వలిసెపూల అందం.. తేనెటీగలతో బంధం

మన్యంలో ఎక్కడ చూసినా వలిసె పూల తోటలే కనిపిస్తున్నాయి. వలిసెపూలకూ.. తేనెటీగలకు విడదీయరాని బంధం ఉంది. ఈ పూలపై తేనెటీగలు వాలకపోతే పరపరాగ సంపర్కం జరగక ఫలదీకరణ చెందే అవకాశమే లేదు. విత్తనాలు అభివృద్ధి చెందవు. తేనెటీగలు ప్రతి వలిసె పూవుపై వాలి అందులోని పుప్పొడిని సేకరిస్తాయి. ఒక పువ్వులోని పుప్పొడిని మరో పువ్వులో జారవిడవడం వల్ల పరపరాగ సంపర్కం జరిగి ఫలదీకరణ చెంది విత్తనాలు ఏర్పడతాయని పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి చెప్పారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

సవాల్‌గా సరకుల తరలింపు

జి.మాడుగుల మండలంలోని కుంబిడిసింగికి అంగన్‌వాడీ, నిత్యావసర సరకులు, గృహోపకరణలు తరలించడం పెద్ద సవాలుగా మారింది. ఈ గ్రామానికి చేరుకునే మార్గంలో మత్స్య గెడ్డ ప్రవహిస్తోంది. రహదారి పైనుంచి నీరు ప్రవహిస్తుండడం తోపాటు పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో వాహనాలు అటుగా వెళ్లడం అసాధ్యమవుతోంది. ఈ పరిస్థితుల్లో గ్రామానికి సరకులను మోసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహార పదార్థాలు, బియ్యం, గుడ్లు అతి కష్టం మీద తీసుకెళ్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు వైద్య సేవల కోసం బయటకు వెళ్లాల్సి వచ్చినా గెడ్డ దాటడం ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ రహదారి, వంతెన నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జి.మాడుగుల

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలంలోని కోరాపల్లి పంచాయతీ కార్యదర్శి పవన్ ఫుట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆయన సత్తా చాటాడు. డిసెంబర్‌లో గోవాలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఏపీ తరపున పాల్గొననున్నాడు. స్థానిక నాయకులు, కోరాపల్లి సచివాలయ సిబ్బంది అభినందించారు.

పంచాయతీ నిధులు ఫలహారం

✦ సర్పంచులు, కార్యదర్శులు కుమ్మక్కు
✦ పనులు చేయకుండానే బిల్లులు

డుంబ్రిగుడ, పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి.. పదవిలో ఉండగానే అందినకాడికి వెనకేసుకోవాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారుల్లో కొందరు వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పదవీ కాలం కొద్ది నెలల్లో ముగియనుండటంతో పంచాయతీల్లో సర్పంచులు ఆదాయార్జనపై దృష్టిసారిస్తున్నారు. కార్యదర్శులతో చేతులు కలిపి అక్రమాలకు తెరలేపారు. పంచాయతీ నిధులను ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామసభ తీర్మానంలో లేని వాటికి ఖర్చు చేసినట్లు చూపి వెనకేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వ్యవహారం చాపకింద నీరులా సాగుతోంది. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తీగలాగితే అక్రమాల డొంక కదులుతుంది.

■ పాడేరు డివిజన్‌లో పాడేరు, అరకులోయ, సీలేరు, చింతపల్లి మేజరు పంచాయతీలుగా ఉన్నాయి. గ్రామాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం నిధులిస్తోంది. వైకాపా ప్రభుత్వం పంచాయతీలకు ఒక్కపైసా ఇవ్వకపోగా, కేంద్రం నుంచి నేరుగా వచ్చే నిధులను రాష్ట్ర ఖజానాకు దారి మళ్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు మంచి రోజులొచ్చాయి. ఆర్థిక సంఘం నిధులు ఎప్పటికప్పుడు విడుదల అవుతున్నాయి. మేజరు పంచాయతీలకు రెండు, మూడు కోట్ల వరకు కేటాయింపులు జరుగుతున్నాయి. ఇవి కాకుండా పన్నుల రూపంలో పంచాయతీలకు ఆదాయం వస్తోంది.

మురిసి గ్రామంలో సీసీ రోడ్డు వేసినట్లు చూపి బిల్లులు మార్చేసిన మట్టిరోడ్డు ఇదే →

■ పంచాయతీ అధికారులు, సర్పంచులు, వార్డు సభ్యులు మూడు నెలలకోసారి సమావేశమై ప్రతిపాదించి తీర్మానం చేసినవి కాకుండా వేరు పనులు చేసినట్లు రికార్డులు చూపి నిధులను స్వాహా చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడం పరిస్థితికి అద్దం పడుతోంది.

■ అరమ పంచాయతీ మురిసి గ్రామంలో గతేడాది ఫిబ్రవరి 19న మిన్ను ఇంటి నుంచి దేవగున్ ఇంటి వరకు రూ.1.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించకుండానే వేసినట్లు చూపి బిల్లులు చేసుకున్నారు. దీనిపై గత నెల 30న పాడేరులో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బురిడి దేవరాజు అధికారులకు ఫిర్యాదు చేశారు.

■ 'పంచాయతీల్లో పనులు చేయకుండా చేసినట్లు చూపి బిల్లులు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. వీటన్నింటిపై విచారణ చేపడుతున్నాం. జామిగుడ, అరమ పంచాయతీల పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించాం. నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. నిధులు పక్కదారి పట్టినట్లు తేలితే బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తామ'ని డీఎల్‌పీవో కుమార్ చెప్పారు.

మండలాలు	22
పంచాయతీలు	430
పాడేరు డివిజన్‌లో..	244
రంపచోడవరం డివిజన్‌లో..	186

కన్నోళ్లకు క'న్నీళ్లు'

✦ రైవాడలో ముగ్గురు యువకుల గల్లంతు
✦ ఒకరి మృతదేహం లభ్యం

దేవరాపల్లి, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రైవాడ జలాశయంలో ఆదివారం జరిగిన బోటు ప్రమాదం జీనబాడులో విషాదాన్ని నింపింది. మూడు కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడి మృతదేహం లభ్యం కాగా.. ఇద్దరు యువకుల ఆచూకీ తెలియాల్సి ఉంది. మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. జీనబాడుకు చెందిన అటవీశాఖ ప్రొటక్షన్ వాచర్ గాలి అప్పలరాజు (25)కు బోటులో కలపను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో గ్రామానికి చెందిన గంజాయి జీవన్‌కుమార్ (18), దెబర రమేష్ (18), జాలాడ ప్రసాద్ (18)కి ఈ విషయం చెప్పాడు. వారంతా అక్కడకు వెళ్లి కలప, నిందితులను అటవీ సిబ్బందికి అప్పగించారు. అనంతరం నలుగురు కలిసి బోటులో స్వగ్రామం జీనబాడు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడారు. గల్లంతైన ఇద్దరు యువకుల కోసం సోమవారం ఉదయం గజఈతగాళ్లతో గాలిస్తామన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న గిరిజన యువకులు ఆయా కుటుంబాలకు ఒక్కగానొక్క కుమారులు కావడంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. అనంతగిరి తహసీల్దారు వీరభద్రాచారి, వీఆర్వోలు లక్ష్మీ ప్రశాంతి, రామకృష్ణ, రాంబాబు తదితరులు జీనబాడు చేరుకున్నారు.

జీవన్ కుమార్, గాలి అప్పలరాజు, దెబర రమేష్ (పాత చిత్రాలు)

ఘటనా స్థలిలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

తనయుడిని కాపాడిన తండ్రి

ఈ ప్రమాదంలో మృత్యుంజయుడిగా బయటపడిన జాలాడ ప్రసాద్‌ను అతడి తండ్రి సత్యం కాపాడాడు. బోటు మునిగిన ప్రాంతానికి సమీపంలో పొలం దున్నుతున్న సత్యంకు జలాశయంలో బోటు పట్టుకుని సహాయం కోసం కుమారుడు చేస్తున్న ఆర్తనాదాలు చెవిన పడ్డాయి. వెంటనే ఒడ్డునున్న బోటులో మునిగిన బోటు వద్దకు చేరుకుని కుమారుడిని రక్షించాడు. తండ్రి రాకపోయి ఉంటే తానూ మునిగిపోయేవాడినని ప్రసాద్ చెప్పాడు. బోటు మునిగిన చోట చేపల కోసం వేసిన వల ఉందని, అందులో చిక్కుకున్న కాలు, చేయిని అతి కష్టం తీసుకున్నానన్నారు. మిగతా ముగ్గురు అందులో చిక్కుకుని ఉంటారన్నారు.

కుమారుడు ప్రసాద్, తండ్రి సత్యం

✦ నాడు భర్త.. నేడు కొడుకు

పదిహేన్నేళ్ల కిందట ఫారెస్టు ప్రొటక్షన్ వాచర్ గాలి అప్పలరాజు తండ్రి మత్స్యరాజు మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి పార్వతమ్మ ఒక్కగానొక్క కొడుకైన అప్పలరాజును కూలి పని చేస్తూ అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసింది. అటవీశాఖలో చేరిన తనయుడిని చూసి మురిసిపోయింది. ఆ ఆనందం నెల రోజుల గడవక ముందే ఆవిరైపోయింది. విధి నిర్వహణలో బోటు ప్రమాదానికి గురైన తన కొడుకు కోసం ఘటనా స్థలిలో రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది.

✦ ఒక్కగానొక్క బిడ్డ

గంజాయి దేముడు, పార్వతమ్మ దంపతుల ఏకైక కుమారుడు జీవన్‌కుమార్. డిగ్రీ చదవడానికి సిద్ధమయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటి దగ్గరే ఉన్నాడు. అప్పలరాజు రమ్మంటే వెళ్లాడు. కుమారుడు బోటు ప్రమాదంలో చనిపోయాడన్న వార్త ఆ దంపతుల చెవిన పడింది. పరుగున ప్రమాదస్థలికి చేరుకున్న వారికి కుమారుడు విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి బోరున విలపించారు.

✦ నాన్నమ్మ దగ్గర పెరుగుతూ..

దెబర రమేష్ తల్లిదండ్రులు రాంబాబు, సుశీల ఐదేళ్ల కిందట చనిపోయారు. అప్పటి నుంచి నాన్నమ్మ పెంపకంలో ఉంటూ కె.కోటపాడు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి వెళ్లి బోటు ప్రమాదానికి గురయ్యాడు. కుమారుడు, కోడలితోపాటు చేతికందిన మనుమడిని తనకు దక్కకుండా దేవుడు అన్యాయం చేశాడంటూ నాన్నమ్మ సుశీల కుమిలిపోతోంది.

భూతల స్వర్గం.. చెరువులవెనం

ఆంధ్రాకశ్మీర్‌గా పేరొందిన లంబసింగి సమీపంలోని కొండపై ఉన్న చెరువులవెనం ఆదివాసీ గ్రామం సహజసిద్ధ ప్రకృతి అందాలతో అలరారుతోంది. కొద్దిరోజులుగా మన్యంలో శీతల వాతావరణం నేపథ్యంలో మంచు అందాలు మైమరిపిస్తున్నాయి. కొండ పైనుంచి పాలసముద్రాన్ని తలపించేలా మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. వాతావరణం మారడంతో మంచు ప్రభావం కాస్త తగ్గినా ప్రకృతి సోయగాలకు పర్యాటకులు మైమరిచిపోతున్నారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

మనోనేత్రమే కరుణాస్త్రం..!

★ ఫైనల్ మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్
★ చరిత్ర సృష్టించిన భారత అంధమహిళల జట్టు

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: భారత అంధ మహిళల క్రికెట్ జట్టు తొలిసారి టీ-20 ప్రపంచకప్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను ఏడు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారి 27 బంతుల్లో 42 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయపథాన నడిపించింది.

గిరిజన గ్రామం నుంచి అంతర్జాతీయ క్రికెట్‌లోకి..: పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కూలీలైన రాంబాబు, సంధ్య దంపతుల నలుగురు పిల్లల్లో కరుణ రెండో సంతానం. ఈమెకి అన్న, ఇద్దరు చెల్లెళ్లు. పుట్టుకతోనే దృష్టిలోపమున్నా.. తల్లిదండ్రులు మిగిలిన పిల్లల్లాగే గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడోతరగతి వరకూ చదివించారు. అనంతరం విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులోని ఎండాడ వద్దనున్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేర్చారు. ప్రస్తుతం ఇక్కడ పదో తరగతి చదువుతోంది.

పాంగి కరుణకుమారి

అక్కడ పరుగుల వరదతో అవకాశం..: మూడేళ్ల కిందట ఆంధ్రాజట్టుకి ఎంపికైన కరుణకుమారి నిలకడగా రాణిస్తూ పరుగుల వరద పారించడంతో ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచకప్ టి-20 జట్టులో దేశం తరఫున ఎంపికైంది. గతంలో వరల్డ్ గేమ్స్‌లో క్రికెటర్‌గా రాణించిన మాగుపల్లి సత్యవతి కోచ్‌గా ఉండటంతో ఆమె మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగారు. వన్‌డౌన్ లేదా సెకెండ్ డౌన్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలర్‌గానూ రాణించడం ఈమెకు కలిసొచ్చింది.

తొలి ప్రపంచకప్ గర్వంగా ఉంది..: ఎండాడ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరడం నా జీవితాన్ని మార్చివేసింది. ప్రిన్సిపల్ విజయ, కోచ్ సత్యవతి ప్రోత్సాహంతో జాతీయ జట్టుకి ఎంపికయ్యా. తల్లిదండ్రుల సహకారంతో ఇక్కడి వరకు రాగలిగా. ప్రపంచకప్ జట్టులో తెలుగు రాష్ట్రాల నుంచి ఏకైక భాగస్వామిని కావడం, దేశానికి తొలి ప్రపంచ కప్‌ను అందించడం గర్వకారణంగా ఉంది.

– కరుణకుమారి

అంతర్జాతీయ, దేశవాళీ టి-20 క్రికెట్‌లో గణాంకాలు..

	మొత్తం	పరుగులు	అత్యధికం	హాఫ్‌సెంచరీలు	వికెట్లు
అంతర్జాతీయం	5	129	42	0	1
దేశవాళీ	17	412	67	3	6

కొత్తపల్లి కళకళ

న్యూస్‌టుడే, జి.మాడుగుల

జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కొండలు, పచ్చని చెట్లు, పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య నుంచి జాలువారుతున్న జలపాతం అందాలను ఆస్వాదించేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫొటోలు తీసుకుంటూ కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపారు. ఇక్కడి ప్రకృతి సోయగాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. పర్యాటకులతో జలపాతం పరిసరాలు కిక్కిరిశాయి.

ఘాటీలో గుండె దడ!

కొరవడిన భద్రత.. గుబులు పుట్టిస్తున్న ప్రయాణం

ఈనాడు డిజిటల్, పాడేరు, న్యూస్‌టుడే, అరకులోయ

మంచు, చలితో మన్యంలో పర్యాటకం ప్రారంభమైంది. ప్రకృతి అందాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా వాహనాల్లో సందర్శకులు తరలివస్తున్నారు. అరకులోయ, పాడేరు, రంపచోడవరం ఘాట్ రోడ్లపై అవగాహన లేకపోవడం, వాహనాలను నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. యంత్రాంగమూ నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఘాట్ రోడ్ల వెంబడి హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఘాట్ రోడ్ల అభివృద్ధికి అడుగులు పడటం లేదు. గతంలో డివిజన్‌గా ఉన్న పాడేరు ఇప్పుడు జిల్లా కేంద్రంగా మారడంతో రాకపోకలు అధికమయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి అరకులోయ మీదుగా విజయనగరం వరకు ఎన్‌హెచ్ 516ఈ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు డుంబ్రిగుడ మండలం వరకు పూర్తయినా.. అరకులోయ నుంచి ఘాట్ రోడ్డులో ఇప్పటివరకు ప్రారంభమే కాలేదు

పాడేరు ఘాట్‌రోడ్డు మలుపులో దెబ్బతిన్న రక్షణగోడ

80 శాతం ప్రమాదాలు అక్కడే..: ఘాట్ రోడ్డులో భారీ వృక్షాలను తొలగించేందుకు అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలో 80 శాతానికిపైగా ప్రమాదాల్లో ఘాట్ రోడ్లలోనే జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల చింతూరు సమీపంలో ఓ వాహనం కల్వర్టులో పడి ఏడుగురు గాయపడ్డారు. నాలుగేళ్ల కిందట డముకు సమీపంలో బస్సు లోయలోకి దూసుకెళ్లి ముగ్గురు మృతి చెందారు.

ప్రమాదానికి కారణాలు ఇవే..

■ ఘాట్ రోడ్లలో ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేవు. కొత్తగా వచ్చే వాహన చోదకులకు రహదారిపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

■ పాడేరు జిల్లా కేంద్రం నుంచి కొంత వరకే రహదారి వెంబడి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ రోడ్డు సక్రమంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దట్టంగా కురుస్తున్న మంచు ఓ కారణమవుతోంది.

■ ప్రధాన ఘాట్ రోడ్లలో రక్షణ గోడలు సరిగా లేవు. ఏటా నిర్వహణకు నిధులు ఖర్చు చేస్తున్నా.. ఫలితం ఉండటం లేదు.

■ వర్షాలు, తుపాన్ల సమయంలో ఘాట్‌రోడ్లపై కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఇనుప కంచె ఏర్పాటు చేయాలని గతంలో పాడేరు ఐటీడీఏ పీవో ప్రతిపాదనలు చేసినా.. ఆచరణలోకి రాలేదు.

ఎక్కువగా ఇక్కడే.. ✦ పాడేరు మండల పరిధిలోని కొమ్మాలమ్మ పనుకు సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వంజంగి వ్యూపాయింట్, 12 మైలు, కందమామిడి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ✦ మారేడుమిల్లి - చింతూరు మార్గంలో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ✦ అరకు ఘాట్‌లో డముకు వద్ద మలుపు దగ్గరగా ఉండటం, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

రెండేళ్లలో ప్రమాదాలు ..



ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు... జిల్లాలో పర్యాటకం ఊపందుకుంది. ఘాట్ రోడ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. భారీ వాహనాలు రాకపోకలను నిలువరించాం.

– అమిత్ బర్దార్, ఎస్పీ, అల్లూరి జిల్లా

నేటినుంచి 'రైతన్న- మీకోసం'

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 24 నుంచి జిల్లావ్యాప్తంగా 'రైతన్న- మీకోసం' వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వారంపాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఇంటింటికీ వెళ్లి రైతులను కలుస్తారు. జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాల పరిధిలో వీటిని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మూడు కుటుంబాలు ఓ క్లస్టర్‌గా.. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి.. ఒక్కొక్క బృందం రోజుకు 30 క్లస్టర్లు (90 గృహాలు) సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గనిర్దేశకాల ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థికస్థితి, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా వీటిని నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా వారోత్సవాల నిర్వహణపై వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య ఇతర అనుబంధ శాఖల క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఇదీ లక్ష్యం.. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, సాగులో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఆర్‌ఎస్‌కే సహాయకులు, పశుసంవర్ధక, మత్స్య సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో వీటిని నిర్వహిస్తారు.

కార్యాచరణ ఇలా..

- ఈనెల 24 నుంచి 29 వరకు అధికారుల బృందాలు రైతుల గృహాలను సందర్శిస్తారు. ఇంటింటి సందర్శనలో సీఎం సందేశ లేఖ, కరపత్రం అందజేస్తారు.
- ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. రైతుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు.
- 30న సమావేశాలు నిర్వహిస్తారు. సందర్శనల ద్వారా సేకరించిన ఫిర్యాదులు, సూచనలకు సంబంధించిన డేటాను సమీకరించి దానిపై డిసెంబరు 2 వరకు విశ్లేషిస్తారు.
- 3వ తేదీన 2026-27 సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి ప్రతి రైతుసేవా కేంద్రంలో కార్యశాల నిర్వహిస్తారు.

రారెత్తిస్తున్న టమాటా!

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గత రెండు రోజులుగా కూరగాయల ధరలు ప్రజలను ఉలిక్కిపడేలా చేశాయి. టమాటా ధర రెండు రోజుల్లో రెట్టింపు కావడంతో కొనుగోలుదారులు ఆశ్చర్యపోయారు. శుక్రవారం నాటికి 20 కిలోల క్రేట్ రూ.800లు ఉండగా ఆదివారం సంతలో రూ.1600లకు చేరింది. దీంతో కూరగాయల వ్యాపారులు కిలో రూ.40ల నుంచి రూ.80లకు పెంచి విక్రయాలు చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో అధికంగా దొరికే ఏజెన్సీకి ప్రత్యేకమైన కాశీపట్నం వంకాయ వారం రోజుల క్రితమే కిలో రూ.100కు చేరింది. ప్రస్తుతం ఈ వంకాయను వ్యాపారులు అమ్ముకునేందుకు విక్రయాలు చేసేందుకు సాహసం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ములక్కాడ ఒక్కోటి రూ.10, క్యాప్సికం కిలో రూ.170, ఏ కూరగాయైనా రూ.80 నుంచి రూ.100 ఉంది. చిరువ్యాపారులు పెట్టుబడి పెట్టి విక్రయాలు చేయలేకపోతున్నారు. ఒకటి రెండు స్థానికంగా దొరికే కూరగాయల విక్రయాలతో సరిపెడుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో స్థానికంగా కూరగాయల పంటల దిగుబడిపై ప్రభావం చూపింది. దాదాపు అన్ని రకాల కూరగాయలు మైదాన ప్రాంతం నుంచి తీసుకువచ్చే వ్యాపారుల వద్ద స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి మారు విక్రయాలు చేయాల్సిన పరిస్థితి. దీంతో స్థానికంగా దొరికే తెల్లపిక్కలు, అల్లం, ఒకటి రెండు ఆకుకూరల విక్రయాలతో సరిపెడుతున్నారు.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

పాపికొండల్లో పర్యాటకుల సందడి

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల్లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 397 మంది పర్యాటకులు గండిపోశమ్మ ఆలయం నుంచి ఆరు బోట్లలో పాపికొండల అందాలను తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. తొలుత పోశమ్మగండి చేరుకున్న వారంతా కొండపై నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసుల తనిఖీలు అనంతరం విహారయాత్రకు బయలుదేరివెళ్లారు. గోదావరిలో నీటి మట్టం తగ్గడంతో గతంలో పూడిపల్లి, దేవీపట్నంలో సినిమా చిత్రీకరణ చేసిన ప్రాంతాలను, నదీ ఒడ్డున ముంపునకు గురైన గ్రామాలు, గోదావరి అందాలను పర్యాటకులు తమ చరవాణీల్లో చిత్రీకరించుకున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. ఆలయ ప్రాంగణంలోని వరద పూర్తిగా తగ్గడంతో కూలిపోయిన దుకాణాలను స్థానికులు మళ్లీ నిర్మించుకుంటున్నారు.

బోటు ఎక్కుతున్న పర్యాటకులు

సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో సుమారు 750 గిరిజన గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించి.. గిరిజనుల దాహార్తి తీరుస్తున్న సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయమని పాడేరు ఆర్డీవో ఎం.వి.ఎస్.లోకేశ్వరరావు పేర్కొన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్‌లో సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకొంటున్నట్లు చెప్పారు. జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రసాద్, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు రమాదేవి, ఉప్పల వెంకటరత్నం, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పించిన ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు, గంగులయ్య తదితరులు

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం • ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner TV Partner Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా : ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ డోర్ నెం.45-40-42, 3వ అంతస్తు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.
వివరాలకు: 9618775577
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

సీలేరు, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్లకు నిరసనగా మావోయిస్టులు చేపట్టిన భారత్ బంద్ సీలేరు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా ఆర్టీసీ అధికారులు శనివారం నుంచే బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. శనివారం రాత్రి నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. సీలేరు ఎస్సై యాసీన్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సాయుధ బలగాల సిబ్బంది ముఖ్య కూడలిలో తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి వారి వివరాలు సరిచూశాక విడిచిపెట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలు, జెన్‌కో జలవిద్యుత్కేంద్రం వద్ద గస్తీ నిర్వహించారు.

పాడేరు, కొయ్యూరు, న్యూస్‌టుడే: బంద్ నేపథ్యంలో సీలేరు, భద్రాచాలం, డొంకరాయి, ముంచంగిపుట్టు, గూడెంకొత్తవీధి, కొయ్యూరు నైట్ హాల్ట్ బస్సు సర్వీసులు నిలిపివేశారు. మంప, రేవళ్లు, బూదరాళ్ల వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు కొయ్యూరు నుంచి వెనుదిరిగాయి. ప్రైవేటు వాహనాలన్నీ యథావిధిగా తిరిగాయి. మారేడుమిల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు డ్రోన్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పాడేరులో బంద్ ప్రభావం కనిపించలేదు. మండల కేంద్రాల్లోనే ప్రజాప్రతినిధులు ఉండాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. మారుమూల గ్రామాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వై.రామవరం: వై.రామవరం ప్రాంతంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ఆదివారం ఉదయం నుంచి బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే ఆర్టీసీ బస్సుల రాకపోకలు ఉంటాయని ఏలేశ్వరం డిపో మేనేజరు ప్రకటన విడుదల చేశారు.

సీలేరులో పోలీసుల తనిఖీలు

మన్యంలో వైద్య సేవలకు డ్రోన్లు

ట్రయల్ రన్‌లో భాగంగా చింతపల్లి వచ్చిన డ్రోన్

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఔషధాలు అందించేందుకు, వారి రక్త నమూనాలు సేకరించేందుకు డ్రోన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా పాడేరు నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానం వరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. మారుమూల గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సెంటర్లలో రోగులకు అత్యవసర మందులు తీసుకువెళ్లేందుకు వీటిని వినియోగిస్తున్నామని బెంగళూరుకు చెందిన రెడ్‌వింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశీష్ తెలిపారు. పాడేరు, అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రభుత్వ ఆసుపత్రులకు ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుతానికి పది ఉన్నాయని, ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు.

చీరకే అందం..

సినీ కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఆదివారం నర్సీపట్నంలో సందడి చేశారు. స్థానికంగా వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. విశాఖ విమానాశ్రయం నుంచి నర్సీపట్నం వచ్చే మార్గంలో పచ్చని గిరులు, ప్రకృతి అందాలు అబ్బురపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

నాగిరెడ్డి లక్ష్మణ్‌రావు

ఎటపాక, న్యూస్‌టుడే: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025-26లో పాల్గొన్న మండలంలోని పలు పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు ప్రతిభ చూపారు. నల్లకుంట పీడీ సోడే నాగిరెడ్డి షాట్‌పుట్‌లో ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ, సీతాపురంలో జెడ్పీ హైస్కూల్ పీఈటీ పెనుబల్లి లక్ష్మణరావు 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించారు. వీరిద్దరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు, చిచ్చడి బాబూరావు, వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు బొర్రా రమేష్, కార్యదర్శి అపకా రమేష్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కాసులు కొట్టు.. పోస్టులు పట్టు..!

ఏయూ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు

భారీగా డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రక్రియలో వర్సిటీ అధికారులు పారదర్శకత పాటించకపోవడం ఆ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పోస్టులను అనర్హులకు ఇవ్వాలని కొంతమంది పెద్దలు ఒత్తిడి చేయగా ఏయూ అధికారులు ప్రక్రియను పక్కన పెట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత వర్సిటీలోని అదే వ్యక్తులు ఫైలును ముందుకు కదిపించడంలో కృతకృత్యులయ్యారు. దీని వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయని తెలుస్తోంది.

నాలుగేళ్ల కిందట ప్రకటన..: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 33 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2018లో ప్రకటన జారీ చేశారు. కొన్ని కారణాలతో నాడు ఈ ప్రక్రియ నిలిచిపోయింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత 2021లో మళ్లీ ప్రకటన జారీ చేశారు. అప్పట్లో ఈ పోస్టులకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో కొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని అప్పట్లో సీఎంవో నుంచే ఒత్తిళ్లు వచ్చాయి. ఏయూలోని మహిళా ఉద్యోగి ఒకరు ఆయా దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలించగా నకిలీవని గుర్తించారు. వాటిని ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ బోర్డులకు పంపించగా.. ఆయా బోర్డులు కూడా నకిలీవని నిర్ధారించాయి. దీంతో నాడు ఆ పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు ధైర్యం చేయలేదు. ఫలితంగా ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది.

తెర వెనుక ఆ నలుగురు: ప్రభుత్వం మారిన తర్వాత అప్పట్లో ఒత్తిడి తీసుకొచ్చిన అభ్యర్థుల్లో 28మందికి రెండు నెలల క్రితం ఉద్యోగాలు ఇస్తూ ప్రస్తుత అధికారులు నేరుగా ఉత్తర్వులు ఇవ్వడం వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశమైంది. గుట్టుచప్పుడు కాకుండా భర్తీ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో పోస్టును రూ.లక్షలకు అమ్ముకున్నారని, ఏయూలోని నలుగురు వ్యక్తులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారని ఆరోపణలు వస్తున్నాయి.

కౌన్సిల్ ఆదేశాల మేరకు నిర్ణయం: 'గత ప్రభుత్వ హయాంలోనే దరఖాస్తులను పరిశీలించి ఫైలు తయారు చేశారు. ఆ ఫైలును అమలు చేయాలని నేషనల్ ఎస్సీ కౌన్సిల్ ఆదేశించింది. అమలు చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పోస్టులను భర్తీ చేశామ'ని రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తెలిపారు. తాము కొత్తగా చేసింది ఏమీ లేదన్నారు.

తాటాకిల్లు దగ్ధం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: అమ్మిరేకులలో ఆదివారం జరిగిన ఘటనలో రాజుబాబుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైందని స్థానికులు తెలిపారు. సర్వం కాలిపోవడంతో బాధితుడి కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలిపోతున్న ఇల్లు

రివార్డు కోసమే ఎన్‌కౌంటర్

పాడేరు, న్యూస్‌టుడే: ఆదివాసీ చట్టాలను కాపాడాలని చెబుతూనే.. ఆదివాసీ హక్కులపై పోరాడుతున్న హిడ్మాను ఎన్‌కౌంటర్‌లో ఎలా హతమార్చారని దండకరణ్య విమోచన సమితి జాతీయ కమిటీ ప్రతినిధి పెనుమాల రంజిత్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం పాడేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రివార్డు కోసమే ఈ ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఆదివాసీ, గిరిజన, ప్రజా, విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంలో యువకుడు మృతి చెందిన ఘటన ముంచంగిపుట్టు మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ అందించిన వివరాల ప్రకారం.. కించాయిపుట్టు పంచాయతీలోని మర్రిపుట్టు గ్రామానికి చెందిన కిముడు శ్రీధర్(25) ఆదివారం తన ఇంటి వద్ద కరెంటు పొయ్యికి మరమ్మతులు చేస్తుండగా.. విద్యుత్తు షాక్‌తో పడిపోయాడు. గ్రామస్థులు ఇతడిని అంబులెన్సులో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. తెదేపా మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ సీహెచ్‌సీని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తెదేపా కార్యకర్తగా ఉన్న శ్రీధర్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. సర్పంచి సుభాష్ చంద్ర, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, త్రినాథ్, శ్రీను, కొండలరావు, గణపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ముంచంగిపుట్టు ఆసుపత్రిలో శ్రీధర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు

పాడేరు: అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగిలి షాక్‌తో ఓ లైన్‌మెన్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ ఘటన పాడేరు మండలం మలకపోలం కొండల్లో చోటు చేసుకుంది. లైన్ ట్రిప్ అవుతోందని లైన్‌మెన్ పరదేశీ వెళ్లగా ప్రమాదానికి గురయ్యాడు. చెయ్యి, కాలు శరీర భాగాలు కాలిపోవడంతో హుటాహుటిన పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు అందించి పరిస్థితి విషమంగా ఉందని మైదాన ప్రాంతానికి తరలించాలని సూచించారు. సహచర సిబ్బంది చందాలు వేసుకుని విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. మలకపోలం సమీపంలోని అటవీ ప్రాంతంలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తొలగించారు. వీటిని అమర్చినవారిపై కేసులు నమోదు చేస్తామని విద్యుత్తు సంస్థ అధికారులు హెచ్చరించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి దుర్మరణం

హుకుంపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హుకుంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఒల్డా పంచాయతీ నూరుపురాయికి చెందిన కొర్రబోయిన శ్రీను(45) హుకుంపేట నుంచి తన స్వగ్రామానికి ఆదివారం బైక్‌పై బయల్దేరారు. గడుగుపల్లి సత్యసాయి ఆలయం వద్ద వాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోయింది. శ్రీను తలకు బలమైన గాయం కావడంతో సంఘటనాస్థలంలోనే మృతి చెందారు. మద్యం తాగి బైక్ నడిపాడని సత్యసాయి భక్తులు పేర్కొన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పైనుంచి జారిపడిన బాలుడు

చింతపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: డైరీనగర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిపై నుంచి జారిపడి బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చింతపల్లికి కూతవేటు దూరంలోని డైరీనగర్‌కు చెందిన కొర్రా మహేష్ ఆదివారం నిర్మాణంలోని ఇంటిపైకి ఎక్కి ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు పైనుంచి కిందకు జారిపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

శ్రమదానంతో చెక్‌డ్యామ్‌కు మరమ్మతు

అనంతగిరి: భీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో చెక్‌డ్యామ్‌కు రైతులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. మొంథా తుపాను కారణంగా చెక్‌డ్యామ్ మరమ్మతులకు గురైందని రైతులు వాపోయారు. ప్రస్తుతం పొలాలకు నీరు అందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాతి, కలపతో గట్టు కట్టి పొలాలకు నీటి మళ్లించే పనులు చేపట్టినట్లుగా నీటి సంఘం వైస్ ఛైర్మన్ వెంకటరమణ తెలిపారు.

కలపతో గట్టు ఏర్పాటు చేస్తున్న రైతులు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ : విశాఖపట్నం జిల్లా
జాయింట్ కలెక్టర్ / ఛైర్మన్, డి.పి.సి. వారి ఉత్తర్వులు

ఇ-టెండర్: పని పేరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా క్రింది మెటీరియల్ కొనుగోలు ప్రక్రియ-ఆర్థిక సంవత్సరం- 2025-26.
వివరములకు: https://tender.apeprocurement.gov.in ప్రింటింగ్ & స్టేషనరీ: e Tender ID No.866837 పై ఇ-టెండర్‌నకు సంబంధించిన వివరములు ఈ దిగువ చూపడమైనది. (1) ఇ-టెండర్ డౌన్లోడ్ ప్రక్రియ ప్రారంభ తేది. 24-11-2025 గం.10.30 ని. (2) ఇ-టెండర్ బిడ్ సమర్పించుటకు ఆఖరు తేది.29-11-2025 గం.05.30 ని. (3)ఇ-టెండర్ తెరుచు తేది.03-12-2025 గం.11.00 నిలకు పథక సంచాలకుల వారి కార్యాలయము, విశాఖపట్నం సంప్రదించవలసిన మొబైల్ నెం: 7993317122 సం/- జాయింట్ కలెక్టర్/ ఛైర్మన్, డి.పి.సి. విశాఖపట్నం జిల్లా

ఏడాది కోర్సు.. ఉపాధి భేష్..!

'దయాల్బాగ్'లో బైక్ మెకానిజంలో శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే

ఆర్థిక, ఇతర కారణాలతో పదో తరగతి, ఇంటర్ వరకే చదివిన యువతకు వృత్తివిద్యలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది దయాల్బాగ్ విద్యాకేంద్రం. ప్రస్తుతం ద్విచక్ర వాహన మరమ్మతుల(బైక్ మెకానిజం) కోర్సు నిర్వహిస్తున్నారు. ఇందులో నిపుణులైన శిక్షకులతో థియరీ, ప్రాక్టికల్స్‌లో తర్ఫీదు ఇప్పిస్తారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం ధ్రువపత్రం అందజేయడంతోపాటు ద్విచక్ర వాహనాల షోరూమ్‌లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

ద్విచక్రవాహన మరమ్మతులో తర్ఫీదు పొందుతున్న యువత

సంస్థ చిరునామా: విశాలాక్షినగర్ (కైలాసగిరి కూడలి)	
కోర్సు: ద్విచక్రవాహనాల మరమ్మతు	శిక్షణ వ్యవధి: ఏడాది కాలం
	విద్యార్హత : కనీసం పదోతరగతి

ఒక బ్యాచ్‌లో శిక్షణ: 25 మందికి
ఐదేళ్లలో తర్ఫీదు: 92 మంది
ఉద్యోగావకాశాలు: 65 మంది

నేర్పించే అంశాలు ఇవీ..: యమహా సంస్థ నుంచి శిక్షితులైన సిబ్బంది వచ్చి ద్విచక్ర వాహనాల మరమ్మతులో మెలకువలు, విడిభాగాల బిగింపు, ఇంజిను నిర్వహణపై తర్ఫీదు ఇస్తారు. మొదటి మూడు నెలలు ద్విచక్రవాహన భాగాల గురించి అవగాహన కల్పిస్తారు. తరువాత ఒక్కో భాగాన్ని విడదీసి వాటిని నిర్వహణ గురించి వివరిస్తారు. ఆరు నెలల తర్వాత ఇంజిన్ సర్వీసింగ్, అందులో వివిధ భాగాల పనితీరు, వాటిని తిరిగి బిగించడం నేర్పిస్తారు. ఎనిమిదో నెల నుంచి 10వ నెల వరకు ద్విచక్రవాహనాన్ని పూర్తిగా విడదీసి, అన్ని భాగాలను విజయవంతంగా బిగించేలా ప్రయోగాలు చేయిస్తారు. పది నుంచి 12 నెలల వ్యవధిలో యమహా షోరూంకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యక్షంగా తర్ఫీదు అందిస్తారు.

వెంటనే ఉపాధి అవకాశాలు: ఐదేళ్ల క్రితం ద్విచక్రవాహన మరమ్మతుల కోర్సు ప్రారంభించాం. మొదట్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు వచ్చేవారు. రెండేళ్ల నుంచి మంచి స్పందన వస్తోంది. యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని మా మత గురువు లాల్ సాహెబ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కోర్సు నిర్వహిస్తున్నాం. ఈ ఐదేళ్లలో 70శాతం వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు.
– దక్షిణామూర్తి, కోర్సుల సమన్వయకర్త



గిరిజన సంఘ నాయకులు, గ్రామస్థుల ఆందోళన

రహదారి పనులు పూర్తిచేయాలి

అనంతగిరి, న్యూస్‌టుడే: వేంగడ పంచాయతీ గోమంగి పాడు గ్రామ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొండలరావు కోరారు. స్థానికులతో కలిసి రహదారి వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి పనులు మంజూరు కాగా.. ఏళ్ల తరబడి కొనసాగించి నేటికీ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ఫలితంగా ఆయా గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్డ్	184	206
స్కిన్‌లెస్	210	216

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోతంగి పంచాయతీ జాకరవలస గ్రామంలో చేతి పంపు ద్వారా బురద నీరు వస్తోంది. – గిరి, స్థానికుడు ✓: చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తాం. – గౌతమి, పంచాయతీ కార్యదర్శి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: జీసీసీ కార్యాలయం, గోదాములు, ఐసీడీఎస్ కార్యాలయాలకు వెళ్లే సీసీ మార్జిన్లు దెబ్బతిన్నాయి. రాకపోకలు సాగించే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. – అప్పారావు, మారేడుమిల్లి, ✓: సీసీ రోడ్డును పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. – వెంకటరమణ, డీఈఈ, పంచాయతీరాజ్

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేటలో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. – చంటిబాబు, గ్రామస్థుడు, ✓: రెండు, మూడు రోజుల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. – సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎర్రంరెడ్డి నగరంలో జనావాసాల మధ్య చెత్తచెదారాలు పేరుకుపోయాయి. దోమల వ్యాప్తి ఎక్కువై ఇబ్బంది పడుతున్నారు. – వెంకట్రావు, రంపచోడవరం, ✓: వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడతాం – కామరాజు, పంచాయతీ కార్యదర్శి

ముసురుమిల్లిలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ, దేవీపట్నం మండలం దామనపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ద్వితీయ, అడ్డతీగల మండలం గొంటువానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు మెమొంటోలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బొజ్జయ్య, ఉపాధ్యక్షులు చిన్నిబాబు, కోశాధికారి వెంకట రమణ, యూటీఎఫ్ ప్రతినిధులు సూరిబాబు, సనాతనబాబు, వెంగళరావు, శ్రీను, వార్డెన్ విజయరాజారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

జామిగుడలో ఫోర్జరీ 'పంచాయితీ'

రూ.36 లక్షలు కాజేశారని వార్డుసభ్యుల ఆరోపణ

పెదబయలు/ పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా- ఒడిశా సరిహద్దులోని పెదబయలు మండలం జామిగుడ పంచాయతీలో తీర్మానాలు లేకుండా, ఫోర్జరీ సంతకాలతో పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్లు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు పంచాయతీ కార్యదర్శులతో సర్పంచి భర్త కుమ్మక్కై.. నిధులని గోల్‌మాల్ చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి.. నిధులు రికవరీ చేసి పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాలని ఉప సర్పంచి కామేశ్వరరావుతోపాటు, వార్డుసభ్యులు సిద్దేశ్వరరావు, పాంగి అచ్యుతరామయ్య, వనుగమ్మ లక్ష్మయ్య, వంతాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. 2021 నుంచి 2025 వరకు సుమారు రూ.36 లక్షల వరకు కాజేశారని పేర్కొన్నారు. వారి ఆరోపణలివీ..

పైకప్పు లేకుండా నిర్మించిన రచ్చబండ

▼ జామిగుడలో రచ్చబండ, కొండగూడలో పాత బావికి మరమ్మతుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ పంచాయతీలో 14 గ్రామాలుండగా.. కేవలం నాలుగు గ్రామాల్లోనే అక్కడక్కడ బల్బులు అమర్చారు. వీటిలో ప్రస్తుతం చాలావరకు వెలగడం లేదు. ఎల్ఈడీ బల్బుల కోసం రూ.7.07 లక్షలు వెచ్చించినట్లు చెల్లింపులున్నాయి.

▼ శానిటేషన్ పేరుతో రూ.8.58 లక్షలు, జంగిల్ క్లియరెన్స్ పేరుతో రూ.2.80 లక్షలు, వీధి కాలువల ఎక్కడా లేకపోయినా కాలువల పరిశుభ్రత కోసం రూ.2.32 లక్షలు ఖర్చుచేసినట్టు చెల్లింపులు చేశారు. ప్రస్తుతం పంచాయతీలో ఎక్కడ చూసినా తుప్పలు, పారిశుద్ధ్య సమస్య దర్శనమిస్తోంది. నీటి ట్యాంకుల పరిశుభ్రత కోసం సుమారు రూ.66 వేలు వెచ్చించినట్లు చూపించి బిల్లులు చెల్లింపులు చేశారు.

▼ అదనంగా విద్యుత్తు, ప్లంబింగ్, పారిశుద్ధ్య పనులకు ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించారు. ఈ పనులేవీ జరగలేదని.. సూపర్ సర్పంచి ఇష్టానుసారంగా వ్యవహరించి.. పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై నిధులు కాజేశారని వార్డు సభ్యులు విమర్శిస్తున్నారు. పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేయాలని నాలుగైదు నెలల నుంచి చెప్పినా వినిపించుకోలేదన్నారు.

పాత పనులకు ఫొటోలు చూపించానే బిల్లులు పెట్టామని పంచాయతీ పూర్వ కార్యదర్శి కాసు తెలిపారు.

▼ తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, అధికారులు విచారణ జరిపితే అన్ని వివరాలు వెల్లడిస్తామని సర్పంచి తెరదాడ అన్నమ్మ తెలిపారు.

పాత బావికి మరమ్మతులు చేసి నిధులు కాజేశారని చెబుతున్న వార్డుసభ్యులు, గ్రామస్థులు

బాపనమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ

గడిబాపనమ్మ

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లిలో వెలసిన గడిబాపనమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన భక్తులతో పాటు మైదాన, పట్టణ ప్రాంతాలకు చెందిన భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించినట్లు ఆలయ ఈవో సత్యరమేష్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం వద్ద ఎస్సై వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతను చేపట్టారు.

రహదారిని కమ్మేసిన మంచు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో ఆదివారం ఉదయం 516-ఇ జాతీయ రహదారిపై దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా మంచు తెరలు వీడలేదు. దీంతో వాహనదారులు రహదారిపై లైట్లు వెలిగించి రాకపోకలు సాగించారు. కొద్ది రోజులుగా చలి తీవ్రత పెరగడంతో చలి మంటల నుంచి ఉపశమనం పొందుతున్నారు. చలికి చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

నన్ను చూసైనా.. తప్పుకొని వెళ్లండి

నాలుగు రాష్ట్రాలకు వెళ్లే రహదారి ఇది. భద్రాచలం నుంచి కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు మీదుగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, వెళ్లే వాహనాలు, పాకొండల సందర్శనకు వెళ్లే వారంతా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. తోటపల్లి శివారులోని మలుపు గోతులు పడి ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల వ్యవసాయ పనులు చేసే కూలీలు గోతిలో చెట్టు కొమ్మను ప్రమాదసూచీగా ఏర్పాటు చేశారు. వాహన చోదకులు చెట్టు కొమ్మను చూసి పక్కగా వెళ్తున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎటపాక

తోటపల్లి శివారులో ఏర్పడ్డ గుంతలో హెచ్చరిక బోర్డులా జామాయిల్ కొమ్మ

కళాశాల ఎదుటే పోస్టుమార్టం గది

రాష్ట్ర విభజన అనంతరం చింతూరు కేంద్రంగా అప్పటి తెదేపా ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసింది. భవన నిర్మాణాలకు నిధులిచ్చింది. వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు నిలిపివేయడంతో గుత్తేదారు అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు విడుదల కావడంతో భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కళాశాల భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించక ముందే అక్కడ పోస్టుమార్టం గదిని నిర్మించారు. ప్రస్తుతం శవ పంచనామా ఇక్కడే చేస్తున్నారు. కళాశాల భవనాలను ప్రారంభిస్తే ఎదురుగా పోస్టుమార్టం ఉంటుందని, ఈలోగా వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చింతూరు

వరద తొలగిందిగా.. దర్శనాలు కల్పించరూ!

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గుముఖం పట్టి గోదావరిలో నీటి మట్టం తగ్గడంతో గండిపోశమ్మ అమ్మవారి ఆలయం బయటపడింది. ఈ ఏడాది జులై 3 నుంచి అమ్మవారి దర్శనాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. నాలుగు నెలలకుపైగా ఆలయంతోపాటు పరిసరాలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. వరద తొలగినా భక్తుల క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలో బురద, మట్టి పేరుకుపోయింది. మరుగుదొడ్ల పైకప్పు దెబ్బతింది. వరద తగ్గిందన్న సమాచారంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆలయాధికారులు అమ్మవారి దర్శనాలను త్వరితగతిన ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయం వద్ద పేరుకున్న బురద

ఎన్నికలొస్తేనే బాగు చేస్తారా?

విస్తీర్ణంలో మారేడుమిల్లి జిల్లాలో అతి పెద్ద మండలం. 71 గిరిజన గ్రామాలున్నాయి.. ఒకదానికొకటి సంబంధం లేకుండా దూరంగా ఉన్నాయి. కొన్ని గ్రామాలకు కనీస రహదారి సదుపాయం లేకపోవడంతో స్థానికులు మండల కేంద్రానికి రావాలన్నా, రేషన్ డిపోలకు వెళ్లి నిత్యావసర సరకులు తెచ్చుకోవాలన్నా అవస్థలు పడుతున్నారు. కుండాడ పంచాయతీ మల్లిసాల, మంజులమామిడి, తూరుమామిడి, కదుమూరు తదితర గ్రామాలకు సరైన రోడ్డు లేదు. కుండాడ నుంచి తూరుమామిడి, కదుమూరు వెళ్లే వారికి కాలినడకే శరణ్యం. దారంతా రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లలేని పరిస్థితి. ఎన్నికల సమయంలో తూరుమామిడి పోలింగ్ కేంద్రానికి అధికారులు, సిబ్బంది వాహనాల్లో వచ్చేందుకు రోడ్డును బాగు చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

అధ్వానంగా తూరుమామిడి రహదారి

అ వీ ఇ వీ

అనాథ బాలికకు ఆర్థికసాయం

కొయ్యూరు, న్యూస్‌టుడే: మూలపేట పంచాయతీ కొండసంతలోని అనాథ బాలిక మునోజు అనితా లక్ష్మికి కొయ్యూరు గ్రామానికి చెందిన దుమంతి సత్యనారాయణ రూ. ఏడు వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. బాలిక తల్లి భవానీ ఐదేళ్ల క్రితం, తండ్రి, అమ్మమ్మలు ఇటీవల మృతి చెందారు. స్థానికులు భవానీ ఓంకార్, జి.శ్రీను, అనిల్, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీలోని తలింబ, చీకుచింత, కుమ్మరిపుట్టు, డొక్రిపుట్టు గ్రామాల్లో ఆరుగురు శిశువులు మృతి చెందారని, బాధిత తల్లులకు పోషకాహారం అందించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి నర్సయ్య, సీపీఎం నాయకులు, లక్ష్మీపురం సర్పంచి త్రినాథ్ డిమాండు చేశారు. ఆదివారం గిరిజన సంఘం నాయకులు ఆ గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాలింతలు అనారోగ్యంతో బాధపడుతున్నారని.. వారిని ఆదుకోవాలన్నారు. ముంచంగిపుట్టు, కిలగాడ ఆసుపత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు లైకోన్, శ్రీను, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

తలింభాలో శిశువును కోల్పోయిన బాధితురాలితో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పూర్తిగా కోలుకున్న విద్యార్థినులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులంతా కోలుకుని పాఠశాలలో సురక్షితంగా ఉన్నారని హెచ్‌ఎం గోపాలం తెలిపారు. ఈనెల 15 నుంచి రెండు రోజుల్లో 54 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరంతా ఆసుపత్రిలో కోలుకుని డిశ్చార్జి అయ్యారు. వెంటనే స్పందించి మెరుగైన వైద్యసేవలందించేలా ఏర్పాట్లుచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులతో హెచ్‌ఎం గోపాలం

అర్ధనారీశ్వరుని అలంకరణలో పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామివారిని ఆదివారం అర్ధనారీశ్వరుడి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు శివయ్యకు పంచామృతాభిషేకాలతో పాటు రుద్రాభిషేకం చేశారు. స్వామివారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు.

లాహిరి లాహిరి లాహిరిలో..

పర్యాటక ప్రాంతాలకు పోటెత్తిన సందర్శకులు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పాడేరు సమీపంలోని వంజంగి మేఘాలకొండకు పర్యాటకులు తరలివచ్చారు. సుమారు 2500 మంది ఇక్కడకు చేరుకుని.. మంచు అందాలు ఆస్వాదించారు. రూ.1.23 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎకో టూరిజం నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. మేఘాలకొండ ఘాట్‌ల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పర్యాటక ప్రాంతాలకు వచ్చిన సందర్శకులు పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పాడేరు సమీప మినుములూరు కాఫీ బోర్డు వద్ద ఆదివారం 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని కాఫీ బోర్డు ఎస్.ఎల్.ఓ రమేష్ పేర్కొన్నారు.

వంజంగి మేఘాలకొండపై పర్యాటకులు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రాకశ్మీర్ లంబసింగి, తాజంగి, చెరువులవెనం ప్రాంతాలన్నీ పర్యాటకులతో నిండిపోయాయి. ఇక్కడ చలి, మంచు అందాలను ఆస్వాదించారు. లంబసింగిలోని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరితరిసార్ట్సు వద్ద కొందరు పర్యాటకులు చలిమంటలు వేసుకుని థింసా నృత్యాలతో సందడి చేశారు.

లంబసింగిలోని హరిత రిసార్ట్సు వద్ద థింసా నృత్యాలతో సందర్శకుల సందడి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం గ్రామంలో కొలువుదీరిన ఉమారామలింగేశ్వర దేవాలయానికి ఆదివారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. దేవాలయం చుట్టూ ఉన్న జీడిమామిడి తోటల్లో వనభోజనాలు చేశారు. ఆలయ ప్రాంగణం, గోస్తనీ నది పరివాహక ప్రాంతం పర్యాటకులతో నిండిపోయింది. విశాఖపట్నం నుంచి విద్యార్థులు బస్సుల్లో వచ్చారు. బొర్రాగుహలను సుమారు 5500 మంది సందర్శించగా.. రూ.4.5 లక్షల ఆదాయం వచ్చిందని యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

గోస్తనీ నదిలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

గి.స.ఉ. సంఘం అధ్యక్షుడిగా చిట్టిబాబు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం అల్లూరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఆదివారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు రేగం మత్స్యలింగం, గౌరవ అధ్యక్షులు సి.హెచ్ శ్రీనివాస్‌పడాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు.. పరిష్కారంపై చర్చించారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా కూడా రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులుగా సాగోరి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్ అనిల్‌కుమార్, కోశాధికారిగా పూజారి ఉపేంద్ర, జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులుగా కంబిడి నీలకంఠంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జి.వి.ప్రసాద్, ఉల్లి అర్జున్, పాలసి కృష్ణారావు, గంగన్నపడాల్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ తదితరులు

మహిళల ఉన్నతే లక్ష్యం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం మన డబ్బులు- మన లెక్కలు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. చింతపల్లి వెలుగు కార్యాలయంలో ఆదివారం అవగాహన కల్పించారు. మహిళల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం చింతపల్లిలో ర్యాలీ నిర్వహించారు.

చింతపల్లిలో వెలుగు సిబ్బంది ర్యాలీ

శబరిమలకు మాలధారుల పయనం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: జోలాపుట్ అయ్యప్ప పీఠంలో మాలధారులు ఆదివారం శబరిమలకు బయలుదేరారు. గణపతి హోమం, ప్రత్యేక పూజలనంతరం ఇరుముడులను కట్టుకున్నారు. మొత్తం 68 మంది దీక్షదారులు రెండు బస్సుల్లో పయనమయ్యారు. హుండీ వేలం పాటను నిర్వహించారు. టంగినిగుడకు చెందిన జామి చిన్నస్వామి, జోలాపుట్‌కు చెందిన పట్నాన గురుమూర్తి, బిసుస్వామి కైవసం చేసుకున్నారు. ఈ నగదును పీఠం నూతన భవన నిర్మాణానికి వినియోగిస్తామని గురుస్వామి సమ్మంగి సూరిబాబు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గురుస్వాములు పొడుగు గుప్తేశ్వరరావు, జగన్నాథపతి, కొంచాడ గోపాల్, చోడిపిల్లి రాంబాబు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడులతో అయ్యప్ప మాలధారులు

సీలేరులో షూటింగ్ సందడి

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో షూటింగ్ సందడి నెలకొంది. మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటిస్తున్న నూతన చిత్రానికి సంబంధించి సీలేరు ప్రాంతంలో సోమవారం నుంచి షూటింగ్ జరగనుంది. గత పది రోజుల నుంచి స్థానిక మారెమ్మ ఆలయం పరిసరాల్లో, ఇండోర్ స్టేడియం వద్ద సెట్‌లు వేస్తున్నారు. మారెమ్మ ఆలయం వద్ద అయ్యప్ప ఆలయం, ఇండోర్ స్టేడియం వద్ద పాత టూరింగ్ టాకీస్ సెట్ వేస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై దర్శకుడు శివ నిర్వాణ్ దర్శకత్వంలో రవితేజ, ప్రియా భవానీ శంకర్ హీరోహీరోయిన్లగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయికుమార్, జగతిబాబులు ప్రధాన పాత్రలో నటించనున్నారు. నెలరోజులపాటు మొదటి షెడ్యూల్ ఈ ప్రాంతంలో చిత్రీకరించడానికి, రెండో షెడ్యూల్‌ను జనవరి నుంచి నిర్వహించడానికి చిత్రబృందం ఏర్పాట్లు చేస్తుంది. హీరో రవితేజ ఆదివారం సాయంత్రం సీలేరు చేరుకున్నారు. ఏపీ జెన్‌కో అతిథిగృహం వద్ద హీరో బసకు ఏర్పాట్లు చేశారు.

సీలేరు జెన్‌కో అతిథిగృహం వద్ద హీరో రవితేజ

మారెమ్మ ఆలయం వద్ద వేస్తున్న సెట్

విక్టోరియా పోర్టుకు చేరుకున్న ఐఎన్‌ఎస్ సావిత్రి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: హిందు మహాసముద్ర (ఐవోఆర్) ప్రాంతం భద్రత కోసం చేపడుతున్న ఆపరేషనల్ గస్తీలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్‌ఎస్ సావిత్రి యుద్ధనౌక పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఈనెల 22న సీషెల్స్ దేశంలోని పోర్టు విక్టోరియాకు చేరుకుందన్నారు. సీషెల్స్ తీరగస్తీ దళానికి భారత నౌకాదళం సంక్లిష్ట విడిభాగాలను అందజేసినట్టు వెల్లడించాయి. ఐవోఆర్ పరిధిలో భద్రత భాగస్వామ్యదారుడిగా ఇండియా నిలిచిందని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

సీషెల్స్ తీరం వద్ద భారత నేవీ నౌక సావిత్రి సిబ్బంది

పురుడుపోసిన అంబులెన్స్ సిబ్బంది

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ మూకుడుపల్లి గ్రామానికి చెందిన నిండు గర్భిణి బోనంగి కందేరమ్మ పురిటినొప్పులతో ఆదివారం బాధపడుతోంది. కుటుంబసభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. వెంటనే స్పందించి అంబులెన్స్ అక్కడకు చేరుకొంది. అప్పటికే పురిటినొప్పులు ఎక్కువవడంతో ఈఎంటీ ఈశ్వరరావు, పైలట్ హరిప్రసాద్ ఆమెకు ప్రసవం చేయగా.. మగబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యసేవల కోసం కందేరమ్మ, శిశువును అంబులెన్స్‌లో రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు.

బాలింత, శిశువును అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సదుపాయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. సర్పంచి దురియా పుష్పలతతో కలసి తాగునీటి బోరుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ 480 మంది గిరి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, గత కొంతకాలంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు, వార్డెన్ తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. రూ.3 లక్షల జడ్పీటీసీ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచిని పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరుకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

సత్యసాయిబాబా మార్గం అనుసరణీయం

రంపచోడవరం, చింతూరు, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి బాబా సామాజిక సేవలు అమోఘమని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. సత్యసాయిబాబా శత జయంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో సావిత్రి, తహసీల్దారు బాలాజీ, డీటీ జిలాని, ఆర్ఐ నిర్మల, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర పాల్గొన్నారు. చింతూరు ఐటీడీఏలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి పీవో శుభం నొఖ్వాల్ బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏవో రాజ్‌కుమార్, ఏఎంవో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొయ్యూరు, ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా మార్గం అనుసరణీయమని ఎంపీపీ రమేష్‌బాబు అన్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం సాయిబాబా చిత్రపటానికి ఎంపీపీ రమేష్‌బాబు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ప్రసాదరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జోలాపుట్ ఆర్ఎఫ్ క్యాంపులో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హోమం, అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గడుగుపల్లిలో చిన్నారుల నృత్య ప్రదర్శన

హుకుంపేట, న్యూస్‌టుడే: గడుగుపల్లి గ్రామంలోని సత్యసాయి ఆలయంలో సాయినాథుడికి పండ్లరసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు సాయికీర్తనలు ఆలపించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

వై. రామవరం, మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో బాపన్న దొర సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేశారు. బొడ్డగండి పంచాయతీ డొంకరాయి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యాన మెట్టగూడెంలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ దీన్ని ప్రారంభించారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి రగ్గులు, దుప్పట్లు అందజేశారు. శ్రీనివాసరావు, ఏఈ శివశంకర్, రమణ, దారప్పన్న పాల్గొన్నారు.

డొంకరాయిలో రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాట్రస్టు సభ్యులు

కొయ్యూరులో నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

రంపచోడవరంలో సత్యసాయిబాబాకు నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, ఉద్యోగులు

(c) eenadu

ప్యాకేజీ-4 పనులు.. ఇక పరుగులు

కురగల్లులో తొలగించిన రోడ్డు పునర్నిర్మాణానికి ఎన్వోసీ

ఈనాడు, అమరావతి

కురగల్లు దగ్గర ఏడీసీఎల్ రహదారిని తొలగించిన ప్రాంతం

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4 పనులు పరుగులు పెడుతున్నాయి. కురగల్లులో కొండవీటి వాగు వరదల సమయంలో తొలగించిన రహదారి పునర్నిర్మాణం పనులు పట్టాలెక్కనున్నాయి. ఆగస్టులో కొండవీటి వాగుకు వరద పోటెత్తిన వేళ నష్ట నివారణకు మంగళగిరి మండలం కురగల్లులో 40 మీటర్ల మేర రహదారిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) తొలగించింది. ప్రస్తుతం పరిస్థితులు కుదుట పడడంతో రహదారి పునర్నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని రాతపూర్వకంగా ఎన్వోసీ ఇవ్వాలని ఏడీసీఎల్‌కి ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. తాజాగా దానికి సంబంధించిన ఎన్వోసీ ఎన్‌హెచ్ అధికారులకు అందింది. అన్నీ కుదిరితే సోమవారం నుంచి పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టి నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఇప్పటికే ప్యాకేజీ-3 పనులు దాదాపు కొలిక్కి రావడంతో విజయవాడ రాకుండా చినకాకాని నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్- వైజాగ్ వెళ్లేందుకు రాకపోకలు మొదలయ్యాయి. నున్న విద్యుత్తు టవర్ల వివాదంపై సోమవారం కోర్టు తీర్పు రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో సంక్రాంతి నాటికి ప్యాకేజీ-3, 4 పనులు కొలిక్కి వచ్చి బైపాస్‌పై వాహనాల రాకపోకలు మొదలవనున్నాయి.

మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు అందించొచ్చు

గోరంట్ల, న్యూస్‌టుడే: మీకోసం వెబ్‌సైట్‌లోనూ ప్రజా సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. అదే విధంగా డివిజన్, పట్టణం, మండలాల్లోనూ వినతులు తీసుకుంటారని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన ఫిర్యాదుల వివరాలను టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేసి.. వాటి స్థితిని తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎయిర్ కార్గో.. లక్ష్యం నీరుగారుతోంది!

ఉత్పత్తిదారులను అనుసంధానించడంలో విఫలం

ఈనాడు, అమరావతి

విజయవాడ విమానాశ్రయంలో ఎయిర్ కార్గో సేవల లక్ష్యం నెరవేరడం లేదు. రోజుకు 10 నుంచి 15 టన్నుల వరకు సరకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నా సగం కూడా వెళ్లడం లేదు. 2019కి ముందు కార్గో సేవలు ఆరంభించినా కొద్ది కాలంలోనే నెలకు 250 టన్నులకు పైగా సరకు ఎగుమతి, దిగుమతి అయ్యే స్థాయికి చేరింది. ప్రత్యేకంగా కార్గో సర్వీసులను ఆరంభించే ప్రయత్నాలూ జరిగాయి. గత వైకాపా హయాంలో ఏడాదిన్నరకు పైగా కార్గో సేవలు నిలిచిపోయాయి. తిరిగి 2024 జులై 1 నుంచి సేవలు ఆరంభమైనా.. సరకు రవాణా అరకొరగానే జరుగుతోంది.

మత్స్య ఉత్పత్తులకు అవకాశాలున్నా..: ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తులు.. నిత్యం దిల్లీ, బెంగళూరు సహా అన్ని నగరాలకు రోడ్డు మార్గంలో వెళ్తున్నాయి. మత్స్య ఉత్పత్తులు ఇటు దిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. గన్నవరం నుంచి నేరుగా రెండు మూడు గంటల్లో దిల్లీ సహా ఆయా ప్రాంతాలకు సరకు చేరే అవకాశముంది.

ప్రస్తుతం ఏడు నగరాలకే.. ప్రస్తుతం హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నై, విశాఖ, తిరుపతి.. ఏడు నగరాలకు మాత్రమే ఇక్కడి నుంచి దేశీయ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నగరాలకు రోజుకు ఒకటిన్నర టన్ను వరకూ సరకు ఇటునుంచి వెళుతోంది. అటు నుంచి 4-5టన్నులు వస్తోంది.
☛ దిల్లీ, ముంబయికి నడుస్తున్న.. ఐదు ఎయిర్‌బస్ 320 సర్వీసుల్లో ప్రయాణికులతో పాటు రెండున్నర నుంచి మూడు టన్నుల వరకూ సరకును తీసుకెళ్లే సామర్థ్యం ఉంది.

అవగాహన, నమ్మకం కలిగించాలి.. కార్గో సేవలను విస్తరించేందుకు.. ఉత్పత్తిదారులందరితో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. నేరుగా ఇక్కడి నుంచే సరకు పంపిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేయాలి. గత ఆరేళ్లుగా ఏ ప్రయత్నమూ చేయలేదు. దీంతో సరకును రోడ్డు మార్గంలోనే ఎక్కువ మంది ఇప్పటికీ పంపిస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార శాతం 86.65

ఈనాడు – అమరావతి

అర్జీదారుల సంతృప్తికి ప్రణాళిక

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రతి సోమవారం వస్తున్న అర్జీల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. దరఖాస్తులను బదిలీ చేయడంతోపాటు ఎప్పటికప్పుడు వాటి ప్రగతిని సమీక్షిస్తుండడంతో పరిష్కారంలో పురోగతి కనిపిస్తోంది. 86.65 శాతం ఫిర్యాదులు పరిష్కరించారు. ఒకవేళ అర్జీదారులు సంతృప్తి చెందని పక్షంలో సమస్యను రీఓపెన్ చేసుకునే వెసులుబాటు ఉండడం, అందుకుగల కారణాలపై విశ్లేషించి, ఆలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లావ్యాప్తంగా ఫిర్యాదులు.. పరిష్కారం తీరు ఇలా...
మొత్తం దరఖాస్తులు: 8,791 | పరిష్కారానికి నోచుకోనివి: 1,174
పరిష్కరించినవి: 7,617 | పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా స్థానం: 4

జిల్లాలో భూసంబంధిత వ్యవహారాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో కొన్ని వ్యక్తిగతమైనవి ఉంటున్నాయి. రెవెన్యూపరంగా భూఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, రీసర్వేలో సమస్యలు, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలన్న అభ్యర్థనలు ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో నిషేధిత జాబితా (22ఏ) నుంచి భూముల తొలగింపు సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. చాలావరకు వివాదాస్పద అంశాలతో ముడిపడి ఉండడంతో సమగ్ర వివరాలు సేకరించిన తరువాతే అధికారులు నిర్ణయం తీసుకుంటున్నారు.

రెవెన్యూపరంగా జిల్లాలో ఇటీవల వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తీరు ఇలా...

విభాగం	వచ్చినవి	పరిష్కారం	పెండింగ్
22(ఏ) నుంచి తొలగింపు	60	3	57
ఏపీ భూదాన్ చట్టం	1	1	0
వ్యవసాయేతరభూములుగా మార్పు	16	8	8
భూఆక్రమణ ఫిర్యాదులు	592	448	144



సంక్రాంతికి రైళ్లన్నీ ఫుల్

విజయవాడ: వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు రైళ్లలో దాదాపు బెర్తులన్నీ ఫుల్ అయ్యాయి. రెండు నెలల ముందుగానే టికెట్ల బుకింగ్ ప్రారంభమవడంతో అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్ బెర్తులు నిండి వెయిటింగ్ లిస్టుతో పాటు కొన్నింటిలో నోరూమ్‌లు దర్శనమిస్తున్నాయి.
☛ ఏటా సంక్రాంతి రద్దీ దృష్టిలో పెట్టుకొని భారీగా ప్రత్యేక రైళ్లను నడుపుతారు. ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో సర్వీసులు ఉన్నాయి. సాధారణ రైళ్లలో రిజర్వేషన్ టికెట్లు ఫుల్ అవడంతో ఇక ప్రత్యేక రైళ్లు, తత్కాల్ టికెట్లపైనే ప్రయాణికులు ఆశలు పెట్టుకున్నారు.
☛ హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ డిమాండ్ ఉంది. తర్వాత సికింద్రాబాద్, బెంగళూరు ఉన్నాయి. రాజధాని ప్రాంతంలో పనులు చేసేందుకు వందల సంఖ్యలో ఉత్తరాంధ్ర నుంచి కార్మికులు వచ్చారు. వారు పండగకు తిరిగి వెళ్లేందుకు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకోవడంతో విజయవాడ, హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ వెయిటింగ్ లిస్టులు ఉన్నాయి. ☛ బెంగళూరు నుంచి ఐటీ ఉద్యోగులు తన సొంత గ్రామాలకు రానుండడంతో బెంగళూరు మార్గంలో డిమాండ్ ఏర్పడింది. జనవరి 13, 14, 15 తేదీల్లో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్టు 100 దాటింది. మరికొన్నింటిలో బుకింగ్‌లు పూర్తయి 'రిగ్రెట్' అని వస్తుంది. ☛ పండగ ముందు, తర్వాత రోజుల్లో తత్కాల్ టికెట్లకు భారీ డిమాండ్ ఉంటుంది.

ప్లాస్టిక్ వ్యర్థం.. పక్షులకు ప్రాణాంతకం..!

ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రం ఇది. దాదాపు 9 ఎకరాల్లో విస్తరించి ఉంది. చుట్టూ నీరు, మధ్యలో చెట్లు..సంతానోత్పత్తికి అనువుగా ఉండడంతో ఆస్ట్రేలియా, సెర్బియా, శ్రీలంక దేశాల నుంచి దాదాపు 15 రకాల పక్షులు వలస వస్తుంటాయి. సుమారు 25 వేల పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. అలాంటి పర్యాటక కేంద్రం ఎదురుగా చూడండి..ఎంత అధ్వానంగా ఉందో. పక్షుల కేంద్ర ప్రధాన ద్వారం ఎదురుగా గ్రామంలోని, చుట్టుపక్కల చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువులోకి చేరి పక్షుల మనుగడను దెబ్బతీస్తోంది. పక్షులు ఆహారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు తినేస్తుండడంతో మృత్యువాత పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసనతో పర్యాటకులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. కేంద్రం పక్కనే ఉన్న చెరువులో కూడా పక్షులు స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. ఇప్పుడా చెరువు నిండా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో విహరించేందుకు అనువుగా లేక పక్షులు చెత్తా చెదారాల్లో వాలుతున్నాయి. ఇప్పటికైనా పక్షుల సంరక్షణ కేంద్రం ఎదురుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు.

\- ఈనాడు, అమరావతి

ఉప్పలపాడు పక్షుల కేంద్రం ఎదురుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

పక్కనే ఉన్న చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

బడి.. కళల బడి

భరతమాత విగ్రహం, చెంతనే ఇండియా మ్యాప్, అబ్దుల్ కలాం, నాలుగు సింహాల విగ్రహాలు

వివేకానందుని మ్యూరల్ ప్రతిమ

అది తెనాలి పురపాలక బాలురోన్నత పాఠశాల. లోపలకు అడుగు పెడితే కళా ప్రపంచంలోకి వెళుతున్న భావన. గదుల గోడలపై దేశ నాయకుల భారీ చిత్రాలు, ఆవరణలో విగ్రహాలు, విభిన్న రూపాలు ఆకట్టుకుంటాయి. 20 అడుగుల సుభాష్ చంద్రబోస్, 12 అడుగుల గాంధీజీ, చాచా నెహ్రూ తదితర జాతీయ నాయకులతో పాటు వివిధ ప్రకృతి అందాల వర్ణ చిత్రాలు ప్రతి తరగతి వద్ద కనిపిస్తాయి. అదే రీతిలో ఆవరణలో 20 అడుగుల భరతమాత విగ్రహంతోపాటు గౌతమబుద్ధుడు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం మొదలైన వారి విగ్రహాలు స్ఫూర్తినిస్తాయి. వీటితోపాటు గ్లోబ్, ఇండియా మ్యాప్‌తోపాటు దేశ నాయకులు, స్ఫూర్తి ప్రదాతల ప్రతిమలు కళా వైభవాన్ని చాటుతాయి. ఇలా తీర్చిదిద్దింది పాఠశాల చిత్రకళోపాధ్యాయుడు టి.ఆర్.విజయప్రకాష్. 1989వ సంవత్సరంలో ఉపాధ్యాయుడిగా దోనేపూడి ప్రభుత్వ పాఠశాలలో అడుగిడిన ఆయన అటుపై 1991వ సంవత్సరం నుంచి తెనాలి మున్సిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. 2012వ సంవత్సరం నుంచి బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రకళను చేరువ చేస్తున్నారు. వేలాది మందికి కళను అందించి, ధ్రువపత్ర కోర్సులు చేయించిన మాస్టారు తను ఏ పాఠశాలలో విధులు నిర్వర్తించినా ఆయా బడులను సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ బడిలో తోటి ఉపాధ్యాయుల సహకారంతో.. విద్యార్థులతో కలిసి ఇలా కళల ఒడిని ఆవిష్కరించారు. సూర్య భగవానుని మ్యూరల్ ఆర్ట్‌తోపాటు మరికొన్ని ప్రతిమలు తుది దశలో ఉన్నాయి. తాను వచ్చే ఏడాది రిటైర్ అవుతానని, తనను ఈ స్థాయిలో ఉంచిన విద్యాశాఖకు బహుమతిగా ఆర్ట్ గ్యాలరీ ఇవ్వడానికి పని ప్రారంభించానని విజయప్రకాష్ వివరించారు. విద్యాశాఖ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని అందుకున్న మాస్టారును రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు వరించాయి. కొన్ని రికార్డులూ నెలకొల్పారు.

\- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తరగతి గది గోడపై సుభాష్‌చంద్రబోస్ చిత్రం

తాను రూపొందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం, గ్లోబ్ వద్ద విజయప్రకాష్ మాస్టారు

ఇంటి పన్ను... ఆన్‌లైన్‌లో చెల్లించెయ్

తెనాలి టౌన్, కలెక్టరేట్, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పన్ను చెల్లింపులకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో రసీదు పుస్తకాలు అందుబాటులో ఉంచుకొని కొన్నింటి ద్వారా వసూలు చేసిన వాటిని మాత్రమే ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఫలితంగా ఆస్తి పన్ను సొమ్ము పక్కదారి పడుతోంది. దీనిపై పలు పంచాయతీల్లో పన్ను చెల్లించినా మళ్లీ కట్టాలనే రసీదులు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేయడం గమనార్హం. ప్రస్తుతం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంలో ఇక ఇంటి పన్నులు అవకతవకలు జరగకుండా ఉంటాయి. అంతేకాకుండా ఇంటి యజమానుల చరవాణి నంబర్‌కి ఉన్న వాట్సాప్‌కు పన్ను నోటీసులు, బకాయిలకు సంబంధించిన సమాచారం పంపిస్తున్నారు. దీంతో ఆ మొత్తాన్ని క్యూఆర్ కోడ్, యూపీఐ ద్వారా చెల్లించే విధానం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా చెల్లిస్తే రసీదు చరవాణికి వస్తోంది. ఫలితంగా ప్రతి పైసా పంచాయతీ ఖాతాకు జమవుతోంది. దీనిపై ఇంటి యజమానులకు అవగాహన లేకపోతే సచివాలయం వద్దకు వెళ్లి వివరాలు అందజేస్తే, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో కాకుండా డబ్బు తీసుకుని రసీదులు అందజేసే సిబ్బందిపై చర్యలు తప్పవని ఇప్పటికే ఉన్నతాధికారులు హెచ్చరించారు. ● జిల్లాలో 257 పంచాయతీలున్నాయి. బకాయిలతో కలిపి సుమారు రూ.47.82 కోట్ల వరకు ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉంది. దీన్ని మార్చి 31లోపు వసూలు చేయాల్సి ఉండగా డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పంచాయతీ అధికారులు ముందుకెళుతున్నారు.

ప్రమాదాలు ఆపాలి.. ప్రాణాలు నిలపాలి

వివిధ శాఖల సమన్వయంతో కసరత్తు

ఈనాడు–అమరావతి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల ఏటా వందలమంది మృత్యువాత పడడంతో పాటు గాయపడిన వారి సంఖ్య 800 మందికిపైగా ఉంటోంది. వాహనదారులు రహదారి నిబంధనలు పాటించకపోవడంతోపాటు ఆయా రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్లతో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుచేస్తోంది. రహదారి భద్రత కమిటీ సమావేశాల్లో వచ్చే సూచనలు పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో గతేడాదితో పోల్చితే రోడ్డు ప్రమాదాల సంఖ్య కొంత తక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఆర్ఏడీ) యాప్ ద్వారా జిల్లాలో ప్రమాదం జరిగిన వెంటనే వారికి వైద్యసాయం అందేలా చూడడంతోపాటు ప్రమాదానికి కారణాలను విశ్లేషిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా రవాణా, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, మున్సిపల్, పంచాయతీ రాజ్, స్థానిక సంస్థలు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్నారు. గుంటూరు నగరంలో పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం వల్ల రోడ్డుపైనే వాహనాలు పెట్టడంతో ప్రమాదాలు జరగడంతోపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని గుర్తించారు. ఈక్రమంలో పోలీసులు, జీఎంసీ అధికారులు సంయుక్తంగా పరిశీలించి నగరంలో ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు గుర్తించారు.

జనవరి ఒకటోతేదీ నుంచి అక్టోబరు 31 వరకు జిల్లాలో విభాగాల వారీగా ఐఆర్ఏడీ యాప్‌లో గుర్తించిన సమస్యలు.. పరిష్కారం..పెండింగ్ వివరాలు ఇలా....

విభాగం	సమస్యలు	పరిష్కారం	పెండింగ్
రవాణాశాఖ	185	184	1
వివిధ రహదారులు	38	5	33
మున్సిపల్ కేంద్రాలు	150	25	125
మొత్తం	373	214	159

జిల్లాలో రోడ్డు ప్రమాదాల వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	971	352	912
2024	1047	452	827
2025 (అక్టోబరు 31 వరకు)	763	288	665

సర్వీసు రోడ్లు వినియోగించుకునేలా.. జిల్లాలో కలకత్తా-చెన్నై జాతీయరహదారి 54 కిలోమీటర్ల మేర ఉండగా..52 కిలోమీటర్ల దూరం సర్వీసు రోడ్లు ఉన్నాయి. అయితే ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల ఆటోల వారు సర్వీసు రోడ్లు ఉపయోగించుకోకుండా జాతీయ రహదారిలోనే ప్రయాణిస్తున్నారు. జనవరి నుంచి జాతీయ రహదారిలో ఇప్పటివరకు 29 ప్రాణాంతక ప్రమాదాలు జరిగితే అందులో 17 ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకే. ఇందులో మరణించిన వారందరూ యువత కావడం గమనార్హం.
☛ జాతీయ రహదారిలోకి 32 ప్రవేశమార్గాలు, 29 ఎగ్జిట్ మార్గాలు ఉన్నాయి. ఈప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు పోలీసులు నిఘా ఉంచడం ద్వారా ద్విచక్రవాహనాలు, మూడు చక్రాల ఆటోలు జాతీయరహదారిలో ప్రయాణించకుండా చూడాలని నిర్ణయించారు.

తనలా.. మరెవరికీ కాకూడదని ఇలా..

అతి వేగం ప్రాణాంతకం.. కన్న బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్కువ వేగంతో ప్రయాణించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు గుంటూరు జన్మభూమి కాలనీకి చెందిన అచ్చయ్య. ప్లకార్డుతో మైకుతో ప్రచారం చేస్తూ జాగ్రత్తలు చెబుతున్నారు. గతంలో రహదారి ప్రమాదంలో గాయపడి ప్రాణాలతో బయటపడ్డానని, తనలా మరెవరికీ జరగకూడదనే నగరంలోని ప్రధాన రహదారుల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నానని ఆయన చెప్పారు.

\- ఈనాడు గుంటూరు

విద్యుత్తు అవసరాలు తీరేలా.. వడివడిగా అడుగులు

220 కేవీ ఉపకేంద్రానికి నేలను చదునుచేస్తూ..

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో భారీ విద్యుత్తు ప్రాజెక్టును ఏపీ ట్రాన్స్‌కో చేపట్టింది. తాడేపల్లి పరిధిలోని బ్రహ్మానందపురంలో ప్రస్తుతం ఉన్న 132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని 220/132/33 కేవీ స్థాయికి పెంచుతూ రూ.80 కోట్లతో పనులు చేస్తున్నారు. 4.30 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుత 132/33 కేవీ కేంద్రం నుంచి 113 మెగావాట్ల విద్యుత్తును తాడికొండ నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. అయితే 220 మెగావాట్లతో ఏర్పాటు చేసే ఉప కేంద్రం నుంచి తాడికొండతోపాటు మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, అమరావతి రాజధాని నగరం, విజయవాడకు సైతం కరెంటు సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

చదువుల తల్లి.. కల తీరకుండానే కన్నుమూసి..

విషాదంలో రోహిణి సోదరుడు డాక్టర్ సుజన్‌బాబు, తల్లి డాక్టర్ లక్ష్మీరాజ్యం తదితరులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే : అమెరికాలోని పెద్ద ఆసుపత్రుల్లో వైద్యురాలుగా పని చేసి బాగా నైపుణ్యం సంపాదించాక.. స్వస్థలానికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ పేదలకు సేవచేయాలనేది ఆమె కల. చిన్నతనం నుంచి వైద్యురాలు కావడం కోసం ఎంతో శ్రమించింది. అమెరికాలో ఉన్నతాసుపత్రిలో కొలువు సాధించింది. ఈక్రమంలో అక్కడ నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ వీసాను రద్దు చేయడంతో మనస్తాపం చెందిన గుంటూరుకు చెందిన వైద్యురాలు కాకు రోహిణి(38) ఆత్మహత్య చేసుకున్న వైనం అందరినీ కలచివేసింది. రోహిణి తండ్రి సుందరరామయ్య వ్యాపారవేత్త. ఆయన 1993లో గుండెపోటుతో మృతిచెందారు. తల్లి లక్ష్మీరాజ్యం వైద్యురాలు. రోహిణి, సోదరుడు సుజన్‌బాబు తల్లితో కలిసి ఉన్నారు. రోహిణికి తన తల్లిలాగ వైద్యురాలు కావాలని చిన్నప్పటి నుంచి కల. ఇంటర్ వరకు గుంటూరులో చదువుకొని బాగా మార్కులు సాధించింది. ఆతరువాత ఎంబీబీఎస్ చేసింది. ఉన్నత చదువులకు వెళ్లే ప్రయత్నంలో ఈ విషాదం చోటు చేసుకుంది.

ఓవర్‌లోడ్ వాహనాలపై కొరడా

పట్టాభిపురం: నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి అధికంగా సరకు రవాణా చేస్తున్న ఓవర్‌లోడ్ వాహనాలపై రవాణా శాఖ అధికారులు దాడులు చేశారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేసి అపరాధరుసుం విధించామని గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ సీతారామిరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతి, కొల్లిపర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఓవర్‌లోడ్ వాహనాలపై తొమ్మిది కేసులు నమోదు చేశామన్నారు. రూ.4 లక్షలకు పైగా అపరాధ రుసుం విధించామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై 193 కేసులు నమోదు చేశామని చెప్పారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. కేసులు నమోదు చేసి విచారణ నిమిత్తం కోర్టు ముందు ఉంచుతామన్నారు. యజమానులు తమ గూడ్స్ వాహనాల్లో అధిక బరువు తరలించవద్దని స్పష్టం చేశారు.

కౌలు రైతులకు అండగా నిలుస్తాం

అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మేడికొండూరు, న్యూస్‌టుడే: 'కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా. రైతులు, కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన, గుండ్లపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ఆదివారం తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంతో మంత్రి లోకేశ్ చొరవతో రూ.వేల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చొరవతో గ్రామాలు అభివృద్ధి బాటపట్టాయన్నారు. పత్తి రైతుల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేరేచర్ల - కొండమోడు రహదారి నిర్మాణ పనులకు సంబంధించి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. మంచి ఆలోచన కలిగిన వ్యక్తులకు రాజకీయాల్లో అవకాశం ఇస్తే ఎలాంటి మంచి పనులు చేస్తారో గుండ్లపాలెం సర్పంచి పాములపాటి కృష్ణారావును ఆదర్శంగా తీసుకోవచ్చని కొనియాడారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ పాలనలో రౌడీయిజం, దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులకు అడ్డులేకుండా పోయిందన్నారు. గత అయిదేళ్లు పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు జీతాలు అందక ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు సకాలంలో వేతనాలు అందుకుంటున్నారన్నారు. తొలుత నాయకులు మేడికొండూరు నుంచి ర్యాలీగా గుండ్లపాలెం చేరుకున్నారు. నాయకులు మల్లిపెద్ది రమేష్, నార్నె శ్రీనివాసరావు, పాములపాటి శివన్నారాయణ, గుండ్లపాలెం సర్పంచి పాములపాటి వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ☛ గుండ్లపాలెంలో సభ జరుగుతుండగా కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ వేదికపైకి వెళ్లి పెమ్మసానికి వినతి పత్రం అందించారు. అనంతరం రామకృష్ణ మైక్ తీసుకుని ప్రసంగించబోతుండగా కొంతమంది ఆయన్ను కిందకి దించేశారు. సభ వద్ద తెదేపా కార్యకర్తలు ప్రవర్తించిన తీరు తనకు అవమానం కలిగించే విధంగా ఉందని ఆయన విలేకరులతో వాపోయారు.

అమరావతి రూపకల్పనలో భాగస్వాములు అవ్వండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి రూపకల్పనలో ఏపీ సీఆర్డీఏ ప్రజలను భాగస్వామ్యులను చేస్తోంది. భవిష్యత్తు తరాలకు ఉత్తమ, సుస్థిరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన రాజధాని నగరాన్ని నిర్మించేందుకు అమరావతి విజన్ 2047 రూపకల్పనలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను సీఆర్డీఏ స్వీకరిస్తుంది. ప్రజా సంఘాలు, వివిధ రంగాల నిపుణులు నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. వివరాలను తెలుగు, ఆంగ్లంలో అందించే అవకాశాన్ని కల్పించారు. సీఆర్డీఏ అధికారిక వెబ్‌సైట్ **'సీఆర్‌డీఏ.ఏపీ.జీవోవీ.ఇన్'** ద్వారా ఈ సర్వేలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రజలు సూచనలు, సలహాలు పంపటానికి ఈ నెల 30 చివరి తేదీగా నిర్ణయించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ తరాలకు అత్యుత్తమ రాజధాని నగరాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొనాలని ఏపీ సీఆర్డీఏ విజ్ఞప్తి చేస్తుంది.



(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Digital Partner TV Partner Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005
వివరాలకు: 7799102585, 8328360034
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

బహుజనుల రాజ్యాధికారం లక్ష్యంగా పోరాడదాం

❖ స్థానిక సంస్థల నుంచే మార్పు మొదలవ్వాలి

గోరంట్ల-నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: బహుజనులంతా విభేదాలను పక్కన పెట్టి రాజ్యాధికారం లక్ష్యంగా ఐక్యంగా పోరాడదామని బహుజన చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. గుంటూరు మహాత్మాగాంధీ న్యూఇన్నర్ రింగ్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన యాదవ వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సభకు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి పేరయ్యయాదవ్ అధ్యక్షత వహించారు. రామచంద్రయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికంగా ఉన్న బహుజనులను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉపయోగించుకుంటూ.. ఉత్సవ విగ్రహాల్లాంటి పదవులిచ్చి రాష్ట్రాన్ని, సంపదను, వనరులను దోపిడీ చేస్తూ అణగదొక్కే కార్యక్రమం చేస్తున్నారన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కలిసికట్టుగా ముందుకెళ్లాల్సి ఉందన్నారు. బహుజనులు, యువత, మహిళల్లో మార్పు మొదలైందని, ఇదే పంథా కొనసాగితే దశాబ్దాలుగా కలలు కంటున్న స్వరాజ్యం ఇంకెంతో దూరంలో లేదన్నారు. ఎన్నికలు, పదవుల కోసం తానెప్పుడూ ఆలోచించలేదన్నారు. ప్రజా రాజకీయం కోసం దోపిడీ వర్గాలు కాకుండా మిగిలిన వర్గాలను ఏకం చేసే దిశగా ప్రయాణం కొనసాగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అన్నింటా పోరాడాలని పిలుపునిచ్చారు. తితిదే సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం ఇప్పటి వరకు దక్కలేదని, అందరం కలిసికట్టుగా ఉంటే రాజకీయంగా పైచేయి సాధించవచ్చన్నారు. చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ బలహీనవర్గాల చైతన్యం కోసం పాటుపడే వారిని బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మైలవరం వైకాపా ఇన్‌ఛార్జి తిరుపతిరావు, ఒంగోలు మాజీ జడ్పీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, తాళ్ల నాగరాజు, కుమ్మర క్రాంతికుమార్, దాసరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్, చిత్రంలో తితిదే సభ్యుడు జంగా కృష్ణమూర్తి, శ్రీనివాస్‌యాదవ్

ఓవరాల్ ఛాంపియన్ గుంటూరు

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

కనకారావు నుంచి ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు జిల్లా క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 14, 17, 19 బాల, బాలికల అంతర జిల్లాల సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా బృందం ట్రాక్ ఈవెంట్‌లో 48 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ఛాంపియన్‌షిప్ కార్య నిర్వాహక కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. రోడ్డు ఈవెంట్‌లో గుంటూరు బృందం 63 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి శాప్ సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, పోటీల పరిశీలకుడు వ.సునీల్, ఉమ్మడి కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ కార్యదర్శి కె.సుగుణరావు అతిథులుగా హాజరై ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు, వ్యక్తిగత విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన సైక్లిస్టులకు పసిడి, రజత, కాంస్య పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాంబాబు, వ్యాయామ సంచాలకులు టి.విజయపద్మ, పీఈటీలు ఎంవీఎస్ ప్రసాద్, కె.పురుషోత్తం, ఎం.రూతమ్మ, ఎం.సునీల్ పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం సేవలు స్ఫూర్తిదాయకం


ప్రగతి సంచికను ఆవిష్కరిస్తున్న బాలస్వామి, సంఘ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విద్య, వైద్య, సామాజిక రంగాల్లో ది తెనాలి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వారు మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.బాలస్వామి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సొసైటీ 30 వసంతాల ప్రగతి వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో తెనాలిలో విధులు నిర్వహించిన క్రమంలో ఇక్కడి సంస్థలు, వ్యక్తులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటు, అందించిన సేవలు, సాధించిన ప్రగతిని వివరించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం 30 వసంతాల ప్రగతి సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అక్కల శ్రీరామ్, రాచాబత్తుని బ్రహ్మం, నరేంద్రబాబు, పురుషోత్తం, జొన్నాదుల మహేష్, వెంకటేశ్వరరావు, ఒంటేరు ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ రాజ్యస్థాపనే సీఐటీయూ లక్ష్యం

మాట్లాడుతున్న నరసింగరావు, వేదికపై నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కార్మిక వర్గ రాజ్యస్థాపనే లక్ష్యంగా సీఐటీయూ ముందుకుసాగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు అన్నారు. సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు తాడేపల్లిలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని, హక్కులను కాలరాసే విధంగా కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని మండిపడ్డారు. 29 పాత చట్టాలను ఎత్తివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. తొలుత సీఐటీయూ పతాకాన్ని వీరే సురేష్ ఆవిష్కరించి నాయకులతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద, సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, నేతాజీ, శివాజీ, రమాదేవి, దుర్గారావు, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు పవన్‌కల్యాణ్ కృషి

ఐక్యత చాటుతున్న కాపు నేతలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న తోటలో కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్, జనసేన నాయకులు జొన్నా రాజేష్ నాయకత్వంలో ఆదివారం కాపు వన సమారాధన మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని నాయకులు కోరారు. కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.3 వేల కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. జనాభా ప్రాతిపదికపై రాజకీయ, ప్రభుత్వ నియామక పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మిరియాల శ్రీనివాస్, రామకృష్ణ, గంజి చిరంజీవి, గాదె వెంకటేశ్వరరావు, వంగవీటి ఆశాకిరణ్, విన్నకోట శ్రీనివాసరావు, అంబటి తిరుపతిరావు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రైతు జేఏసీ సమావేశం వాయిదా

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని రైతుల సమస్యలను 6 నెలల్లో పరిష్కరిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన రైతు సమస్యల పరిష్కార కమిటీ స్పష్టమైన హామీ ఇచ్చినందున ఈ నెల 29న గుంటూరులో నిర్వహించ తలపెట్టిన రైతు జేఏసీ విస్తృత సమావేశాన్ని వాయిదా వేసినట్లు మందడం గ్రామానికి చెందిన ఐకాస నాయకుడు ఆలూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లకు రాజధాని రైతులు ధన్యవాదాలు తెలిపారు.

సమాజానికి దిక్సూచి సత్యసాయి

సత్యసాయి చిత్రపటానికి పూలు వేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సత్యసాయి సమాజానికి దిక్సూచి అని, విద్య, వైద్య రంగాలతో పాటు, తాగునీటి ప్రాజెక్టు ద్వారా ప్రజల దాహార్తి తీర్చుతూ సమాజానికి ఎంతో మేలు చేకూర్చారని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లో సత్య సాయి సేవా సమితి సారథ్యంలో సత్యసాయి శత జయంత్యుత్సవాలు ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొని సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పిల్లల్లో విలువలు పెంపొందించేందుకు సత్య సాయి బోధనలు ఎంతగానో తోడ్పడతాయని, తల్లిదండ్రులు వాటిని తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బాబాను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సూచించారు. మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ ప్రేమ తత్వమే సేవాతత్వంగా బాబా భావించారన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు నరసింహారావు, సమితి సభ్యులు సాయి శంకర్, డీఆర్వో ఖాజావలీ, డీపీవో బి.వి.నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణ పనులు

భారీ పైపుల ఏర్పాటు

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీడ్ యాక్సెస్ (ఈ-3) రహదారి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గత ప్రభుత్వంలో రాజధాని గ్రామం దొండపాడు శివారు నుంచి వెంకటపాలెం సమీపంలోని మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం వరకు సుమారు 14.3 కి.మీ దూరం సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కొంతమేర పూర్తి చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వర్షాల కారణంగా కొన్ని రోజులు నిర్మాణ పనులు నెమ్మదిగా జరిగాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గిపోవడంతో సీడ్‌యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం రహదారి పక్కన పెద్ద పెద్ద డి.ఎ పైపులను వెల్డింగ్ అనుసంధానం చేసి క్రేన్‌తో భూమిలో ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు భూగర్భ విద్యుత్ తీగలు, వైర్లు అమర్చేందుకు పైపులు అమర్చారు. విద్యుత్‌తో పాటు టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పనకు, మురుగు నీరు, వరద నీరును తరలించేందుకు భూగర్భ విధానంలో డక్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు మరో 3 కి.మీ దూరం రహదారి నిర్మాణానికి జీవో ప్రారంభించారు. కృష్ణానదిపై స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కాగా, రాయపూడి వద్ద కొద్ది దూరం రహదారి నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. దొండపాడు వద్ద విద్యుత్ హెచ్‌టీ లైనులను మార్చాల్సి ఉంది.

కురగల్లు సొసైటీ అక్రమాలపై విచారించి నివేదికివ్వండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కురగల్లు సొసైటీలో రైతులు దాచుకున్న సొమ్మును అక్రమార్కులు దోచేయడంపై జిల్లా సహకార శాఖ అధికారి విచారించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సహకార శాఖ కమిషనర్ కె. శ్రీలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కురగల్లు సొసైటీలో అక్రమాలపై తీసుకున్న చర్యలను వివరించాలని, అనుమానిత వ్యక్తుల ఆస్తులను షరతులతో కూడిన అటాచ్‌మెంట్‌కు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

'శెట్టిబలిజలకు వైకాపా ఏం చేసిందో చెప్పాలి'

తాడేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ల నుంచి శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని తొలగించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. తాడేపల్లిలోని పార్క్యూన్ గ్రాండ్ హోటల్లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీలు కూడా శెట్టిబలిజ ధ్రువపత్రం తీసుకునే విధంగా వైకాపా ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. శెట్టిబలిజలకు వైకాపా హయాంలో ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. త్వరలో శెట్టిబలిజలకు కూటమి ప్రభుత్వం రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్మిక శాఖలో ప్రభుత్వం పలు కీలక సంస్కరణలను అమల్లోకి తెచ్చిందన్నారు. కార్మికులకు ఈఎస్ఐ వైద్యశాలల్లో వారి అత్తామామలకు సైతం వైద్యం అందించే విధంగా సంస్కరణలను తీసుకొచ్చామన్నారు. గర్భిణులుగా ఉన్న మహిళా కార్మికులకు ఆరునెలలు ప్రసూతి సెలవు ఇవ్వాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. వేతనాల్లో తేడా లేకుండా వివక్ష లేకుండా చూసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. వారానికి 48 గంటలు ఎప్పుడైనా పనిచేసే సదుపాయం కల్పించామన్నారు. తప్పనిసరిగా అదనపు పనిగంటలు చేయాలనే నిబంధన లేదన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల ఆరోగ్యపరంగా, వేతనాలు పరంగా కార్మికులకు రక్షణ కలుగుతుందన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్'లో చోటు

ఉపేంద్రవర్మను అభినందిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 2023 జులై 03వ తేదీన 1360 మంది కళాకారులతో ఏకకాలంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆధ్యాత్మిక సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించినందుకు గాను యూవీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత డాక్టర్ అంగా ఉపేంద్ర వర్మకు 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్'లో చోటు దక్కింది. ఈ మేరకు ఇటీవల ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. ఆయను ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 7095718191.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

JOBS

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

Paparao High School K.Uppalapadu, Prakasam (Dt). Wanted High School Telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female) Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. ✆ 7019326579, 9392182210.

జై గణేష్ గ్రూప్ గుంటూరులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (ఆడ/మగ) 34 మెంబర్స్ కావలెను. జీతం: 15000+ PF+ESI. ✆ 96525 42277.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ॥ 10th, వ:30-65 సం॥.7989246788.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్తు డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలీకాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ॥ 10-20K ✆ 83743 25002 & 88858 79076.

చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్‌వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.

మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి
•తెనాలి •పొన్నూరు

వసతి గృహానికి సామగ్రి వితరణ

శుద్ధ జల యంత్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: సిరి సేవా సంస్కృతి ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ కళాశాల వసతి గృహ విద్యార్థినుల సౌకర్యార్థం రూ.లక్ష విలువ గల శుద్ధజల యంత్రం, గాలి పంకాలు, రాతపుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందించినట్లు బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బీసీ వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన సామగ్రి అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్.నాగరమేష్, జొన్నాదుల శివరామకృష్ణ, నందిపాటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

30న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయలని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న గుంటూరులో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమీర్, యశ్వంత్, కిరణ్, సౌమ్య, సుర్జిత్, రాజ్, వెంకి, గోపి, జిస్టు, లోకేశ్, నసీర్, పర్హాన్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

◆ 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని నేతాజీనగర్‌లో మూడు రోజులుగా పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు.

◆ 19వ వార్డు ఎస్టీ కాలనీలో పాడైపోయిన వీధి దీపానికి మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

? పొన్నూరులోని 15 వార్డు ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. **- పి.వెంకటేశ్వర్లు, 15వ వార్డు**

✔ గొయ్యికు మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు**

? పొన్నూరు 28వ వార్డు ప్రధాన రహదారిలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. **-షేక్ ముంతాజ్, 28వ వార్డు**

✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.
- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.– న్యూస్‌టుడే, పొన్నూరు

తీరనున్న చెత్త వెతలు!

తెనాలికి వచ్చిన కాంపాక్టర్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పోగయ్యే చెత్తను రోజూ తరలించడంతో పాటు ఆయా నిల్వలను బయో మైనింగ్ చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు కమిషనర్లకు సూచించారు. ఆ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి బయో మైనింగ్ పనులు జరుగుతున్నాయి. అలాగే రోజువారీ చెత్త తరలించే సంస్థతో కూడా ఒప్పందం కుదుర్చుకోవడంతో తెనాలి పట్టణ వాసుల కష్టాలు తీరనున్నాయి.

* చెత్త తరలించిన వాహనానికి టన్నుకు కిలోమీటరుకు రూ.6.55 చెల్లించాలి. ఇది ప్రస్తుతం పురపాలక సంఘంలో చెత్త తరలింపునకు అవుతున్న ఖర్చుతో పోల్చితే తక్కువగానే ఉంది. ఈ క్రమంలో తెనాలిలో పోగయ్యే 90 టన్నుల వ్యర్థాల్లో 60 టన్నులు తరలింపునకు ఏడాదికి రూ.కోటి చెల్లించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ లెక్కన ఒప్పందం ప్రకారం రెండేళ్లకు రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇది తరలించే చెత్త పరిమాణాన్ని బట్టి మారుతుంటుంది. ఇప్పటికే సదరు సంస్థతో కలిసి పనిచేయడానికి రాష్ట్రంలోని 12 పురపాలక సంఘాలు ముందుకొచ్చాయి. వాటికి 30 టన్నుల చెత్త తరలించే సామర్థ్యం కలిగిన కాంపాక్టర్లు అందించారు. ఈ వాహనం ఖర్చును పురపాలక సంఘం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు భరించనున్నారు. వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్లుగా తరలించని చెత్త బయోమైనింగ్ పనులు జరుగుతున్నట్లు కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. అలాగే కాంపాక్టర్‌లో రెండు ట్రిప్పులు చెత్త తరలింపు.. కౌన్సిల్ ఆమోదం తరువాత అమల్లోకి వస్తుందని తెలిపారు.

ఆరంభం.. అంతలోనే అలంకారప్రాయం!

తెనాలి బస్టాండ్‌లో నిరుపయోగంగా ఐక్లిక్ కేంద్రం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి బస్టాండ్ ప్రాంగణంలో సుమారు పదేళ్ల కిందట పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐక్లిక్ కేంద్రం నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు తమకు ఎదురైన సమస్యలను ఈ కేంద్రం ద్వారా పోలీసు విభాగానికి పంపే వీలు కల్పించారు. రాత పూర్వక ఫిర్యాదును స్కాన్ చేయడం ద్వారా లేదా తాము చెప్పదలుచుకున్న విషయాన్ని కంప్యూటర్ కీబోర్డును ఉపయోగించి సందేశంగా పంపే వెసులుబాటు ఉందని అప్పట్లో ప్రకటించారు. ఫిర్యాదు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులకు చేరుతుందని, అది ఏ స్టేషన్ పరిధికి సంబంధించినది అయితే అక్కడికి పంపుతామని, అనంతరం పోలీసులే నేరుగా ఫిర్యాదుదారుడిని సంప్రదిస్తారని చెప్పారు. తొలి రోజుల్లో కేంద్రం వద్ద కానిస్టేబుల్ ఉండి.. అక్కడికి వచ్చిన వారికి ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు ఎలా పంపాలో తెలిపేవారు. కొద్ది రోజుల తరువాత అతడు రావడం మానేశారు. దీనికి తోడు అంతర్జాల సమస్యలు తలెత్తడంతో రోజుల వ్యవధిలోనే కేంద్రం నిరుపయోగంగా మారింది. కంప్యూటర్ ఆధారిత పరికరాలదీ అదే తీరు. గత నెలలో బస్టాండ్ పరిధిలో కొన్ని చోరీలు జరిగాయి. మరోవైపు ఆవరణలోని కెమెరాలూ పనిచేయడంలేదు. డివిజన్ కేంద్రమైన తెనాలి బస్టాండ్ నుంచి రోజూ 106 సర్వీసుల ద్వారా సుమారు 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో భద్రతాపరమైన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

గుంటూరు గ్రామీణం: చౌడవరంలోని దందత్తనాథ క్షేత్రంలో ఆదివారం భక్తిభావంతో సాగిన శ్రీ గణపతి సచ్చితానంద భగవద్గీత కంఠస్థ పోటీలు అలరించాయి. ఆరు రౌండ్‌లలో జరిగిన పోటీల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఆరు బృందాలుగా పాల్గొన్నారు. అనంతరం దత్తక్షేత్ర పారాయణంలో భాగంగా భగవద్గీత పారాయణం జరిగింది. అన్ని బృందాలు ఉత్తమ ప్రతిభ కనబర్చటంతో అందరినీ విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు.

గ్రామీణ సీఐ బదిలీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి గ్రామీణ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఉమేష్ బదిలీ అయినట్లు స్థానిక అధికారులకు ఆదివారం సమాచారం అందింది.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. తెనాలి వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. రావిపాటి వీరనారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేడుక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి ఎన్‌సీఆర్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2000 బృంద సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించినట్లు ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ఏఐసీసీ పరిశీలకుల రాక నేడు

తెనాలి(కొత్తపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్యారెడ్డి తదితరులు సోమవారం ఉదయం తెనాలి రానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు తెలిపారు.

స్పందించారు.. నిధులు మంజూరు చేశారు

15వ వార్డులో నిర్మించిన సీసీ డ్రెయిన్

పొన్నూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో స్థానిక 15వ వార్డులో సిమెంటు డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.20 లక్షల నిధులను మంజూరు చేసి పనులు చేయలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గతేడాది సెప్టెంబరు 22న 'వైకాపా హయాంలో మాటలతోనే కాలయాపన' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పురపాలక సంఘ అధికారులు స్పందించారు. సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.26 లక్షల నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆ సిమెంటు కాలువను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సోమవారం ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నరేంద్ర మోదీ నూతన రూపకర్త పుస్తకావిష్కరణ

పుస్తకం విడుదల చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే : పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు, పొన్నూరు మండల పరిధిలోని వడ్లమూడికి చెందిన వడ్రాణం సురేష్ రచించిన నరేంద్ర మోదీ నూతన భారతదేశ రూపకర్త ముందు చూపు అమలు అనే పుస్తకాన్ని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు తదితరులు గుంటూరులోని పెమ్మసాని కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక వహాబ్‌రోడ్‌లో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి పాల్గొని పడిపూజ విశిష్టత వివరించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, గురుస్వాములు, అయ్యప్పదీక్షాధారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

చేబ్రోలు, న్యూస్‌టుడే : మండలంలోని శలపాడులో దశాబ్దాల కిందట నిర్మించిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానిక దాతలు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం పునఃనిర్మాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండదని ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వచ్చేది.. వెళ్లేది ఎలా?

గుంటూరు- బాపట్ల ప్రధాన మార్గంలో మామిళ్లపల్లి అడ్డరోడ్డు వద్ద దాతలు నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం చుట్టూ కొందరు వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు భవనం లోపలికి.. బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి లోపలికి వెళ్లే మార్గంలో వాహనాలు నిలపకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

మరమ్మతులు ఆపేసి.. అవస్థలు పాల్జేసి..!

రోడ్డుపై వ్యర్థాలు

కొల్లిపర, న్యూస్‌టుడే: మండలంలోని మున్నంగి గ్రామంలో రేపల్లె కాలువను కలుపుతూ నిర్మించిన సీసీ రోడ్డు ధ్వంసమై నెలలు గడుస్తోంది. మరమ్మతులు చేపట్టిన అధికారులు మధ్యలోనే వదిలేశారు. తొలగించిన వ్యర్థాలు కాలువ వంతెన, రోడ్డుపై వేశారు. దీంతో వంతెన దాటాలంటే కష్టతరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాలి తీస్తామన్నా.. పట్టింపులేదు!

తెనాలి బస్టాండ్‌లో విజయవాడ బస్సులు ఆగే ప్రాంతానికి రెండో గేటు నుంచి నేరుగా వచ్చే వారు తమ వాహనాలను అక్కడే నిలుపుతుండటం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి ఆర్టీసీ అధికారులు 'ఇక్కడ వాహనాలు నిలుపరాదు.. నిలిపినచో టైర్లలో గాలి తీయబడును' అంటూ పెద్ద అక్షరాలతో రాయించారు. కాని ఫలితం సున్నా..ఆ బోర్డు వద్దే నిలిపిన వాహనాలను చిత్రంలో చూడొచ్చు. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

సమాజంపై అవగాహన పెంచుకోండి

కొత్తరెడ్డిపాలెంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

చేబ్రోలు: విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత, అవగాహన పెంచుకోవాలని చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుచరిత అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపులో పచ్చదనం, పరిశుభ్రత, మొక్కలు నాటడం, వైద్య శిబిరం, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అక్షరాస్యతపై మహిళలకు అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త సుధాకర్, కళాశాల అధ్యాపకులు, స్థానికులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

పొన్నూరు, న్యూస్‌టుడే : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి జేవీ. సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం చేబ్రోలు డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాదక ద్రవ్యాలపై మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. నేటి యువత క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. విష సర్పాలకు ఆవాసాలు

పొన్నూరు, న్యూస్‌టుడే

మండలంలోని బ్రాహ్మణ కోడూరు, మామిళ్లపల్లి, మాచవరం, ములుకుదురు, నండూరు, ఉప్పరపాలెం, మన్నవ, దండమూడి, ఆరెమండ తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడవిలా తయారయ్యాయి. గుబురుగా పెరగడంతో విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి. పగలు, రాత్రి అని లేకుండా వాటిల్లో నుంచి పాములు, తేళ్లు, మండ్రకప్పలు తదితరాలు గృహాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఒక్కోసారి తలుపులు తీయాలన్నా భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటు వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాపోతున్నారు.

చూసి వెళ్తున్నారు అంతే..

కొంత మంది స్థల యజమానులు పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. వారు వీటిని పట్టించుకోక పోవడంతో సమస్య వస్తోంది. దీన్ని పరిష్కరించమని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు ఇచ్చినప్పుడు ఆ స్థలాల వద్దకు అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారు తప్పా సమస్యకు పరిష్కారం చూపడం లేదని ఆవేదన చెందుతున్నారు. స్థల యజమానులను పిలిపించి మాట్లాడడం లేదని వాపోతున్నారు. కొన్ని స్థలాలు పల్లంగా ఉండటంతో వర్షపు నీరు చేరుతోంది. రోజులు తరబడి ఆ నీరు బయటకు వెళ్లకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల సమస్య ఎక్కువగా ఉందని, దోమ కాటుతో విషజ్వరాలు సోకుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ వేముల శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆయన ఇలా స్పందించారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు అందించమని పంచాయతీ కార్యదర్శులకు చెబుతామన్నారు. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాహ్మణ కోడూరులో గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మండలం	పొన్నూరు
గ్రామాలు	29
కుటుంబాలు	21,930
జనాభా	63,504
ఖాళీ స్థలాల సంఖ్య	2,200

త్రోబాల్ జట్ల ఎంపికలు

ఎంపికకు హాజరైన క్రీడాకారులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళలు, పురుషుల త్రోబాల్ జట్ల ఎంపిక ఆదివారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ వేకనరస కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో జరిగింది. గుంటూరు జిల్లా త్రోబాల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, వివేక విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎంపికలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈదర వెంకటపూర్ణచంద్, డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు, నల్లూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవాడతాయని తెనాలి పురపాలక బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని భారతి పేర్కొన్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా ఆదివారం పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. శిక్షకురాలు కొడాలి గోవర్ధన, ఇతర ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు, శిక్షకులు

చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ

పొన్నూరు, న్యూస్‌టుడే : బల్గేరియా అసినొగ్రాడ్ నగరంలోని బల్గేరియా చెస్ స్పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంటులో పొన్నూరు పరిధిలోని నిడుబ్రోలుకు చెందిన చెస్ క్రీడాకారుడు ధూళిపాళ్ల బాలచంద్రప్రసాద్ ప్రతిభ చాటి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆయన తండ్రి ధూళిపాళ్ల రమేశ్‌బాబు ఆదివారం తెలిపారు

దేవాలయ పరిశుభ్రత యోగం

కార్యక్రమంలో పాల్గొన్న యోగా సాధకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: శ్రీఆంజనేయం ధ్యాన, యోగ మండలి ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయ పరిశుభ్రతా యోగం నిర్వహించారు. తెనాలిలోని గోవర్ధనస్వామి ఆలయంలో యోగా సాధకులు పరిశుభ్రత పనులు చేపట్టారు. ప్రాంగణాన్ని రంగవల్లులతో అలంకరించారు. యోగాచార్య కిశోర్ గురూజీ పర్యవేక్షించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 99/2024 in O.S. 519/2022

Between:
Sanaka Vijaya Lakshmi, W/o. Venkata Koteswarara Rao, Tenali ...DHR
and
Divi Uma Lakshmi @ Uma
W/o. Prabhakara Rao, Age 54 Years, D. No. 1-9-40, Nazerpet, Tenali, ... J.Dr.

పై నెంబరు ఇ.పి.లో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జెడిఆర్ స్వాధీనంలో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారిచే ది. 16-12-2025వ తేదీ ఉదయం 10-30 గం.ల లగాయతు వేలం వేయబడును. కావలసినవారు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

Property of House Flat baring No. G2 in Ground Floor having 1700 Sq. Ft. of Plinth area and Common area and having 100 Sq. Ft. of Car Parking, Borewell, Common Corridor, Stair Case etc., in Rani Villas, and having 45 Sq. Yards out of 405.54 Sq. Yds of undivided and unspecified share in the land in ward No.8, Block No. 10, T.S. No. 517/4, situated at Tenali, within the Sub - Registry of Tenali, Guntur District, is being bounded by: **East:** Open to Sky, **South:** Open to Sky, **West:** Open to Sky, **North:** Stair Case, Lift Common Carridor.

DHR Value: **Rs. 20,00,000/-**
Amina Value: **Rs. 30,00,000/-**
Sale Date: **16-12-2025**
Further Hearing: **23-12-2025**

నోట్: 1) ఇ.సి. దాఖలా బొల్లు ఇందిరా రాణి గారి నుండి జెడిఆర్‌కు సేల్‌డీడ్ ద్వారా డాక్యుమెంట్ నెం. 2262/2022 SRO Tenali (713) న ది. 27-4-2022 సంక్రమించినది. 2) ఇ.సి. దాఖలా జెడిఆర్ ది. 6-7-2022న డాక్యుమెంట్ నెం. 4068/2022 (1) SRO Tenali (713) IIFL Home Finance Ltd., Ponnuru వారికి Mortgage Without Possession చేసివున్నారు. 3) శ్రీ కోర్టు వారు ది. 4-7-2022న జెడిఆర్‌కు దావాలో జప్తు నోటీసు ఇచ్చి ఉన్నారు. తరువాత ది. 6-7-2022న షెడ్యూలు ఆస్తిని జప్తు చేసివున్నారు. కాబట్టి సదరు Mortgage without Possession డీడ్‌నకు లోబడి వుండనవసరం లేదు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

Y.Uma Maheswara Rao,
Advocate for DHR
Tenali, Cell 93466 51714

కత్తిపోట్లకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సహజీవనం చేస్తున్న వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన.. పట్టణ రాజుల కాలనీకి చెందిన ఉష (45) అనే మహిళ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెనాలి పోలీసులకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. నిందితుడిపై నమోదు చేసిన కేసును హత్యగా మార్చినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు. సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మూడురోజుల నుంచి వడ్డేశ్వరంలో యాచికత్వం చేస్తూ కనిపిస్తున్నాడని అనారోగ్యంతో సదరు వ్యక్తి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించినట్లు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గుంటూరు గ్రామీణం: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు కొనసాగించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివితేజ మూర్తి అన్నారు. విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెదపలకలూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆ కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలకు విద్య, ఉద్యోగం, చట్టసభలు, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏఐబీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి అన్నారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీలకు అన్ని రంగాల్లో 52 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ సామాజికభవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.

నిఘా నీడలో పెదకాకాని

పెదకాకాని, న్యూస్‌టుడే

నేర నియంత్రణకు పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఇందులో భాగంగా పెదకాకాని మండలంలోని గ్రామాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసింది. పెదకాకాని సీఐ నారాయణ స్వామి ఆయా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి వారే స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా కేసుల దర్యాప్తులో వీటి పాత్ర కీలకంగా మారుతుంది. రాబోయే కాలంలో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

మూడు పుణ్యక్షేత్రాలు

పెదకాకానిలో మల్లేశ్వర స్వామి దేవస్థానం, బాజీబాబా దర్గా, స్వస్థిశాల(తోట) ఉన్నాయి. నిత్యం భక్తులు ఈ పుణ్యక్షేత్రాల్లో మొక్కులు, పూజలు, ప్రార్థనలు నిర్వహించేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. చోరీలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రధాన మార్గాల్లో కెమెరాలను బిగించారు. నంబూరు, కొప్పురావూరు, పెదకాకాని, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల పరిధిలో సుమారు పది కి.మీ పైగా చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి వెళ్తోంది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన సమాచారం పోలీసులకు ఉపయోగపడుతోంది.

ఆటోనగర్ వై- జంక్షన్ వద్ద వరలక్ష్మి అమ్మవారి ఆలయానికి బిగిస్తున్న సీసీ కెమెరా

❖ అక్టోబరు 13న తక్కెళ్లపాడు వద్ద తెల్లవారుజామున హైవే సర్వీసు రోడ్డులో వాకింగ్ చేస్తున్న ముగ్గురు మహిళలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి అది మినీ వ్యాన్‌గా తెలుసుకున్నా.. వాహనం నంబరు కనిపించలేదు. హైవే నిఘా నేత్రాలను పరిశీలించి బాపట్లకు చెందిన వాహనంగా గుర్తించి నిందితుడిని పట్టుకున్నారు.

❖ ఇదే హైవేపై కొన్ని నెలల కిందట ప్రత్తిపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.8 లక్షలు తీసుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు ఓ దొంగ ఆయనతో గొడవపడి అదును చూసి నగదుతో ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు.

❖ నంబూరులో వివాహితను హత్య చేసిన నిందితులను పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగానే పట్టుకొని జైలుకు పంపించారు.

www.kimssikhara.com
KIMS SIKHARA HOSPITALS
కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.

డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences
ప్రతి మంగళవారం నాడు
సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు
స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్
7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్, బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

(c) eenadu

మంగళగిరి
• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సమస్యల పరిష్కారానికి కృషి

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండలం లాం గ్రామంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు సర్పంచి షేక్ అబిద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను నమోదు చేసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తామని తెలిపారు. అధిక మొత్తంలో పేదలకు సొంత ఇళ్లు ఇవ్వాలని దరఖాస్తులు వచ్చాయి. గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్, నాయకులు షేక్ అలీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల తనిఖీ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: తెనాలి తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం దుగ్గిరాలలో తనిఖీలు నిర్వహించారు. మాంసం, చేపల విక్రయ దుకాణాల్లో తూనికల పరిశీలించారు. 8 దుకాణాల్లో కొలతల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. కేసులు నమోదు చేసి, రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ డి.శేషసాయి తెలిపారు. ఆ శాఖ సాంకేతిక సహాయకుడు రవిశేఖర్ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనంతవరం నుంచి పల్నాడు జిల్లా కర్లపూడి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి పోయాయని 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా స్థానికులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన తుళ్లూరు విద్యుత్ ఏఈ రిలకరాజు సిబ్బందితో స్తంభాలను మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరింపచేశారు.

తుళ్లూరు: మల్కాపురంలో సైడు కాలువల్లో మురుగు పేరుకొని దోమలు పెరిగాయని 'మేమున్నాం మీకు తోడుగా' కార్యక్రమం ద్వారా సమస్యను స్థానికులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు పారిశుద్ధ్య కార్మికులతో కాలువలను శుభ్రం చేయించి దోమల మందు జల్లించారు.

మంగళగిరిలో ప్రీమియర్ లీగ్ -4 క్రికెట్ టోర్నమెంట్

ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు పురస్కరించుకుని మంగళగిరిలో ప్రీమియర్ లీగ్ -4 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెదేపా నాయకులు ప్రకటించారు. ఈ మేరకు మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో పోటీలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. జనవరి 23న మంత్రి లోకేశ్ పుట్టిన రోజు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఏటా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు ఈ నెల 30వ తేదీ లోగా తమ పేర్లను మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. క్రీడా ప్రాంగణం వివరాలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష నగదును అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. ఏపీ పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు తెదేపా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జోగి విశ్వేశ్వర్, తాడేపల్లి, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దాసరి కృష్ణ, కేసినేని శ్రీనిత, వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ జవ్వాదికిరణ్‌చంద్, వల్లభనేని భార్గవ్, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు

గుంటూరు గ్రామీణం: పొదవరంలోని దత్తానంద క్షేత్రంలో ఆదివారం భక్తిభావంతో శ్రీ గణపతి సచ్చిదానంద భగవద్గీత పోటీలు అలరించాయి. ఆరు రౌండ్లలో జరిగిన పోటీల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఆరు బృందాలుగా పాల్గొన్నారు. అనంతరం దత్తక్షేత్ర పారాయణ బృందం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం జరిగింది. అన్ని బృందాలు ఉత్తమ ప్రతిభ కనబర్చటంతో అందరినీ విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న మహిళలు

కర్షకుల కష్టం.. దళారుల పరం

దుగ్గిరాల, న్యూస్‌టుడే

✤ వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతుల్లో గుబులు

వాతావరణ మార్పులు అన్నదాతల్లో భయాన్ని నింపుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో వానలు కురిసి చేతికందిన పంట నోటికి రాదేమోనని ఆవేదన కర్షకుల్లో కనిపిస్తోంది. దీంతో అయినకాడికి అమ్ముకుంటే బయటపడతామన్న ఆలోచన చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వరి సుమారు 35,000 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం యంత్రాలతో హడావుడిగా కోయించేస్తున్నవారు కొందరైతే, కోసేసి ధాన్యం రోడ్ల మీద, ఇంటి ఆవరణలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఆరబోసేస్తున్న వారు మరి కొందరు. దుగ్గిరాల మండలం పేరకలపూడి, పెదపాలెం, పెదకొండూరు, గొడవర్రు, ఈమని, మంగళగిరి మండలంలో నూతక్కి, రామచంద్రాపురం, తాడేపల్లి మండలం వడ్డేశ్వరం, మెల్లెంపూడి తదితర గ్రామాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది.

✤ ప్రస్తుతం ఎకరాకు 35 బస్తాల నుంచి 40 బస్తాల దిగుబడి ఉంటోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1771. కానీ పలు గ్రామాల్లో దళారులు రూ.1400లకు కొంటున్నారు. అంటే బస్తాకు రూ.300 తక్కువకే అయినా రైతులు అమ్మేస్తున్నారు. రైతుల ఆందోళనను కొంతమంది దళారులు అవకాశంగా మార్చుకుంటున్నారు.

పేరకలపూడిలో ధాన్యాన్ని కోసి ట్రాక్టర్లో పోస్తున్న యంత్రం

ఖర్చులు పెరుగుతాయనే భయంతో...

ఎకరం చేను కోసేందుకు గంటమ్పావు సమయం పట్టింది. కోసినందుకు యంత్రానికి గంటకు రూ. 3 వేలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన 5250 అయింది. అదే తుపాను వస్తే ఎలా ఉంటుందో తెలీదు. అప్పుడు పంట మొగిలిపోతే పడిపోతే కాబట్టి 4 గంటలు పడుతుంది, 5 గంటలు పడుతుందో. దీని వల్ల కోసినందుకే సుమారు రూ. 12 వేలు ఖర్చుదాటి పోతుంది. - పసుపులేటి లక్ష్మయ్య, రైతు, గొడవర్రు

బస్తా రూ.1400కు అమ్మేశా..

నేను బీపీటీ 5204 రకం వేశాను. ఇప్పుడే యంత్రంతో కోయించేశాను. బస్తా రూ. 1400 చొప్పున అమ్మేశా. వర్షాలు కురిస్తే కోత ఖర్చులు పెరిగిపోతాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి స్థలం కూడా లేదు. - తాడేపల్లి పిచ్చయ్య, రైతు, పేరకలపూడి

రైతులు అప్రమత్తం కావాలి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో వరి కోతలు కోసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారి సునీత తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి రాగల 48 గంటల్లో వర్షాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పంటలు వర్షంలో తడవకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు.

ఏపీసీసీ పరిశీలకుల రాక నేడు

తెనాలి: కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఏపీసీసీ పరిశీలకులు సోమారెడ్డి తదితరులు సోమవారం తెనాలి రానున్నారు. ఈమేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాంబశివుడు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తెదేపా మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరాం ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడ్ స్టార్ ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. 164 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు చైతన్య, రాజారావు, తెదేపా నాయకులు కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్, దక్కుమల్లి భాగ్యారావు, చిన్నం శ్రీకాంత్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గుంటూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు కొనసాగించి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివితేజ మూర్తి అన్నారు. విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెదపలకలూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆ కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి అంజుమన్ సంస్థ ఆధ్వర్యాన ఆదివారం ముస్లిం పేద విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. సుమారు 600 మంది విద్యార్థులకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్ షిబ్లీ ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. నాయకులు షేక్ అక్రమ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై అసత్య ఆరోపణలు చేశారంటూ ఫిర్యాదు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల వైకాపా అధినేత జగన్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అసత్య ఆరోపణలు, వ్యాఖ్యలు చేశారంటూ వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు తాడేపల్లి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదికొండ ప్రకాష్ తదితరులు పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారిలో ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి వేడుకలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: సత్య సాయి బాబా శతజయంతి సందర్భంగా ఆదివారం పెదనందిపాడు మండలం ఉప్పలపాడులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి మందిర్‌లో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భజనలు, పారాయణలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సమన్వయకర్త రవీంద్రబాబు, సభ్యులు చంద్రశేఖర్, బ్రహ్మానందం, పార్వతి, విజయ తదితరులు పాల్గొన్నారు. పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రణమిల్లారు. దుగ్గిరాల రైలుపేటలోని శ్రీషిర్డీసాయి-పర్తిసాయి ధ్యాన మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నసంతర్పణ చేశారు.

ఫిరంగిపురం న్యూస్‌టుడే: ఫిరంగిపురంలో తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో సత్య సాయి బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాదరావు మాట్లాడుతూ బాబా బోధనలు, సేవా స్ఫూర్తిని కొనియాడారు.

పెదనందిపాడు: భజనలు చేస్తున్న భక్తులు

పెదనందిపాడు ఎంపీడీవో కార్యాలయంలో..

దుగ్గిరాల రెవెన్యూ కార్యాలయం వద్ద అధికారులు

ఫిరంగిపురంలో..

యూరియా.. మాకే ఇవ్వండయ్యా..

పేరకలపూడి రైతు సేవా కేంద్రం వద్దకు ఆదివారం యూరియా వచ్చింది. దీంతో రైతులు ఒక్కసారిగా కేంద్రం వద్దకు రావడంతో రద్దీ నెలకొంది. ఒక్క లారీ లోడు మాత్రమే వచ్చిందని, ఒకేసారి రెండు, మూడు లారీల సరుకు వస్తే ఈ ఇబ్బందులు ఉండవని అన్నదాతలు చెబుతున్నారు. కొంతమంది తీసుకున్న వారే మళ్లీ వస్తుండడంతో రైతులు అంటున్నారు.

- న్యూస్‌టుడే, పేరలకపూడి(దుగ్గిరాల)

దారి లేక.. దాట లేక..

తాడికొండ గ్రామం నుంచి కంతేరు వెళ్లే ప్రధాన రహదారిలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి పెద్ద మసీదు వరకు ఇరుకు రోడ్డులో వాహనాలు కదలక ఈ పరిస్థితి ఏర్పడుతోంది. విజయవాడ, మంగళగిరి, కంతేరు, గుంటూరు నుంచి భారీ వాహనాలు రాజధానికి వెళ్లేందుకు ఇటుగానే వస్తుంటాయి. ఈ క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు దారి లేక గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తాడికొండ

మొక్కలు మొలచి.. చిక్కులు తెచ్చి..

మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. భవనం గోడలు అక్కడక్కడ నెర్రెలు ఇచ్చాయి. సిమెంట్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. వర్షం కురిసిన సమయంలో అక్కడక్కడ నీరు కిందకు దిగుతుంది. మరోపక్క భవనం చుట్టూ ఖాళీ స్థలంలో పిచ్చి గడ్డి పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మేడికొండూరు

అడుగేస్తే గుంత.. తప్పని చింత

వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరు నగరపాలక సంస్థల పరిధిలో విస్తరించిన ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల ఏర్పడిన పెద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఆ ధాటికి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఏటుకూరు, బొంతపాడు, అనంతవరప్పాడు, లేమల్లెపాడు, వట్టిచెరుకూరు, లింగంగుంట్లపాలెం, చినలింగాయపాలెం గ్రామాల ప్రజలు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. గోతులతో ఒళ్లు హూనం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ అబ్బాస్‌కెనడి మాట్లాడుతూ గుంతలను త్వరలోనే పూడ్చుతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు

26న అగ్నిగుండ కావడి మహోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మందడం షణ్ముఖ వారాహి పీఠం ఆధ్వర్యంలో 26వ తేదీన 11వ అగ్నిగుండ కావడి మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం గురుస్వామి మురుగన్ నండూరి రమేష్ స్వామి తెలిపారు. ఆరోజు సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామికి 13,200 లీటర్ల ఆవు పాలతో అభిషేకం నిర్వహించనున్నారు. 25న నవనాగుల ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

నాగులపాడు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళ్లిపాళ్ల నరేంద్రకుమార్ స్వామికి పాలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గొల్లపూడి శ్రీనివాసరావు, పి. మురళి, వాసు, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సాంబశివరావు, సభ్యుడు చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పల్నాడు సూపర్‌ఫాస్ట్ రైలు సిరిపురంలో ఆపాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలంలో ఆదివారం కేంద్ర సహాయ మంత్రి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పర్యటించారు. ఈ నేపథ్యంలో సిరిపురానికి చెందిన తెదేపా కార్యకర్తలు నేతలకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో సిరిపురం రైలు స్టేషన్లో పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేదన్నారు. అప్పుడు ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉందన్నారు. కొన్నాళ్ల నుంచి సదరు రైలు సిరిపురంలో ఆగడం లేదన్నారు. మళ్లీ యాథావిధిగా రైలు ఆపాలని చుట్టుపక్కల 4 గ్రామాల ప్రజలు సంతకాలు చేశారన్నారు. ఆ నివేదికను రైల్వే శాఖ అధికారులకు అందించామన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పెమ్మసాని, శ్రావణ్‌కుమార్‌లకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

'తిరుమలకు కళంకం తెచ్చిన వైవీ సుబ్బారెడ్డి'

కాకుమాను, న్యూస్‌టుడే: పవిత్ర తిరుమలకు వైవీ సుబ్బారెడ్డి కళంకం తెచ్చారని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. కాకుమానులో ఆదివారం ఆయన విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేశారు. వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడే కల్తీ నెయ్యితో 20 కోట్లు లడ్డూలు తయారు చేసినట్లు సిట్ విచారణలో తేలడమే ఇందుకు నిదర్శనమన్నారు. వైకాపా పాలనలో తిరుమలను అప్రతిష్ఠపాలు చేశారని పేర్కొన్నారు.

వెతలు తీర్చండి సారూ..

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో పలు సమస్యలు నెలకొన్నాయి. గ్రామం నుంచి పెదపరిమి వెళ్లే రహదారి శివారులో గుంతలమయంగా మారింది. పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులకు గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇటుగా విద్యార్థులు, కార్మికులు, ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

● నీరుకొండ గ్రామ శివారులో ఓలివేలు కొండ ప్రార్థనా మందిరం వద్ద ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దీని వల్ల దుర్వాసన వ్యాపించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

● గ్రామ రామాలయం సెంటర్‌లో దోమలు బెడద ఎక్కువగా ఉందని, కాసేపు ఆరు బయట సేదతీరడానికి వీలు ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విషజ్వరాల బారిన పడతామని వారు వాపోతున్నారు. అన్ని వీధుల్లో ఫాగింగ్, డ్రెయిన్‌లలో బ్లీచింగ్ చల్లించాలని వారు కోరుతున్నారు.

కుంగిపోయిన రోడ్డు

శుభ్రం చేయని చెత్త కుండీలు..

'షెడ్డును అక్రమంగా కూల్చేశారు'

తాడికొండ, న్యూస్‌టుడే: రియల్ ఎస్టేట్ వ్యాపారులు తన షెడ్డును అక్రమంగా కూల్చారని పోలరాజు ఆదివారం ఓ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏఎస్ఐగా పనిచేసి పదవీవిరమణ అనంతరం 2017లో సమాజ సేవల నిమిత్తం తాడికొండ అడ్డరోడ్డు ప్రధాన కూడలి సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి స్థలంలో ఓ షెడ్డును ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఆ నిర్మాణాన్ని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూల్చివేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తనను కులం పేరుతో దూషించి బెదిరింపులకు గురిచేశారని వాపోయారు.

మురుగుమయం.. రోగాల భయం

పేరకలపూడి నుంచి పెదపాలెం వెళ్లే మార్గంలో రోడ్డు వెంట మురుగునీరు రంగు మారి కన్పిస్తోంది. మురుగు కాల్వల్లోని నీరు ముందుకు సాగకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గతంలో డ్రైనేజీ లో నీరు సరిగా పారేలా చర్యలు తీసుకున్నా ప్రజలు ఎక్కడికక్కడ అడ్డులు వేస్తుండడం కూడా దీనికి కారణంగా కన్పిస్తోంది. రంగు మారి నీరు నిల్వ ఉన్న కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. ఈ పరిస్థితి వ్యాధులకు కారణం అవుతోంది. కనీసం వారంలో రెండు సార్లు బ్లీచింగ్ పొడి చల్లడం వంటి చర్యలైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పేరకలపూడి (దుగ్గిరాల)

విద్యార్థులు దేశభక్తి అలవరచుకోవాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తి అలవరచుకుని సమాజ అభ్యున్నతికి పాటుపడాలని ప్రిన్సిపల్ వీరరాఘవయ్య అన్నారు. పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా క్యాడెట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకత్వ లక్షణాలు అలవరుచుకుని క్రమశిక్షణ తో ఉన్నతికి ఎదగాలని సూచించారు. తొలుత క్యాడెట్స్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కెప్టెన్ పాతూరి శ్రీనివాస పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వీరరాఘవయ్య

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు. సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మూడురోజుల నుంచి వడ్డేశ్వరంలో యాచికత్వం చేస్తూ కనిపిస్తున్నాడని అనారోగ్యంతో సదరు వ్యక్తి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించినట్లు తెలిపారు.

దూషించి కొట్టిన ఘటనపై కేసు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మద్యం తాగి తన ఇంటిపైకి వచ్చి దౌర్జన్యం చేసి కొట్టారని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయపూడిలో నివాసం ఉంటున్న రమ్య అనే మహిళ ఇంటి ముందు ఆదివారం సుభానీ అనే వ్యక్తి మద్యం తాగి గొడవ చేయటం ప్రారంభించాడు. ఆమె ప్రశ్నించడంతో దౌర్జన్యంగా ఇంటిలోకి వచ్చి ఆమెతో పాటు భర్త, కూమార్తెను చేతులతో కొట్టాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు ఎస్.ఐ క్రాంతి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయిదుగురు జూదరుల అరెస్ట్

చింతపల్లిపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో డంపింగ్ యార్డు సమీపంలో జూద శిబిరంపై ప్రత్యేక పోలీసుల బృందం (టాస్క్ ఫోర్స్ బృందం) ఆదివారం దాడులు నిర్వహించి రూ. 33,720లను స్వాధీనం చేసుకున్నామని సీఐ రామానాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

'ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు'

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: తమను కొట్టి గాయపరిచిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బేతపూడికి చెందిన దంపతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ వారు మాట్లాడిన వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. అందులో వారి తెలిపిన వివరాల ప్రకారం.. 'గేదెలె కట్టే స్థలం విషయంలో మాకు, స్థానికులు కొంతమంది మధ్య వివాదం రేగింది. ఈ క్రమంలో ఓ వర్గం వారు తమపై దాడి చేసి గాయపరిచారు. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాం. సమస్య పరిష్కారం కాకపోవడంతో కొన్నాళ్లకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానిపై ఎలాంటి చర్యలు లేవు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట సదరు వ్యక్తులు మరోసారి మా ఇంటికి వచ్చి కొట్టారు. ఈ ఘటనలో లక్ష్మీకోటేశ్వరమ్మ తలకు రక్త గాయమైంది. పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రాంతీయ ఆసుపత్రిలో ఆమె చికిత్స తీసుకుంటోంది. ఇప్పటికైనా ఫిరంగిపురం పోలీసులు కలగజేసుకుని తమకు న్యాయం చేయాలి' అని బాధితులు విజ్ఞప్తి చేశారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ(గుంటూరు): స్థానిక సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు నేరుగా స్వీకరించనున్నారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి...

(కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 50, వంగ 40, బెండ 49, పచ్చిమిర్చి 40, కాకర 50, క్యారెట్ 59, క్యాబేజీ 30, బీర 36, దొండ 58, బంగాళాదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుళ్లు 58, దోస 32, పొట్ల 45, చామదుంప 25, మునగ 10, గోంగూర 12, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, బీట్‌రూట్ 43, కీర 29, క్యాప్సికం 80, అల్లం 78, ఫ్రెంచి బీన్స్ 50, సొర 20, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? లాలాపేట మేదరబజారులో కొద్దిరోజుల నుంచి పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో దుర్వాసనకు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నాం. -రాయుడు

✔ సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఏఈ

? బస్టాండ్ సెంటర్‌లోని రైతుబజారులో కొందరు రైతులు కూరగాయలను బోర్డు ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. కట్టడి చేయాలి. - జస్వంత్- అల్లినగర్

✔ అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. -స్వప్న, ఎస్టేట్ ఆఫీసర్, -న్యూస్‌టుడే, పట్నంబజారు

☛ మంగళదాస్‌నగర్ 2వలైన్ సైడుకాల్వల్లో పూడికలు పేరడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని స్థానికులు వనీంబలీ 'మేమున్నాం..మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కాల్వల్లో పూడికలు తీయించారు.

స్పందనకు వందనం

☛ గాంధీనగర్ ప్రధానరోడ్డులో చెత్త కుప్పలు రెండురోజులుగా తీయకపోవడంతో అపరిశుభ్రంగా మారుతోందని స్థానికులు వెంకట్రావు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో వారు ట్రాక్టర్, సిబ్బందిని పంపి చెత్త కుప్పలు తొలగింపజేశారు. -న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

ఆధునిక బస్‌షెల్టర్లు.. తీరనున్న పాట్లు

నెలాఖరుకు అందుబాటులోకి రానున్న నిర్మాణాలు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో అనేక ప్రాంతాల్లో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన బస్సుషెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. వీటిని ఎవరూ ఉపయోగించకపోవడంతో వాటిని జీఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు పూర్తిగా తొలగించారు. దీంతో ప్రయాణికులు ఎండలు, వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో ఎనిమిది ప్రాంతాల్లో నూతనంగా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఒక ఏజెన్సీకి అనుమతులు ఇవ్వగా పలుచోట్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేస్తున్నారు. సదరు ఏజెన్సీ వారే బస్సుషెల్టర్‌ను నిర్వహించాల్సి ఉంది. వారు షెల్టర్ నిర్మాణంపై ప్రకటనలు వేసుకునేందుకు వీలుకల్పించారు. దీనికి సంబంధించి ఏజెన్సీ నుంచి ప్రకటల ఫీజులు ప్రణాళిక విభాగానికి చెల్లించాల్సి ఉంటుంది.

ఆటోనగర్ వద్ద నిర్మిస్తున్న బస్‌షెల్టర్

ఈ ప్రాంతాల్లోనే.. : లక్ష్మీపురం వద్ద ఏర్పాటు చేసిన ఈ-బస్‌బే తరహా నిర్మాణాలు నగరంలో ఏర్పాటు చేసేందుకు గతంలో ప్రతిపాదనలు చేసి పరిపాలన ఆమోదం మొత్తం పూర్తయ్యాక స్థలాల వివాదంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈనేపథ్యంలో ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్లు అనేకం పూర్తిగా శిథిలావస్థకు చేరి పడిపోయాయి. కొన్ని నిర్వహణ సరిగా లేక ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో తాజాగా ప్రయాణికుల సౌకర్యార్థం ఎండ, వానల నుంచి రక్షణ కోసం బస్‌షెల్టర్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా నగరంలో టీజేపీఎస్ కళాశాల ఎదుట, ఆటోనగర్ రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద, ఎన్టీఆర్ బస్టాండ్, గుజ్జనగుండ్ల కూడలి, మణిపురం బ్రిడ్జి వద్ద, జిల్లా గ్రంథాలయం ఏసీ కళాశాల వద్ద, అమరావతిరోడ్డు లాడ్జి కూడలి, పల్నాడు బస్టాండ్ ప్రాంతాల్లో ఈనెలాఖరు కల్లా నూతన నిర్మాణాలు అందుబాటులోకి తేనున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సూచించారు. మాయాబజార్‌లోని జీటీ రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఎంతవరకు పూర్తయ్యాయి. ఎప్పటిలోగా పూర్తి చేయాలి. ఎంతమేరకు మెటీరియల్ వినియోగిస్తున్నారు. ఎంత నాణ్యత పాటిస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు జీటీ రోడ్డులో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే ఆ సమస్య ఉండదన్నారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నాం. నాణ్యతాప్రమాణాల మేరకు పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికార్లను ఆదేశిస్తున్నాం. పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు ముప్పు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి.. నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం కార్మికులకు అన్యాయం చేయడమేనని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ సమ్మె హక్కు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అడిగే హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని బలహీనపరిచే ప్రయత్నం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా లేబర్‌కోడ్‌లపై వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, అఖిల పక్షాలు కలిసి పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, మున్సిపల్ కార్మికుల సంఘం నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తున్న క్రమంలో ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు గుంటూరు హిమనికూడలిలో గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే నిరసనలో కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఆకిటి అరుణ్‌కుమార్, కోటయ్య, జగన్నాథం, చైతన్య, విఠల్‌రెడి పాల్గొన్నారు.

సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు

రాత పుస్తకాల పంపిణీ

పట్నంబజారు: వాసవీ మిత్రమండలి గుంటూరు అధ్యక్షుడు అన్నా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఏటుకూరురోడ్డులోని అమ్మవారి దేవస్థానంలో 200 మంది పేద విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా కోశాధికారి కొనకళ్ల వెంకట సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ నిడమానూరి సురేష్, కూనిశెట్టి చంద్రశేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల అభిప్రాయాలతోనే నాయకుల ఎంపిక

పట్నంబజారు, న్యూస్‌టుడే: పార్టీ కార్యకర్తల అభిప్రాయాల మేరకు నాయకుల ఎంపిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్యరెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నాయకుల నుంచి సేకరించిన అభిప్రాయాల మేరకు జిల్లా, నగర అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఏడు రోజులు పర్యటించి అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ పాలక్ వర్మ, మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జి ఉషారాణి, డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, బిల్లా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్యరెడ్డి, వేదికపై జిల్లా కాంగ్రెస్ నాయకులు

బోడేపూడికి ఘనంగా సన్మానం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన బోడేపూడి వెంకట సుబ్బారావును ఏటుకూరు రోడ్డులోని డీపీసీ నగర్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నసీర్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు బీఎస్ఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. సీతారామస్వామి దేవస్థానం ఛైర్మన్ కొంపల్లి మాలకొండయ్య, వ్యాపారవేత్త ఆర్కే చౌదరి, మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

వెంకట సుబ్బారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్

30న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న గుంటూరులో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమీర్, ఉపాధ్యక్షులు యశ్వంత్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, సౌమ్య, ఉపాధ్యక్షులు సుర్జిత్, నాయకులు రాజ్, వెంకి, గోపి, జిస్టు, లోకేశ్, నసీర్, పర్హాన్ పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కిరణ్, సమీర్, యశ్వంత్, సౌమ్య తదితరులు

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలకు విద్య, ఉద్యోగం, చట్టసభలు, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏఐబీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి అన్నారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీలకు అన్ని రంగాల్లో 52 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ సామాజికభవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఏఐబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.రమణయ్య అధ్యక్షత వహించారు. బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వుగ్గం సాంబశివరావు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలు కలిసి ఉమ్మడి సమస్యలపై ఉద్యమించాలన్నారు. బీసీ కులాల ఐకాస నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో డి.లక్ష్మీనారాయణ, అన్సార్, జాన్‌బాబు, జిలాని, జె.శ్రీనివాసరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరంజ్యోతి, వేదికపై రమణయ్య, సాంబశివరావు తదితరులు

రోడ్డుకు అడ్డంగా రాళ్లకుప్ప

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : నెహ్రూనగర్ ఆవుల సంఘం సమీపంలో గుంతలకు మరమ్మతులు చేయడానికి తీసుకొచ్చిన కంకర, సిమెంట్ మిశ్రమం రహదారి మధ్యలో పోసి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. వాహనాలు రద్దీ అధికంగా ఉన్నప్పుడు కొన్ని ద్విచక్ర వాహనాలు ఆ కంకర రాళ్ల కుప్పపై వెళ్లే క్రమంలో అదుపు తప్పి పడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ మరింత ప్రమాదకరంగా మారింది. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు

లాలాపేటలోని మూర్తి ఫ్యాషన్స్ సెంటర్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వారం రోజుల నుంచి వీటిని తొలగించలేదు. పారిశుద్ధ్య సిబ్బంది కేవలం బ్లీచింగ్ చల్లి వదిలేశారు. దీంతో డస్ట్‌బిన్‌లు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వాటి నుంచి వచ్చే దుర్వాసన కారణంగా దుకాణాల్లో ఉండలేకపోతున్నామని వ్యాపారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

గుంత.. రాకపోకలకు చింత

కొత్తపేట వస్త్ర దుకాణాల రహదారిలో పైపులైను పనులకు గుంతను తీసి చుట్టూ రక్షణ చర్యలు తీసుకోలేదు. ఇటుగా ప్రభుత్వపాఠశాలలు, ఆలయాలతోపాటు పెద్దసంఖ్యలో వస్త్ర దుకాణాలు ఉండటంతో నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీ రహదారిలో పెద్ద గుంతను తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందని ఆందోళన చెందుతున్నారు.

- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

పక్కకు ఒరిగిన స్తంభం



లాలాపేట నూకాలమ్మ అమ్మవారి గుడి వెనుక రోడ్డులోని విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. పూర్తిగా పక్కకు ఒరిగి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. నివాస గృహాల మధ్య ప్రమాదకరంగా మారిన స్తంభానికి మరమ్మతులు చేయాలని పలుమార్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

సత్యసాయి సేవలు చిరస్మరణీయం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజలకు శ్రీసత్యసాయిబాబా చేసిన సేవలు చిరస్మరణీయమని, వారు చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు, ఆధ్యాత్మికతను కోట్ల మంది ప్రజలు స్మరించుకుంటున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఎన్నో గ్రామాలకు తాగునీరు, విద్య, వైద్య సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, వేముల జ్యోతిపద్మజ, ఇర్రి ధనలక్ష్మి, సాధు రాజేష్, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజరు బాలాజీ బాషా, పీవో సింహాచలం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుక నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి ఎస్‌బీ డీఎస్పీ గొట్టిపాటి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ సత్యసాయిబాబా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు, అళహరి శ్రీనివాసరావు, గంగా వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

సిస్టర్ మేరీ గ్లోరీని వెనరబుల్‌గా ప్రకటన

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని సెయింట్ జోసఫ్ ఆసుపత్రిలో విశేష సేవలందించిన డాక్టర్ సిస్టర్ మేరీ గ్లోరీని వెనరబుల్‌గా పోప్ లియో XIV ప్రకటించారు. నవంబరు 21న వాటికన్ సిటీ రోమ్‌లో ఆమోదించారు. ఈఅవార్డుతో సిస్టర్ మేరీ గ్లోరీ సెయింట్ హుడ్ పురస్కారానికి దగ్గరలో ఉన్నట్లయ్యింది. నిరుపేదలకు సేవ చేసినందుకు రోమన్ క్యాథలిక్ చర్చి (ఆర్‌సీఎం) మేరీ గ్లోరీని గుర్తించింది. ఆమె జూన్ 23, 1887లో ఆస్ట్రేలియాలో జన్మించారు. వైద్యవృత్తిలో అధికారికంగా గుర్తింపు పొందిన ప్రపంచ మొదటి మత సోదరి అయ్యారు. 1920లో భారతదేశానికి వచ్చి మహిళలు, పిల్లలు, పేదలను స్వస్థత పరచడానికి తన జీవితమంతా అంకితం చేశారు. ఆమె జీవితం సేవలను కొనియాడుతూ మేరీ గ్లోరి ఫొటో ఆసుపత్రిలో ఉంచారు. సెయింట్ జోసఫ్ స్కూల్‌లో ఆమె సమాధి, మ్యూజియం ఉన్నాయి.

గ్రంథాలయం, వాకింగ్ ట్రాక్ నిర్మించండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : డొంకరోడ్డు కాకుమానువారితోటలోని వెల్ఫేర్ సెంటర్ స్థలం అభివృద్ధి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 14.80 ఎకరాల స్థలం అడవిగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. తక్షణమే గ్రంథాలయం, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ వలి, నాగరాజు, తిరుపతయ్య, కేశవ, కొండలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సంఘ సర్వసభ్య సమావేశం బ్రాడీపేట 1/13, బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం జరిగింది. సమావేశంలో వచ్చే మూడేళ్ల కాలానికి గాను కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రామరాజు రామకృష్ణారావు, అధ్యక్షుడిగా డి.ఫణిభూషణరావు, ఉపాధ్యక్షుడిగా నాదెండ్ల రాధాకృష్ణ, కార్యదర్శిగా కళ్లెం సుబ్రహ్మణ్యశర్మ, సంయుక్త కార్యదర్శిగా రాజేంద్రబాబు, కోశాధికారిగా దెందుకూరి శివరామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితో పాటు 8 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక కూడా జరిగింది. ప్రతి ఏకాదశికి అహోరాత్ర పారాయణలు, సప్తాహ, త్రయాహ్నిక కార్యక్రమాలు జరపాలని నూతన కార్యవర్గం నిర్ణయించింది. ఎన్నికల ప్రక్రియకు నందిరాజు రాజేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ 10న

గోరంట్ల : సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ డిసెంబరు 10న గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్నామని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి తెలిపారు. ఏపీ ఎన్జీఓ హోంలో ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద కుమార్ పాల్గొన్నారు.


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కంకర తేలిన దారి.. నరకంగా మారి..

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

సంజీవనగర్ నుంచి వెంకటాద్రిపేట, చేనేతకాలనీ, న్యూగుంటూరు, నెహ్రూనగర్‌కు వెళ్లే రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో తాగునీటి పైపుల నిమిత్తం తవ్వకాలు చేశారు. గుంటూరు పశ్చిమ నుంచి నెహ్రూనగర్ రిజర్వాయర్ వరకు నూతన పైపులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారులను సరిగా పూడ్చకపోడంతో గుంతలుపడ్డాయి. గతంలో తాత్కాలికంగా మట్టి, డస్టుతో సరిచేశారు. దీంతో వాహనాలు వెళ్లే క్రమంలో లేస్తోన్న దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వేసిన నూతన తాగునీటి పైపుల నుంచి నీటి సరఫరా పునరుద్ధరించారు. వెంటనే ఆ ప్రాంతంలో నూతనంగా రహదారి వేస్తామని చెప్పారు. నెలలు గడుస్తున్నా కొత్తది ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇటీవల రహదారిపై గోతులకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఫలితంగా కంకర రాళ్లు పైకి తేలడంతో ఆ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు ఈ రాళ్లపై రాత్రి వేళ ప్రయాణం సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతనంగా రహదారి నిర్మించాలని కోరుతున్నారు.


రహదారిలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు

ఆకట్టుకున్న సంగీత ప్రదర్శనలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట 2/14లో త్యాగరాజ కళావేదికపై వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కీబోర్డ్, వయోలిన్, వీణ, గాత్రాలలో తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. వాయులీన విద్వాంసుడు పి.నందకుమార్ కచేరీ చేశారు. కార్యక్రమానికి వీకే శాస్త్రి, కె రాజ్యలక్ష్మి సహకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి మానికొండ శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన తమిళనాడురాష్ట్రం, పల్లిపట్టు, తిరువళ్ళూరు, కొనసముద్రం, కొత్తకుప్పం గ్రామం కాపురస్తురాలు సమ్మి కనకరత్నం,W/o.ఇంజుమ్ వెంకటేశ మందాడి గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు ఆస్తి పరకళ్ళ రామారావు వగైరాలుకు వారసత్వేనా అనగా,పరకళ్ళ శేషు ప్రమీల రాణి మరియు ఆమె సొదరి ది.04-01-2016న దస్తావేజు నెం.71/2016 గుంటూరు యస్.ఆర్.ఒ.లో రిజిస్టరు చేసుకున్న భాగపంపిణి రీత్యా "ఏ-షెడ్యూలు" ఆస్తి సంక్రమించి సర్వ హక్కులుతో అనుభవించుచూ ఎటువంటి లిఖిత పూర్వక ఏర్పాటుచేయకనే ది.22-05-2021న మరణించిన దరిమిలా సంక్రమించినదని, అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.1563/1946 పొయినదని తెలిపి విక్రయించుచున్నందున నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి కొంత క్రయధనం చెల్లించి విక్రయ బయాన అగ్రిమెంట్ కుదుర్చుకొనియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన తనఖాలు, తాకట్లు, కోర్టుజప్తులు, సెక్యూరిటీలు, ఇతర అగ్రిమెంట్లు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. గడువులోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టిక్లయిములు రానియెడల నిష్పేచిత ఆస్తిగా భావించి నా క్లయింటు సదరు పరకళ్ళ రామారావు వగైరాల వద్ద నుండి కొనుగోలు చేయుదురని తరుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నాక్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు : గుంటూరు డి. & సబ్.డి॥, జి.యం.సి. ఏరియా టౌన్ సర్వే కానటు వంటి గుంటూరు సిటీ, నెహ్రూనగర్ 3వ లైను ఏరియా, గుంటూరు గ్రామ డి.నెం.424/1 య.9-46 శెంట్లలో చ.గ.359.1లు స్థలములో పడమర వైపుగల చ.గ.188.6లు స్థలము పాత అసెస్మెంట్ నెం. 63655, ప్రస్తుత అసెస్మెంట్ నెం.1021161627, డోర్ నెం.8-8-42, ఆర్.సి.సి. డాబా వగైరాలకు **హద్దులు.తూర్పు:**పొలసం గీతాలావణ్యగారి ఆస్తి, అ.55.9 లు, **దక్షిణం:** మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు,అ.29.6లు, **పడమర:** బొర్రా జ్యోతి ఆస్తి, అ.55.6లు, **ఉత్తరం:** కొటారి రుద్రాదేవి ఆస్తి, అ.32లు.

బి. శివరామ కృష్ణా రెడ్డి, అడ్వకేట్,
మారుతీనగర్, గుంటూరు, సెల్.8096152567, 7386489796

బహిరంగ ప్రకటన

బెంగలూరు, RT నగర్, మునేశ్వర గుడి దగ్గర, 3వ మెయిన్ రోడ్డు, నెం. 98 నివాసి రాయ్‌చంద్ గారి కుమారుడు రూప రామ్ రాథోడ్ (ఆధార్ నెం. 8133 7574 7150) అను నా క్లయింట్ చక్కా సుజాత (ఆధార్ నెం. 5036 5439 5331), W/o. శివరామకృష్ణ ఫ్లాట్ నెం. F-2, ప్రహస్ మ్యాన్షన్, 1వ లైను, కృష్ణ నగర్ పార్క్, కృష్ణనగర్, గుంటూరు గారి తాలూకు గల షెడ్యూలు ఆస్థిని అమ్మదలచియున్నందున సదరు రూప రామ్ రాథోడ్ గారు కొనదలచినారు గాన సదరు ఆస్తిపై మీకు ఎటువంటి ఇబ్బందులు గాని, పేచీలు గాని ఉన్న యెడల ఈ రోజు నుండి ఏడు (7) రోజుల లోపల ఈ Cell: 99596 80130 నెంబరుకి సంప్రదించగలరు.

గుంటూరు డి॥ పెదకాకాని సబ్ డి॥ యిలాకా తక్కెళ్ళపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన తక్కెళ్ళపాడు గ్రామం బాపతు డి.నెం. 53/1బి రు య.2-85 శెంట్లున్నూ, డి.నెం. 53/2ఏ రు య.2-81 శెంట్లున్నూ, డి.నెం.53/2బి రు య.2-91 శెంట్లున్నూ వెరశి మూడు నెంబర్లు ఏకఖండముగానున్న య.8-57 శెంట్లు మింజుమలె, ప్లాటు నెం.1.2రు దాఖలా చ.గ. 854లు స్థలములో చ.గ. 266-7లు స్థలము లోగడ యన్.హెచ్. 5 రోడ్డు క్రింద పోను మిగిలిన చ.గ. 587-3లు స్థలములో పడమర వైపున నాకు హక్కు కలిగి నీకు విక్రయించిన చ.గ. 400లు స్థలమునకు హద్దులు: తూర్పు: ఈరోజున మీరు టన్నారాపూరి కమల గారి వలన క్రయం పొందుచున్న స్థలం హద్దు. అ.49-00లు, దక్షిణం: మోపర్తి రవీంద్రనాద్ వగైరాల భూమి హద్దు అ.71-03లు, పడమర: యన్.హెచ్. 5 రోడ్డు హద్దు అ.49-00లు, ఉత్తరం: అ. 30లు వెడల్పు గల రోడ్డు హద్దు. అ. 75-00లు. ఈ హద్దుల మధ్య చ.గ. 400లు లేక చ.మీ. 334-45ర్లు ఖాళీ నివేశన స్థలమును మాత్రమే విక్రయించి ఈరోజుననే నీకు నేను స్వాధీనపర్చడమైనది.

గుంటూరు డి॥ పెదకాకాని సబ్ డి॥ యిలాకా తక్కెళ్ళపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన తక్కెళ్ళపాడు గ్రామం బాపతు డి.నెం. 53/1బి రు య.2-85 సెంట్లున్నూ, డి.నెం.53/2ఏ రు య.2-81 శెంట్లున్నూ, డి.నెం. 53/2బి రు య. 2-91 శెంట్లున్నూ వెరశి పై మూడు నెంబర్లు ఏకఖండముగా నున్న య. 8-57 శెంట్లు మింజుమలె, చ.గ. 993లు స్థలములో నాకు హక్కు కలిగి నీకు విక్రయించిన ప్లాటు నెం. 2రులో కొంత మరియు ప్లాటు నెం.2ఏరులో పూర్తిగా వెరశి చ.గ. 326-3లు స్థలమునకు హద్దులు. తూర్పు: ఆలపాటి నాగేశ్వరరావు గారి భూమి హద్దు. అ. 49-00లు, దక్షిణం: మోపర్తి రవీంద్రనాథ్ వగైరాల స్థలం హద్దు. అ. 58-00లు, పడమర: కొల్లి లక్ష్మారెడ్డి గారి స్థలం హద్దు అ. 49-00లు, ఉత్తరం: అ. 30లు వెడల్పు గల బజారు హద్దు అ. 62-00లు. ఈ హద్దుల మధ్య చ.గ. 326-3లు లేక చ.మీ. 272-87ర్లు ఖాళీ నివేశన స్థలమును మాత్రమే విక్రయించి ఈరోజుననే నీకు నేను స్వాధీనపర్చడమైనది.

గుంటూరు
తేది: 23-11-2025

ఇట్లు: శ్రీనివాసరావు గాళం
కపిరావు పిన్నబోయిన, అడ్వకేట్స్,
4/13, బ్రాడీపేట, గుంటూరు, 99493 68369

(c) eenadu

గుంటూరు పశ్చిమ

దందాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

రౌడీషీటర్లకు గంగా వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు ఎవరైనా దందాలు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టాభిపురం ఠాణా పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు నివాసం ఉండే ప్రాంతాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ఇది దృష్టిలో పెట్టుకుని మసలుకోవాలని సూచించారు. స్థానికులను బెదిరించి వసూళ్లకు పాల్పడినా, గొడవలకు దిగినా ఉపేక్షించేది లేదన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉంటూ జీవనోపాధి కోసం పనులకు వెళ్లాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ పక్క రహదారిలో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం ఈ రహదారిలో విద్యార్థులు, ఉద్యోగులు తిరుగుతుంటారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **స్థానికులు, శివరామ్‌నగర్**

✔ సిబ్బందిని పంపి చెత్త తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. - **అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

చెత్త సమస్య పరిష్కారం: నవభారత్‌నగర్ రెండో లైన్ జీవీ హార్మొనీ అపార్ట్‌మెంట్ ఎదురుగా శానిటరీ సిబ్బంది చెత్తను తీసుకువెళ్లడానికి రావడం లేదు. దీంతో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ ఎన్‌వీఎస్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ: స్థానిక సమస్యలపై సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) ఉంటుందని తెలిపారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు నేరుగా స్వీకరించనున్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 50, వంగ (సన్నాలు) 49, బెండ 49, పచ్చిమిర్చి 40, కాకర 59, బీర 48, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజి 30, క్యారెట్ 59, దొండ 58, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుళ్లు 58, దోస 32, సొర 27, పొట్ల 45, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 110, చామదుంప 25, మునగ 12, బీట్‌రూట్ 43, కీరదోసకాయ 29, బీన్స్ 50, క్యాప్సికమ్ 80, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

చర్చా వేదిక.. చైతన్య దీపిక

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సంస్థ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

సామాజిక చైతన్యం.. మానసిక వికాసమే లక్ష్యంగా ఆవిర్భవించింది అవగాహన సంస్థ. సమాజం ఎలా ఉంటే బాగుంటుంది.. సామాజిక రుగ్మతలకు చికిత్స ఏమిటి? ప్రతి పౌరుడు ఉత్తమ పౌరుడని అనిపించుకోవడం ఎలా? వంటి ప్రశ్నలు ఉదయించేది అక్కడే.. సమాధానాలు దొరికేది అక్కడే. ఒక్క మాటలో చెప్పాలంటే నగరానికి చైతన్య దీపిక. ఈ సంస్థ వెలుగు రేఖల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు.. ఎవరికి కావాల్సిన చైతన్య బాటలను వారు వెతుక్కుంటూ ముందుకు సాగుతుంటారు. ఈ సంస్థ నిర్వహించే సభలకు వెళ్లడమే గొప్పగా భావించే స్థాయికి తీసుకెళ్లారు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి.

● గుంటూరు అరండల్‌పేట 15/1లోని కుబేరా టవర్స్‌లో సంస్థ కార్యాలయం ఉంది. ఇక్కడ దినపత్రికలు, ఇతర జర్నల్స్ అందుబాటులో ఉంటాయి. ఇక్కడున్న హాలు వయోవృద్ధులకు ఒక ఆటవిడుపు స్థలం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వచ్చి సొంతింట్లో ఉన్నంత స్వతంత్రంగా ఉంటుంటారు.

మాట్లాడుతున్న పాతూరి వెంకటేశ్వరరావు

● సామాజికంగా ఏ చిన్న మార్పు కనిపించినా.. అది మంచిదా, చెడ్డదా.. అనే చర్చా వేదికను నిర్వహిస్తారు నిర్వాహకులు. ఓటర్ల నమోదు కార్యక్రమాలు, సీనియర్ సిటిజన్ కార్డులు ఇప్పించడం, పాఠశాలలో తల్లిదండ్రులతో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలు వెలుగులోకి తేవడం.. ఇలా తదితర అంశాలపై సభలు ఏర్పాటు చేసి.. అవగాహన కల్పించడం ఈ సంస్థ లక్ష్యాల్లో ఒకటి. ఆరోగ్య పరంగా ప్రతి వారం ఓ ప్రముఖ వైద్యుడితో ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలను.. సభ్యులకు, నగర పౌరులకు ఇప్పిస్తుంటారు. ● హాస్యవల్లరులు, మనమూ పాడుదాం రండి కార్యక్రమాలు, కవితా గోష్ఠులు నిరంతరం జరుగుతుంటాయి. ● సామాజిక సమస్య తీవ్రతను బట్టి ధర్నాలు, ర్యాలీలు చేస్తుంటారు.

సమాజానికి మేలు చేయడమే లక్ష్యం

మిత్రులం కొందరం కలిసి సమాజానికి మేలు చేయాలని ఆలోచన చేశాం. 1992, ఫిబ్రవరి 21న కలెక్టరేట్ రోడ్డులో ఆనాడున్న హోటల్ విజయకృష్ణలో అవగాహన సంస్థను ప్రారంభించాం. గౌరు తిరుపతిరెడ్డి రచించిన వాస్తు శాస్త్ర పుస్తకావిష్కరణతో ప్రారంభమైన అవగాహన కార్యక్రమ పరంపర నేటికి ఐదు వేలకు చేరుకుంది. వైద్యులను వారానికి ఒక్కరిని రప్పించి సలహాలు, సూచనలు ఇప్పిస్తున్నాం. 1,242 యోగా శిక్షణ శిబిరాలు, 392 వైద్య శిబిరాలు, 390 మనమూ పాడుదాం రండి కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులకు అవగాహన ఒక కల్పవృక్షం.

- కొండా శివరామిరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మాట్లాడుతున్న పరంజ్యోతి, వేదికపై రమణయ్య, సాంబశివరావు తదితరులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలకు విద్య, ఉద్యోగం, చట్టసభలు, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏఐబీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి అన్నారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీలకు అన్ని రంగాల్లో 52శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ సామాజికభవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఏఐబీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.రమణయ్య అధ్యక్షత వహించారు. బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వృగ్గం సాంబశివరావు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలు కలిసి ఉమ్మడి సమస్యలపై ఉద్యమించాలన్నారు. బీసీ కులాల ఐకాస నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో డి.లక్ష్మీనారాయణ, అన్సార్, జాన్‌బాబు, జిలాని, జె.శ్రీనివాసరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

సూర్యనారాయణ జీవన దృక్పథం ఆదర్శనీయం

సూర్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగిగా, విరామం ఎరుగని సాహిత్యాభిలాషిగా అంటూ సూర్యనారాయణ జీవన దృక్పథం ఆదర్శనీయమని అఖిల భారత సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.వివేకానంద పేర్కొన్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి అంటూ సూర్యనారాయణ జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని జీవీఎస్ భవన్‌లో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సభ్యులు పలువురు సత్కరించారు. సంఘ కార్యదర్శి గడ్డె తిలక్ మాట్లాడుతూ పదవీవిరమణ తర్వాత కూడా అసాధారణ రీతిలో ఎన్నెన్నో పుస్తకాలు సేకరించి, అవి అందరికీ అందేలా అన్నమయ్య 'పేరుతో' గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీవీఎస్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ జి.జయప్రకాశ్ మాట్లాడారు. కార్యక్రమంలో కస్టమ్స్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ కె.రాజారావు, పీవీ సత్యనారాయణ, ముత్యాలు, సీతారామయ్యచౌదరి, ఈశ్వరమ్మ, ఆషా, భానుమతి, మేరీ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక సేవలు అభినందనీయం

భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక సేవలు అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కొనియాడారు. కళావేదిక దశాబ్ది ఉత్సవాలు అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో ఆదివారం జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్.. వేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావును సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, కళావేదిక వైస్ ఛైర్మన్ మాతృశ్రీ విద్యా సంస్థల అధినేత బండ్లమూడి గాంధీ, సెయింట్ లారెన్స్ స్కూల్ అధినేత మేకల రవీంద్రబాబు, డేగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, గోరంట్ల

ప్రేక్షకులను అలరించిన విభావరి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: కలెక్టరేట్ రోడ్డులోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సహస్ర సరాగాలు సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. నిర్వాహకులు విష్ణుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సినీ సంగీత విభావరిలో దాదాపు 40 మందికి పైగా గాయకులు పాల్గొని సినిమా పాటలు మధురంగా గానం చేశారు. ప్రియాంక, సుచరిత వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది జి.శాంతకుమార్, ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ బత్తుల ఉమాదేవి, జి.మోసెస్‌పాల్ పాల్గొని కళాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

పాట పాడుతున్న విష్ణుకుమార్, ఉమాదేవి

వ్యర్థాల గుట్టలు.. వెళ్లేందుకు తిప్పలు

లక్ష్మీనగర్ ఒకటో లైన్‌లో రహదారి వెంబడి రోజులుగా వ్యర్థాల గుట్టలు అడ్డంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిలో నిత్యం స్కూల్ ఆటోలు, ఉద్యోగులు, యార్డులో పనికి వెళ్లేవారు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రాళ్లగుట్ట అడ్డంగా ఉండడంతో ఒక ఆటో వస్తే.. ఎదురుగా వచ్చే వారు తప్పించుకునే మార్గం ఉండడంలేదు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు రహదారిపై వ్యర్థాల గుట్టలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

మరమ్మతులు సరే.. గుంత పూడ్చడం మరిచారే..

నల్లపాడు రోడ్డులో నుంచి శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే మలుపు వద్ద మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం గుంతలు తీశారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత గుంతను సరిగా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం ఈ దారిలో లారీ ఇరుక్కుపోయింది. అభివృద్ధి పనుల్లో భాగంగా నల్లపాడు రోడ్డు నుంచి చుట్టుగుంట వరకు సైడ్ కాలువలు తీస్తున్న క్రమంలో ఈ రహదారి మీదుగానే ఏటీ అగ్రహారంలోకి వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు తక్షణం రహదారిపై గుంతలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, గుంటూరు పశ్చిమ

ఆకట్టుకున్న సంగీత ప్రదర్శనలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట 2/14లో త్యాగరాజ కళావేదికపై వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కీబోర్డ్, వయోలిన్, వీణ, గాత్రాలలో తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. వాయులీన విద్వాంసుడు పి.నందకుమార్ కచేరీ చేశారు. కార్యక్రమానికి వీకే శాస్త్రి, కె రాజ్యలక్ష్మి సహకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి మానికొండ శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కీబోర్డుపై చిన్నారుల సంగీత ప్రదర్శన

కల్వర్టులు దాటాలంటే కష్టాలే..

పట్టాభిపురం, న్యూస్‌టుడే:

కల్వర్టుల వద్ద పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. వాహనచోదకులు కల్వర్టులు ఎక్కాలన్నా.. దిగాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేగంగా వెళ్తే.. వాహనాలు సైతం మరమ్మతులకు గురవడమే గాకుండా.. నడుము నొప్పులతో పాటు ఇతర సమస్యలు వస్తున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా కల్వర్టులు నిర్మించడం, రోడ్డు ఏర్పాటు చేసే సమయంలో గుత్తేదారులు కల్వర్టుల వద్ద సక్రమంగా వాలు చేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. కల్వర్టులకు, రోడ్లను సరిగ్గా అనుసంధానించలేదు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల నీటి ప్రవాహానికి కొన్ని కోతకు గురయ్యాయి. కల్వర్టుల వద్ద ప్రమాదకర పరిస్థితుల్ని ప్రజలు.. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఫలితంగా మాకు తిప్పలు తప్పడం లేదని జనం విమర్శలు గుప్పిస్తున్నారు.

చెప్పినా పట్టించుకోరు..

◆ కల్వర్టుల వద్ద వాహనాలు ఎక్కి దిగాలంటే ఇబ్బందిగా ఉంటుందని, పోర్కులు పాడైపోతున్నాయని, టైర్లకు రాళ్లు గుచ్చుకొని కొన్ని సందర్భాల్లో పంక్చర్లు పడుతున్నాయని వాహనచోదకులు పేర్కొంటున్నారు.

◆ చంద్రమౌళీనగర్ ఏడోలైను ఒకటో అడ్డరోడ్డులోని కల్వర్టు కోతకు గురై రెండు అంగుళాలకు పైగానే రోడ్డుకు ఖాళీ రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రమాదకర పరిస్థితిని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతీగతీ లేదు.

చంద్రమౌళీనగర్‌లోని ఏడో లైను ఒకటో అడ్డరోడ్డులో ఇలా...

స్తంభాలగరువు రామాలయం వద్ద

◆ స్తంభాలగరువు రామాలయం వద్ద కల్వర్టు ఏడాది క్రితమే నిర్మించారు. అప్పట్లో రోడ్డు మీదకు స్లోప్ చేయకుండా పైపైన చేసేసి చేతులు దులిపేసుకున్నారు. వర్షాలకు సిమెంట్ మిశ్రమం కొట్టుకుపోయింది. సరిగ్గా మలుపు తిరిగే వద్ద ఈ పరిస్థితి ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ◆ పలు ప్రాంతాల్లోని కల్వర్టుల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలతో రోజురోజుకీ పరిస్థితి మరింత దిగజారిపోతుందని స్థానికులు వాపోతున్నారు. హడావుడిగా నడిచి వెళ్లే సమయంలో కాళ్లు బెణికి నొప్పుల బారిన పడుతున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడుము నొప్పులతో బాధపడటమే కాకుండా.. వాహనాలకు మరమ్మతుల వల్ల ఆర్థికంగానూ నష్టపోవాల్సి వస్తోందని వాహనచోదకులు విమర్శిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద ప్రమాదకరంగా ఉన్న పరిస్థితుల్ని చక్కదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు ముప్పు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి.. నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం కార్మికులకు అన్యాయం చేయడమేనని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ సమ్మె హక్కు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, తగిన వేతనం అడిగే హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని బలహీనపరిచే ప్రయత్నం జరుగుతుందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, మున్సిపల్ కార్మికుల సంఘం నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తున్న క్రమంలో ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు సాంస్కృతికం: విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సంఘ సర్వసభ్య సమావేశం బ్రాడీపేట 1/13, బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం జరిగింది. సమావేశంలో వచ్చే మూడేళ్ల కాలానికి గాను కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రామరాజు రామకృష్ణారావు, అధ్యక్షుడిగా డి.ఫణిభూషణరావు, ఉపాధ్యక్షుడిగా నాదెండ్ల రాధాకృష్ణ, కార్యదర్శిగా కళ్లెం సుబ్రహ్మణ్యశర్మ, సంయుక్త కార్యదర్శిగా రాజేంద్రబాబు, కోశాధికారిగా దెందుకూరి శివరామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితో పాటు 8 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక కూడా జరిగింది. ప్రతి ఏకాదశికి అహోరాత్ర పారాయణలు, సప్తాహ, త్రయాహ్నిక కార్యక్రమాలు జరపాలని నూతన కార్యవర్గం నిర్ణయించింది. నందిరాజు రాజేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

30న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయలని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న గుంటూరులో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమీర్, ఉపాధ్యక్షులు యశ్వంత్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, సౌమ్య, ఉపాధ్యక్షులు సుర్జిత్, నాయకులు రాజ్, వెంకి, గోపి, జిస్టు, లోకేశ్, నసీర్, పర్వాన్ పాల్గొన్నారు.

సిస్టర్ మేరీ గ్లోరీని వెనరబుల్‌గా ప్రకటన

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని సెయింట్ జోసఫ్ ఆసుపత్రిలో విశేష సేవలందించిన డాక్టర్ సిస్టర్ మేరీ గ్లోరీని వెనరబుల్‌గా పోప్ లియో XIV ప్రకటించారు. నవంబరు 21న వాటికన్ సిటీ రోమ్‌లో ఆమోదించారు. ఈఅవార్డుతో సిస్టర్ మేరీ గ్లోరీ సెయింట్ హుడ్ పురస్కారానికి దగ్గరలో ఉన్నట్లయ్యింది. నిరుపేదలకు సేవ చేసినందుకు రోమన్ క్యాథలిక్ చర్చి (ఆర్‌సీఎం) మేరీ గ్లోరీని గుర్తించింది. ఆమె జూన్ 23, 1887లో ఆస్ట్రేలియాలో జన్మించారు. వైద్యవృత్తిలో అధికారికంగా గుర్తింపు పొందిన ప్రపంచ మొదటి మత సోదరి అయ్యారు. 1920లో భారతదేశానికి వచ్చి మహిళలు, పిల్లలు, పేదలను స్వస్థత పరచడానికి తన జీవితమంతా అంకితం చేశారు. ఆమె జీవితం సేవలను కొనియాడుతూ మేరీ గ్లోరి ఫొటో ఆసుపత్రిలో ఉంచారు. సెయింట్ జోసఫ్ స్కూల్‌లో ఆమె సమాధి, మ్యూజియం ఉన్నాయి.

సత్యసాయి సేవలు చిరస్మరణీయం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా సేవా సమితి సేవా మార్గంలో నడుస్తుందని సత్యసాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.ఎల్.నరసింహారావు అన్నారు. జడ్పీ ప్రాంగణంలోని శ్రీసత్యసాయి శాంతి సుధ మందిరంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఓంకార సుప్రభాత నగర సంకీర్తన, వేద విద్యార్థులకు సత్కారం, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యసాయి సామూహిక వ్రతాలు, జూలా ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, సొసైటీ సభ్యుడు కోవెలమూడి అపర్ణ, స్కూల్ ప్రిన్సిపల్ పి.వి.సీతామహాలక్ష్మి, డాక్టర్ హనుమంతరావు, టీజేపీఎస్ కళాశాల కరెస్పాండెంట్ కేవీ బ్రహ్మం, కార్పొరేటర్ ఇ.వరప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతి వేడుకల్లో జడ్పీ ఉద్యోగులు

రక్తదానం చేస్తున్న భక్తులు

★ గుంటూరులో జడ్పీ భవనంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రాంగణంలో ఆదివారం థలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్, సక్షమ్ సేవా కేంద్రం సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 109 మంది భక్తులు పాల్గొని రక్తదానం చేశారు.

జిల్లాపరిషత్తు: జిల్లాపరిషత్తు కార్యాలయంలో సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం జరిగాయి. జడ్పీ పీఎఫ్ విభాగం పరిపాలన అధికారి టి.శ్రీనివాసరావు, సిబ్బంది సత్య సాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నగరపాలకసంస్థ: ప్రజలకు శ్రీసత్యసాయిబాబా చేసిన సేవలు చిరస్మరణీయమని, వారు చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, వేముల జ్యోతిపద్మజ, ఇర్రి ధనలక్ష్మి, సాధు రాజేష్, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజరు బాలాజీబాషా, పీవో సింహాచలం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి శాంతి సుధ మందిరంలో

సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

సైకిళ్లపై శబరిమలకు

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే: పర్చూరు సమీపంలోని కొల్లావారిపాలానికి చెందిన కొల్లా పద్మా శ్రీనివాసరావు రెండు దశాబ్దాల క్రితం వ్యాపారం నిమిత్తం గుంటూరు వచ్చారు. ఆయనకు అయ్యప్ప స్వామి అంటే భక్తి ఎక్కువ. ఇప్పటివరకు 22 సార్లు ఆయన స్వామి దర్శనం చేసుకున్నారు. ఇందులో 17 సార్లు సైకిల్‌పై వెళ్లడం విశేషం. మరో రెండుసార్లు కాలినడకన వెళ్లి వచ్చారు. ఆయన.. మిత్రులు శంకరయ్య, శేషగిరిరావు, నాగేశ్వరరావులతో కలిసి కొన్నిసార్లు వెళ్లొచ్చారు. ఆయన 18వ సారి గుంటూరు సంపత్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ప్రముఖ సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్యతో కలిసి శబరిమలకు సైకిళ్లపై బయలుదేరారు. వారికి మిత్రులు, సైకిస్టులు వీడ్కోలు పలికారు. మొదటిరోజైన ఆదివారం 190 కిలోమీటర్లు ప్రయాణం చేసి కావలి వరకు వెళ్లారు.

శబరిమలకు బయలుదేరుతున్న పద్మాశ్రీనివాసరావు, సుబ్బయ్యలకు వీడ్కోలు

సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ 10న

సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ డిసెంబరు 10న గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్నామని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి తెలిపారు. ఏపీ ఎన్జీఓ హోంలో ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, గోరంట్ల

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన తమిళనాడురాష్ట్రం, పళ్లిపట్టు, తిరువళ్ళూరు, కొనసముద్రం, కొత్తకుప్పం గ్రామం కాపురస్తురాలు సమ్మి కనకరత్నం, W/o. ఇంజుమ్ వెంకటేశ మందాడి గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు ఆస్తి పరకళ్ళ రామారావు వగైరాలుకు వారసత్వేనా అనగా, పరకళ్ళ శేషు ప్రమీల రాణి మరియు ఆమె సోదరి ది.04-01-2016న దస్తావేజు నెం.71/2016 గుంటూరు యస్.ఆర్.ఒ.లో రిజిస్టరు చేసుకున్న భాగపంపిణీ రీత్యా "ఏ-షెడ్యూలు" ఆస్తి సంక్రమించి సర్వ హక్కులుతో అనుభవించుచూ ఎటువంటి లిఖిత పూర్వక ఏర్పాటుచేయకనే ది.22-05-2021న మరణించిన దరిమిలా సంక్రమించినదని, అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.1563/1946 పోయినదని తెలిపి విక్రయించుచున్నందున నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి కొంత క్రయధనం చెల్లించి విక్రయ బయాన అగ్రిమెంట్ కుదుర్చుకొనియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన తనఖాలు, తాకట్లు, కోర్టుజప్తులు, సెక్యూరిటీలు, ఇతర అగ్రిమెంట్లు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. గడువులోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టిక్లెయిములు రానియెడల నిష్పేచిత ఆస్తిగా భావించి నాక్లయింటు సదరు పరకళ్ళ రామారావు వగైరాల వద్ద నుండి కొనుగోలు చేయుదురని తదుపరి వచ్చు ఎట్టి క్లెయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నాక్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు : గుంటూరు డి. & సబ్.డి॥, జి.యం.సి. ఏరియా టౌన్ సర్వే కాసటు వంటి గుంటూరు సిటీ, నెహ్రూనగర్ 3వ లైను ఏరియా, గుంటూరు గ్రామ డి.నెం.424/1 య.9-46 సెంట్లలో చ.గ.359.1లు స్థలములో పడమర వైపుగల చ.గ.188.6లు స్థలము పాత అసిస్మెంట్ నెం. 63655, ప్రస్తుత అసిస్మెంట్ నెం.1021161627, డోర్ నెం.8-8-42, ఆర్.సి.సి. డాబా వగైరాలకు **హద్దులు.తూర్పు:**పొలసం గీతాలావణ్యగారి ఆస్తి, అ.55.9 లు, **దక్షిణం:** మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు,అ.29.6లు, **పడమర:** బొర్రా జ్యోతి ఆస్తి, అ.55.6లు, **ఉత్తరం:** కొటారి రుద్రాదేవి ఆస్తి, అ.32లు.

బి. శివరామ కృష్ణా రెడ్డి, అడ్వకేట్,
మారుతీనగర్, గుంటూరు, సెల్.8096152567, 73864 89796

బహిరంగ ప్రకటన

బెంగలూరు, RT నగర్, మునేశ్వర గుడి దగ్గర, 3వ మెయిన్ రోడ్డు, నెం. 98 నివాసి రాయ్‌చంద్ గారి కుమారుడు రూప రామ్ రాథోడ్ (ఆధార్ నెం. 8133 7574 7150) అను నా క్లయింట్ చక్కా సుజాత (ఆధార్ నెం. 5036 5439 5331), W/o. శివరామకృష్ణ ఫ్లాట్ నెం. F-2, ప్రహస్ మ్యాన్షన్, 1వ లైను, కృష్ణ నగర్ పార్క్, కృష్ణనగర్, గుంటూరు గారి తాలూకు గల షెడ్యూలు ఆస్తిని అమ్మదలచియున్నందున సదరు రూప రామ్ రాథోడ్ గారు కొనదలచినారు గాన సదరు ఆస్తిపై మీకు ఎటువంటి ఇబ్బందులు గాని, పేచీలు గాని ఉన్న యెడల ఈ రోజు నుండి ఏడు (7) రోజుల లోపల ఈ Cell: 99596 80130 నెంబరుకి సంప్రదించగలరు.

గుంటూరు డి॥ పెదకాకాని సబ్ డి॥ యిలాకా తక్కెళ్ళపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన తక్కెళ్ళపాడు గ్రామం బాపతు డి.నెం. 53/1బి రు య.2-85 శెంట్లున్నూ, డి.నెం. 53/2ఎ రు య.2-81 శెంట్లున్నూ, డి.నెం.53/2బి రు య.2-91 శెంట్లున్నూ వెరశి మూడు నెంబర్లు ఏకఖండముగానున్న య.8-57 శెంట్లు మింజుమలె, ప్లాటు నెం.1.2రు దాఖలా చ.గ. 854లు స్థలములో చ.గ. 266-7లు స్థలము లోగడ యన్.హెచ్. 5 రోడ్డు క్రింద పోను మిగిలిన చ.గ. 587-3లు స్థలములో పడమర వైపున నాకు హక్కు కలిగి నీకు విక్రయించిన చ.గ. 400లు స్థలమునకు హద్దులు: తూర్పు: ఈరోజున మీరు బన్నారావూరి కమల గారి వలన క్రయం పొందుచున్న స్థలం హద్దు. అ.49-00లు, దక్షిణం: మోపర్తి రవీంద్రనాథ్ వగైరాల భూమి హద్దు అ.71-03లు, పడమర: యన్.హెచ్. 5 రోడ్డు హద్దు అ.49-00లు, ఉత్తరం: అ. 30లు వెడల్పు గల రోడ్డు హద్దు. అ. 75-00లు. ఈ హద్దుల మధ్య చ.గ. 400లు లేక చ.మీ. 334-45ర్లు ఖాళీ నివేశన స్థలమును మాత్రమే విక్రయించి ఈరోజుననే నీకు నేను స్వాధీనపర్చడమైనది.

గుంటూరు డి॥ పెదకాకాని సబ్ డి॥ యిలాకా తక్కెళ్ళపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన తక్కెళ్ళపాడు గ్రామం బాపతు డి.నెం. 53/1బి రు య.2-85 సెంట్లున్నూ, డి.నెం.53/2ఎ రు య.2-81 శెంట్లున్నూ, డి.నెం. 53/2బి రు య. 2-91 శెంట్లున్నూ వెరశి పై మూడు నెంబర్లు ఏకఖండముగా నున్న య. 8-57 శెంట్లు మింజుమలె, చ.గ. 993లు స్థలములో నాకు హక్కు కలిగి నీకు విక్రయించిన ప్లాటు నెం. 2రులో కొంత మరియు ప్లాటు నెం.2ఏరులో పూర్తిగా వెరశి చ.గ. 326-3లు స్థలమునకు హద్దులు. తూర్పు: అలపాటి నాగేశ్వరరావు గారి భూమి హద్దు. అ. 49-00లు, దక్షిణం: మోపర్తి రవీంద్రనాథ్ వగైరాల స్థలం హద్దు. అ. 58-00లు, పడమర: కొల్లి లక్ష్మారెడ్డి గారి స్థలం హద్దు అ. 49-00లు, ఉత్తరం: అ. 30లు వెడల్పు గల బజారు హద్దు అ. 62-00లు. ఈ హద్దుల మధ్య చ.గ. 326-3లు లేక చ.మీ. 272-87ర్లు ఖాళీ నివేశన స్థలమును మాత్రమే విక్రయించి ఈరోజుననే నీకు నేను స్వాధీనపర్చడమైనది.

గుంటూరు
తేదీ: 23-11-2025

ఇట్లు: శ్రీనివాసరావు గాళం
కపిరావు పిన్నబోయిన, అడ్వకేట్స్,
4/13, బ్రాడీపేట, గుంటూరు, 99493 68369

(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం నవంబరు 24, 2025

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నేడు

కానూరు పి.వి.పి. సిద్ధార్థ ప్రాంగణంలో నిర్వహణ

ఈనాడు, అమరావతి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ప్రారంభిస్తారు. విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొంటున్నారు. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' ముఖ్య ఉద్దేశం.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

ఏకపీఠంపై శివపార్వతులు...

కృష్ణా జిల్లా ఘంటసాలలోని ప్రాచీన బాలపార్వతీ సమేత జలదీశ్వరస్వామి దేవాలయం ఎంతో ప్రత్యేకమైనది. ఇక్కడ జలదీశ్వరస్వామిగా పూజలందుకుంటున్న శివలింగం పక్కనే పార్వతీదేవి ఏకపీఠంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. సాధారణంగా శివాలయాల్లో శివుడు ఒకచోట ఉంటే అమ్మవారు మరోచోట ఉంటారు. ఈ క్షేత్రంలో మాత్రం ఆది దంపతులు (శివపార్వతులు) ఏకపీఠంపై భక్తులను ఆశీర్వదిస్తారు. అగస్త్య మహాముని, ఆయన భార్య లోపాముద్ర కలిసి ఈ జలదీశ్వరస్వామిని, పార్వతీదేవిని ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. స్వామిని దర్శిస్తే సాక్షాత్తు కైలాసంలో ఆదిదంపతుల కల్యాణ దర్శనం చేసుకున్నంత భాగ్యం కలుగుతుందని ప్రతీతి. ఆలయ ప్రాంగణంలో 1400 ఏళ్ల కిందటి పాళీ భాషలో శాసనం ఇప్పటికీ కనిపిస్తుంది. దీని పక్కనే తెలుగు అనువాదాన్ని సైతం భక్తులకు అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు. - ఈనాడు, కృష్ణా

టిడ్కో గృహం.. కష్టాల కాపురం..

వసతులు లేక.. నివాసాలు ఉండలేక..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే, గుడివాడ

జిల్లాలోని టిడ్కో గృహాల నిర్మాణం దాదాపు పూర్తయినా వసతుల లేమి లబ్ధిదారులను తిప్పలు పెడుతోంది. గత ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చివరి దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నీరు, విద్యుత్తు, డ్రైనేజీ వంటివి పూర్తి చేయకుండానే ఇళ్లల్లోకి వెళ్లమంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

★ గుడివాడ, మచిలీపట్నంలోని గోసంఘంలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తికాగా లబ్ధిదారులు నివాసాలు ఉంటున్నారు. ఉయ్యూరులో 85శాతమే పనులు జరిగాయి. రుద్రవరంలో బీ బ్లాక్‌లో నీరు, విద్యుత్తు కల్పిస్తే వెంటనే నివాసం ఉంటామని ఫ్లాట్ల లబ్ధిదారులు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్ కార్యాలయం, మంత్రికి పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా స్పందించట్లేదని, గృహాలు ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆకతాయిలకు అడ్డగా..

మచిలీపట్నం రుద్రవరంలోని టిడ్కో గృహాలన్నీ పూర్తికావాలంటే 2నెలలు పడుతుంది. ఏ బ్లాక్‌లో మరుగుదొడ్లు, విద్యుత్తు, పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. బీ బ్లాక్‌లో నీరు, విద్యుత్తు కనెక్షన్లు ఇస్తే నివాసాలు ఉండవచ్చు. ఖాళీగా ఉండడంతో రుద్రవరానికి చెందిన అధికార పార్టీ ఇన్‌ఛార్జి సోదరుడు గుమ్మడి కిరణ్, మరికొందరు వాచ్‌మెన్‌ను బెదిరిస్తూ మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వీరి మాటున మరికొందరు గదులకు వేసిన తాళాలు పగలగొట్టి విద్యుత్తు మీటర్లు, వైర్లు ఎత్తికెళ్లిపోయారు.

గుడివాడ: పై అంతస్తుల వారికి నీరు అందక డ్రమ్ముల్లో పట్టి పెట్టుకుని..

ఈ గృహాల్లో మద్యం సీసాలు, పగిలిన కిటికీల అద్దాలు దర్శనమిస్తున్నాయి. ★ గుడివాడలో లబ్ధిదారులకు నీరు చాలట్లేదు. ఏడాదిగా ట్రాక్టర్లలో వచ్చే నీటిని డ్రమ్ముల్లో పట్టుకొని పై అంతస్తుల వారు మోసుకుంటున్నారు. రూ. 40లక్షలతో 8 బోర్లు వేసినా నీరు చాలట్లేదు. వర్షం వస్తే డ్రైనేజీ పొంగి రోడ్లపైకి వస్తోంది.

విద్యుత్తు మీటర్లు ధ్వంసం చేశారిలా..

పగిలిన మద్యం సీసాలు

మున్సిపాలిటీ	ఫ్లాట్లు
మచిలీపట్నం	2304
గుడివాడ	8912
ఉయ్యూరు	2496
నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)	రూ.1000

వారంలో కనెక్షన్లు

- మంత్రి కొల్లు రవీంద్ర

రుద్రవరంలో బీ బ్లాక్ వారికి నీరు, విద్యుత్తు కనెక్షన్లు ఇప్పించి వారం రోజుల్లో సమస్య లేకుండా చూస్తాం. రుద్రవరానికి చెందిన కొందరు పార్టీ పేరు చెప్పి గృహాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మా దృష్టికి వచ్చింది. వారెవరైనా చర్యలు తప్పవు.

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 99590 21800

ప్యాకేజీ-4 ...ఇక పరుగులు

కురగల్లులో తొలగించిన రోడ్డు పునర్నిర్మాణానికి ఎన్వోసీ

ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4 పనులు పరుగులు పెడుతున్నాయి. కురగల్లులో కొండవీటి వాగు వరదల సమయంలో తొలగించిన రహదారి పునర్నిర్మాణం పనులు పట్టాలెక్కుతున్నాయి. ఆగస్టులో కొండవీటి వాగుకు వరద పోటెత్తిన వేళ నష్ట నివారణకు మంగళగిరి మండలం కురగల్లులో 40 మీటర్ల మేర రహదారిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) తొలగించింది. ప్రస్తుతం పరిస్థితులు కుదుట పడడంతో రహదారి పునర్నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని రాతపూర్వకంగా ఎన్వోసీ ఇవ్వాలని ఏడీసీఎల్‌కి ఎన్‌హెచ్ఏ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. తాజాగా దానికి సంబంధించిన ఎన్వోసీ ఎన్‌హెచ్ అధికారులకు అందింది. అన్నీ కుదిరితే సోమవారం నుంచి పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టి నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఇప్పటికే ప్యాకేజీ-3 పనులు దాదాపు కొలిక్కి రావడంతో విజయవాడ రాకుండా చినఆవుటపల్లి నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్- వైజాగ్ వెళ్లేందుకు రాకపోకలు మొదలయ్యాయి. నున్న విద్యుత్తు టవర్ల వివాదంపై సోమవారం కోర్టు తీర్పు రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో స్పష్టత రానుంది. మొత్తం మీద సంక్రాంతి నాటికి ప్యాకేజీ-3, 4 పనులు కొలిక్కి వచ్చి బైపాస్‌పై వాహనాల రాకపోకలు మొదలవనున్నాయి.

కురగల్లు దగ్గర ఏడీసీఎల్ రహదారిని తొలగించిన ప్రాంతం

కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్ (మచిలీపట్నం): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1100 నంబరుకు కాల్ చేసి అర్జీ స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

వృక్షం.. ఆరాధ్య దైవం

నాట్య క్షేత్రమైన కూచిపూడిలో 300 ఏళ్ల నుంచి ఉన్న రావివృక్షాన్ని (గంటలమ్మ) నాట్య కుటుంబాలు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నాయి. కూచిపూడి భాగవతులు దేశంలోని పలు ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు ఇచ్చేందుకు వెళ్లే ముందు కూచిపూడి అగ్రహారంలో ఉన్న రావి వృక్షానికి మొక్కేవారు. తాను తిరిగి వచ్చే వరకు భార్యాబిడ్డలను కాపాడమని ఆ చెట్టుకు గంట కట్టి మోగించి వెళ్లేవారు. ఆ వృక్షానికి ఉన్న గంటలు నిత్యం గాలికి ఊగుతూ మోగుతూ ఉండటంతో దాన్ని గంటలమ్మ చెట్టుగా పిలుస్తుంటారు. భాగవతులు తర్వాత ఆయన వంశీయులు ఆ చెట్టును కొలుస్తున్నారు. - కూచిపూడి, న్యూస్‌టుడే

వందనమమ్మా.. మంతెన బామ్మ!

కంకిపాడు, న్యూస్‌టుడే

ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న బాలబాలికలు

ఏడు పదుల వయసులోనూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ సామాజిక సేవలో తరిస్తున్నారు.. కంకిపాడు మండలం మంతెనకు చెందిన పెండ్యాల విజయలక్ష్మి. ఆమె భర్త రామారావు ఏలూరులోని ఓ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. వీరి కుమార్తె, కుమారుడు ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడ్డారు. విజయలక్ష్మి పదేళ్లుగా సామాజిక సేవతో పాటు గ్రామ ప్రగతికి కృషిచేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలు, చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం, కీళ్ల సమస్యలపై బాలలు, మహిళల్లో అవగాహన కల్పించేందుకు బాలసేన, మహిళా మండలి ఏర్పాటు చేయించారు. 'స్వచ్ఛ సుందర మంతెన'కు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, వ్యాపారులు, గ్రామస్థులకు నార సంచులు, స్టీల్, గాజుగ్లాసుల పంపిణీ, బాలలకు పోటీలు నిర్వహించి బహుమతుల అందజేత, పండగలు, పర్వదినాలను పురస్కరించుకుని మహిళా మండలి సభ్యులంతా స్వయంగా సేంద్రియ పదార్థాలతో చేసిన తినుబండారాలను చిన్నారులకు పంపిణీ చేస్తున్నారు.

☛ వేసవి శిక్షణ శిబిరాలకు తనే స్వయంగా విద్యార్థులను తీసుకెళుతుంటారు. బాలలు, మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణ, పాఠశాల ప్రాంగణాల్లో సేంద్రియ విధానంలో కూరగాయల ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు, గో ఆధారిత ఎరువులు ఇస్తున్నారు. బంధువులకు చెందిన 40 సెంట్ల స్థలంలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలను ఇంటింటికీ అందజేస్తున్నారు. విజయలక్ష్మిని గ్రామంలోని బాలలు, విద్యార్థులు అమ్మమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. 'నా కుటుంబానికి అన్నీ ఇచ్చిన గ్రామం.. రుణం తీర్చుకునే బాధ్యత నాపై ఉందని భావించి, సేవచేస్తున్నాను' అని పెండ్యాల విజయలక్ష్మి తెలిపారు.

పెండ్యాల విజయలక్ష్మి

త్రివర్ణ వీచిక.. నిలువెత్తు స్ఫూర్తిగా..

ఆంధ్రప్రదేశ్- తెలంగాణ సరిహద్దుల్లోని జగ్గయ్యపేటలో జాతీయ రహదారి సమీపంలో 150 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకం తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నిత్యం రెపరెపలాడుతూ జాతీయ స్ఫూర్తిని చాటుతోంది. 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్వహస్తాలతో ఆవిష్కరించిన పతాకం ఈ ప్రాంతానికి ఒక విశిష్టతను సంతరింపజేసింది. ఆ ప్రాంతాన్ని ఒక దేశభక్తి ప్రబోధకమైన సందర్శన స్థలంగా మార్చడం కోసం జగ్గయ్యపేట పురపాలక సంఘం వారు అక్కడ ఒక తిరంగ్ ఉద్యానవనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆ పార్క్ దశల వారీగా రూపుదిద్దుకుంటూ ఉంది. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

స్వగృహం ప్రాప్తిరస్తు!

అర్హుల ఎంపికకు పీఎం ఆవాస్ యోజన 2.0 సర్వే

ఈనాడు, అమరావతి

నీడ లేని పల్లె ప్రజలకు సొంత గూడు కల సాకారం చేసేందుకు కూటమి సర్కారు నడుం కట్టింది. దీని కోసం పీఎం ఆవాస్ యోజన 2.0 ద్వారా లబ్ధి అందించనున్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతలు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్నారు.

జిల్లా	దరఖాస్తులు	సర్వే చేసినవి
ఎన్టీఆర్	15,994	9190
కృష్ణా	6,707	4,069
మొత్తం	22,701	13,259

ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

నవంబరు-30 నాటికి కొలిక్కి..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,701 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిని హౌసింగ్, సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో కలిసి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటున్న స్థలాన్ని పరిశీస్తున్నారు. వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 13,259 మందిని సర్వే చేశారు. నవంబరు 30వ తేదీలోగా సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. నెల రోజుల తర్వాత కేంద్రం అర్హుల జాబితా ప్రకటించి ఇళ్ల మంజూరుపై దృష్టి సారిస్తుంది.

గృహ నిర్మాణానికి కూటమి చొరవ

☛ వైకాపా పాలనలో మొదలుపెట్టి అసంపూర్తిగా నిలిపేసిన గృహాల్లో 11,008 గృహాలు తాజాగా కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది.

☛ సామూహిక గృహప్రవేశాల రోజే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,449 ఇళ్లు మంజూరు చేసింది.

☛ ఇందులో ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలున్నాయి. వీటికి ఉమ్మడి జిల్లాకు రూ. 70.8 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

☛ ప్రస్తుతం పీఎం గ్రామీణ ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు సర్వే చేస్తున్నారు.

☛ ఈ సర్వేలో అర్హులను బట్టి వచ్చే రెండేళ్లలో కూటమి సర్కారు గృహాలు మంజూరు చేయనుంది.

☛ ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ. 1.5లక్షలు, రాష్ట్రం రూ. లక్ష చొప్పున రూ. 2.5లక్షలు అందుతాయి. అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా 90 పని రోజులకు రూ. 27వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 12వేలు మంజూరు చేస్తారు.

☛ మొత్తంగా ఒక్కో లబ్ధిదారుడికి రూ. 2.89లక్షలు చెల్లిస్తారు.

ఖాతాలు నావే.. పోస్టులు నావి కాదు!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

రెండో రోజూ పోలీసుల కస్టడీకి సహకరించని విజయ్‌భాస్కర్‌రెడ్డి

'సామాజిక మాధ్యమాల ఖాతాలు నావే.. అందులో అసభ్యకర పోస్టులు.. మార్ఫింగ్ ఫొటోలు, కంటెంట్ నాది కాదు' అని రెండో రోజు పోలీసుల కస్టడీలో వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, న్యాయమూర్తులపై అత్యంత అసభ్యకర పదజాలంతో కంటెంట్ రాస్తూ.. పోస్టులు పెట్టడం వెనుక కారణాలేంటని విచారణాధికారి వెంకటరమణ అడిగిన ప్రశ్నలకు తెలియదు.. సంబంధం లేదంటూ నిందితుడు పొడిపొడిగా సమాధానాలు చెప్పాడు. నెల్లూరు జిల్లా వెంకటాచలం ఠాణాలో రెండో రోజు ఆదివారం పోలీసుల కస్టడీలో విజయ్‌భాస్కర్‌రెడ్డి సహకరించలేదు. 5 గంటల పాటు సుమారు 16 ప్రశ్నలు అడగ్గా నిందితుడు డొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం వైద్య పరీక్షలు చేయించి నెలూరు జైల్లో నిందితుడిని అప్పగించారు.

విచారణ సాగిందిలా..

- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రిలోకేశ్ వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టారు కదా.. వారు ఎవరో తెలుసా?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: తెలుసు
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఆయన ఎవరో తెలుసా?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: జస్టిస్ ఎన్.వి.రమణ ఎవరో నాకు తెలియదు.
- ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టడం వెనుక ప్రధాన ఉద్దేశమేంటి?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.. సంబంధం లేదు.
- సామాజిక మాధ్యమాల్లో మీరు పెట్టిన పోస్టులు తీవ్ర అసభ్యంగా ఉన్నాయని అనిపించలేదా?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.
- మీ ఫేస్‌బుక్ ఖాతాలో మహిళల ఫొటోలు మార్ఫింగ్, అనుచిత వ్యాఖ్యలతో కంటెంట్ రాయమని చెప్పిందెవరు? మీతో పాటు ఇంకా ఎవరెవరు పాత్రధారులు ఉన్నారు?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: ఆ ఖాతాలు నావే. అందులోని కంటెంట్ నాది కాదు.
- మీ విదేశీ మొబైల్ నంబర్‌తో ఉన్న కోర్ కమిటీ వాట్సప్ గ్రూప్, కోర్‌కమిటీలోని సభ్యులు ఎవరెవరు? వారు అసభ్య పోస్టులు ఎవరెవరికి పంపేవారు. మీకు ఎలాంటి సూచనలు చేసేవారు?
విజయ్‌భాస్కర్‌రెడ్డి: వారెవరో నాకు తెలియదు.

డ్రగ్స్ కేసులో.. కీలక మలుపు

ఈనాడు, అమరావతి

మ్యాడీ, లోహిత్ వాంగ్మూలాలతో కదిలిన డొంక
వైకాపా నేత కొండారెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు

ఎటువంటి పురోగతి లేకుండా ఉన్న ఎండీఎంఏ కేసు మ్యాడీ అరెస్టుతో కీలక మలుపు తిరిగింది. అతని విచారణ ఆధారంగా మరికొందరి పేర్లు వచ్చాయి. వీరిలో వైకాపా విద్యార్థి నేత పులగం కొండారెడ్డి పేరు ఒకటి. దీంతో అతడిని ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. లోహిత్ యాదవ్ విచారణలో పలు ముఖ్యమైన విషయాలు బయటకొచ్చాయి.

వైకాపా ర్యాలీల్లో హల్‌చల్

17న నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లోని లోహిత్‌ను మాచవరం పోలీసులు విచారించగా పలు విషయాలు వెల్లడించాడు. విశాఖ నగరంలోని ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రాంతానికి చెందిన లోహిత్ హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై చివరి ఏడాది మానేశాడు. ఇంటికి సమీపంలోని శ్రీవాత్సవ్ (ఏ1) ద్వారా 2020 నుంచి కొండారెడ్డితో పరిచయం ఏర్పడింది. మత్తు బంధం ప్రాణ స్నేహితులుగా మార్చింది. కొండారెడ్డి వైకాపాలో విద్యార్థి నేతగా ఎదుగుతుండడంతో వైకాపా ర్యాలీల్లో అతనితో కలిసే తిరిగేవాడు. లోహిత్ కాల్‌డేటా పరిశీలిస్తే గతేడాది మే 30 నుంచి ఈ ఏడాది ఆగస్టు 30 వరకు 15 నెలల్లో 1,467 కాల్స్ ఉన్నాయి. దీనిపై ప్రశ్నిస్తే ఇద్దరం తరచూ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీతో తీసుకునేవారమని, పార్టీల గురించి ఫోన్‌లో మాట్లాడుకునేవారమని చెప్పాడు.

కొండారెడ్డి

ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ అమ్మకాలు

ఎండీఎంఏతో పాటు బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ (లైసర్జిక్ యాసిడ్ డైఇథైలామైడ్) తెప్పించి విశాఖపట్నంలో కొండారెడ్డి విక్రయించేవాడు. ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్‌ను నాలుక కింద పెట్టుకుని చప్పరిస్తే మత్తు ఎక్కుతుంది. విశాఖ జిల్లాలో పలువురు వైకాపా కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలున్నాయి. తెలిసినవారికి నేరుగా, పరిచయం లేని వారికి డ్రాపింగ్ పాయింట్ల ద్వారా అందజేసేవారు. వచ్చిన సొమ్మును శ్రీవాత్సవ్, హర్షవర్ధన్‌నాయుడు, స్వరూప్‌రాజ్ ద్వారా కొండారెడ్డికి చేర్చేవారు.

శ్రీవాత్సవ్, హవీలా పట్టుబడిన రోజు..

బెంగళూరులో 20 గ్రాముల ఎండీఎంఏ కొని విశాఖ తీసుకెళ్తుండగా 3నెలల కిందట విజయవాడలో పట్టుబడ్డారు. ఆరోజు పట్టుబడిన ఇద్దరి ఫోన్లు స్విచాఫ్ రావడంతో కొండారెడ్డి, లోహిత్‌లు గాభరా పడ్డారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. తర్వాత వీరిద్దరూ ఒకచోట కలుసుకున్నారు. పోలీసులకు ఏమైనా దొరికారా? ఒకవేళ దొరికితే తమ పేర్లు ఏమైనా చెప్పారా? అన్న కంగారు పెరిగింది. దీంతో వాట్సప్ ద్వారా మ్యాడీకి కొండారెడ్డి ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు.

దారంతా గుంతలు.. దాటలేక గంతులు..

కూచిపూడి గ్రామం నుంచి మొవ్వ వరకు సుమారు 4 కి.మీ రహదారిలో వాహనదారులు వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. చాలాచోట్ల రహదారి ధ్వంసమై రాళ్లు తేలి ప్రయాణం దారుణంగా ఉంటోంది. ఆర్టీసీ బస్సులో వెళ్తున్నా ఈ గుంతల కారణంగా ఎగిరెగిరి పడుతున్నారు. - ఈనాడు, కృష్ణా

ఫ్లెక్సీ ఫ్రేమ్ దించుతుండగా.. విద్యుదాఘాతం

ముగ్గురు యువకులకు తీవ్ర.. మరొకరికి స్వల్ప గాయాలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఫ్లెక్సీ ఫ్రేమ్ దించుతుండగా.. విద్యుదాఘాతానికి గురై ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా.. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం ఉయ్యూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక జగదాంబ సమేత సోమేశ్వరాలయం(శివాలయం) ఎదురు భవనాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇనుప ఫ్రేమ్‌ను జి. నరేంద్ర, మేకల శివసాయి, జొన్నలగడ్డ పృథ్వీరాజ్, జొన్నలగడ్డ రాము అనే యువకులు కిందికి దించుతుండగా.. పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్తు తీగలకు తగిలింది. దీంతో వారంతా విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే స్థానికులు స్పందించి వారిని కిందకు దించి.. హుటాహుటిన ఉయ్యూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారిలో నరేంద్ర, శివసాయి, రాముకు తీవ్ర గాయాలు కాగా.. పృథ్వీరాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితిని తెలుసుకున్న.. వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మండవ జయదేవ్.. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉపాధి నిమిత్తం పనులకు వెళ్లే యువకులు.. బంధువులకు సంబంధించిన ఫ్లెక్సీ దించుతుండగా.. ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా, రుసుం చెల్లించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎయిర్ కార్గో... లక్ష్యం నీరుగారుతోంది!

ఈనాడు, అమరావతి

విజయవాడ విమానాశ్రయంలో ఎయిర్ కార్గో సేవల లక్ష్యం నెరవేరడం లేదు. రోజుకు 10 నుంచి 15 టన్నుల వరకూ సరకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నా సగం కూడా వెళ్లడం లేదు. 2019కి ముందు కార్గో సేవలు ఆరంభించిన కొద్ది కాలంలోనే నెలకు 250 టన్నులకు పైగా సరకు ఎగుమతి, దిగుమతి అయ్యే స్థాయికి చేరింది. ప్రత్యేకంగా కార్గో సర్వీసులను ఆరంభించే ప్రయత్నాలూ జరిగాయి. గత వైకాపా హయాంలో ఏడాదిన్నరకు పైగా కార్గో సేవలు నిలిచిపోయాయి. తిరిగి 2024 జులై 1 నుంచి సేవలు ఆరంభమైనా.. సరకు రవాణా అరకొరగానే జరుగుతోంది.

మత్స్య ఉత్పత్తులకు అవకాశాలున్నా..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తులు.. నిత్యం దిల్లీ, బెంగళూరు సహా అన్ని నగరాలకు రోడ్డు మార్గంలో వెళ్తున్నాయి. మత్స్య ఉత్పత్తులకు దిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. గన్నవరం నుంచి నేరుగా రెండు మూడు గంటల్లో దిల్లీ సహా ఆయా ప్రాంతాలకు సరకు చేర్చే అవకాశముంది.

ప్రస్తుతం ఏడు నగరాలకే..

ప్రస్తుతం హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నై, విశాఖ, తిరుపతి.. ఏడు నగరాలకు మాత్రమే ఇక్కడి నుంచి దేశీయ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నగరాలకు రోజుకు ఒకటిన్నర టన్ను వరకూ సరకు ఇటునుంచి వెళుతోంది. అటు నుంచి 4-5టన్నులు వస్తోంది.

★ దిల్లీ, ముంబయికి నడుస్తున్న.. ఐదు ఎయిర్‌బస్ 320 సర్వీసుల్లో ప్రయాణికులతో పాటు రెండున్నర నుంచి మూడు టన్నుల వరకూ సరకును తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. ఏటీఆర్-72 సర్వీసుల్లో టన్ను వరకూ తీసుకెళ్లొచ్చు.

అవగాహన, నమ్మకం కలిగించకే.. కార్గో సేవలను విస్తరించేందుకు.. ఉత్పత్తిదారులందరితో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. నేరుగా ఇక్కడి నుంచే సరకు పంపిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేయాలి. గత ఆరేళ్లుగా ఏ ప్రయత్నమూ చేయలేదు. దీంతో సరకును రోడ్డు మార్గంలోనే ఎక్కువ మంది ఇప్పటికీ పంపిస్తున్నారు.

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్,
విజయవాడ రూరల్ మండలం,
ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
Energy Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
FM Partner TV Partner Organised by
Digital Partner

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

అలరించిన ఛత్రపతి శివాజీ నాటకం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

నాటకంలో ఓ సన్నివేశం

భట్లపెనుమర్రు (కూచిపూడి), న్యూస్‌టుడే: 'జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్' నాటకాన్ని భట్లపెనుమర్రు పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాలలో ఆదివారం ప్రదర్శించారు. దీన్ని సంస్కృతాంధ్ర అధ్యక్షులు డాక్టర్ పి.వి.యన్.కృష్ణ రచించి, దర్శకత్వం వహించారు. సంస్కార భారతి(ఆంధ్రప్రదేశ్), పింగళి వెంకయ్య రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ల సంయుక్త నిర్వహణలో డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్యమండలి వారు ప్రదర్శించారు. కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాక్షేత్ర మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి శిష్యబృందం వేదాంతం వెంగ్రిప్రసాద్, దేవిభవాని, సుందరాంజలి కూచిపూడి నాట్యాంశాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

సంస్కృతి పరిరక్షకులు కూటమి కృష్ణ: కళ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా అన్నారు. నాటకం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భట్లపెనుమర్రు గ్రామంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జన్మించారని, కూచిపూడి నాట్య ఆద్యుడు శ్రీసిద్ధేంద్రయోగి జన్మస్థలం కూచిపూడికాగా, పవిత్ర క్షేత్రయ్య జన్మస్థలం మొవ్వ గ్రామం అని చెప్పారు. సీనియర్ (గ్రూప్స్) నేత చలసాని బలరామ్ ఎంతో విలువైన భూమిని సైనికస్కూలుకు అంకితం చేయటం దాతృత్వానికి, సేవకు మారుపేరు అని ప్రశంసించారు. స్వర్ణాంధ్ర మిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సి.వి.ఎల్.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, ట్రస్ట్ ఛైర్మన్ చలసాని బలరామ్ చైర్మన్ అనిల్‌బాబు, ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ టి.ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు ఘంటసాలలో 'రైతన్నా మీకోసం'

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి తెలిపారు. రబీలో 'మినుము పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు'పై రైతులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఇతర అధికార, అనధికార ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

పెనమలూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తన రిటైల్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. పోరంకిలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయ ప్రారంభం, సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో సంఘ అధ్యక్షుడిగా కొత్తపల్లి విజయకుమార్ తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొల్లిపర నాగపోతరాజు, గుడిమెట్ల లక్ష్మణరావు, కార్యదర్శిగా భీమవరపు శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రతినిధులుగా ధూళిపాళ్ల రమేష్, దివ్వెల వెంకటేశ్వరరావు, చిలుకూరి క్రాంతికిరణ్, అబ్బూరి శ్రీనివాసరావు మరికొందరు ఎన్నిక ఏకగ్రీవమైంది. వీరితో ఏపీ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం పదవీకాలం మూడేళ్లు ఉంటుందని సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి విజయకుమార్ తెలిపారు.

బీచ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు


సాయి గణేశ్ (పాతచిత్రం)

మొగల్తూరు: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణాజిల్లా తేలప్రోలు వద్ద ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆయన ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. గణేశ్ సముద్రంలో స్నానానికి వెళ్లి అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. మెరైన్ సిబ్బంది, పోలీసులు, ఆ యువకుడి మిత్రులు, బంధువులు తీరంలో గాలింపు చేపట్టారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శబరిమల వెళ్లే భక్తులకు జాగ్రత్తలు తప్పనిసరి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా నుంచి శబరిమల బయలుదేరి వెళ్లే అయ్యప్ప భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. ఎం.సుహాసిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పంబానది, చుట్టుపక్కల సరస్సుల్లో జలాశయాల్లో స్నానము ఆచరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నిరంతరం చేతులు శుభ్రం చేసుకోవాలని, కాచిన నీటిని తాగాలని పేర్కొన్నారు.

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలంలోని రావికంపాడు సమీపంలో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. పొలాల మధ్య పంట కాలువలో మహిళ మృతదేహం ఉందని ఆదివారం ఉదయం స్థానికులు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. 30 ఏళ్ల లోపు మహిళ సగం వస్త్రాలతో మొహంపై గాయాలతో చేతిపై ప్రణయ్ అనే టాటూ ఉండడాన్ని గుర్తించారు. మృతదేహం లభ్యమైన తీరును బట్టి హత్యగా నిర్ధారించారు. ఏ గ్రామానికి చెందిన మహిళో తెలుసుకునేందుకు ఆనవాళ్లను పోలీస్ సిబ్బందికి పంపారు. జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన మహిళై ఉంటుందన్న అంచనాలతో ఆరా తీస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

చదివింది చెబుతూ.. చెప్పేది వింటూ..

వ్యవసాయంపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణ

తాడేపల్లిలో గ్రామ చిత్రపటాన్ని గీసి రైతులకు వివరిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, శాస్త్రవేత్తలు

ఘంటసాల, న్యూస్‌టుడే

పాఠ్యాంశ విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో వివరిస్తూ, ఉత్తమ రైతుల నుంచి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పొందడంలో భాగంగా 'గ్రామీణ అవగాహన కృషి అనుభవం' (రావెప్) కార్యక్రమం అమలవుతోంది. దీనిలో భాగంగా అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాలలోని 3 మండలాలలో 3 నెలల పాటు శిక్షణ పొందేందుకు రెండు నెలల క్రితం 33 మంది బాపట్ల వ్యవసాయ కళాశాల ఏజీ బీఎస్సీ విద్యార్థినులు విచ్చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి పర్యవేక్షణలో ఘంటసాల, మొవ్వ, మోపిదేవి మండలంలోని గ్రామాలలోని రైతులకు పలు వ్యవసాయక అంశాలపై వారు శిక్షణ ఇస్తున్నారు. ఆయా గ్రామా భౌగోళిక పరిస్థితుల ఆధారంగా గ్రామాల చిత్రపటాలను గీసి శాస్త్రవేత్తల సూచనలతో అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, పొలంలో ఒక ఆదర్శ రైతు అనుసరించే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహననూ పెంచుకుంటున్నారు.

రైతుల సమన్వయంతో వ్యవసాయ క్షేత్రంలో పలు అంశాలను నేర్చుకోవడంతో విజ్ఞానం మరింత మెరుగైంది. అన్నదాతలు భూమిని చదును చేయడం దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు పడే కష్టం గురించి తెలిసింది. - **జ్యోత్స్నవి, విద్యార్థిని, ఘంటసాల**

'రావెప్' కార్యక్రమం వ్యవసాయ విద్యలో ముఖ్యమైన భాగం. తగిన మోతాదులో రసాయన మందుల వాడకం, నీటి నిర్వహణ, మట్టి నమూనా ఫలితాలను అనుసరించి వ్యవసాయ సలహాదారుగా, పరిశోధకులుగా వెళ్లడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతోంది. - **అశ్విని, విద్యార్థిని, తాడేపల్లి**

ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఇచ్చే పలు శిక్షణల పట్ల అవగాహన కలిగింది. షేడ్‌నెట్‌లో మొక్కల పెంపకం, పశు పోషణ, కోళ్ల చేపల పెంపకం పద్ధతులు తెలిసాయి. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను గ్రహించాను. గ్రామీణ కృషి అనుభవం ఒక ప్రయోగాత్మక కార్యక్రమంగా క్షేత్రస్థాయిలో ఎంతగానో ఉపయోగపడింది. - **గాయత్రి, విద్యార్థిని, శ్రీకాకుళం**

సత్యసాయి మార్గంతో సమాజంలో శాంతి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: సత్యసాయి మార్గాన్ని అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి పరిడవిల్లుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సత్యసాయి శత జయంతి జిల్లా స్థాయి వేడుకలను ఆదివారం సాయంత్రం మచిలీపట్నంలోని ఈడేపల్లి సత్యసాయి సేవా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రితోపాటు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ, కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి సంస్థలు అందిస్తున్న సేవలను మంత్రి కొనియాడారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన మహనీయుడు సత్యసాయి అని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాబా తన ఆధ్యాత్మిక బోధనల ద్వారా సమాజానికి శాంతి సందేశాన్ని అందించారని వివరించారు. ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాల అనంతరం సత్యసాయి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీదేవి, ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ పలువురు అధికారులు, సత్యసాయి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద మహిళకు నిత్యావసర సరకులు అందిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల, కలెక్టర్, వీసీ తదితరులు

బాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

వేడుకగా సాయిబాబా శతజయంతి

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. బాబా బోధనలు సమాజంలో శాంతి, సేవాభావం, మానవతా విలువలను పెంపొందింపజేశాయన్నారు. బాబాకు ప్రీతిపాత్రమైన ప్రేమ, కరుణ, నిస్వార్థ సేవలను నిరంతరం ప్రజాసేవలో తలమునకలుగా ఉండే పోలీసులు ఆచరించాలని సూచించారు.

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు.నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.
అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు
అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.
న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:
ఉంగుటూరు, నందివాడ, గన్నవరం టౌన్
సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.
గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.
న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా–521 104

అదుపు తప్పిన ట్రావెల్స్ బస్సు

గన్నవరం శివారులో ఘటన

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పట్టణ శివారులో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి అమలాపురం వెళ్లే ఏఆర్ 20ఈ 3344 నంబరు గల గంగా ట్రావెల్స్ బస్సు ఆదివారం తెల్లవారుజామున గన్నవరానికి చేరుకుంది. గన్నవరం పట్టణం దాటిన తర్వాత ఆర్టీఐ మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న లారీని ట్రావెల్స్ బస్సు ఒక పక్కన బలంగా ఢీకొట్టి.. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పంట బోదెల్లోకి బస్సు దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ప్రయాణికులను ఇతర బస్సుల్లో గమ్యస్థానాలకు తరలించారు.

పంట బోదెల్లోకి దూసుకెళ్లిందిలా..

రామరత్నం దాతృత్వం చిరస్మరణీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: రామరత్నం దాతృత్వం చిరస్మరణీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. నగరంలోని చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధుల సేవా ఆశ్రమ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం గుత్తికొండ రామరత్నం వర్ధంతి సభ నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'రామరత్నంలో దాతృత్వంతో పాటు భక్తితత్వం కూడా ఎక్కువగా ఉండేది. ఆమె పలు వ్యాపారసంస్థల ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించారు. సాహితీ కార్యక్రమాలకు ఎంతగానో చేయూత అందించేవారు. ఆమె పేరిట ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం' అని పేర్కొన్నారు. సాహితీవేత్త డా.పూర్ణచంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. గుత్తికొండ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించడంతో పాటు రామరత్నం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక, సాహితీవేత్త ఎంసీదాస్(విజయవాడ), సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్(ఉయ్యూరు), స్త్రీవాద కవయిత్రి మందరపు హైమావతి(విజయవాడ), ప్రసంగ ప్రజ్ఞానిధి, విమర్శకులు, డా. గుమ్మా సాంబశివరావు(విజయవాడ), నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ(ఒంగోలు), విద్యావేత్త దామెర్ల నరసింహారావు(మైలవరం), భావతరంగిణి సంస్థ నిర్వాహకులు, భవిష్య(మచిలీపట్నం)లకు గుత్తికొండ రామరత్నం ఛారిటబుల్ ట్రస్ట్ జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు సుశీల, వివిధ సంస్థల ప్రతినిధులు పోతురాజు, గురజాడ రాజరాజేశ్వరి, గుత్తికొండ చినసుబ్బారావు, వెంకటరాములు, అంజనీకుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు తదితరులు

పోక్సో కేసులో నిందితుల అరెస్టు

గూడూరు, న్యూస్‌టుడే: ఓ బాలికను బలవంతంగా తీసుకెళ్లిన కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగేంద్రప్రసాద్ ఆదివారం సాయంత్రం గూడూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గూడూరు మండలం తరకటూరుకు చెందిన బాలిక మచిలీపట్నంలో ఇంటర్ చదువుతోంది. ఆమె ఈ నెల 17వ తేదీన కళాశాల నుంచి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద కొంతకాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన నవీన్, అతని స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై బలవంతంగా తీసుకెళ్లాడు. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ సీహెచ్ రాజా పర్యవేక్షణలో రెండు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుడివాడలో బాలిక ఆచూకీ కనుగొన్నారు. ఈ నెల 22వ తేదీ రాత్రి ఈ కేసుకు సంబంధించి పోక్సో, ఇతర సెక్షన్ల కింద నిందితులుగా ఉన్న నవీన్ అతని స్నేహితులు తరుణ్, కృష్ణవంశీ, కార్తీక్‌సాయిలను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితులు అందరినీ రిమాండ్‌కు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ట్రైనీ ఎస్సై షేక్ బషీరాతోపాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: లారీ డ్రైవర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన బాపులపాడు మండలం పెరికీడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన కొత్తూరి ప్రసాద్‌బాబు(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శనివారం బాపులపాడు మండలంలోని ఓ పరిశ్రమ నుంచి సరకు తీసుకుని అరిపిరాలలో చేపల చెరువు వద్ద దింపారు. ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో పెరికీడులో జాతీయ రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద లారీ నిలిపేశారు. గమనించిన స్థానికులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ప్రసాద్‌బాబు సీట్లో మృతి చెంది ఉన్నాడు. గుండె పోటుతో మృతి చెందాడా? అనారోగ్య కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

VJA సిద్ధార్థనగర్ మోడరన్ ఫుడ్స్ దగ్గర HRT రెసిడెన్సీలో 2BHK ఫ్లాట్ 1078 Sft E/F గ్రౌండ్ ఫ్లోర్ కప్‌బోర్డ్స్ కారుపార్కింగ్‌తో అమ్మకానికి కలదు ✆ 94932 45833, 92464 72339.

HOUSE FOR SALE

విజయవాడ బందరురోడ్డు దగ్గరలో ★ తులసీనగర్ 3వ లైన్‌లో 123 చ.గ.ల్లో G+1 తూర్పు ఫేస్ బిల్డింగ్ అమ్మకం. ✆ 82477 82459.

ఇల్లు అమ్మబడును
విజయవాడ, 1 టౌన్ శ్రీనివాస మహల్ వెనుక రోడ్‌లో, రోడ్‌కి ఆనుకొని, 221 గజాల G+1 (8 పోర్షన్‌ల ఇల్లు) అమ్మబడును. No Brokers.
✆ 93467 20854

JOBS

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

Req. Fresh/Exp any (ITI/ B.Tech/ Dip) Production. MCA. MBA. Manager. M.Sc., B.Sc., Chemist. B.Com., BA. Sal: 94000. gkltd. ✆ 78428 36844.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్ ఎగ్జిక్యూటివ్స్. Q: 10th/డిగ్రీ రిటైర్డ్ బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెటింగ్. నోటార్గెట్. ✆ 90524 70111.

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆ 70320 60786

ప్రముఖ ఆర్కిటెక్ ఆఫీసులో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవం ఉన్న Male కావలెను. ✆ 93973 41745

విజయవాడలో ప్రముఖ 3 స్టార్ హోటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ మేనేజర్ మరియు యువతి యువకులు కావలెను. ✆ 91001 17227.

డెలివరి బాయ్స్ ★ ఆఫీసు బాయ్స్ మరియు గర్ల్స్ విజయవాడ నందు పని చేయుటకు కావలెను. అనుభవం బట్టి జీతం ఇవ్వబడును. ✆ 92466 33459

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

కరుణించవయ్యా.. కరిమల వాసా

పడిపూజ మహోత్సవంలో మంత్రి కొల్లు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నగరంలోని కోనేరు సెంటరులో దివ్య మహాపడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా 18 మెట్లపొటాల అయ్యప్పస్వామి, పలు పుర దేవతామూర్తుల చిత్రాలతో ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. లోక కల్యాణార్థం కేరళ సంప్రదాయ పూజా విధానంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అయ్యప్ప దీక్షాపరులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. కమిటీ ప్రతినిధులు మోటమర్రి బాబాప్రసాద్, దేసు వెంకటసుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, కె.గోపాలకృష్ణ, కాంతారావు, కాట్రగడ్డ రమేష్ తదితరులు పర్యవేక్షించారు.

ధర వరలు

టమాట 51, వంగ 50, బెండ 50, పచ్చిమిర్చి 44, కాకర 48, క్యాబేజీ 30, క్యారెట్ 66, దొండ 46, బంగాళదుంప 33, ఉల్లిపాయలు 24, గోరు చిక్కుడు 60, దోస 36, సొర 25, అరటికాయ 7, చిక్కుళ్లు 90, బీర 36, చామదుంప 26, మునగ 14/12, కంద 44, బీట్‌రూట్ 48, కీరదోస 35, బీన్స్ 65, క్యాప్సికం 75, అలసందలు 60, చిలకడదుంప 40, కొత్తిమీర 22/11, పుదీనా 20/5 సోమవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిజపల్లి 9182361295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

సినిమాలు

రేవతి: శివ
మినీరేవతి: ప్రేమంటే
సిరికృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి
సిరివెంకట్: 12ఏ రైల్వేకాలనీ

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండటంతో నగరపాలకసంస్థ అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే డివిజన్ల వారీగా సచివాలయ ఉద్యోగులతో ఆస్తి పన్ను వసూళ్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతోపాటు కమిషనరేట్ నుంచి ప్రత్యేక నిఘా ఉంచారు. దీంట్లో భాగంగా నిర్దేశించిన రోజుల్లో ఎలాంటి వసూళ్లు చేయని డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ కావడం నగరపాలకసంస్థ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

లక్ష్యం చేరేలా కార్యాచరణ

నగరంలోని 50 డివిజన్ల పరిధిలో అన్నీ కలిపి దాదాపు 53 వేల వరకు అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. పన్నులు వసూళ్లకు గానూ అధికారులు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు పన్ను చెల్లింపు కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎక్కువగా పెండింగ్‌లో ఉండటంతో ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి నిర్దేశించిన మేర లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ వేగవంతం చేశారు. ఇంత చేసినా బకాయిలు మాత్రం ఆశించిన మేర వసూలు కావడం లేదు. నగరపాలకసంస్థ పరిధిలో పాత బకాయిలతో కలిపి మొత్తం దాదాపు రూ.38 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం రూ.15 కోట్లకుపైగా మాత్రమే వసూలయ్యాయి. కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలతోపాటు నగరంలోని పలు విభాగాల నుంచి రూ.కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయి. సాధ్యమైనంతవరకు ఈ బకాయిలను కూడా రాబట్టాలని నిర్ణయించారు.

నగరపాలకసంస్థ కార్యాలయం

13 మందికి షోకాజ్ నోటీసులు..

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి 20 వరకు జరిగిన పన్నులు వసూళ్ల ప్రక్రియను పరిశీలించింది. మచిలీపట్నం నగరపాలకసంస్థ పరిధిలో 13 సచివాలయాల్లో నిర్దేశించిన రోజుల్లో ఒక్క అసెస్‌మెంట్ నుంచి కూడా పన్ను వసూలు చేయలేదని తేలింది. నివేదికలో సున్నా ఉండటంతో ఆయా సచివాలయాల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల నుంచి వివరణ తీసుకోవాలని పుర పరిపాలనశాఖ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో వారందరికీ నగరపాలకసంస్థ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం సీసీఏ రూల్స్ 1991 ప్రకారం ఉద్యోగ ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధమని, కావున ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోరాదో లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సృజనాత్మకత చాటేందుకు పోటీలు దోహదం

విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పోటీల్లో విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకునేందుకు పోటీలు దోహదపడతాయని నగరంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ హెచ్ఎం కె.దివ్య అన్నారు. ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి.అవంతి (10వ తరగతి), సిహెచ్ సాయిసంతోష్ (9వ తరగతి), ఎండీ అమీన్ (9వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు హెచ్ఎం, ఉపాధ్యాయులు కె.నాగలక్ష్మి, కె.మోహనకుమారి తదితరులు బహుమతులు అందజేశారు. ఈనాడు సంస్థలు విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడంతోపాటు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. కరస్పాండెంట్ వీవీ సుందరరామ్ విజేతలను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

★ నగరంలోని పంచాయతీరాజ్ కాలనీలో రహదారి పక్కన వేసిన చెత్త తొలగించడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులను పంపి తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని జవ్వారుపేట సమీపంలోని ప్రధాన రహదారి పక్కన వేసిన చెట్లకొమ్మలు వ్యర్థాలు తొలగించడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

26న చేపట్టే నిరసనను విజయవంతం చేయండి

సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు): కేంద్ర ప్రభుత్వం మోసపూరితంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుట్టాయిపేటలోని జ్యోతిబాపూలే భవనం కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం నాలుగు కార్మిక చట్టాలను అమల్లోకి తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల విషయంలో తన వివక్షతను చాటుకుందని మండిపడ్డారు. లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకునే వరకూ పోరాటం ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ నెల 26న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా కార్మికుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల నాయకులు బూర సుబ్రమణ్యం, చిరువోలు జయరావు, లింగం ఫిలిప్, శర్మ, యూనస్, హుస్సేన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులు పరిరక్షించాలి

ప్రజాచైతన్య యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శంకర్‌నాయక్, నాయకులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: గిరిజనుల హక్కులు పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. నగరంలోని రహదారులు, భవనాలశాఖ అతిథిగృహంలో ఆదివారం సంఘ నాయకులతో ఆయన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల అవస్థలు మారలేదన్నారు. నేటికీ వేలాది మంది గిరిజనులకు రేషన్, ఆధార్ కార్డులు లేవన్నారు. ఫలితంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వారికి దక్కడం లేదని వాపోయారు. గిరిజనులను మన్యం ప్రాంతాలకు పరిమితం చేయడం వల్ల మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి అన్యాయం జరుగుతోందన్నారు. ఏపీ ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం ఖర్చుచేసే కోట్లాది రూపాయలు దారిమళ్లిపోతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయకపోవడంతో గిరిజనుల హక్కుల గురించి చట్టసభల్లో మాట్లాడే వారే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ, రాజకీయ రిజర్వేషన్లు తదితర అంశాల కోసం తలపెట్టిన గిరిజన ప్రజా చైతన్యయాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షులు భూక్యా షమీర్‌నాయక్, యువజన నాయకులు హనుమంతునాయక్, ఏకసిరి వెంకటేశ్వరరావు, ఇతర సంఘ నాయకులు పాల్గొని యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు.

శ్రీనివాసాచార్యకు ఐఎంఏ అవార్డు

అవార్డు అందుకుంటున్న డా.శ్రీనివాసాచార్య

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: నగరానికి చెందిన వైద్యులు బృందావనం శ్రీనివాసాచార్య ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్టేట్ అవార్డు దక్కించుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆదివారం ఐఎంఏ రాష్ట్ర 67వ వార్షిక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డా. నందకిషోర్ చేతుల మీదుగా వివిధ ప్రజారోగ్య కార్యక్రమాలు నిర్వహించినందుకు ఐఎంఏ స్టేట్ అవార్డుతో పాటు ఐఎంఏ మచిలీపట్నం శాఖకు ఇచ్చిన అవార్డును శ్రీనివాసాచార్య స్వీకరించారు. నూతన రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన డా.బాలరాజు, ఇతర వైద్యులు శ్రీనివాసాచార్యను అభినందించారు.

ఐకమత్యంగా పోరాడుదాం

పొట్టి శ్రీరాములు, వాసవీ అమ్మవారి చిత్రపటాల వద్ద ఐక్యత చాటుతున్న ఆర్యవైశ్యులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: అందరూ కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు. మండల కేంద్రం బంటుమిల్లిలోని కె కన్వెన్షన్‌లో ఆదివారం ఆర్యవైశ్య యువ శక్తి పేరుతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగనాయకులు గుప్త, కొప్పర్తి సుబ్బారావు, జులూరి సంపత్, కొల్లా చంద్రశేఖర్, చెక్కా చందు, సబ్బిశెట్టి రాజా, వక్కలగడ్డ కరుణ్ కుమార్, పూర అరవింద్, తమ్మన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంతీదేవి మహోత్సవం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఆముదాలపల్లిలో కుంతీదేవి (గొంతెమ్మ పండగ) మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు వారి సంప్రదాయం ప్రకారం పూజ కార్యక్రమాలు జరిపారు. ఈదా నాంచారయ్య, దాసరి కోటి తిరుపతి, నాగబాబు, రాజబాబు, దాసరి రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

27న గోశాల ప్రారంభం

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

పెడన, న్యూస్‌టుడే: భాజపాకు అనుబంధమైన హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెడనలో ఏర్పాటు చేసిన గోశాలను ఈ నెల 27న ఉదయం ప్రారంభిస్తున్నట్లు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయం పక్కన గోశాల రూపుదిద్దుకుందని తెలిపారు. ఎమ్మెల్యేను ఆదివారం ఆయన నివాసంలో కలిసిన ఐక్యవేదిక ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడితోపాటు అగస్త్యేశ్వరస్వామి ఆలయ అర్చకుడు గూడూరి అగస్త్యేశ్వర శర్మ, తోట హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

మల్లవోలు సమీపంలో..

మండల పరిధిలోని రామరాజుపాలెం అడ్డరోడ్డు నుంచి మల్లవోలుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, పోలవరం, రామన్నపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు వెంబడే రాకపోకలు సాగిస్తారు. కనీసం సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం, గతంలో ఉన్నవి పాడైపోయినా పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు

పరిశుభ్రత కరవు.. రోగాలకు నెలవు..

ప్రజలు బాధ్యత మరచి వ్యవహరిస్తే ఎలా ఉంటుందో మచిలీపట్నంలోని బ్రహ్మపురాన్ని సందర్శిస్తే తెలుస్తుంది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉండే ఈ వీధిలో అపరిశుభ్రం తాండవిస్తోంది. వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయడంతో దుర్వాసన వస్తుంది. మున్సిపాలిటీ సిబ్బంది రెండురోజులైనా చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, భాస్కరపురం(మచిలీపట్నం)

పడిపోతున్నా చూడరు.. ప్రమాదమన్నా వినరూ..

నగరంలో జిల్లా పరిషత్ కూడలిలో సిగ్నల్ లైట్ స్తంభం ఓ పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారింది. కొంతకాలంగా ఇలాగే ఉంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాలిపోయినప్పుడల్లా దానిని సరిచేసి వెళ్లిపోతున్నారని ఇలా తరుచూ చేయడం వల్ల స్తంభం అడుగుభాగం విరిగిపోయేలా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇలాగే వదిలేస్తే ఏదో ఒకరోజు పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రద్దీగా ఉండే రహదారి కావడంతో అధికారులు చొరవతీసుకుని ప్రమాదం జరగకముందే తొలగించడం అవకాశం ఉంటే కొత్తది ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

'చెత్త' కష్టాలు

నగరంలోని జిల్లా కోర్టు సెంటర్ నుంచి నాయర్ బడ్డీ సెంటరుకు వెళ్లే దారిలోని పోలీసు కల్యాణ మండపం సమీపంలో రహదారి పక్కన చెత్త, వ్యర్థాలు పేరుకున్నాయి. ఎప్పటి నుంచో అలాగే ఉంటున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో క్రమేపీ రోడ్డుపైకి వస్తున్నాయి దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ఉత్సవాల వేలంలో ప్రతిష్టంభన

వరుసగా రెండోసారి వాయిదా

పెడన, న్యూస్‌టుడే: డిసెంబరు 4 నుంచి 14 వరకు జరగనున్న పెడన గ్రామదేవత పైడమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇందులో ముందస్తుగా భక్తుల నుంచి రుసుములను వసూలు చేసే హక్కులకు వేలంపాటలు నిర్వహిస్తారు. అయితే ఇందులో ప్రధాన ఆలయం వెలుపల స్టాళ్ల ఏర్పాటు హక్కుల వేలం రెండు సార్లుగా వాయిదా పడుతూ వస్తోంది. గతేడాది ఈ మొత్తం రూ.15.20 లక్షలు ఆదాయం దేవాదాయ శాఖకు రాగా.. ఈ ఏడాది పాటలకు నలుగురు గుత్తేదారులు వచ్చినా అంత మొత్తానికి ముందుకు రాలేదు. అప్‌సెట్ ధర కంటే తక్కువగా రూ.13 లక్షలకు పాట పెరగక పోవడంతో అధికారులు శనివారం రెండోసారి వాయిదా వేశారు. ఈ నెల 26న తిరిగి నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణారావు చెప్పారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

ప్రసాదానికి అత్యధికంగా: లడ్డూ ప్రసాద విక్రయానికి నిర్వహించిన వేలంలో స్థానికుడు రౌతుల పైడిరాజు అత్యధికంగా రూ.1.02 లక్షలకు హక్కులను పొందారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రెట్టింపు ఆదాయం ఈ విభాగం నుంచి వచ్చింది. అమ్మవారికి సమర్పించే చీరలకు రూ.1,52,500, ప్రభలను ఆలయం చుట్టూ తిప్పినందుకు భక్తులు చెల్లించాల్సిన రుసుములకు రూ.72 వేలు వచ్చినట్లు ఈవో చెప్పారు.

వంతెన నిర్మించి.. కష్టాలు తీర్చండి..!

కరఅగ్రహారం రహదారిలో మురుగు డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన పక్క భాగం బీటలువారడంతో పాటు అడుగుభాగంలో ఇనుపచువ్వలు వేలాడుతున్నాయి. 4 వేల మంది జనాభా కలిగిన గ్రామానికి ఇదే ప్రధానమార్గం. వంతెన కూలితే కరఅగ్రహారం ప్రజలు చిలకలపూడి, నవీన్‌మిట్టల్ కాలనీ, చినకరఅగ్రహారం మీదుగా ప్రయాణించి గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. రహదారి కూడా గోతులతో అధ్వానంగా మారింది. రహదారితో పాటు నూతన వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కరఅగ్రహారం (మచిలీపట్నం రూరల్)

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

అలంకరణలో స్వామివారు

మచిలీపట్నం(గొడుగుపేట): నగరంలోని అయ్యప్ప ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెమ్మనగిరిపేట అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా క్రతువులు నిర్వహించగా భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నసమారాధనలు... సత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో నారాయణ సేవ చేశారు. రేవతీ సెంటరు గంగానమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోనేరు సెంటరులో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బంటుమిల్లి: మండల కేంద్రం బంటుమిల్లిలోని గుడివాడ రోడ్డులో ఆదివారం భవాని, శివ, అయ్యప్ప స్వామి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిల భవనంతో భయం.. భయం..

నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం పక్కనే ఉన్న శిథిల భవనంతో స్థానికులతో పాటు ఉద్యోగులు భయపడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరి.. కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతోపాటు భవనం చుట్టూ పొదలు వ్యాపించి దట్టంగా అల్లుకున్నాయి. వాటి నుంచి అప్పుడప్పుడు విషసర్పాలు వస్తున్నాయని.. ప్రమాదకరంగా ఉన్న ఆ భవనాన్ని తొలగించాలని అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా దానిని తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల, బాలికల అంతర్ జిల్లాల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం బాల, బాలికల విభాగాల్లో 30 లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. వాటిలో బాలుర విభాగంలో శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కృష్ణా, కడప, అనంతపురం జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. వీటిలో అనంతపురం-ప్రకాశం, కడప-నెల్లూరు జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ పోటీలు నిర్వహించగా ప్రకాశం, నెల్లూరు జట్లు విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించాయి. బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, విజయనగరం, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కృష్ణా, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. వీటిలో విజయనగరం-ప్రకాశం, అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ పోటీలు నిర్వహించగా ప్రకాశం, అనంతపురం జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మరికొన్ని జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ పోటీలు జరుగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తి అరుణ, ప్రతినిధులు అడపా రామకృష్ణ, చిలుకోటి రాజేష్, సింహాద్రి గంగాధర్‌లతోపాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో క్రీడా ప్రాంగణం కోలాహలంగా మారింది.

క్యూలైన్లలో బారులుదీరి...

స్వామి సేవలో తరించిన భక్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి ఆదివారం దాదాపు 20వేల మంది వచ్చారు. తలనీలాల మొక్కుబడులు సమర్పించి స్వామి పూజలలో పాల్గొన్నారు. వివిధ సేవల రూపేణా రూ.8.95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

సాంబారు గిన్నెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు

పెదపారుపూడి: వేడి సాంబారు గిన్నెలో పడి చిన్నారి తీవ్ర గాయాలైన సంఘటన వానపాముల గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం నాలుగేళ్ల చిన్నారి గ్రామంలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లింది. అక్కడ తోటి చిన్నారులతో ఆడుకుంటూ పక్కనే ఉన్న వేడి సాంబారు గిన్నెలో పడిపోయింది. చిన్నారి కేకలు వేయడంతో పక్కనే ఉన్నవారు బయటకు తీసి గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకుని వెళ్లినట్లు తెలిసింది.

రహదారికి మరమ్మతులు చేయరూ..

మండల కేంద్రం బంటుమిల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా మురుగు కాలువపై ఉన్న రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పటినుంచో సమస్య ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పరిష్కారానికి నోచుకోలేదు. రోజు అధిక సంఖ్యలో ఈ దారిపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిని సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి.

నేడు ఉచితంగా బీఎండీ పరీక్షలు

చల్లపల్లి: చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో 50 సంవత్సరాలు దాటిన వారిలో వచ్చే ఎముకల బలహీనత వ్యాధిని గుర్తించేందుకు బోన్ మినరల్స్ డెన్సిటీ (బీఎండీ) పరీక్షలను సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచితంగా నిర్వహిస్తారని సీఆర్ ట్రస్ట్ ప్రతినిధి అడ్డాడ ప్రసాద్‌బాబు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి

గన్నవరం గ్రామీణం : అమెరికా ఆధిపత్య ధోరణి వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం గన్నవరం శివారు మర్లపాలెంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దేశంతో పాటు ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని.. ఆ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం నిలువరించాలని చెప్పారు. ప్రత్యేకించి రాష్ట్రంలోని ఆక్వా ఉత్పత్తులతో పాటు వ్యవసాయ రంగంపై సుంకాల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, సురగాని సాంబశివరావు, నాగేశ్వరావు, బాబావలి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

రాఘవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొనకళ్ల

ఉప్పులూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఆర్టీసీ సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు చెప్పారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జంపాన రాఘవయ్య ప్రథమ వర్ధంతి సభ ఉప్పులూరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడిన రెండు రాష్ట్రాల్లోని లక్షలాది మందికి జీవనోపాధి కల్పించేందుకు రాఘవయ్య నిర్విరామ కృషిచేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు నిబద్ధతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా రాఘవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ సొంఠి శివరాం ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొండవీటి శివయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు పడవల మధుసూదనరావు, కల్లుగీత కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు పేరం అదివిష్ణు, స్థానిక ప్రతినిధులు బొర్రా వెంకట్, జంపాన వీరాస్వామి, చలసాని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ పెనమలూరు సుగాలీకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి అహ్మద్ స్పందించి ఎనిమిది కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. ★ పెనమలూరు ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ప్రాంగణాలు అపరిశుభ్రంగా ఉన్నాయంటూ పలు గ్రామాల ప్రజలు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి అహ్మద్ స్పందించి.. శుభ్రం చేయించారు. ★ గంగూరు ఈఎస్ఐ కాలువ కట్టపై వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి ఆరు కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. ★ గంగూరు ప్రధాన గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, డ్రెయిన్లలో పూడిక తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు. ★ పెదపులిపాక-యనమలకుదురు చిన్న కట్ట రహదారి వెంట వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ప్రయాణికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పెదపులిపాక గ్రామకార్యదర్శి వెంకటరత్నం స్పందించి శుభ్రం చేయించారు. –పెనమలూరు, న్యూస్‌టుడే

★ కానూరు వినాయకనగర్‌లో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ షేక్ నజీర్ స్పందించి సమస్య పరిష్కరించారు. ★ పోరంకి లక్ష్మీపురం కాలనీలో మురుగు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సుధాకర్ స్పందించి పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. ★ యనమలకుదురు లాకుల సెంటర్, ఇందిరానగర్-2 ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ ఈఈ భూషణం స్పందించి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

- కానూరు, పోరంకి, యనమలకుదురు, న్యూస్‌టుడే

శివారు గ్రామాలపై మరింత నిఘా

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

పటమట స్టేషన్ శివారు ప్రాంతాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల వైపు పటమట పోలీసులు నిఘా మరింత పటిష్ఠం చేశారు. ఇప్పటికే కమిషనరేట్ నుంచి పటమట స్టేషన్‌కు కేటాయించిన డ్రోన్ కెమెరాతో శివారు ప్రాంతాలను పూర్తిగా జల్లెడ పడుతున్నారు. దీంతో పాటు ఒక రక్షక్ వాహనాన్ని ప్రత్యేకంగా శివారు ప్రాంతాలకు కేటాయించి తరచూ తిరుగుతుండడంతో ఆకతాయిలు ఆగడాలు కొంతమేర తగ్గాయి. స్టేషన్ పరిధిలో 5 గ్రామాల్లో గతంలో వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పటమట స్టేషన్ పరిధిలో ఇటీవల నలుగురు మావోయిస్టులు పట్టుబడడంతో పరిసర ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గత నాలుగు రోజుల వ్యవధిలో సుమారు 100 కెమెరాలు ఏర్పాటు చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో..

గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జాతీయ రహదారితో పాటు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఏర్పాటు చేసిన కెమెరాలు మాత్రం గ్రామాల్లో మారుమూల ప్రాంతాలు కవర్ అయ్యే విధంగా బిగించారు. రామవరప్పాడు రైల్వే స్టేషన్, రైవస్ కాలువ కట్ట, వేమినేని రామస్వామి వీధి, హనుమాన్ ఆలయం వీధి, ఏలూరు కాలువ కట్ట ప్రాంతాలు, ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాల వెనుక ప్రాంతం, నిడమానూరు రైల్వే స్టేషన్, నిడమానూరు-నారాయణపురం కాలనీ మధ్య ప్రాంతం, పోరంకి రోడ్డు, నిడమానూరు జడ్పీ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాలు, నిడమానూరు ఇండియన్ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ వెనుక ప్రాంతాలు, గూడవల్లిలోని రైల్వే పట్టాల పరిసర ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచారు.

ఎనికేపాడులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

పోలీస్ స్టేషన్ పరిధి:	పటమట
గ్రామాలు:	రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి
జనాభా:	సుమారు లక్ష మంది

అదనంగా ఏర్పాటు చేశాం..

పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు గ్రామాల వైపు నిఘా పెంచాం. సీపీ రాజశేఖరబాబు సూచనల మేరకు సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టడంతో పాటు పలు ప్రాంతాల్లో గతంలో ఉన్న 100 సీసీ కెమెరాలతో పాటు నూతనంగా 100 హై రిజ్యూలేషన్ కలిగిన కెమెరాలు ఏర్పాటు చేశాం. దీంతో పాటు ఈ ప్రాంతాల్లో ప్రతి రోజు డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఆకతాయిల అల్లర్లు గురించి సమాచారం అందించి సహకరించాలి. - **వల్లభనేని పవన్ కిషోర్, పటమట సీఐ**

రైతుల ఇబ్బందులపై ఆరా

తెన్నేరు (కంకిపాడు): తుపాను హెచ్చరిక నేపథ్యంలో రైతులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తెలుసుకునేందుకు భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ సూచనలతో స్థానిక నాయకులు ఉప్పులూరు, తెన్నేరు, మంతెన ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా తెన్నేరు పరిధిలోని పంట పొలంలో ధాన్యం బస్తాల వద్ద రైతు వేచి ఉండటాన్ని గమనించారు. లారీ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పగా.. విషయాన్ని తహసీల్దార్, మార్కెట్ యార్డ్ కార్యాలయాలకు తెలియజేశారు. అనంతరం అధికారులు లారీలను పంపడంతో ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. కార్యక్రమంలో నాయకులు దివి రోహిణీకుమార్, గుళ్లపల్లి శ్రీనివాసరావు, డొక్కు విష్ణువర్ధనరావు, ఇంటూరి నరేష్, పువ్వాడ కృష్ణమోహన్, కరుణకుమార్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గుత్తేదారుకు తీవ్ర గాయాలు

పెనమలూరు: బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకికి చెందిన గుత్తేదారు పాలడుగు సునీల్‌కుమార్.. ఈ నెల 21న ద్విచక్ర వాహనంపై నిడమానూరు నుంచి పోరంకి వెళుతూ.. పోరంకి కూడలి వద్ద బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు అతడిని ఢీకొట్టింది. దీంతో సునీల్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకుంఠలక్ష్మీపురంలో పారిశుద్ధ్యం దారుణంగా తయారైంది. శివారు గ్రామం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. కనీస స్థాయిలో కూడా పరిశుభ్రత చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారితో సహా, అంతర్గత రహదార్ల వెంట కూడా కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయ్యప్పదీక్షాధారులకు అన్నదానం ప్రారంభం

గండిగుంట (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం గండిగుంట అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప దీక్షాధారులకు 45 రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా మార్గం అనుసరణీయం

ఉయ్యూరు: సత్యసాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రవీణ్ తదితరులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్, కోడూరుపాడు సాయి మందిరాల్లో ఆదివారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. బాపులపాడులో ఉదయం సత్యసాయి పతాకాన్ని ఆవిష్కరించి, గోపూజ, వ్రతాలు చేశారు. అనంతరం మహానగర సంకీర్తన చేసి, యనమదల రామదాసు, కస్తూరి దంపతుల ఆధ్వర్యంలో కేక్ కోశారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు వి. పాపారావు, ఎస్. సుబాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె పాల్గొన్నారు. ★ కోడూరుపాడులో గోపూజ, పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు జెట్టం వెంకటేశ్వరరావు, గరికపాటి రామకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెనమలూరు: పెనమలూరు మండలంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక మందిరంలో సత్యసాయి నామ సంకీర్తన పారాయణం, నారాయణ సేవతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పూలు, పుష్పాలతో అలంకరించిన పల్లకీపై సత్యసాయిబాబా చిత్రపటాలను ఏర్పాటు చేసి పురవీధుల్లో పల్లకీ నిర్వహించారు. పెనమలూరు శ్రీసత్యసాయిబాబా సేవా సంస్థ కన్వీనర్ వి. మోహనరావు, ప్రతినిధులు ఉయ్యూరు రమణయ్య, యూర్ని పుల్లయ్య, లక్ష్మీప్రసన్న, చిన్నారులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వ్రతంలో పాల్గొన్న భక్తులు

కంకిపాడు: సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని కొణతనపాడు, కంకిపాడు, తెన్నేరు, ప్రొద్దుటూరు తదితర గ్రామాల్లో ఆదివారం నగర సంకీర్తన, భజనతో కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కంకిపాడు శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందికి అల్పాహారం అందజేశారు. సమితి ప్రతినిధులు కటికల రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కె. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉయ్యూరు గ్రామీణం: సత్యసాయిబాబా శతజయంతిని ఉయ్యూరు ఏఎంసీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్రపటానికి ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు పాల్గొన్నారు.

గ్రామోత్సవం, పల్లకీ సేవ

పల్లకీ సేవలో ప్రసాదంపాడు సమితి కన్వీనర్ గంగాధరరావు, భక్తులు

ప్రసాదంపాడు (రామవరప్పాడు), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా మార్గం అనుసరణీయమని ప్రసాదంపాడు సమితి కన్వీనర్ గంగాధర్‌రావు, బాల వికాస్ కో ఆర్డినేటర్ అనూరాధ అన్నారు. బాబా శత జయంతి ఉత్సవాలను ప్రసాదంపాడు ఆశ్రమం రోడ్డులోని మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి గ్రామోత్సవం, పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. భజన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌లు ఎత్తి వేయాలి'

నిరసనలో పాల్గొన్న సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ కార్మికుల హక్కులు హరిస్తుందని సీఐటీయూ గన్నవరం మండల కన్వీనర్ బెజవాడ తాతబ్బాయి పేర్కొన్నారు. మండల కేంద్రంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం లేబర్ కోడ్‌ల నకళ్లు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఈ కోడ్‌ల వల్ల కార్మికుల సంక్షేమానికి విఘాతం కలిగిస్తాయని చెప్పారు. ఈ ప్రతిపాదనలను సీఐటీయూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. లేబర్ కోడ్ లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ఎస్. సాంబశివరావు, నాగేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చివరికి గండం..

ఆందోళనలో కర్షకులు

కాకులపాడులో వరి పనల్ని కుప్పగా వేస్తున్న కూలీలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ వరి సవ్యంగా చేతికొస్తుందా, పంటకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సొమ్ము వస్తుందా? అన్న ప్రశ్నలు అన్నదాతలను ప్రస్తుతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, తుపాను హెచ్చరికలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈనెల 20 నుంచే వర్షాలు పడేందుకు అవకాశముందని వాతావరణ శాఖ సూచించినా, ఆదివారం సాయంత్రం వరకు వాన పడకపోవడంతో రైతులు కొంత ఉపశమనం పొందారు. ప్రస్తుతం వాతావరణం మారడంతో మళ్లీ ఆందోళన మొదలైంది. రెండ్రోజుల్లో అల్పపీడన ప్రభావం ఉంటుందనే సమాచారంతో భయాందోళనలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 70 శాతం వరకు కోతల ప్రక్రియ పూర్తి అవ్వగా.. అధికారుల సూచనల మేరకు కోతల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడింది. ఇప్పటికే కోతలు వారంతా పొలాల్లో ఉన్న వరి పనల్ని ఎండబెట్టుకుని కుప్పలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

అలా సేకరణ.. ఇలా చెల్లింపు!

పెనమలూరు నియోజకవర్గంలో వివరాలు	
ఖరీఫ్ వరి విస్తీర్ణం:	40వేల ఎకరాలు
ధాన్యం కొనుగోలు కేంద్రాలు:	20
మద్దతు ధర క్వింటాకు: ఏ–గ్రేడు:	2,389
సాధారణ రకం:	రూ.2,369

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే సంబంధిత రైతు ఖాతాలో సొమ్ము జమవుతోంది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో తేమ శాతం నిర్ధారణ, పంట నమోదు, ట్రక్‌షీట్ జారీ ప్రక్రియలు కూడా త్వరితగతిన పూర్తవుతున్నాయి.

ఒకేసారి పంట పక్వానికి రావడంతో.. : గత నాలుగేళ్లుగా కోత, నూర్పిడి యంత్రాలు పరిసర జిల్లాల నుంచి ఇక్కడకు వస్తుంటాయి. గత ఖరీఫ్‌తో పోల్చితే ప్రస్తుతం సగం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. డిమాండ్ పెరగడంతో గంటకు రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు.

లారీల్లో ధాన్యం మిల్లుకు తరలింపు

సాధారణ పరిస్థితుల్లో గంటన్నరలో ఎకరం నూర్పిడి పూర్తవుతుంది. మొంథా తుపాను, ఈదురుగాలికి 35 శాతం పొలాల్లోని పంట నేలకొరిగింది. ఇలా పడిన పొలాల్లో నూర్పిడికి రెండున్నర నుంచి మూడు గంటలు పడుతోంది. ఈ లెక్కన ఎకరానికి రైతుపై రూ.5వేల వరకు అదనపు భారం పడుతోంది. మరోవైపు తుపానుకు ముందు ఎకరానికి 40 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించారు. ఇటీవల వ్యవసాయ, గణాంక శాఖలు, బీమా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పంట దిగుబడి అంచనాలో 34 బస్తాలుగా నిర్ధారించారు.

మద్దతు ధరకు హామీ : ధాన్యంలో తేమ శాతం నిబంధనలకు లోబడి ఉండటంతో ప్రభుత్వ మద్దతు ధర లభిస్తోంది. ఆరబెట్టని (పచ్చి)ధాన్యంకు రైతు ఆశించిన రేటుకే బయట వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సేకరణ, ధర, సొమ్ము చెల్లింపు విషయాల్లో రైతులు ఇప్పటి వరకు సంతృప్తిగానే ఉన్నారు.

వసతి గృహం.. ఇదేమి నిర్వాకం..!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: దశాబ్దాల కిందట నిర్మించిన కానుమోలు ఎస్సీ బాలికల వసతిగృహం దుస్థితి వీడట్లేదు. భవనం శిథిల దశకు చేరుకుంది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా, పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదు. ఆవరణ మొత్తం లోతట్టుగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. తాగునీటి శుద్ధి కోసం గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో యూనిట్ ఏళ్ల కిందటే మూలకు చేరింది. దీంతో బయటి నుంచి నీరు తెచ్చుకోవడం అనివార్యమైంది. విద్యార్థినులు నిద్రించేందుకు ఇప్పటికీ మంచాల సదుపాయం కూడా లేదు. దీంతో నేలపై చాపలు పర్చుకునో, ప్రభుత్వం సరఫరా చేసే దుప్పట్లు వేసుకునో రోజులు వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యార్థినులు దుస్తులు శుభ్రం చేసుకునేందుకు నీటి వసతి, చేతులు శుభ్రం చేసే వాష్ ఏరియా, కిటికీలకు తలుపులు అమర్చడం వంటి పనులు నేటికీ కొలిక్కి రాలేదు. 38 మంది బాలికలున్న ఈ వసతి గృహం చుట్టూ ప్రహరీ ఉన్నా.. ప్రధాన ద్వారానికి ఉన్న ఇనుప గేటు సైతం పటిష్ఠంగా లేదు. ఊరికి దూరంగా, జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో ఆకతాయిలు చొరబడితే అడ్డుకునే ఏర్పాట్లు గానీ, సీసీ కెమేరా పర్యవేక్షణ గానీ లేకపోవడంతో బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు కృషి

పోరంకిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పోరంకి, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం పోరంకి బీజేఆర్ నగర్‌లో రూ.48.40 లక్షలతో, విశ్వసాయి అపార్టుమెంటు నుంచి రూ.29.70 లక్షలతో, సీఆర్‌డీఏ నిధులు రూ.1.60 కోట్లతో కృష్ణాపురంకాలనీలో నిర్మించిన రోడ్లను ఆయన ప్రారంభించారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం నిలిపివేత

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు మండలం పెదపులిపాక శ్రీనగర్‌కాలనీలో కరకట్ట పక్కన నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణాన్ని పంచాయతీ అధికారులు నిలిపివేయించారు. కరకట్ట సర్వీసు రహదారిని ఆక్రమించి నిర్మిస్తున్నారంటూ గ్రామస్థులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గ్రామ కార్యదర్శి తిరుమల వెంకటరత్నం ఆదివారం స్పందించి.. పనులను నిలిపివేయాలని భవన యజమానికి ఆదేశాలిచ్చారు. స్థలానికి సంబంధించిన పత్రాలు, నిర్మాణ అనుమతుల ప్రతులను వెంటనే అందజేయాలని సూచించారు. వాటి పరిశీలన జరిగే వరకూ పనులు చేపట్టవద్దని ఆదేశించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అభినందనీయం

పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న క్యాడెట్లు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, దేశరక్షణాంశాల్లో నిర్మాణాత్మక శిక్షణ పొందడమే కాకుండా సామాజికాంశాల్లోనూ ఎన్‌సీసీ క్యాడెట్లు ముఖ్య పాత్ర పోషించడం హర్షణీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త నూకల వెంకట సాంబశివరావు అన్నారు. స్థానిక ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ దినోత్సవంలో ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నివసించే పేదలు, వృద్ధులకు క్యాడెట్లు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేసీ వినయ్‌కుమార్, ప్రిన్సిపల్ బుచ్చిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి పి. శ్రీరామ్‌తేజ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు వేళాయె..!

ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ

కానూరు, పోరంకి, యనమలకుదురు, న్యూస్‌టుడే: బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) అమలుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ శనివారం ప్రారంభం కాగా.. మొదటి రోజు తాడిగడప పురపాలక పరిధిలో 23 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం నాలుగు సర్కిల్స్‌లో దాదాపుగా 2500 దాకా రావొచ్చని తద్వారా రూ.20 కోట్లపైనే రుసుము కింద ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2019కు ముందు పలుమార్లు బీపీఎస్ అమలైంది. తాడిగడప పురపాలక సంఘం ఏర్పాటై 60 నెలలు కావస్తోంది. గతంలో కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి గ్రామ పంచాయతీలుగా ఉండేవి. అప్పట్లో జరిగిన అక్రమ నిర్మాణాలకు రుసుము చెల్లింపు ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం కలగనుంది. వారంతా జీవో విడుదలైన నవంబరు 12 నుంచి 120 రోజుల లోపు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను అర్హత కలిగిన ఎల్‌టీపీల ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా..

ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన కట్టడాలకే పీనలైజేషన్ అమలు చేస్తారు. భిన్నంగా సమర్పించిన ఎల్‌టీపీని(లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్) బ్లాక్‌లిస్టులో పెడతారు. 120 రోజులు మాత్రమే దరఖాస్తులకు అవకాశమిచ్చారు. ఆ లోపు రూ.10వేలు చెల్లించి ప్రాథమికంగా దరఖాస్తు చేసుకోవాలి.

◆ దరఖాస్తు తరువాత నిర్మాణంలో మార్పులు, చేర్పులు చేస్తే ఎల్‌టీపీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

నాలుగు సర్కిల్స్‌లో 2500పైనే..

నిబంధనలు ఉల్లంఘించి తాడిగడప పురపాలక సంఘ పరిధిలోని నాలుగు సర్కిల్స్‌లో 2500కు పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



● అక్రమ కట్టడాలపై చర్యలు

బీపీఎస్ జీవో వచ్చాక కూడా కొందరు అక్రమ కట్టడాలు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఆగస్టు 31 తరువాత నిర్మించే అక్రమ కట్టడాలను కూల్చివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. - **షేక్‌నజీర్, కమిషనర్, తాడిగడప పురపాలకసంఘం**

నిరుపేదలకు తోపుడు బండ్ల అందజేత

పెనమలూరు, న్యూస్‌టుడే: బోడే ప్రసాద్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పెనమలూరు, పోరంకిలకు చెందిన నిరుపేదలు వాటపల్లి నాంచారమ్మ, మరీదు వెంకటేశ్వరరావుల జీవనోపాధి నిమిత్తం. ట్రస్టు అధ్యక్షుడు బోడే వెంకట్రామ్ తోపుడు బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమం పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నాయకులు కోయ ఆనంద్, తోటకూర భాస్కర్, కొలుసు లక్ష్మణ్, చిగురుపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న మహిళను ఓ ఆటో ఢీకొట్టి.. అనంతరం పల్టీకొట్టిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా వెల్దుర్తి గ్రామానికి చెందిన బి. కళావతి అనే మహిళ. తన కుమారుడు, కుమార్తె గోసా, తాడిగడపల్లోని ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. ఆదివారం ఉదయం ఆమె పిల్లల వద్దకు వచ్చారు. ముగ్గురు కలిసి మధ్యాహ్నం సమయంలో భోజనం చేసేందుకు గంగూరు వెళ్లి.. హోటల్‌లో భోజనం చేసి బందరు రోడ్డు దాటుతుండగా.. మచిలీపట్నం వైపు వేగంగా వెళుతున్న ఓ ఆటో అదుపుతప్పి.. తొలుత కళావతిని ఢీకొట్టి.. అనంతరం పల్టీకొట్టింది. ఈ ఘటనలో కళావతికి బలమైన గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

సవరణ ప్రకటన

ది. 22-11-2025 శనివారం నాడు ఈనాడు దినపత్రికలో కృష్ణా జిల్లా, పెనమలూరు ఎడిషన్‌లో ప్రచురించిన నా క్లయింట్ అయిన కంచర్ల లలితేంద్రనాథ్ ఇన్సాల్వెన్సీ పిటీషన్ I.P. నెం. 72/2025 in I.A. నెం. 1131/2025 ప్రకటన నందు చిన్న సవరణ కలదు.

1) ప్రతివాదుల పేర్లలో 3వ క్రమ సంఖ్య నందు జి. కలభాసిని బదులుగా 'జి. కలవ్ హాసిని' అని ప్రింట్ అయినది. కావున సవరణ చేయుచున్నాము.

2) 16వ క్రమ సంఖ్య నందు జి. అజయ్ భరత్ బదులుగా విజయ్ భరత్ అని ప్రింట్ అయినది. కావున సవరణ చేయుచున్నాము.

3) నా క్లయింట్ అయిన కంచర్ల లలితేంద్రనాథ్ State Bank of India (S.B.I.) Kankipadu Branch A/c. No. 10494484936 సేవింగ్స్ ఖాతా [illegible]

4) Karur Vysya Bank (KVB) Kankipadu Branch A/c. No. 1462135000002413 [illegible]

5) Karur Vysya Bank (KVB) Kankipadu Branch A/c. No. [illegible] [illegible]

ఎమ్.హెచ్.వి.ఎస్. కుమార్, న్యాయవాది, [illegible] విజయవాడ - 520 001 సెల్: 63054 06215

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

స్వామి సేవలో తరించిన భక్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి ఆదివారం దాదాపు 20వేల మంది వచ్చారు. తలనీలాల మొక్కుబడులు సమర్పించి స్వామి పూజలలో పాల్గొన్నారు. వివిధ సేవల రూపేణా రూ.8.95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

యాకూబ్ పాషాను సత్కరిస్తున్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ఉత్తమ ఉపాధ్యాయునిగా సత్కారం

గుడివాడ, న్యూస్‌టుడే: ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడివాడ మాంటిస్సోరి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సయ్యద్ యాకూబ్ పాషాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఘన సత్కారం జరిగింది. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థ సారథి చేతుల మీదుగా తాడిగడపలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఆ కార్యక్రమంలో సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

❖ పెదపారుపూడి మండలం భూషణగుళ్ల గ్రామంలో పైపులైనుకు లీకు పడడంతో స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయితీ కార్యదర్శి ప్రసాదు స్పందించి మరమ్మతులు చేయించారు. ❖ యలమర్రు గ్రామంలోని ఎస్సీ కాలనీలో వీధిలైట్లు పోవడంతో కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ స్పందించి వెంటనే వీధిలైటు వేయించారు. ❖ చినపారుపూడి గ్రామంలో పాత పంచాయితీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోవడంతో స్పందించిన కార్యదర్శి దయామణి కార్మికులచే చెత్తను తొలగించారు.
❖ ఎంపీపీ స్కూల్ పక్కన డ్రైనేజి పూడుకుపోవడంతో కార్యదర్శి స్పందించి పూడిక తీయించారు. – పెదపారుపూడి, న్యూస్‌టుడే

మంటలు రేగితే ఆర్పేదెలా?

★ చల్లపల్లిలో స్థలమున్నా నిర్మించని అగ్నిమాపక కేంద్ర భవనం ★ ప్రమాదం జరిగితే సర్వం బుగ్గి

చల్లపల్లి, న్యూస్‌టుడే

చల్లపల్లిలో 25 ఏళ్ల క్రితం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించినా నిధులు రాక నిర్మాణం పూర్తి కాలేదు. చల్లపల్లి ప్రధాన కూడలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే చల్లపల్లితో పాటు మోపిదేవి, ఘంటసాల తదితర మండలాల్లోని 46 పంచాయతీలకు ఉపయుక్తంగా ఉంటుంది. స్థలాన్ని కేటాయించి 25 సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయక నిర్మాణం అటకెక్కింది. చల్లపల్లి మండలంలోని 11 పంచాయతీల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొవ్వ, 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అవనిగడ్డ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వాలి. మాజేరు పంచాయతీలోని పాతమాజేరు, కొత్తమాజేరు గ్రామాల ప్రజలు మచిలీపట్నం అగ్నిమాపక కేంద్రంపై ఆధార పడుతున్నారు. మచిలీపట్నం, అవనిగడ్డ, మొవ్వ ప్రాంతాల నుంచి చల్లపల్లి ప్రాంతాలకు అగ్నిమాపక శకటం చేరే లోపే జరగాల్సిన తీవ్ర నష్టం జరిగిపోతోంది.

★ 2011లో చల్లపల్లి మండలం పురిటిగడ్డలో భారీ అగ్ని ప్రమాదం జరగగా అవనిగడ్డ, మొవ్వ అగ్నిమాపక శకటాలు వచ్చేలోపే 40 ఇళ్లు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శకటాలతో సిబ్బంది వచ్చి మంటలను పక్కనున్న గృహాలకు వెళ్లకుండా చూస్తున్నారే తప్ప, జరిగిన ప్రమాదాన్ని నిలురించలేక పోతున్నారు. గతంలో వక్కలగడ్డ, రామానగరం, పాతమాజేరు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించగా, బాధితులు సర్వం కాలి రోడ్డున పడ్డారు.

మురుగు, తూటుకాడతో కేంద్రానికి కేటాయించిన స్థలం

● ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మోపిదేవి, ఘంటసాల మండలాలతో పాటు చల్లపల్లి మండలంలో ప్రమాదాలను నియంత్రించాలంటే చల్లపల్లిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అగ్నిమాపక కేంద్రానికి ఏర్పాటు చేసిన స్థలానికి రక్షణగా ప్రహరీ, సరైన రహదారి సౌకర్యం లేక మురుగు వచ్చి చేరుతోంది. ప్రజాప్రతినిధులు పరిశీలించి భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : నిరంతరం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. డివిజన్ సహకార ప్రాథమిక సంస్థ ఏజీఎం మాటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో గుడివాడలోని 11 సహకార బ్యాంకుల లోని ఉద్యోగులకు క్రికెట్, చెస్, క్యారమ్స్ షటిల్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, నెట్టెం రఘురామ్ బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహించేలా వారు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, భస్కాకరరావు, బ్యాంక్ సీఈఓ శ్యామ్, జీఎం చంద్రశేఖర్, బ్రాంచ్ డీజీఎం ప్రభాకర్, గుడివాడ బజార్ బ్యాంక్ మేనేజర్ ఎం.సాంబ శివరావు, బ్యాంక్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీ బహూకరణ కార్యక్రమంలో నెట్టెం రఘురామ్, వెంకటేశ్వరరావు తదితరులు

కౌతవరం వద్ద రోడ్డుపై ఆరబెడుతున్న ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

ధాన్యం కొనుగోళ్లకు వేగంగా చర్యలు

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో సార్వా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టామని, రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం ఆయన, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు మండలంలోని అంగలూరు, గుడ్లవల్లేరు, కౌతవరం, వేమవరం, వడ్లమన్నాడు గ్రామాల్లో పర్యటించి సార్వా వరి కోతలు, పంట ఆరబెట్టడాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కౌతవరం ఆర్ఎస్‌కేలో రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తేమశాతంపై ఆర్ఎస్‌కే సిబ్బందితో ఆరా తీశారు. మిల్లర్లు చెప్పినట్లు తేమ శాతం నష్టపోతున్నామని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన జేసీతో ఫోన్లో మాట్లాడి మిల్లర్ల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాలాజీ, సొసైటీ అధ్యక్షులు వడ్లమాని యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రభుత్వమిది

మెరకనపల్లి(మోపిదేవి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మెరకనపల్లి సొసైటీ ఛైర్‌పర్సన్ యర్రంశెట్టి సుబ్బారావు పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ పథకం' నిధులు విడుదల చేసినందున ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. గత 18 ఏళ్లుగా కట్టని పి.వెంకట సుబ్బారావు బాకీని అపరాధ రుసుముతో కలిపి రూ.99 వేలు కుటుంబ సభ్యులు చెల్లించారు.

దివిసీమ ఆత్మబంధువు సత్యసాయిబాబా

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివిసీమ ఆత్మబంధువు సత్యసాయిబాబా అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం వంతెన కూడలిలో సత్యసాయి శత జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 1977 దివిసీమ ఉప్పెన అనంతరం సేవల్లో సత్యసాయి సేవాదళం పాత్ర మరువలేనిదన్నారు. బాబా దివిసీమకు వచ్చి సేవలందించారన్నారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సనకా నాగమల్లేశ్వరరావు, ఆచార రామమోహన్‌రావు, పాల్గొన్నారు.

మేడూరు(పమిడిముక్కల), : సత్య సాయిబాబా సందేశాలు శాంతిని కోరే ప్రపంచ మానవాళికి మార్గదర్శకాలని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు.

అవనిగడ్డలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సాయిబాబా సందేశాలను వివరిస్తున్న గుమ్మడి

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రగతి విద్యాసంస్థ ప్రాంగణంలో సత్య సాయి బాబా సేవా సమితి సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వంద మంది పేదలకు అన్నదానం, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

మేడూరులో ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ శివనాగేంద్ర మురళీ కోలాట భజన సమాజం వారి కోలాట భజన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: దక్షిణ చిరువోలులంక సత్యసాయిబాబా మందిరంలో బాబా చిత్రపటానికి పూలదండలు వేసి సాయిచాలీసా పారాయణ చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ శ్రీసత్యసాయి సేవా సమితిలో బాబా జయంతిని వైభవంగా నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. మండవ వాసుదేవరావు, బండారు వెంకటేశ్వరరావు, పొట్లూరి వెంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కూచిపూడిలో చీకటిమర్ల శివరామప్రసాద్ సరకులు పంపిణీ చేశారు. పెదపూడిలో పూజలు నిర్వహించారు.

తేమ శాతాన్ని తగ్గించుకోండి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు ధాన్యం ఆరబెట్టుకుని తేమ శాతాన్ని తగ్గించుకుంటే గిట్టుబాటు ధర లభిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా రైతులకు సూచించారు. ఆదివారం కనుమూరులో ధాన్యం రాశులను పరిశీలించారు. కొనుగోళ్లలో ఇబ్బందులపై ఆరా తీశారు. మద్దతు ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దన్నారు.

కనుమూరులో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

కనుమూరులో ముఖద్వారానికి శంకుస్థాపన

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పామర్రు మండలం కనుమూరులో గ్రామ ముఖద్వారం నిర్మాణానికి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రముఖుడు యలమంచిలి వాసుదేవరావు సహకారంతో మాజీ రాజ్యసభ సభ్యుడు యలమంచిలి శివాజీ పేరిట గ్రామ ముఖద్వారం నిర్మితమవుతోంది.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం 32 మంది ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 18.70 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 811 మందికి రూ. 6,42,23,757ల సహాయం చేసినట్లు చెప్పారు. వెంకట్రామ్ పాల్గొన్నారు.

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: కనుమూరులో అనారోగ్యం పాలైన క్రాంతి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.20వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అందించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. తెదేపా నేత దగ్గుపాటి ఫణిరాజా, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలోని వేమవరం, వడ్లమన్నాడు, రెడ్డిపాలెం, ఉలవలపూడి, గాదేపూడి, డోకిపర్రు, లంకాదొడ్డి గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి 11 వరకూ సరఫరా నిలిపివేయనున్నారు. ప్రజలు గమనించాలని అధికారులు తెలిపారు.

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం మాజేరు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సబ్ డివిజన్ డీఈ పులి శివనాగేశ్వరరావు తెలిపారు. పనులు చేపట్టనున్న దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు ఉచితంగా బీఎండీ పరీక్షలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో 50 సంవత్సరాలు దాటిన వారిలో వచ్చే ఎముకల బలహీనత వ్యాధిని గుర్తించేందుకు బోన్ మినరల్స్ డెన్సిటీ (బీఎండీ) పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని సీఆర్ ట్రస్ట్ ప్రతినిధి అడ్డాడ ప్రసాద్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అన్నదాతల్లో గుబులు

తోట్లవల్లూరు, పెదపారుపూడి – న్యూస్‌టుడే

వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అధికారుల ప్రకటనలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 1.60 లక్షల హెక్టార్లల్లో వరి పంటను సాగు చేశారు. మొంథా తుపానుకు సుమారు 45,000 హెక్టార్లల్లో నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. మిగతా చాలా చోట్ల ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. తోట్లవల్లూరు మండలంలోని 8,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, యాకమూరు, పెనమకూరు, గరికపర్రు, దేవరపల్లి, వల్లూరుపాలెం, బొడ్డపాడు తదితర గ్రామాల్లో ఇప్పటికే పంట కోత కోశారు. చాలాచోట్ల కళ్లాలు, పొలాల్లో ధాన్యం ఆరబోసుకున్నారు. ఆకాశంలో మబ్బులు ముసురుపట్టడంతో ధాన్యాన్ని కుప్పలు వేసి పట్టాలు కప్పుతున్నారు. వర్షం కురిస్తే తడిసిపోతాయన్న భయంతో కొందరు తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు.

సంచులు లేక రోడ్ల పక్కన ధాన్యం రాశులు

ముందుకు సాగని చెరువు సుందరీకరణ పనులు

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ పట్టణం బేతవోలు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన చెరువు ఇప్పుడు ఆక్రమణలకు గురైంది. కూటమి నాయకులు ఎన్నికల ప్రచార సమయంలో.. చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈనేపథ్యంలో చెరువు సుందరీకరణకు రూ.1.90 కోట్ల మంజూరుకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేశారు. నిధులు మంజూరై ఏడాది కాలం గడిచినా, ఇప్పటి వరకు చెరువు సుందరీకరణ విషయాన్ని అధికారులు మరిచారు. నియోజకవర్గంలోని చెరువులకు భిన్నంగా బేతవోలు చెరువు కాలుష్యానికి దూరంగా ఉంది. సుమారు 10 ఎకరాల వరకు విస్తీర్ణం కలిగి ఉంది. కట్ట మరమ్మతు, విద్యుత్తు దీపాల ఏర్పాటు, అలంకరణల కోసం పచ్చదనం పెంపు, నడకమార్గం తదితర పనులు అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు అంటున్నారు. చెరువులో గుర్రపు డెక్క వేగంగా విస్తరిస్తోంది. ఇళ్లలోని మురుగు నీరు చెరువులోకి చేరడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

చెరువులో విస్తరిస్తున్న గుర్రపుడెక్క

ప్రభుత్వం మారినా.. కార్డులు మార్చరే!

వైకాపా ప్రభుత్వం గద్దె దిగి 19 నెలలు కావస్తోంది. అప్పటి ప్రభుత్వంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ పరిధి నిర్వహణలో ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎయిడెడ్, వసతి గృహాలు, సంక్షేమ వసతి గృహాలు తదితర పాఠశాలలకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమ నిర్వహణలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఆ వివరాల నమోదుకు ఆరోగ్య ప్రగతి కార్డులు పంపిణీ చేశారు. వాటి అట్ట మీద అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యుడు, అంబులెన్స్ చిత్రాలు ముద్రించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 19 నెలలు దాటుతున్నా ఇంకా ఆ పాత కార్డులే వినియోగంలో ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తవి ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **- మోపిదేవి, అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే**

ఇంకా వినియోగంలో ఉన్న ఆర్‌బీఎస్ ఆరోగ్య కార్డులు

మూడు వాహనాల స్వాధీనం

నాగాయలంక, న్యూస్‌టుడే: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. శనివారం రాత్రి నాగాయలంకలో ఇసుక తరలిస్తున్న కనిగంటి శ్రీనివాసరావుకు చెందిన రెండు ట్రాక్టర్లను, వక్కపట్లవారిపాలెం గ్రామానికి చెందిన అంబటి లక్ష్మణ్ ప్రసాద్‌కి చెందిన ఒక టిప్పరును అదుపులోకి తీసుకుని మచిలీపట్నం మైనింగ్ కార్యాలయానికి తదుపరి చర్యలు నిమిత్తం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులోని ట్రాక్టర్లు

శారదాంబ మృతికి సంతాపం

నాగాయలంక: తెదేపా నేత, రాష్ట్ర సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు మాతృమూర్తి శారదాంబ మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం తెదేపా నేత కనపర్తి శ్రీనివాసరావు శారదాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, గోవర్ధన్, పర్చూరి దుర్గాప్రసాద్, మేడికొండ విజయ్, కర్రి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో డ్రోన్ కెమెరాల సాయంతో ఊరి చివర జూదం ఆడుతున్న 7గురు వ్యక్తులను గుడివాడ టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7110 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామం రైల్వే గేటు సమీపంలో ఆరుగురు వ్యక్తులను రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారినుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులకు ఉపకార వేతనాల పంపిణీ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: బొండాడ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం గాంధీక్షేత్రంలో ఫౌండేషన్ నిర్వాహకులు బొండాడ రాఘవేంద్రరావు ఆర్థిక సహకారంతో రాయల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వార్షిక ఉపకార వేతనాల పంపిణీలో ఆయన మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికి విద్యార్థులకు రూ.కోటి సహాయం చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే, బొండాడ నీలిమ చేతుల మీదుగా నియోజకవర్గంలోని 82 మంది కళాశాల విద్యార్థులకు రూ.6 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ సీతాలం రాంబాబు, కార్యదర్శి తోట పద్మనాభరావు, కోశాధికారి అంకం రామసాయిప్రసాద్, డాక్టర్ ఓసూరి బాలబాలాజీ, మండలి వెంకట్రామ్, జితిన్‌చంద్ర, వంగర శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థికి ఉపకార వేతనం పంపిణీ చేస్తున్న బుద్ధప్రసాద్, నీలిమ

పులిగడ్డలో ఎన్‌సీసీ క్యాడెట్ల భారీ ప్రదర్శన

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డలోని గురుకులంలో 16 ఆంధ్రా బెటాలియన్- మచిలీపట్నానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం భారీ ప్రదర్శన చేశారు. ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రదర్శనను ప్రధానాచార్యులు కనపర్తి జాన్ ప్రారంభించారు. మాదక ద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గురుకులం ఎన్‌సీసీ అధికారి కె.సురేష్ ఆధ్వర్యంలో క్యాడెట్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన

వైభవంగా గంగానమ్మ జాతర

భద్రిరాజుపాలెం(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: భద్రిరాజుపాలెంలో గంగానమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్దఎత్తున మొక్కుబడులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చి పలువురు తిలకించారు. ఈ జాతర అనంతరం వరి కోతలు ప్రారంభిస్తామని రైతులు తెలిపారు.

కొండలమ్మకు భక్తుల పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వేమవరం శ్రీకొండలమ్మ తల్లి ఆలయానికి ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సామూహిక పాలపొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. మొక్కుబడులు చెల్లించుకుని బంధుమిత్రులకు అన్నసమారాధన చేసుకున్నారు.

పూజలకు హాజరైన భక్తులు

వేడి నైవేద్యాల సమర్పణ

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: విశ్వనాధపల్లి గ్రామ దేవత అద్దంకి నాంచారమ్మ తల్లికి గ్రామస్థులు రైతులను, పంటలను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడమని ప్రార్థిస్తూ ఆదివారం సాయంత్రం వేడి నైవేద్యాలు సమర్పించారు. 500 మందికిపైగా కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

కృష్ణా నదికి మహావస్త్ర సమర్పణ నేడు

నాగాయలంక, న్యూస్‌టుడే: కృష్ణమ్మ తల్లికి కృతజ్ఞతగా శ్రీరామపాద క్షేత్రంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు మహా వస్త్రం సమర్పించడానికి నిర్వాహకులు సంకల్పించారు. దాతలు అందించిన 500 చీరలతో కృష్ణావేణి విగ్రహం నుంచి నదికి అవతల వైపు బాపట్ల జిల్లా బొబ్బర్లంక వరకు ఈ వస్త్ర సమర్పణ చేయనున్నారు. భక్తులు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం

గుడివాడ, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో ఓ వ్యక్తి తనను శారీరకంగా వశపర్చుకుని వేరే యువతితో వివాహం చేసుకుంటున్నాడంటూ ఓ యువతి టూటౌన్ పోలీసులను శనివారం రాత్రి ఆశ్రయించింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన యువతి, కార్మిక నగర్‌కు చెందిన వేణుగోపాల్ కొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఈక్రమంలో పెళ్లి చేసుకుంటాననడంతో దగ్గరయ్యారు. అతడికి వేరే యువతితో వివాహం నిశ్చయించుకున్నట్లు తెలుసుకున్న యువతి వెళ్లి నిలదీసింది. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంబారు గిన్నెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: వేడి సాంబారు గిన్నెలో పడి చిన్నారి తీవ్ర గాయాలైన సంఘటన వానపాముల గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం నాలుగేళ్ల చిన్నారి గ్రామంలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి తల్లిదండ్రులతో కలసి వెళ్లింది. అక్కడ తోటి చిన్నారులతో కలసి ఆడుకుంటూ పక్కనే ఉన్న వేడి సాంబారు గిన్నెలో పడిపోయింది. చిన్నారి కేకలు వేయడంతో పక్కనే ఉన్నవారు బయటకు తీసి గుడివాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకుని వెళ్లినట్లు తెలిసింది.

సమస్యలపై సానుకూల స్పందన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావును ఆదివారం ఆయన కార్యాలయంలో అగ్నికుల క్షత్రియ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పాపారావును సత్కరిస్తున్న దృశ్యం

వృద్ధురాలి నేత్రదానం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక నేతాజీ విగ్రహం ఎదురురోడ్డులోని వయోవృద్ధురాలు పొట్లూరి స్వరాజ్యలక్ష్మి(96) ఆదివారం ఉదయం వయోభారంతో స్వగృహంలో మృతి చెందారు. కుమారుడు పొట్లూరి సత్యనారాయణ, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె రెండు కార్నియాలను లయన్స్‌క్లబ్ సభ్యులు అడుసుమిల్లి వీరభద్రరావు, చాపరాల బాలాజీల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేకరించారు.

స్వరాజ్యలక్ష్మి(ఫైల్)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆత్మీయులైన
శ్రీ యలవర్తి శ్రీనివాసరావు గార్కి
ఇవే మా హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ..

శ్రీ యలవర్తి శ్రీనివాసరావు గారు B.E
మాజీ ఛైర్మన్: గుడివాడ మున్సిపాలిటీ
చిన్నికృష్ణా ఎంటర్‌ప్రైజెస్
గౌరీశంకరపురం, గుడివాడ
ఆచంట వెంకటేశ్వరరావు

(c) eenadu

‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ నేడు

కానూరు పి.వి.పి. సిద్ధార్థ ప్రాంగణంలో నిర్వహణ

ఈనాడు, అమరావతి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ నిర్వహిస్తోంది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్ ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ప్రారంభిస్తారు. విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొంటున్నారు. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం ‘ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన’ ముఖ్య ఉద్దేశం.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

ఏకపీఠంపై శివపార్వతులు...

కృష్ణా జిల్లా ఘంటసాలలోని ప్రాచీన బాలపార్వతీ సమేత జలదీశ్వరస్వామి దేవాలయం ఎంతో ప్రత్యేకమైనది. ఇక్కడ జలదీశ్వరస్వామిగా పూజలందుకుంటున్న శివలింగం పక్కనే పార్వతీదేవి ఏకపీఠంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. సాధారణంగా శివాలయాల్లో శివుడు ఒకచోట ఉంటే అమ్మవారు మరోచోట ఉంటారు. ఈ క్షేత్రంలో మాత్రం ఆది దంపతులు (శివపార్వతులు) ఏకపీఠంపై భక్తులను ఆశీర్వదిస్తారు. అగస్త్య మహాముని, ఆయన భార్య లోపాముద్ర కలిసి ఈ జలదీశ్వరస్వామిని, పార్వతీదేవిని ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. స్వామిని దర్శిస్తే సాక్షాత్తు కైలాసంలో ఆదిదంపతుల కల్యాణ దర్శనం చేసుకున్నంత భాగ్యం కలుగుతుందని ప్రతీతి. ఆలయ ప్రాంగణంలో 1400 ఏళ్ల కిందటి పాళీ భాషలో శాసనం ఇప్పటికీ కనిపిస్తుంది. దీని పక్కనే తెలుగు అనువాదాన్ని సైతం భక్తులకు అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు.

- ఈనాడు, కృష్ణా

ఇసుక దందా.. కనబడుతోందా!

ఈనాడు, అమరావతి

- నదిలో ఫెర్రీ సహా చుట్టుపక్కల భారీగా డ్రెడ్జింగ్
- వందల ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్న అక్రమార్కులు

కృష్ణా నదిలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ సహా పరిసర ప్రాంతాల్లో భారీగా ఇసుక దందా సాగుతోంది. తాజా వరదలకు ఫెర్రీ సమీపంలోని లంకలు, చుట్టుపక్కల ప్రాంతాల్లోకి వేల టన్నుల ఇసుక కొట్టుకొచ్చింది. దీనిపై ఇసుకాసురుల కన్ను పడింది. కళ్ల ముందు రూ.కోట్ల విలువైన ఇసుక కనిపించడంతో కొత్త పడవలు, జేసీబీలతో రంగంలోకి దిగిపోయారు. విచ్చలవిడిగా నది మధ్యలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేస్తూ పడవల ద్వారా తీసుకొచ్చి ట్రాక్టర్లలో నింపి తరలించుకుపోతున్నారు. ఫెర్రీ కేంద్రంగానే రోజుకు 400-500 ట్రాక్టర్ల ఇసుకను ఎత్తుకుపోయి స్టాక్ పాయింట్లు పెట్టుకుని అమ్ముకుంటున్నారు. అక్రమార్కులు బరితెగించేసి ఇసుకను తోడేస్తున్నా ఒక్క అధికారీ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

ఫెర్రీ వద్ద ట్రాక్టర్లలోకి క్రేన్‌లతో ఇసుక ఎత్తుతూ..

ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతుంటే గుంటుపల్లిలోని ఇసుకాసురులు మరో అడుగు ముందుకు వేసి టిప్పర్లు, లారీల ద్వారా భారీగా తరలించేస్తున్నారు. ఉదయమంతా నదిలోని ఇసుకను యంత్రాలతో తోడేసి తీసుకొచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. దానిని రాత్రి వేళ లారీలు, టిప్పర్లకు ఎత్తి సరిహద్దులు దాటించేస్తున్నారు.

సిండికేటుగా మారి దందా

ఇసుకాసురులు సిండికేటుగా మారి దందా సాగిస్తున్నారు. నదిలో తోడి ఒడ్డుకు తీసుకొచ్చి, నింపినందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 700 వసూలు చేస్తున్నారు. ఈ ఇసుకను ఇబ్రహీంపట్నంలో అమ్మితే ట్రాక్టరు రూ. 1200, అదే కొండపల్లి వెళితే రూ.1500 చొప్పున వసూలు చేస్తున్నారు. లారీలు, టిప్పర్లలో దూరప్రాంతాలకు తరలిస్తున్నారు. పురపాలిక పరిధిలోని గుత్తేదారు వేలంపాట పాడుకుని ఇసుక ట్రాక్టర్ల నుంచి రూ.100 ఆశీలు వసూలు చేస్తున్నారు.

ఎద్దుల బండ్లకు కూలి చెల్లించి..

ఎద్దుల బండ్లతో ఎవరైనా నేరుగా రేవుల్లోకి వచ్చి ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో దీనిని కూడా కొందరు అక్రమార్కులు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఎండ్ల బండ్లు నడిపేవాళ్లకు కూలి చెల్లించి ఇసుక తరలిస్తున్నారు.

అధికారులు ఉన్నారా.. లేరా?

ఫెర్రీలో ఇసుక దందా భారీగా జరుగుతుండడంపై తీవ్ర విమర్శలు రావడంతో 20 రోజుల కిందట అధికారులు హడావుడి చేశారు. కానీ వాళ్లు వచ్చేసరికే ఫెర్రీ మొత్తం ఖాళీ చేసి అక్రమార్కులు పరారయ్యారు. ఓ ఐదు రోజుల తర్వాత నుంచి మళ్లీ దందా సాగిస్తున్నారు

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 99590 21800

ప్యాకేజీ-4 ...ఇక పరుగులు

కురగల్లులో తొలగించిన రోడ్డు పునర్నిర్మాణానికి ఎన్వోసీ

ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4 పనులు పరుగులు పెడుతున్నాయి. కురగల్లులో కొండవీటి వాగు వరదల సమయంలో తొలగించిన రహదారి పునర్నిర్మాణం పనులు పట్టాలెక్కుతున్నాయి. ఆగస్టులో కొండవీటి వాగుకు వరద పోటెత్తిన వేళ నష్ట నివారణకు మంగళగిరి మండలం కురగల్లులో 40 మీటర్ల మేర రహదారిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) తొలగించింది. ప్రస్తుతం పరిస్థితులు కుదుట పడడంతో రహదారి పునర్నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని రాతపూర్వకంగా ఎన్వోసీ ఇవ్వాలని ఏడీసీఎల్‌కి ఎన్‌హెచ్ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. తాజాగా దానికి సంబంధించిన ఎన్వోసీ ఎన్‌హెచ్ అధికారులకు అందింది. అన్నీ కుదిరితే సోమవారం నుంచి పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టి నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఇప్పటికే ప్యాకేజీ-3 పనులు దాదాపు కొలిక్కి రావడంతో విజయవాడ రామవరప్పాడు రింగ్ నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్- వైజాగ్ వెళ్లేందుకు రాకపోకలు మొదలయ్యాయి. నున్న విద్యుత్తు టవర్ల వివాదంపై సోమవారం కోర్టు తీర్పు రానున్న నేపథ్యంలో దాన్ని పూర్తి స్థాయిలో పరిష్కరించనున్నారు. మొత్తం మీద సంక్రాంతి నాటికి ప్యాకేజీ-3, 4 పనులు కొలిక్కి వచ్చి బైపాస్‌పై వాహనాల రాకపోకలు మొదలవనున్నాయి.

కురగల్లు దగ్గర ఏడీసీఎల్ రహదారిని తొలగించిన ప్రాంతం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృక్షం.. ఆరాధ్య దైవం

నాట్య క్షేత్రమైన కూచిపూడిలో 300 ఏళ్ల నుంచి ఉన్న రావివృక్షాన్ని (గంటలమ్మ) నాట్య కుటుంబాలు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నాయి. కూచిపూడి భాగవతులు దేశంలోని పలు ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు ఇచ్చేందుకు వెళ్లే ముందు కూచిపూడి అగ్రహారంలో ఉన్న రావి వృక్షానికి మొక్కేవారు. తాను తిరిగి వచ్చే వరకు భార్యాబిడ్డలను కాపాడమని ఆ చెట్టుకు గంట కట్టి మోగించి వెళ్లేవారు. ఆ వృక్షానికి ఉన్న గంటలు నిత్యం గాలికి ఊగుతూ మోగుతూ ఉండటంతో దాన్ని గంటలమ్మ చెట్టుగా పిలుస్తుంటారు. భాగవతులు తర్వాత ఆయన వంశీయులు ఆ చెట్టును కొలుస్తున్నారు.

- కూచిపూడి, న్యూస్‌టుడే

వందనమమ్మా.. మంతెన బామ్మ!

కంకిపాడు, న్యూస్‌టుడే

ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న బాలబాలికలు

ఏడు పదుల వయసులోనూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ సామాజిక సేవలో తరిస్తున్నారు.. కంకిపాడు మండలం మంతెనకు చెందిన పెండ్యాల విజయలక్ష్మి. ఆమె భర్త రామారావు ఏలూరులోని ఓ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. వీరి కుమార్తె, కుమారుడు ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడ్డారు. విజయలక్ష్మి పదేళ్లుగా సామాజిక సేవతో పాటు గ్రామ ప్రగతికి కృషిచేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలు, చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం, కీళ్ల సమస్యలపై బాలలు, మహిళల్లో అవగాహన కల్పించేందుకు బాలసేన, మహిళా మండలి ఏర్పాటు చేయించారు. స్వచ్ఛ సుందర మంతెన'కు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, వ్యాపారులు, గ్రామస్థులకు నార సంచులు, స్టీల్, గాజుగ్లాసుల పంపిణీ, బాలలకు పోటీలు నిర్వహించి బహుమతుల అందజేత, పండగలు, పర్వదినాలను పురస్కరించుకుని మహిళా మండలి సభ్యులంతా స్వయంగా సేంద్రియ పదార్థాలతో చేసిన తినుబండారాలను చిన్నారులకు పంపిణీ చేస్తున్నారు.

- వేసవి శిక్షణ శిబిరాలకు తనే స్వయంగా విద్యార్థులను తీసుకెళుతుంటారు. బాలలు, మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణ, పాఠశాల ప్రాంగణాల్లో సేంద్రియ విధానంలో కూరగాయల ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు, గో ఆధారిత ఎరువులు ఇస్తున్నారు. బంధువులకు చెందిన 40 సెంట్ల స్థలంలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలను ఇంటింటికీ అందజేస్తున్నారు. విజయలక్ష్మిని గ్రామంలోని బాలలు, విద్యార్థులు అమ్మమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. ‘నా కుటుంబానికి అన్ని ఇచ్చిన గ్రామం.. రుణం తీర్చుకునే బాధ్యత నాపై ఉందని భావించి, సేవచేస్తున్నాను’ అని పెండ్యాల విజయలక్ష్మి తెలిపారు.

పెండ్యాల విజయలక్ష్మి

త్రివర్ణ వీచిక.. నిలువెత్తు స్ఫూర్తిగా..

ఆంధ్రప్రదేశ్- తెలంగాణ సరిహద్దుల్లోని జగ్గయ్యపేటలో జాతీయ రహదారి సమీపంలో 150 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకం తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నిత్యం రెపరెపలాడుతూ జాతీయ స్ఫూర్తిని చాటుతోంది. 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్వహస్తాలతో ఆవిష్కరించిన పతాకం ఈ ప్రాంతానికి ఒక విశిష్టతను సంతరింపజేసింది. ఆ ప్రాంతాన్ని ఒక దేశభక్తి ప్రబోధకమైన సందర్శన స్థలంగా మార్చడం కోసం జగ్గయ్యపేట పురపాలక సంఘం వారు అక్కడ ఒక తిరంగ్ ఉద్యానవనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆ పార్క్ దశల వారీగా రూపుదిద్దుకుంటూ ఉంది.

- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

స్వగృహం ప్రాప్తిరస్తు!

అర్హుల ఎంపికకు పీఎం ఆవాస్ యోజన 2.0 సర్వే

ఈనాడు, అమరావతి

నీడ లేని పల్లె ప్రజలకు సొంత గూడు కల సాకారం చేసేందుకు కూటమి సర్కారు నడుం కట్టింది. దీని కోసం పీఎం ఆవాస్ యోజన 2.0 ద్వారా లబ్ధి అందించనున్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతలు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్నారు.

జిల్లా	దరఖాస్తులు	సర్వే చేసినవి
ఎన్టీఆర్	15,994	9190
కృష్ణా	6,707	4,069
మొత్తం	22,701	13,259

ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

నవంబరు-30 నాటికి కొలిక్కి..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,701 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిని హౌసింగ్, సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో కలిసి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటున్న స్థలాన్ని పరిశీస్తున్నారు. వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 13,259 మందిని సర్వే చేశారు. నవంబరు 30వ తేదీలోగా సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. నెల రోజుల తర్వాత కేంద్రం అర్హుల జాబితా ప్రకటించి ఇళ్ల మంజూరుపై దృష్టి సారిస్తుంది.

గృహ నిర్మాణానికి కూటమి చొరవ

- వైకాపా పాలనలో మొదలుపెట్టి అసంపూర్తిగా నిలిపేసిన గృహాల్లో 11,008 గృహాలు తాజాగా కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది.
- సామూహిక గృహప్రవేశాల రోజే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,449 ఇళ్లు మంజూరు చేసింది.
- ఇందులో ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలున్నాయి. వీటికి ఉమ్మడి జిల్లాకు రూ. 70.8 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.
- ప్రస్తుతం పీఎం గ్రామీణ ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు సర్వే చేస్తున్నారు.
- ఈ సర్వేలో అర్హులను బట్టి వచ్చే రెండేళ్లలో కూటమి సర్కారు గృహాలు మంజూరు చేయనుంది.
- ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ. 1.5లక్షలు, రాష్ట్రం రూ. లక్ష చొప్పున రూ. 2.5లక్షలు అందుతాయి. అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా 90 పని రోజులకు రూ. 27వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 12వేలు మంజూరు చేస్తారు.
- మొత్తంగా ఒక్కో లబ్ధిదారుడికి రూ. 2.89లక్షలు చెల్లిస్తారు.

ఖాతాలు నావే.. పోస్టులు నావి కాదు!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

రెండో రోజూ పోలీసుల కస్టడీకి సహకరించని విజయ్‌భాస్కర్‌రెడ్డి

‘సామాజిక మాధ్యమాల ఖాతాలు నావే.. అందులో అసభ్యకర పోస్టులు.. మార్ఫింగ్ ఫొటోలు, కంటెంట్ నాది కాదు’ అని రెండో రోజు పోలీసుల కస్టడీలో వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, న్యాయమూర్తులపై అత్యంత అసభ్యకర పదజాలంతో కంటెంట్ రాస్తూ.. పోస్టులు పెట్టడం వెనుక కారణాలేంటని విచారణాధికారి వెంకటరమణ అడిగిన ప్రశ్నలకు తెలియదు.. సంబంధం లేదంటూ నిందితుడు పొడిపొడిగా సమాధానాలు చెప్పాడు. నెల్లూరు జిల్లా వెంకటాచలం ఠాణాలో రెండో రోజు ఆదివారం పోలీసుల కస్టడీలో విజయ్‌భాస్కర్‌రెడ్డి సహకరించలేదు. 5 గంటల పాటు సుమారు 16 ప్రశ్నలు అడగ్గా నిందితుడు డొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. విచారణ అనంతరం వైద్య పరీక్షలు చేయించి నెలూరు జైల్లో నిందితుడిని అప్పగించారు.

విచారణ సాగిందిలా..

- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రిలోకేశ్ వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టారు కదా.. వారు ఎవరో తెలుసా?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: తెలుసు

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఆయన ఎవరో తెలుసా?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: జస్టిస్ ఎన్.వి.రమణ ఎవరో నాకు తెలియదు.

- ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టడం వెనుక ప్రధాన ఉద్దేశమేంటి?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.. సంబంధం లేదు.

- సామాజిక మాధ్యమాల్లో మీరు పెట్టిన పోస్టులు తీవ్ర అసభ్యంగా ఉన్నాయని అనిపించలేదా?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.

- మీ ఫేస్‌బుక్ ఖాతాలో మహిళల ఫొటోలు మార్ఫింగ్, అనుచిత వ్యాఖ్యలతో కంటెంట్ రాయమని చెప్పిందెవరు? మీతో పాటు ఇంకా ఎవరెవరు పాత్రధారులు ఉన్నారు?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: ఆ ఖాతాలు నావే. అందులోని కంటెంట్ నాది కాదు.

- మీ విదేశీ మొబైల్ నంబర్‌తో ఉన్న కోర్‌కమిటీ వాట్సప్ గ్రూప్, కోర్‌కమిటీలోని సభ్యులు ఎవరెవరు? వారు అసభ్య పోస్టులు ఎవరెవరికి పంపేవారు. మీకు ఎలాంటి సూచనలు చేసేవారు?

విజయ్‌భాస్కర్‌రెడ్డి: వారెవరో నాకు తెలియదు.

డ్రగ్స్ కేసులో.. కీలక మలుపు

ఈనాడు, అమరావతి

- మ్యాడీ, లోహిత్ వాంగ్మూలాలతో కదిలిన డొంక
- వైకాపా నేత కొండారెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు

కొండారెడ్డి

ఎటువంటి పురోగతి లేకుండా ఉన్న ఎండీఎంఏ కేసు మ్యాడీ అరెస్టుతో కీలక మలుపు తిరిగింది. అతని విచారణ ఆధారంగా మరికొందరి పేర్లు వచ్చాయి. వీరిలో వైకాపా విద్యార్థి నేత పులగం కొండారెడ్డి పేరు ఒకటి. దీంతో అతడిని ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. లోహిత్ యాదవ్ విచారణలో పలు ముఖ్యమైన విషయాలు బయటకొచ్చాయి.

వైకాపా ర్యాలీల్లో హల్‌చల్

17న నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లోని లోహిత్‌ను మాచవరం పోలీసులు విచారించగా పలు విషయాలు వెల్లడించాడు. విశాఖ నగరంలోని ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రాంతానికి చెందిన లోహిత్ హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై చివరి ఏడాది మానేశాడు. ఇంటికి సమీపంలోని శ్రీవాత్సవ్ (ఏ1) ద్వారా 2020 నుంచి కొండారెడ్డితో పరిచయం ఏర్పడింది. మత్తు బంధం ప్రాణ స్నేహితులుగా మార్చింది. కొండారెడ్డి వైకాపాలో విద్యార్థి నేతగా ఎదుగుతుండడంతో వైకాపా ర్యాలీల్లో అతనితో కలిసే తిరిగేవాడు. లోహిత్ కాల్‌డేటా పరిశీలిస్తే గతేడాది మే 30 నుంచి ఈ ఏడాది ఆగస్టు 30 వరకు 15 నెలల్లో 1,467 కాల్స్ ఉన్నాయి. దీనిపై ప్రశ్నిస్తే ఇద్దరం తరచూ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీతో తీసుకునేవారమని, పార్టీల గురించి ఫోన్‌లో మాట్లాడుకునేవారమని చెప్పాడు.

ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ అమ్మకాలు

ఎండీఎంఏతో పాటు బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ (లైసర్జిక్ యాసిడ్ డైఇథైలామైడ్) తెప్పించి విశాఖపట్నంలో కొండారెడ్డి విక్రయించేవాడు. ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్‌ను నాలుక కింద పెట్టుకుని చప్పరిస్తే మత్తు ఎక్కుతుంది. విశాఖ జిల్లాలో పలువురు వైకాపా కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలున్నాయి. తెలిసినవారికి నేరుగా, పరిచయం లేని వారికి డ్రాపింగ్ పాయింట్ల ద్వారా అందజేసేవారు. వచ్చిన సొమ్మును శ్రీవాత్సవ్, హర్షవర్ధన్‌నాయుడు, స్వరూప్‌రాజ్ ద్వారా కొండారెడ్డికి చేర్చేవారు.

శ్రీవాత్సవ్, హావీలా పట్టుబడిన రోజు..

బెంగళూరులో 20 గ్రాముల ఎండీఎంఏ కొని విశాఖ తీసుకెళ్తుండగా 3నెలల కిందట విజయవాడలో పట్టుబడ్డారు. ఆరోజు పట్టుబడిన ఇద్దరి ఫోన్లు స్విచాఫ్ రావడంతో కొండారెడ్డి, లోహిత్‌లు గాబరా పడ్డారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. తర్వాత వీరిద్దరూ ఒకచోట కలుసుకున్నారు. పోలీసులకు ఏమైనా దొరికారా? ఒకవేళ దొరికితే తమ పేర్లు ఏమైనా చెప్పారా? అన్న కంగారు పెరిగింది. దీంతో వాట్సప్ ద్వారా మ్యాడీకి కొండారెడ్డి ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు.

సంక్రాంతికి సీటు దొరుకుతుందా..!

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు రైళ్లలో దాదాపు బెర్తులన్నీ ఫుల్ అయ్యాయి. రెండు నెలల ముందుగానే రైల్వే రిజర్వేషన్ టికెట్ల బుకింగ్‌లు ప్రారంభమవ్వడంతో అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్ బెర్తులు నిండి వెయిటింగ్ లిస్టుతో పాటు కొన్ని రైళ్లలో నోరూమ్‌లు దర్శనమిస్తున్నాయి.

★ ఏటా సంక్రాంతి పండగ రద్దీ దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ భారీగా ప్రత్యేక రైళ్లు నడుపుతుంది. ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో సర్వీసులు ఉన్నాయి. సాధారణ రైళ్లలో రిజర్వేషన్ టికెట్లు ఫుల్ అవడంతో ఇక ప్రత్యేక రైళ్లు, తత్కాల్ టికెట్లపైనే ప్రయాణికులు ఆశలు పెట్టుకున్నారు.

★ హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ డిమాండ్ ఉంది. తర్వాత సికింద్రాబాద్, బెంగళూరు ఉన్నాయి. రాజధాని ప్రాంతంలో పనులు చేసేందుకు వందల సంఖ్యలో ఉత్తరాంధ్ర నుంచి కార్మికులు వచ్చారు. వారు పండగకు తిరిగి వెళ్లేందుకు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకోవడంతో విజయవాడ, హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ వెయిటింగ్ లిస్ట్ ఉన్నాయి.

★ బెంగళూరు నుంచి ఐటీ ఉద్యోగులు తన సొంత గ్రామాలకు రానుండడంతో బెంగళూరు మార్గంలో డిమాండ్ ఏర్పడింది. జనవరి 13, 14, 15 తేదీల్లో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్టు 100 దాటింది. మరికొన్నింటిలో బుకింగ్‌లు పూర్తి అయ్యి ‘రిగ్రెట్’ అని వస్తుంది.

★ పండగ ముందు, తర్వాత రోజుల్లో తత్కాల్ టికెట్లకు భారీ డిమాండ్ ఉంటుంది. బుకింగ్ ప్రారంభించిన నిముషాల్లోనే టికెట్లు వెయిటింగ్ లిస్టుకు చేరుకుంటాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో రైల్వే శాఖ సంక్రాంతి పండగకు విజయవాడ మీదుగా ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీసీపీ సరిత.. చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు, ఈగల్ చీఫ్ ఐజీ రవికృష్ణ తదితరులు

అమరావతి రూపకల్పనలో భాగస్వాములు అవ్వండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి రూపకల్పనలో ఏపీ సీఆర్డీఏ ప్రజలను భాగస్వాములను చేస్తోంది. భవిష్యత్తు తరాలకు ఉత్తమ, సుస్థిరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన రాజధాని నగరాన్ని నిర్మించేందుకు అమరావతి విజన్ 2047 రూపకల్పనలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను సీఆర్డీఏ స్వీకరిస్తుంది. ప్రజా సంఘాలు, వివిధ రంగాల నిపుణులు నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. వివరాలను తెలుగు, ఆంగ్లంలో అందించే అవకాశాన్ని కల్పించారు. సీఆర్డీఏ అధికారిక వెబ్‌సైట్ ‘సీఆర్‌డీఏ.ఏపీ.జీవోవీ.ఇన్’ ద్వారా ఈ సర్వేలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రజలు సూచనలు, సలహాలు పంపటానికి ఈ నెల 30 చివరి తేదీగా నిర్ణయించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ తరాలకు అత్యుత్తమ రాజధాని నగరాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొనాలని ఏపీ సీఆర్డీఏ విజ్ఞప్తి చేస్తుంది.

ఎయిర్ కార్గో... లక్ష్యం నీరుగారుతోంది!

ఈనాడు, అమరావతి

విజయవాడ విమానాశ్రయంలో ఎయిర్ కార్గో సేవల లక్ష్యం నెరవేరడం లేదు. రోజుకు 10 నుంచి 15 టన్నుల వరకూ సరకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నా సగం కూడా వెళ్లడం లేదు. 2019కి ముందు కార్గో సేవలు ఆరంభించిన కొద్ది కాలంలోనే నెలకు 250 టన్నులకు పైగా సరకు ఎగుమతి, దిగుమతి అయ్యే స్థాయికి చేరింది. ప్రత్యేకంగా కార్గో సర్వీసులను ఆరంభించే ప్రయత్నాలూ జరిగాయి. గత వైకాపా హయాంలో ఏడాదిన్నరకు పైగా కార్గో సేవలు నిలిచిపోయాయి. తిరిగి 2024 జులై 1 నుంచి సేవలు ఆరంభమైనా.. సరకు రవాణా అరకొరగానే జరుగుతోంది.

మత్స్య ఉత్పత్తులకు అవకాశాలున్నా..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తులు.. నిత్యం దిల్లీ, బెంగళూరు సహా అన్ని నగరాలకు రోడ్డు మార్గంలో వెళ్తున్నాయి. మత్స్య ఉత్పత్తులకు దిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. గన్నవరం నుంచి నేరుగా రెండు మూడు గంటల్లో దిల్లీ సహా ఆయా ప్రాంతాలకు సరకు చేర్చే అవకాశముంది.

ప్రస్తుతం ఏడు నగరాలకే..

ప్రస్తుతం హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నై, విశాఖ, తిరుపతి.. ఏడు నగరాలకు మాత్రమే ఇక్కడి నుంచి దేశీయ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నగరాలకు రోజుకు ఒకటిన్నర టన్ను వరకూ సరకు ఇటునుంచి వెళుతోంది. అటు నుంచి 4-5టన్నులు వస్తోంది.

★ దిల్లీ, ముంబయికి నడుస్తున్న.. ఐదు ఎయిర్‌బస్ 320 సర్వీసుల్లో ప్రయాణికులతో పాటు రెండున్నర నుంచి మూడు టన్నుల వరకూ సరకును తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. ఏటీఆర్-72 సర్వీసుల్లో టన్ను వరకూ తీసుకెళ్లొచ్చు.

అవగాహన, నమ్మకం కలిగించకే.. కార్గో సేవలను విస్తరించేందుకు.. ఉత్పత్తిదారులందరితో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. నేరుగా ఇక్కడి నుంచే సరకు పంపిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేయాలి. గత ఆరేళ్లుగా ఏ ప్రయత్నమూ చేయలేదు. దీంతో సరకును రోడ్డు మార్గంలోనే ఎక్కువ మంది ఇప్పటికీ పంపిస్తున్నారు.

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

రామరత్నం దాతృత్వం చిరస్మరణీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: రామరత్నం దాతృత్వం చిరస్మరణీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. నగరంలోని చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధుల సేవా ఆశ్రమ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం గుత్తికొండ రామరత్నం వర్ధంతి సభ నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'రామరత్నంలో దాతృత్వంతో పాటు భక్తితత్వం కూడా ఎక్కువగా ఉండేది. ఆమె పలు వ్యాపారసంస్థల ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించారు. సాహితీ కార్యక్రమాలకు ఎంతగానో చేయూత అందించేవారు. ఆమె పేరిట ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం' అని పేర్కొన్నారు. సాహితీవేత్త డా. పూర్ణచంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. గుత్తికొండ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించడంతో పాటు రామరత్నం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక, సాహితీవేత్త ఎంసీదాస్(విజయవాడ), సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్(ఉయ్యూరు), స్త్రీవాద కవయిత్రి మందరపు హైమావతి(విజయవాడ), ప్రసంగ ప్రజ్ఞానిధి, విమర్శకులు, డా. గుమ్మా సాంబశివరావు(విజయవాడ), నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ(ఒంగోలు), విద్యావేత్త దామెర్ల నరసింహారావు(మైలవరం), భావతరంగిణి సంస్థ నిర్వాహకులు, భవిష్య(మచిలీపట్నం)లకు గుత్తికొండ రామరత్నం ఛారిటబుల్ ట్రస్ట్ జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు సుశీల, వివిధ సంస్థల ప్రతినిధులు పోతురాజు, గురజాడ రాజరాజేశ్వరి, గుత్తికొండ చినసుబ్బారావు, వెంకటరాములు, అంజనీకుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు తదితరులు

శబరిమల వెళ్లే భక్తులకు జాగ్రత్తలు తప్పనిసరి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా నుంచి శబరిమల బయలుదేరి వెళ్లే అయ్యప్ప భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. ఎం. సుహాసిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పంబానది, చుట్టు పక్కల సరస్సులో జలాశయాల్లో స్నానము ఆచరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నిరంతరం చేతులు శుభ్రం చేసుకోవాలని, కాచిన నీటిని తాగాలని పేర్కొన్నారు.

అధిక లాభాలు.. విచ్చలవిడి చెల్లింపులు..

నకిలీ మద్యం వ్యవహారంలో అద్దేపల్లి సోదరుల తీరు

ఈనాడు, అమరావతి

నకిలీ మద్యం అమ్మకాల ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో అద్దేపల్లి జనార్దనరావు.. ముడి సరకు, ఇతర వస్తువుల కోసం అధిక మొత్తాలు వెచ్చించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సీసాలు, మూతలు, లేబుల్స్, స్పిరిట్, అన్నింటికీ రెట్టింపు, మూడు రెట్లు ధరలు చెల్లించారు. జనార్దనరావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావుల ఆర్థిక లావాదేవీలను పరిశీలించిన సిట్, ఎక్సైజ్ అధికారులకు భారీగా నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఎక్కడా తమ అక్రమ వ్యాపారానికి ఇబ్బంది లేకుండా చూసేందుకు అవతలి వ్యక్తులను అధిక ధరలతో ప్రలోభపెట్టినట్లు విచారణలో తెలిపారు.

పెద్ద మొత్తంలో విత్‌డ్రాయల్స్, నగదు బదిలీలు

నకిలీ మద్యం కేసులో నిందితుల మధ్య భారీగా లావాదేవీలు నడిచాయి. శనివారంతో ఇద్దరు నిందితుల కస్టడీ ముగిసింది. నాలుగు రోజుల విచారణలో వారి బ్యాంకు స్టేట్‌మెంట్లను తీసుకుని లావాదేవీల గురించి ప్రశ్నించి వివరాలు రాబట్టారు. నిందితుల మధ్య పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయి. బెంగళూరుకు చెందిన బాలాజీతో ఎక్కువ జరిగాయి. గోవా నుంచి స్పిరిట్ తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో అందించేవాడు. బాలాజీతో పాటు అతని కుమారుడు సుదర్శన్‌కు దాదాపు రూ. 1.50 కోట్ల వరకు ఇచ్చినట్లు తేలింది. పలుసార్లు ములకలచెరువులో అందజేశారు.

☛ లేబుళ్ల డిజైన్, ప్రింటింగ్ కోసం రవి ద్వారా హైదరాబాద్‌లోని పలువురికి రూ. 20లక్షల వరకు చెల్లింపులు జరిగాయి. ఎక్కువగా యూపీఐ ద్వారా బదిలీ జరిగాయి. కోయంబత్తూరుకు చెందిన వ్యాపారికి ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ సీసాలను తయారు చేసి పంపించినందుకు ఒక్కొక్క సీసాకు రూ. 4.50 చెల్లించాడు. ఈ బ్రాండ్ సీసాలకు మూడు రెట్లు ఎక్కువగా చెల్లించాడు.

☛ సీసాల కోసం సూరంపల్లిలో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పరిశ్రమలో తయారు చేశారు. వీటికి కూడా రెట్టింపు ధరను జగన్మోహన్‌రావు చెల్లించాడు. మూతల సరఫరా విషయంలోనూ ఇదే విధంగా అధిక ధరలు చెల్లించాడు. వీటిని సరఫరా చేసిన మనోజ్‌కుమార్ జైన్, ధారబోయిన ప్రసాద్‌లకు సాధారణంగా రేట్ల కంటే ఎక్కువ మొత్తమే చెల్లించినట్లు లావాదేవీల ఆధారంగా గుర్తించారు.

వికసిత్ భారత్‌కు సత్యసాయి విలువలు మార్గదర్శకం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయి చూపిన విలువల మార్గం.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు మార్గదర్శకమని కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, జిల్లా అధికార యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సహకారంతో ఆదివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో కావూరి చైతన్య, వివిధ శాఖల అధికారులు, సత్యసాయి సేవా సమితుల సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విశ్వశాంతి, సౌభాగ్యం, మానవాళి సుఖ సంతోషాల కోసం పరితపించిన సత్యసాయి సేవలు ఆదర్శనీయం అన్నారు. 'అందరినీ ప్రేమించు- అందరినీ సేవించు' అనే సత్యసాయి సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, విద్యార్థులు విలువలతో కూడిన విద్యను భ్యసించాలని సూచించారు. శ్రీసత్యసాయి సేవా సమితి సారథ్యంలో ఆధ్యాత్మిక సేవా విద్యా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను విజయవాడ సమితి కన్వీనర్ ఎన్. వి. ఎల్. నరసింహారావు వివరించారు. కాగా ఇదే వేదికపై జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాకారుల నృత్య, అభినయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు సి. హెచ్. సాయిగీత, ఝాన్సీ, విజయలక్ష్మి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

కళాకారిణుల నృత్య ప్రదర్శన

ఉన్నత చదువుకు వెళ్లి తిరిగి రాని లోకాలకు..

నందిగామ, న్యూస్‌టుడే : అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లిన కుమారుడు ప్రయోజకుడైన తిరిగి వస్తాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. అక్కడే అనారోగ్యంతో మృతి చెందటంతో బోరున విలపిస్తున్నారు. నందిగామ శివారు హనుమంతుపాలేనికి చెందిన గాడిపర్తి రాధాకృష్ణ, రాధ దంపతులకు నవీన్‌కుమార్, కిరణ్ సంతానం. కష్టపడి వ్యవసాయం చేస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. ఇద్దరు అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లారు. పెద్ద కుమారుడు నవీన్‌కుమార్ టెక్సాస్‌లో ఉద్యోగాన్వేషణలో ఉండగా.. తీవ్ర అనారోగ్యానికి గురై శుక్రవారం అమెరికాలోని బూస్టన్ వైద్యశాలలో మృతి చెందాడు. ఎంపీ కేశినేని శివనాథ్, విప్ సౌమ్య, తానా సభ్యుల సహకారంతో మృతదేహాన్ని తీసుకుని సోదరుడు కిరణ్ ఆదివారం హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి వచ్చాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నవారు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, రాటకొండ వెంకట్రావు తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలు చేశారు.

నవీన్‌కుమార్ (పాత చిత్రం)

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు. నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.
అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు
అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.
న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:
ఎ.కొండూరు, జగ్గయ్యపేట టౌన్, గుణదల, సత్యనారాయణపురం, విజయవాడ లీగల్, ధర్నాచౌక్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సబ్ కలెక్టరేట్
సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.
గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.
న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521 104

బూదవాడలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

25 మందిపై కేసు నమోదు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న ఇరువర్గాల ఘర్షణల విషయమై పోలీసులు 25 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు. . ఇరువర్గాల్లోని అనుమానితులపై ఐపీసీ 307 పాటు పలు సెక్షన్లు నమోదు చేసినట్లు తెలిపారు. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో ఒక వర్గంలోని 14 మందిపై, మరో వర్గంలోని 11 మందిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. అరెస్టుల పర్వం పూర్తికాగానే గ్రామంలో వివాదాల్లో పాల్గొన్నవారు, ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయి ఘర్షణలు చెలరేగి. . అవి పలుమార్లు పునరావృతం కావడంతో పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేయడమే కాక ఇరువర్గాలకు తీవ్ర హెచ్చరికలు చేసి రాజీ చేశారు. పాతకక్షలను పురస్కరించుకొని శనివారం రాత్రి గ్రామ శివార్లలో మొదలైన వివాదం.. చివరికి కర్రలు, రాళ్లు, సుత్తులు, కడ్డీలతో దాడి వరకూ వెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు గ్రామంలో తీవ్రత రీత్యా తొలుత పరిస్థితిని అదుపులోకి తెచ్చి అనంతరం పికెట్ కొనసాగించారు. గాయాలపాలైన ఏడుగురిలో ఐదుగురు స్థానికంగా చికిత్స పొందుతుండగా.. మరో ఇద్దరు విజయవాడలో చికిత్స పొందుతున్నారు. ఘర్షణల్లో గాయపడిన సరిహద్దు తెలంగాణ గ్రామమైన రామాపురం వాసి ఆ రాష్ట్రంలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఇది అంతర్రాష్ట్ర వివాదంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న బందోబస్తును డీసీపీ, ఏసీపీలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలో కొనసాగుతున్న పికెటింగ్‌తో ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గ్రామంలో పోలీసుల పహారా

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలంలోని రావికంపాడు సమీపంలో గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. పొలాల మధ్య పంట కాలువలో మహిళ మృతదేహం ఉందని ఆదివారం ఉదయం స్థానికులు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. 30 ఏళ్ల లోపు మహిళ సగం వస్త్రాలతో మొహంపై గాయాలతో చేతిపై ప్రణయ్ అనే టాటూ ఉండడాన్ని గుర్తించారు. మృతదేహం లభ్యమైన తీరును బట్టి హత్యగా నిర్ధారించారు. ఏ గ్రామానికి చెందిన మహిళో తెలుసుకునేందుకు ఆనవాళ్లను పోలీస్ సిబ్బందికి పంపారు. జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన మహిళై ఉంటుందన్న అంచనాలతో ఆరా తీస్తున్నారు. ఎవరు చంపి ఉంటారనే అంశంపై స్పష్టత కోసం పలు కోణాల్లో పరిశోధిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండు రోజుల్లో కేసులోని మిస్టరీని ఛేదిస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రపంచకప్ గెలుపు దేశానికి గర్వకారణం

ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంధ మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో నేపాల్‌పై భారత మహిళా జట్టు సాధించిన విజయం దేశానికి గర్వకారణమని ఆంధ్రా క్రికెట్ సంఘ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. భారత మహిళల అంధ క్రికెట్ జట్టుకు ఏసీఏ తరఫున అభినందనలు తెలిపారు. కొలంబోలో ఆదివారం ముగిసిన ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత జట్టు ప్రదర్శన అంతర్జాతీయ వేదికపై దేశ గౌరవాన్ని మరోసారి నిలబెట్టిందని పేర్కొన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగు తేజం పి. కరుణకుమారికి ఆయన అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం దేశంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. శారీర ప్రతిబంధకాలను పక్కనబెట్టి అసాధారణ పోరాట స్ఫూర్తి, కృషి, సంకల్ప బలం ప్రదర్శించి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల అంధ క్రికెట్ జట్టు నిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. ఈ విజయం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని ఆయన పేర్కొన్నారు.

'ఎన్‌కౌంటర్‌లపై న్యాయమూర్తితో విచారణ జరపాలి'

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : బూటకపు ఎన్‌కౌంటర్‌లను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. చర్చలకు సిద్ధమని, ఆయుధాలు పక్కన పెడతామని మావోయిస్టులు వెల్లడించినా.. వారిని కాల్చి చంపడం యుద్ధనీతికి వ్యతిరేకమన్నారు. ప్రభుత్వం మావోయిస్టుల మధ్య జరుగుతున్న హింస, ప్రతిహింసల్లో అత్యధికంగా ఆదివాసీలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు చట్టానికి లోబడి పనిచేయాలని సూచించారు. చర్చలతోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్. వేదికపై శంకర్, శోభనాద్రీశ్వరరావు తదితరులు

చంపే అధికారం ఎవరు ఇచ్చారు: వడ్డే

వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి పాలకులు ఎంచుకున్న ఈ విధానం సరైంది కాదన్నారు. మావోయిస్టులను కోర్టులో హాజరుపరచకుండా చంపే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వాళ్లు నేరస్థులా? కాదా? అనే విషయాన్ని న్యాయ వ్యవస్థ తేల్చాలి తప్ప.. పోలీసులు కాదన్నారు. సీపీఐ నాయకుడు జె. వి. వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్లతో మావోయిజాన్ని అంతం చేయాలనుకోవడం పాలకుల భ్రమ అన్నారు. మోదీ ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు ఇవి నిదర్శనమని దుయ్యబట్టారు. సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. ప్రసాద్ మాట్లాడుతూ. . మోదీ ప్రభుత్వ కగార్ ఆపరేషన్‌కు మద్దతుతో ఆగకుండా.. ఆపరేషన్ సంభవ్ నిర్వహణలోనూ చంద్రబాబు ప్రభుత్వం భాగస్వామిగా మారిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి. రమాదేవి, ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, న్యూడెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం నాయకులు చిలుకా చంద్రశేఖర్, డి. హరినాథ్, వెంకట్‌రెడ్డి, లలిత, రామకృష్ణ, జానకి రాములు, ప్రసాద్ బాబు, దుర్గారావు, పోలారి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

వెంచరు వివాదం..

ప్రాణహాని ఉందని బాధితుడి ఆవేదన

చిట్టినగర్, న్యూస్‌టుడే: వెంచరు వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడి నానా బీభత్సం సృష్టించి భయభ్రాంతులకు గురి చేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే.. బెంజిసర్కిల్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో మాధవరపు శ్రీనివాసరావు నివసిస్తున్నారు. ఎం.ఎస్.ఆర్ డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. విజయవాడ గ్రామీణ ప్రాంతం అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలో వెంచరు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న నగరానికి చెందిన అమరేంద్రనాథ్, ఎం.కొండారెడ్డి, దేవిరెడ్డి శంకరరావు కలిసి వారికి వారి అనుచరులు 10 మందితో వెంచరులోకి వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. రియల్ ఎస్టేట్ కార్యాలయం, ప్రధాన ద్వారం గేటు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి.. కార్యాలయంలో పని చేసే రత్నకుమార్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టి.. చంపుతామని బెదిరించారు. జేసీబీతో కార్యాలయం గది ధ్వంసం చేశారు. అక్కడే పని చేస్తున్న టి. రాధాకృష్ణ, వి. గోపాలకృష్ణ, ఎస్. ప్రసాద్‌లను భయభ్రాంతులకు గురి చేశారు. శంకరరావు, కొండారెడ్డి అరుస్తూ మీ యజమానిని చంపేస్తామని హెచ్చరించారు. విద్యుత్తు స్తంభాల తీగలు తొలగించి హంగామా సృష్టించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనివాసరావు సుమారు రూ. 6 లక్షలు విలువైన ప్రాపర్టీ నష్టం చేశారని, తనకు తన కుటుంబానికి వారి నుంచి ప్రాణహాని ఉందని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు.

కోర్టులో స్థల వివాదం.. అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంచరు ఇరువర్గాలు భాగస్వాములని, వారి మధ్యనే వివాదం తలెత్తడంతో ఆ విషయమై కోర్టులో నడుస్తుందని బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు కూడా సహకరించడం లేదని వాపోయాడు. తనకు తెదేపా నాయకుడు ఎరుబోతు రమణ, శంకరరావు వల్ల ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. పోలీసులు మాత్రం వెంచరుకు సంబంధించిన డాక్యుమెంట్లు చూపాలని అడిగామని చెబుతున్నారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

VJA **సిద్ధార్థనగర్** మోడరన్ ఫుడ్స్ దగ్గర HRT రెసిడెన్సీలో 2BHK ఫ్లాట్ 1078 Sft E/F గ్రౌండ్ ఫ్లోర్ కప్‌బోర్డ్స్ కారుపార్కింగ్‌తో అమ్మకానికి కలదు ✆ 94932 45833, 92464 72339.

HOUSE FOR SALE

విజయవాడ బందరురోడ్డు దగ్గరలో ★ తులసీనగర్ 3వ లైన్‌లో 123 చ.గ.ల్లో G+1 తూర్పు ఫేస్ బిల్డింగ్ అమ్మకం. ✆ 82477 82459.

ఇల్లు అమ్మబడును
విజయవాడ, 1 టౌన్ శ్రీనివాస మహల్ వెనుక రోడ్‌లో, రోడ్‌కి ఆనుకొని, 221 గజాల G+1 (8 పోర్షన్‌ల ఇల్లు) అమ్మబడును. No Brokers.
✆ 93467 20854

JOBS

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

Req. Fresh/Exp any (ITI/ B.Tech/ Dip) Production. MCA. MBA. Manager. M.Sc., B.Sc., Chemist. B.Com., BA. Sal: 94000. gkltd. ✆ 78428 36844.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్ ఎగ్జిక్యూటివ్స్. Q: 10th/డిగ్రీ రిటైర్డ్ బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెటింగ్. నోటార్గెట్. ✆ 90524 70111.

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆ 70320 60786

ప్రముఖ ఆర్కిటెక్ ఆఫీసులో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవంఉన్న Male కావలెను. ✆ 93973 41745

విజయవాడలో ప్రముఖ 3 స్టార్ హోటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ మేనేజర్ మరియు యువతి యువకులు కావలెను. ✆ 91001 17227.

డెలివరి బాయ్స్ ★ ఆఫీసు బాయ్స్ మరియు గర్ల్స్ విజయవాడ నందు పని చేయుటకు కావలెను. అనుభవం బట్టి జీతం ఇవ్వబడును. ✆ 92466 33459

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రాష్ట్ర స్థాయి సైక్లింగ్‌లో హవా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్యల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 14, 17, 19 బాల, బాలికల అంతర్ జిల్లాల సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా బృందం ట్రాక్ ఈవెంట్‌లో 48 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ఛాంపియన్‌షిప్ కార్యనిర్వాహక కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. రోడ్డు ఈవెంట్‌లో గుంటూరు బృందం 63 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి శాప్ సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, పోటీల పరిశీలకుడు ఐ.సునీల్, ఉమ్మడి కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ కార్యదర్శి కె.సుగుణరావు అతిథులుగా హాజరై ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు, వ్యక్తిగత విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన సైక్లిస్టులకు పసిడి, రజత, కాంస్య పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాంబాబు, వ్యాయామ సంచాలకుడు టి.విజయవర్మ, పీఈటీలు ఎంవీఎస్ ప్రసాద్, కె.పురుషోత్తం, ఎం.రూతమ్మ, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

తిరువూరు 4వ వార్డులోని డ్రెయినేజీలో మట్టి, బురద పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికుడైన కిరణ్‌కుమార్ 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

స్పందనకు వందనం

★ నరసాపురం గ్రామ పంచాయతీ ఉప్పర బజారులో గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి దాత గొట్టేటి సుబ్రహ్మణ్యం సహకారంతో ట్రాక్టర్ ద్వారా రబ్బీష్ తోలించి పారిశుద్ధ్య కార్మికులతో సరి చేయించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

? కొండపల్లి ఆరు పంపుల కూడలి డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. ఈ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. **- శ్యామలరావు, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి అక్కడి చెత్తను తొలగిస్తాం. **- వెంకటరత్నం, పారిశుద్ధ్య పనుల ఇన్‌ఛార్జి - న్యూస్‌టుడే, కొండపల్లి**

? తిరువూరు 9వ వార్డులోని నివాసాల మధ్యనున్న ఖాళీ స్థలాల్లో మురుగు నిలుస్తోంది. **- వెంకట్రావు, స్థానికుడు**

✔ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- మున్సిపల్ శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

నేడు రెండు గ్రామాల్లో రైతన్నా.. మీకోసం

ఎ.కొండూరు, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఎ.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుద్ధ జలాల సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు కోకిలంపాడు, 5.30 గంటలకు మల్లేలలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎట్టకేలకు పనులు ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం నుంచి నూజివీడు వెళ్లాలంటే మధ్యలో ఉన్న వెల్వడం, చంద్రాల దాటాలంటే ప్రయాణికులకు అవస్థలే. దాంతో ఆ మార్గం ఒకటున్నదన్న విషయాన్నే కొన్నాళ్లుగా ప్రజలు మర్చిపోయారు. అభివృద్ధి పనులు చేయడాన్ని వాయిదాలు వేస్తూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. ఆర్నెళ్ల కిందటే మైలవరం నుంచి వెల్వడం అడ్డరోడ్డు వరకు వెట్‌మిక్స్ వేసినా, వర్షాలకు మరింత గోతులు పడటంతో, అవస్థలు పడుతున్న నేపథ్యంలో గోతుల రోడ్డుపై మందంగా వెట్‌మిక్స్ వేస్తూ చదును చేసే పనులు జరిగాయి.

యంత్రంతో చదును చేయిస్తూ..

పొంచి ఉన్న ప్రమాదం.. రైతుల్లో కలవరం

జి.కొండూరు, న్యూస్‌టుడే

ఈ ఏడాది కురిసిన వర్షాలకు పులివాగు సప్లయ్ ఛానల్ మీదుగా జి.కొండూరు పోలీస్ స్టేషన్ సమీపంలోని పంట చెరువుకు నీరు పుష్కలంగా చేరడంతో నిండు కుండలా దర్శనమిస్తోంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో పెద్దగా పంటను పండించుకునే అవకాశం ఏర్పడింది. కానీ ప్రస్తుతం చెరువు పొంగే ప్రమాదం పొంచి ఉందని కర్షకుల్లో ఆందోళన మొదలైంది. ఆకాశం మబ్బులు కమ్మితే చాలు ఆయకట్టు రైతుల్లో భయాందోళన నెలకొంటుంది. దీనికి కారణం చెరువు నిండితే నీరు బయటకు వెళ్లేందుకు కళింగ లేకపోవడమేనని వాపోతున్నారు.

పంట చెరువు పడమర దిక్కున ఆక్రమణకు గురైన అలుగు

వర్షాలు పడినప్పుడు..

దాదాపు 41.76 ఎకరాల పంట చెరువు కింద రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. వర్షాలు పడినప్పుడు గడ్డమణుగు మేజర్ గడ్డ సమీపంలోని పులివాగు సప్లయ్ ఛానెల్ నుంచి చెరువులోకి నీరు చేరుతోంది. ఇటీవల మొంథా తుపాన్ సమయంలో పులివాగు సప్లయ్ ఛానెల్ మూసి వేయడంతో ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో చెరువు నిండితే రెండు వైపులా అలుగు పారేందుకు వీలు ఉండటంతో పంటలు పండించుకునేవారు. చెరువుకు అధికంగా నీరు చేరితే తూర్పు వైపునున్న అలుగు నుంచి ఆత్కూరు పంట చెరువుకు, మరో పక్క పడమరగా ఉన్న అలుగు పారి నీరు పులివాగులో కలుస్తోంది. ఈ రెండు పూర్తిగా ఆక్రమణకు గురై చెరువు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకున్నాం

పులివాగు సప్లయ్ ఛానెల్ నుంచి నీరు చెరువుకు చేరకుండా చర్యలు తీసుకున్నాం. రైతులు విజ్ఞప్తి మేరకు వర్షం వచ్చి చెరువు నిండినప్పుడు అదనపు నీరు బయటకు వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ వెనుక నుంచి పూడిపోయిన అలుగును తాత్కాలికంగా ఎన్నెస్పీ మైనర్‌కు అనుసంధానం చేశాం.

- రాజేష్, నీటి పారుదల శాఖ సహాయక ఇంజినీర్

100 మందికి కంటి వైద్య పరీక్షలు

నేత్ర పరీక్షలు చేస్తున్న లక్ష్మీకుమారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రుద్రవరం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు సంఘ అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ ఉప సర్పంచి బి.కృష్ణారెడ్డి, ఎం.వాసుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కంటి వైద్య నిపుణురాలు పి.లక్ష్మీకుమారి వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచి జె.చాంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో సమాజ సేవకు అవకాశం

మైలవరం, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేసుకునే అవకాశం కలుగుతుందని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించి క్యాడెట్లు గౌరవ వందనం చేశారు. ఎన్‌సీసీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జడ్.నాగిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జె.రాముడు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వందనం చేస్తున్న క్యాడెట్లు

ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌కు అభినందన

కొండపల్లి, న్యూస్‌టుడే : ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన మొహమ్మద్ ఫారూక్ షుబ్లీకు సుఫీ మత గురువులు అల్తాఫ్ రజా అభినందనలు తెలిపారు. ఉర్దూ అకాడమి ఛైర్మన్‌గా బాధ్యతలు వహించిన ఆయనను ముస్లిం మత పెద్దలు విజయవాడలో ఆదివారం కలిసి ఘనంగా సత్కరించారు. ఉర్దూ భాషాభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. షేక్ మహబూబ్ సుభాని, తబ్రేజ్, కుమార్, షేక్ బాషా, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్సు పోటీల్లో ప్రతిభ

తిరువూరు టౌన్, విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక నాగార్జున పాఠశాలకు చెందిన విద్యార్థులు విస్సన్నపేటలోని వికాస్ టెక్నో స్కూల్ వేదికగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించారు. బి.గ్రీష్మజ, డి.చరితశ్రీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వి.మురళీ మోహన్, కార్యదర్శి గంగాధరరావు, వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ నరెడ్ల నర్సిరెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మేలు

అమ్మిరెడ్డిగూడెం, గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని అమ్మిరెడ్డిగూడెం, గోసవీడు గ్రామాల పరిధిలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు వి.రాజకుమారి ఆదివారం తనిఖీ చేసి ఆరబెట్టిన ధాన్యం పరిశీలించారు. ధాన్యం ఆరుదల పూర్తవ్వగానే సాగుదారులు పీపీసీ కేంద్రాల్లో పంటను విక్రయిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చన్నారు. పలువురు అధికారులు ఆమె వెంట ఉన్నారు.

అమ్మిరెడ్డిగూడెం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకుమారి

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల కార్యక్రమం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : నాగులూరు గ్రామంలో అయ్యప్ప స్వామి దీక్షాధారుల ఇరుముడుల కార్యక్రమం ఆదివారం జరిగింది. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీవీ. సత్యనారాయణ(విజయబాబు), కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

నాగులూరు రామాలయంలో అయ్యప్ప స్వామి దీక్షాధారులు

ఘనంగా సత్య సాయిబాబా జయంతి వేడుకలు

సత్యాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : పద్యనాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత నేటి తరం ప్రజలపై ఉందని ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ డైరెక్టర్, బళ్లారి రాఘవ కళాపీఠం అధ్యక్షుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి అన్నారు. పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంత్యుత్సవం సందర్భంగా మండలంలోని సత్యాలపాడులో తెలుగు కళారత్నాలు సేవా సంస్థ, ఉషోదయం ఫౌండేషన్ నిర్వాహకులు యూవీ.రత్నం, డి.ఉషారాణి, విశ్రాంత తహసీల్దార్ టి.రామచంద్రరాజు సంయుక్త ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటక ఏకపాత్రాభినయం, కవి సమ్మేళనం, జానపద పాటలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోపాలకృష్ణసాయి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పి.వెంకయ్య నిర్వాహకులతో కలిసి కళాకారులను సత్కరించారు.

సత్యాలపాడులో పౌరాణిక కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెనుగొలనులో పల్లకీ సేవ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకలను ఆదివారం రెడ్డిగూడెంలోని శ్రీసత్య సాయి ధ్యాన మందిరంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో శ్రీసత్య సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున సాయి మందిరంలో పూజలు చేశారు.

పెనుగొలను(గంపలగూడెం) : మండలంలోని పెనుగొలనులో సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు.

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో విస్సన్నపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం ప్రాంగణంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

స్పందించండి.. వెతలు తీర్చండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం నుంచి దాములూరు గ్రామీణ రహదారిలో జూపూడి, మూలపాడు గ్రామాల వద్ద ఇబ్బడి వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో డొంక రోడ్డుగా ఉన్న దీన్ని జాతీయ రహదారికి సమాంతరంగా నదీ తీర గ్రామాలను కలుపుతూ ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద అభివృద్ధి చేశారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లి వచ్చేందుకు ఇది ఒక్కటే మార్గం. గ్రామాల ఎగువ నుంచి వచ్చి కృష్ణా నదిలో కలిసే వాగులను దాటేందుకు రహదారిపై లోలెవల్ వంతెన నిర్మించారు. ఇటీవల జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువ కావడంతో ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలతో పాటు ఇతరులు వివిధ పనులకు వెళ్లిరావడానికి ఈ రహదారినే వినియోగిస్తారు. వర్షాకాలంలో వాగులు పొంగి లోలెవల్ వంతెనలపై మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుంది. లో లెవల్ వంతెనకు ఇరువైపుల రెయిలింగ్ లేకపోవడంతో ఇటీవల వరదలకు ద్విచక్ర వాహన చోదకుడు అదుపు తప్పి కింద పడి వాగు ప్రవాహంలో కొట్టుకు పోతుండగా సమీపంలోని రైతులు యువకుడిని రక్షించారు. రెయిలింగ్ లేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను అధికమించడంలో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. రానున్న వర్షాకాలం నాటికి వంతెనకు ఇరుపక్కల రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూపూడి వద్ద ఇబ్బడివాగుపై రెయిలింగ్ లేని వంతెన

మోక్షం కలగక.. ప్రమాదాలు ఆగక

మండలంలోని కొత్తగూడెం నుంచి చిలుకూరివారిగూడెం వెళ్లే మార్గంలో బుడమేరు వాగుపై ఉన్న వంతెన శిథిలమై మూడేళ్లవుతున్నా అభివృద్ధికి మోక్షం కలగడం లేదు. వైకాపా హయాంలో కింద ఉన్న పిల్లర్లు, పక్కనున్న రోడ్డు కుంగింది. ఈ నేపథ్యంలో రూ.45 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు అప్పట్లోనే అధికారులు ప్రకటించినా ఆమోదం రాలేదు. దాంతో ప్రస్తుతం మరింత పగిలి రాకపోకలు ప్రమాదకరంగా మారినా, పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, మైలవరం

యథేచ్ఛగా మద్యం.. గంజాయి అమ్మకాలు!

విస్సన్నపేట, న్యూస్‌టుడే

మండల కేంద్రం విస్సన్నపేటలోని పలు ప్రాంతాల్లో అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా సరఫరా జరుగుతున్నట్లు నివాసితులు తెలుపుతున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, బాలికలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్టాండు, బీజేఆర్ నగర్, ఏ.కొండూరు రోడ్డు, పుట్రేల రహదారి, పోలీసు స్టేషన్ వెనుక ప్రాంతం, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం, గంజాయి, జూదం, వ్యభిచారం యథేచ్ఛగా నడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా వెనుక కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నట్లు సమాచారం. యువత, మహిళలు, విద్యార్థులే లక్ష్యంగా ఈ వ్యవహారం జరుగుతున్నట్లు తెలిసింది. వ్యసనానికి బానిసైన ఓ మహిళ ఇటీవల పూటుగా మద్యం తాగి, గంజాయి సేవించి మండల కేంద్రం గాంధీ విగ్రహం ముందు స్పృహ తప్పి పడిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మద్యం, గంజాయి, జూద క్రీడలను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విస్సన్నపేట సెంటర్‌లో స్పృహ తప్పి పడిపోయిన ఓ మహిళ

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణ రాయితీ కోసం వినియోగదారులకు మరో అవకాశం కల్పించింది. విద్యుత్తు సర్వీసులకు అధిక విద్యుత్తు వినియోగిస్తుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30 వరకు 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చింది. మళ్లీ మరో అవకాశంగా డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించింది. మీ సేవా కేంద్రాల్లో, విద్యుత్తు సరఫరా సంస్థ వెబ్‌సైట్‌లో కావాల్సిన కిలో వాట్‌కు తగిన సొమ్ము చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవచ్చు. వినియోగదారులు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవచ్చని అధిక లోడు వాడకంపై జరిమానాల బారిన పడకుండా చూసుకోవాలని ఇబ్రహీంపట్నం సహాయక ఇంజినీరు వెంకన్న తెలిపారు.

పంటల నష్టంపై నివేదిక

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఈ నెల మొదటి వారంలో వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో జరిగిన పంట నష్టాన్ని అధికారులు అంచనా వేశారు. ఈ- పంట నమోదు ఆధారంగా వరి, పత్తి నష్టాన్ని అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి వి.హరీష్ కుమార్ తెలిపారు. పత్తి, వరి రైతులకు రూ.6.29 కోట్ల వరకు పంట నష్టం వాటిల్లిందని నివేదిక పంపించారు. ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తే బాధిత కర్షకులకు ఎకరాకు రూ.6,800 చొప్పున చెల్లిస్తారు.

ప్రజలకు అండగా ఉంటా

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని గొల్లపూడిలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కేకు కోసి సందడి చేశారు.

మహిళకు మూడు చక్రాల వాహనం అందిస్తున్న సుబ్బారావు

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచి ఆలయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి.

భోజన పథకానికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం, ఆయాల సంఘం మండల సమావేశాన్ని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.త్యాగరాజు, ఎస్‌కే.నాగుల్‌మీరా ఆధ్వర్యంలో గంపలగూడెంలో ఆదివారం నిర్వహించారు. భోజన పథకానికి గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని, విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. కార్మికులకు ఏకరూప దుస్తులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నినాదాలు చేస్తున్న వంట ఏజెన్సీ సభ్యులు, ఆయాలు, ఏఐటీయూసీ నాయకులు

లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను విస్సన్నపేట బస్టాండ్ సెంటర్‌లో దగ్ధం చేస్తూ సీఐటీయూ శ్రేణులు నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు జ్ఞానరత్నం, నాయకులు రాము, నాగేశ్వరరావు, సుబ్బారావు, కన్నయ్య పాల్గొన్నారు.

విస్సన్నపేటలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ శ్రేణులు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

చందర్లపాడు: తోటరావులపాడు, ఏటూరు మధ్య రోడ్డు అభివృద్ధి పనులను చింతలపాడులో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు రహదారి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

మార్గంలో ఇలా.. రాకపోకలు ఎలా?

విజయవాడ- విస్సన్నపేట మార్గంలో పిచ్చిపొదలు పెరిగి తారురోడ్డుపైకి చొచ్చుకొస్తున్నాయి. దీంతో కళాశాలల బస్సులు, చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అసలే గుంతలమయంగా తయారైన రోడ్డులో రాకపోకలు సాగించలేక పోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ రహదారిలో పడిన గోతులకు మరమ్మతులు, రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

కన్నారావుకు తెదేపా శ్రేణుల నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో శనివారం మృతి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి కన్నారావు మృతదేహానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం నివాళులర్పించారు. నాయకులు లితీష్, బాలకృష్ణ, వెంకట నారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో చోదకుడి మృతి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న చోదకుడు గరిడేపల్లి చిన్నపుల్లయ్య(42) మృతి చెందాడు. గ్రామానికి చెందిన కె.కొండలరావుకు చెందిన ట్రాక్టర్‌కు చిన్నపుల్లయ్య డ్రైవర్‌గా ఉన్నాడు. మధ్యాహ్నం ట్రాక్టర్ నడుపుతుండగానే ప్రమాదవశాత్తు సీటు నుంచి జారి టైర్ల కింద పడిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గంపలగూడెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిన్నపుల్లయ్య మృతదేహం

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

ఆదమరిస్తే అంతే ఇక

గొల్లపూడి వన్‌సెంటర్ రోడ్డులోని గొయ్యి ప్రమాదకరంగా మారింది. తాగునీటి పైపులైన్ వాల్వ్ కోసం కొన్ని రోజుల కిందట పంచాయతీ సిబ్బంది దాన్ని తవ్వారు. ఆ తర్వాత పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా తయారైంది. నిత్యం ఈ మార్గంలో వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాల విద్యార్థులు, చిన్నారులు అటుగానే వెళ్తున్నారు. కొంత మంది అందులో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దాన్ని పూడ్చించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, గొల్లపూడి

గొలుసు దుకాణాలను నిర్మూలించండి

తిరువూరు టౌన్: తిరువూరు పట్టణ, మండల పరిధిలో గొలుసు దుకాణాల్లో 24 గంటలు మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలోనే ఇవి ఎక్కువగా ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందజేసిన సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు, ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించి గొలుసు దుకాణాలను పూర్తిగా నిర్మూలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

గోపాలపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని గోపాలపురం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై జి.మహాలక్ష్మణుడు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.4,810 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైన జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

విజేతలతో ప్రిన్సిపల్ సునీత, డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రతిభ చాటి.. బహుమతి పట్టి..

పటమట, న్యూస్‌టుడే: పటమటలోని శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ రిషిత్ గుప్తా (9వ తరగతి), ద్వితీయ బి.మహామన్విత (9వ తరగతి).. తృతీయ బహుమతి ఎం.లలిత ప్రణవి (9వ తరగతి) సాధించారు. వీరికి ప్రిన్సిపల్ కె.సునీత, డీన్ పి.వెంకటేశ్వర్లు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సత్య సాయిబాబాకు ఘన నివాళి

బాబా చిత్రపటం వద్ద మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ (జీ) రవీంద్రరావు, ఉద్యోగులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: భగవాన్ సత్య సాయిబాబా సేవలు ప్రపంచవ్యాప్తంగా ఎందరో మన్ననలు, ప్రశంసలు అందుకున్నాయని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సాయిబాబా శత జయంతి కార్యక్రమం సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అదనపు కమిషనర్ (జీ) ఎ.రవీంద్రరావుతో కలిసి సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయి ట్రస్ట్ ద్వారా కోట్లమంది భక్తులకు బాబా వివిధ సేవలు అందించారని అన్నారు. ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం, తాగునీరు చేరువ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు గోపాలకృష్ణ నాయక్, కార్పొరేషన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తోటివారికి సాయం చేస్తే సంతృప్తి

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ప్రభాస్ తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న వారికి ఉన్నంతలో సాయం చేస్తే సంతృప్తి, జీవితానికి సార్థకత లభిస్తుందని పర్వతనేని చంద్రశేఖరరావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ పర్వతనేని ప్రభాస్ అన్నారు. ఆదివారం స్థానిక సిద్ధార్థ కూడలిలోని కమ్మ విద్యార్థినుల వసతి గృహంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు రూ.3 లక్షల ఉపకార వేతనాలు, బీటెక్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఓ విద్యార్థినికి ల్యాప్‌టాప్, ముగ్గురికి కుట్టు మిషన్లు, ఇస్త్రీపెట్టెలు, విజయమేరీ పాఠశాల విద్యార్థులకు దుస్తులు, వృద్ధాశ్రమానికి వంద దుప్పట్లు ఆదివారం ప్రభాస్ అందజేశారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు జయంతి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

నేడు కార్పొరేషన్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అనువుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రెయిన్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులు తదితర సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని ఆయన సూచించారు.

నేడు నగరానికి కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : విదేశీ పర్యటన నిమిత్తం ప్రభుత్వ అనుమతితో సెలవుపై వెళ్లిన నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం తిరిగి నగరానికి రానున్నారు. యథావిధిగా ఆయన విధులు నిర్వహించనున్నారు. ఈనెల 12 నుంచి ఆయన సెలవు పెట్టారు. ఆయన స్థానంలో అదనపు కమిషనర్ (జీ) డి.చంద్రశేఖర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

లక్ష్య సాధనకు ఎత్తులు

చెస్ టోర్నీలో క్రీడాకారుల ప్రతిభ ● రేటింగ్ మెరుగుకు కృషి

న్యూస్‌టుడే-విజయవాడ (క్రీడలు): నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో మూడు రోజులు నిర్వహిస్తున్న అంతర్జాతీయ బిలో 1800 రేటింగ్ చెస్ టోర్నీలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. ఈ టోర్నీలో వయసుతో సంబంధం లేకుండా పోటీ పడటం విశేషం. టోర్నీలో ఆడుతున్న పలువురు క్రీడాకారులను 'న్యూస్‌టుడే' పలకరించింది.. వారు చదరంగంపై తమ ఇష్టం, లక్ష్యాలు వెల్లడించారు.

చెస్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నా పేరు రామ ఆంజనేయుడు. హైదరాబాద్ నుంచి వచ్చాను. చిన్నతనంలో ఇంట్లో నాన్న చెస్ ఆడేవారు. అలా స్ఫూర్తి పొందా. చదరంగం పుస్తకాలు చదివి సొంతంగా సాధన చేశా. ప్రస్తుతం హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్‌లో ఐటీఎస్ అధికారిగా ఉన్నా. అయిదేళ్ల నుంచి ప్రొఫెషనల్‌గా ఆడుతున్నాను. ఈ ఆట అంటే ఇష్టం. రెండేళ్ల క్రితమే క్లాసికల్‌లో 1710 రేటింగ్ వచ్చింది. చెస్‌లో రాణించాలంటే ముందు నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలి. క్లాసికల్ చెస్‌లో 2000 ఫిడే రేటింగ్ సాధించడమే లక్ష్యం.

నా పేరు శ్రీ వర్షిణి తన్నీరు (10). హైదరాబాద్ నుంచి వచ్చాను. గత ఏడాది చెస్ సాధన ప్రారంభించాను. రోజూ రెండు గంటలు సాధన చేస్తాను. రెండు నెలల క్రితమే క్లాసిక్ ఈవెంట్‌లో ఫిడే 1425 రేటింగ్ వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. చెస్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనేదే నా లక్ష్యం.

నా పేరు చెరుకూరి శౌర్య (13). మాది గుణదల. ఏడాది నుంచి సాధన చేస్తున్నా. బ్లిట్జ్‌లో 1462, ర్యాపిడ్‌లో 1450 రేటింగ్ ఉంది. తల్లిదండ్రులు వ్యాపారులు. క్లాసికల్‌లో కూడా ఫిడే రేటింగ్ సాధించడమే ప్రస్తుతం నా ముందు ఉన్న లక్ష్యం.

నా పేరు వి.వీర వరప్రసాద్. విశాఖపట్నం నుంచి వచ్చాను. రైల్వే క్రీడాకారులతో తలపడుతున్నాను. తండ్రిలో సరదా ఇష్టంతో పుట్టుకతో వచ్చిన ప్రతిభావంతుడిని. పదేళ్ల క్రితం చెస్ సాధన ప్రారంభించా. భార్య కూడా చెస్ క్రీడాకారిణి. ఇద్దరం ఓ వైపు పోటీలో తలపడుతూనే .. మరో వైపు శ్రీ చెస్ అకాడమీలో చెస్ శిక్షణ ఇస్తాం. బ్లిట్జ్‌లో 1505 రేటింగ్ ఉంది. క్లాసిక్ ఈవెంట్‌లో ఫిడే రేటింగ్ సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను.

ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్సై వినీత్

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

కృష్ణలంక, న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా రహదారి ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని 5వ ట్రాఫిక్ సీఐ బాల మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం సిబ్బందితో రాణిగారితోట 17, 18 డివిజన్ల పరిధిలోని రాఘవయ్యమూర్తి రోడ్డు, సిద్ధం కృష్ణారెడ్డి వీధి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రహదారి ఆక్రమించి నిలిపిన ఆటోలను, ఆక్రమణలను పరిశీలించారు. ఆర్‌సీఎం పాఠశాల సమీపంలో రేయింబవళ్లు నిలుపుతున్న ఆటోలను పరిశీలించి డ్రైవర్లను హెచ్చరించారు. రాకపోకల నిమిత్తం నిర్దేశించిన రోడ్లపై పార్కింగ్ చేయడం సరైంది కాదని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఇలా ఉంటే... స్తంభం ఎక్కేదెలా?

ఏడో డివిజన్‌లోని కరెంట్ బావి సమీపంలోని ఓ విద్యుత్తు స్తంభానికి చుట్టూ కేబుల్ వైర్లు, వాటికి సంబంధించిన బాక్సులు, వైర్ల చుట్టలు ఉన్నాయి. ఇంట్లో కరెంట్ రావడం లేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే సిబ్బంది స్తంభం పైకి ఎక్కి లైన్లు సరి చేయాల్సి ఉంటుంది. ఇలా ఉంటే స్తంభం ఎక్కేదెలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలానే పలు స్తంభాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ)

స్తంభం చుట్టూ తీగలు

వీటిని సరి చేయలేరా?

అయ్యప్పనగర్ నుంచి బందర్ రోడ్డుకు వచ్చే రోడ్డులో పలు మ్యాన్‌హోల్స్ దిమ్మెలు ధ్వంసమై గుంతల్లా మారాయి. సుమారు 4 మ్యాన్‌హోల్స్ వద్ద ఈ పరిస్థితి ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ దిమ్మెలు సరిచేసి రోడ్డుకు సమాంతరంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పటమట

నిరుపయోగం.. తీర్చిదిద్దితే సుందరం

న్యూస్‌టుడే, బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ)

బెంజిసర్కిల్ కూడలి వద్ద గుంతలతో స్థలం

నగరంలోనే అత్యంత ముఖ్యమైన ప్రధాన కూడలి బెంజిసర్కిల్. చెన్నై- కోల్‌కతా, విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారులు కలిసే ప్రాంతం. పెరుగుతున్న వాహనాలు, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు పై వంతెనలు నిర్మించారు. అయితే రెండో పై వంతెన కింద బెంజిసర్కిల్ ప్రాంతంలో ఎంతో విలువైన స్థలాన్ని నిరుపయోగంగా ఉంచారు. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంటోంది. స్థానికులు తమ వాహనాలను నిలిపేందుకు ఈ ప్రాంతాన్ని వినియోగిస్తున్నారు. ఏలూరు వైపు వెళ్లే బస్టాప్ వద్ద తోపుడుబండ్లు, దుకాణాలు పెట్టుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

దేశ, విదేశాల నుంచి సందర్శకులు... గన్నవరం విమానాశ్రయం నుంచి నగరంలోకి వెళ్లేందుకు బెంజిసర్కిల్ మీదుగా ఎంజీరోడ్డులోకి వెళతారు. ఇలా ప్రతి రోజూ ఎంతో మంది దేశ, విదేశాల నుంచి నగరానికి వస్తారు. దుర్గమ్మ దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఇలా నగరానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి అత్యధిక మంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి కూడలిలో మొక్కలు పెట్టడం, ఇతర వసతులు కల్పించాలి. దీని వల్ల నగరం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

80085 74652

పూడిక తీస్తున్న సిబ్బంది

✦ 3వ డివిజన్ ఆయుష్ హాస్పిటల్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి రామేశ్వరరావు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా డీఈ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ✦ 3వ డివిజన్ గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి ఎదురుగా దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి అన్నపూర్ణ మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు పిచికారీ చేయించారు. ✦ 4వ డివిజన్ భారతీనగర్ 4-7/79ఎ విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రత్నాకర్ రావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

జిల్లా ఆక్వాటిక్ జట్టుకు ఓవరాల్ రన్నరప్ ట్రోఫీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖపట్నంలోని ఆక్వా కాంప్లెక్స్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి వింటర్ అంతర్ జిల్లాల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా ఆక్వాటిక్ జట్టు 18 పసిడి, ఎనిమిది రజత, ఏడు కాంస్య పతకాలతో మొత్తం 187 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ సాధించినట్లు జిల్లా ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. కృష్ణా జట్టు 144 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. గ్రూపు- 2 బాలుర విభాగంలో జిల్లాకు చెందిన బి.పృధ్వీరాజ్, బాలికల విభాగంలో యానా జైన్ చెరో అయిదేసి పసిడి పతకాలు సాధించి.. వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన స్విమ్మర్లను రాష్ట్ర సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి ఎ.మోహన్ వెంకట్ రామ్, కృష్ణా జిల్లా సంఘ కార్యదర్శి వెనిగళ్ల వినోద్, కోశాధికారి పువ్వాడ బాలమురళీకృష్ణ, వీఎంసీ స్విమ్మింగ్ పూల్ ఇన్‌ఛార్జి యు.అనిల్, పలువురు వీఎంసీ స్విమ్మింగ్ శిక్షకులు అభినందించారు.

ముఖ్య అతిథి నుంచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు

రాష్ట్ర బాలికల రికర్వ్ జట్టుకు కాంస్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో ఆదివారం ప్రారంభమైన 42వ జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలికల రికర్వ్ జట్టు కాంస్య పతకాన్ని సాధించిందని రాష్ట్ర విలువిద్య సంఘ ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీకి చెందిన కొండపావులూరి యుక్తశ్రీ, టి.భువన రాజేశ్వరి, టి.వైష్ణవి, చెరుకూరి డాలీ శివానీలతో కూడిన రాష్ట్ర బృందం మూడో స్థానం కోసం జరిగిన పోరులో 5- 3 తేడాతో జార్ఖండ్‌పై విజయం సాధించినట్లు చెప్పారు. ముందుగా జరిగిన రికర్వ్ బాలికల ర్యాంకింగ్ రౌండ్ (60+60)లో కొండపావులూరి యుక్తశ్రీ 720 పాయింట్లకు 674 సాధించి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన ఆర్చర్లను, అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, కోచ్ నవీన్‌కుమార్, గౌరవ్, జట్టు మేనేజర్ ఆకుల కిరణ్‌కుమార్, రాష్ట్ర విలువిద్య సంఘ కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, శిక్షకులు ఇ.సాహిత్, టి.శివశంకర్‌ను రాష్ట్ర, జిల్లా విలువిద్య సంఘ ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్ర రికర్వ్ ఆర్చరీ బృందంతో సత్యనారాయణ, జట్టు శిక్షకులు, మేనేజర్

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ ఏవో నీలిమ, చిత్రంలో 'ఈగల్' ఐజీ రవికృష్ణ, వేదికపై పలువురు అతిథులు

టాప్ బోర్డుపై తలపడుతున్న క్రీడాకారులు

ఏపీ, తెలంగాణ క్రీడాకారుల ముందంజ

అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పటమట మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కర్రి ఓంకార్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పుల్లి షణ్ముఖ చెరో ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. రెండో రోజైన ఆదివారం రాత్రి ముగిసిన ఆరు రౌండ్లకు ఆరుగురు క్రీడాకారులు 5.5 పాయింట్లతో తర్వాత స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఆరో రౌండ్‌లో టాప్ బోర్డుపై పుల్లి షణ్ముఖ (1724) తెల్ల పావులతో తన ఆట ప్రారంభించి ప్రత్యర్థి తెలంగాణకు చెందిన అహాన్ మిత్రా (1576)పై విజయం సాధించాడు. రెండో బోర్డుపై కర్రి ఓంకార్ (1646) నల్లపావులతో ఆడి ప్రత్యర్థి కె.వెంకట శ్రీచేతన్‌రెడ్డి (1586)ని నిలువరించాడు. మూడో బోర్డుపై ఎం.యుగంధర్ (1625) తన ప్రత్యర్థి ఎ.సూర్య (1782)ని ఓడించి 5.5 పాయింట్లతో నిలిచాడు. నాలుగో బోర్డుపై ఏవీఎస్ విజయకుమార్ (1774) తన ప్రత్యర్థి ఏఎల్‌వీ సాయి చేతన్ (1588)ను నిలువరించగా.. అయిదో బోర్డుపై పి.సంజయ్ సాహుల్ (1622), కె.శౌర్య (1714) మధ్య గేమ్ 'డ్రా'గా ముగిసింది.

✦ రెండో రోజు పోటీలను 'ఈగల్' ఐజీ ఆకె రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పోటీలో పాల్గొనే క్రీడాకారులతో మాదక ద్రవ్యాల నిషేధానికి తోడ్పడతామని ఏసీపీ ఏవో ఎం.నీలిమ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఎస్.ఆషా, రాష్ట్ర చెస్ సంఘం (ఏసీఏ) ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ, ది విజయవాడ చెస్ సంఘ అధ్యక్షుడు ఎంసీ అక్బర్ పాషా, కళాశాల కోచ్ వి.రాజ్‌కుమార్, పీడీ ఎన్.సునీత, టోర్నీ డైరెక్టర్ పి.రేణుక, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఎన్ఎం ఫణికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజాదర్బార్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి చేరవేయడంలో ప్రజాదర్బార్ కీలకపాత్ర పోషిస్తోందని తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. 17వ డివిజన్ రాణిగారితోటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే వేదికగా ప్రజాదర్బార్ కొనసాగుతుందని, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వచ్చే వినతులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని పిలుపునిచ్చారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న క్రాంతికుమార్

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నగరంలోని పటమటకు చెందిన కోగంటి వెంకట రామయ్య రూ.1,01,116 విరాళం చెక్కును ఆదివారం దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఆలయ ఇన్‌స్పెక్టర్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


ఛైర్మన్ రాధాకృష్ణకు చెక్కు అందజేస్తున్న దాత వెంకటరామయ్య

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన పూజ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన కార్యక్రమాన్ని రుత్వికులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాజగోపురం ప్రాంగణంలో సూర్య భగవానుడి చిత్రపటానికి పూజ చేయగా.. వేదపండితులు అరుణ పారాయణం చేశారు. మంత్ర సహిత సూర్య నమస్కారాలను అర్చకుడు నిర్వహించారు. సూర్యోపాసన పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం వారికి ప్రసాదాలు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచి ఆలయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అధికారులు భావిస్తున్నారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్షాధారులు కూడా దర్శనానికి తరలివచ్చారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సైక్లింగ్‌లో కృష్ణా హవా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్యల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 14, 17, 19 బాల, బాలికల అంతర్ జిల్లాల సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా బృందం ట్రాక్ ఈవెంట్‌లో 48 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ఛాంపియన్‌షిప్ కార్య నిర్వాహక కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. రోడ్డు ఈవెంట్‌లో గుంటూరు బృందం 63 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి శాప్ సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, పోటీల పరిశీలకుడు ఐ.సునీల్, ఉమ్మడి కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ కార్యదర్శి కె.సుగుణరావు అతిథులుగా హాజరై ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు, వ్యక్తిగత విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన సైక్లిస్టులకు పసిడి, రజత, కాంస్య పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్య నిర్వాహక కార్యదర్శి జి.రాంబాబు, వ్యాయామ సంచాలకుడు టి.విజయవర్మ, పీఈటీలు ఎంవీఎస్ ప్రసాద్, కె.పురుషోత్తం, ఎం.రూతమ్మ, ఎం.సునీల్ పాల్గొన్నారు.

అతిథులు సుగుణరావు, సునీల్ నుంచి ట్రోఫీలు అందుకుంటున్న కృష్ణా జిల్లా క్రీడాకారులు

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి

కృష్ణలంక, న్యూస్‌టుడే : ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతిపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న మహంకాళి సురేష్ (40)కు భార్య, ముగ్గురు సంతానం. అతడు రాణిగారితోట మాదంశెట్టి సీతయ్య వీధిలో కుటుంబంతో నివాసం ఉండేవాడు. దీర్ఘకాలంగా మద్యాన్ని తాగుతుండటంతో ఇటీవల ఆరోగ్యం దెబ్బతింది. మద్యం అలవాటు మానుకోలేక పోవడం, ఆరోగ్యం సక్రమంగా లేక మనస్తాపానికి లోనయ్యాడు. శనివారం భార్య, పిల్లలు బయటకు వెళ్లగా అతడు ఇంట్లో ఉన్నాడు. రాత్రికి ఇంటికొచ్చిన అనంతరం భార్య, పిల్లలు లోపలికి వెళ్లి చూడగా సురేష్ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కిందకు దింపి ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. విజయవాడ చుట్టుగుంట సెంటర్ వద్ద గరికిముక్కు జాహ్నవి (32) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. చిట్టినగర్ వాగు సెంటర్‌కు చెందిన శ్రీనివాస్‌తో కొన్నాళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. 22న శ్రీనివాస్‌తో కలిసి జాహ్నవి ద్విచక్ర వాహనంపై విద్యాధరపురం సితార సెంటర్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్, జాహ్నవి గాయపడ్డారు. స్థానికులు విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ప్రకటన

నా క్లయింట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంకొల్లు బ్రాంచ్ వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. శ్రీ కోగంటి మురళీకృష్ణ మరియు వీరమాచినేని రంగారావు గారు గుణదల నందు రీ సర్వే నెం.305/5 నందున య.0.55 ట్లు దస్తావేజు నెం.837/1985 క్రింద కొనుగోలు చేసినారని, తదుపరి వారు చెరుకూరి వెంకటనాగేశ్వరరావు గారికి సదరు స్థలమును విక్రయించుటకు జనరల్ పవర్ అటార్నీ వ్రాయించారని తదుపరి సదరు పైన తెలిపిన స్థలము నుండి చ.గ.111.16లు క్రయ దస్తావేజు నెం. 301/2001 క్రింద మరియు చ.గ. 467.66లు ద.నెం.2513/2000 క్రింద శ్రీ గొట్టిపాటి లక్ష్మీజి గారికి విక్రయించారని తదుపరి గొట్టిపాటి లక్ష్మీజి గారు చ.గ.578.28లు ను ద.నెం. 6838/2017 క్రింద శ్రీమతి గోగినేని విజయలక్ష్మి వగైరాలకు విక్రయించారని తదుపరి వారు సదరు స్థలము నందున "ఇంద్రకీలాద్రి రెసిడెన్సీ" అను అపార్ట్‌మెంట్‌ను నిర్మాణం చేసినారని తదుపరి సదరు అపార్ట్‌మెంట్ నందలి థర్డ్ ఫ్లోర్‌ను శ్రీమతి పూషాడపు శ్రీలత మరియు శ్రీ పూషాడపు వెంకట శ్రీనివాసరావు గారికి ద.నెం.6251/2022 క్రింది విక్రయించినారని తదుపరి శ్రీమతి పూషాడపు శ్రీలత మరియు శ్రీ పూషాడపు వెంకట శ్రీనివాసరావు గార్లు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఫ్లాట్‌ను M/s. TATA Capital Housing Finance Ltd. విజయవాడ వారి వద్ద తనఖాగా ఉంచి ఋణము పొందియున్నారని తదుపరి సదరు కంపెనీ నుండి సదరు లోన్‌ను టేకోవర్ చేసికొని సదరు ఫ్లాట్‌ను తనఖాగా ఉంచుకొని ఋణమును మంజూరు చేయమని శ్రీమతి పూషాడపు శ్రీలత మరియు శ్రీ పూషాడపు వెంకట శ్రీనివాసరావు నా క్లయింట్ బ్యాంకు వారిని కోరుచున్నారు. కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి హక్కులు గాని క్లయిములు గాని చట్ట ప్రకారం చెల్లదగిన అభ్యంతరములు గాని ఉన్న యెడల నాకు 7 దినములలోగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలియజేయవలెను. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదమైనదని భావించి సదరు ఆస్తిని తనఖాగా ఉంచుకొని నా క్లయింట్ బ్యాంకు వారు ఋణము మంజూరు చేయుదురు. తదుపరి వచ్చు క్లయింలు గాని లేక అభ్యంతరములు గాని లా ప్రకారం చెల్లవు మరియు నా క్లయింట్ బ్యాంకు వారిని బైండ్ చేయజాలవు.

షెడ్యూల్: యన్.టి.ఆర్ జిల్లా గుణదల జిల్లా రిజిస్ట్రార్ వారి ఇలాకా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరినటువంటి విజయవాడ సిటీ గుణదల కరెన్సీనగర్‌లోని రీ.సర్వే నెం.350/5 దాఖల "ఇంద్రకీలాద్రి రెసిడెన్సీ" నందలి థర్డ్ ఫ్లోర్ ఫ్లాట్‌నకు **హద్దులు: తూర్పు:** కారిడార్, లిఫ్ట్ మరియు స్టెయిర్‌కేస్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

ఇట్లు: **పాదర్తి పూర్ణచంద్రరావు,** అడ్వకేట్
F.F-1, LRK టవర్స్, రామాలయం వీధి, కృష్ణలంక, విజయవాడ-13. ✆ 98482 30004

(c) eenadu

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

డేటా ఎంట్రీ, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిరుద్యోగ యువతులకు డేటా ఎంట్రీ, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ, ఉపాధి కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ఎం. రమేష్‌బాబు శనివారం తెలిపారు. 15-45 ఏళ్ల గల పది, ఇంటర్, డిగ్రీ, ఆపై అర్హతలున్న నిరుద్యోగ మహిళలకు రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు డిసెంబరు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ- మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో స్థానిక కళాశాలకు ఉదయం 10 గంటలకు సంప్రదించాలని చెప్పారు. పూర్తి వివరాలకు 89199 51682కు ఫోన్ చేయాలని తెలిపారు.

తుపాను పొంచి ఉంది.. జాగ్రత్త

నందిగామ, న్యూస్‌టుడే : రాష్ట్రంలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కోరారు. నందిగామలో ఆదివారం ఓ ప్రకటన చేస్తూ.. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నందిగామ నియోజకవర్గంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరికోతలు పూర్తి చేసి ధాన్యం సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేయాలని సూచించారు. రహదారులపై ధాన్యం, మొక్కజొన్నలు ఆరబోయవద్దని సూచించారు. రైతులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. అధికారులు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ స్థానిక రామన్నపేట రోడ్డులో తాగు నీరు పైపులైన్‌కు మూడు చోట్ల లీకులు వచ్చి నీరు వృథాగా పోతోంది. విషయాన్ని మున్సిపల్ ఏఈ పణి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయన పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ✦ స్థానిక 14వ వార్డులో అంతర్గత రోడ్లపై చెత్త, చెదారం ఉంది. విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. ✦ స్థానిక తొమ్మిది వార్డుల్లో డ్రైయిన్ల పూడికతో మురుగు దిగువకు వెళ్లలేదు. దీనివల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కార్మికులతో శుభ్రం చేయించారు.
✦ స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో చెత్త, చెదారంతో అధ్వానంగా ఉంది. ఈ విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో శుభ్రం చేయించారు. -నందిగామ, న్యూస్‌టుడే

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

చందర్లపాడు: తోటరావులపాడు, ఏటూరు మధ్య రోడ్డు అభివృద్ధి పనులను చింతలపాడులో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు రహదారి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. సహకార సంఘ అధ్యక్షుడు బొందలపాటి రామలింగేశ్వరరావు, చెన్నుమల్లు వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, తుంగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కజొన్నపైనే ఆశలన్నీ

సాగు నీరిస్తేనే రైతులు గట్టెక్కేది
నష్టంతో పత్తి పంట తొలగింపు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి దిగుబడి లేక రైతులు ట్రాక్టర్ల దోజర్లతో తొలగిస్తున్నారు. పత్తి స్థానంలో రబీపంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పొలాలు సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తాక పొలాలు తడిపేందుకు కాలువలకు సక్రమంగా నీరందక ఆవేదన చెందుతున్నారు. ఇటు పత్తిసాగుతో నష్టపోయిన రైతులు రబీ పంటపై ఆశతో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మాగల్లు మైనర్ కాలువ (పిల్లకాలువ) ఆయకట్టులో పత్తి పొలాలను రైతులు ట్రాక్టర్ దోజర్లతో తొలగించి మొక్కజొన్న విత్తారు. మునేటి ప్రధాన కాలువ నుంచి ఈ కాలువకు సాగు నీరు వదలక పోతే మొక్కజొన్న ఎలా మొలకెత్తుతుందని రైతు యలమందల శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. కౌలుకు పొలం తీసుకుని పత్తి సాగు చేస్తే నష్టపోయానని, ఈ పంట స్థానంలో మొక్కజొన్న విత్తితే నీటి తడులివ్వడానికి కాలువలో చుక్కనీరు రావడం లేదని ఆయన వాపోయారు.

❖ వత్సవాయి మండలం పోలంపల్లి నుంచి మునేటి ప్రధాన కాలువపై మిర్చి సాగు చేస్తున్న రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీటి తడులిస్తున్నారు. దీనివల్ల కాలువ చివరి ఆయకట్టుగా ఉన్న నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాలైన కొండూరు, మాగల్లు, సోమవరం, పల్లగిరి వరకు సాగునీరు సక్రమంగా సరఫరా అవక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మునేటి ప్రధాన కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్లను తొలగించి.. అధికారులు దిగువకు సాగునీరు వచ్చేలా చూడాలని కర్షకులు కోరుతున్నారు. సాగు నీరందితే రబీలో మొక్కజొన్న సాగుకు వీలు పడుతుందని, లేకుంటే మళ్లీ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు లేని మాగల్లు మైనర్ కాలువ

మాగల్లు వద్ద మొక్కజొన్న విత్తిన పొలం

రాష్ట్రస్థాయి డెంటల్ కాన్ఫరెన్స్‌లో ప్రతిభ

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే : విజయనగరంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి డెంటల్ కాన్ఫరెన్స్‌లో నందిగామ యువకుడు బండారు శ్రీప్రణీత్ కృష్ణసాయి పత్ర సమర్పణలో ప్రథమంగా నిలిచాడు. ఆయన శ్రీకాకుళంలోని శ్రీసాయి డెంటల్ కాలేజ్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ద్వితీయ ఎండీఎస్ చదువుతున్నారు. ఎవాల్వింగ్ స్ట్రాటజీస్ ఇన్ మేనేజింగ్ ఓఎస్ఎంఎఫ్ అంశంపై పత్రాలు సమర్పించి ప్రథమంగా నిలిచి 25 నుంచి మూడు రోజుల నిర్వహించే ఆల్ ఇండియా డెంటల్ కాన్ఫరెన్స్‌కు వెళ్లారు.

ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీప్రణీత్ కృష్ణసాయి

ఆలయ పునర్నిర్మాణానికి సిద్ధం

కొణతాలపల్లి (వీరులపాడు), న్యూస్‌టుడే : వందల సంవత్సరాల చరిత్ర ఉన్న దేవాలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు పూనుకున్నారు. గ్రామస్థులు, దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.67 లక్షలతో జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. మండల పరిధి కొణతాలపల్లి గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం అతి పురాతనమైనది. శివాలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు కమిటీగా ఏర్పడ్డారు. దాతలు, గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి దేవాదాయ శాఖ సహకారంతో పునర్నిర్మించే పనులకు శ్రీకారం చుడుతున్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సౌమ్య ఆదేశాలతో పారిశుద్ధ్య సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా గుడిమెట్లకు వెళుతుండగా అడవి రావులపాడు వద్ద రహదారిపై పశువుల వ్యర్థాల గుట్టలను చూసి.. ఎంపీడీవో ప్రసాదరావుకు ఫోన్ చేసి వీటిని తొలగించే చర్యలు చేపట్టి.. రహదారికి రెండువైపులా మొక్కలు నాటించాలని ఆదేశించారు. ఎంపీడీవో, పంచాయతీ సర్పంచి సూరా వెంకటనర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్, కూటమి నాయకులు కొండూరు నరసింహారావు, రోశయ్య తదితరులు జేసీబీతో రహదారిపై ఉన్న వ్యర్థాలను తొలగించారు.

వీధిలో మురుగు.. వెళ్లేదెలా?

విజయరాణి పాఠశాల పక్క రహదారిపై మురుగు

కంచికచర్ల పంచాయతీ పరిధిలో మురుగు కాలువల్లో రోజుల తరబడి పూడిక తీయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక విజయరాణి పాఠశాల పక్క రహదారిలో కాలువలో పూడిక తీయక మురుగు రహదారిపై చేరింది. దీనితో నిత్యం రహదారిలో వచ్చే వాహనదారులు, విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -కంచికచర్ల, న్యూస్‌టుడే

చెరువు.. కనుమరుగు

కంచికచర్ల, న్యూస్‌టుడే

గండేపల్లి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

గ్రామాల్లో సాగు నీటి వనరులుగా ఉన్న చెరువులు కనుమరుగయ్యే స్థితికి చేరాయి. రెండు దశాబ్దాల క్రితం మెట్ట ప్రాంతమైన నందిగామ నియోజకవర్గంలో సాగు రంగంలో చెరువులు ప్రముఖపాత్ర పోషించాయి. తర్వాత ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల నిర్వహణ లోపంతో పలు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. కంచికచర్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న కంచమ్మ చెరువు ఇందుకు ఉదాహరణ. సర్వే నం. 304-4లో సుమారు 212 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన ఈ చెరువు ప్రస్తుతం వంద ఎకరాలకే పరిమితమైంది. మిగిలిన విస్తీర్ణం కేవలం రికార్డుల్లోనే ఉంది. ఆక్రమణదారులు సుమారు వంద ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నా అడిగేవారే లేరు. నిర్వహణ లోపంతో పలు చెరువులు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. గండేపల్లి చెరువులో గుర్రపు డెక్క పెరిగింది. అధికారులు స్పందించి చెరువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

తీగలు కలిపితేనే దీపాలు వెలిగేది

మండలంలోని కొణతమాత్కూరు మధ్యమ్మ కుంట కాలనీలో వీధి దీపాలు వెలిగే స్విచ్ వేయడానికి బోర్డు లేక ప్రమాదకరంగా మారింది. స్థానిక ఓ విద్యుత్తు స్తంభానికి తక్కువ ఎత్తులో రెండు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేశారు. పంచాయతీ గుమస్తా నిత్యం సాయంత్రం ఈ రెండు తీగలను చేతితో ప్రమాదకరంగా కలిపితే ఎల్ఈడీ దీపాలు వెలుగుతాయి. ఇక్కడ సమీపంలో చిన్నారులు తిరుగుతున్నారని, తీగలను తాకితే ప్రాణాంతకమవుతుందని స్థానికుడు తాళ్లూరి చిన సింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సాంబశివరావును అడుగగా విద్యుత్తు శాఖ సిబ్బందిని సంప్రదించి స్తంభానికి స్విచ్ ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. -నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే

స్తంభానికి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలు

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

ఇబ్రహీంపట్నం గ్రామీణం : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణ రాయితీకి వినియోగదారులకు మరో అవకాశం కల్పించింది. విద్యుత్తు సర్వీసులకు అధిక విద్యుత్తు వినియోగిస్తుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30 వరకు 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చింది. మళ్లీ మరో అవకాశంగా డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించింది.

దారంతా గుంతలు.. వెళ్లాలంటే చిక్కులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పెనుగంచిప్రోలు ఆర్ అండ్ బీ బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. గ్రామంలో కీలకమైన రహదారి గుంతలు పడి స్వరూపం కోల్పోయింది. 20 ఏళ్లుగా రోడ్డు నిర్మాణానికి నోచుకోక ఈ పరిస్థితి నెలకొంది. స్థానిక పాత సినిమాహాలు కూడలి నుంచి విఘ్నేశ్వర ఆలయం రోడ్డు వరకు సుమారు కిలోమీటరు బైపాస్ రోడ్డు ఉంది. ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న బైపాస్ రోడ్డు రాకపోకలకు అనుకూలంగా ఉండేది. గత తెదేపా ప్రభుత్వంలో రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా శంకుస్థాపన చేశారు. అనంతరం వైకాపా ప్రభుత్వం రాగా పనులు చేయలేదు. దీంతో రోడ్డుపై తారు పూర్తిగా లేచిపోయి గుంతలు పడింది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో ఇరుకుగా మారింది. ఇళ్లలో వాడుకునే నీరు రోడ్డు పైకి వస్తోంది. ఇళ్ల ముందు మెట్లు రోడ్ల పైనే నిర్మిస్తున్నారు. దీనివల్ల బైపాస్ రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారింది. ప్రధానంగా శుక్ర, ఆదివారాల్లో తిరుపతమ్మ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు బైపాస్ రోడ్డు పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలతో బైపాస్ రోడ్డు

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెల్లంకి (వీరులపాడు), న్యూస్‌టుడే : మండల పరిధి వెల్లంకి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేడు ప్రారంభించనున్నారు.

తిరుపతమ్మ ఆలయానికి భక్తులు భారీగా రాక

అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావటంతో మొక్కుబడులు తీర్చుకోవటానికి తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చి.. ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు.

వైభవంగా సత్య సాయిబాబా శత జయంతి

నూతన కాలమానిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సౌమ్య తదితరులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ రైతుపేట భగవాన్ సత్య సాయి మందిరంలో పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంతి కార్యక్రమం ఆదివారం పండగలా నిర్వహించారు. మందిరం, గాంధీ కూడళ్లలో కేకులను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి కోసి పంపిణీ చేశారు. వంద జ్యోతులు వెలిగించారు. సత్య సాయి సేవాసమితి ముద్రించిన 2026 ఆంగ్ల సంవత్సర కాలమానినిలను ఆవిష్కరించారు. అన్నదానం నిర్వహించారు. వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సాయికృష్ణా కోలాట బృందం మహిళలు కోలాటం ప్రదర్శించారు. స్వామికి ఊయలసేవ నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ యు. వాసుదేవరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, రత్నకుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అమ్మినేని జ్వాలా ప్రసాద్, బొందలపాటి నరసింహారావు, కోవెలమూడి వెంకట నారాయణ, సేవాసమితి సభ్యులు సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామలో సత్య సాయి బాబా వందో జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం బాబా చిత్రపటానికి ఆర్డీవో కె. బాలకృష్ణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సేవలను ఎప్పటికి ప్రజల హృదయాల్లో ఉంటాయని కొనియాడారు. ఆయన బోధనలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయని చెప్పారు. తహసీల్దారు కె. సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలోని సత్యసాయి సేవామందిరం భవనంలో సత్య సాయి బాబా జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు సామూహిక పారాయణం, భజనలు, ప్రార్థనలు నిర్వహించారు. సత్యసాయికి విశేష పూజలు నిర్వహించారు. సేవాసమితి తరపున పులువురు సీనియర్ సభ్యులు, వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతీయ ఘనత, సేవాతత్పరతను, ప్రేమగుణాన్ని చాటి చెప్పిన సత్యసాయిబాబా ప్రతి ఒక్కరికీ స్మరణీయులన్నారు. ఆయన అందించిన స్ఫూర్తిని అందరం అందిపుచ్చుకొని ముందుకు సాగుదామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య

అయ్యప్ప పీఠానికి కరెన్సీ నోట్లతో అలంకరణ

పంచలోహ విగ్రహానికి క్షీరాభిషేకం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ కొప్పు రమేష్ గురుస్వామి పీఠానికి ఆదివారం సముద్రాల సతీష్, సాయికిరణ్ ఆధ్వర్యంలో రూ. 5 లక్షల విలువైన పలు రకాల కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. గణపతి, కుమారస్వామి, అయ్యప్ప తదితర చిత్రపటాలను రూ.100, రూ.200, రూ.500 కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్వామి పంచలోహ విగ్రహాలకు అర్చకుడు రవికిరణ్, కొప్పు రమేష్, దాతలు శ్రీనివాసమూర్తి, శ్రీదేవి సంప్రోక్షణ, క్షీరాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప మాలధారుల శరణు ఘోష మార్మోగింది.


పీఠంలో చిత్రపటాలకు కరెన్సీ నోట్ల అలంకరణ

ధాన్యం మద్దతు ధరకు అమ్మండి

పంట ఉత్పత్తి పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

కేతవీరునిపాడు (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే : రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం అమ్మాలని నందిగామ ఆర్డీవో కె. బాలకృష్ణ కోరారు. ఆదివారం మండలంలోని కేతవీరునిపాడు వద్ద కల్లంలో ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2389, సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2369కు కొంటున్నట్లు చెప్పారు. స్థానికంగా మునగచర్ల, దాములూరు గ్రామాల వద్ద ఉన్న మిల్లులకు ధాన్యం విక్రయానికి అనుమతి ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉంచామని, ట్రాక్టర్లకు జీపీఎస్ చేయించామని అన్నారు. తహసీల్దారు ఎన్. సురేష్‌బాబు, పీడీఎస్ డిప్యూటీ తహసీల్దారు రామ్మూర్తిరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అమ్మినేని జ్వాలా ప్రసాద్, తెదేపా నాయకుడు నెలకుదిటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకం అందించాలి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని వైకాపా రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ కోరారు. పెనుగంచిప్రోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఈ పథకాన్ని అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. రెండో ఏడాది అర్హుల జాబితాలో కోత విధించి రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల మందికి మొండిచేయి చూపిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

గోపాలపురం(ఎ.కొండూరు): గోపాలపురం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై జి. మహాలక్ష్మణుడు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.4,810 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైన జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శునకాల సంచారం.. భయపడుతున్న జనం

నందిగామ, న్యూస్‌టుడే

కోనేరు సెంటర్ వద్ద కుక్కల గుంపు

నందిగామలో శునకాలు రహదారులపై గుంపులుగా తిరుగుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదు. నందిగామ పురపాలక సంఘ పరిధిలో నందిగామ, అనాసాగరం, హనుమంతుపాలెం గ్రామాల్లో 20 వార్డులు ఉన్నాయి. జనాభా 55 వేల పైగా ఉంది. కొన్నేళ్లుగా శునకాల సంతానం వృద్ధి చెందుతోంది. చట్టప్రకారం వీటికి సంతానం కలగకుండా శస్త్ర చికిత్సలు చేయించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతూ సుమారు పదివేలకు పైగా ఉంది. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల్లో తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు, మహిళలు వణుకుతున్నారు.

❖ స్థానిక రైతుపేట, రైతుపేట డౌన్, ముక్కపాటి నగర్, రామలింగేశ్వర నగర్, చెరువు బజారు, బీసీ, ఎస్సీకాలనీలు, డీవీఆర్ కాలనీ, ఒకటి నుంచి ఆరు వార్డుల్లో కుక్కలతో జనం ఇబ్బంది పడుతున్నారు. కొన్నింటికి రోగాలు వచ్చి.. ఒకదాని నుంచి మరో దానికి వ్యాపిస్తున్నాయి. చూడటానికే భయంకరంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యాసంస్థల వద్ద విద్యార్థులు రాత్రివేళల్లో ఇళ్లకు వెళ్లేందుకు భయపడుతున్నారు. వీటిని చట్టప్రకారం నివారించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక మున్సిపల్ అధికారులు, పాలకులను కోరుతున్నా పట్టించుకోవట్లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

శ్రీరామను సన్మానిస్తున్న నూకానమ్మ, వీరాస్వామి తదితరులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని చందాపురం శివారులో ఆదివారం రాష్ట్ర దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మన బోతుల శ్రీరామను రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సంఘ రాష్ట్ర ఇన్‌ఛార్జి యనగాల నూకానమ్మ, ప్రధాన కార్యదర్శి వీరంకి వీరాస్వామి సత్కరించారు. డైరెక్టరుగా నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ సౌమ్య, ఎంపీ శివనాథ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సంఘం నాయకులు గువ్వల సత్యనారాయణ, దుద్దుకూరి శ్రీనివాసరావు, ఆళ్ల రామారావు, బిట్టు రమేష్, ఎస్‌కే దాదా, బాషా, గోకర్ల నరసింహారావు, సదాశివరావు, గంగాధర్, వెంకయ్య, శ్రీను, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో చోదకుడి మృతి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న చోదకుడు గరిడేపల్లి చిన్న పుల్లయ్య(42) మృతి చెందాడు. గ్రామానికి చెందిన కె. కొండలరావుకు చెందిన ట్రాక్టర్‌కు చిన్నపుల్లయ్య డ్రైవర్‌గా ఉన్నాడు. మధ్యాహ్నం ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు సీటు నుంచి జారి టైర్ల కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గంపలగూడెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పుల్లయ్య మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

జాగ్రత్తలు పాటిస్తే విహారం.. విస్మరిస్తే విషాదం

గొట్టుముక్కల (కంచికచర్ల), న్యూస్‌టుడే: గొట్టుముక్కల సమీపంలోని అటవీ ప్రాంతంలో స్వయంభూగా వెలసిన మద్దులమ్మ తల్లి ఆలయం, పరిసర ప్రాంతాలు అటు ఆధ్యాత్మికంగా, ఇటు పర్యాటకంగా ప్రాచుర్యం పొందాయి. గతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకే పరిమితమైన ఈ ప్రాంతానికి నేడు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వారాంతాల్లో, సెలవు దినాల్లోనూ పెద్దఎత్తున భక్తులు, పర్యాటక ప్రేమికులు తరలి వస్తున్నారు. చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతం, కొండలపై నుంచి జాలువారే జలపాతాల నడుమ సేద దీరేందుకు యువత ఆదివారాల్లో భారీగా తరలి వస్తోంది.

❖ ఈ నేపథ్యంలో ఇక్కడ భద్రతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతం కావడంతో ఆకతాయిలు, మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీంతో సామాన్యులకు అక్కడి పరిస్థితులు ఇబ్బందిగా మారుతున్నాయి. గతంలో ఆలయానికి దగ్గరలో మందుబాబులు చిందులు వేస్తుంటే, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేయగా వెళ్లిపోయారు. జలపాతాల్లో స్నానాలు చేసేందుకు కొంతమంది యువత కొండల పైకి వెళ్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అజాగ్రత్తగా వ్యవహరిస్తే విహారం కాస్తా విషాదంగా మారే ప్రమాదముంది. ఇక్కడికి భక్తులు, పర్యాటక ప్రేమికులు భారీగా వస్తున్న నేపథ్యంలో అధికారులు ఇక్కడ భద్రత, వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టి సారిస్తే మేలని స్థానికులు కోరుతున్నారు.

జలపాతం వద్ద కేరింతలు కొడుతున్న యువత

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: భోపాల్‌లో ఐదు రోజులుగా జరుగుతున్న జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టు అభినందనలు అందుకుంది. ఉపాధ్యాయుడు జి. చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో వరదల నుంచి వంతెనలు, వాహనాలను కాపాడేలా ఎం. నాగతేజ, వై. భార్గవ్ ధనుష్‌లు రూపొందించిన నమూనాను ప్రదర్శించారు. చివరిరోజైన ఆదివారం నమూనాకు నిర్వాహకుల ప్రశంసలు లభించాయి. అభినందన పత్రాలు అందుకున్న వీరిని విజేతల జాబితాలో ప్రకటించారు. కేంద్ర పాలిత ప్రాంతాలతో సహా దేశం నలుమూలల నుంచి నమూనాలతో విచ్చేసిన విద్యార్థులతో పాల్గొనడం తమకు కొత్త అనుభూతి ఇచ్చిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిభ చాటిన వారికి బాలుర హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ప్రదర్శనలో అభినందన పత్రాలు అందుకున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యార్థులు

డిసెంబరు నుంచి 100 రోజుల కార్యాచరణ

జుజ్జూరు(వీరులపాడు): మండల స్థాయి స్కూల్ అసిస్టెంట్లకు జుజ్జూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఎంఈవో పాల్ కెనడీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ, మార్గదర్శకత్వంపై పలు సూచనలు చేశారు. 90 మంది స్కూల్ అసిస్టెంట్లు, 23 మంది ఎస్జీటీలు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు పాల్గొన్నారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

శాంతిభద్రతలకు విఘాతమా?

కొత్తపేట సీఐ చినకొండలరావుతో 'ఈనాడు' ఫోన్ ఇన్ నేడు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు, నేరాలు, గంజాయి, బ్లేడు బ్యాచ్, రౌడీషీటర్లతో ఇబ్బందులు పడుతున్నారా? సోమవారం సీఐ చిన కొండలరావుతో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏమైనా సమస్యలుంటే కింద తెలిపిన నంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేసి తగిన పరిష్కారం పొందవచ్చు.

ఈనాడు మీతోడు

94406 27083 | తేదీ: సోమవారం (24-11-2025) | సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 వరకు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ భవానీపురం శివాలయం వీధిలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందితో కుక్కలు పట్టించారు. ★ కుమ్మరివీధులు ట్రాన్స్‌ఫార్మర్ ఎదురు వీధిలో మురుగు కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? పాల ఫ్యాక్టరీ ఎస్ఏఎస్ కళాశాల వెనుక కొండ ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోంది. **- సూరిబాబు, స్థానికుడు.** ✔ పైపులైన్లు లీకేజీ ఉందేమో పరిశీలిస్తాం. **- రామకృష్ణ, మంచినీటి విభాగం ఏఈ**

? వాగు సెంటర్ వడ్రపేట ప్రాంతంలో చెత్త తరలించడం లేదు. **- కోటేశ్వరరావు, స్థానికుడు.** ✔ సిబ్బందిని పంపి చెత్త తరలిస్తాం. **- నరసింహారావు, శానిటరీ అధికారి**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

జిల్లా ఆక్వాటిక్ జట్టుకు ఓవరాల్ రన్నరప్ ట్రోఫీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : విశాఖపట్నంలోని ఆక్వా కాంప్లెక్స్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి వింటర్ అంతర్ జిల్లాల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా ఆక్వాటిక్ జట్టు 18 పసిడి, ఎనిమిది రజత, ఏడు కాంస్య పతకాలతో మొత్తం 187 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ సాధించినట్లు జిల్లా ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు.

నేడు నగరానికి కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : విదేశీ పర్యటన నిమిత్తం ప్రభుత్వ అనుమతితో సెలవులో వెళ్లిన నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం తిరిగి నగరానికి రానున్నారు. యథావిధిగా ఆయనవిధులు నిర్వహించనున్నారు. ఈనెల 12 నుంచి ఆయన సెలవు పెట్టారు. ఆయన స్థానంలో అదనపు కమిషనర్ (జి) డి.చంద్రశేఖర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు.

అధికారుల నిర్లక్ష్యం.. భక్తులకు భారం..

★ దుర్గగుడి ఘాట్ రోడ్డులో నిత్యం తిప్పలు

★ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు

మూసుకుపోయిన ఘాట్ రోడ్డు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత నిర్ణయాలు భక్తులకు ఇబ్బందులు తెస్తున్నాయి. దీర్ఘకాల ప్రయోజనాలను అంచనా వేసి పనులు చేపట్టాల్సిన అధికారుల నిర్ణయాలు నెలలు తిరగకుండా మసకబారుతున్నాయి.

★ కొండరాళ్లు పడే వైపు ప్రొటోకాల్ కార్యాలయం, డోనర్ సెల్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు దుర్గగుడి ఘాట్‌రోడ్డులో భక్తుల పాదరక్షలు భద్రపరిచేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గత ఏడాది వర్షాల కారణంగా కొండ రాళ్లు జారి పడి ప్రొటోకాల్ కార్యాలయం నేలమట్టం అయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో దేవస్థానం ఉద్యోగులు, భక్తులు లేకపోవడంతో దేవస్థానం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

★ ప్రస్తుతం ఐరన్ బడ్డీ తీసుకొచ్చి ప్రొటోకాల్ కార్యాలయంగా మార్చారు. అదే ప్రాంతంలో ఐరన్ బడ్డీపై కొండ రాళ్లు జారి పడితే బాధ్యత ఎవరు వహిస్తారని దేవస్థానం ఉద్యోగులు వాపోతున్నారు.

అడ్డదిడ్డ కౌంటర్లతో ఇబ్బందులు

దుర్గగుడి ఘాట్ రోడ్డులో అడ్డదిడ్డంగా కౌంటర్లు, దుకాణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు పాదరక్షలు పెట్టేందుకు ఘాట్ రోడ్డుకు అడ్డంగా లైన్లో నిలుచుంటున్నారు. దీనికి తోడు భక్తుల వాహనాలతో రద్దీ ఏర్పడుతుంది.

★ కొబ్బరికాయలు కొనే వారు, పాదరక్షలు పెట్టేవారు రోడ్డుకు అడ్డంగా నడిచి క్యూలైన్లోకి ప్రవేశించేందుకు వచ్చే సమయంలో వాహనాలపై వచ్చే ప్రముఖులు, అధికారుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ★ ఆయా సమస్యలపై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. శీతల పానీయాల దుకాణాలు, క్లోక్ రూమ్, సెల్‌ఫోన్ పాయింట్, పాదరక్షల స్టాండ్ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ప్రొటోకాల్ వాహనాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

టోల్ గేటు వద్ద నిలిచిన వాహనాలు

★ దుర్గగుడి టోల్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని కనకదుర్గ పైవంతెన నిర్మాణం చేశారు. రూ.450 కోట్లు ఖర్చు అయినా దుర్గగుడి టోల్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు యథాతథంగా ఉన్నాయి. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాల్లో ట్రాఫిక్ వాహన చోదకుల సహనానికి పరీక్షగా మారిందని వాపోతున్నారు.

కార్పొరేషన్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అనువుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రెయిన్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులు తదితర సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని ఆయన సూచించారు.

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణ రాయితీ కోసం వినియోగదారులకు మరో అవకాశం కల్పించింది. విద్యుత్తు సర్వీసులకు అధిక విద్యుత్తు వినియోగిస్తుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30 వరకు 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చింది. మళ్లీ మరో అవకాశంగా డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించింది. మీ సేవా కేంద్రాల్లో, విద్యుత్తు సరఫరా సంస్థ వెబ్‌సైట్‌లో కావాల్సిన కిలో వాట్‌కు తగిన సొమ్ము చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవచ్చు. వినియోగదారులు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవచ్చని అధిక లోడు వాడకంపై జరిమానాల బారిన పడకుండా చూసుకోవాలని ఇబ్రహీంపట్నం సహాయక ఇంజినీరు వెంకన్న తెలిపారు.

ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌కు అభినందన

కొండపల్లి: ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఫారూక్ షుబ్లీకు సూఫీ మత గురువులు అల్తాఫ్ రజా అభినందనలు తెలిపారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా బాధ్యతలు వహించిన ఆయనను ముస్లిం మత పెద్దలు విజయవాడలో ఆదివారం కలిసి ఘనంగా సత్కరించారు. ఉర్దూ భాషాభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులపై అవగాహన

చిట్టినగర్, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా సుమారు 88 లక్షల విద్యార్థులతో దూర విద్యలో తమ సంస్థ అగ్రగామిగా నిలిచిందని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ కె.సుమలత పేర్కొన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల అధ్యయన కేంద్రంలో ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నూతన విద్యార్థులకు దిశానిర్దేశం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతనంగా చేరిన విద్యార్థులు డిప్లొమో, డిగ్రీ, పీజీ, పలు వృత్తి విద్య కోర్సుల వివరాలపై అవగాహన ఉండాలని సూచించారు. హాజరు నమోదు, ప్రాజెక్ట్ వివరాలు, శిక్షణ తరగతుల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల స్టడీ సెంటర్ సమన్వయకర్త ఎం.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ పి.ఎల్.రమేష్, సహాయ సమన్వయకర్తలు వై.శ్రీనివాసరాజు, ఎన్.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుమలత, వేదికపై సమన్వయకర్త వెంకటేశ్వరరావు, కేబీఎన్ వైస్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు

హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. వేకువ జామునుంచి ఆలయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గా నగర్ మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అధికారులు భావిస్తున్నారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్షాధారులు కూడా దర్శనానికి తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ఉదయం 11.30 నుంచి 2.30 గంటల వరకు వీఐపీ సిఫార్సు లెటర్లు, రూ.500 టికెట్ల విక్రయాలు నిలిపి వేశారు. భక్తులను బంగారు వాకిలి వరకు మాత్రమే దర్శనానికి అనుమతించారు.

క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు

అమ్మవారిని దర్శించుకుంటూ..

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నగరంలోని పటమటకు చెందిన కోగంటి వెంకట రామయ్య రూ.1,01,116 విరాళం చెక్కును ఆదివారం దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఆలయ ఇన్‌స్పెక్టర్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దుర్గగుడి ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణకు చెక్కు అందజేస్తున్న దాత వెంకటరామయ్య

జగన్మాత సన్నిధిలో సూర్యోపాసన పూజ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన కార్యక్రమాన్ని రుత్విజులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాజగోపురం ప్రాంగణంలో సూర్య భగవానుడి చిత్రపటానికి పూజ చేయగా.. వేదపండితులు అరుణ పారాయణం చేశారు. మంత్ర సహిత సూర్య నమస్కారాలను అర్చకుడు నిర్వహించారు. సూర్యోపాసన పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం వారికి ప్రసాదాలు అందజేశారు.

అరుణ పారాయణంలో వేదపండితులు

పైపులైన్ల లీకులతో తాగునీరు వృథా..!

పైపులైన్లు లీకై తాగు నీరు వృథాగా పోతుంది. కొన్ని చోట్ల తుప్పు పట్టి రంధ్రాలు పడ్డాయి. దీని వల్ల కొండ ప్రాంతాలకు సక్రమంగా నీరు అందడం లేదని నివాసితులు వాపోతున్నారు. లంబాడీపేట అడ్డరోడ్డు, వాటర్ ట్యాంకు వీధిలో, పెండెం రాములు వీధి, ఎస్‌డీఏ చర్చి వీధిలో, ముక్కా అప్పారావు వీధిలో, భీమన జానకరామయ్యవీధి తదితర కొండ ప్రాంతాల్లో పైపులు లీకవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలను మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

నివాసాల మధ్య వ్యర్థాలు..!

భవానీపురంలోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. డంపర్ బిన్ల వద్ద చెత్త గుట్టలుగా ఉండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దీనికి తోడు కుక్కలు, ఆవులు డంబర్ బిన్లలోని చెత్తను రోడ్లపైకి తీసుకొస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

గతుకుల దారి.. అవస్థలుగా మారి..

భవానీపురం పాత హెచ్‌బీ కాలనీలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారి పొడవునా గోతులు పడడంతో రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ మార్గంలో ఆర్టీసీ బస్సులు సైతం వెళ్తుంటాయి. గతుకుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఉన్న గోతులు పూడ్చాలని నగరపాలక సంస్థ అధికారులను కోరుతున్నా ప్రయోజనం ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

రక్షిత నీరు కలుషితం

35వ డివిజన్‌లో తాగునీరు కలుషితం అవుతున్నాయి. జోసెఫ్ వీధి, ఖాసీం వీధి, డేవిడ్ వీధి, వంగర సుందరరావు వీధి, లక్ష్మణరావు వీధి, గంటి వారి వీధి, బాప్టిస్ట్‌పాలెం, అల్‌సీసం చర్చి, పప్పుల మిల్లు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో దోమలు, కలుషిత మంచినీరు కారణంగా పెద్ద సంఖ్యలో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనిపై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెజ్జోనిపేట**

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి చెందినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన గౌస్ బాషా(50) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ గొల్లపూడి నల్లకుంట వద్ద సరకు అన్‌లోడ్ చేసి లారీ పక్కన పెట్టి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో లారీపైకి ఎక్కి గౌస్ బాషా పడుకున్నారు. 21వ తేదీ ఉదయం క్లీనర్ మీరావలీ చూడగా గౌస్ బాషా కింద పడిపోయి ఉన్నాడు. వెంటనే ఆయన్ను నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి తలలో రక్తం గడ్డ కట్టిందని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి 22వ తేదీ రాత్రి మృతి చెందారు. ఈ మేరకు భార్య అస్మత్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. విజయవాడ చుట్టుగుంట సెంటర్ వద్ద గరికిముక్కు జాహ్నవి(32) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. చిట్టినగర్ వాగు సెంటర్‌కు చెందిన శ్రీనివాస్‌తో కొన్నాళ్ల కిందట పరిచయం ఏర్పడింది. ఈనెల 22న సాయంత్రం శ్రీనివాస్‌తో కలిసి జాహ్నవి ద్విచక్ర వాహనంపై విద్యాధరపురం సితార సెంటర్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్, జాహ్నవిలు గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత.. నిందితుడి అరెస్టు

చిట్టినగర్, న్యూస్‌టుడే: గంజాయితో పట్టుబడిన యువకుడిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరు నగరంలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఆదివారం వించిపేట, నైజాంగేటు, రైల్వేగేటు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఎస్సై పద్మారావుకు వచ్చిన సమాచారం మేరకు వించిపేటకు చెందిన మొయిన్ సాహో అలియాస్ రాకేష్ కుమార్(28) అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న సంచి పరిశీలించగా 1.5 కిలోల గంజాయి, అమ్మకానికి సిద్ధం చేసిన 50 చిన్నపాటి గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఒడిశా రాష్ట్రం ఏజెన్సీ ప్రాంతం నుంచి చౌక ధరకు గంజాయి తీసుకు వచ్చి, ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకొన్నాడు. ఈమేరకు పట్టుబడిన గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనాల చోరీ నివారణపై అవగాహన

వాహన చోదకులతో మాట్లాడుతున్న ఏసీపీ దుర్గారావు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం స్టేషన్ పరిధిలో వాహనాలు చోరీకి గురి కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పశ్చిమ ఏసీపీ దుర్గారావు పేర్కొన్నారు. భవానీపురం స్టేషన్ పరిధిలోని సితార జంక్షన్ వద్ద ఆదివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. లొకేషన్‌ను తెలిపే పరికరాలను వాహనాలకు అమర్చుకోవాలని సూచించారు. తద్వారా వాహనాలు చోరీకి గురికాకుండా ఉంటాయని.. దొంగతనం చేసిన వాహనం లొకేషన్ తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు లొకేషన్‌ను తెలిపే పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐలు ఆనంద్, రవితేజ, సుమన్, అనూష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా సత్య సాయిబాబా సేవలు

బాబా చిత్రపటం వద్ద మేయర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ (జి) రవీంద్రరావు, ఉద్యోగులు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సుహాసిని తదితరులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : భగవాన్ సత్య సాయిబాబా సేవలు ప్రపంచ వ్యాప్తంగా ఎందరో మన్ననలు, ప్రశంసలు అందుకున్నాయని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సాయిబాబా శత జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అదనపు కమిషనర్ (జి) ఎ.రవీంద్రరావుతో కలిసి సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయి ట్రస్ట్ ద్వారా కోట్లమంది భక్తులకు బాబా వివిధ సేవలు అందించారని అన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు చేరువ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు గోపాలకృష్ణ నాయక్, కార్పొరేషన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: సత్య సాయి బాబా చూపించిన ప్రేమ, ఆదరణ, విలువలు, ప్రజలకు బోధించే అంశాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని తెలిపారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సత్యసాయిబాబా స్ఫూర్తిని మనమంతా అనుసరించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఎత్తులు

చెస్ టోర్నీలో క్రీడాకారుల ప్రతిభ ● రేటింగ్ మెరుగుకు కృషి

తలపడుతున్న క్రీడాకారులు

న్యూస్‌టుడే-విజయవాడ (క్రీడలు): నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో మూడు రోజులు నిర్వహిస్తున్న అంతర్జాతీయ బిలో 1800 రేటింగ్ చెస్ టోర్నీలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. ఈ టోర్నీలో వయసుతో సంబంధం లేకుండా పోటీ పడటం విశేషం. టోర్నీలో ఆడుతున్న పలువురు క్రీడాకారులను 'న్యూస్‌టుడే' పలకరించగా.. వారు చదరంగంపై తమ ఇష్టం, లక్ష్యాలు వెల్లడించారు.

నా పేరు రామ ఆంజనేయులు. హైదరాబాద్ నుంచి వచ్చాను. చిన్నతనంలో ఇంట్లో నాన్న చెస్ ఆడేవారు. అలా స్ఫూర్తి పొందా. చదరంగం పుస్తకాలు చదివి సొంతంగా సాధన చేశా. ప్రస్తుతం హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్‌లో ఐటీఎస్ అధికారిగా ఉన్నా. అయిదేళ్ల నుంచి ప్రొఫెషనల్‌గా ఆడుతున్నాను. ఈ ఆట అంటే ఇష్టం. రెండేళ్ల క్రితమే క్లాసికల్‌లో 1710 రేటింగ్ వచ్చింది. చెస్‌లో రాణించాలంటే ముందు నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలి. క్లాసికల్ చెస్‌లో 2000 ఫిడే రేటింగ్ సాధించడమే లక్ష్యం.

నా పేరు శ్రీ వర్షిణి తన్మయి (10). హైదరాబాద్ నుంచి వచ్చాను. గత ఏడాది చెస్ సాధన ప్రారంభించాను. రోజూ రెండు గంటలు సాధన చేస్తాను. రెండు నెలల క్రితమే క్లాసిక్ ఈవెంట్‌లో ఫిడే 1425 రేటింగ్ వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. చెస్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనేదే నా లక్ష్యం.

నా పేరు చెరుకూరి శౌర్య (13). మాది గుణదల. ఏడాది నుంచి సాధన చేస్తున్నాను. బ్లిట్జ్‌లో 1462, ర్యాపిడ్‌లో 1450 రేటింగ్ ఉంది. తల్లిదండ్రులు వ్యాపారులు. క్లాసికల్‌లో కూడా ఫిడే రేటింగ్ సాధించడమే ప్రస్తుతం నా ముందు ఉన్న లక్ష్యం.

నా పేరు వి.వీర వరప్రసాద్. విశాఖపట్నం నుంచి వచ్చాను. అన్‌రేటెడ్ క్రీడాకారుడిగా తలపడుతున్నాను. తలలోని నరాల ఇబ్బంది కారణంగా పుట్టుకతో విభిన్న ప్రతిభావంతుడిని. పదేళ్ల క్రితం చెస్ సాధన ప్రారంభించా. భార్య కూడా చెస్ క్రీడాకారిణి. ఇద్దరం ఓ వైపు పోటీలో తలపడుతూనే.. మరో వైపు శ్రీ చెస్ అకాడమీలో చెస్ శిక్షణ ఇస్తాం. బ్లిట్జ్‌లో 1505 రేటింగ్ ఉంది. క్లాసిక్ ఈవెంట్‌లో ఫిడే రేటింగ్ సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను.

సినిమాలు

★ **ప్రేమంటే, 12ఏ రైల్వే కాలనీ, కాంత:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **రాజు వెడ్స్ రాంబాయి:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **పాంచ్‌మినార్:** మిరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు) ★ **మఫ్టీపోలీస్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు) ★ **సంతాన ప్రాప్తిరస్తు:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

రాష్ట్ర బాలికల రికర్వ్ జట్టుకు కాంస్యం

విజయవాడ (క్రీడలు): అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో ఆదివారం ప్రారంభమైన 42వ జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలికల రికర్వ్ జట్టు కాంస్య పతకాన్ని సాధించిందని రాష్ట్ర విలువిద్య సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీకి చెందిన కొండపావులూరి యుక్తశ్రీ, టి.భవన రాజేశ్వరి, టి.వైష్ణవి, చెరుకూరి డాలీ శివానీలతో కూడిన రాష్ట్ర బృందం మూడో స్థానం కోసం జరిగిన పోటీలో ఝార్ఖండ్‌పై విజయం సాధించిందని చెప్పారు.

కావలెను
అనురాగ్ పిల్లల ఆసుపత్రి
విజయవాడ One Town నందు Out Patient Wingలో పనిచేయుటకు, కనీసం ఇంటర్మీడియట్ చదివిన, మధ్య వయస్సులైన స్త్రీలు కావలెను. సంప్రదించండి
భాస్కర్ 93911 82838

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందన వందనం

❖ పాయకాపురం బ్రహ్మం గారి ఆలయం ఎదురు వీధిలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు. – న్యూస్‌టుడే, పాయకాపురం

? తోటవారివీధి.. 14వ లైనులో మట్టిరోడ్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - కళ్యాణి, స్థానికురాలు

✔ ఇప్పటికే పనులు జరుగుతున్నాయి. త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం. - సతీష్, ఏఈ, సర్కిల్-2

? నందమూరినగర్ ఐదో వీధిలో చెత్త సేకరణకు ప్రతి రోజు పారిశుద్ధ్య సిబ్బంది రావడం లేదు.-రాము, స్థానికుడు

✔ సిబ్బందిని పంపిస్తాం. - బాబూ శ్రీనివాసన్, సర్కిల్-2 ఏఎంవోహెచ్ - న్యూస్‌టుడే, పాయకాపురం

మొక్కల పెంపకంతో కాలుష్య నియంత్రణ

పాయకాపురం, న్యూస్‌టుడే : మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరి అన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలతో పాటు పలు కూడళ్లలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.చంద్రశేఖర్, ఛైర్మన్ శేషారెడ్డి, సెక్రటరీ ఎస్.సుగుణరెడ్డి, పీజీ అకడమిక్ డైరెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ బలిజల అభ్యున్నతికి కృషి

పాయకాపురం, న్యూస్‌టుడే : స్థానిక ప్రకాష్‌నగర్‌లోని అన్నపూర్ణ వీధిలో కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆఫీసును ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. సామాజిక వర్గానికి చిహ్నంగా దీనిని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కేకు కోశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కృష్ణ బలిజ సామాజికవర్గం అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గద్దం రాజేశ్వరరావు, తెదేపా డివిజన్ నాయకులు పైడి శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ కూడా పాల్గొనే ఇంజినీర్ పి.రవిచంద్రబాబు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు సాయిబాబాకాలనీ 1 నుంచి 15వ లైను వరకు, గద్దె బాబూరావు రోడ్డు, బాపూజీ రోడ్డు, కొబ్బరితోట, పసుపుతోట పార్కు, నుంచి డ్రైనేజీ వీధి రోడ్డు వరకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

ప్రయాణం.. కారాదు ప్రమాదం

రహదారిలో సరిగా పూడ్చని దిమ్మెలు

మధురానగర్, న్యూస్‌టుడే

గుణదల ఒకటో డివిజన్ ప్రధాన రహదారి వాహన చోదకులను భయపెడుతోంది. కర్మెల్‌నగర్ నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డుకు వెళ్లే దారిలో పలు చోట్ల ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. తారురోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ.. కొన్ని చోట్ల పాడైపోయింది. కర్మెల్‌నగర్, ప్రశాంతినగర్, శిర్డీసాయి నగర్ తదితర ప్రాంతాల్లో కొత్త కొత్త భవనాల నిర్మాణం సాగుతోంది. జనాభా సంఖ్య పెరుగుతోంది. వీరంతా గుణదల మూడు వంతెనల మీదుగా నగరంలోకి రావాల్సి ఉంటోంది. ఇక్కడ కార్లు ఇతర వాహనాలు రాకుండా గడ్డర్లు పెట్టేశారు. దీంతో ఈ ప్రాంత వాసులు ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా గుణదల ఒకటో డివిజన్ రావాల్సి వస్తోంది. ప్రధాన రహదారిపై రాకపోకలు పెరిగాయి.

❖ అంచులు బీటలువారి..

బుడమేరు వైపు రహదారి కుంగుతోంది. అంచులు బీటలు వారాయి. ఇది మరింతగా కుంగితే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడతారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిర్డీ సాయి నగర్ సమీపంలో రోడ్డు ఒక చోట పూర్తిగా పాడైపోయింది. ద్విచక్రవాహన చోదకులు ఇక్కడకు వచ్చే సరికి నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. మరోచోట నగరపాలకసంస్థ తవ్విన గుంతలు

❖ ఎంత మందిపై ప్రభావం అంటే...

డివిజన్	: 1వ డివిజన్, గుణదల
ప్రాంతాలు	: కర్మెల్‌నగర్, ఆదర్శకాలనీ, ప్రశాంతినగర్, శిర్డీసాయినగర్
జనాభా	: 5వేల మంది
రాకపోకలు సాగించే ద్విచక్రవాహనాలు	: 6,000
కార్లు, ఇతర వాహనాలు	: 2,000

గుంతలు పడి పాడైపోయిందిలా..

దిమ్మెలు వేశారు. మట్టి సక్రమంగా పూడ్చకపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

❖ మరమ్మతులు చేస్తేనే..

మూడు వంతెనల ఇరుకుగా మారడంతో కర్మెల్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు నగరంలోకి వెళ్లేందుకు ఈ దారిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల మాత్రమే పాడైపోయింది. వీటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తే.. మిగిలిన దారి పాడవకుండా ఉంటుంది. మన్నిక నిలబడుతుంది. ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అనువుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం వేదిక నిర్వహిస్తున్నట్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రెయిన్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులు తదితర సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని ఆయన సూచించారు.

వారణాసి సంస్కృతికి 'కాశీలో అస్సీ' అద్దం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : హిందీ సాహిత్యంలో అద్వైతం, సంచలనాత్మక రచనగా నిలిచిన 'కాశీ కా అస్సీ' నవల ఉత్తర భారత సంస్కృతి, వారణాసి జీవన శైలికి అద్దం పడుతుందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఈ నవలను విశ్వేశ్వరవర్మ భూపతిరాజు 'కాశీలో అస్సీ'గా తెలుగులో అనువదించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో అవధ్ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో పుస్తక పరిచయ సభ ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి, విమర్శకుడు సత్రీ మాట్లాడుతూ.. హిందీ ఆధాయుడు కాశీనాథ్‌సింగ్ రచించిన ఈ నవల.. అస్సీ ఘాట్ మార్పులు, స్థానిక జీవనం, విదేశీయుల ప్రభావం, రాజకీయ పరిణామాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అనువాదకుడు భూపతిరాజు మాట్లాడుతూ.. కాశీ భారతీయ సంస్కృతి, మరణానంతరం తత్వాన్ని గౌరవించే ప్రత్యేక క్షేత్రమని చెప్పారు. నవలలో ప్రేమ, పాంటసీ, థ్రిల్లర్ వంటి వాణిజ్య అంశాలేమీ లేకుండా వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అనువాద రచయిత విశ్వేశ్వరవర్మ భూపతిరాజు వివరించారు. కార్యక్రమంలో అవధ్ సంస్థ అధ్యక్షుడు జేవర ఉమామహేశ్వరరావు, అవధ సాహిత్యపీఠం అధ్యక్షుడు ఆద్దూరి వెంకటరమణ, ఎక్సెల్ సంస్థ ప్రధాన కార్యదర్శి బి.అంజనేయరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పుస్తక పరిచయ సభలో సత్రీ, భూపతిరాజు, ఉమామహేశ్వరరావు తదితరులు

14న చిత్రకళా సంత

విజయవాడ సాంస్కృతికం: తెలుగు ప్రపంచ చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 14వ తేదీన విజయవాడలో నాలుగో చిత్రకళా సంత నిర్వహిస్తున్నట్లు జిజిక్‌లో పోలవరపు సాంస్కృతిక సమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావు తెలిపారు. లబ్బీపేటలోని తితిదే కల్యాణ మండపం రోడ్డులో ఆ రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ వ్యాప్తంగా ఉన్న కళాకారుల చిత్రాలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.ఎం.పీరన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మూడు చిత్రకళా సంతలు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అండ్ క్రియేటివిటీ కమిషన్, దీనివల్ల విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో 4వ సంత నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల స్థానిక, జాతీయ కళాకారులు పరస్పరం అవగాహన కలుగుతుందన్నారు. సామాన్యులకు తక్కువ ధరలకే విలువైన చిత్రాలు లభిస్తాయని వివరించారు. విజయవాడ, అమరావతి చిత్ర ఆర్ట్ సెంటర్‌లు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న వక్తలు, కళాకారులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నగరంలోని పటమటకు చెందిన కోగంటి వెంకట రామయ్య రూ.1,01,116 విరాళం చెక్కును ఆదివారం దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఆలయ ఇన్‌స్పెక్టర్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

స్ఫూర్తి సారథి.. సత్యసాయి బాబా

పాయకాపురం, న్యూస్‌టుడే : భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ... సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి మానవతా విలువలు, పరిమళాలను నలుదిశలా వ్యాపింపజేసిన స్ఫూర్తి సారథి సత్యసాయి అని అన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి.. ఎనలేని సేవలు అందించారని వివరించారు. అందరికీ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ.. భావితరాలకు మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. వేకువ జామునుంచి ఆలయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అధికారులు భావిస్తున్నారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్షాధారులు కూడా దర్శనానికి తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దేవస్థానం ఈవో శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ఉదయం 11.30 నుంచి 2.30 గంటల వరకు వీఐపీ సిఫార్సు లెటర్లు, రూ.500 టికెట్ల విక్రయాలు నిలిపివేశారు. భక్తులను బంగారు వాకిలి వరకు మాత్రమే దర్శనానికి అనుమతించారు.

సంస్థల సేవలు అభినందనీయం

సీతారాంపురం, న్యూస్‌టుడే : భగవాన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కొనియాడారు. సీతారాంపురంలోని సత్యసాయి సేవా మందిరంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'మానవ సేవే మాధవ సేవ' అని పిలుపునిచ్చి.. సేవ చేశారని కొనియాడారు. ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సీతారాంపురంలో ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. బుడమేరు వరదల సమయంలో సుమారు రూ.కోటి విలువైన నిత్యావసర సరకులు, దుస్తులు అందించారని గుర్తు చేశారు. ట్రస్టు సమకూర్చిన 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, కూరగాయలను ఆయన పేదలకు అందజేశారు. ❖ కలెక్టర్ జి.లక్ష్మీశ.. పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాలు అందించారు. మహానారాయణ సేవలో 2300 మందికి స్వామివారి అన్నప్రసాదం అందించారు. ఉపముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి వీఆర్ కృష్ణతేజ కేకు కోశారు. పలువురికి కుట్టు మిషన్లు, గ్రైండర్లు అందజేశారు. సమితి కన్వీనర్ నరసింహారావు, తులసీరామ్, గుప్తా, ఏకే నారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

సత్యసాయిబాబా సేవలో ఎమ్మెల్యే ఉమా తదితరులు

కేకు కోస్తున్న సంయుక్త కార్యదర్శి కృష్ణతేజ

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తూ..

అధికారుల నిర్లక్ష్యం.. భక్తులకు భారం..

★ దుర్గగుడి ఘాట్ రోడ్డులో నిత్యం తిప్పలు

ఇంద్రకీలాద్రి, పాయకాపురం, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత నిర్ణయాలు భక్తులకు ఇబ్బందులు తెస్తున్నాయి. దీర్ఘకాల ప్రయోజనాలను అంచనా వేసి పనులు చేపట్టాల్సిన అధికారుల నిర్ణయాలు నెలలు తిరగకుండా మసకబారుతున్నాయి.

★ కొండరాళ్లు పడే వైపు ప్రొటోకాల్ కార్యాలయం, డోనర్ సెల్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు దుర్గగుడి ఘాట్‌రోడ్డులో భక్తుల పాదరక్షలు భద్రపరిచేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గత ఏడాది వర్షాల కారణంగా కొండ రాళ్లు జారి పడి ప్రొటోకాల్ కార్యాలయం నేలమట్టం అయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో దేవస్థానం ఉద్యోగులు, భక్తులు లేకపోవడంతో దేవస్థానం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

★ ప్రస్తుతం ఐరన్ బడ్డీ తీసుకొచ్చి ప్రొటోకాల్ కార్యాలయంగా మార్చారు. అదే ప్రాంతంలో ఐరన్ బడ్డీపై కొండ రాళ్లు జారి పడితే బాధ్యత ఎవరు వహిస్తారని దేవస్థానం ఉద్యోగులు వాపోతున్నారు.

కౌంటర్లతో ఇబ్బందులు

దుర్గగుడి ఘాట్ రోడ్డులో అడ్డదిడ్డంగా కౌంటర్లు, దుకాణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు పాదరక్షలు పెట్టేందుకు ఘాట్ రోడ్డుకు అడ్డంగా లైన్లో నిలుచుంటున్నారు. దీనికి తోడు భక్తుల వాహనాలతో రద్దీ ఏర్పడుతుంది.

★ కొబ్బరికాయలు కొనే వారు, పాదరక్షలు పెట్టేవారు రోడ్డుకు అడ్డంగా నడిచి క్యూలైన్లోకి ప్రవేశించేందుకు వచ్చే సమయంలో వాహనాలపై వచ్చే ప్రముఖులు, అధికారుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది.

★ దుర్గగుడి టోల్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని కనకదుర్గ పైవంతెన నిర్మాణం చేశారు. రూ.450 కోట్లు ఖర్చు అయినా దుర్గగుడి టోల్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు యథాతథంగా ఉన్నాయి. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాల్లో ట్రాఫిక్ వాహన చోదకుల సహనానికి పరీక్షగా మారిందని వాపోతున్నారు.

టోల్ గేటు వద్ద నిలిచిన వాహనాలు

★ ఆయా సమస్యలపై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. శీతల పానీయాల దుకాణాలు, క్లోక్ రూమ్, సెల్‌ఫోన్ పాయింట్, పాదరక్షల స్టాండ్ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ప్రొటోకాల్ వాహనాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సైకిల్ ర్యాలీలో పోలీసు సిబ్బంది

బానిస కావొద్దు అంటూ విద్యార్థినుల ప్రదర్శన

మత్తులో దాడులు చేస్తారు...

చైతన్య రథం.. అవగాహన పథం..

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ అధికార యంత్రాంగం ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లో చేపట్టిన అవగాహన, చైతన్య సైకిల్ ర్యాలీకి చక్కని స్పందన లభించింది. యువత, వివిధ సంస్థల ప్రతినిధులు, పోలీసు సిబ్బంది తరలివచ్చారు. ఉత్సాహంగా ముందుకు సాగుతూ.. నినాదాలు చేస్తూ.. ప్రజలను అప్రమత్తం చేశారు. తొలుత డీసీపీ సరిత పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ రవికృష్ణ, సీపీ రాజశేఖరబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

ఏపీ, తెలంగాణ క్రీడాకారుల ముందంజ

అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పటమట మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కర్రి ఓంకార్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పుల్లి షణ్ముఖ చెరో ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. రెండో రోజైన ఆదివారం రాత్రి ముగిసిన ఆరు రౌండ్లకు ఆరుగురు క్రీడాకారులు 5.5 పాయింట్లతో తర్వాత స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఆరో రౌండ్‌లో టాప్ బోర్డుపై పుల్లి షణ్ముఖ (1724) తెల్ల పావులతో తన ఆట ప్రారంభించి ప్రత్యర్థి తెలంగాణకు చెందిన అహాన్ మిత్రా (1576)పై విజయం సాధించాడు. రెండో బోర్డుపై కర్రి ఓంకార్ (1646) నల్ల పావులతో ఆడి ప్రత్యర్థి కె.వెంకట శ్రీచేతన్‌రెడ్డి (1586)ని నిలువరించాడు. మూడో బోర్డుపై ఎం.యుగంధర్ (1625) తన ప్రత్యర్థి ఎ.సూర్య (1782)ని ఓడించి 5.5 పాయింట్లతో నిలిచాడు. నాలుగో బోర్డుపై ఏవీఎస్ విజయకుమార్ (1774) తన ప్రత్యర్థి ఏఎల్‌వీ సాయి చేతన్ (1588)ను నిలువరించగా.. అయిదో బోర్డుపై పి.సంజయ్ సాహుల్ (1622), కె.శౌర్య (1714) మధ్య గేమ్ 'డ్రా'గా ముగిసింది.

టాప్ బోర్డుపై తలపడుతున్న క్రీడాకారులు

✦ రెండో రోజు పోటీలను 'ఈగల్' ఐజీ ఆకె రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పోటీలో పాల్గొనే క్రీడాకారులతో మాదక ద్రవ్యాల నిషేధానికి తోడ్పడతామని ఏసీపీ ఏవో ఎం.నీలిమ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఎస్.ఆషా, రాష్ట్ర చెస్ సంఘం (ఏసీఏ) ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ, ది విజయవాడ చెస్ సంఘ అధ్యక్షుడు ఎంపీ అక్బర్ పాషా, కళాశాల కోచ్ వి.రాజ్‌కుమార్, పీడీ ఎన్.సునీత, టోర్నీ డైరెక్టర్ పి.రేణుక, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఎస్ఎం ఫణికుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ఆందోళనలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రైతు పంటలకు మద్దతు ధరలు, రుణమాఫీ, వ్యవసాయ కూలీల సమస్య, విద్యుత్తు బిల్లు ఉపసంహరణపై అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 26న ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాసేలా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విత్తన చట్ట ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లిలో బూటకపు ఎదురుకాల్పులు జరిపి, మావోయిస్టులను చంపడం దారుణమన్నారు. దీనిపై న్యాయ విచారణ జరపాలని కోరారు. మన్యం జిల్లాలో 170 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రాజెక్టుల పేరుతో విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.వీరబాబు, సహాయ కార్యదర్శులు ఎస్.కె.బాషా, యు.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఝాన్సీ. వేదికపై వీరబాబు, నాగేశ్వరరావు తదితరులు

'తెలుగు వెలుగు' పురస్కారాల ప్రదానం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని 'తెలుగు వెలుగు' సంస్థ జాతీయ పురస్కారాలు ప్రదానం చేసింది. ఆదివారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన.. సాహితీవేత్త పోలవరపు సాంస్కృతిక సమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావుతో పాటు మొత్తం 30 మందికి అవార్డులు అందజేశారు. సంస్థ సేవలను సన్మానగ్రహీతలు కొనియాడారు. సాహితీవేత్త పంతులు వెంకటేశ్వరరావు, తెలుగు వెలుగు సాహితీ వేదిక ఛైర్మన్ పోలోజు రాజ్‌కుమార్‌చార్యులు, రాష్ట్ర అధ్యక్షుడు మండలి లక్ష్మణబాబు, చిత్రకారుడు డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు పి.రమేష్, కళాకారులు వేముల తిరుపతిరెడ్డి, బాణాల రాజు, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న నారాయణరావు

అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : యువ సామ్రాట్ అక్కినేని నాగచైనత్య జన్మదిన వేడుకలు ఆదివారం గాంధీనగర్‌లో అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు ఎన్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకు కోసి అభిమానులకు పంచిపెట్టారు. నిర్మల్ హృదయ్ భవన్‌లో వృద్ధులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి.శేఖర్, కె.ప్రభాకర్, ఎస్.కె.బాషా, లక్ష్మణ్, ఎం.విజయకృష్ణ, ప్రదీప్ పాల్గొన్నారు.

కేకు పంపిణీ చేస్తున్న అభిమానులు

చేయూత వార్షికోత్సవం

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రేమ, సహృదయతకు మారుపేరుగా నిలిచే స్వచ్ఛంద సంస్థ 'చేయూత' 19వ వార్షికోత్సవం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మానసిక, దివ్యాంగ చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాస్తంత శిక్షణ ఇస్తే తాము సాధారణ విద్యార్థుల వల్లే ప్రతిభా పాటవాలు చూపుతామంటూ వారు చేసిన నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేసాయి. అనిశా ఎస్సై పూర్ణిమ, డాక్టర్ జగన్‌మోహన్, డాక్టర్ దుర్గా నాగరాజు, మడోన్నా పాఠశాల సిస్టర్ క్లారా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు వేమూరు బాబూరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థులను ఆశీర్వదించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

➡ డంపింగ్ యార్డ్ అనుకునేరు...!

గుణదల బుడమేరు ఆప్రాన్ పరిసరాలు చెత్తమయంగా మారుతున్నాయి. కాలువ గట్టుపై చెత్తను కుప్పలుగా తెచ్చి పోస్తున్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది సేకరించిన చెత్తను సైతం ఇక్కడే పోయడం గమనార్హం. వ్యర్థాలు గాలికి ఎగిరి రోడ్డు మీదకు వస్తున్నాయి. గుణదల నుంచి నున్న వైపు వెళ్లే వారు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగిస్తుంటారు. అంచుల్లో పేరుకున్న చెత్తను చూసి డంపింగ్‌యార్డ్ అని భ్రమపడుతున్నారు.

- న్యూస్‌టుడే, మధురానగర్

➡ పని చేయని సిగ్నల్ లైట్లు

సత్యనారాయణపురం సంగీత కళాశాల నుంచి కొత్త వంతెన సెంటరుకు వెళ్లే దారిలో ఉన్న సిగ్నల్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. గత కొన్నాళ్ల నుంచి పనిచేయడం లేదు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటుగా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉంటుంది. సంగీత కళాశాల నుంచి కొత్త వంతెన సెంటరు వైపు మలుపు తిరిగే సమయంలో.. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి.. సిగ్నల్ లైట్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సత్యనారాయణపురం(గాంధీనగర్)

అద్దెకు కావలెను

Child Development Centre నిర్వహించుటకు సూర్యారావుపేట/ సీతారామపురం పరిసర ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల విస్తీర్ణము కావలెను. సంప్రదించండి.

భాస్కర్ ✆ 93911 82838

(c) eenadu

తీరం.. జనసంద్రం

రేవుపోలవరం తీరానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొబ్బరి, జీడిమామిడి తోటల్లో ఆటపాటలతో సందడి చేసిన వారంతా సాయంత్రం తీరంలో స్నానాలు చేస్తూ సేదతీరారు. జెట్టీపైకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు. మెరైన్ పోలీసులతో కలిసి డ్రోన్‌తో పర్యాటకులను కదలికలను నిశితంగా పరిశీలించారు. – న్యూస్‌టుడే, ఎస్.రాయవరం

చీరకే అందం..

సినీ కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఆదివారం నర్సీపట్నంలో సందడి చేశారు. స్థానికంగా వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. విశాఖ విమానాశ్రయం నుంచి నర్సీపట్నం వచ్చే మార్గంలో పచ్చని గిరులు, ప్రకృతి అందాలు అబ్బురపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

కన్నోళ్లకు క‘న్నీళ్లు’

✦ రైవాడలో ముగ్గురు యువకుల గల్లంతు
✦ ఒకరి మృతదేహం లభ్యం

దేవరాపల్లి, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రైవాడ జలాశయంలో ఆదివారం జరిగిన బోటు ప్రమాదం జీనబాడులో విషాదాన్ని నింపింది. మూడు కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడి మృతదేహం లభ్యం కాగా.. ఇద్దరు యువకుల ఆచూకీ తెలియాల్సి ఉంది. మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. జీనబాడుకు చెందిన అటవీశాఖ ప్రొటక్షన్ వాచర్ గాలి అప్పలరాజు (25)కు బోటులో కలపను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో గ్రామానికి చెందిన గంజాయి జీవన్‌కుమార్ (18), దెబర రమేష్ (18), జాలాడ ప్రసాద్ (18)కి ఈ విషయం చెప్పాడు. వారంతా అక్కడకు వెళ్లి కలప, నిందితులను అటవీ సిబ్బందికి అప్పగించారు. అనంతరం నలుగురు కలిసి బోటులో స్వగ్రామం జీనబాడు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడారు. గల్లంతైన ఇద్దరు యువకుల కోసం సోమవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలిస్తామన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న గిరిజన యువకులు ఆయా కుటుంబాలకు ఒక్కగానొక్క కుమారులు కావడంతో వారి తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయాయి. అనంతగిరి తహసీల్దారు వీరభద్రాచారి, వీఆర్వోలు లక్ష్మీప్రశాంతి, రామకృష్ణ, రాంబాబు తదితరులు జీనబాడు చేరుకున్నారు.

జీవన్ కుమార్, గాలి అప్పలరాజు, దెబర రమేష్ (పాత చిత్రాలు)

ఒక్కగానొక్క బిడ్డ: గంజాయి దేముడు, పార్వతమ్మ దంపతుల ఏకైక కుమారుడు జీవన్‌కుమార్. డిగ్రీ చదవడానికి సిద్ధమయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటి దగ్గరే ఉన్నాడు. అప్పలరాజు రమ్మంటే వెళ్లాడు. కుమారుడు బోటు ప్రమాదంలో చనిపోయాడన్న వార్త ఆ దంపతుల చెవిన పడింది. పరుగున ప్రమాదస్థలికి చేరుకున్న వారికి కుమారుడు విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి బోరున విలపించారు.

నాడు భర్త.. నేడు కొడుకు: పదిహేన్నేళ్ల కిందట ఫారెస్టు ప్రొటక్షన్ వాచర్ గాలి అప్పలరాజు తండ్రి మత్స్యరాజు మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి పార్వతమ్మ ఒక్కగానొక్క కొడుకైన అప్పలరాజును కూలి పని చేస్తూ అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసింది. అటవీ శాఖలో చేరిన కొడుకుని చూసి మురిసిపోయింది. ఆ ఆనందం నెల రోజుల గడవక ముందే ఆవిరైపోయింది. విధి నిర్వహణలో బోటు ప్రమాదానికి గురైన తన కొడుకు కోసం ఘటనా స్థలిలో రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది.

నాన్నమ్మ దగ్గర పెరుగుతూ..: ఈ ఘటనలో గల్లంతైన దెబర రమేష్ తల్లిదండ్రులు రాంబాబు, సుశీల ఐదేళ్ల కిందట చనిపోయారు. అప్పటి నుంచి నాన్నమ్మ పెంపకంలో ఉంటూ కె.కోటపాడు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి వెళ్లి బోటు ప్రమాదానికి గురయ్యాడు. కుమారుడు, కోడలితోపాటు చేతికందిన మనుమడిని తనకు దక్కకుండా దేవుడు అన్యాయం చేశాడంటూ రమేష్ నాన్నమ్మ సుశీల కుమిలిపోతోంది.

ప్రాణాలకేదీ రక్షణ?

నిర్మాణ పనుల్లో పొంచి ఉన్న ముప్పు

నక్కపల్లి, పాయకరావుపేట గ్రామీణం న్యూస్‌టుడే

■ పాయకరావుపేట మండలం రాజానగరం పాఠశాలలో శుక్రవారం కళావేదిక నిర్మాణంలో కాంక్రీటు బకెట్ స్లాబ్ నుంచి మీద పడటంతో ఉపాధ్యాయిని దుర్మరణం పాలైంది.

■ రెండేళ్ల కిందట పాయకరావుపేట దుర్గా కాలనీ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గది సన్‌షేడ్ పడటంతో ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. గతేడాది నంద్యాల జిల్లా నందికొట్కూరులో పాఠశాల ప్రహరీ కూలి ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు.

ఈదటంలో పూర్తిగా శిథిలమైన పాఠశాల

రాజానగరం స్పెషల్ పాఠశాలకు కూలేలా ఉన్న పోర్టికో

ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న భవన నిర్మాణాల్లో గుత్తేదారుల నిర్లక్ష్యం విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాణాల మీదకు తెస్తోంది. పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు కలిపి 1,447 పాఠశాలలున్నాయి. సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా చోట్ల విద్యాభివృద్ధిలో భాగంగా ఎప్పటికప్పుడు నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్నింటికి ప్రభుత్వ నిధులు, మరికొన్నింటికి సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నారు. నిర్మాణ సమయంలో గుత్తేదారుల నిర్లక్ష్యం కొన్నిసార్లు ప్రమాదాలకు దారి తీస్తోంది. పాఠశాలల ఆవరణల్లోనే ఉంచే నిర్మాణ సామగ్రి రూపంలోనూ విద్యార్థులకు ముప్పు పొంచి ఉంది. తాజాగా రాజానగరం పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలో నిర్లక్ష్యమే కనిపిస్తోంది. పనుల విషయంలో పర్యవేక్షణ అధికారులు అప్రమత్తంగా లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చినట్లవుతోంది.

★ పాయకరావుపేట మండలం అరట్లకోట ఎస్సీ కాలనీ వద్ద పూర్తిగా శిథిలమైన భవనం ఉంది. దీని తొలగించాలని సర్పంచి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈదటం, రాజానగరం, రత్నాయంపేట గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఆడుకుంటూ వీటి వద్దకే వస్తుంటారు. దురదృష్టం వెంటాడితే జరిగే ప్రాణనష్టం అధికమే. ముందే మేల్కొని ఇలాంటి వాటిని తొలగిస్తే అందరి ప్రాణాలకు రక్షణ కలుగుతుంది. తొలగించేంత వరకైనా ఆయా ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

★ కేవలం నిర్మాణాలు జరిగే చోటే కాదు, పాఠశాలల్లోని శిథిల భవనాలు, ప్రహరీలతోనూ ముప్పు పొంచి ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో అత్యవసరంగా తొలగించాల్సిన భవనాలు 149 ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. తొలగింపు అనుమతుల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించారు. ఇంతవరకు ఎలాంటి కదలిక లేదు. వర్షాలకు అవి తడిసి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి.

రాజానగరంలో ప్రమాదం జరిగిన వేదిక నిర్మాణ ప్రాంతం

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని వేల్పులవీధిలో ఆదివారం శ్రీరామ దేవ వ్యాయామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన జిమ్‌ను ప్రారంభించారు. రోజూ గంటపాటు వ్యాయామం చేయాలన్నారు. అనంతరం జిమ్‌లోని పరికరాలను పరిశీలించి కొంతసేపు వ్యాయామం చేశారు.

జిమ్ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కలతలు వీడుదాం.. కలిసుందాం

ఫ్యామిలీ కౌన్సిలింగ్‌తో ఏకమవుతున్న జంటలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

■ అనకాపల్లికి చెందిన యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తల్లిదండ్రులు ఈమెకు అదే రంగానికి చెందిన యువకుడితో వివాహం చేశారు. ఇద్దరూ బెంగళూరులో ఉంటున్నారు. పెళ్లయిన రెండు నెలల వరకు బాగానే ఉన్నారు. ఆ తర్వాత మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అనకాపల్లిలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో వీరికి నాలుగుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఇద్దరూ కలిశారు.

■ చోడవరానికి చెందిన వివాహితతో భర్త తరచూ గొడవ పడేవాడు. మద్యానికి బానిసైన భర్త వేధింపులు భరించలేక వేరుగా ఉంటానంటూ ఆమె పోలీసులను ఆశ్రయించింది. దంపతులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్తను ఎన్టీఆర్ ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రానికి పంపి చికిత్స అందించడంతో ఇప్పుడు ఇద్దరూ సంతోషంగా ఉంటున్నారు.

అనకాపల్లిలో కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

తలపడుతున్న ఏడు అడుగుల బంధం ముక్కలు కాకుండా కౌన్సిలింగ్ దోహదపడుతోంది. మూడు ముళ్ల ఆవశ్యకత, కలిసుండాల్సిన అవసరాన్ని వివరిస్తూ మనస్పర్థలు, కలహాలు తొలగించేందుకు కౌన్సిలింగ్ సత్ఫలితాలిస్తోంది. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది మార్చిలో ఎస్పీ తుహిన్‌సిన్హా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కేంద్రాన్ని జగన్ సర్కారు ఆపేసింది. స్థానిక ఎస్పీ వచ్చిన వారికి కౌన్సిలింగ్‌కు అంత ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యామిలీ కౌన్సిలింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. చిన్నపాటి తగాదాలతో భార్యభర్త విడిపోవడం ఎక్కువవుతోంది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేది. పెద్దలు సర్దిచెప్పేవారు. ఇప్పుడు చిన్నకుటుంబాలు ఎక్కువ అవుతుండడంతో మనస్పర్ధలు వస్తే సర్దిచెప్పేవారు కరవవుతున్నారు. చిన్న చిన్న తగాదాలతో భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్న సంఘటనలు పెరుగుతున్నాయి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఫ్యామిలీ కౌన్సిలింగ్ విధానాన్ని ప్రారంభించింది. దంపతుల మధ్య నెలకొంటున్న వివాదాలను పరిష్కరించేందుకు మహిళా పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నారు. ఇక్కడ డీఎస్పీ, సీఐ, ఇద్దరు మహిళా ఎస్సైలు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అవసరమైన వారిని వన్‌స్టాప్ సెంటర్‌లో వ్యక్తిత్వ వికాస నిపుణులు, కొన్నిసార్లు లాయర్లతో మాట్లాడిస్తున్నారు.

రెండేళ్లలో ఇలా..	
ఏడాది	కౌన్సిలింగ్
2024	624
2025 (నవంబరు)	494

రాజీ మార్గంలో పరిష్కారం: భార్య, భర్తల కేసుల్లో రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నాం. కౌన్సెలింగ్ చేయడం ద్వారా కాపురాల్లో మార్పు వస్తోంది. చిన్నచిన్న గొడవలకు దూరంగా ఉండటం వల్ల పిల్లలు నష్టపోతారు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతున్నాం. పెద్ద మనుషులు, కుటుంబ సభ్యుల సమక్షంలో రాజీ పత్రం రాయిస్తున్నాం. వారెలా ఉంటున్నారని తర్వాతా పరిశీలన చేస్తున్నాం. – శ్రీనివాసులు, డీఎస్పీ, మహిళా పోలీస్‌స్టేషన్

మనోనేత్రమే కరుణాస్త్రం..!

▌ ఫైనల్ మ్యాచ్‌లో కీలక ఇన్సింగ్స్
▌ చరిత్ర సృష్టించిన భారత అంధమహిళల జట్టు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భారత అంధ మహిళల క్రికెట్ జట్టు తొలిసారి టీ-20 ప్రపంచకప్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను ఏడు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారి 27 బంతుల్లో 42 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయపథాన నడిపించింది.

ప్రపంచకప్‌తో తెలుగు తేజం పాంగి కరుణకుమారి

అంతర్జాతీయ, దేశవాళీ టి-20 క్రికెట్‌లో గణాంకాలు	మొత్తం	పరుగులు	అత్యధికం	హాఫ్ సెంచరీలు	వికెట్లు
అంతర్జాతీయం	5	129	42	0	1
దేశవాళీ	17	412	67	3	6

★ గిరిజన గ్రామం నుంచి అంతర్జాతీయ క్రికెట్‌లోకి..: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కూలీలైన రాంబాబు, సంధ్య దంపతుల నలుగురు పిల్లల్లో కరుణ రెండో సంతానం. ఈమెకి అన్న, ఇద్దరు చెల్లెళ్లు. పుట్టుకతోనే దృష్టిలోపమున్నా.. తల్లిదండ్రులు మిగిలిన పిల్లల్లాగే తమ గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడోతరగతి వరకూ చదివించారు. అనంతరం విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులోని ఎండాడ వద్దనున్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం ఇక్కడ పదో తరగతి చదువుతోంది. **★ అక్కడ పరుగుల వరదతో అవకాశం..:** మూడేళ్ల కిందట ఆంధ్రాజట్టుకి ఎంపికైన కరుణకుమారి నిలకడగా రాణిస్తూ పరుగుల వరద పారించడంతో ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచకప్ టి-20 జట్టులో దేశం తరపున ఎంపికైంది. గతంలో వరల్డ్ గేమ్స్‌లో క్రికెటర్‌గా రాణించిన మాగుపల్లి సత్యవతి కోచ్‌గా ఉండటంతో ఆమె మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగారు. వన్‌డౌన్ లేదా సెకెండ్ డౌన్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలర్‌గానూ రాణించడం ఈమెకు కలిసొచ్చింది.

★ తొలి ప్రపంచకప్ గర్వంగా ఉంది..: ఎండాడ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరడం నా జీవితాన్ని మార్చి వేసింది. మా ప్రిన్సిపల్ విజయ, కోచ్ సత్యవతిల ప్రోత్సాహంతో జాతీయ జట్టుకి ఎంపికయ్యాను. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన తాను తల్లిదండ్రుల సహకారంతో ఇక్కడి వరకు రాగలిగాను. ప్రపంచకప్ జట్టులో తెలుగు రాష్ట్రాల నుంచి ఏకైక భాగస్వామిని కావడం, దేశానికి తొలి ప్రపంచకప్‌ను అందించడం గర్వకారణంగా ఉంది. – పాంగి కరుణకుమారి, టి–20 ప్రపంచకప్ విజేత జట్టు క్రీడాకారిణి

సాగులో పంచసూత్రాలు

నేటి నుంచి ‘రైతన్న మీకోసం’

అనకాపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. రైతన్నకు ఏటా పెట్టుబడి సహాయంగా రూ.20 వేలు అందిస్తోంది. ఇప్పటికే రెండు విడతలగా రూ.14 వేలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. అన్నదాతలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల సాగు చేపట్టడం, వ్యవసాయ ఉత్పత్తులను ఉప ఉత్పత్తులుగా మార్చి విక్రయించడం, వ్యవసాయంపైనే కాకుండా అనుబంధ రంగాలపై దృష్టిసారించడం చేయాల్సి ఉంది. ఆ దిశగా రైతులను చైతన్యం చేయడానికి ‘రైతన్న మీకోసం’ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 24 నుంచి వారం రోజులపాటు వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు మూడు బృందాలుగా ఏర్పడి రైతుల ఇళ్లకు వెళ్లనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం, సాగు చేస్తున్న పంటల వివరాలు, సాగు విధానం, అమ్మకం చేస్తున్న తీరు తెలుసుకుంటారు. ఎటువంటి సహకారం కోరుకుంటున్నారో తెలుసుకుంటారు. ఈ వివరాలతో మండల స్థాయిలో నివేదిక తయారీ చేస్తారు. శాస్త్రీయ విధానం, ప్రకృతి సాగు, పెట్టుబడి ఖర్చులు తగ్గించడం, విలువ జోడింపు, మార్కెటింగ్ ఐదు అంశాలపై దృష్టిసారించనున్నారు. వీటికి పంచ సూత్రాలు అని పేరు పెట్టారు.

★ జిల్లాలో ఏటా ఖరీఫ్ 85,867 హెక్టార్లలో, రబీలో 15,662 హెక్టార్లలో పంటలు పండిస్తున్నారు. ఏటికేడు చెరకు సాగు తగ్గుతోంది. గతంలో 42 వేల హెక్టార్లలో సాగయ్యేది. ప్రస్తుతం 3,200 హెక్టార్లకు పడిపోయింది. వేరుశనగదీ ఇదే పరిస్థితి. రబీలో సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉంది. ఖరీఫ్ కోతల అనంతరం జిల్లాలో సుమారు 70 వేల హెక్టార్ల భూమి ఖాళీగా ఉండిపోతోంది. తక్కువ నీటితో ఉలవలు, మినుము, పెసర, ఆవాలు వంటివి సాగు చేయవచ్చు.

1 శాస్త్రీయ పద్ధతులు: రైతులు శాస్త్రీయ విధానంలో సాగు చేసేలా ప్రోత్సహిస్తారు. వరిలో అధిక దిగుబడి ఇచ్చే రకాలున్నా.. శ్రీకాకుళం సన్నాలనే అధికంగా వేస్తున్నారు. ఈ పంటకు పురుగులు, తెగుళ్ల సోకుతున్నాయి. దీనికి బదులు నూతన రకాలను సూచిస్తారు.

2 ప్రకృతి సేద్యం: జిల్లాలో సుమారు 21 వేల హెక్టార్లలో ప్రకృతి సేద్యంలో పంటలు పండిస్తున్నారు. దీన్ని 40 వేల హెక్టార్లకు పెంచాల్సిన అవసరముంది. రైతులు అవసరానికి మించి యూరియా వేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయి. వీటికి మార్కెట్‌లోనూ అధిక ధర పలుకుతోంది.

3 మార్కెటింగ్ : వరి కోతల అనంతరం టమాటా సాగు చేస్తారు. రైతులంతా ఒకేసారి వేయడం వల్ల దిగుబడి చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోతున్నాయి. మార్కెట్‌లో డిమాండుకు అనుగుణంగా సాగు చేయాలి. శీతల గిడ్డంగిలు ఏర్పాటు చేసి మార్కెట్‌లో ధరలు పతనమైనప్పుడు సరకు నిల్వ చేసి ధర వచ్చినప్పుడు విక్రయించేలా రైతులను ప్రోత్సహించనున్నారు.

4 యాంత్రీకరణ: పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు 40 నుంచి 45 శాతం కూలీలకే కేటాయించాల్సి వస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా యాంత్రీకరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం రాయితీపై యంత్రాలు, యంత్ర పరికరాలను అందిస్తోంది. యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు.

5 విలువ జోడింపు: చెరకు నుంచి బెల్లం దిమ్మలు తయారీ చేస్తున్నారు. బెల్లం పొడరు, ముక్కలు, తేనె రూపంలో అమ్మకం చేస్తే అధిక ఆదాయం వస్తుంది. వరిని ధాన్యంగా కాకుండా బియ్యం, నూకగా తయారీ చేయవచ్చు. మినుము, పెసర, కందిని పప్పుగా మార్చు చేయవచ్చు. ఇందుకు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

పల్లెపాలనకు చక్కని వసతి!

26 పంచాయతీలకు రూ.832 లక్షలు ❑ మార్చి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పాలనకు వీలుగా చక్కని వసతి సమకూరనుంది. జిల్లాలోని 26 పంచాయతీలకు భవనాల నిమిత్తం రూ.832 లక్షలు మంజూరు చేస్తూ ఈ నెల 12న కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. రూ.650 లక్షలను రాష్ట్రీయ గ్రామీణ అవాస్ అభియాన్ కింద, రూ.182 లక్షలను ఉపాధిహామీ పథకం కింద వెచ్చిస్తారు. పనులన్నీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించడంతో పంచాయతీరాజ్ అధికారులు పనులకు వీలుగా పలుచోట్ల మార్కింగ్ ఇచ్చారు. ఒక్కో భవనాన్ని 1226 చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. సర్పంచి, కార్యదర్శులకు వేర్వేరుగా గదులు, సమావేశ మందిరం, సిబ్బంది కోసం హాల్, సామగ్రి గది నిర్మిస్తారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షలు ఖర్చు చేస్తారు.

ఎక్కెడక్కెడ నిర్మిస్తారు..: కరక (బుచ్చెయ్యపేట), డి.సురవరం (చీడికాడ), చంద్రయ్యపేట (కె.కోటపాడు), ఎం.కృష్ణాపురం (మాడుగుల), మామిడిపాలెం, మల్లవరం, కె.తూటిపాల, బీఎస్‌పేట, ముసిడిపాలెం (మాకవరపాలెం), మల్లవరం, గొల్లలపాలెం, కాకరపల్లి (మునగపాక), కేపీల్‌పురం, దుగ్గాడ (నర్సీపట్నం) సుందరకోట, వైబీపట్నం, చినగొలుగొండపేట, లింగంపేట (నాతవరం), ఒమ్మవరం, కేబీపీ అగ్రహారం (రావికమతం), పడాలపాలెం (రోలుగుంట), పీఎన్ఆర్‌పేట, ములకలాపల్లి (ఎలమంచిలి).

కేపీల్‌పురంలో పంచాయతీ భవన నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న సిబ్బంది

ఆట.. జీవితానికి బాట

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

క్రీడలు మానసిక, శారీరక వికాసానికే కాదు.. ఆసక్తి పెంచుకుంటే భవితకూ రాచబాట వేస్తాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నక్కపల్లి వేదికగా అండర్-19 బాలబాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో నక్కపల్లిలో సందడి నెలకొంది. మైదానంలో హోరాహోరీగా తలపడుతుండగా.. విజేతగా నిలవాలనే కసి, ఆకాంక్ష క్రీడాకారులందరిలో కనిపిస్తోంది. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ‘న్యూస్‌టుడే’ మాట్లాడింది. వారేమంటున్నారంటే.. – నక్కపల్లి, న్యూస్‌టుడే

✔ **మహిళా విజయాలే స్ఫూర్తి:** ఆడపిల్లలంటే కేవలం సాదాసీదా చదువులు, పెళ్లికే పరిమితం కాదు. తలచుకుంటే సాధ్యం కానిది లేదని ఎందరో ఆడవారు నిరూపించారు. ముఖ్యంగా క్రీడల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. క్రికెట్, హాకీ, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, చెస్ ఇలా అనేక ఆటల్లో విజేతలుగా నిలిచిన మహిళా క్రీడాకారులు మాకు స్ఫూర్తి. దీంతో హాకీపై మక్కువ పెంచుకుని శిక్షణ పొందుతున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ నిరూపించుకోవాలని చూస్తున్నాం. – పి.మాధవి, ఎం.భావ్విక, నెల్లూరు

✔ **ఆత్మస్థైర్యం పెరిగింది:** రాష్ట్రస్థాయి పోటీలకు నక్కపల్లి వేదికగా నిలవడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఒకసారి ఇక్కడకు వచ్చాం. ఏర్పాట్లు బాగున్నాయి. హాకీపై యువతలో ఆసక్తి పెరుగుతోంది. గతంలో అనేక పోటీల్లో విశాఖ తరపున బరిలో నిలిచాం. ఈ ఆటద్వారా మాలో ఆత్మస్థైర్యం పెరిగింది. హాకీలో రాణించడమే కాదు, ఐపీఎస్ కావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. – టి.స్రవంతి, బి.అనిత, విశాఖ

✔ **అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని...:** సుమారు నాలుగేళ్లగా హాకీ ఆడుతున్నాం. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది. ఇలాంటి పోటీల ద్వారా సత్తా చాటడానికి మాలో ప్రతిభ చాటుకునే అవకాశం ఉంది. తద్వారా జాతీయ జట్టులో స్థానం సాధించి అంతర్జాతీయ స్థాయికి ఆడాలనేది మా కోరిక. – టి.యశ్వంత్, కె.సాయికుమార్, శ్రీకాకుళం

✔ **భవితకు బాటలు:** ఆటంటే కేవలం క్రికెట్ ఒక్కటే కాదు. ఒకప్పుడు అంతర్జాతీయ వేదికలపై ఎన్నో విజయాలకు మన హాకీ చిరునామాగా ఉంది. మధ్యలో ప్రాభవం తగ్గినా తిరిగి పుంజుకుంటోంది. మా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో గతంలో అనేక విజయాలు సాధించింది. ముందుముందు ఈ ఆటలో మరింత రాణించి భవిష్యత్తుకు మరిన్ని బాటలు వేసుకోవాలని చూస్తున్నాం. అందుకు తగినట్లే శిక్షణ పొందుతున్నాం. – డి.సుశాంత్, సి.శరణ్‌కుమార్‌రెడ్డి, కడప

(c) eenadu

విలువలకు ప్రతీక సత్యసాయి బోధనలు

సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా బోధనలు, సేవ, ప్రేమ, శాంతి, ధర్మం మానవ విలువలకు ప్రతీకగా నిలిచాయని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. శతజయంతి వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలో సేవాతత్వాన్ని అనుసరిస్తూ 100 బాలవికాస్ కేంద్రాలు స్థాపించారన్నారు. మహిళలకు శాశ్వత ఉపాధి కల్పనలో భాగంగా 300 కుట్టు శిక్షణ కేంద్రాలు, ఎన్టీఆర్ ఆసుపత్రిలో గర్భిణులకు ప్రతిరోజూ భోజనాలు అందిస్తున్నారన్నారు. భజనలు, కీర్తనల అనంతరం మంగళహారతి ఇచ్చారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర భక్తులతో కలిసి కేకు కోశారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) యథావిధిగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు వీసీ హాల్‌లో ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మీ కోసం వెబ్‌సైట్‌లోను అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్ షట్‌డౌన్

పరవాడ, న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్‌ను శనివారం అర్ధరాత్రి తాత్కాలికంగా షట్‌డౌన్ చేశారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం ఉత్పత్తి నిలిపి వేశారు. ఈ పనులు పూర్తికావడానికి సుమారు రెండు నెలలు సమయం పట్టే అవకాశముంది. పనులు పూర్తయిన అనంతరం విద్యుత్తు ఉత్పత్తిని పునఃప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా 2, 3, 4 యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని కార్మిక వర్గాలు పేర్కొన్నాయి.

అవయవదానం.. పలువురికి స్ఫూర్తి

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస శివాలయం వద్ద మూడ్రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన తాపీమేస్త్రీ ఎర్నింటి కనకారావు (46) అవయవాలను వారి కుటుంబీకులు ఆదివారం దానం చేశారు. ఈ మేరకు ఆయన భార్య సూరమ్మ, కుమారుడు వాసు అంగీకారంతో మాతృభూమి సేవా సంఘం ప్రతినిధి కిట్టుకి మృతదేహాన్ని అప్పగించారు. మృతుని స్వస్థలం తగరపువలస సమీపంలోని విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండయ్యపాలెం గ్రామం.

మాతృభూమి సేవా సంఘానికి మృతుని అవయవదానం అంగీకార పత్రాన్ని అందిస్తున్న కనకారావు కుటుంబీకులు

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు

Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT TV Partner: ETV ఆంధ్ర ప్రదేశ్ Organised by: ఈనాడు క్రీడాతరంగ్

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా : ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ, డోర్ నెం.45-40-42, 3వ అంతస్థు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.

వివరాలకు: 9618775577

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఏడాది కోర్సు.. ఉపాధి భేష్..!

'దయాల్బాగ్'లో బైక్ మెకానిజంలో శిక్షణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే

సంస్థ చిరునామా: విశాలాక్షినగర్ (కైలాసగిరి కూడలి)	
కోర్సు: ద్విచక్రవాహనాల మరమ్మతు	శిక్షణ వ్యవధి: ఏడాది కాలం
	విద్యార్హత : కనీసం పదోతరగతి

ఆర్థిక, ఇతర కారణాలతో పదో తరగతి, ఇంటర్ వరకే చదివిన యువతకు వృత్తివిద్యలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది దయాల్బాగ్ విద్యాకేంద్రం. ప్రస్తుతం ద్విచక్ర వాహన మరమ్మతు(బైక్ మెకానిజం) కోర్సు నిర్వహిస్తున్నారు. ఇందులో నిపుణులైన శిక్షకులతో థియరీ, ప్రాక్టికల్స్‌లో తర్ఫీదు ఇప్పిస్తారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం ధ్రువపత్రం అందజేయడంతోపాటు ద్విచక్ర వాహనాల షోరూమ్‌లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

ద్విచక్రవాహన మరమ్మతులో తర్ఫీదు పొందుతున్న యువత

ఒక బ్యాచ్‌లో శిక్షణ: 25 మందికి

ఐదేళ్లలో తర్ఫీదు: 92 మంది

ఉద్యోగావకాశాలు: 65 మంది

నేర్పించే అంశాలు ఇవీ..: యమహా సంస్థ నుంచి శిక్షితులైన సిబ్బంది వచ్చి ద్విచక్ర వాహనాల మరమ్మతులో మెలకువలు, విడిభాగాల బిగింపు, ఇంజిను నిర్వహణపై తర్ఫీదు ఇస్తారు. మొదటి మూడు నెలలు ద్విచక్రవాహన భాగాల గురించి అవగాహన కల్పిస్తారు. తరువాత ఒక్కో భాగాన్ని విడదీసి వాటిని నిర్వహణ గురించి వివరిస్తారు. ఆరు నెలల తర్వాత ఇంజిన్ సర్వీసింగ్, అందులో వివిధ భాగాల పనితీరు, వాటిని తిరిగి బిగించడం నేర్పిస్తారు. ఎనిమిదో నెల నుంచి 10వ నెల వరకు ద్విచక్రవాహనాన్ని పూర్తిగా విడదీసి, అన్ని భాగాలను విజయవంతంగా బిగించేలా ప్రయోగాలు చేయిస్తారు. పది నుంచి 12 నెలల వ్యవధిలో యమహా షోరూంకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యక్షంగా తర్ఫీదు అందిస్తారు.

వెంటనే ఉపాధి అవకాశాలు: ఐదేళ్ల క్రితం ద్విచక్రవాహన మరమ్మతు కోర్సు ప్రారంభించాం. మొదట్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు వచ్చేవారు. రెండేళ్ల నుంచి మంచి స్పందన వస్తోంది. యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని మా మత గురువు లాల్ సాహెబ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కోర్సు నిర్వహిస్తున్నాం. ఈ ఐదేళ్లలో 70శాతం వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు.


– దక్షిణామూర్తి, కోర్సుల సమన్వయకర్త

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల పయనం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: అమరావతిలో సోమవారం జరగనున్న మాక్ అసెంబ్లీకి జిల్లా ఎంపికైన విద్యార్థులు పయనమయ్యారు. ఈ సందర్భంగా వీరిని లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం సత్కరించారు. చోడవరం లయన్స్ క్లబ్ సహకారంతో అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి విద్యార్థులు మాక్ అసెంబ్లీకి హాజరుకానున్నారు. న్యాయవాది కాండ్రేగుల డేవిడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పూసర్ల సాంబశివరావు, నరసయ్యపేట, లక్ష్మీపురం సర్పంచులు నాగబాబు, గణపతినాయుడు, వేపాడ సత్యనారాయణ, విద్యార్థులు పూజిత, రావాడ నారాయణమూర్తి, మణికంఠ, స్నేహలత, జ్యోత్స్న, గీతిక, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో లయన్స్‌క్లబ్ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

విజేతలకు బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చెకుముకి పోటీలు అనకాపల్లిలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల వారీగా విభాగాల్లో విజేతలను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి స్థానం అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ- బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపాలెం జడ్పీ పాఠశాల, తృతీయస్థానం అనకాపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు.

▼ ప్రైవేటు పాఠశాలల్లో అచ్యుతాపురానికి చెందిన శ్రీభవానీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, వి.మాడుగుల సెంటాన్స్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, పాయకరావుపేట శ్రీప్రకాశ్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు త్రిమూర్తులరెడ్డి, నాగచంద్ర బహుమతులు ప్రదానం చేశారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. వేదిక ప్రతినిధులు వరప్రసాద్, రాంకుమార్, ఎంవీఎస్.వర్మ, మారిశెట్టి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషనల్ గస్తీలో ఐఎన్ఎస్ సావిత్రి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: హిందు మహాసముద్ర (ఐవోఆర్) ప్రాంతం భద్రత కోసం చేపడుతున్న ఆపరేషనల్ గస్తీలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సావిత్రి యుద్ధనౌక పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఈనెల 22న సీషెల్స్ దేశంలోని పోర్టు విక్టోరియాకు చేరుకున్నారు. సీషెల్స్ తీరగస్తీ దళానికి భారత నౌకాదళం సంక్లిష్ట విడిభాగాలను అందజేసినట్లు వెల్లడించాయి. ఐవోఆర్ పరిధిలో భద్రత భాగస్వామ్యదారుడిగా ఇండియా నిలిచిందని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

సీషెల్స్ తీరం వద్ద భారత నేవీ నౌక సావిత్రి సిబ్బంది

జిల్లా నీటి యాజమాన్య సంస్థ : విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ / చైర్మన్, డి.పి.సి. వారి ఉత్తర్వులు

ఇ-టెండర్: పని పేరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా క్రింది మెటీరియల్ కొనుగోలు ప్రక్రియ-ఆర్థిక సంవత్సరం- 2025-26.
వివరములకు: https://tender.apeprocurement.gov.in ప్రింటింగ్ & స్టేషనరీ: e Tender ID No.866837 పై ఇ-టెండర్‌నకు సంబంధించిన వివరములు ఈ దిగువ చూపడమైనది. (1) ఇ-టెండర్ డౌన్లోడ్ ప్రక్రియ ప్రారంభ తేది. 24-11-2025 గం.10.30 ని. (2) ఇ-టెండర్ బిడ్ సమర్పించుటకు ఆఖరు తేది.29-11-2025 గం.05.30 ని. (3)ఇ-టెండర్ తెరుచు తేది.03-12-2025 గం.11.00 నిలకు పథక సంచాలకుల వారి కార్యాలయము, విశాఖపట్నం సంప్రదించవలసిన మొబైల్ నెం: 7993317122 సం/- జాయింట్ కలెక్టర్/ చైర్మన్, డి.పి.సి. విశాఖపట్నం జిల్లా

సెమీఫైనల్‌కు విశాఖ బాల బాలికల హాకీ జట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హాకీ అండర్ 19 బాల బాలికల పోటీలు ఆదివారంతో రెండోరోజుకు చేరుకున్నాయి. ఇక్కడి మైదానాల్లో ఉదయం పోటీలు ప్రారంభానికి ముందు బాలురు, బాలికలను బీఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, సీనియర్ హాకీ ప్లేయర్ ఎల్.రమేశ్, వెంకటేశ్వరరావు పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో కడప, నెల్లూరు, విశాఖ, తూర్పుగోదావరి సెమీఫైనల్‌కు చేరగా, బాలికల విభాగంలో తూర్పు గోదావరి ఫైనల్‌కు చేరింది. విశాఖ, అనంతపురం జట్లు సెమీస్‌కు చేరాయి.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నిశీధిలో మృత్యుకేక

■ ఆగిన బస్సును ఢీకొట్టిన లారీ

■ ఇద్దరి దుర్మరణం.. తొమ్మిది మందికి గాయాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నిశీధిలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలకృత్యాల కోసం బస్సును ఆపగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోవగా ఇద్దరు మృతి చెందారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

ఊహించని ఘటన: ★ హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో రాగానే ప్రయాణికుల కాలకృత్యాలకు డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో వెనుక నుంచి పంట దిగుబడుల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వేగంతో కదిలి ముందు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి.

★ బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదానికి గురైన బస్సు

★ ప్రమాదంలో వెనుక సీట్లలో కూర్చున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృత్యువాత పడ్డారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన గడ్డం బద్రినాథ్(25), విశాఖపట్నానికి చెందిన హరిత(22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. గడ్డం బద్రినాథ్ ఏడాదిన్నర క్రితమే కొలువు సాధించాడు. ★ హరిత ముందు సీట్ రిజర్వేషన్ చేసుకోగా వెనుక వచ్చి కూర్చుంది. లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న ఇరువురు తనువు చాలించారు. ఒకే కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు స్నేహితులను ప్రమాదం బలితీసుకోవడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం మిగిలింది.

AUTO

VEHICLES FOR SALE

Caravan Sales: Suitable for Farm House, Resorts & Staying Purpose. Price: 13 Lacs. ✆ 7675950509, 9885884213.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

Well maintained restaurant with continental menu and equipment near dwarakanagar near to complex available for sale or run/ maintain on monthly profit/sharing basis. Contact:9848487871

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat, North East Facing, 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం /సవరవిల్లి Nr. ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు. కమర్షియల్ 2000 గజాలు VMRDA RERA నెం.తో కలదు. 9493244471, 9396972239

EENADU Classifieds

JOBS

Golden Opportunity to Earn Un-Limited income for everyone (M/F) as part/ full time just Reffer VRS/ RTD employees with zero investment not MLM trust (Face value) is your earnings. (5K-10K/ Day) Preference to Team Leaders/ Tax Consultants/ Bank Managers/ Working Professionals ✆ 8790189686

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

Wanted Female Telecallers Qualification any Degree, Age Limit: 25 to 45 years (Must be Married) Salary upto: 14000/-. Working Location: Master Minds College, Gajuwaka Vizag. Contact: 92487 13330.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

Wanted Male Worker for Musical Showroom @ Sampath Vinayaka Temple Road, Asilmetta. Salary: 12,000. Ph: 9949466685

ఉద్యోగ అవకాశం (ప్రతిభావంతులకు)
ప్రముఖ అగ్రగామి సంస్థల 25సం॥ పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ క్రింది JOBsకు అభ్యర్థులను ఎంపిక చేయబడును.
❖ ఆఫీస్ ఇన్‌ఛార్జెస్ : M/F
❖ ఆఫీస్ అసిస్టెంట్స్ : M/F
❖ టెలీ కాలర్స్ : M/F
అర్హత: కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో పదవీ విరమణ చేయువారు మరియు ప్రైవేట్ సంస్థల్లో పనిచేయువారు అర్హులు.
జీతభత్యాలు: నెలకు 50వేలు రూ॥ నుండి లక్షా20వేలు వరకు నిర్ణయించబడినది. (నెగోషియబుల్)
Note: 1. పార్ట్ టైం జాబ్ చేయువారికి కూడా అవకాశం కల్పించబడును.
2. ఇదివరలో మీయొక్క Job, అర్హతలను బట్టి ఇంటర్వ్యూ సమయంలో మీ స్థాయి Package నిర్ణయించబడును.
ఇంటర్వ్యూ తేదీలు: 24, 25 & 26 నవంబర్ 25
Con: K.B.S.SEKHAR Doctors Colony, VSP
Ph: 9290060887 9177296835

మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (F), Marketing Executives (M) Min. 1 Year. Exp. కావలెను. Ph: 9703398398.

షర్ట్స్, జీన్స్ & T. షర్ట్స్ మార్కెటింగ్ చేయుటకు సేల్స్ బాయ్స్ కావలెను 2 వీలర్ ఉన్నవారికి ప్రాధాన్యం కలదు. జీతం + కమీషన్ ఇవ్వబడును. 7386521199.

వైజాగ్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి MM, CMM జాబ్‌లకు స్త్రీ/ పు॥ అభ్యర్థులు కావలెను. మంచి రెమ్యునరేషన్/ కమీషన్ కలదు. 9704421081.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. Contact Phone Number: 7702184399

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గోపాలపురంలో చోరీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురంలోని జగనన్న కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బొడ్డేడ వెంకట కన్యాకుమారి అనే మహిళ శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది.బీరువాలోని నాలుగు తులాల బంగారు వస్తువులు, 15తులాల వెండి వస్తువులు దొంగతనం జరిగింది.వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామీణ సీఐ అశోక్‌కుమార్

వ్యాను, బైక్ ఢీ : ఇద్దరికీ తీవ్ర గాయాలు

గాయపడిన రామస్వామికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల, న్యూస్‌టుడే: వ్యాను, బైక్ ఢీకొనడం వలన ఇద్దరి వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన కోటవురట్ల శివారు చినలింగాపురం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. .. లింగాపురానికి చెందిన బి.రామస్వామి, కోటవురట్లకు చెందిన సురేష్ కలిసి, చినలింగాపురంలో ఓ ఇంటికి వెళ్లి, ద్విచక్ర వాహనంపై తిరిగి వారి నివాసాని వెళ్తున్నారు. అదే సమయంలో నర్సీపట్నం నుంచి వస్తున్న పాల వ్యాన్ వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రామస్వామికి కాలు విరిగిపోగా, సురేష్ తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఇద్దరికి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఉన్న వ్యాన్‌ను, ద్విచక్ర వాహనాన్ని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేదల వైద్యుడు కె.ఎస్.ప్రకాశరావు మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలో ఫీవర్ ఆసుపత్రిని స్థాపించి నిరుపేదలకు నామమాత్రపు రుసుంతో గత 60 ఏళ్లుగా వైద్య సేవలు అందించిన పేదల వైద్యుడిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ కె.ఎస్.ప్రకాశరావు(85) అనారోగ్యం కారణంగా శనివారం రాత్రి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమార్తె, కుమారుడు విశాఖలోనే వైద్యులుగా స్థిరపడ్డారు. కె.ఎస్.ప్రకాశరావు మృతదేహాన్ని నగరానికి చెందిన పలువురు వైద్యులు, ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. డాక్టర్ ప్రకాశరావు పేదలకు అందించిన సేవలను, ఆయనపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని గుర్తు చేసుకున్నారు. కేవలం రూ.20 నామమాత్రపు రుసుం తీసుకొని రూ.100 లోపే ఖర్చు అయ్యే మందులతో రోగాన్ని నయం చేసేవారని స్థానికులు చెబుతున్నారు. సోమవారం ఉదయం వారి స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభించి కాన్వెంట్ కూడలి వద్దనున్న శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని అతని కుటుంబ సభ్యులు తెలిపారు.

శారదానదిలో ఒకరి గల్లంతు

కశింకోట, న్యూస్‌టుడే: తేగాడలో ఆదివారం శారదానదిలో స్నానానికి దిగి వ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన రైతు నకిరెడ్డి చిన రమణ గ్రామంలో వృద్ధురాలి అంత్యక్రియల అనంతరం స్థానికులతో కలిసి శారదానదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. . సీఐ అల్లు స్వామినాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడ్డుకు కొట్టుకొచ్చిన విద్యార్థి మృతదేహం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈనెల 22న వుడా పార్కు లైట్ హౌస్ వద్దనున్న తీరంలో బుల్లయ్య కళాశాల డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు గల్లంతైన విషయం విధితమే. ఆదివారం ఉదయం మన్యం జిల్లా సాలూరు ప్రాంతానికి చెందిన మానేపల్లి తేజేష్(20) మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్‌డ్	184	206
స్కిన్‌లెస్	210	216

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **రాజు వెడ్స్ రాంబాయి,** సత్య నారాయణ స్క్రీన్‌2: **రోడ్డు టు రివెన్స్,** పర్తిసాయి: **ప్రేమంటే,** షిర్డిసాయి: **గర్ల్‌ఫ్రెండ్,** రామచంద్ర: **12ఎ రైల్వేకాలనీ,** సత్య నారాయణ స్క్రీన్‌1: **పాంచ్‌మినార్,** వెంకటేశ్వర: **మఫ్టీ పోలీస్,** అచ్యుతాపురం: ఎస్‌టీబీల్ సినీవరల్డ్ స్క్రీన్-1 **12ఎ రైల్వేకాలనీ,** స్క్రీన్-2: **ప్రేమంటే**

ఆర్డీఓ కార్యాలయ నూతన భవనంలో పూజలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయ నూతన భవనంలో ఆదివారం వాస్తు పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తిగా నిలిచిన ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించింది. కార్యాలయంలో సువిశాల గదులతో పాటు సమావేశాల నిర్వహణకు వీలుగా వసతులు కల్పించారు. ఈ నెల 25న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదగా ఈ భవనాన్ని ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు.

అన్నదాతలకు ఆసరా

చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

కొత్తూరు (అనకాపల్లి): అన్నదాతలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సరైన సమయంలో సీఎం కిసాన్ రెండో విడత పరిహారాన్ని అందజేయడం హర్షణీయమని రైతులు, రైతు ప్రతినిధులు పేర్కొన్నారు. దిబ్బపాలెంలో ఆదివారం వీరంతా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి ఎద్దడి

నిర్మాణం పూర్తయిన తాగునీటి ట్యాంకు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేశవరం గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. సుమారు రూ.25 లక్షలకు పైగా జల జీవన్ మిషన్ నిధులతో గ్రామీణ రక్షిత నీటి సరఫరా విభాగం అధికారులు అదనపు ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఈ పథకం ద్వారా దాదాపు 500 కుటుంబాల తాగునీటి అవసరాలు తీరుతాయని జేఈ ఫణివర్మ తెలిపారు. ఈ గ్రామం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు సమీప పరిశ్రమలోకి ఉపాధి కోసం వస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయి తాగునీటిని అందించేందుకు ఈ పథకం ఉపయోగం పడుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పైపులు ఏర్పాటు చేసి త్వరలో పథకం ప్రారంభిస్తామని జేఈ చెప్పారు.

రుణాలకు ఎదురుచూపులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పురుషుల స్వయం సంఘాలకు రుణాల మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంది. మహిళా డ్వాక్రా సంఘాల మాదిరిగా వీటికి కూడా బ్యాంకు రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణ పరిధిలో 16 సంఘాలను ఏర్పాటు చేశారు. అయిదుగురు సభ్యులతో వీటిని ప్రారంభించి బ్యాంకుల నుంచి రుణాలు అందించాలని నిర్ణయించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న చిరు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న పురుషులను గుర్తించి సంఘాలుగా ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియ పూర్తై నెలలు గడిచినా రుణాల ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఆన్‌లైన్‌లో ఇబ్బందులే దీనికి కారణాలుగా అధికారులు చెబుతున్నారు. దీనిపై అధికారులు కూడా పట్టనట్లే వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఉద్యోగిని

ఆరు సంఘాలకు మంజూరు

పట్టణంలోని 16 పురుషుల సంఘాల్లో ఆరింటికి రుణాలు అందించాం. మిగిలిన సంఘాలకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యంతో కొంత జాప్యం నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించి అన్ని సంఘాలకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.



– సంతోష్‌కుమార్, ఏపీడీ

కాలువ దాటేదెలా?

కానరాని సిమెంట్ పలకలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: 'తాళం వేసితిని... గొళ్లెం మరిచితిని' చందంగా డ్రైనేజీ నిర్మించి దాన్ని దాటేందుకు సిమెంట్ పలకలు వేయడం మరిచారు. పాల్తేరులో సుమారు రూ. అయిదు లక్షలతో డ్రైనేజీ నిర్మించారు. తుని మండలం వల్లూరు వెళ్లే దారికి ఈవలవైపు దీని పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తి చేసిన తర్వాత దాని మీదుగా వీధి రోడ్లకు చేరేందుకు సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఇళ్ల నుంచి వచ్చి బయటకు వెళ్లాలంటే వీలుండటం లేదు. ద్విచక్ర వాహనచోదకులు, ఇతర వాహనాలతోనూ వెళ్లలేని దుస్థితి. వీధి రోడ్లకు చేరాలంటే డ్రైనేజీ మీదుగా దూకాల్సిందే. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొన్నిచోట్ల తాత్కాలికంగా ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ కార్యదర్శి శివరామ్‌ను వివరణ కోరగా సిమెంట్ పలకల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. త్వరలోనే పనులు మొదలుపెడతామని వివరించారు.

అన్నమయ్య పార్కు అభివృద్ధి

అనకాపల్లి పట్టణాన్ని ఆనుకొని శారదా నది ఒడ్డున ఉన్న అన్నమయ్య పార్కు అభివృద్ధి పనులకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ప్రాంగణం అంతా ముళ్ల కంపలు, తుప్పలతో నిండిపోయింది. అన్నమయ్య పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావడానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నిర్ణయించారు. ముందుగా ఉపాధి హామీ నిధులతో ఉద్యాన ప్రాంగణాన్ని శుభ్రం చేయించి, మొక్కలు నాటేలా చర్యలు చేపట్టారు. ఉపాధి నిధులు రూ.మూడు లక్షలతో చేపట్టిన పనులను చేపట్టారు. పిచ్చి మొక్కలన్నీ తొలగించారు. కొలతలు తీసుకుని ప్రణాళిక ప్రకారం మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టారు. ఈసీ పరమేష్, ఎఫ్ఏలు మణి, రూప, టీఏ కుమారి తదితరులు ఉపాధి కూలీలతో పనులు చేయించారు. అన్నమయ్య పార్కు ప్రాంగణం అంతా పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటి పెంచే చర్యలు చేపడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు(అనకాపల్లి)

పనులు చేస్తున్న కూలీలు

కూలితేనే.. స్పందిస్తారా..

కుమారపురం రోడ్డులో..

విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామాల్లో వేసినవి నేల వాలుతున్నా పట్టించుకునే వారు కనిపించడం లేదు. రాజానగరం నుంచి కుమారపురం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం దీనికి నిదర్శనం. పక్కకు పూర్తిగా వాలిపోయింది. దీనివల్ల తీగలు కిందకు వేలాడుతున్నాయి. తీర ప్రాంతం కావడంతో గాలులకు స్తంభం మరింత కిందకు పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి సకాలంలో స్తంభాన్ని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట

ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన తుప్పలు

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో ఆ సంస్థ తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇందుకు రాంబిల్లి - వెంకయ్యపాలెం ప్రధాన మార్గంలోని ట్రాన్స్‌ఫార్మరు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ మార్గంలో రాంబిల్లి సమీపాన, కండలెపువానిపాలెం కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు తుప్పల మధ్య ఉన్నాయి. ఇవి కనిపించకుండా చుట్టూ దట్టంగా తుప్పలు అలుముకున్నాయి. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, రాంబిల్లి

ఇలా వదిలేస్తారా!


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భవనం

అనకాపల్లిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భవనాన్ని వినియోగంలోకి తేవడంలో జాప్యం నెలకొంది. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి తరలించారు. 2017లో తెదేపా హయాంలో భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. అయిప్పటికి పనులు పూర్తికాలేదు. విలువైన స్థలంలో ఉన్న ఈ భవనాన్ని అందుబాటులోకి తెస్తే కార్యాలయానికి అద్దె భారం తప్పుతుంది. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

వంతెన నిర్వహణ అస్తవ్యస్తం..

శంకరం రైల్వే పైవంతెన నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వంతెన రక్షణ గోడలపై పొదలు పెరిగిపోతున్నాయి. కలెక్టర్, ఎమ్మెల్యే మూడు నెలల క్రితం ఇక్కడ పరిశుభ్రత పనులు చేపట్టారు. తిరిగి ఇక్కడి పరిస్థితి యథావిధిగా మారింది. వంతెన వద్ద లైటింగ్ సదుపాయం లేకపోవడంతో రాత్రివేళల్లో అంధకారంగా మారుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్వహణపై పాలకులు, అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

శంకరం వద్ద వంతెన గోడపై అల్లుకున్న పొదలు

రోడ్డు మధ్యలో మురుగు

రాజానగరంలో మురుగు రోడ్డు మీదకు చేరింది. గ్రామంలోని ప్రధాన రహదారిలో ఉన్నత పాఠశాల సమీపాన రోడ్డుపై చేరి నీరు చిన్న తటాకాన్ని తలపిస్తోంది. రోజుల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో నిల్వ నీటి నుంచి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. రహదారిపై రాకపోకలు సాగించేందుకు వీలుండటం లేదని వాపోతున్నారు. బురదలోనే నడిచి వెళ్లాల్సి వస్తోంది. వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నీరు పోయేందుకు డ్రైనేజీ లేక పోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. మురుగు తొలగించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

ప్రయాణం బితుకు.. బితుకు

వెంకటనగరం గ్రామం నుంచి పాల్మన్‌పేటకు వెళ్లే దారిలో పంపానదిపై వంతెనకు అనుసంధానంగా నిర్మించిన అప్రోచ్ మార్గానికి ఇరువైపులా రక్షణ చర్యలు లేవు. వాహనాలు అదుపు తప్పితే వంతెన కింద నివాసాల్లోకి దూసుకుపోయే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నుంచి నిత్యం కోటనందూరు, అడ్డరోడ్డు, అన్నవరం తదితర ప్రాంతాలకు ముడిసరుకుతో భారీ వాహనాలు, కార్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అప్రోచ్ కిరువైపులా ఇనుప కమ్మెల రైలింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

వంతెనకు సమీపంలో రక్షణ లేని మార్గం

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండా వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు, వినతులు, విజ్ఞాపనలు పట్టించుకోకుండా ఏక పక్షంగా కేంద్రం వీటిని తీసుకువచ్చిందని ఆరోపించారు. ఉద్యమాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసే చర్యలు సరికాదన్నారు. కార్మికుల వేతనాలు, పనిగంటల, సామాజిక భద్రతకు భంగం కలిగే చర్యలు కేంద్రం తీసుకుంటోందని ఆరోపించారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైకాపా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చోడిపల్లి అప్పారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈనెల 26న కార్మికుల ఆందోళనకు మద్దతుగా నిలుస్తున్నట్లు తెలిపారు.

సంప్రదాయాలు కాపాడాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి శారదానది ఒడ్డున పరుశురామ్‌పేటలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పితృకర్మల భవన ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతినిధులు చెరువు రామకోటయ్య, బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాస్, గంటి రవి, పేరూరి బుజ్జి, కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 20 వేల సాయం

రాంబిల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదానికి గురైన గుడాల చంటిబాబును రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి తెదేపా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు దూళి రంగనాయకులు, ఎరిపల్లి చిట్టిబాబు, గరికిన గోవింద, చెల్లూరి నూకన్న, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికి తీయండి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మున్సిపల్ ఛైర్మన్ బాకూరి ప్రసాద్‌రాజు తెలిపారు. పట్టణంలో రాంనగర్‌లో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ఆహ్లాదం, ఆనందాన్ని పెంచడానికి ప్రతివారం దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతో విద్యార్థులు

జన సైనికుల కుటుంబాలకు పరిహారం

నక్కపల్లి, కశింకోట, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మృతిచెందిన జనసైనికులకు సంబంధించి ఆదివారం విజయవాడలో బీమా చెక్కుల పంపిణీ జరిగినట్లు పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కురందాసు అప్పలరాజు తెలిపారు. రాజయ్యపేటకు చెందిన ఎం.అప్పలరాజు, న్యాయంపూడికి చెందిన సీహెచ్ ఆనందరావు, సీతంపాలేనికి చెందిన ఎ.సింహాద్రి వేర్వేరు సమయాల్లో ప్రమాదవశాత్తు మరణించారన్నారు. వీరికి పార్టీ సభ్యత్వంలో భాగంగా రూ. 5 లక్షల చొప్పున బీమా చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ నేత నాగబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గెడ్డం బుజ్జి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆకేటి గోవిందరావు, పిక్కి స్వామి, కిరణ్ పాల్గొన్నారు. కశింకోట మండలంలోని పరవాడపాలెం గ్రామానికి చెందిన సూరిశెట్టి సంతోషి కి రూ. 91,572 చెక్కును జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ అందజేశారు. నాయకులు ఉగ్గిన రమణమూర్తి, గొంతిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులతో గెడ్డం బుజ్జి తదితరులు

ఉత్సాహంగా గ్రామజ్యోతి

ఎలమంచిలి, మునగపాక, న్యూస్‌టుడే: కొక్కిరాపల్లిలో గ్రామజ్యోతి కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. యువతులు, మహిళలు నూకాంబిక చెరువు గట్లపై తుప్పలను తొలగించారు. మొక్కలు నాటుతున్నామని వీటిని సంరక్షించే బాధ్యతలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

శ్రమదానంలో యువతులు

నిబంధనలు పాటిస్తే మేలు

ఎలమంచిలి: రోడ్డు నిబంధనలు ప్రతి వాహనచోదకుడు పాటిస్తే భద్రతకు డోకా ఉండదని ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొక్కిరాపల్లి జాతీయ రహదారి వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలకు సుదీర్ఘ అనుబంధం ఉందని కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ గెల్లా జయబాబు అన్నారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేకును కోసి పంపిణీ చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఎన్‌సీసీ అధికారులు దాడి జగదీశ్వరరావు, ఏఎస్ఎన్ మూర్తి, పర్యవేక్షకురాలు పెంటకోట అనూరాధ, వైస్ ప్రిన్సిపల్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు. ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రేమతత్వమే నిజమైన మానవత్వం

అచ్యుతాపురం, ఎలమంచిలి, మునగపాక, కశింకోట, న్యూస్‌టుడే: ప్రేమతత్వమే నిజమైన మానవత్వమని, సమానత్వమే సాయి తత్వమని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హరిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. మడుతూరులో దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు వీఎస్‌టీ పట్నాయక్ దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎలమంచిలిలో సత్యసాయి సమితి కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎలమంచిలి ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలను తహసీల్దార్ వరహాలరావు పంపిణీ చేశారు. మునగపాక తహసీల్దార్ కార్యాలయంలో సాయిబాబా చిత్రపటానికి ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సోమరాజు పాల్గొన్నారు. కశింకోట సత్యసాయి మందిరంలో మధ్యాహ్నం మహానారాయణ సేవకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నాలుగు వేలమంది భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం బాలబాలికలు కూచిపూడి, భరతనాట్యం, నాటికలు ప్రదర్శించి అందరినీ అలరించారు.

హరిపాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

అనకాపల్లి పట్టణం, కొత్తూరు, న్యూస్‌టుడే: గాంధీనగరంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సత్యసాయి సమితి ఛైర్మన్ లక్ష్మణరావు, కన్వీనర్ సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో గ్రామీణ సీఐ అశోక్‌కుమార్ సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. రామాపురం సత్యసాయి మందిరంలో అన్న సమారాధన నిర్వహించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. గాజువాక మహిళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మందిర నిర్వాహకురాలు బీవీపీ మహేశ్వరి, రమణ, దేవయ్య, శ్రీనివాస్, లక్ష్మీ పాల్గొన్నారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపట తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో సత్యసాయి జయంతి వేడుకలు చేశారు. సత్యసాయి భజన మండలి సభ్యులు దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందజేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంచారు. మండలి కన్వీనరు రమేష్ బాబు, యాజ్ఞవల్క్య‌శర్మ, రమణరాజు పాల్గొన్నారు. ఎస్.రాయవరం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నక్కపల్లి, వేంపాడులలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వ్రతాలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సారిపల్లిపాలెంలోని మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

కశింకోటలో నాట్య ప్రదర్శన

'రైతన్న మీకోసం' వారోత్సవాలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏఓ రంగాచారి పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 29 వరకు రైతు సేవా కేంద్రాలను యూనిట్‌గా తీసుకుని ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఇళ్లకు వెళ్లి రైతుల అవసరాలు, సమస్యలు తెలుసుకోవాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలను అనకాపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగచైతన్య అఖిల్ అభిమాన సంఘ అధ్యక్షులు ఎస్.భానుచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోలవరపు త్రినాధరావు, బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమాన సంఘ అధ్యక్షులు మళ్ల సంతోష్, నాగార్జున, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వస్త్రాలు అందజేస్తున్న అభిమానులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | ఎలమంచిలి- 80085 74726 | పాయకరావుపేట- 80085 74750

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: రామునాయుడు కాలనీలో మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా చేస్తామని చెప్పుతున్నారు కాని పట్టించుకోవడం లేదు. – **రాజశేఖర్, అనకాపల్లి,** ✓: నిర్మాణ పనులు చేపడతాం. – **శేఖర్, జీవీఎంసీ ఈఈ, అనకాపల్లి**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: నర్సింగరావుపేటలోని సాయిబాబా కోవెల వద్ద రహదారి గోతులు పడింది. సమస్యను పరిష్కరించగలరు. – **రాజు, అనకాపల్లి,** ✓: మరమ్మతు చేపడతాం. – **గోపాలకృష్ణ, జీవీఎంసీ డీఈ, అనకాపల్లి**

పాయకరావుపేట: ?: పాయకరావుపేటలోని దుర్గానగర్‌లో కుక్కల బెడద ఎక్కువైంది. ఒంటరిగా రోడ్డుపైకి రాలేకపోతున్నాం. సమస్య పరిష్కరించాలి. – **డి.శ్రీనివాస్, స్థానికుడు,** ✓: కుక్కల బెడదకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడతాం. – **కె.డేవిడ్, ఈవో**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని బృందావనం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వీధిలో మురుగు పోయేందుకు వీలుండటం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయించాలి. – **జి.రమేష్, స్థానికుడు,** ✓: పారిశుధ్యం మెరుగుపరుస్తాం. మురుగు తొలగిస్తాం. – **నాగార్జున, శానిటరీ మేస్త్రి**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని బృందావనం నుంచి మేకల రేవు పుంత రోడ్డులో గుంతలు పూడ్చాలి. రాజీవ్‌నగర్ కాలనీ, ధనిశెట్టి నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారంతా ఇబ్బందులు పడుతున్నారు. – **పి.ప్రసాద్, స్థానికుడు,** ✓: రోడ్డుపై పడిన గుంతలు పూడ్చిస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

పాయకరావుపేట: ?: పాయకరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆటస్థలం వరకు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట భయంభయంగా ప్రయాణించాల్సి వస్తోంది. – **కె.రవి, స్థానికుడు,** ✓: వీధి దీపాలు వేయిస్తాం. ఇబ్బందులు తొలగిస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: మంగవరం నుంచి గోపాలపట్నం వెళ్లే దారిలో ఆవ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపు ఉన్న విషయం దగ్గరకు చేరే వరకు తెలియడం లేదు. – **దొర, గోపాలపట్నం,** ✓: మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. – **కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: మోసయ్యపేటలోని మురుగు నీటి కాలువల అనుసంధానం లేకపోవడం వల్ల నీరు ముందుకెళ్లడం లేదు. – **ఆనందరావు, మోసయ్యపేట,** ✓: అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు ముగిసిన వెంటనే కాలువల అనుసంధానం పూర్తి చేస్తాం. – **శ్రీను, పంచాయతీ కార్యదర్శి**

కోటవురట్ల, న్యూస్‌టుడే: ?: కోటవురట్ల ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకుపోయి ఉంది. **అప్పారావు, కోటవురట్ల,** ✓: పేరుకుపోయిన చెత్తను తొలగించి, శుభ్రం చేయించమని కార్యదర్శికి చెబుతాను.

– **చంద్రశేఖర్, ఎంపీడీఓ**

నీటి సరఫరా పునరుద్ధరణ

స్పందనకు వందనం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెదరామభద్రపురం శివారు చిన్ననర్సాపురం గ్రామానికి నీటిని సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్తు పనుల్లో భాగంగా పైపులైన్లు తవ్వడంతో పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై శుక్రవారం 'ఈనాడు'లో 'నిలిచిన తాగునీటి సరఫరా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పైపులైన్లు మరమ్మతు చేయించడంతో తాగునీరు సరఫరా అవుతోంది.

తుప్పల తొలగింపు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయం వద్ద విద్యుత్తు స్తంభాన్ని ఆనుకుని ఉన్న తుప్పలను విద్యుత్తు సిబ్బంది తొలగించారు. 'ఈనాడు'లో శుక్రవారం 'కళ్ల ముందే ఎగబాకిన ప్రమాదం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఉన్నతాధికాధికారులు సిబ్బందితో తుప్పలు మొత్తం తొలగించారు.

పేటలో హోంమంత్రి పర్యటన నేడు

పాయకరావుపేట: పేటలో సోమవారం హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారు. మండలంలోని పెదరామభద్రపురంలో నిర్వహించనున్న రైతన్న మీకోసంలో ఆమె పాల్గొంటారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేశారు.

తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారం..

నక్కపల్లి, న్యూస్‌టుడే: సారిపల్లిపాలెంలోని క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసినట్లు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి అనిత హాజరు కానున్నారని అన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

మునగపాక, న్యూస్‌టుడే: వ్యాయామంతో ఆరోగ్యం పదిలమని అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌ఛైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం బాక్సింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు దొడ్డి వరహా, గోసాల గోవిందరావు, మళ్ల రాజేష్ పాల్గొన్నారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ తర్వాత నర్సీపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందని సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. మరిన్ని షాపింగ్‌మాల్స్, వినోద పార్కులు ఏర్పాటుకావాల్సిన అవసరముందన్నారు. స్థానికంగా శ్రీసత్య షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ నటి అనుపమ పరమేశ్వరన్‌తో కలిసి పలు విభాగాలను ప్రారంభించారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా సీఐ గోవిందరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ప్రారంభిస్తున్న సభాపతి అయ్యన్న

సంత ఇబ్బందులు తీరాయి

స్పందనకు వందనం

దేవరాపల్లి: దేవరాపల్లి సంతను రోడ్డుపై నిర్వహిస్తుండటంపై 'దారిలోనే సంత.. జనసందోహం' శీర్షికతో ఈనాడులో మంగళవారం ప్రచురితమైన కథనంపై దేవరాపల్లి ఎస్సై వి.సత్యనారాయణ స్పందించారు. కానిస్టేబుళ్ల సహకారంతో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ దగ్గరకు ఆయన వెళ్లారు. రోడ్డు మీద సంత వల్ల అసౌకర్యాన్ని వారికి వివరించారు. శివాలయం పక్కన ఖాళీగా ఉన్న ప్రదేశానికి కూరగాయలను తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య: ఆడి1: రాజు వెడ్స్ రాంబాయి, ప్రేమంటే, శివ రోడ్డు టు రిజెంట్, ఆడి 2: ది గర్ల్ ఫ్రెండ్, ఆడి 3: 12ఏ రైల్వే కాలనీ, మస్త్ పోలీస్, ఆడి 4: ప్రేమంటే, రాజు వెడ్స్ రాంబాయి, బంగార్రాజు: శ్రీ వెడ్డింగ్‌షో, రాజు: జంగిరి. చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కాంత, సాయిలక్ష్మి: శివ, పూర్ణా: 12ఏ రైల్వే

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE Cum SPL. JUDGE TO TRY CASES UNDER SC & ST (POA) ACT AT: VIZIANAGARAM
O.S.03/2025

Between:
V.R. DEVELOPERS, Rep. by its Partners "Smt. Alluru Yamini Naga Lakshmi and others ...Plaintiffs
And
Sri Ganta Satish Naidu & others ...Defendants

SUMMONS

To,
D-5: Smt. Mandapati Vishali, W/o. Venkata Ravi Kumar, Hindu, aged about 42 years, C/o. M.S.N. Raju, Plot No.1, Kusuma Gajapapathi Nagar, Cantonment, Vizianagaram -535003.
D-9: Smt. Dendukuri Vijayalakshmi, W/o. Subba Raju, Hindu, aged about 72 years, R/at Church Street, Near Sharada School, Sharada Nagar, Narsipatnam -531116.
D-12: Smt. Chekuri Lakshmi Bhavani, W/o. Sanyasi Raju, Hindu, aged about 50 years, R/at Plot No.3, M.S.N. Colony, Vizianagaram -535002.

పైనెంబరు దావాయందు మీకు కోర్టువారు కోర్టుద్వారా పంపిన సమన్లు / నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు జారీచేసియున్నారు. సదరు దావా తేది. 11-12-2025 నాటికి వాయిదా ఉన్నది. సదరు దావా విషయమై మీకు ఏవిధమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణగాని ఉన్నయెడల పై కోర్టువారి ఎదుట పై తేదీన స్వయంగాగానీ, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై తెలుపుకొనవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది. లేనియెడల మహారాజశ్రీ కోర్టువారు మీ పరోక్షమందు సదరు దావాను పరిష్కరించగలరు.

(By Order of the Hon'ble Court)
V.V.V.S.S.M. RAJA RAO & N. MADHUSUDAN RAO, Advocates for Plaintiffs. Cell: 94408 89502

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. SHRIRAM FINANCE LIMITED, Chodavaram Branch, Chodavaram, Anakapalli District, I issue the following notice to general public. My client intends to grant loan to Mr. PADALA MOHAN KUMAR S/o Padala Varaha Murthy by keeping the below mentioned schedule property of Mr. PADALA VARAHA MURTHY S/o Padala Pydikonda as security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Anakapalli District, Madhugula Mandalam, Madugula Sub-District, Madugula Koduru Gram panchayat and village accounts covered by S.No.114-1 an extent of 150 Sq. yards or 126 Sq. meters of vacant site is measured and bounded by: EAST: Vacant site of Gali Annapurna - 50 feet or 15.250 meters; SOUTH: Vacant site of Gali Annapurna- 27 feet or 8.235 meters; WEST: Vacant site of Chukka Krishna - 50 feet or 15.250 meters; NORTH: Rasta -27 feet or 8.235 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.23.11.2025. Mobile No.98851 66648 Mail: sreenivaskoduri@gmail.com

గోవాడసుగర్స్ పై అఖిలపక్ష సమావేశం

చోడవరం, న్యూస్‌టుడే: రైతులకు ఆశాజ్యోతిగా ఉన్న గోవాడ చక్కెర కర్మాగారంలో గానుగాట నిలిపివేయడంపై అందరిలోనూ అసంతృప్తి వ్యక్తమవుతుందని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎస్ఎన్.రాజు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన పీవీఎస్ఎన్.రాజు మాట్లాడుతూ రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని అధిగమించేందుకు గోవాడను నడిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచాల్సి ఉందన్నారు. సీడీసీ మాజీ ఛైర్మన్ కర్రి తమ్మునాయుడు, అడపా నర్సింహమూర్తి, పెద మదినా సర్పంచి కొల్లిమిల్లి వెంకటరమణ, ఉప సర్పంచులు దాడి సూరి నాగేశ్వరరావు, శనివాడ నాయుడుబాబు, నందవరపు రమాదేవి, నరవ సరోజిని, అల్లం రామఅప్పారావు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాజు

శాంతియుత మార్గమే శరణ్యం

రోలుగుంట, న్యూస్‌టుడే: మనిషి జీవితంలో శాంతి లోపిస్తే సమాజంలో చోటుచేసుకునే అనేక అనర్థాలు మానవ జీవితంపై ప్రభావితం చూపుతాయని పెదబొడ్డేపల్లికి చెందిన రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రోలుగుంటలోని క్రీస్తురాజు దేవాలయం 24వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. రోలుగుంటతోపాటు కె.నాయుడిపాలెం, కొత్తకోట, నిండుగొండ, కంచుగుమ్మల, కొవ్వూరు తదితర గ్రామాలకు చెందిన క్రీస్తు ఆరాధకులు హాజరయ్యారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

చోడవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఉండేందుకు ఆసక్తిని చూపాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పలరాజు అన్నారు. పట్టణంలోని వివేకానంద కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు ముఖ్యఅతిథిగా హాజరై క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరమన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు వినియోగం వంటి వాటికి దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ఉద్బోధించారు.

నర్సీపట్నంలో సినిమా చిత్రీకరణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఆర్కే మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎ.రాజ్‌కుమార్ నిర్మాతగా పీకే నాయుడు దర్శకత్వంలో తెరకెక్కనున్న పవిత్రఫైల్స్ సినిమా చిత్రీకరణకు ఆదివారం మాజీ కౌన్సిలర్ పైల గోవిందరావు క్లాప్ కొట్టారు. సంస్కృతి, సంప్రదాయాల దెబ్బతీయడం వల్ల కోల్పోతున్న పవిత్రతను సరిచేయడం కథాంశంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో అంజి, చందన జంటగా నటిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో బాలగణపతి ఆలయ ఛైర్మన్ ధనిమిరెడ్డి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చీకట్లు తొలగాయ్..

కింతలిలో విద్యుత్తు ఉపకేంద్రం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గిరిజన గ్రామాల్లోని విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ఉపవిద్యుత్ కేంద్రాన్ని సుమారుగా రూ. 337 లక్షలతో 33/11 కేవీ లైన్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగింది. తద్వారా కింతలి, కింతలి వల్లాపురం, అవురువాడ ఎల్‌పొన్నవోలు, జాలంపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఇబ్బందులు తప్పాయి. గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో ఈ పంచాయతీలకు మాత్రమే కాకుండా పొంగలిపాక, సత్యవరం, గాదిరాయి, ఒమ్మలి ఉండేవి. దీంతో ఏ గ్రామంలో సమస్య వచ్చినా ఆయా గ్రామాల్లో సరఫరా నిలిపివేయాల్సి వచ్చేది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాదాపు ఏడాది కాలంలోనే సబ్‌స్టేషన్‌ను పూర్తిచేసింది. దీంతో ఇక్కడి గిరిజనుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ సబ్‌స్టేషన్‌కు ఇంధన వనరులశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో గాదిరాయి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో దాదాపు 50 కిపైగా గ్రామాలు ఉండేవి. ఏమాత్రం వర్షం వచ్చిన, గాలి వీచిన సరఫరాకు అంతరాయం కలిగేది. ఒక్కోసారి లోఓల్టేజీ కారణంగా ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయేవి. ప్రస్తుతం ఇలాంటి ఇబ్బందులు ఏమీలేవు.

మంచు మళ్లీ పెరిగింది..

పొగమంచు తీవ్రత మళ్లీ పెరిగింది. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మన్యం ప్రాంతాన్ని తలపించేలా దట్టంగా పొగమంచు అలముకుంది. దీంతో ఉదయాన్నే రాకపోకలు సాగిస్తున్నవారు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బంది పడ్డారు. పట్టపగలు హెడ్‌లైట్లు వెలిగించుకొని నెమ్మదిగా వాహనాలు నడిపారు. పొలాలపై మంచు దుప్పటిలా ఆవరించింది. – చీడికాడ, న్యూస్‌టుడే

అర్జునగిరి-కలిగొట్ల ప్రధాన రోడ్డులో..

తేజస్వినికి స్వర్ణం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలో ఆదివారం జరిగిన జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని ఎనభై కిలోల విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించిందని శాప్ కోచ్ కె.అబ్బు తెలిపారు. డిసెంబర్‌లో పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.

శ్రమదానంతో విశ్రాంతి భవనం నిర్మాణం

రోలుగుంట, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అభిమానాన్ని జనసేనకులు శ్రమదానంతో చాటుకున్నారు. మండలంలోని గుండుబాడు శివారు బలిజిపాలెం, గుండుబాడు గ్రామాలకు చెందిన జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు కల్యాణ్ పేరుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా బలిజిపాలెం కూడలివద్ద సుమారు రూ.3 లక్షల అంచనా వ్యయంతో ప్రయాణికుల విశ్రాంతి షెడ్డును నిర్మించి మార్గదర్శకంగా నిలిచారు. గ్రామానికి చెందిన పవన్ అభిమానులంతా నగదు పోగుచేసుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

కాపలాదార్ల వేతనాలు పెంచాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పాఠశాలల్లో రాత్రి కాపలాదార్లకు ఇస్తున్న రూ.ఆరు వేల వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, రాత్రి కాపలాదార్ల సంఘం గౌరవాధ్యక్షుడు డీజీనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఈ సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో జీవనం సాగించడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. భద్రత కోసం వీరందరిని బీమా పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘ సమావేశం నేడు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడులో నియోజకవర్గస్థాయి యాదవ సంఘ సమావేశం సోమవారం జరుగుతుంది. ఈ విషయాన్ని మండల సంఘ నాయకుడు నంబారు అప్పారావు తెలిపారు.

పీఏసీఎస్‌కు అనుబంధంగా దుకాణ సముదాయం

రోలుగుంట, న్యూస్‌టుడే: ఇప్పటికే వ్యాపార, వాణిజ్య రంగాల్లో సభ్య రైతులకు సేవలను అందిస్తూ లాభాల్లో దూసుకుపోతున్న రోలుగుంట పీఏసీఎస్‌కు అనుబంధంగా ఆదివారం దుకాణ సముదాయాన్ని సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి సుర్ల బాబులునాయుడు ప్రారంభించారు. ఈ దుకాణ సముదాయం వల్ల సొసైటీకి మెరుగైన ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు యర్రంశెట్టి వెంకటరమణ, బుంగా అప్పారావు, సొసైటీ సీఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సముదాయాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు బాబులునాయుడు

సాగునీటి రంగానికి మహర్దశ

కలిగొట్ల కాలువ పూడికతీత ప్రారంభిస్తున్న పాత్రునాయుడు తదితరులు

దేవరాపల్లి (న్యూస్‌టుడే): కూటమి పాలనలో సాగునీటి రంగానికి మహర్దశ పడుతోందని రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు అన్నారు. కలిగొట్ల సాగునీటి కాలువ పూడికతీత పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. రైవాడ ఆయకట్టుకి పూర్తిగా సాగునీరందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘ అధ్యక్షుడు సిమ్మినాయుడు, వెంకటరమణ, డి.డి.నాయుడు, కొమార బాబూరావు, జనసేన అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, ఈశ్వరరావు, సాంబ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా అందజేత

చెక్కు అందజేస్తున్న నాగబాబు తదితరులు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఐదు నెలలు కిందట ప్రమాదవశాత్తూ విద్యుతాఘాతంతో మృతి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు పాసింబిల్లి చిరంజీవి కుటుంబసభ్యులకు ఆదివారం మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో జనసేన ఎమ్మెల్సీ కె.నాగబాబు రూ.5లక్షలు బీమాచెక్కు అందజేశారు. పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు సలాదుల ప్రసాదుబాబు, మరిశా స్వామినాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.దేవి తదితరులు పాల్గొన్నారు.

మేళాలో 155 మందికి ఉద్యోగాలు

చీడికాడ, న్యూస్‌టుడే: యువత ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులోభాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉద్యోగ మేళాను నిర్వహించామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉద్యోగమేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఐదేళ్లలో 15 లక్షల ఉద్యోగాలను కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి గోవిందరావు మాట్లాడుతూ. 385 మంది పాల్గొనగా 155 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, కోనాం జలాశయం ఛైర్మన్ పోతల చిన్నంనాయుడు, తెదేపా మండల కార్యదర్శి పంచాడ దాలినాయుడు, మాజీ ఛైర్మన్ గండి ముసలినాయుడు, చీడికాడ, దండిసురవరం సొసైటీల అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాథం, బొబ్బాది తాతారావు, గాలి బాలకృష్ణ, రొంగలి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE Cum SPL. JUDGE TO TRY CASES UNDER SC & ST (POA) ACT AT: VIZIANAGARAM
I.A.53/2025 in O.S.03/2025

Between:
V.R. DEVELOPERS, Rep. by its Partners Smt. Alluru Yamini Naga Lakshmi and others ...Petitioners / Plaintiffs
And
Sri Ganta Satish Naidu & others ...Respondents / Defendants

NOTICE

To,
R-5: Smt. Mandapati Vishali, W/o. Venkata Ravi Kumar, Hindu, aged about 42 years, C/o. M.S.N. Raju, Plot No.1, Kusuma Gajapapathi Nagar, Cantonment, Vizianagaram -535003.
R-9: Smt. Dendukuri Vijayalakshmi, W/o. Subba Raju, Hindu, aged about 72 years, R/at Church Street, Near Sharada School, Sharada Nagar, Narsipatnam -531116.
R-12: Smt. Chekuri Lakshmi Bhavani, W/o. Sanyasi Raju, Hindu, aged about 50 years, R/at Plot No.3, M.S.N. Colony, Vizianagaram -535002.

పైనెంబరు దావాయందు మీకు కోర్టువారు కోర్టుద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీచేసియున్నారు. సదరు దావా తేది. 11-12-2025 నాటికి వాయిదా ఉన్నది. సదరు దావా విషయమై మీకు ఏవిధమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణగాని ఉన్నయెడల పై కోర్టువారి ఎదుట పై తేదీన స్వయంగాగానీ, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై తెలుపుకొనవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది. లేనియెడల మహారాజశ్రీ కోర్టువారు మీ పరోక్షమందు సదరు దావాను పరిష్కరించగలరు.

(By Order of the Hon'ble Court)
V.V.V.S.S.M. RAJA RAO & N. MADHUSUDAN RAO, Advocates for Petitioners. Cell: 9440889502

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు

నర్సీపట్నంలో మహిళల సామూహికవ్రతాలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: సత్యసాయి జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో అంతటా వేడుకలు ఘనంగా జరిగాయి. కూంద్రపువానిపాలెంలో సంస్థ జిల్లా సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్ 100 మందికి రగ్గులను అందజేశారు. కశిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టరు రొంగలి మహేశ్, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.


కూంద్రపువానిపాలెం పతాకావిష్కరణ

చోడవరం, న్యూస్‌టుడే : సత్యసాయిబాబా సేవా సమితి సారథ్యంలో అన్నసమారాధన, ప్రార్థనలు చేశారు. రాష్ట్రగృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు సాయి మందిరంలో హారతిచ్చారు. భక్తులు విశేషంగా హజరయ్యారు.

సత్యసాయి సేవలో తాతయ్యబాబు

వేచలంలో...

వేలం ప్రకటన

మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో..
EP 3/2024 OS 148/2020
కురచా వెంకటలక్ష్మి .....D.Hr
సాలాపు చినతల్లి Etc ......JDRs

ప్రజలు యావన్మందికీ యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై JDRs చెందిన యీ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని పై కోర్టులో 2025వ సంవత్సరం డిసెంబరు నెల 22వ తేదీన ఉదయం గం॥ 10.30ని॥ల నుండి సాయంత్రం గం॥ 5.00ని॥ల మధ్యలో పై నెంబరు డిక్రీ బాకీ రాబట్టుకోరి వేలం వేయబడును. కావున సదరు వేలంపాటలో పాల్గొనదలచినవారు పైన తెలిపిన తేదీన పై కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరయి వేలంపాటలో పాల్గొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

District : Anakapalli, Mandal : Chodavaram
Village: Jannavaram
ITEM No.1: Dry Land Comprised in S.No. 21-1-A-2 in an extent Ac 0.10 Cents and is bounded by:
East: Tank, South: Tank, West: Dry Land of Salapu Appala Naidu, North: Dry Land of Salapu Eswara Rao
ITEM No.2: Dry Land Comprised in S.No.133-17-A in an extent of AC 0.20 Cents and is bounded by:
East: Yetikaluva, South: Dry Land of Salapu Venkata Appalanaidu, West: Rainfed Channel; North: Dry Land of Salapu NarasimhaMurthy.
ITEM No.3: Dry Land Comprised in S.No.108-6-A in an extent AC. 0.10 Cents is bounded by:
East: YetiKaluva, South: Dry Land of Salapu Venkata Appala Naidu, West: Rainfed Channel, North: Dry Land of Salapu Ramunaidu.

గమనిక: పై వేలంపాటకి సంబంధించి ఎవ్వరికైననూ ఎటువంటి సందేహములు ఉన్నయెడల పై కోర్టులో గాని D.Hr తరపు అడ్వకేట్ గారిని సంప్రదించవలెను.

D.Hr తరపు న్యాయవాది
KOTAKALA LAKSHMANA RAO
Advocate. Cell: 9949931167
Chodavaram
చోడవరం
తేది: 21-11-2025



పెందుర్తి

తెరపై ఈనాడు

ఆక్సికాంట్ స్క్రీన్-1 ప్రేమంటే (మార్నింగ్, ఫస్ట్ షో), 12a ఫ్రెక్టరీలు (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్-2 రాజు వెడ్స్ రాంబాయి

భర్త ఇంటికి తిరిగి రాలేదని భార్య ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాయుడుతోట దరి దుర్గానగర్‌కు చెందిన సింహాద్రి నాగరాజు(36)కు గత కొన్నాళ్లుగా మానసిక స్థితి సరిగా లేక ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అదృశ్యం కేసు నమోదు చేసి హెచ్‌సీ జి.అప్పారావుకు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్ ప్రధాన కాలువలు శుభ్రంగా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. – అప్పారావు, శ్రీనివాసనగర్. ✓: కాలువలను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. – అప్పలనాయుడు, ఏఎంహెచ్ఓ, జోన్–8

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. – పి.వెంకటేశ్, సబ్బవరం ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ?: సబ్బవరం సాయినగర్ కాలనీ నుంచి వచ్చే వాడుక నీరు వ్యాపార దుకాణాల ముందు నిలిచిపోతోంది. – కె.గంగునాయుడు, సబ్బవరం. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ సమావేశంలో చర్చించి కాలువ తవ్వే ఏర్పాటు చేస్తాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం.

ఆదమరిస్తే అంతే..!

తరచూ జరుగుతున్న ప్రమాదాలు

వేపగుంట, న్యూస్‌టుడే

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే బీఆర్టీఎస్ రహదారి అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా మారింది. మొంథా తుపానుకు కురిసిన భారీవర్షాలకు గోతులు పెద్దవిగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. పెద్దపెద్ద గోతులు జీవీఎంసీ అధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు కనిపిస్తున్నా గోతులు పూడ్పించాలన్న ఆలోచన అధికారులకు ఉండటం లేదు. దీంతో ద్విచక్రవాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకర గోతులను పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు. ★ బీఆర్టీఎస్ రహదారిలో ఎక్కువగా ప్రైవేటు కేబుల్ సంస్థలు తవ్విన గోతులే ఉన్నాయి. ఆ సంస్థలు సక్రమంగా గోతులను పూడ్చకుండా వదిలేశాయి. కొన్నిచోట్ల తూతూమంత్రంగా పూడ్చి చేతులు దులుపుకొన్నాయి. దీంతో వర్షాలకు రహదారులు పూర్తిగా కోసుకుపోయి పెద్దపెద్ద గోతుల్లా మారాయి.

ఎక్కడ ప్రమాదకరంగా ఉన్నాయంటే..:

★ వేపగుంట నుంచి పినగాడి వెళ్లే సర్వీసు రహదారిలో పెద్దపెద్ద గోతులు ఉన్నాయి. రాత్రివేళల్లో ఆ గోతుల్లో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ★ వేపగుంట నుంచి పెందుర్తి వెళ్లే రహదారిలో వేపగుంట రామాలయం, సంతోషనగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం కూడళ్ల వద్ద, వేపగుంట నుంచి గోపాలపట్నం వెళ్లే రహదారిలో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. ★ జీవీఎంసీ అధికారులు వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి రహదారులపై ప్రత్యేక లేయరు వేసి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీకాలనీ ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా గొయ్యి..

ఇలాంటి స్టాపర్లు ప్రమాదాలను నిలువరించేనా..

పరిశీలించి తగుచర్యలు తీసుకుంటాం..

బీఆర్టీఎస్ రహదారిలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు గోతులు పెద్దవి ప్రమాదకరంగానే మారాయి. ప్రయివేటు సంస్థల కారణంగా పాడైన రహదారులను ఆ సంస్థల యాజమాన్యాలకు సమాచారం పంపి తగు చర్యలు తీసుకుంటాం. – శంకర్రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనరు, జోన్–8,

పద్మనాభుడి సేవలో ఎంపీ శ్రీభరత్

పద్మనాభం, న్యూస్‌టుడే: విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదివారం పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన కుంతీ మాధవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎర్రాయుడు దంపతులు ఎంపీకి స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి నిధులు లేకపోవడం వల్ల విడారాన్ని అనంత పద్మనాభ స్వామి, కుంతీమాధవ స్వామి ఆలయాలకు కూడా చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపట్టాలని, ఆలయ ముఖద్వారం నిర్మించాలని ఎంపీకి ఎంపీటీసీ దంపతులు విన్నవించారు. కార్యక్రమంలో మండల తెదేపా యువజన అధ్యక్షుడు కేవీ.సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.సుమంత్‌నాయుడు, ఆలయ ఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు వేదాశీర్వాదం చేస్తున్న ఆలయ అర్చకులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి, సీతారాముల మహామూర్తి అభివృద్ధిపై గీతాపఠనాలు చేశారు. ఇస్కాన్ (విశాఖ) అధ్యక్షుడు సాంబదాస్ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు.

ఆగని తాబేళ్ల మృత్యువాత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ తీరానికి ఆదివారం సముద్రంలో నుంచి ఓ పెద్ద మృత తాబేలు కొట్టుకొచ్చింది. ఇటీవల నుంచి రుషికొండ తదితర ఇతర పరిసర తీరాలకు ఎక్కువగా పలు తాబేళ్లు ముఖ భాగంలోని గాయాలతో విగతజీవులుగా చేరుతుండటం అందరినీ కలవరపెడుతోంది. పడవల ఇంజిన్ల చక్రాలు తగిలి లేదా వలల్లో చిక్కుకున్నప్పుడు భయాందోళనకు గురై ఎక్కువగా మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని మత్స్య శాఖాధికారులు పేర్కొంటున్నారు. కూర్మాలకు ఇలాంటి దుస్థితి తలెత్తడం పట్ల పర్యావరణ ప్రేమికులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

అల్లిపురం, న్యూస్‌టుడే: నగరంలోని డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కడలి సంస్థ పుండరీకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాన్ని వాల్తేర్ రైల్వే డివిజన్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలు అందించిన కొణతాల రాజును కడలి సంస్థ సభ్యులు సన్మానించారు.

రౌడీషీటర్లు గీత దాటితే కఠిన చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ స్వామినాయుడు సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ జరిపారు. ప్రస్తుతం వారి కుటుంబ నేపథ్యం, జీవనోపాధి మార్గాలపై ఆరా తీశారు. నేరాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. గీత దాటితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ స్వామినాయుడు, పోలీసులు

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం దరి గౌరీ విశ్వేశ్వర కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడిని కాలనీవాసులు కోరారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించారు. రోడ్లు, కాలువలు లేక ఇబ్బందిపడుతున్నామని, మురుగు, దోమలతో అవస్థలు పడుతున్నట్లు ఆయనకు వివరించారు. దీనిపై కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారని వారు అన్నారు.

కార్పొరేటర్ ముమ్మనకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ సోమవారం ఉదయం 10 గంటలకు సబ్బవరం తహసీల్దారు కార్యాలయానికి వస్తారని ఏరియా మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యలు పరిష్కరించారో లేదో అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీది కీలకపాత్ర

పెందుర్తి, న్యూస్‌టుడే : యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల కరస్పాండెంట్ కేఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు ఉత్సాహంగా పాల్గొని గౌరవ వందనం, మార్చ్ ఫస్ట్ చేశారు. పతాకావిష్కరణ చేసి ఎన్‌సీసీ గీతం ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అక్షిత్ వర్మ, వైష్ణవి వర్మ, ఉప ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఎన్‌సీసీ అధికారులు రోజా, శేఖర్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రైతుబజార్ నిర్వహణపై ఆగ్రహం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం రైతుబజార్ నిర్వహణపై మార్కెట్‌శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలను పరిశీలించారు. టమాటా ధరలు, సరఫరాపై ఆరా తీశారు. బజార్‌లో ఎక్కడికక్కడే కూరగాయల నిల్వలు, వ్యర్థాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గృహమిత్ర, పండ్ల దుకాణాలను పరిశీలించారు.

రైతుకార్డును పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్ కిరణ్

కుటుంబ సభ్యులకు క్షతగాత్రుడి అప్పగింత

ఇందల్ కుమార్‌ను బంధువుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్

పెందుర్తి, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ వద్ద గాయాలతో ఉన్న ఓ వ్యక్తిని సంరక్షించిన పోలీసులు అతడిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. దీనికి సంబంధించి పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన ఇందల్ కుమార్(28) ఈనెల 16న తోటివారితో కలిసి కూలీపని కోసం రాజమహేంద్రవరం వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయి గాయాలపాలయ్యాడు. రోడ్డు పక్కన ఉన్న అతడికి పెందుర్తి పోలీసులు చికిత్స చేయించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఇందల్ కుమార్ కుటుంబానికి సమాచారం అందించి విశాఖ రప్పించి ఆదివారం అతడిని వారికి అప్పగించారు.

యువత భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి, భాగస్వామ్యం ఎంతో కీలకమని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం పాపయ్యరాజుపాలెం దగ్గర ఎన్‌ఏడీ లేఅవుట్‌లో పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ముమ్మన ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్, కాలనీ సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీ లేఅవుట్‌లో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వైభవంగా శ్రీకృష్ణార్పణం

శ్రీకృష్ణలీలల సంకీర్తన చేస్తున్న కళాకారులు

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధా మదన్‌మోహన్ స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌వెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామదాసు సంకీర్తన ప్రచార సమితి కళాకారులు కాళీప్రసాద్ సమక్షంలో జి.సునీత, జి.విద్యలక్ష్మి, పి.లక్ష్మి శిరీష, ఏ.సరిత, కె.మాధవి లత, కె.శ్రీలక్ష్మి, సి.రమాదేవి, శివకుమార్, సిహెచ్.దుర్గప్రసాద్ శ్రీకృష్ణలీలల సంకీర్తన చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌వెంట్ జిల్లా ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస, యదురాజా భక్తదాస, అంబరీషదాస తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు ఆగి ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జింకలు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి వస్తున్న జింక

సత్యసాయి జీవితం సమాజానికి ఆదర్శం

పెందుర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా స్వయంగా సేవా మార్గాన్ని అనుసరించడంతో పాటు సమాజానికి స్ఫూర్తి నింపి ఆదర్శంగా నిలిచారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. చినముషిడివాడలోని సత్యసాయి మందిరం, సుజాతనగర్‌లోని సత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సుజాతనగర్‌లోని ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు, దుస్తులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణలు జరిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శానాపతి శంకర్రావు, సింహాచలం మాజీ ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో భజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, తదితరులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట, ప్రహ్లాదపురం సత్య సాయిబాబా ఆలయాల్లో ఆదివారం శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వేపగుంట కృష్ణరాయపురం భజన మండలి కన్వీనరు అక్కునాయుడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడులు పాల్గొని పూజలు చేశారు. ప్రహ్లాదపురం కన్వీనరు డి.కె.పి.రాజు, గ్రూపు లీడర్ ముత్యాల నాయుడుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కార్యాలయంలో సత్యసాయి శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దారు బి.చిన్ని కృష్ణ, సబ్బవరం సర్పంచి దెడ్డం ప్రసాదరావు, బోకం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు పలువురు భక్తులు హాజరై సత్యసాయి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సుమారు 3 వేల మందికి అన్నసమారాధన చేపట్టారు. బలిరెడ్డి అప్పారావు, మామిడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో..

సబ్బవరం సాయినగర్ కాలనీలో..

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవంలో పంచకర్ల వెంకటేశ్వరరావు, తదితరులు

సుజాతనగర్ భజన మండలిలో..

వేపగుంట ఎస్సీబీసీ కాలనీలో..

ప్రహ్లాదపురంలో..

ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు

వేపగుంట, న్యూస్‌టుడే: అప్పన్న స్వామి - భరత్ నగర్ రహదారిలో గోపీజనవల్లభస్వామి ఆలయ సమీప ప్రాంగణంలో అయ్యప్ప స్వామి సన్నిధానం పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర ద్రవిడ సేవాసంఘం ఆధ్వర్యంలో శబరిమల పూర్వ ప్రధాన మేల్‌శాంతి బ్రహ్మశ్రీ పీ.జీ.మురళి నంబూద్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సన్నిధానం పూజకు నగరంలో పలు పీఠాల నుంచి సుమారు నాలుగు వేల మంది స్వాములు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పరశురామ పురస్కార గ్రహీత నీలం బాలాజీ గురుస్వామి, కోనసీమ జిల్లా చిరుతపూడికి చెందిన జాతీయస్థాయి అవార్డు గ్రహీత రాజేశ్ గురుస్వాములు భక్తి గీతాలు ఆలపించారు. స్థానిక కార్పొరేటరు రాపర్తి కన్నా తదితరులు హాజరై పూజలో పాల్గొన్నారు.

అప్పన్నపాలెం శ్రీకృష్ణుడి గుడి వద్ద అయ్యప్పల పూజలు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

స్కేటింగ్ పోటీలకు శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : నగరంలో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న 63వ జాతీయ స్కేటింగ్ పోటీలకు ఉక్కు ఇందిరా పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ఈనెల 20వ తేదీ నుంచి డిసెంబరు 2 వరకూ శిక్షణ ఇస్తున్నారు. అనంతపురం, కృష్ణా, నెల్లూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల నుంచి సుమారు 211 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

సాధన చేస్తున్న స్కేటింగ్ క్రీడాకారులు

ఆటోడ్రైవర్ నిజాయతీ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి నెల్లిముక్కుకాలనీకి వరలక్ష్మి ఇంటికి వస్తుండగా.. ఆదివారం ఆటోలో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయారు. దీనిపై న్యూపోర్టు క్రైం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే ఆటోడ్రైవర్ శ్రీనివాస్ నేరుగా స్టేషన్‌కు వచ్చి బ్యాగును పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ అప్పలరాజు బాధితురాలికి బ్యాగును అందించి ఆటోడ్రైవర్‌ను అభినందించారు.

బ్యాగును అందజేస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్, ఎస్ఐ అప్పలరాజు తదితరులు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన నిందితుడు జయసేన్ అక్రమంగా విశాఖకు గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయిని 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపాలెం సమీపంలోని శ్మశానవాటిక వద్ద కణితి కాలనీకి చెందిన కాండ్రేగుల ఓంకార్ (25), వడ్లపూడికి చెందిన దెండేటి సందీప్ (28) గంజాయి తరలిస్తుండగా పోలీసు తనిఖీలో పట్టుకున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

‘కనకమహాలక్ష్మి’ ఉత్సవ కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాత నగరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నూతన కమిటీ కొనసాగుతుంది. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ సిఫార్సుల మేరకు కమిటీ సభ్యులుగా జనసేన నుంచి కందుల నాగరాజు, వాకముళ్ల అక్కలనాయుడు, ధనాలకోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లబిల్లి వెంకటలక్ష్మి, తెదేపా నుంచి కేదారి లక్ష్మి, ఇంధన భద్రరావు, మేడపాటి శ్రీధర్, యాండ్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కృష్ణారావు, ఎం.లక్ష్మీనాగేశ్వరరావు, భాజపా నుంచి కొప్పుల రామ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. వారితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ కమిటీ సభ్యుడిగా కొనసాగనున్నారు. ★ ఉత్సవాల నేపథ్యంలో ఆలయ వర్గాలకు కమిటీ సభ్యులు సహాయ, సహకారాలు అందించాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు అమ్మవారి ఆలయానికి ట్రస్టుబోర్డు ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీతో కీలక నిర్ణయాలు తీసుకునే వీలుండదు.

PUBLIC NOTICE

Under the instructions of my clients (1) Dr. Utharavalli Navya, D/o Sri P.V.S. Lakshmi Prasad and (2) Sri Puvvula Anvesh, S/o Sri P.V.S. Lakshmi Prasad, Residents of Flat No. SK 15-6, Paramount towers, Sriram Panorama Hills, Yendada, Visakhapatnam-530045, We are issuing this public notice.

Sri P.V.S. Lakshmi Prasad and Smt. Puvvula Lakshmi, Retired Manager, LIC, R/o Sujathanagar, Visakhapatnam, are the parents of my clients and they are separated by virtue of a decree of divorce granted by the Family Court, Visakhapatnam in the month of November 2009. Since then, they are living separately and my clients are in the care and custody of their father only and there is no relationship between the mother and the children.

My clients reliably learnt that Smt. Puvvula Lakshmi is borrowing different amounts from different people, even though, there is no need of borrowing as she is getting a reasonable amount of pension every month. She is mentally unstable and she refuses medical treatment. When she is not repaying the sundry debts, the money lenders are approaching my clients making illegal demands, even though, my clients are no way responsible or liable.

This is to inform the general public that my clients are no way concerned with the activities of borrowing or lending money by Smt. Puvvula Lakshmi.

BVRR ASSOCIATES
B.V.RAMANJANEYA RAO
B.CHITTARANJAN KUMAR & B.V. KALPANA
Advocates
D.No. 49-28-9, Madhuranagar
Visakhapatnam -530016. **Ph: 9848483399**

(c) eenadu

ఈనాడు
అనంతపురం
సోమవారం నవంబరు 24, 2025

వైకాపా ప్రభుత్వంలో నష్టపోయాం.. న్యాయం చేయండి

లోకేశ్‌కు తెదేపా కార్యకర్తల వినతులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రోద్బలంతో పోలీసులు తమపై అక్రమ కేసులు బనాయించారని.. వాటిని విచారించి ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ముదిగుబ్బ మండలం మలకవేములకు చెందిన డి.లోకేశ్ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన లోకేశ్ ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. చెన్నేకొత్తపల్లి గ్రామంలో తాను కొనుగోలు చేసిన రెండున్నర సెంట్ల స్థలాన్ని గత వైకాపా ప్రభుత్వంలో హనుమంతరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడని, విచారించి న్యాయం చేయాలని ముదిగుబ్బ మండలం మాకర్లకుంటపల్లికి చెందిన టి.నాగభూషణం విన్నవించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు సాయం చేయాలని బుక్కపట్నంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు రామాంజనేయులు కోరారు. ఎంఏ బీఈడీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పుట్టపర్తికి చెందిన జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వినతులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి అర్జీదారులకు హామీ ఇచ్చారు.

అర్జీ స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

మన రాష్ట్రం తరఫున పరేడ్‌లో కళాకారులు

ప్రశాంతి నిలయం ప్రధాన ద్వారం వద్ద కిక్కిరిసిన భక్తజనం

వేదఘోషతో ప్రదర్శనగా వస్తున్న వేదపండితులు, విద్యార్థులు

బాల వికాస్ చిన్నారుల నృత్యప్రదర్శన

సంప్రదాయ నృత్యాలతో...

సత్యకీర్తి.. విశ్వకాంతి!

- సాయి నామస్మరణతో మార్మోగిన పుట్టపర్తి
- అట్టహాసంగా బాబా శత జయంతి వేడుకలు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తి: ఏ నోట విన్నా సాయి నామస్మరణే. ఏ హృదయాన్ని మీటినా సత్యసాయి సంకీర్తనలే. ప్రతి మాటలో.. ప్రతి పిలుపులో సాయిరాం.. మదినిండా కొలువుదీరిన సాయినాథుడిని కీర్తిస్తూ భక్తజనం తరించింది. శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరిగాయి. దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల మధ్య బాబా వేడుకలు కనువిందుగా సాగాయి. ప్రముఖ గాయకుడు మనో, డ్రమ్మర్ శివమణి.. గాన తాండవం నడుమ శ్రీసత్యసాయి పాటలు భక్తులను అలరించాయి. వేదపండితులు, వివిధ రాష్ట్రాలకు చెందిన సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు, బాలవికాస్ చిన్నారుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, మేళతాళాల నడుమ సాయినాథుడు ఆశీనులైన స్వర్ణరథాన్ని మందిరం నుంచి హిల్‌వ్యూ స్టేడియం వరకు ఊరేగించారు.

సాయిప్రేమ సజీవం..

ఉదయం 9.55 గంటలకు శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలు విద్యార్థుల వేదపఠనం, సాయికీర్తనలతో ప్రారంభించారు. వేదికపైకి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మంత్రి లోకేశ్ ఆశీనులయ్యారు. 10 గంటలకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభోపన్యాసం చేశారు. సాయి మిషన్ నిత్యం సజీవంగా కొనసాగుతోందన్నారు. సాయి చూపిన ప్రేమ, సేవామార్గంలో ట్రస్టు పయనిస్తుందని స్పష్టం చేశారు. వేడుకలకు హాజరైన ముఖ్యఅతిథులు, భక్తజనానికి ట్రస్టు తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి, ఉపరాష్ట్రపతి మాటామంతీ..

'మనో'గానం.. డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

అలరించిన బాలవికాస్ చిన్నారులు

సత్యసాయి శతజయంతి వేడుకల్లో 18 రాష్ట్రాల బాలవికాస్ చిన్నారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హిల్‌వ్యూ స్టేడియంలో గుజరాత్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన బాలల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కళకళలాడిన స్టేడియం

సాయినాథుడి వందేళ్ల పండగ తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఉదయం 7 గంటల నుంచే హిల్‌వ్యూ స్టేడియంలో వేచి ఉన్నారు. సాయి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ పేద, ధని, ప్రముఖులు అనే తేడా లేకుండా తెల్లటి వస్త్రాలు, టోపీలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు సేవాదళ్ సభ్యులు, పోలీసులు మార్గనిర్దేశం చేశారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భక్తుడి అవసరం తెలుసుని సహాయం అందించారు. ఉమ్మడి అనంతపురం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించుకున్నారు. భక్తుల రాకతో పుట్టపర్తి పురవీధులు కిటకిటలాడాయి.


ఇరువురు సీఎంల ఆత్మీయ కరచాలనం

కలెక్టర్, ఎస్పీ నిరంతర పర్యవేక్షణ

వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్... ట్రస్టు వర్గాలు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించారు. వీవీఐపీల రాకపోకలతో పాటు, స్టేడియం, ప్రశాంతి నిలయం, పట్టణ వీధుల్లో తిరుగుతూ.. వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

మిరపకు విల్ట్

- ఎండుతున్న పంట
- ఆందోళనలో రైతులు

ఉరవకొండ మండలం ఇంద్రావతి వద్ద విల్ట్ సోకడంతో ఎండిపోతున్న మిరప పంట

ఉరవకొండ, న్యూస్‌టుడే: మిరప పంట సాగు ఆశాజనకంగా ఉన్నా గత వారం నుంచి విల్ట్ తెగులు వ్యాప్తితో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అనంత జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోర్ల కింద ఈ ఏడాది 30వేల ఎకరాల్లో మిరప సాగయింది. అందులో 5531, తేజ, 2043, 273, డబ్బీ అనే మిరప రకాలు ఉన్నాయి. అత్యధికంగా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెళుగుప్ప, బొమ్మనహాళ్, కణేకల్లు..మండలాల్లో అత్యధికంగా సాగులో ఉంది. పంట పూత, కాయ పడే కాలం. మందుల పిచికారీ, ఎరువులు, ఇతరత్రా యాజమాన్య చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు ఎకరాకు రూ.1.20 లక్షల ప్రకారం రైతులు పెట్టుబడి పెట్టారు.

మందులు పిచికారీ చేస్తున్నా..

పంటలో వేర్లు కుళ్లిపోవడం ద్వారా విల్ట్ తెగులు ఆశించడం ప్రారంభం అయ్యింది. ఉరవకొండ ప్రాంతంతో వ్యాప్తి అధికంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తెగులు సోకిన తరువాత మొక్కలు క్రమంగా ఎక్కువకొక్కటి ఎండిపోతున్నాయి. రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. మొక్కలను తొలగించడం తప్ప ప్రత్యామ్నాయం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా ఎర్రనేలల్లో సాగయిన మిరపకు ఎక్కువగా తెగులు సోకుతున్నట్లు అభిప్రాయపడుతున్నారు. పంట సాగు సమయంలో రైతులకు కనీస జాగ్రత్తలు ఉద్యాన అధికారులు తెలియజేసిన సందర్భాలు లేవు. ఇప్పటికైనా ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పొలాలను పరిశీలిస్తాం..

- యామిని, ఉద్యాన అధికారి, ఉరవకొండ

రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగులు నివారించవచ్చు. 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక లీటరు నీటికి కలిపి మొక్కల మొదల్లో పిచికారీ చేయాలి. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. నీటి తడులను తగ్గించుకుంటే మంచిది. కొమ్మ ఎండు, కాయ కుళ్లుకు ఒక ఎంఎల్ ప్రొపికోనజోల్, 0.5 ఎంఎల్ డైఫెన్కోనజోల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి తగిన చర్యలు చేపడుతాం.

రూ.1.75 కోట్లతో నిర్మించారు... నిరుపయోగంగా మార్చారు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)కు రూ.1.75 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి ఏడాదిన్నర కాలం దాటిపోయింది. అయినా దానిని అందుబాటులోకి తీసుకొచ్చేదిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం పీహెచ్‌సీ భవనం ఇరుకుగా ఉండటంతోపాటు శిథిలావస్థకు చేరింది. కనీసం ఐదారుగురు రోగులకు సెలైన్ బాటిల్స్ పెట్టాలన్న ఇబ్బందికరంగా మారింది. ఎవరైనా ప్రమాదాలకు గురయ్యో, గాయాలతోనో చికిత్స పొందాల్సి వస్తే.. వారికి ఆరుబయటే మందు వేసి, కుట్లు, పట్టీలు కడుతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పీహెచ్‌సీ అధికారి డాక్టర్ వెంకటేశ్ నాయక్‌తో ప్రస్తావించగా.. ప్రహరీని నిర్మించాల్సి ఉందని, ఆర్‌అండ్‌బీ అధికారులు పూర్తి చేయగానే సేవల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కరిగించేసి.. దోచేసి!

- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

కదిరి పట్టణం, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమార్కుల ధనదాహానికి పచ్చనిచెట్లతో కూడిన కొండలు కరిగిపోతున్నాయి. ఎర్ర మట్టి కోసం యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. కుటాగుళ్ల నుంచి కదిరి మండలం పందులకుంటకు వెళ్లే మార్గంలోని కొండలను మట్టివ్యాపారులు భారీ యంత్రాలతో కరిగించేస్తూ ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో తరలించి జేబులు నింపుకొంటున్నారు.

కొండను తవ్వుతున్నారు ఇలా..

- గతంలో పనికి ఆహార పథకం కింద వేప, సీతాఫలం విత్తనాలను కొండలపై చల్లడంతో వృక్షాలుగా ఎదిగాయి. పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న కొండలో అక్రమార్కుల ఆగడాలకు నేలకొరిగాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కొండను తవ్వేస్తున్న విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని గ్రామీణులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కడప రాతికొండను 150 అడుగులలోతు తవ్వేస్తున్నారు. దీంతో కుటాగుళ్ల, బోయరామన్నపల్లి, కదిరికుంట్లపల్లి, హనుమంతరావుపల్లి, జౌకల, చలమకుంట్లపల్లి గ్రామాల్లో పశువులకు గ్రాసం లేకుండా పోతోందని కాపరులు వాపోతున్నారు.
- సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప రాతికొండను లక్ష్యంగా చేసుకున్న అక్రమార్కులు మట్టిని తవ్వి.. రాత్రివేళల్లో తరలిస్తున్నారు. బిల్డర్లతో ఒప్పందం చేసుకుని రవాణా సాగిస్తున్నారు. టిప్పర్ మట్టికి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.1000లకు విక్రయిస్తున్నారు.

ఈనాడు ప్రత్యేక పరిశీలన

తగిన చర్యలు తీసుకుంటాం

- మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

కొండను తవ్వేసి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారంగా అడవులు రూపుకోల్పోయేలా చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతాం.

ఆస్తుల క్రయవిక్రయాల్లో పారాహుషార్!

హక్కుదారు నిర్ధారణలో జాగ్రత్తలు తీసుకోవాలి

మీకోసం

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు క్రయవిక్రయాలు చేయాలంటే రిజిస్ట్రేషన్ ముఖ్యం. ఆయా వాటికి సంబంధించి రిజిస్టర్ అయిందా? హక్కుదారు ఎవ్వరు? నిబంధనల ప్రకారం ఉన్నాయా ? తదితరాలపై అమ్మకం, కొనుగోలు చేసే సమయంలో చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గొడవలు, ఆక్రమణలతో పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతుండటం చూస్తుంటాం. సరైన దస్త్రాలు, స్థిర, చర ఆస్తులకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు లేకపోతే నష్టపోవాల్సి ఉంటుంది.

ఏమి చేయాలంటే..!

- ★ ఎవరైనా ఆస్తి కొనుగోలు సమయంలో హక్కుదారు, ఏవైనా బకాయిలు ఉన్నాయా? అన్న విషయం నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.
- ★ 'మీ భూమి' వెబ్‌సైట్ ద్వారా భూమి యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేసుకుని ఆస్తి అమ్మకందారు పేరిట ఉందా? లేదా అన్నది తెలుసుకోవచ్చు.
- ★ దస్తావేజుల ప్రతులు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరిది? ఎలా సంక్రమించిందన్న విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంటుంది.
- ★ ఆస్తిని 'పవర్ ఆఫ్ అటార్నీ' ద్వారా పొందిన వ్యక్తి అమ్మకం చేస్తున్నప్పుడు హక్కులు ఉన్నాయా? లేవా అన్నది నిర్ధారించుకోవాలి.
- ★ పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాలు, అసెస్మెంట్ రిజిస్టర్‌లో నమోదు ముఖ్యం. ఈ వివరాల మదింపు రిజిస్టర్‌లో ఆస్తికి సంబంధించిన హక్కులు పరిశీలించుకోవాలి.
- ★ కొనుగోలు చేసే ఆస్తిపై వివాదాలు, ఇతరులకు హక్కులు లేవనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకున్నాకే ముందడుగు వేయాలి.
- ★ క్రయ దస్తావేజు రాసుకునే సమయానికి సదరు ఆస్తికి సంబంధించి ఆస్తి, నీటి పన్నులు, విద్యుత్తు బిల్లుల బకాయిలు లేకుండా చూసుకోవాలి.

అద్భుత ఆలోచనలు.. బహుళ ప్రయోజనాలు!

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే : నైపుణ్యంపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పాఠశాల విద్యార్థుల్లోనూ నైపుణ్యం పెంపొందించడానికి ప్రభుత్వం చొరవ చూపుతోంది. ఇటీవల జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి 9 నమూనా ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వాటిల్లో రెండు నమూనాల తీరు ఇలా..

నమూనా ప్రాజెక్టుతో విద్యార్థులు జనార్దన్, విజయలక్ష్మి, శిక్షకుడు శ్రీనివాసరెడ్డి

ప్రాజెక్టు	: క్వాంటం కంప్యూటర్
విద్యార్థులు	: జనార్దన్, విజయలక్ష్మి
తరగతి	: ఇంటర్మీడియట్
పాఠశాల	: ఆదర్శ, పుట్లూరు

పని తీరు : సాధారణ కంప్యూటర్లు 0 లేదా 1 సంకేతాలతో పని చేస్తాయి. క్వాంటం కంప్యూటర్ 0, 1 కలిపి పనిచేస్తాయి. ఉదాహరణకు 200 నాణేలకు సంబంధించి సాధారణ కంప్యూటర్‌లో వివరాలు కోరితే ఒకవైపు మాత్రమే పరిశీలిస్తాయి. సమయం ఎక్కువ తీసుకుంటాయి. క్వాంటం కంప్యూటర్ నాణేనికి రెండువైపులా పరిశీలించి క్షణాల్లో సమగ్ర వివరాలు ఇస్తుంది.

ప్రయోజనం: రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీతోనే అన్ని అంశాలు ముడిపడి ఉన్నాయి. వివిధ సవాళ్లను సులువుగా పరిష్కరించుకోవచ్చు.

ప్రాజెక్టు	: స్టోర్ అండ్ డిస్‌ప్లే ప్లాన్
విద్యార్థులు	: నందకిశోర్, కాంతమ్మ
తరగతి	: పది
పాఠశాల	: జడ్పీ ఉన్నత, తిమ్మంపల్లి, యల్లనూరు

పనితీరు: నాలుగు అంతస్తుల షాపింగ్ మాల్ ఏర్పాటు నమూనా ఇది. ఒక అంతస్తులో నిత్యావసరాలు, రెండోదాంట్లో వంట సామగ్రి, మూడో లో ఎలక్ట్రికల్ వస్తువులు, నాలుగో అంతస్తులో వస్త్రాలు అందుబాటులో ఉంచి విక్రయిస్తారు. ఇవన్నీ స్వదేశీవస్తువులు. ఆర్థిక లావాదేవీలకు భీమ్ యాప్ ఉపయోగిస్తారు.

ప్రయోజనం: స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, మార్కెటింగ్ లభిస్తుంది. భీమ్ యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరగడం వల్ల స్వదేశీసంస్థలు బలోపేతం అవుతాయి.

విద్యార్థులు నందకిశోర్, కాంతమ్మతో శిక్షకుడు వెంకటేశ్

పీఎం ఆవాస్ యోజనతో లబ్ధి ఎలా?

దరఖాస్తు చేయడంలో ఇబ్బందులా..

ఈనాడు మీ తోడు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు సొంతింటి కల సాకారం చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సంబంధిత సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించినా పలు సందేహాలు తలెత్తుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, బిల్లుల మంజూరు, నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించి ఆప్షన్-3 నుంచి 1, 2కు బదిలీ కావడం.. తదితర సమస్యలను సంబంధిత జిల్లా అధికారిణి దృష్టికి తీసుకెళ్లడానికి 'ఈనాడు' చక్కటి అవకాశం కల్పిస్తోంది. ఒక్క ఫోన్ కాల్‌తో అనంతపురం జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారిణి శైలజతో నేరుగా మాట్లాడి.. మీ సమస్య, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఫోన్ చేయాల్సిన తేదీ: 25-11-2025
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
ఫోన్ నంబర్లు: 70939 30112, 80085 73011



(c) eenadu

మౌనిగిరి క్షేత్రం వార్షికోత్సవాలు ప్రారంభం

క్షేత్రంలో కర్ణాటక లోకాయుక్త చీఫ్ జస్టిస్ బీ.వీరప్ప కుటుంబ సభ్యులు

రాప్తాడు: హంపాపురం గ్రామం మౌనిగిరి క్షేత్రంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి 8వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ వార్షికోత్సవాలను కర్ణాటక లోకాయుక్త చీఫ్ జస్టిస్ బి.వీరప్ప జ్యోతి వెలిగించి కార్యక్రమాలు ప్రారంభించారు. మౌనిగిరి క్షేత్ర వ్యవస్థాపకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ వార్షికోత్సవాలు మూడు రోజులు జరగనున్నట్లు తెలిపారు. మంగళవారం హనుమంతుడికి 1000 లీటర్ల పాలతో మహాభిషేకం, పదివేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ట్విటర్ వేదికగా మంత్రి లోకేశ్ అభినందనలు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని పైదొడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న బుకెరామిరెడ్డిపల్లి కౌసల్యను ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్విటర్ వేదికగా ఆదివారం అభినందించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయురాలు కౌసల్య

విద్యార్థుల్లో ఒకరిగా మారి ఆటపాటలతో వారిని అలరిస్తూ, సామెతలు, సూక్తులతో బోధిస్తున్నారని గుర్తించారు. ఆంగ్లం, గణిత పాఠాలు సులభంగా వివిధ పద్ధతులతో నేర్పి స్ఫూర్తిదాయకంగా ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలి విద్యా సేవ బాగుందని అభినందనీయమని ట్విట్టర్ వేదికగా మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు కౌసల్యను స్థానిక ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY, MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు | Digital Partner: ఈనాడు.నెట్, ఈటీవీ BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు కార్యాలయం,
ఈవెంట్స్ డిపార్ట్‌మెంట్, బెంగళూరు
హైవే, రాప్తాడు, అనంతపురం - 515001
వివరాలకు: 80080 01704

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

HOUSE FOR SALE

KLD రోడ్డుకు Ahuda, RERA అనుమతి కలిగి, అన్ని సౌకర్యాల Venture నందు Double, Duplex హౌస్‌లు 90%లోన్‌తో కలవు. ✆ 9866011539, 9963484888.

PLOT FOR SALE

ఉరవకొండ నందు అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన కస్తూరిబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

ATP-కదిరి రోడ్‌కి విన్సెంట్‌డిపాల్ స్కూల్ ఎదురుగా రోడ్ నుంచి 3వబిట్ AHUDA అప్రూవ్డ్ ఉ: 40 అ||ల రోడ్, ద: 30 అ||ల రోడ్ కార్నర్ 10 సెంట్లప్లాటు అమ్మబడును. ✆ 9581196786.

JOBS

అటెండెంట్ కావలెను (పురుష) 63 సం. వయస్సు గల ఒంటరి పురుషుడికి సహకారం అందించేందుకు కావలెను. నెలవారీ జీతం. రామ్‌నగర్. 9393724047.

అనంతపురం టౌన్లో పనిచేయడానికి ఇడ్లీ-వడ, పూరి, దోసెలు రుచికరముగా చేయడంలో అనుభవం కలిగిన వంటమాస్టర్స్ కావలెను. ✆ 83097 18300.

SECURITY GUARDS

క్రింది ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ మరియు సెక్యూరిటీ గార్డులు కావలెను. అనంతపూర్, హిందూపూర్, కదిరి, పామిడి, తాడిపత్రి, పుట్టపర్తి, గుత్తి, ధర్మవరం. ✆ 8008800542, 9000492993.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds — 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

తెలంగాణ సీఎంకు అశోక స్తూపం బహూకరణ

సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పుట్టపర్తికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, సవిత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సవిత రేవంత్‌రెడ్డికి అశోక స్తూపం ప్రతిమను బహూకరించారు.

– న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

సిరి ధాన్యాల వినియోగంతో సంపూర్ణారోగ్యం

మాట్లాడుతున్న ఖాదర్‌వలి

కుందుర్పి, న్యూస్‌టుడే: సిరి ధాన్యాల వినియోగం అలవాటు చేసుకున్న వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి ఆరోగ్య నిపుణులు, పద్మశ్రీ డా. ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఎనుములదొడ్డిలోని విలువల బడిలో ఆదివారం 'సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు' వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలతో పోల్చుకుంటే గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రకృతిలో లభించే వేర్లు, ఆకులు, అలముల ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. పాఠశాలల్లో చిరు ధాన్యాల వినియోగంపై బోధన చేయాలన్నారు. రచయిత్రి శశికళ, గేట్స్ కళాశాల ప్రతినిధులు వాణి, గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్‌కే ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ తీరుపై ఎంపీ ఆగ్రహం

ఈనాడు, అనంతపురం: ఉపరాష్ట్రపతి పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రొటోకాల్ జాబితాలో పేరు లేకపోవడంపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికేందుకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. ఆ సమయంలో ప్రొటోకాల్ జాబితాలో పేర్లు లేవని.. బయటకు వెళ్లాలని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో ఎంపీ.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాగతం పలికేందుకు వస్తున్నట్లు ఒకరోజు ముందుగానే చెప్పినా జాబితాలో తమ పేర్లు ఎందుకు చేర్చలేదని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణను నిలదీశారు. ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధులు విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేశారు.

విజ్ఞానం పాఠ్యాంశం కాదు.. జీవన విధానం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ప్రతినిధులు

పెనుకొండ, న్యూస్‌టుడే: విజ్ఞానశాస్త్రం పాఠ్యాంశం మాత్రమే కాదని, పాఠశాలలో నేర్చుకున్న విజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్లోబల్‌జెన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో జేవీవీ(జన విజ్ఞాన వేదిక) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. విజ్ఞానశాస్త్రం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) స్థాయికి అభివృద్ధి చెందినా చదువుకున్న మేధావులే మూఢ విశ్వాసాల వల్ల నష్టపోతున్నారన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి చెకుముకి పరీక్షల్లో గ్లోబల్‌జెన్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు, హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి ఎంకే నబి వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఆదిశేషు, జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేశ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గ్లోబల్‌జెన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఎంఈవో రాఘవయ్య, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ జగన్‌మోహన్‌రెడ్డికి సన్మానం

ఉపాధ్యాయులతో పీఈటీ జగన్‌మోహన్‌రెడ్డి

పిల్లలపల్లి (బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మూడు రోజుల కిందట గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీల్లో బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో డిస్కస్‌త్రో, లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జగన్‌మోహన్‌రెడ్డిని స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులతోపాటు ఆ పాఠశాల హెచ్ఎం బసవరాజు, గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు.

శతక్కొట్టిన లోహిత్

భారీ స్కోరు దిశగా ఆంధ్ర

లోహిత్ లక్ష్మీనారాయణ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే : అంతర్రాష్ట్ర అండర్-19 కూచ్ బెహార్ నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు ఒడిశా జట్టుపై 80 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కేవలం 56 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆంధ్ర జట్టును లోహిత్ లక్ష్మీనారాయణ (101) అద్భుతమైన శతకంతో జట్టును ఆదుకున్నాడు. ఏఎన్‌వీ లోహిత్ (60), జయంత్‌కృష్ణ (21), జి.మాన్విత్‌రెడ్డి (21)లు ఓ మోస్తరుగా బ్యాటింగ్‌లో రాణించి జట్టును ఆదుకున్నారు. ఒడిశా బౌలర్లు రాజ్‌యాదవ్ (3/56), సంబిత్ కెబేజ (2/52) విజృంభించి ఆంధ్ర జట్టు బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేశారు. ఆంధ్ర బ్యాటర్లు రెండో రోజు విజృంభిస్తే మొదటి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు లభిస్తుంది. ఈ పోటీలను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి జి.మురళీకృష్ణ, ఏసీఎల్ఓ ఎం.కమలాకర్‌నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

పెనకచర్ల డ్యాంలోకి ట్రాక్టర్!

గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య



వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం జె.రాంపురం శివారు గొల్లపల్లిలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రామాంజినేయులుకు చెందిన ట్రాక్టర్‌ను పెనకచర్ల డ్యాం నీళ్లలోకి వదలడంతో పాటు ఆయన పొలంలోని గేట్‌వాల్వ్స్, బిందుసేద్యం పరికరాలు ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయారు. ఆదివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహానంది, ఎస్సై నాగస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పొలంలోని వ్యవసాయ పరికరాల ధ్వంసంతో రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు.

పర్యావరణ సమతుల్యతలో పక్షులు కీలకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే : పర్యావరణ సమతుల్యతలో పక్షుల ప్రాముఖ్యతను గుర్తించడం, విద్యార్థుల్లో ప్రకృతిపై అవగాహన కల్పించడంలో భాగంగా బర్డ్‌వాక్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎస్కేయూ జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న కొత్తకొత్త పక్షులు, వలస పక్షులను గుర్తించారు. పక్షులు ఏర్పాటు చేసుకొన్న వివిధ రకాల గూళ్లను పరిశీలించారు. అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం పక్షుల రంగులు, అరుపులు, వాటిని ఎలా గుర్తించాలో తెలియజేశారు. వివిధ వర్గాల ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్షులను వీక్షిస్తున్న ప్రకృతి ప్రేమికులు

కనువిందుగా... సత్యసాయి జోలసేవ

సాయినాథుడిపై నీళ్లు వేస్తున్న ఏనుగు

సంగీత కచేరీ నిర్వహిస్తున్న పండిట్ అజయ్ చక్రవర్తి బృందం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకొని హిల్‌వ్యూ స్టేడియంలో వేలాది మంది భక్తజనం నడుమ జోలసేవ కమనీయంగా జరిగింది. జోలసేవను భక్తులు తిలకించి తరించిపోయారు. ఊయలలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి, జోలను ఊపడంతో భక్తులు తన్మయం చెందారు. ప్రముఖ సంగీత గాయకుడు పండిట్ అజయ్ చక్రవర్తి, కౌశిక చక్రవర్తి, నవీన్ బృందం "ది ఈటర్నల్ సింఫనీ" సుమధుర స్వరాలతో సంగీత కచేరీ నిర్వహించారు. శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక వైభవం, సేవా కార్యక్రమాలను ప్రదర్శిస్తూ డ్రోన్ల ద్వారా లేజర్‌షో ప్రదర్శించారు. బాణసంచా కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. సంగీత బృందాన్ని ట్రస్టీ రత్నాకర్, సతీమణి హిమవాహిని ఘనంగా సన్మానించారు.

ఎస్కేయూలో విద్యార్థిపై దాడి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ చేస్తున్న వంశీకృష్ణ అనే విద్యార్థిపై బయట వ్యక్తులు శనివారం రాత్రి దాడి చేశారు. ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న వంశీకృష్ణ రాత్రి వసతిగృహం వద్ద వెళ్తుండగా ఇద్దరు యువకులు అడ్డగించారు. సంబంధం లేకపోయినా పిడిగుద్దులు గుద్దారు. దీంతో ఆ విద్యార్థి కన్ను వద్ద గాయమైంది. ఇతర విద్యార్థులంతా కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యాయత్న బాధితుడిని రక్షించిన పోలీసులు

అపస్మారక స్థితిలో పడిఉన్న రాచూరి రాజు

పామిడి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించిన బాధితుడిని పోలీసులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన రాచూరి రాజు అనే వ్యక్తి ఆదివారం ఫినాయిల్ తాగుతూ, బంధువులకు చరవాణిలో సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు పామిడి పోలీస్‌స్టేషన్‌కు విషయం తెలిపారు. ఎస్సై రవిప్రసాద్ ఆదేశాలతో సిబ్బంది రామాంజనేయులు, పోలీసులు రవీంద్ర, ఇమ్రాన్ సాంకేతికత సాయంతో పామిడి కొండాపురం రైల్వేగేట్ సమీపంలో రాజు ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం రాజు బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన వైద్యం కోసం రాజును అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైమ్.. కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పవన్

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో హమాలీ మృతిచెందిన ఘటన వజ్రకరూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు ద్వారా తెలిసిన వివరాలిలా... కణేకల్లు మండలం సొల్లాపురానికి చెందిన పవన్(32), రాము హమాలీలు. వారిద్దరూ ద్విచక్ర వాహనంపై ఆదివారం వజ్రకరూరులోని పవన్ బంధువుల ఇంటికి వెళ్లి రాత్రయ్యాక తిరిగొస్తున్న క్రమంలో వీరిని ప్యాపిలి సమీపం గుంతకల్లు ప్రధాన దారిలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాము పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద వివరాలను ఉరవకొండ ఎస్సై జనార్దన్ నాయుడు సేకరించారు.

మరో ప్రమాదంలో...: ఉరవకొండ మండలం చిన్న ముష్టూరులో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో శివరామిరెడ్డి కాలనీకి చెందిన ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్సకు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

గోరంట్ల మండలం కరావులపల్లిలో..

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలం కరావులపల్లి సమీపంలో ఆదివారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో ఇదే మండలం వానవోలు గ్రామానికి చెందిన వెంకటేష్(30) దుర్మరణం పాలయ్యాడు. వివరాలిలా.. పుట్టపర్తి మండలంలోని కప్పలబండలో వెంకటేష్ బంధువుల ఇంటిలో శనివారం జరిగిన జన్మదిన వేడుకల్లో భార్యాపిల్లలతో కలిసి పాల్గొన్నాడు. ఆదివారం ద్విచక్రవాహనంలో ఒక్కడే సొంతూరుకు వస్తున్నాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో తీవ్రంగా గాయపడినట్లు భావిస్తున్నారు. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించి 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్లగా కొంతసేపటికే మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్థులు వివరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కమ్మచౌదరి

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం కరిడిపల్లికి చెందిన కమ్మచౌదరి(40) అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భార్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పంటల సాగుకు రూ.10 లక్షల దాకా అప్పులయ్యాయి. దిగుబడులు సక్రమంగా రాకపోవడంతో నష్టాలు వచ్చి అప్పులు తీరే మార్గం లేక మనస్తాపానికి గురైన కమ్మచౌదరి శనివారం రాత్రి పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కళ్యాణదుర్గం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు జమేదారు నాగరాజు తెలిపారు.

తండ్రి వంట చేయలేదని కుమారుడు..

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆదివారం పట్టణంలోని గూడ్స్ షెడ్ కొట్టాలకు చెందిన పసుపులేటి శ్రీనివాసులు (38) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. శ్రీనివాసులుకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. భార్య విడాకులు ఇచ్చింది. తల్లి ఇది వరకే మృతిచెందింది. తండ్రి లక్ష్మీనారాయణతో కలిసి ఉంటున్నాడు. కుమారుడికి తండ్రి భోజనం చేసి పెడుతుండేవాడు. శనివారం రాత్రి ఇంట్లో వంట చేయలేదని, బయటకు వెళ్లి హోటల్లో తిని రావాలని శ్రీనివాసులుకు తండ్రి లక్ష్మీనారాయణ తెలిపాడు. దీంతో కుమారుడు గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

ఉండబండలో ఉరుసు

విడపనకల్లు, న్యూస్‌టుడే: ఉండబండలో హజ్రత్ సయ్యద్ మహమ్మద్ నాగూర దాదా ఉరుసు సందర్భంగా ఆదివారం గంధం వేడుకలు వైభవంగా నిర్వహించారు. దర్గా నుంచి జెండాను ఊరేగింపుగా వన్నూరుస్వామి కట్ట వద్ద వరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేటి నుంచి 'రైతన్నా- మీకోసం'

ఉరవకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి 29 వరకు ఉరవకొండ మండలంలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏవో రామకృష్ణుడు పేర్కొన్నారు. రోజూ ఒక్కో రైతు సేవాకేంద్రం పరిధిలోని రైతులకు అగ్రిటెక్‌పై అవగాహనతో పాటు ప్రకృతి సేద్యానికి ఉన్న ప్రోత్సాహం, పురుగు మందుల అధికంగా వినియోగించడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తామన్నారు. డిసెంబరు 3న రైతుసేవా కేంద్రాల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి, వ్యవసాయ ప్రణాళికను తయారు చేస్తామని వివరించారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

పద్మశాలి సంక్షేమ సంఘం సేవలు స్ఫూర్తిదాయకం

తెనాలి టౌన్: విద్య, వైద్య, సామాజిక రంగాల్లో ది తెనాలి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వారు మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.బాలస్వామి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సొసైటీ 30 వసంతాల వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో తెనాలిలో విధులు నిర్వహించిన క్రమంలో ఇక్కడి సంస్థలు, వ్యక్తులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటు, అందించిన సేవలు, సాధించిన ప్రగతిని వివరించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం 30 వసంతాల ప్రగతి సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల శ్రీరామ్, రాజాబత్తుని బ్రహ్మం, నరేంద్ర బాబు, పురుషోత్తం, జొన్నాదుల మహేష్, వెంకటేశ్వరరావు, ఓంకార్ ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనేయులు, ఆశ్వర్థ ఆరోగ్య వివరాలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలుసుకున్నారు. బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, పాలాభిషేకాలు నిర్వహించారు. యాగమండపంలో రాహు కేతు, సర్పదోష, కాలసర్పదోష, కుజదోష నివారణార్థం సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర బీజాక్షర హోమాన్ని చేశారు.

మాతృవేదనకు.. ఆర్థిక భరోసా

● మొదటి, రెండో ప్రసవాలకు సాయం

న్యూస్‌టుడే, రాయదుర్గం

రాయదుర్గం లాంటి వెనకబడిన కరవు ప్రాంత గర్భిణులకు 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన' అండగా నిలుస్తోంది. అర్హులైన వారు వివరాలను నమోదు చేసుకుంటే ఆర్థిక భరోసా లభించనుంది. ఈ పథకం కింద మొదటి ప్రసవానికి రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ అయితే రూ.6 వేలు అందిస్తారు. గర్భిణులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించటంతోపాటు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకుంటారు. కరవుకు నిలయంగా ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ మంది మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వారికి ప్రసవ సమయంలో ఈ సహాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

అంగన్‌వాడీలకు అప్పగింత

పీఎం మాతృ వందన యోజనకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియను గతంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా ఈ బాధ్యతలు అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించారు. గత నమోదు వివరాలను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించే బాధ్యత స్థానిక కార్యకర్తలపైనే ఉంది. దుర్గం నియోజకవర్గంలోని అయిదు మండలాలకు సంబంధించి మొదటి కాన్పుకు గర్భిణులు 378 మంది ఉండగా.. రెండో కాన్పు గర్భిణులు 46 మంది వరకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు.

నగదు నేరుగా ఖాతాల్లో జమ

గర్భిణిగా నమోదైన 5 నెలల్లోపు రూ.2 వేలు, అన్ని రకాల టీకాలు వేసుకోవటం సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలలోపు మరో రూ.2 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవమైతే రూ. వెయ్యి, పుట్టిన బిడ్డకు మూడున్నర నెలల వయసులో అవసరమైన టీకాలన్నీ వేయించుకుంటే మరో వెయ్యి ఖాతాలో జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం ఒకేసారి రూ.6 వేలు బాలింత ఖాతాలో జమ చేస్తారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న సీడీపీవో పద్మావతి తదితరులు

ఎంపిక చేసిన వారికే వర్తింపు

గర్భిణులకు 18 సంవత్సరాల 7 నెలలు నిండితేనే మాతృ వేదన ఆర్థిక సాయానికి అర్హులవుతారు. బ్యాంకు ఖాతాలు తీసుకుని ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానం చేసుకోవాలి. స్థానిక రేషన్‌కార్డుల్లో, పోషణ్ ఖాతాలో పేర్లు నమోదు చేసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పోషకాహారాన్ని సరఫరా చేస్తున్నాం.

- పద్మావతి, సీడీపీవో రాయదుర్గం

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: రాయదుర్గం పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో కాలవల నిర్మాణానికి తవ్వకాలు చేసి వారం రోజులైనా పనులు చేపట్టక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- ఓంకారప్ప, వెంకటేశ్వరమ్మ**

సమాధానం: మురుగు కాల్వల పనులు చేస్తుండగా నీళ్లు ఊరుతున్నాయని నిలిపివేశాం. కొద్ది రోజుల్లో పనులు పూర్తిచేసి ఇబ్బందులు తీరుస్తాం. **-నరసింహులు, ఏఈ**

సమస్య: శాంతినగర్‌లో కాలవ పూడుకుపోవడంతో మురుగు రోడ్డుపై పారుతుంది. ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- రమేష్**

సమాధానం: త్వరలో పూడిక తొలగించి కాలవల నుంచి మురుగు పూర్తిగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **-నరసింహులు, ఏఈ**

సమస్య: మూడేళ్ల కిందట శాంతినగర్‌లో కాలవ నిర్మాణానికి ఆక్రమణలు తొలగించి తదుపరి పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. **-జయప్రద, శాంతినగర్**

సమాధానం: గతంలోని మొదలు పెట్టిన పనులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **- నరసింహులు, ఏఈ**

- న్యూస్‌టుడే, రాయదుర్గం

సమస్య: కళ్యాణదుర్గం మండలం దాసంపల్లి ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **-మారెప్ప, దాసంపల్లి**

సమాధానం: ప్రజలు అవగాహన కల్పించి వృథా నీరు రోడ్లపైకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **- రవి, ఇన్‌ఛార్జి కార్యదర్శి, బోయలపల్లి**

సమస్య: దాసంపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో స్థానికులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. **- ప్రకాష్, దాసంపల్లి**

సమాధానం: విద్యుత్తు తీగలు సరిచేసి సమస్య పరిష్కరించేలా కృషి చూస్తాం. **-ఖాదర్‌బాషా, లైన్‌మెన్**

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

సైన్స్‌పై ఆసక్తితోనే ఉన్నత శిఖరాలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్సుపై ఆసక్తి పెంచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చెకుముకి పోటీలకు 20 మండలాల నుంచి విద్యార్థులు హాజరైనట్లు రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు మూడు ప్రైవేట్ పాఠశాలలు, మూడు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు చిత్తప్ప, ప్రధాన కార్యదర్శి వీరరాజు, సలహాదారు మల్లికార్జున, జ్ఞానభారతి విద్యా సంస్థల అధినేత రమేష్‌బాబు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: పోలేపల్లికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు పూజారి చంద్రన్న అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా.. పలువురు సంతాపం తెలిపారు. ఆ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు ఓబుళేసు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కురుగొడు తదితరులు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

మురుగు తొలగేనా?

విడపనకల్లు మండలం పాల్తూరు బీసీ కాలనీలో కాలువలు లేకపోవడంతో దారిలోనే మురుగు ప్రవహిస్తోంది. స్థానికులు రహదారిపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఈ మురుగు నీటిలో నడవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దారికి ఇరువైపులా ఉన్న చిన్న కాలువలు కూడుకుపోయాయి. అధికారులు స్పందించి మురుగు కాలువలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, విడపనకల్లు

ట్యాంకు పరిసరాలు శుభ్రం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: దొడగట్ట గ్రామం నడిబొడ్డున ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద నిత్యం గ్రామస్థులు దుస్తులు ఉతుకుతుండటంతో ట్యాంకు పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఈ విషయాన్ని నెల 22వ తేదీన 'ఇది ట్యాంకా.. ధోబీఘాటా?' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం కార్మికుల చేత తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రతను తొలగించారు. ఇప్పటి నుంచి ఇక్కడ దుస్తులు ఉతకకుండా తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో యోగానంద పేర్కొన్నారు.

శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయం

కుందుర్పి మండలం బండమీదపల్లి రోడ్డులోని వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో.. రోజువారీ విధులను తాత్కాలికంగా వ్యవసాయ గోదాము సమీపంలోని వాచ్‌మెన్ గదిలోకి మార్చారు. ఈ గదిలోనే ఐదేళ్లుగా సిబ్బంది ఇబ్బందుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం కూర్చోవడానికి కూడా స్థలం సరిపోక సిబ్బంది, రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పాత భవనం మరమ్మతులు పట్టించుకునే వారే కరవయ్యారు. వెంటనే కొత్త కార్యాలయాన్ని నిర్మించాలని మండల రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కుందుర్పి

'కేంద్రీకృత వంటశాలల ఏర్పాటు తగదు'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును తక్షణమే విరమించుకుని మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టం చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి, భోజన పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, జిల్లా కోశాధికారి సరస్వతి పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ సంస్థకు అప్పగించాలనుకోవడం సరి కాదన్నారు. కార్యక్రమంలో కార్మికులు అనంతమ్మ, రామాంజనేయులు, సూరమ్మ, మంజునాథ్ పాల్గొన్నారు.

దుర్గంలో సమావేశమైన భోజన సంఘం ప్రతినిధులు

ప్రహరీకి గేటు ఏర్పాటు చేయరూ

రాయదుర్గం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం ప్రహరీని ఎన్నికల సమయంలో కూల్చేశారు. అప్పటి నుంచి పునఃనిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో నేటికీ అలాగే దర్శనమిస్తోంది. గేటు లేని కారణంగా కళాశాల ఆవరణలో రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహం ఉంది. కొందరు ఆకతాయిలు రాత్రిపూట చెట్ల కిందనే తిష్ఠ వేస్తున్నారు. వీరి ఆగడాలకు కళ్లెం వేసేందుకు గేటు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ఇది కోనేరే... నమ్మండి

ఇది ఏదో పాడుబడిన బావి మాదిరి కనిపిస్తుంది కదూ...!! కాని ఇది ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని బుగ్గ కోనేరు. దీనికి ఆలయ పరంగా ఎంతో చరిత్ర ఉంది. అయితే అది వ్యర్థాలు, పాచితో తీవ్ర అపరిశుభ్రంగా మారింది. నీటితో నిండుగా ఉన్న కోనేరులోని అపరిశుభ్రతను చూసి భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు స్నానాలు చేయడానికి వీలు లేకుండా ఉంది. ఆలయ అధికారులు కోనేరు శుభ్రత దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులతోపాటు భక్తులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

పడకేసిన పారిశుద్ధ్యం!

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని 5వ వార్డులో తాగునీటి కుళాయి వద్ద పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కనీసం నీళ్లు పట్టుకోవడం ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రతతో తాగు నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. పరిశుభ్రత వల్ల దోమల ఉద్ధృతి పెరుగుతోంది. ఇక్కడి మురుగు కాల్వ శుభ్రం చేయకపోవడంతో పందుల సంచారం పెరిగింది. సంబంధిత అధికారులు వెంటనే పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుచున్నారు.

- న్యూస్‌టుడే, వజ్రకరూరు

నిర్మాణంలోనే డొల్లతనం!

కణేకల్ మండలం కళేకుర్తి నుంచి బెళుగుప్ప మండలం బూదవర్తి, శ్రీరంగాపురం గ్రామాల మీదుగా గుండ్లపల్లి ప్రధాన దారి వరకు సుమారు 9 కిలోమీటర్లు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న పనులు నాసిరకంగా సాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒకవైపు ఈ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండగానే మరోవైపు కుంగిపోయి, అంచులు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడ తారు లేచిపోతోంది. దారి పనులు నాణ్యతగా చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బూదవర్తి, శ్రీరంగాపురం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై పీఆర్ డీఈ సుధాకర్ నాయక్‌తో 'న్యూస్‌టుడే' మాట్లాడే ప్రయత్నం చేయగా ఆయన స్పందించలేదు.

- న్యూస్‌టుడే, బెళుగుప్ప

హెచ్చరిక బోర్డును కమ్మేసిన పొదలు!

వజ్రకరూరు మండలం చిన్నహోతూరు నుంచి ఉరవకొండ వెళ్లే ప్రధాన రహదారిలో హంద్రీనీవా కాలువ వద్ద హెచ్చరిక బోర్డు ముళ్ల కంపల్లో దర్శనమిస్తోంది. అది కనపడక కొత్త వారికి దారి ఎలా వెళ్లాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అక్కడ ప్రమాదాలు కూడా జరిగాయి. సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డు కనిపించేలా ముళ్ల కంపలు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వజ్రకరూరు

ఇద్దరి మృతికి కారకుడైన చోదకుడిపై కేసు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలం గొళ్ల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తోడళ్లుల్లు ఇద్దరు సురేష్, సాలప్ప అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన కారు బెళుగుప్ప మండలానికి చెందినదిగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించి, కారు చోదకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

దేశసమగ్రతను కాపాడటమే లక్ష్యం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: దేశసమగ్రతను పరిరక్షించడమే ఎన్‌సీసీ క్యాడెట్ల లక్ష్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ, అవినీతి నిరోధకశాఖ సీఐ జయమ్మ, డాక్టర్ నాగశశికళ, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు రంగనాథ్ అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవడం మొదటి లక్ష్యమన్నారు. అధికారులు చిన్న వెంకటమ్మ, రామాంజనేయులు, అహ్మద్, విష్ణుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనం... చొరవ చూపితే ప్రయోజనం

ఆదిగానిపల్లిలోని అంగన్‌వాడీ భవనం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఆదిగానిపల్లి గ్రామంలో గత తెదేపా ప్రభుత్వం స్త్రీసంక్షేమ, ఉపాధి నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనం ఏళ్లు గడచినా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. గత వైకాపా ప్రభుత్వం పనులు పూర్తిచేసేలా చొరవ తీసుకోలేదు. తుది దశ పనులు చేయడంలో గుత్తేదారుడి జాప్యంతో ఈ భవనం నిరుపయోగంగా మిగిలింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీ భవనంలో ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. కాసింత చొరవ చూపితే భవనం అందుబాటులోకి రానుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

క్విజ్‌పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జేఎన్‌టీయూ: ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌కు చెందిన రిలియబులిటీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్‌లో క్విజ్ నిర్వహించారు. పోటీల్లో జేఎన్‌టీయూ ట్రిపుల్‌ఈ విభాగం సంజన ప్రథమ, అలేఖ్య ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థి నీలిమ 6వ బహుమతులు దక్కించుకున్నారు.

కల్‌హోళ ఈశ్వరాలయంలో...

వైభవంగా దీపోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కల్‌హోళలో ఆదివారం రాత్రి ఈశ్వరాలయంలో వీరశైవ లింగాయత్ సామాజికవర్గానికి చెందిన పలువురు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. పవిత్ర జలాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

రాయదుర్గం గ్రామీణం: 74 ఉడేగోళం గ్రామ సమీపంలో సుప్రసిద్ధ మద్దానేశ్వర స్వామి ఆలయంలో సోమవారం లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు ఆదివారం తెలిపారు.

74 ఉడేగోళంలో వెలసిన మద్దానేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలోని పురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం షష్ఠి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా గణపతి పూజ, కలశస్థాపన కార్యక్రమాలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శత జయంతి

కళ్యాణదుర్గం: శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆదివారం వాల్మీకి సర్కిల్‌లో వైద్యులు రాజేష్‌కుమార్ సాయిబాబా సేవలను కొనియాడారు. సత్యసాయి అభివృద్ధి కార్యక్రమాల్లో తాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యతలను వివరించారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నీటి పథకం అధికారులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

100 మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

బాబా చిన్ననాటి పాలరాతి విగ్రహం

ఉరవకొండ: సత్యసాయిబాబా చూపిన సేవామార్గం స్ఫూర్తిదాయకమని సత్యసాయి ధ్యాన మండలి అధ్యక్షుడు వెంకట పేర్కొన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలో బాబా జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ధాన్యమండలి ప్రతినిధులు దివాకర్, రామాంజనేయులు, చంద్రమోహన్, జయరాములు, కేశన్న, జయన్న, శ్రీవాణి, ఇందిర, శైలజ, పద్మ, భారతి, రాధ, మౌనిక, పృథ్వీ పాల్గొన్నారు. ● ఉరవకొండలోని సత్యసాయి అవతార ప్రకటన క్షేత్రంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆగిన వంతెనలు... ప్రజలకు అవస్థలు

న్యూస్‌టుడే, కుందుర్పి

కుందుర్పి మండలంలో పలు మార్గాల్లో ఆగిపోయిన వంతెనలతో ప్రజలు, రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం పంట పొలాలకు వెళ్లేందుకు అన్నదాతలు అవస్థలు పడుతూ. . ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం సమీపంలోని కర్ణాటకకు వెళ్లాలంటే కిలోమీటర్ల కొద్ది తిరిగి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెస్తరపల్లి- జంబుగుంపల మార్గంలో...

నాలుగేళ్లుగా ఇదే స్థితి

ప్రభుత్వ హయాంలో 2020లో రూ.4 కోట్లతో జంబుగుంపల నుంచి వెంకటంపల్లి మీదుగా నిజవల్లి వరకూ రోడ్డు, వంతెనల నిర్మాణం, రూ. 6.2 కోట్లతో బండమీదపల్లి నుంచి తమ్మయ్యదొడ్డి మీదుగా బొమ్మాజిపల్లి వరకూ రోడ్డు, వంతెనల నిర్మాణం, అపిలేపల్లి నుంచి మందలపల్లి వరకు తారురోడ్డు, పెద్దవాగులు, వంకలపై ఎత్తైన వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. ఈ పనులు చేస్తున్నప్పుడు పాత వంతెనలు, కల్వర్టులు తొలగించి సిమెంట్ దిమ్మెలను నిర్మించారు. నాలుగున్నర ఏళ్లు పనులు ఆ స్థాయిలోనే నిలిచాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

జంబుగుంపల- వెంకటంపల్లి మార్గంలో దిమ్మెల స్థాయిలో ఆగిన వంతెన

కొత్తగా టెండర్లు పిలుస్తున్నాం

వివిధ రహదారుల నిర్మాణాలు, వంతెనల పనులు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు, భూమి పూజలు, కొన్ని ప్రాంతాల్లో పనులు షురూ అయ్యాయి. తదుపరి కొన్ని సాంకేతిక కారణాలతో పాత టెండర్లు రద్దయ్యాయి. ప్రస్తుతం కొత్తగా టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నాం. మొదట వంతెనల నిర్మాణ పనులు పూర్తిచేయిస్తాం.

- నాగేంద్ర ప్రసాద్, పీఆర్ డీఈఈ, కళ్యాణదుర్గం

వేడుకగా భక్త కనకదాస ఉరేగింపు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మల్లికేతిలో శ్రీభక్త కనకదాస జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం కురుబలు, మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి గంగా జలంతో ప్రత్యేక పూజలు చేశారు. కనకదాస చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి వీధుల్లో ఊరేగించారు.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్‌లో భక్త కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, బసవరాజు, లాలుస్వామి, డాక్టర్ బసప్ప, సర్పంచులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ఉరవకొండ మండలం లత్తవరంలో కురుబలు భక్త కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని వాహనంపై ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మాజీ సర్పంచి బోదపాటి గోవిందప్ప పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో కనకదాస చిత్రపటంతో భక్తులు

(c) eenadu

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అఖిలభారత కరాటే పోటీలో సత్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే: తమిళనాడులోని ఎ.వి.ఎస్.గోజురాయు కరాటే సంఘం ఆధ్వర్యంలో పటేల్ పార్క్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన అఖిలభారత స్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంతకల్లు క్రీడాకారులు సత్తాచాటారు. తమ అకాడమీలో శిక్షణ పొందుతున్న నలుగురు క్రీడాకారులు హర్షిత బంగారు, శ్రీశాన్, శివ రజత, అనిర్ధ సాయి కాంస్య ట్రోఫీలు కైవసం చేసుకున్నట్లు గుంతకల్లు పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ దినేష్ తెలిపారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రసిద్ధి చెందిన అనంత గణగరగ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. శ్రీదేవి, భూదేవిల సమేతంగా స్వామివారిని సుందరంగా అలంకరించి వేదికపై ఉంచి వేదమంత్రాల నడుమ అర్చకులు కల్యాణం చేశారు. తర్వాత ప్రకాశ్, శివశేఖర దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవ ఆలయ మాడవీధుల నడుమ సాగింది. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయాధ్యక్షుడు సాయిప్రకాశ్, పురాణ ప్రవచనకర్తలు భాస్కరరావు, ప్రకాశ్ తదితరులు పర్యవేక్షించారు.

స్వామివార్ల కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్‌నుంచి పిల్లేపల్లి గ్రామం వరకు ఉన్న 9 కిలోమీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. వాహనాలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -నాగార్జున, చీలేపల్లి

సమాధానం: రహదారి ధ్వంసమైన విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. -భాస్కర్, ఎంపీడీవో, శింగనమల

-న్యూస్‌టుడే, శింగనమల(బుక్కరాయసముద్రం)

సమస్య: యల్లనూరు మార్గంలోని దుకాణాల ముందు పలువురు ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే ఉంచుతున్నారు. దుకాణదారులు ప్రచార బోర్డులను అక్కడే పెడుతుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంది. -రమణ, వాహనచోదకుడు

సమాధానం: పోలీసు సిబ్బందిని పంపించి వాహనాలను తొలగిస్తాం. -శోభనరావు, సీఐ

సమస్య: యల్లనూరు మార్గం నుంచి చింతల రాయిని దేవాలయం వరకు వెళ్లే ప్రధాన మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -మనోజ్, సాని‌కుడు

సమాధానం: మురుగు కాలువను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. -నాగేంద్ర, మున్సిపల్ ఏఈ

-న్యూస్‌టుడే, తాడిపత్రి

సమస్య: పట్టణంలోని దోనిముక్కల రోడ్డు ప్రాంతంలో సాయంత్రమైతే దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. -రాజు, స్థానికుడు

సమాధానం: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. -వేణుగోపాలరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఇదేనా.. ఆదర్శ పురపాలిక

◆ తాడిపత్రి శివారు కాలనీల్లో సమస్యలు ◆ కానరాని సీసీ రోడ్లు, మురుగు కాలువలు

శ్రీనివాసపురంలో ఇళ్ల మధ్య భారీ మురుగు గుంత

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి ఆదర్శ పురపాలికలోని శివారు కాలనీల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. మొత్తం 12 శివారు కాలనీలుండగా, 20వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఒక్క కాలనీలోనూ సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించలేదు. ఖాళీ స్థలాల్లో ఆటు వర్షపు నీరు ఇటు మురుగునీరు చేరి నెలల తరబడి నిల్వ ఉంటుండడంతో దోమలు, పందులకు నిలయంగా మారి రోగాలు ప్రబలుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి గురించి పట్టించుకోక పోవడంతో కాలనీవాసులకు నరకం కనిపిస్తోంది. ఇకనైనా కూటమి ప్రభుత్వం తమ కష్టాలు తీర్చాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని శివారు కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎలాంటి ఇబ్బందులంటే..

● పట్టణంలోని శ్రీనివాసపురం ఆఖరి వీధిలో చిట్టడవులను తలపించే విధంగా ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. ముళ్లచెట్లు పెరగడంతో జూదాలకు నిలయంగా మారాయి. మరోవైపు మురుగునీరు చేరి, నెలల తరబడి నిల్వ ఉంటూ వ్యాధుల కార్ఖానాగా మారాయి.

● టైలర్స్ కాలనీలోని శివారు వీధుల్లో సీసీ రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని మురుగు రోడ్లపైకే చేరుతోంది. పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

జయనగర్ కాలనీ, టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, టీచర్స్ కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు జేసీఎల్ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి భూమిపూజ చేశారు. రెండు రోజుల్లో పనులు మొదలవుతాయి. రెండో విడతలో సీపీఐ కాలనీ, నందలపాడులోని పలు వీధుల్లో నెలకొన్న సమస్యలు త్వరలో తీరుస్తాం. -నాగేంద్ర, మున్సిపల్ ఏఈ, తాడిపత్రి

● సీపీఐ కాలనీ, జయనగర్ కాలనీ, చేనేత కాలనీ, నందలపాడులోని శివారు వీధుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సీసీ రోడ్లతో పాటు తాగునీటి పైపులైను లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జయనగర్ కాలనీలోని ఆఖరి వీధుల్లో ఇటీవల అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినా, సీసీ రోడ్డు లేకపోవడంతో ఎత్తుగా మారిన మార్గంలో కాలనీవాసులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

చిత్రలేఖనం శిక్షణ శిబిరం ప్రారంభం

గుంతకల్లు, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆవరణంలో రైల్వే ఉద్యోగుల పిల్లలకు ఆదివారం చిత్రలేఖన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి ఎల్లప్ప, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నేతాజీయల్, కార్యవర్గ సభ్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శని, ఆదివారాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తామని వారు చెప్పారు. పెద్ద సంఖ్యలో హాజరైన బాలబాలికలకు ప్రముఖ చిత్రకారుడు శ్రీధరన్ చిత్రాలు ఎలా వేయాలో మెలకువలు నేర్పారు. అలి తకలల్లో ఒకటైన చిత్రలేఖనం చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీస్తుందని ఈ సందర్భంగా శ్రీధరన్ తెలిపారు.

చిన్నారులకు సూచనలు చేస్తున్న చిత్రకారుడు శ్రీధరన్

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిఒక్క విద్యార్థి ఎన్‌సీసీలో చేరాలని, దీనివల్ల క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ అన్నారు. ఆదివారం ఆ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరితే దేశభక్తి భావవ్యక్తత్వ అభివృద్ధి చెందుతుందన్నారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సురేశ్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేసీ హరికుమార్

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో కొండల నడుమ వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం స్వామి వారికి అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకుల పూజలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అశ్వర్థ ఆలయంలో..

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అర్చకులు అశ్వర్థ నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వర స్వామికి ఉదయం వివిధరకాల అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

చీటీల బాధితుల ధర్నా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: రూ.లక్షల్లో చీటీలు వేసి మోసపోయామంటూ బాధితులు ఆదివారం గుంతకల్లులో మహిళా ఏజెంటు ఇంటి ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ రోడ్డులో ఉంటున్న ఇజాహ్ పాఠో ప్లూడిమా నిర్వాహకురాలు, చీటీల మహిళా ఏజెంటు దిల్షాద్‌బేగం వద్ద రూ.లక్షల్లో చీటీలు కట్టామన్నారు. ఎన్నాళ్ళయినా డబ్బులు ఇవ్వలేదని, అడిగితే నాకు లాయర్లు తెలుసు, జడ్జి తెలుసని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ బెదిరిస్తోందని వాపోయారు. తాను టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటూ, పదేళ్లుగా దిల్షాద్ వద్ద చీటీలు వేస్తున్నట్లు బాధితురాలు పర్వీన్ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో చిన్న చీటీలు వేసినప్పుడు డబ్బులు ఇచ్చిందని, నమ్మి రూ.9లక్షల చీటీ వేస్తే ఇవ్వడం లేదని రోదించింది. అరుణమ్మ రూ.16లక్షలు, మేఘన్ రూ.4లక్షలు, షాహిన్ రూ.9లక్షలు, మంజుల రూ.3లక్షలు చొప్పున దిల్షాద్ వద్ద చీటీలు వేసి మోసపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మహిళా ఏజెంటు ఇంటి ముందు బైఠాయించిన బాధితులు

స్నేహమంటే ఇదే..

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: మండలంలోని వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కుటుంబానికి ఆమెతో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. రెండు నెలల క్రితం లక్ష్మీదేవి అనారోగ్యంతో మరణించింది. సమాచారం అందుకున్న మిత్రులు ఆదివారం నరసాపురం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు డబ్బు అందజేసి, వారిని పరామర్శించారు.

రక్తపోటు, మధుమేహం పరీక్షలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహార విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు నారాయణస్వామి సూచించారు. పట్టణానికి చెందిన నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడకదారులకు ఆదివారం రైల్వే క్రీడా మైదానంలో రక్తపోటు, మధుమేహ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు వారికి పలు సూచనలు చేశారు. ఉదయం, సాయంత్రం నడక అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నారాయణ్‌నాయక్, ఉదయపు నడకదారుల సంఘం అధ్యక్షుడు అంజి, ఉపాధ్యక్షుడు రాముడు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంత్యుత్సవం

పెద్దవడుగూరు: సాయి చిత్రపటానికి భక్తుల పూజలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సమితి భక్తుల బాబా ఆశయాలను కొనసాగిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త, ఏడీఆర్‌ఎం సుధాకర్ అన్నారు. రైల్వేకు చెందిన ప్రభాత్‌నగర్‌లోని సత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంత్యుత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. సమితి సభ్యులు తమ సేవా కార్యక్రమాలను ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. తొలుత సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థిని హన్వితారెడ్డి ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో వేదపండితుడు వేణుగోపాలస్వామి, రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు మమతా, సమితి కార్యదర్శి శంకర్‌నారాయణ గుప్త, సేవా సమితి ధర్మప్రచారక్ జిల్లా కోఆర్డినేటర్ నాగశయన, సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యసాయి సేవా సమితి సభ్యులు సాయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటంతో సంకీర్తనలు ఆలపిస్తూ ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు శివరంగయ్య దోమతెరలు, వాటర్ కూలర్‌ను వైద్యాధికారి శివకార్తిక్‌రెడ్డికి అందజేశారు. అనంతరం సభ్యులు ఆసుపత్రి ప్రాంగణంలో కేకు కోసి అందరికీ పంచారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గురువారం సేవా సమితి ఆధ్వర్యంలో రోగులకు అన్నప్రసాదం వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విశ్వనాథ్, సభ్యులు ప్రకాశ్, తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పామిడి: కేకు కోస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

గుంతకల్లు: ఆకట్టుకున్న చిన్నారి భరతనాట్యం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కాశేపల్లిలో సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి సాయి తాగునీరు అందించడంతో కొన్నేళ్లుగా గ్రామస్థులు ఆయన జయంతిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామస్థులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అన్నదానం చేశారు.

అపరిశుభ్రంగా గూగూడు కల్యాణకట్ట

నార్పల, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం వద్దనున్న కల్యాణకట్ట, స్నానాలు చేసేచోట నెలకొన్న అపరిశుభ్రతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ కుళ్లాయిస్వామి ఆలయానికి పదుల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. స్వామికి తలనీలాలు సమర్పించిన తర్వాత పక్కనే స్నానాలు చేస్తుంటారు. ఆ నీరంతా అక్కడే నిల్వ ఉంటూ దుర్వాసన వస్తోంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి కల్యాణకట్ట వద్ద శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తులు స్నానాలు చేసేచోట ఇలా..

బంగారం వ్యాపారి కేసు వివాదాస్పదం

తాడిపత్రి వాసి అరెస్టు?

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని బంగారం వ్యాపారి తనకంటి శ్రీనివాసులు, ఆయన సోదరుడు తాడిపత్రి వాసి వెంకటస్వామిపై నమోదైన కేసు వివాదాస్పదంగా మారింది. దాదాపు 10 కేజీల (9824.953) బంగారం తీసుకొని, సంబంధిత మొత్తం ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు తనపై దాడి చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి హేమంత్‌శర్మ ఈ సోదరులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 20న ప్రొద్దుటూరులో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి, విషయాన్ని రహస్యంగా ఉంచారు. ఈ నెల 21న రాత్రి శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శివాలయం కూడలి వద్ద మఫ్టీలో వచ్చిన పోలీసులు ఆయనను బలవంతంగా తీసుకెళ్లారు. 22న సాయంత్రానికి శ్రీనివాసులు తమ అదుపులో ఉన్నట్లు పోలీసులు స్పష్టత ఇచ్చారు. విచారణ అనంతరం అదేరోజు రాత్రి పోలీసులు అతడిని ప్రొద్దుటూరులోని ఇంటికి తీసుకెళ్లారు. ఆయన సోదరుడు వెంకటస్వామిని తాడిపత్రికి పంపించారు. ఈక్రమంలో ఇరువురికి నోటీసులు ఇచ్చారు. ఇదిలా ఉండగా దాదాపు రూ.7కోట్ల విలువైన ఆస్తి పత్రాలను పోలీసులు తన వద్ద నుంచి తీసుకెళ్లారంటూ శ్రీనివాసులు ఆరోపించారు. కాసేపటికి పోలీసుల తీరును తప్పుబడుతూ మాట్లాడారు. తన సోదరుడు వెంకటస్వామిని తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

సోదరుల అరెస్టుకు రంగం సిద్ధం

మరోవైపు ఈ కేసు వ్యవహారంలో సోదరులను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈక్రమంలో శ్రీనివాసులును ఆదివారం ప్రొద్దుటూరు పోలీసులు మరోసారి అదుపులోకి తీసుకున్నారు. అతడి సోదరుడు వెంకటస్వామి కోసం పోలీసులు తాడిపత్రికి వెళ్లినట్లు సమాచారం. బావ తనకంటి శ్రీనివాసులు చెబితేనే తన భర్త వెంకటస్వామి అప్పులు చేశారని ఆయన భార్య పద్మజ ఆదివారం ప్రొద్దుటూరు పోలీసుల దృష్టికి తెచ్చారు. తన భర్త వెంకటస్వామి, బావ కలిసి 20 ఏళ్లుగా వ్యాపారం చేశారని, ఇప్పుడు అప్పులతో సంబంధం లేదని బావ అంటున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని పద్మజ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పొలాల్లో విద్యుత్తు తీగల చోరీ

◆ నిందితులకు దేహశుద్ధి ◆ పోలీసులకు అప్పగింత

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటపొలాల్లో వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్తుతీగలను ఎత్తుకెళుతున్న ముగ్గురు నిందితులను రెడ్డిపల్లి, భద్రంపల్లి గ్రామాల రైతులు వెంటబడి పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన ఇది. వివరాలు.. అనంతపురానికి చెందిన ముగ్గురు నిందితులు ఆదివారం సాయంత్రం రెడ్డిపల్లి గ్రామ శివారుల్లోని పంటపొలాల్లో వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్తు కేబుల్ తీగలను కత్తిరిస్తుండగా స్థానిక రైతులు గుర్తించారు. వారిని పట్టుకోవడానికి వెంటపడగా, ఆ ముగ్గురు తీగలను తమవెంట తీసుకుని స్కూటీలో 544డి జాతీయ రహదారి మీదుగా అనంతపురం వైపు పారిపోయారు. రైతులూ తమ ద్విచక్రవాహనాల్లో వారిని వెంబడించి భద్రంపల్లి గ్రామ శివారులో అడ్డగించి చితకబాదారు. అనంతరం బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూటీలో పారిపోతున్న నిందితులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తి గ్రామీణం, తాడిపత్రి, న్యూస్‌టుడే: గుత్తి, తాడిపత్రిలో ఆదివారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన నాగరాజు, ఆయన భార్య భారతి, చెల్లెలు కాంత ఓబుళాపురం నుంచి గుత్తికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుత్తిలోని లచ్చానపల్లి రోడ్డు వద్దకు చేరుతుండగా బైబిల్ మిషన్‌శాల వద్ద వారి వాహనానికి కుక్క అడ్డుగా రావడంతో కిందపడటంతో గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు.

● తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి వెళ్లే మార్గంలో అశోక్ పిల్లర్ వైపు నుంచి చిన్నకంబయ్య అనే ఆటో చోదకుడు ఆసుపత్రికి వెళ్లేందుకు యూ టర్న్ చేస్తుండగా, బస్టాండు వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. చిన్నకంబయ్య కాలికి రక్త గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆరోహనరావు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి..

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నెలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇస్మాయిల్, శివ వర్గాల మధ్య కొన్నాళ్లుగా వ్యక్తిగత వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గొడవకు దిగడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చౌడమ్మ ఆలయంలో చోరీ

పామిడి, న్యూస్‌టుడే: మండలంలోని అనుంపల్లి గ్రామ రోడ్డు సమీపంలోని చౌడమ్మ ఆలయంలో ఆదివారం చోరీ చోటుచేసుకుంది. భక్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆలయం తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదుతో పాటు అమ్మవారు మెడలోని నాలుగు గ్రాముల బంగారం, తొమ్మిది తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

పాఠశాలకు గేటు బిగించరా?

పట్టణంలోని అంజుమాన్ రోడ్డులో ఉన్న సర్దార్ పటేల్ పురపాలక ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, గేటు లేకపోవడంతో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పగటిపూట బయటి వ్యక్తులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. నాడు-నేడు కింద గేటు పనులు పూర్తి చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వెంటనే ప్రహరీని నిర్మించి గేటు బిగించాలని ఉపాధ్యాయులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

పునాదికే పరిమితమైన గ్రంథాలయం

పురపాలిక గ్రంథాలయానికి సొంత భవనం కోసం మున్సిపల్ మాజీ అధ్యక్షుడు, దివంగత హనుమేశ్రావు పాతగుంతకల్లు మీదుగా వెళ్లే జాతీయ రహదారి పక్కన స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. భవన నిర్మాణానికి ఏడేళ్ల క్రితం రూ.10 లక్షలు నిధులు కేటాయించారు. అధికారులు పునాది మాత్రమే వేసి వదిలేయడంతో ముళ్లకంపలు పెరిగి పాడవుతోంది. ప్రస్తుతం గ్రంథాలయాన్ని పాఠశాలకు చెందిన చిన్న గదిలో నిర్వహిస్తున్నారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు

ప్రమాదకరంగా రహదారి

మండలంలోని జూటూరు నుంచి నరసాపురం వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనచోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఎవరికీ ప్రాణనష్టం వాటిల్లకముందే సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దపప్పూరు

సారూ.. మురుగు కనబడదా?

తాడిపత్రిలోని ప్రధాన రోడ్డు పక్కనున్న మార్గబిలాలు పొంగిపొర్లడంతో మురుగునీరు పరుగులు తీస్తోంది. దీనివల్ల వాహనచోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు నీటి నిల్వతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ తేజను న్యూస్‌టుడే వివరణ కోరగా స్పందించారు. భూగర్భ మురుగునీటి కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, అక్కడా మురుగు తీయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, తాడిపత్రి

కనిపించని వేగ నిరోధకాలు

మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారు 544డి జాతీయ రహదారి వంతెన కింద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనంతపురం-తాడిపత్రికి నిత్యం వందలాది వాహనాలు వేగంగా వెళుతుంటాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల వ్యవధిలో జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో 12 మంది గాయపడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారి నిర్వహణ అధికారులు ఇక్కడ ప్రమాద సూచికల బోర్డులు పెట్టడంతో పాటు వేగ నిరోధకాలు వేయాలని చేయాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

భక్తిశ్రద్ధలతో హోమాలు

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, పాలాభిషేకాలు నిర్వహించారు. యాగమండపంలో రాహు కేతు, సర్పదోష, కాలసర్పదోష, కుజదోష నివారణార్థం సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర బీజాక్షర హోమాన్ని చేశారు. ఈ హోమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జాఫర్ సేవలు స్ఫూర్తిదాయకం

జాఫర్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు

కమలానగర్: భారత కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ పేద ప్రజల అభ్యున్నతి కోసం పోరాడుతున్న సీపీఐ మైనార్టీ విభాగం ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, ఐఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ మైనార్టీ విభాగం ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు వైస్రాయ్‌లో ఆదివారం మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.

సంఘీభావం తెలుపుతున్న దళిత, గిరిజన, బీసీ సంఘాల నాయకులు

గిరిజనుల అభ్యున్నతికి పోరాటం

రుద్రంపేట, న్యూస్‌టుడే: గిరిజనుల సామాజిక అభివృద్ధి కోసం గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (జీపీఎస్ఎస్) పోరాటం చేస్తుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గర్మా మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. ఆదివారం పాతూరు గిరిజన భవన్‌లో ఆయన అధ్యక్షతన గిరిజన ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజన హక్కులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చినా సమాజంలో వెనకబడ్డామన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినా ఆ పట్టం పూర్తయిన వెంటనే హామీలు నీటి మీద రాతలుగా మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు కేశవనాయక్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చింతా చంద్రమోహన్, గిరిజన సంఘం నాయకుడు శ్రీనివాస్ నాయక్, జడ్పీటీసీ సభ్యుడు పాతే జయరాం నాయక్, నారాయణస్వామి నాయక్, ఎల్లన్న పాల్గొన్నారు.

వేలం వేస్తారు.. వదిలేస్తారు!

పట్టని కూరగాయల మార్కెట్ల నిర్వహణ

ఇరుకిరుకుగా.. కష్టంగా!



పాతూరు కూరగాయల మార్కెట్ ఇరుకిరుకుగా మారింది. స్వాతంత్ర్యం కంటే పూర్వం నుంచి మార్కెట్ కొనసాగుతున్నా కేవలం వేలం పాటతో సరిపెడుతున్నారు. వర్షం వస్తే చాలు అడుగు పెట్టలేని పరిస్థితి కొనసాగుతోంది. దుకాణాల నిర్వహణ విషయంలో క్రమపద్ధతి అన్నది లేకపోవడంతో అక్కడికి వెళ్లాలంటేనే జనం ఆలోచించాల్సి వస్తోంది. వాహనాలు అన్నీ రోడ్డు మీద నిలబెడుతుండటంతో మార్కెట్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పెద్ద దుకాణాలు నిర్మిస్తే వారికి 32 వరకు షాపులు ఉండగా మిగిలిన వారంతా నేలమీదనే వ్యాపారాలు, కూరగాయలు విక్రయిస్తుంటారు. రోజుకి 10వేల మంది వరకు మార్కెట్‌కు వస్తుంటారు.

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే : నగరంలోని పాతూరు, కొత్తూరు కూరగాయల మార్కెట్లను నగర పాలక సంస్థ గాలికి వదిలేసింది. ఏటా సుంకం వసూళ్లకు వేలం వేయడంతోనే తమ పని అయిపోయిందన్న ధోరణిలో ఉంటోంది. రూ.కోట్లలో ఆదాయం ఒనగూరే అవకాశం ఉన్నా రూ.లక్షలకే పరిమితం అవుతోంది. ఒకే పాటి సొమ్ము జమకాగానే పట్టించుకోవడం లేదు. అనంతపురం నగరంలోని పాతూరు, కొత్తూరు మార్కెట్ల స్థితి గతులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక పరిశీలన కథనం. ● పాతూరు మార్కెట్ బయట రోడ్డుకు నలుగు వైపులా రోడ్డు మీదే కూరగాయలు, ఆకు కూరలు విక్రయిస్తున్నారు. కొత్తూరు మార్కెట్లో దుకాణాలు ఉన్నా నిర్వహణ లేకపోవడంతో 10 మంది వరకు అక్కడే రోడ్డు మీదే పెడుతున్నారు. నీలం కాంప్లెక్స్, నడిమి వంక, రాంనగర్ ఉపరితల వంతెన కింద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద, సాయినగర్‌లో రోడ్డు మీద వ్యాపారాలు సాగిస్తున్నారు.

సంవత్సరం	వేలం (రూ.లక్షల్లో)
2022-23	75.60
2023-24	79.10
2024-25	90.40
2025-26	88.15

కొత్తూరు మార్కెట్లో ఖాళీగా దుకాణాలు

దుకాణాలు కట్టి వదిలేసి!

కొత్తూరులోని ప్రజలకు అందుబాటులో ఉండటానికి గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన కొత్తూరు మార్కెట్ సముదాయం చూస్తే భయపడే పరిస్థితి. షాపింగ్ కాంప్లెక్స్ కింది భాగాన 300 దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. దుకాణాలు కట్టి వదిలేయడంతో ముగ్గురు, నలుగురు మాత్రమే ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య : గడియార స్తంభం రైల్వే వంతెన కింద మట్టి తొలగించి కప్పగా పోయడంతో మళ్లీ రోడ్డు మీదకు వస్తోంది. -నరేష్‌కుమార్

సమాధానం : వెంటనే మట్టిని తరలిస్తాం.

సమస్య : గుత్తిరోడ్డు నుంచి ఎర్రనేల కొట్టాల్లోకి వెళ్లే మార్గంలో ప్రారంభంలోనే మట్టి రోడ్డు రాళ్లు తేలాయి. -ఎం.ఎల్.ఎన్.ప్రసాద్

సమాధానం : రోడ్డు మరమ్మతులు చేయిస్తాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఇంఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు.) -న్యూస్‌టుడే, అశోక్‌నగర్

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గంగ : **ప్రేమంటే**, గౌరి : **కాంత**, గాయత్రి : **శివ2023**, త్రివేణి : **కొదమసింహం**, సీలిమ : **అవారా**, తరంగిణి : **హ్యాపీ జర్నీ**, మిస్టీ **పోలీస్**, తేజస్విని : **పాంచ్ మినార్**, ఎస్వీ సినిమా : **రాజా వెడ్స్ రాంబాయి**, శాంతి : **12వ రైల్వేకాలనీ**, సుధా : **ది గర్ల్‌ఫ్రెండ్.**

నగరంలో ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయాల్లో నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం.

ఆకట్టుకున్న సంగీత విభావరి

సంగీతాలాపన చేస్తున్న గాయనీగాయకులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో ఓ వెలుగు వెలిగిన అందాల రాశి శ్రీదేవి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుని నేటికీ ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాపరిష త్‌లో 'అతిలోక సుందరి శ్రీదేవి మ్యూజికల్ నైట్' ఉల్లాసభరితంగా జరిగింది. డీఆర్వో మాలోల, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగరాజు తదితర ప్రత్యేకాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై సంగీతాలాపన చేశారు. అనంతరం ఆరభి యూత్, కల్చరల్ అసోసియేషన్ సహకారంతో 'ఆకాశంలో ఒక తార కళాబృందం' వారితో అతిలోక సుందరి సంగీత గాన కచేరీ జరిగింది.

శాంతి.. సేవకు ప్రతిరూపం సత్యసాయి

సత్యసాయికి నివాళి అర్పిస్తున్న జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మాలోల, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : సమాజ సేవ.. విశ్వశాంతికి ప్రతిరూపం శ్రీసత్యసాయి బాబా అని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో సత్యసాయి శత జయంతి ఉత్సవాన్ని జరిపారు. బాబా చిత్ర పటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఆ తర్వాత జ్యోతి వెలిగించి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. జేసీ మాట్లాడుతూ బాబా విద్య, వైద్యం, తాగునీరు.. వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన గొప్ప మానవతావాదిగా కీర్తించబడ్డారన్నారు. డీఆర్వో మాలోల మాట్లాడుతూ బాబా ప్రవచనాలు, ఆధ్యాత్మిక బోధనలు యావత్తు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం పొందాయని గుర్తు చేశారు. రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఏపీ వీరశైవ లింగాయత్ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ స్వప్న, వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక సంక్షేమ డైరెక్టర్ పరమేశ్వర్, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ రవికుమార్, మాల సంక్షేమ సహకార సంస్థ డైరెక్టర్ కమలమ్మ, తదితరులు మాట్లాడారు. ఆ తర్వాత సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు రామచంద్ర మూర్తి, కన్వీనర్ నరసింహప్ప, బాల వికాస్ సమన్వయకర్త గీతా సుకుమార్, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ గంగాధర్, తదితరుల సమక్షంలో బాబా భక్తి గీతాలను ఆలపించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఎన్‌సీసీ క్యాడెట్లు

దేశసమగ్రతను కాపాడటమే లక్ష్యం

ఎస్కేయూ: దేశసమగ్రతను పరిరక్షించడమే ఎన్‌సీసీ క్యాడెట్ల లక్ష్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ, అవినీతి నిరోధకశాఖ సీఐ జయమ్మ, డాక్టర్ నాగశశికళ, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు రంగనాథ్ అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవడం మొదటి లక్ష్యమన్నారు. అధికారులు చిన్న వెంకటమ్మ, రామాంజనేయులు, అహ్మద్, విష్ణుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌కు చెందిన రిలియబులిటీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్‌లో క్విజ్ నిర్వహించారు. ఆయా పోటీల్లో జేఎన్‌టీయూ ట్రిపుల్‌ఈ విభాగం సంజన ప్రథమ, అలేఖ్య ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థి నీలిమ 6వ బహుమతులు దక్కించుకున్నారు

స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

రుద్రంపేట: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ నాయకులు రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీవో హోమ్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీనగర్ కాలనీలో అంబేద్కర్ భవన్‌లో ఉన్న స్టడీ సర్కిల్ మళ్లీ ప్రారంభించాలన్నారు.

ఘనంగా నాగచైతన్య జన్మదినం

కమలానగర్, న్యూస్‌టుడే : హీరో అక్కినేని నాగచైతన్య 39వ జన్మదిన వేడుకలను అనంతపురంలో అక్కినేని అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం త్రివేణి థియేటర్ ఆవరణలో అభిమానులు గౌతమ్, రమేష్, అస్లామ్, రామాంజి, వెంకట్, అనిల్, సాయి, ఖాదర్, రాము కేకు కోసి సంబరాలు చేశారు. 200 మందికి దుప్పట్లు అందించారు.

ఒడిబియ్యం తీసుకెళ్తున్న మహిళలు

మహిళలకు ఒడిబియ్యం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : సత్యసాయి శత జయంతి పురస్కరించుకుని హెచ్ఎల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహలక్ష్మి ఆలయంలో ఆదివారం 150మంది మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈకార్యక్రమానికి కురుబ చంద్రశేఖర్‌బాబు, తోట కిషోర్‌బాబు, రామకృష్ణ చేయూతనందించారు. పలువురు ముత్తైదువుల కాళ్లకు పసుపు పారాణి పెట్టి ఒడిబియ్యం పోశారు. ఆలయ నిర్వాహకుడు విజయ కుమార్, కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇద్దరు విద్యార్థులపై దాడి చేసి దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన శివశంకర్ నాయక్, బాబు నాయక్ ఎస్వీయూలో ఎంఏ చదువుతున్నారు. వారు నగరంలోని ఓ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌కు అడ్మిషన్ కోసం వెళ్లారు. ఆ సమయంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నారాయణతోపాటు స్నేహితుడు జగదీష్ అక్కడ ఉన్నారు. విద్యార్థులు తాము విద్యార్థి సంఘం నాయకులుగా చెప్పడంతో మాటామాటా పెరిగింది. దీంతో జగదీష్ వారిపై దాడి చేస్తూ కులం పేరుతో దూషించారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దాడితోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బస్సు షెల్టర్ లేక పాట్లు

అనంతపురం నగరంలో కళ్యాణదుర్గం వైపు వెళ్లే జాతీయ రహదారి అత్యంత రద్దీ కూడలి. రాప్తాడు, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని మండలాల ప్రజలంతా అనేక పనుల నిమిత్తం అనంతపురానికి వస్తుంటారు. కళ్యాణదుర్గం బైపాస్‌లో బస్సు స్టాపింగ్ ఉంది. బస్సుల కోసం ప్రయాణికులంతా గంటల కొద్దీ నిరీక్షిస్తుంటారు. అక్కడ బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండలోనే రోడ్లపై నిలబడాల్సి వస్తోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, రాంనగర్(అనంతపురం)

లీకేజీని అరికట్టరూ!

నగరంలో నిత్యం ఎక్కడో ఒక తాగునీటి పైపులైన్లు లీకేజీ అవుతుంటాయి. కొత్త పైపులు ఏర్పాటు చేసినా తాగునీటి విభాగం అధికారులు లీకేజీని అరికట్టడంలో విఫలమవుతున్నారు. నీటి సరఫరా చేసే సమయంలో వాల్వ్‌ను కొన్ని ప్రాంతాలకు ఒత్తిడి ఎక్కువగా పెంచడం, మరికొన్ని ప్రాంతాలకు తక్కువగా వదలడంతో నీరు సరైన మోతాదులో రావడం లేదు. నగరంలోని కోవూరునగర్‌లో 9వ క్రాస్‌లో గత కొన్ని రోజులుగా తాగునీరు లీకేజీ అవుతోంది. ఇదే ప్రాంతాల్లో 8వ క్రాస్‌కు, 9వ క్రాస్‌కు మధ్యలో నీరు లీకేజీ అవుతోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, అశోక్‌నగర్

కాలువలో తాగునీటి పైప్‌లైన్

తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ మురుగు కాలువలో ఉండటంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి జాతీయరహదారి అటువైపు పంచాయతీ బోర్ ఉండటంతో సరఫరా చేసే పైప్‌లైన్‌ను డ్రైనేజీలో నుంచి తీసుకొచ్చారు. నీరు కలుషితమై అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, రాప్తాడు

పొలాల్లో విద్యుత్తు తీగల చోరీ

స్కూటీలో పారిపోతున్న నిందితులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటపొలాల్లో వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్తు తీగలను ఎత్తుకెళుతున్న ముగ్గురు నిందితులను రెడ్డిపల్లి, భద్రంపల్లి గ్రామాల రైతులు వెంటబడి పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన ఇది. వివరాలు.. అనంతపురానికి చెందిన ముగ్గురు నిందితులు ఆదివారం సాయంత్రం రెడ్డిపల్లి గ్రామ శివారుల్లోని పంటపొలాల్లో వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్తు తీగలను కత్తిరిస్తుండగా స్థానిక రైతులు గుర్తించారు. వారిని పట్టుకోవడానికి వెంటపడగా, ఆ ముగ్గురు తీగలను తమవెంట తీసుకుని స్కూటీలో 544డి జాతీయ రహదారి మీదుగా అనంతపురం వైపు పారిపోయారు. రైతులూ తమ ద్విచక్రవాహనాల్లో వారిని వెంబడించి భద్రంపల్లి గ్రామ శివారులో అడ్డగించి చితకబాదారు. అనంతరం బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏడు వేల మందికి నారాయణసేవ

పాతూరు కస్తూర్బా పాఠశాలలో అన్నప్రసాద వితరణలో సమితి సభ్యులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : సత్యసాయి శత జయంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్య జ్యోతి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో భారీస్థాయిలో 7వేల మందికి నారాయణ సేవ (అన్నదానం) నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, కన్వీనర్ నరసింహమప్ప ఆధ్వర్యంలో నగరంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అరవిందనగర్‌లోని భజన మందిరంలో తెల్లవారుజామున ఓంకార సుప్రభాతంతో మొదలు పెట్టి భారీస్థాయిలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం సుభాష్‌రోడ్డు లోని ఆఫీసర్స్ క్లబ్ ఎదురుగా 3500 మందికి, తపోనగర్ కూడలిలో 1500 మందికి, రుద్రంపేట బైపాస్ సమీపాన, పాతూరు కస్తూర్బా పాఠశాలలో వెయ్యిమంది చొప్పున నారాయణసేవ జరిపారు. సాయంత్రం భజనమందిరంలో వేదపఠనం, భజన సంకీర్తనలు, ప్రసాద వితరణ జరిపారు. సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనంత సంక్షేమం: పుస్తకం ఇష్టపడి చదవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పి వాటిని విశ్లేషించాలని సూచిస్తూ వారిలో జ్ఞాప శక్తిని పెంపొందించారు. ఇందులో భాగంగా సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి జిల్లాకు సత్యసాయి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

బాబా మార్గాన్ని అనుసరిద్దాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నేటి సమాజంలో సత్యసాయి బాబ సూచించిన మార్గాన్ని ప్రజలు అనుసరించాలని సత్యసాయి బోర్డు డీఈ రామారావు, ఏఈ రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. సత్యసాయి జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని సత్యసాయి నీటివిడుదల సంస్థలో పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నీటి విడుదల సంస్థ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఆత్మకూరులో కేకు కోసి శుభాకాంక్షలు తెలుపుతున్న సత్యసాయి కార్మికులు

నివాళి అర్పిస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

సేవలు అజరామరం

అనంత నగరపాలక : భగవాన్ సత్యసాయి బాబా సేవలు ఎంతో స్ఫూర్తి దాయకమని మేయర్ వసీం కొనియాడారు. ఆదివారం సత్యసాయి శతజయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతపురం జిల్లాలోనే కాకుండా దేశ విదేశాల్లో కూడా ఆయన సేవలు విస్తరించారన్నారు. తన బోధనలతో జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారన్నారు. విద్య, వైద్యం, తాగునీరు ఇలా పలు అంశాల్లో అనంతపురానికి సేవలు అందించారన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్ భూషణ్, ఇషాక్, రహంతుల్లా పాల్గొన్నారు.

బాలికల బృంద నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక సందడి ఆకట్టుకుంది. రెండు గంటల పాటు జరిగిన అనేక కార్యక్రమాలకు అడుగడుగునా కరతాళ ధ్వనులు మారుమోగాయి. అరవింద నృత్యకళా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, సినిమా పాటలకు డ్యాన్స్ ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. గాయని మాధురి మధురమైన పాటలు ఆలపించి మైమరిపించారు. ఎం.షణ్ముఖ, ప్రియ, అక్షర, భానుమతి, పార్థిత, నేహసరి, సాయివర్ష, పాలవి, హరిశ్యామా, శ్రీనిధి, దివ్య, లాస్యలు చక్కటి ప్రదర్శనలతో కనువిందు చేశారు. అన్నమయ్య సంకీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలను శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

ఉల్లాసభరితంగా పౌరాణిక నాటక ప్రదర్శన

పాన్పుసీనులో శ్రీకృష్ణ,అర్జున, దుర్యోధన వేషధారులు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : సత్యసాయి శతజయంతి సందర్భంగా నగరంలోని కృష్ణ కళామందిరంలో ఆదివారం రాత్రి నాగదుర్గ నాటక కళాసమితి వారి 'ఆణిముత్యాలు' పౌరాణిక నాటక ప్రదర్శన ఉల్లాస భరితంగా జరిగింది. దేవరకొండ రత్నమోహన్, జీజే ఎర్రిస్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణతులాభారం, పాన్పుసీను, భక్తచింతామణి, శ్రీరామాంజనేయ యుద్ధం, సత్య హరిచంద్ర (వారణాసి సీను) నాటకాల ప్రదర్శన జరిగింది. నిర్వాహకులు దేవరకొండ రత్నమోహన్ హరిశ్చంద్రగా, జీజే ఎర్రిస్వామి శ్రీకృష్ణుడిగా, భవానీదేవిగా రెండు పాత్రల్లో నటించారు. వనజ కుమారి సత్యభామగా, చింతామణిగా, చంద్రమతిగా మూడు పాత్రల్లో అభినందనలు అందుకున్నారు.

మేము జనాభా లెక్కల్లో లేమా?

ఆలమూరు లే అవుట్ కాలనీలో ఇళ్ల ముందు పిచ్చిమొక్కలు

రుద్రంపేట, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం (మండలం) ఆలమూరు పంచాయతీ పరిధి ఆలమూరు లేఅవుట్‌లో నివాసం ఉంటున్న ప్రజలు స్థానిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆలమూరు లే అవుట్‌లో ఆరు వేల ఇళ్లకు పైగా నిర్మాణ పనులు ప్రారంభించింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఇప్పటివరకు రెండు వందల కుటుంబాలు అక్కడ స్థానికంగా నివాసం ఉంటున్నారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఆలమూరు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఇది మా పరిధిలోకి ఇంకా రాలేదంటూ సమాధానం చెబుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న ప్రజలు జనాభా లెక్కల్లో లేనట్లుగా అధికారులు మాట్లాడుతున్నారన్నారు. నీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరుబావులు మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు సొంత నిధులు ఖర్చు చేసి సమస్యలు తీర్చుకుంటున్నామని స్థానికులు తెలిపారు.

సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేసుకొంటున్న స్థానికులు

సంతల ఆదాయం రూ.3.36 లక్షలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,36,300 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ. 2,06,200 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ. 1,30,100 రాబడి వచ్చింది. ఈ మొత్తాన్ని సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు.

పద్మశాలి సంక్షేమ సంఘం సేవలు స్ఫూర్తిదాయకం

ప్రగతి సంచికను ఆవిష్కరిస్తున్న బాలస్వామి, సంఘ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విద్య, వైద్య, సామాజిక రంగాల్లో ది తెనాలి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వారు మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.బాలస్వామి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సొసైటీ 30 వసంతాల ప్రగతి వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో తెనాలిలో విధులు నిర్వహించిన క్రమంలో ఇక్కడి సంస్థలు, వ్యక్తులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటు, అందించిన సేవలు, సాధించిన ప్రగతిని వివరించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం 30 వసంతాల ప్రగతి సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అక్కల శ్రీరామ్, రాచాబత్తుని బ్రహ్మం, నరేంద్రబాబు, పురుషోత్తం, జొన్నాదుల మహేష్, వెంకటేశ్వరరావు, ఓంకార్ ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

WANTED
ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థ
నందు పనిచేయుటకు MANAGERS
కావలెను. జీతం: 40,000- 75,000,
Any Degree, Min 2 Yrs
Experience. Age: 25-42 Yrs.
9182419225

(c) eenadu

సత్య సాయి సేవా మార్గం ఆదర్శనీయం

సత్యసాయిబాబా చిత్రపటం వద్ద కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: సత్య సాయిబాబా సేవా మార్గం ప్రపంచానికే ఆదర్శనీయమని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను రాయచోటిలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాబా చిత్రపటం వద్ద పూలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి చూపిన సేవ, ప్రేమ భావాన్ని ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా సేవ, మానవత, ప్రేమ వంటి భావాలను ప్రపంచానికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, ఎన్జీవోల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ● రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు సత్య సాయిబాబా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథం, ఆలయ ఈవో వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆటోలో విద్యార్థులు.. గాలిలో ప్రాణాలు

ఆటోలో వేలాడుతూ ప్రయాణిస్తున్న వీరంతా పాఠశాల విద్యార్థులు. ఖాజీపేటలో ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు రేపటి పౌరులకు నిత్యకృత్యంగా మారాయి. కొందరు డ్రైవర్లు చిన్నారులను అధిక సంఖ్యలో ప్రమాదకరంగా ఇలా తరలిస్తున్నారు. ఈ తీరుపై పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఖాజీపేట**

ఆంధ్రా భద్రాద్రిలో బెట్టింగ్ బంగార్రాజులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట, శివారు గ్రామాల్లో కొందరు బెట్టింగ్ బంగార్రాజులు పాగా వేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న కొందరు నిరుద్యోగ యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల బాట పట్టారు. లాభాలంటూ బంధువులు, మిత్రులు, పరిచయస్తులను వారిపై ఆశల వల విసురుతున్నారు. కావాలంటే తామే పెట్టుబడి సర్దుబాటు చేస్తామని.. బ్యాంకుల్లో అదనపు ఖాతాలు తెరవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఈ తీరుతో పలువురు ఇప్పుడు కలత చెందుతున్నారు.

ఆశల వల విసురుతున్నారు

సాలాబాదు పంచాయతీలోని ఓ పల్లెకు చెందిన యువకులు ఒంటిమిట్టకు మకాం మార్చారు. పందేలు, కమీషన్ రూపంలో రూ. లక్షలు ఆర్జించారు. ఒకనాడు అతి సాధారణ జీవితం గడిపిన వీరంతా.. ఇప్పుడు విలాసాలకు అలవాటు పడ్డారు. బెట్టింగ్‌లతో జీవితాలు బాగుపడతాయనేందుకు తామే నిదర్శనమంటూ కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బంధుమిత్రులను కూడా ఉచ్చులోకి దించుతున్నారు. మహిళా సంఘాల సభ్యులు, గృహిణులకూ ఎర వేస్తున్నారు. పోలీసులు స్పందించి అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

తిన్నోళ్లకే మళ్లీ పెద్దిపీట

ఇసుకలో చేతులు కలిపిన మేతలు

జేబులు నింపుకొంటున్న అక్రమార్కులు

ఈనాడు, కడప: సమృద్ధిగా కురిసిన వర్షాలతో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. దీంతో ఇసుక కొరత ఏర్పడి డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని రేవుల్లో ఇష్టారీతిన తవ్వకాలు సాగిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, తిరుపతి నగరాలకు నిత్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకుగాను గత ప్రభుత్వ హయాంలో మెక్కిందంతా 'పెద్ద' పాత్ర పోషించిన నేతతో అధికార పార్టీలో కొందరు చేతులు కలిపారు. కాసుల కక్కుర్తి ఇదే తీరు 'రామచంద్ర' అనేలా వ్యవహరిస్తున్నారు.

ముగిసినా.. అదే గలీజు

వాస్తవానికి రేవుల్లో ఇసుక తవ్వకాల లీజు గడువు గత నెలాఖరుతో ముగిసింది. దీంతో తవ్వకాలు ఆగిపోవడం యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుక తరలింపు పేరుతో ఈ నెలాఖరు వరకు అనుమతి తీసుకున్నారు. ఈ ముసుగులో రేవుల్లోనే తవ్వకాలు చేపట్టి నేరుగా తరలించుకుపోతున్నారు. పెనగలూరు మండలం కోమంతరాజుపురం, నారాయణనెల్లూరు రేవుల్లో యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. వైకాపా, తెదేపా నేతలు కొందరు కలిసి ఈ దందా సాగిస్తున్నారు. పరిమితికి మించి టిప్పర్లలో ఇసుక రవాణా చేస్తుండటం, ఆపై కురుస్తున్న వర్షంతో రహదారులు ఇప్పటికే ధ్వంసమైపోయాయి. పెనగలూరు నుంచి కడప- రేణిగుంట జాతీయ రహదారి వరకు, ఆపై జాతీయ రహదారి దెబ్బతింది.

అక్రమార్జన రోజుకు రూ. లక్షలు

నారాయణనెల్లూరు(పెనగలూరు మండలం), కోమంతరాజుపురం(పెనగలూరు మండలం) రేవుల్లో ఇష్టారీతిన తవ్వకాలు సాగుతున్నాయి. టిప్పర్లలో చెన్నై, బెంగళూరుకు తరలించి రూ.లక్షకు విక్రయిస్తున్నారు. తిరుపతికి అయితే రూ. 40 వేలు డిమాండ్ చేస్తున్నారు. నిత్యం 150 నుంచి 200 టిప్పర్లలో రోజుకు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై గనుల శాఖ ఏడీ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. రేవుల్లో లీజు గడువు గత నెలాఖరుతో ముగిసిందన్నారు. యార్డుల్లో ఉన్న ఇసుక కోసం ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. రేవుల్లో తవ్వకాలకు అనుమతి లేదని, తవ్వుతుంటే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక టిప్పర్ల రాకపోకలతో ధ్వంసమైన రహదారి

కలల గూడుకు పీఎంఏవై 2.0

జిల్లాలో 42 వేల దరఖాస్తులు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 పథకం కింద ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రాధాన్యతల వారీగా మంజూరు చేయాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశం. ఆ దిశగా అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ఇంటింటి సర్వే చేస్తున్నారు.

ఇప్పటికి 16,324 పూర్తి

గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల మంజూరుకు గత కొన్ని నెలలుగా లబ్ధిదారుల నుంచి 42 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిపై ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. మొదట సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటి వరకు 16,324 దరఖాస్తులను సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 25,565 మందికి సంబంధించినవి సర్వే చేయాల్సి ఉంది. మరోవైపు సచివాలయాల్లో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తవీ స్వీకరిస్తున్నారు.

కంభంవారిపల్లెలో సర్వే చేస్తున్న అధికారులు

ఇంటింటి సర్వేకు సహకరించాలి

కాలనీ ఇళ్ల నిర్మాణాలకు నిర్వహిస్తున్న సర్వేకు లబ్ధిదారులు సహకరించాలి. ఇళ్ల మంజూరులో మొదట సొంత స్థలం ఉన్న వారికి ప్రాధాన్యముంటుంది. లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. జియో ట్యాగింగ్ చేసిన చోటే ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.
- రమేష్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ పీడీ

సేవలు అందిస్తున్నారా గురూ!

కలికిరి, న్యూస్‌టుడే: బంకుల్లో పెట్రోల్ కొట్టించుకునే వారిలో చాలా మందికి అక్కడ నిర్వాహకులు కల్పించాల్సిన సౌకర్యాలపై అవగాహన ఉండదు. కొందరు కల్పించరు. మరికొందరు అడిగినా పట్టించుకోరు. ఈ విషయాలపై ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక.. ఏం చేయలేక చాలా మంది మదన పడుతుంటారు.

● బంకుల్లో ఎలక్ట్రానిక్ ఎయిర్ ఫిల్ యంత్రం ఉండాలి. ఉచితంగా వాహనాల్లో గాలి నింపాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ ఉద్యోగి ఉండాలి. ఇంధనం పోయించుకున్న వారికే ఉచితంగా గాలి పెడతారని చాలా మందిలో అపోహ ఉంది. ఏ వాహనానికైనా నింపాల్సిందే.

● వినియోగదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలి. చాలా చోట్ల ఉదయం ఒక డబ్బా ఉంచి అయిపోయాక మళ్లీ పెట్టకుండా వదిలేస్తున్నారు. పెట్రోల్ బంకు పనిచేస్తున్నంత సేపు తాగునీరు అందుబాటులో ఉంచాలి.

● అత్యవసర సమయం, లేదా ప్రమాదాలు సంభవించినప్పుడు బంధువులు, అవసరమైన వ్యక్తులకు ఫోన్ చేసుకునేందుకు బంకుల్లో ఫోన్ సదుపాయం ఉండాలి. ● వినియోగదారులు ఉచితంగా వినియోగించుకునేలా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. ● ప్రమాదాలు, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో బంకుల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి. ● ఇంధనం నింపే వేళ లేదా ఇతర సమయాల్లో మంటలు చెలరేగితే అదుపునకు అగ్నిమాపక పరికరాలు ఉండాలి. నిర్వాహకులు, ఏజెన్సీ వివరాలు, ఫోన్ నంబర్లు ప్రదర్శించాలి.

ఇలా తెలపొచ్చు

ఉమ్మడి జిల్లాలోని 70 శాతం పైగా బంకుల్లో నిబంధనల అమలు ఊసేలేదు. ఇబ్బందులను gvportal.gov.in అనే వెబ్‌సైట్‌లో లేదా మండల, జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి, సదరు ఏజెన్సీకైనా తెలపొచ్చు.

పరవశించి.. ఊళ్లు బోనమెత్తి

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు పుష్కలంగా చేరడంతో ఏడు గ్రామాల వాసులు పరవశించారు. గంగమ్మకు పూజలు చేసి ఆదివారం బోనాలు సమర్పించారు. మండలంలోని పర్తికోట పంచాయతీ దేవుల చెరువు నీటితో నిండి మొరవ పారింది. దీంతో పర్తికోట, ఆవులవారిపల్లి, చీటికివారిపల్లి, మామిడిగుండపులవారిపల్లి, దుగ్గసానివారిపల్లి, వసంతనాయునిపల్లి, కన్యమడుగువారిపల్లి గ్రామాల ప్రజలు ఆదివారం చెరువు కట్టపై వెలసిన గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఏడు గ్రామాలకు చెందిన మహిళలు బోనాలను భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు.

కిడ్నీ కంత్రీపై వేటు

జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ సస్పెన్షన్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె నేరవార్తలు: మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ తీవ్ర కలకలం సృష్టించింది. మూత్రపిండ మార్పిడి కేసులో జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ **కాంపా ఆంజనేయులు** అరెస్టయ్యారు. ఈ ఉదంతంపై స్పందించిన ప్రభుత్వం అతనిపై వేటేసింది. అతని కుమారుడు, కోడలి పైనా పోలీసులు కేసు నమోదు చేయించింది. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం తెలిపారు.

నోట్ల కట్టలతో నోరు నొక్కేసే యత్నాలు

గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ పేరుతో ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ కుటుంబ సభ్యులు ఈ ఏడాది జనవరిలో మదనపల్లెలో ఆసుపత్రి నెలకొల్పారు. ఇందులో ఆంజనేయులుతో పాటు అతని కుమారుడు అవినాష్, కోడలు శశ్వితి వైద్యులుగా పని చేస్తున్నారు. ఈ నెల 9న హారిక అనే మహిళ నుంచి మూత్రపిండాన్ని తీసి మరొకరికి మార్పిడి చేశారు. ఈ వ్యవహారంలో రూ. 25 లక్షల ఒప్పందం కుదిరినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం విశాఖపట్నంకు చెందిన యమునకు శస్త్ర చికిత్స చేసి మూత్రపిండం తీయగా.. తీవ్ర నొప్పి, బాధ, రక్తస్రావంతో ఐసీయూలోనే ఆమె మరణించింది. ఈ విషయం బయటికి పొక్కకుండా రూ. 6 లక్షలకు ప్రలోభ పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

పరారీలోనే కీలక నిందితుడు

యమున మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి కేసులో ఏ1గా ఉన్న ఆంజనేయులు, ఏ6 సూరిబాబు, ఏ7 సూరి తిరుపతికి పారిపోయారు. ఇదే కేసులో ఏ1 ఆంజనేయులుతో పాటు ఏ3 బాల రంగడు, ఏ4 షేక్ జుండమ్మన్ మెహరాజ్, ఏ5 పిల్లి పద్మ, ఏ6 కాకర సత్య, ఏ7 సూరిబాబు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసులో కీలక వ్యక్తి ఏ2గా ఉన్న పార్థసారథిరెడ్డి పరారీలో ఉన్నారు. ఇతన్ని పట్టుకునే పక్షంలో కేసులో మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆంజనేయులు వ్యవహారంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు పోలీసులు వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ వ్యవహారంలో ప్రాథమిక విచారణలో వాస్తవాలు వెలుగుచూడటం, ఆపై అధికారి 48 గంటలకు పైగా రిమాండ్‌లో ఉండటంతో సర్వీసు రూల్స్ ప్రకారం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ దందాపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం జిల్లాలో సంచలనం కలిగించింది. ఆసుపత్రి నెలకొల్పిన దగ్గర నుంచి అక్రమంగా మూత్రపిండ మార్పిడి పలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. యమున మృతితో వ్యవహారమంతా బట్టబయలైంది.

చలి గుప్పిట ఆంధ్రా ఊటీ

ఆంధ్రా ఊటీగా పేరొందిన బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌ను చలి వణికిస్తోంది. సముద్ర మట్టానికి 4,312 అడుగుల ఎత్తులో ఉన్న ఈ పర్యాటక కేంద్రంపై కనిష్ఠ ఉష్ణోగ్రత 18 డిగ్రీల లోపుగా నమోదవుతోంది. దీంతో సందర్శకులు సాయంత్రమైతే అతిథి గృహాలకే పరిమితమవుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు ఎడతెరిపి లేకుండా మంచు కురిసింది. సాయంత్రానికి చలి తీవ్రత అధికం కావడంతో పర్యాటకులు తిరుగు ప్రయాణమయ్యారు. **- న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

నిలకడగా టమాట ధర

మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డులో టమాట ధర ఆదివారం కిలో అత్యల్పంగా రూ.33 నుంచి నాణ్యమైన కాయలు అత్యధికంగా రూ. 63 వరకు పలికాయి. దిగుబడులు తగ్గటంతో డిమాండ్ పెరిగినట్లు అధికారులు తెలిపారు. గత వారం రోజుల వరకు కిలో రూ. 28 నుంచి అత్యధికంగా రూ. 50 వరకు మాత్రమే ధరలు లభించాయి. మూడు రోజులుగా పుంజుకుని కిలో రూ. 63తో నిలకడగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు 120 టన్నుల నుంచి 140 టన్నుల వరకు రైతులు సరకు తెస్తున్నారు. ఏగ్రేడ్ టమాట కిలో రూ. 33 నుంచి రూ. 63 వరకు, బి గ్రేడ్ రూ. 33 నుంచి రూ. 50 పలికాయి. సగటున కిలో రూ. 48 నుంచి రూ. 60తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ యార్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి జగదీష్ తెలిపారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

స్వచ్ఛం.. సుందరం.. పురస్కారం!

రామారావు పాఠశాలలో రంగులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం

సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రహరీపై చిత్రాలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహించి ఏటా ర్యాంకులు అందిస్తోంది. ఈ సారి మదనపల్లె పురపాలక సంఘానికి మంచి ర్యాంకు సాధించాలన్న ధ్యేయంతో అధికారులు ప్రణాళికతో సాగుతున్నారు. చెత్త రహిత పట్టణంగా చేయడానికి కొన్ని పద్ధతులు అనుసరిస్తున్నారు. గతంలోని తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వంద శాతం పారిశుద్ధ్యమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి

మదనపల్లెను చెత్త రహిత పట్టణంగా చేయాలన్న లక్ష్యంతో సేకరణలో అనేక పద్ధతులు చేపడుతున్నారు. 300-350 వరకు ఇళ్లను 135 మైక్రో ప్యాకెట్లుగా విభజించారు. ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్ట్ యార్డుకు తరలిస్తున్నారు. తడి చెత్త నుంచి ఎరువును తయారు చేస్తున్నారు. బహిరంగ మల విసర్జన రహిత పట్టణంగా చేయడానికి తాజాగా ఆరు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కిచెన్ గార్డెన్స్ నిర్వహణ, లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

పట్టణ సుందరీకరణకు కృషి

చెత్త నిర్వహణతో పాటు పట్టణ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రధాన కూడళ్లలో చిత్రాలు గీయించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, అంబేడ్కర్ కూడలి, పురపాలక సంఘ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ విషయమై కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సమష్టి సహకారంతో ఈ సారి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

ఆ ఊళ్లు.. దేశ రక్షణకు కోటలు

ఆదర్శం

ఎగువరామాపురం గ్రామ ముఖచిత్రం

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు మండలంలోని ఎగువరామాపురం, ఎగువ తంబళ్లపల్లె గ్రామాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ రెండూ దేశ రక్షణకు పెట్టని కోటలుగా ఉంటున్నాయి. ఆయా ఊళ్లకు చెందిన 350 మందికి పైగా సైన్యంలో చేరి సేవలందిస్తుండటం ఇందుకు కారణం. ఇరవై అయిదేళ్ల క్రితం ఇక్కడ పంటలు పండక గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. ఆ సమయంలో రెండు గ్రామాల్లో ఒక్కో ఇంట్లో ఒకరిద్దరు చొప్పున సైన్యంలో చేరేందుకు కఠోరంగా శ్రమించి ఫలితం సాధించారు. నాటి నుంచి నేటి వరకు ఇదో ఆనవాయితీగా వస్తోంది. వందల సంఖ్యలో గ్రామస్థులు సైనికులుగా ఎంపికై సేవలందిస్తున్నారు. ఎగువరామాపురానికి చెందిన సుబేదారు షేక్ దస్తగిరి, బ్లాక్ కమెండో బండి ప్రతాపరెడ్డి 2008లో ముంబాయిలో చేపట్టిన ఉగ్రవాదుల ఏరివేతలో పాల్గొని పలువురిని రక్షించి గుర్తింపు పొందారు. మరికొందరు కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. దేశ రక్షణకు తమవంతు సేవలు అందించడం ఆనందంగా ఉంటుందని సైనికోద్యోగులు చెబుతుంటారు.

బాలల భవితకు భరోసా

చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

సద్వినియోగంతో ఎంతో మేలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అడుగు తీసి అడుగు వేయలేరు. సరిగా మాట్లాడలేరు. కనీసం తమ పనులు తాము చేసుకోలేరు. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన వారి దయనీయ పరిస్థితి ఇది. అటువంటి చిన్నారులకు విద్యతో పాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సాధారణ స్థితికి తెచ్చేలా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో భవిత కేంద్రాల ద్వారా అనేక రకాల సేవలు అందిస్తుండగా. . కొందరు అందిపుచ్చుకోలేకపోతున్నారు.

రవాణా ఖర్చుల చెల్లింపు

భవిత కేంద్రాల్లో ఒక్కో చోట ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఒక ఫిజియోథెరపిస్టు, ఒక స్పీచ్ థెరపిస్టు, ఒక ఆయా సేవలందిస్తారు. కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ. 800, బాలురకు రూ. 600 రవాణా ఖర్చుల కింద బాలల తల్లి బ్యాంకు ఖాతాలో నెలవారీ ప్రభుత్వం జమ చేస్తుంది. ● ఉమ్మడి జిల్లాలో 17 భవిత కేంద్రాలున్నాయి. అందులో 860 మంది చిన్నారులుండగా 9,642 మంది ప్రత్యేక అవసరాలు పిల్లలు సేవలు పొందుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. కొందరికి అవగాహన లేకపోతోంది. దీంతో సేవలు అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఇక్కడికి తీసుకొచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.
- జి.జనార్దన్, ఐఈఆర్‌పీ, రాయచోటి

సాగులో ఆమెకు ఆసరా

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులను పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం భాగస్వాములను చేస్తూ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. దీంతోపాటు వ్యవసాయ రంగంలోనూ భాగస్వాములను చేసేలా దృష్టి సారించింది. పండించిన పంటను ఇంటి అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు, మిగిలిన ఉత్పత్తులను విక్రయించుకోవడం ద్వారా ఆదాయం పొందేందుకు ఆర్థికంగా చేయూతనిస్తోంది. రైతు సాధికారిత సంస్థ, సెర్ప్ సహకారంతో ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం

12 మండలాల్లో పంటలు

జిల్లాలోని 12 మండలాల్లో మహిళా రైతు సంఘ సభ్యుల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకుగాను తంబళ్లపల్లె, రైల్వే కోడూరు, చిన్నమండెం, వాల్మీకిపురం మండలాల్లో పోషక విలువలతో కూడిన పంటలు సాగు చేయిస్తున్నారు. ఇందుకుగాను ఆయా మండలాల్లో సుమారు 500 మహిళా రైతు సంఘాలను ఎంపిక చేశారు. వీటిల్లో సుమారు అయిదు వేల మంది మహిళా రైతులున్నారు. ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండెం, పెద్ద తిప్పసముద్రం కురబలకోట, రామాపురం, రామసముద్రం మండలాల్లో త్వరలో ప్రారంభించనున్నారు.

రూ. కోటి అరవై లక్షలు మంజూరు

జిల్లాలో ఎంపిక చేసిన మండలాలకు రూ. కోటి అరవై లక్షల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో మహిళ సంఘానికి పెట్టుబడికిగా రూ. 1.50 లక్షలు రుణంగా ఇస్తారు. ఇంటి ఆవరణంలో పెరటి తోటలు, కొద్దిపాటి విస్తీర్ణంలో కూరగాయల సాగు వీటితో చేపట్టవచ్చు.

ఇటు ఆరోగ్యం.. అటు ఆదాయం

మహిళలకు పోషక విలువలున్న ఆహారాన్ని అందివ్వడమే ఈ కార్యక్రమ లక్ష్యం. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం వల్ల మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రభుత్వం పెట్టుబడికి అవసరమైన నిధులను మంజూరు చేసింది. ప్రకృతి వ్యవసాయంలో మహిళా రైతులను భాగస్వాములుగా చేసి, ఆర్థిక చేయూత అందిస్తాం.
- నాగేశ్వరరావు వెలుగు పీడీ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ప్రకటనల కొరకు సంప్రదించండి : కడప : 99899 97626 మదనపల్లి : 80080 01768

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, ఆలంఖాన్‌పల్లి,
కడప-516 003.
వివరాలకు: 9154991003, 8008551774
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
TV Partner ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు
Digital Partner ఈనాడు.నెట్ ETV BHARAT
EENADU SPORTS LEAGUE 2025

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

వీరభద్రుని సేవలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

హరిజవహర్‌లాల్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రాంగణంలోని ఉప ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని వీరభద్ర స్వామి, భద్రకాళీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఆయనకు వివరించారు. దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథం, ఈవో వెంకట రమణారెడ్డి ఆయనను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.

శ్రీశైలం ఆలయాభివృద్ధికి తితిదే నిధులు

శ్రీశైలం బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడిని కలిసిన నాగిరెడ్డిపల్లి సర్పంచి, కూటమి నాయకులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీశైలం ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడిని నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి సర్పంచి జంబు సూర్యనారాయణ, కూటమి నేతలు ఆదివారం డీబీఎన్‌పల్లిలో కలిశారు. శ్రీశైలం ఆలయ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రెండు నెలల కాలంలోనే ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలకు తితిదే నుంచి రూ.25 కోట్లు నిధులు తీసుకు రావడం హర్షించతగ్గ విషయమన్నారు. రాజంపేట ప్రాంతానికి శ్రీశైలం ఆలయ ఛైర్మన్ పదవి రావడం ఇదే మొదటిసారని చెప్పారు.

డయల్ యువర్ సీఎండీ నేడు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారులు విద్యుత్తుపరమైన సమస్యల పరిష్కారానికి తన పరిధిలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్తు సరఫరా సంస్థ సీఎండీ శివ శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 వరకు సెల్ నెంబరు 89777 16661కు ఫోన్ చేసి తెలియచేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోని కార్యాలయాలలో కూడా ప్రజలు అర్జీలు సమర్పించవచ్చన్నారు. ఆ అర్జీలను కూడా పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. గతంలో ఇచ్చిన అర్జీల స్థితిని తెలుసుకొనేందుకు 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీదారులు మాత్రమే జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు తీసుకురావాలని ఆయన తెలియజేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల వితరణ

ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాతలు

సంబేపల్లె, న్యూస్‌టుడే : సంబేపల్లె మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో కొలువైన శ్రీకొత్తపురమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు రూ. 5 లక్షల చెక్కును ఆదివారం వితరణ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాయచోటి సంజీవ నగర్ కాలనీకి చెందిన విశ్రాంత సెరికల్చర్ అధికారి అంకం జయచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఆలయ ప్రహరీ నిర్మాణం, పార్కింగ్ బండలు వేయుటకు ఈ చెక్కును ఆలయ కమిటీకి అందించారన్నారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మాజీ సీఎం జగన్ పర్యటన

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన ఖరారైంది. ఈ నెల 25న బెంగళూరులోని తన నివాసం నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి పులివెందులలోని బాకరాపురం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు తన క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ తనను కలిసేందుకు వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలను వింటారు. రాత్రికి తన నివాసంలో బస చేసి 26న ఉదయం 10 గంటలకు బ్రాహ్మణపల్లె సమీపంలోని అరటి తోటలను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడతారు. అదే రోజు మధ్యాహ్నం వేముల మండలం వేల్పుల గ్రామ ప్రజలతో మమేకమవుతారు. సాయంత్రం పులివెందులలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి తన నివాసంలో బస చేసి 27న ఉదయం బయలుదేరి బెంగుళూరుకు వెళ్తారని వైకాపా పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సవాళ్లు.. ప్రతిసవాళ్లు

● పీపీపీ విధానంపై వైకాపా, తెదేపా మధ్య ఘర్షణ

పరస్పర దాడులు చేసుకుంటున్న తెదేపా, వైకాపా నాయకులు, కార్యకర్తలు

మదనపల్లె పట్టణం, మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లె వైద్య కళాశాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైద్య కళాశాల విషయంలో తలెత్తిన వివాదం చివరకు తెదేపా, వైకాపా నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణకు దారితీసింది. వారం రోజులు క్రితం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో చేపట్టడం మంచి నిర్ణయమని గత వైకాపా ప్రభుత్వంలో కళాశాల నిర్మాణానికి రూ.26 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న పెద్దిరెడ్డి కనీసం రూ.3 కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీతో పాటు మరికొందరు నాయకులు శనివారం మదనపల్లెలోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. శ్రీరామ్‌చినబాబు పార్టీలు మారుతూ నేడు తెదేపాలోకి వచ్చాడని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేస్తే అతన్ని ఎక్కడా తిరగనివ్వమని హెచ్చరించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేసిన చినబాబు మెడికల్ కళాశాల వద్దకు వచ్చి తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి, పెద్దిరెడ్డి కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరు పార్టీ నాయకులు మధ్య వివాదం తారస్థాయికి చేరింది. పెద్దిరెడ్డి త్రయం మెడికల్ కళాశాల వద్దకు వస్తే తాను క్షమాపణ చెబుతానని, ఎంపీటీసీ స్థాయి నాయకులు, కార్యకర్తలకు క్షమాపణ చెప్పనని చినబాబు చెప్పారు. దీంతో ఆదివారం తంబళ్లపల్లెకు చెందిన ఎంపీటీసీతో పాటు మరికొందరు వైకాపాకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైద్య కళాశాలకు చేరుకుని చినబాబు ఇక్కడికి వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రీరామ్ చినబాబు వర్గీయులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల సమక్షంలోనే ఇరుపార్టీలకు చెందిన వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇరువురిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని వినతి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించు కోకపోవడం దారుణమని ఏఐఎస్‌టీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని హార్సిలీహిల్స్‌లో ఉపాధ్యాయుల సమస్యపై ఎస్టీయూ ఆధ్వర్యంలో విద్యా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఆయన హాజరై మాట్లాడారు. 12వ వేతన సవరణ అమలు ఆలస్యమవుతున్న పీఆర్‌సీ కమిటీ ఛైర్మన్‌ను నియమించాలని, ఐఆర్‌పై దృష్టిని కేంద్రీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని కోరారు. జేఎఫ్‌ఎంఈ మద్దతుతో డిసెంబరు 9వ తేదీన జరగనున్న 'చలోజంతర్ మంతర్' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, ఉపాధ్యక్షుడు కడియాల మురళి తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీరాణి, అధికారులు

కలికిరి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు అండర్-14 బాలబాలికలకు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఝాన్సీరాణి తెలిపారు. ఆదివారం హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించే మైదానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ పోటీల్లో 500 మంది క్రీడాకారులు, కోచ్, మేనేజర్లు దాదాపు 600 మంది పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నటరాజన్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆశయాలు నెరవేరుస్తాం

మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేశ్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్‌మహేశ్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి తాను తమ నాయకుడు పవన్‌కల్యాణ్ వెంటే నడుస్తున్నానని భవిష్యత్తులో కూడా ఆయన వెంటే ఉంటానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఏపీ పారిశ్రామికాభివృద్ధి సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా పదవిని ఇచ్చారన్నారు. ఈ నెల 26వ తేదీ మంగళగిరిలో ప్రమాణస్వీకారోత్సవం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జనసేనపార్టీ నాయకులు ఎస్.రఘునాథ్, హరి, అఫ్సర్ మనోజ్, జయభవ్య పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో తరగతి గదుల నిర్మాణం

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె మండలం ముష్టూరు వద్ద ఉన్న కేజీబీవీలో రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ నిధులతో మూడు తరగతి గదులు, డార్మెంటరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతారు. ఐదు నుంచి పది వరకు నడుస్తున్న కేజీబీవీలో మూడేళ్ల ముందు పాఠశాల స్థాయి పెంచుతూ ఇంటర్మీడియట్ తరగతులను ప్రభుత్వం ప్రారంభించింది. తరగతి గదుల కొరత ఏర్పడడంతో ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద నిధులు మంజూరు చేసింది. తరగతి గదులు మరుగుదొడ్లు పూర్తయితే విద్యార్థినులకు తరగతి గదుల కొరత తీరనుంది.

కస్తూర్బాలో నిర్మిస్తున్న తరగతి గదులు

రైలు నుంచి కిందపడి మృతి

పెద్దమండ్యం: మండలంలోని లింగంవారిపల్లెకు చెందిన మతి స్థిమితం లేని ఓ యువకుడు మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వారి కథనం మేరకు.. లింగంవారిపల్లెకు చెందిన రామచంద్ర నాయుడు (33) అనే యువకుడు మతి స్థిమితం లేక కడప, రాయచోటి, తిరుపతి, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో తిరుగుతుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెలలో ఇంటి నుంచి వెళ్లిపోయిన అతను తమిళనాడులోని తిరువూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి మృతి చెందారని రైల్వే పోలీసులు తమకు సమాచారం అందించారన్నారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డుతో పాటు ఫోన్ బుక్‌లోని ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి, సమాచారం తెలపడంతో ఆదివారం మధ్యాహ్నం తమ కుటుంబీకులు తమిళనాడుకు వెళ్లినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

శేషు

మదనపల్లె నేరవార్తలు: ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఒకరు మృతి చెందారని వైద్యులు తెలిపారు. ఆయన ఈ నెల 17న ఆర్టీసీ బస్టాండులో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. ఆయన పేరు శేషు అని, తనది హిందూపురం అని మాత్రమే చెప్పారని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. మృతుడికి బంధువులు ఎవరైనా ఉంటే ఆసుపత్రికి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ సామాజిక సేవలు

మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, పక్కన సంఘం ప్రతినిధులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. రాజంపేట మండలం కూచివారిపల్లి గ్రామం వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో 67వ రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఉన్న 100 ఐఎంఏ శాఖల ద్వారా మెరుగైన సేవలందిస్తామని చెప్పారు. నిరంతర వైద్య, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి వైద్యం అందించడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నందకిషోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఆర్థిక కార్యదర్శి తుమ్మల కార్తిక్, ఉపాధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ ప్రసాద్, మధుసూదన్‌శర్మ, సుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శులు శివకుమార్, మణిబాబు, అనిల్‌కుమార్ ప్రసాద్, వైద్యులు సుధాకర్, శ్రీహరి, విజయకుమార్, సునీల్, రాజంపేట అధ్యక్షుడు చలమయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో నాసిరకం మాంసం పట్టివేత

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలోని మాంసం దుకాణాలపై ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు దాడులు నిర్వహించారు. అనారోగ్యంతో చనిపోయిన గొర్రెల మాంసం విక్రయించేందుకు సిద్ధంగా ఉంచగా గుర్తించి పెట్రోలు పోసి సిబ్బంది సాయంతో కాల్పించేశారు. మృతి చెందిన పశువుల మాంసాని శీతల పెట్టెల్లో నిల్వ ఉంచి వినియోగదారులకు విక్రయిస్తున్నారని పలువురు గ్రామ పంచాయతీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పంచాయతీ ఈవో నాగభూషణ్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

PLOT FOR SALE

తిరుపతి -A రంగంపేట మోహన్‌బాబు స్కూల్ వెనుక 30x44 అం|| ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ ప్లాట్స్ అమ్మబడును. ✆ 73828 81119, 90147 27359.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెల్లూరు.. చేరాలంటే తెల్లారు!

గోతులే.. నూతుల్లా మారి ఇక్కట్లు

రాజంపేట- నెల్లూరు ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట - నెల్లూరు ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. భారీ వర్షాల కారణంగా నీరంతా రహదారిపై చేరి చెరువులను తలపిస్తోంది. గత ప్రభుత్వం రేవుల నుంచి భారీ టిప్పర్లలో ఇసుకను తరలించడంతో అప్పట్లో రహదారులు దెబ్బతిన్నాయి. ఈ రహదారి బాగుకు నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో సామాన్యులు ప్రమాదాలకు గురవుతున్నారు. ● పెనగలూరు మండలం బెస్తపల్లి వద్ద రోడ్డుపై పెద్ద గుంత పడింది. అందులో వర్షం నీరు నిల్వ ఉండడంతో గొయ్యి కనిపించక వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంత దాదాపు నాలుగు అడుగుల మేర విస్తరించింది. కనీసం హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. రెండు వరుసల రహదారి అయినప్పటికీ ఒక వైపు రోడ్డు దెబ్బతింది. ● రాజంపేట మండలం కొత్తపల్లి, పోలి గ్రామాల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వం దీని గురించి పట్టించుకోకపోవడంతో వాహనదారులు ముప్పుతిప్పలు ఎదుర్కొన్నారు. పోలి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన రక్షణ కంచె కూడా దెబ్బతింది. ఇక్కడ గతంలో అనేక వాహనాలు వేగాన్ని అదుపు చేయలేక చెరువులోకి దూసుకుపోయాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

వివరాలు వెల్లడిస్తున్న పీడీ రాజ్యలక్ష్మి, జీఎం శ్రీనివాసులు

కడప గ్రామీణ: నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వివిధ సంస్థల్లో కల్పించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్‌లో డీఆర్‌డీఏ-సిడాప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్-సోలార్ పవర్ ప్రాజెక్టులో పలు రకాల ఉద్యోగాల కోసం ఉద్యోగ మేళా నిర్వహించారన్నారు. 233 మంది నిరుద్యోగులు హాజరు కాగా అందులో 119 మంది ముఖాముఖిలో ఎంపికయ్యారు. వీరికి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది ఎంపికలు హైదరాబాద్ నుంచి నిర్వహిస్తారని సోలార్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టు జీఎం శ్రీనివాసులు, డిప్యూటీ హెచ్ఆర్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, డీఆర్‌డీఏ-సిడాప్ జిల్లా ఉద్యోగ మేళా మేనేజర్ రంగస్వామి, సోలార్ సంస్థ ప్రతినిధులు, సిడాప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడి వీరంగం

నేతాజీ కూడలిలో కానిస్టేబుల్‌ను భయపెడుతున్న యువకుడు

నేతాజీకూడలి (రాయచోటి), న్యూస్‌టుడే: రాయచోటిలో అల్లరి మూకలు పేట్రేగిపోతున్నారు. పట్టణంలోని నేతాజీ ప్రధాన కూడలిలోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు రోడ్డుపైనే బీరు సీసా పగలగొట్టాడు. [illegible] ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలబడి డ్రైవర్‌పై దాడికి దిగాడు. రోడ్డుపై వీరంగం సృష్టిస్తున్న యువకుడిని పట్టుకునేందుకు యత్నించిన పోలీసు [illegible] స్థానికుల సాయంతో [illegible] పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

మాట్లాడుతున్న మిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ చేతుల మీదుగా ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోని యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, కర్తవ్యభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఎన్‌సీసీలో చేరి దేశసేవలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ నవీన్‌కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పద్మావతినగర్‌లోని పంచాయతీ స్థలంలో ఆదివారం చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆర్‌ఐ మురగయ్య మాట్లాడుతూ... గతంలో పలు మార్లు ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నించారని అన్నారు. ఈ స్థలంలో గతంలో పంచాయతీ సామూహిక మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచిందని, అప్పటి అప్పటి పంచాయతీ పాలక వర్గం తీర్మానించినట్లు రికార్డుల ద్వారా గుర్తించామన్నారు. ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆర్‌ఐ స్పష్టం చేశారు.

సప్త కన్యకల ఆలయంలో ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక దేవతా నగర్‌లోని సప్తకన్యకల ఆలయంలో అమ్మ వారికి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మాకం శ్రీరాములు ఆధ్వర్యంలో వేద పండితులు నరసింహారావు, చైతన్యస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బిల్వార్చనకు పెద్దేత్తున మహిళలు తరలి రావడంతో ఆలయ ఆవరణం రద్దీగా తయారైంది. ఈ క్రమంలో అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న మహిళలు

అడ్డుకునేదెవరు..
ఆక్రమించి అద్దెకిచ్చేద్దాం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల నుంచి గ్రామీణ రోడ్ల వరకు విలువైన భూములను కొందరు ఆక్రమించి భవనాలు నిర్మించి అద్దెలకు ఇస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. రహదారిని ఆక్రమించి షాపులు నిర్మించడంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్లపై వాహనాలు నడపాలంటే డ్రైవర్లకు భయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కనీసం మూడు అడుగుల వెడల్పు స్థలం కూడా వదలకుండా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారు. జీవనోపాధి సరే... ప్రమాదాలు సంభవిస్తే ప్రాణాల పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. డివిజన్ కేంద్రమైన మదనపల్లెతో పాటు ప్రధాన పట్టణాల్లో పరిస్థితి కూడా ఇలానే ఉంది.

✶ పుంగనూరు రహదారిపై కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పురపాలక సంఘం బోర్డు నుంచి శ్రీకృష్ణదేవరాయల కూడలి వరకు కొందరు రహదారికి సంబంధించిన స్థలంలో తాత్కాలిక రేకుల దుకాణాలు ఏర్పాటు చేశారు. అక్కడికి మరమ్మతుల కోసం వచ్చిన వాహనదారులు రోడ్లపై అడ్డదిడ్డంగా నిలిపేయడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. బసినికొండ పంచాయతీ సచివాలయం ఎదుట రోడ్డు భవనాల శాఖకు సంబంధించిన స్థలాల్లో అక్రమంగా దుకాణాలను ఏర్పాటుచేసి అద్దెకు ఇస్తుండటం గమనార్హం. డ్రైవర్స్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిని మార్పుచేశారు. ఇక్కడ రహదారుల శాఖకు సంబంధించిన ఇరువైపుల 10 అడుగుల స్థలం ఉండగా కనీసం మూడు అడుగులు కూడా లేకుండా ఆక్రమించేశారు.

✶ తిరుపతి మార్గంలోని దేవతానగర్, తట్టివారిపల్లె, సీటీఎం గ్రామాల్లో రహదార్లల్లో ఇదే తరహాలో ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలున్నాయి. దీనిపై రోడ్డు భవనాల శాఖ ఏఈ బూరయ్యను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో తనిఖీచేస్తామన్నారు. ఆక్రమణలు జరిగినట్లు తేలితే రెవెన్యూ, పంచాయతీ అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు.

✶ మదనపల్లె- బెంగళూరు మార్గంలో రోడ్లకు పక్కనే విలువైన భూములున్నాయి. రహదారికి కనీసం మూడు అడుగుల స్థలం కూడా వదలకుండా అక్కడక్కడ దుకాణాలతోపాటు, హోటళ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆ దుకాణాలకు వచ్చే వారు రహదార్లపైనే వాహనాలను నిపేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అనిబిసెంట్ కూడలి నుంచి చిప్పిలి గ్రామం వరకు అక్కడక్కడ రహదారికి సంబంధించిన స్థలాలపై నిర్మాణాలు, తాత్కాలిక షెడ్లను ఏర్పాటుచేసి వ్యాపారాలు చేస్తున్నారు.

నిధులు లేక... అసంపూర్తిగా..

గుండ్లూరు(కలికిరి), న్యూస్‌టుడే: కలికిరి మండలం గుండ్లూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు మంజూరైన అదనపు తరగతి గదులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అప్పటి తెదేపా హయాంలో 2018లో నాబార్డు పథకం కింద రూ.20 లక్షల అంచనాతో అదనపు తరగతి గదులు మంజూరు చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నాడు నేడు అని చెపుతూనే పనులకు నిధులు నిలిపేసింది. దీంతో చేసిన పనులకు గాను బిల్లులు రాకపోవడంతో గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారు. దీంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగ మారాయి. ఈ పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేసిన సమయంలో ప్రాథమికోన్నత పాఠశాలగా సాగేది. అనంతరం ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టడంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులు 3 కి.మీ దూరంలో ఉన్న మహల్ తెలుగు, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో చేరిపోయారు. దీంతో ఈ పాఠశాల ప్రాథమిక స్థాయిలోనే సాగుతుండటంతో.. తలుపులు, కిటికీలు లేని అదనపు తరగతి గదులు ఆకతాయిలకు నిలయాలుగా మారాయని పలువురు స్థానికులు వాపోతున్నారు.

గుండ్లూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఇలా..

అయ్యప్ప స్వాముల పడిపూజ 29న

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అయ్యప్ప ఆలయంలో ఈ నెల 29న స్వామి వారికి పడిపూజను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 16న ఆవరణలో అన్నదాన కార్యక్రమం ప్రారంభం కాగా, ఈ నెల 28న గణపతి హోమం, భగవతి సేవ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అందువల్ల అయ్యప్ప మాలధారులు ఆవరణలో జరిగే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఉత్సవ కమిటీ నియామకం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి ఆలయానికి నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా మార్వారి సుధాకర్ నాయుడు, జర్మనీరాజు, రమణరావు, విశ్రాంత ప్రధాన పోస్టుమాస్టరు గట్టు రమణ, ఢంకణాచారి, కే.భగవాన్, బండి అమరనాథ్, కే.శివమూర్తి, బి.మహేష్, జి.ఆనంద నాయుడు నియమితులయ్యారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను ఉత్సవ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను నీరుగార్చేందుకే నూతన లేబర్‌కోడ్‌లను అమలు చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మదనపల్లెలో ఆదివారం పార్టీనాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏకపక్షంగా ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనిపై ప్రజాస్వామ్యంలో హక్కులను సాధించుకునేందుకు అన్ని సంఘాలు ఐక్యం కావాలని కోరారు.

టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): మండలంలోని గ్యారంపల్లె గురుకుల పాఠశాల ఆవరణంలో ఆదివారం టీ-20 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు టీ-20 క్రికెట్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి అద్వైత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు ఆటలపై ఆసక్తి చూపాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు భవిష్యత్తులో క్రికెట్‌లో రాణించాలన్నారు.

అడుగుకో గుంత.. తప్పని చింత

కలికిరి క్రాస్ రోడ్డు నుంచి బస్టాండుకు వెళ్లే మార్గంలో అడుగుకో గుంతపడింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి గుంతలను తప్పించే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కలికిరి

ఘనంగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజక వర్గాల్లో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆయన చిత్రపటాన్ని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తరలివచ్చిన సాయి భక్తుల సమక్షంలో భజనలు నిర్వహించారు. వక్తలచే సాయి జీవిత చరిత్ర ప్రసంగాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. - న్యూస్‌టుడే, బృందం

ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

బి.కొత్తకోట: దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ములకల చెరువులో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వాల్మీకిపురం: పూజల్లో పాల్గొన్న భక్తులు

నిర్మించారు.. వినియోగం మరిచారు

పత్తేగడ(కలికిరి), న్యూస్‌టుడే: కలికిరి మండలం పత్తేగడ పంచాయతీ టి.మాదిగపల్లెలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఇక్కడ రూ.7 లక్షలతో మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్మించారు. ఆ గ్రామంలో చిన్నారులు సంఖ్య తక్కువగా ఉందని సమీపంలోని సత్యాపురం అంగన్‌వాడీ కేంద్రంలోకి అధికారులు విలీనం చేశారు. ఈ కారణంగా లక్షలు వెచ్చించి నిర్మించిన నూతన భవనాన్ని వినియోగించక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగ మారింది. సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రత్యామ్నాయంగా వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లుడిపై అత్తింటివారి దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: అల్లుడిపై అత్తింటివారు దాడి చేసి గాయపర్చిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. రెండేళ్ల క్రితం తంబళ్లపల్లెకు చెందిన స్రవంతిని ప్రేమ వివాహం చేసుకున్నాను. కొంత కాలంగా ఆమె వారి తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. తంబళ్లపల్లె మండలంలో బోరెడ్డిగారిపల్లెలో ఓ వివాహానికి శనివారం అర్ధరాత్రి బస్సు డ్రైవర్‌గా వెళ్లాను. ఈ క్రమంలో ఆమె కుటుంబ సభ్యులు మల్లిరెడ్డి, పవన్‌కుమార్, సుభాషిణితో పాటు పలువురు తనపై దాడి చేసి కొట్టారని తెలిపారు.

రాగి తీగల చోరీ

ములకలచెరువు : మండలంలోని పెద్దపాళ్యం బ్రిడ్జి సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రికను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి తీగలు ఎత్తుకెళ్లారు. కొండా సిద్ధార్థ ఏడాది కిందట ఇక్కడ ఓ భవన నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ నియంత్రికను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

హోంగార్డు మృతికి సంతాపం

మదనపల్లె నేరవార్తలు: అనారోగ్యంతో హోంగార్డు మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన ఆర్.వి.రమణ (47) మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కార్యాలయం నుంచి భోజనానికి ఇంటికి వెళ్లారు. ఒక్కసారిగా కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఆయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఛీఛీ.. ఇదేం దారి

గాలివీడు బస్టాండు కూడలి ప్రాంతం

మండల కేంద్రమైన గాలివీడులో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. అన్ని బాగున్నా స్థానికుల రోడ్డుపైకి చొచ్చుకుని ఇళ్ల నిర్మాణాలు, కట్టడాలు చేపట్టారు. వర్షపు నీటితో పాటు నివాసాల నుంచి వెలువడే వృథా నీటిని రహదారిపైకి వదులుతున్నారు. అంగళ్ల ముందు మట్టి కుప్పలు వేయడంతో నీటి ప్రవాహంతో లోతట్టు దారిలో మట్టి పేరుకు పోతున్నాయి. దీంతో జన సంచార ప్రాంతమైన బస్టాండు కూడలిలో సిమెంటు రహదారిని మట్టి కప్పేసింది. శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

బీటలు వారి.. ప్రమాదంగా మారి

పుల్లంపేట మండల పరిధిలోని గారాలమడుగు పంచాయతీ పరిధిలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు బీటలువారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ద్విచక్ర వాహనాలు పట్టుతప్పి చోదకులు గాయాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

?: పట్టణంలోని కొత్తపేటలో కాలువలను శుభ్రం చేయడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అవి పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలి? - రమేష్, స్థానికుడు

✓: వెంటనే సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం.

?: పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. చిన్నారులు, పెద్దలపై దాడులు చేస్తున్నాయి. కుక్కలను పట్టి వేరే ప్రాంతానికి తరలించాలి? - కందుకూరి ఆంజనేయులు, రాయచోటి

✓: కుక్కల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆ చర్యల్లో భాగంగా కుక్కల కోసం వరిగ రోడ్డులోని డంప్ యార్డులో ఓ షెడ్డు నిర్మిస్తున్నాం. వీధి కుక్కలను పట్టి, వాటికి శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

(పై రెండు ప్రశ్నలకు కమిషనర్ రవి సమాధానమిచ్చారు)

- న్యూస్‌టుడే, రాజంపేట

?: పట్టణంలో చక్రాలమడుగుతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమల బెడద వేధిస్తోంది? దోమల నివారణ చర్యలు చేపట్టండి? - రామరాజు, రాజంపేట

✓: వెంటనే సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణ చర్యలు చేపడతాం.

- పారిశుద్ధ్య అధికారి, రాజంపేట

అడుగుకో గండం.. రహదారికో దండం

★ అవస్థలు పడుతున్న వాహనదారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట నియోజకవర్గంలో చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యం, నిర్వహణ లోపం, సరైన ప్రణాళిక లేని కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దారులు అధ్వానంగా మారాయి. రాజంపేట నుంచి కోడూరు వరకు ఉన్న జాతీయ రహదారి అత్యంత దారుణంగా మారింది. ఎక్కడ ఏ గుంత ఉందో తెలిసేలోపే ప్రమాదాలు బారిన పడుతున్నారు. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండల కేంద్రాల్లో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నా అధికారులు చర్యలు కోవడం లేదు. దీంతో సామాన్య ప్రజలు, వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

బోయనపల్లి వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు

హెచ్.చెర్లోపల్లి- గొల్లపల్లి మార్గం ఇలా..

- రాజంపేట మండలం బోయనపల్లి వద్ద చిన్నపాటి వర్షానికే నీరంతా రహదారి పైకి చేరుతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన కల్వర్టులు కబ్జా చేయడంతో నీరుబయటకు వెళ్లే పరిస్థితి లేదు. రహదారికి ఇరువైపులా మురుగు వెళ్లడానికి కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏర్పాటు చేయకపోవడంతో రహదారంతా జలమయం అవుతున్నాయి.
- పెనగలూరు మండలం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు వద్ద వర్షపు నీరు నిలిచి, ప్రజలు కార్యాలయాలు వద్దకు రావాలంటే అవస్థలు పడుతున్నారు. అదే విధంగా ఎగువ సిద్దవరం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడి అందులో మురుగు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- రాజంపేట మండలం హస్తవరం గొల్లపల్లి గ్రామ రహదారిపై దాదాపు 10 అడుగుల భారీ గుంత ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఆ నీరంతా ఇక్కడి గుంతలోకి చేరుతోంది. వారం, పది రోజులు పాటు నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.
- సుండుపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బ్యాంకు ఎదుట కుంటలా వర్షం నీరు ఆగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ రహదారి పెద్ద గుంతలా మారడంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

వెలిగల్లుపై మంచు దుప్పటి

రాయచోటి-కదిరి ప్రధాన రహదారిపై గాలివీడు మండలంలో నిర్మించిన వెలిగల్లు జలాశయాన్ని మంచు ముంచేసింది.. ఒకవైపు తుపాను, మరోవైపు చలిగాలుల ప్రభావంతో అర్ధరాత్రి నుంచే మంచు తెరలు కమ్మేస్తున్నాయి. జలాశయంపైనే ప్రధాన రహదారి ఉండడంతో రాకపోకలు సాగించే వారికి దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. కట్టపై ఉన్న రహదారిపై లైట్లు వేసుకుని ప్రయాణం చేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు కనిపించకుండా మంచు కప్పేస్తోంది. ఈ దృశ్యాలను తిలకించడానికి జలాశయం వద్దకు చేరుకుంటున్నారు. తూముకుంట, ఎన్పీకుంట సౌర విద్యుత్తు ప్లాంట్లలో పనిచేసే అధికారులు, సిబ్బంది మంచుతో రాకపోకలకు అవస్థలు పడతున్నారు. ప్రమాదాలు జరగకుండా చోదకులు అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

గాలివీడులో ఆగిన మట్టి రవాణా

స్పందనకు స్పందనం

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడులోని గుర్రాలమిట్ట నుంచి ఎర్రమట్టిని తరలించకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం 'ఈనాడు'లో 'కొండలకు గుండ్లు..అక్రమార్కులకు ఆస్తులు' శీరికను చిత్ర కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన అధికారులు ఎర్రమట్టి తవ్వకుండా నిలిపివేయించారు. దీనిని కొనసాగించాలని కోరుతున్నారు.

భగవద్గీత.. జీవన సారం

గాంధీబజార్ (రాయచోటి), న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని కడప చిన్మయ మిషన్ అధ్యక్షుడు స్వామి తురియానంద సరస్వతి తెలిపారు. పట్టణంలోని గాంధీబజార్‌లో వెలసిన శ్రీకన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం ప్రవచనాలు, భగవద్గీత పారాయణం చేశారు. ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరు చిన్న విషయాన్ని కూడా ఒక శాస్త్రీయ పరిజ్ఞానంతో చూస్తున్నారన్నారు. మనిషి కూడా తన జీవితాన్ని ఎలా బాగు చేసుకోవాలనే విషయాన్ని ఆలోచించాలన్నారు. అయిదు రోజుల పాటు జరిగిన ప్రవచనాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, మహిళ సంఘం సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డిసెంబరులో ఎస్ఎఫ్ఐ మహాసభలు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా డిసెంబరు 12, 13, 14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ చెప్పారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం మహాసభలకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభల్లో విద్యారంగ సమస్యలు, అభివృద్ధి కొరకు పలు తీర్మానాలు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమణ, మదన్ మోహన్‌రెడ్డి, అఫ్రిది, లతీఫ్ పాల్గొన్నారు.

మహాసభలకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బంగారు పతకధారికి సన్మానం

కొర్లకుంట నాగరాజును సన్మానిస్తున్న వీఆర్‌డీఎస్ సంస్థ చైర్మన్ సురేంద్రారెడ్డి, గ్రామస్థులు

వీరబల్లి, న్యూస్‌టుడే: భూటాన్ దేశంలో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో వీరబల్లి వాసి బంగారు పతకం సాధించడం అభినందనీయమని వీఆర్‌డీఎస్ ఛైర్మన్ డి.సురేంద్రారెడ్డి, విశ్రాంత మైనింగ్ అధికారి నటరాజశర్మ, విశ్రాంత ఉపాధ్యాయులు బసిరెడ్డి, వి.శ్రీనివాసులు, వి.మల్లికార్జున, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సిరిగిరి కుళాయరెడ్డి పేర్కొన్నారు. వీరబల్లి జడ్పీ పాఠశాలలో ఆదివారం నాగరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద వాడై ఉండి వీరబల్లి మండలాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం గర్వించతగ్గ విషయమన్నారు. క్రీడల్లో సత్తా చాటితే ఏదైనా సాధించగలమని నిరూపించిన నాగరాజును ప్రతి క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పతకం సాధించడానికి తర్ఫీదునిచ్చిన కోచ్‌కు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తనను ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని చెప్పారు. భవిష్యత్‌లో మండలంలోని క్రీడాకారులను ఆదుకోవడానికి తన వంతు సహకారం అందిస్తానని విశ్రాంత మైనింగ్ అధికారి నటరాజశర్మ తెలిపారు. రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మస్తాన్, స్నేహితులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కేంద్రాల మార్పు

పుల్లంపేట: మండలంలోని 11 గ్రామ సచివాలయాలుండగా అందులో దళవాయపల్లెలోని కొత్తపేట సచివాలయంగా, ఏజీపల్లెను వీవీజీపల్లె సచివాలయంగా, రెడ్డిపల్లె సచివాలయాన్ని టి.కమ్మపల్లె సచివాలయంగా, తిప్పాయపల్లె సచివాలయాన్ని బావికాడపల్లె సచివాలయంగా మార్పు చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చాయని అధికారులు తెలిపారు.

మాలధారణం.. నియమాల తోరణం

మణికంఠగిరిపై అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటి, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్ష నియమాలతో కూడిన తోరణం లాంటిదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. పట్టణంలోని సుద్దలోళ్లపల్లె రోడ్డులోని మణికంఠగిరి కొండపై అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల దీక్ష చేపట్టిన అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. ఆధ్యాత్మికత పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు. అనంతరం అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి బసిరెడ్డి, తెదేపా నాయకులు శ్రీనివాసులు, న్యాయవాది సతీష్‌రెడ్డి, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

శిబిరానికి వచ్చిన మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని హెచ్ఎంఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రూపానందరెడ్డితో పాటు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, సాయివికాస్‌రెడ్డి నేతృత్వంలో తిరుపతికి చెందిన అరవింద ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. 600 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 150 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించడంతో వారికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి తిరుపతికి పంపించారు.

రూ.19.03 లక్షలతో వసతి గృహ నిర్మాణ పనులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం మరమ్మతు పనులు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. రూ.19.03 లక్షలతో పనులు చేపట్టగా స్వచ్ఛభారత్ కింద శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్ల స్థానంలో కొత్త వాటిని నిర్మిస్తున్నారు. వసతి గృహంలో ప్రస్తుతం 55 మంది విద్యార్థులున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వసతి గృహ మరమ్మతులకు పైసా ఖర్చు చేయలేదు. దీంతో పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతి గృహాల బాగుకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు తాగేందుకు నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయడంతో పాటు రంగులు వేయడం, ఇతర పనులన్నీ డిసెంబరు మొదటి వారానికి పూర్తి కావచ్చని అధికారులు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

వీరబల్లి, న్యూస్‌టుడే: రైతులకు సరసమైన ధరలకే ఎరువులు విక్రయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. ఆదివారం వీరబల్లి మండలం ఓదివీడులో ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని విధాల నష్టపోతున్న రైతులను దుకాణ యజమానులు డబ్బుల కోసం వేధించకుండా, తక్కువ ధరలకే ఎరువులు, రసాయన పురుగు మందులు సరఫరా చేయాలన్నారు. రైతుల హక్కులు సాధించుకోవడానికి గ్రామ స్థాయి నుంచి గ్రామ కమిటీలు, జిల్లా కమిటీలు వేసుకుని అందరూ కలికట్టుగా ఉంటూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో డీలర్ జగిలి రమేష్, రంగస్థల కళాకారుడు తుమ్మల హరినాథ్, విశ్రాంత అధ్యాపకులు జగిలి రామచంద్ర, జగిలి సాంబశివయ్య, రాజశేఖర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే మానవత లక్ష్యం

కొత్తపేట (రాయచోటి), న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సే మానవత సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ రాయచోటి అధ్యక్షుడు శివ గంగిరెడ్డి తెలిపారు. కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలను అభినందించారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ సేవలు నిర్వహిస్తున్నామన్నారు. భావి పౌరులైన విద్యార్థులకు మానవతా విలువలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం దాత డాక్టరు సాయికృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, చింతం వెంకట్రామిరెడ్డి, కో-ఛైర్మన్ షకీల్, కార్యదర్శి వెంకట రామానాయుడు, వెంకటేశ్వరరెడ్డి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో కమిటీ సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించడం జరిగిందని ఆ శాఖ అధ్యక్షుడు బలరాంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంఘం నియమించడంతో కార్యక్రమాలు విస్తరిస్తాయన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ అలీ, ఉపాధ్యక్షురాలిగా రెడ్డి కీర్తి, సంయుక్త కార్యదరిశ్గా సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు బలరాంరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ జిల్లా కమిటీ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, విశ్వనాథ్, రవీంద్రనాయక్ మహదేవ, దేవేంద్ర, శివారెడ్డిలు పాల్గొన్నారు.

సత్యసాయి స్ఫూర్తి.. సేవా దీప్తి

సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో శ్రీసత్యసాయి జయంతిలో వేడుకల్లో అధికారులు

రైల్వేకోడూరు: శ్రీసత్యసాయి బాబా చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఏపీడీ మృత్యుంజయరావు, సిబ్బంది

సేవా కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరు ఇతరులకు సాయం చేయాలని, ప్రేమను పంచాలనీ చాటి చెప్పిన ఆధ్యాత్మిక మూర్తి సత్య సాయిబాబా అందరిలో స్ఫూర్తిని రలిగించారని వక్తలు కొనియాడారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను మండల పరిషత్ కార్యాలయ సభా భవనాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. అందరినీ ప్రేమించు-అందరినీ సేవించు అన్న బాబా బోధనలు నేటి తరానికి అనుసరణీయమన్నారు. ఆయన సేవలు వెల కట్టలేనివని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు యువత భక్తి భావాన్ని పెంపొందించుకొని సత్య, ధర్మ ప్రవర్తనతో జీవించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం

ఘనంగా గీతా జయంతి

రాజంపేట, న్యూస్‌టుడే: గీతా జయంతిని పురస్కరించుకుని తితిదే ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం భగవద్గీత పఠన పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలబాలికలు తమ ప్రతిభను చాటుకున్నారు. భగవద్గీతలోని 14వ అధ్యాయంలో వన్యశ్రీ, కుశాల్, ఉజ్వల, 16వ అధ్యాయం పోటీలో పి.రేణు, శివపార్వతి, విక్రమ్, నిత్య జీవితంలో భగవద్గీత- భావ విశ్లేషణ అంశంలో పి.శ్రీనివాసులు, వీరేంద్రతేజ, వెంకటశివ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి శ్రీశైలం దేవస్థాన ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల బాధ్య ప్రధానోపాధ్యాయురాలు శారద బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వెంకట సుబ్బారెడ్డి, డాక్టర్ శివారెడ్డి, రామచంద్రయ్యానాయుడు, మునికుమార్, శ్రవంతి, యూపీ రాయుడు, గోపాలకృష్ణ, శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్తు జిల్లా కార్యక్రమ సహాయ అధికారి డాక్టర్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విజేతలు

బహుమతి అందుకుంటున్న శ్రీనివాసులు

తుపానుతో అన్నదాతకు కష్టాలు

వర్షం ఆగిపోవడంతో వరి కుప్పను ఆరబెడుతున్న రైతులు

రామాపురం, న్యూస్‌టుడే: రెండు రోజులుగా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం మండలంలోని గోపగుడిపల్లెకు చెందిన 20 మంది రైతులు వరి కోతకోసి ధాన్యాన్ని ఎండబెట్టేందుకు కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై గువ్వలచెరువు సమీపంలో వాహన విశ్రాంతి స్థలంలో వరి ధాన్యాన్ని ఆరబోశారు. రాత్రింబవళ్లు అక్కడే కాపలా ఉంటున్నారు. తుపాను ప్రభావంతో గువ్వలచెరువు చుట్టూ ఉన్న పాలకొండల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో పైన పట్టలు కప్పి ధాన్యం తడవకుండా కష్టాలు పడుతున్నారు. ఆరే వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాలని రైతులు తెలిపారు.

జోరు వానతో వీధులు జలమయం

పుల్లంగేరు చిట్వేలి వంతెనపై నిలిచిన వర్షపు నీరు

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పుల్లంపేటలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి వీధులన్నీ జలమయం అయ్యాయి. చిట్వేలి వంతెనపై వర్షపు నీరు నిలబడి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. నాలుగు రోడ్ల కూడలి వద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పుల్లంపేటలో ప్రధాన భావనారుషి ఆలయం వద్ద వర్షపు నీరు నిలబడి నడిచేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

శ్రీరాములపేట వీధి జలమయం

వెలిగల్లుకు జలకళ.. పర్యాటకం వెలవెల

కళకళలాడుతున్న వెలిగల్లు జలాశయం

- న్యూస్‌టుడే, గాలివీడు

గాలివీడు మండలం రాయచోటి-కదిరి రోడ్డులోని వెలిగల్లు జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జలాశయం గేట్లకు గ్రీజు పూయడానికి కూడా పైసా నిధులివ్వలేదు. పర్యాటకాన్ని పట్టించుకోలేదు. ఇక్కడి ప్రకృతి, వాతావరణం చక్కగా ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. జలాశయాన్ని తిలకించడంతో పాటు సేద తీరేందుకు ప్రత్యేక ఉద్యానవనం, ప్రకృతి అందాలు వీక్షించేందుకు అనుకూలంగా పలు నిర్మాణాలు చేపట్టారు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు వెనుకబడింది. ఏటా సందర్శకుల సంఖ్య పెరుగుతుండగా సుందరీకరణ పనుల్లో జాప్యం జరుగుతోంది.

వెలిగల్లు జలాశయం నిర్మించి 17 ఏళ్లు గడుస్తోంది. పదేళ్లుగా నిండుకుండలా నీటితో కళకళలాడుతోంది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.16 టీఎంసీల నీరుంది. జలాశయం నిర్మించిన కొత్తలో బోటు షికారుకు అనుమతిచ్చారు. పర్యాటకులు బోటులో షికారు చేసేవారు. ఒక టీఎంసీ నీటి నిల్వలున్నంత వరకు కొంత దూరం వరకు పడవ వెళ్లేది. అయినప్పటికీ పడవ ప్రయాణానికి అప్పట్లో పోటీ పడేవారు. గుత్తేదారు వ్యక్తిగత కారణాలతో బోటు షికారును నిలిపి వేయగా అనంతరం అధికారులు దాని గురించి పట్టించుకోలేదు. ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉండటంతో బోటు షికారును కొనసాగించాలని పర్యాటకులు కోరుతున్నారు. అయిదేళ్ల కిందట జలాశయం కట్ట వద్ద ప్రత్యేకంగా గదిని నిర్మించారు. అక్కడి నుంచి బోటును నడపాలని తలిచారు. ప్రస్తుతం ఆ గది నిరుపయోగంగా మారింది.

సేద తీరడానికి నిర్మించిన ఉద్యాన వనం

ప్రతిపాదనలు బుట్టదాఖలు

- వైకాపా పాలనలో అప్పటి కలెక్టరు జలాశయాన్ని సందర్శించి స్పిల్‌వే గేట్ల దిగువ ప్రాంతంలోని రెండు కొండల మధ్య రోప్ వే, ఉద్యాన వనం వద్ద గుట్టపై విశ్రాంతి గదులు, హోటల్ భవనాలు, గండిమడగు క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
- బోటు షికారుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన కలెక్టర్లు పర్యాటక కేంద్రాన్ని పట్టించుకోలేదు. బోటు షికారు ఏర్పాటు చేయాలని యాత్రికులు, సందర్శకులు కోరుతున్నారు.
- ఇటీవల అదనపు ఆకర్షణగా తూముకుంట, ఎన్పీకుంటలో 1,400 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. మరి కొందరు గండిమడుగు క్షేత్రాన్ని సందర్శించడానికి వరుస కట్టారు. కూటమి పాలనలో పర్యాటకంగా అభివృద్ధికి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నివేదిక పంపాం

వెలిగల్లు జలాశయం పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను వివరిస్తూ సుందరీకరణకు నిధులివ్వాలని నివేదిక పంపాం. బోటు షికారు ఏర్పాటుకు పర్యాటక అధికారుల దృష్టికి తీసుకుపోతాం. - భరత్‌కుమార్, వెలిగల్లు జలాశయం డీఈ, గాలివీడు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ఈనాడు బాపట్ల
సోమవారం నవంబరు 24, 2025

చంపాడు- పెరవలి మధ్య కోతకు గురైన రేపల్లె డ్రెయిన్ కట్ట

కట్టలు కోత.. పంటలెలా చేరవేత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన మురుగు కాలువల కట్టలు కోతకు గురయ్యాయి. ముఖ్యంగా రేపల్లె డ్రెయిన్ గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం నుంచి మొదలై తెనాలి, వేమూరు, అమృతలూరు మండలాల మీదుగా నగరం మండలం వద్ద సముద్రంలో కలుస్తోంది. దీని కాలువ కట్టలు జంపని నుంచి పెరవలి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర గతంలో రెండువైపులా దెబ్బతినగా.. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. కట్టలపై కనీసం ట్రాక్టర్లు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ప్రధానంగా చంపాడు, పెరవలి వద్ద కట్టలు కోతకు గురై కుంగిపోయాయి. చంపాడు, పెరవలి, పోతుమర్రు తదితర గ్రామాల రైతులు ధాన్యం చేరవేతకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలువ కట్టలపై ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లు సైతం కిందకు జారిపోయాయి. అధికారులు చొరవతీసుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై డ్రైనేజీ శాఖ ఏఈ నాయక్ మాట్లాడుతూ కాలువ కట్టలు కోతకు గురైన విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులకు చెప్పామని మరమ్మతులు చేసేందుకు రూ.12 లక్షలు అవసరమని దీనిపై నివేదిక పంపామని తెలిపారు.

- న్యూస్‌టుడే, పెరవలి (వేమూరు), కూచిపూడి (అమృతలూరు)

సమస్యలపై మీకోసం వెబ్‌సైట్లో అర్జీల స్వీకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవటానికి మీ కోసం వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నమోదు చేసిన అర్జీల స్థితిని సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవటానికి నేరుగా 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలను కార్యాలయాల్లో నేరుగా అందజేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

జోరుగా.. హుషారుగా

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: ప్రజలు ఆనందంగా గడిపేందుకు హ్యాపీ సండే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని రథం బజారులో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.

అన్నదాత ఇంట.. లాభాలు పండాలని..

'రైతన్న-మీకోసం' వారోత్సవాలు నేటి నుంచి

చందోలు, (పిట్టలవానిపాలెం), కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 'రైతన్న-మీకోసం' వారోత్సవాలు నిర్వహించనున్నారు. వారంపాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఇంటింటికీ వెళ్లి రైతులను కలుసుకుంటారు. అందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మూడు కుటుంబాలకు ఓ క్లస్టర్‌గా.. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి, ఒక్కొక్క బృందం రోజుకు 30 క్లస్టర్లు (90 గృహాలు) సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశం ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థికస్థితి, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా వీటిని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇదీ లక్ష్యం.. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఆర్‌ఎస్‌కే సహాయకులు, పశుసంవర్ధక, మత్స్య సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో చేస్తారు.

కార్యాచరణ ఇలా.. ● ఇంటింటి సందర్శనలో సీఎం సందేశ లేఖ, కరపత్రం అందజేస్తారు. ● ఏపీ ఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. రైతుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. ● 30న సమావేశాలు నిర్వహిస్తారు. సందర్శనల ద్వారా సేకరించిన ఫిర్యాదులు, సూచనలకు సంబంధించిన డేటాను సమీకరించి దానిపై డిసెంబరు 2 వరకు విశ్లేషిస్తారు. ● 3న 2026-27 సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి ప్రతి రైతు సేవా కేంద్రంలో కార్యశాల నిర్వహిస్తారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, మార్టూరు

పర్చూరు-కారంచేడు మధ్య రోడ్డు నెర్రెలిచ్చి.. (మరమ్మతులకు ముందు)



వంతెన రివిట్‌మెంట్ వద్ద..

ఇనుప రెయిలింగ్ ఇలా..

జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి ప్రారంభించకుండానే పగుళ్లు వచ్చాయి. మొంథా తుపానుకు పలుచోట్ల కోతకు గురై దెబ్బతింది. రోడ్డు పైభాగం కూడా దెబ్బతినడంతో మళ్లీ తారు వేసి సరిచేశారు. మార్జిన్‌లో పగుళ్లు రావడంతో తొలగించి మరమ్మతులు చేపట్టారు. ప్రారంభానికి ముందే రోడ్డు నిర్మాణంలో పలు లోపాలు బహిర్గతమయ్యాయి. వాడరేవు-చిలకలూరిపేట జాతీయరహదారిలో ఒక వంతెన, చిలకలూరిపేట వద్ద బైపాస్‌లోకి అనుసంధాన రహదారి మినహా మిగిలిన రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలకు అనుమతించారు.

వాడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఏ నిర్మాణాన్ని ఆర్ఆర్ఎస్ఎం ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఈపీసీ విధానంలో చేపట్టింది. మొత్తం 47 కిలోమీటర్ల దూరం నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని రూ.677.88 కోట్లతో పనులు చేశారు. ఫిబ్రవరి 2024లో మొదలైన పనులు ఫిబ్రవరి 2026 నాటికి పూర్తి చేయాలనేది ఒప్పందం. ఇప్పటికే 95 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

కీలక రహదారి కావడంతో..

పల్నాడు, బాపట్ల జిల్లాలను అనుసంధానం చేయడంలో కీలకమైన రహదారి కావడంతో రద్దీ ఎక్కువగానే ఉంది. అక్టోబరులో వచ్చిన మొంథా తుపాను వరదకు పర్చూరు దాటిన తర్వాత కారంచేడు వైపు పర్చూరు వాగు వద్ద రోడ్డు కోతకు గురవడంతో చీలిపోయింది. మట్టిని సక్రమంగా రోలింగ్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. గుర్తించిన గుత్తేదారు సంస్థ రోడ్డు పగుళ్లు వచ్చిన వరకు తొలగించి మరమ్మతులు చేపట్టింది. అలాగే పర్చూరు వద్ద వాగుపై నిర్మించిన వంతెనకు ఒకవైపు మట్టి కట్ట వర్షానికి కొట్టుకుపోవడంతో రెయిలింగ్ పడిపోయింది. రహదారి మధ్యలో డివైడర్‌లో వేసిన మట్టిలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో మొక్కల పెరుగుదలకు అడ్డంకిగా మారింది. జాతీయ రహదారి నిర్మాణంలో పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటే కొన్నాళ్లపాటు మరమ్మతులు ఉండవు. ఇక్కడ అందుకు భిన్నంగా అనేక లోపాలు బహిర్గతం కావడం గమనార్హం. ఇప్పుడే ఇలా ఉంటే భారీవాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తే పరిస్థితి ఏంటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంటి పన్ను... ఆన్‌లైన్‌లో చెల్లించు

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పన్ను చెల్లింపులకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో రసీదు పుస్తకాలు అందుబాటులో ఉంచుకొని కొన్నింటి ద్వారా వసూలు చేసిన వాటిని మాత్రమే ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఫలితంగా ఆస్తి పన్ను సొమ్ము పక్కదారి పడుతోంది. దీనిపై పలు పంచాయతీల్లో పన్ను చెల్లించినా మళ్లీ కట్టాలనే రసీదులు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేయడం గమనార్హం. ప్రస్తుతం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంలో ఇక ఇంటి పన్నులు అవకతవకలు జరగకుండా ఉంటాయి. అంతేకాకుండా ఇంటి యజమానుల చరవాణి నంబర్‌కి ఉన్న వాట్సాప్‌కు పన్ను నోటీసులు, బకాయిలకు సంబంధించిన సమాచారం పంపిస్తున్నారు. దీంతో ఆ మొత్తాన్ని క్యూఆర్ కోడ్, యూపీఐ ద్వారా చెల్లించే విధానం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా చెల్లిస్తే రసీదు చరవాణికి వస్తోంది. ఫలితంగా ప్రతి పైసా పంచాయతీ ఖాతాకు జమవుతోంది. దీనిపై ఇంటి యజమానులకు అవగాహన లేకపోతే సచివాలయం వద్దకు వెళ్లి వివరాలు అందజేస్తే, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో కాకుండా డబ్బు తీసుకుని రసీదులు అందజేసే సిబ్బందిపై చర్యలు తప్పవని ఇప్పటికే ఉన్నతాధికారులు హెచ్చరించారు. ● జిల్లాలో 459 పంచాయతీలున్నాయి. సుమారు రూ.17 కోట్ల వరకు ఇంటి పన్ను డిమాండ్ ఉంది. దీన్ని మార్చి 31లోపు వసూలు చేయాల్సి ఉండగా డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పంచాయతీ అధికారులు ముందుకెళుతున్నారు.

విద్యావంతుల గ్రామం.. నరసాయపాలెం



బాపట్ల, న్యూస్‌టుడే: నరసాయపాలెం జిల్లాలో చైతన్యవంతమైన గ్రామం. విద్యావంతుల కేంద్రంగా గుర్తింపు తెచ్చుకుంది. వందల మంది వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలుగా దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ గ్రామం నుంచి ఐదుగురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లుగా సేవలందించారు. ఊట్ల అప్పారావు ఐపీఎస్‌కు ఎంపికై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పని చేశారు. అజయ్ కళ్లం ఐఏఎస్ అధికారిగా సేవలందించారు. ఏపీ సీఎస్‌గానూ పని చేశారు. ప్రత్తిపాటి గౌతమ్ కుమార్ ఐపీఎస్‌కు ఎంపికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ ముఖ్య కార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేశారు. ఆయన తండ్రి ప్రత్తిపాటి అంకమ్మ చౌదరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా సేవలందించారు. కన్నెగంటి సంధ్యారాణి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై పాఠశాల విద్యాశాఖ కమిషనర్, కేంద్ర తపాలా శాఖ సంచాలకురాలిగా సేవలందించారు. ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. కుంభా శివకృష్ణ 2011లో ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం విశాఖ జీఎస్టీ సంయుక్త సంచాలకుడిగా ఉన్నారు.

కురగల్లు సొసైటీ అక్రమాలపై నివేదికివ్వండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కురగల్లు సొసైటీలో రైతులు దాచుకున్న సొమ్మును అక్రమార్కులు దోచేయడంపై జిల్లా సహకార శాఖ అధికారి విచారించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సహకార శాఖ కమిషనర్ కె.శ్రీలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కురగల్లు సొసైటీలో అక్రమాలపై తీసుకున్న చర్యలను వివరించాలని, అనుమానిత వ్యక్తుల ఆస్తులను షరతులతో కూడిన అటాచ్‌మెంట్‌కు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒకే గదిలో అయిదు తరగతులు!

పిట్టలవానిపాలెం మండలం అల్లూరు పంచాయతీ పరిధి ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' రెండో దశలో పనులు చేపట్టడానికి పడగొట్టారు. సుమారు రూ.26 లక్షలతో నూతన భవన పనులు ప్రారంభించారు. అనంతరం నిధులు విడుదల కాక పునాదుల దశలోనే నిలిచింది. ఈ పాఠశాలలో అయిదు తరగతుల్లో 24 మంది విద్యార్థులు ఉండగా కాలనీలోని సామాజిక భవనంలోనే బోధిస్తున్నారు. అక్కడ ఒక గదిలో అయిదు తరగతులు నిర్వహించటం గందరగోళంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సామాజిక భవనం వద్ద మరుగుదొడ్డి లేక పోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, అల్లూరు (పిట్టలవానిపాలెం)

పునాది దశలోనే నిర్మాణం

సామాజిక భవనంలో ఒకే గదిలో బోధన

ఎస్పీ ఉమామహేశ్వర్‌కు అదనపు బాధ్యతలు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు డిసెంబరు రెండు వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రకాశం ఇన్‌ఛార్జి ఎస్పీగా బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ నియమితులయ్యారు. ఇన్‌ఛార్జి ఎస్పీగా ఉమామహేశ్వర్ తాత్కాలిక బాధ్యతలు ఆదివారం చేపట్టారు.

సంక్షేమంలేని వసతి గృహాలు

అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్, చీరాల అర్బన్

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వీటిని సందర్శించి ఇబ్బందులు తెలుసుకునే తీరిక అధికారులకు లేకుండాపోయింది. నెలకొకసారి కూడా రాత్రి పూట బస చేయడం లేదు. ఫలితంగా కొందరు వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

● బాపట్లలో ఎస్సీ కళాశాల విద్యార్థుల వసతిగృహం ప్రైవేటు భవనంలో నడుస్తోంది. ఇది శిథిలావస్థకు చేరడంతో భారీ వర్షం కురిస్తే నీరు లీకై పుస్తకాలు, దుస్తులు తడిసిపోతున్నాయి. కిటికీల మెష్‌లు దెబ్బతినడంతో దోమలు కుడుతున్నాయి. రక్షిత నీరు అందడం లేదు.

బాపట్లలో శిథిలస్థితిలో ఎస్సీ కళాశాల విద్యార్థుల వసతిగృహం

ఇరుకైన గదిలో నిద్రిస్తున్న విద్యార్థులు

అర్ధాకలితోనే..

పేరాల చిన్నబోసు బొమ్మ రోడ్డులోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో 25 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉంటున్నారు. ప్రతిరోజు అర్ధాకలితోనే ఉంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెనూ చార్టు ఉన్నా అమలు కావడం లేదు. అద్దె వసతి గృహంలో పేరుకు మూడు మరుగుదొడ్లు ఉన్నా.. ఒకటి మాత్రమే వినియోగంలో ఉంది. కిటికీలకు తలుపులు లేవు.. కేవలం మెష్ పెట్టారు. చీకటి పడితే దోమల మోత ఎక్కువ. చలితీవ్రత పెరుగుతున్నా.. ఇంత వరకు దుప్పట్లు ఇవ్వలేదు. వార్డెన్ మాత్రం కళాశాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయమని చెప్పారు.

● ఈ విషయాలపై జిల్లా ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమాధికారులు రాజాదిబోరా, శివలీల, ప్రకాశరావులను సంప్రదించగా ప్రైవేటు భవనాల్లో ఉన్న వసతిగృహాల కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రస్తుతం మరమ్మతులు జరుగుతున్నాయని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

బీసీ బాలుర వసతి గృహంలో మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు

కూలిన ప్రహరీ..

● రేపల్లెలో ఎస్సీ-2 బాలిక, బీసీ బాలికలు, బీసీ కళాశాల బాలుర వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలులేవని, ఇరుకు గదుల్లో ఇబ్బందిగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. ఎస్సీ, బీసీ కళాశాల బాలికల హాస్టల్ భవనాలకు కిటికీలున్నా మెష్‌లు లేవు. మొంథా తుపాను ప్రభావంతో వీచిన గాలులు, భారీ వర్షానికి బీసీ బాలిక వసతి గృహం ప్రహరీ కూలింది. ఎస్సీ-2 బాలికల వసతి గృహంలో 28 మందికి అయిదు మరుగుదొడ్లు ఉండగా ఒక దానికి తలుపు లేదు. బీసీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లు మరమ్మతులకు గురై అవస్థలు పడుతున్నారు. బీసీ కళాశాల విద్యార్థుల హాస్టల్లో తాగునీటి సౌకర్యం లేదు. డబ్బాల్లో తెచ్చుకుని తాగుతున్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

దేశ సంస్కృతికి నిలువుటద్దం యోగా

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమని, దేశ సంస్కృతికి నిలువటద్దమని, యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం అన్నారు. జె.పంగులూరు మండలం చందలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 69వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను డీఈవో ప్రారంభించారు. ముందుగా పతాకావిష్కరణ, ప్రతిజ్ఞ చేయించారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ చందలూరి గిరిజ అధ్యక్షత వహించారు. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనాన్ని అధికారులు స్వీకరించారు. విద్యార్థులు కోలాట ప్రదర్శనతో స్వాగతం పలికారు. పూర్వ ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి మాట్లాడుతూ చందలూరు చదువుల తల్లిగా ఉండేదని, క్రీడల తల్లిగా మార్చేందుకు గ్రామస్థులు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, కొండా ప్రతిమ, పీడీ ముద్దన విష్ణు పర్యవేక్షించారు. రాష్ట్ర పరిశీలకులుగా పూర్ణచంద్రరావు, రాజ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. చీరాల డిప్యూటీ డీఈవో గంగాధరరావు, బాపట్ల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, వడ్డవల్లి వీరనారాయణ, కె.వి.సుబ్బారావు, రామలింగస్వామి, నార్నె తాతయ్య, పెంట్యాల కృష్ణారావు, మురకొండ సుబ్బారావు పాల్గొన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సింగిల్, ఆర్టిస్టిక్ ఫెయిర్, రిథమిక్ ఫెయిర్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.

ఒలింపిక్స్‌లో గెలుపొందే వరకు పరుగే!

మారథాన్‌లో రాణిస్తున్న ఆర్మీ ఉద్యోగి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

పతకాలతో అంకమ్మరావు

ఆర్మీలో ఉద్యోగం. మంచి జీతం. పెళ్లయి పిల్లలు. ఏదో సాధించామని చాలామంది రిలాక్స్ అవుతుంటారు. అతను మాత్రం ఉద్యోగం వచ్చాకే పరుగు మొదలెట్టారు. రిటైర్డ్ అయ్యేలోపు ఒక్కసారైనా ఇండియా జర్సీ వేసుకుని అంతర్జాతీయస్థాయిలో పరుగుపెట్టాలని పట్టుదలతో ప్రయత్నాలు చేస్తున్నారు. అతనే శావల్యాపురం మండలం కారుమంచికి చెందిన అంకమ్మరావు. తాజాగా పుణెలో 50 కి.మీ మారథాన్‌లో బంగారుపతకం సాధించారు. చిన్నప్పుడు మార్షల్ ఆర్ట్సులో జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. డిగ్రీ వరకు పరుగుపోటీల్లో ఎక్కడా పాల్గొనలేదు. ఆర్మీ సెలక్షన్‌లో ఎంపిక కోసం పరుగుపెట్టారు. ఉద్యోగం సాధించాక మరోసారి హైదరాబాద్‌లో జరిగిన మారథాన్‌లో ఆర్మీ తరపున పరుగుపెట్టి మొదటి స్థానం రావడంతో తోటి స్నేహితులు ప్రోత్సహించారు. పరుగులో ఒక్కసారైనా దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో పరుగు పోటీల్లో పాల్గొనాలని వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు.

ఆర్మీలో 5, 21, 42 కిలోమీటర్ల పరుగులో పోటీపడే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. కానీ 35 ఏళ్లు పైబడిన వారికి... లుకు కావడంతో మారథాన్ విభాగంలో పోటీపడుతున్నారు. ఆర్మీలో ఈ విభాగం నుంచి ఎవరూ లేరు. అందుకే సొంతంగా శిక్షణ తీసుకుంటున్నారు. 12, 24 గంటలపాటు జరిగే జాతీయ స్థాయి మారథాన్ పరుగులో మొత్తంగా 23 పతకాలు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో 50 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉండే కొండల్లో 550 కిలోమీటర్లు 10 రోజుల్లో పూర్తి చేసిన 15 మందిలో ఒకరిగా నిలిచారు. ఒకపక్క రోజువారీ విధులు నిర్వహిస్తూనే సాయంత్రం రెండుగంటలు, ఆదివారం పూర్తిగా కఠోర సాధన చేస్తున్నారు. ఒలింపిక్స్ లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. గతేడాది బెంగళూరులో ఒలింపిక్స్ అర్హత 24 గంటల మారథాన్ పరుగులో త్రుటిలో తప్పిపోయారు. వచ్చే ఏడాది మరోసారి జరగనుంది. దీనికోసం సిద్ధమవుతున్నారు. నాన్న వ్యవసాయ కూలీ. ఆర్మీలో ఉద్యోగం వచ్చాక కుటుంబాన్ని ముందుకు నడిపారు. చెల్లెలి పెళ్లి. తమ్ముడి చదువు. ఇలా అన్ని బాధ్యతలు చేపట్టి ఉద్యోగాన్ని చూసుకుంటూ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న అంకమ్మరావు నేటితరానికి స్ఫూర్తిదాయకం.

బ్రహ్మానందపురంలో భారీ విద్యుత్తు ప్రాజెక్టు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో భారీ విద్యుత్తు ప్రాజెక్టును ఏపీ ట్రాన్స్‌కో చేపట్టింది. తాడేపల్లి పరిధిలోని బ్రహ్మానందపురంలో ప్రస్తుతం ఉన్న 132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని 220/132/33 కేవీ స్థాయికి పెంచుతూ రూ.80 కోట్లతో పనులు చేస్తున్నారు. 4.30 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుత 132/33 కేవీ కేంద్రం నుంచి 113 మెగావాట్ల విద్యుత్తును తాడికొండ నుంచి తీసుకుని సరఫరా చేస్తున్నారు. అయితే 220 మెగావాట్లతో ఏర్పాటు చేసే ఉప కేంద్రం నుంచి తాడికొండతోపాటు మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, అమరావతి రాజధాని నగరం, విజయవాడకు సైతం కరెంటు సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

భట్టిప్రోలులో వెలుగులోకి తెలుగు లిపి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు ప్రాచీన గ్రామం. తెలుగు భాష లిపికి పుట్టినిల్లు. ప్రస్తుతం మనం వాడుతున్న తెలుగు భాషను క్రీస్తు శకం ఐదో శతాబ్దంలో ద్రవిడ భాష నుంచి తెలుగు భాషగా గ్రామంలోనే మార్చబడింది. మల్లంపల్లి సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో అయిదు గురు బృందం తెలుగు భాషను వాడుకలోకి తీసుకొచ్చారు. అంతకుముందు తెలుగు భాష కన్నడ భాష తరహాలో లిఖించేవారు. ఇందుకు సంబంధించిన చరిత్రను ఆంధ్ర విజ్ఞాన పుస్తకంలో రాశారు. వీటి ఆధారాలు ఉన్న పుస్తకాలు భట్టిప్రోలు గ్రంథాలయంలో ఉన్నాయని స్థానిక తెలుగు పండిట్ విశ్రాంత ఉపాధ్యాయుడు లీలామోహనరావు తెలిపారు. స్థానిక విరలేశ్వర స్వామి దేవస్థానంలో ఉన్న కట్టడాలపై అప్పటి తెలుగు భాషలో దేవస్థానం చరిత్రను చెక్కడం గమనార్హం.

విరలేశ్వరస్వామి ఆలయంలో చెక్కిన తెలుగు లిపి

పల్నాటి ఉత్సవాలకు తెర

లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేసిన పీఠాధిపతి

కొణతాల ఊరేగింపు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : పల్నాటి వీరుల ఆరాధనలు ఆదివారం నిర్వహించిన కలిపాడుతో ముగిశాయి. శనివారం వీర్లదేవాలయంలో కోడిపోరు తర్వాత గ్రామోత్సవానికి బయలు దేరిన కొణతాలు తెల్లవార్లు కారంపూడిలోని ప్రతి వీధిలో తిరిగి గ్రామస్థుల నీరాజనాలు అందుకున్నాయి. ఆదివారం ఉదయం నాగులేటి గంగదారి మడుగులో కొణతాలకు పవిత్రస్నానాలు చేయించిన ఆచారవంతులు చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ దేవాలయాల్లో శంఖుతీర్థాలు తీసుకున్నారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఇల్లు చేరి ఆయనతో కలిసి వీర్లదేవాలయ ప్రాంగణంలోని లంకన్న ఒరుగు బండ చేరుకున్నాయి. అప్పటికే ఆచారవంతుడు లంకన్న వేషధారుగా అక్కడ మృతి చెందినట్లు పడుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ఆచారవంతులు, మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున లంకన్న ఒరుగు బండ వద్దకు చేరుకున్నారు. అతనికి శంఖుతీర్థమిచ్చి నాగులేరు గంగదారి మడుగులో స్నానం చేయించి కొణతాలు వీర్లదేవాయం చేరాయి. సాయంత్రం కొణతాలకు స్నానం చేయించి వీరగంధం పూసి వాటిని ధరించిన ఆచారవంతులు చెన్నకేశవస్వామి, అంకాళమ్మ దేవాలయాల్లో శంఖుతీర్థాలు తీసుకొన్నారు. పరుగులు పెడుతూ వీర్లదేవాయ ప్రాంగణంలో పీఠాధిపతి వద్ద శంఖుతీర్థం తీసుకొని అక్కడ ఏర్పాటు చేసిన కల్లిమండపంపై వాలీ యుద్ధంలో మరణించినట్లుగా ప్రదర్శించారు. చివరలో బ్రహ్మన్న ఆయుధానికి ఇదే తరహాలో క్రతువు నిర్వహించి పల్నాడు ఉత్సవాలకు తెరదించారు. కొణతాలు వాలిన తంగెడ మండల కోసం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పోటీ పడ్డారు. దీంతో ఐదురోజుల పాటు జరిగిన పల్నాడు ఉత్సవాలు ముగిశాయి.



(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Digital Partner: ఈనాడు.net TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ Organised by: ఈనాడు

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు).

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్
ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005
వివరాలకు: 7799102585, 8328360034
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై పీఈటీ/ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఆలేరు వాగుతో అన్నదాతలకు అగచాట్లు

ఆలేరు వాగు నిర్వహణ సక్రమంగా లేక ఏటా వేల ఎకరాల్లో పంటలు నీటమునిగి అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండలాల పరిధిలో 17 కిలోమీటర్ల పొడవున వాగు ప్రవహించి, సంతరావూరులో కొమ్మమూరు కాలువ దగ్గర వేటపాలెం మురుగు కాలువలో కలుస్తోంది. కొలలపూడి దగ్గర వాగు ఆరంభమవుతుంది. ఇంకొల్లులో 22వేలు, కారంచేడులో 5వేలు, చినగంజాం మండలంలో 3వేల ఎకరాలు వాగు పరీవాహకం కింద ఉన్నాయి. భారీ వర్షం కురిస్తే ఈ మండలాల్లో పైర్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయి. అవగాహన లేమితో 2012లో దగ్గుబాడు, నాయుడువారిపాలెం దగ్గర రూ.2కోట్లు వెచ్చించి నిర్మించిన వంతెనలు ఇరుకుగా ఉన్నందున వాగు కట్టలు తెగి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాయుడువారిపాలెం, హనుమోజిపాలెం, జరుగులవారిపాలెం, సంతరావూరు పరిధిలో పదిచోట్ల పంట పొలాలకు గండ్లు పడ్డాయి. రహదారులు భారీగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మరో తుపాను హెచ్చరిక నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన వాగు గండ్లు పూడ్చాలని రైతు సంఘ నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. **- ఇంకొల్లు, చినగంజాం, న్యూస్‌టుడే**

జరుగులవారిపాలెం సమీపంలో వాగుకు పడ్డ గండి

ప్రసన్నాంజనేయుడికి వెండి సర్వాంగం బహూకరణ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి ఆదివారం వెండి సర్వాంగాన్ని పట్టణానికి చెందిన మోదడుగు రాంబాబు-ఇందిరాదేవి, కుమారులు వెంకట శ్రీనివాసరావు, ఆంజనేయులు, కుమార్తె నాగాంజలి అందజేశారు. మూడడుగుల ఎత్తు, 1.700 కిలోల బరువు కలిగిన సర్వాంగాన్ని ఆకు పూజా మండపం వద్ద గల ప్రసన్నాంజనేయస్వామికి అందించారు. దీని విలువ సుమారు రూ.3.23 లక్షలని దాత వెల్లడించారు. పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సభ్యులు నూతి ప్రసాద్, వెంకటరత్నం, పద్మజల సమక్షంలో బహూకరించగా, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు రసీదు అందించారు. అనంతరం దాత కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వదించి, స్వామి వారి శేషవస్త్రం సమర్పించారు.

సర్వాంగాన్ని అందజేస్తున్న దాత కుటుంబీకులు

పురాతన రథం వేలంపై భక్తుల అభ్యంతరం

వెనక్కి తగ్గిన దేవాదాయ శాఖ అధికారులు

బాపట్ల, న్యూస్‌టుడే: భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన పురాతన రథాన్ని వేలం పాటలో విక్రయించాలన్న దేవాదాయ శాఖ అధికారుల నిర్ణయంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత రథాన్ని సంరక్షించి ఆలయ ఆవరణలో ప్రదర్శనగా ఉంచాలన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దేశిరాజు వెంకటరమణ బాబు మాట్లాడుతూ రథాన్ని వేలం వేసి విక్రయించాలన్న విషయాన్ని అధికారులు కనీసం చెప్పలేదన్నారు. హడావుడిగా శనివారం వేలంపాట పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయం నుంచి ఈవో కార్యాలయాన్ని మార్చే విషయాన్ని సైతం సమాచారం ఇవ్వకుండా దస్త్రాలు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో దేవాదాయ శాఖ అధికారులు వెనక్కి తగ్గారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాత రథాన్ని వేలం వేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ఈవో రజనీకుమారి ఆదివారం తెలిపారు.

సమాజ సేవా స్ఫూర్తి చాటిన సత్యసాయి

సత్యసాయి బాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని జేసీ భావన అన్నారు. పట్టణంలోని సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం నిర్వహించిన శత జయంతి వేడుకల్లో జేసీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ సత్యసాయి కరువు పీడిత అనంతపురం జిల్లా ప్రజలకు తాగునీరు అందించారన్నారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఎంహెచ్‌వో విజయమ్మ, పీడీలు విజయలక్ష్మి, రాధామాధవి, డీఎస్‌డీవో రాజా దిబోరా, డీఈఎస్ పురుషోత్తం, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దారు సలీమా, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సత్యసాయి బాబా చిత్రపటానికి ఎస్పీ ఉమామహేశ్వర్ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. **- బాపట్ల, న్యూస్‌టుడే**

సత్యసాయి బాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ భావన

బాబా చిత్రపటానికి ఎస్పీ ఉమామహేశ్వర్ నివాళి

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల గ్రామీణ పోలీసులు ఆదివారం పిట్టువారిపాలెం పరిధిలో ఏడుగురు కోడి పందేల నిర్వాహకులను అరెస్టు చేశారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామం పరిధిలోని అడవిలో గుట్టుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందింది. వేటపాలెం ఎస్సై జనార్దన్ ఇతర సిబ్బందితో దాడి చేయగా.. నిర్వాహకులు కోళ్లతో సహా పరారయ్యారు. ఒక కోడి, ఏడుగురు వ్యక్తులతో పాటు రూ.5100, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

జాతీయస్థాయిలో సత్తాచాటాలి

చీరాల, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి జమ్ములో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిడ్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభచూపి విజేతగా నిలవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆకాంక్షించారు. రాష్ట్ర జట్టు జెర్సీలను ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.కొల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు చీరాలలో నిర్వహిస్తే ఎమ్మెల్యే కొండయ్య క్రీడాకారులకు కావాల్సిన వసతులు సమకూర్చారన్నారు. ఇపుడు రాష్ట్రజట్టుకు అవసరమైన జెర్సీలు సొంత ఖర్చుతో అందజేస్తున్నారని తెలిపారు. మాజీ కౌన్సిలర్ అనపర్తి వనజ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

జెర్సీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు

శాస్త్రీయ సమాజ స్థాపనకు ముందుకు రావాలి

చీరాల, న్యూస్‌టుడే: సమాజంలో మూఢనమ్మకాలు పారదోలి శాస్త్రీయ సమాజ స్థాపనకు విద్యార్థులు ముందుకు రావాలని జేవీవీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఆదివారం శ్రీగౌతమి కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. అనంతరం దీనిలో భాగంగా ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి, పరీక్ష నిర్వహించారు. ఇందులో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గౌతమి సంస్థల అధినేత ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.సుబ్బారావు, కె.మాల్యాద్రి, పిచ్చయ్య, సూరిబాబు, శ్రీనివాసరావు, రంగారావు, వరప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 7095718191.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

JOBS

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

Paparao High School K.Uppalapadu, Prakasam (Dt). Wanted High School Telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female) Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. ✆ 7019326579, 9392182210.

జై గణేష్ గ్రూప్ గుంటూరులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (ఆడ/మగ) 34 మెంబర్స్ కావలెను. జీతం: 15000+ PF+ESI. ✆ 96525 42277.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ: 10th, వ:30-65 సం||.7989246788.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్త్ డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలీకాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ|| 10-20K ✆ 83743 25002 & 88858 79076.

చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెనెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్‌వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.

మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

వెలగపూడి విద్యార్థినులు.. అథ్లెటిక్స్‌లో విజేతలు

ఉల్లిపాలెం (నగరం), న్యూస్‌టుడే

అథ్లెటిక్స్ పోటీల్లో నగరం వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల బాలికలు సత్తా చాటుతున్నారు. జిల్లాస్థాయి పోటీల నుంచి జాతీయస్థాయి పోటీల వరకు దూసుకుపోతున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో కళాశాల విద్యార్థినులు పలు బహుమతులు సొంతం చేసుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న వాకా లక్ష్మీ దుర్గ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలంలో నిర్వహించిన అంతర కళాశాలల పోటీల్లో 100 మీటర్ల హార్డిల్స్‌లో ద్వితీయ, హైజంప్‌లో తృతీయ, పది కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగు పందెంలో తృతీయ బహుమతులు గెలుచుకుంది. ఎం.విజయలక్ష్మి పది వేల మీటర్లు, 50 వేల మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకుంది. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపుతున్న బాలికలు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా వారి లక్ష్యాలు పంచుకున్నారిలా..

జాతీయస్థాయిలో బంగారు పతకమే లక్ష్యం

క్రీడలపై ఆసక్తి గుర్తించిన తల్లిదండ్రులు ప్రోత్సహించారు. పాఠశాల స్థాయి ఆటల పోటీల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు దక్కించుకున్నా. ఇటీవల అంతర కళాశాలల పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. మంగుళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా పోటీల్లో పాల్గొన్నా. పూర్తిస్థాయిలో సాధన చేయలేక పోవడం వల్ల విజయం సాధించలేకపోయాను. ఈ ఏడాది జాతీయ స్థాయిలో విజయం సాధించేందుకు గట్టిగా సాధన చేస్తున్నాను. **-ఎం.విజయలక్ష్మి, నగరం**

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే భవిష్యత్తు ఉందని ప్రిన్సిపల్ హరికృష్ణ, వ్యాయామ అధ్యాపకులు సాంబమూర్తి చెప్పిన మాటలు గట్టిగా నమ్మాను. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి అథ్లెటిక్స్ పోటీల్లో సాధన చేయడం ప్రారంభించా. జిల్లాస్థాయి పోటీల్లో విజయాలు సాధించి అంతర కళాశాలల పోటీల్లో పలు బహుమతులు గెలుచుకున్నా. ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకునేందుకు ప్రాక్టీస్ చేస్తున్నా. క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది లక్ష్యం. **-వాకా లక్ష్మీ దుర్గ, నగరం**

25 నుంచి ఏఎన్‌యూ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబుతో కలిసి పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, ఏఎన్‌యూ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. పోటీల అనంతరం ఏఎన్‌యూ జట్టును ఎంపిక చేస్తారన్నారు. అన్ని అనుబంధ కళాశాలల జట్లు పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

పోటీల కరపత్రంతో ప్రిన్సిపల్ నాతాని, పీడీ

కాలువలోకి దూసుకెళ్లిన కారు

చోదకుడిని కాపాడిన అయ్యప్ప భక్తులు

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి ఎన్నెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటన కొమ్మాలపాడు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండకు చెందిన కె.పవన్‌కల్యాణ్ ఒక్కరే కారులో నరసరావుపేట నుంచి ఒంగోలు బయలుదేరారు. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిలో కొమ్మాలపాడు ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువ వంతెన సమీపానికి రాగానే అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి, నిండుగా నీళ్లున్న కాలువలోకి దూసుకెళ్లింది. నీటిలో మునిగిపోతున్న కారును కాలువలో స్నానానికి వెళ్లిన అయ్యప్ప భక్తులు గమనించారు. తక్షణం స్పందించారు. కారులో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసి, ప్రాణాలు కాపాడారు. ముందు భాగం నుజ్జయిన కారును కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోకుండా ఒక అంచుకు చేర్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కారును క్రేన్ సాయంతో బయటకు తీయించారు. కారులోని వ్యక్తిని కాపాడిన అయ్యప్ప స్వామి భక్తులను స్థానికులు అభినందించారు.

కాలువలో పడ్డ కారును బయటకు తీస్తూ..

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

నమూనా అసెంబ్లీకి ఎంపిక

బాపట్ల: రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా అమరావతిలో రాష్ట్ర విద్యా శాఖ ఈ నెల 26న నిర్వహిస్తున్న నమూనా అసెంబ్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులను ఎమ్మెల్యేలుగా ఎంపిక చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి సాధిక్ తెలిపారు. పురపాలక ఉన్నత పాఠశాల ఆయన ఆదివారం మాట్లాడుతూ రాజ్యాంగం, శాసనసభ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు దత్తు, విజయలక్ష్మీ గైడ్ టీచర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను డీఈవో పురుషోత్తం అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో అధికారులు

91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

అక్రమ తవ్వకాలపై ఆందోళన

ఈపూరుపాలెం-స్టువర్టుపురం సరిహద్దుల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

బాపట్ల, న్యూస్‌టుడే: చీరాల- బాపట్ల మండలాల సరిహద్దుల్లో స్టువర్టుపురం-ఈపూరుపాలెం మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తవ్వకాలపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు యంత్రాలతో భారీగా తవ్వి ఇసుక తరలించుకుపోతున్నారు. కేవలం ఇసుక తరలించే ట్రాక్టర్లపై తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలను సీజ్ చేసి తవ్వకాలు చేస్తున్నవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల అందజేత

పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, న్యూస్‌టుడే: ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన కొల్లూరుకు చెందిన చిట్టా నాగలక్ష్మికి రూ. 75,406, చొప్పర నాగరాజుకి రూ. 35,000 దోనేపూడికి చెందిన మట్లపూడి సుధాకర్‌కు రూ. 43,350, ఈపూరుకు చెందిన మొవ్వ సుజాతకు రూ. 1,72,236, బొద్దులూరుపాడుకు చెందిన డొక్కు ఝాన్సీకి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 3,47,992 ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరు పత్రాలను ఆదివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధితులకు అందజేశారు. వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతన్న.. మీ కోసం

నగరం, న్యూస్‌టుడే: రైతులకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతన్న.. మీ కోసం సర్వే ప్రారంభించిందని ఏవో రమేష్ ఆదివారం తెలిపారు. 24 నుంచి 29 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సర్వే చేస్తారన్నారు. అధికారులకు రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో భావితర జీవితం అంధకారం

ప్లాస్టిక్ అనర్థాలు వివరిస్తున్న విద్యార్థులు

బేతపూడి(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం బేతపూడిలో రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ నిర్వహిస్తున్న సేవా శిబిరం ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామస్థులు, దుకాణాల నిర్వాహకులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బదులు వస్త్రాలు, కాగితాలతో చేసిన క్యారీ బ్యాగ్స్, మాంసం తెచ్చుకునేందుకు స్టీల్ బాక్సులు వాడాలని తెలిపారు. వేడి పదార్థాలు ప్లాస్టిక్ సంచుల్లో తెచ్చుకుని తింటే ఆరోగ్యం పాడవుతుందని వివరించారు. సింగిల్ యూసేజ్ క్యారీ బ్యాగ్స్ వినియోగాన్ని తగ్గించకుంటే భావి తరాల భవిష్యత్తు అంధకారమవుతుందని విశదీకరించారు.

పోషకాహారం పంపిణీ

మోపర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే: మోపర్రు ఏఆర్‌సీ వసతి గృహం విద్యార్థులకు దాతలు ఆదివారం పోషకాహారం పంపిణీ చేశారు. చెరుకుపల్లి మండలం కావూరుకు చెందిన పావులూరి రంగారావు జ్ఞాపకార్థం కుమార్తె, అల్లుడు లక్ష్మి, మల్లికార్జునరావు సహకారంతో నెల రోజులకు అల్పాహారంగా సరిపోయే బిస్కెట్లు, శనగలు, బఠానీలు నిర్వాహకులకు అందజేశారు.

ఎదురు వస్తూ.. ప్రమాదాలు కలిగిస్తూ

డివైడర్ ఉన్నా రాంగ్ రూట్‌లో ప్రయాణం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

ఇది పరిస్థితి
రెండు నెలల్లో చోటుచేసుకున్న ప్రమాదాలు : 25
మరణించిన వారు : 3
తీవ్ర గాయాలైన వారు : దాదాపు 10 మంది
స్వల్ప గాయలైనవారు : 12
వైద్య ఖర్చులు : దాదాపు 15 లక్షల వరకు

పోలీస్‌స్టేషన్ ఎదురుగా అపసవ్య దిశలో లారీకి ఎదురు వెళుతున్న కారు

చెరుకుపల్లిలో జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టిన వాహనం

మండల కేంద్రం చెరుకుపల్లిలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిబంధనలు అతిక్రమించే వారికి జరిమానాలు, తీవ్రతను బట్టి కేసులు నమోదు చేస్తాం.. ఇటీవల చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ చేయడానికి వచ్చిన సమయంలో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో చెప్పిన మాటలు. ఆయన వచ్చి వెళ్లిన తర్వాత మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీస్‌స్టేషన్ ఎదురుగానే అపసవ్య దిశలో వచ్చిన టాటా ఏసీ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి.

★ చెరుకుపల్లి కొత్తపేట నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా గుళ్లపల్లి, పొన్నపల్లి వరకు దాదాపు 2.5కి.మీ మేర జాతీయ రహదారిపై అధికారులు డివైడర్ ఏర్పాటు చేశారు. వీటికి మధ్యలో ఐదు చోట్ల మాత్రమే 'యూటర్న్' సదుపాయం కల్పించారు. దీంతో వాహనదారులు చుట్టూ తిరిగి రావడం ఎందుకని అపసవ్య దిశలో ప్రయాణిస్తున్నారు. అది కూడా డివైడర్‌కు ఆనుకుని వచ్చే వాహనాలకు ఎదురుగా వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం నిబంధనలకు విరుద్ధం. అయినా ఇలాగే బైకులు, ఆటోలు, కార్లు కూడా అడ్డదిడ్డంగా ప్రయాణిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులైన వారు గాయాల పాలై వారు వైద్య ఖర్చుల చెల్లింపులతో కుదేలవుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే మీతో పాటు ఎదురుగా వచ్చే వారికి ప్రమాదమే. దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. నిత్యం వాహనాల చెకింగ్ నిర్వహించి అలా వచ్చే వారికి అపరాధ రుసుము విధిస్తున్నాం.

-టి.అనిల్‌కుమార్, ఎస్సై, చెరుకుపల్లి

ఆరోగ్యమే మహాభాగ్యం

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బాపట్ల, న్యూస్‌టుడే: ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి ప్రతి ఒక్కరూ సంతులిత ఆహారం తీసుకుని, శారీరక వ్యాయామం చేయాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. ముప్పలనేని శేషగిరిరావు ఫౌండేషన్, కిమ్స్ శిఖర ఆసుపత్రి ఆధ్వర్యంలో కమ్మజన సేవా సమితి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేసి ఔషధాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక ఆహార అలవాట్లు, జీవనశైలి ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా ఆపాలన్నారు. ఏటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించటానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఏకాగ్రతతో చదివితే విజయాలు

స్వాగత వేడుకల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: తరగతిలో అధ్యాపకులు చెప్పే పాఠాలు ఏకాగ్రతతో విని కష్టపడి చదివితే విద్యార్థి జీవితంలో విజయం సాధిస్తారని ఏజీ కళాశాల ఏడీ ప్రసూనరాణి అన్నారు. కళాశాలలో ఏజీ బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కళాశాల విద్య విద్యార్థుల మధ్య పరస్పర అంతర్గత అనుబంధం పెంపొందించుకునే గొప్ప వేదికన్నారు. సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహ భావన పెరిగేలా తమ నడవడికను మలుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు పాటించటం ద్వారా ఉత్తమ విద్యార్థులుగా నిలవాలన్నారు. ఆచార్యులు ఎస్ఆర్ కోటేశ్వరరావు, లాల్ అహమ్మద్, శ్రీరేఖ, సంధ్య పాల్గొన్నారు.

సినీ దర్శకుడు అనిల్ రావిపూడి పుట్టినరోజు వేడుక

చిలుకూరివారిపాలెం(యద్దనపూడి): ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి పుట్టినరోజు వేడుకను ఆదివారం యద్దనపూడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు కేక్‌లు కోసి, ప్రజలకు పంచారు. యద్దనపూడి, మార్టూరు ప్రాంతాలకు చెందిన పలువురు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు హైదరాబాద్ తరలివెళ్లారు. వేడుకల్లో తండ్రి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు.. జరిమానా

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: వినియోగదారులకు నష్టం కలిగించేలా తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పర్చూరు, కారంచేడులోని పలు మాంసం దుకాణాల్లో తూకాలను అధికారులు తనిఖీ చేశారు.

ఈదులమ్మ తల్లికి పూజలు

పూజలందుకున్న ఈదులమ్మ తల్లి

బేతపూడి (బాపట్ల టౌన్), న్యూస్‌టుడే: బేతపూడి గ్రామదేవత ఈదులమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఐశ్వర్య దేవిగా బండ్లమ్మ

చందోలు (పిట్టలవాని పాలెం) : చందోలు బండ్లమ్మ అమ్మకు మార్గశిర మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణ ద్రవ్యాలతో బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా ఐశ్వర్యదేవిగా దర్శనమిచ్చారు. పిట్టలవాని పాలెం, గోకరాజు నర్సోజీవారిపాలెంలోని శ్రీబండ్లమ్మ వార్లకు పూజలు నిర్వహించారు.

భక్తానుగ్రహదాయినిగా అల్లూరమ్మ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మ అమ్మవారు మార్గశిర మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'భక్తానుగ్రహదాయిని'గా భక్తులకు దర్శనమిచ్చారు.

విజ్ఞానయాత్రకు అమృతలూరు విద్యార్థులు

బస్సు ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు

అమృతలూరు: అమృతలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా 65మంది 9వ తరగతి విద్యార్థులు రెండు బస్సుల్లో బయలుదేరారు. ఉండవల్లి గుహలు, రాజధాని ప్రాంతంలోని సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, అమరావతి మ్యూజియం తదితర ప్రాంతాలను విద్యార్థులు సందర్శించారని ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు తెలిపారు.

సత్యసాయి శతజయంత్యుత్సవం

అమృతలూరు, రేపల్లె అర్బన్, వేమూరు, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అమృతలూరు గోవాడ గీతా సాయి మందిరంలో స్వామికి సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రేపల్లె సత్య సాయి ఆలయంలో తెదేపా నేత అనగాని సత్య ప్రసాద్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సత్య వాక్కులు వివరించారు. వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవి సత్య సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పూజల్లో తెదేపా నేత అనగాని శివప్రసాద్

సత్య సాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రవి

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయం

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం అరవింద్ అశ్రమంలో గల సత్యసాయి ఆరోగ్య మల్టీస్పెషాలిటీ వైద్యశాలలో శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి 2026 జనవరి నుంచి జీవిత కాలం ఏటా రూ.లక్ష చొప్పున విరాళం ఇస్తానన్నారు. వైద్యశాలకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ముందుగా జ్యోతి వెలిగించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వైద్యశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

వ్యర్థాలతో ఇబ్బందులు

అమృతలూరు ఆరో వార్డు రహదారి అంచున చెరువు గట్టుపై గృహ వ్యర్థాలు పడేస్తుండటంతో స్థానికులకు ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు. వ్యర్థాల నుంచి దుర్గంధం వస్తుందని అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, అమృతలూరు**

ప్రమాదాన్ని తవ్వి వదిలేశారు

చుండూరులో గ్రంథాలయం దగ్గర నుంచి బీబీఆర్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారిలో నీటి సమస్య కారణంగా ఈ రోడ్డులో ప్రధాన కూడలి, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద చాలా కాలం క్రితం రహదారిని పగులగొట్టారు. మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్య గురించి ఇటు పంచాయతీ రాజ్ శాఖ, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మరియదాసు మాట్లాడుతూ పరిశీలించి, పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, చుండూరు**

రహదారిపై ముళ్ల కంప తొలగించరూ!

మండలంలోని రెడ్డిపాలెం కూడలి నుంచి కోమలి వెళ్లే ప్రధాన రహదారిపై భవనంవారిపాలెం శివారులో ముళ్ల కంప వేయడంతో ప్రమాద భరితంగా ఉంది. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో రోడ్ల పక్కన కొట్టిన ముళ్ల కంపను తీసుకువచ్చి రహదారిపై వేశారు. వందలాది వాహనాలు ఈ రహదారిపై వెళ్తుంటాయి. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ముళ్ల కంపను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

వరద నీటిలోనే పంట పొలాలు

దోనేపూడి వద్ద కరకట్ట పక్కన పొలాల్లో నిలిచిన నీటిలో విద్యుత్తు మోటారు షెడ్డు

కొల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా నది వరదలు తగ్గి 20 రోజులు దాటినా కొల్లూరు, దోనేపూడి సమీపంలోని కరకట్ట పక్కన ఉన్న వందల ఎకరాల పల్లపు పొలాలు ఇప్పటికీ పది అడుగుల లోతు వరద నీటిలోనే ఉన్నాయి. వీటిని బయటకు పంపే అవకాశం లేక పోవడంతో ఇవి భూమిలో ఇంకి పోవడం తప్ప మరో దారి లేకుండా పోయింది. తొలకరిలో సాగు చేసిన అరటి, పసుపు కంద తదితర పంటలు వదర పాలైనా రెండో పంట వేసుకుని నష్టాన్ని భర్తీ చేసుకుందామనుకున్న అన్నదాతలు నీరు తగ్గి పొలాలు ఎప్పుడు బయట పడతాయా అని ఎదురు చూస్తున్నారు.

దుద్దుకూరులో నేత్రదానం

దుద్దుకూరు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 717వ నేత్రదానం జరిగింది. దుద్దుకూరుకు చెందిన కటారి శ్రీలక్ష్మమ్మ(90) ఆదివారం మృతిచెందారు. రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు ఎస్.రామమోహనరావు, జెట్టి స్వామిలు శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి, మృతురాలి కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు ఆంజనేయులు, తిరుమలరావు, భాస్కరరావులను రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, నాగేశ్వరరావు అభినందించారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదమే

రోడ్డు మధ్యలో పగుళ్లు

బేతపూడి, (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పెనుమూడి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. 2016 కృష్ణా పుష్కరాల సందర్భంగా తెదేపా ప్రభుత్వ పాలనలో రోడ్డు నిర్మాణం చేశారు. భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు చేయడంతో కాలక్రమేణా రోడ్డుపై కొంతభాగం నిలువుగా పగిలింది. గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యం వహించిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. కూటమి పాలనలోనైనా రోడ్డును అభివృద్ధి చెందుతుందని ఎదురు చూస్తున్నారు.

తుపాను గాయం.. అందని సాయం

వరిపైర్లు నాశనమైనా పరిహారానికి నమోదు చేయని అధికారులు

బేతపూడి, అప్పికట్ల, కేబీపాలెం, (బాపట్ల టౌన్) న్యూస్‌టుడే

ముంపునకు గురై కుళ్లిపోయిన వరిపైరు

ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా బాపట్ల నియోజకవర్గంలో పెద్దగా పంటలు ముంపునకు గురై నష్టం జరగలేదు. కొన్ని పొలాలు ముంపునకు గురైనా త్వరగా కోలుకున్నాయి. తుపాను వచ్చేనాటికి పైర్లు పెరిగి ఈనే దశలో ఉన్నాయి. కానీ బేతపూడి, చీరాల మండలం బోయినవారిపాలెం గ్రామాల పరిధిలో పొలాల్లో తుపాను ముందు నాట్లు వేశారు. దీంతో పొలాల్లో పైర్లు ప్రాథమిక దశలో ఉన్నాయి. ఈనేపథ్యంలో వర్షానికి దాదాపు రెండు గ్రామాల పరిధిలో సుమారు నాలుగు వందల ఎకరాల్లో పంట వరద ముంపునకు గురైంది. 200 ఎకరాలు పూర్తిగా వరి పైర్లు చనిపోగా, 200 ఎకరాల్లో 50 శాతం దెబ్బతిన్నాయి. పూర్తిగా పైర్లు దెబ్బతిన్న రైతులు మళ్లీ నారుకు విత్తనాలు చల్లారు. పైరు 50 శాతం దెబ్బతిన్న రైతులు నారు కొనుగోలు చేసి చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేశారు. అధికారులను పంట నష్ట పరిహారానికి నమోదు చేయమని అడిగినా నమోదు చేయడం లేదని స్థానిక రైతులు తెలిపారు.

రూ.18000 వేలు నష్టం: బాలకృష్ణ

తుపాను కారణంగా రూ.18000 నష్టం వచ్చింది. తుపాను ముందు నాటిన చేను ముంపునకు గురై ఎకరం పొలంలో నారు చనిపోయింది. మళ్లీ నారు కొనుగోలు చేసి నాటితే రూ.13వేలు ఖర్చు అదనంగా అయింది. ప్రస్తుతం నాటు వరకే సుమారు రూ.28వేలు ఖర్చైంది. ప్రస్తుతం బేతపూడి రైతులకు సాగునీటి సమస్య ఉంది.

సాగు చాలా ఆలస్యం అయింది : సాంబిరెడ్డి

ఈ ఏడు తుపాను వల్ల వ్యవసాయం చాలా ఆలస్యం అయింది. కొన్ని చోట్ల కోతలు కోస్తుంటే బేతపూడి రైతులు రెండోసారి విత్తనాలు చల్లుతున్నారు. నాకున్న 90 సెంట్లు దెబ్బతింది. రైతులు పొలాలు దెబ్బతిన్నాయని పంచాయతీ కార్యాలయంలో చెప్పినా ఎవరూ నష్టపరిహారం రాయలేదు. బేతపూడిలో పైర్లు దెబ్బతిన్నాయని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భవనంవారిపాలెం(పిట్టలవాని పాలెం), న్యూస్‌టుడే : మండలంలోని 216 జాతీయ రహదారిపై రెడ్డిపాలెం కూడలి వద్ద ద్విచక్ర వాహనం కారును ఢీ కొట్టడంతో భవనంవారిపాలేనికి చెందిన కలకోట రామకోటిరెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్సై శివకుమార్ తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ రేపల్లె సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.23/2022 in O.S.116/2006
Between:
ది భారతి హ్యాండ్‌లూమ్స్ రామకృష్ణపురం, చీరాల
Rep by as Propritor కాటూరి దుర్గా ప్రసాద్ ...డిక్రీ హోల్డర్
and
కొండా శ్రీరామకృష్ణ ...జడ్జిమెంట్ డెటార్

పై నంబరు E.P. 23/2022 లో జడ్జిమెంట్ డెటార్‌కు చెందిన ఈ దిగువ షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని పై నంబరు OS 116/2006 డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై కోర్టులో శ్రీ కోర్టు వారిచే ది.8-12-2025న ఉదయం గం. 10.30 ని॥లకు బహిరంగ వేలం పాట నిర్వహించి అమ్మకం చేయబడును. కావున కావలసినవారు సదరు వేలం పాటలో పాల్గొని కొనుగోలు చేసుకొనవచ్చును.
షెడ్యూలు: గుంటూరు డిస్ట్రిక్టు (ప్రస్తుతం బాపట్ల డిస్ట్రిక్టు), భట్టిప్రోలు సబ్ డిస్ట్రిక్ ఐలవరం గ్రామ పంచాయితీ ఏరియా అద్దేపల్లి గ్రామం D.No. 779/4A Ac. 2.00 మాగాణి భూమిలో Ac. 1.00 మాగాణి భూమికి హద్దులు.
తూర్పు: మాచర్ల రామస్వామి గారి పొలం హద్దు, దక్షిణం: పంట నీరు రైతు హద్దు, పడమర: ఐలవరం కాలువ హద్దు, ఉత్తరం: గీరుట్ల చిన రెడ్డియ్య గారి పొలం హద్దు. పై నాలుగు హద్దుల మధ్య Ac. 1.00 మాగాణి భూమి మాత్రం వేలం వేయబడును.
E.C. దాఖలు అన్యాక్రాంతములు ఏమి లేవు.
D.Hr. విలువ: 10,00,000/-
కోర్టు అమీనా విలువ: 12,50,000/-
వేలం తేదీ: 8-12-25
ఫర్‌దర్ హియరింగ్: 15-12-25
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.
T. శారద, దాసరి శ్రీవల్లి
DHR తరపు న్యాయవాదులు, రేపల్లె

ఇసుకపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానం

ఇసుకపల్లి (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే

మురుగు కాలువ దుస్థితి

ఆధ్యాత్మిక నిలయమైన ఇసుకపల్లి ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామ దేవత వేపాళమ్మ, చెన్నమల్లేశ్వర స్వామి, అయ్యప్పస్వామి, సాయి బాబా గుడి, లూథరన్ టౌన్ చర్చి తదితర దేవాలయాలకు నిలయం. ఇక్కడ మురుగు కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. రేపల్లె పట్టణాన్ని స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దేందుకు 140 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. అయితే వీరిలో 15 మందికిపైగా మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వార్డుకు నలుగురు చొప్పున విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారులు, వీధులు శుభ్రం చేయడం, ఇంటింటా చెత్త సేకరణకు పరిమితం అవుతున్నారు. 28 వార్డుల్లో ఒకరు చొప్పున మురుగు కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు తొలగించాల్సి వస్తోంది.

★ కాలువల్లోని వ్యర్థాలు నిత్యం తొలగించక పారుదలకు అవరోధంగా మారుతోంది. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. వాటి కాటుకు గురైన ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. గత నెలలో వచ్చిన తుపాను కారణంగా భారీవర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని నేటికీ పూర్తిగా తొలగించక పోవడమే అందుకు తార్కాణమని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. అయినా ఇప్పటి వరకు నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించడం, మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించలేదు. ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం చేస్తున్నారు. నాయకుల పర్యటనలు చేసేప్పుడు రోడ్ల పక్కన సున్నం చల్లించి చేతులు దులుపుకొంటున్నారు.

ప్రత్యేక దృష్టి: పట్టణంలో పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నం కాకుండా దృష్టి సారించాం. ఎక్కడా వ్యర్థాలు పేరుకోకుండా, కాలువలు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాం. దోమల నిర్మూలన జరిగేలా సన్నాహాలు చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటితో పాటు మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేసేలా చర్యలు తీసుకుంటాం. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు అధికారులకు సహకరించాలి.

-శామ్యూల్, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి

నరక ప్రయాణం

గోవాడలో గుంతలు పడిన ఆర్‌అండ్‌బీ రహదారి

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: అమృతలూరు-గోవాడ ఆర్ అండ్‌బీ రహదారి గుంతలు పడి ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తెనాలి నుంచి చెరుకుపల్లి, రేపల్లె, బాపట్ల, చీరాల వెళ్లేందుకు నిత్యం ఇటుగా పదుల సంఖ్యలో పెద్ద వాహనాలు, బస్సు సర్వీసులు, కార్లు, ఆటోలు, వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిని అభివృద్ధి చేయాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ మాట్లాడుతూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అభివృద్ధికి రూ. 2.5కోట్లు కేటాయించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. రహదారి అభివృద్ధితో వాహనచోదకుల, ప్రయాణీకుల వెతలు తీరనున్నాయి.

శిథిల భవనం తొలగించండి

భవనంపై ఉన్న మర్రి చెట్టు

అప్పికట్ల (బాపట్లటౌన్) న్యూస్‌టుడే : మండలంలోని అప్పికట్ల గ్రామంలో (సచివాలయం పక్కన పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం అందులో కార్యకలాపాలు నిర్వహించడం లేదు. భవనంపై మర్రి చెట్లు మొలిచాయి. గ్రామంలో ఇలాగే ప్రాథమిక పాఠశాల భవనం కూడా ఉంది. అవి కూలి ఎలాంటి ప్రమాదాలు సంభవించకముందే వాటిని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ జీడిపప్పు దినోత్సవం

వేటపాలెం, న్యూస్‌టుడే: జాతీయ జీడిపప్పు దినోత్సవాన్ని అనంత భారత్ క్యాష్యూ ఉత్పత్తి దుకాణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో దీర్ఘకాలికంగా సేవలందించిన షేక్ గాలీబ్ షరీఫ్, జీడిపప్పుతో మాలలు, బొకేలు తయారు చేసి ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన సత్యాల సత్యానందంను షాపు యజమాని ప్రత్తి వెంకటసుబ్బారావు సత్కరించారు. శరత్‌బాబు, నాగాంజనేయులు పాల్గొన్నారు.

కూరగాయలు కొనేందుకు వచ్చి వ్యక్తి మృతి

మార్టూరు, న్యూస్‌టుడే: చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామానికి చెందిన సోమేపల్లి శ్రీనివాసరావు(60) ఆదివారం మార్టూరు మార్కెట్‌కు కూరగాయలు కొనేందుకు వచ్చి, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించిన ఫలితం లేక పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి అతడి వివరాలు తెలుసుకొని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

సినీ దర్శకుడు అనిల్ పుట్టినరోజు వేడుక

చిలుకూరివారిపాలెం (యద్దనపూడి), న్యూస్‌టుడే: ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి పుట్టినరోజు వేడుకను ఆదివారం యద్దనపూడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు కేకులు కోసి, ప్రజలకు పంచారు. యద్దనపూడి, మార్టూరు ప్రాంతాలకు చెందిన పలువురు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు హైదరాబాద్ తరలివెళ్లారు. వేడుకల్లో తండ్రి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో తండ్రి బ్రహ్మయ్యతో రావిపూడి

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి

కారంచేడు, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ మొయిన్ సూచించారు. ఆదివారం కారంచేడు పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాహనాలు నడిపే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. డీఎస్పీకి కేసుల వివరాలను ఎస్సై ఖాదర్‌బాషా వివరించారు. సీఐ వై.వి రమణయ్య ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

తొలగని చెత్త... కదలని మురుగు

చెరుకూరు(పర్చూరు), న్యూస్‌టుడే: మండలంలో మేజర్ పంచాయతీ చెరుకూరులో చెత్త తొలగక.. మురుగు కదలక పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించిన సైడ్ కాలువల్లేక వర్షాల సమయంలో మురుగు నిలుస్తోంది. ఎస్టీ కాలనీ సమీపంలో రోడ్డు మీద, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో చెత్తాచెదారం పడేస్తున్నారు. చెత్తసంపద కేంద్రం ఉన్నా అక్కడికి తరలించడంలేదు. ఫలితంగా దుర్గంధం వెదజల్లుతుండగా మరోవైపు కుక్కలు రోడ్డుపైకి ఈడ్చుకొస్తున్నాయి. గ్రామంలో మొత్తం 14 వార్డుల్లో 6333 మంది జనాభా ఉండగా సుమారు 2015 గృహాలు, 1200 మంచినీటి కుళాయిల కనెక్షన్లు, రెండు సచివాలయాలు ఉన్నాయి. గ్రామంలోని విద్యుత్తు దీపాలు రేయింబవళ్లు వెలుగుతున్నాయి.

గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి మురుగు

• గ్రామంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని రూ.29లక్షలతో 2011లో నిర్మించారు. ప్రస్తుతం దీనిలో 3 నుంచి 10వ తరగతి వరకు 76 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు, స్నానాల గదులు, మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం సుమారు రూ.33 లక్షల నిధులను గతేడాది విడుదల చేసింది. గుత్తేదారు సకాలంలో నిర్మించకపోవడంతో విద్యార్థులు ఆరు బయటకు కాలకృత్యాలకు వెళుతుండగా గృహంలోని వంటగది పక్కనే ఉన్న పంపుల వద్ద స్నానాలు చేస్తున్నారు. రాత్రి సమయంలో అత్యవసరమైతే పూర్తికాని మురుగుదొడ్లకు వెళ్లక తప్పడం లేదని విద్యార్థులు తెలుపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి మొక్కలు బాగా పెరిగి, విషపురుగులకు ఆవాసంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి, వసతి గృహంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విఘ్నేశ్వర కాలనీలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

పదేళ్లుగా.. అలంకారప్రాయంగా

దేశాయిపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీతో పాటు శారదా కాలనీలో నివసిస్తున్న సుమారు 500 కుటుంబాలకు రక్షిత నీరు అందించేందుకు అధికారులు పదేళ్ల క్రితం రూ.45 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. ఆనుమల్లిపేట ప్రాంత ప్రజలకు తాగునీరు అందిస్తున్న బావుల నుంచి నీరు అక్కడికి మళ్లించేందుకు రైల్వే ట్రాక్ వెంట పైపులైన్లు వేశారు. నీటిని పంపింగ్ చేయడానికి సంతరావూరు రైల్వేగేటు పక్కన పంప్ హౌస్ ఏర్పాటు చేశారు. ఇసుకను యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలించడంతో అప్పుడు పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో వాటిని బాగుచేసి, నీటిని సరఫరా చేయడానికి గ్రామీణ నీటిపారుదల శాఖాధికారులు ఆరేళ్ల క్రితం ప్రణాళికలు సిద్ధం చేశారు. బావుల్లో నీరు తక్కువగా ఉండటంతో పంపింగ్ ప్రక్రియను నిలుపుదల చేసి, చీరాల మండలం కొత్తపాలెంలో బావులు ఏర్పాటు చేసి, పైపులైన్ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌కి మళ్లించేందుకు రూ.90 లక్షలతో మళ్లీ ప్రతిపాదనలు తయారుచేసి పంపారు. అంతే ఆనాటి నుంచి నేటి వరకు ఆ ప్రక్రియ ముందుకు కదల్లేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.నాగరాజు దృష్టికి 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నిధులున్నాయన్నారు. నీటి లభ్యత గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని, త్వరలో ఇది పూర్తవుతుందన్నారు.

తాగునీటికి తప్పని ఇబ్బందులు: ఈ ప్రాంతవాసులు తాగునీటికి పడే ఇబ్బందులు వర్ణనాతీతం. చేతి పంపులున్నా తాగేందుకు ఉపయోగపడవు. ఫలితంగా శుద్ధజలాలు కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తాగునీటి కోసం నిత్యం రూ.20 వరకు వ్యయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వచ్చే వేసవి నాటికైనా పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? కారంచేడు గేటు వాటర్ ట్యాంకు బస్సు పాయింట్ వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉంటుంది. ఇక్కడ నిలబడాలంటే ఇబ్బందిగా ఉంటుంది. - **శామ్యూల్** ✔ ట్యాంకు నుంచి లీకవుతున్న నీరు వల్ల కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. సిబ్బందిని పంపి పరిష్కరిస్తాను. - **ప్రవీణ్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, చీరాల**

? బద్రిరాజు తోటలో వారం రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించడంలేదు. దుర్వాసన వస్తోంది. - **శ్రీను, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి వెంటనే అక్కడ బాగుచేయిస్తా. - **బాలిగ సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం – న్యూస్‌టుడే, వేటపాలెం**

చెత్త తొలగింపు.. చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని హరిప్రసాదునగర్ పోలేరమ్మ ఆలయం పక్కన మురుగుకాలువలో చెత్త పేరుకుపోయింది. పొదలలో పెంచి దుర్వాసన వస్తోందని ఆ ప్రాంతవాసులు 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి శుక్రవారం తీసుకొచ్చారు. దీనికి స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి అక్కడ చెత్తను తొలగింపజేశారు.

స్పందనకు వందనం

వెలిగిన దీపం.. చినగంజాం, న్యూస్‌టుడే: స్థానిక సుందరయ్య కాలనీలోని వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బందిగా ఉందని స్థానికులు సమస్యను ఈ నెల 20న 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తేగా ప్రచురితమైన కథనానికి గ్రామ కార్యదర్శి కె.అంజయ్య స్పందించారు. గ్రామ ఒప్పంద కార్మికుడు ఏసోబును పంపించి విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయించి, వెలిగేలా చేసి, సమస్యను పరిష్కరించారు.

నిత్యం రద్దీ.. నిర్వహణ ఏదీ?

216ఏ జాతీయ రహదారి తీరిది

ఈపూరుపాలెం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే

తీరంలో 216ఏ జాతీయ రహదారి ఎంతో కీలకమైన మార్గం. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల మీదుగా ఒంగోలు వరకు ప్రయాణాన్ని సులభతరం చేసింది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా.. ఎన్‌హెచ్ అధికారులు దీని నిర్వహణపై అంతగా శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

ఇవీ సమస్యలు

✦ ఈపూరుపాలెం-స్టువర్టుపురం మధ్య ఉన్న కూడలి వద్ద హైమాస్ట్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి. రాత్రి పూట కూడలి వద్ద ప్రమాదాలు పెరుగుతున్నాయి. 20 రోజుల క్రితం ద్విచక్ర వాహనం కారును ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఉభయ పక్షాల మధ్య రాజీ కుదరడంతో విషయం పోలీసుల వద్దకు వెళ్లలేదు. వారం క్రితం లారీ ఇదే కూడలి వద్ద బోల్తా పడి దెబ్బతింది. అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణాపాయ కలగలేదు. ఇలా పోలీసుల దృష్టికి రాని ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. గతంలో చాలా కేసులు నమోదయ్యాయి. ✦ ఇదే దారిలో కుందేరు వంతెన వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్ ప్రమాదవశాత్తు వాహనం ఢీకొనడంతో దెబ్బతింది. దీంతో రాత్రి పూట ప్రమాదం పొంచి ఉంది. వంతెన వద్ద గుంతలు పడిన చోట ఇటీవల అధికారులు బీటీ రహదారిగా అభివృద్ధి చేసినా.. రెయిలింగ్ సరిచేయడం లేదు. ✦ జాతీయ రహదారిపై ఇరువైపులా రెయిలింగ్ ఉన్న చోట్ల ఇసుక మేటలు వేసి ఉంది. ఇటీవల దీన్ని గుర్తించిన అధికారులు ఇసుకను కువ్వలు చేసి, తొలగించకుండా అక్కడే వదిలిపెట్టారు. అంచుల్లో ప్రయాణించే వాహనాలు రాత్రి పూట అదుపు తప్పి జారిపడే ప్రమాదం ఉంది. కూడలిలో నిర్మించిన ప్లాట్‌ఫారాలు వాహనాల తాకిడికి దెబ్బతింటున్నాయి. ✦ ఈ రహదారిని నాలుగు వరుసలుగా మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించి, ఈమేరకు డీపీఆర్ దిశగా సాగుతుండగా.. కొందరు రోడ్డు అంచుల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించడం లేదు. అధికారులు ఈ రహదారిలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఈపూరుపాలెం కుందేరు వద్ద దెబ్బతిన్న రెయిలింగ్

ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలను అభివృద్ధిలో ముందుంచుదాం

బోసునగర్ (చీరాల), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని, చీరాలలోనూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. పార్టీ పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కలిసి చీరాలను అభివృద్ధిలో ముందుంచుదామన్నారు. అనంతరం అధ్యక్షుడిగా డి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా మామిడాల సుబ్బారావు, ఇతర బాధ్యులచేత ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. సురేష్‌ను వివిధ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, సజ్జా హేమలత, నాగేంద్రమణి, పురుషోత్తం, సీతారామాంజనేయులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ కుంట వైపు వెళ్లొద్దు

వెంపరాల కొండ దిగువ గోతిలో నిలిచిన నీరు

మండలంలోని వెంపరాల కొండ దిగువన మట్టి తవ్వకాలు జరపగా ఏర్పడిన కుంట ప్రమాదకరంగా ఉంది. మొంథా తుపాను ప్రభావంతో సుమారు 10 అడుగుల లోతు గల గుంతలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. గేదెలు, మేకలు పొలాలకు తోలుకెళ్లిన యువకులు ఇలాంటి కుంటల్లో ఈత సరదా కోసం దిగితే ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉంది. తక్షణం గుంత చుట్టూ హెచ్చరిక బోర్డులు ఉంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, వెంపరాల (అద్దంకి)**

సామాజిక భవనానికి మరమ్మతులు పూర్తి

ఎన్టీఆర్‌నగర్ (అద్దంకి), న్యూస్‌టుడే: అద్దంకి ఎన్టీఆర్ నగర్‌లో అసంపూర్తిగా, శిథిల స్థితికి చేరిన సామాజిక భవనానికి మరమ్మతులు పూర్తి చేశారు. స్థానికుల విరాళాలు రూ.12 లక్షలతో భవనం మరమ్మతులు పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేశారు.

ఆర్వోబీపై గుంతలతో అవస్థలు

ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుంచి ఏర్పాటు చేసిన ఆర్వోబీపై నుంచి హరిప్రసాదునగర్‌కి వెళ్లడానికి మలుపు తిరిగే సమయంలో తారు లేచి, గుంతలు ఏర్పడ్డాయి. ఆ దారిలో వెళ్లే ప్రతి ద్విచక్రవాహనదారుడు అక్కడికి వచ్చేసరికి ఆగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు ఇవి కనపడక వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, కారంచేడు గేటు(చీరాల అర్బన్)**

గాడిలో పడితే గతి తప్పినట్టే!

కశ్యాపురం వద్ద రోడ్డు దుస్థితి

అద్దంకి నుంచి రేణింగవరం వెళ్లే రోడ్డులో కశ్యాపురం సమీపంలో లోతైన వంతెన వద్ద రోడ్డు మధ్యలో చీలడంతో ద్విచక్ర వాహన చోదకులు రాత్రి సమయంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి ఇక్కడ మరమ్మతులు చేసి, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, జె.పంగులూరు**

పెచ్చులూడి.. ప్రమాదకరంగా మారి

దగ్గుబాడు గ్రామంలో 31 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఈ పథకం కింద తమ గ్రామంతో పాటు ఇంకొల్లు మండలం గొల్లపాలెం వరకు నీటి సరఫరా జరుగుతోందని ప్రజలు తెలుపుతున్నారు. ట్యాంకు పిల్లర్లు మొత్తం పగుళ్లిచ్చి ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదభరితంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్రను వివరణ కోరగా ట్యాంకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపామని, నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు. – **న్యూస్‌టుడే, దగ్గుబాడు (కారంచేడు)**

ఇనుప చువ్వలు బయటపడిన వాటర్ ట్యాంకు పిల్లర్లు

నామఫలకం కూలింది.. పక్కన పెట్టేశారు!

సంతరావూరు జడ్పీ ఉన్నత పాఠశాల నామఫలకం (నేమ్ బోర్డు) మొంథా తుపాను సమయంలో గాలికి కూలిపోగా, పక్కన పెట్టారు. ఇందులో 140 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులున్నారు. గతంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండగా ఈ విద్యా సంవత్సరం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాలగా మారింది. ఇది గ్రామం నడిబొడ్డున ఉంది. పాఠశాలకు మంచి పేరుండగా నామఫలకం కూలితే సకాలంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రజలు అంటున్నారు. వెంటనే ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం సత్యానందం, ఎంఈవో అజయ్‌బాబులను వివరణ కోరగా త్వరలో నేమ్ బోర్డును ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. – **న్యూస్‌టుడే, సంతరావూరు (చినగంజాం)**

గోడ పక్కన నామఫలకం

నియంత్రికల్ని చుట్టేసిన మొక్కలు

విద్యుత్తు నియంత్రికలను మొక్కలు చుట్టేశాయి. ఈ దృశ్యం మండలంలోని వెంపరాలలోనిది. వ్యవసాయ మోటార్లు అధికంగా ఉన్న ఈ గ్రామంలో నియంత్రికల సంఖ్య ఎక్కువే. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల్లో వీటిని రైతులు ఉపయోగించుకుంటున్నారు. వివిధ మొక్కలు వీటిని చుట్టేసినపుడు మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. తరచూ విద్యుత్తు అంతరాయాలకు ఇవే కారణంగా రైతులు భావిస్తున్నారు. – **న్యూస్‌టుడే, వెంపరాల (అద్దంకి)**

దాత వెంకన్నకు ఘన నివాళి

తిమ్మసముద్రం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: సంస్కృత కళాశాల వ్యవస్థాపకుడు, మహాదాత గోరంట్ల వెంకన్న వర్ధంతిని ఆదివారం స్థానిక వెంకన్న ట్రస్టు కార్యాలయంలో నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ గోరంట్ల పెద వీరయ్య దంపతులు పాల్గొన్నారు. సంస్కృత కళాశాల, జీవీ పాఠశాలల విద్యార్థులు వెంకన్న చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కళాశాల పూర్వవిద్యార్థుల ఒకచోట కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాల పూర్వవిద్యార్థి, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అష్టావధానం అలరించింది. విద్యార్థులు గురువులను సత్కరించారు. పండిత సదస్సు నిర్వహించారు. సాయంత్రం ఉత్తమశ్రేణి విద్యార్థులకు బహుమతి ప్రదానం, కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాస్, అతిథులు హేమంత్, శేషగిరిరావు, రాంబాబు, రఘుకుమార్, చినరామయ్య పాల్గొన్నారు.

వెంకన్న చిత్రపటంతో విద్యార్థుల ఊరేగింపు

వేటపాలెంలో పేదలకు వస్త్రాలు అందజేస్తున్న దాతలు

అద్దంకిలో బాబా చిత్రపటంతో ఊరేగింపు

సత్యసాయి సిద్ధాంతాలు ఆచరణీయం

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర పర్వదినంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకురావడం శుభపరిణామమని, బాబా సిద్ధాంతాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని చీరాల, వేటపాలెం బాబా మందిరాల కన్వీనర్లు ఆంజనేయులు, రామిశెట్టి నరసింహారావు, పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.లవన్న పేర్కొన్నారు. ఆదివారం బాబా శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నగర సంకీర్తన, బాబా తాకిన శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. పేదలు, పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రదానం చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవ చేశారు. ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబు పాల్గొన్నారు

✦ అద్దంకి కొత్తపేటలోని సాయిబాబా మందిరం నుంచి స్వామివారి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది. కన్వీనర్ చిన్ని శ్రీహరిరావు, చిన్ని హనుమ, నాగసూరి రమేష్‌బాబు పర్యవేక్షించారు. సాయంత్రం విద్యార్థులకు నృత్యం, భరతనాట్యం పోటీలు నిర్వహించారు.

✦ పర్చూరు కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో బాబా చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేశారు. నేతలు కె.వెంకటకృష్ణారావు, షేక్ షంషుద్దీన్, ఎం.హరిప్రసాద్‌లు పాల్గొన్నారు. అనంతరం వీఆర్వో వై.శ్రీనివాసరావును సన్మానించారు. కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జి.నాగరాజు, ఎంపీడీవో కె.నేతాజీలు శ్రీసత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచారు.

✦ ఇంకొల్లు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం తహసీల్దార్ శ్రీనివాస్, సత్యసాయి సేవలను ప్రస్తుతించారు. నక్కలపాలెం సత్యసాయి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

మంత్రి గొట్టిపాటి పర్యటన

అద్దంకి, మార్టూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు వద్ద అగ్రహారం భూముల విషయమై రైతులతో మాట్లాడతారు. అద్దంకి మండలం నాగులపాడులో సామాజిక భవనం ప్రారంభోత్సవం, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, మధ్యాహ్నం మార్టూరులో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని మంత్రి కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

నేడు

రామ్‌నగర్ (అద్దంకి), న్యూస్‌టుడే: విద్యుత్తు టవర్లకు కొత్త తీగలు బిగించే క్రమంలో సోమవారం అద్దంకిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ఎం.దామోదరం తెలిపారు. రామ్‌నగర్ ప్రాంతంలోని బ్యాంక్‌ఆఫ్ బరోడా నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ఒంగోలు రోడ్డుకు పడమర వైపు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

మార్టూరు: మరమ్మతుల్లో భాగంగా రాజుపాలెం ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వీరాంజనేయులు తెలిపారు.

దీక్షాపరులకు సద్ది రేపు

మార్టూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 25న దీక్షాపరులకు సద్ది నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ ఛైర్మన్ సకల ఆంజనేయులు ఆదివారం తెలిపారు.



జాతీయ సమైక్యతను చాటుతూ ప్రదర్శన

జె.పంగులూరు: మండలంలోని చందలూరులో ఆదివారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ప్రారంభ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థినులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మునీషా బేగం నడుముకు రింగుతో జాతీయ సమైక్యతను చాటుతూ చేసిన ప్రదర్శన, విద్యార్థినులు ఎన్.శృతి బృందం యోగాసనాలు సభికులను ఆకర్షించాయి.

యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

తూకాల్లో తేడాలు.. జరిమానా

పర్చూరు, కారంచేడు: వినియోగదారులకు నష్టం కలిగించేలా తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం పర్చూరు, కారంచేడులోని పలు మాంసం దుకాణాల్లో తూకాలను అధికారులు తనిఖీ చేశారు. తూకపు ముద్రలు లేకుండా విక్రయిస్తున్న ఆరు దుకాణాలకు రూ.9వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

మార్టూరు, పర్చూరు: ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు, డ్రైవర్లు భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని పర్చూరు ఎస్సై జీవీ చౌదరి సూచించారు. శనివారం అర్ధరాత్రి కోల్‌కతా-చెన్నై రహదారిలో మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా జాతీయ జీడిపప్పు దినోత్సవం

వేటపాలెం, న్యూస్‌టుడే: జాతీయ జీడిపప్పు దినోత్సవాన్ని అనంత భారత్ క్యాష్యూ ఉత్పత్తి దుకాణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో దీర్ఘకాలికంగా సేవలందించిన షేక్ గాలీబ్ షరీఫ్, జీడిపప్పుతో మాలలు, బొకేలు తయారు చేసి ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన సత్యాల సత్యానందంను షాపు యజమాని ప్రత్తి వెంకటసుబ్బారావు సత్కరించారు. శరత్‌బాబు, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

పర్చూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని కోరుతూ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బొమ్మల కూడలిలో నిరసన తెలిపారు. నాయకులు కొండయ్య, కె.శ్రీనివాసరావు, టి.పేతురు, డేవిడ్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

వృద్ధులకు అన్నదానం

మార్టూరు: స్థానిక అమ్మ ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం ఏపీ స్టేట్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు అన్నదానం చేశారు. ముదిరాజ్ యువసేన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకుడు చందు ధన్యవాదాలు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

కోనంకి(మార్టూరు): గ్రామానికి చెందిన కోటపాటి సురేష్ నేతృత్వంలో ఆదివారం తేజశ్రీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు పవన్, అమృతలు సుమారు 100 మందికి పరీక్షలు చేశారు.

దుద్దుకూరులో నేత్రదానం

దుద్దుకూరు (ఇంకొల్లు): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 717వ నేత్రదానం జరిగింది. దుద్దుకూరుకు చెందిన కటారి శ్రీలక్ష్మమ్మ(90) ఆదివారం మృతిచెందారు. రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు ఎస్.రామమోహనరావు, జెట్టి స్వామిలు శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి, మృతురాలి కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు ఆంజనేయులు, తిరుమలరావు, భాస్కరరావులను రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, నాగేశ్వరరావు అభినందించారు.

కోటి సంతకాల సేకరణ

పర్చూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం పర్చూరు బొమ్మలకూడలిలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. నేత అప్పారావు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

చినగంజాం, న్యూస్‌టుడే: వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌ను 216 జాతీయ రహదారి టి.జంక్షన్ వద్ద ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శీలం రమేష్ తెలిపారు. ఒంగోలుకు చెందిన టిప్పర్ యజమాని ప్రదీప్‌కుమార్, ఇద్దరు డ్రైవర్లు మహేంద్ర, వెంకట్రావులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కూరగాయలు కొనేందుకు వచ్చి వ్యక్తి మృతి

మార్టూరు: చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామానికి చెందిన సోమేపల్లి శ్రీనివాసరావు(60) ఆదివారం మార్టూరు మార్కెట్‌కు కూరగాయలు కొనేందుకు బండిపై వచ్చి, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు సీపీఆర్ చేసిన ఫలితం లేక పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి అతడి వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

(c) eenadu

చల్లని తల్లికి చాంగుభళా!

తిరుచానూరు, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో శ్రీపద్మావతీ అమ్మవారు ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై వెన్నముద్ద కృష్ణుడి రూపంలో భక్తులకు సాక్షాత్కరించారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీయోగనారాయణుడి రూపంలో దర్శనమిచ్చారు.

నేటి సేవలు

ఉదయం 9.15: రథోత్సవం

రాత్రి 7.00: అశ్వవాహనం

మేఘాల సోయగం.. మది పరవశం

తిరుమలలో గత రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. శేషాచలం అటవీప్రాంతం మీదుగా కొండపైకి వచ్చే మార్గాల్లో తేలియాడుతున్న మేఘాలు, జలపాతాలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, తిరుమల

ఈనాడు చిత్తూరు

సోమవారం నవంబరు 24, 2025 5

చోదకా.. ఇదిగో సూచిక

చూడండి.. గమ్యస్థానం చేరండి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులు జోరుగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసింది. కానీ కొందరు పెడచెవిన పెడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ సూచిక ఏం చెబుతుందో పరిశీలించి జాగ్రత్తలు తీసుకుందాం. – న్యూస్‌టుడే, పుత్తూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివరాలు..

వాహనాల రాకపోకలు: రోజూ వేలల్లో

- ఏడాదిలో ప్రమాదాలు: 1,050
- ద్విచక్ర వాహనాలు: 659
- భారీ వాహనాలు: 135
- కార్లు, ఇతర వాహనాలు: 256
- మృతులు: 425
- క్షతగాత్రులు: 1,165

వేగ నియంత్రణ..

జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ఎడమ వైపు గ్రామీణ రోడ్డు ఉందని సూచన. అటు నుంచి వాహనాలొచ్చే అవకాశం ఉంటుంది. అక్కడ వేగం నియంత్రణలో ఉంచుకోవాలి.

వంతెన ఉందని..

ఈ సూచిక ఇరుకైన వంతెన ఉందని తెలుపుతుంది. ఈ ప్రాంతంలో వేగంగా వెళ్లినా, వాహనాలు నిలిపేసినా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

దూకుడు వద్దని..

వాహనాలు నడిపే సమయంలో డివైడర్ల మధ్య ఖాళీ గురించి ఈ గుర్తు సూచిస్తుంది. రోడ్లలో మలుపు తిరగడానికి.. 2, 3 మార్గాలను కలపడానికి, రోడ్డు క్రాస్ చేయాలని సూచిస్తాయి. ఇక్కడ నెమ్మదిగా వెళ్లాలి.

పనులు చేస్తున్నారని..

ఈ రోడ్డులో ముందు పనులు జరుగుతున్నాయి వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని దీని అర్థం. అక్కడ నుంచే వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లాల్సి ఉంటుంది.

కుడి.. ఎడమలు..

రహదారికి ఎడమ వైపు వెళ్లమని నిర్దేశించే సంకేతమిది. డివైడర్, మలుపులున్నా ఆ ప్రాంతాల్లో వాహనాలు తిరుగుతాయని, ఎడమవైపు వెళ్లాలని అర్థం. అదే కుడి వైపునకు సూచిక ఉంటే అటుగా వెళ్లొచ్చు.

అందరూ పాటించాల్సిందే..

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పనుల నేపథ్యంలో సూచికలు పెట్టిస్తున్నాం. చోదకులకు అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అందరూ నిబంధనలు పాటిస్తే ప్రయాణం సాఫీగా సాగుతుంది. – **చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు**

పాఠశాలలు, కళాశాలలు..

రోడ్డుపై ఈ సూచికలుంటే ఆ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉన్నట్లు వాహన చోదకులు గుర్తించుకోవాలి. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వారితో పాటు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.

అధిగమించవద్దని..

ఈ సంకేతం కనిపిస్తే ముందున్న వాహనాలను అధిగమించవద్దని అర్థం చేసుకోవాలి. దాన్ని విస్మరిస్తే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరిస్తుంది.

కొత్త కార్డులకు సరకులు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: కొత్తగా బియ్యం కార్డులు పొందిన లబ్ధిదారులకు శుభవార్త. జిల్లాలో రెండు నెలల క్రితం 8,985 కొత్త బియ్యం కార్డులు జారీ చేశారు. నూతన బియ్యం కార్డుదారులకు డిసెంబరు నుంచి సరకులు అందజేయనున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొత్త కార్డులతో కలిపి మొత్తం 5,43,219 బియ్యం కార్డులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు.

సమయం: ఉదయం 10-12 గంటల వరకు

చరవాణి నంబరు: 89777 16661

ఆపదమిత్ర.. యువత పాత్ర

విపత్తుల వేళ సహాయక చర్యలపై శిక్షణ

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు స్థానికంగా ఉన్న యువత ద్వారా సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆపద మిత్ర అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆసక్తిగల యువతను ఎంపిక చేసి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, మై భారత్ ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణపై వారికి ప్రత్యేకమైన శిక్షణను అందించనున్నారు. ఇందుకు అధికారులు యువతకు ఆహ్వానం పలుకుతున్నట్లు మైభారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు.

శిక్షణ: వరదలు, తుపానులు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ధన, ప్రాణ నష్టాలు జరగకుండా ఎలా స్పందించాలనే అంశంపై శిక్షణనిస్తారు. డిసెంబరు 1 నుంచి 7వ తేదీవరకు గుంటూరులో శిక్షణనిస్తారు. ఉచితంగా భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హులు: 18 నుంచి 29 ఏళ్లలోపు యువత. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి.

దరఖాస్తు విధానం

చిత్తూరు నగరం గిరింపేటలోని మైభారత్ కార్యాలయంలో యువత పేర్లను ఈ నెల 24వ తేదీలోగా నమోదు చేసుకోవాలి. వివరాలకు 9908127829 చరవాణిలో సంప్రదించాలి.

35 వేల బోగస్‌కార్డులు

ఉపాధి హామీలో అంతులేని అక్రమాలు

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేతనదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో బోగస్ కార్డులు బయట పడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొందరు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండటంతో మరిన్ని బయట పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

పనులు చేస్తున్న వేతనదారులు

జిల్లాలో వివరాలు..

- ఉపాధి వేతనదారులు: 4,06,682 మంది
- ఈకేవైసీ జరిగింది: 3,74,148
- చేయించుకోవాల్సింది: 32,534

92 శాతం పూర్తి..

ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు జాబ్ కార్డులున్న 92 శాతం మందికి ఈకేవైసీ పూర్తయింది. వాటిని పరిశీలించిన అధికారులు 35 వేలు బోగస్ కార్డులను గుర్తించి రద్దు చేశారు. రద్దయిన వారిలో ఎవరైనా అర్హులు ఉంటే మరోసారి అప్పీలు చేసుకోవచ్చని సూచించారు.

ఎన్నో అవకతవకలు..

గత ప్రభుత్వ పాలనలో చాలా వరకు అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు పనులకు రాకుండానే ఇళ్ల వద్ద ఉంటూ వేతనాలు పొందినట్లు గుర్తించారు. రోజూ వచ్చే కూలి సొమ్ములో కొంత స్థానిక నాయకుల ఖాతాల్లోకి చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. మస్టర్లలో తప్పులు, వేతనాల చెల్లింపులో అక్రమాలు, జాబ్‌కార్డులో ఉన్న చిరునామాలో వేతనదారు ఉండకపోవడం, ఉద్యాన పంటల కోసం ఉపాధి కార్డులు తీసుకోవడం మొదలైన అవకతవకలు జరిగాయి. ఈ లెక్కన రూ.కోట్లలో సొమ్ము పక్కదారి పట్టినట్లు అధికారులు భావిస్తున్నారు.

– న్యూస్‌టుడే, చిత్తూరు జిల్లా పంచాయతీ

పుంగనూరు.. పశుజాతి మాణిక్యం

పుంగనూరు, న్యూస్‌టుడే: చిట్టి.. పొట్టి కాళ్లు.. అందమైన ఆకృతి.. ఆకర్షించే అమాయకత్వం.. చూపరులను కట్టిపడేసే సొగసు పుంగనూరు గోవుల సొంతం. కరవు పరిస్థితులను సైతం తట్టుకొని మనుగడ సాగించడం వీటి ప్రత్యేకత. ఒకప్పుడు ఇంటింటికీ ఒకటి చొప్పున కనిపించే ఆవులు క్రమేపీ అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. కొందరు రైతులు మాత్రం వీటి సంరక్షణలో తమ పాత్ర పోషిస్తున్నారు.

- కేంద్రం తపాలా కవరుపై పుంగనూరు జాతి పశువుల ఫొటోలు ముద్రించి 2022 ఫిబ్రవరిలో విడుదల చేసింది.
- తిరుమల క్షేత్రంలోని తితిదే గోశాలలో పుంగనూరు ఆవులు పెంచుతూ వాటి పాలు స్వామివారి అభిషేకానికి వాడుతున్నారు.

పరిశోధన..: పుంగనూరు జాతి పశు ఉత్పత్తికి ప్రభుత్వం మిషన్ పుంగనూరు చేపట్టింది. ఆరోగ్యవంతమైన జాతి ఎద్దుల నుంచి వీర్యం సేకరించి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తారు. ఎండిలో ట్రాన్స్‌ఫర్, ఇన్‌విట్రో ఇన్‌వైలో కృత్రిమ విధానాలతో మనుగడ కాపాడేలా చూస్తున్నారు. **రూ.100 కోట్లతో** రూ.100 కోట్లతో పలమనేరు, పులివెందులలో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

లీటరు పాలు రూ.100 పైనే..

● దేశీయ ఆవు జీవిత కాలంలో 7 నుంచి 8 దూడలకు జన్మనిస్తుంది. కానీ పుంగనూరు ఆవులు 13 వరకు పిల్లలకు జన్మనిస్తాయి. ● ఈ ఆవు 70 నుంచి 90 సెం.మీ ఎత్తు, 115 నుంచి 200 కిలోల బరువు కలిగి ఉంటుంది. ● రోజుకు 2 నుంచి 3 లీటర్ల పాలు మాత్రమే ఇస్తాయి. ● సాధారణ ఆవు పాలల్లో 3 నుంచి 4 శాతం వెన్న ఉంటే, వీటలో 8 శాతం ఉంటుంది. అందుకే ఈ పాల ధర లీటరు రూ.100పైనే. ● జిల్లా వ్యాప్తంగా వీటి సంఖ్య వెయ్యి లోపు ఉంటుంది.

పరదేశీ ప్రశస్తి.. శ్రీకాళహస్తి

రాహుకేతు పూజలపై విదేశీయుల ఆసక్తి

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఆలయ సందర్శనకు ఏటా విదేశీయుల తాకిడి పెరుగుతోంది. సాధారణంగా ఇతర దేశాల నుంచి వచ్చే వారు ఇక్కడి పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించడానికి వస్తుంటారు. కానీ ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులు మాత్రం ప్రత్యేకం. రాహు, కేతు పూజలు సైతం చేయించుకోవడం విశేషం.

హస్తకళలపై మక్కువ: అంతర్జాతీయ గుర్తింపు పొందిన కళంకారీ శ్రీకాళహస్తికి పెట్టింది పేరు. ఇక్కడి కళాకారులు తయారు చేసే కొయ్య బొమ్మలకు ప్రపంచ దేశాల్లో మంచి ఆదరణ లభిస్తోంది. విదేశీ భక్తులు దర్శనానంతరం వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వీరి కారణంగా ఆలయ పరిసరాల్లో హస్తకళల దుకాణాలు ఎక్కువయ్యాయి.

ఎక్కడెక్కడి నుంచి..

రష్యా, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఇటలీ

శాంతి మండపంలో రాహు, కేతు పూజలు చేయించుకుంటున్న జపాన్ దేశీయులు

సంప్రదాయ వస్త్రధారణతో..

చెన్నై, ముంబయి, దిల్లీ, బెంగళూరులో యోగా విద్యనభ్యసించడానికి విదేశీ మహిళలు వస్తుంటారు. వీరిలో చాలామంది శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో వస్త్రధారణ విషయంలో పెద్దగా ఆంక్షలు లేవు. దీంతో చాలామంది జీన్స్, టీషర్టు వేసుకొని వస్తుంటారు. పరదేశీ మహిళలు చీరకట్టులో, పురుషులు పంచె, చొక్కా ధరిస్తుండటం గమనార్హం. ఇక్కడి శిల్పకళా సౌందర్యం కూడా వారి ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.

సంవత్సరం	2021-22	2022-23	2023-24	2024-25	2025-26
విదేశీ భక్తులు	4200	4500	7100	8700	10,100
కరెన్సీ నోట్లు	950	1200	1,500	1,750	1,960

వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించండి

వేలూరు కలెక్టరు లేఖ

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన 16 మందికి చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కొల్లమేడు చెక్‌పోస్టు సమీప ఇటుకబట్టీలో పనిచేస్తున్న కార్మికులకు విముక్తి కల్పించాలని వేలూరు జిల్లా కలెక్టరు సుబ్బలక్ష్మి.. చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు లేఖ రాశారు. గుడిపాల మండలం కొల్లమేడు చెక్‌పోస్టు సమీప ఇటుకబట్టీలో వేలూరు జిల్లాకు చెందిన 16 మంది రెండేళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. వారి బంధువులు వేలూరు కలెక్టరును ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఆమె.. ఇక్కడి కలెక్టరుకు లేఖ రాశారు. స్పందించిన ఆయన వెంటనే వారి వివరాలు సేకరించి విముక్తి కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు చిత్తూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం చిత్తూరులోని కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించనున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్‌డూడీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వాడని సిమ్ కార్డులను తొలగించుకున్నారా..?

పుత్తూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో మోసగిస్తున్నారు. సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు మోసాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే మన పేరు మీద సిమ్‌కార్డులు పుట్టుకొస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు మన పేరుతో ఉన్న సిమ్‌ను యాక్టివేట్ చేసి అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డుతో మన పేరు మీద ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయో, సులువుగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం “సంచార్ సాథీ మొబైల్ యాప్’ను అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం.

మోసం చేసేందుకు సవాలక్ష మార్గాలు..

కొత్త సిమ్‌కార్డు తీసుకునేందుకు దుకాణానికి వెళ్లినప్పుడు వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, వేలిముద్రలు తీసుకుంటుంటారు. కొంత మంది నేరగాళ్లు వేలిముద్రలు, ఐరిస్ సేకరించే ప్రక్రియ ఒకటికి రెండు సార్లు చేస్తారు. దీంతో రెండు సిమ్‌కార్డులు మన పేరు మీద నమోదవుతాయి. మనం అడిగిన సిమ్ తీసుకుని మనం అక్కడి నుంచి వెళ్లిపోయాక .. రెండోది మనకు తెలియకుండా వారి వద్ద ఉండిపోతుంది. వీటిని అధిక ధరలకు సైబర్ నేరగాళ్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇలా పసిగట్టవచ్చు..

సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో ఈ మోసాలకు చెక్ పెట్టొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో యాప్ అందుబాటులో ఉంది. అదే విధంగా www.sancharsaathi.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి అందులో సిటిజన్ సెంట్రిక్ సేవలకు సంబంధించి పలు ఆప్షన్‌లు కనిపిస్తాయి. వాటిలో ‘నో మొబైల్ కనెక్షన్ ఇన్ యువర్ నేమ్’పై క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన పది అంకెల చరవాణి కింద క్యాప్చా నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆపై మన పేరు మీద నమోదైన సిమ్‌కార్డు నంబర్లు కనిపిస్తాయి. ఆ నంబర్ ఎంపిక చేస్తే నాట్‌మై నంబర్, రిక్వైర్డ్, నాట్ రిక్వైర్డ్ ఎంపికలు వస్తాయి. వీటిలో ఒకటి ఎంచుకుని ఫిర్యాదు చేయవచ్చు.

సప్తపది.. ప్రకృతి ఒడి

ఫంక్షన్ హాలు.. ప్లాస్టిక్ పూలు.. విద్యుత్తు దీపాలు.. పాటల హోరు.. సాధారణంగా వివాహ వేడుకల్లో ఇవే చూస్తుంటాం. కానీ అందరికంటే భిన్నంగా కొబ్బరితోటలో.. పచ్చని పందిరిలో.. ప్రకృతి ఒడిలో మూడుముళ్ల ముచ్చట తీర్చుకుంటే ఎలా ఉంటుంది.. నింద్ర మండలం ఇరుగువాయి గ్రామంలో ఆదివారం ఓ వివాహ వేడుక ఇలాగే జరిగింది. విశాఖలో స్థిరపడిన గిరిబాబు స్వగ్రామం నింద్ర. ఈయన కుమార్తె పూజిత తన వివాహం సొంతూరిలో గ్రామస్థుల మధ్య.. తమకున్న కొబ్బరితోటలో చేసుకోవాలని ఉందని తండ్రికి చెప్పారు. కుమార్తె కోరికతో బంధుమిత్రులందరినీ ఆహ్వానించి సంప్రదాయబద్ధంగా తోటలో వివాహం చేశారు. – న్యూస్‌టుడే, నింద్ర

మేనకూరు.. ఉద్యోగాల మణిహారం

- రూ.10,391.93 కోట్ల పెట్టుబడులు
- 7 వేల మందికి ఉద్యోగావకాశాలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీలు, సులభతర వాణిజ్యం, సింగిల్ డెస్క్ పాలసీ విధానంతో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

అయిదు నెలల కాలంలో..

నాయుడుపేట పట్టణంలోని పారిశ్రామిక వాడల్లో అయిదు నెలల కాలంలోనే రూ10,393.93 కోట్ల పెట్టుబడులతో 9 భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కలిగింది. మేనకూరు పారిశ్రామిక వాడలోనే 2026 నాటికి 7 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఏర్పడింది.

పారిశ్రామికవాడలో నిర్మాణంలో కార్బన్ పరిశ్రమ

5 నెలల్లో పరిశ్రమలు.. (✪ పరిశ్రమ ❖ పెట్టుబడి (రూ.కోట్లలో) ❒ ఉద్యోగాలు)

పరిశ్రమ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగాలు
ప్రీమియర్ ఎనర్జీ	1,743	2,200
ఫిల్పిస్ కార్బన్	3,000	1,000
బిర్లా కార్బన్	1,793	500
వాల్సన్ ల్యాబ్	1,743	415
గ్రీన్‌ల్యామ్ సౌత్ లిమిటెడ్	595	850
బీసీబీ ఎలక్ట్రానిక్స్	700	1,000
ఇథనాల్ పరిశ్రమలు-2	819.70	200

భూముల కేటాయింపు పూర్తి..

ప్రీమియర్ ఎనర్జీకి చెందిన సౌరఫలకాలు, సోలార్ మాడ్యూల్స్ సెల్ తయారీ, బిర్లా కార్బన్, ఫిల్పిస్ కార్బన్‌తో పాటు తాజాగా పీసీబీల ఎలక్ట్రానిక్స్, వాల్సా ల్యాబ్స్, గ్రీన్ ల్యామ్ సౌత్ లిమిటెడ్ కంపెనీలు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాయి. ఇప్పటికే ప్రీమియర్ ఎనర్జీ, కార్బన్ పరిశ్రమల భవన నిర్మాణాలు కొలిక్కి వచ్చాయి. మిగిలిన వాటికి భూముల కేటాయింపు పూర్తయింది.

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 75,082 మంది దర్శించుకున్నారు. రూ. 2.87 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి.

దీనిని ఏమందురో..?

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చెల్లూరు జలాశయానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్యాం నిండి పొంగిపొర్లుతోంది. కొండల మధ్య జలాశయం ఆహ్లాదకరంగా ఉండటంతో వందలాది మంది వచ్చి సేదతీరుతున్నారు. కొంతమంది యువత మద్యం తాగుతున్నారు. నీటిలోకి దిగి ఈత కొడుతున్నారు. మరికొందరు కుటుంబాలు, స్నేహితులతో వచ్చి ప్రమాదకరంగా స్వీయ చిత్రాలు తీసుకుంటున్నారు. – ఈనాడు, తిరుపతి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు క్లాసిఫైడ్స్

లీగల్ ప్రకటనలు

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

పదవీ విరమణ శుభాకాంక్షలు

జన్మదిన శుభాకాంక్షలు

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జీఎస్టీ 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY www.mits.ac.in MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE

FM Partner: ఈ FM Mee FM | TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు | Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా: ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, నేంద్రగుంట(వి&పో), పాకాల(మం), తిరుపతి(జి) - 517112

వివరాలకు: 90634 38851, 80087 05935

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

అన్నదాత ఇంట..

సిరులు పండాలని

నేటి నుంచి 'రైతన్నా-మీకోసం'

జిల్లాలో సాగు వివరాలిలా..(హెక్టార్లలో)

- ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు: 71 వేలు
- రబీ సాధారణ సాగు: 29 వేలు
- ఉద్యాన పంటల సాగు: 72 వేలు
- రైతుల సంఖ్య: 3.45 లక్షల మంది

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయం లాభసాటి కావాలి.. రైతన్న ఇంట సిరులు పండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఈ నెల 29 వరకు 'రైతన్నా-మీకోసం' వారోత్సవాల్లో భాగంగా ఇంటింటా సందర్శన, ఈ నెల 30 నుంచి డిసెంబరు 3వరకు సేకరించిన వివరాలు విశ్లేషణ చేస్తారు.. ఇందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.. వారం పాటు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది బృందాలుగా ఇంటింటికీ వెళ్లి రైతులను కలిసి మాట్లాడతారు.. సాగు పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్ నీటి భద్రత, డిమాండ్, ప్రభుత్వ మద్దతు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఆర్ఎస్‌కే సహాయకులు, పశుసంవర్ధక, మత్స్య సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, ప్రగతిశీల రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో చేస్తారు.

క్లస్టర్‌గా.. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి..ఒక్కొక్క బృందం రోజుకు 30 క్లస్టర్లు(90గృహాలు) సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధి అంశాలపై అధికారులు వివరించి..సాగులో ప్రయోజనాలు, చేకూరే పంచసూత్రాలను తెలియజేస్తారు. సాగు ప్రోత్సాహకాలు చేరుతున్నాయా..? వ్యవసాయానికి ఎలాంటి రాయితీలు అమలు చేయాలి.., యాంత్రీకరణ పరికరాలు కావాలా.., తదితర అంశాలతో పాటు సాగులో ఎదురయ్యే సమస్యలు, రెవెన్యూ పరమైన సమస్యలను తెలియజేయవచ్చు. రైతులు చెప్పిన అంశాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి.

3న రైతులతో సమావేశాలు..

ఆర్ఎస్‌కేల వద్ద డిసెంబరు 3న స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి ప్రస్తుత రబీ, రానున్న ఖరీఫ్, రబీ సీజన్లకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

10.30 తర్వాతే పుణ్యస్నానాలకు అనుమతి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం జరిగే చివరి ఘట్టమైన పంచమీతీర్థానికి సర్వం సిద్ధం చేసినట్లు తితిదే జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఆదివారం అధికారులతో కలిసి పంచమీతీర్థం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉదయం 10.30 గంటల తరువాత మాత్రమే భక్తులను పుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతిస్తామని చెప్పారు. పంచమీతీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

పంచమీతీర్థానికి సిద్ధమైన పుష్కరిణి

మరిన్ని వివరాలు

- వేర్వేరుగా పుష్కరిణిలోకి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు.
- పద్మసరోవరంలోకి వెళ్లేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూడి కూడలి, నవజీవన్ ఆసుపత్రి సమీపంలో క్యూలైన్ల ఏర్పాటు.
- 900: శ్రీవారి సేవకుల సేవలు.
- తితిదే సిబ్బంది 600 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ 200, ఎన్‌సీసీ విద్యార్థులు 200, పోలీసు సిబ్బంది 1,600 మందితో భద్రతా ఏర్పాట్లు.
- 150: అన్నప్రసాదాల కౌంటర్లు.
- తోళప్పగార్డెన్స్, ఉన్నత పాఠశాల ఆవరణ, అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో, పూడి రోడ్డు తదితర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం.
- 284: శాశ్వత, తాత్కాలిక మొబైల్ మరుగుదొడ్ల ఏర్పాటు.
- 3 ప్రాథమిక చికిత్స కేంద్రాలు, 5 అంబులెన్స్‌లు అందుబాటులో.
- 120: సీసీ కెమెరాలతో నిఘా
- 9: డ్రోన్లతో ఏరియల్ వ్యూ.

పార్కింగ్ పాయింట్లు: శిల్పారామం, తనపల్లి కూడలి, మార్కెట్ యార్డు, రామానాయుడు కల్యాణ మండపం, పూడి కూడలి, తిరుచానూరు దళితవాడ.

మార్కెటింగ్ శాఖ ఆదాయం రూ.6.35 కోట్లు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా మార్కెటింగ్ శాఖ ఆదాయం ఇప్పటివరకు రూ.6.35 కోట్లు సమకూరిందని ఆ శాఖ ఇన్‌ఛార్జి జేడీ సుధాకర్ తెలిపారు. జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, ఈ ఏడాది వాటి ఆదాయ లక్ష్యం రూ.10.39 కోట్లుగా నిర్ణయించామన్నారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం, బంగారుపాళ్యం కమిటీలు ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాలను సాధించాయని చెప్పారు. మిగిలిన కమిటీలు వెనుకంజలో ఉన్నాయన్నారు. చెక్‌పోస్టులను బలోపేతం చేసి ఆదాయ లక్ష్యాన్ని సాధించాలని కమిటీల కార్యదర్శులను ఆయన ఆదేశించారు.

'తప్పుగా మాట్లాడా.. క్షమించండి'

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ప్రసాదంపై తాను మాట్లాడిన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే తనను క్షమించాలని యాంకర్ శివజ్యోతి కోరారు. ఆదివారం తన సోషల్ మీడియా ఖాతాలో విడుదల చేసిన వీడియోలో ఆమె మాట్లాడుతూ.. తాను తప్పుడు ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. శ్రీవాణి దర్శన టికెట్ల క్యూలైన్‌లో నిల్చున్నామనే ఉద్దేశంతో మాత్రమే అలా అన్నానన్నారు. తనతో పాటు తన తమ్ముడి తరఫునా క్షమాపణలు చెబుతున్నానన్నారు.

పీ4 వెలుగులు

యానాదులతో లక్ష్మీపతిరాజు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: పేదరికాన్ని నిర్మూలించడానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం మండలంలో తొలిసారిగా ఫలితం లభించింది. మండలంలోని యర్రగంగనపల్లె యానాది కాలనీలో పీ4లో భాగంగా... అదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీపతిరాజు యానాదులకు మూడు ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ఆదివారం వారు గృహప్రవేశం చేశారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం రద్దీ అధికంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉన్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వసతులు కల్పించారు.

తిరుమలకు కూరగాయల వితరణ

పలమనేరు: తిరుమల వెంగమాంబ అన్నదాన సత్రానికి పట్టణానికి చెందిన నాగమల్లీశ్వరి, పత్తిహరినాథ్, శ్రీకాంత్, కదిరి సుబ్రహ్మణ్యం, జయరాంరెడ్డి 13 టన్నుల కూరగాయలను ఆదివారం వితరణగా అందజేశారు. పలమనేరు మార్కెట్ నుంచి ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపారు.

సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం

సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తమని.. ఆయన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రేమ, శాంతి, మానవతా విలువల్ని ఆచరణలో చూపారన్నారు. రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చారని, పేదలకు ఉచిత వైద్యసేవలు అందించారన్నారు.

సర్వేయర్ల సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ..

చిత్తూరు(జిల్లా పంచాయతీ): జిల్లా సర్వేయర్ల సంఘం నూతన భవన నిర్మాణానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం భూమిపూజ చేశారు. కలెక్టరేట్ సమీపంలో, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదురుగా ఈ భవనాన్ని నిర్మించనున్నారు. సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవిరావు, నాయకులు రామకృష్ణ, సాయిబాబు, శేషగిరిరావు, జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు
నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7,8-8.30, 9.30 -10.30 గంటల వరకు
మ. 12.00, **సా.** 4.30, **రా.** 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం

శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45 గంటలకు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12 గంటలకు కల్యాణోత్సవం, 2 గంటలకు డోలోత్సవం, 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకారసేవ.

సర్వదర్శనం: తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ
6.30: ప్రథమ కాలాభిషేకం
7.30: ద్వితీయ కాలాభిషేకం
11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు
11.30: నిత్య కల్యాణం
సాయంత్రం: 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం
9.00: ఏకాంతసేవ
సర్వదర్శనం: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

రాహు, కేతు పూజలు: ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు.

అభిషేకాలు: మృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ(శుక్ర వారం).

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

నియోజకవర్గానికో రైతుబజారు

కార్యాచరణకు ఆదేశం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: రైతులకు గిట్టుబాటు ధర..వినియోగదారులకు సరసమైన ధరలకే నాణ్యమైన కూరగాయలు అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గానికో రైతుబజారు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు.. జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో కుప్పం, గంగాధరనెల్లూరు, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో వీటి ఏర్పాటుకు ఇప్పటికే స్థలాల ఎంపిక పూర్తయిందని మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ తెలిపారు.

ప్రచార యావే.. నాప్‌కిన్లు లేవాయే

గత ప్రభుత్వ హయాంలో ప్రతి పథకానికి ప్రచారం కోసమే కోట్ల రూపాయలు కుమ్మరించారు తప్ప ఎక్కడా ఆ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదనేందుకు నిదర్శనం ఈ చిత్రాలు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల కోసం వైకాపా హయాంలో శానిటరీ నాప్‌కిన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఉచితంగా విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్లు ఇస్తున్నట్లు ప్రచారం చేశారు. అప్పటి నుంచి కొత్త యంత్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

- ఈనాడు, చిత్తూరు

ప్రముఖులు రాలేదు.. అంధకారం తప్పదు

మంగళం ఆర్టీవో కార్యాలయం కూడలి నుంచి కరకంబాడి వైపు డివైడర్ మధ్యలో ఏడాది క్రితం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇవి తిరుపతికి ప్రముఖులు వచ్చినప్పుడు మాత్రమే వెలుగుతున్నాయి. మిగిలిన సమయంలో చీకట్లే. వాహనాల లైట్ల వెలుగులోనే వాహనదారులు రాకపోకలు సాగించాలి. అంధకారంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **-ఈనాడు, తిరుపతి**

మొత్తం తవ్వేశారు.. స్తంభం వదిలేశారు..

ఇసుకాసురుల దాహానికి పలమనేరు పట్టణంలోని చిన్నూరు చెరువు రూపురేఖలు కోల్పోయింది. ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. యంత్రాలతో అడ్డగోలుగా తవ్వేశారు. చివరికి విద్యుత్తు స్తంభం ఉండటంతో చిన్న దిబ్బను వదిలేశారు.

- న్యూస్‌టుడే, పలమనేరు

ప్లాంట్ నిలిచి.. కాలుష్యం పెరిగి

- తుప్పుపడుతున్న పరికరాలు
- నగరిలో స్తంభించిన ఈటీపీ ప్లాంట్

చింతలపట్టడలోని ఈటీపీ ప్లాంట్

నగరి, న్యూస్‌టుడే: భూగర్భ జలాల కాలుష్యం అనగానే కనిపించేది నగరిలో నిర్లక్ష్యంగా వదిలేస్తున్న రసాయనాల రంగునీటి వ్యర్థాలే. ఈ సమస్య నానాటికీ జటిలమై పట్టణవాసులను కలవరపెడుతోంది.. అడపాదడపా రంగునీటి వ్యర్థాలను శుద్ధి చేసే ఈటీపీ ప్లాంట్ సైతం స్తంభించింది.. ఫలితంగా వస్త్ర ఉత్పత్తిదారులు రసాయనాల రంగునీటి వ్యర్థాలు నేరుగా మురుగు కాలువల్లోకి వదిలేస్తున్నారు.. పలుమార్లు ఈ సమస్యపై కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించినా ఫలితం శూన్యం.

ఈటీపీ ప్లాంట్ ఏర్పాటు: 15 ఏళ్ల క్రితం
ప్రారంభం: 2017, **డైయింగ్ యూనిట్లు:** మాన్యువల్-60, మిషనరీ-15
పెండింగ్ విద్యుత్తు బిల్లు: రూ.2 కోట్లు
ప్లాంట్ మూతపడినది: నాలుగు నెలలుగా

ఎంఎస్ఎంఈ ఒక్కటే పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం మాంగాడు వద్ద వందెకరాల్లో ఎంఎస్ఎంఈ ప్రారంభించింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సైతం డైయింగ్ యూనిట్ల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ ఎంఎస్ఎంఈలో యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రైతులు సాగునీటి కాలుష్యంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈటీపీని వినియోగంలోకి తెచ్చే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

దెబ్బతిన్న పరికరాలు..

చింతలపట్టడలో ఈటీపీ ప్లాంట్‌లో పరికరాలు, మోటార్లు తుప్పుపడుతున్నాయి. మాన్యువల్ డైయింగ్ యూనిట్ల నుంచి రసాయనాల వ్యర్థాల నీరు ఈటీపీకి చేరడమే లేదు. మురుగు కాలువల ద్వారా నగరి చెరువుకు.. ఆపై వరవ కాలువల్లో ప్రవహిస్తోంది. అదే రైతులకు సాగునీరుగా మారడం గమనార్హం. రంగు నీటి వ్యర్థాల శుద్ధికి పట్టణంలో గతంలో ఏర్పాటు చేసిన ఈటీపీ ప్లాంట్ నిర్వహణకు విద్యుత్తు బిల్లు కట్టలేని పరిస్థితిలో నిర్వాహకులు ఉండటం గమనార్హం. గతంలో ఈ బిల్లు పురపాలిక చెల్లించినా ఆపై అది నిలిచిపోయింది.

భాస్కర్‌రావుకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు గుంటూరుకు చెందిన భాస్కర్‌రావు రూ.1,00,020 చెక్కును కుటుంబ సమేతంగా ఆదివారం వితరణగా అందజేశారు. ఆయనకు, కుటుంబీకులకు స్వామివారి దర్శనం చేయించి శేషవస్త్రాలు, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను ఆలయ అధికారులు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పాఠశాల విద్య కీలకం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తిని పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఆయన మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్, జయంతి పాల్గొన్నారు.

విజేతలు వీరే..: ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి చౌడేపల్లె మండలం చారాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెండో బహుమతి బంగారుపాళ్యం మండలం మంగళపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ బహుమతి కె.టి.పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు; ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి పూతలపట్టు మండలం మంగళ విద్యాలయ, ద్వితీయ బహుమతి చిత్తూరు రెయిన్‌బో, అరగొండ అమరరాజ విద్యాలయ విద్యార్థులు, తృతీయ బహుమతి కుప్పం పబ్లిక్ పాఠశాల విద్యార్థులు.

EENADU Classifieds

BUILDING CONSTRUCTION
Hotel Building Plans Statutory Approvals Consultant Required for a high raise in 50 cents. Cont: 92824 05555.

JOBS
WANTED CHEMIST (Male) B.Sc., Chemistry/ B.Pharmacy M/s. Coastal Laboratories, Akkampeta, TADA. 70133 32427, info@coastal-labs.com.

MGBబజాజ్‌షోరూం తిరుపతి నందు టీంలీడర్స్ (M), వరదాయపాళెం, పుత్తూరు, నగరినందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M)-6, టెలికాలర్ (F)-3 కావలెను జీతం: 12K-15K. ✆9154993869, 9246777877.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
తిరుపతి-A రంగంపేట మోహన్ బాబు స్కూల్ వెనుక 30x44 అం|| ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ ప్లాట్స్ అమ్మబడును. ✆ 73828 81119, 90147 27359.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

బాధ్యతల స్వీకరణ

మల్లికార్జున రావు

నగరి, న్యూస్‌టుడే: నూతన సీఐగా ఓ.మల్లికార్జునరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఆయన నగరికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన విక్రమ్ తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెడతానని, ప్రజల సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

గుడిపాల, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని సీవీఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ అన్నారు. మండల కేంద్రంలోని కళాశాలలో 78వ ఎన్‌సీసీ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ గీతాన్ని ఆలపించారు. ప్రోగ్రాం అధికారి అర్జున్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆలూరు బాలాజీ పేర్కొన్నారు. స్థానిక త్రినేత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం భగవాన్ శ్రీరమణ మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పిరమిడ్ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
పుత్తూరు: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ: సమస్య: పచ్చనపల్లె దళితవాడలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - రవి, గ్రామస్థుడు

సమాధానం: కాలువల్లో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లిస్తాం. - శ్రీనివాసులు, ఎంపీడీవో

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు: సమస్య: స్థానిక వారపు సంతలో వీధిదీపాలు సక్రమంగా లేక రాత్రివేళ రైతులకు, కొనుగోలుదారులకు ఇబ్బందిగా ఉంది. - లక్ష్మీ, స్థానికురాలు

సమాధానం: పంచాయతీ సిబ్బందితో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం. - మనోహర్‌గౌడ్, ఎంపీడీవో

న్యూస్‌టుడే, తవణంపల్లె: సమస్య: చెర్లోపల్లి గ్రామంలో వీధులు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. -స్థానికులు

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి సీసీ రోడ్లు నిర్మిస్తాం. - హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో

న్యూస్‌టుడే, నగరి: సమస్య: వార్డు సచివాలయంలో తాగునీటి సౌకర్యం లేదు. రైతులు, ప్రయాణికులు అత్యవసరమైతే నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. -బాషా, నగరి

సమాధానం: అవసరమైన చోట నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. -కృష్ణారెడ్డి, కమిషనర్

శివారు ప్రాంతాలు.. శివ శివా

వరదమ్మకాలనీలో నివాసాల ఎదుట నీటి గుంత

- అభివృద్ధికి ఆమడ దూరం
- వీధుల్లో వసతుల కరవు
- అసౌకర్యాల నడుమ ప్రజలు

- డివిజన్: 5
- జనాభా: 3,500
- ప్రాంతాలు: చెంగల్రాయ మిట్ట, సీకేపల్లె, సాంబయ్య కండ్రిగ, రఘురాంనగర్ కాలనీ, రిజర్వు పోలీస్ కాలనీ, విజయనగర్, కామేశ్వర నగర్

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలోని పలు డివిజన్లలోని పలు కాలనీలు, శివారు విలీన గ్రామాల్లోని స్థానికులను మౌలిక వసతుల కొరత నిత్యం వేధిస్తోంది.. ఏళ్ల తరబడి సమస్యలు అలానే అపరిష్కృతంగా ఉండిపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు.. ప్రధానంగా మౌలిక సదుపాయాల కొరతతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. . వీధుల ప్రారంభమే సమస్యలతో స్వాగతం పలుకుతోంది.. తమ ప్రాంతాలు నగరపాలక సంస్థలో విలీనమైనా వసతుల కల్పనలో వెనుకబడ్డాయి.

మట్టిరోడ్లే దిక్కు..

స్థానిక 5వ డివిజన్ పరిధిలోని సాంబయ్య కండ్రిగ ఇందిరమ్మ కాలనీలో రహదారి సదుపాయం లేకపోవడంతో ఎగుడుదిగుడుగా ఉన్న మట్టిరోడ్లపై వాహనాల ప్రయాణం చేయాల్సి వస్తోందని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో రాత్రివేళ విషపురుగుల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల ఎదుట చిన్నపాటి గుంతల్లో మురుగునీరు నిల్వ పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత లోపించడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కొండ ప్రాంతం కావడంతో అన్నివిధాలా అవస్థలు పడుతున్నామని వారు వాపోయారు. ఈ కాలనీ మధ్యభాగంలో ఇళ్లలోని మురుగునీరు చేరుతోంది. దీంతో పాదచారులు సైతం నడవలేని దయనీయ స్థితి.

సమస్యలు పరిష్కరిస్తాం..

నగరపాలక పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

- వెంకట్రామిరెడ్డి, ఎంఈ, నగరపాలక సంస్థ

కుక్కలపల్లెలో రోడ్డు దుస్థితి

- డివిజన్: 21
- జనాభా: మూడు వేలు
- ప్రాంతాలు: కుక్కలపల్లె, వరిగపల్లె, గుడియాత్తం రోడ్డు

సమస్యలతో సహజీవనం..

21వ డివిజన్ పరిధిలోని కుక్కలపల్లెలో సమస్యలతో స్థానికులు సహజీవనం చేస్తున్నారు. ఈ గ్రామంలో ఇప్పటి వరకు రోడ్లు, కాలువలు లేవు. ఫలితంగా రాకపోకలు కష్టతరమయ్యాయి. వీధుల్లోనే మురుగునీరు నిలిచి ఉంటోంది. వీటిపైనే పాదచారులు, వాహనచోదకులు వెళ్లాల్సిన పరిస్థితి. కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరు నివాసాల ఎదుట నిల్వ ఉంటున్న దుస్థితి. దోమలు, దుర్వాసన సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా ఇక్కడకు విధులకు రావడం లేదని ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నా వసతులు కల్పించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, నగరపాలక అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేత్ర శస్త్రచికిత్సకు 48 మంది ఎంపిక

చిత్తూరు(సంతపేట): జైన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 117 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన 48 మందికి తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నారు. రోగులకు రవాణా/వసతి సౌకర్యాలతో పాటు శస్త్రచికిత్స తర్వాత కంటి అద్దాలను తాము ఉచితంగా అందజేస్తామని జైన్ సంఘం కార్యదర్శి సుభాష్‌జైన్ తెలిపారు.

అదుపు తప్పితే.. లోయలోకే..!

సింహరాజుపురం పంచాయతీ నుంచి పాలసముద్రానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ఎక్కడ చూసినా గోతులే. ఎక్కడికక్కడ రాళ్లు తేలాయి. దీంతో పెద్ద వాహనదారులతో పాటు ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలిన ఈ రహదారిలో ప్రయాణం వణికిస్తోంది. ప్రధానంగా ఈ రహదారి ఘాట్‌రోడ్డు కావడంతో జారితే ఇకఅంతే. పక్కనున్న లోయలే పడాల్సిందేనని భయపడుతున్నారు. ఇక రాత్రివేళ వాహనదారుల ఇబ్బందులు చెప్పనలవికావు.

- న్యూస్‌టుడే, పాలసముద్రం

ఈ మార్గంలో ఇంతే..!

మరాఠీ గేటు ప్రాంతంలో గ్రావెల్, కంకర క్వారీల వద్దకు భారీ వాహనాల రాకపోకలతో ఆ రోడ్డు ఛిద్రమైంది. ఇటీవలి వర్షాలకు బురదమయమైంది. దీంతో పాదచారులు వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో అయితే వాహనాలు రాకపోకలతో లేచే దుమ్ము, ధూళితో ఆ ప్రాంత వాసులు నరకం అనుభవిస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లు గ్రావెల్, కంకర తరలిపోతోంది. ఈ రహదారిని తారుమార్గంగా మార్పు చేస్తే ఇబ్బందులు ఉండవని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుత్తూరు

పట్టించుకునేవారెవరు..?

పశువుల దాహార్తి తీర్చేందుకు తిరుమలరాజుపురంలో నిర్మించిన పశువుల నీటితొట్టెను అట్టహాసంగా నిర్మించి దానికి రంగులు సైతం వేయించారు. అయితే తొట్టెలో నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చలేక.. దాన్ని అలానే నిరుపయోగంగా అధికారులు వదిలేశారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. దీన్ని నీటితో నింపి పశువుల దాహార్తి తీర్చాలని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పాలసముద్రం

ఇలా ఉంటే రోగాలు రావా..?

మండలంలోని యాబిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో కుంటలా వర్షపు నీరు, మురుగునీరు నిలిచింది. ఈ నీరు ఎక్కువ రోజులు ఇలానే నిలిచి ఉంటే దోమలు ప్రబలి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. ఈ కుంట సమీపంలోనే పాఠశాల సైతం ఉండటంతో విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశముందని తల్లిదండ్రులు వాపోతున్నారు.. నీరు నిలవకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తవణంపల్లె

పార్టీలో చేరిన వారితో యుగంధర్

జనసేన పార్టీలో చేరిక

పాలసముద్రం: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పలువురు యువకులు తమ పార్టీలో చేరారని నియోజకవర్గ బాధ్యులు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆముదాల, వెంగళరాజుకుప్పం పంచాయతీ గ్రామానికి చెందిన కొందరు యువకులు.. జనసేన మండల అధ్యక్షుడు లతీష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, చంద్ర, కోదండన్, జావిద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆవరణ ఎంపీడీవో కార్యాలయం లోనిది. ఇక్కడకు నిత్యం పనుల నిమిత్తం సందర్శకులు వచ్చివెళ్తుంటారు. ఈ కార్యాలయ ఆవరణ చిన్నపాటి వర్షానికే బురదమయమై చిత్తడిగా మారింది. ఆ సమయంలో ప్రజలు కార్యాలయానికి రావాలంటే తిప్పలు పడుతున్నారు. తమ కార్యాలయాన్నే శుభ్రంగా ఉంచుకోలేని అధికారులు ప్రజల కష్టాలు ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదని సందర్శకులు విమర్శిస్తున్నారు. - న్యూస్‌టుడే, పెనుమూరు

స్పందనకు వందనం

తీరిన తాగునీటి సమస్య

కృష్ణజిమ్మాపురం పంచాయతీ కొండం గ్రామంలోని తాగునీటి ట్యాంకుకు వెళ్లే పైపులైను దెబ్బతిని నీరు లీకవుతున్న సమస్యపై ఎంపీడీవో సతీష్‌రాజు స్పందించారు. ఆయన ఆదేశాలతో సర్పంచి భానుప్రియ తంగరాజు, కార్యదర్శి జయశంకర్. . సిబ్బంది సాయంతో మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టారు.

- న్యూస్‌టుడే, పాలసముద్రం

ముళ్లకంపల తొలగింపు

బాలకృష్ణాపురం పంచాయతీ గ్రామానికి వెళ్లే రహదారిలో పెరిగిన ముళ్లకంపల సమస్యపై ఎంపీడీవో సతీష్‌రాజు స్పందించారు. ఆయన ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ సిబ్బంది సాయంతో వాటిని తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం

విద్యుత్తు వృథాకు అడ్డుకట్ట

గల్లావాళ్లవూరు, పుణ్యసముద్రంలో వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్న సమస్యపై అధికారులు స్పందించి రాత్రి వేళల్లో వెలిగేలా చర్యలు చేపట్టారు. ● ఎం.బోయపల్లి, అరగొండ బీసీ కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయిన సమస్యపై అధికారులు స్పందించి శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, తవణంపల్లె

వెలిగిన వీధి దీపాలు

కనకనేరి ఎస్టీకాలనీలో వీధి దీపాలు వెలగని సమస్యపై ఈవోపీఆర్డీ కృష్ణప్రసాద్ స్పందించారు. సర్పంచితో మాట్లాడి వెలగని దీపాలకు మరమ్మతులు చేసి అవి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, గుడిపాల

నూతన దీపాల ఏర్పాటు

● ఇందిరమ్మ కాలనీలో వర్షాలకు వీధిదీపాలు మరమ్మతులకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యపై అధికారులు స్పందించి వాటిని వెలిగించారు. లేనిచోట కొత్తవి ఏర్పాటు చేయించారు.

● కుశస్థలి నది ఒడ్డున పార్కు చుట్టుపక్కల పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించారు.

● జాతీయ రహదారి పనుల కారణంగా డ్రెయిన్ ఎత్తుగా నిర్మించడంతో పట్టణ శివారు ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. అవసరమైన చోట గ్రావెల్ తోలి రాకపోకలకు సులభతరం చేశారు.

- న్యూస్‌టుడే, నగరి

విరాళం అందజేస్తున్న నాగరాజనాయుడు, ప్రవాసాంధ్రుడు శ్యామ్‌సుందర్‌రావు

దేవాలయ నిర్మాణానికి విరాళం

పూతలపట్టు, న్యూస్‌టుడే: పోటుకనుమ ఎగువ దళితవాడ విరుపాక్షమ్మ దేవాలయ నిర్మాణానికి కాణిపాకం ఆలయ పాలకమండలి సభ్యుడు నాగరాజనాయుడు, ఆయన కుమారుడు, ప్రవాసాంధ్రుడు శ్యామ్‌సుందర్‌రావు రూ.50 వేలు నగదు విరాళంగా అందజేశారు. ఈ విషయాన్ని వారు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆలయ నిర్మాణానికి మొదట విడతలో ఈ నగదు ఇచ్చామన్నారు. తెదేపా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సుబ్బరాజు, గురప్పనాయుడు, రామయ్య, మనోహర్, వెంకటస్వామి, జగన్నాథం, సంజీవయ్య పాల్గొన్నారు.

కలుజు కాలువ ఆక్రమణ

- దశబంధు చెరువు కబ్జా
- పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, పుత్తూరు

పూడ్చివేసిన కలుజు నీరు పోయే కాలువ

భూముల ధరలు ఆకాన్నంటుతున్న నేపథ్యంలో ఆక్రమణదారులు కాలువలు, ప్రభుత్వ భూములు, పొరంబోకు స్థలాలు ఆక్రమిస్తున్నారు.. చివరకు కలుజు కాలువను సైతం ఆక్రమించి చదును చేస్తున్నారు.. వేపగుంట దశబంధు చెరువు వేపగుంట-నెడియం రోడ్డు పక్కనే ఉంది.. దీని కింద ఆయకట్టు లేనప్పటికీ ఆ పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ చెరువు నిండి కలుజు పారితే తూర్పున ఉన్న కల్వర్టు ద్వారా వెళ్లేవి. వేపగుంట-నెడియం రోడ్డు విస్తరణ సమయంలో ఆ కల్వర్టును రోడ్లు, భవనాల శాఖ అధికారులు పూడ్చివేశారు. అప్పటి నుంచి దిగువన ఉన్న పొలం గుండా వేపగుంట రైల్వేస్టేషన్ సమీప వంతెన ద్వారా వెళ్లిపోయేవి. ఇటీవల కలుజు నీరు పారే ప్రాంతంలో కంకర వేసి చదును చేస్తున్నారు. ఒకవేళ చెరువు నిండితే ఆ నీరు రోడ్డుపైకి చేరడమేకాక భారీ వర్షాలు పడితే రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువ లేదని వాదన

చెరువులు ఎక్కడ నిర్మించినా విధిగా కలుజు ఏర్పాటు చేస్తారు. అదీనూ ప్రభుత్వ భూముల్లోనే కలుజు కాలువలు ఉంటాయి. ఈ చెరువు నీరు పోయేందుకు కాలువ లేదని ఆ భూమి యజమానులు వాదిస్తున్నారని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వందల ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన చెరువు నుంచి ఇన్నాళ్లుగా కలుజు నీరు పోతోంది. ప్రస్తుతం ఆ నీరు పోయేందుకు కాలువ లేదని చెప్పడం విడ్డూరమని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సంయుక్త సర్వే చేస్తే అసలు విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

రోడ్డు ఆక్రమించి

దశబంధు చెరువు కలుజు వద్ద రోడ్డు ఆక్రమించి ఓ దుకాణం వెలిసినా అధికారులు నోరు మెదపడం లేదు. ఆర్అండ్‌బీ, జలవనరుల, రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎవరికివారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

సర్వే చేయిస్తాం

సర్వే చేయిస్తే అన్ని విషయాలు వెలుగు చూస్తాయి. చెరువు నుంచి కలుజు కాలువ విధిగా ఉంటుంది. సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తాం. కలుజు వద్ద ఆక్రమణకు గురైన స్థలం విషయంలోనూ చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

సత్యసాయి సమితి సేవా కార్యక్రమాలు

దుప్పటి అందజేస్తున్న సమితి సభ్యులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా ఆదివారం చిత్తూరులో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. గిరింపేటలోని మందిరం వద్ద వందమంది దీన నారాయణులకు దుప్పట్ల వితరణ, అన్నదానం చేశారు. ఉయ్యాలసేవ, నగర సంకీర్తన, భజనలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. **పెనుమూరు:** స్థానిక బస్టాండు సమీపంలో సాయి సేవా భక్తులు పాపమ్మ, గోపీనాథ్ చౌదరి కుటుంబసభ్యులు సాయిబాబా చిత్రపటాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. నగరి: పట్టణంలోని సత్యసాయి సేవాదళ సభ్యులు, సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. విద్యార్థులకు ఉపకరణాలు వితరణగా అందజేశారు. సేవాదళ్ కన్వీనర్ న్యాయవాది మురళీధర్, సభ్యులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తహసీల్దారు షబ్బీర్‌బాషా, సిబ్బంది పాల్గొని సత్యసేవా మందిరంలో పనిచేస్తున్న మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వాదిస్తున్న అర్చకులు

అర్ధగిరి(తవణంపల్లె), న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం చేయించారు. ఆపై స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో మునిశేఖర్ పాల్గొన్నారు.

తీగ తగిలిందో.. ప్రాణం గోవిందా!

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గృహావసరాలకు విద్యుత్తు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ తీగలు చేతికందే ఎత్తులో ఉండటం, గృహాలకు సమీపంలో కిందికి వాలి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు పెనుగాలులకు కిందకు వాలడంతో ఈ పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో పాఠశాలలకు సమీపంలో, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిందకు వాలి ఉన్నాయి. ఎవరైనా ప్రమాదవశాత్తూ వీటిని తాకితే ప్రమాదం జరిగే అవకాశముంది. విద్యుత్తు శాఖ అధికారులు వాలిన విద్యుత్తు తీగలను స్తంభాలను బాగుచేయడంలో మీనమేషాలు లెక్కిస్తుండటంతో నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా మారింది.

సంపర్తి వీధిలో ఇంటికి అనుకుని వేలాడుతున్న విద్యుత్తు తీగలు

ప్రమాదకర గ్రామాలివే..

కార్వేటినగరం మత్స్యవిలాసంవీధి, సంపర్తివీధి, కొల్లాగుంట, టీకేఎంపేట, ఆర్‌కేవీబీపేట, సురేంద్రనగరం, డీఎంపురం, కేఎంపురం, గోపిశెట్టిపల్లి, వెదురుకుప్పం మండలంలోని గెరిగదొన, కన్నికాపురం, పచ్చికాపల్లం, పాతగుంట, బ్రాహ్మణపల్లి, శ్రీరంగరాజపురంలోని ముద్దికుప్పం, తయ్యూరు, మెదవాడ, నెలవాయి, జీడీనెల్లూరు మండలంలోని ఎగవూరు, బీసీకాలనీ, నల్లరాళ్లపల్లి, ఆవలకొండ, అక్కనగారిపల్లి, పాలసముద్రం మండలంలోని తిరుమలరాజుపురం, బాలకృష్ణాపురం, బలిజకండ్రిగ గ్రామాల్లో విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి.

తీగలు సరిచేయాలి..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్ల పరిసరాల్లో, పొలాల వద్ద తీగలు చేతికందే ఎత్తులో ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు వీటిని సరిచేయాలి.

- మురళి, కార్వేటినగరం

చర్యలు తీసుకుంటాం..

సబ్ డివిజన్ పరిధిలో కొన్ని గ్రామాల్లో తీగలు కిందకు వాలాయనే విషయం తెలిసింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అలా జరగొచ్చు. వెంటనే సరిచేయిస్తాం. ఎక్కడైనా తీగలు ప్రమాదకరంగా ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా.

- చంద్రబాబు, ఏడీఈ, కార్వేటినగరం

లారీ కూరుకుపోయి రాకపోకలకు అంతరాయం

నింద్ర, న్యూస్‌టుడే: మేళంబాకంలో కొత్తగా పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టడానికి సిమెంటు లోడు తెప్పించారు. ఆ మార్గం సింగిల్ రోడ్డు కావడంతో రోడ్డుకు అంచున లారీ నిలిపి బస్తాలను దింపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో లారీ దిగబడింది. అప్పుడే అక్కడకు చేరుకున్న పుత్తూరు- ఎలకాటూరు-నగరి ఆర్టీసీ బస్సు వెళ్లేందుకు అంతరాయం ఏర్పడింది. దీంతో చవరంబాకం ప్రధాన రోడ్డు వద్ద నగరి-నాగలాపురం మీదుగా నగరికి బస్సును దారి మళ్లించి తీసుకెళ్లారు. ఈ మార్గంలో ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. సిమెంటు బస్తాలన్నీ దింపాక.. జేసీబీ సాయంతో లారీని బయటకు తీయడంతో సమస్య పరిష్కారమైంది.

ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

చెకుముకి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కార్వేటినగరం: జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి ప్రతిభ పరీక్షలో కార్వేటినగరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని ఆ పాఠశాల హెచ్ఎం శేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జన విజ్ఞాన వేదిక కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెలికితీయడానికే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

గుడిపాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలని తెదేపా సీనియర్ నాయకుడు చంద్రమోహన్ కోరారు. వివిధ పనుల కోసం వారు పలు ప్రభుత్వ కార్యాలయానికి వస్తుంటారని అక్కడ మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మండల కార్యాలయాల వద్ద వీటి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
E.P.No.35 of 2016
O.S.No.92 of 2003
Between:
K. Appaswami Naidu (died) and others ... Decree Holders.
And:
Selvam (Died) and others ... Judgment Debtors.
NOTICE UNDER ORDER 21, RULE 32 CPC TO JUDGEMENT DEBTORS NO.5 TO 7
To
1. S. Kesavan, S/O. Selvam, residing at Konapalle Village, Periambadi Post,Yadamari Mandal, Chittoor District. (JDr No.5)
2. S. Rajendran, S/O. Selvam, residing at Konapalle Village, Periambadi Post,Yadamari Mandal, Chittoor District. (JDr No.6)
3. S. Babu, S/O. Selvam, residing at D.No. 27-111/1, Telephone Colony, Chittoor (JDr No.7)
Please take Notice that the above E.P is filed by the D.Hrs against you and others to detain you in the civil prison for disobeying the permanent injunction orders of the above Hon'ble Court in O.S.No. 92 of 2003 under Order 21 Rule 32 C.P.C and the said petition stands posted to 03.12.2025 for your appearance before the above said Hon'ble Court. Please attend before the above said Court on 03.12.2025 at 10-30 a.m. either in person or through your counsel and to file your objections if any, failing which the matter will be decided exparte.
Sd/-C.SURESH REDDY
Advocate for Decree-Holders
Place:Chittoor,Date:22.11.2025

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

పుట్టపర్తి సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పుట్టపర్తి సత్యసాయి శతజయంతి ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **వి.కోట:** మండల కేంద్రంలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదానం చేపట్టారు. సత్యసాయి పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ.. పుట్టపర్తికి ఇక్కడి నుంచి దాదాపు రూ.60వేల విలువ చేసే కూరగాయల్ని వితరణగా పంపినట్లు పేర్కొన్నారు.

వీధుల్లో శుభ్రత పనులు

పలమనేరు: పట్టణంలోని తహసీల్దారు వీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పరిసరాలు అధ్వానంగా ఉండటంతో 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త రావడంతో అధికారులు స్పందించారు.

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: గూడూరుపల్లెలో మురుగు కాలువలు శుభ్రం చేయాలి
– సాయికుమార్
సమాధానం: గ్రామంలోని కాలువలను శుభ్రం చేయించి వీధుల్లోని చెత్త, వ్యర్థాలను తొలగిస్తాం.
– సురేష్ బాబు, కార్యదర్శి

పెద్దపంజాణి: సమస్య: చలమంగళంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిలో మురుగునీరు, వర్షపునీరు నిలిచి నడిచేందుకు ఇబ్బందికరంగా ఉంది. – శ్రీనివాసులు
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – బాలాజీ, ఎంపీడీవో

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: దళవాయికొత్తపల్లె నుంచి అమరావతి కాలనీ వెళ్లే దారిలో కాలువలు లేక రోడ్డుపై మురుగు నిల్వ ఉంటోంది. – తిరుపతి
సమాధానం: మురుగు లేకుండా చూస్తాం. – కమిషనర్

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని ముత్తాచ్చారిపాళ్యం ఒకటో వీధిలో కాలువల్లో మురుగు పేరుకుపోయింది. - రంగయ్య
సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం.
– ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండు ఆవరణలో మురుగునీరు నిల్వ ఉంటోంది. – రామయ్య
సమాధానం: మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. – హరిబాబు, కార్యదర్శి, బొమ్మయ్యగారిపల్లె

కుటుంబ సాధికారత సమితి సభ్యుల పాత్ర కీలకం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: రాబోవు సర్పంచి ఎన్నికల నేపథ్యంలో కుటుంబ సాధికార సమితి సభ్యుల పాత్ర కీలకమని సంస్థాగత ఎన్నికల పరిశీలకులు నాగేశ్వరనాయుడు పేర్కొన్నారు. మండలంలోని పుదిపట్లలో ఆదివారం సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. పంచాయతీ అధ్యక్షుడిగా తేజ్‌ప్రకాష్‌రెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, గువ్వల రమేష్‌రెడ్డి, బగ్గిడి గోపాల్, లక్ష్మీపతి రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరనాయుడు

ఆరడుగుల నేలా కరవే..!

❖ చెరువు, కుంటలు, కాలువలే ఆదరువు

పుంగనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శ్మశానవాటికలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాలకు ఉన్న కొద్దిపాటి శ్మశాన స్థలాలనూ అక్రమార్కులు ఆక్రమిస్తున్నారు. ప్రతి గ్రామానికి శ్మశానం అవసరమని ప్రభుత్వ స్థలం ఉంటే కేటాయిస్తాం లేదంటే కొనుగోలు చేసి కేటాయిస్తామని నెల నెలా జరిగే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తహసీల్దార్లు ఇస్తున్న హామీలు ప్రకటనలకే పరిమితమవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పుంగనూరు చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. బతికినంత కాలం భూమి కోసం పోరాడుతున్న సామాన్యులు మరణించాక ఖాళీ జాగా లేక అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి పడే యాతన నరకాన్ని తలపిస్తోంది. భూములు ఉన్న రైతులు తమ పొలాల్లో అంత్యక్రియలు చేస్తుంటే భూములు లేనివారు వంకలు, వాగులు, చెరువులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురవడం, కృష్ణాజలాలతో చెరువులు, కుంటలు నిండటంతో ఖననం కష్టతరమవుతోంది.

పుంగనూరులో ఖననం చేసే గోతిలో ఊరిన నీటిని తోడుతున్న వ్యక్తి

పుంగనూరు పురపాలికలో..

పుంగనూరు పురపాలకలోని ఎన్ఎస్‌పేట, బీడీకాలనీ ప్రజలు పుంగమ్మ చెరువును, చెంగళాపురం, అరవ ఇండ్లు, తోపుమఠం ప్రజలు కౌండిన్య కాలువను శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారు. సుమారు వంద దళితవాడలు, తండాలకు చెరువులు, కుంటలు, వంకలే శ్మశానాలు. ఈ నియోజకవర్గాల్లో శ్మశానాలు లేని గ్రామాలు, కాలనీలు, దారి సౌకర్యం లేనివి, ఆక్రమణకు గురైనవి వందల సంఖ్యలో ఉన్నాయి. శ్మశాన సమస్య ఉన్నవారు రాతపూర్వకంగా వినతి చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని పుంగనూరు తహసీల్దారు రాము పేర్కొంటున్నారు.

హంద్రీ-నీవాతో చెరువులకు జలకళ

❖ ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

వి.కోట, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ ఏడాది పలుచోట్ల వర్షాలు అధికంగా కురిశాయి. అయితే వి.కోట ప్రాంతంలో మాత్రం తక్కువ వర్షపాతం నమోదైంది. మూడేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో బోర్లు సైతం ఎండిపోయాయి. కానీ హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు రావడంతో మండలంలో పలు చెరువుల్లో జలకళ సంతరించుకుంది.

వి.కోట మండల పరిధిలో మూడు ఏళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో దాదాపు 1,200 నుంచి 1,500 లోతుకు భూగర్భజలాలు అడుగంటాయి. హంద్రీ-నీవా జలాల వల్ల తిరిగి భూగర్భ జలాల మట్టం పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పెద్దభరిణేపల్లె, నెర్నిపల్లె, వి.కోట, తోటకనుమ, కృష్ణాపురం తదితర పంచాయతీల్లో నీటి సమస్య తీరింది.

మొరవపోతున్న కీలపల్లె చెరువు

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

హంద్రీ-నీవా కాలువ కర్ణాటక సరిహద్దును తాకుతూ వెళ్తుంది. కర్ణాటకలోని పంతనహళ్లి వి.కోటకు కేవలం రెండు కి.మీ దూరంలో ఉంటుంది. పంతనహళ్లికి చెందిన చెరువుల్లో చుక్క నీరు లేకపోవడం పొరుగునే ఉన్న వి.కోట మండలంలోని చెరువులు కృష్ణాజలాలతో నిండటంతో కర్ణాటక వాసులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీ ఎన్జీవో సంఘం పని చేస్తోందని ఆ సంఘ తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని అంశాలపై, హక్కుల సాధనపైన నిరంతర పోరాటం సాగిస్తున్నారు. సమావేశంలో సంఘ కార్యదర్శి జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, సభ్యులు రమణ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కాస్త ఆలోచించి బాగు చేయండయ్యా..!

పలమనేరు, న్యూస్‌టుడే: పెరుగుతున్న జనాభా, ఇరుకు వీధుల కారణంగా చిన్న శుభకార్యమైనా ప్రత్యేక మండపాలు తీసుకోవాల్సిన పరిస్థితి. అయితే పేదవారికి ఇది కష్టతరం. చిన్నచిన్న కార్యక్రమాలు పెళ్లిచూపులు, సంతర్పణలు, కేశఖండన తదితరాలు చేసుకోవాలంటే పట్టణంలో సరైన వసతి లేక, ఉన్నా అద్దె భరించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆలాంటి వారంతా కూడా పట్టణంలోని గుండుబావి వద్ద చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. గుండుబావి వద్ద పరిసరాలు అధ్వానంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుండుబావి అధ్వానంగా మారిపోయింది.

పట్టణ జనాభా: 53 వేలు
ప్రైవేటు మండపానికి అద్దె: రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు
చిన్న కార్యక్రమాలు చేసుకోవాలంటే: రూ.30 వేలు

శుభ్రం చేస్తే బాగుంటుంది

గుండుబావి పరిసరాలను శుభ్రంగా ఉంచడమే కాకుండా ప్రహరీ మరమ్మతులు చేసి ఎవరినీ లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇక కార్యాలు చేసుకునే వారి కోసం షెడ్డు నిర్మిస్తే అనుకూలంగా ఉంటుంది.

గుండుబావి వద్ద పూజలు చేస్తున్న పట్టణవాసులు

మరమ్మతులు చేస్తాం

అందరికీ అందుబాటులో ఉండేలా గుండుబావి మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం 1975-76లో పదో తరగతి చదువుకున్న వారు ఆత్మీయ సమావేశమయ్యారు. 50 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: గ్రామాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మండలంలోని ఆమినిగుంట పంచాయతీ నూనెముద్దనపల్లె వాసులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కొండామర్రి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని పక్కనే ఉన్న రైతు ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పోలీసుస్టేషన్ ఎదుట నూనెముద్దనపల్లె వాసులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని గొంగివారిపల్లె రాజీవ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామివారికి కల్యాణోత్సవం చేశారు.



అసంపూర్తి పనులతో అవస్థలు

పుంగనూరు మండల పరిధిలోని ఏటవాకిలి పంచాయతీ కేంద్రంలో సచివాలయ భవన నిర్మాణం రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. పక్కనున్న రైతు సేవా కేంద్రం పరిస్థితీ ఇలానే ఉంది. దీంతో సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. గ్రామస్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరైతే పనులు చేస్తామని ఎంపీడీవో అప్పాజీ తెలిపారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

ఈ స్టాండు.. బస్సులకా.. ఆటోలకా..?

పలమనేరు పట్టణంలోని ఆర్టీసీ బస్సులు నిలిపే స్థలంలో ఆటోవాలాల హవా కనిపిస్తోంది. బస్టాండులోకి ఇతర వాహనాలను అనుమతించకూడదు. కానీ ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆటోలు, కార్లు ప్రయాణికుల కోసం లోపలకు వస్తున్నాయి. ప్రైవేటు కార్లు రోజంతా అన్న క్యాంటీన్ వైపు వరుసగా ఉంచుతున్నాయి. దీంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

- న్యూస్‌టుడే, పలమనేరు

నడవాలంటే రోచ్చురోడ్డే దిక్కు

పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలోని రోడ్డు అధ్వానంగా తయారైంది. కమిటీ నుంచి వెలుపలికి వచ్చే దారి బురదతో ఉండటంతో రైతులు మార్కెట్‌లోకి రావడానికి ఇబ్బందిగా మారింది. మార్కెట్‌లో అంతర్గత రోడ్లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, పలమనేరు

శుద్ధజలం అందక.. తిప్పలు

గుడుపల్లె మండలంలోని పలు గ్రామాల్లో శుద్ధినీటి కేంద్రాలకు మరమ్మతుకు గురికావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మిట్టూరులో శుద్ధజల పంపిణీ కేంద్రం అలంకారప్రాయంగా మారడంతో ప్రజలు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయమై కుప్పం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తంను వివరణ కోరగా.. డిసెంబరు నెలాఖరుకల్లా కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లో మరమ్మతుకు గురైన కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, గుడుపల్లె

తెలుగు సాహిత్యానికి మూడున్నర దశాబ్దాల సేవ

పలమనేరు, న్యూస్‌టుడే: రచయిత పలమనేరు బాలాజీ తెలుగు సాహిత్యానికి మూడున్నర దశాబ్దాలుగా సేవ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బాలాజీని ఆదివారం జన విజ్ఞాన వేదిక సభ్యులు సత్కరించారు. జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఆ సంస్థ జిల్లా నాయకులు సాహితీ పురస్కారాన్ని అందించారు. జన విజ్ఞాన నాయకులు అరుణశివప్రసాద్, యుగంధర్‌బాబు, సుదర్శనాచారి, జయంతి, కోమల రవీంద్ర పాల్గొన్నారు.

బాలాజీని సత్కరిస్తున్న సభ్యులు, అధికారులు

సమాజ సేవే ఆర్ఎస్ఎస్ ధ్యేయం

పుంగనూరు గ్రామీణ: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఆర్ఎస్ఎస్ ముందుంటుందని భాజపా పట్టణ అధ్యక్షుడు జగదీశ్ రాజు తెలిపారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఆదివారం గృహసంపర్క కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు త్రిమూర్తిరెడ్డి, చంద్రరాజు, వెంకటరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న జగదీశ్ రాజు

నేడు గ్రీవెన్స్ రద్దు..

కుప్పం పట్టణం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కొన్ని కారణాలతో రద్దు చేస్తున్నట్లు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

18 మండలాల్లో వర్షం..

చిత్తూరు(మిట్టూరు): అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి జిల్లాలోని 18 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. నింద్ర 8.2, యాదమరిలో 7.4 మి.మీటర్లు కురవగా. . మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

శిబిరానికి విశేష స్పందన

సదుం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన శిబిరంలో దివ్యాంగులు, వృద్ధులకు పరికరాలు అందించేందుకు ఎంపిక చేశారు. వివిధ మండలాల నుంచి అధికసంఖ్యలో హాజరయ్యారు. అధికారులు ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. పలమనేరు ఆర్డీవో భవానీ, తహసీల్దారు ప్రమీల, ఎంపీడీవో రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

శిబిరానికి హాజరైన ప్రజలు

యువకుడి నిజాయతీ

పెద్దపంజాణి: చరవాణి పోగొట్టుకున్న బాధితుడికి యువకుడు తిరిగి అందించి తన నిజాయతీ చాటుకున్న ఘటన పెద్దపంజాణిలో ఆదివారం జరిగింది. వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన చాన్‌బాష పలమనేరుకు ఆటోలో వెళ్తుండగా... గంగవరం సమీపంలో రోడ్డుపై చరవాణి దొరికింది. ఎంతసేపటికీ చరవాణికి ఫోన్ రాకపోవడంతో తనవెంట తెచ్చుకున్నాడు. గంగవరానికి చెందిన రాజేష్ ఫోన్ చేసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా చరవాణి పోగొట్టుకున్నానని చెప్పడంతో యువకుడు అందించాడు. చాన్‌బాషను పలువురు అభినందించారు.

పెచ్చులూడి ప్రమాదకరంగా మారి

ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తూ గృహాలను మంజూరు చేస్తున్న గృహ నిర్మాణ శాఖ కార్యాలయ గది పెచ్చులూడి, కమ్మీలు తేలి ప్రమాదకరంగా మారింది. కుప్పం మండల పరిషత్ కార్యాలయ భవనంలో కొనసాగుతున్న గృహ నిర్మాణ శాఖ గది పైభాగం పెచ్చులూడటంతో సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.
- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

వి.కోట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకొంది. సీఐ సోమశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. గాండ్లపల్లెకు చెందిన వరలక్ష్మి(28) స్థానిక పలమనేరు రోడ్డులో బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం యథావిధిగా దుకాణం మూసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ వరలక్ష్మిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో వృద్ధుడి మృతి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో గురువారెడ్డి(70) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందారు. గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీకి చెందిన వృద్ధుడు బస్టాండులో విగతజీవిగా పడి ఉండటంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఈ క్రమంలో ఆకస్మికంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఏనుగుల దాడిలో పంట నష్టం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కౌండిన్య అభయారణ్యం సరిహద్దులోని గౌనితిమ్మేపల్లి ఎర్రచేను వద్ద శనివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన బడాబచ్చాని పొలంలో ఎకరం వరి పంటను ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి.

వేధింపులపై కేసు

పుంగనూరు గ్రామీణ: మండలంలోని ఓబిరెడ్డిపల్లెకి చెందిన మల్లికను అదే గ్రామానికి చెందిన వెంకటరమణ, భార్య ఉమ, శాంతమ్మలు వేధించి దాడి చేయడంతో.. మల్లిక ఫిర్యాదు మేరకు కేసు ఆదివారం నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోటీకెళ్తే.. పతకాలే..!

✦ సత్తా చాటుతున్న విద్యార్థులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ బాలబాలికలు ప్రతిభ చాటుతున్నారు. పిల్లల అభిరుచి, ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. పుంగనూరు మండలానికి చెందిన విద్యార్థులు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి..

చంద్రమాకుల్పల్లెకు చెందిన శివకుమార్, విజయ దంపతుల కుమార్తె గానవి. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల మదనపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తనదైన ప్రతిభ చాటింది. పీడీ మురళీధర్ ప్రోత్సాహంతో నిత్యం శిక్షణ తీసుకుంటా పోటీల్లో సత్తా చాటుతోంది. ఈ నెల 25న ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణపూర్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తలపడనుంది. అంతర్జాతీయ క్రీడల్లో రాణించడమే తన లక్ష్యమంటోంది.

ప్రశంసలు అందుకుంటూ..

పాలెంపల్లె పంచాయతీ ఊటూరుకు చెందిన శ్రీనివాసులు నాయక్, రాధిక దంపతుల కుమారుడు జ్యోతి ప్రసాద్‌నాయక్. పూజగానిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నాడు. పీడీ ఉమాదేవి విద్యార్థి పట్టుదలను చూసి ఆ దిశగా ప్రోత్సహిస్తోంది. జ్యోతిప్రసాద్ మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీల్లో సత్తాచాటాడు. ఈ నెల 22న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థులు

బైరెడ్డిపల్లె మండలం తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీపతి తెలిపారు. పాఠశాల విద్యార్థులు కావేరి, ప్రత్యూష జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. విజయనగరంలో ఈ నెల 24, 25న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు తలపడనున్నట్లు పేర్కొన్నారు.
- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

గొట్టాలకు మరమ్మతు చేయరూ..?



మండల పరిధిలోని ఏటవాకిలి ఎస్సీ కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు గొట్టాలు మరమ్మతుకు గురై నీరు వృథాగా పోతోంది. గొట్టాలు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో అప్పాజీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతు చేయిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

(c) eenadu

ఉత్సాహం.. గజ్జెల కోలాటం

పోడలాడలో శ్రీరామ సెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గజ్జెల పూజ ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద మహిళలు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. - న్యూస్‌టుడే, రాజోలు

నువ్వా.. నేనా..!

ఫెన్సింగ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు సఖినేటిపల్లి మండలం మోరి జడ్పీ ఉన్నత పాఠశాల ముస్తాబైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఘనంగా చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పోటీలకు ఇప్పటికే వివిధ పాఠశాలల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు చేరుకున్నారు. క్రమశిక్షణతో సాధన చేస్తున్నారు.

సాధన చేస్తున్న విద్యార్థులు

ఆధ్యాత్మిక పరవశం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈవో ఎన్ఎస్ చక్రధర రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

పేర్లు తికమక.. తేదీల్లో తప్పులు

అపార్ నమోదుకు ఆటంకంగా మారిన వైనం

పరిశీలన

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

విద్యార్థులకు ఒకే గుర్తింపు సంఖ్య కోసం ప్రవేశపెట్టిన అపార్ నమోదుకు ఆధార్‌లో తప్పులు ప్రతిబంధకంగా మారాయి. ఆధార్, పాఠశాల రికార్డులు, జనన ధ్రువీకరణ పత్రంలో పుట్టిన తేదీ ఒకేలా ఉండాలని చెబుతున్నారు. వీటిలో తేడా ఉన్నవారు పుట్టిన తేదీని మార్పు చేయాలని, తప్పుగా నమోదైన పేర్లు సరిచేయాలని అభ్యర్థులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

అల్లవరంలో విద్యార్థులకు అపార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ముందుకు సాగక..

నోటరీ, ఇతర ధ్రువీకరణ పత్రాలతో సచివాలయాల్లో దస్త్రాలు సమర్పించినా తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది అడిగినంత ఇవ్వకుంటే అక్కడి నుంచి దస్త్రాలు ఆర్డీవో కార్యాలయానికి కదలడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. 90 రోజుల తర్వాత పలు సాంకేతిక కారణాలు సాకుగా చూపిస్తూ అర్జీని తిరస్కరిస్తున్నారని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో నెలలుగా అపార్ నమోదు ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఏం జరుగుతోందంటే..

- 18 ఏళ్లలోపు వారికి ఆర్డీవో జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువ పత్రం అప్‌లోడ్ చేస్తేనే అపార్ నమోదుకు అవకాశం ఇచ్చారు.
- వయసు ధ్రువీకరణకు పదో తరగతి ధ్రువ పత్రాన్ని వినియోగిస్తున్నా, ఈ నిబంధనలతో 18 ఏళ్లు నిండిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- జనన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసిన సమయంలోనే అన్ని పత్రాలను పరిశీలించాల్సి ఉండగా, డబ్బులు చెల్లించక పోవడంతో సాకులు చెప్పి కొంత కాలానికి తిరస్కరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.
- ఆధార్‌లో పుట్టిన తేదీ సరిదిద్దాలంటే సచివాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు విద్యార్థులు తల్లిదండ్రులు తిరుగుతున్నారు. ఈ క్రమంలో తమకు రూ.4 నుంచి రూ.5వేల వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు.
- ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల వరకు ఎంఈవోలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధానం నిలిపివేశారు.

విద్యార్థులు మిగిలిపోయారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేలా తక్షణం చర్యలు తీసుకుంటాం.

అధికారులతో చర్చిస్తాం

అపార్ నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. కొంత మంది విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాల సమస్యలు ఉన్నాయి. ఇంకా 10వేలకు పైగా ... -సలీం బాషా, డీఈవో

జిల్లాలో వివరాలు

తరగతి	విద్యార్థులు	అపార్ నమోదు	చేయాల్సిన వారు
పదో తరగతి లోపు	2,14,416	2,07,252	7,164
ఇంటర్మీడియట్	26,593	21,806	4,787

ఇక పక్కాగా.. సమాచారం

వసతిగృహాల పర్యవేక్షణపై ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

వసతిగృహాల్లో పొరపాట్లు, అవకతవకలకు అస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా కృత్రిమ మేధ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ప్రతి చిన్న పని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వసతిగృహాల్లో వార్డెన్ల పనితీరును గాడిన పెట్టేందుకు ఈ యాప్ ఓ సూచికగా నిలవనుంది. ఇటీవల జిల్లాలోని అన్ని వసతిగృహాల్లోని సంక్షేమ అధికారులకు ఈ యాప్‌ను చరవాణీల్లో వేయడమే కాకుండా పని తీరును వివరించారు.

జిల్లా సమాచారం
- ఎస్సీ వసతిగృహాలు 33
- విద్యార్థుల సంఖ్య 2900
- బీసీ 21
- విద్యార్థుల సంఖ్య 859
- గురుకుల పాఠశాలలు 06
- విద్యార్థుల సంఖ్య 3480

ప్రత్యేకతలు ఇవే

వసతి గృహాల్లో పారదర్శకతను పెంచేలా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) పేరుతో ఓ సరికొత్త యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రోజూ చేపట్టే పనులతోపాటు వారాంతం, నెలవారీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అమలు చేసేలా చర్యలు తీసుకుంటుంది. వసతి గృహాల్లో కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు, ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదులు శుభ్రత అన్నీ ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసేలా ఆప్షన్లు పొందుపరిచారు. వసతి గృహాల్లో ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా వార్డెన్లకు ఈ యాప్ ద్వారా తక్షణమే హెచ్చరికలు వెళ్తాయి.

అమలాపురంలో యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తున్న అధికారి

నిరంతరం నిఘా..

హెచ్‌పీటీఎస్ యాప్‌తో వసతి గృహాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్టపడనుంది. ప్రధానంగా భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు ఆ ఆహారం సరిపోతుంతా.. లేదా అనే విషయాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. ఆహార పదార్థాల నాణ్యత సక్రమంగా ఉన్నదీ..? లేనిదీ..? తెలుసుకునే వెసులుబాటు ఉంది. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ జరిగితే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు.

నీరుగారిన లక్ష్యం

మూలకు చేరిన ఎత్తిపోతల పథకాలు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

చెంతనే గోదావరి నది, ప్రధాన కాలువ ఉన్నా.. ఏటా సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎత్తిపోతల పథకాలు మూలకు చేరినా పట్టించుకునేవారే లేరు. దీనివల్ల పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. భవనాలు శిథిలావస్థకు చేరాయి.

చెత్తాచెదారంతో పూడిపోయిన కాలువ

ఇదీ పరిస్థితి..

- 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఉచ్చిలి ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. మోటార్లు, పంపులు మరమ్మతులకు గురయ్యాయి. భవనం బీటలు వారి కూలిపోయే స్థితిలో ఉంది. ఈ పథకం ద్వారా ఉచ్చిలి, ఆత్రేయపురం, లొల్ల, వాడపల్లి గ్రామాల్లోని 1,300 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. పథకం పనిచేయక పంట కాలువ బక్కచిక్కిపోయింది. ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురైంది.
- వసంతవాడ పథకానికి సంబంధించిన భూగర్భంలోని పైపులైన్లు దెబ్బతిన్నాయి. లీకుల ద్వారా సాగునీరు ఉబికి పైకి వస్తోంది. దీని పరిధిలో వసంతవాడ, తాడిపూడి, కట్టుంగ, అంకంపాలెం, నార్కెడుమిల్లి పొలాలకు సాగునీరు అందాలి. సార్వా గట్టెక్కినా దాళ్వా పంటకు సక్రమంగా నీరందే సూచనలు కనిపించడం లేదు. ఈ సమస్యలను మండల ఇరిగేషన్ ఏఈ వెన్నా సాయిమాధవ ప్రసన్న వద్ద ప్రస్తావించగా దాళ్వా సాగుకు ఇబ్బందులు ఏర్పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
- పేరవరం ఎత్తిపోతల పథకం అంతంతమాత్రంగానే పనిచేస్తోంది. తరచూ మరమ్మతులకు గురవుతోంది. పేరవరం, రాజవరం, వెలిచేరు, పులిదిండి, వద్దిపర్రు ప్రాంతాలకు సుమారు 2వేల ఎకరాల పైబడి ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. రాజవరం వద్ద కాలువ రక్షణ గోడ కూలిపోయింది. దాని వ్యర్థాలు కాలువలో అలాగే ఉన్నాయి. వెలిచేరు తదితర చోట్ల కాలువ గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయింది.

సమనస విద్యార్థులకు జాతీయ పురస్కారం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమనస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఈజీ మిషన్ టూల్స్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి పురస్కారం వచ్చినట్లు జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 52వ రాష్ట్రీయ వైజ్ఞాన ప్రదర్శనలో రాష్ట్రం నుంచి 6 ప్రాజెక్టులు పాల్గొన జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. వీరికి అధికారులు పురస్కారం అందజేశారు. విద్యార్థులను డీఈవో సలీం బాషా అధికారులు అభినందించారు.

77 మంది అనర్హుల తొలగింపు

యానాం, న్యూస్‌టుడే: నకిలీ ఆధార్ కార్డులు, రిజిస్ట్రేషన్ సంఖ్యలను సమర్పించి పుదుచ్చేరి మత్స్యశాఖ నుంచి ప్రకృతి వైపరీత్య, వేట నిషేధ సహాయం పొందేందుకు దరఖాస్తు చేసిన 77 మందిని జాబితా నుంచి తొలగించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఆ వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచారు. పుదుచ్చేరిలో 10,267 మంది, కారైకాల్‌లో 3,990, మాహేలో 527, యానంలో 5,216 మంది సహాయం కోసం దరఖాస్తు చేశారు. వీరిలో పుదుచ్చేరి - 18, కారైకాల్- 5, మాహే- 3, యానాం -51 మంది నకిలీ ఆధార్, రిజిస్ట్రేషన్ నంబర్లు సమర్పించారు.

హూ.. హా.. నేర్చుకుందాం బాగా..!

విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య

న్యూస్‌టుడే, పామర్రు

పాఠశాల విద్యార్థినుల ఆత్మరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా యుద్ధ విద్యల్లో శిక్షణనిస్తోంది. బాలికల్లో మనోధైర్యం పెంచడం, దేహ దారుఢ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, అవసరమైనపుడు తమను తాము రక్షించుకునే నైపుణ్యాలు సాధించడమే లక్ష్యంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. గతేడాదిలో శిక్షణ ప్రారంభించినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సరిగా అమలు కాలేదు. ఈసారి పకడ్బందీగా శిక్షణ కొనసాగేలా ప్రభుత్వం ప్రణాళిక ఖరారు చేసింది. రాష్ట్రంలో జోన్ 2, 3 పరిధుల్లో వివిధ యాజమాన్యాల్లో నిర్వహిస్తున్న 1,592 ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

సాధన చేస్తున్న బాలికలు

- కార్యక్రమం పేరు: రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్
- ఎంపికచేసిన పాఠశాలలు: ఉమ్మడి జిల్లాలో 661 (కోనసీమ 213, తూర్పుగోదావరి 231, కాకినాడ 217)
- ఎవరెవరికి: 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాలికలు
- శిక్షణ వివరాలు: 2025-26 విద్యా సంవత్సరంలో రెండు నెలల పాటు 20 తరగతులు నిర్వహిస్తారు.
- అంశాలు: ముఖ్యంగా కరాటే, మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్, ఆత్మరక్షణ పద్ధతులు
- నిర్వహణ: సమగ్ర శిక్ష అభియాన్
- పాఠశాలల్లో పర్యవేక్షణ: ప్రధానోపాధ్యాయులు, పీఈటీ, పీడీలు
- శిక్షణ ఇచ్చేవారు: ప్రత్యేకంగా నియమితులైన ఏజెన్సీ నుంచి శిక్షకులు, మహిళా శిక్షకులకు ప్రాధాన్యం ఇస్తారు.

గాయాలైనా దిక్కు లేదు..!

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

బస్సుల్లో పేరుకే ఫస్ట్ ఎయిడ్ బాక్సు.. అంటూ కనిపిస్తున్నా.. దానిని తెరిచిచూస్తే ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన సామగ్రి అందులో ఉండటం లేదు. కొన్ని బస్సుల్లో అసలు పెట్టెలే లేని పరిస్థితి. అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని కొన్ని బస్సులను ఆదివారం పరిశీలించగా.. ప్రథమ చికిత్స పెట్టెల్లో కిట్లు కనిపించ లేదు. కొన్నింటిలో కాటన్ బండిల్స్ దర్శనమిస్తుంటే.. మరి కొన్నింటిలో కాలం చెల్లినవి ఉన్నాయి.

ఎస్.యానం పల్లెవెలుగు బస్సులో ఖాళీగా ప్రథమ చికిత్స కిట్ బాక్స్

అమలాపురం డిపో సమాచారం	
బస్సులు	130
రోజువారీ ప్రయాణికులు	43 వేలు

ఏం ఉండాలంటే..

- ఎలస్టిక్ బ్యాండేజ్ రోలర్స్
- స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్
- బెటాడిన్ ఆయింట్‌మెంట్
- నియోస్ప్రిన్ పౌడర్
- డెటాల్ బాటిల్
- బర్నాల్ ఆయింట్‌మెంట్
- కొత్త బ్లేడ్
- ఎలస్టిక్ ప్లాస్టర్

చారిత్రక దర్గా.. మహిళలకే ప్రవేశం

ఈ నెల 25న షహదత్

దక్షిణ భారతదేశంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో ఉన్న బీబీ ఫాతెమాజహెరా దర్గా చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహ్మద్ ప్రవక్త తనయగా, కర్బలా యుద్ధభూమిలో అమరత్వం పొందిన ఇమామ్‌హసన్, ఇమామ్‌హుస్సేన్‌కు తల్లిగా ముస్లింలకు ఆరాధ్యనీయురాలుగా ఆమె అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది. సంఘ నాయకులు చెబుతున్నారు. తాటాకులతో ఉండే ఇక్కడి ప్రదేశంలో క్రీ.శ.1576లో కట్టడం నిర్మితమైంది. ఇందులో ఫాతెమా జహెరాకు చెందిన స్మారక నిర్మాణం(మజార్) ఉంది. 2022లో ఈ పురాతన కట్టడంపై రూ.కోటి వ్యయంతో గోళాకార స్తూపాన్ని నిర్మించారు. మహిళలకు మేలి ముసుగు(పరదా) సంప్రదాయాన్ని తీసుకొచ్చి వారి గౌరవాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దిన మహోన్నత మహిళగా ఆమె ఖ్యాతికెక్కింది. ముస్లిం క్యాలెండర్‌లో జమాదుసానీ(ఆఖర్) మాసంలో 3న అంటే నవంబరు 25 మంగళవారం పాశర్లపూడి దర్గాలోని ఫాతెమాజహెరాకు మహిళలు షహదత్(వర్ధంతి) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ విశేషమేమిటంటే దర్గాలో దర్శనానికి మహిళలు తప్ప పురుషులు ఎవర్నీ అనుమతించరు. గర్భిణులను కూడా లోనికి వెళ్లనివ్వరు. మహిళలు తమ కోర్కెలను నెరవేరాలంటూ గాజులు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. పలువురు అక్కడ తలనీలాలను కూడా ఇస్తుంటారు. -న్యూస్‌టుడే, మామిడికుదురు

పాశర్లపూడిలోని ఫాతెమాజహెరా పురాతన దర్గా

శాంతి మంత్రం.. సత్యసాయి సందేశం

అమలాపురం పట్టణం: మానవసేవయే మాధవసేవగా భావించి భగవాన్ సత్యసాయిబాబా సమాజానికి సేవలందించారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం మహిపాలవీధిలోని సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో మాధవి సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ● సత్యసాయి బాబా ఆధ్యాత్మికవేత్తగానే కాకుండా విద్య, వైద్యం, తాగునీటి సరఫరా వంటి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారని ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు.

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవంలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో మాధవి

నేటి నుంచి.. రైతన్నా మీ కోసం

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏడాదికి సగటున 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ఈ నెల 24 నుంచి డిసెంబరు 3 వరకు ఇంటింటా వారోత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమైంది. రానున్న అయిదేళ్ల కాలంలో రైతును రాజుగా చేసేందుకు ప్రధానమైన అయిదు విధానాలపై కార్యాచరణకు అధికారులు సిద్ధమయ్యారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అంశాలతో పాటు పాడి రైతులకు అండగా ఉండటం, సంపద సృష్టించేందుకు పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, సంక్షోభం నుంచి సంక్షేమం వరకు సాధించిన విజయాలను కరపత్రాల రూపంలో అందరికీ విశదం చేస్తారు. కార్యాచరణలో భాగంగా 24 నుంచి 29 వరకు ఆరు రోజులు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సేకరించిన సమాచారంతో నివేదికను సిద్ధం చేస్తారు. ఏడో రోజైన డిసెంబరు 3న కార్యశాల, సమావేశం ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించి ఇంటింటా ప్రచారానికి గ్రామస్థాయి అధికారులతో బృందాలను రూపొందించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు వారు పొందిన లబ్ధి గురించి వివరిస్తారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

బంగారు కావ్యం

వైద్యవిద్యలో 14 పతకాలు కైవసం

న్యూస్‌టుడే, సాంబమూర్తి నగర్(కాకినాడ)

ఎంబీబీఎస్‌లో చేరడానికి ర్యాంకు తెచ్చుకోవడం ఓ ఎత్తు అయితే, తర్వాత క్లిష్టతరమైన సిలబస్‌ను చదవడం మరో ఎత్తు.. అలాంటి వైద్యవిద్యలో సత్తా చాటుతూ ఉత్తమ విద్యార్థిని నిలిచారు మానస కావ్య. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో చదువుతున్న కావ్య ఇటీవల జరిగిన వార్షికోత్సవంలో ఏకంగా 14 బంగారు పతకాలు సాధించి ఔరా అనిపించారు.

ఎలా సాధించానంటే..

బంగారు పతకాల సాధనకు తాను చేసిన కృషిని కావ్య ఇలా వివరించారు. 'పరీక్షల సమయంలో ఎక్కువ కష్టపడతాను. రాత్రి పూట ఎక్కువ సమయం చదువుకు కేటాయిస్తాను. ఖాళీ సమయాల్లో, తరగతులు అయ్యాక కళాశాల లైబ్రరీకి వెళతాను. అక్కడ పూర్తి సమయం సద్వినియోగం చేసుకుని, వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తాను. ఆ తర్వాతే ఇంటికి వెళతాను. అమ్మతో పాటు నా బెస్ట్ ఫ్రెండ్ భవిత సహకారం ఎంతో ఉంది. కళాశాలలోనూ చక్కటి, ప్రశాంతమైన వాతావరణం ఉంది. చదువుతోపాటు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొంటాను. మొదటి ఏడాది నుంచి పలు సబ్జెక్టుల్లో నాలుగు, చివరి ఏడాదిలో మెడిసన్, సర్జరీ, బెస్ట్ ఔట్ గోయింగ్ తదితర విభాగాల్లో మొత్తం 10 బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉంది.'

కుటుంబ నేపథ్యం

కావ్యది గుంటూరు. తండ్రి ఆర్మీలో సుబేదార్ మేజర్‌గా చేస్తున్నారు. తల్లి గృహిణి. తండ్రి ఉద్యోగం రీత్యా ఆమె చాలావరకు విద్యాభ్యాసం హరియాణా, దిల్లీ ప్రాంతాల్లో సాగింది. చిన్నప్పటినుంచి మెడిసన్ చదవాలనే కోరికతో పట్టుదలతో చదివి నీట్‌లో 400వ స్టేట్ ర్యాంకు సాధించారు. ఆల్‌ఇండియా కోటా ద్వారా ఆర్ఎంసీలో చేరారు. 2020-25 యూజీ బ్యాచ్. ప్రస్తుతం చివరి ఏడాది హౌస్ సర్జన్ చేస్తున్నారు.

గదుల్లో దుర్వాసన.. ఆవరణ అస్తవ్యస్తం

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్వానంగా గదుల నిర్వహణ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కోనసీమ కల్యాణ వేంకటేశ్వర స్వామిగా పేరుపొందడంతో ఇక్కడి సన్నిధిలో ఏటా వందల వివాహాలు జరుగుతాయి. అంత ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయంలో నిర్వహణ అధ్వానంగా ఉండటంతో గదులు, ఆవరణ అస్తవ్యస్తంగా మారుతున్నాయి. వీటిని అద్దెకు తీసుకుంటున్నవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏసీ గదుల నుంచి దుర్వాసన వస్తోందని ఆదివారం తెల్లవారుజామున ఇక్కడ జరిగిన వివాహానికి వచ్చిన బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్వహణ కొరవడి..

ఆలయంలో 30 సాధారణ, 10 ఏసీ గదులు, రెండు సూట్‌రూమ్‌లు ఉన్నాయి. వివాహ సమయాల్లో వీటిని అద్దెకు ఇస్తారు. మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించక పోవడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితి. ఏసీ గదుల నుంచి దుర్వాసన వస్తోందని వివాహాలకు హాజరయ్యే బంధువులు చెబుతున్నారు. తినిపడేసిన అన్నం పేట్లను సకాలంలో ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. శనివారం రాత్రి ఏసీ గదులు అద్దెకు తీసుకున్నా.. దుర్వాసన రావడంతో మండపాల్లో ఉండాల్సి వచ్చిందని వివాహానికి వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లగా గదులను శుభ్రం చేయిస్తామన్నారు.

అధ్వానంగా మారిన వరండా

ధ్రువపత్రం పోయిందా.. మళ్లీ పొందండిలా..

ప్రతి ఒక్కరికీ విద్య, ఉద్యోగానికి కొన్ని ధ్రువపత్రాలు అవసరం. వీటిని ప్రయాణించే సమయంలో, ప్రమాదాల్లో, పొరపాటున మరిచిపోవడం వల్ల పోగొట్టుకునే అవకాశం ఉంది. అలాంటి సమయాల్లో నకలు మన చేతికి రావాలంటే కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉంది. అవేమిటో తెలుసుకుందాం.

పదో తరగతికి..: పదో తరగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పోగొట్టుకుంటే bse.ap.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. దానిని ప్రింట్ తీసి వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాలతో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ వారికి పోస్టు ద్వారా పంపించాలి.

ఇంటర్మీడియట్: ఇంటర్మీడియట్ ధ్రువపత్రమైతే bie.ap.gov.in వెబ్ సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ ఓపెన్ అవుతుంది. హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ ఐటీ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. అఫిడవిట్, ప్రిన్సిపల్ సంతకం చేసిన దరఖాస్తును అప్లోడ్ చేయాలి. తర్వాత చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ కొడితే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. -న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

ఇంతింతై.. అన్నదానమంతై

వాడపల్లి ఆలయం వద్ద పాత సత్రంలో భోజనాలు చేస్తున్న భక్తజనం

అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తాం.. ఆకలితో ఉన్న వారికి కడుపు నిండా భోజనం పెట్టడం ద్వారా మానవ సేవతో పాటు మాధవ సేవ చేసుకున్నంత పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని విశ్వసిస్తుంటారు. ఆలయానికి విచ్చేసే భక్తులు కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి విరాళాల రూపంలో చేయూత నందిస్తున్నారు. నిత్యం వస్తున్న వేలాది మందికి నిర్విరామంగా అన్నప్రసాదాన్ని అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నారు. 2004 గ్రామస్థుల సహకారంతో 10 మంది భక్తులతో ప్రారంభమైన ఈ పథకాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రతి శనివారం 10 వేల మంది నుంచి 18 వేల మంది వరకు అన్నప్రసాదం స్వీకరిస్తుండగా, మిగతా రోజుల్లో 2 వేల నుంచి 5 వేల మంది వరకు ఉంటున్నారు. దాతల నుంచి విరాళాలు రూ.12 కోట్లు పైబడి సమకూరగా దానిపై వచ్చే వడ్డీతో అన్నప్రసాదం అందజేస్తున్నారు. విరాళాలతో పాటు కూరగాయలు, బియ్యం, ఇతర సామగ్రి అందజేస్తున్నారు. స్వామివారి కృపతోపాటు భక్తుల విరాళాల వల్ల అన్నదాన పథకం దినదినాభివృద్ధి చెందుతోందని దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

బొప్పాయిపై తిరునామం

మామిడికుదురులోని ఓ బొప్పాయి కాయపై మూడు నామాలు మాదిరిగా కనిపించడం విశేషంగా ఆకట్టుకుంటోంది. దీంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. వీటి పుష్పాల సమయంలో జరిగే పోషక లోపాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కాయలపై పలు రకాల ఆకారాలు ఏర్పడుతుంటాయని మామిడికుదురు మండల ఉద్యానాధికారి దిలీప్‌కుమార్ తెలిపారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

తీరంలో సందడి

కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి చిన్నారులు, పెద్దలు తారతమ్యం లేకుండా ఆటపాటలతో కాలక్షేపం చేశారు. తీరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రత చర్యలు చేపట్టారు. - న్యూస్‌టుడే, సర్పవరం

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం, ఎన్‌హెచ్-16, హుకుంపేట, రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సత్యదేవుడికి ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పూజలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణస్వామిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బొజ్జిరెడ్డి దంపతులు వ్రతమాచరించి, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం గావించి స్వామి ప్రసాదం అందించారు. 59 ఆదివాసీ గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటు చేయాలని ఉపప్రణాళిక ప్రాంత ఆదివాసీల తరఫున పలువురు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ)ను పెదమల్లాపురంలో ఏర్పాటు చేయాలని, ఆదివాసీ గ్రామాల్లో తెగలన్నింటికీ రాజ్యాంగ హక్కులు కల్పించాలని కోరారు. ఆయన వెంట జిల్లా సాధికారిక గిరిజన సంక్షేమ అధికారి నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

తూర్పు రాజగోపురం వద్ద బొజ్జిరెడ్డి తదితరులు

సిద్ధివినాయకుడి సేవలో సీఎస్ విజయానంద్

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం బహూకరించారు. ముందుగా ఆయనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు మహేష్‌కుమార్, కీర్తి చేకూరి స్వాగతం పలికారు. ఆయన వెంట ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఇతర అధికారులు ఉన్నారు.

కొబ్బరికాయ కొడుతున్న సీఎస్ కె.విజయానంద్

'టీకా.. ఆరోగ్యానికి లేదిక ధోకా'

తునిలో చిన్నారికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అప్పుడే పుట్టిన శిశువు నుంచి 16 ఏళ్ల వయసు వరకూ వ్యాధి నిరోధక శక్తిని పెంచే విధంగా ఏ టీకాలు ఎప్పుడు వేయించాలో స్పష్టం చేస్తూ ప్రభుత్వం ప్రణాళిక చేసింది. నేషనల్ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ పేరిట కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అన్ని ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేసింది. అనేక మంది తల్లిదండ్రులకు అవగాహన లేక చిన్నారులకు సకాలంలో ఆయా వ్యాధి నిరోధక టీకాలు, చుక్కల మందులు వేయించలేకపోతున్నారు. ఆయా టీకాలు సకాలంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే పిల్లలకు వేయించాలి.

మీ కోసం

వేయించుకోవాల్సింది ఇలా...

● బిడ్డ పుట్టిన వెంటనే ఓపివి జీరో, బీసీజీ, హెచ్ఈపీ బి వేస్తారు. ● తర్వాత ఆరు వారాలకు ఓపీవి -1, ఆర్‌వివి -1, ఎఫ్ఐపీవి -1, పెంటావేలెంట్ -1, పీసీవీ -1 వేయించాలి. ● 10వ వారంలో ఓపీవి -2, ఆర్‌వివి -2, పెంటావేలెంట్ -2 ● 14వ వారంలో ఓపీవీ -3, ఆర్‌వివి -3, ఎఫ్ఐపీవి -2, పెంటావేలెంట్ -3, పీసీవీ -2 వేస్తారు. ● ఆ తర్వాత 9-12 నెలల వయసులో ఎంఆర్ -1, ఎఫ్ఐపీవి -3, పీసీవీ బూస్టర్, జెఈ -1, ● 16-24 నెలల్లో ఓపీవీ బూస్టర్, ఎంఆర్ -2, డీపీటీ బూస్టర్ -1, జేఈ-2 ఉంటాయి. ● పిల్లల వయసు 5-6 ఏళ్లకు చేరితే డీపీటీ బూస్టర్ -2, 10 ● 16 ఏళ్ల వయసు వారికి టీడీ వేస్తారు. ● గర్భిణీలకు కూడా టీడీ -1, టీడీ -2 లేక టీడీ బూస్టర్ వంటివి వేయించాల్సి ఉంటుంది. - న్యూస్‌టుడే, తుని

ఆక్రమణలపై కొరడా..

అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న పురపాలక సిబ్బంది

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా నిర్మాణం ప్రారంభించామనే భయం లేదు.. మున్సిపల్ అధికారులు నోటీసులిస్తారనే ఆలోచన లేదు.. ఎవరేం చేస్తారనే అభయం.. దీంతో అక్రమ నిర్మాణాలు కట్టేస్తున్నారు.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించేస్తున్నారు.. ఇది రామచంద్రపురం, అమలాపురం, మండపేట పట్టణాల్లో కొందరు వ్యవహరిస్తున్న తీరు. రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలను సైతం ఆయా పట్టణాల్లో కబ్జా చేసేందుకు వెనకడుగు వేయడం లేదు. కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని అక్రమ కట్టడాలను సక్రమంగా చేయించుకోవడమో, అధికారుల కళ్లుగప్పడమో చేస్తున్నారు.

రామచంద్రపురం రామకృష్ణ సెంటర్లో అనుమతుల్లేని నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

జిల్లాలో రామచంద్రపురం, అమలాపురం, మండపేట పట్టణాల్లో ఆక్రమణలకు అడ్డులేకుండా పోతోంది. మండపేటలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలో చిక్కుకున్నాయని కౌన్సిల్ సమావేశంలోనే సభ్యులు ఇటీవల ఏకరువు పెట్టారు. పట్టణంలో గుర్తించిన అక్రమణలు 119గా ఉంటే వీటిలో 108కి అధికారులు నోటీసులు జారీ చేశారు. రామచంద్రపురం పట్టణంలో 260 వరకు అక్రమ కట్టడాలు, ఆక్రమణలను గుర్తించి వారిలో 227 మందికి నోటీసులిచ్చారు. వీరిలో 21 మంది అనుమతుల్లేకుండా భవనాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. అమలాపురం పట్టణంలో 112 ఆక్రమణలున్నట్లు గుర్తించి 200 మందికి నోటీసులిచ్చారు. బహుళ అంతస్తులు, ఒకే భవనం ముగ్గురు నలుగురు పేరున ఉండటంతో ఎక్కువ మందికి నోటీసులివ్వాల్సి వచ్చింది.

మారిన నిబంధనలతో..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మారిన నిబంధనల ప్రకారం ఆయా పట్టణాల్లో ప్రణాళికా విభాగం అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకుని కూలగొట్టే వరకు వెళ్తున్నారు. రామచంద్రపురం ప్రధాన రోడ్డు రామకృష్ణా సెంటర్లో ఇటీవల అనుమతుల్లేకుండా పైఅంతస్తు నిర్మిస్తుంటే నోటీసులిచ్చిన అనంతరం కట్టడాన్ని కూలగొట్టారు. అలాగే అనుమతుల్లేని లేఔట్లలో వేసిన హద్దురాళ్లను తొలగిస్తున్నారు. ఇలా మండపేట పట్టణంలోనూ ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై దృష్టి సారించారు. అమలాపురంలో టౌన్ సర్వేయర్ రికార్డుల ప్రకారం ముందుకెళ్తూ ఆక్రమణలపై కన్నెర్ర చేస్తున్నారు. మండపేటలోనైతే కొన్ని స్థలాలకు నకిలీ పట్టాలు సైతం పుట్టించేశారు. వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం...

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై రామచంద్రపురం పట్టణ ప్రణాళికా విభాగం అధికారి శేషగిరిని వివరణ కోరగా పట్టణ ప్రణాళికా నిబంధనలు, బీపీఎస్ కొత్త నిబంధనల ప్రకారం నోటీసులు జారీచేసిన తర్వాత ఆయా నిర్మాణాలను కూలదోయవచ్చని వివరించారు. భవనాన్ని నిర్మించి బీపీఎస్ చేయించకపోతే ఎగువ అంతస్తుల నిర్మాణానికి అనుమతులిచ్చేది లేదన్నారు. ఇక ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో మరికొన్ని గుర్తించాల్సి ఉందని వాటిపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ముమ్మిడివరంలో పట్టణ పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. ముమ్మిడివరం మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంలతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ గేదెల్లంకలో ఉత్తరవాహిని పుష్కరాల రేవు ప్రాంతంలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.84 కోట్లు విడుదల చేసినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రూ.1.84 కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారుల నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శంకుస్థాపన చేశారు. ముమ్మిడివరంలో రూ.98.50 లక్షలతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, పీఆర్ డీఈ శ్రీనివాస్, కమిషనర్ రవివర్మ, సాగిరాజు సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా ట్రయల్ రన్ విజేత రామరాజు

నిర్వాహకుడి నుంచి పతకం అందుకుంటున్న నాగశ్రీరామరాజు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తొమ్మిదో మల్నాడ్ అల్ట్రా ట్రయల్ రన్ పేరిట కర్ణాటక పశ్చిమ కనుమల్లోని మల్లనదురులో ఈ నెల 22న నిర్వహించిన పరుగులో ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన ట్రై అథ్లెట్, మాజీ సైనికుడు దాట్ల నాగశ్రీరామరాజు జయకేతనం ఎగురవేశారు. నిర్విరామంగా 100 కి.మీ. పరుగును 13.58 గంటల్లో పూర్తి చేసి 45 సంవత్సరాల విభాగంలో విజేతగా నిలిచారు. ఇటీవల తమిళనాడు జవాదుహిల్స్ అల్ట్రా ట్రైల్‌రన్‌లో 85 కి.మీ. పరుగు 13.45 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆదివారం ఆయన్ను అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

విజేతలతో జిల్లా అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జనపల్లి సత్యనారాయణ అన్నారు. రావులపాలెం బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జిల్లాలోని 26 ప్రైవేటు, 22 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అర్హత సాధించిన వారు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని ప్రధాన కార్యదర్శి పి.పి.ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాస్, ఛాంబర్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్లు నందం సత్యనారాయణ, కోట సోమేషులు విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి మూఢనమ్మకాలను దూరం చేయడమే లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు అన్నారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ లింగేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 98491 38626

TO LET

E/F 3BHK 1546 Sft. Flat available for rent. A block 1207 gated community velumuriviss Morampudi Rajahmundry. ✆ 8790249629

JOBS

Wanted Female Telecallers and male counselors qualification any degree, age limit: 25 to 45 Years (Must be Married) Salary upto: 16000/-, working location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds

WANTED Qualified & Experienced Candidate to teach Maths & Social Studies for Higher Classes. Walk-in: 22-11-25 & 24-11-25 from 10 am to 6 pm. ✆ 98491 36605.

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives - for Rajamundry/ Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Sahasra College - Kakinada Wanted Senior Lecturers & Junior Lecturers Maths, Physics & Chemistry, Lady Hostel Wardens & Telecallers, Pro's. Razole, Sakhenetipalli & Amalapuram. Cell: 94406 91781, 96525 11056, 80748 54469.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-. 40 సంవత్సరాలలోపువారు మాత్రమే. Cont: శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

రాజమండ్రి, బొమ్మూరు, కొవ్వూరుల్లో ప్రముఖ షోరూమ్స్, కాలేజీల్లో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 12 to 15 వేలు. రూం+భోజనం. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి ✆ 93922 69369.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. ✆ 7702184399.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	19,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

స్నానానికి వెళ్లి సముద్రంలో బాలుడి గల్లంతు

మలికిపురం, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: చింతల మోరి బీచ్‌లో స్నానానికి వెళ్లిన సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన తెన్నేటి మహిమరాజు(బబ్లు-14) గల్లంతైనట్లు మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మోరి, మోరిపోడు గ్రామాలకు చెందిన స్నేహితులు వాస్కూడి సూర్యగణేశ్, కొప్పాడి రాకేశ్‌పాల్, చుట్టుగుళ్ల ముఖేశ్‌లతో కలిసి బీచ్‌కు వెళ్లాడు. నలుగురు కలిసి సముద్ర స్నానానికి లోపలికి వెళ్లారు. అలల ధాటికి మహిమరాజు కొట్టుకుపోయాడు. మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ బాలుడికి తల్లి లేకపోవడంతో తండ్రి రమేశ్ సంరక్షణలో ఉంటున్నాడు. 9వ తరగతి చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. సరదాగా స్నానానికి వెళ్లి గల్లంతవ్వడంతో తండ్రి తల్లడిల్లిపోతున్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

లక్ష్మణస్వామి సేవలు చిరస్మరణీయం

సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత బండారు లక్ష్మణస్వామి జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. మండపేట మండలం ఏడిద గ్రామంలో ఆదివారం బండారు లక్ష్మణస్వామి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ కార్యకర్తలు అభ్యుదయ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో సర్పంచి బూరిగ ఆశీర్వాదం, రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు, కమ్యూనిస్టు నాయకులు పెరుమళ్ళ రాజు, నల్లా రామారావు, దేవ రాజేంద్ర, కె.రామకృష్ణ ప్రజానాట్య మండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రాజోలు: పొన్నమండ ఉపకేంద్రం పరిధిలో వివిధ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఈఈ రాంబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల శ్రమదానం

రావులపాలెం గ్రామీణం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా జల, వాయు కాలుష్యాలను అరికట్టాలని రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు కోరారు. మండల పరిధిలోని రావులపాడులో ఆదివారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్, శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధులను శుభ్రం చేశారు. సర్పంచి మట్టా సత్యాదేవి, బాబ్జి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేశనపల్లిలో బందోబస్తుపై సమాలోచన

మలికిపురం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కేశనపల్లి పర్యటన సందర్భంగా కొబ్బరి రైతులతో ముఖాముఖి ఏర్పాటుకు స్థలం ఎక్కడ అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. తీర గ్రామాల్లో ఉప్పునీటి ప్రభావంతో దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలనకు ఈ నెల 26న ఆయన రానున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. దెబ్బతిన్న తోటల్లోనే శ్మశానవాటిక సమీపంలో ఎత్తుచేసి అక్కడే ముఖాముఖి ఏర్పాటు చేయాలని ఆలోచించారు. సాధ్యం కాకపోతే దగ్గరలోనే ఉన్న తుపాను ఆశ్రయ భవనం వద్ద ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మందికి చాలకపోవచ్చన్న సందేహం ఉంది. దీనిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో కేశనపల్లి వచ్చి తిరిగి శివకోటి వెళ్లే అంశంపై కూడా స్పష్టత రాలేదు. ఆదివారం రాజోలు సీఐ టి.వి.నరేశ్‌కుమార్, ఎస్సై పి.సురేశ్ కేశనల్లి గ్రామాన్ని పూర్తిగా పరిశీలించి బందోబస్తుపై చర్చించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 | పి.గన్నవరం: 80085 74229 | కొత్తపేట: 90323 93884

చెత్తాచెదారం శుభ్రం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం వద్ద జాతీయ రహదారి చెంత సర్వీసు రోడ్డులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

పైపులైనుకు మరమ్మతులు

మామిడికుదురు: ఆదుర్రు గ్రామ పరిధి గరువులో పైపులైను దెబ్బతినడంతో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బీవీ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. వెంటనే మరమ్మతులు చేయించి నీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

రహదారిపై వ్యర్థాల తొలగింపు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాడు ప్రధాన రహదారి చెంతన వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తూ రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి దృష్టికి తీసుకుని వెళ్లగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించారు.

పర్యాటకుల సందడి

అంతర్వేది బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకుంది. వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది సముద్రంలో స్నానాలు చేస్తూ, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పలువురు ఏటీఎస్ వాహనాలపై కుటుంబ సమేతంగా చక్కర్లు కొట్టారు. బోటింగ్ చేశారు. సఖినేటిపల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, అంతర్వేది

స్వామివారికి శాంతి కల్యాణం

అంబాజీపేట, మామిడికుదురు, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలం ముక్కామలలో బాలాత్రిపుర సుందరీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ● మామిడికుదురు మండలం ఈదరాడలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. గులాబీలతో విశేషార్చనలు జరిపారు.

ముక్కామలలో ..

ఈదరాడలో ..

సైన్స్ సంబరాల్లో ప్రతిభ

రాజోలు: రావులపాలెంలో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో మండలంలోని చింతలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య తెలిపారు. కె.ఎల్.ఎస్.అమృత, జి.విజయసతీష్‌కుమార్, సీహెచ్ లోకేశ్‌ను ఆదివారం అభినందించారు.

అందరికీ గృహయోగం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి

పి.గన్నవరంలో సర్వే చేస్తున్న హౌసింగ్ అధికారులు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఈ మేరకు గృహనిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో కుటుంబాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. వాస్తవానికి సర్వే ఈ నెల 5తో ముగియాల్సి ఉండగా మరింత మందికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నవంబరు మాసాంతం వరకు పొడిగించారు.

ఆ వివరాలు ఇలా..

మండలం	లబ్ధిదారులు	వెబ్‌సైట్‌లో నిక్షిప్తం
అయినవిల్లి	906	576
అంబాజీపేట	1,031	399
పి.గన్నవరం	879	469
మామిడికుదురు	393	588
మొత్తం..	3,209	2,032

నాలుగు నెలల క్రితమే..

వాస్తవానికి నాలుగు నెలల క్రితమే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకునే వారి వివరాలను అధికారులు సేకరించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 3,209 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఈ వివరాలను పీఎంఏవై 2.0 గ్రామీణ్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇందులో మున్సిపాలిటీల పరిధిలోని వారికి మాత్రమే ఇళ్లు మంజూరవుతాయని, గ్రామీణ ప్రాంతాలవారి కోసం ఆవాస్ ప్లస్-2024 వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తాజాగా ఉత్తర్వులు రావడంతో ఆ దిశగా చర్యలు ప్రారంభించారు.

యూనిట్ విలువ ..

ఆవాస్ ప్లస్-2024లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పక్కా ఇళ్లు నిర్మించుకునేవారికి యూనిట్ విలువను రూ.1.59 లక్షలుగా నిర్ణయించింది. ఈ మొత్తంలో ఉపాధిహామీ పథకం కింద మరుగుదొడ్డి నిర్మాణంతో పాటు కూలీల వేతనం కలిపి రూ.39 వేలు ఉంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కొంతమొత్తం జోడించి మంజూరు చేస్తుంది. ఎంతనేది ఇంకా నిర్ణయించలేదు. మున్సిపాలిటీ, నగరపాలక సంస్థల్లో యూనిట్ విలువ రూ.2.50 లక్షలు. దీంట్లో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇస్తుంది.

పి.గన్నవరం నియోజకవర్గంలో..

ముందుగా చేసిన సర్వే ప్రకారం ఉన్న లబ్ధిదారులు 3,209 మందికి సంబంధించి ఇంతవరకు 2032 మంది సర్వే పూర్తిచేసి ఆవాస్ ప్లస్-2024 వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

గ్రామీణ ప్రాంతాల్లో పక్కా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల వివరాలను సర్వే చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు కొనసాగుతుంది. సర్వే అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. - ధర్నాల శ్రీనివాస్, డీఈఈ, హౌసింగ్ కార్పొరేషన్, పి.గన్నవరం

ఉచిత వైద్యశిబిరాలు

ఆలమూరు: మెదడు, నరాలు, వెన్నెముకకు సంబంధించిన సమస్యల పట్ల అశ్రద్ధ పనికిరాదని న్యూరోసర్జన్ ఎస్.జె.బాలపరమేశ్వరరావు అన్నారు. కొత్తూరు సెంటర్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాజమహేంద్రవరం సిటీ న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరో, సందీప్ ఐక్లినిక్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బాలపరమేశ్వరరావును తెదేపా మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి పాపారావు, నడిపల్లి వెంకటేశ్వరరావు సత్కరించారు.

పొడగట్లపల్లి గ్రామంలో..

రావులపాలెం గ్రామీణం: రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని ఉప్పలపాటి జానకీ రామయ్య అన్నదాన సత్రంలో ఆదివారం ఎ.వి.ఆర్. ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

రాజోలు, న్యూస్‌టుడే: ఈ నెల 26న జరగనున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. శివకోటిలో నిర్వహించనున్న పల్లె పండగ-2 సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ రాజ్ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. రెండో హెలిప్యాడ్ నిర్మాణం కోసం ర.భ.శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అక్కడ జరుగుతున్న పనులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. తహసీల్దార్ సీహెచ్ భాస్కర్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కామేశ్

ఆసాది అర్చకుల ఐక్యతకు కృషి

ఆలమూరు: ఆసాది అర్చకులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ పిలుపునిచ్చారు. ఆదివారం చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తిక వనసమారాధన, సమావేశం నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆసాది అర్చకులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందన్నారు. హైకోర్టు న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. గరగ నృత్యం తదితర కళా సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. వీరిని సభ్యులు ఘనంగా సత్కరించారు. లేగా వెంకట స్వామి, గుమ్ములూరి రవికుమార్, లేగా వీరబాబు, వీరరాఘవులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

ఆలమూరు, న్యూస్‌టుడే: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు అందుకున్న చింతలూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వుడతా వేంకటేశ్వరరావును ఆదివారం ఎస్టీయూ విద్యాభవన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్కరించారు.

రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో విద్యార్థులకు ఆదివారం మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'భారత రాజ్యాంగం- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర' అంశంపై జరిగిన పోటీలకు 13 జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 9, 10 తరగతులకు చెందిన 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. సంఘ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శి సాదనాల సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శి గెడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో ఎమ్మెల్సీ పూజలు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్సీ పాక సత్యనారాయణ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సూపరింటెండెంట్ విజయసారథి స్వామివారి చిత్రపటం అందజేశారు.

విద్యుత్తు తీగలపై పొదుల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో గోరింకల డ్రెయిన్ చెంతన ఉన్న విద్యుత్తు స్తంభానికి, తీగలకు పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈ నెల 23న 'తీగలను అల్లుకున్న పొదలు' శీర్షికన చిత్రవార్త వెలువడింది. వెంటనే స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ నరేష్ సిబ్బందిని పంపించి వాటిని తొలగించారు. స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

పంట కాలువలో తూడు

శేషారాయుడు పంట కాలువలో తూడు, గడ్డి పెరిగిపోయి సాగునీటి ప్రవాహానికి ఆటంకంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం గింజ తయారీ దశలో వరిచేనుకు నీరు అవసరం ఉంటుందని చెబుతున్నారు. తక్షణం కాలువను బాగు చేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈ రమేశ్‌బాబును వివరణ కోరగా కాలువలో తూడు, గడ్డి తొలగింపు కార్యక్రమం చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మలికిపురం

కోత బారినపడి.. గట్టు కరిగిపోతూ

ఆదుర్రులోని వాడబోది మీడియం డ్రెయిన్ కుడివైపు గట్టు కోతబారిన పడి క్రమేణా కరిగిపోతుండటంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. పోటునీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గట్టు మీదుగా వ్యవసాయ భూముల్లోకి రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉందని కలవరపడుతున్నారు. 180 హెక్టార్ల వరిచేలకు ప్రధాన ఆధారమైన ఈ డ్రెయిన్‌కు ఇరువైపులా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విన్నపాలు చేశారు. పరిశీలన చేసి అవసరమైన చర్యలు చేపడతామని ఏఈఈ ఆనంద్‌కిరణ్ తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

రాకపోకలకు ఇక్కట్లు

కొండకుదురు, ముక్తేశ్వరం కాలువ గట్టు ప్రధాన రహదారిని గత ప్రభుత్వం హయాంలో తారురోడ్డుగా మార్చారు. రెండేళ్లకే ఎస్.మూలపొలం, కొండకుదురు గ్రామాల్లో గుంతలు పడి రాళ్లుతేలి అధ్వానంగా మారింది. వాహనదారులు, రైతులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిశీలించి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ జేఈ ఆనందబాబు తెలిపారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

అసంపూర్తిగా ముఖద్వారం

బొబ్బర్లంక కూడలిలోని హనుమాన్ జంక్షన్ వద్ద ర.భ. రాష్ట్రీయ రహదారిలో బ్యారేజీ సమీపంలో నిర్మించిన కోనసీమ ముఖద్వారం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పది సంవత్సరాల క్రితం ఎంపీ నిధులతో ప్రారంభించి నిధులు లేవంటూ గుత్తేదారుడు ఆపేశాడు. ఈ విషయాన్ని ర.భ.శాఖ డీఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా ద్వారాన్ని వాడపల్లి దేవస్థానం అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

నిత్య సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, మామిడికుదురు, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య సుదర్శన హోమానికి కాకినాడకు చెందిన కాపగంటి వీరసూర్యప్రసాద్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతలకు అర్చకులు స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు. ● అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కె.కృష్ణ, కుటుంబ సభ్యులు రూ.50 వేలు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచి

విద్యాభవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, న్యూస్‌టుడే: సమాజానికి దిక్సూచి, మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం ఆలమూరులో నూతనంగా నిర్మించిన ఎస్టీయూ విద్యాభవన్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. భవనం నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చిన పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావును అభినందించారు. ఎస్టీయూ జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ మాదే రాజగోపాల్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్‌ఎంపీ డాక్టర్స్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వర్రావు, వంటిపల్లి సతీష్ పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెలిచేరుకు చెందిన వానపల్లి హేమలక్ష్మీభార్గవికి గతంలో వివాహమైంది. కొద్దికాలానికి మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన తిమ్మిరి దుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకునేందుకు నిర్ణయించారు. పెళ్లి ప్రస్తావన తీసుకొస్తుంటే ముఖం చాటేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు: కేసు నమోదు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో లొల్ల గ్రామానికి చెందిన సూర్యవేణికి ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన చాపల రవికుమార్‌తో వివాహమైంది. ఆ సమయంలో తగినంత కట్నం ఇచ్చి వివాహం ఘనంగా జరిపించారు. కాపురం కొన్నాళ్లు సజావుగానే సాగింది. ఇటీవల రవికుమార్ చెడువ్యసనాలకు బానిసై అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడు. దీంతో సూర్యవేణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

కిలో రూ.50 పైనే..

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ధరలకు రెక్కలు వచ్చాయి. 15 రోజుల కిందట వరకు కేజీ రూ.20 నుంచి రూ.30 వరకు ఉండగా ప్రస్తుతం రూ.50 నుంచి 90 పలుకుతున్నాయి. తుపాను కారణంగా దిగుబడి తగ్గిపోయింది. కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లో రైతుబజార్లు ఉన్నాయి. రైతుబజార్లలో కంటే బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.30 పైనే అదనంగా విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు ఇలా (కిలో రూ.లలో)

కూరగాయలు	రైతు బజార్	బయట మార్కెట్
చిక్కుడు	100	150
క్యారెట్	55	80
కంద	50	70
బీన్స్	70	120
కిప్పికం	80	150
ఆకాకర	90	120
దొండ	56	158

ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

రాజోలు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత చైతన్య వేదిక నాయకులు కోరారు. ఆదివారం రాజోలు మట్టావారిగ్రూపులో మట్టా ఏడుకొండలు ఆధ్వర్యంలో 'ఇంటింటా అంబేడ్కర్' కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టా సురేష్, బొడ్డపల్లి ప్రసాద్, మందపాటి మధు, బత్తుల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో కోలాటంతో గ్రామోత్సవం

రావులపాలెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు సతీష్‌రాజు

పి.గన్నవరంలో సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

సత్యసాయి శత జయంత్యుత్సవం

పి.గన్నవరం, రావులపాలెం పట్టణం, కొత్తపేట, ఆత్రేయపురం, మామిడికుదురు, న్యూస్‌టుడే: సత్యసాయి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నగర సంకీర్తన మొదలుకుని రాత్రి ఉయ్యాల సేవ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. బాబా చిత్రపటాలను పల్లకిలో ఉంచి కోలాట నృత్యాలతో గ్రామోత్సవం జరిపారు. రాత్రి దీపోత్సవం, బాణసంచా కాల్పులు, ఉయ్యాల సేవ చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వేడుకలు జరిపారు. పి.గన్నవరంలో జరిగిన వేడుకల్లో విధాన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, షిరిడిసాయిబాబా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, డొక్కా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ● ఆత్రేయపురం అగ్రహారంలోని శ్రీసత్యసాయి సేవా సమాజంలో పేపకాయల సూర్యారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు గావించారు. ● మామిడికుదురులోని శివాలయ ప్రాంగణంలో అర్చనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో జి.భవాని, సర్పంచి గౌస్ మొహిద్దీన్, నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో కాంతులీనుతున్న సర్వమత స్తూపం

భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

[illegible] ది.08-12-2025 సోమవారం ఉదయం 10.00 గంటలకు సదరు దేవస్థానం వద్ద ఈ క్రింది భూములకు కౌలుకు బహిరంగ వేలంపాట పెట్టబడును.

సర్వే నెం.	విస్తీర్ణం	వేలం పాట తేది
116/8, 67/4A, 67/1B, 67/1D, 128/7A1, 65/2, 69/4A, 69/4C	10.24 ఎకరాలు	08-12-2025

సం/- కార్యనిర్వహణాధికారి

భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

[illegible] ది.08-12-2025 సోమవారం మధ్యాహ్నం 2.00 గంటలకు సదరు దేవస్థానం వద్ద ఈ క్రింది భూములకు కౌలుకు బహిరంగ వేలంపాట పెట్టబడును.

సర్వే నెం.	విస్తీర్ణం	వేలం పాట తేది
141/3, 202/2, 194/2B, 70/3	9.96 ఎకరాలు	08-12-2025

సం/- కార్యనిర్వహణాధికారి

భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

[illegible] నిమిత్తం దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలంపాట జరుపబడును. ది.08-12-2025 సోమవారం ఉదయం 11.00 గంటలకు సదరు దేవస్థానం వద్ద ఈ క్రింది భూములకు కౌలుకు బహిరంగ వేలంపాట పెట్టబడును.

సర్వే నెం.	విస్తీర్ణం	వేలం పాట తేది
67/2B, 67/2D, 69/3A, 65/1, 69/3C	7.35 ఎకరాలు	08-12-2025

సం/- కార్యనిర్వహణాధికారి

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda
రీజనల్ ఆఫీస్ :: రాజమండ్రి

మా విలువైన ఖాతాదారుల గమనిక నిమిత్తం ఇవ్వబడ్డ ప్రకటన

మా ఖాతాదారులకు మరింతగా విస్తృత సేవలందించు బ్యాంక్ ఆఫ్ బరోడా, అప్పనపల్లి బ్రాంచ్‌లో కొన్ని పరిపాలనా సౌకర్యాలు పెంపొందించు ఉద్దేశ్యంతో మా ప్రస్తుత చిరునామాలోని అసగా డి.నెం.4-2, పాశర్లపూడి గ్రామం, మామిడికుదురు యస్ఆర్ఓ & మండలం, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533247 నుండి డి.నెం.4-62, ఆర్.యస్.నెం.224/1, 2బి1, 2బి, 2బి2, పాశర్లపూడి గ్రామం, మామిడికుదురు యస్ఆర్ఓ & మండలం, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533247 వద్దకు మారుస్తున్నట్లుగా మరియు తేది.15-12-2025 నుండి సదరు చిరునామా నుంచే పని చేస్తుందని తెలుపడమైనది. సదరు క్రొత్త వసతి, చిరునామా నుండి అన్నిరకాల సాధారణ బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలతో పనిచేయును.

మా అప్పనపల్లి బ్రాంచ్ లోని లాకర్ సదుపాయం గల వారికి మరల మేము తెలియజేయదమేమనగా ఈ కొత్త చిరునామాలోకి లాకర్లు మారుస్తున్నప్పుడు కావాల్సిన జాగ్రత్తలు మేము తీసుకొందుము. అయినప్పటికీ ఈ మార్పు వలన జరిగే రిస్కు మరియు నష్టాన్ని తగ్గించుకోవటానికి ఒకవేళ లాకరు సదుపాయం గలవారు తాము భద్రపరచిన వస్తువులను స్వాధీనం చేసుకొని, కొత్త వసతికి మార్పినంతట మరల బ్యాంకులో భద్రపర్చదల్చినచో వారు తేది.06-12-2025న గాని లేదా అలోగా గాని చేసుకోవచ్చును.

ఈ విషయములో మీకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాం. మరియు మా ఉన్నత సేవలను అన్నివేళలా మీకు అందించగలమని మీకు హామీ ఇస్తున్నాం.

ప్రదేశం: రాజమండ్రి, తేది: 18-11-2025 సం/- రీజనల్ హెడ్

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

వేడుకలు విజయవంతం చేయాలి

అల్లవరం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం రోజున నిర్వహించే 75 రాజ్యాంగ ఆవతరణ వేడుకలు విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి సభ్యులు కోరారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం రాజ మార్గం ఏర్పాటు చేసిందని, ఆటువంటి రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసీరావు, బాలకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట- 40, వంకాయలు నలుపు- 62, వంకాయలు తెలుపు- 50, బెండకాయలు - 62, పచ్చిమిర్చి - 44, కాకరకాయ - 44, బీరకాయలు- 55, కాలీఫ్లవర్ -28, క్యాబేజీ - 38, క్యారెట్ - 58, దొండకాయలు - 43, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు -35, చిక్కుడుకాయలు - 120, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్ - 54, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 98, ఉసిరి - 80, ముల్లంగి - 45, కరివేపాకు -55, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70. ★ ఒక్కొక్కటి చొప్పున ఆనపకాయ - 30, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -12, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 25, కొబ్బరికాయ - 25.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: అమలాపురం నల్లవంతెన రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. -దుర్గి, వ్యాపారి

సమస్య: వడ్డిగూడెం ముదురుకాలువలో పూడికలు పెరిగిపోయాయి. మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది. - పర్వతి, వ్యాపారి

సమస్య: అమలాపురం కురసాలవారి వీధి రోడ్డుపై చెత్త, వ్యర్థాలు పెరిగిపోయాయి. - శంకర్, స్థానికుడు

సమస్య: కొంకాపల్లి ఏవీఆర్ నగర్‌లో చెత్త పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోయాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -అనిల్‌కుమార్, స్థానికుడు

సమస్య: కె.అగ్రహారంలో చెట్ల రహదారిపై అడ్డంగా దుంగలు ఉన్నాయి. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - చిన్న, స్థానికుడు

స్పందనకు వందనం

పరిష్కారం: నల్లవంతెన రోడ్డు, వడ్డిగూడెం మురుగుకాలువ, కురసాలవారివీధి, ఏవీఆర్ నగర్‌లో చెత్త, కె.అగ్రహారంలోలో సమస్యలను ఆయా వార్డు సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించారు. వాటిని సిబ్బందితో తొలగింపజేశారు.
–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఆట.. గెలుపు బాట

• ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, అమలాపురం గ్రామీణం

గ్రామీణ ప్రాంత పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఆదర్శంగా నిలిచారు. చదివిన పాఠశాలకు పేరు తెచ్చారు. కష్టాలను ఎదురీది విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. భవిష్యత్తు ప్రణాళిక వారి మాటల్లో..

గొల్లవిల్లిలో వాలీబాల్ సాధన చేస్తున్న విద్యార్థులు

బంగారు పతకం సాధిస్తా..

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి బంగారు పతకం సాధించి ఊరిపేరు నిలబెడతా. ఇటీవల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించా. రాష్ట్ర పోటీలకు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నిత్యం సాధన చేస్తున్నా.
-యనమదల ఇందిర, 8వ తరగతి, గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

జాతీయ స్థాయిలో ఆడతా..

వాలీబాల్ క్రీడలో రాణించి జాతీయ స్థాయిలో ఆడాలని నా కోరిక. ఆ దిశగా నిత్యం కృషి చేస్తున్నా. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేలా సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో కొలువు సాధించి తల్లిదండ్రులకు అండగా ఉంటా.
-ఎం.కావ్యశ్రీ, 9వ తరగతి, జడ్పీ ఉన్నత పాఠశాల, మునిపల్లి

బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఆడి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. బాపట్ల సూర్యలంకలో త్వరలో జరగబోయే ఎస్‌జీఎఫ్ బీచ్ వాలీబాల్ పోటీల్లో ఆడే అవకాశం లభించింది. బాగా రాణించి పాఠశాల పేరు నిలబెడతా. భవిష్యత్తులో క్రీడా కోటలో మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు అండగా నిలబడతా.
- దేవరపల్లి మేఘనా షాలిని, 9వ తరగతి, గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

నిత్యం సాధన చేస్తున్నా..

రెండేళ్లుగా ఖోఖో పోటీల్లో పాల్గొంటున్నా. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు కసరత్తు చేస్తున్నా.
- వనమాడి లోకేష్, పదో తరగతి, మహాత్మా గాంధీ జ్యోతిబా పులే గురుకుల పాఠశాల, సమనస

నగదు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: తీరగ్రామాల్లో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మొంథా తుపాను ప్రభావంతో నీటిముంపునకు గురైన 2,685 మంది బాధితులకు రూ.26.85 లక్షల ప్రభుత్వ సాయం అందజేత కార్యక్రమం ఆదివారం పల్లంలో నిర్వహించారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. తీరగ్రామాల్లో వంతెనల నిర్మాణానికి, తాగునీటి ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెల్లి వివేకానంద, దండుప్రోలు సత్యం, చెల్లి సురేష్, వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, బాలయోగి, రవికిరణ్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంటు ప్రారంభం

ఐ.పోలవరం: మురమళ్లలోని బైర్రాజు క్యాంపస్‌లో గ్లోబల్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంటును ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృథ్వీరాజు, తాడి నరసింహారావు, చెల్లి అశోక్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఎస్‌ఐ నాయకులు

బుద్ధుడి మార్గం అనుసరణీయం

ముమ్మిడివరం: దేశానికి బౌద్ధ దమ్మ అవసరం ఎంతైనా ఉందని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్‌ఐ) జిల్లా శాఖ పేర్కొంది. ఆదుర్రు ప్రాచీన బౌద్ధ స్థూప ప్రచార యాత్రలో భాగంగా ముమ్మిడివరం మండలంలోని పలు గ్రామాల్లో బీఎస్‌ఐ నాయకులు ఆదివారం పర్యటించారు. మండలంలోని అనాతవరం, మహిపాలచెరువు, ముమ్మిడివరం, థాణేలంక, పళ్లవారిపాలెం, లంక ఆఫ్ ఠాణేలంక, గురజాపులంక తదితర గ్రామాల్లో పర్యటించి బౌద్ధం ఆవశ్యకతను వివరించారు. కేవీవీ సత్యనారాయణ, బి.బాబూ రాజేంద్రప్రసాద్, ఎం.వెంకట్రావు, పి.సుధీర్, కవి, వై.సురేష్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

సత్యసాయి సేవలు స్ఫూర్తి దాయకం

ముమ్మిడివరం: సత్యసాయిబాబా సేవా మార్గం చూపారని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అన్నంపల్లిలో ఏర్పాటు చేసి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లోనూ ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్ మాథుర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, కమిషనర్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. కొమరగిరిపట్నం గ్రామంలో నిర్వహించిన సత్యసాయి జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడి స్వామినాయుడు పాల్గొన్నారు.

అమలాపురం కలెక్టరేట్: సత్యం, ధర్మం,శాంతి, ప్రేమ అనే సూత్రాలను ప్రపంచానికి బోధించిన మహోన్నత వ్యక్తి సత్యసాయి బాబా అని జేసీ నిశాంతి అన్నారు. ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంతి కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్డీవో కె.మాధవి, ఏవో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా చిత్ర పటం వద్ద జేసీ నిశాంతి, అధికారులు

కొమరగిరిపట్నంలో ఎమ్మెల్యే ఆనందరావు

సత్యసాయిబాబా శతజయంతిలో ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ రాజశేఖరం, ఎమ్మెల్యే దాట్ల

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో జరిగిన వేడుకల్లో ఎంపీడీవో డి.కృష్ణ, బద్రి సాయిప్రసాద్, పేరాబత్తుల శ్రీనివాసరావు, రాజు, పేరాబత్తుల రాజా పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: సత్యసాయి బాబా బోధనలు నేటి సమాజానికి ఆదర్శమని విశ్రాంత శాస్త్రవేత్త కేవీఎన్ రావు అన్నారు. మొబర్లీపేటలో రావు ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి నిర్వహించారు.

★ అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, అధికారులు శ్రీసత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్సులు సమర్పించారు.

ప్రమాణం చేస్తున్న కళాశాల అధ్యాపకుల సంఘ నాయకులు

అధ్యాపకుల నూతన సంఘం ఎన్నిక

అమలాపురం పట్టణం: జిల్లా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల నూతన కార్యవర్గ సభ్యులను అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడబాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ జబీన్, సంయుక్త కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌గా కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిత్య సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, మామిడికుదురు, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య సుదర్శన హోమానికి కాకినాడకు చెందిన కాపగంటి వీరసూర్యప్రసాద్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతలకు అర్చకులు స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు.

ప్రమాదం అంచున..!

మొంథా తుపాను ప్రభావంతో బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి నీలరేవుకు వెళ్లే సీసీ రోడ్డు బెర్ములు కుంగిపోయాయి. రోడ్డు ఆనుకుని చెరువులు ఉండటంతో తుపాను రోజుల్లో నీరు పైవరకు చేరి రోడ్డు బెర్ములు కుంగాయి. దీనిని పట్టించుకోకుంటే మరింత కుంగి సీసీ రోడ్డు బీటలు తీసి పాడయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

మైదానంలో మద్యం సీసాలు

యానాం జీఎంసీ బాలయోగి స్టేడియంలోనికి ప్రవేశించే మార్గంలో ఖోఖో క్రీడామైదానం వద్ద ఆదివారం ఉదయం వరుసగా పేర్చిన బీరు సీసాలు పలువురిని విస్మయానికి గురి చేశాయి. రాత్రి సమయంలో ఎనిమిది గంటల తర్వాత స్టేడియం తలుపులు మూసేసినా గోడ పక్కనుంచి లోనికి రావడానికి మార్గం ఉండడంతో పలువురు గుంపులుగా వెళ్లి మద్యం తాగుతున్నారు. స్టేడియంలో ఎలాంటి కాపలా లేకపోవడంతో ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు ఇది అడ్డాగా మారింది. అధికారులు తగిన తనిఖీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, యానాం

భవనం కిటికీలు ధ్వంసం

కాట్రేనికోన మండలంలోని మొల్లేటిమొగలో తెదేపా హయాంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన తుపాను రక్షిత భవనం అధ్వానంగా మారుతోంది. ఇటీవల కొందరు ఆకతాయిలు కిటికీ అద్దాలను పగలగొట్టారు. రాత్రివేళల్లో కొందరు ఇందులోకి ప్రవేశించి అధ్వానంగా మార్చుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కాట్రేనికోన

జనసేన కార్యకర్తలకు ప్రమాద బీమా అందజేత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ మృతి చెందిన పలువురు జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఆ పార్టీ తరపున మంజూరైన ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని క్రాపచింతలపూడి గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు, అనాతవరానికి చెందిన కొండమంచిలి సత్యనారాయణ, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన వాసంశెట్టి రాఘువులు ఇటీవల ప్రమాదాల్లో మృతి చెందారు. వీరికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు వంతున చెక్కులను మంగళగిరిలోని పద్మావతి పంక్షన్ హాల్లో ఆదివారం అందజేశారు. మాదాల శ్రీధర్, సవరపు వెంకట్, వలవల శ్రీనివాసరావు, సవరపు ప్రసాద్, రామాయణం రాజు, ఉద్దిస నాగబాబు, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన సవరపు నాగబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతనికి జనసేన క్రియాశీల సభ్యత్వం ఉండటంతో రూ.5 లక్షల బీమా చెక్కును ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు బాధిత కుటంబ సభ్యులకు అందించినట్లు జనసేన నాయకులు పిల్లా ప్రసాద్ తెలిపారు.

బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

విజేతలతో వ్యాయామోపాధ్యాయులు, అధికారులు

బాలికల ఖోఖో పోటీల్లో తృతీయ స్థానం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోని లాస్‌పేట ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్- గ్రూప్ 1 పోటీల్లో యానాం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖోఖోలో కారైకాల్ జోన్-5తో తలపడి తృతీయ స్థానం సాధించినట్లు జోనల్‌గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్ తెలిపారు. కబడ్డీ అండర్ -14, 19 బాలురు, వాలీబాల్ అండర్ -17 బాలికలు, క్యారమ్స్ 14, 17, 19 విభాగాలలో పోటీలు జరిగాయని తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు రమేష్, ఐవీకే మోహన్, జల్లి చంద్రశేఖర్ యానాం జట్టుతో వెళ్లారు.

అక్షరాస్యత పరీక్షకు 443 మంది హాజరు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి విద్యాశాఖ అక్షరాస్యత కేంద్రం ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ - నవభారత్ సాక్షరతా కార్యక్రమం పరీక్షకు 443 మంది హాజరైనట్లు విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు. వయోజనులకు వాలంటీర్లతో పాఠాలు చెప్పించి నిర్వహించిన ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యల అంచనా పరీక్షలో అర్హత సాధించిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఈ రాత పరీక్షను పుదుచ్చేరి ప్రాజెక్టు అధికారి పువియరసన్, కోఆర్డినేటర్ గణేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉల్లాస్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కర్రి భవానీప్రసాద్, ఎ.విజయలక్ష్మి, బి.సత్యవేణి పాల్గొన్నారు.

ఫిర్యాదుల విచారణకు కమిషన్ ఏర్పాటు

యానాం, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరించే పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడానికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పుదుచ్చేరి ప్రభుత్వం కమిషన్‌ను నియమించింది. మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి వాసును ఛైర్‌పర్సన్‌గా, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఉదయకుమార్, విశ్రాంత న్యాయమూర్తి అశోకన్ సభ్యులుగా మూడేళ్ల పాటు కొనసాగుతారు. పోలీసు అధికారులపై ఎటువంటి ఫిర్యాదు చేసినా కమిషన్ స్వచ్ఛందంగా విచారణ చేపట్టి నివేదికను పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపిస్తుంది.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటి పలువురు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌పోటీలకు ఎంపికయ్యారని శిక్షకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం మున్సిపల్ సర్క్యులర్ బజార్ జిమ్‌లో జిల్లా బాడీబిల్డింగ్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు వై.ఇందిర, సీహెచ్ సత్యగోపాల్, జి.దినేష్ ప్రసాద్, దుర్గా రామగణేష్, సుజిత్‌కుమార్‌లను సన్మానించారు. సముద్రం, ప్రతాప్, పల్లంరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులతో సంఘ నాయకులు

అదుపుతప్పిన ట్రావెల్స్ బస్సు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పట్టణ శివారులో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి అమలాపురం వెళ్లే ఏఆర్ 20ఈ 3344 నంబరు గల బస్సు ఆదివారం తెల్లవారుజామున గన్నవరానికి చేరుకుంది. గన్నవరం పట్టణం దాటిన తర్వాత ఆర్టీఐ మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న లారీని ట్రావెల్స్ బస్సు ఓ పక్కన బలంగా ఢీకొట్టింది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పంట బోదెల్లోకి బస్సు దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ప్రయాణికులను ఇతర బస్సుల్లో గమ్యస్థానాలకు తరలించారు.

పంట బోదెల్లోకి దూసుకెళ్లిన బస్సు

జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

యానాం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి కోసం యానాం ఓల్డేజ్‌హోంలో జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పుదుచ్చేరి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రకటించారు. డిసెంబరు 21న దీనిని ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆరోహి కుట్టు, ఎంబ్రాయిడరీ మిషన్ల తయారీ సంస్థ ఎండీ డాక్టర్ శిరీషా స్థానికంగా జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత కార్యశాలను ఆదివారం నిర్వహించారు. ఎంబ్రాయిడరీ యంత్రంతో డిజైనింగ్, మిషన్ల సహాయంతో సంచులు తయారీ, కొలతలు వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లాడి మాట్లాడుతూ 10 కుట్టు మిషన్లు, ఒక ఎంబ్రాయిడరీ మిషన్‌ను రూ.5.30 లక్షలతో సమకూర్చి ఉచిత శిక్షణ కల్పించడానికి తాను సిద్ధమని, యంత్రాల్ని ఏర్పాటుచేయాలని డాక్టర్ శిరీషను కోరారు.

వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తా

యానాం, న్యూస్‌టుడే: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తానని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన తన కుమారుడి పుట్టినరోజు వేడుకలో మాట్లాడారు. వ్యాపారం చేయడం కోసం కొందరు రాజకీయాలలోకి వస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లలో తన సహకారం కోరినవారందరికీ అండగా నిలిచానన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో వెళ్లేది అందరినీ అడిగే నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ వేడుకల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఆసాది అర్చకుల ఐక్యతకు కృషి

ఆలమూరు: ఆసాది అర్చకులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ పిలుపునిచ్చారు. ఆదివారం చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తిక వన సమారాధన, సమావేశం నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆసాది అర్చకులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందన్నారు. హైకోర్టు న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. గరగ నృత్యం తదితర కళా సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు.

సంఘ జిల్లా నూతన నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు సాయి సత్యనారాయణ

వైద్య ఉద్యోగులు సంఘటితంగా ఉండాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో వైద్య ఉద్యోగులు సంఘటితంగా ఉండి సంఘ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.సాయి సత్యనారాయణ తెలిపారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ సంఘ జిల్లా నాయకుల సర్వసభ్య సమావేశం పీవీ సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సంఘ కార్యదర్శి గిరిబాబు ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సత్యరాజు, అధ్యక్షురాలిగా నక్కా విజయనాగేంద్రకుమారి, కార్యదర్శిగా రాపాకు దుర్గాభాయితో పాటు ఉపాధ్యక్షులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యూటీఎఫ్ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వైద్యకళాశాలను ప్రైవేటుపరం చేయొద్దు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని, వైద్యకళాశాలను ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నాలు చేయవద్దని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అమలాపురం కె.అగ్రహారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ కోకన్వీనర్ పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణంలో 10 కళాశాలలను ప్రైవేట్ పరం చేశారని అన్నారు. సీపీఐ నాయకుడు కె.సత్తిబాబు తదితరులు మాట్లాడారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.

(c) eenadu

మండపేట

• మండపేట • రామచంద్రపురం

26న పుంతలో ముసలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

మండపేట: కొండపల్లివారివీధిలోని పుంతలో ముసలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలను ఈనెల 26 నుంచి 30 వరకు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు బర్రె దుర్గారావు తదితరులు తెలిపారు. 26న లక్ష్మిగణపతి హోమం, 27న భజన కార్యక్రమాలు, 28న అమ్మవారికి కుంకుమపూజలు, 29న సారె సమర్పణ, 30న జాతర ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. దేవరపల్లి వారి జువ్వాలమ్మ గరగ నృత్యం, మండపేట వారి పైడితలమ్మ కాళీమాత నృత్యం, తాళ్లపూడి వారి ఉమావరుణ్ బుట్టబొమ్మల నాట్యం, గోరగేదెల నృత్య ప్రదర్శన, బాలవరం వారి స్టార్ బాయిస్ తీన్మార్ నృత్యాలు ఉంటాయని పేర్కొన్నారు.

జ్ఞానసరస్వతికి మూలా నక్షత్ర పూజలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యాలయాల ఆవరణలోని స్వయంభూ జ్ఞానసరస్వతి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలాను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, జన్మ నక్షత్ర పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. విల్లూరి వీరభద్రరావు అవధాని, పెదపూడి సాయి విశ్వనాథశర్మ పండితుల ఆధ్వర్యంలో చేసిన పూజలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం

పట్టణ సమస్యల పరిష్కారానికి గళం విప్పండి..

నేడు ఈనాడు ఫోన్-ఇన్

• మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురండి..

సమయం: సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

రామచంద్రపురం పట్టణంలో శునకాల సమస్య తీవ్రంగా ఉందా.. పట్టణ శివారుతో పాటు వీధులు, రోడ్లపై చెత్త పేరుకుపోయిందా.. తొలగించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా..? దోమలు విజృంభిస్తున్నాయా, టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందా.. రక్షితనీటి సరఫరాలో లోపాలా.. అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు సరిగా లేవా.. పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా భవనాల క్రమబద్ధీకరణకు కొత్త నిబంధనలతో ఎలా చేసుకోవాలి.. ఇలా మీ సమస్య ఏదైనా నేరుగా మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజుతో మాట్లాడే అవకాశం ‘ఈనాడు’ కల్పిస్తోంది. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

ప్రోత్సాహం కరవు

న్యూస్‌టుడే, పామర్రు

రైతులను ఆర్థికంగా ఆదుకునే ఉద్యాన పంటల సాగు ప్రస్తుతం కర్షకులకు భారంగా మారుతుతోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరవై పంటల సాగుపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో పలు పథకాల ద్వారా నిధులు ఎక్కువ కేటాయించడంతో ఉత్సాహంగా సాగు చేపట్టిన రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయంపై దృష్టి పెడుతున్నారు. పెట్టుబడులు కూడా రాకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

భారంగా మారుతున్న ఉద్యాన పంటల సాగు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో గోదావరి లంక భూములు, పొలాల దిమ్మలు, ఖాళీ స్థలాల్లో దాదాపు 16 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. అరటి 1,980 ఎకరాలు, బొప్పాయి 640, మామిడి 145, తమలపాకులు 130 ఎకరాలు, కొబ్బరి రెండు వేల ఎకరాల్లో దిమ్మల మీద, కె.గంగవరంలో నాలుగైదు గ్రామాల్లో తోటలుగా పండిస్తున్నారు. ఏటా వరదల్లో పంటలన్నీ దెబ్బతింటున్నాయి. గతంలో కూరగాయల సాగుకు ప్రత్యేకంగా నిధులిచ్చి ప్రోత్సహించారు. రకరకాల విత్తనాలను కిట్ల రూపంలో రాయితీతో అందించారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.6 వేల వరకూ రాయితీ అందేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక కూరగాయలకు సంబంధించిన రాయితీని పూర్తిగా ఎత్తేసింది.

కోరుమిల్లి లంక భూముల్లో తెగుళ్లతో వాలిపోయిన అరటి (పాతచిత్రం)

ఇలా మంగళం..

ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన, రాష్ట్రీయ ఉద్యాన మిషన్, సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్ర ప్రణాళిక వంటి ప్రధాన పథకాలకు గతంలో రూ.కోట్లు మంజూరు చేసేవారు. రాష్ట్రీయ ఉద్యాన మిషన్, రాష్ట్ర ప్రణాళికకు గత ప్రభుత్వం మంగళం పాడిందని రైతులు చెబుతున్నారు. మిగిలిన రెండు పథకాలకు కూడా ఏటా నిధుల్లో కోత పెట్టింది. దీంతో రాయితీలు అందక ఉద్యాన రైతులు పంటల సాగుకు వెనుకంజ వేశారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతోనే ఉద్యాన పథకాలు అమలవుతుంటాయి. కేంద్రం నిధులిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటా విడుదల కాలేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందంటున్నారు.

వరదల నష్ట పరిహారమూ లేదు..

గోదావరికి వరదలు వచ్చినపుడు నష్టపోయిన ఉద్యాన పంటలకు తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉండగా నష్టపరిహారం అందేదని, ఇపుడు జాబితాలు తీసుకోవడమే తప్ప పరిహారం అందలేదని లంక రైతులు వాపోతున్నారు. దాదాపు రెండేళ్లుగా వరదలకు తీవ్రంగా నష్టపోయామని, అధికారులు వచ్చి సర్వేచేసి అంచనా వేసి వెళ్లారని, పది శాతం మందికి కూడా పరిహారం అందలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి అడిగితే జాబితాలు పంపే వరకే తమ బాధ్యతని అధికారులు చెబుతున్నారని రైతులు అంటున్నారు.

రైతుల ఖాతాల్లోకే నేరుగా..

ప్రస్తుతం ఉద్యాన శాఖ ద్వారా సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమల్లో ఉన్నాయి. వీటి ద్వారా నిధులు మంజూరవుతున్నాయి. అర్హులను ఎంపికచేసి రాష్ట్ర కార్యాలయానికి జాబితాలు పంపిస్తున్నాం. నిధులు మంజూరైతే నేరుగా వారి ఖాతాల్లోనే జమవుతాయి. ఇటీవల ఉద్యాన పంటలకు కొన్ని రాయితీలు పెరిగాయి. వాటి గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- అనూష, ఉద్యాన శాఖాధికారి, కె.గంగవరం

25న మంత్రి నాదెండ్ల పర్యటన

మండపేట, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మండపేట నియోజకవర్గంలో ఈనెల 25న పర్యటిస్తారని రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ సమీపంలోని సూర్య కన్వెన్షన్ హాలులో ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గ రైతులతో ముఖాముఖి సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి మంత్రి పాల్గొంటారని వివరించారు.

నేడు రాజ్యాంగ దినోత్సవ పోటీలు

పామర్రు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు సోమవారం నిర్వహిస్తామని ఎంఈవోలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులులు వెల్లడించారు. మండలస్థాయిలో ఈ పోటీలు కె.గంగవరంలో జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకూ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకూ ప్రాథమిక పాఠశాలల వారికి జరుగుతాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ : 80085 74192 ద్వారపూడి : 91543 96553

తొలగిన వ్యర్థాలు..

సమస్య: మండపేట మండలం ఏడిద సీతానగరం ఎస్సీకాలనీ రహదారి పక్కనే వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - సూర్యప్రతాప్, ఏడిద సీతానగరం

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి పీజీవీప స్వామికి తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు.

- న్యూస్‌టుడే, ద్వారపూడి

స్పందనకు వందనం

పట్టణంలోని ముచ్చుమిల్లి కవలవారిసావరం రోడ్డులో విద్యుత్తు స్తంభాన్ని పెనవేసుకున్న తీగలను ఆదివారం తొలగించారు. పిచ్చిమొక్కలు, పాదులు స్తంభాన్ని చుట్టుకుని ప్రమాదకరంగా మారాయని ‘ఈనాడు’లో ‘స్తంభాన్ని పెనవేసుకున్న బంధం’ శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్తు శాఖ డీఈ రత్నాకరరావు, ఏఈ ఎం.వి.రమణ ఆదేశాలతో లైన్‌మన్ గోవిందు, సిబ్బంది వచ్చి తీగలను తొలగించారు.

- న్యూస్‌టుడే, రామచంద్రపురం

కేశనపల్లిలో బందోబస్తుపై సమాలోచన

మలికిపురం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కేశనపల్లి పర్యటన సందర్భంగా కొబ్బరి రైతులతో ముఖాముఖి ఏర్పాటుకు స్థలం ఎక్కడ అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. తీర గ్రామాల్లో ఉప్పునీటి ప్రభావంతో దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలనకు ఈ నెల 26న ఆయన రానున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. దెబ్బతిన్న తోటల్లోనే శ్మశానవాటిక సమీపంలో ఎత్తు చేసి అక్కడే ముఖాముఖి ఏర్పాటు చేయాలని ఆలోచించారు. సాధ్యం కాకపోతే దగ్గరలోనే ఉన్న తుపాను ఆశ్రయ భవనం వద్ద ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మందికి చాలకపోవచ్చన్న సందేహం ఉంది. దీనిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో కేశనపల్లి వచ్చి తిరిగి శివకోటి వెళ్లే అంశంపై కూడా స్పష్టత రాలేదు. ఆదివారం రాజోలు సీఐ టి.వి.నరేశ్‌కుమార్, ఎస్సై పి.సురేశ్ కేశనల్లి గ్రామాన్ని పూర్తిగా పరిశీలించి బందోబస్తుపై చర్చించారు.

ఏడిదలో సత్యసాయిబాబా సేవలో మహిళలు

వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సతీమణి సత్యవతితో కేకు కోయిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సత్యసాయికి నివాళి

మండపేట, రామచంద్రపురం బృందాలు: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలతో పాటు రెండు పట్టణాలు, మండలాల్లో గ్రామోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబావారి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. రామచంద్రపురంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం తదితరులు సత్యసాయిబాబా ఆలయంలో సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ద్రాక్షారామలో తెల్లవారుజామున నగర సంకీర్తన, పతాకావిష్కరణ, సహస్రపూజ అనంతరం 10 గంటల నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమృత కలశాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. పామర్రు, పాణింగిపల్లి, కె.గంగవరం, దంగేరు, కోటిపల్లి గ్రామాల్లో సత్యసాయి సేవా సంస్థల సభ్యులు తెల్లవారుజామున నగర సంకీర్తనతో కార్యక్రమాలను మొదలుపెట్టారు. గృహస్థులు సాయి పాదుకలకు హారతులిచ్చారు.

పామర్రులో సాయిబాబా పాదుకలతో గ్రామోత్సవం

అవార్డు అందుకుంటున్న సుబ్బారెడ్డి

సుబ్బారెడ్డి సేవలు ప్రశంసనీయం

మండపేట గ్రామీణం: మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన పడాల సుబ్బారెడ్డి యువతలో చైతన్యస్ఫూర్తికి, నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరం నటరాజ నృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ నుంచి ఆదివారం సప్తా ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానానందజీ మహారాజ్, పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

మార్కెట్ ధరకే కొనుగోలు చేయండి

మండపేట: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న ధాన్యాన్ని మార్కెట్ ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని వైకాపా రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి కోరారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మండపల్లి రవి, పోతంశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత

రాయవరం, న్యూస్‌టుడే: ప్రమాదకరమైన గుంతలతో అధ్వానంగా మారిన సోమేశ్వరం-రాజానగరం (ఎస్‌ఆర్) రహదారిలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రాయవరంలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయని ‘ఈనాడు’లో వరుస కథనాలు ప్రచురించిన నేపథ్యంలో ర.భ.శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం రాయవరంలోని ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చి, బ్లాక్ టాప్‌తో రోలింగ్ చేయించారు. పనులను పర్యవేక్షించిన రామచంద్రపురం డీఈఈ జీవీఎస్ సూర్యనారాయణ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చి, మరమ్మతులు చేసేందుకు వార్షిక అత్యవసర నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

ఎస్.ఆర్.రహదారిలో చేపట్టిన తారు పనులు

ఉద్యానం.. తొలగని అంధకారం

పట్టణంలోని వైఎస్ఆర్ ఉద్యానంలో దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. సాయంత్రం వేళల్లో సందర్శకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చలికాలం కావడంతో 6 గంటలకు ముందే చీకటి పడడంతో రాత్రి 8 గంటల వరకు ఉండేందుకు మహిళలు ఆందోళన చెందుతున్నారు. పార్కు, రోడ్లలో వెలుగులు తప్ప ఉద్యానవనంలో అంధకారం తొలగడం లేదు. నడకకు వచ్చేవారు చరవాణి వెలుగులో నడక సాగిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్‌ను వివరణ కోరగా దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మండపేట

25 నుంచి సుబ్బారాయుడి షష్ఠి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు ఈనెల 25 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకులు కొమర్రాజు సుబ్రహ్మణ్యం, వెంకట్రావు పర్యవేక్షణలో మంగళవారం రాత్రి 7 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం, బుధవారం తీర్థం నిర్వహిస్తామని చెప్పారు. గురువారం సద్యస్సం, శనివారం కంకణసేవ, ఆదివారం శ్రీపుష్పోత్సవం ఉంటాయన్నారు. రోజూ సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చలువపందిళ్లు నిర్మించి, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

అంగరలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

రాయవరం, న్యూస్‌టుడే: చెల్లూరు సినిమా రోడ్డు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు తెదేపా నాయకులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. మాజీ సర్పంచి నూనె యేసుబాబు పూజాదికాలు జరిపించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు మండ వీర్రాజు మాట్లాడుతూ రూ.6 లక్షల వ్యయంతో విగ్రహం, మందిరం నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.రామారావు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

భూమిపూజలో తెదేపా నాయకులు

భగవద్గీత శ్లోకాల పోటీలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: లలిత నగర్ విజ్ఞానభారతి పాఠశాలలో ఆదివారం భగవద్గీతలోని భక్తియోగం శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా విచ్చేశారు. ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి విభాగంలో బద్ది రిత్విక్, శిరిగినీడి శ్రీరామ కార్తికేయ, సాధనాల సత్యసాత్విక విజేతలుగా నిలిచారు. నాలుగో తరగతి నుంచి 7వ తరగతి విభాగంలో టి.గణేష్ కార్తికేయ, జి.మణికంఠ, బి.కృష్ణ, 7 నుంచి 10 తరగతుల విభాగంలో గాడేపల్లి సాయిలక్ష్మి స్రవంతి, రాచర్ల హర్ష, కడియం కృత్తిక బహుమతులు అందుకున్నారు. వీరు డిసెంబర్ 14న కాకినాడలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు హనుమంతరావు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా నేమాని శర్మ, విల్లూరి కృష్ణానంద మూర్తి, సింగబాబు, మేడవరపు గోపాలకృష్ణ, ఉమాపతి శాస్త్రి, డి.గాయత్రి, ఎం.వెంకటరమణ, పుణ్యవతి, భద్రరావు వ్యవహరించారు. కోటి భావనారాయణ తదితరులు సౌజన్యంతో బహుమతులు అందించారు.

విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

యువతి అదృశ్యంపై కేసు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జానీబాషా వెల్లడించారు. ఈనెల 21వ తేదీన రాత్రి ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

పామర్రు: కోట గ్రామానికి చెందిన గంగుమళ్ల ధర్మయ్య తాటాకిల్లు ఆదివారం అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో సామగ్రి అంతా కాలిపోవడంతో కుటుంబీకులు రోడ్డున పడ్డారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనతో ఆయన తండ్రి, కూటమి నేత సత్యం తమ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి రూ.20 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, గృహ నిర్మాణ పథకంలో ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంచుమర్తి బాబూరావు, ములకల రామచంద్రరావు, తాడి శ్రీనివాసు, కోట శేషాద్రి, పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందిస్తున్న సత్యం తదితరులు

ఆసాది అర్చకుల ఐక్యతకు కృషి

ఆలమూరు: ఆసాది అర్చకులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ పిలుపునిచ్చారు. ఆదివారం చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తిక వనసమారాధన, సమావేశం నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆసాది అర్చకులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందన్నారు. హైకోర్టు న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. గరగ నృత్యం తదితర కళా సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. వీరిని సభ్యులు ఘనంగా సత్కరించారు.

మరణానంతరం వృద్ధుడి నేత్రదానం

పామర్రు, న్యూస్‌టుడే: పాణింగిపల్లికి చెందిన అల్లూరి రామారావు (84) ఆదివారం గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులు అతని నేత్రాలు దానం చేయాలని నిర్ణయించారు. పామర్రుకు చెందిన కరుటూరి వెంకటరత్నం ప్రోత్సాహంతో కాకినాడ బాదం బాలకృష్ణ కంటి ఆస్పత్రికి సమాచారం అందించగా వారొచ్చి మృతదేహం నుంచి కార్నియా సేకరించారు. పాణింగిపల్లి గ్రామం నుంచి ఇదే తొలి నేత్రదానమని సమాచారం.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు

• ప్రారంభించకుండానే శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు

న్యూస్‌టుడే, ద్రాక్షారామ

గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలు చేయడానికి లక్షలు వెచ్చించి నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలు నిరుపయోగంగా మిగిలాయి. విలువైన ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనడానికి ఇవే ఉదాహరణగా నిలుస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ప్రైవేటు గదుల్లో నిర్వహించడంతో మౌలిక వసతులు కరవవుతున్నాయని, వసతులతో కూడిన ప్రభుత్వ భవనాలు ఉండాలనే ఉద్దేశంతో లక్షలు వెచ్చించి సొంత భవనాలు నిర్మిస్తే ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది. అయితే భవన నిర్మాణాలు పూర్తిచేయకపోవడం వల్లే వినియోగించడం లేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. రామచంద్రపురం మండలంలోని వెలంపాలెం, జగన్నాయకులపాలెం, మాలపాడు, తోటపేట తదితర గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల పనులు పూర్తిచేసినా తుదిమెరుగులు దిద్దకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు.

మోకాలిలోతు బురదలో..

వెలంపాలెం గ్రామ శివారు అరుంధతీయపేటలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. గోడలు బీటలు వారి, మొక్కలు మొలిచి శిథిలస్థితికి చేరింది. నిర్మించి మూడేళ్లు కావస్తున్నా ఇంకా ప్రారంభించలేదు. గతంలో బహిరంగ మరుగుదొడ్డి ఉండే ప్రదేశం ఖాళీగా ఉండటంతో భవనం ఇక్కడ నిర్మించారు. ప్రస్తుతం వర్షం వస్తే ఈ భవనం నిర్మించిన ప్రదేశంలో మోకాలి లోతు నీరు చేరుతుంది. పైగా చుట్టూ పొదలు కమ్మేసి ఉన్నాయి. ఇక నిర్మించిన భవనం ఫ్లోరింగ్ మొత్తం దిగిపోయింది. మెట్ల వద్ద నిర్మించిన గోడ సైతం బీటలు వారి పడిపోడానికి సిద్ధంగా ఉంది. వీటితో నిర్మాణంలో నాణ్యత లోపించినట్లు వెల్లడవుతోంది. పనులు పర్యవేక్షించిన ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు ఎలా చెల్లించారో వారికే తెలియాలి. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీవో వి.వి.వరహాలక్ష్మిని వివరణ కోరగా అసంపూర్తి భవనాలను పూర్తిచేయడానికి ఎంపీడీవో కార్యాలయం ద్వారా ఉన్నతాధికారులకు వినతులు పంపామని చెప్పారు. భవనాలను పూర్తిచేయడానికి నిధులు విడుదల య్యాయని, పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వివరించారు.

భవనం శిథిలమై కూలిపోతున్న గోడ

కాజులూరులో దుస్తుల పంపిణీ

కాజులూరు, న్యూస్‌టుడే: గొల్లపాలెంలో సత్యసాయి శత జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు, సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత కార్యనిర్వాహక అధికారి గంటా ధనరాజు ఆధ్వర్యంలో 17 సంవత్సరాలుగా బాబా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నా శత జయంతి సందర్భంగా ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనం, రుద్రాభిషేకం జరిపించారు. బాబా పాదుకలతో రథోత్సవం వైభవంగా సాగింది. అనంతరం అన్నదానంతో పాటు 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ గొల్లపల్లి గంగారావు, ఎల్ఐసీ ప్రసాద్, కాకి గంగాభవాని, దాసరి బాబులు, గంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
A Government of India Undertaking

రామచంద్రాపురం బ్రాంచి
సూర్య సినిమాక్స్ కాంప్లెక్స్, రామచంద్రాపురం, సెల్.99497 32725

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)/9(1)ల నిబంధనలలో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం. 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు)
ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకముగా తెలుపునది ఏమనగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యొక్క అధీకృత అధికారిచే లాంఛనంగా స్వాధీనం తీసుకొనబడిన బ్యాంక్ తనఖాలో/ ఛార్జీలో ఉన్న దిగువ పేర్కొన్న స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రామచంద్రాపురం బ్రాంచి వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి పడిన దిగువ తెలిపిన బకాయిలు మొత్తం+వడ్డీ,కాస్ట్స్,ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తులను "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేది: 11.12.2025 న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది & సమయం: 11.12.2025, మ॥12.00 గం॥ నుండి సా॥05.00 గం॥ వరకు

ఋణగ్రహీత(లు): 1)శ్రీ నరాల గోపాలరావు, చిరునామా: డి.నెం. 1-36/2, వెంటూరు శివారు, వెంటూరు, రాయవరం మండలం, పూర్వం తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా- 533 233 2)కో అప్లికేంట్: శ్రీమతి నరాల వీరవేణి, భర్త: శ్రీ నరాల గోపాలరావు, చిరునామా: డి.నెం. 1-36/2, వెంటూరు శివారు వెంటూరు, రాయవరం మండలం, పూర్వం తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా- 533 233వారు చెల్లించవలసిన బకాయిమొత్తం 03.07.2025 నాటికి రూ.7,91,782.58/- (అక్షరాల ఏడు లక్షల తొంభై ఒక్క వేల ఏడు వందల ఎనభై రెండు రూపాయిల యాభై ఎనిమిది పైసలు మాత్రమే)+ తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

స్థిరాస్తుల వివరములు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, H/o వెంటూరు గ్రామ పంచాయితీ, కొత్తపేట, సర్వేనెం.ఆర్.ఎస్ 24/7 లో మొత్తం ఎ॥1.67 సెంట్లులలో నైరుతి వైపున 120 చ॥గ॥ లేదా 100.80 చ॥మీ॥ స్థలంలో నిర్మించిన డి.నెం 1-59 ఆర్.సి.సి డాబా ఇల్లు ఈ దిగువ హద్దులలో తూర్పు : 50 లింకులు= 33 అ॥ =10.065 పంచాయితీ రోడ్డు పడమర : 70 లింకులు= 46.2 అ॥ =14.091పుట్టపర్తి వీర్రాజు గారి ఇల్లు, ఉత్తరం : 36 లింకులు= 23.7 అ॥ =7.228 పుట్టపర్తి సూర్యారావు గారి స్థలం, దక్షిణం : 46 లింకులు= 30.3 అ॥ =9.241 కోరంగి కాలువ గట్టు.
పైనతెలిపిన హద్దులలో 120 చ॥గ॥ లేదా 100.80 చ॥మీ॥ స్థలంలో నిర్మితమైన ఆర్‌సిసి డాబా భవనము మరియు భౌతికమైన మరియు నిరకరమైన, అన్నీ హక్కులతోకలిపి.

రిజర్వుధర: రూ.16,00,000/- ధరావత్తు: రిజర్వుధరలో 10% బిడ్ పెంపుదల: రూ.20,000/-

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల విక్రయ నోటీసు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(6)/రూల్9(1) క్రింద పై ఋణం తీసుకొన్న ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లకు పైన తెలిపిన తేదీన ఇ-వేలం జరుపబడుతుందని జారీ చేయబడుతున్న నోటీసుగా కూడా దీనిని పరిగణించాలి.

అమ్మకం యొక్క సవివరమైన, నియమ నిబంధనల కోసం ఈ వెబ్‌సైట్స్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx (or) www.unionbankofindia.co.in మరియు ఇ-వేలం పోర్టల్: వెబ్‌పోర్టల్: https://baanknet.com లో సందర్శించగలరు

తేది: 21.11.2025, ప్రదేశము: రామచంద్రాపురం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భక్తి గీతాలు ప్రేమ వెలుగులు

శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకలను రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకులంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర, సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తిగీతాలు, దశావతార రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరై మాట్లాడారు. – న్యూస్‌టుడే, ధవళేశ్వరం

ధ్రువపత్రం పోయిందా.. పొందండిలా..

మీ కోసం

ప్రతి ఒక్కరికీ విద్య, ఉద్యోగానికి కొన్ని ధ్రువపత్రాలు అవసరం. వీటిని పోగొట్టుకున్న సందర్భంలో నకలు మన చేతికి రావాలంటే కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉంది. **పదో తరగతికి..:** పదో తరగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పోగొట్టుకుంటే bse.ap.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. దానిని ప్రింట్ తీసి వివరాలు నింపాలి. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ వారికి పోస్టు ద్వారా పంపించాలి. **ఇంటర్మీడియట్:** bie.ap.gov.in వెబ్ సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ ఓపెన్ అవుతుంది. హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ ఐటీ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. అఫిడవిట్, ప్రిన్సిపల్ సంతకం చేసిన దరఖాస్తును అప్లోడ్ చేయాలి. చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ కొడితే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. –న్యూస్‌టుడే, దేవీచౌక్

మత్తు మహమ్మారిని తొక్కేద్దాం..

డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని అదనపు ఎస్పీలు ఎన్వీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. జిల్లా పోలీసులు, ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో ఆదివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలు వివరించారు. సంబంధిత కదలికలపై ఎలాంటి సమాచారమున్నా 1972 నంబరుకు తెలియజేయాలన్నారు. విశ్రాంత ఏఎస్పీ గోపాలకృష్ణ, ప్రముఖ వైద్యుడు రామ్మోహనరావు, ఎన్‌కేవీటీ, గైట్ కళాశాలల ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం)

జంట జబ్బుల పంజా..!

వయసుతో సంబంధం లేకుండా మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. జంట జబ్బులుగా పేరున్న ఈ కంటికి కనిపించని శత్రువులు ప్రజారోగ్యంపై దాడి చేస్తున్నట్లు తాజా సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) సర్వేలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, తీవ్ర ఒత్తిడి, వ్యసనాలు వీటికి కారణమవుతున్నాయి. మెరుగైన జీవనశైలి అలవర్చుకుని చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే వీటిని దూరంగా ఉంచొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. –న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

జిల్లాలో పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం బాధితులు

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం ఎన్‌సీడీ సర్వే 3.0 పూర్తయి 4.0 జరుగుతోంది. రెండు, మూడు ఎన్‌సీడీ సర్వేల్లో దాదాపు జిల్లా వ్యాప్తంగా 25 శాతానికి పైగా ప్రజలకు అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నట్లు తేలింది. రెండో విడతలో 30 ఏళ్లు నిండిన వారికి, మూడో విడతలో 18 ఏళ్లు పైబడిన వారికి పరీక్షలు చేశారు. మూడేళ్ల కిందట విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలోనూ మొత్తం జనాభాలో 27.6 శాతం పురుషులు, 21.7 శాతం మహిళలు మధుమేహంతో బాధపడుతున్నారని తేలింది. 30 శాతం మహిళలు, 32 శాతం పురుషులకు అధిక రక్తపోటు ఉన్నట్లు వెల్లడైంది.

జిల్లాలో ఎన్‌సీడీ సర్వే వివరాలు

జనాభా	15,56,948
పరీక్షలు చేసింది	14,31,964
రక్తపోటు బాధితులు	2,00,517
మధుమేహం కేసులు	1,70,432

యువతలో అధికం..

సాధారణంగా గతంలో 45 ఏళ్లు దాటిన వారిలోనే మధుమేహం, బీపీ లక్షణాలు కనిపించేవి. ప్రస్తుతం 25 ఏళ్లు నిండిన వారందరికీ పరీక్షలు చేస్తున్నారు. ఎన్‌సీడీ సర్వేలో 30 నుంచి 40 ఏళ్ల మధ్యవారిలో అధికంగా బీపీ, షుగరు కేసులున్నట్లు తేలడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాల్లో నివసిస్తున్న వారే అధికంగా బాధ పడుతున్నట్లు తెలుస్తోంది.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా రక్తపోటు వస్తోంది. సాధ్యమైనంత వరకు ఒత్తిడిలేని జీవన విధానం అలవర్చుకోవాలి. ఒత్తిడి అధికంగా ఉన్నపుడు కొన్ని నిమిషాలు కళ్లు మూసుకుని మౌనంగా ఉండాలి. యోగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సాధ్యమైనంత ధ్యానం అలవర్చుకోవాలి. వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

– వడ్డాది సురేష్, ఎండీ(జనరల్ మెడిసిన్), రాజమహేంద్రవరం

వ్యాయామం తప్పనిసరి

ప్రతిరోజూ 30 నిమిషాలు వ్యాయామం చేస్తే మధుమేహం రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. ఒకవేళ వ్యాధి వచ్చిన వారు వ్యాయామం చేస్తే నియంత్రణలో ఉంటుంది. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ షుగరు పరీక్ష చేయించుకోవాలి. దాహం ఎక్కువగా ఉండటం, మూత్రం అధికంగా రావడం, [illegible] వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటి వారు గుర్తిస్తే వెంటనే మధుమేహం పరీక్ష చేయించాలి.

– కందుల సాయి, మధుమేహం వైద్యనిపుణుడు, రాజమహేంద్రవరం

కష్టాల బాల్యానికి కొత్త జీవితం

జిల్లాలో దత్తత మాసోత్సవ కార్యక్రమాలు

– న్యూస్‌టుడే, హుకుంపేట, బొమ్మూరు

అమ్మఒడిలో.. నాన్న భుజాలపై పాల నవ్వులతో ఆడుతూ ఎదగాల్సిన చిన్నారులు తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్నారు. అనుదినం గడిపేస్తున్న బాల్యం.. ఎంతో భారంగా సాగుతోంది. ఆర్థిక, కుటుంబ, ఇతర కారణాలతో పలువురు బాల్యాలలోనే నిరాదరణకు గురవుతున్నారు. అలాంటి వారిని శిశుగృహాల్లో చేర్చుతారు. అవకాశం, ఆసక్తి ఉన్నవారు వారిని దత్తత తీసుకోవచ్చు. దత్తత మాసోత్సవాల సందర్భంగా దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

దత్తతపై అవగాహన కల్పిస్తున్న డీసీపీయూ సిబ్బంది

ఇలా చేయొచ్చు..

● శిశుగృహాల్లో ఉండే చిన్నారులను 'కారా' నిబంధనలను అనుసరించి దత్తత కూడా ఇస్తారు. కావాల్సిన దంపతులు ముందుగా తమ పాన్ కార్డుతో కారా వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ● కుటుంబ ఫొటోతో పాటు నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ, అఫిడవిట్‌తోపాటు తల్లిదండ్రులు ఇద్దరికి వైద్య పరీక్షలకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ● హోమ్ స్టడీ(గృహ అధ్యయన పత్రం)తో 6 వేల ఫీజు రూపంలో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి [illegible] సంచాలకులు, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థకు పొందుపరుస్తూ దరఖాస్తు సమర్పించాలి. చివరి దశలో మరి కొన్ని నిబంధనలతో దత్తత ప్రక్రియ పూర్తవుతుంది.

జిల్లాలో శిశుగృహం: రాజమహేంద్రవరం ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఉంది.

సంప్రదించాల్సిన నంబరు:

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పీడీ	9398055826
జిల్లా బాలల పరిరక్షణ అధికారి	8919156981
ప్రొటెక్షన్ అధికారి	8919157028
శిశు గృహ మేనేజర్	8919157091

సద్వినియోగం చేసుకోవాలి

పిల్లలకు కొత్త జీవితం ఇవ్వాలనే ఉద్దేశంతో దత్తత సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈనెల 30 వరకు కార్యక్రమాలు జరుగుతాయి. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. అనాథలను ఎవరైనా గుర్తిస్తే అంగన్‌వాడీ కేంద్రం, పోలీసు స్టేషన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలి.

– టి.శ్రీదేవి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పీడీ

చారిత్రక దర్గా.. మహిళలకే ప్రవేశం

మీకు? తెలుసా

ఈ నెల 25న షహదత్

దక్షిణ భారతదేశంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో ఉన్న బీబీ ఫాతిమాజహెరా దర్గా చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహ్మద్ ప్రవక్త తనయగా, కర్బలా యుద్ధంలో అమరత్వం పొందిన ఇమామ్‌హసన్, ఇమామ్ హుస్సేన్‌కు తల్లిగా ముస్లింలకు ఆరాధ్యనీయురాలుగా ఆమె అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని సంఘ నాయకులు చెబుతున్నారు. తాటాకులతో ఉండే ఇక్కడి ప్రదేశంలో క్రీ.శ. 1576లో కట్టడం నిర్మితమైంది. ఇందులో ఫాతెమా జహెరాకు చెందిన స్మారక నిర్మాణం(మజార్) ఉంది. 2022లో ఈ పురాతన కట్టడంపై రూ.కోటి వ్యయంతో గోపురాకార స్తూపాన్ని నిర్మించారు. మహిళలకు మేలి ముసుగు(పరదా) సంప్రదాయాన్ని తీసుకొచ్చి వారి గౌరవాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దిన మహోన్నత మహిళగా ఆమె ఖ్యాతికెక్కింది. ముస్లిం క్యాలెండర్‌లో జమాదుసానీ(ఆఖర్) మాసంలో 3న అంటే నవంబరు 25 మంగళవారం పాశర్లపూడి దర్గాలోని ఫాతిమా జెహెరాకు మహిళలు షహదత్(వర్ధంతి) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ విశేషమేమిటంటే దర్గాలో దర్శనానికి మహిళలకు తప్ప పురుషులకు ఎవర్నీ అనుమతించరు. గర్భిణులను కూడా లోనికి వెళ్లనివ్వరు. మహిళలు తమ కోర్కెలను నెరవేరాలంటూ గాజులు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. పలువురు అక్కడ తలనీలాలను కూడా ఇస్తుంటారు. -న్యూస్‌టుడే, మామిడికుదురు

పాశర్లపూడిలోని ఫాతిమాజహెరా పురాతన దర్గా

'పది' విద్యార్థులకు ప్రత్యేకం..!

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని డీఈఓ వాసుదేవరావు తెలిపారు. యూడైస్‌లో విద్యార్థుల వివరాలు తప్పుగా నమోదైనా, పరీక్షల ఫీజు తదితర అంశాలపై కార్యాలయ పనివేళల్లో (ఉదయం 10 గం. నుంచి సాయంత్రం 5 గం.వరకు) ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. – న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ఎం.అమలుకుమారి అసిస్టెంట్ కమిషనర్	98499 39487
ఎ.వి.ఉమా మహేశ్వరరావు సూపరింటెండెంట్	98485 97115
ఎన్.సత్తిబాబు, ఏఎస్‌ఓ	89854 91066
టి.నాగిరెడ్డి, డీఎస్‌ఓ	94936 50136
బి.రాజ్‌కుమార్ జూనియర్ అసిస్టెంట్	98494 59869

ఆధ్యాత్మిక పరవశం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

పాతాళంలో జలం..!

గోదావరి చెంతనే ఉన్నా జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నగరాలు, పల్లెలు కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో వర్షపునీరు సైతం భూమిలో ఇంకే పరిస్థితి లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. ఇటీవల సంభవించిన మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పరిస్థితి కొంత మెరుగుపడినా గతేడాదితో పోల్చితే లోటు కనిపిస్తోంది. – ఈనాడు, రాజమహేంద్రవరం

పడిపోతున్న జలాలు

గతేడాది అక్టోబరులో 17.29 (సగటు) మీటర్ల లోతులో జలాల లభ్యత ఉంటే, ఈ ఏడాది సెప్టెంబరుకు 19.92 మీటర్లకు పడిపోయింది. వర్షాల నేపథ్యంలో అక్టోబరుకు 18.46 మీటర్లకు చేరినా గతేడాదితో పోల్చితే 1.1 మీటర్ల దిగువకు పడిపోయాయి. మే నెలలో 21.50 మీటర్లుంటే, మార్చిలో 25.51 మీటర్లు సగటు నమోదైంది. ప్రస్తుత పరిస్థితే కొనసాగితే వచ్చే వేసవినాటికి 30 మీటర్లకు వెళ్లే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, కడియం, కోరుకొండ, దేవపల్లి, నల్లజర్ల, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లో లోటు కనిపిస్తుండగా, రాజమహేంద్రవరం గ్రామీణం, గోకవరం, చాగల్లులో కొంత మెరుగుదల ఉంది.

వర్షపాతం ఇలా..

జిల్లాలో అక్టోబరు నాటికి 768 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతోపోల్చితే 1.8 మి.మీ లోటు ఉంది.



ఏం చేయాలంటే...

● గ్రామాల్లోని చిన్న నీటి వనరుల్లో పూడిక తీసి, గట్లు పటిష్ఠం చేయాలి.

● ప్రజాచైతన్యం తీసుకురావడం ద్వారా భూగర్భ జలాలు పెంచే అవకాశం ఉంది.

● ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంలు ఏర్పాటు చేయాలి.

సాంకేతిక అస్త్రం.. పారదర్శకతకు మార్గం..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లోని సభ్యులు ఆర్థిక స్వావలంబనపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. స్వయం ఉపాధితో వారి జీవన స్థితిగతులు మెరుగుపర్చడానికి వివిధ పథకాల ద్వారా రుణ సహాయం అందించడంతోపాటు పొదుపు సంఘాల నిర్వహణ, అభివృద్ధికి కొత్త విధానాలు అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని వీటి పర్యవేక్షణకు ఇ-నారీ వ్యవస్థ ఏర్పాటు చేస్తోంది.

ఎస్‌హెచ్‌జీల్లో కనీసం పదో తరగతి చదివి 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్నవారిని ఇ-నారీలుగా ఎంపిక చేస్తోంది. స్మార్ట్ ఫోన్ల వినియోగంపై అవగాహన ఉండి, ఎస్‌హెచ్‌జీల కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు వెలుగు సిబ్బంది ద్వారా శిక్షణ ఇస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం పదేసి ఎస్‌హెచ్‌జీలకు ఒకరి చొప్పున ఇ-నారీలుగా ఎంపిక చేశారు.

దస్త్రాల నిర్వహణపై ఇ-నారీలకు శిక్షణ

మండల సమాఖ్యలు	18
గ్రామ సమాఖ్యలు	897
ఎస్‌హెచ్‌జీలు	30,950
సభ్యులు	3,03,958
శిక్షణకు ఎంపికైంది	3,281

ఏఏ అంశాల్లో తర్ఫీదు ఇస్తారంటే

ఇ-నారీలకు పలు అంశాలపై మండలాల వారీగా శిక్షణ అందించి సంఘాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. పొదుపు సంఘాల్లో పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడటానికి ఇది ఉపయోగపడుతుంది. తర్ఫీదు పొందిన వారు ఎస్‌హెచ్‌జీల్లోని మహిళల చరవాణుల్లో మొబైల్ బుక్ కీపింగ్ యాప్ డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పిస్తారు.

● కంబాలచెరువుకు చెందిన కొందరు జీజీహెచ్‌లోని అత్యవసర విభాగానికి సేవల నిమిత్తం ఆదివారం రాత్రి వచ్చారు. వైద్యురాలిని మంచినీరు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఆమె బయట ఉంటాయని బదులిచ్చారు. వారు ఆగ్రహంతో మంచినీటి సీసాను ఆమెపై విసిరేశారు. వైద్యురాలు 112కు ఫోన్ చేయగా పోలీసులు నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

● రాజమహేంద్రవరం గ్రామీణం రాజవోలుకు చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం రాత్రి జీజీహెచ్‌కు వచ్చారు. వారితోపాటు వచ్చిన 20 మంది యువకులు అత్యవసర విభాగంలోని వైద్యులతో దురుసుగా మాట్లాడటంతోపాటు భద్రతా సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు.

అర్ధరాత్రి.. బిక్కుబిక్కుమంటూ విధులు..!

జీజీహెచ్‌లో కొరవడిన భద్రత

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం):

రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగానికి భద్రత కొరవడింది. రాత్రి సమయాల్లో మద్యం, గంజాయి మత్తులో అల్లరిమూకలు చికిత్సకు వచ్చి వైద్యులు, సిబ్బందిపై దాడులకు దిగుతున్నారు. ఇక్కడ పోలీసు పర్యవేక్షణ ఉండాల్సి ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆసుపత్రి అవుట్‌పోస్టులో మహిళా పోలీసులే విధులు నిర్వహిస్తున్నారు.

వైద్య సిబ్బందితో యువకుల వాగ్వాదం

ఓపీ తీసుకోకుండానే...

రాత్రయిందంటే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పదుల సంఖ్యలో వస్తున్న అల్లరిమూకలను భద్రతా సిబ్బంది అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర వైద్య విభాగానికి నిత్యం 200కు పైగా కేసులొస్తున్నాయి. కొందరు మద్యం, గంజాయి మత్తులో యువకులు కనీసం ఓపీ కూడా తెచ్చుకోకుండా వచ్చి సేవలందించాలని లేదంటే దాడులకు తెగబడటం అలవాటుగా మారిపోయింది.

● జీజీహెచ్‌లో నిత్యం ఇలాంటి ఘటనలు పరిపాటిగా మారాయి. ఇక్కడ అత్యవసర విభాగంలో పోలీసు పర్యవేక్షణ ఉండాలని ఎన్నిసార్లు విన్నవించినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆసుపత్రి యంత్రాంగం చెబుతోంది. దీనిపై జిల్లా ఎస్పీ స్పందించి, భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) జిల్లాలో సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ప్రజలు అర్జీలు అందించవచ్చని తెలిపారు.

అక్రమ లే ఔట్లు.. యథేచ్ఛగా నిర్మాణాలు..!

✦ గత సర్కారు నిర్వాకంతో రుడా ఆదాయానికి తూట్లు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గత పాలకుల నిర్వాకం, అధికారుల చేతివాటంతో నగరంలో ఇష్టానుసారం నిర్మాణాలు చేసేశారు. ప్రస్తుతం కూటమి సర్కారు వాటిని సరిచేసేందుకు ప్రయత్నిస్తోంది. అనధికార భవనాలు లే ఔట్లు క్రమబద్ధీకరణకు తాజాగా జీవో విడుదల చేసింది. నిర్ణీత తేదీ లోపు వీటిని సరి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి నిబంధనలు, మార్గదర్శకాలు కూడా జీవోలో పొందుపర్చారు. గత ప్రభుత్వ హయాంలో 3620 లే ఔట్లు వేశారంటే పరిస్థితి అంచనా వేయవచ్చు. అనుమతుల పేరుతో రూ. లక్షల్లో గుంజుకొన్నారు.

అనధికార లే ఔట్ల దరఖాస్తులు	5228
పరిష్కరించింది	1384
పెండింగ్‌లో ఉన్నవి	3844
దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా రుడాకు లభించిన ఆదాయం	రూ 25.65 కోట్లు

262	భవనాల క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తులు
32	పూర్తి చేసినవి
5	తిరస్కరించినవి
రూ 5.2 కోట్లు	ఇప్పటి వరకు సమకూరిన ఆదాయం

భవనాలదీ అదే దారి

భవన నిర్మాణాల విషయంలో కూడా ఇదే పంథా కొనసాగించారు. ప్రస్తుత ప్రభుత్వం బీపీఎస్‌కు అవకాశం కల్పించడంతో రుడా పరిధిలో ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలపై సర్వే చేస్తారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం నోటీసులు జారీ చేశారు. అయితే రుడా పరిధిలో నిబంధనలు అతిక్రమించిన భవనాలు రెండు వేలకు పైగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థతోపాటు, కొవ్వూరు, నిడదవోలు పురపాలికల్లో ఎక్కువ నిర్మాణాలు చోటు చేసుకొన్నాయి. అదనపు అంతస్తుల నిర్మాణం, రోడ్డు ఆక్రమణలు, సెల్లార్లు లేనివి పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

ఆశలు పెంచుతున్న ఆయిల్‌పామ్

ఏడాదిన్నరలో 5 వేల హెక్టార్లలో పెరిగిన సాగు

– న్యూస్‌టుడే, గోపాలపురం, బిక్కవోలు

గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆర్థికంగా చితికిపోయిన ఆయిల్‌పామ్ రైతులు నెమ్మదిగా కోలుకుంటున్నారు. సాగుదారులకు కూటమి ప్రభుత్వం దశలవారీగా బకాయిలు చెల్లిస్తోంది. దీంతో బాధల నుంచి బయట పడుతున్నారు. దీనికి తోడు ధర ఆశాజనకంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందిస్తున్నాయి. ఈ తరుణంలో సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. జిల్లా పరిధిలో సుమారు 50 వేల హెక్టార్ల వరకు ఆయిల్ పామ్ సాగు అవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో సుమారు 5 వేల హెక్టార్లలో రైతులు ఈ సాగు పెంచారు. వచ్చే ఏడాది మార్చి చివరిలో మరో రెండు వేల హెక్టార్లలో సాగు పెంచాలని లక్ష్యం ఉంది. రాయితీపై మొక్కలు, పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుందని, ఆయిల్‌పామ్ సాగు పెంచాలని ఇటీవల గౌరీపట్నంలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి రైతులకు సూచించారు.

గోపాలపురంలో ఆయిల్ పామ్ తోట

పాత బకాయిలు జమ..

గత ప్రభుత్వం ఒక పైసా కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం రూ.25 కోట్ల బకాయిలు విడుదల చేసింది. మూడు నెలలుగా ధర క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆగస్టు, సెప్టెంబరుల్లో టన్ను రూ.19వేల ధర అక్టోబరులో రూ.19,682 వరకూ పలికింది. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలున్నాయని జిల్లా ఆయిల్‌పామ్ రైతు సంఘ అధ్యక్షుడు బుచ్చిబాబు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాబా సేవలు యువతకు ప్రేరణ

కేకు కోస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి బాబా సేవలు యువతకు ఎంతో ప్రేరణ ఇస్తాయని కలెక్టరు కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఆల్కట్ గార్డెన్స్‌లోని శ్రీసత్యసాయిబాబా మందిరంలో జరిగిన శతజయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం భక్తులతో కలసి భజనలో పాల్గొన్నారు. సాయి సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను అభినందించారు. శ్రీసత్యసాయి సేవాసమాజం ఆధ్వర్యంలో సత్యసాయి మందిరం, సత్యసాయి గురుకుల పాఠశాలల్లో నిర్వహించే భజన, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆనందాల అందెల రవళి..

నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ నిర్వహణలో ఆదివారం నిర్వహించిన సప్పా ఎక్సలెన్స్ పురస్కార సభ ఆదివారం జరిగింది. పలువురు నాట్యగురువుల శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం తదితర సంప్రదాయ నృత్య ప్రదర్శనలు కనువిందు చేశాయి. నగరానికి చెందిన కళాభిమానులు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరై తిలకించారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

శివాలయానికి ఇత్తడి కలశాల అందజేత

ఆశీర్వచనం అందుకుంటున్న దాత వెంకట రామరాజు, కుటుంబ సభ్యులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీభ్రమరాంబమల్లేశ్వర స్వామి ఆలయానికి ఓ దాత 8 ఇత్తడి కలశాలను కానుకగా ఇచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన కొత్తపల్లి వెంకట రామరాజు రూ.1.90 లక్షల విలువైన కలశాలను ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు దాతను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయనకు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం కూడా ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాక నేడు

కోరుకొండ, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి ఆయన ప్రత్యేక విమానంలో ఇక్కడికి వచ్చి రోడ్డు మార్గంలో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల సమీపంలోని జగన్నాథపురం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన ఇక్కడికి వచ్చి పర్యటన ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లనున్నారు.

వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో జిల్లాలో 63 వసతి గృహాల్లో విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. 10 గిరిజన సంక్షేమ, 21 వెనుకబడిన తరగతుల, 32 సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారన్నారు. వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా స్నేహపూర్వక కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి ఒంటరితనం, ఒత్తిడి, నిరుత్సాహం వంటి సమస్యలపై అవసరమైన సూచనలు చేశారన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్,
ఇ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం-533 124, mail id: egdcsm2022@gmail.com
టెండర్ నోటీస్ నెం.PDS/Stage-II/03/2025-27 టెండర్ ఐడి: 866839 ది 22-11-2025
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, తూర్పుగోదావరి జిల్లాలో బియ్యము, పంచదార, కందిపప్పు, పామ్ ఆయిల్, రాగి పిండి/బెల్లం మరియు ప్రభుత్వము వారు నిర్ణయించిన ఇతర నిత్యావసర వస్తువులు ప్రజా పంపిణీ వ్యవస్థ, అంగన్‌వాడీల మధ్యాహ్న భోజనం మరియు సంక్షేమ హాస్టల్స్‌కు మండల స్థాయి గోడౌను "నిడదవోలు" నుండి (లేదా) బఫర్ గోడౌను నుండి అనుసంధానం చేయబడిన మండలములోని చౌక ధర దుకాణములకు (లేదా) గ్రామ/వార్డు సచివాలయములకు/సంక్షేమ సంస్థలకు/హాస్టల్స్/స్కూల్స్ మరియు ప్రభుత్వము వారు సూచించిన ఏదేని ఇతర ప్రదేశములకు, 2025-27 సంవత్సరములకు గాను (నియామకము తేదీ నుండి 31-03-2027 వరకు) రెండవ దశ రవాణా (స్టేజ్-2) చేయుటకు ఆసక్తిగల వారి నుండి ఇ-టెండర్లు ఏ.పి. ఇ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్ ద్వారా కోరబడుచున్నవి. టెండరు ఫారము/నోటిఫికేషన్ వివరములు www.apeprocurement.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

1. కాంట్రాక్ట్ పీరియడ్:	ది. టెండర్ ఖరారు అయిన తేదీ నుండి 31-03-2027 వరకు
2. టెండర్ ఫారమ్ డౌన్‌లోడ్ ప్రారంభం తేది:	ది. 24-11-2025 సమయం ఉ.11.00 గంటల నుండి
3. టెండర్ ఫారమ్ డౌన్‌లోడ్ ముగింపు తేది:	ది. 27-11-2025 సమయం సా.4.00 గంటల వరకు
4. టెండర్ దాఖలు చేయు ఆఖరి తేదీ:	ది. 27-11-2025 సమయం సా.5.00 గంటల వరకు
5. టెక్నికల్ టెండర్ తెరిచే తేదీ, సమయం:	ది. 27-11-2025 సమయం సా.6.00 గంటల వరకు
6. ఫైనాన్షియల్ టెండర్ తెరిచే తేదీ, సమయం:	ది. 28-11-2025 సమయం మ.3.00 గంటల వరకు

ఏ కారణము చూపకుండా టెండర్లలో మార్పులు చేయు గాని, వాయిదా వేయుటకు గాని, పూర్తిగా రద్దు పరచుటకు గాని, జాయింట్ కలెక్టర్ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారికి పూర్తి అధికారములు కలవు. పూర్తి వివరములకు సెల్ నెం.95733 65733 & 83098 97907లకు సంప్రదించగలరు.
సం/- జిల్లా జాయింట్ కలెక్టర్ & ఇ.ఎ.ఇ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025
Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
FM Partner: ఈ FM Mee FM | TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు కార్యాలయం,
ఎన్‌హెచ్-16, హుకుంపేట,
రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

షష్ఠి ఉత్సవం.. వీరభద్రుని సంబరం

వీరభద్రుని సంబరానికి కాలువగట్టున పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే షష్ఠి ఉత్సవాల మొదటి ఘట్టం వీరభద్రుని సంబరం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఏటా వేడుక వీరభద్రుని సంబరంతోనే ప్రారంభం కావడం ఆనవాయితీ. షష్ఠి ఉత్సవానికి మూడు రోజుల ముందుగా సంబరం నిర్వహిస్తారు. తొండాపు దుర్గాప్రసాద్‌రెడ్డి, అనూష దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవాలయం నుంచి పెద్దఎత్తున ఊరేగింపుగా గోదావరి కాలువ ఒడ్డుకు చేరుకుని పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సాయిబాబా రెడ్డి, కమిటీ సభ్యులు చిట్టిబాబు చౌదరి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రాజారావుపేటలోని జమ్మి చెట్టును పూజించి తిరిగి దేవాలయానికి చేరుకున్నారు. రాత్రికి పెద్దఎత్తున సంబరం చేశారు.

యువతకు ఉపాధి ప్రభుత్వ బాధ్యత: ఎమ్మెల్యే

ఉపాధి మేళాలో పేర్లు నమోదు చేయించుకుంటున్న యువత

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: చదువు పూర్తిచేసిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం వికాస ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఉద్యోగ మేళాను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మేళాకు 620 మంది అభ్యర్థులు హాజరవగా 473 మంది ఉద్యోగాలు పొందారు. ఎంపికైనవారికి తెదేపా యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, ఏఎంసీ ఛైర్మన్ సూర్యకుమారి, కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన చెకుముకి

విజేతలతో జేవీవీ సంఘ సభ్యులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) చెకుముకి జిల్లాస్థాయి పోటీలు రాజమహేంద్రవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలకు జేవీవీ సంఘ సభ్యులు బహుమతులు అందజేశారు. జేవీవీ మెజీషియన్ సీహెచ్ శ్రీరాములు, సైన్స్ రిసోర్స్ పర్సన్ బీవీఎల్ ఆనంద్, సంఘ సభ్యులు కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు, పైడియ్య, ఎం.మల్లికార్జునరావు, కోశాధికారి తాతారావు, కార్యదర్శులు వసంతరావు, చిలుకూరి శ్రీనివాసరావు, జీవీ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విభాగంలో..

శ్రీప్రకాష్ విద్యానికేతన్ రాజానగరం (ప్రథమ), స్వర్ణభారతి కొవ్వూరు మండలం (ద్వితీయ), శ్రీగౌతమి గాంధీపురం రాజమహేంద్రవరం (తృతీయ), ప్రోత్సాహక బహుమతులు శ్రీ అన్నపూర్ణ విద్యానికేతన్ ఉండ్రాజవరం, భాష్యం ఇంగ్లీషు మీడియం స్కూలు (దేవరపల్లి) అందుకున్నాయి.

ప్రభుత్వ విభాగంలో..

ప్రభుత్వ పాఠశాల విభాగంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల రఘుదేవపురం సీతానగరం మండలం (ప్రథమ), ఏపీఆర్ స్కూలు భూపతిపాలెం గోకవరం (ద్వితీయ), ఏకేఆర్జీ ఇంగ్లిష్ మీడియం స్కూలు నిడదవోలు (తృతీయ), ప్రోత్సాహక బహుమతులు రాజానగరం జడ్పీ స్కూలు, ఎంవీయన్ జడ్పీ స్కూలు (ఉండ్రాజవరం) అందుకున్నాయి.

బాస్కెట్ బాల్ విజేతలు.. కృష్ణా, తూర్పుగోదావరి జట్లు

నూజివీడు రూరల్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతల వివరాలను టోర్నమెంట్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని తూర్పుగోదావరి, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం విశాఖపట్నం, నాలుగో స్థానాన్ని కృష్ణా జిల్లాలు సాధించాయన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కృష్ణా, ద్వితీయ స్థానం తూర్పుగోదావరి, తృతీయ స్థానం గుంటూరు, నాలుగో స్థానాన్ని చిత్తూరు జిల్లా జట్లు సాధించినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా అండర్ 17 బాలుర విభాగంలో వరుసగా 8వ సారి విజయం సాధించారన్నారు. డీవైఈవో పీఎస్ సుధాకర్, సీఐ పి.సత్యశ్రీనివాస్, బిస్ అధినేత బి.శ్యామ్, కరస్పాండెంట్ మెలోడి, అబ్జర్వర్ పి.కృష్ణ, 13 జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు, క్రీడలూ విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం కావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సూచించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం అండర్-19 బాలబాలికల ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మంత్రితోపాటు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు హాజరై జ్యోతి వెలిగించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా డీఐఈవో ఆంజనేయులు, ప్రిన్సిపల్ సౌజన్య, వ్యాయామ ఉపాధ్యాయులు శీనయ్య, ఎన్టీ ప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు జరిగిన పోటీలలో కృష్ణా-తూర్పుగోదావరి జిల్లాలు తలపడ్డాయి. కృష్ణా జిల్లా విజేతగా నిలిచింది.

కాలం చెల్లిన ఔషధాలపై కొనసాగిన విచారణ

ఈనాడు, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో కాలం చెల్లిన మందులు ఇచ్చారని ఓ మహిళ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసిన అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. డ్రగ్స్ జీఎం డాక్టర్ బాలు ఆదివారం రాజమహేంద్రవరం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లి వివరాలు సేకరించారు. సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసి మహిళ, 55 ఏళ్ల రోగి వివరాలు తెలియజేయడంతో లోతుగా విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "55 ఏళ్ల మహిళ బీపీ సమస్యతో నారాయణపురం యూపీహెచ్‌సీకి సెప్టెంబర్ 6న వచ్చారు. అక్టోబరుతో గడువు ముగిసే మాత్రలు ఆమెకు ఇచ్చారు. కానీ వాటిని ఆమె వేసుకోకుండా దాచుకున్నారు. నవంబరు 8న మోకాళ్ల నొప్పితో మరో దఫా ఆసుపత్రికి వెళ్లారు. ఆ రోజు ఇతర మాత్రలతోపాటు బీపీ మాత్రలు కూడా ఇచ్చారు. 'ఎక్స్'లో రెండు బ్యాచ్ నంబర్లతో ఇచ్చిన మాత్రలు పోస్టు చేయగా.. అందులో ఒక బ్యాచ్ నంబరు స్థానిక ఆసుపత్రిలో ఇచ్చారు. కానీ మరో బ్యాచ్ నంబర్‌తో ఉన్నవి ఈ ఆసుపత్రికి సరఫరా కాలేదు." అని ఆయన వివరించారు. దీనిపై సమగ్ర నివేదికను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు.

రూ.8.10 లక్షల విలువైన ఆభరణాల అప్పగింత



ఆభరణాలు చూపుతున్న అధికారులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రైలులో వదిలేసిన రూ.8.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, దుస్తులతో ఉన్న రెండు ట్రాలీ లగేజీ బ్యాగ్‌లను రాజమహేంద్రవరం రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది స్వాధీనం చేసుకుని బాధిత ప్రయాణికుడికి సురక్షితంగా అప్పగించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన బి.విశ్వనాథ్‌రెడ్డి తన భార్యతో కలిసి అన్నవరం వచ్చి, స్వస్థలానికి వెళ్లేందుకు ఆదివారం ఉదయం అన్నవరం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. బిలాస్పూర్-తిరుపతి రైలు ఎక్కి తమ రెండు ట్రాలీ బ్యాగ్‌లను బి-5 కోచ్‌లో ఉంచారు. భార్య రైలు ఎక్కకుండా ప్లాట్‌ఫామ్‌పై ఉండిపోవడంతో బ్యాగ్‌లు కోచ్‌లోనే ఉంచి రైలు దిగారు. ఇంతలో రైలు కదిలింది. బ్యాగ్‌లు కోచ్‌లోనే ఉండిపోవడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఈ సమాచారాన్ని రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్ అధికారులకు అందించారు. రైలు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో సిబ్బంది బి-5 కోచ్‌లో ఉన్న రెండు బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో బంగారు ఆభరణలతో పాటు దుస్తులు ఉన్నాయని, వీటి మొత్తం విలువ రూ.8.10 లక్షలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వాటిని బాధిత ప్రయాణికుడి అప్పగించామన్నారు.

ట్రాలీ వాహనం బోల్తా: 20 మందికి గాయాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ సమీపాన రాజానగరం మార్గంలో జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ట్రాలీ వాహనం బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజంపాలేనికి చెందిన 25 మంది ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుణ్ణంపల్లిలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బయలుదేరారు. ఐటీడీఏ సమీపానికి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ట్రాలీ వాహనం ప్రమాదవశాత్తు రహదారి పక్కకు బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనాల్లో మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. స్టీరింగ్ వదిలేయడం ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఆదిమూలం గంగరాజు

కోరుకొండ, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుకొండ మండలం గాడాలకు చెందిన రైతు ఆదిమూలం గంగరాజు(50)కు సొంతంగా కొంత భూమి ఉంది. దాంతో పాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా సాగులో నష్టాలు వచ్చి అప్పులపాలయ్యారు. కొంతకాలంగా రోజువారి కూలి పనులకు వెళ్తున్నారు. అప్పుల భారం పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై రంగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుమారుడు ధనరాజు ఉపాధి నిమిత్తం వివిధ పనులు చేస్తుంటారు.

సంతోషంగా వెళ్లి.. విగతజీవిగా మారి

విభాగినిని ఢీకొని యువకుడి మృతి

కోరుకొండ, న్యూస్‌టుడే: స్నేహితులు, బంధువులతో సంతోషంగా గడిపేందుకు వనసమారాధనకు వెళ్లారు. ఉత్సాహంగా గడిపారు. తిరిగెళ్తూ విభాగినిని ఢీకొని మృతిచెందారు. ఈ విషాదకర ఘటన ఘటన కోరుకొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం గ్రామీణంలోని కాతేరుకు చెందిన కేతా వీరబాబు(26) పేపరు మిల్లులోని ఒప్పంద ఉద్యోగిగా చేస్తున్నారు. కోరుకొండ మండలం గాడాల సమీపంలో ఆదివారం జరిగిన వనసమారాధనలో పాల్గొన్నారు. ద్విచక్రవాహనంపై రాత్రిపూట తిరిగి వెళ్తుండగా గాడాల వద్ద అదుపు తప్పి విభాగినిని ఢీకొన్నారు. అతడు వెంటనే అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	19,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 98491 38626

TO LET

E/F 3BHK 1546 Sft. Flat available for rent. A block 1207 gated community velumuriviss Morampudi Rajahmundry. ✆ 8790249629

JOBS

Wanted Female Telecallers and male counselors qualification any degree, age limit: 25 to 45 Years (Must be Married) Salary upto: 16000/-, working location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

WANTED Qualified & Experienced Candidate to teach Maths & Social Studies for Higher Classes. Walk-in: 22-11-25 & 24-11-25 from 10 am to 6 pm. ✆ 98491 36605.

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives - for Rajamundry/ Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Sahasra College - Kakinada Wanted Senior Lecturers & Junior Lecturers Maths, Physics & Chemistry, Lady Hostel Wardens & Telecallers, Pro's. Razole, Sakhenetipalli & Amalapuram. Cell: 94406 91781, 96525 11056, 80748 54469.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-. 40 సంవత్సరాలలోపువారు మాత్రమే, Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

రాజమండ్రి, బొమ్మూరు, కొవ్వూరుల్లో ప్రముఖ షోరూమ్స్, కాలేజీల్లో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. జీతం: 12 to 15 వేలు. రూం+భోజనం. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి ✆ 93922 69369.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. ✆ 7702184399.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU for Advertisement Contact: 8008597607

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజమహేంద్రవరం

ఉద్యోగుల నిరసన నేడు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకటేష్ తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఈ నేపథ్యంలో పోరాట దీక్ష చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

కొత్త మూత ఏర్పాటు

ఏవీఏ రోడ్డు: ప్రధాన రహదారి పరిధిలోని చందాసత్రం వీధి మలుపులో మ్యాన్‌హోల్ గ్రిల్ పూర్తిగా దెబ్బతింది. వాణిజ్య ప్రాంతం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలకు అవకాశం ఉంది. దీనిపై 'ఈనాడు'లో 16న 'మలుపులో ప్రమాదమే' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. కొత్త మూత ఏర్పాటు చేశారు.

స్పందనకు వందనం

ఆభరణాల సమర్పణ

బంగారు, వెండి ఆభరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల విరాళంతో తయారు చేయించిన పన్నెండున్నర కాసుల బంగారు సూత్రాలతో తాడు, 325 గ్రాముల వెండి యజ్ఞోపవీతం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మళ్ల వెంకటరాజు, ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు ఆలయ అభివృద్ధికి మరిన్ని సేవలందించాలని కోరారు. మజ్జి రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కోల రామచంద్రరావు, పెండ్యాల ఉమామహేశ్వరరావు, కేలం సత్యనారాయణ, కేలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం

శ్యామలాసెంటర్: 69వ స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-14, 17, 19 బాల, బాలికల కరాటే పోటీలను రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో ఆదివారం డీఏ బి.దిలీప్‌కుమార్ ప్రారంభించారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీలకు పలు జిల్లాల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఏ మాట్లాడుతూ మహిళల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. ఇటీవల సర్వశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. జిల్లా సంఘ కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, భువనేశ్వరి, వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, సీహెచ్ రాజశేఖర్, వీరబాబు, జయకుమార్, జె.శ్రీనివాస్, జి.రేణుక, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డీఏ దిలీప్‌కుమార్

యువతులు.. క్రీడల్లో విజేతలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయనేది నిపుణుల మాట. చదువుతో పాటు అన్నింట్లోనూ పిల్లలను ప్రోత్సహించడం ద్వారా వారి భవితకు చక్కని బాటలు వేయచ్చు. రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు పలు క్రీడల్లో రాణిస్తూ విజేతలుగా నిలుస్తున్నారు. చక్కటి ప్రణాళికతో చదువు, ఆటలు రెండింటిలో రాణిస్తున్న క్రీడాకారిణుల అంతరంగం, లక్ష్యాలు వారి మాటల్లో..

జాతీయ స్థాయిలో రాణించాలని..

మాది మురారి గ్రామం. నాన్న వ్యవసాయం చేస్తుంటారు. పాఠశాల స్థాయి నుంచే రన్నింగ్, కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో రాణిస్తున్నా. రాజ్యలక్ష్మి కళాశాలలో ఇంటర్‌లో చేరాక బాక్సింగ్ సాధన ప్రారంభించాను. కోచ్ భవానీ శంకర్ వద్ద శిక్షణలో విశేషంగా రాణిస్తున్నా. అంతర కళాశాలల బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచి విశాఖపట్నంలో జరిగిన తుది పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆనందాన్ని కలిగించింది. **- కె.మహా హాసిని, ఇంటర్**

స్కేటింగ్‌లో ప్రతిభ చూపుతూ..

మా నాన్న పంచాయతీ ఉద్యోగి. ఆయన ప్రోత్సాహంతోనే 3వ తరగతిలో స్కేటింగ్ సాధన ప్రారంభించా. కాకినాడ, విశాఖపట్నం, రాయపూర్, బెంగళూర్, దిల్లీ తదితర నగరాల్లో జరిగిన జాతీయ స్కేటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి పతకాలు సాధించాను. ఇది చాలా క్రమశిక్షణతో కూడిన ఆట. గెలుపు, ఓటములు సెకను కాలంలో మారిపోతాయి. ప్రపంచ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేత కావాలనేదే నా లక్ష్యం. **- మహమ్మద్ హనీఫా మెహనాజ్, ఇంటర్**

పాఠశాల స్థాయి నుంచి..

మాది వై.రామవరం. నాన్న రైతు. రోజూ ఎంతో శ్రమిస్తారు. ఆయనే నాకు స్ఫూర్తి. పాఠశాల స్థాయి నుంచి వెయిట్ లిఫ్టింగ్ సాధన ప్రారంభించాను. జిల్లాస్థాయిలో పతకాలు సాధించాను. డిగ్రీలో రాజ్యలక్ష్మి కళాశాలలో చేరాక పీఈటీ ప్రోత్సాహంతో జూడోలో శిక్షణ తీసుకున్నా. నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పోటీల్లో జూడో విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాను. ఆలిండియా పోటీల్లో గెలవడమే ధ్యేయం. **- కె.స్వర్ణలత, బీఎస్సీ**

పోలీసు ఉద్యోగం సాధించాలని..

చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతూ రాష్ట్రస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించాను. మానాన్న కూలీ. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా నన్ను ప్రోత్సహించారు. డిగ్రీలో చేరాక నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల జూడో పోటీల్లో బంగారు పతకం అందుకున్నా. డిగ్రీ పూర్తి చేసి పోలీసు ఉద్యోగం సాధించాలని ఆశయంతో ఉన్నాను. **- తోట లీల వెంకటేశ్వరి, బీఏ**

దేశభద్రత అందరి బాధ్యత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాలోచన వేదిక ఆధ్వర్యంలో 'దేశభద్రత - కింకర్తవ్యం' అంశంపై చర్చ ఆదివారం గౌతమఘాట్‌లోని రివర్ బే ఆహ్వానం హాలులో జరిగింది. రాకా సుధాకర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తూ దేశభద్రత పౌరులందరి బాధ్యత అని గుర్తు చేశారు. సరిహద్దు భద్రత సైన్యం చూసుకుంటుందని, దేశ సమగ్రత ప్రభుత్వం చూస్తుందన్నారు. అంతర్గత భద్రతకు సంబంధించి సామాన్య పౌరులంతా బాధ్యత తీసుకున్నపుడే దేశ భద్రత సాధ్యమన్నారు. అందరూ తమ రాజ్యాంగ పరమైన బాధ్యతలు నిర్వర్తించినపుడు మాత్రమే దేశానికి భద్రత ఉంటుందన్నారు. సభలో లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, ప్రొఫెసర్ మట్టారెడ్డి, ఆర్ఎస్ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది.

నేటినుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30 వరకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, రక్తదాతల సర్వే, డ్రగ్స్ రహిత, ప్లాస్టిక్ దుర్వినియోగం గురించి అవగాహన, దంత, కంటి వైద్య శిబిరాలు నిర్వహణ, రోడ్డు సంరక్షణ, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాజ్యలక్ష్మి తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ కె.వి.స్వామి, ప్రిన్సిపల్ కె.విజయనిర్మల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): సత్యసాయిబాబా సేవలు అజరామరం అని అధికారులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు నిర్వహించారు. జేసీ మేఘస్వరూప్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా ఛైర్‌పర్సన్ బొడ్డు వెంకటరమణ తదితరులు పాల్గొని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుకుల కరస్పాండెంట్ శ్యామ్ సుందర్, ప్రిన్సిపల్ గుర్రయ్య, ఆదిపెన్ ఎస్సీ ఎ.సుబ్బరాజు, ఇన్‌ఛార్జి డీఆర్వో బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీ.నగర్: బాబా తత్వం మార్గదర్శకమని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్యదర్శి శైలజవల్లి, శ్రీనివాసరావు, మదర్ల అలీ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా, మున్సిపల్ అధికారులు తదితరులు

కంబాలచెరువు, కోటగుమ్మం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి తదితరులు బాబా చిత్రపటానికి నివాళి అర్పించారు. ★ నగరంలోని పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. ఏవీఏ రోడ్డు, దానవాయిపేట, ఐఎల్ టీడీ జంక్షన్, ఆల్కట్‌గార్డెన్స్‌లోని సేవా మందిరాల్లో జరిగాయి. ప్రసాదం, పులిహోర, దుప్పట్లు పంపిణీ చేశారు.

కలెక్టరేట్‌లో జేసీ మేఘస్వరూప్

జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ మురళీకృష్ణ

భళా.. సాంస్కృతిక కళ..

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాస్ స్వీయ పర్యవేక్షణలో విద్యార్థులు డోలా ప్రవల్లి, బొర్రా తేజస్వి, అంజనా రాగాన్, చందనా కలిసి దశావతారాల నృత్యరూపకాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. సత్యసాయి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గురవారెడ్డి మార్గదర్శకత్వంలో ఆ పాఠశాల విద్యార్థులు సత్యసాయి భజన, కీర్తనలు ఆలపించారు. **– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం**

ఆహ్లాదానికి ఆనవాలుగా నర్సరీలు

కడియం, న్యూస్‌టుడే: కడియంలోని పచ్చని నర్సరీల అందాలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయని రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.హరికృష్ణ కొనియాడారు. కుటుంబ సమేతంగా కలిసి ఆయన కడియంలోని నర్సరీని ఆదివారం సందర్శించారు. ఆధునిక పద్ధతుల్లో మొక్కల పెంపకంపై కృషి చేస్తున్న రైతులను కొనియాడారు. గతంలో ఆయన జిల్లా ఎస్పీగా పనిచేసిన జ్ఞాపకాలను పంచుకున్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రామకృష్ణ, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్బీ సిబ్బంది జనార్ధన్ పాల్గొన్నారు.

సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులు

రాజానగరం: సచివాలయ వ్యవస్థలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజలకు సుస్థిరమైన పాలన అందించడంలో పాలన సంక్షేమ పథకాల పర్యవేక్షణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్ట్ అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో, పట్టణ స్థాయిలో పుర కమిషనర్లు వీటిని పర్యవేక్షించనున్నారు. 2047 విజన్ లక్ష్యసాధనలో సచివాలయ ఉద్యోగుల సేవలను పక్కాగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, పర్యవేక్షణ మాత్రం వదిలేసింది. త్వరలో మండలానికి ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు పనిచేయనున్నారు. ఒకరు పంచాయతీ, మరొకరు సచివాలయ వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు.

డబ్బాలు పోయి.. గొట్టాలు మిగిలి

నగరంలోని రద్దీ ప్రాంతాల్లో చెత్త డబ్బాలు కనిపించట్లేదు. వాటి కోసం ఏర్పాటు చేసిన స్టాండ్‌లు, గొట్టాలు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న చెత్త డబ్బాలతోపాటు స్టాండ్ గొట్టాలు సైతం వంగిపోయాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **– న్యూస్‌టుడే, దేవీచౌక్**

తెరిచిన ప్రమాదం..

సీటీఆర్ఐ కూడలి వద్ద ఫ్యూజ్ పెట్టె ప్రమాదకరంగా ఉంది. రక్షణ ఏర్పాట్లు లేకుండా ఉంది. చేతికి అందేంత ఎత్తులో ప్రమాదకరంగా ఉండటంతో ఆదమరుపుగా ఉంటే ఏదైనా జరగొచ్చని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

వ్యాధుల భయం..

ఆల్కట్‌తోట ప్రాంతంలో రైల్వేస్టేషన్ రోడ్డు వెంబడి రహదారికి ఇరువైపుల మురుగు వెళ్లే మార్గం లేక వీధిలోనే నిలిచిపోతోంది. పలు వీధుల్లో డ్రెయినేజీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో మిగిలిన వీధుల్లో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. **– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

నడక బాటలో వ్యర్థాలు

నగరంలోని నందంగనిరాజు జంక్షన్ నుంచి వై-జంక్షన్‌కు వెళ్లే దారిలో కాలిబాటపై చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు రాత్రిపూట దీపాలు వెలగట్లేదు. అటుగా వెళ్లే విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, కోటగుమ్మం**

విభాగినిపై వాహనాలు

దేవీచౌక్ ప్రధాన వర్తక ప్రాంతం. నగరం, గ్రామీణం నుంచి రోజూ కొన్ని వందల మంది ఇక్కడకు వస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడి నుంచి పేపరుమిల్లుకు వెళ్లే మార్గంలో విభాగినిపై కార్లు, ఆటోలు నిలిపేస్తున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి. **– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు**

జనసేన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు పరిహారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు తొమ్మిదో డివిజన్‌కు చెందిన బత్తిన సంతోష్, 42వ డివిజన్‌కు చెందిన నవగాని రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జనసైనికుల క్రియాశీలక సభ్యత్వం వారికి ఉండటంతో మంగళగిరిలోని ఓ కన్వెన్షన్‌లో ఎమ్మెల్సీ నాగబాబు రూ.5 లక్షల చెక్కు ఆదివారం అందజేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పవర్ లిఫ్టర్‌కు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం గౌతమఘాట్ వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా పవర్ లిఫ్టింగ్‌లో విశేష ప్రతిభ చూపుతున్న శానిటరీ కార్మికుడు అర్జి బాలకృష్ణకు ఆర్థికసాయం అందించారు. డిసెంబరులో టర్కీ దేశంలోని ఇస్తాంబుల్ నగరంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న బాలకృష్ణకు ఖర్చుల నిమిత్తం రూ.25వేలు చెక్కును అందజేశారు. పదేళ్లుగా పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపుతూ ఎన్నో పతకాలు సాధించిన బాలకృష్ణ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సాయం అందించామని ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్‌గుప్తా, డైరెక్టర్ లక్కోజు వీరభద్రరావు తెలిపారు.

గంజాయి రవాణా నిందితుల అరెస్టు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ దివాన్‌చెరువు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కారు, వ్యానులో గంజాయిని గుర్తించారన్నారు. నిందితులు గంజాయిని ఒడిసాలోని బరంపురానికి చెందిన రాము వద్ద కొనుగోలు చేసి కర్ణాటకకు రవాణా చేస్తున్నారని తెలిపారు. కర్ణాటకకు చెందిన ఇస్మాయిల్ షరీఫ్, మన్సూర్, సుల్తాన్ సలీమ్, మస్తాన్ అలీఖాన్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1.66 కోట్లు విలువైన 332.91 కిలోల గంజాయి, వ్యాను, కారు, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండు నిమిత్తం ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

మౌలిక వసతుల మాటేమిటి..!

వార్డు కష్టాలు

ఏవీఏ రోడ్డు: నగరంలోని పలు వార్డుల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. 23వ వార్డులో అంతర్గత రహదారులు, సరిగా లేని మ్యాన్‌హోల్ మూతలు, వీధి మలుపులో వ్యర్థాలు, ప్రమాదకరంగా స్తంభాలు కనిపిస్తున్నాయి. ఈ వార్డులో సుమారు 3,600 మంది నివసిస్తున్నారు. రంగ్రీజు పేట, చందాసత్రం, గ్రంధి వారి వీధి తదితర ప్రాంతాలు ఉన్నాయి. గోదావరి గట్టు, ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉండటంతో రాకపోకలు విపరీతంగా ఉంటాయి. మెయిన్‌రోడ్డుకు అనుసంధానమైన మార్గాలు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ● పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. వీధి మలుపుల్లో చెత్త వేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు నడక మార్గాల్లో వేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ● రహదారుల మధ్యలో మ్యాన్‌హోల్స్‌పై ఇనుప చట్రాలు దెబ్బతిన్నాయి. మురుగు కాలువలపై పలకలు సైతం సరిగా లేవు. కొన్నిచోట్ల కుంగిపోయాయి. మరికొన్ని చోట్ల దెబ్బతిన్ని ఊచలు బయటకు వచ్చాయి. విద్యాసంస్థలకు సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రికలు, ఫ్యూజ్ బాక్సులు ఉన్నాయి.

నడక మార్గంలో చెత్త

సప్పా ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్న వివిధ రంగాల్లో నిపుణులు

పురస్కారాల అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నాట్య రంగంలో విశేష సేవలందించిన సప్పా దుర్గాప్రసాద్ సేవలు అమూల్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం ఉదయం తాడితోటలోని సంహిత కన్వెన్షన్ హాలులో సప్పా ఎక్సలెన్స్ పురస్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఏటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న నిపుణులను సప్పా ఎక్సలెన్స్ పురస్కారాలతో సత్కరిస్తున్నారన్నారు. అతిథులుగా హాజరైన తెదేపా నాయకుడు గన్ని కృష్ణ, తెలుగు వర్సిటీ వీసీ మునిరత్నం, జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరుల చేతుల మీదుగా సప్పా ఎక్సలెన్స్ - 2025 పురస్కారాలు అందించారు. వివిధ నాట్యసంస్థల శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

గ్రహీతలు వీరే..

సేవారంగం : వంశీ రామరాజు, నండూరి సుబ్బారావు, నిమ్మలపూడి గోవింద్. **వైద్యం :** డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఎం.రామకోటేశ్వరరావు. **ఆధ్యాత్మికం :** రాపాక శ్రీనివాస్, **పత్రికా రంగం :** పొత్తూరి సుబ్బారావు, కుడుపూడి పార్థసారథి. **రచనా రంగం :** శిఖామణి. **కళలు:** మల్లికార్జున్. **నాట్యం:** డాక్టర్ వేణుగోపాల్, హేమసుందర్.

నదీమ తల్లికి నీరాజనం

అఖండ గోదావరి తీరంలో నిత్యం గోదారమ్మకు అందించే హారతి వైభోగం తిలకించడం అపురూపమైన వరంగా భావిస్తారు. దేవాదాయశాఖ నిర్వహణలో జరిగే కార్యక్రమం ఆదివారం సాయంత్రం కమనీయంగా జరిగింది. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య 14 రకాల హారతులను నదీమ తల్లికి సమర్పించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరై తిలకించారు. **- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం**

ఉత్సాహంగా కాపు వనసమారాధన

చిన్నారుల ఆటాపాటలు.. సినీగీతాలకు నృత్యాలు.. యువత కేరింతలు.. పెద్దల ఐక్యతారాగాలు.. మహిళలకు వివిధ పోటీలు.. విజేతలకు బహుమతులతో అంతటా సందడి వాతావరణం. రాజమహేంద్రవరం కాపు సంక్షేమ, సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక, వనసమారాధన ఉత్సాహభరితంగా జరిగింది. జేఎన్‌రోడ్డు శివారు జాతీయ రహదారి జంక్షన్ చెంతనున్న చెరుకూరి కొబ్బరితోటలో జరిగిన కార్యక్రమంలో వేలాది సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు. కాపు సంక్షేమ, సేవాసంఘ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన కాపు నాయకులు పాల్గొన్నారు. ఐకమత్యంగా ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు. **- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం**

వనసమారాధనలో కాపు సంఘీయులు

నృత్యం చేస్తున్న చిన్నారులు

వాలంటీర్ల శ్రమదానం

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం ఉదయం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బొమ్మూరు వివేకానంద మహా రోగ్యకేంద్ర సమీపంలో పెరిగిన గడ్డిమొక్కలు తొలగించారు. గతంలో ఇదే ప్రాంతంలో స్వచ్ఛభారత్ నిర్వహించి మొక్కలు నాటామని ఎన్ఎస్ఎస్ అధికారి జి.వి.ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. కె.సుధాకర పట్నాయక్, పోలుకొండ సాయి, బి.రమాదేవి, శిరీష తదితరులు పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం**

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

బిక్కవోలు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కూటమి నేత, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బలభద్రపురంలో డ్వాక్రా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన షాపింగ్ మాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. వాషింగ్ పౌడర్, ఇతరత్రా వస్తుత్పత్తులు విక్రయిస్తారని వెల్లడించారు. మార్కెట్‌లో లభించే వస్తువుల ధర కన్నా 20 శాతం తక్కువకు లభిస్తాయని తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు దత్తుడు సుబ్బారెడ్డి, సర్పంచి బుంగా రామారావు, యువనేత నల్లమిల్లి వెంకట రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నదీమతల్లికి నీరాజనం

అఖండ గోదావరి తీరంలో నిత్యం గోదారమ్మకు అందించే హారతి వైభవాన్ని తిలకించడం అపూర్వమైన వరంగా భావిస్తారు. దేవాదాయశాఖ నిర్వహణలో జరిగే కార్యక్రమం ఆదివారం సాయంత్రం కమనీయంగా జరిగింది. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య 14రకాల హారతులను నదీమతల్లికి సమర్పించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరై తిలకించారు. – న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

మేమున్నాం.. మీకు తోడుగా

మీ సమస్యలను తెలిపేందుకు ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, ఉ. 10 - మ. 1, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

నీరు రావట్లేదు..

సమస్య: బొమ్మూరు టీచర్స్ కాలనీ చివరి వీధిలో వీధి కొళాయి మూడు రోజుల నుంచి రావట్లేదు. నీటి కోసం దూర ప్రాంతానికి వెళ్తున్నాం. - శ్రీను, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేయించి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. - కాశీ, గ్రామ కార్యదర్శి, బొమ్మూరు - న్యూస్‌టుడే, బొమ్మూరు

జనసేన కార్యకర్తల కుటుంబాలకు బీమా పంపిణీ

రాజానగరం, న్యూస్‌టుడే: మృతిచెందిన జనసేన కార్యకర్తలకు చెందిన బీమాను ఆదివారం వారి కుటుంబాలకు పంపిణీ చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేయించారు. వారిలో ముగ్గురు కార్యకర్తలు వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందారు. ఆదివారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5లక్షల విలువైన చెక్కులు అందించారు. ఎమ్మెల్సీ నాగబాబు చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. వెలుగు శివ (నరేంద్రపురం), నగరపు వీరరామకృష్ణ (తొర్రేడు), సేనాపతి శ్రీను (గాదరాడ) కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

ట్రస్ట్ సేవలు అభినందనీయం

కడియం, న్యూస్‌టుడే: సమాజహిత సేవలకు ప్రాముఖ్యత నిచ్చే మార్గాని ట్రస్ట్ సేవలు అభినందనీయమని గ్రామీణ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. కడియం గౌతమి నర్సరీలో ఆదిత్య మార్గాని వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. మార్గాని సోదరులు చేస్తున్న సామాజిక సేవలను ఆయన కొనియాడారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మాజీ ఎంపీ మార్గాని భరత్, నాగేశ్వరరావు, ఏడుకొండలు, బోడపాటి గోపి, గట్టి నర్శయ్య, సుబ్బారావు, ముద్రగడ జమీ, తదితరులు పాల్గొన్నారు.

కడియంలో ఎమ్మెల్యే గోరంట్లతో నేతలు

శిక్షణ భవనం.. వసతులు మృగ్యం

హుకుంపేట, బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని జిల్లా మహిళా ప్రాంగణంలో మహిళలు, యువతులకు కొత్త కోర్సులు రానున్నాయి. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరింగ్, బ్యూటీషియన్, డేటాఎంట్రీ ఆపరేటర్ శిక్షణలు త్వరలో ప్రారంభించనున్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి, 8వ తరగతి ఆపైన చదివిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సులు ఆరంభమవుతుండటంతో మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు లేవు..

ప్రాంగణం 15 ఏళ్ల నుంచి పూర్తిగా మరమ్మతులకు నోచుకోలేదు. పాత భవనంలోనే నిర్వహిస్తున్నారు. కొన్నినెలల క్రితం ప్రాంగణం పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తుప్పలు, చెట్లు తొలగించి శుభ్రం చేయమని అధికారులను ఆదేశించారు. కాని ప్రయోజనం లేదు. భవంతి మొత్తం రంగులు లేవు, కిటికీల అద్దాలు పగిలిపోయాయి. పాములు, విషకీటకాలు తిరగడంతో సిబ్బంది భయపడుతూనే విధులు నిర్వహిస్తున్నారు. కొత్త కోర్సులకు వచ్చే అభ్యర్థులు వసతులు లేని గదుల్లోనే శిక్షణలు తీసుకోవాలి. ఏళ్ల క్రితం పక్కన పెట్టిన కంప్యూటర్లు ఉపయోగపడతాయో లేదో తెలియని పరిస్థితి. కుట్టుమిషన్లు సైతం మూలకు చేరాయి. వాటినీ బాగు చేసి ఉపయోగించాల్సిన పరిస్థితి.

సిబ్బంది కొరత..

పదేళ్ల క్రితం వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పదవీ విరమణ పొందిన తర్వాత కొత్తగా ఎవరిని నియమించలేదు. మినిస్టీరియల్ ఉద్యోగితోనే ప్రాంగణం నడిచేది. ఆమె కూడా పదవీ విరమణ చేయడంతో ప్రాంగణం మొత్తం ఖాళీగా ఉంది. కనీస సమాచారం చెప్పే వారు లేరు. ఐసీడీఎస్ సీడీపీవోలను ఇన్‌ఛార్జ్ మేనేజర్లుగా నియమించి కాలం గడుపుతున్నారు. వాళ్లు కూడా నెలల వ్యవధిలో మారిపోతున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జ్ మేనేజరుగా పి.విమలను నియమించారు. ఇన్‌ఛార్జ్ కారణంగా ప్రాంగణంపై పూర్తి సమయాన్ని కేటాయించడానికి కష్టం అవుతుంది. గదులు శుభ్రం చేయాలన్నా, అతిథులకు కనీసం మంచి నీరు అందించలేని పరిస్థితి.

రంగులు వెలసిపోయిన మహిళా ప్రాంగణం

త్వరలో కోర్సులు ప్రారంభం..

మహిళలకు ఉచితంగా కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలు పొందడానికి ఈ కోర్సులు ఉపయోగపడతాయి. బయట ఈ కోర్సులకు రూ.వేలు ఖర్చు చేయాలి. అర్హులైన శిక్షకులు బోధిస్తారు. ఆ మేరకు సదుపాయాలు సమకూర్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - మురళి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

ఉద్యోగుల నిరసన నేడు

శ్యామలా సెంటర్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేష్ తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఈ నేపథ్యంలో పోరాట దీక్ష చేపడుతున్నామన్నారు. కార్యక్రమానికి పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటినుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30 వరకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, రక్తదాన సర్వే, డ్రగ్స్ రహిత, ప్లాస్టిక్ దుర్వినియోగం గురించి అవగాహన, దంత, కంటి వైద్య శిబిరాల నిర్వహణ, రోడ్డు సంరక్షణ, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాజ్యలక్ష్మి తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ కె.వి.స్వామి, ప్రిన్సిపల్ కె.విజయనిర్మల తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కోరుకొండ: కోరుకొండ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేఈపీ నటరాజన్ తెలిపారు. మునగాల, శ్రీరంగపట్నం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వాహన రికార్డులన్నీ ఉండాలి

పెదపూడి: ద్విచక్ర, త్రిచక్ర, కారు, జీపు తదితర వాహనాల రికార్డులన్నీ సక్రమంగా ఉండాలని పెదపూడి ఎస్సై తులసీరామ్ సూచించారు. ఆదివారం పెదపూడి మండలం రామేశ్వరం ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి కాలనీలో ఏకకాలంలో సోదాలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అచ్యుతాపురత్రయంలో జూద శిబిరంపై దాడిచేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పురస్కారాలు అందుకున్న వివిధ రంగాల్లో నిపుణులు

పురస్కారాల అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, అనపర్తి గ్రామీణం: నాట్యరంగంలో విశేష సేవలందించిన సప్పా దుర్గాప్రసాద్ సేవలు అమూల్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం ఆనం కళాకేంద్రంలోని సంహిత కన్వెన్షన్ హాలులో సప్పా ఎక్స్‌లెన్స్ పురస్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఏటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న నిపుణులను సప్పా ఎక్స్‌లెన్స్ పురస్కారాలతో సత్కరిస్తున్నారన్నారు. అతిథులుగా హాజరైన తెదేపా నాయకుడు గన్ని కృష్ణ, తెలుగు వర్సిటీ వీసీ మునిరత్నం, జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరుల చేతుల మీదుగా సప్పా ఎక్స్‌లెన్స్ - 2025 పురస్కారాలు అందించారు. వివిధ నాట్యసంస్థల శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.

పురస్కార గ్రహీతలు

సేవారంగం : వంశీ రామరాజు, నందూరి సుబ్బారావు, నిమ్మలపూడి గోవింద్. వైద్యం : డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఎం.రామకోటేశ్వర రావు. ఆధ్యాత్మికం : రాపాక శ్రీనివాస్, పత్రికా రంగం : పొత్తూరి సుబ్బారావు, కుడుపూడి పార్థసారథి. రచనా రంగం : శిఖామణి. కళలు: మల్లి కార్జున్. నాట్యం: డాక్టర్ వేణుగోపాల్, హేమసుందర్. పడాల సుబ్బారెడ్డి పురస్కారాలు అందుకున్నారు.

సత్యసాయి మార్గం ఆదర్శం

బొమ్మూరు, హుకుంపేట, బిక్కవోలు: భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలు ఆల్కాట్‌గార్డెన్స్‌లోని సత్యసాయి సేవా సమాజంలో వేడుకగా నిర్వహించారు. విశేష భజన, నామ సంకీర్తన చేశారు. ● హుకుంపేట రామకృష్ణనగర్ యూనిట్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో చేపట్టారు. ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, కూటమి నాయకులు కేక్ కోసి, శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంఈవో తులసీదాస్, తెదేపా మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కుమ్మరి శాలివాహన డెవలప్‌మెంట్ డైరెక్టర్ పందూరి అప్పారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ గౌడ, ఆళ్ల ఆనందరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆల్కట్‌గార్డెన్స్‌లో పూజలు చేస్తున్న సభ్యులు

రాజానగరం: శ్రీసత్యసాయిబాబా ఆశీస్సులు అందరిపై ఉండాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజానగరం మండల పరిషత్తు కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి ఎమ్మెల్యే బత్తుల, ఆర్డీవో కృష్ణ నాయక్ నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు నేటికీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ, తహసీల్దారు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడి మండలం పెదపూడి, సంపర గ్రామాల్లో సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి కోలాట నృత్యాలు, బ్యాండు మేళాలతో రథోత్సవం నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

రాజానగరంలో చిత్రపటానికి నివాళి..

సత్యసాయి గురుకులంలో..

పడిపోయిన పలకలు

కోరుకొండ రోడ్డులో సింహాచల్ నగర్ ప్రాంతంలో నరసింహస్వామి ఆలయ సమీపంలో పలకలు కాలువలో పడిపోయాయి. ఈ ప్రాంతంలో రాత్రిపూట సరిగా దీపాలు వెలగట్లేదు. మలుపులు తిరిగే సమయంలో ఆదమరుపుగా ఉంటే వాహనదారులు పడిపోయే అవకాశం ఉంది. సరిదిద్దాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

గుంతలు.. యథేచ్ఛగా వాహనాలు

ఇసుక లారీలు ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బాలాజీపేట మీదుగా బొమ్మూరు వైపు వెళ్తున్నాయి. రాత్రిపూట ఎక్కువగా తిరుగుతున్నాయని, వాటిలోంచి ఇసుక పడి చోదకులు జారి పడిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు.

టార్పాలిన్ వంటివి పూర్తిగా కప్పట్లేదని ఆరోపిస్తున్నారు. వాటి కారణంగా రహదారి గుంతలు పడుతోందని అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

మట్టి రోడ్డుతో ఇక్కట్లు..

కొంతమూరు మెర్సీకాలనీలో మట్టి రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలోని వారంతా ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. సరైన రోడ్డు మార్గం లేక రాకపోకలు కష్టంగా ఉన్నాయని వారు వాపోతున్నారు. వర్షం పడితే సమస్య తీవ్రంగా ఉంటుందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

విభాగినిపై వాహనాలు

దేవీచౌక్ ప్రధాన వర్తక ప్రాంతం. నగరం, గ్రామీణం నుంచి రోజూ కొన్ని వందల మంది ఇక్కడకు వస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడి నుంచి పేపరుమిల్లుకు వెళ్లే మార్గంలో విభాగినిపై కార్లు, ఆటోలు నిలిపేస్తున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

చెట్టు కాదు.. విద్యుత్తు స్తంభం

ధవళేశ్వరం కెనాల్ రోడ్డు పక్కనే విద్యుత్తు స్తంభానికి తుప్పలు, తీగలు అలముకున్నాయి. కాలువ గట్టు వద్దనే ఉండటంతో పశువులు గడ్డి తినేందుకు తరచూ పరిసర ప్రాంతంలోనే తిరుగుతున్నాయి. ప్రమాదాలకు అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ధవళేశ్వరం, మోరంపూడి

ఆలయాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

గోకవరం: ఆలయాల్లో ఆభరణాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను గోకవరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబరు 16న కొత్తపల్లిలో రాజలింగేశ్వర స్వామి ఆలయం, అక్టోబరు 21న గోకవరం శివారులోని గంగాలమ్మ ఆలయంలో వెండి ఆభరణాలను అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం తుమ్మలనగరం గ్రామానికి చెందిన పేరాల నరసింహారావు, అదే మండలంలో పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గుండి జగదీష్ చోరీలకు పాల్పడినట్లు గుర్తించి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 గ్రాముల బంగారు శతమానాలు, కేజీ వెండి వస్తువులు, ఒక ఆటో, మోటారు సైకిల్, హుండీలో కాజేసిన రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరు గోకవరంతోపాటు రాజమహేంద్రవరం, రాజానగరం, రంపచోడవరం పరిసరాల్లో నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

అదుపులోకి తీసుకున్న నిందితులతో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది

రూ.1.66 కోట్ల గంజాయి స్వాధీనం

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ దివాన్‌చెరువు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కారు, వ్యానులో గంజాయిని గుర్తించారన్నారు. నిందితులు గంజాయిని ఒడిసాలోని బరంపురానికి చెందిన రాము వద్ద కొనుగోలు చేసి కర్ణాటకకు రవాణా చేస్తున్నారని తెలిపారు. కర్ణాటకకు చెందిన ఇస్మాయిల్ షరీఫ్, మన్సూర్, సుల్తాన్ సలీమ్, మస్తాన్ అలీఖాన్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1.66 కోట్లు విలువైన 332.91 కిలోల గంజాయి, వ్యాను, కారు, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండు నిమిత్తం ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

ఎంఈవో-1 విశ్వనాథం బాధ్యతల స్వీకరణ

పెదపూడి: పెదపూడి ఎంఈవో-1 విశ్వనాథం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గాంధీ స్మారకోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఎంఈవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంఈవో-1గా పనిచేసిన కె.సత్యనారాయణపై సస్పెన్షన్‌కు గురవడంతో ఆయన స్థానంలో విశ్వనాథం బాధ్యతలు స్వీకరించారు.

24 నుంచి రైతన్నా మీకోసం

పెదపూడి: మండలంలోని అన్ని గ్రామంల్లో ఈనెల 24 నుంచి డిసెంబర్ 3 వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామని ఏవో ఎన్.సత్యప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అయిదు సూత్రాలను తెలియజేస్తారన్నారు. వీటి ద్వారా రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెరిగి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు.

సచివాలయాలకు పర్యవేక్షణ అధికారులు

రాజానగరం, న్యూస్‌టుడే: సచివాలయ వ్యవస్థలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజలకు సుస్థిరమైన పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాల పర్యవేక్షణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్ట్ అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో, పట్టణ స్థాయిలో పుర కమిషనర్లు వీటిని పర్యవేక్షించనున్నారు. 2047 వికసిత్ లక్ష్యసాధనలో సచివాలయ ఉద్యోగుల సేవలను పక్కాగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, పర్యవేక్షణ మాత్రం వదిలేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. త్వరలో మండలానికి ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు పనిచేయనున్నారు. ఒకరు పంచాయతీ, మరొకరు సచివాలయ వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు.

ఆహ్లాదానికి కడియం నర్సరీలు

కడియం, న్యూస్‌టుడే: కడియంలోని పచ్చని నర్సరీల అందాలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయని రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఎస్.హరికృష్ణ కొనియాడారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆచప కడియంలోని నర్సరీని ఆదివారం సందర్శించారు. వారికి పల్ల వెంకటేశ్, వినయ్ మొక్క అందించి స్వాగతం పలికారు. వందేళ్ల భారీ వృక్షాల పెంపకంతో పాటు వాణిజ్య మొక్కల వివరాలను తెలుసుకున్నారు. ఆధునిక పద్ధతుల్లో మొక్కల పెంపకంపై కృషి చేస్తున్న రైతులను కొనియాడారు. గతంలో ఆయన జిల్లా ఎస్పీగా పనిచేసిన జ్ఞాపకాలను పంచుకున్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రామకృష్ణ, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్బీ సిబ్బంది జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పరిశీలిస్తున్న ఐజీ హరికృష్ణ

వేంకటేశ్వరస్వామికి ఆభరణాలు

రాజానగరం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రం గ్రామంలో కొలువైన వేంకటేశ్వరస్వామి వారికి రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన వట్టికూటి వెంకటరాయుడు, స్వప్న దంపతులు రూ.50 వేలు విలువైన గిన్నె సమర్పించారు. గ్రామంలో అయ్యప్ప మాలధారులు రూ.20,000 విలువైన వెండి గిన్నెను అందించారు. ఓ అజ్ఞాత భక్తుడు స్వామివారి హుండీలో రూ.2లక్షలు విలువైన బంగారు తాడును సమర్పించారు.

యువతులు.. క్రీడల్లో విజేతలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయనేది నిపుణుల మాట. చదువుతో పాటు అన్నింట్లోనూ పిల్లలను ప్రోత్సహించడం ద్వారా వారి భవితకు చక్కని బాటలు వేయచ్చు. రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు పలు క్రీడల్లో రాణిస్తూ విజేతలుగా నిలుస్తున్నారు. చక్కటి ప్రణాళికతో చదువు, ఆటలు రెండింటిలో రాణిస్తున్న క్రీడాకారిణుల అంతరంగం, లక్ష్యాలు వారి మాటల్లో..

జాతీయ క్రీడాకారిణిగా రాణించాలని..

మాది మురారి గ్రామం. నాన్న వ్యవసాయం చేస్తుంటారు. పాఠశాల స్థాయి నుంచే రన్నింగ్, కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో రాణిస్తున్నా. రాజ్యలక్ష్మి కళాశాలలో ఇంటర్‌లో చేరాక బాక్సింగ్ సాధన ప్రారంభించాను. కోచ్ భవానీ శంకర్ వద్ద శిక్షణలో విశేషంగా రాణిస్తున్నా. అంతర కళాశాలల బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచి విశాఖపట్నంలో జరిగిన తుది పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆనందాన్ని కలిగించింది. - కె.మహా హాసిని, ఇంటర్

స్కేటింగ్‌లో ప్రతిభ చూపుతూ..

మా నాన్న పంచాయతీ ఉద్యోగి. ఆయన ప్రోత్సాహంతోనే 3వ తరగతిలో స్కేటింగ్ సాధన ప్రారంభించా. కాకినాడ, విశాఖపట్నం, రాయపూర్, బెంగళూర్, దిల్లీ తదితర నగరాల్లో జరిగిన జాతీయ స్కేటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి పతకాలు సాధించాను. ఇది చాలా క్రమశిక్షణతో కూడిన ఆట. గెలుపు, ఓటములు సెకను కాలంలో మారిపోతాయి. ప్రపంచ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేత కావాలనేదే నా లక్ష్యం. - మహమ్మద్ హనీఫా మెహనాజ్, ఇంటర్

జూడో పోటీల్లో మెరికలా..

మాది వై.రామవరం. నాన్న రైతు. రోజూ ఎంతో శ్రమిస్తారు. ఆయనే నాకు స్ఫూర్తి. పాఠశాల స్థాయి నుంచి వెయిట్ లిఫ్టింగ్ సాధన ప్రారంభించాను. జిల్లాస్థాయిలో పతకాలు సాధించాను. డిగ్రీలో రాజ్యలక్ష్మి కళాశాలలో చేరాక పీఈటీ ప్రోత్సాహంతో జూడోలో శిక్షణ తీసుకున్నా. నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పోటీల్లో జూడో విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాను. ఆలిండియా పోటీల్లో గెలవడమే ధ్యేయం. - కె.స్వర్ణలత, బీఎస్సీ

పోలీసు ఉద్యోగం సాధించాలని..

చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతూ రాష్ట్రస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించాను. మానాన్న కూలీ. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా నన్ను ప్రోత్సహించారు. డిగ్రీలో చేరాక నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల జూడో పోటీల్లో బంగారు పతకం అందుకున్నా. డిగ్రీ పూర్తి చేసి పోలీసు ఉద్యోగం సాధించాలని ఆశయంతో ఉన్నాను. - తోట లీల వెంకటేశ్వరి, బీఏ

ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, తిప్పరాజుపాలెం గ్రామం, డోర్ నెం. 2-87రు కాపురస్తులు 1) పామర్తి చంద్రశేఖర్ గారి భార్య పామర్తి సుదీప్తి, వీరి కుమార్తె 2) పామర్తి కేతన శ్రీమహాలక్ష్మి మైనరు అయినందున గార్డియన్ తల్లి పామర్తి సుదీప్తి గార్ల తరపు యావన్మందికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా,

మా 1వ క్లయింటు భర్తగారున్నూ, 2వ క్లయింటు తండ్రిగారున్నూ అయిన పామర్తి చంద్రశేఖర్‌గారికి రాజానగరం మండలం, పాలచర్ల గ్రామంలో రివిజన్ సర్వే నెం. 675 రులో య. 2-92 సెంట్లున్నూ, రివిజన్ సర్వే నెం. 676రులో య.0-28 సెంట్లు వెరశి ఏకప్రతి య.3-20 సెంట్లు భూమి కలదు. మా 1వ క్లయింటు యొక్క భర్తగారు అదనపు కట్నం కోసం మా 1వ క్లయింటును బాధపెట్టుటవలన మా 1వ క్లయింటు వారి పుట్టినింటిలో అనగా తిప్పరాజుపాలెం గ్రామంలో వారి కుమార్తెతో నివశించుచున్నారు. మా 1వ క్లయింటు మనోవర్తి నిమిత్తం వారి భర్త గారిని కోరగా Maintanance ఇవ్వకుండా, ఇతర హక్కులు ఇవ్వకుండా పైన తెలిపిన ఆస్తిలో మా క్లయింట్లకు ఏ విధమైన హక్కులేకుండా చేద్దామనే దురుద్దేశ్యముతో సదరు పామర్తి చంద్రశేఖర్‌గారు అనగా మా 1వ క్లయింటు భర్తగారు వారి సోదరి అయిన పెమ్మనబోయిడి శివసుబ్రహ్మణ్యం గారి భార్య పెమ్మనబోయిడి విజయలక్ష్మి గారితో కుమ్మక్కయి ఆమె పేర ది. 25-7-2025వ సం।।రం తేదీని డాక్యుమెంటు నెం. 9485/2025రుగా రిజిస్టర్డు సెటిల్‌మెంట్ దస్తావేజును నామకహా వ్రాయించినట్లు మా క్లయింట్లకు తెలియవచ్చినది. మా 1వ క్లయింటు భర్త గారైన పామర్తి చంద్రశేఖర్‌గారు పెమ్మనబోయిడి విజయలక్ష్మి గారితో సదరు ఆస్తిని ఇతరులకు విక్రయించి మా క్లయింట్లకు నష్టం కలుగచేయు దురుద్దేశ్యముతో ప్రయత్నములు చేయుచున్నట్లుగా మా క్లయింట్లకు తెలియవచ్చినది. సదరు పైన తెలిపిన ఆస్తి గుర్తించి మా క్లయింట్లకు గల హక్కులు నిమిత్తం కోర్టులో కేసులు దాఖలు చేయుచున్నారు. కావున సదరు ఆస్తిని ఎవరైనా కొనుగోలు గాని, తనఖాలు వగైరా ఎట్టి అన్యాక్రాంతములు జరిపించినను అట్టివి మా క్లయింట్లను బైండు చేయవనియు, సదరు ఆస్తిని కొనుగోలు చేసిన ఎడల వారు నష్టపోవుదురనియు యావన్మందికి ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కాకినాడ 20-11-2025

అల్తాఫ్ మహమ్మద్, అడ్వకేట్ Cell No: 98480 47860

(c) eenadu

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, నిడదవోలు, న్యూస్‌టుడే: చిన్నాయిగూడెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ కంతంగూడెం ఫీడర్‌కు సంబంధించి మరమ్మతుల దృష్ట్యా సోమ, మంగళవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. • నిడదవోలు మండలం శంకరాపురం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఈనెల 24న సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు. లింగంపల్లి, తిమ్మరాజుపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పాల కావిళ్లతో ఊరేగింపు

దేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామంలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో షష్ఠిని పురస్కరించుకుని పాల కావిళ్లతో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం స్వామి కల్యాణం వైభవంగా జరిపారు. సోమవారం ఉదయం 108 కలశములతో ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కావిళ్లతో భక్తులు..

వీధి దీపాలు ఏర్పాటు

ఈనాడు స్పందన

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలోని ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ సమీపంతోపాటు, పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా దీనిపై ఈనెల 18న 'వెలగని దీపాలు.. చీకట్లో వీధులు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితం అయ్యింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: తాళ్లపూడి: 80085 74498

ఉ. 10 - మ. 1 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

కూడలిలో వ్యర్థాలు

సమస్య: గాంధీబొమ్మ వీధి నుంచి గీతా మందిరానికి వెళ్లే నాలుగు రహదారుల కూడలిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన రావడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

సమాధానం: కూడలిలో ఉన్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వీరన్న, పంచాయతీ కార్యదర్శి, తాళ్లపూడి - న్యూస్‌టుడే, తాళ్లపూడి

కరాటే శిక్షణ.. సాధనతో రక్షణ

ఆరంభమైన తరగతులు..

కొవ్వూరు పట్టణం, గోపాలపురం, న్యూస్‌టుడే: చిన్నారులు, విద్యార్థినులు, మహిళలపై ఈ మధ్యకాలంలో దాడులు, అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయి. మానవ మృగాల బారిన పడి బలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వం 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసింది. విద్యార్థినులకు కరాటే, కుంగ్‌ఫూ వంటి ఆత్మరక్షణ విద్యల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించింది. కొవిడ్ తర్వాత వైకాపా సర్కారు ఈ ప్రక్రియను విస్మరించింది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి 'రాణి రుద్రమదేవి ఆత్మ రక్ష' పేరుతో కరాటే తరగతులను తిరిగి పునరుద్ధరించింది. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో 87 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు 22,594 మంది చదువుతున్నారు. ఇవి కాక గురుకుల పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లోనూ ఈ ప్రక్రియకు చేపడుతున్నారు.

శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

డివిజను పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో శిక్షకులు సుమారు 45 మంది శిక్షకులను నియమించారు. మార్గదర్శకాల ప్రకారం వీరికి కరాటే విద్యలో ప్రాథమిక అంశాలపై శిక్షణ ప్రారంభించారు. ● రాణి రుద్రమదేవి ఆత్మ రక్ష పథకం ద్వారా ప్రస్తుతం నవంబరు, డిసెంబరు నెలలకు 20 తరగతులను ప్రతి పాఠశాలలో నిర్వహించనున్నారు. ● ప్రతి పాఠశాలలో పాఠ్యాంశాల బోధన సమయానికి అవరోధం లేకుండా కరాటే తరగతి నిర్వహించాలని ప్రణాళిక ఇచ్చారు. ● ప్రతి తరగతి 90 నిమిషాల పాటు కొనసాగనుంది.

గత తెదేపా హయాంలోనే కరాటే శిక్షణ ఆరంభమైంది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బాలికలకు మేలు చేకూరుతుంది. కరాటేలో మెళకువలు, ప్రాథమిక అంశాలతో పాటు పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తే ఆరోగ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

ఎంతో ఉపయుక్తం.. - అల్ల రాధ, శిక్షకురాలు, ఫోర్ట్ డాన్, కొవ్వూరు

ప్రతివారం కొనసాగాలి..

ఆత్మస్థైర్యంతో పాటు ఆరోగ్యాన్ని పెంచే కరాటే వంటి అంశాల్లో గతంలో శిక్షణ ఇవ్వడం బాగుంది. కొన్ని నెలలు మాత్రమే కాకుండా ఏడాదంతా ప్రతి వారం తరగతులు కొనసాగేలా ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తే మాకెంతో ప్రయోజనకరంగా ఉంటుంది. - సీహెచ్ కావేరి, 9వ తరగతి

గోలింగేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని పురాతన రాజరాజేశ్వరి స్వామి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 655వ లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు, లలిత సహస్ర నామాల పఠనం చేశారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యప్రకాశరావు, ప్రధానార్చకుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చోడేశ్వరునికి..

కొవ్వూరు పట్టణం: పాత ఊరు బోడేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్ర పూజ చేశారు. సాయంత్రం రుద్రహోమం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, వేదస్వస్తి క్రతువులను జరిపించారు.

బాలికల క్రికెట్ జట్టు ఎంపిక రేపు

గోపాలపురం, దేవరపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. దేవరపల్లి మండలం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామని ఫెడరేషన్ సభ్యులు కె.అలివేలుమంగ, డి.సునీత, కె.దుర్గాప్రసాద్, మల్లేశ్వరరావులు తెలిపారు. ఎంపిక పోటీలకు వచ్చే విద్యార్థులు ఉదయం 9 గంటలకు పాఠశాల ఆవరణలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పోస్టల్ ఖాతాదారులకు అండగా కమిషన్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తపాలా కార్యాలయంలో సొమ్ము దాచుకుని పోగొట్టుకున్న లబ్ధిదారులకు కమిషన్ అండగా నిలుస్తుందని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. కొవ్వూరు మండలం ధర్మవరానికి చెందిన పోస్టల్ బాధితులు కొవ్వూరులోని నివాసంలో జవహర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. జవహర్ మాట్లాడుతూ ధర్మవరంలో దళితులు, పేదలు సుమారు 1500 మంది స్థానిక పోస్టాఫీసు 'సేవింగ్స్' ఇతర ఖాతాల్లో నగదు దాచుకున్నారన్నారు. 2022 ఏడాదిలో సుమారు రూ.1.60 కోట్లు పక్కదారి పట్టగా వారంతా ఆందోళన గురయ్యారన్నారు.

జవహర్‌ను అభినందిస్తున్న ధర్మవరం వాసులు

అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా వారికి న్యాయం జరగలేదన్నారు. వారు పలుమార్లు తనను కలసిన నేపథ్యంలో కమిషన్ తరఫున పోస్టల్ జనరల్‌ను కలిసి న్యాయపరంగా సొమ్ములు ఇవ్వాలని సూచించామన్నారు. ప్రస్తుతం 15 మందికి రూ.10 లక్షలు, అంతకుముందు రూ.15 లక్షలు వచ్చాయన్నారు. ముత్యాల కాశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

నిడదవోలు: నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవాల ఏర్పాట్లను ఏపీ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు ఆదివారం పరిశీలించారు. గణపతికూడలిలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లను సిబ్బందికి వివరించారు. ఆయన వెంట పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు ఉన్నారు.

గాయపడిన విద్యార్థులకు సాయం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వేగేశ్వరపురంలో ఇటీవల ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో గాయపడిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆదివారం చేయూతనిచ్చింది. వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎం.పోశమ్మ, జి.శ్రీలక్ష్మి, బి.ధరణిలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సేకరించిన రూ.30వేలు, నిత్యావసరాలను అందజేశారు. అధ్యాపకులు డేవిడ్ రాజు, పరస రాధాకృష్ణ, వీర్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పారామిలటరీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పారామిలటరీ సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పారామిలటరీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి ప్రభాకరరావు కోరారు. కొవ్వూరులోని సంఘ కార్యాలయంలో వార్షిక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి హాజరయ్యారు. ప్రభాకరరావు మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు ఉద్యోగుల మాదిరిగా పారామిలటరీ విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎన్టీఆర్ కృష్ణా, ఏలూరు, విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం

కొవ్వూరు పట్టణం, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, న్యూస్‌టుడే: సత్యసాయి సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగం కావాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను సేవా సమితి మందిరం, పురపాలక, ఆర్డీవో కార్యాలయాల్లో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు వైస్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవో రాణి సుస్మిత, సేవా సమితి ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, భోజనం పొట్లాలను అందించారు. సుబ్బారాయచౌదరి, రామకృష్ణ చిన్ని, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● గోపాలపురంలోని సత్యసాయి మందిరం వద్ద భక్తులు కె.జలపతి, చిన్నబ్బాయి ఆధ్వర్యంలో అన్నసమారాధన, దుప్పట్ల పంపిణీ జరిగింది. ● నల్లజర్ల మండల పరిషత్తు కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణా రావు, ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

భోజనం పొట్లాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో సుస్మిత

నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి: నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, సత్యసాయి సేవా సమితి ప్రాంగణాల్లో వేడుకలు నిర్వహించారు. శశి విద్యాసంస్థల అధినేత వేణుగోపాలకృష్ణ, పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ● మోర్త, వేలివెన్నులో బాబా ఆలయాల్లో, పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ఆరాధనలు, సంకీర్తన జరిగాయి.

గోపాలపురం: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తూ..

వేలివెన్నులో..

మాక్ అసెంబ్లీకి విద్యార్థి ఎంపిక

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి మండలం ఖండవల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి పమ్మి దీపిక ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి నియోజకవర్గం నుంచి ఎంపికయ్యారు. విద్యార్థినిని ఎంఈవోలు బాల సుబ్రహ్మణ్య స్వరూప్, షేక్ సూర్జాన్, ఎంపీడీవో కొండూరి ఉమామహాలక్ష్మి, పద్మజ, ప్రధానోపాధ్యాయిని టి.పద్మప్రియ అభినందించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్..

చాగల్లు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ విజయలక్ష్మి తెలిపారు. గత ఆక్టోబరులో పెదవేగిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

గుమ్మడి కాయ కాదు.. నీళ్ల ట్యాంకు

ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో సూర్యభగవానుని ఆలయంపై గుమ్మడికాయ ఆకారంలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయానికి వచ్చే భక్తులు తిలకిస్తూ ఆనందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం



పైపులైన్‌కు లీకులు

నిడదవోలు పట్టణంలో బస్టాండ్ ఎదురుగా పైపులైనుకు లీకు ఏర్పడి ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారిపైకి నీరు చేరుతోంది. దీంతో ప్రయాణికులు, రహదారిపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పైపులైనుపై ఆధారపడే పట్టణవాసులకు తాగు నీరు సరిగా అందడం లేదు. తక్షణమే మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నిడదవోలు

భవనాలకు మోక్షం ఎప్పుడో..?

తాళ్లపూడి మండలంలో నాడు-నేడు కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాలు మొండిగోడలకే పరిమితం అయ్యాయి. నిర్మించి సుమారు రెండున్నరేళ్లు అవుతున్నా, ఇప్పటి వరకు ఎటువంటి కదలిక లేదు. గోడలపై పాదులు, పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. మండలంలో 22 అసంపూర్తి భవనాలకు మోక్షం లేక చిన్నారులు అద్దె భవనాలు, ఇరుకుగదుల్లో నెట్టుకొస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి అన్నారు.

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

తుపాను మిగిల్చిన కష్టం

మొంథా తుపాను కారణంగా పెరవలి మండలంలోని పలు గ్రామాల అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలులకు చెట్లు దెబ్బతినడంతో అరటి గెలలు కుళ్లిపోతున్నాయి. వాటిని రైతులు కోసి తోటల్లోనే గుట్టలుగా వేస్తున్నారు. పంట చేతికొస్తున్న సమయంలో తుపాను తమ ఆశలపై నీళ్లు చల్లిందని, అప్పులే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పెరవలి

కోటసత్తెమ్మను దర్శించుకున్న అంబికా కృష్ణ

నిడదవోలు, న్యూస్‌టుడే: ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిఉన్న కోటసత్తెమ్మ వారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, అలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేఏ శర్మ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణకు పండితుల వేదాశీర్వచనం

మాజీ సర్పంచి మృతికి సంతాపం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామ మాజీ సర్పంచి యాళ్ల చంటమ్మ (103) ఆదివారం మృతి చెందారు. 2006-2011 మధ్య సర్పంచిగా పనిచేసిన ఆమె అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతుల మీదుగా నిర్మల్ గ్రామీణ పురస్కార్ అవార్డును అందుకున్నారు. పంగిడి అభివృద్ధికి ఆమె చేసిన కృషిని పలువురు గుర్తుచేసుకున్నారు. సర్పంచి గోశాల నాగార్జున, ఉపసర్పంచి ఉప్పులూరి నానాజీ, మాజీ సర్పంచి, మాజీ ఎంపీపీ పీకే రంగారావు, కూటమి నాయకులు సంతాపం తెలిపారు.

మంగళ సూత్రాలు కాజేసిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు పట్టణం: మహిళా ఉద్యోగిని మెడలో మంగళ సూత్రాలు లాక్కుని పరారైన వ్యక్తిని అరెస్టు చేశామని పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సెర్ప్ విభాగంలో మండల సమాఖ్య (నిడదవోలు) ప్రాజెక్టు అధికారిగా ఈడూరి మహాలక్ష్మి పనిచేస్తున్నారు. ఈ నెల 21న విధులు ముగించుకుని రాజమహేంద్రవరం వెళ్లేందుకు నిడదవోలులో ఆర్టీసీ బస్సు ఎక్కారు. కొవ్వూరు టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి బస్సులో వెనుకవైపు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మహాలక్ష్మి మెడలో బంగారు మంగళ సూత్రాల తాడును లాక్కుని పరారయ్యాడు. దీనిపై మహాలక్ష్మి ఫిర్యాదుపై కేసు నమోదైంది. బంగారాన్ని అమ్మేందుకు వాడపల్లికి చెందిన ఎం.పుట్టాలయ్య ఆదివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం వెళ్తుండగా రోడ్‌కం రైలు వంతెనపై పట్టుకుని అరెస్టు చేశారు.

దాడి కేసులో ఫిర్యాదు..

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: అప్పుగా తీసుకున్న నగదును ఇవ్వమని అడిగినందుకు దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణ పరిధి ఒకటో వార్డు శ్రీరామా కాలనీకి చెందిన బొండాడ సురేష్ పట్టణానికి చెందిన ఎ.శివకు గతంలో రూ.5 వేలు అప్పుగా ఇచ్చారు. పలుమార్లు డబ్బులు అడిగినా ఇవ్వడం లేదు. ఈనెల 19న డబ్బుల విషయంలో వాగ్వాదం జరగ్గా మద్యం సీసాను పగులకొట్టి సురేష్ మెడపై శివ దాడి చేశాడు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో సురేష్ చికిత్స పొందుతూ ఫిర్యాదు చేయగా శివను అరెస్టు చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శంకరాపురంలోని హృదయాలయ మానసిక దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు నిడదవోలు ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, షాట్‌పుట్, కబడ్డీ, షటిల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వచ్చే నెల 3న బహుమతులు అందిస్తామని నిర్వాహకులు దండే గణేష్ బాబు, బలగం విశాలాక్షి తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

దేశభద్రత అందరి బాధ్యత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాలోచన వేదిక ఆధ్వర్యంలో 'దేశభద్రత - కింకర్తవ్యం' అంశంపై చర్చ ఆదివారం గౌతమఘాట్‌లోని రివర్ బే ఆహ్వానం హాలులో జరిగింది. రాకా సుధాకర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తూ దేశభద్రత పౌరులందరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్గత భద్రతకు సంబంధించి సామాన్య పౌరులంతా బాధ్యత తీసుకున్నపుడే దేశ భద్రత సాధ్యమన్నారు. సభలో లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, ప్రొఫెసర్ మట్టారెడ్డి, ఆర్ఎస్ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది.

'లేబర్ కోడ్‌ల అమలు సరికాదు'

నల్లజర్ల: దేశ వ్యాప్తంగా లేబర్‌కోడ్‌ల అమలుకు కేంద్రం సిద్ధం కావడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా నాయకుడు కొక్కిరిపాటి వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. పరిశ్రమల్లో కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, 8 గంటల పనిదినం, గ్రాడ్యుటీ వంటి సదుపాయాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి అమలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన నేడు

శ్యామలాసెంటర్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకటేష్ తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఈ నేపథ్యంలో పోరాట దీక్ష చేపడుతున్నామన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సేవే ధ్యేయంగా పనిచేయాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ విద్యార్థులు సేవే ధ్యేయంగా పనిచేయాలని ఎంఈవో సక్సేనారాజు, ప్రధానోపాధ్యాయుడు పొట్లచెరువు రామకృష్ణ అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రధాన రహదారిలో ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి కవాతు, ప్రదర్శన చేశారు. వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

ప్రదర్శన చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు, అధికారులు

60 ఏళ్లు.. 12 మంది ఛైర్మన్లు

వజ్రోత్సవాలకు సిద్ధమైన నిడదవోలు పురపాలక సంఘం

సంఘ వివరాలు ఇలా..

పట్టణ విస్తీర్ణం	10.365 చ.కి.మీ
జనాభా	43,809
ఇళ్ల సంఖ్య	10,873
వార్డులు	28
వీధి దీపాలు	2000
చెరువులు	3
మురుగు కాలువలు	100.64 కిమీలు
పాఠశాలలు	11
పార్కులు	6
మురికివాడలు	19

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు 1964 నవంబరు చివరి వరకు గ్రామం. అనంతరం 1964 డిసెంబరు 1న తృతీయశ్రేణి పురపాలక సంఘంగా ఆవిర్భవించింది. కొంతకాలానికి ద్వితీయ శ్రేణి పురపాలక సంఘంగా మారింది. ఈ సందర్భంగా ఈనెల 26 నుంచి 28 వరకు పురపాలక సంఘ వజ్రోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

8 సార్లు ప్రత్యేకాధికారుల పాలన..

60 ఏళ్ల కాలంలో నిడదవోలు పట్టణానికి 12 మంది ఛైర్మన్లు పనిచేయగా, వారిలో ఇద్దరు ఇన్‌ఛార్జిలుగా పనిచేశారు. 8 సార్లు ప్రత్యేకాధికారుల పాలన సాగింది. 41 మంది కమిషనర్లు ఇక్కడ పనిచేశారు. వారిలో ఏడుగురు ఇన్‌ఛార్జి కమిషనర్లుగా ఉన్నారు. ఛైర్మన్లలో చిన్నం వెంకన్న, బొబ్బా కృష్ణమూర్తిలు రెండేసి సార్లు పనిచేశారు. తెదేపా ఆవిర్భావం అనంతరం జరిగిన తొలి ఎన్నికల్లో బొబ్బా కృష్ణమూర్తి తొలిసారి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం రెండోసారి 2014 నుంచి 2019 వరకు పనిచేశారు. ఇద్దరు డాక్టర్లు ఛైర్మన్‌లుగా సేవలు అందించారు. వారిలో తొలి ఛైర్మన్ బీవీఎన్ రాజు ఒకరు కాగా, డాక్టర్ తోపరాల శ్రీరామలక్ష్మి రెండోవారు. ఆనాటి నుంచి పట్టణం క్రమంగా అభివృద్ధి చెందుతూ ప్రగతి వైపు అడుగులు వేస్తోంది. పురపాలక సంఘ తొలి ఛైర్మన్‌గా ప్రజల నుంచి దీనబంధు బిరుదు పొంది, పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందిన బీవీఎల్ రాజు పట్టణ ప్రజలకు విశేష సేవలు అందించారు. అనంతరం కొత్తపల్లి శ్రీరాములు హయాంలో 1970లో శంకుస్థాపన చేసి 1972లో పురపాలక సంఘ కార్యాలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం భూపతి ఆదినారాయణ 12వ ఛైర్మన్ కాగా, 41వ కమిషనర్‌గా టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి పని చేస్తున్నారు.

ఏర్పాట్లలో కార్యాలయం

పురస్కారాల అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నాట్యరంగంలో విశేష సేవలందించిన సప్పా దుర్గాప్రసాద్ సేవలు అమూల్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం తాడితోటలోని ఓ హాలులో సప్పా ఎక్సలెన్స్ పురస్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ వీర్రాజు మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలందిస్తున్న నిపుణులను సప్పా ఎక్సలెన్స్ పురస్కారాలతో సత్కరిస్తున్నారన్నారు. అతిథులుగా హాజరైన తెలుగు వర్సిటీ వీసీ మునిరత్నం, తెదేపా నాయకుడు గన్ని కృష్ణ, జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరుల చేతుల మీదుగా సప్పా ఎక్సలెన్స్ - 2025 పురస్కారాలు అందించారు.

సేవారంగం: వి. రామరాజు, ఎన్.సుబ్బారావు, ఎన్.గోవింద్. **వైద్యం:** విజయ్ కుమార్, ఎం.రామకోటేశ్వరరావు. **ఆధ్యాత్మికం:** ఆర్.శ్రీనివాస్, **పత్రికా రంగం :** పి.సుబ్బారావు, కె.పార్థసారథి. **రచనా రంగం:** శిఖామణి. **కళలు:** మల్లికార్జున్. **నాట్యం:** డాక్టర్ వేణుగోపాల్, హేమసుందర్.. పురస్కారాలు పొందారు.

వసతి గృహంలో వైద్య శిబిరం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉండ్రాజవరం ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దుర్గామహేశ్వరరావు వైద్య పరీక్షలు ఆదివారం చేశారు. అవసరమైన వారికి మందులు ఇచ్చారు. శీతాకాలంలో వేడిగా ఉన్న ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

(c) eenadu

గులాబీ మార్గంలో .. అందాల సౌధం

నాగవార వద్ద మెట్రో వాణిజ్య సముదాయం షురూ

నాగవార భూగర్భ మెట్రో స్టేషన్ వద్ద తలెత్తనున్న హైటెక్ వాణిజ్య భవనం (ఊహాచిత్రం)

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: నమ్మ మెట్రో గులాబీ మార్గంలోని నాగవార వద్ద మెట్రో వాణిజ్య సముదాయ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఎనిమిది అంతస్తుల భవనంలో నాలుగంతస్తులు వాణిజ్య భవనాలు, మరో నాలుగంతస్తులు పార్కింగ్ ప్రదేశానికి ఉపయోగిస్తారు. కార్పొరేట్ సంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మాల్స్ వంటి వాటికి వినియోగించనున్నారు. నాగవార భూగర్భస్టేషన్ వద్ద రూ.168 కోట్ల అంచనా వ్యయంతో 32,2573 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తారు. పదినెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తారు. రెండువేల వాహనాలను పార్కింగ్ చేసే సామర్థ్యం కలిగిన ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మాన్యతా టెక్ పార్కు, హెబ్బాళ్ రింగ్‌రోడ్డు, ఎంబసీ, కార్లటన్ సెంటర్ చుట్టుపక్కల ఉన్నాయి. ఆ భవనాలను అద్దెకు తీసుకునేందుకు వివిధ సంస్థలను బీఎంఆర్‌సీఎల్ ఆహ్వానించింది. 2026 చివరి నాటికి ఈ మార్గంలో రైలు సంచరించేందుకు నిర్మాణ పనులను సాగిస్తున్నారు. నాగవార నుంచి కోనేనా అగ్రహార (గొట్టిగెరె) 21.3 కిలోమీటర్ల మార్గంలో వచ్చే ఏడాది మే నుంచి రైలు సంచారం ప్రారంభం కానుంది. అందులో 13.8 కిలోమీటర్ల భూగర్భ మార్గంలో రైలు సంచరిస్తుంది. ఈ మార్గంలో 18 స్టేషన్లు ఏర్పాటుకానుండగా అందులో 12 భూగర్భ స్టేషన్లు ఉంటాయి. ప్రతి స్టేషన్‌ను వాణిజ్య కేంద్రంగా మార్చనున్నారు. తద్వారా ఆదాయం పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బైబీహళ్ నాగవార వద్ద ఎనిమిది అంతస్తుల వాణిజ్య వ్యాపార భవనం అస్తిత్వంలోకి రానుంది.

28న ఉడుపికి ప్రధాని రాక

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 28న ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించనున్నారు. శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు చేస్తారు. ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలికేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో మునిగిపోయింది. హెలిప్యాడ్, కాంక్రీట్ రహదారి నిర్మాణం, భద్రత వ్యవస్థ తదితర వాటిపనులను శరవేగంగా సాగిస్తున్నారు. 28న ఢిల్లీ నుంచి నేరుగా ప్రధాని మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉదయం 11.05 గంటలకు వస్తారు. అక్కడి నుంచి 11.10 గంటలకు హెలికాప్టర్‌లో ఉడుపికి చేరుకుంటారు. ప్రధాని ఉడుపి పర్యటనపై ప్రధాన మంత్రి కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఉడుపి బైపాస్ నాలుగు మీటర్ల రహదారి మరమ్మతులు చేపట్టారు. ప్రధాని సంచరించే వాహనాల కోసం రహదారులను సిద్ధం చేస్తున్నారు. ఏపీఎంసీ వద్ద మూడు హెలిప్యాడ్‌లకు మరమ్మతులు చేపట్టగా వాటి పక్కన నాలుగో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఉడుపి శ్రీకృష్ణమఠంలో జరిగే గీతోత్సవం, లక్షకంఠ పారాయణం కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ భగవద్గీత పది శ్లోకాలను పఠించనున్నారు. ఆ తోపాటు హాజరవుతున్న లక్షలాది మంది ప్రజలు భగవద్గీత శ్లోకాలను ఏక కాలంలో పఠిస్తారు. శ్రీకృష్ణుడిని దర్శించుకున్న ప్రధాని అక్కడ నిర్మించిన సువర్ణతీర్థ మంటపం, సువర్ణకనక కిండిలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉడుపి కృష్ణమఠాన్ని ప్రధాని భేటీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.35 గంటలకు ఉడుపి హెలిప్యాడ్ నుంచి మంగళూరు విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విమానంలో గోవాకు వెళ్లనున్నారు. ఈనెల 24 నుంచి ఎస్పీజీ భద్రతాదళాలు ఉడుపికి వచ్చి భద్రత ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

సిద్ధు దూకుడు.. శివుడికి సవాలు

కాంగ్రెస్‌లో మొదలైన సముదాయ సమరం

ఈనాడు, బెంగళూరు: అధికార పార్టీలో అసలైన రాజకీయం మొదలైంది. మొన్నటి వరకు ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల పరిమితమైన సమరం క్రమంగా దారి మళ్లింది. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వర్గానికో, సముదాయానికో పరిమితం కాదన్న డిమాండు ఊపందుకున్నాయి. పార్టీ కోసం పని చేసే క్రమశిక్షణ కలిగిన సైనికుడిని నేనంటూ నిత్యం డీకే శివకుమార్ చేస్తున్న వాదనపైనా ఆక్షేపణ మొదలైంది. పార్టీ ఏ ఒక్కరి సొత్తు కాదనే వాదన తీవ్రతరమైంది. ఇదే సమయంలో పార్టీ అధికారంలోకి వచ్చినందుకు అన్ని సముదాయాల నేతలు, అన్ని ప్రాంతాల కార్యకర్తలు శ్రమ ఫలితమేనన్న వాదనలు ఊపందుకున్నాయి. దీంతో ముఖ్యమంత్రి పీఠంపై రేసులోకి దిగిన నేతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పోటీ పడితే చాలనుకున్న డీకే శివకుమార్‌కు అసలైన సవాలు మొదలైంది.

మాకూ అవకాశమివ్వండి

ఖర్గే మనసులో ఏముందో?

బెంగళూరులోని మల్లికార్జున ఖర్గే నివాసానికి ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారులు డీకే శివకుమార్ మినహా మిగిలిన నేతలంతా తరలి వెళ్లటం ఆసక్తికర పరిణామం. రాహుల్‌గాంధీ తోనూ భేటీ కాలేకపోయిన డీకే. ఖర్గేతో మాట్లాడినా ఫలితం శూన్యమని భావించినట్లు తెలుస్తోంది. శని, ఆదివారాల్లో డీకే మద్దతుదారుల కంటే సిద్ధరామయ్య బృందమే జోరు చూపింది. హెచ్.సి.మహదేవప్ప, కె.వెంకటేశ్, ఈశ్వర ఖండ్రె, లక్ష్మీ హెబ్బాళ్కర్ తదితరులంతా తనతో చర్చించేందుకు వస్తుండటంతో ఖర్గే ఏం చేయాలో దిక్కుతోచలేదు. కొందరు తమ అభిప్రాయాలను సీనియర్ల ద్వారా పంపే ప్రయత్నం చేశారు. మరోవైపు సతీశ్ జార్కిహొళి, డా.జి.పరమేశ్వర్‌లు తమ అభిప్రాయాలను బహిరంగ పరుస్తూ అధిష్ఠానానికి సంకేతాలు పంపారు. వీరంతా సిద్ధరామయ్య బృందంలో సభ్యులే. దళిత, గిరిజన, లింగాయత సముదాయాలకు చెందిన వీరంతా ప్రత్యక్షంగానే డీకే శివకుమార్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్‌లో అహిందలు, ఆపై లింగాయతుల ఓట్లు కీలకమని ఖర్గేకు గుర్తు చేశారు. ఆ ప్రాంతాల వారిగా చూసినా సిద్ధరామయ్య డీకే శివకుమార్ బెంగళూరు, పాత మైసూరుకు చెందిన వారు కాగా ఉత్తర కర్ణాటక, కల్యాణ కర్ణాటక ప్రాంతాలకూ ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రతిపాదన చేశారు.

అంతా రాహుల్ చేతుల్లోనే..

ప్రస్తుత రాజకీయ ముఖ చిత్రం ప్రకారం డీకే శివకుమార్ పట్ల అధిష్ఠానం కూడా అంత సానుకూలంగా లేదని తెలుస్తోంది. డీకే శివకుమార్ వ్యక్తిగా, నాయకత్వ లక్షణాలతో పార్టీని నడిపించినా ఆయనకు మద్దతుగా ఉండే నేతల సంఖ్య పరిమితమే. పైగా ఒక్కలిగ లను పార్టీకి అంతగా ప్రయోజనం చేకూరకపోవటమూ అధిష్ఠానం పరిశీలించే అంశాల్లో ఒకటి. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో దాదాపు 90 మంది అహింద, లింగాయత్, బ్రాహ్మణ సముదాయాలకు చెందిన వారు కాగా వీరంతా అనుమతి చాటితే 2028 ఎన్నికల్లో పార్టీ మనుగడే కష్టతరంగా మారే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అస్త్రంగా మలచుకున్నారు. తనకు కాదంటే అహిందలకు అవకాశం ఇవ్వాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్న సిద్ధరామయ్య అదే విషయాన్ని అధిష్ఠానంతోనూ స్పష్టంగా చెప్పారు. ఈ సందిగ్ధత పరిస్థితులను చక్కబెట్టాలంటే రాహుల్‌గాంధీ జోక్యం చేసుకోవాల్సిందే.

రాహుల్ చేతిలో సిద్ధు, శివుడి భవిత

భాజపా శిబిరంలోనూ కదలిక

హస్తినలో విజయేంద్ర ఎత్తులు

మూడు రోజులుగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర దిల్లీలో మకాం వేశారు. ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌లో మొదలైన రాజకీయ పరిణామాలను అమిత్ షాతో చర్చించినట్లు సమాచారం. డీకే మరాం అవకాశం దక్కకపోయినా తన మద్దతుదారులతో వేరు కుంపటి లేదా పార్టీ ఫిరాయింపునకు ప్రయత్నించే వీలుంది. ఇలాంటి పరిణామాలను సద్వినియోగం చేసుకునేందుకు భాజపా ప్రయత్నింపక మానదు. కాంగ్రెస్‌లో ఇతర నేతలతో పోలిస్తే డీకే శివకుమార్ ఎక్కువగా ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండటం, యడియూరప్పతో ఇప్పటికీ వ్యక్తిగత అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. పైగా కుంభమేళాలో పవిత్రస్నానం, సద్గురు జగ్గీవాసుదేవ్, అమిత్‌షాతో కలిసి శివరాత్రి కార్యక్రమంలో పాల్గొనటం, గత విధాన సభ సమావేశాల్లోనూ ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని ఆలపించి భాజపా భావజాలం పట్ల అభిమానాన్ని చాటారు. ఇవన్నీ డీకేను భాజపాకు ఆహ్వానించేందుకు దోహదపడే అంశాలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

గూళూరు ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయా

జిల్లాలోని గూళూరు మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర ఆదివారం వైభవంగా సాగింది. ఏటా దీపావళి బలిపాడ్యమి రోజు గణేశ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. కార్తికమాసం పూర్తయిన నేపథ్యంలో గూళూరు చెరువులో నిమజ్జనం చేశారు. జానపద కళా బృందాలు, నాదస్వరం, ఎలుగుబంటి, నాసిక్‌డోలు, కేరళ జానపద నృత్యం, వీరగాసే బృందాలు, కీలుగుర్రం, నంది ధ్వజం, నెమళ్ల నాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దారిపొడవునా గణేశ మూర్తికి భక్తులు నీరాజనం పలికారు. **- న్యూస్‌టుడే, తుమకూరు**

దీపిక.. విజయగీతిక

● అంధుల క్రికెట్ చరిత్రలో నవోదయం ● తొలి టి-20 ప్రపంచ పోటీలో భారత జట్టు సత్తా

దీపిక, భారత జట్టు నాయకురాలు

ఎన్.ఆర్.కావ్యా, సభ్యురాలు

వి.కావ్యా, సభ్యురాలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ప్రపంచకప్ అంధుల తొలి మహిళల టీ-20 క్రికెట్ పోటీలో భారత మహిళల జట్టు ఛాంపియన్స్ గౌరవాన్ని దక్కించుకొని దివ్యాంగుల క్రికెట్ రంగంలో కొత్త ఇతిహాసాన్ని నెలకొల్పారు. ఆదివారం కొలంబోలో ముగిసిన చివరి పోటీలో భారత జట్టు ఏడు వికెట్ల తేడాతో నేపాల్ జట్టుపై విజయం సాధించి ప్రేక్షకుల జేజేలు పొందుతున్నారు. దిల్లీ, బెంగళూరుతో పాటు చివరిగా కొలంబోలో ముగిసిన ఈ పోటీల భారత జట్టుకు క్రీడాకారిణి టి.సి.దీపిక సారథ్యం వహించడం ఈ పోటీల్లో విశేషం. ఈమె మైసూరులోనే విద్యనభ్యసించింది. కర్ణాటక తరపున ఎన్.ఆర్.కావ్యా, వి.కావ్యాలు సైతం జాతీయ జట్టులో పాల్గొన్నారు. కెప్టెన్‌గా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన దీపిక ప్రతి మ్యాచ్‌కు తనవంతున సమర్థంగా బాధ్యతలు నిర్వహించి జట్టు విజయానికి కృషి చేసింది. భారత జట్టు శ్రీలంక, ఆస్ట్రేలియా, నేపాల్, యూఎస్‌ఏ, పాకిస్థాన్ జట్లను ఢీకొంది. వరుస విజయాలతో ఛాంపియన్స్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. భారత అంధుల క్రికెట్ జట్టు అధ్యక్షుడు, సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్ స్థాపకుడు డా.మహంతేష్ జి.కివడసణ్ణనవర్ ప్రోత్సాహంతో భారత జట్టు సభ్యులు ఈ సాధనకు పూనుకున్నారు. జట్టు విజయంతో కన్నడనాట అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.

మొక్కజొన్న రైతుల పోరాటం షురూ

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా భాజపా పోరాటం చేపట్టనుంది. అనంతరం 27, 28 తేదీల్లో భాజపా మండల పరిధిలో పోరాటం చేస్తామని ఆ పార్టీ మాజీ మంత్రి రేణుకాచార్య తెలిపారు. డిసెంబరు ఒకటి, రెండు తేదీల్లో జిల్లా కేంద్రాల్లో రైతులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మొక్కజొన్న పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రైతులను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్న మద్దతు ధర ప్రకటించడంతో పాటు దిగుమతులపై ఆంక్షలు విధించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. మరోవైపు బాగల్‌కోటె, హావేరి, గదగ, ధార్వాడ తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న రైతులు పోరాటాలను కొనసాగిస్తున్నారు.

వైద్య స్పాలపై నిఘా

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్రంలో అక్రమంగా తలెత్తున్న మెడికల్ స్పా కేంద్రాలపై నిఘా వేయడంతో పాటు నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు తెలిపారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అక్రమ కేంద్రాలను గుర్తించి అధికారులు చర్యలు చేపడుతున్నారన్నారు. అనుభవం లేని కొందరు వ్యక్తులు రసాయనిక మందులను ఉపయోగించి సౌందర్య వర్ధక చికిత్సలు చేస్తున్నారని, వృద్ధుల కీళ్ల నొప్పులను తగ్గిస్తామని కొందరు మార్చుకుని రేడియేషన్ థెరపీ చేసే వ్యక్తులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారని తెలియజేశారు. సౌందర్య చికిత్స విధానాన్ని కర్ణాటక ప్రైవేట్ వైద్య సంస్థల చట్టం కింద తెచ్చినట్లు చెప్పారు. కొందరు అల్లోపతి, ఆయుర్వేద వైద్యులు సైతం కేంద్రాలను ప్రారంభించినట్లు గుర్తించామన్నారు.

అంకురాల వికేంద్రీకరణకు కసరత్తు మొదలు

జిల్లాల్లోనూ అంకురాల జోరు

ఈనాడు, బెంగళూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన అంకుర విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తు మొదలైంది. బెంగళూరు దాటి అంకురాలను విస్తరించే దిశగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను సర్కారు ప్రకటించింది. డిసెంబరు రెండో వారం నుంచి ఈ అంకురాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. బెంగళూరుతో పోలిస్తే జిల్లాల వారీగా అందించే ప్రోత్సాహకాలు కొత్తతరం ఆవిష్కరణలకు ప్రపంచ వేదిక కల్పించటమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు అవకాశముంది.

ప్రోత్సాహకాలివిగో

ఇటీవల ప్రకటించిన విధానం ప్రకారం రాష్ట్రంలో ఐదేళ్లలో మొత్తం అంకురాల సంఖ్యను 30వేలకు పెంచటం, అందులో 5వేలను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేయటం. మంగళూరు, మైసూరు, హుబ్బళ్లి-ధార్వాడ, శివమొగ్గ, కలబురగి జిల్లాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఇన్నోవేషన్ క్లస్టర్లు, స్టార్టప్ జోన్లు, సెక్టార్ల వారిగా ప్రత్యేక హబ్‌లను ఈ విధానంలో భాగంగా ఏర్పాటు చేస్తారు. ఈ అంకురాల కోసం రూ.2 కోట్ల పెట్టుబడుల అంకురాలకు కార్యాలయం బాడుగల్లో 50శాతం రాయితీ, మూడేళ్ల పాటు ఆస్తి పన్నుల్లో 30 శాతం రాయితీ, ప్రతి ఉద్యోగికి రూ.50వేల ప్రోత్సాహక వేతనాలను సర్కారు అందిస్తుంది. బెంగళూరు బయట బదిలీ చేసే కార్యాలయాలకు ఫోను ఖర్చుల్లో 25 శాతం తిరిగి చెల్లింపు, రూ.50 కోట్ల మూలధన వ్యయం ఉన్న కంపెనీల పరిశోధన, అభివృద్ధి ఖర్చులో 40శాతం ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. అదనంగా ఏఐ, ఎంఎల్, క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్‌చైన్‌లో పరిశోధనలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తారు. ఈ ఏడాది మొత్తం వంద అంకురాలకు ఈ ప్రోత్సాహకాలిచ్చేందుకు రూ.960 కోట్లను సర్కారు వ్యయం చేయనుంది. ఈ ప్రోత్సాహకాలపై నెటిజన్లు కొందరు అభినందించినా మరి కొందరు బెంగళూరులా మైసూరు, మంగళూరు వంటి ప్రాంతాలను నగరీకరణ, భరించలేని నివాసయోగ్య జిల్లాలుగా మార్చరాదని సలహా ఇవ్వటం గమనార్హం.

విదేశీ సంస్థలతో బీటూబీకి అవకాశం

శునకషోకులు

ప్రదర్శనలో విదేశీజాతి కుక్కల ప్రదర్శన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వివిధ జాతులకు చెందిన పెంపుడు కుక్కలు, నేరగాళ్లను వేటాడే ముద్దనాళ్ కుక్కలు, ఆఫ్రికా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా తదితర దేశాలకు చెందిన వివిధ జాతులకు పెంపుడు కుక్కల ఫ్యాషన్ షో ప్రదర్శన ఆదివారం రాత్రి నగరంలోని కాక్స్‌టౌన్ ఒరాయన్ అవెన్యూ మాల్‌లో జరిగింది. పెంపుడు కుక్కలతో పాటు పిల్లి, వివిధరకాల పక్షులు తదితర వాటిని వేదికపై ప్రదర్శించారు. కుక్కలతోపాటు వాటి యజమానులు ర్యాంప్‌పై నడిచారు. ఆఫ్రికన్ గ్రేప్యారట్, మకావ్ పక్షి, ఇగ్వానా, షుగర్ గ్లైడర్, హెడ్జ్ హగ్, పర్షియన్ పిల్లి, అలబై, కాకేశియన్ షెఫర్డ్, కాంగల్, బార్డర్‌కాలి, బర్నీస్‌మౌంటన్ డాగ్ తదితర జాతుల ప్రాణులను ప్రదర్శించారు. జంతు ప్రేమికులు వచ్చి అపూర్వమైన కుక్క పిల్లలు, పక్షులను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. తమ యజమానులతో కలిసి వయ్యారంగా శునకాలు నడిచాయి. రామచిలుకలు, పావురాలు, ఫీనిక్స్ పక్షి, కింగ్‌ఫిషర్ తదితర పక్షులను ప్రదర్శించారు. ప్రదర్శన తిలకించేందుకు ఐదువందల మందికి పైగా సందర్శకులు వచ్చారు.

విదేశీ స్వదేశీ పెంపుడు కుక్కలను ప్రదర్శిస్తున్న యజమానులు

కఠిన చర్యలు తప్పవు

డాక్టర్ పరమేశ్వర్

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నేరాలతో సంబంధం ఉన్న పోలీసులపై కఠినచర్యలు తీసుకోవడంతో పాటు వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం ఇక్కడ సదాశివ నగరలో ఉన్న నివాసానికి నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్, సంయుక్త కమిషనర్లు అజయ్‌హిలోరి, వంశీకృష్ణ తదితరులు ఆయనను కలిశారు. ఏటీఎం దోపిడీ సంఘటనపై పోలీసు కమిషనర్, మంత్రికి వివరించారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రూ.6.29 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఇంకా కొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంఘటనలో పోలీసుశాఖకు చెందిన సిబ్బంది ఉన్నారని, కేసు దర్యాప్తునకు ఇద్దరు సంయుక్త పోలీసు కమిషనర్లు, ఇద్దర డీసీపీలు, రెండు వందల మంది సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. ఇలాంటి సంఘటన నగరంలో గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. నగర పోలీసులకు చెడ్డపేరు తెచ్చేందుకు ఈ సంఘటనకు పాల్పడ్డారని తెలిపారు. సవాల్‌గా తీసుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు వివరించారు. దీన్నుంచి గుణపాఠం నేర్చుకోవాలని నిత్యం పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోరమంగలలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల అపహరణ సంఘటన సవాల్‌గా స్వీకరించిన పోలీసులు ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు జమ చేసే ఏజెన్సీలు ఆర్‌బీఐ మార్గదర్శకాలను పాటించాలని మంత్రి సూచించారు.

26 నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రత్యేక అభియాన్

బెంగళూరు(బాణసవాడి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్ణాటక దళిత సంఘర్షసమితి (అంబేద్కర్‌వాద) ఈనెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకంగా జనజాగృతి అభియాన్ చేపట్టనుంది. అసమానతలు, విషపూరితమైన వైదికధర్మాన్ని అమలు చేస్తూ ప్రజల్లో విషబీజాలను ఆర్‌ఎస్‌ఎస్ నాటుతోందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు మావళ్లి శంకర్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఆచరిస్తోందన్నారు.

అతడే.. అసలు సూత్రధారి

ఇటీవల నగరంలో దొంగలు అపహరించిన వ్యాన్

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే సీఎంఎస్ వాహనాన్ని అడ్డగించి అందులో ఉన్న రూ.7.11 కోట్ల నగదు దోపిడీ చేసిన కేసులో ప్రధాన సూత్రధారి ట్రావెల్స్ ఏజెంట్ రవిగా పోలీసులు గుర్తించారు. చిత్తూరుకు చెందిన అతడు కల్యాణనగరలో ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఈ వ్యాపారం వల్ల అప్పులు పెరగడంతో దాన్ని బంద్ చేశారు. అప్పుల నుంచి బయట పడేందుకు అనేకసార్లు పలు దోపిడీ పథకాలను రూపొందించినా ఆచరణ సాధ్యం కాలేదు. బార్అండ్ రెస్టారెంట్‌లో గోవిందపుర పోలీసు ఠాణా కానిస్టేబుల్ అప్పణ్ణ నాయక్, సీఎంఎస్ ఏజెన్సీ వాహనాల బాధ్యుడు గోపాల్ ప్రసాద్, సీఎంఎస్ మాజీ ఉద్యోగి క్లేవియర్‌తో పరిచయమైంది. ఈ పరిచయంతో ముగ్గురు కలిసి నగదు దోపిడీకి పథకాన్ని సిద్ధం చేశారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే వాహనాలను లక్ష్యంగా చేసుకుని మూడు నెలలు కిందట ముగ్గురు కలిసి పథకాన్ని రూపొందించారు. నవీన్, నెల్సన్ మరో ఇద్దరు వారికి సహకరించారు. సీఎంఎస్ వాహనాల్లో నగదు ఎంత ఉంటుంది. వాహనంలో ఎంత మంది సిబ్బంది ఉంటారు. వాహనంలో ఉన్న ఆటోమేటిక్ బటన్, సైరన్, సీసీ కెమెరాలు ఎక్కడ ఉన్నాయి. వాటిని ఎలా ఆపేయాలన్న అంశాలను సీఎంఎస్ వాహనాల నిర్వహణ బాధ్యుడు గోపాల్‌ప్రసాద్ వివరించాడు. దోపిడీ చేసిన తరువాత పోలీసు దర్యాప్తు ఎలా చేస్తారు. దాన్నుంచి ఎలా తప్పించుకోవాలన్న అంశాలను కానిస్టేబుల్ అప్పణ్ణ నాయక్ పూసగుచ్చినట్లు వివరించాడు. దోచుకున్న డబ్బులను ఎక్కడ దాచాలో అనే దానిపై నిందితుడు రవి నిఘా పెట్టాడు. రెండు ఇన్నోవా కార్లను అద్దెకు తీసున్నారు. నవీన్, నెల్సన్ వాటికి డ్రైవర్లుగా వ్యవహరించారు. సంఘటన జరిగిన గంట తరువాత ఆ ప్రదేశానికి పోలీసులు వచ్చి దర్యాప్తు చేపడతారని కానిస్టేబుల్ అప్పణ్ణ నాయక్ సూచించారు. వాహనాన్ని అడ్డగించి సిబ్బంది దింపి చరవాణులను స్వాధీనం చేసుకున్న నిందితులు తమ వాహనంలో ఎక్కించుకుని డెయిరీ కూడలి ఉపరితల వంతెన పైకి వచ్చి డబ్బులు ఉన్న డబ్బాలను తమ వాహనాల్లో ఎక్కించుకుని పరారయ్యారు. ఒకటిన్నర గంటలోపు నిందితులు వాహనాలను ఆంధ్ర సరిహద్దులను దాటించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు దోపిడీ సమయంలో చరవాణులు ఉపయోగించలేదు. ఉపరితల వంతెనపై సీసీకెమెరాలు లేకపోవడంతో ఆ ప్రదేశాన్ని నిందితులు ఎంచుకుని దోపిడీకి పాల్పడ్డారు. వాహనం వెంట నిందితులు పడలేదు. అశోక్ పిల్లర్ నుంచి వెనక నుంచి వచ్చారు. ఉపరితల వంతెన వద్ద ఆర్‌బీఐ, ఐటీ అధికారుల పేరుతో దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. రెండు వాహనాల నెంబరు ప్లేట్లను మార్చారు. పోలీసు దర్యాప్తు పక్కదారి పట్టించేందుకు తిరుపతి వద్ద ఇన్నోవా కారు విడిచి పెట్టారు.

పోలీసుల అదుపులో ట్రావెల్స్ ఏజెంట్ రవి

మరో రూ.70 లక్షలు స్వాధీనం

బెంగళూరు(బాణసవాడి): ఏటీఎం కేంద్రంలో నగదు జమ చేసే సీఎంఎస్ వాహనాన్ని అడ్డగించి రూ.7.11 కోట్ల నగదు దోచుకుని పరారైన సంఘటనకు సంబంధించి కొత్తగా నిందితులు రవి, నవీన్, నెల్సన్‌లను సిద్ధాపుర పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టుల సంఖ్య ఏడుగురికి పెరిగింది. ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు వారు దాచిన రూ.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం రూ.6.45 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు, మిగతా నగదు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సీఎంఎస్ సిబ్బందిపై నిఘా

దోపిడీ సంఘటన జరిగిన తరువాత పోలీసులు సీఎంఎస్ సిబ్బందిపై పోలీసులు నిఘా వేశారు. పని చేసి విడిచిపెట్టిన ఉద్యోగులపైనా దృష్టి సారించారు. వాహనాల నిర్వహణ బాధ్యుడు గోపాల్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతడి చరవాణిని పరిశీలించారు. పదేపదే ఓ వ్యక్తికి ఫోన్ చేసిన నెంబరును గుర్తించి ఆరా తీశారు. అది కానిస్టేబుల్ అప్పణ్ణ నాయక్ ఫోన్ నెంబరుగా గుర్తించారు. ఇప్పటికే అప్పణ్ణ నాయక్ పలుమార్లు సస్పెండ్ అయ్యారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దోపిడీ సంఘటన వెనక ఉన్న నిందితుల వివరాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి వచ్చాయి. వాటి ఆధారంగా నిందితులను అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

సోమేశ్వర దేవస్థానంలో నంది, శివలింగం

ఆలయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

హొయసల రాజుల రాజముద్రిక

దర్పణ సుందరి

ఘన వారసత్వం.. మన పర్యాటకం

● పెరుగుతున్న విదేశీ పర్యాటకులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ జాబితాలో కర్ణాటకలో హొయసల దేవస్థా నాలు బేలూరు, హళేబీడు, సోమనాథ్‌పుర ఆలయాలకు చోటు దక్కడంతో పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరు గుతోంది. విదేశీ పర్యాటకుల సంఖ్య గతంతో పోలిస్తే మరింత ఎక్కువైనట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే పర్యాటకుల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రాచీన వారసత్వ సంపదను సంరక్షించేం దుకు పురాతన వస్తు శాఖ, పర్యాటక శాఖలు ప్రత్యేక కార్యాచరణ పథకాలను అమల్లోకి తెచ్చారు. దేశంలో యునెస్కో గుర్తించిన 42 వారసత్వ ప్రదేశాల్లో హొయ సల రాజులు నిర్మించిన ఆలయాలూ ఉన్నాయి. హంపీ తరువాత ఈ ఆలయాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అధికారులు తెలిపారు.

● ప్రాచీన శిల్పకళలకు ప్రసిద్ధిగాంచిన బేలూరు, హళే బీడు హాసన జిల్లాలో ఉన్నాయి. అక్కడ ప్రసిద్ధి చెందిన చెన్నకేశవ ఆలయం ఉంది. హొయ సల శైలిలో శిల్పకళకు ఈ ఆలయం ఒక నిలువుటద్దం. బేలూరును పూర్వం వేలాపురి అనే వారు. కాల క్రమంలో వేలూరుగా ఖ్యాతి పొందింది. అనంతరం బేలూరుగా మారింది. బేలూరు పట్టణం యాగాచి నది ఒడ్డున ఉంది. బేలూరు హొయసల రాజుల రాజధాని. ఇక్కడ 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న హళేబీడుకు రాజధానిని మార్చారు. అద్భుతమైన శిల్పకళతో ఆలయాలను నిర్మిం చారు. బేలూరులో వైష్ణవాలయాన్ని, హళేబీడులో శైవాల యాలను హొయసల రాజు విష్ణువర్ధనుడు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1117లో పడమటి చాళక్యు లపై విష్ణువర్ధనుడు విజయం సాధిం చిన చిహ్నంగా భక్తితో రెండు ఆల యాలను నిర్మించారు. ఆలయ సముదాయంలో కేశవాలయం దాని చుట్టూ రంగనాయకి, కప్పె చెన్నిగరాయ ఆలయాలు ఉన్నాయి. చెన్నకేశవాలయంలో నిత్యం పూజలు చేస్తారు. ఇక్కడ ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలు ఉన్నాయి. ఆలయం ప్రవేశద్వారం వద్ద హొయసల రాజుల రాజముద్ర కనిపిస్తుంది. ఈ ఆల యాన్ని ద్రావిడ శైలిలో సబ్బురాతితో నిర్మించారు. తేలిక ఆకుపచ్చ రంగు కలిగిన సబ్బురాతిపై శిల్పాలను కళాకా రులు అందంగా చెక్కారు. గోడల పైకప్పులపై వివిధ భంగిమల్లో నర్తకీమణుల శిల్పాలు, ద్వారపాలకుల శిల్పాలు, దర్పణసుందరి, భస్మమోహిని తదితర ఆకర్షణీ యమైన శిల్ప సంపద పర్యాటకులను కట్టిపడేస్తుంది. ఆలయం బయట 42 అడుగుల ఎత్తు కలిగిన ధ్వజ స్తంభం ఉంది. ఈ స్తంభం ఒకవైపు ఆధారంగా నేలను తాకి ఉండదు. మూడువైపులా స్తంభాలపై ధ్వజస్తంభం ఆధారపడి ఉంటుంది.

● సోమనాథపుర ఆలయం మైసూరు జిల్లాలో కావేరి నది ఒడ్డున ఉంది. హొయసల రాజు నర సింహ 1254లో ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర వెల్లడించింది. హొయసల శైలిలో నల్లరాతితో స్తంభాల ఆధారంగా నిర్మించారు. ప్రతి గోడ, రాతిపై శిల్పకారులు శిల్పాలను చెక్కారు. నర్తకీమణులు, వన్యజీవులు, వేటగాళ్లు, నృత్యకారిణి తదితర శిల్పాలు ఉన్నాయి. నిపుణులైన వారు ఏళ్ల తరబడి శిల్పాలు చెక్కి రాత్రి స్తంభాలకు అమర్చారు.

ముగిసిన అంతర్జాతీయ సెల్ థెరపీ సదస్సు

బెంగళూరు (క్రీడలు),న్యూస్‌టుడే: స్థానిక ఎంఎస్ రామయ్య స్మారక ఆస్పత్రి, వైడ్‌నెట్‌వర్క్ ఫర్ బ్లడ్ అండ్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (డబ్ల్యూబీఎంటీ)లు సంయుక్తంగా అంతర్జాతీయ సెల్ థెరపీ సదస్సు ముగి సింది. మూలకణాల థెరపీ, కార్-టీ చికిత్సలు ఆధునిక సాంకేతికతల ద్వారా మెరుగుప రచే విధానాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చిం చారు. కర్ణాటక ఆరోగ్యశాఖ కమి షనర్ కె.బి.శివ కుమార్ ఈ సద స్సులో పాల్గొని

సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ ప్రముఖులు

మాట్లాడుతూ రక్త క్యాన్సర్లు, అనువంశిక ఆరోగ్య సమస్యలకు ఈ థెర పీలు ఉపయోగపడుతున్నా అన్ని దేశాలకు ఈ చికిత్సలు అందుబాటులో లేవన్నారు. భవిష్యత్తులో ఈ థెరపీలు క్యాన్సర్ కారక మరణాలను నివా రిస్తాయన్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూబీఎంటీ అధ్యక్షుడు ఆచార్య డమియానో రొండె మాట్లాడుతూ అన్ని విభాగాల వైద్య నిపుణులు, శాస్త్ర వేత్తలు ఒకే వేదికపై వచ్చి ఈ సమస్యకు ఏకీకృత పరిష్కారం చూప టమే ఈ సదస్సు లక్ష్యమన్నారు. రామయ్య ఆస్పత్రి సీఈవో డా. నాగేంద్రస్వామి, ఆస్పత్రి వైద్య బృందం ఈ సదస్సులో పాల్గొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: వేగంగా సంచరిస్తున్న ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనటంతో బీదర్‌కు చెందిన మల్లికార్జున(40), పవన్‌కుమార్(32) అనే వ్యక్తులు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం బీదర్ నగర శివార్లలోజరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జనవాడ పోలీ సుఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తు ప్రారంభం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో కొందరు ఖైదీలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంపై బయ టకు వచ్చిన వీడియోలు ఆధారంగా జైలు అధికారులు తనిఖీలు చేప ట్టారు. హత్య కేసులో నిందితుడు సినీనటుడు దర్శన్ ఆప్తుడు ధన్వీర్ తదితరులను విచారిస్తున్నారు. వీడియోలను తాను ఎవరికీ షేర్ చేయలే దని ధన్వీర్ విచారణలో తెలిపారు. [illegible] విచా రించారు. కారాగారంలో ఖైదీలు పుట్టిన రోజు వేడుకలు, నృత్యం తది తర వాటిని కొందరు చరవాణిలో వీడియో తీసి బయటకు పంపించారు. అది కాస్త వైరల్ కావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

ఎనిమిది మంది అరెస్టు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: కొందరు నిందితులు పోలీ సుల పేరుతో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను అపహరించి వారి బ్యాంకు ఖాతాల్లో రూ.18.90 లక్షలు నగదు తమ ఖాతాల్లోకి జమ చేయించుకుని పరారైన ఎనిమిది మంది నిందితులను కోరమంగల పోలీ సులు అరెస్టు చేశారు. [illegible] ఉన్నారు. వారితోపాటు అపహరణకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చలపతి, భరత్, పవన్, ప్రసన్న, [illegible] అరెస్టు చేశారు. [illegible] బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం [illegible] నలు గురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నిందితులు రెండు కార్లలో అపహరించి [illegible] ఓ ప్రైవేట్ [illegible] బంధించారు. వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీసుకుని విడిచిపెట్టారు. అనంతరం బాధి తులు కోరమంగల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేశారు. కేసుదర్యాప్తులో ఉంది.

మత్తు మాత్రలు స్వాధీనం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: మత్తు మాత్రలను విక్రయి స్తున్నాడనే ఆరోపణపై ప్రేమ్(27) అనే వ్యక్తిని హెణ్ణూర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.40 లక్షల విలువైన 6700 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్దూరు మాజీ పురసభ అధ్యక్షుడి అరెస్టు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఓ ఇంట్లో జరిగిన దొంగ తనం సంఘటనకు సంబంధించి మద్దూరు పురసభ మాజీ అధ్యక్షుడు ఎం.కె.మరిగౌడను మద్దూరు పోలీసులు అరెస్టు చేశారు. అతడు దొంగి లించిన రూ.15లక్షలు విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకు న్నారు. గత ఆగస్టు 26న మద్దూరులోని దొడ్డబీదిలో నివసిస్తున్న గ్యాస్ చంద్రు ఇంట్లో నిందితుడు ముసుగు వేసుకుని ప్రవేశించి ఆయన భార్య సుశీలమ్మను బెదిరించి నగదు దోచుకుని పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అసలు నిందితుడిని అరెస్టు చేశారు.

దొంగకు కటకటాలు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు బెళగావి మహంతేశ్ నగరనివాసి సురేష్‌ను బెళగావి పోలీసులు అరెస్టుచేశారు. అతడినుంచి రూ.89.60 లక్షలు విలువైన 1,280 గ్రాముల బంగారు నగలు, రూ.1.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. బాలీవుడ్ సిని మాల ప్రేరణతో ఇప్పటి వరకు ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు విచా రణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో ఉంది.

వక్ఫ్ మండలి అధ్యక్షుడికి వినతి పత్రం సమర్పిస్తున్న రసూల్

వక్ఫ్ ఆధీనంలోకి దుకాణ సముదాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: స్థానిక ఖబరస్థాన్ (సున్ని) పరిధి దుకాణ సముదాయా లను వక్ఫ్ మండలి తన ఆధీనంలోకి తీసుకోవాలని కంప్లి ముస్లిం ఖబరస్థాన్ సమితి కార్యవర్గసభ్యుడు బి. రసూల్ తెలిపారు. కంప్లిలో ఆదివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఈ విష యమై రాష్ట్ర వక్ఫ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, వక్ఫ్ మండలి అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ అలీ హుసేన్‌కు శని వారం బెంగళూరులో వినతి పత్రం సమర్పించానన్నారు. హొసపేట బైపాస్ మార్గంలో ఖబరస్థాన్‌కు 8.38 ఎకరాల భూమిలో 20కి పైగా దుకాణ సముదా యాలు ఉన్నాయి. దీన్ని వక్ఫ్ ఆస్తిలో చేర్చలేదు. దుకాణాల ద్వారా వచ్చే బాడుగ వృథాగా ఖర్చవు తోంది. అందువల్ల ఈ దుకాణ సముదాయాలను వక్ఫ్ మండలి ఆధీనంలోకి తీసుకోవాలన్నారు.

ఆమె సేవలు ..అనుపమానం

బ్యాంకు కొలువు.. అయిదంకెల జీతం.. చక్కగా సాగిపోతున్న ఆ జంట జీవితాన్ని ఓ వ్యాధి ఎలా అత లాకుతలం చేసింది.. పెద్దదిక్కు కోల్పోయి ఆమెపడ్డ వేదన..ఆపై సమాజసేవకు ఎలా కదిలిందో తెలిపే మానవీయ గాథ ఇది..

అల్జీమర్స్ వాక్‌థాన్ జాగృతి ప్రారంభం కార్యక్రమంలో అనుపమా, తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: నేటి ప్రపం చంలో నేను, నాకు, నాది అంతే అనే స్వార్థపు వాతా వరణంలో ఆరోగ్యదృష్టిలో ఇతరుల కోసం శ్రమించే వారు చాలా తక్కువ. ఓ మహిళ మాత్రం ఎన్నో కష్టా లను ఎదురించి ధైర్యంగా నిలదొ క్కుకొని నిలిచి సమాజసే వకు అంకితమై శభాష్ అన్పించుకున్నారు. జీవన చక్రంలో తనకు జరిగిన నష్టం ఇతరులకు కలగకూడదనే దృష్టితో ఆరోగ్య జాగృతి కల్పించేం దుకు కంకణం కట్టిన ఆ అమ్మాయే అను పమా గాడిచెర్ల. లయన్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ - మెంటల్‌హె ల్త్‌గా పనిచేస్తున్న అనుపమా జీవితంలో తాను అనుభవించిన కష్ట, నష్టాలను మరిచేందుకు సమాజసేవకు అంకితమైంది. తాను ఎదుర్కొన్న కష్టాలు, బాధలతో ఆమె ఎలా సేవకు ఉపక్రమించారో తెలుసుకుందామా. ఈ కష్టా లకు ప్రధాన కారణం ఆమె భర్త సురేష్‌బాబు మతిమ రుపు(డిమెన్షియా) వ్యాధికి గురై మృతి చెందడమే. ఈ వ్యాధికి గురైన సురేష్‌బాబు పడ్డ కష్టాలు ఎవరికీ రాకూడదంటారామె. కడప జిల్లాకు చెందిన అనుపమా ఉద్యోగరీతిలో ఉద్యాననగరానికి వచ్చాక బ్యాంకు ఉద్యోగి సురేష్‌బాబుతో వివాహమైంది. ఒక కుమార్తె ఉంది. ఎన్నో ఆశలతో చక్కని జీవితాన్ని గడుపుతున్న అనుపమా కుటుంబంలో చేదు సంఘటన చోటుచేసు కొంది. అనుకోకుండా భర్త సురేష్‌బాబు ప్రవర్తనలో మార్పులు కనిపించింది. ఎంతో మంది వైద్యులకు చూపినా ప్రయోజనం లేకపోయింది. రోజు రోజుకు క్షీణిస్తున్న ఇతని ఆరోగ్యాన్ని పరిశీలించిన వైద్యులు ఎట్టకేలకు ఇతనికి డిమెన్షియా అని నిర్ధయించారు. ఈ దశలో ఉద్యోగానికి రాజీనామా చేసే పరిస్థితి నెలకొంది. చిన్నపాప తల్లీకూతుళ్లకు డిమెన్షియా అంటే తెలియదు. కుమార్తె భవిష్యత్తు ఒకవైపు, ఇంటి యజమాని వ్యాధితో ఉద్యోగం పోయింది. ఆదాయం లేదు. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న అనుపమా ఇంట్లో సురేష్‌బాబును చూసు కోలేని పరిస్థితి. ఈ దశలో రెసిడెన్షియల్ హోంకు చేర్చింది. ఏడేళ్ల పాటు తన భర్తకు ఆకలి, నిద్ర, దాహం అనేది తెలియదు. తాను ఎక్కడున్నాడో, ఏమైందని కూడా తెలియదు. నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. చక్కగా ఉన్న సురేష్‌బాబు ఈ వ్యాధితో చివరికి మృత్యుఒడికి చేరుకున్నాడు. అదే సమయంలో ఆమె పనిచేసే సంస్థలో తలెత్తిన సమస్య లతో ఉద్యోగమూ పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థి తుల్లో దృఢ చిత్తంతో భర్తకు వచ్చిన వ్యాధిపై ఎమ్మెస్సీ డిమెన్షియా స్టడీస్ కోర్సును అభ్యసించాలని సంకల్పిం చారు. ప్రపంచ అల్జీమర్స్ దినాచరణ సందర్భంగా 2019 నుంచి ఏటా వాక్‌థాన్ జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో ఈవ్యాధి గురించి అవగాహన కల్పించే కార్యక్రమన్ని చేపట్టారు. సొంత ఖర్చుతో కళా శాల విద్యార్థులతో కలిసి వాక్‌థాన్‌ను నిర్వహిస్తు న్నారు. తాను పడ్డ కష్టాల నుంచి మెల్లమెల్లగా కోలు కున్న అనుపమ ఇప్పటివరకు దాదాపుగా 15వేల మందికి ఈ వ్యాధిపై జాగృతి కల్పించడం విశేషం. అనాథాశ్రమాలకు వెళ్లి వారికి ఔషధాలు, భోజన ఏర్పాట్లు కల్పించి తన వంతు సాయం చేస్తున్నారు. ఆమె సేవలకు అనేక సంఘ సంస్థలు మెచ్చి సత్క రించి ప్రోత్సహిస్తున్నాయి.

బీఎన్ఎం ఇన్‌స్టిట్యూట్‌లో అనుపమాకు సత్కారం

పాత్రికేయుల సమస్యలు తీరుస్తాం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రాష్ట్రంలో సీనియర్ పాత్రికే యులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారికి నెలవారి పింఛన్ మంజూ రులో ఉన్న కఠిన షరతులను తొలగించి పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదివారం ఇక్కడి బెంగళూరు ప్రెస్ క్లబ్‌లో భారతీయ సీనియర్ పాత్రికే యుల సమాఖ్య, కర్ణాటక సీనియర్ పాత్రికేయుల వేదిక సంయు క్తంగా ఏర్పాటు చేసిన సమావే శాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరా మయ్యతో చర్చించి అమల్లో ఉన్న కఠిన షరతులను సవరించి అందరికీ పింఛన్ దొరికే విధంగా చర్య తీసుకుంటామన్నారు. పాత్రికేయుల కూడా ఆరోగ్య వైద్య సౌకర్యం కల్పించేందుకు సంజీవిని పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు. వేదిక అధ్యక్షుడు ఆర్.పి.సాంబసదాశివారెడ్డి, [illegible] ప్రధాన కార్యదర్శి [illegible], ఉపాధ్యక్షుడు ఆనంద్ [illegible], కార్యద ర్శులు శాంతకుమారి, కేపీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కేవీప్రభాకర్ తదితరులు

నియమాలు చెప్పి..ఉచితంగా శిరస్త్రాణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: రహదారి నియమాల జాగృతి వారోత్స వాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ అనేక నూతన కార్యక్రమాలు చేపట్టినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం హిరియూరు రూరల్ పోలీసు [illegible] వద్ద రహదారి నియమాల క్విజ్ పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో పాల్గొని సరైన జవాబు ఇచ్చిన వారికి ఉచితంగా శిరస్త్రాణాలు అందజేశారు. ప్రజలలో శిరస్త్రాణాలు ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను, ధరించకపోతే జరిగే నష్టాలను గురించి అవ గాహన పెంపొందించి నట్లు తెలిపారు. కార్యక్ర మంలో సబ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆనంద్

సీఎం పదవికి పరమేశ్వర్ అర్హుడు

బెంగళూరు(యశ్వంతపుర): ముఖ్య మంత్రి అయ్యే అన్ని అర్హతలు హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్‌కు ఉన్నాయని కర్ణాటక మురికివాడల నిర్మూలన మండలి అధ్యక్షుడు, హుబ్బళ్లి శాసనసభ్యుడు ప్రసాద్‌అబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయనను హుబ్బళ్లిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు ఎమ్మెల్సీ డాక్టర్ యాతీంద్ర సిద్ధరామయ్యతో కలిసి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేప్ర సాద్ అబ్బయ్య విలేకర్లతో మాట్లాడారు. డాక్టర్ పరమేశ్వర్ ముఖ్యమంత్రి కావాలని ఆశించడంలో తప్పు లేదన్నారు. నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్ఠానం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా బాగా పని చేస్తున్నారని, మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య, ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ పార్టీ అధిష్ఠానంతో చర్చించాలని తెలిపారు. మూడుసార్లు గెలిచిన తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలియజేశారు.

ఉద్యమంలా ఈ-ఖాతా సరిచేత

☛ గ్రామాలను దత్తతకు తీసుకున్న అధికారులు ☛ జిల్లాలో 43,737 ఎకరాలు

ఈ-పౌతి గురించి వివరిస్తున్న ఉప తహసీల్దార్ పాండు, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, తహసీల్దార్ రేఖ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: మృతిచెందిన వారి పేరు మీద ఉన్న వ్యవసాయ భూములను వారి వారసుల పేర్లకు బదిలీ చేయడానికి, ఈ-పౌతి ఖాతాను వేగవంతం చేయడా నికి జిల్లా యంత్రాంగం గ్రామాలను దత్తత తీసుకోవడానికి సిద్ధమయ్యారు. జిల్లాలో భూమి రికార్డుల కోసం ఆధార్ కార్డు నంబరును అనుసంధానం చేసినప్పుడు జిల్లాలో మొత్తం 43,737 ఎకరాల భూమి మృతిచెందిన వారి పేర్ల మీద ఉన్నట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 41,38,317 ఎకరాలు భూమి మరణించిన వారి పేర్లతో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ-పౌతి ఖాతా ఉద్య మాన్ని నిర్వహించాలని ప్రభుత్వం 2024లో ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రారంభ మైంది. బళ్లారి జిల్లాలో కూడా ఈ ఉద్యమం ప్రారంభిం చారు. దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కార ణంగా చాలా ప్రాంతాల్లో అవగాహన లేక పోవడంతో ముందుకు సాగడం లేదు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో జాప్యాన్ని గమనించిన జిల్లా పాలనాధికారి, అదనపు జిల్లా పాలనాధికారి ప్రచారంలో వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకోవడం ద్వారా ఈ-పౌతి ఖాతా ఉద్యమానికి ఊతం ఇచ్చినట్లు అవుతుందని అధికారులు భావించారు.

ఏ గ్రామాలను దత్తతకు తీసుకున్నారు

బళ్లారి తాలూకాలోని మోకా, కంప్లి తాలూకాలోని ఎమ్మిగనూర్, దమ్మూర్, కురుగోడు తాలూకాలోని కోళూరు, సండూరు తాలూకాలోని దరోజి, సిరుగుప్ప తాలూకాలోని సిరిగేరి గ్రామాలను ఇద్దరు అధికారులు దత్తతకు తీసుకున్నారు.

ఏమి చేయాలి.. : మరణించిన వారి కుటుంబాలు తమ పేర్లపై భూములు ఉంటే వారు ఈ-పౌతి ఖాతా ఉద్య మంలో దరఖాస్తులను సమర్పించాలి. జిల్లా యంత్రాంగం అన్ని పత్రాలను తనిఖీ చేస్తుంది. అవసరమైన పత్రాలను సృష్టించి పేరును మార్పు చేసి వారసుల పేర్ల మీద చేయ నున్నారు. కుటుంబ వంశ వృక్షం, మరణ ధ్రువీకరణ పత్రాలను స్థానిక స్థాయి అధికారులు సిద్ధం చేస్తారు. మరణ ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేకపోతే స్థానిక అధికారులు పంచనామా చేసి పత్రాలను అందిస్తారు.

ఉపయోగం ఏమిటి

మరణించిన వ్యక్తి పేరు మీద భూమి ఉంటే అమ్మడం, కొనడం, బ్యాంకు రుణాలు తీసుకోవడం లేదా ప్రకృతి వైపరీత్యాలు సంబంధించిన సందర్భంలో జరిగిన నష్టాలకు పరిహారం పొందడం కష్టమైంది. ఖాతా మారిన తర్వాత ఈ పనులన్నీ సరళీకృతం అవుతాయి. ఖాతాను మార్చేటప్పుడు కుటుంబంలో వంశీ వృక్షంలోని ప్రతి సభ్యునికి ఇ-కేవైసీ చేయిస్తారు.

కార్యక్రమం ఉద్దేశం ఏమిటంటే..

ఈ-పౌతి ఖాతా ఉద్యమానికి ఊతం ఇవ్వడం, దిగువ స్థాయి అధికారుల్లో ఉత్సాహాన్ని నింపడం, పేరు మార్పు కోసం వేచి ఉన్న కుటుంబాలు ముందుగానే దరఖాస్తులు చేసుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
- మహమ్మద్ ఝుబేర, అదనపు జిల్లా పాలనాధికారి, బళ్లారి

ఉపముఖ్యమంత్రిని కలిసిన మేయర్

డి.కె.శివకుమార్‌ను సన్మానిస్తున్న బళ్లారి మేయర్ పూజారి గాదెప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె మేయర్ పూజారి గాదెప్ప నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు బెంగళూరులో ఉన్న ఉపముఖ్యమంత్రి, కె.పి. సి.సి అధ్యక్షుడు డి.కె.శివకు మార్‌ను ఆదివారం కలిసి సన్మానించారు. సోమవారం మేయర్‌గా పూజారి గాదెప్ప బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముందు రోజు ఉపముఖ్య మంత్రి తదితరులను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

వారసత్వ పరిరక్షణ సమష్టి బాధ్యత

హంపీ చక్రతీర్థ కోదండరామాలయం మార్గంలో ముళ్లపొదలను తొలగిస్తూ శుభ్రత పనులు చేస్తున్న విద్యార్థులు

హంపీ సాలుమంటపం వద్ద శ్రమదానం చేసిన విద్యార్థులు, పురావస్తుశాఖ సిబ్బంది

హొసపేటె, న్యూస్‌టుడే: మన వారస త్వాన్ని పరిరక్షిం చడం సమష్టి బాధ్యత, రాబోయే తరానికి వాటిని మిగ ల్చాల్సి ఉందని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాల కుడు డాక్టర్ ఆర్.శేజేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పురావ స్తుశాఖ, ఓ ప్రైవేటు పాఠశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్స వాలు-2025 నేపథ్యంలో ఆదివారం హంపీ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన శ్రమదాన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. ఆరుబ యలు పర్యాటక క్షేత్రం హంపీలాంటి శిల్ప కళా కాణాచి మరెక్కడా మనకు కనిపిం చదు. అడుగడుగునా గుడులు, గోపురాలు, స్మారకాలు, మండపాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అపురూప స్మారకా లను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని గుర్తుచేశారు. హంపీ చరి త్రకు సంబంధించిన పుస్తకాలను ప్రాథమిక దశలోనే విద్యార్థులు చదవాలని సూచిం చారు. ఈ సందర్భంగా తుంగభద్ర నదీ తీరం, చక్రతీర్థ కోదండరామాలయం, సాలు మంటపాల్లో శ్రమదానం ద్వారా స్వచ్ఛత పనులు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనన్య ప్రసాద్, సహాయక పురావస్తు అధికారి డాక్టర్ మంజునాయక్, హంపీ ట్రాఫిక్ ఎస్సై శివకు మార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చోరులకు అరదండాలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకొన్న పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు రూ.5.50 లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు నగ లను స్వాధీనం చేసుకొన్నట్లు డీవైఎస్పీ సత్యనారాయణరావు తెలిపారు. ఆది వారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిందితులను జగన్నాథ్, భీమానాయక్‌గా గుర్తించారు. గత నెల 23న మధ్యాహ్నం పట్టణంలోని ఉపాసీ నగర్‌లో నివాసముంటున్న అగ్నిమాపక దళం విశ్రాంత ఉద్యోగి జయణ్ణ ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.7 లక్షల విలువ చేసే 73 గ్రాముల బంగారు నగలు, రూ. 20 వేల నగదును దోచు కొని పరారయ్యారు. పరారీలో ఉన్న మరో నిందితుడు శ్రీనాథరెడ్డి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

శరవేగంగా సుధాక్రాస్ పైవంతెన పనులు

బళ్లారి, న్యూస్‌టుడే: స్థానిక కంటో న్మెంట్లోని సుధాక్రాస్‌లో రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న పైవంతెన పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. 2026 సెప్టెంబరు లోపు పైవంతెన పనులు పూర్తి చేయాల్సి ఉంది. అధికా రులు ఒత్తిడితో గుత్తేదారు 2026 ఏప్రిల్ లోపు పూర్తి చేయడానికి రాత్రిం బవళ్లు పనులు చేయిస్తున్నారు.

పూర్తి కావస్తున్న స్తంభాలు

పనుల వివరాలు

సుధాక్రాస్ రైల్వే గేటు ప్రతి 7-10 నిమిషాలకు మూసి వేస్తుండంతో వాహనదారులు, పాదచారులకు పెద్ద తలనొప్పిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో డీసీగా పనిచేసిన పవన్‌కుమార్ మాలపాటి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జిల్లా గని నిధులు(డి.ఎం. ఎఫ్) రూ.104కోట్లతో పైవంతెన పనులు ప్రారంభించారు. పైవంతెన మొత్తం 900 మీటర్లు పొడవుం టుంది. రైల్వే గేటుకు ఇరువైపులా 18 స్తంభాలు నిర్మించారు. పైవంతెన సుధాక్రాస్(ఓపీడీ) కూడలి సమీపం నుంచి ప్రారంభమై... టి.బి.శ్యానిటో రియం రహదారిలోని పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు ఉంటుంది. పైవంతెన మొత్తం 12 మీటర్ల వెడల్పు ఉంటుంది. వంతెన కింద ఇరువైపులా 5 మీటర్ల చొప్పున సర్వీస్ రహదారిని నిర్మిస్తారు.

ముగింపు దశలో పైవంతెన పనులు

ట్రాఫిక్ మళ్లింపు

సుధాక్రాస్ నుంచి హొసపేటె, సండూరు, కంప్లి ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు పైవంతెన మీదుగా మళ్లీ ..పాత కాంగ్రెస్ కార్యా లయం మీదుగా, టి.బి.శ్యానిటోరియం, కువెంపు నగర గుండా వినాయకనగ ర్‌కు చేరుకుని 63వ జాతీయ రహదా రిపై వెళ్లాల్సి ఉంటుంది. ఆర్.టి.ఒ, అటవీశాఖ, రేడియోపార్క్ వైపు వెళ్లే వాహనదారులు కూడా పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి వెనక్కి వచ్చి ప్రధాన రహదారి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పనులు ఏప్రిల్ లోపు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తు న్నట్లు జాతీయ రహదారి అధికారులు తెలిపారు.

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

వామ్మో! కూలుతుందా!

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి ఏపీఎంసీ మార్కెట్లోని ప్రధాన ద్వారం రహదారిలో ఉన్న విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. మురుగు కాలువ పక్కన ఉన్న విద్యుత్తు స్తంభం కింద భాగంలో సిమెంట్ లేచిపోయి కూలేలా ఉంది. ఏ చిన్న వాహనం ఢీకొన్నా పునాది బలహీనంగా ఉండడం వల్ల స్తంభం కూలిపోవచ్చు. అప్పుడు పెను ప్రమాదం తప్పదు. అందువల్ల జెస్కాం అధికారులు విద్యుత్తు స్తంభానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

సాలుమరద తిమ్మక్కకు నివాళులు

బళ్లారి, న్యూస్‌టుడే: బుడగ జంగమ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృక్షమాత సాలుమరద తిమ్మక్కకు కుడతిని పట్టణపంచాయతీ సభ్యులు, కుడతిని వాసులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 114 మొక్కలను స్థానిక ప్రజలకు వితరణ చేసి వాటిని నాటి సంరక్షించాలని కోరారు. సాలుమరద తిమ్మక్కకు సంతానం లేకపోయినా నాటిన మొక్కలను సంతానంగా చూసుకొనే వారని పలువురు కొనియాడారు.

తిమ్మక్కకు నివాళులర్పిస్తున్న కుడతిని పట్టణ పంచాయతీ సభ్యులు

ఇసుకాయ స్వాహా!

• ఆంధ్రా నుంచి రాత్రికి రాత్రే దిగుమతి
• దళారులకు కాసుల వర్షం

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో రాజకీయ నేతల అనుచరులు ఇసుకను అక్రమంగా సరఫరా చేయడం ప్రారంభించారు. 18 టన్నుల లోడ్‌కు రూ.32 వేలు తీసుకుంటున్నారు. అక్రమంగా ఇసుక రాత్రికిరాత్రే తరలించడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. బళ్లారి సరిహద్దుల్లోని అనంతపురం, కర్నూలు (ఆంధ్రప్రదేశ్) జిల్లాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నారు. బళ్లారి గ్రామీణ, ట్రాఫిక్ పోలీసులు, ఇతర పోలీస్‌స్టేషన్ అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏవో రెండు మూడు టిప్పర్లపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో మళ్లీ ఇసుక కృత్రిమ కొరత తలెత్తింది. నిర్మాణ పనులు దాదాపు నిలిచిపోయాయి. ఒకవైపు కూలీల ఉపాధిపై ప్రభావం చూపుతుండగా, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకునే వారి పరిస్థితి ఘోరంగా మారింది. మే లో కూడా ఇసుక కొరత ఏర్పడింది. అప్పుడు కూడా రాజకీయ నాయకులు, కొందరు స్వార్థ ప్రయోజనాల కారణంగా ఇసుక సరఫరా ఆగిపోయిందని ఆరోపణలు వచ్చాయి.

ఇసుక స్టాక్ పాయింట్

ధరలకు రెక్కలు

నగర శివారులోని అసుండి వడేనూరు, యాల్పి గ్రామాల్లో ఇసుక లీజు ప్రాంతాలు ఉన్నాయి. నగరానికి ఇసుక సరఫరాకు ఇవే మూలాలు. ఈ విధంగా సరఫరా అయిన ఇసుక లోడ్ (18 టన్నులు) ధర ఇదివరకు రూ.32వేలు, రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులు, స్మగ్లర్లు ఇందులో కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు కూడా ఇదే కారణాలను చూపుతూ అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. వారు భారీ లాభాలు ఆర్జిస్తున్నారని తెలుస్తోంది.

మందకొడిగా నిర్మాణ పనులు

ట్రాఫిక్ రద్దీ

నగరంలో భారీ వాహనాల కదలిక వల్ల ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకే ట్రిప్ షీట్‌తో ఇసుకను అనేక సార్లు రవాణా చేస్తున్నారు. దీని వల్ల అనవసరమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. అందువల్ల 2023లో ఉత్తర్వుల ప్రకారం మేము వాహనాలను ఆపివేస్తున్నాం. ఇసుక వ్యాపారులు ఈ ఉత్తర్వులను సవరిస్తే వాహనాలు రావడానికి అనుమతిస్తామని పోలీసుఅధికారులు వివరిస్తున్నారు. అయితే ఎవరి ఆదేశాల ప్రకారం ఈ నిబంధనలు అమలు చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గనులశాఖ మౌనం

ఇసుక సరఫరాలో సమస్యలు ఉన్నప్పటికీ భూగర్భ గనుల శాఖ అధికారులు ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. వారు సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించినట్లు కనిపించడం లేదు. ఈ సమస్యపై జిల్లా పాలనాధికారి కె.నాగేంద్ర ప్రసాద్ వివరణ కోరగా సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి సమాచారం సేకరించి దానిపై మాట్లాడతానని తెలిపారు.

సరఫరాలో అంతరాయం

గత ఒకటిన్నర నెలలుగా ఇసుక సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా గుత్తేదారులు కాంట్రాక్ట్ తీసుకున్న ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. గత 15 రోజులుగా ఇసుక తవ్వకాలు ప్రారంభమైనప్పటికీ, సరఫరా సాధ్యం కావడం లేదు. - వ్యాపారులు, బళ్లారి

కల్యాణ కర్ణాటక శిక్షణాభివృద్ధికి ప్రత్యేక నిధులు

సిరివార, (మాన్వి) : కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని శిక్షణాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించినట్లు మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్, ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌లతో కలిసి తాలూకాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శిక్షణ ద్వారా మాత్రమే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. తాగునీరు, రహదార్ల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు. ఎంపీ నిధులతో సిద్ధరామేశ్వర గుడి వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న కల్యాణ మంటపానికి భూమి పూజ చేశారు. కేకేఆర్‌డీబీ నిధులతో నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ పవార్, నాయకులు చుక్కి శివకుమార్, బ్రిజేష్‌పాటిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎన్.ఎస్.బోసురాజు

సాగు భలే బాగు

బళ్లారి, న్యూస్‌టుడే: సేంద్రియ పద్ధతిలో 25 ఏళ్లుగా సేద్యం చేస్తూ...వేర్వేరు రకాల వరిని సాగు చేస్తున్న ఆదర్శ రైతు ఈరప్పయ్య పలువురికి ఆదర్శమని తాలూకా వ్యవసాయశాఖాధికారి మంజునాథరెడ్డి పేర్కొన్నారు. తాలూకా బైరాపురం సమీపంలోని ఈరప్పయ్య పొలాన్ని క్షేత్ర పర్యటనకు వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొదట సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి పంటను రైతులు పరిశీలించారు. అక్కడే సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న ప్లాంట్‌ను కూడా తిలకించి ఈరప్పయ్య నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇదే పద్ధతిలో సాగు చేయడానికి ఆసక్తి చూపారు. అనంతరం ఈరప్పయ్యతో పాటు పలువురు రైతులను సన్మానించి అభినందించారు. వ్యవసాయశాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న ఆదర్శ రైతులు

27న సమన్వయ పరిశీలన సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: మహిళ,శిశు అభివృద్ధిశాఖ వివిధ పథకాలపై జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన ఈ నెల 27న ఉదయం 10.30లకు జిల్లా పాలనాధికారి కార్యాలయంలో జిల్లాస్థాయి సమన్వయ పరిశీలన సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారి రామకృష్ణ తెలిపారు.

'అభ్యంతరాలు ఉంటే తెలపండి'

బళ్లారి, న్యూస్‌టుడే: కంప్లిలోని అంబేడ్కర్ కూడలిలోని వాణిజ్య దుకాణాలు, బళ్లారి రహదారిలోని వాణిజ్య దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపయోగించుకోవడానికి వీలులేకుండా ఉన్నాయి. ఈ ప్రదేశంలో బస్ షెల్టర్ నిర్మించుకోవడానికి కె.కె.ఆర్.టి.సి.కి అప్పగిస్తున్నాం. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో రాతపూర్వకంగా తెలపాలని పురసభ ముఖ్య అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారిపై మురుగు పరుగులు

నగరంలోని బసవనకుంట రహదారిపై భూగర్భ మురుగు కాలువ గొట్టాలు బ్లాక్ కావడంతో అపరిశుభ్ర నీరు బయటకు పొంగి ప్రవహిస్తుంది. దుర్వాసన వెలువడుతుండడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగర పాలికె అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, బళ్లారి

సవితా సమాజ జిల్లా అధ్యక్షుడి ఎంపిక

బళ్లారి, న్యూస్‌టుడే: సవితా సమాజ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ స్వామి ఎంపికయ్యారు. గత జిల్లా అధ్యక్షుడు రాకేష్ రాజీనామా చేయడంతో అధ్యక్ష ఎన్నిక సముదాయ భవనంలో కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. శ్రీరామరంగపురానికి చెందిన నారాయణస్వామి బళ్లారిలో స్థిరపడి సంఘం అభివృద్ధికి పాటుపడుతున్నారు. ఆయనకు పలువురు మద్దతు ఇవ్వడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన నారాయణస్వామిని అభినందిస్తున్న సభ్యులు

25 నుంచి షష్టి వేడుకలు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్‌లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి షష్టి వేడుకలు జరగనున్నాయి. 25న ఉదయం నాగ పూజ, ఊరేగింపు ఉత్సవం, అంకురారోహణ, ధ్వజారోహణ, రాత్రి స్వామి వారి కల్యాణం, 26న షష్టి నాడు మహాన్యాస పూర్వక ఏకవార అభిషేకం, బలిహరణ, భక్తుల కానుకలు సమర్పణ, 27న పుష్ప యాగం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ సమితి ప్రతినిధి రుద్రరాజు నాగరాజు తెలిపారు.

సైనికుల సేవలను మరవలేం

రాయచూరు,న్యూస్‌టుడే : సైనికుల సేవలు, త్యాగాలను విస్మరించలేమని జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ సహ కార్యదర్శి దండప్ప బిరాదార్ పేర్కొన్నారు. అఖిల కర్ణాటక మాజీ సైనికుల జిల్లా సంఘం 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఇక్కడి భారతీయ వైద్య కుటుంబ సంఘం కార్యాలయంలో జరుపుకొన్నారు. బిరాదార్ ప్రారంభ జ్యోతిని వెలిగించి ప్రసంగించారు. ఊరికి, కుటుంబానికి దూరంగా ఉంటూ, ఎండ, వాన, చలిని లెక్క చేయకడా సరిహద్దుల్లో పహారా కాస్తుండడంతో మనమంతా హాయిగా నిద్రిస్తున్నామన్నారు. మాజీ సైనికుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, రహీం, గోపాలనాయక్, సుందరసింగ్, మల్లికార్జున వేదిక మీద ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని.. ఇద్దరి మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చోదకులు మృతిచెందారు. ఈ ఘటన కూడ్లిగి శివారు 50వ జాతీయ రహదారిలో ఆదివారం చోటుచేసుకుంది. కూడ్లిగికి చెందిన మెకానిక్ నాజర్(30) తన దుకాణానికి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన హగరిబొమ్మనహళ్లి తాలూకా కల్లహళ్లికి చెందిన మహేశ్(26) బైకు ఢీకొనడంతో ఇద్దరూ కిందపడ్డారు. నాజర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో క్షతగాత్రుడు మహేశ్‌ను బళ్లారికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. కూడ్లిగి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1,623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,528	3,066
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,313	6,246
నీటి నిల్వ (టి.ఎం.సి)	72.420	96.000

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఉత్తర కర్ణాటకపై నిర్లక్ష్యం

బళ్లారి, న్యూస్‌టుడే: అభివృద్ధి విషయంలో ఉత్తర కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తున్నారని ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్ ఆరోపించారు. సిరిగన్నడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కన్నడ రాజ్యోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మాతృభాష కన్నడంలో విద్యాభ్యాసం చేయించాలన్నారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఉన్నా స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు లభించడం లేదని విచారం వ్యక్తం చేశారు. కొట్టూరు సంస్థాన శాఖ మఠం నిరంజన ప్రభు మహాస్వామి కన్నడ భాష ప్రాముఖ్యం, మన సంస్కృతుల గురించి వివరించారు. అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు విరూపాక్షిగౌడ, అధ్యక్షుడు వీరభద్రగౌడ, సి.ఐ విశ్వనాథ హిరేగౌడర్, సుప్రిత్, హసన్‌భాష, నాగరాజు, షణ్ముఖ, రమేశ్, మల్లికార్జున, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురిని సన్మానించి అభినందించారు.

పలువురికి సన్మానం చేస్తున్న స్వామి, ప్రముఖులు

చలవాది మహాసభ తాలూకా అధ్యక్షుడిగా చెన్నప్ప

కంప్లి, న్యూస్‌టుడే: చలవాది మహాసభ కంప్లి తాలూకా అధ్యక్షుడిగా సి.ఎ.చెన్నప్ప నియమితులయ్యారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు సి.శివకుమార్ చెన్నప్పకు నియామక పత్రం అందించారు. కంప్లిలో ఆదివారం చెన్నప్ప విలేకరులతో మాట్లాడుతూ చలవాది సముదాయ సంక్షేమంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రక్తదానంతో ఆరోగ్యం వృద్ధి

బళ్లారి, న్యూస్‌టుడే: రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డాక్టర్ యల్లా రమేశ్‌బాబు అధికారులకు సూచించారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలోని ఎయిడ్స్ నియంత్రణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో డి.హెచ్.ఒ మాట్లాడారు. రక్తహీనత, గర్భిణులు, ప్రమాదంలో గాయపడిన సందర్భంలో రక్తం చాలా అవసరమవుతుంది. సరైన సమయంలో రక్తం లభించకపోవడంతో మృత్యువాత పడుతున్నారు. ఆ పరిస్థితిని ఎదుర్కోవాలంటే రక్తదానం చేసే వారి సంఖ్య పెరగాలి. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ రక్తం మనిషి శరీరంలోనే ఉత్పత్తి అవుతుంది. రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తం ఉత్పత్తి కావడంతో మరింత ఆరోగ్యంతో పాటు ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చని వివరించారు. 45 కిలోల కంటే ఎక్కువ బరువు, 12.5 గ్రాముల కంటే ఎక్కువ హిమోగ్లోబిన్ ఉన్న మహిళలు ప్రతి నాలుగు నెలలు, పురుషులు ప్రతి మూడు నెలలకు ఓసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. సమావేశంలో వైద్యులు ఖర్షిద్ బేగం, గిరీశ్, హొన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యల్లా రమేశ్‌బాబు, చిత్రంలో డాక్టర్ ఇంద్రాణి తదితరులు

26న బెంగళూరులో నిరవధిక ధర్నా

కంప్లి, న్యూస్‌టుడే: వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న బెంగళూరులో నిరవధిక ధర్నా జరుపతలపెట్టినట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలప్ప పేంటర్ తెలిపారు. కంప్లిలో ఆదివారం వారు ధర్నా కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి. ఆరోగ్యం దృష్ట్యా 12 గంటల పనిని రద్దు చేయాలి. ఉపాధి హామీ పనులను 200 రోజులకు విస్తరించాలి. వలస కార్మికులకు రక్షణ కల్పించాలంటూ వివిధ సమస్యలను వివరించారు. కట్టడ కార్మికులు, ఉపాధి కూలీలు, ఆటో చోదకులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: వివిధ సంఘాలు, కళాశాలలు, పాఠశాలలు వివిధ రంగాలలో సాధన చేసిన స్థానిక కళాకారులను రప్పించి వారిని గౌరవించి ప్రోత్సహించాల్సి ఉందని జిల్లా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ బి.ఎం. గుర్నాథ్ సూచించారు. ఆదివారం ఇక్కడ జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవం కార్యక్రమంలో భాగంగా గీత గాయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గీత గాయనకు జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన 45 మంది కళాకారులు కన్నడ భాష, సంస్కృతి, నాడు తదితరాలపై రచించిన పాటలను పాడి ప్రేక్షకులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శివస్వామి, తాలూకా అధ్యక్షులు ప్రశాంత్, కార్యదర్శి నరేంద్రబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత వేంకటేశ్వర కళాశాల

గెలుపొందిన జట్టు సభ్యులు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఛాంపియన్‌షిప్ గెలుపొందారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆటల మైదానంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 20కు పైగా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కబడ్డీ కప్ గెలుపొందిన విద్యార్థులను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ శివకుమార్ తదితరులు అభినందించారు.

ఘనంగా సాయి శతజయంతి

పుట్టపర్తి సాయిబాబా చిత్రపటానికి పుష్పాలంకరణ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ఈశ్వరాంబ సేవాసమితి, బాబా భక్తుల ఆధ్వర్యంలో హొసపేట రోడ్డులోని పుట్టపర్తిసాయి బాబా మందిరంలో బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అభిషేకం, పూజలు ఆచరించారు. నగరసంకీర్తన, మందిరం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. బిమ్స్ ఆవరణలో రోగుల బంధువులకు అన్నదానం చేపట్టామని ఈశ్వరాంబ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వరెడ్డి తెలిపారు. అఖండభజనలు నిర్వహించామన్నారు. లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రిగినాగరాజ్ కేక్ కోసి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షుడు విరుపాక్షప్ప, ప్రముఖులు మఠం గురుప్రసాద్, సాయి సేవాసమితి, ఈశ్వారాంబ సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాబోయే రోజులు ఆయుర్వేద వైద్యానివే

హొసపేటె, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో అందరూ ఆయుర్వేద వైద్యం వైపు మళ్లే అవకాశం దగ్గరలో ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు దాదాపీర్ అన్నారు. జిల్లా యంత్రాంగం, ఆయుర్వేద వైద్యశాఖ, రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అల్లోపతి వైద్యం నయం చేయని ఎన్నో వ్యాధులను ఆయుర్వేద వైద్యం నయం చేసిందని గుర్తు చేశారు. నెమ్మదిగా నయమైనప్పటికీ ఆయుర్వేద మందులను వాడటం ఉత్తమమని సలహా ఇచ్చారు. సుమారు 285 మంది రోగులకు కొప్పళ జిల్లా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ పర్వతగౌడ, వైద్యులు మునివాసుదేవ రెడ్డి, హాలమ్మ, ఆర్తీ తదితరులు చికిత్స అందించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ కేదారేశ్వర దండిన్, డాక్టర్ బి.వి.భట్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షుడు దాదాపీర్, వైద్యులు

ఔరా! గోమాత మాతృత్వం

బళ్లారి: ఓ గోమాత మూడు దూడలకు పాలు ఇచ్చి మాతృత్వం చాటుకుంది. స్థానిక కంటోన్మెంట్‌లోని ప్రశాంత్ కాలనీకి వచ్చిన ఓ ఆవు దగ్గర మూడు దూడలు పాలు తాగుతున్న దృశ్యాన్ని చుట్టుపక్కల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సర్వసాధారణంగా ఆవు.. పుట్టిన ఒక్క దూడకు మాత్రమే పాలు ఇస్తుంది. కొత్త దూడలు పాలు తాగడానికి ప్రయత్నిస్తే కాలుతో తన్నడం మనం చూస్తూనే ఉంటాం.

మూడు దూడలకు పాలు ఇస్తున్న ఆవు

సత్తాచాటిన బెస్ట్ విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాలల్లో జరిగిన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో బళ్లారి బెస్ట్ కళాశాల విద్యార్థులు సత్తాచాటి బీదర్ జిల్లా బసవ కల్యాణంలో జరిగే విభాగ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సుస్మిత మదన్‌కుమార్, ఐశ్వర్య, కావ్య, మహాలక్ష్మి, కుసమ, అర్చన, యామిని, హేమ తదితర విద్యార్థులు ఆంగ్ల, కన్నడ వ్యాసరచన, క్విజ్, జానపద నృత్యం తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచారు.

విభాగ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎలుగుబంటి దాడిలో పంచాయతీ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు

హొసపేటె, న్యూస్‌టుడే: పొలానికి వెళ్లి తిరిగొస్తున్న గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శివమూర్తి(38)పై ఎలుగుబంటి దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన ఆదివారం కూడ్లిగి తాలూకా కామయ్యనహట్టి వద్ద జరిగింది. సొంత పొలంలో పనులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి తిరిగివస్తుండగా రెండు పిల్లలతో కలిసి వచ్చిన ఎలుగు అతనిపై దాడిచేసింది. అరుపులు, కేకలు పెట్టడంతో ఇరుగుపొరుగు పొలాల వారు వచ్చి ఎలుగుల్ని అక్కడి నుంచి తరిమి కొట్టారు. గొంతు పైన తీవ్ర గాయాలైన ఆయనకు స్థానికంగా చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే కూడ్లిగి అటవీ, పోలీసుశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పదే పదే.. ఇదే మాట!

★ మరో మూణ్నెల్లో ఎన్.హెచ్-150ఎ సిద్ధం!

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఎన్.హెచ్.150ఎ రహదారి నిర్మాణ పనులు మరో మూడు నెలల్లో పూర్తి చేయిస్తామని ఇంజినీర్ల బృందం పేర్కొంది. సిరుగుప్ప పరిధిలోని ప్రధాన రహదారి జేవర్గి నుంచి చామరాజనగర్ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దడేసూగురు చిన్న బ్రిడ్జి నుంచి హాళేకోట మారెమ్మ ఆలయం వరకు సుమారు 15 కిలోమీటర్ల ఈ రహదారి నిర్మాణ పనులు హైదరాబాద్‌కు చెందిన ఆర్.ఎం.ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టింది. సుమారు రూ.72 కోట్లకు టెండర్ దక్కించుకుని జనవరి 2022లో పనులు ప్రారంభించింది. ఆగస్టు 31, 2025కి పూర్తి కావాల్సి ఉంది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యం, ఇంజినీర్ల పర్యవేక్షణా లోపం, ప్రజాప్రతినిధుల నిర్లిప్తతతో పనులు నత్త నడకన సాగుతూ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. దీంతో పట్టణ పరిధిలోను, ఇబ్రహింపుర గ్రామ పరిధిలో పనులు సాగక మట్టితో నిండి పోయి వర్షం వస్తే బురద, ఎండ కాస్తే దుమ్ము, ధూళితో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుంతలమయం కావడంతో ప్రమాదాలు షరా మామూలయ్యాయి. 40కు పైగా కేసులు నమోదయ్యాయి. ప్రజలు రహదారి నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని రాస్తారోకోలు చేపట్టినప్పుడల్లా ఎన్‌హెచ్ ఇంజినీర్లు వచ్చి మూణ్నెల్లో పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం.. తర్వాత యథాస్థితే కొనసాగుతోంది.

రహదారి నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఇంజినీర్లు

కొనసాగుతున్న తారు రోడ్డు పనులు

అధికారుల వివరణ

ఎన్‌హెచ్ ఇంజినీర్లు ఈఈ. సుందర వడివేలు, ఈఈ. వెంకట శేషాద్రి, ఏఈ. ప్రతాప్ నాయక్ బృందం ఆదివారం ఏపీఎంసీ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' పనులు ఎప్పుడు పూర్తి చేస్తారనే ప్రశ్నకు వారు బదులిస్తూ మొత్తం 15 కిలోమీటర్ల రహదారికి 9 కిలోమీటర్లు పూర్తయిందన్నారు. పట్టణ పరిధిలో 3.8 కిలోమీటర్ల నాలుగులైన్ల రహదారి పనులు.. బళ్లారి రహదారిలో వైష్ణవి హోటల్ నుంచి సింధనూరు రహదారిలో అంకాలి మఠం వరకు సీసీ రహదారి నిర్మాణానికి ఎన్.హెచ్. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపగా మంజూరు కాలేదు. డిసెంబరు చివరి నాటికి పట్టణ పరిధిలో ఒక వైపు పూర్తి చేస్తాం, మార్చి నాటికి పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణ పనులు చేస్తాం అని పేర్కొన్నారు.

(c) eenadu

ఘన వారసత్వం.. మన పర్యాటకం

● పెరుగుతున్న విదేశీ పర్యాటకులు

సోమేశ్వర దేవస్థానంలో నంది, శివలింగం

ఆలయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

హోయసల రాజుల రాజముద్రిక

దర్పణ సుందరి శిల్ప సోయగం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ జాబితాలో కర్ణాటకలోని హొయసల దేవస్థానాలు బేలూరు, హళేబీడు, సోమనాథపుర ఆలయాలకు చోటు దక్కడంతో పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. విదేశీ పర్యాటకుల సంఖ్య గతంతో పోలిస్తే మరింత ఎక్కువైనట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే పర్యాటకులకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రాచీన వారసత్వ సంపదను సంరక్షించేందుకు పురావస్తు శాఖ, పర్యాటక శాఖలు ప్రత్యేక కార్యాచరణ పథకాలను అమల్లోకి తెచ్చారు. దేశంలో యునెస్కో గుర్తించిన 42 వారసత్వ ప్రదేశాల్లో హొయసల రాజులు నిర్మించిన ఆలయాలూ ఉన్నాయి. హంపీ తరువాత ఈ ఆలయాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అధికారులు తెలిపారు.

● ప్రాచీన శిల్పకళలకు ప్రసిద్ధిగాంచిన బేలూరు, హళేబీడు హాసన జిల్లాలో ఉన్నాయి. అక్కడ ప్రసిద్ధి చెందిన చెన్నకేశవ ఆలయం ఉంది. హొయసల శైలిలో శిల్పకళకు ఈ ఆలయం ఒక నిదర్శనం. బేలూరును పూర్వం వేలాపుర అనే వారు. కాలక్రమంలో వేలూరుగా ఖ్యాతి పొందింది. అనంతరం బేలూరుగా మారింది. బేలూరు పట్టణం యగాచి నది ఒడ్డున ఉంది. బేలూరు హొయసల రాజుల రాజధాని. ఇక్కడి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న హళేబీడుకు రాజధానిని మార్చారు. అద్భుతమైన శిల్పకళతో ఆలయాలను నిర్మించారు. బేలూరులో వైష్ణవాలయాన్ని, హళేబీడులో శైవాలయాలను హొయసల రాజు విష్ణువర్ధనుడు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1117లో పడమటి చాళుక్యులపై విష్ణువర్ధనుడు విజయం సాధించిన చిహ్నంగా భక్తితో రెండు ఆలయాలను నిర్మించారు. ఆలయ సముదాయంలో కేశవాలయం దాని చుట్టూ రంగనాయకి, కప్పె చెన్నిగరాయ ఆలయాలు ఉన్నాయి. చెన్నకేశవాలయంలో నిత్యం పూజలు చేస్తారు. ఇక్కడ ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలు ఉన్నాయి. ఆలయం ప్రవేశద్వారం వద్ద హోయసల రాజుల రాజముద్ర కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని ద్రావిడ శైలిలో సబ్బురాతితో నిర్మించారు. తేలిక ఆకుపచ్చ రంగు కలిగిన సబ్బురాతిపై శిల్పాలను కళాకారులు అందంగా చెక్కారు. గోడల పైకప్పులపై వివిధ భంగిమల్లో నర్తకీమణుల శిల్పాలు, ద్వారపాలకుల శిల్పాలు, దర్పణసుందరి, భస్మమోహిని తదితర ఆకర్షణీయమైన శిల్ప సంపద పర్యాటకులను కట్టిపడేస్తుంది. ఆలయం బయట 42 అడుగుల ఎత్తు కలిగిన ధ్వజస్తంభం ఉంది. ఈ స్తంభం ఒకవైపు ఆధారంగా నిలిచి తాకి ఉండదు. మూడువైపులా స్తంభాలపై ధ్వజస్తంభం ఆధారపడి ఉంటుంది.

● సోమనాథపుర ఆలయం మైసూరు జిల్లాలో కావేరి నది ఒడ్డున ఉంది. హొయసల రాజు నరసింహ 1254లో ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర వెల్లడించింది. హొయసల శైలిలో నక్షత్రాకార స్తంభాల ఆధారంగా నిర్మించారు. ప్రతి గోడ, రాతిపై శిల్పాలను శిల్పాలను చెక్కారు. నర్తకీమణులు, వన్యజీవులు, వేటగాళ్లు, నృత్యకారిణి తదితర శిల్పాలు ఉన్నాయి. నిపుణులైన వారు ఏళ్ల తరబడి శిల్పాలు చెక్కి రాత్రి స్తంభాలకు అమర్చారు.

ముగిసిన అంతర్జాతీయ సెల్ థెరపీ సదస్సు

బెంగళూరు (క్రీడలు),న్యూస్‌టుడే: స్థానిక ఎంఎస్ రామయ్య స్మారక ఆస్పత్రి, వైడెన్‌వర్స్, వర్ల్డ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (డబ్ల్యూబీఎంటీ)ల సంయుక్తంగా అంతర్జాతీయ సెల్ థెరపీ సదస్సు ముగిసింది. మూలకణాల థెరపీ, కార్-టీ చికిత్సల ఆధునిక సాంకేతికతల ద్వారా మెరుగుపడ ఈ విధానాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చించారు. కర్ణాటక ఆరోగ్యశాఖ కమిషనర్ కె.బి.శివకుమార్ ఈ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ రక్త క్యాన్సర్లు, అనువంశిక ఆరోగ్య సమస్యలకు ఈ థెరపీలు ఉపయోగపడుతున్నా అన్ని దేశాలకు ఈ చికిత్సలు అందుబాటులో లేవన్నారు. భవిష్యత్తులో ఈ థెరపీలు క్యాన్సర్ కారక మూలాలను నివారిస్తాయన్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూబీఎంటీ అధ్యక్షుడు ఆచార్య దమియానో రొండె మాట్లాడుతూ అన్ని విభాగాల వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు ఒకే వేదికపై వచ్చి ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడం ఈ సదస్సు లక్ష్యమన్నారు. రామయ్య ఆస్పత్రి సీఈవో డా. నాగేంద్రస్వామి, ఆస్పత్రి వైద్య బృందం ఈ సదస్సులో పాల్గొంది.

సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ ప్రముఖులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: వేగంగా సంచరిస్తున్న ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో బీదర్‌కు చెందిన మల్లికార్జున(40), పవన్‌కుమార్(32) అనే వ్యక్తులు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం బీదర్ నగర శివార్లలో జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జనవాడ పోలీసు రాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తు ప్రారంభం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో కొందరు ఖైదీలు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంపై బయటకు వచ్చిన వీడియోలు ఆధారంగా జైలు అధికారులు తనిఖీలు చేపట్టారు. హత్య కేసులో నిందితుడు సినీనటుడు దర్శన్ అభిమాని దర్శన్ తదితరులను విచారిస్తున్నారు. వీడియోను తాను ఎవరికీ షేర్ చేయలేదని దర్శన్ విచారణలో తెలిపారు. రౌడీషీటర్ ఖురుసేమలను విచారించారు. కారాగారంలో ఖైదీలు పుట్టిన రోజు వేడుకలు, నృత్యం తదితర వాటిని కొందరు చరవాణిలో వీడియో తీసి బయటకు పంపించారు. అది కాస్త వైరల్ కావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

ఎనిమిది మంది అరెస్టు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: కొందరు నిందితులు పోలీసులు పేరుతో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను అపహరించి వారి బ్యాంకు ఖాతాల్లో రూ.18.90 లక్షల నగదు తమ ఖాతాల్లోకి జమ చేయించుకుని పరారైన ఎనిమిది మంది నిందితులను కోరమంగల పోలీసులు అరెస్టు చేశారు. కోలారు పోలీసు ఠాణా హెడ్‌కానిస్టేబుల్ ఉన్నారు. వారితోపాటు అపహరణకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చలపతి, భరత్, పవన్, ప్రసన్న, అతీక్, జబివుల్లా, మంజు, రాకేశ్‌లను అరెస్టు చేశారు. చలపతి హెడ్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నిందితులు రెండు కార్లలో అపహరించి మాలూరుకు తీసుకువెళ్లి ఓ ప్రైవేట్ కళాశాలలో బంధించారు. వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు తీసుకుని విడిచిపెట్టారు. అనంతరం బాధితులు కోరమంగల పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేశారు. కేసుదర్యాప్తులో ఉంది.

మత్తు మాత్రలు స్వాధీనం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: మత్తు మాత్రలను విక్రయిస్తున్నాడనే ఆరోపణపై ప్రేమ్(27) అనే వ్యక్తిని హైగ్రౌండ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.40 లక్షలు విలువైన 6700 మత్తు మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులోఉంది.

మద్దూరు మాజీ పురసభ అధ్యక్షుడి అరెస్టు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఓ ఇంట్లో జరిగిన దొంగతనం సంఘటనకు సంబంధించి మద్దూరు పురసభ మాజీ అధ్యక్షుడు ఎం.కె.మరిగౌడను మద్దూరు పోలీసులు అరెస్టు చేశారు. అతడు దొంగిలించిన రూ.15లక్షలు విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. గత ఆగస్టు 26న మద్దూరులోని దొడ్డబీదిలో నివసిస్తున్న గ్యాస్ చంద్రు ఇంట్లో నిందితుడు ముసుగు వేసుకుని ప్రవేశించి ఆయన భార్య సుశీలమ్మను బెదిరించి నగదు దోచుకుని పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అసలు నిందితుడిని అరెస్టు చేశారు.

దొంగకు కటకటాలు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు బెళగావి మహంతేశ్ నగరనివాసి సురేష్‌ను బెళగావి పోలీసులు అరెస్టుచేశారు. అతడినుంచి రూ.89.60 లక్షలు విలువైన 1,280 గ్రాముల బంగారు నగలు, రూ.1.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. బాలీవుడ్ సినిమాల ప్రేరణతో ఇప్పటి వరకు ఆరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో ఉంది.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	75
క్యారెట్-	70
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	95
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	60
టమాటా(సాధారణ)-	50
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	70
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

ఆమె సేవలు ..అనుపమానం

బ్యాంకు కొలువు.. అయిదంకెల జీతం.. చక్కగా సాగిపోతున్న ఆ జంట జీవితాన్ని ఓ వ్యాధి ఎలా అతలాకుతలం చేసింది.. పెద్దదిక్కు కోల్పోయి ఆమెపడ్డ వేదన..ఆపై సమాజసేవకు ఎలా కదిలిందో తెలిపే మానవీయ గాథ ఇది..

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: నేటి ప్రపంచంలో నేను, నాకు, నాది అంతే అనే స్వార్థపు వాతావరణంలో ఆరోగ్యదృష్టిలో ఇతరుల కోసం శ్రమించే వారు చాలా తక్కువ. ఓ మహిళ మాత్రం ఎన్నో కష్టాలను ఎదిరించి ధైర్యంగా నిలదొక్కుకొని నిలిచి సమాజసేవకు అంకితమై శభాష్ అన్పించుకున్నారు. జీవన చక్రంలో తనకు జరిగిన నష్టం ఇతరులకు కలగకూడదనే దృష్టితో ఆరోగ్య జాగృతి కల్పించేందుకు కంకణం కట్టిన ఆ అమ్మాయే అనుపమా గాడిచెర్ల. లయన్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ - మెంటల్‌హెల్త్‌గా పనిచేస్తున్న అనుపమా జీవితంలో తాను అనుభవించిన కష్ట, నష్టాలను మరిచేందుకు సమాజసేవలో మమేకమయ్యారు. తాను ఎదుర్కొన్న కష్టాలు, బాధలతో ఆమె ఎలా సేవకు ఉపక్రమించారో తెలుసుకుందామా. ఈ కష్టాలకు ప్రధాన కారణం ఆమె భర్త సురేష్‌బాబు మతిమరుపు(డిమెన్షియా) వ్యాధికి గురై మృతి చెందడమే. ఈ వ్యాధికి గురై సురేష్‌బాబు పడ్డ కష్టాలు ఎవరికీ రాకూడదంటారామె. కడప జిల్లాకు చెందిన అనుపమా ఉద్యోగరీతిలో ఉద్యాననగరానికి వచ్చాక బ్యాంకు ఉద్యోగి సురేష్‌బాబుతో వివాహమైం. ఒక కుమార్తె జన్మించింది. ఎన్నో ఆశలతో చక్కని జీవితాన్ని గడుపుతున్న అనుపమా కుటుంబంలో చేదు సంఘటన చోటుచేసుకొంది. అనుకోకుండా భర్త సురేష్‌బాబు ప్రవర్తనలో మార్పులు కనిపించింది. ఎంతో మంది వైద్యులకు చూపినా ప్రయోజనం లేకపోయింది. రోజు రోజుకు క్షీణిస్తున్న ఇతని ఆరోగ్యాన్ని పరిశీలించిన వైద్యులు ఎట్టకేలకు ఇతనికి డిమెన్షియా అని నిర్ణయించారు. ఈ దశలో ఉద్యోగానికి రాజీనామా చేసే పరిస్థితి నెలకొంది. చిన్నపాప తల్లీ కూతుళ్లకు డిమెన్షియా అంటే తెలియదు. కుమార్తె భవిష్యత్తు ఒకవైపు, ఇంటి యజమాని వ్యాధితో ఉద్యోగం పోయింది. ఆదాయం లేదు. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న అనుపమా ఇంట్లో సురేష్‌బాబును చూసుకోలేని పరిస్థితి. ఈ దశలో రెసిడెన్షియల్ హోంకు చేర్పించింది. ఏడేళ్ల పాటు తన భర్తకు ఆకలి, నిద్ర, దాహం అనేది తెలియదు. తాను ఎక్కడున్నాడో, ఏమైందని కూడా తెలియదు. నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. చక్కగా ఉన్న సురేష్ బాబు ఈ వ్యాధితో చివరికి మృత్యుఒడికి చేరుకున్నాడు. అదే సమయంలో ఆమె పనిచేసే సంస్థలో తలెత్తిన సమస్యలతో ఉద్యోగమూ పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దృఢ చిత్తంతో భర్తకు వచ్చిన వ్యాధిపై ఎమ్మెస్సీ డిమెన్షియా స్టడీస్ కోర్సును అభ్యసించాలని సంకల్పించారు. ప్రపంచ అల్జీమర్స్ దినాచరణ సందర్భంగా 2019 నుంచి ఏటా వాక్‌థాన్ జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో ఈవ్యాధి గురించి అవగాహన కల్పించే కార్యక్రమన్ని చేపట్టారు. సొంత ఖర్చుతో కళాశాల విద్యార్థులతో కలిసి వాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నారు. తాను పడ్డ కష్టాల నుంచి మెల్లమెల్లగా కోలుకున్న అనుపమ ఇప్పటివరకు దాదాపుగా 15వేల మందికి ఈ వ్యాధిపై జాగృతి కల్పించడం విశేషం. అనాథాశ్రమాలకు వెళ్లి వారికి ఔషధాలు, భోజన ఏర్పాట్లు కల్పించి తన వంతు సాయం చేస్తున్నారు. ఆమె సేవలకు అనేక సంఘ సంస్థలు మెచ్చి సత్కరించి ప్రోత్సహిస్తున్నాయి.

బీఎన్ఎం ఇన్‌స్టిట్యూట్‌లో అనుపమాకు సత్కారం

అల్జీమర్స్ వాక్‌థాన్ జాగృతి ప్రారంభం కార్యక్రమంలో అనుపమా, తదితరులు

పాత్రికేయుల సమస్యలు పరిష్కరిస్తాం

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రాష్ట్రంలో సీనియర్ పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారికి నెలవారి పింఛన్ మంజూరులో ఉన్న కఠిన షరతులను తొలగించి పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కె.వి.ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదివారం ఇక్కడ బెంగళూరు ప్రెస్ క్లబ్‌లో భారతీయ సీనియర్ పాత్రికేయుల సమాఖ్య, కర్ణాటక సీనియర్ పాత్రికేయుల వేదిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో చర్చించి అమల్లో ఉన్న కఠిన షరతులను సవరించి అందరికీ పింఛన్ దొరికే విధంగా చర్య తీసుకుంటామన్నారు. పాత్రికేయుల కూడా ఆరోగ్య వైద్య సౌకర్యం కల్పించేందుకు సంజీవని పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు. వేదిక అధ్యక్షుడు ఆర్.పి.సాంబసదాశివా రెడ్డి, ఎస్‌జేఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఎన్.పి.చెక్కుటి, ఉపాధ్యక్షుడు ఆనందమ్ పులిపలుపుల, కార్యదర్శులు శాంతాకుమారి, కేపీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారుడు కేవీప్రభాకర్ తదితరులు

నియమాలు చెప్తే..ఉచితంగా శిరస్త్రాణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: రహదారి నియమాల జాగృతి వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ అనేక నూతన కార్యక్రమాలు చేపట్టినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం హిరియూరు రూరల్ పోలీసు ఠాణా అధికారులు ఉప్పారహట్టి వద్ద రహదారి నియమాల క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని సరైన జవాబు ఇచ్చిన వారికి ఉచితంగా శిరస్త్రాణాలు అందజేశారు. ప్రజలలో శిరస్త్రాణాలు ధరించడం వల్ల కలిగే ఉపయోగాలు, ధరించకపోతే జరిగే నష్టాలను గురించి అవగాహన పెంపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆనంద్

సీఎం పదవికి పరమేశ్వర్ అర్హుడు

బెంగళూరు(యశ్వంతపుర): ముఖ్యమంత్రి అయ్యే అన్ని అర్హతలు హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్‌కు ఉన్నాయని కర్ణాటక మురికివాడల నిర్మూలన మండలి అధ్యక్షుడు, హుబ్బళ్లి శాసన సభ్యుడు ప్రసాద్‌అబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయనను హుబ్బళ్లిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు ఎమ్మెల్సీ డాక్టర్ యాతీంద్ర సిద్ధరామయ్యతో కలిసి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య విలేకర్లతో మాట్లాడారు. డాక్టర్ పరమేశ్వర్ ముఖ్యమంత్రి కావాలని ఆశించడంలో తప్పు లేదన్నారు. నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్ఠానం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా బాగా పని చేస్తున్నారని, మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ పార్టీ అధిష్ఠానంతో చర్చించాలని తెలిపారు. మూడుసార్లు గెలిచిన తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలియజేశారు.

ఇద్దరు చోరులకు అరదండాలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకొన్న పోలీసులు నిందితుల వద్ద నుంచి సుమారు రూ.5.50 లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకొన్నట్లు డివైఎస్పీ సత్యనారాయణరావు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిందితులను జగన్నాథ్, భీమానాయక్‌గా గుర్తించారు. గత నెల 23న మధ్యాహ్నం పట్టణంలోని ఉపాసీనగర్‌లో నివాసముంటున్న అగ్నిమాపక దళం విశ్రాంత ఉద్యోగి జయణ్ణ ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.7 లక్షల విలువ చేసే 73 గ్రాముల బంగారు నగలు, రూ. 20 వేల నగదును దోచుకొని పరారయ్యారు. పరారీలో ఉన్న మరో నిందితుడు శ్రీనాథరెడ్డి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

హంపీ చక్రతీర్థ కోదండరామాలయం మార్గంలో ముళ్లపొదలను తొలగిస్తూ శుభ్రత పనులు చేస్తున్న విద్యార్థులు

సాలుమంటపం వద్ద శ్రమదానం చేసిన విద్యార్థులు, పురావస్తుశాఖ సిబ్బంది

వారసత్వ పరిరక్షణ సమష్టి బాధ్యత

హొసపేటె, న్యూస్‌టుడే: మన వారసత్వాన్ని పరిరక్షించడం సమష్టి బాధ్యత, రాబోయే తరానికి వాటిని మిగలాల్సి ఉందని రాష్ట్ర పురావస్తుశాఖ సంచాలకుడు డాక్టర్ ఆర్.శేజేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పురావస్తుశాఖ, ఓ ప్రైవేటు పాఠశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2025 నేపథ్యంలో ఆదివారం హంపీ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరుబయలు పర్యాటక క్షేత్రం హంపీలాంటి శిల్పకళా కాణాచి మరెక్కడా మనకు కనిపించదు. అడుగడుగునా గుడులు, గోపురాలు, స్మారకాలు, మండపాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అపురూప స్మారకాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని గుర్తుచేశారు. హంపీ చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ప్రాథమిక దశలోనే విద్యార్థులు చదవాలని సూచించారు. ఈ సందర్భంగా తుంగభద్ర నదీతీరం, చక్రతీర్థ కోదండరామాలయం, సాలు మంటపాల్లో శ్రమదానం ద్వారా స్వచ్ఛత పనులు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనన్య ప్రసాద్, సహాయక పురావస్తు అధికారి డాక్టర్ మంజునాయక్, హంపీ ట్రాఫిక్ ఎస్సై శివకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన మేయర్

డి.కె.శివకుమార్‌ను సన్మానిస్తున్న బళ్లారి మేయర్ పూజారి గాదెప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె మేయర్ పూజారి గాదెప్ప నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు బెంగళూరులో ఉన్న ఉపముఖ్యమంత్రి, కె.పి.సి.సి అధ్యక్షుడు డి.కె.శివకుమార్‌ను ఆదివారం కలిసి సన్మానించారు. సోమవారం మేయర్‌గా పూజారి గాదెప్ప బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముందు రోజు ఉపముఖ్యమంత్రి తదితరులను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

భారతిటీచర్ ఏళెనే తరగతి టీజర్ విడుదల

ఏడోతరగతి విద్యార్థిని ఉపాధ్యాయురాలు కావాలని కన్నకలను ఏవిధంగా తీర్చుకుంటుందనే సామాజిక కథ ఆధారంగా నిర్మిస్తున్న 'భారతి టీచర్ ఏళెనె తరగతి' చిత్రం టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. సామాజిక సమస్యలతో కూడిన చిత్రం టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు ఎం.ఎల్.ప్రసన్న తెలిపారు. కన్నడ భాష ప్రాధాన్యతను గురించి బాబా కన్నడిగ అనే పాటను చిత్రబృందం విడుదల చేశారు. కన్నడ ఉద్యమకారుడు రోహిత్ రాఘవేంద్ర హీరోగా, సిహికహి చంద్రు, యశికా, గోవిందగౌడ, అశ్విన్ హసన్, దివ్యాఅంచన్, బెనకా నంజప్ప, సౌజన్యసునిల్‌తో పాటు కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ ప్రత్యేక పాత్ర నటిస్తున్నారు. డిసెంబరులో విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

భారతిఏళెనే తరగతి చిత్రం టీజర్‌ను విడుదలలో చిత్రబృందం

చిత్రంలో నటరాజ్ హొన్నవళ్లి, సుమతి, నిశాంత్ తదితరులు

నడుబెట్టు అప్పణ్ణ సిద్ధం

అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామీణులు పడే సమస్యలను బయట ప్రపంచానికి తెచ్చే విధానంగా నిర్మిస్తున్న 'నడుబెట్టు అప్పణ్ణ' చిత్రం సిద్ధమైంది. విడుదల కాకముందే కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై సినీ మేధావులు ప్రశంసలు పొందినట్లు దర్శకురాలు అనుపమ శరధి తెలిపారు. కనీస సౌకర్యాలకు దూరమైన గ్రామంలో నివసిస్తున్న ప్రజలు పడే బాధలను తెరపైకి ఎక్కించారు. పంటలపై వన్యజీవుల దాడులతో ప్రజలు పడే కష్టాలను చిత్రీకరించినట్లు ఆమె తెలిపారు. నటరాజ్ హొన్నవళ్లి, సుమతి, నిశాంత్, జగన్నాథ్, భవానిశంకర్, అడూరు బాలకృష్ణ కాసరగూడు, జీవన్‌సుళ్య తదితరులు నటిస్తున్నారు. కుమార్ ఈశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

రుధ చిత్రీకరణ షురూ

మహిళ ప్రధానమైన చిత్రం 'రుధ' చిత్రీకరణ ఇటీవల సంజయనగరలో ఉన్న రాఘవేంద్ర స్వామి బృందావనంలో ప్రారంభమైంది. తొలి దృశ్యానికి నటి అనుప్రభాకర్ క్లాప్ ఇచ్చారు. కేపీజీ విషన్స్ బ్యానర్‌పై పుట్టరాజు నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో కేరళలో జరిగిన సంఘటన ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు శరత్ శిడ్లఘట్ట తెలిపారు. వరలక్ష్మీ, మానసగౌడ తదితరులతోపాటు రంగభూమి కళాకారులు నటిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణ కొనసాగిస్తారు.

రుధ చిత్రం చిత్రీకరణ ప్రారంభంలో నటులు

27న రానున్న బ్యాంక్‌ఆఫ్ భాగ్యలక్ష్మీ

విభిన్నమైన కథ చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మీ' చిత్రం ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. కుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చి చిత్రాన్ని తిలకించే విధంగా నిర్మించినట్లు దర్శకుడు అభిషేక్ తెలిపారు. హాస్యం, ప్రేమ, థ్రిల్లర్ కూడిన కథ చిత్రమన్నారు. దీక్షిత్‌శెట్టి, బృందా ఆచార్య తదితరులు నటిస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్‌భాగ్యలక్ష్మీ చిత్రంలో దీక్షిత్‌శెట్టి, బృందా ఆచార్య

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

(c) eenadu

కన్నడిగులూ..మాతృభాషను మరువద్దు

ఎమ్మెల్యే మునిరాజును సత్కరిస్తున్న సురేష్, నిర్వాహకులు

బెంగళూరు (బ్యాటరాయనపుర), న్యూస్‌టుడే : కన్నడిగులు ఇళ్లలో పిల్లలతో కన్నడభాషలో మాట్లాడాలని దాసరహళ్లి ఎమ్మెల్యే ఎస్.మునిరాజు తెలిపారు. ఆదివారం శెట్టిహళ్లి వార్డులోనే చొక్కసంద్రలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవంలో ఎమ్మెల్యే భువనేశ్వరికి పూజలు చేసి మాట్లాడారు. మాతృభాషను మర్చిపోకుండా పరాయిభాషను గౌరవిస్తూ భాషాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సోమశేఖర్, బి.సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అట్టహాసంగా కన్నడ రాజ్యోత్సవం

కర్ణాటకలో నివసిస్తున్న అన్యభాష ప్రజలు తప్పనిసరిగా కన్నడభాషను నేర్చుకోవాలని ఇండో ఏషియన్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ టి.ఏకాంబరం నాయుడు తెలిపారు. నగరంలోని కల్యాణనగరలో ఉన్న అకాడమీ విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కన్నడ భాష నేర్చుకోవడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతులను గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కన్నడ పాటలకు నృత్యం చేశారు. ఆచార్య చంద్రశేఖర్, అధ్యాపకులు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, బెంగళూరు (బాణసవాడి)

హోసూరు కబుర్లు

విశ్వశాంతి కోసం హోమాలు

హోమంలో వేద పండితులు, మహిళా భక్తులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-డెంకణీకోట రహదారిలోని నాగొండపల్లి గ్రామంలో వీరభద్రస్వామి ఆలయ మూడో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మఠాధీశులు భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మరిస్వామిగౌడ, బసమ్మణ్ణి కుటుంబ సభ్యులు, చెన్నేన అగ్రహారం, చిన్నబేళగొండపల్లి, తదితర గ్రామస్థుల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం కోలారు జిల్లా సింగహళ్లి వేద పండితులు నీలకంఠశాస్త్రి బృందం, ఆలయ అర్చకులు హరీష్ ఆధ్వర్యంలో హోమాలు చేశారు. హోసూరు సమీపం శైవక్షేత్రం గుమ్మళాపురం సంస్థానం మఠాధీశుడు డాక్టర్ శివానంద శివాచార్య స్వామీజీ, హోసూరుల శ్రీకైవార నారేయణ తాతాశ్రమ పీఠాధిపతి వెంకటేశ్వరస్వాములు, మఠాధీశులు, ఆలయం వ్యవస్థాపకులు ఎన్.ఎం.భద్రేగౌడు, బి.మంజునాథ, మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, బాగలూరు రవికుమార్, భాజపా నాయకుడు నాగునాగేంద్ర, శ్రీనివాసరెడి, నాగొండపల్లి రామకోటి రామణ్ణ, ఆర్.సదాశివయ్య, కృష్ణప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి

సాయిబాబా ప్రతిమ వద్ద వాలంటీర్లు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే : డెంకణీకోట కెలమంగలం ప్రాథమిక పాఠశాల వద్ద సాయిబాబా ఆలయంలో సత్యసాయి బాబా శతజయంతిని వైభవంగా నిర్వహించారు. వేదపారాయణం, సత్యసాయి జండా అవిష్కరణ, గణపతి, గాయత్రి, వాస్తు నవగ్రహ హోమాలు చేశారు. సాయిబాబా విగ్రహాన్ని తేరులో ఉంచి పట్టణ ముఖ్య వీధుల్లో ఊరేగించారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

రహదారికి తారు వేయండి మహాప్రభో..

వానియర్ వీధి దారి దుస్థితి

శూలగిరి, (బేరికె), న్యూస్‌టుడే : నిత్యం ప్రజలు సంచరించే రహదారి అధ్వానంగా తయారైంది. పట్టించుకునే నాయకులు, అధికారులు కరువయారని ప్రజలు వాపోయారు. కొత్తగా తాలూకా కేంద్రంగా ఏర్పడిన శూలగిరి వానియర్ వీధి రహదారి కంకరతేలి గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రజల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాలూకా కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు రోడ్డు దుస్థితి చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత బీడీవో అధికారులు, నాయకులు చర్యలు తీసుకొని తారురోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారుల పనుల నాణ్యతపై దృష్టి

సిమెంట్ పనుల నాణ్యత చూస్తున్న ఇంజినీర్లు

తారు పనులను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : నగర రహదారులు గుంతలు పూడ్చివేత పనులు, సిమెంట్ పనుల్లో నాణ్యతపై గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) అధికారులు దృష్టి సారించారు. పనులు సాగుతున్న ప్రాంతాల్లో ఇంజినీరింగ్ నిపుణులు, సాంకేతిక నిపుణులు తారుకంకర మిశ్రమం, సిమెంట్ కంకర మిశ్రమాన్ని ఆధునిక పరికరాల ద్వారా పరీక్షలు చేపట్టారు. నగరంలో ఇప్పటి వరకు 20 వేల గుంతలను పూడ్చారు. ఇంకా మూడు వేలకు పైగా గుంతలను పూడ్చాలని అంచనా వేశారు. పూడ్చిన గుంత వద్ద మళ్లీ గుంతలు పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. చేసిన పనుల్లో నాణ్యత లేక పోవడమే అందుకు కారణమని అధికారులు గుర్తించారు. పనులు జరుగుతున్న ప్రదేశాలకు నాణ్యత సాంకేతిక నిపుణులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నారు. పనుల నాణ్యత పరిశీలించేందుకు ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. పనులకు ఉపయోగించే సిమెంట్, ఇసుక, కంకర నాణ్యతతో పాటు తారును పరిశీలిస్తున్నారు. గుంతలు పూడ్చివేతతో పాటు సిమెంట్ రహదారుల నాణ్యతపై దృష్టిసారించారు. నాసిరకం సిమెంట్ వినియోగిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఇంజినీరింగ్ నిపుణులు రంగంలోకి దిగారు. వివిధ ప్రాంతాల్లో సాగుతున్న సిమెంట్‌దారులను పూర్తిస్థాయిలో నాణ్యత పరిశీలించారు. నాణ్యతకు ప్రాధాన్యమివ్వకపోతే సంబంధించిన గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాధికార చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు హెచ్చరించారు.

ఆకాశాన్నంటిన టమాటా ధరలు

ఎన్.వడ్డహళ్లి మార్కెట్‌లో టమాటా నిల్వలు

ముళబాగిలు, న్యూస్‌టుడే : గత కొన్నాళ్లుగా రైతులకు కన్నీళ్లు తెప్పించిన టమాటా ధరలు అమాంతం పెరిగాయి. ఈనెల మూడో వారం ప్రారంభం నుంచి రోజూ పెరుగుతూనే ఉంది. అధిక వర్షాల కారణంగా పంట దిగుబడులు లేక సరకు తగ్గిన నేపథ్యంలో ధరలు పెరిగినప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. కుప్పలు తెప్పలుగా మార్కెట్‌కు తెచ్చే రోజుల్లో ధరలు చాలా తక్కువగా ఉంటాయి. సరకు తగ్గితే ధరలు ఆకాశాన్నంటుతాయి. ముళబాగిలు తాలూకా ఎన్.వడ్డహళ్లి మార్కెట్‌లో 15 కిలోల బాక్స్ ఆదివారం రూ.750 పలికింది. చిన్న మార్కెట్లలో ఈ ధరలు మరీ అధికంగా ఉంటాయి. ఈ సరకు ఇళ్లకు చేరేలోపు కిలో రూ.60 నుంచి రూ.70 ఉంటోంది. కోలారు జిల్లాలోని అన్ని టమాటా మార్కెట్లలో ధరలు పెరిగాయి. స్థానికంగా పంట దిగుబడులు తగ్గడం.. ఇప్పుడు సీజన్ నడుస్తున్న ఉత్తరాది రాష్ట్రాలు చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక దావణగెరె ప్రాంతాల్లో వర్షాల కారణంగా టమాటాకు తెగుళ్లు సోకి దిగుబడి భారీగా తగ్గింది. బయటి రాష్ట్రాల వ్యాపారులు ఎక్కడ సరకు ఉంటే అక్కడికెళ్లి పోటీ పడి కొనుగోలు చేయడంతో ధరలు పెరగడానికి ప్రధాన కారణం.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

పూజలు చేస్తున్న స్వామీజీ, ఎమ్మెల్యేలు, ప్రతినిధులు

తుమకూరు, న్యూస్‌టుడే : సిద్ధగంగామఠం శివకుమార స్వామీజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం సిద్ధలింగస్వామీజీ, ఎమ్మెల్యేలు సురేశ్‌గౌడ, జ్యోతిగణేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వస్తు ప్రదర్శన స్థలంలో కోటి రూపాయల వ్యయంతో అమృతరాయితో రూపొందించిన ఎనిమిది అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. విగ్రహ నిర్మాణంతో పాటు ఉద్యానవనాన్ని అత్యంత సుందరంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామన్నారు. దీనికి కావలసిన నిధులను మఠం పూర్వ విద్యార్థి వెంకటేగౌడ శ్రమ ఉందన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మఠానికి వందేళ్ల చరిత్ర ఉందని, పేద విద్యార్థులను విద్యాదానం చేస్తూ ప్రపంచ ఖ్యాతిగాంచిందన్నారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షల చొప్పుల ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖులు నాగణ్ణ, వెంకటేగౌడ, విశ్వనాథయ్య, గంగాధరయ్య, రేణుకయ్య పాల్గొన్నారు.

ముగిసిన కేజీఎఫ్ క్రీడా పోటీలు

విజేతలతో లాభూరామ్, శివాంశు రాజ్‌పుత్ తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఏడాదికోసారి నిర్వహించే పోలీసు క్రీడా పోటీలు పండగ వాతావరణంగా సాగాయని ఐజీపీ లాభూరామ్ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కేజీఎఫ్ పోలీసు జిల్లా వార్షిక క్రీడా పోటీలు ముగిశాయి. విజేతలకు ముఖ్య అతిథి లాభూరామ్ బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. కర్తవ్య నిర్వహణలో ఒత్తిళ్ల మధ్య ఉన్న పోలీసులకు వినోదంగా క్రీడోల్లాసం, పరస్పర స్నేహ బాంధవ్యానికి క్రీడలు ఉపకరిస్తాయన్నారు. శివాంశురాజ్‌పుత్ మాట్లాడుతూ పోలీసులు మనోవికాసం కోసం ఏడాదికి ఒకసారి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అత్యుత్తమ పారితోషికాన్ని బేతమంగల సర్కిల్ జట్టు అందుకుంది. కార్యక్రమంలో డీఎస్పీ వి.లక్ష్మయ్య, ఆర్‌పీఐ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి'

చిత్రపటం వద్ద స్వామీజీలు, రాజు తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : యువ సముదాయం చెడు గుణాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని నిరంజనానందపురి స్వామీజీ సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉంటే చక్కని సమాజం నిర్మాణం చేసేందుకు సాధ్యమన్నారు. ఆదివారం ఇక్కడి విజయనగరలోని కాసియా భవనంలో కనక విద్యాట్రస్టు, విజయనగర ఆసుపత్రి సహకారంతో భక్త కనకదాసుల జయంత్యుత్సవాలు నిర్వహించారు. ప్రతిభావంత విద్యార్థులకు ఉపకార వేతనాలను స్వామీజీ ప్రదానం చేశారు. ఈశ్వరానందపురి స్వామీజీ, సాహితీవేత్త ఎస్.జి.సిద్ధరామయ్య, ట్రస్టు అధ్యక్షుడు ఎస్.రాజు తదితర ప్రముఖులు కనకదాసుల చిత్రపటానికి పూలు సమర్పించారు. 700 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు విజయలక్ష్మీ, డి.ఆర్.పద్మనాభ, మంజప్ప, శ్రేయస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన

చిత్రాలను తిలకిస్తున్న మహిళలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని ఎంజీ రోడ్డులో ఉన్న రంగోలి మెట్రో కళా కేంద్రంలో ఆదివారం ఆర్ట్ మ్యాటర్, రంగోలిమెట్రో కర్ణాటక కళా కేంద్రం ఆధ్వర్యంలో వివిధ పోటీలతో పాటు చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. జానపద గీతాలు, నృత్యం, భగవద్గీత, రంగోలి తదితర పోటీలను నిర్వహించారు. పోటీలకు విద్యార్థులు, యువతి యువకులు హాజరయ్యారు. సాంస్కృతిక, చిత్రలేఖనం పోటీలకు ఎక్కువ సంఖ్యలో యువతులు హాజరై చిత్రాలను గీసి ప్రతిభ చూపించారు. విద్యార్థులు జానపదగీతాలకు నృత్యం చేశారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు మెట్రో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

వాలంటీర్లతో స్వచ్ఛతా అభియాన్

తుమకూరులోని రైల్వేస్టేషన్‌లో సాగుతున్న స్వచ్ఛతా సేవలు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు రైల్వేస్టేషన్, ఆసుపత్రి ఆవరణంలో ఎన్‌సీసీ వాలంటీర్లు స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. ఎన్‌సీసీ 4వ కర్ణాటక బెటాలియన్ ఆధ్వర్యంలో పులు సాగుతున్నాయి. ఈ అభియాన్‌లో 300 మంది వాలంటీర్లు, 14మంది అధికారులు పాల్గొన్నారు. రైల్వే రైల్వేపట్టాలపై ఉన్న చెత్త తీసి శుభ్రం చేయడంతో పాటు ప్రయాణికులు, ప్రజలకు స్వచ్ఛతపై జాగృతి కల్పించారు. బెంగళూరు జోన్ రైల్వే మండలి డైరెక్టర్ ధనియాకుమార్, సుబేదార్ మేజర్ దినేష్‌సింగ్ యోగీష్, ఎస్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రసిద్ధి చెందిన కౌండిన్య నది

ముళబాగిలు తాలూకా కురుడుమలె గ్రామ కొండలో ఉద్భవించే కౌండిన్య నది ప్రసిద్ధి చెందింది. కౌండిన్య అనే రుషి కురుడుమలె కొండపై తపస్సు చేసినందున అక్కడ ఉద్భవించే నదికి కౌండిన్య నది అని పేరు పెట్టారని చరిత్రకారుడు ఆచార్య కె.ఆర్.నరసింహన్ చెప్పారు. ఈ రాష్ట్ర ప్రజలకు దీని గురించి పెద్దగా తెలియదు. వర్షాకాలంలో గ్రామానికి తూర్పున లోతట్టు ప్రాంతాల గుండా ప్రవహిస్తుంది. రాష్ట్రంలోని సరస్సులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని పలమనేరు ప్రాంతాల్లో సరస్సులను నింపి అనంతరం తమిళనాడు ప్రాంతంలో ప్రవహిస్తుంది. పలమనేరు తాగునీటి ప్రాజెక్టు, అటవీశాఖ ప్రాజెక్టులకు కౌండిన్య పేరు పెట్టి ఆయనను స్మరించుకుంటున్నారు. – న్యూస్‌టుడే, ముళబాగిలు

సామాజిక సేవకుడికి రాజ్యోత్సవ పురస్కారం

ప్రముఖుల నుంచి పురస్కారం స్వీకరిస్తున్న శంకర్, తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర) : కర్ణాటక బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీహెచ్ శంకర్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి రాజ్యోత్సవ రత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ భారతీయ విద్యాభవన్‌లో ఫిగర్ మీడియా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి రాణీసతీశ్ తదితరులు కలిసి ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. నగరంలోని మురికివాడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్పందించడంతో పాటు పరిష్కారించేందుకు డాక్టర్ జీహెచ్ శంకర్ నిత్యం శ్రమిస్తున్నారని రాణీసతీశ్ తెలిపారు. మురికివాడల ప్రజలు నివశించే ఇళ్లకు భూహక్కు, తాగునీరు, విద్యుత్తు సరఫరా తదితర మౌలిక సౌకర్యాలను పోరాడి సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ బలిబీర్‌సింగ్ బేడీ, రేవతి కామత్ తదితరులు పాల్గొన్నారు.

భాషాభివృద్ధికి కృషి చేయాలి

జెండా ఎగురవేస్తున్న నాగభూషణం, తదితరులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : కన్నడిగులు భాషాభివృద్ధికి కృషిచేయాలని విద్యాసమితి మాజీ అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. అబ్బిగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన భువనేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి, కన్నడ జెండాను ఎగురవేశారు. అనేక రాష్ట్రాల్లో కన్నడిగులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కన్నడ సేన అధ్యక్షుడు జేమ్స్, ప్రతినిధులు విశ్వనాథ్, రాజణ్ణ, కె.సి.వెంకటేష్, అభిమానులు పాల్గొన్నారు.

విజయవంతంగా భగవద్గీత పోటీలు

పోటీలో పాల్గొన్న పిల్లలు, పెద్దలు.

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఏటా గీతాజయంతి సందర్భంగా నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ గీతా జయంతి మహోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బాలలు, విద్యార్థులు, పెద్దలకు భగవద్గీత పోటీలను నిర్వహిస్తూ వస్తోంది. ఆదివారం భగవద్గీత శ్లోకాల పోటీలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ సంచాలకుడు, తితిదే అధికారి డి.పి.భుజంగరావు పోటీలకు వచ్చిన వారిని ప్రోత్సహిస్తూ..న్యాయ నిర్ణేతలను పరిచయం చేశారు. విజేతలకు డిసెంబరు 1న బహుమతులు ప్రదానం చేస్తారు.

రూ.9.30 లక్షల సొత్తు స్వాధీనం

బెంగళూరు (యశ్వంతపుర) : ఇంటి తలుపులను పగలుకొట్టి చోరీ చేసి పరారైన నిందితుడిని వైట్‌ఫీల్డ్ పోలీసులు అరెస్టు చేసి లక్ష రూపాయలు నగదుతో పాటు రూ.9.30 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టందూరు అగ్రహారలో దొంగతనం జరిగిన గంటలోగా నిందితుడు మంజునాథ్‌ను అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును వశపరుచుకున్నారు.

దేహదారుఢ్య పోటీ విజేతగా జ్యోష్ణా

కిరీటం, జ్ఞాపికలతో జ్యోష్ణా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఆస్ట్రేలియాకు చెందిన ఐ కాంపీట్ నేచురల్ సమాఖ్య దుబాయ్‌లో నిర్వహించిన దేహదారుఢ్య, ఫిట్నెస్ ఏంజిల్ విభాగంలో నగరానికి చెందిన 48 ఏళ్ల జ్యోష్ణా వెంకటేశ్‌నాయుడు బంగారు పతకాన్ని సాధించింది. ఏంజల్ కిరీటాన్ని సొంతం చేసుకున్న భారత తొలి మహిళగా ప్రఖ్యాతి గాంచింది. ప్రతిష్ఠాత్మకమైన పోటీలో భారత రాయబారిగా స్వర్ణపతకాన్ని సాధించి ఇతర మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. వ్యాపారవేత్త అయిన ఈమెకు 22 ఏళ్ల కుమార్తె ఉంది. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జ్యోష్ణా తన అనుభూతిని పంచుకున్నారు. 27 దేశాల నుంచి ఆరు వందల మంది వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. భారత తరపున పాల్గొని కిరీటాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

కలర్ థెరఫీ శిబిరానికి చక్కని స్పందన

శిబిరాన్ని ప్రారంభిస్తున్న గీతారుక్మిణీ, తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ప్రాచీన ఈజిప్ట్ కాలం నుంచి రంగుల చికిత్స వాడుకలో ఉందని, కొన్ని రంగులు మన మనఃస్థితిపై ప్రభావాన్ని చూపుతాయని సీనియర్ శిక్షకురాలు గీతా రుక్మిణీ తెలిపారు. రాజరాజేశ్వరి నగరంలోని యోగా సాంస్కృతిక అకాడమీ, బసవ అక్యూ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కలర్ థెరఫీ చికిత్స శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానసిక, దైహిక ఆరోగ్య పరిస్థితులు, పలు వ్యాధులను రంగులు, వెలుగు చికిత్సలతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అనురాధా యోగా అకాడమీ, అధ్యక్షుడు బి.కె.రమేష్, యోగా శిక్షకురాలు బి.వి.శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : నగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఆడుగోడి పోలీసుఠాణా పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చామరాజపేట నివాసి గోపాలకృష్ణ (70) మృతి చెందారు. తెల్లవారుజామున రహదారి పక్కన నిలిపిన క్రేన్‌కు ఆటో వచ్చి ఢీకొనటంతో డ్రైవర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

● ఎలక్ట్రానిక్ సిటీ పోలీసుఠాణా పరిధిలో ఓమ్నీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో బిహార్ నివాసి సోనుకుమార్ (26) మృతి చెందారు. రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆసంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఓమ్నీ బస్సు డ్రైవర్‌ను అరెస్టుచేసి దర్యాప్తు చేపట్టారు.

దోపిడీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ద్విచక్రవాహనాలపై సంచరిస్తున్న వ్యక్తులను అడ్డగించి నగదు, నగలు దోచుకుని పరారవుతున్న నిందితులు ఆడుగోడి నివాసులు విక్రమ్(19), సరవణ (20) సూర్య (19)లను విల్సన్‌గార్డన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు చరవాణులు, బంగారు గొలుసు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ తిప్పేస్వామి (35) శనివారం రాత్రి మద్యం మత్తులో ఆటో నడుపుతుండగా..ట్రాఫిక్ పోలీసులు అడ్డగించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నమోదు చేస్తుండగా ఆటోను వదిలేసి పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కూడలి వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వావాదానికి దిగి సీసాలోని పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలు శరీరాన్ని వ్యాపించాయి. అక్కడున్న వారు మంటలను అదుపు చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని పభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి దావణగెరలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం వందలాది మంది ఆటో డ్రైవర్లు గాంధీ కూడలిలో ధర్నా చేశారు. పోలీసుల వేధింపులతోనే తన భర్త ఆత్మహత్యాయత్నం చేసినట్లు భార్య లక్ష్మీ ఆరోపించింది. ఘటనకు కారణమైన పోలీసులు మంజునాథ్, దేవరాజ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR,A.P
I.A.NO.377 /2024 & I.A.NO. 378 /2024 In O.S.NO. 668 /2024

Between:
1. D.Kumar
2. D.Devarajulu ...Petitioners/Plaintiffs

And:
Smt M.Rani and 3 others ...Respondents/Defendants

NOTICE TO RESPONDENT NO.3/ DEFENDANT NO.3

Smt R.Mohana W/o Murugesh Reddy, D/o Late Dalavay Ragunadh Reddy, Hindu, aged about 37 years, House-wife (Native of Venpanjeri Village, G.D. Nellore Mandal, Chittoor District) now residing at D.No.23, 3rd Cross, Minhaj Nagar, Ward No.181, Bangalore City,Karnataka (within the jurisdiction of City Civil Court, Bangalore)

Take notice that the above petition **I.A.No.377/2024** in O.S.No.668/2024 filed under provisions under Order 39 Rule 1 CPC and **IA No.378/2024** in OS No.668/2024 filed under the provisions under sec.151 CPC are stand posted to **05-12-2025 at 10-30 a.m.** for your notice and appearance before the above Court. Therefore at your liberty to appear either in person or through Advocate to appear before the above Court on **05-12-2025 at 10-30 A.M.** and to raise objections if any, failing which the matter will be decided according to law.

Sd/- G.VASANTHA KUMAR
Advocate for Petitioners/Plaintiffs
Place:Chittoor,Date: 20.11.2025

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR,A.P
O.S.NO. 668 /2024

Between:
1. D.Kumar
2. D.Devarajulu ...Plaintiffs

And:
Smt M.Rani and 3 others ..Defendants

NOTICE TO THE DEFENDANT NO.3

Smt R.Mohana W/o Murugesh Reddy, D/o Late Dalavay Ragunadh Reddy, Hindu, aged about 37 years, House-wife (Native of Venpanjeri Village, G.D. Nellore Mandal, Chittoor District) now residing at D.No.23, 3rd Cross, Minhaj Nagar, Ward No.181, Bangalore City,Karnataka (within the jurisdiction of City Civil Court, Bangalore)

Take notice that the above suit for declaration of right and title of the plaintiffs and for consequential relief of injunction orders against you with respect to the hereunder mentioned schedule property is stands posted to **05-12-2025 at 10-30 a.m.** for your notice and appearance before the above Court.Therefore at your liberty to appear either in person or through Advocate to appear before the above Court on **05-12-2025 at 10-30 A.M.** and to raise objections if any, failing which the matter will be decided according to law.

SCHEDULE

Chittoor District - Chittoor Sub District-Chittoor Municipal Corporation Area- Kattamanchi Revenue Village Accounts Sy.No. 293/4,290/4,295/5, 290/6 - vacant house site with measurements of East to West 50 ft and North to South 30 ft referred as ABCD in the plaint rough sketch situated within the following boundaries: East : The house bearing D.No.22-977/3A Belonging to Ravindra Reddy, West : vacant site of Lakshmikanthamma, North: Vacant site of Rambabu,South : Road

Sd/- G.VASANTHA KUMAR
Advocate for Plaintiffs
Place:Chittoor,Date: 20.11.2025

గోపాలకృష్ణ సేవలు అభినందనీయం

గోపాలకృష్ణను సత్కరిస్తున్న శ్రీనివాస్, మాల్యాద్రి, తదితరులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికి సేవలందిస్తున్న దొడ్డబొమ్మసంద్ర వార్డు అధ్యక్షుడు గోపాలకృష్ణ సేవలు అభినందనీయమని రామచంద్రాపుర సీనియర్ కాంగ్రెస్ నాయయకుడు, మాజీ కౌన్సిలర్ ఆర్.యం.శ్రీనివాస్ పేర్కొన్నారు. దొడ్డబొమ్మసంద్రలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న గోపాలకృష్ణ సేవలు హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాల్యాద్రి, అశ్వత్థ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

29న రక్షణ ఉజ్జీవ మహాసభలు

కరపత్రాలు ప్రదర్శిస్తున్న అరుణ్‌కుమార్, ప్రతినిధులు

బెంగళూరు (మత్తికెరె), న్యూస్‌టుడే : క్రైస్తవులను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయడానికి తేజోమహిమ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి శేషాద్రిపురలోని వరదాచారి కళాక్షేత్రంలో ఉజ్జీవ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జాకోబ్ తెలిపారు. ముఖ్య ప్రసంగికులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి బిషప్ రెవరెండ్ జడజాన్‌రాజు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నేలటూరి యోహాన్, ఎన్.హనోక్, జయరామ్, మాధవ పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి చంపిన భర్త

ముళబాగిలు : కోలారు తాలూకా జన్నఘట్ట గ్రామంలో శనివారం సాయంత్రం కావ్య (28)పై అనుమానంతో భర్త శివరాజ్ గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్య చేసిన తర్వాత కోలారు గ్రామీణ పోలీసులకు లొంగిపోయాడు. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తాలూకాలోని పెత్తండహళ్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. స్నానం చేయడానికి ఉంచిన విద్యుత్తు వాటర్ హీటర్‌ను తాకడంతో ఆమె షాక్ తగిలి చనిపోయినట్లు సంగలి పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

(c) eenadu

మాట్లాడుతున్న నాడగౌడ, తదితరులు

సమస్యలపై చర్చించకపోతే ఉద్యమం

రాయచూరు, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను శీతాకాలపు సమావేశాల్లో చర్చించకపోతే డిసెంబరు 21 నుంచి బెంగళూరులో నిరవధిక ధర్నా ప్రారంభిస్తామని ఉద్యోగుల సంఘం రాజ్యాధ్యక్షుడు ఎం.బి.నాడగౌడ హెచ్చరించారు. ఆయన ఆదివారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలోని 63 వేల పంచాయతీల్లో పనిచేస్తున్న వారి డిమాండ్లను ఇది వరకే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందరినీ సర్కారు ఉద్యోగులుగా గుర్తించాలని, అంత వరకూ కనీస వేతనాన్ని రూ.36 వేలు ఖరారు చేయాలని, పదవీ విరమణ చేసిన వారికి, ఉద్యోగంలో ఉంటూ మరణించిన కుటుంబాలకు రూ.6 వేల పింఛన్, రూ.10 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీల్లోని ఖాళీ కొలువులను భర్తీ చేయాలని, బిల్ కలెక్టర్లకు పదోన్నతి కల్పించాలని ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, గౌరవాధ్యక్షుడు శరణబసవ, కార్యదర్శి ఆంజనేయ పాల్గొన్నారు.

మరో రూ.70 లక్షలు స్వాధీనం

బెంగళూరు: ఏటీఎం కేంద్రంలో నగదు జమ చేసే సీఎంఎస్ వాహనాన్ని అడ్డగించి రూ.7.11 కోట్ల నగదు దోచుకుని పరారైన సంఘటనకు సంబంధించి కొత్తగా నిందితులు రవి, నవీన్, నెల్సన్‌లను సిద్ధాపుర పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టుల సంఖ్య ఏడుగురికి పెరిగింది. ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు వారు దాచిన రూ.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో రూ.6.45 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

పోటీలను ప్రారంభిస్తున్న సీఈవో ఈశ్వర్

పరుగు పందేనికి సిద్ధమవుతూ..

జల విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పాదన పతనం

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని జల విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పాదన పడిపోయింది. విస్తారంగా కురిసిన వానలు, అతివృష్టి, తుపాను కారణంగా గత నెల వరకు గణనీయమైన ఉత్పత్తి జరిగింది. కర్ణాటకలోని 16 జల విద్యుత్తు ప్రాజెక్టుల్లో వానాకాలంలో ప్రతి రోజూ 3666.6 మెగావాట్ల తయారీ లక్ష్యంగా ఉంది. అక్టోబరు తొలి వారం చివరి రోజుల్లో అటు ఇటుగా 2789 మెగావాట్ల విద్యుత్తు తయారైంది. వర్షాకాలం ముగిసినందున, అకాల వానలు కురవనందున నవంబరు ఆరంభం నుంచి ఉత్పాదన తగ్గడం ప్రారంభమైంది. నెలాఖరుకు మరింత దిగజారింది. ఆదివారం రాత్రి 7.55 గంటల వరకు అందిన సమాచారం మేరకు మెగావాట్లలో..శరావతి 763 (మొత్తం 1035 మెగావాట్ల సామర్థ్యం), నాగజహరి 342 (900), గేరుసుప్పా 106 (240), సూపా 104 (100), కాద్రా 94 (150), కొడసల్లి 76 (120), జోగ్ 74 (139.2), వారాహి 55 (460), ఎల్‌పీహెచ్ 27(55), శివసముద్రం 26 (42), షింషా 10 (17.2) మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. ఘటక ప్రభ 9 (32), బాద్రా 6 (39.2), మునిరాబాద్ 4 (38), మణిడ్యామ్ 4 (9), ఆలమట్టిలో శున్నా (పూర్తి సామర్థ్యం 290) ఉత్పాదన నమోదైంది. మొత్తం 1700 మెగావాట్లను తయారు చేశారు.

శూన్య ఉత్పత్తి నమోదైన ఆలమట్టి జలాశయం

తాప కేంద్రాల్లో..

రాయచూరు థర్మల్ కేంద్రంలో 851 మెగావాట్లు (మొత్తం 1720), బళ్లారిలో 762 (1700 మెగావాట్లకు), యరమారస్‌లో 357 (1600 కెపాసిటీకి), ఉడుపిలో 490 (సామర్థ్యం 1200), జిందాల్‌లో 77 మెగావాట్లు (మొత్తం 1460) మెగావాట్లను తీస్తున్నారు. ఐదు కేంద్రాల్లో 2537 మెగావాట్లను ఉత్పాదన చేశారు. ప్రతి రోజూ 7680 తయారు చేయాలి. యూనిట్లు స్తంభించినందున కర్ణాటక విద్యుత్తు నిగమ 5143 మెగావాట్లను కోల్పోయింది. వాతవరణం చల్లబడినందున గృహ విద్యుత్తు అవసరాలు తగ్గాయి. డిసెంబరు నుంచి డిమాండ్ పెరిగే అవకాశముంది.

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

రాయచూరు, న్యూస్‌టుడే : నిత్యం ఒత్తిళ్ల మధ్య పనిచేస్తున్న పోలీసులు ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని జడ్పీ సీఈవో ఈశ్వరకుమార్ కాందూ కోరారు. ఇష్టమైన క్రీడను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని, రోజూ నడక, వ్యాయామం, యోగా చేయాలని సలహా ఇచ్చారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం పోలీస్ కవాతు మైదానంలో జిల్లా స్థాయి వార్షిక క్రీడాకూటను బెలూన్లు వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పనిభారంతో జీవన శైలి గతి తప్పి అనారోగ్యం బారిన పడతారని, మానసికంగా కుంగిపోతుందని తెలిపారు. ఆటలోని సామర్థ్యాన్ని గుర్తించేందుకు దోహదపడే క్రీడాకూటలో కానిస్టేబుళ్లు, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు. ఎస్పీ పుట్టమాదయ్య ప్రసంగిస్తూ ఆటలతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చని, మనసును అదుపులోకి ఉంచుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. శాంతి భద్రతలను కాపాడే పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలు అందిస్తారన్నారు. ఏడాది పాటు తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆరోగ్య రక్షణకు, క్రీడలపై ఆసక్తి పెంచేందుకు నాలుగు రోజులు పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కుమారస్వామి, హరీశ్, డీఎస్పీలు శాంతవీర, దత్తాత్రేయ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబండ ఫిర్కాలో విద్యుత్తుకు అంతరాయం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా చంద్రబండ ఫిర్కా పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని జెస్కాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో అత్యవసర పనుల నిమిత్తం విద్యుత్తును స్తంభింప చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్తు అంతరాయానికి గ్రామీణులు సహకరించాలని కోరారు.

28న ఉడుపికి ప్రధానిరాక

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 28న ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించనున్నారు. శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు చేస్తారు. ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలికేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో మునిగిపోయింది. హెలిప్యాడ్, కాంక్రీట్ రహదారి నిర్మాణం, భద్రతా వ్యవస్థ తదితర వాటిపనులు శరవేగంగా సాగిస్తున్నారు. 28న దిల్లీనుంచి నేరుగా ప్రధాన మంత్రి మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉదయం 11.05 గంటలకు వస్తారు. అక్కడి నుంచి 11.10 గంటలకు హెలికాప్టర్‌లో ఉడుపికి చేరుకుంటారు. ప్రధాని ఉడుపి పర్యటనపై ప్రధాన మంత్రి కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఉడుపి బైపాస్ నాలుగు మీటర్ల రహదారి మరమ్మతులు చేపట్టారు. ప్రధాని సంచరించే వాహనాల కోసం రహదారులను సిద్ధం చేస్తున్నారు. ఏపీఎంసీ వద్ద మూడు హెలిప్యాడ్‌లకు మరమ్మతులు చేపట్టగా వాటి పక్కన నాలుగో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఉడుపి శ్రీకృష్ణమఠంలో జరిగే గీతాత్సోవం, లక్షకంఠ పారాయణం కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ భగవద్గీత పది శ్లోకాలను పఠించనున్నారు. ఆయనతోపాటు హాజరవుతున్న లక్షలాది మంది ప్రజలు భగవద్గీత శ్లోకాలను ఏకకాలంలో పఠిస్తారు. శ్రీకృష్ణుడిని దర్శించుకున్న ప్రధాని అక్కడ నిర్మించిన సువర్ణతీర్థ మంటపం, సువర్ణకనక కిండిలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉడుపి కృష్ణమఠాన్ని ప్రధాని భేటీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.35 గంటలకు ఉడుపి హెలిప్యాడ్ నుంచి మంగళూరు విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విమానంలో గోవాకు వెళ్లనున్నారు. ఈనెల 24 నుంచి ఎస్‌పీజీ భద్రతాదళాలు ఉడుపికి వచ్చి భద్రత ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

కల్యాణ కర్ణాటక శిక్షణాభివృద్ధికి ప్రత్యేక నిధులు

సిరివార, (మాన్వి) : కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని శిక్షణాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించినట్లు మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్, ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌లతో కలిసి తాలూకాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శిక్షణ ద్వారా మాత్రమే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదార్ల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు. ఎంపీ నిధులతో సిద్ధరామేశ్వర గుడి వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న కల్యాణ మంటపానికి భూమిపూజ చేశారు. కేకేఆర్‌డీబీ నిధులతో నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ పవార్, నాయకులు చుక్కి శివకుమార్, బ్రిజేష్‌పాటిల్, రమేష్, ఎం.శ్రీనివాస్, శివశరణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎన్.ఎస్.బోసురాజు

రాష్ట్ర స్థాయి పోటీల్లో నవోదయ విద్యార్థి ప్రతిభ

రాయచూరు, న్యూస్‌టుడే : నవోదయ ఫార్మసీ కళాశాలలో ఫారం-డి అంతిమ ఏడాది విద్యార్థి అనికేత్ దాస్ రాష్ట్ర స్థాయి వక్త (ప్రసంగం) పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి హైదరాబాద్‌లో ఈ నెల 29న జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాడు. బెంగళూరులోని ఎస్‌బీడీ ఫార్మా కళాశాలలో 'డిజిటల్ సాంకేతిక రంగంలో ఆరోగ్యం-ఔషధాల పాత్ర అనే అంశంపై పోటీలను ఏర్పాటు చేసింది. కర్ణాటకలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆకట్టుకునేలా ప్రసంగించిన అనికేత్‌ను నిర్వాహకులు విజేతగా ప్రకటించారు. విద్యార్థిని నవోదయ సంస్థల అధ్యక్షుడు సుంకి రాజేంద్రరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్, డైరెక్టర్లు సుంకి అమృత్ రెడ్డి, ఆచార్య సి.సురేష్ బాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.దొడ్డయ్య అభినందించారు.

ప్రసంగ పోటీల్లో అనికేత్

జ్యోతి వెలిగిస్తున్న బిరాదార్, తదితరులు

సైనికుల సేవలను మరవలేం

రాయచూరు,న్యూస్‌టుడే : సైనికుల సేవలు, త్యాగాలను విస్మరించలేమని జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ సహ కార్యదర్శి దండప్ప బిరాదార్ పేర్కొన్నారు. అఖిల కర్ణాటక మాజీ సైనికుల జిల్లా సంఘం 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఇక్కడి భారతీయ వైద్య కుటుంబ సంఘం కార్యాలయంలో జరుపుకొన్నారు. బిరాదార్ ప్రారంభ జ్యోతిని వెలిగించి ప్రసంగించారు. ఊరికి, కుటుంబానికి దూరంగా ఉంటూ, ఎండ, వాన, చలిని లెక్క చేయకడా సరిహద్దుల్లో పహారా కాస్తున్నందున మనమంతా హాయిగా నిద్రిస్తున్నామన్నారు. మాజీ సైనికుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, రహీం, గోపాలనాయక్, సుందరసింగ్, మల్లికార్జున వేదిక మీద ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు.

'ఎయిమ్స్' పట్టని కేంద్ర మంత్రులు

మాన్వి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం జిల్లాపై పక్షపాత వైఖరి చూపుతోందని, జిల్లాకు ఎయిమ్స్ కేటాయించే విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పెదవి విప్పకపోవటం దురదృష్టకరమని కర్ణాటక రక్షణ వేదిక (శివరామేగౌడ) జిల్లా అధ్యక్షుడు ఆశోక్‌కుమార్ జైన్ ఆరోపించారు. తాలూకా రక్షణ వేదిక ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. ఎయిమ్స్ కోసం 1300 రోజులుగా రాయచూరు పట్టణంలో పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్రానికి పట్టలేదన్నారు. కేంద్ర మంత్రులకు వ్యతిరేకంగా జిల్లాకు చెందిన అన్ని కన్నడ పర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు హరీష్‌సింగ్, విష్ణువర్ధన్, నారాయణస్వామి, బసవరాజ్, పవన్‌కుమార్, దేవరాజ్‌వర్మ, నరసింహ, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న కార్యకర్తలు

మన 'దీపిక'.. విజయఢంకా

♦ అంధుల క్రికెట్ చరిత్రలో నవోదయం
♦ టీ-20 ప్రపంచ క్రికెట్ పోటీలో భారత జట్టు సత్తా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ప్రపంచ కప్ అంధుల తొలి మహిళల టీ-20 క్రికెట్ పోటీలో భారత మహిళల జట్టు ఛాంపియన్స్ గౌరవాన్ని దక్కించుకొని దివ్యాంగుల క్రికెట్ రంగంలో కొత్త ఇతిహాసాన్ని నెలకొల్పారు. ఆదివారం కొలంబోలో ముగిసిన చివరి పోటీలో భారత జట్టు ఏడు వికెట్ల తేడాతో నేపాల్ జట్టుపై విజయం సాధించి ప్రేక్షకుల జేజేలు పొందుతున్నారు. దిల్లీ, బెంగళూరుతో పాటు చివరిగా కొలంబోలో ముగిసిన ఈ పోటీల భారత జట్టుకు క్రీడాకారిణి టి.సి.దీపిక సారథ్యం వహించడం ఈ పోటీల్లో విశేషం. కర్ణాటక తరపున ఎన్.ఆర్.కావ్యా, వి.కావ్యాలు సైతం జాతీయ జట్టులో పాల్గొన్నారు. కెప్టెన్‌గా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన దీపిక ప్రతి మ్యాచ్‌కు తనవంతున సమర్థవంతగా బాధ్యతలు నిర్వహించి జట్టు విజయానికి కృషి చేసింది. భారత జట్టు శ్రీలంక, ఆస్ట్రేలియా, నేపాల్, యూఎస్ఏ, పాకిస్థాన్ జట్లను ఢీకొంది. వరుస విజయాలతో ఛాంపియన్స్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. భారత అంధుల క్రికెట్ జట్టు అధ్యక్షుడు, సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్ స్థాపకుడు డా.మహంతేష్ జి.కివడసణ్ణనవర్ ప్రోత్సాహంతో భారత జట్టు సభ్యులు ఈ సాధనకు పూనుకున్నారు. జట్టు విజయంతో కన్నడనాట అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.

దీపిక, భారత జట్టు నాయకురాలు

ఎన్.ఆర్.కావ్యా, సభ్యురాలు

వి.కావ్యా, సభ్యురాలు

భారతిటీచర్ ఏళెనే తరగతి టీజర్ విడుదల

ఏడోతరగతి విద్యార్థిని ఉపాధ్యాయురాలు కావాలని కన్నకలలు ఏవిధంగా తీర్చుకుంటుందనే సామాజిక కథ ఆధారంగా నిర్మిస్తున్న 'భారతి టీచర్ ఏళెనె తరగతి' చిత్రం టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. సామాజిక సమస్యలతో కూడిన చిత్రం టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు ఎం.ఎల్.ప్రసన్న తెలిపారు. కన్నడ భాష ప్రాధాన్యతను గురించి బాబా కన్నడిగ అనే పాటను చిత్రబృందం విడుదల చేశారు. కన్నడ ఉద్యమకారుడు రోహిత్ రాఘవేంద్ర హీరోగా, సిహికహి చంద్రు, యశికా, గోవిందగౌడ, అశ్విన్ హాసన్, దివ్యాలంచన్, బెనకా నంజప్ప, సౌజన్య సునిల్‌తో పాటు కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ ప్రత్యేక పాత్ర నటిస్తున్నారు. డిసెంబరులో విడుదలకు సిద్ధం చేస్తున్నారు.

భారతిఏళెనే తరగతి చిత్రం టీజర్‌ను విడుదల చేస్తున్న చిత్రబృందం

చిత్రంలో నటరాజ్ హొన్నవళ్లి, సుమతి, నిశాంత్ తదితరులు

నడుబెట్టు అప్పణ్ణ సిద్ధం

అటవీ ప్రాంతాల్లో ఉన్న గ్రామీణులు పడే సమస్యలను బయట ప్రపంచానికి తెచ్చే విధానంగా నిర్మిస్తున్న 'నడుబెట్టు అప్పణ్ణ' చిత్రం సిద్ధమైంది. విడుదల కాకముందే కోల్‌కతాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై సినీ మేధావులు ప్రశంసలు పొందినట్లు దర్శకురాలు అనుపమ శరధి తెలిపారు. కనీస సౌకర్యాలకు దూరమైన గ్రామంలో నివసిస్తున్న ప్రజలు పడే బాధలను తెరపైకి ఎక్కించారు. పంటలపై వన్యజీవుల దాడులతో ప్రజలు పడే కష్టాలను చిత్రీకరించినట్లు ఆమె తెలిపారు. నటరాజ్ హొన్నవళ్లి, సుమతి, నిశాంత్, జగన్నాథ్, భవానిశంకర్, అడూరు బాలకృష్ణ కాసరగూడు, జీవన్‌సుళ్య తదితరులు నటిస్తున్నారు. కుమార్ ఈశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

రుధ చిత్రీకరణ షురూ

మహిళ ప్రధానమైన చిత్రం 'రుధ' చిత్రీకరణ ఇటీవల సంజయనగరలో ఉన్న రాఘవేంద్ర స్వామి బృందంలో ప్రారంభమైంది. తొలి దృశ్యానికి నటి అనుప్రభాకర్ క్లాప్ ఇచ్చారు. కేపీజీ విషన్స్ బ్యానర్‌పై పుట్టరాజు నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో కేరళలో జరిగిన సంఘటన ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు శరత్ శిడ్లఘట్ట తెలిపారు. వరలక్ష్మీ, మానసగౌడ తదితరులతోపాటు రంగభూమి కళాకారులు నటిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణ కొనసాగిస్తారు.

రుధ చిత్రం చిత్రీకరణ ప్రారంభం

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

27న రానున్న బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మీ

విభిన్నమైన కథ చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మీ' చిత్రం ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. కుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చి చిత్రాన్ని తిలకించే విధంగా నిర్మించినట్లు దర్శకుడు అభిషేక్ తెలిపారు. హాస్యం, ప్రేమ, థ్రిల్లర్ కూడిన కథ చిత్రమన్నారు. దీక్షిత్‌శెట్టి, బృందా ఆచార్య తదితరులు నటిస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్‌భాగ్యలక్ష్మీ చిత్రంలో దీక్షిత్‌శెట్టి, బృందా ఆచార్య

26న కార్మికుల సమస్యలపై అధ్యయనం

రాయచూరు, న్యూస్‌టుడే : అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి, పోరాట తీరును రూపొందించేందుకు బెంగళూరులోని స్వతంత్ర ఉద్యానవనంలో నవంబరు 26న సమావేశాన్ని నిర్వహిస్తామని అసురక్షిత కార్మికుల ఐక్య ఆందోళన జిల్లా అధ్యక్షుడు గంగప్ప తోరణదిన్ని వెల్లడించారు. ఆదివారం పత్రికాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీస వేతన చట్టాన్ని పరిశ్రమల్లో అమలు చేయడం లేదని, దినకూలీ, ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగులను విభజించి సౌలభ్యాలను వర్తింపచేయక వంచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన నాలుగు కోడ్ చట్టాల వల్ల కార్మికులు ప్రయోజనాలను కోల్పోయే అవకాశముందన్నారు. శ్రామికులకు వ్యతిరేకమైన ఈ చట్టాలను వెనక్కి తీసుకోవాలని, పని వేళలను 8 గంటలకు పరిమితం చేయాలని, హమాలీలు, దర్జీలు, హోటళ్లు, ఇళ్లలో పనిచేసే వారి సంక్షేమం కోసం కల్యాణ మండలిని స్థాపించేలా ఒత్తిడి తెస్తామని తెలిపారు. సమావేశంలో ప్రతినిధులు రంగారెడ్డి, రామణ్ణ, నరసింహులు, గ్రాకూస్ కార్యకర్త మారెమ్మ ఉన్నారు.

విలేకరులకు వివరిస్తున్న గంగప్ప, తదితరులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

23-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1,623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,528	3,066
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,313	6,246
నీటి నిల్వ (టి.ఎం.సి)	72.420	96.000

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

సోమేశ్వర దేవస్థానంలో నంది, శివలింగం

ఆలయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

హొయసల రాజుల రాజముద్రిక

దర్పణ సుందరి

ఘన వారసత్వం.. మన పర్యాటకం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ జాబితాలో కర్ణాటకలో హొయసల దేవస్థానాలు బేలూరు, హళేబీడు, సోమనాథ్‌పుర ఆలయాలకు చోటు దక్కడంతో పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. విదేశీ పర్యాటకుల సంఖ్య గతంతో పోలిస్తే మరింత ఎక్కువైనట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చే పర్యాటకుల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రాచీన వారసత్వ సంపదను సంరక్షించేందుకు పురాతన వస్తు శాఖ, పర్యాటక శాఖలు ప్రత్యేక కార్యాచరణ పథకాలను అమల్లోకి తెచ్చారు. దేశంలో యునెస్కో గుర్తించిన 42 వారసత్వ ప్రదేశాల్లో హొయసల రాజులు నిర్మించిన ఆలయాలూ ఉన్నాయి. హంపీ తరువాత ఈ ఆలయాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని అధికారులు తెలిపారు.

● ప్రాచీన శిల్పకళలకు ప్రసిద్ధిగాంచిన బేలూరు, హళేబీడు హాసన జిల్లాలో ఉన్నాయి. అక్కడ ప్రసిద్ధి చెందిన చెన్నకేశవ ఆలయం ఉంది. హొయసల శైలిలో శిల్పకళకు ఈ ఆలయం ఒక నిలువుటద్దం. బేలూరును పూర్వం వేలాపురీ అనే వారు. కాలక్రమంలో వేలూరుగా ఖ్యాతి పొందింది. అనంతరం బేలూరుగా మారింది. బేలూరు పట్టణం యాగాచి నది ఒడ్డున ఉంది. బేలూరు హొయసల రాజుల రాజధాని. ఇక్కడ 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న హళేబీడుకు రాజధానిని మార్చారు. అద్భుతమైన శిల్పకళతో ఆలయాలను నిర్మించారు. బేలూరులో వైష్ణవాలయాన్ని, హళేబీడులో శైవాలయాలను హొయసల రాజు విష్ణువర్ధనుడు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1117లో పడమటి చాళుక్యులపై విష్ణువర్ధనుడు విజయం సాధించిన చిహ్నంగా భక్తితో రెండు ఆలయాలను నిర్మించారు. ఆలయ సముదాయంలో కేశావాలయం దాని చుట్టూ రంగనాయకి, కప్పి చేన్నగరాయ ఆలయాలు ఉన్నాయి. చెన్నకేశవాలయంలో నిత్యం పూజలు చేస్తారు. ఇక్కడ ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలు ఉన్నాయి. ఆలయం ప్రవేశద్వారం వద్ద హొయసల రాజుల రాజముద్ర కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని ద్రావిడ శైలిలో సబ్బురాతితో నిర్మించారు. తేలిక ఆకుపచ్చ రంగు కలిగిన సబ్బురాతిపై శిల్పాలను కళాకారులు అందంగా చెక్కారు. గోడల పైకప్పులపై వివిధ భంగిమల్లో నర్తకీమణుల శిల్పాలు, ద్వారపాలకుల శిల్పాలు, దర్పణసుందరి, భస్మమోహిని తదితర ఆకర్షణీయమైన శిల్ప సంపద పర్యాటకులను కట్టిపడేస్తుంది. ఆలయం బయట 42 అడుగుల ఎత్తు కలిగిన ధ్వజ స్తంభం ఉంది. ఈ స్తంభం ఒకవైపు ఆధారంగా నేలను తాకి ఉండదు. మూడువైపులా స్తంభాలపై ధ్వజస్తంభం ఆధారపడి ఉంటుంది.

● పెరుగుతున్న విదేశీ పర్యాటకులు

● సోమనాథపుర ఆలయం మైసూరు జిల్లాలో కావేరి నది ఒడ్డున ఉంది. హొయసల రాజు నరసింహ 1254లో ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర వెల్లడించింది. హొయసల శైలిలో నల్లరాతితో స్తంభాల ఆధారంగా నిర్మించారు. ప్రతి గోడ, రాతిపై శిల్పకారులు శిల్పాలను చెక్కారు. నర్తకీమణులు, వన్యజీవులు, వేటగాళ్లు, నృత్యకారిణి తదితర శిల్పాలు ఉన్నాయి. నిపుణులైన వారు ఏళ్ల తరబడి శిల్పాలు చెక్కి, రాత్రి స్తంభాలకు అమర్చారు.

(c) eenadu

విపత్తు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం: సురేష్ పూజారి

సురేష్ పూజారి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం తుపానుగా మారుతుందన్న అంచనాలున్నాయి. విపత్తును ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నామని రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. ఈ విపత్తు తొలుత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రభావం చూపి చివరిగా ఒడిశా ప్రాంతంలోకి ప్రవేశిస్తుందని విదేశీ మెట్ సంస్థలు అంచనా వేస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. సహాయ కార్యక్రమాలకు ఎన్డీఆర్ఎఫ్, ఒడ్రాఫ్, అగ్నిమాపక దళాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించామన్నారు. ప్రాణ నష్టం జరగకూడదని, ఆస్తినష్టాలు తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన 10 ఇళ్లు

మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం పురపాలక సంస్థ పరిధి 4వ వార్డు దెప్పాసాహిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పదిళ్లు కాలి బూడిదయ్యాయి. దినసరి కూలీలుగా పనిచేస్తున్న వీరంతా పనులకు వెళ్లిపోయారు. ఒక ఇంటిలో మంటలు చెలరేగి వరుసగా ఉన్న ఇళ్లకు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంతోషి బౌరి, లలిత బౌరి, ఆదియమ 3 కుటుంబాలకు చెందిన 10 ఇళ్లు కాలి బూడిదయ్యాయి, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని నష్టం అంచనా వేస్తున్నారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామని సబ్ కలెక్టర్ దిలీప్ అభిషేక్ అన్నారు.

సుజాత... అవుతారా బిజద అధినేత?

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

బిజద వర్గాల్లో చర్చ | డిసెంబరు 26న నిర్ణయం

రాష్ట్రాన్ని 25 ఏళ్లు పాలించిన నవీన్‌పట్నాయక్ ఇటీవల కాలంలో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. వయోభారం కూడా పెరిగింది. బిజద అధినేతగా క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 26న భువనేశ్వర్‌లో జరగనున్న పార్టీ ఆవిర్భావ వేడుకల్లో నవీన్ సుజాత కార్తికేయన్‌కు బాధ్యతలు అప్పగిస్తారని పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఓ సంచలనంగా మారుతుంది.

నవీన్‌తో కార్తికేయ పాండ్యన్

ఆయన నిర్ణయం ఏమిటో?

డిసెంబరు 26న నవీన్ బిజద సారథి ఎవరన్నది ప్రకటిస్తారన్న వార్తలు ఊపందుకున్నాయి. గతేడాది వీఆర్ఎస్ తీసుకున్న సుజాత కార్తికేయన్ పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. 2026 ఏప్రిల్ ప్రథమార్థంలో రాష్ట్రానికి సంబంధించి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతాయి. సంఖ్యాబలం ప్రకారం బిజద సునాయాసంగా ఒక సీటు సొంతం చేసుకోనుండగా, సుజాతకు ఈ పదవి కూడా నవీన్ కేటాయించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆయనకు నీడలా కనిపెట్టుకుని ఉన్న ఐఏఎస్ మాజీ అధికారి వి.కార్తికేయ పాండ్యన్ భార్యే సుజాత కార్తికేయన్.

నాయకత్వ లోపంతో ఇబ్బందులు

నవీన్ అధికారంలో ఉన్న సమయంలో ఆయనను నేరుగా కలుసుకోలేక నేతలు ఇబ్బందిపడ్డారు. ఆయన ఎదుట నిల్చొని మాట్లాడే సాహసం ఎవరూ చేయలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి. ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయన వద్దకు ఎవరూ వెళ్లడం లేదు. నవీన్ అనుమతితో కొద్దిమంది సీనియర్ నేతలు వచ్చి వెళుతున్నారు. మరోవైపు పార్టీలో రచ్చ అంతకంతకు పెరుగుతోంది. ఇదివరకు మీడియా ముందు కొచ్చి మాట్లాడే సాహసం చేయని వారంతా ఇప్పుడు పార్టీకి, అధినేతలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు.

మీకే ముందుగా తెలుస్తుంది

సుజాత కార్తికేయన్

దీనిపై ఆదివారం భువనేశ్వర్‌లో పాత్రికేయులు బిజద ఉపాధ్యక్షుడు దేవీ ప్రసాద్ మిశ్రను అడగ్గా, ఏదైనా 'మీకే ముందుగా తెలుస్తుంది' అని పేర్కొన్న ఆయన వేచి చూడండని సూచించారు. ప్రసార సాధనాలవారికి చిన్న ఆధారం దొరికితే పెద్ద కథనాలు రాసేస్తారన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలో ఏం జరుగుతుందన్నది తేటతెల్లమవుతుందని పేర్కొన్నారు.

పీఏసీ సమావేశం నామమాత్రం

నవీన్ నివాస్‌లో శనివారం రాత్రి బిజద రాజకీయ వ్యవహారాల సంఘం (పీఏసీ) సమావేశం నామమాత్రంగా సాగింది. నువాపడ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బిజద పరాజయానికి కారణం అధికారంలో ఉన్న భాజపా పెద్దఎత్తున దుర్వినియోగానికి పాల్పడటమేనని పార్టీ పెద్దలు ప్రకటించారు.

వ్యతిరేకత తప్పదేమో..

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నవీన్‌ను పక్కన పెట్టి అంతా తానై చక్రం తిప్పిన కార్తికేయ పాండ్యన్‌పై సీనియర్ నేతలంతా గుర్రుగా ఉన్నారు. పార్టీ పరాజయం తర్వాత నైతిక బాధ్యత వహించి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానని ప్రకటించిన ఆయన ఇంతవరకు నవీన్‌నివాస్ వీడలేదు. తెర వెనుక ఉంటూ పార్టీని శాసిస్తున్నట్లు ఎంతోమంది బాహాటంగా విమర్శలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో ఆయన భార్య సుజాతకు నవీన్ పార్టీ పగ్గాలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పరిశీలకులంటున్నారు. కార్తికేయ పాండ్యన్ తమిళ వ్యక్తి అని, సుజాత జగత్సింగ్‌పూర్ (ఒడిశా) వాసి. వీరిద్దరిదీ ప్రేమ వివాహం. ఆమెకు బిజద సారథ్య బాధ్యతలు అప్పగిస్తే మహిళా ఓటు బ్యాంకు సురక్షితమవుతుందని, శక్తిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సుజాతకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలతో(ఎస్‌హెచ్‌జీ) సన్నిహిత సంబంధాలున్నాయని చెబుతున్నారు.

సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిద్దాం

బ్రహ్మపుర ఎమ్మెల్యే, సంబరాల కమిటీ ఛైర్మన్ అనిల్ కుమార్‌ను సత్కరిస్తున్న మహిళా సమన్వయకర్తలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, పండగల్లోని విశిష్టతలు ప్రతిబింబించేలా, జనరంజకమైన సాంస్కృతిక కార్యక్రమాలతో బ్రహ్మపురలో జనవరి 13న 'సంక్రాంతి సంబరాలు-2026' ఘనంగా నిర్వహిద్దామని బ్రహ్మపుర ఎమ్మెల్యే, సంబరాల కమిటీ ఛైర్మన్ కె.అనిల్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక గాంధీ నగర్‌లోని బ్రహ్మపుర ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో సంక్రాంతి సంబరాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో వైస్ ఛైర్మన్ పూడిపెద్ది సత్యనారాయణ (బాబు) సంబరాల నిర్వహణపై వివరించారు. కార్యక్రమంలో ముఖ్య కన్వీనరు ఆర్.శ్రీనివాస్, కన్వీనరు టి.వాసుదేవరావు, సమన్వయకర్తలు వి.రవికుమార్ గుప్త, తూతిక గోపి తదితరులతోపాటు పలువురు మహిళా సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ అనిల్ కుమార్‌ను మహిళా సమన్వయకర్తలు సత్కరించారు. ఉత్కళ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ (యూసీడీఏ) నూతన రాష్ట్రాధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన పూడిపెద్ది సత్యనారాయణ (బాబు)ను ఎమ్మెల్యే అనిల్ కుమార్, సమన్వయకర్తలు సత్కరించారు.

సమావేశంలో పాల్గొన్న సంక్రాంతి సంబరాల కమిటీ సమన్వయకర్తలు తదితరులు

అభివృద్ధికి చిరునామా ఒడిశా

సీఎం మోహన్ చరణ్ మాఝి

సంచిక ఆవిష్కరిస్తున్న సీఎం, ఎంపీలు, అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సిరులకు నిలయమైన ఒడిశా కొన్నాళ్లు వెనకబడినా అభివృద్ధికి ఇప్పుడు చిరునామా అయిందని, అన్నిరంగాల్లో ముందంజలో ఉందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. శనివారం రాత్రి దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 14 నుంచి అంతర్జాతీయస్థాయి ట్రేడ్ ఫెయిర్-2025 జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నెల 27 వరకు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ అయిదు ప్రతిష్ఠాత్మక స్టాళ్లతో ఒడిశా పెవిలియన్ ఏర్పాటైంది. ఈ వేడుకలో పాల్గొన్న సీఎం మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ప్రతిభ, ఉత్పత్తుల గురించి విపులంగా వివరించారు. రాష్ట్ర ప్రతిష్ఠకు అద్దం పట్టే 'ఉత్కళ ప్రసంగ' సంచిక ఆవిష్కరించారు.

చీరను పరిశీలిస్తున్న మోహన్

కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ సుజిత్‌కుమార్, బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంత్‌శర్మ, రిలీఫ్ కమిషనర్ దేవరంజన్‌కుమార్ సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జగన్నాథప్రసాద్ ఠాణా పరిధిలోని జలిసాహిలో 2019 నవంబరులో పవన్ సెఠి అనే యువకుడు హత్య కేసులో అయిదుగురికి జీవిత ఖైదు శిక్ష పడింది. కేసును విచారించిన భంజనగర్‌లోని అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానం నిందితులకు జీవిత శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించకుంటే మరో సంవత్సరం శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొంది. శిక్ష పడ్డవారు జగన్నాథప్రసాద్ ఠాణా పరిధిలోని ప్రాంతాలకు చెందిన బసంత కుమార్ సెఠి (34), దిలీప్ కుమార్ సెఠి (25), అభిమన్యు సెఠి అలియాస్ అభి (59), శ్వేత సెఠి (30), సంతోష్ సామల్ (30)లని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. హతుడు పవన్, శిక్ష పడ్డ బసంతల మధ్య పాతకక్షలు ఉండేవని, జూదంలో జరిగిన వాగ్వాదం కూడా హత్యకు కారణమని పోలీసులు తెలిపారు.

అమెరికాలో 'అష్టాదశ శక్తిపీఠాల అధిదేవతల' వేషధారణలతో ప్రదర్శన

జాజ్‌పూర్ బిరజాదేవి వేషధారణలో ఖజానా దీప్తి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో 'అగ్రహారం' అనే సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 'అష్టాదశ శక్తిపీఠాల అధిదేవతలైన వివిధ అమ్మవార్ల వేషధారణతో ప్రదర్శన ఏర్పాటైంది. ఇందులో ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన బ్రహ్మపురకు చెందిన ఖజానా దీప్తి ఒడిశాలోని జాజ్‌పూర్‌లో వెలిసిన 'బిజరా దేవి' వేషం ధరించారని బ్రహ్మపురలో ఉంటున్న ఆమె తండ్రి కె.పి.కృష్ణారావు ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

వివిధ దేవతల వేషధారణలు

భంజనగర్‌లో డీజీపీ సమీక్ష

డీజీపీ వై.బి.ఖురానియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీసు అధికారి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర పోలీసు డీజీ యోగేష్ బహదూర్ (వై.బి.) ఖురానియా శనివారం రాత్రి గంజాం జిల్లా భంజనగర్‌లో అధికారులతో సమీక్షించారు. మావోయిస్టుల నిర్మూలన, శాంతి భద్రతలు తదితర అంశాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. అదనపు డీజీ సంజీబ్ పండా, దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, గంజాం ఎస్పీ శుభేందుకుమార్ పాత్ర్, ఐఆర్‌బీ ఎనిమిదో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సుధాకర్ మిశ్ర, అదనపు ఎస్పీ రంజన్ కుమార్ దే, ఎస్డీపీఓ దీపక్‌కుమార్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు డీజీపీ ఖురానియా తనరడలోని ఐఆర్‌బీ ఎనిమిదో బెటాలియన్ కేంద్రానికి వెళ్లి ఆధునిక వ్యాయామశాలను ప్రారంభించారు. శనివారం కొంధమాల్ జిల్లా కేంద్రం ఫుల్బాణీలో డీజీపీ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు.

బొడొసింహార అవతారం... రమణీయం...కమనీయం

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఇదివరకు పూరీ శ్రీక్షేత్రంలో రాత్రి పవళింపు సేవ సమయంలో దేవదాసీలు జగన్నాథుని ఎదుట నృత్యాలు చేసేవారు. భక్త కవి జయదేవుని అష్టపదులు శ్రావ్యంగా ఆలపిస్తూ దేవదాసీల నాట్యాలు శృంగార పురుషుని వైభవానికి ప్రతీకగా నిలిచేవి. 1980లో జానకి వల్లభ్ పట్నాయక్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవదాసీ వ్యవస్థ రద్దయింది. గర్భగుడిలో నృత్యాలు కనుమరుగయ్యాయి. దీనికి ముందుగా ఏర్పాటయ్యే జగన్నాథుని 'బొడొసింహార' వేడుక మాత్రం కొనసాగుతోంది.

ఇది శ్రీక్షేత్రానికే సాధ్యం

శ్రీక్షేత్రంలో స్వామికి నిత్యం 119 రకాల సేవలు నిర్ణీత వేళల్లో నిర్వహిస్తారు. ఇవికాక తంచా గోప్య సేవలు అదనంగా చేపడతారు. స్వామి సేవల కోసం 2 వేలమందికిపైగా 36 తెగల సేవాయత్‌లున్నారు. నిత్యం రాత్రి 10.30 గంటలకు ఏర్పాటయ్యే బొడొసింహార అవతారం విలక్షణమైనది. ఒక్కోసారి 11 గంటలకు కూడా చేపడతారు. వివిధ జాతుల పుష్పాలతో మాలలు, గుచ్ఛాలుగా కట్టి స్వామికి పుష్పాలత్ సేవాయత్‌లు అలంకరణ చేస్తారు. తర్వాత 30 నిమిషాలు అర్చన జరుగుతుంది. అనంతరం 'బొడొ సింహార భోగో' పేరిట పిండి వంటకాలు, పళ్లు నివేదన చేస్తారు. నిత్యం ఉదయం 7 గంటలు లోపు జరిగే గోపాలవల్లభ సేవ, ఇతర సేవలు కొనసాగుతాయి. రాత్రి 11.30 గంటలకు లేదా 12 గంటలకు ముందు అంతిమ సేవగా చేపట్టే పురుషోత్తముని బొడొసింహార అవతారం ప్రత్యేకమైనది. ఈ సేవకు అవసరమయ్యే పరిమళాలు వెదజల్లే పుష్పాలు స్వామి పుష్పవనం నుంచి సేకరిస్తారు. జగన్నాథుని సేవలతో ప్రమేయం ఉన్న, ఇతర మఠాల యాజమాన్యాలూ నిత్యం పూలు సమకూరుస్తుంటాయి.

అనంతరూపాల స్వామి జగన్నాథుడు

అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీల విజేత ఫుల్బాణీ

విన్నర్, రన్నర్ ట్రోఫీలతో కళాశాలల జట్ల క్రీడాకారులు. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం, క్రీడల మండలి ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన 53వ అంతర కళాశాలల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. భంజవిహార్ క్రీడామైదానంలో నిర్వహించిన ఇందులో తుదిపోరులో ఫుల్బాణీ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి జట్టు 3-0 గోల్ల తేడాతో కళింగ మహావిద్యాలయ (జి.ఉదయగిరి) జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. మ్యాచు అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన గంజాం జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జె.కామేశ్వరరావు, వర్సిటీకి చెందిన కుశకుమార్ నాయక్, గౌరీ శంకర్ పాత్ర్ విన్నర్, రన్నర్ జట్లకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండలి ప్రతినిధులు రాజేష్‌మహంతి, శివానంద వర్మ, కళాశాలల శిక్షకులు పాల్గొన్నారు.

ఆదివారం... సీఎం దస్త్రాల పరిశీలన

సీఎంఓలో మోహన్ దస్త్రాల పరిశీలన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పట్నా (బిహారు), దిల్లీ పర్యటనల నేపథ్యంలో రెండు రోజులుగా భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లోని తన కార్యాలయానికి రాలేదు. ఆదివారం మధ్యాహ్నం హస్తిన నుంచి భువనేశ్వర్ వచ్చిన ఆయన తన నివాసానికి వెళ్లకుండా నేరుగా కార్యాలయానికొచ్చి పెండింగ్‌లో ఉన్న దస్త్రాలు పరిశీలించారు. సెలవు రోజు కావడంతో అధికారులు లేకపోయినా సొంతంగా పనులన్నీ చేశారు.

నడ్డాను కలిసిన మోహన్

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శనివారం రాత్రి దిల్లీలో కేంద్ర భాజపా అధ్యక్షుడు, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను ఆయన నివాసంలో కలుసుకున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, తమ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

మాలు శాంత హైస్కూల్‌కు జాతీయ పురస్కారం


మంత్రి పాటిల్ నుంచి పురస్కారం అందుకుంటున్న రష్మిరంజన్ సేథి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలోని దమన్‌జోడిలో మతల్‌పుట్‌లో ఉన్న మాలు శాంత హయ్యర్ సెకండరీ హైస్కూల్ నీటి సంరక్షణ, వర్షపు నీటి పునర్వినియోగంలో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని దీనికి ఎంపికైన ఏకైక పాఠశాల ఇదే కావడం విశేషం. కొత్త దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో కేంద్ర జల వనరుల మంత్రి సర్ పాటిల్ నుంచి ప్రిన్సిపల్ రష్మి రంజన్ సేథి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో సుమారు 700 మొక్కలు నాటారు. నీటి సమస్యల కారణంగా పైకప్పు నుంచి పడే వర్షపు నీటిని నిల్వ చేసి ఆ నీటిని మొక్కలకు పోయడం వంటి ప్రయోగానికి ఈ పురస్కారం లభించింది. ఉపాధ్యాయులను పాలనాధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్ అభినందించారు.

ప్రపంచ ఎబిలిటీ పోటీల్లో రాష్ట్రానికి మరో మూడు పతకాలు

పతకాలతో ప్రఫుల్లకుమార్, కమలకాంత్, సుచిత్ర

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: థాయిలాండ్‌లో జరుగుతున్న ప్రపంచ ఎబిలిటీ క్రీడల్లో రాష్ట్రానికి మరో మూడు పతకాలు లభించాయి. శనివారం పురుషుల విభాగం జావెలిన్ త్రోలో కమలకాంత్ నాయక్ మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం గెలుచుకోగా, ప్రఫుల్ల కుమార్ ఖండత్రాయ్ డిస్కస్ త్రోలో తృతీయ స్థానంతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. మహిళా విభాగంలో సుచిత్ర పరిడా డిస్కస్ త్రోలో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం పొందారు.

నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం

● తుపానుగా మారడం తథ్యమన్న మెట్ నిపుణులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం తీవ్రరూపం దాల్చిందని, సోమవారం(24న) ఇది వాయుగుండంగా మారుతుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ పీడనానికి చేరువలో దక్షిణ అండమాన్ సముద్రంలో 23న మరో అల్పపీడన ద్రోణి ఉపరితలానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిందన్నారు. తీవ్ర పీడనం వాయుగుండంగా మారిన తర్వాత 48 గంటల్లో (26న) తుపానుగా మారుతుందన్న అంచనా ఉందన్నారు. ఈ విపత్తు గురించి పూర్తి వివరాలు సోమవారం తేటతెల్లమవుతాయన్నారు. వాతావరణ అధ్యయన శాస్త్ర నిపుణుడు డా॥శరత్‌చంద్ర సాహు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ... బంగాళాఖాతంలో ఒకే ప్రాంతంలో (తక్కువ దూరంలో) రెండు పీడనాలు ఏర్పడటం అరుదని చెప్పారు. ఈ రెండూ కలిసిపోయే సూచనలున్నందున తుపానుగా మారుతుందన్నది స్పష్టమైందన్నారు. బంగాళాఖాతం మీదుగా చలిగాలుల తీవ్రత తగ్గినందున ఈ విపత్తు బలోపేతం కావడానికి వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయన్నారు. ఇది దక్షిణ, తూర్పు దిశగా తీరానికి ప్రయాణిస్తుందని చెప్పారు. 24న దక్షిణ అండమాన్ సముద్ర ఉపరితలంలో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, 25న తీవ్రత 60కి పెరుగుతుందన్నారు. ఇది ఏ తీరానికి చేరువవుతుందన్న దానిపై ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుందన్నారు. తొలుత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రభావం ఉంటుందని, తర్వాత ఒడిశాకు ఉంటుందన్న అంచనా ఉందన్నారు. మరోవైపు యూరప్ తదితర మెట్ సంస్థలు ఈ తుపాను ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ప్రభావం చూపుతుందని ప్రకటించాయి.

నిన్న నైరాశ్యం.. నేడు ఆదర్శం

చెరువులో పట్టిన చేపలతో జ్ఞానరంజన్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: వరి సాగుతో అంతంతమాత్రంగా ఆదాయం, దీనికి తోడు వరదలు వెరసి ఆ రైతుకు కుటుంబ పోషణ భారంగా మారింది. ఆరుగాలం శ్రమించినా అభివృద్ధికి నోచుకోని పరిస్థితుల్లో తనకు చావు తప్ప మరో మార్గం లేదనుకున్నాడు. చివరిగా వినూత్నంగా ఆలోచించి చేపల పెంపకం, సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల సాగుకు శ్రీకారం చుట్టాడు. దీంతో దయనీయ స్థితి నుంచి ఆ రైతు దర్జాగా బతికే స్థాయికి ఎదిగాడు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద మత్స్యసాగులో తీసుకున్న శిక్షణ దాస్ జీవితాన్నే మార్చేసింది. వరిసాగుతో ఇంతకు ముందు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే ఆర్జించే దాస్ నేడు 15 క్వింటాళ్ల చేపలను ఉత్పత్తి చేస్తుండటం విశేషం. దీంతో పాటు సేంద్రియ పద్ధతిలోనే పండిస్తున్న కూరగాయలను దాస్ స్వయంగా విక్రయిస్తుండటం గమనార్హం. దీనికితోడు కూరగాయలు, మామిడి పండ్ల సాగుతో అదనపు ఆదాయం సంపాదిస్తున్నాడు. ఉత్తమ రైతు కేటగిరీలో యంత్రాంగం, వివిధ సంస్థల నుంచి ఇప్పటికే పలుమార్లు అవార్డులు అందుకున్నాడు.

తోటి రైతులకు శిక్షణ..

చేపలకు అందించే ఆహారాన్ని దాస్ సేంద్రియ వ్యర్థాలతో స్వయంగా తయారు చేసుకుంటున్నారు. దీంతో అత్యంత నాణ్యతతో కూడిన చేపల ఉత్పత్తి చేస్తున్నాడు. కూరగాయల సాగు, చేపల పెంపకంలో కొన్ని మెలకువలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని జ్ఞానరంజన్ పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి చుట్టుపక్కల గ్రామాల రైతులకు స్వచ్ఛందంగా శిక్షణ ఇస్తున్నారు.

రైతులకు సూచనలిస్తూ...

ప్రేయసి గొంతుకోసిన ప్రియుడు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని బుద్ధ పార్కులో ఆదివారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ప్రేయసిని అనుమానించిన ప్రేమికుడు ఆమె గొంతు కోశాడు. వివరాల్లోకి వెళితే... డార్జిలింగ్ నుంచి టింకూగురుంగ్ తన ప్రేయసితో కలిసి ఒడిశా విహారానికొచ్చాడు. వీరిద్దరూ భువనేశ్వర్ బుద్ధపార్కులో కూర్చుని ఉండగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆమె వేరొకరితో ప్రేమలో ఉందని టింకూ నిలదీశాడు. అది ఊహ మాత్రమేనని, తను టింకూనే ప్రేమిస్తున్నాని ఆమె ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆకస్మికంగా కత్తి తీసి ఆమె గొంతు కోశాడు. బాధితురాలు కేకలు వేయడంతో పార్కులో ఉన్నవారు ఆయనను అదుపులోకి తీసుకుని చంద్రశేఖర్‌పూర్ పోలీసులకు అప్పగించారు. యువతిని పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు.

(c) eenadu

ఎన్‌సీసీ శిక్షణతో నాయకత్వ లక్షణాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయని, సైన్యంలో ఉద్యోగాలు లభిస్తాయని వైమానిక దళం విశ్రాంత అధికారి శివ పట్నాయక్ అన్నారు. ఆదివారం పర్లాఖెముండి పట్టణంలోని మహారాజ బాలుర ఉన్నత పాఠశాలలో 78వ నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీ పతాకాన్ని ఎగురవేసి, అనంతరం విద్యార్థుల కవాతు తిలకించారు. ప్రధానాచార్యుని మోనాలిసా దాస్, ఉపాధ్యాయులు డి.శ్రీరామ్ మూర్తి పాల్గొన్నారు.

మహారాజ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కబడ్డీ, ఖోఖో క్రీడల్లో బాలల ప్రతిభ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కబడ్డీ.. కబడ్డీ... అన్న కూతతో.. ఖో కొట్టిన ఉత్సాహంతో ఆ మైదానంలో క్రీడల కళ సంతరించుకుంది. రెంగాలుబంద సమితిలో బ్రహ్మపుర లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ క్రీడోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కోదిగిలోని బాలాజీ విద్యాపీఠ్ క్రీడా మైదానంలో ఏర్పాటైన ఇందులో సమితిలోని వివిధ పాఠశాలలు, క్లబ్ సంఘాలకు చెందిన జూనియర్, సీనియర్ బాలబాలికలు 500 మంది తమ పేర్లు నమోదు చేసుకుని వివిధ క్రీడాంశాల్లో పాల్గొంటున్నారు. తొలిరోజు కబడ్డీ, ఖోఖో మ్యాచులలో జూనియర్ బాలలు క్రీడాస్ఫూర్తితో పోటాపోటీగా ఆడారు. ఈ నెల 29 వరకు కొనసాగనున్న ఈ పోటీల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.

బాలుర కబడ్డీ ఆట

ఖోఖో ఆడుతున్న బాలికలు

నేటి నుంచి దేవ్‌మాలి పర్వత ముఖ్య మార్గం మూసివేత

దుదారి మార్గం వైపు రాకపోకలు సాగించాలని ఆదేశాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఎత్తయిన శిఖరంతోపాటు జిల్లాలో ముఖ్య పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన దేవ్‌మాలి పర్వతానికి వెళ్లే ముఖ్య రహదారి ఆదివారం నుంచి కొన్ని రోజులు మూసివేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో ఈ ముఖ్య మార్గాన్ని మూసివేసి పర్యాటకులు దుదారి మార్గం వైపు రాకపోకలు సాగించాలని సూచించింది. ఈ పర్వతానికి దేశంలో వివిధ ప్రాంతాల పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. అధ్వానంగా ఉన్న ఈ 3.5 కి.మీ. రహదారి మరమ్మతులు చేపట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సబ్ కలెక్టర్ ప్రేమ్‌లాల్ హిరాలాల్ తెలిపారు.

కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

ఘనంగా సాయిబాబా జయంత్యుత్సవాలు

రాయగడ తిరువీధి మహోత్సవంలో సాయి భక్తులు

పర్లాఖెముండి జీ బ్లాక్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయగడ, సిమిలిగుడ, పర్లాఖెముండి, జయపురం, న్యూస్‌టుడే: సత్య సాయి బాబా శత జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు. బాబా మందిరాల్లో సంకీర్తన, సామూహిక సాయి వ్రతాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో భక్తులు సాయిబాబా చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి భక్తిగీతాలు పాడుతూ తిరువీధి మహోత్సవం నిర్వహించారు.

సిమిలిగుడలో నారాయణ సేవా కార్యక్రమం

సిక్కిం గవర్నరు మనవరాలి వివాహంలో సామల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లోని ఒక ప్యాలెస్‌లో శనివారం రాత్రి సిక్కిం గవర్నరు ఓంప్రకాష్ మాథుర్ మనవరాలి వివాహం జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర భాజపా అధ్యక్షుడు మన్మోహన్‌సామల్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

కల్యాణ మండపంలో వధూవరులతో సామల్

ధ్వజస్తంభం ఏర్పాటుకు సన్నాహాలు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా సితా మహల్ గ్రామంలో రాధాకాంత్ మందిర ప్రాంగణంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం ఆదివారం జరిగింది. ట్రస్ట్ సభ్యులు సుశాంత్‌కుమార్ పండా, మహేష్ పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న సుశాంత్

విజయవంతంగా సదస్సు

సదస్సులో పాల్గొన్న ఐఐటీ సిబ్బంది

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ ఐఐటీలో స్కోప్ 2.0-నేషనల్ కెపాసిటీ బిల్డింగ్ ఆన్ సైన్స్ కమ్యూనికేషన్ వర్క్‌షాప్ 2025 ఐదురోజులు విజయవంతంగా సాగింది.

ఎన్‌సీసీ శిక్షణతో దేశభక్తి

రాయగడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణతో దేశభక్తి, క్రమశిక్షణ అలవడటంతో పాటు మంచి భవిష్యత్తు లభిస్తుందని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండో అన్నారు. ఆదివారం ఆటానమస్ కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రిన్సిపల్ డా.సరస్వతి రే, కల్నల్ ఆర్.సి.భరత్వాల్ ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రదర్శించిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కార్యక్రమంలో అక్షయ్‌కుమార్ తదితరులు

ధాంనగర్‌లో దేశ సమైక్యతా ర్యాలీ

భువనేశ్వర్: భద్రక్ జిల్లా ధాంనగర్‌లో శనివారం రాత్రి దేశ సమైక్యతా ర్యాలీ కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ నాయకత్వంలో జరిగింది. పటేల్ 150వ జయంత్యుత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుండటంతో ప్రభుత్వం అన్నిచోట్లా సమైక్యతా ర్యాలీలు చేపడుతోంది. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఉక్కు మనిషి భారత్‌లో ఐక్యత కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి విపులంగా వివరించారు.

పరిశ్రమలో లాభాలు పెంచేందుకు వర్క్ షాప్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని జిల్లా పరిషత్తు సమావేశ భవనం శనివారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల లాభాలు పెంచేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. రెవెన్యూ ఏడీఎం మునీంద్రా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అకౌంటెంట్ జనరల్ ఇన్‌స్పెక్టర్ అతుల్ ప్రకాష్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కుమార్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, అసిస్టెంట్ జిల్లా పారిశ్రామిక అధికారి బిభు రంజన్ స్వయిన్ తదితరులు పాల్గొన్నారు. ఏడీఎం మునీంద్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న వారికి పలు సూచనలు చేశారు.

వేదికపై కూర్చుని ఉన్న రెవెన్యూ ఏడీఎం మునీంద్రా, సబ్ కలెక్టర్ అనూప్ పండా తదితరులు

లక్ష్మీపూర్‌లో సమితి స్థాయి విజ్ఞాన ప్రదర్శన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ హైస్కూల్‌లో ఆదివారం సమితి స్థాయి విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పవిత్ర శాంత పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను చూపేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు గోపాల్ మండల్ అధ్యక్షతన సమితి విద్యాధికారిని రితా మహంతి తదితరులు పాల్గొన్నారు.

★ ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న కకిరిగుమ్మ-దమన్‌జోడి రహదారి అభివృద్ధికి కృషి చేస్తానని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని ఎమ్మెల్యే పవిత్ర ఆదివారం పరిశీలించారు. మరమ్మతుల గురించి అధికారులతో చర్చించారు.

ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

జిల్లా రైతు సంఘ సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న నరేంద్రకుమార్

జయపురం: పట్టణంలోని తెప్పగూడ హనుమాన్ మందిర ప్రాంగణంలో ఆదివారం జిల్లా రైతు అభివృద్ధి సంఘం తరపున సమీక్షా సమావేశం జరిగింది. రైతులు తమ సమస్యలను సోమవారం జరగనున్న జిల్లాస్థాయి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ ఏడాది మండీ సమయంలో దళారులకు అవకాశం ఇవ్వకూడదని, అందరూ మండీల్లోనే తమ ధాన్యం విక్రయించాలని నిర్ణయించారు. సమావేశంలో చర్చించనున్నట్లు సంఘ ఎడిటర్ నరేంద్రకుమార్ తెలిపారు.

వైద్య సేవలు మెరుగు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా గోపీవల్లబ్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ ఖగేంద్రనాథ్ మహతో వైద్య సేవలు మెరుగుకు మారుమూల గ్రామాల్లో ఆదివాసీలకు వైద్య సేవలు అందుబాటులో తేవడానికి మొబైల్ వైద్య సంచార వాహనం ప్రారంభించారు. ఈ వైద్య వాహనంలో వైద్యులు ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఉంటారని ఎమ్మెల్యే డాక్టర్ ఖగేంద్రనాథ్ మహతో తెలిపారు.

మొబైల్ వైద్య వాహనం వద్ద డాక్టర్ ఖగేంద్రనాథ్ మహతో

ఖరగ్‌పూర్ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో పోటీలు: ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఖరగ్‌పూర్ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డెన్‌లో చిత్రలేఖన, వ్యాసరచన, ఇతర పోటీలు నిర్వహించినట్లు రైల్వే ప్రకటించింది.

ఛత్రిపుట్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సిటీ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం ఛత్రిపుట్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఉపాధ్యాయుడు ప్రతాప్‌కుమార్ పాత్ర్, స్వచ్ఛంద సంస్థ స్వీయ్ సభ్యులు నేతృత్వంలో విద్యార్థులు పాఠశాల నుంచి సైకిళ్లపై గొడపాదర్ మీదుగా స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్ చరిత్ర, రైలు సిగ్నల్స్, రైల్వే ప్రయాణికుల కోసం శాఖ అందిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు.

ఫార్మాతో బహుళ ప్రయోజనాలు

రాయగడ, న్యూస్‌టుడే: ఫార్మసీ విద్యార్థులకు ఎక్కువ డిమాండ్ ఉందని, వీరికి అవకాశాలు లభించడంతో పాటు ప్రజారోగ్యానికి సహకరించిన వారవుతారని వక్తలు అన్నారు. గుణుపురం జీఐఈటీ వర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఈనెల 16 నుంచి శనివారం వరకు ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు సదస్సులో ప్రభుత్వ వైద్యుడు ప్రమోద్ కుమార్ పండా పాల్గొని ప్రసంగించారు. వీసీ ఏబీ ఎల్ఎస్ శర్మ, ప్రఫుల్లకుమార్ సాహు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సిబ్బంది, విద్యార్థులు

నిరుపేదలకు చేయూత

పేదలకు రగ్గులు అందజేస్తున్న బృందం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ సమరయోధులు సహీద్ లక్ష్మణ్ నాయక్ స్వగ్రామం టెంటిలిగుమ్మలో ఆదివారం నిరుపేదలకు చేయూతను అందించారు. సిమిలిగుడకు చెందిన సహీద్ లక్ష్మణ్ నాయక్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఓ బృందం ఆ గ్రామానికి వెళ్లి అక్కడ నిరుపేదలకు రగ్గులు అందజేశారు. అధ్యక్షులు అజయ్‌కుమార్ సాహు, కార్యదర్శి గేను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య పోటీలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఒడియా దినపత్రిక సకల అయిదో వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీ మెమోరియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు ప్రమోద్ చంద్ర పాడి, జిల్లా విజ్ఞాన పరిశీలకుడు ఎ.రవికుమార్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తే నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని, వీటివలన క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం లభిస్తాయని జైలర్ హను శెట్టి అన్నారు. శనివారం గుణుపురం సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన 30వ వార్షిక క్రీడాపోటీల ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రిన్సిపల్ ప్రఫుల్ల శత్పథి, తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పోటీలో చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిగాయి. స్థానిక సివిల్ కోర్టు ఆవరణలోని ఎనిమిది గదుల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 115 మంది విద్యార్థులు పాల్గొని చిత్రాలు గీశారు. డీఎల్ఎస్ఎ కార్యదర్శి బ్యోమకేశ్ నాయక్ అధ్యక్షతన ఈ పోటీలు జరిగాయి.

అవార్డు అందుకుంటున్న సాయిప్రియా వాకర్స్ క్లబ్ సభ్యులు

సాయిప్రియా వాకర్స్ క్లబ్‌కు అవార్డులు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్‌కు ఆరు అవార్డులు లభించాయి. ఆదివారం భువనేశ్వర్‌లో జరిగిన 21వ వార్షిక రాష్ట్రస్థాయి సదస్సులో ఈ అవార్డులను అందజేశారు. అధ్యక్షుడు కొల్లూరు సూర్యనారాయణ శర్మకు డైనమిక్ ప్రెసిడెంట్ అవార్డు, మరో అయిదు అవార్డులను క్లబ్ ప్రతినిధులు డా.ఎం.సురేష్‌కుమార్ తదితరులు హాజరై అందుకున్నారు.

పాఠశాలలో చేరిన నలుగురు అనాథ పిల్లలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా నందహండి సమితి పడాలగూడ పంచాయతీ మార్ఖిగూడ గ్రామంలో ఇటీవల విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ డా.ఎన్.తిరుమల నాయక్ సందర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పిల్లలు అనాథలై విద్యాబోధనకు దూరమై అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్నారు. వెంటనే వారి వివరాలు సేకరించి, వారిని బాలాశ్రమాల్లో చేర్చాలని డీఈఓ ఛత్రపతి సాహును ఆదేశించారు. ఈ మేరకు బీఈఓ శ్రీకాంత్‌జానీ, శిశుసంక్షేమ కమిటీ, చైల్డ్ హెల్ప్‌లైన డెస్క్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని ఆ నలుగురి పిల్లలను మార్ఖిగూడ బాలాశ్రమంలో చేర్చినట్లు హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ చిన్మయ్ నాయక్ తెలిపారు.

గంజాం ఖోఖో జట్టు ఎంపిక శిబిరం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అథ్లెటిక్ సంఘం (జీడీఏఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఖోఖో జూనియర్ బాలబాలికల జట్టు ఎంపిక శిబిరం ఆదివారం జరిగింది. స్థానిక గుసానినువాగాంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఏర్పాటైన ఇందులో బ్రహ్మపుర, ఛత్రపురం, గంజాం, గిరిసోల, కుకుడాఖండి, హింజిలికాటు, అస్కా, పురుషోత్తంపూర్, కొణిసి తదితర ప్రాంతాలకు చెందిన బాలబాలికలు సుమారు 70 మంది పాల్గొన్నారు. శిక్షకులు మ్యాచులు నిర్వహించి ఉత్తమ ఆట కనబరిచిన బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ నెలాఖరి వారంలో పూరీలో జరగనున్న అంతర జిల్లా ఖోఖో పోటీల్లో గంజాం జిల్లా జట్టు పాల్గొననున్నట్లు జీడీఏఏ ప్రధాన కార్యదర్శి జె.కామేశ్వరరావు సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. జీడీఏఏ ఉపాధ్యక్షుడు కేదార్‌నాథ్ చౌదురి శిబిరాన్ని పర్యవేక్షించారు.

సునాబెడలో రక్తదాన కార్యక్రమం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడకు చెందిన సాయి సైనిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ సంతోష్‌కుమార్ జెనా శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ స్మృతిరేఖ అధ్యక్షతన జిల్లా రక్తదాతల సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్ సాహు, స్నిగ్ధరాణి మిశ్ర పాల్గొన్నారు. 20 మంది రక్తదానం చేశారు.

మోహన్‌బాబుకు అభినందనలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: సినీ నటుడు, దర్శకుడు మోహన్‌బాబు సినీ పరిశ్రమలో 50 ఏళ్ల ప్రస్థానం పూర్తిచేసుకున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో 'ఎంబి 50' పేరిట శనివారం ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి పర్లాఖెముండి నియోజకవర్గ ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి హాజరై మోహనబాబుకు అభినందనలు తెలిపారు. మోహన్‌బాబుతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

సినీ నటుడు మోహన్‌బాబుతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

నైతిక విద్య, యోగా శిక్షణ శిబిరం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నైతిక విద్య, యోగా శిక్షణపై ఆదివారం శిబిరం నిర్వహించారు. గుసాని సమితి ఉప్పలాడ ప్రాంతంలో ఉన్నటువంటి ఠాగూర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో కేంద్రపడ జిల్లా నుంచి వచ్చిన దివ్య జీవన్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సత్సంగ్ విహార్ ప్రచారకులు స్వామి రామశరణానంద సరస్వతి, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రఫుల్ల కుమార్ మహంత్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా: పదేళ్ల బాలుడి దుర్మరణం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కె.నువాగాం ఠాణా పరిధిలో భ్రమరపూర్ పంచాయతీలోని సమాసింగి గ్రామ శివారులోని బాహుదా నది వద్ద ఆదివారం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ సమయంలో చోదకుడి పక్కన కూర్చున్న పదేళ్ల బాలుడు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు భ్రమరపూర్ గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ప్రకాష్ నాయక్‌గా గుర్తించారు. ఉదయం నదిలో ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేసి ర్యాంప్ మీదుగా పైకి ఎక్కే క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపుతప్పి ఒక్కసారిగా పైకి లేచి బోల్తా పడింది. జేసీబీతో ట్రాక్టర్‌ను తొలగించి ప్రకాష్ మృతదేహాన్ని కార్మికులు గ్రామంలోని బాలుడి ఇంటికి తరలించారు. ఈ ఘటనతో భ్రమరపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దుర్ఘటన అనంతరం ట్రాక్టరు చోదకుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు.

కర్రతో కొట్టి అన్నను హత్యచేసిన వ్యక్తి

నవరంగపూర్, న్యూస్‌టుడే: తన అన్నయ్యను కర్రతో కొట్టి హత్య చేసిన ఘటన నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితి నువాపరా గ్రామంలో జరిగింది. ఠాణాధికారి రఘునాథ్ మాఝి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివ సింగ్ గండ్(28) కోతల పనుల కోసం ఖుడుకు గ్రామంలో ఉంటున్న పిన్ని కుమారుడు రాజేష్‌గండ్‌ను పిలిచారు. శనివారం కోతల పనులు పూర్తయ్యాక రాత్రి ఇద్దరి మధ్య ఏదో గొడవ జరిగింది. కోపంతో రాజేష్ పక్కనే ఉన్న కర్రతో శివ సింగ్ తలపై గట్టిగా కొట్టాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేష్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

చెరువులో జారిపడి విద్యార్థి మృత్యువాత

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కొలనరా సమితి కేంద్రంలోని రాణి చెరువులో జారి పడి వికాస్ మెలక(7) శనివారం సాయంత్రం మృతి చెందాడు. చందిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనరాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వికాస్ వెళ్లాడు. సాయంత్రం స్కూలు విడిచి పెట్టిన తరువాత తోటి విద్యార్థులతో చెరువు వద్దకు వెళ్లి కాలుజారి పడిపోయి నీటిలో మునిగిపోయాడు. తోటి విద్యార్థులు సమాచారంతో చెరువు వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు గాలించారు. బాలుడి ఆచూకీ తెలియక పోవడంతో అగ్నిమాపక సిబ్బంది చెరువులో దిగి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 వేల లీటర్ల ఊటసారా ధ్వంసం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బడగడ ఠాణా పరిధిలోని కె.బురుపడ గ్రామ శివారులోని సారా అక్రమ తయారీ కేంద్రాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ప్లాస్టిక్ బకెట్‌లలో నిల్వ ఉంచిన మూడు వేల లీటర్ల ఊటసారాను ధ్వంసం చేసి, 500 లీటర్లను స్వాధీనం చేసుకున్నామని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్లాస్టిక్ బకెట్‌లలో నిల్వ ఉంచిన ఊటసారా

మండిన గ్యాస్: మహిళ మృతి

జయపురం, న్యూస్‌టుడే: వంట చేసేందుకు గ్యాస్‌స్టవ్‌ను వెలిగించగా మంటలు చెలరేగి మహిళ మృతిచెందిన ఘటన జయపురం సమితి కంగా పంచాయతీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంగా ప్రాంతానికి చెందిన రాజేశ్వరి బిసోయి(47)కు టిఫిన్ సెంటర్ ఉంది. శుక్రవారం వంట చేసేందుకు రాజేశ్వరి స్టవ్ వెలిగించగా మంటలు చెలరేగి ఆమె తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు జిల్లా ప్రధానాసుపత్రికి, మెరుగైన చికిత్సకు విశాఖపట్టణంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి అస్వస్థత

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణ సింగుపూర్‌లో నాగావళి నది తీరంలో ఉన్న శ్మశాన వాటికలో శనివారం మృతదేహాన్ని దహనం చేస్తున్న సమయంతో తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పదిమంది వరకు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో కె.సింగుపూర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దహనం చేస్తున్న సమయంలో వచ్చే పొగ కారణంగా సమీపంలో ఉన్న నాలుగు తేనెపట్ల నుంచి తేనెటీగలు దాడిచేశాయని స్థానికులు తెలిపారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ: నలుగురికి గాయాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కవిసూర్య నగర్ ఠాణా పరిధిలోని హిండల గ్రామంలో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గంపై కత్తులు, హాకీ స్టిక్‌లతో దాడి చేయడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కవిసూర్యనగర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. ఈ ఘటనపై ఆదివారం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రాజకీయ కక్షల కారణంగా ఈ దాడి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాటు తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: నాటు తుపాకితో కాల్చుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గజపతి జిల్లా గుమ్మ సమితి సేరంగో ఠాణా పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఠాణా అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుబుని పంచాయతీ సితిరిగూడ గ్రామానికి చెందిన బిర్సన్ గమాంగ్(34) మానసికంగా బాధపడుతూ ఇంటికి సమీపంలో ఉన్న అడవిలో శనివారం రాత్రి నాటు తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన భార్య జుని గమాంగ్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిర్సన్ గమాంగ్

ఖనిజాల అక్రమ రవాణా: 25 వాహనాలు స్వాధీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం పోలీసు జిల్లాలోని వివిధ ఠాణాల పరిధుల్లో ఖనిజాలు (మైనర్ మినరల్స్) అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. కళ్లికోట, ఛత్రపురం, ఛమ్మాఖండి, హింజిలి, సురడా, బడగడ, బెల్లుగుంఠ, బెగునియాపడా, పొలసరా, పురుషోత్తంపూర్, కవిసూర్యనగర్ ఠాణాల పరిధుల్లో ఆయా ఖనిజాలను అక్రమంగా రవాణా చేస్తున్న 25 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నలుగుర్ని ఢీకొన్న బస్సు

భువనేశ్వర్, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జాజ్‌పూర్ సదర్ పోలీసుస్టేషన్ పరిధిలోని బరిఖపుకియా రోడ్ కురులా కూడలి వద్ద ఆదివారం ఉదయం ఒక ప్రయాణికుల బస్సు నలుగురిని ఢీకొంది. ఈ ఘటనలో వారంతా తీవ్రంగా గాయపడి కటక్ పెద్దాసుపత్రిలో చికిత్సకు చేరారు. ఆగ్రహించిన ప్రజలు బస్సు ప్రయాణికుల్ని దింపించి బస్సు టైర్లు తగలబెట్టారు. క్షతగాత్రులకు న్యాయం చేయాలని కొంతసేపు ధర్నా చేశారు. పోలీసులు వారికి శాంతింపజేసి, బాధితులకు పరిహారంగా సొమ్ము చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంతంలో గాయాలతో యువకుడు

పర్లాఖెముండి: పర్లాఖెముండి రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని అమ్మవారి మందిర ప్రాంతంలో యువకుడు గాయాలతో పడి ఉన్నట్లు ఆదివారం స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో రైల్వే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ యువకుడిని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడు శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రౌతుపురానికి చెందిన టి.ఎర్రయ్యగా గుర్తించారు. మద్యం తాగి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ ముఠా అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా రవుర్కెలాకు చేరువలోని లట్టికొటా వద్దనున్న మైనింగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఒక దోపిడీ ముఠాపై దాడులు చేసిన పోలీసులు అయిదుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు తప్పించుకుని పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యే యత్నం చేశారు. ఈనేపథ్యంలో పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో వారి కాళ్లకు బుల్లెట్లు తగిలాయి. గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్పించారు.

ప్రయాణికురాలికి గాయాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: బంగారు గొలుసు కోసం దుండగులు ఒక మహిళను గాయపరిచిన ఘటన ధవళి రైలులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైలులో బంధువులతో పెళ్లికి సుర్మాహుజా వెళుతున్నారు. ఆమెను అనుసరిస్తున్న ఇద్దరు దుండగులు ఆమె మెడలో బంగారు గొలుసును, హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కొని బోల్‌పూర్ స్టేషన్ దగ్గరలో పరిగెడుతున్న రైలు నుంచి దూకి పారిపోయారు. ఈ సమయంలో ఆమె గాయపడటంతో చికిత్సకు ఆసుపత్రికి తరలించారు. ఆ స్టేషన్‌కు సమీపంలోని గ్రామస్థులు ఆ నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

(c) eenadu

బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం కళాకారుల ప్రదర్శన

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ తిరువీధిలో ఇచ్ఛాపురం బాలికల శాస్త్రీయ నృత్యప్రదర్శన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి వేంకటేశ్వర దేవస్థానం పరిధి తిరుచానూరు పద్మావతిదేవి దేవస్థానంలో జరిగిన కార్తిక బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం కళాకారులు తమ ప్రతిభతో కళాసేవ చేసుకున్నారు. ఇచ్ఛాపురం వెంకటేశ్వర డాన్స్ అకాడమీ కళాకారుల బృందం బుధ, శుక్ర, శనివారాల్లో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నాగురుస్వామి, జయలక్ష్మి పట్నాయక్ తెలిపారు. కూచిపూడి గ్రామ నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు జరిగాయని, బుధవారం అమ్మవారి తిరువీధి సందర్భంగా మాడవీధుల్లో నృత్యనీరాజనం అందించారు. శుక్రవారం మహతి కళావేదికపైనా, శనివారం శిల్పారామంలో నృత్యప్రదర్శన జరిగాయన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం శేషవస్త్రాలతో కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందించారని వివరించారు. కావ్య, శైలు, పూజ, విజయలక్ష్మి, శ్వేతారాణి, జాగృతి, దీపిక, జైత్రి, జాహ్నవి, లిఖిత, పల్లవి, సింధు, మధు, చంద్రకళ, పూజ, అక్షయ, హేమలత, సుజాత, గాయత్రి పాల్గొన్నారు.

తిరుపతి మహతి కళావేదికపై నృత్యప్రదర్శన చేస్తున్న ఇచ్ఛాపురం కళాకారులు

జగన్నాథునిపై నమ్మకం... కోలుకున్న చిన్నారి

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: సంవత్సరానికిపైగా ఆ బాలుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎంతో మంది డాక్టర్లకు చూపించాడు తండ్రి. ఫలితం లేకపోవడంతో పిల్లాడితో సహ పూరీలోని జగన్నాథుని ఆలయానికి చేరుకొని ప్రార్థనలు చేశారు. తర్వాత భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చేర్చారు. 15 రోజుల చికిత్సల తర్వాత ఆ ఎనిమిదేళ్ల పిల్లాడు కోలుకున్నాడు.

అసలేం జరిగింది?

రాజస్థాన్‌కు చెందిన ప్రకాశ్ భోయ్ అనే వ్యక్తికి నిఖిల్ అనే 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఏడాది కాలంగా నిఖిల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్నో ఆసుపత్రుల్లో చూపించాడు తండ్రి ప్రకాశ్. ఆరోగ్యం కుదుటపడలేదు. ఇక చేసేది ఏమీ లేక పూరీకి తీసుకొచ్చాడు. కుమారుడ్ని సింహద్వారం వద్ద ఉంచి ప్రార్థించి తర్వాత ఎయిమ్స్‌కు తరలించాడు. తర్వాత చిన్నారి కోలుకున్నాడు.

ఆత్మరక్షణ శిక్షణతో శారీరక దృఢత్వం

సీతానగరం, న్యూస్‌టుడే: విద్యార్థినులందరూ ఆత్మరక్షణ విద్య శిక్షణను సద్వినియోగం చేసుకుని, మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని సాధించాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి కోరారు. జోగింపేట కేజీబీవీ కేంద్రంగా రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణను ప్రారంభించారు. విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు లక్ష్మణ, ఏపీసీ తేజేశ్వరరావు, తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో-2 వెంకటరమణ, ప్రత్యేకాధికారిణి సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, ఇచ్ఛాపురం

సత్యసాయి స్ఫూర్తి..

సేవా దీప్తి



ఆధ్యాత్మిక వికాసమే ధ్యేయంగా, సమాజ సేవే లక్ష్యంగా సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ముందడుగు వేస్తున్నారు. సత్య సాయిబాబా పేరిట జిల్లావ్యాప్తంగా మందిరాల ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రజల్లో భక్తి, సేవా భావాలను పెంపొందిస్తున్నారు. అభాగ్యులు, అనాథలు, అన్నార్తుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా జిల్లాలో సేవలపై కథనం.

ఆపన్నహస్తం అందిస్తూ..

జిల్లాలో 122 భజన మండళ్లు, 31 సత్యసాయి సేవా సమితుల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మహిళలు, యువత, పిల్లలను ఆధ్యాత్మిక మహిళ, సేవాదళ్, యువ, బాలవికాస్ విభాగాలుగా వర్గీకరించి శిక్షణ ఇస్తున్నారు. నిత్య నారాయణసేవా, దీన జనోద్ధరణ, విద్యాజ్యోతి వంటి పథకాలు అమలు చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న దేవాలయాలను పునరుద్ధరిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో లక్షలాది మొక్కలు నాటారు.

శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో రోగులు, సహాయకులకు ఉచితంగా భోజనం అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

మరింత విస్తరిస్తాం

సత్యసాయి మందిరాల ద్వారా సేవలను మరింత విస్తరిస్తామని సత్యసాయి సేవా సమితుల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు పేర్కొన్నారు. మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ కేంద్రాలు, యువతకు కంప్యూటర్, టైలరింగ్, మెకానిక్, ఇతర వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నట్లు వివరించారు. ఉచిత పశు, కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

❖ 180 బాలవికాస్ కేంద్రాల్లోని 5 వేల మంది పిల్లలకు 215 మంది గురువులు బోధన చేస్తున్నారు. హిరమండలంలో ప్రేమసాయి వృద్ధాశ్రమం స్థాపించారు. 75 మందికి పుట్టపర్తి సత్యసాయి ఆసుపత్రుల్లో గుండె ఆపరేషన్లు ఉచితంగా చేయించారు. 12 ఏళ్లుగా సీతంపేట, ఓణి ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్నారు. మంగళవారంపేట, దోమాం గ్రామాలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. శ్రీకాకుళం, పాలకొండ, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస ప్రాంతాల్లో కైవల్య రథాల ద్వారా అనాథ శవాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. పలాస, పాలకొండలో ఫ్రీజర్ బాక్సులున్నాయి. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ యంత్రాలను ఉచితంగా సరఫరా చేశారు.

జిల్లావ్యాప్తంగా సేవలు

జిల్లాలో జాతీయ నిత్య నారాయణ సేవలో భాగంగా పెద్దమందిరం, న్యూకాలనీ మందిరాల్లోనే కాకుండా 50 చోట్ల రోజూ 650 మందికి భోజనాలు అందిస్తున్నారు. భిక్షాటనకు వెళ్లలేని అభాగ్యులను గుర్తించి వారి వద్దకే వెళ్లి ఆహారం ఇస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో రెండు పూటలా సుమారు 500 మంది కడుపు నింపుతున్నారు. ❖ ప్రతి నెల సుమారు 200 మంది గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం ఇస్తున్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, రాజాం, పాలకొండ మందిరాల ఆధ్వర్యంలో 38 మంది బాలురకు ఉచిత వసతి, విద్య అందిస్తున్నారు. 16 చోట్ల మంచి నీటి పథకాలు ఏర్పాటు చేశారు.

పూండి రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

పూండి రైల్వేస్టేషన్ వద్ద ప్రస్తుతం పట్టాల మధ్యలో ఉన్న పాత స్లీపర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం రైల్వే సిబ్బందితోపాటు ప్రైవేట్ కార్మికులతో డౌన్‌లైన్‌లో కొత్త స్లీపర్లు అమర్చే పనులు చకచకా చేపట్టారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు

కురుపాం గ్రామీణం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం జరిగింది. దేవస్థానం ఛైర్మన్‌గా మార్కొండ పకీరునాయుడు, సభ్యులుగా రెడ్డి రాజేశ్వరి, ఎస్.పకీరునాయుడు, గరుగుబిల్లి మీన, వావిలపల్లి పద్మజ, ముచ్చర్ల నారాయణరావు, ఆరిక జానకి, బొమ్మాలి సుభాషిణి, భగవాన్ వరప్రసాద్ మిశ్రో, ఎస్.లక్ష్మి, ఎం. కృష్ణంనాయుడు, వి.వెంకట అప్పలాచార్యులుతో దేవస్థానం ఈవో బి.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బోరు ద్వారా మడిలోకి నీరు తరలింపు

సాధారణంగా ఉప్పు తయారు చేయాలంటే సముద్రపు నీటిని తీర ప్రాంత భూముల్లో నింపుతారు. అది ఎండ తీవ్రతకు ఎండి ఉప్పుగా మారుతుంది. కానీ సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాంతంలో బోరు నీటి నుంచి ఉప్పు తయారు చేస్తున్నారు. –న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

ఈ నేలలో ఉప్పుంది..!

● సంతబొమ్మాళి మండలం నౌపడ, మర్రిపాడు, తెలగపేట, యామాలపేట తదితర ప్రాంతాల్లో బోర్ల నుంచి వచ్చే నీటితో ఉప్పు పండిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పలు కంపెనీలకు ఉప్పు భూములు లీజు పద్ధతిలో అప్పగించారు. వారు సముద్రపు నీటిని తీసుకొచ్చి మడుల్లో నింపి ఉప్పు సాగు చేసేవారు. గడువు ముగిసిపోవడం, కేంద్రం తిరిగి లీజులు పునరుద్ధరించకపోవడంతో పలువురు రైతులు ఇక్కడ భిన్నమైన పద్ధతిని అనుసరించక తప్పలేదు. ఈ ప్రాంతంలో కుమూల విస్తీర్ణం చాల తక్కువ. సముద్ర నీటిని తీసుకొచ్చి మడుల్లో నింపి ఉప్పు సాగు చేసే అవకాశం లేదు. దీంతో మోటారు ద్వారా భూగర్భ జలాలను తోడి ఆ నీటితో ఉప్పు తయారు చేస్తున్నారు.

తయారీ ఇలా..

★ ఉప్పు తయారీకి లవణ శాతం ఎక్కువ ఉన్న నీరు కావాలి. తీర ప్రాంత భూగర్భంలో 40-50 అడుగుల్లోపే ఇలాంటి నీరు పుష్కలంగా దొరుకుతుంది. బోర్ల నుంచి తోడిన నీటిలో లవణ శాతం 5-7 వరకు ఉంటుంది.
★ సన్నటి కాలువల ద్వారా చిన్న మడుల్లోకి ఆ నీటిని పంపుతారు. ఎండ తీవ్రత ఆధారంగా వారం రోజులు ఉంచుతారు. అక్కడ నీటిలో ఉప్పు సాంద్రత 10-18 శాతానికి చేరుకుంటుంది. అక్కడ నుంచి మరో మడికి తరలిస్తే 24 శాతం. ఉప్పు పండించే ప్రధాన మడిలో వేస్తే 28 శాతంగా మారుతుంది. అనంతరం ఆరేడు రోజుల్లోనే ఉప్పు సేకరిస్తారు.
★ నౌపడ ప్రాంతాల్లో ఉప్పు సాగు శ్రమ, తెలివితేటలపై ఆధారపడి ఉంటుంది. పెద్దసంఖ్యలో ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఏటా డిసెంబర్‌లో ఉప్పు పనులు ప్రారంభిస్తారు. ఉప్పు సాంద్రతను హైడ్రో మీటరు ద్వారా రైతులు ఎప్పటికప్పుడు పరీక్షిస్తుంటారు. జనవరి నుంచి ఉప్పుతీత ఉంటుంది.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

రాష్ట్ర క్రీడా సంఘాల గుర్తింపు క్రమబద్ధీకరించకపోవడంతో వందలాదిమంది సీనియర్ జాతీయస్థాయి క్రీడాకారులు ఆటలో శ్రమించి సాధించిన ధ్రువపత్రాలు పనికి రావడం లేదు. ఒకవైపు అసోసియేషన్ ప్రతినిధుల నిర్లక్ష్యం, మరోవైపు ఆధిపత్య పోరుతో క్రీడాకారుల జీవితాలు అంధకారమయమవుతోంది.

ప్రయోజనాలు ఇలా..

★ గుర్తింపు ఉన్న క్రీడా సంఘాల్లో ఉంటే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, క్రీడాసామగ్రి అందుతుంది.
★ గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు క్రీడాకోటాలో రిజర్వేషన్ లభిస్తుంది.
★ శాప్ గుర్తింపు లేకుండా, రెన్యువల్ చేయకుండా పోటీలు నిర్వహించకూడదు. ఇలాంటివి ఉంటే శాప్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

శాప్ గుర్తింపు ఉన్న క్రీడా సంఘాలివి

బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, సాఫ్ట్ టెన్నిస్, ఆమెచ్యూర్ అక్వాటిక్స్, జూడో, చదరంగం, జిమ్నాస్టిక్స్, కుడో, యోగా

★ రాష్ట్ర, జిల్లాస్థాయిలో కొన్ని క్రీడా సంఘాలకు గుర్తింపు లేకపోవడంతో క్రీడాకారులు ఎన్ని పతకాలు సాధించినా.. ప్రయోజనం ఉండట్లేదు. రాష్ట్రంలో కబడ్డీ సంఘానికి గుర్తింపు లేకపోగా పదవులపై యావతో కొంతమంది స్వార్థపరులు సంఘాన్ని భ్రష్టు పట్టించడంతో క్రీడా స్ఫూర్తి కనుమరుగైపోతోంది. న్యాయం చేయాల్సిన పాలకులే అన్యాయం చేస్తుండటంతో ఆటగాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
★ క్రీడలు, క్రీడాకారులకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం క్రీడాకోటాను రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచింది. ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ భర్తీలో పలువురు క్రీడాకారులకు పరీక్షతో సంబంధం లేకుండా ప్రత్యేక క్రీడాకోటా డీఎస్సీని విడుదల చేసింది.

జీవితాలతో ఆటలు..!

గుర్తింపు లేని సంఘాలతో క్రీడాకారులకు అన్యాయం

● జిల్లాలో కబడ్డీ సంఘానికి గతంలో తెదేపా నుంచి యార్లగడ్డ వెంకన్నచౌదరి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. అందులో నుంచి బయటకొచ్చిన వైకాపాకు చెందిన వ్యక్తి మరో సంఘాన్ని ఏర్పాటు చేసి కృష్ణదాస్ కొడుకు ధర్మాన లింగన్నాయుడును నియమించారు. ప్రభుత్వం మారిపోవడంతో ప్రస్తుతం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షుడిగా ఉన్నారు.

క్రీడాకారులు ఇవి తెలుసుకోవాలి

● పోటీల్లో పాల్గొనే ముందే సంబంధిత సంఘానికి గుర్తింపు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో)ను సంప్రదించాలి. ● క్రీడా యాప్‌లో వ్యక్తిగతంగా నమోదు అయితే తెలుసుకోవచ్చు. ● వీటి నిర్వహణ తీరు సంతృప్తికరంగా లేకపోతే విజయవాడలోని శాప్ కార్యాలయానికి ఫిర్యాదు చేయొచ్చు.

రెన్యువల్ చేసుకోని సంఘాలు

సాఫ్ట్‌బాల్, రోలర్ స్కేటింగ్, ఫెన్సింగ్, పెన్‌కాక్‌సిలాట్, టెన్నికాయిట్, డెఫ్ స్పోర్ట్స్, అట్యా పాట్యా, ఖో-ఖో, బాస్కెట్ బాల్, సెపక్‌తక్రా, రగ్బీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పారాస్పోర్ట్స్, ఆర్చరీ, జుజిస్టు, స్కూలింగ్ అండ్ రోయింగ్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, రైఫిల్‌షూటింగ్, కనోయింగ్ అండ్ కయాంగ్, తైక్వాండో, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్

'272 జీవో ప్రకారం.. ప్రతి క్రీడా సంఘం గుర్తింపు తీసుకోవాల్సిందే. కొన్ని సంఘాలు దరఖాస్తు చేసుకున్నాయి. తీసుకోని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.' అని శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, మందస, సోంపేట

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం తోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టింది. అయినా విద్యాలయాలను పలు సమస్యలు వేధిస్తున్నాయి. ముఖ్యంగా రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో పాఠశాలలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. పశువులు విచ్చలవిడిగా తిరుగుతుండటంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి.

అధ్వానంగా విద్యాలయాల పరిసరాలు

ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో మొత్తం 693 పాఠశాలలున్నాయి. అందులో 211 పాఠశాలలకు ప్రహరీలు లేవు. ఈ క్రమంలో కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు గ్రామస్థుల సహకారంతో కట్టెలు, ఇనుప కంచెలతో రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. నాడు-నేడు పాఠశాలల్లో మంజూరైన వాటిల్లో బిల్లులు సక్రమంగా రాకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలోనే ఆపేశారు.

★ కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం, గుండం, ఇచ్ఛాపురం మండలం డొంకూరు, సోంపేట మండలంలో ఇసకపాలెం, గొల్లగండి, కవిటి మండలం సీమూరు, మధ్యపుట్టుగ, సన్యాసిపుట్టుగ, బొగిడియ పుట్టుగ పాఠశాలలో ప్రహరీలు లేకపోవడంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారవుతున్నాయి.

రక్షణ గోడు

నియోజకవర్గాల వివరాలిలా...

మండలం	పాఠశాలలు	ప్రహరీలు లేనివి
కంచిలి	101	40
సోంపేట	94	17
కవిటి	112	36
ఇచ్ఛాపురం	88	12
పలాస	82	36
మందస	120	42
వజ్రపుకొత్తూరు	96	28

కంచిలి మండలం గుండం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కట్టెలతో నిర్మించిన ప్రహరీ...

● మందస మండలం పొత్తంగి సిరిపురం, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, మెట్టూరు ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ సగమే నిర్మించారు. ముచ్వలరేవు(లక్ష్మీదేవిపేట) ఒరియా పాఠశాల, గోవిందపురం ఉన్నత పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో పాఠశాలకు రక్షణ లేకుండా పోయింది.

పాఠశాలల ప్రహరీల సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు మంజూరైన వెంటనే విడతల వారీగా ఏటా కొన్ని పాఠశాలలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రహరీల నిర్మాణ పనులు చేపడతాం. – విలియమ్, డిప్యూటీ డీఈవో, టెక్కలి

మట్టి దారి అనుకునేరు...

బెండిగేటు నుంచి బెండి మీదుగా నువ్వలరేవు వరకు రెండు వరుసల విస్తరణ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా బెండి సమీపంలో ఒక వైపు కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. వీటిని తడిపేందుకని మట్టిని గుట్టలుగా వేశారు. దీంతో రహదారి అధ్వానంగా మారింది. సీసీ రోడ్డు గట్టి పడేందుకు వేశాం, పూర్తిగా తొలగించి శుభ్రం చేసేలా చొరవ తీసుకుంటున్నట్లు రోడ్లు, భవనాల శాఖ జేఈ విక్రమ్ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

రాకపోకలకు అవస్థలు

కత్తివరం నుంచి బెలగాం వెళ్లే రహదారికి ఇరువైపులా పొదలు, పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అమ్మో మలుపు.. ప్రమాదాలకు పిలుపు

జగన్నాథపురం సమీప మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో లొద్దపుట్టి, జగన్నాథపురం, టి.బరంపురం, అరకభద్ర, శాసనాం తదితర గ్రామాలతోపాటు ఒడిశాలో మరో 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. తారు రోడ్డుకు ఇరువైపులా అంచులు మరమ్మతులకు గురయ్యాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ విక్రమ్‌ను వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య తీవ్రమైతే తాత్కాలిక చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

కాలువలు నిర్మించరూ..!

రెంటికోటలోని పొందర వీధిలో రోడ్డుకు ఓ పక్క కాలువ లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోతోందని, బురదమయమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సద్గుణ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నిత్యం ఇదే సమస్య

కాశీబుగ్గలో ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత జాతీయ రహదారి వరకు ఉన్న తాగునీటి పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో దారి పొడవునా గోతులు దర్శనమిస్తున్నాయి. తాజాగా రెండు రోజులుగా పైపులైన్ లీకవుతుండంతో నీరంతా వృథాగా పోతోంది. దీనిపై మున్సిపల్ డీఈ కనకరాజును వివరణ కోరగా కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ

మట్టి కోటలు మైమరిపిస్తున్నాయి..!

చిత్రం చూడగానే విశాఖలోని భీమిలి ఎర్రమట్టి దిబ్బలు అనుకుంటున్నారా.. అయితే పొరబడినట్లే. వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు-మెట్టూరు మధ్య శతాబ్దాల కిందట పుట్టిన రాకాసి గెడ్డలోని దిబ్బలివి. కొన్నేళ్ల కిందట మహేంద్రతనయ నది నుంచి ఉద్ధృతంగా ప్రవాహం రావడంతో గెడ్డ కోతకు గురై భూమట్టం నుంచి దాదాపు వంద అడుగుల లోతు వరకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచే ఇవి ఏర్పడ్డాయి. ప్రస్తుతం నీరు లేని ఈ గెడ్డలో అడుగు పెడితే ఎత్తయిన కొండలు, పచ్చని తోటలు మధ్యలో ఎర్ర మట్టి దిబ్బలతో సుందరంగా కనిపిస్తోంది. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వైభవంగా శోభాయాత్ర

సోంపేట, న్యూస్‌టుడే: అయ్యప్ప, శ్రీరామ, శంకర, భవానీ మాలధారణ స్వాముల శోభాయాత్ర ఆదివారం కనులపండువగా సాగింది. సోంపేట నేతాజీ నగర్‌లో శ్రీరామ సన్నిధానం వద్ద తెప్పల రవిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నేతాజీనగర్ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి కోదండరామస్వామి ఆలయం వరకు నిర్వహించిన శోభాయాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆగండి.. గొయ్యి చూసి వెళ్లండి

పాలకొండ గాయత్రీ నగర్ ప్రధాన రహదారిలో కల్వర్టు శిథిలమైంది. ఈ వీధిలోనే ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. దీంతో స్థానికులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. కల్వర్టు మధ్యలో విరిగిపోవడంతో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపడతామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

రెండేళ్లుగా పునాదుల్లోనే..

లక్ష్మీపురం గ్రామ సచివాలయ, వెల్‌నెస్ కేంద్రాల భవనాలు రెండేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. స్థానిక ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో వీటి నిర్మాణ పనులు 2023లో ప్రారంభించారు. బిల్లులు రాక గుత్తేదారు పనులు నిలిపేశారు. దీంతో సచివాలయ, ఆరోగ్య, ఆర్‌ఎస్‌కే ఉద్యోగులు అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. భవనాల పూర్తికి చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగు అధికారి చంద్రమౌళి తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

సత్యసాయి మార్గం సమాజ హితం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజానికి ఎనలేని సేవలు అందించిన బాబా సత్యసాయి మార్గాన్ని అంతా అనుసరించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం పార్వతీపురం పట్టణంలోని కంచరివీధి సత్యసాయి మందిరంలో జరిగిన బాబా శతజయంతి ఉత్సవంలో పాల్గొని, మాట్లాడారు. ప్రజలు శాంతి, ప్రేమతో మెలిగి ప్రశాంత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టర్ వైశాలి, మందిరం కన్వీనర్ డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు
తమిళనాడు
సోమవారం నవంబరు 24, 2025

మద్రాసు హైకోర్టు పరిసరాల్లోని ప్రజలు కోర్టు ప్రాంగణం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వారు బాట హక్కు కోరకుండా కోర్టు అన్ని మార్గాలను ఏడాదికోసారి 24 గంటలపాటు మూసేస్తుంటారు. ఆ ప్రకారం శనివారం రాత్రి 8 నుంచి ఆదివారం రాత్రి 8 గంటల వరకు అన్ని మార్గాలను మూసేశారు

నేడు రాష్ట్రానికి భారీ వర్ష సూచన

తీవ్ర అల్పపీడనం 26న తుపానుగా మారే అవకాశం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 26న తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. మలక్కా జలసంధి, సమీపంలోని దక్షిణ అండమాన్ సముద్రతీరంలో నెలకొన్న అల్పపీడనం ఆదివారం తీవ్రంగా బలపడిందని, అది పశ్చిమ, వాయువ్య దిశలో కదులుతూ సోమవారం ఆగ్నేయ బంగాళాఖాతం, పక్కనే ఉన్న దక్షిణ అండమాన్ తీరంలో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. ఇది అదే దిశలో పయనిస్తూ 48 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని చెప్పింది. అంతేకాకుండా 25వ తేదీ కన్నియాకుమరి, శ్రీలంక-నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వివరించింది. దీని ప్రభావంతో 24వ తేదీ రాష్ట్రంలో కొన్నిచోట్ల, 25 నుంచి 29 వరకు రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. సోమవారం దక్షిణ అండమాన్ తీరంలో గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, మధ్యలో 65 కి.మీ వేగానికి చేరుతాయని, 25, 26 తేదీల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ తీరాల్లో గంటకు 60 నుంచి 80 కి.మీ వేగంతో, మధ్యలో 90 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, ఆ ప్రాంతాలకు జాలర్లు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

ఉష్ణోగ్రతలు పెరిగితే ఉపద్రవమే

- భూతాపం నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకు ప్రణాళికలు
- యూకే ప్రభుత్వ సాయంతో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు



పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు కీలక అడుగుపడింది. రాష్ట్ర ప్రభుత్వం వేడి స్థితిస్థాపకత కేంద్రాన్ని (హీట్ రెసిలియన్స్ సెంటర్) తీసుకురానుంది. దేశంలోనే ఇలాంటి కేంద్రం ఒక రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి. ఇందుకోసం యూకే ప్రభుత్వంతో తమిళనాడు ప్రభుత్వం చేతులు కలిపింది. **- ఈనాడు-చెన్నై**

యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్ఈపీ), వరల్డ్ రీసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ)తో కలిసి యూకే ప్రభుత్వం చేపడుతున్న 'క్లైమేట్ యాక్షన్ ఫర్ ఏ రెసిలియంట్ ఆసియా (కారా)' కార్యక్రమంలో భాగంగా తమిళనాడులో వేడి స్థితిస్థాపకత కేంద్రాన్ని తెస్తోంది.

కేంద్రం ఏం చేస్తుందంటే..

● పెరుగుతున్న వేడి, మారుతున్న వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ, సంస్థాగత పాలనా ముసాయిదాను ఏర్పాటు చేయడంలో ఈ కేంద్రం అత్యంత కీలకంగా మారబోతోంది. ● పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, విపత్తు నిర్వాహణ, ప్రణాళికా విభాగాల్లో తీసుకురావాల్సిన మార్పులు, పెంచుకోవాల్సిన సామర్థ్యంపై దిశానిర్దేశం చేయనుంది. ● ప్రభావవంతమైన పాలసీలు చేయడానికి అవసరమైన ఆధారాల్ని చూపించడం, వాతావరణ గణాంకాల్ని సేకరించడం లాంటివి చేస్తుంది. ● చెన్నైతో పాటు రాష్ట్రంలోని ప్రముఖ నగరాలకు, జిల్లాలకు వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలను ప్రభుత్వ విభాగాలతో కలిసి తీసుకురావడంలో ప్రభావవంతంగా పనిచేయనుంది. ● పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనుగుణంగా ఉపశమన కార్యక్రమాలు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు అవసరమైన నిధుల సేకరణకు వివిధ బ్యాంకులతో పాటు ప్రపంచవ్యాప్త ఆర్థిక వనరుల విభాగాలతో చర్చలు జరపనుంది.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు చర్యలు

ఇప్పటికే వేడి నియంత్రణ, జాగ్రత్త చర్యలపై తమిళనాడు ప్రభుత్వం.. వాతావరణ మార్పులు, పర్యావరణ, అటవీశాఖ పరంగా ప్రణాళికలు చేసింది. ప్రత్యేక విపత్తు నిర్వహణ కార్యక్రమాలకూ తెరతీసింది. ఈ ప్రయత్నానికి మరింత బలాన్ని చేకూర్చేలా 'వేడి స్థితిస్థాపకత కేంద్రం' వచ్చింది. దీంతో ఈ ఏడాది నవంబరు 11న బ్రెజిల్‌లోని కాప్30 సదస్సులో నిర్దేశించిన లక్ష్యాల్ని అందుకునేందుకు మరింత సులువు కానున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

రాష్ట్రం నుంచే 11 నగరాలు

తాజా కాప్30 సదస్సులో ఆయా ప్రాంతాల్లో వేడి నియంత్రణకుగానూ 'గ్లోబల్ కూలింగ్ ప్లెడ్జ్'కు ముందుకొచ్చిన నగరాల్లో మన దేశం నుంచి 15 ఉన్నాయి. ఇందులో ఒక్క తమిళనాడు నుంచే 11 నగరాలున్నాయి. చెన్నైతో పాటు ఆవడి, కోయంబత్తూరు, ఈరోడ్, మదురై, సేలం, తాంబరం, తూత్తుకుడి, తిరుచ్చి, తిరుప్పూర్, వేలూరు ఈ జాబితాలో ఉన్నాయి. భవిష్యత్తులో ఆయా నగరాల్లోని పరిస్థితులకు అనుగుణంగా వేడిని చల్లబరిచే వినూత్న ప్రణాళికల రూపకల్పన జరగనుంది.

స్పందనతోనే మార్పు

ప్రపంచం అత్యవసరంగా స్పందించాల్సిన పనుల్లో పెరుగుతున్న వేడి నుంచి బయటపడటం అత్యంత ప్రధానంగా ఉంది. ఇందులో చురుగ్గా స్పందించకపోతే వేడి విపరీతంగా పెరిగి మరింత దుష్ప్రభావాలకు దారితీయనుంది. ప్రాణాలు పోయేదాకా వెళ్లడంతో పాటు ఉపాధి మీద దెబ్బపడనుంది. ఈ నేపథ్యంలో తమిళనాడుతో కలిసి పనిచేస్తుండటం గర్వంగా ఉంది. **- సీమా మల్హోత్రా, ఇండో పసిఫిక్ మంత్రి, యూకే**

ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు

రాష్ట్రంలో వేడి పెరుగుతున్న తీరును అత్యంత కచ్చితంగా మ్యాపింగ్ చేసేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడనుంది. దీన్నిబట్టి ఎక్కువ రిస్క్ ఉన్న జోన్లను గుర్తించొచ్చు. వచ్చిన సంకేతాలకు అనుగుణంగా ప్రభుత్వం స్పందించేందుకు వీలు ఏర్పడుతుంది. ప్రతి నగరానికి, ప్రతి జిల్లాకూ ఈ తరహా వివరాలు రానున్నాయి. ఇందుకు అవసరమైన ఉపగ్రహ డేటాను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. **- సుప్రియా సాహు, రాష్ట్ర పర్యావరణ, వాతావరణమార్పులు, అటవీ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి**

పంచమూర్తుల గొడుగుల ఊరేగింపు

గొడుగుల సమర్పణ

కార్తిక మహా దీపోత్సవాలను పురస్కరించుకొని పంచమూర్తుల వాహనాలకు ఉపయోగించే గొడుగులను చెన్నై పల్లావరం అరుణాచల సేవా ట్రస్టు తరఫున ఆలయానికి సమర్పించారు. ఈ గొడుగులను ఆదివారం మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అరుణాచలేశ్వరాలయంలో కార్తిక మహా దీపోత్సవాలు ప్రారంభం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో సోమవారం ధ్వజారోహణంతో కార్తిక మహా దీపోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ సమయంలో వినాయకుడు, శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, ఉణ్ణామలై సమేత చంద్రశేఖరస్వామి, దుర్గమ్మ సమేత అరుణాచలేశ్వరస్వామి, చండికేశ్వరులు అనే పంచమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. ఏడో రోజు 30వ తేదీ పంచరథాల ఉత్సవం జరుగుతుంది. డిసెంబరు 3వ తేదీ వేకువ జామున 4 గంటలకు ఆలయంలో భరణి దీపం వెలిగిస్తారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు 1668 అడుగుల ఎత్తైన కొండపై మహాదీపం వెలిగిస్తారు. ఆ సమయంలో అర్ధనారీశ్వరర్ భక్తులకు దర్శనమిస్తారు. ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది.

వృషభ వాహనంపై చండికేశ్వరుని అనుగ్రహం

వెండి మూషిక వాహనంపై వినాయకుడు, వృషభ వాహనంపై చండికేశ్వరుని ఊరేగిస్తున్న దృశ్యం

తిరువణ్ణామలై: కార్తిక దీపోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ముందుగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు తొలి రోజు దుర్గమ్మ, రెండో రోజు పిడారి అమ్మన్ ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం వినాయకుడిని వెండి మూషిక వాహనంపై, చండికేశ్వరుని వృషభ వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శునకాలతో ర్యాలీలో పాల్గొన్న జంతు ప్రేమికులు

వీధి కుక్కలను చంపడం పరిష్కారం కాదు

చెన్నైలో జంతు ప్రేమికుల ఆందోళన

టీనగర్, న్యూస్‌టుడే: వీధి శునకాలను వేరే ప్రాంతానికి తరలించేందుకు అనుమతిస్తూ ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పు తమిళనాడులో చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ జంతు ప్రేమికులు, హెవెన్ ఫర్ యానిమల్స్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం చెన్నైలోని పుదుపేటలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినదించారు. వీధి కుక్కలను చంపడం, తరలించడం పరిష్కారం కాదని, వాటిని సంరక్షించాలని కోరారు. 'యానిమల్ బర్త్ కంట్రోల్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, తద్వారా వీధి కుక్కల సంఖ్యను నియంత్రించవచ్చని సూచించారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా డిసెంబరు 8న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

చెన్నై, న్యూస్‌టుడే: కొత్త లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా డిసెంబరు 8న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు పలు పార్టీలు ప్రకటించాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్, వీసీకే వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంపీ తిరుమావళవన్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి పళ.ఆసైతంబి ఆదివారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. అందులో.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, ఈ వ్యవహారంలో ప్రజాభిప్రాయం సేకరించడం, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేయడం వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తుల గురుతర బాధ్యత అని తెలిపారు. లేబర్ కోడ్ విధివిధానాలను తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలు ఇంకా రూపొందించలేదని పేర్కొన్నారు. భాజపాయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు కోరకుండా వాటిని కేంద్రంలోని పాలకులు నిరాకరిస్తున్నారని తెలిపారు. లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో డిసెంబరు 8న ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

లంచం తీసుకుంటే అధికారుల విధ్యార్హతలు రద్దు: సీమాన్

టీనగర్, న్యూస్‌టుడే: తమ పార్టీ అధికారంలోకి వస్తే లంచం తీసుకునే అధికారుల విద్యార్హతలను రద్దు చేస్తామని నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ తెలిపారు. తిరునెల్వేలి జిల్లా కూతన్‌కుళిలో శనివారం జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటిని పరిష్కరించడంలోనూ ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా లంచం తీసుకునే ఏ అధికారిని వదిలిపెట్టమన్నారు. పణగుడి ప్రాంతంలో పశువుల మేత హక్కులను కాపాడాలని కోరుతూ పశ్చిమ కనుమల ప్రాంతంలో తాను తలపెట్టిన పశువుల కాపరి నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. పశువులకు ఆశ్రయం ఇవ్వకుండా క్వారీలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు.

మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యం: విజయ్

పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు

ప్రసంగిస్తున్న విజయ్

సైదాపేట, న్యూస్‌టుడే: తాము అధికారంలోకి వస్తే మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యం ఉంటుందని టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు. కరూర్ దుర్ఘటన అనంతరం మొదటిసారిగా ఆదివారం విజయ్ పార్టీ శ్రేణులు, ప్రజలను కలిశారు. సేలం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని భావించినా పోలీసుల అనుమతి పొందడంలో ఏర్పడిన సమస్యలతో అది వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం కాంచీపురం జిల్లా సంగువారిసత్రంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో 'పబ్లిక్ మీట్' నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన 2000 మందికి పోలీసులు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా విజయ్ ప్రసంగిస్తూ.. అసత్య వాగ్దానాలు చేసి డీఎంకే అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. టీవీకేకు సిద్ధాంతం లేదని అంటున్నారని, డీఎంకే సిద్ధాంతమే అవినీతికి పాల్పడటమని ఎద్దేవా చేశారు. కాంచీపురం వద్ద పాలారు నదిలో సుమారు 22 లక్షల యూనిట్ల ఇసుక దోపిడీకి గురైందని, తద్వారా సుమారు రూ.4,730 కోట్ల అవినీతి జరిగిందని తెలిపారు. టీవీకే అధికారంలోకి వస్తే మహిళల భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని, అలాగే అందరికీ సొంత ఇల్లు, ద్విచక్ర వాహనం, ఇంటికో పట్టభద్రుడు ఉండే విధంగా విద్యా విధానంలో సంస్కరణలు, ఇంట్లో ఒకరికి శాశ్వత ఆదాయం, భద్రతా ప్రణాళిక సృష్టిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు సేకరించి వీటిని అమలు చేస్తామని అన్నారు. రాజకీయ, సిద్ధాంత వ్యతిరేకులు ఎవరనేది ముందే ప్రకటించి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తాను మిగతా వారిలా మాటలతో ప్రజలను మోసగించనని, తాను రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు మంచి చేయడానికని స్పష్టం చేశారు.

క్యూఆర్ కోడ్ పాస్‌లను స్కాన్ చేసి లోనికి అనుమతిస్తున్న నిర్వాహకులు

పిల్లలతో వచ్చే మహిళలకు అనుమతి నిరాకరణ

టీనగర్: సమావేశానికి పిల్లలతో వచ్చే మహిళలకు అనుమతి నిరాకరించారు. విజయ్ సమావేశాలకు అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున తరలివస్తుండటంతో చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిదే అంటుండగా, మరికొందరు అభిమాన నాయకుడిని చూడటానికి వచ్చే మహిళలను పిల్లల కారణంగా అడ్డుకోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

ఐఐటీఎంలో 'ఫైడ్' చెస్ పోటీలు ప్రారంభం

తొలి రోజు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వడపళని, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాసులో మొదటిసారిగా 'శాస్త్ర క్లాసికల్ ఎఫ్ఐడీఈ (ఫైడ్)' చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు పోటీలు జరుగనున్నాయి. శాస్త్ర ఇన్‌స్టిట్యూట్ తరఫున నిర్వహించిన పోటీలను ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి ప్రారంభించారు. ప్రతి పోటీ 90 నిమిషాలు జరుగుతుంది. పోటీల గురించి ఐఐటీ ఆచార్యులు మురుగయన్ అమృతలింగం మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో పిల్లల నుంచి వృద్ధుల వరకు 350మందికి పైగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. స్విస్ వ్యవస్థ, ఎఫ్ఐడీఈ నియమాల ప్రకారం జరిగే 8 రౌండ్ల క్లాసికల్ చెస్ టోర్నమెంట్లలో ఆటగాళ్లు పోటీ పడనున్నారని, విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు.

డిసెంబరు 10న అన్నాడీఎంకే కార్యవర్గ, సర్వసభ్య సమావేశం

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే సర్వసభ్య, కార్యవర్గ సమావేశం డిసెంబరు 10వ తేదీ చెన్నైలో జరుగనుంది. భారత ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సంవత్సరానికి రెండుసార్లు కార్యవర్గ సమావేశం, ఒకసారి సర్వసభ్య సమావేశం జరపాలన్నది నిబంధన. ఆ ప్రకారం డిసెంబరు 10న అన్నాడీఎంకే కార్యవర్గ, సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. చెన్నై వానగరంలోని శ్రీవారి కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ నేతృత్వం వహించనున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యూహం, పొత్తు గురించి నిర్ణయం తీసుకునే అధికారం, ఎన్నికల వ్యూహం, విజయావకాశాలు, కూటమిలోకి పార్టీలను తేవటం, క్షేత్రస్థాయి పరిస్థితులు తదితర పలు విషయాల గురించి ఇందులో చర్చించనున్నట్లు సమాచారం.

30న ఈరోడులో పళనిసామి ప్రచారం.. ఇదిలా ఉండగా ఎడప్పాడి పళనిసామి తలపెట్టిన 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోమ్' ఎన్నికల ప్రచారం ఈనెల 30న ఈరోడులో పునఃప్రారంభం కానుంది. ఆ రోజు ఈరోడు శివారు పశ్చిమ జిల్లా తరఫున గోబిశెట్టిపాళెయంలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఇందులో పళనిసామి ప్రసంగించనున్నారని అధిష్ఠానం ఆదివారం వెల్లడించింది.

టీవీకే అంటే భయపడుతున్న డీఎంకే : టీటీవీ

మాట్లాడుతున్న టీటీవీ దినకరన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: టీవీకే అంటేనే డీఎంకే నేతలకు గుబులు పట్టుకుంటోందని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. ఆయన తిరుచ్చిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 'ఎస్ఐఆర్'కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల అందజేత ప్రక్రియ 90 శాతం ముగిసిందని తెలిపారు. అయినా దీనికి సంబంధించి డీఎంకే నేతలు గగ్గోలు పెడుతుండటం విచిత్రంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలులో తేమ 22 శాతానికి పెంచడానికి కుదరదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. అదేవిధంగా కోవై, మదురైలలో మెట్రో రైలు ప్రాజెక్టులను తిరస్కరించడానికి రాజకీయ దురుద్దేశమే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైతే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే తగిన మూల్యం చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో తమతో చేతులు కలపడానికి కొన్ని పార్టీలు సంప్రదిస్తున్నాయని వెల్లడించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ మానసికంగా కుంగిపోయారని స్పీకర్ అప్పావు పేర్కొనడం ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు.

గాంధీమతి నియామకాన్ని స్వాగతిస్తూ తీర్మానం

మాట్లాడుతున్న రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: పీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా పార్టీ వ్యవస్థాపకులు రామదాస్ కుమార్తె గాంధీమతి నియామకాన్ని స్వాగతిస్తూ తీర్మానం ఆమోదించారు. దిండివనంలో పీఎంకే సామాజిక మాధ్యమ పేరవై వర్కింగ్ కమిటీ సమావేశం రామదాస్ నేతృత్వంలో ఆదివారం జరిగింది. ఇందులో పీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ గాంధీమతి, గౌరవాధ్యక్షుడు జీకే మణి, పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశం ద్వారా పీఎంకే అధ్యక్షుడిగా రామదాస్‌ను ఎన్నుకోవటం, పీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాంధీమతి నియామకాన్ని స్వాగతిస్తూ తీర్మానాలు ఆమోదించారు. అదేవిధంగా యువజన విభాగ అధ్యక్షుడిగా తమిళ కుమరన్‌ను నియమించినందుకు కృతజ్ఞత, వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ డిసెంబరు 12న రామదాస్ నేతృత్వంలో జరగనున్న ఆందోళను విజయవంతం చేయటం తదితర తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా రామదాస్ మాట్లాడుతూ... నేటి ఆధునిక కాలంలో ఎన్నికలు ఎదుర్కోవడంలో సామాజిక మాధ్యమాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని, కావున పార్టీ కార్యకర్తలకు సోషల్ మీడియా శిక్షణ ఇవ్వకుండా ఎన్నికలు ఎదుర్కోలేమని చెప్పారు. అదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో నాగరికమైన విమర్శలు చేయాలని పీఎంకే శ్రేణులకు సూచించారు. వారంలో ఒకరోజు పీఎంకే కార్యకర్తలకు సోషల్ మీడియా శిక్షణ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు.

'ఆల్ ఇండియా టూర్' వెళ్లాలనుకునేవారు మదురై రావాలి

ఉదయనిధి స్టాలిన్

ప్యారిస్: ఆల్ ఇండియా టూర్ వెళ్లాలనుకునేవారు మదురైకి రావాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సూచించారు. తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ తరఫున మదురై తముక్కం స్టేడియంలో ఏర్పాటు చేసిన సారస్ మేళా, ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చాలామంది ఆల్ ఇండియా టూర్ వెళ్లడానికి ఇష్టపడతారని, అలాంటి వారు తముక్కం మైదానానికి రానున్న 12 రోజుల్లో వస్తే సరిపోతుందని, ఆల్ ఇండియా టూర్ వెళ్లిన భావన కచ్చితంగా కలుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన వస్తువులను ఇక్కడ స్వయం సహాయక బృందాలు విక్రయానికి ఉంచారని తెలిపారు. మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, ఎమ్మెల్యేలు దళపతి తదితరులు పాల్గొన్నారు.

● **అంతర్జాతీయ హాకీ స్టేడియం ప్రారంభం ..** మదురైలో అంతర్జాతీయ హాకీ స్టేడియాన్ని ఉదయనిధి స్టాలిన్ శనివారం ప్రారంభించారు. పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్-2025 చెన్నై, మదురైలలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు జరుగనుంది. ఈ పోటీల నిర్వహణకు మదురై రేస్‌కోర్స్ స్టేడియాన్ని రూ. 20 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు.

ఆహారం రుచి చూస్తున్న ఉదయనిధి స్టాలిన్

(c) eenadu

త్వరలో చెన్నై ఎగ్మూరు-రామేశ్వరం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మూరు నుంచి రామేశ్వరం వరకు త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఈ నేపథ్యంలో దక్షిణ రైల్వే తాత్కాలిక సమయ పట్టిక (ప్రొవిజనల్ టైమ్‌టేబుల్) విడుదల చేసింది. ఎగ్మూరులో తెల్లవారు జామున 5.30 గంటలకు బయలుదేరి, తాంబరం, విళుపురం, తిరుచ్చిరాపల్లి, పుదుక్కోట, కారైక్కుడి, శివగంగై, రామనాథపురం మీదుగా రామేశ్వరం చేరుకుంటుంది. తిరిగి రామేశ్వరంలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి ఎగ్మూరుకు 10.20కి వస్తుంది. ఈ రైలు బుధవారం నడవదు.

సత్యసాయి శతజయంతి వేడుకలో పాల్గొన్న శేఖర్‌బాబు

రత్నాకర్‌కు లేఖ అందిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

సైదాపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఆదివారం జరిగిన సత్యసాయి బాబా శతజయంతి వేడుకలో తమిళనాడు హిందూ దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు సత్య సాయిబాబా అందించిన వైద్య సేవలు, కృష్ణా నది జలాల పంపిణీ విషయంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మధ్య ఆయన వారధిగా ఉండటాన్ని గుర్తు చేసుకున్నారు. సత్యసాయి పేరుతో ప్రజా సంక్షేమ పనులు కొనసాగాలని ముఖ్యమంత్రి స్టాలిన్ రాసిన శుభాకాంక్షల లేఖను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌కు అందజేశారు.

'టెట్'లో అదనపు మార్కులు కేటాయించాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో అదనపు మార్కులు కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్య ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారు అర్హత పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు అర్హత పరీక్షలను మరికొద్ది రోజుల్లో నిర్వహించనుంది. దీనికి మొత్తం 100 మార్కులు నిర్ణయించారు. విధుల్లో అనుభవానికి 20 మార్కులు, జనరల్ నాలెడ్జ్‌కు 20 మార్కులు అదనంగా కేటాయించాలని ఉపాధ్యాయ సమాఖ్య కోరింది. 1 నుంచి 8వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు మాత్రమే అర్హత పరీక్షలు నిర్వహించాలని కోరింది.

తిరుచ్చెందూర్ ఆలయం వద్ద రీల్స్ చేసిన యువకులు

చర్యలు చేపట్టాలంటున్న భక్తులు

ఆలయం ఎదుట రీల్స్ చేస్తున్న యువకులు

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుచ్చెందూర్ ఆలయం వద్ద కొందరు యువకులు చేసిన రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుచ్చెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆరుగురు యువకులు ఆలయానికి వచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేశారు. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రదేశాల పవిత్రతను దెబ్బతీస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇన్ హౌస్ కోచింగ్

విధానాన్ని ప్రవేశపెడుతున్న ఆర్ట్స్, సైన్స్ కళాశాలలు

– న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరంలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు 'ఇన్ హౌస్ కోచింగ్' విధానాన్ని పలు కళాశాలలు ప్రవేశపెట్టాయి. ప్రభుత్వ ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చొరవలో భాగంగా కొన్ని కళాశాలలు పూర్వ విద్యార్థులతో వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా దిశగా సామాజిక మాధ్యమాలు, చట్టపరమైన అక్షరాస్యత, సైన్స్, పరిశోధన, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ(ఎంసీసీ) ఆలోచనలో ఉంది. కొన్ని సంస్థలు సోషల్ మీడియా మేనేజర్లను పేర్కొంటూ కొత్త తరహాలో విస్తేస్తున్నాయని, క్లబ్ కార్యకలాపాల్లో భాగంగా విద్యార్థులకు మంచి శిక్షణ అందిస్తామని, ఆన్‌లైన్‌లో హౌస్ ఈవెంట్‌లను నిర్వహించడం ద్వారా కూడా విద్యార్థులకు మంచి అవగాహన కలిగే అవకాశముందని ఎంసీసీ కళాశాల ప్రిన్సిపల్ పాల్‌విల్సన్ పేర్కొన్నారు. కెరీర్, విద్యా రంగం, వ్యవస్థాపకత ఎలెక్టివ్ కోర్సులు, ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రామ్ జరిపిస్తున్నాం మ్యాప్ చేసే ఆలోచన కూడా తమ కళాశాలకు ఉందని విల్సన్ తెలిపారు.

ఇంటర్నల్ మార్కులతో ఉపయోగం

పరీక్షలకు ముందుగా ఇంటర్నల్ మార్కుల పద్ధతిని ప్రవేశపెట్టాలని డీవై వైష్ణవ్ మహిళా కళాశాల యోచిస్తోంది. కొత్త అభ్యాస విధానంలో భాగంగా ఇంటర్నల్ మార్కులను విద్యార్థులు అంగీకరించాలని, ఇంటర్నల్ మార్కుల ద్వారా సెమిస్టర్ పరీక్షలకు ముందునుంచే విద్యార్థులు ఆలోచనలో పడతారని, అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ ఎస్. సంతోష్‌బాబు పేర్కొన్నారు. ఒకవేళ తక్కువ మార్కులుంటే అధ్యాపకులు కూడా తమ వైపు నుంచి ఏవైనా పొరబాట్లు ఉంటే సరిదిద్దుకునే అవకాశం లేకపోలేదని ఆయన వివరించారు.

విదేశీ సంస్థలతో ఒప్పందాలు

నగరంలోని యతిరాజ్ మహిళా కళాశాల విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించేందుకు విదేశీ సంస్థలతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ క్రమంలో సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ కోసం దాదాపు 50 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కోర్సుతో విద్యార్థులు పీజీ ప్రోగ్రామ్‌లు, పరిశోధనల గురించి ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్. ఉమాగౌరి పేర్కొన్నారు. విద్యార్థులతో స్టార్టప్‌లను పెంపొందించడానికి ఇన్‌క్యుబేషన్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉన్నట్లు ఆమె తెలిపారు.

ప్రముఖుల విజయాలు తెలియజేసేలా..

ఉమెన్ క్రిస్టియన్ కాలేజీ (డబ్ల్యూసీసీ)... తమ సంస్థలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పన కోసం 'హౌస్ కోచింగ్'ను ప్రారంభించింది. ఇప్పటికే ఈ శిక్షణలో అనేక మంది చేరారు. మద్రాస్ శాసనసభకు మొదటి మహిళా సభ్యురాలు రుక్మిణీ లక్ష్మీపతి, మొదటి మహిళా ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఆఫీసర్ సీబీ ముత్తమ్మ ఈ కళాశాల పూర్వ విద్యార్థులు. ఈ ఇద్దరి విజయాల గురించి తమ కళాశాల విద్యార్థులకు తెలియజేయాలనుకుంటున్నామని ప్రిన్సిపల్ లిలియన్ జాస్పర్ పేర్కొన్నారు.

కవి సురదాకు నివాళి

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి నాజర్, మేయర్ ప్రియ తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: రూపకకాల కవి, సినీ గేయరచయిత, స్క్రిప్టు రచయిత సురదా 105వ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు. అశోక్‌నగర్‌లోని సురదా విగ్రహం వద్ద ఆదివారం అలంకరించిన ఆయన చిత్రపటానికి మంత్రి నాజర్, జీసీసీ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, ఇతర ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సురదా కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుమ్మిడిపూండి, ఎగ్మూరు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

వార్ మెమోరియల్ వద్ద నివాళులర్పిస్తున్న ఆర్.శ్రీనివాస్

ఘనంగా ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం

వడపళని, న్యూస్‌టుడే: నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 78వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చెన్నైలోని విక్టరీ వార్ మెమోరియల్ వద్ద మేజర్ జనరల్ ఆర్.శ్రీనివాస్, సీఓఎస్, హెడ్ క్వార్టర్స్ దక్షిణ భారత్ ఏరియా ఇండియన్ ఆర్మీ ఆర్‌అడ్మ్ సతీష్ షెనాయ్ తదితరులు ఎన్‌సీసీ అమరులకు నివాళులర్పించారు.

కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా రైతుల ఆందోళన

మాట్లాడుతున్న రైతు సంఘ ప్రతినిధులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలుకు తేమ శాతాన్ని 17 నుంచి 22 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇటీవల రాసిన లేఖలో కోరింది. ఆ మేరకు కేంద్ర ఆహార శాఖ అధికారుల బృందం డెల్టా జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీని ఆధారంగా ధాన్యం తేమ శాతాన్ని పెంచే ప్రసక్తేలేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడానికి నిరసగా రైతులు ఆందోళనకు దిగారు. తంజావూరులో ఆదివారం జరిగిన ఆందోళనకు డీఎంకే రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి విజయన్ అధ్యక్షత వహించారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ సాయం ప్రకటించారు. చెంగల్పట్టు జిల్లా కూవత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అళగేశన్(47) వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఈనెల 19వ తేదీ పుదుచ్చేరి-చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయన ఘటనా స్థలిలోనే మరణించాడు. ఆయన మృతికి ముఖ్యమంత్రి స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబీకులు, బంధువులకు, తోటి ఉద్యోగులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.30లక్షలు ప్రభుత్వ సాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

డీఎంకేను విమర్శించే అర్హత విజయ్‌కు లేదు: టీకేఎస్ ఇళంగోవన్

చెన్నై, న్యూస్‌టుడే: తమ పార్టీపై విమర్శలు చేసే అర్హత టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు లేదని డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ తెలిపారు. చెన్నైలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ... విజయ్‌కు అన్నాదురై గురించి తెలియదన్నారు. ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో పార్టీని అన్నాదురై ప్రారంభించలేదని తెలిపారు. విజయ్ మాత్రం తొలి ఎన్నికల్లోనే ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో ఉన్నారని విమర్శించారు. పార్టీ విధానాల కోసం డీఎంకే వారు జైళ్లకు వెళ్లారని, ఇప్పటివరకు అన్నాదురై విధానాలనే డీఎంకే నెరవేర్చుతోందని తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్టులను నిరాకరించిన కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. భాజపాకు బానిసగా ఆయన ఉన్నారని ఆరోపించారు. కరూర్ తొక్కిసలాట దుర్ఘటనకు విజయ్ కారణమని, బహిరంగ సభకు ఆయన ఆలస్యంగా రావడం వల్లే ఘటన జరిగిందని ఆరోపించారు. అందువల్ల ఈ వ్యవహారంపై ఆయన ఎప్పటికీ మాట్లాడరన్నారు. డీఎంకే దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించడానికి విజయ్‌కు ఎలాంటి అర్హత లేదని, ఆ పార్టీవారే దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: కరోనా కాలంలో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... కరోనా కాలంలో విధుల్లో ఉండి కరోనా సోకి మృతి చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసులు తదితర ఉద్యోగుల కుటుంబాలకు తగిన పరిహారం అందిస్తామని డీఎంకే తన ఎన్నికల హామీల్లో చెప్పిందన్నారు. ఇంకొన్ని రోజుల్లో డీఎంకే పాలనే ముగియనుందని, ఇంతవరకు వాగ్దానం మేరకు పరిహారం అందించలేదని పేర్కొన్నారు. వారి వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా తెలిపారు. కావున ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే వారికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్‌కు సీఎం సంతాపం

చెన్నై, న్యూస్‌టుడే: దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ యుద్ధ విమానం కుప్పకూలి మరణించిన వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం ప్రకటించారు. తన సంతాప ప్రకటనలో... నమాంశ్ స్యాల్ భౌతిక కాయాన్ని కోయంబత్తూర్‌కు తీసుకొచ్చిన దృశ్యాలను చూసి చలించిపోయానన్నారు. కోయంబత్తూర్‌లోని సూలూర్ ఎయిర్ బేస్‌లో పనిచేసిన ఆయనకు రాష్ట్రం తన నివాళి అర్పిస్తోందని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన ధైర్యం అమరత్వంతో నిలిచిపోతుందని తెలిపారు.

మురసొలి మారన్ సేవలను కీర్తిస్తున్నా

చెన్నై: కేంద్ర మాజీ మంత్రి దివంగత మురసొలి మారన్ సేవలను కీర్తిస్తున్నానంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. మురసొలి మారన్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో... డీఎంకేకు శాస్త్రీయ ముఖచిత్రంగా ఢిల్లీలోనూ, దోహ సదస్సులోనూ మురసొలి మారన్ ముద్ర వేశారన్నారు. కరుణానిధి మనస్సాక్షిగా, పార్టీ ప్రస్థానంలోని క్లిష్ట పరిస్థితులకు సాక్షిగా ఆయన నిలిచారని తెలిపారు. ఆయన వర్ధంతి రోజు ఆయన సేవలను కీర్తించి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.

చెన్నై నుంగంబాక్కంలోని ఎంవోపీ వైష్ణవ మహిళా కళాశాలలో జరిగిన 'నమ్మ లిటిల్ హీరోస్-2025' కార్యక్రమంలో ఉర్‌బేసర్ సుమిత్ సంస్థలో పనిచేసే శుభ్రతా కార్మికుల కుటుంబాలలో కళాశాల విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లను అందజేస్తున్న చెన్నై మహానగర పాలకసంస్థ డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్

– న్యూస్‌టుడే, చెన్నై

అర్ధరాత్రి ఇళ్ల తలుపులు తట్టిన మహిళ

సాయం కోసం వచ్చినట్లు పోలీసుల వివరణ

తలుపు తడుతున్న మహిళ (సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా బర్గూర్‌లో ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి ఓ మహిళ పలు ఇళ్ల తలుపులు తట్టడంతో ఇళ్లలోనివారు భయాందోళన చెందారు. ఎవరూ తలుపులు తీయలేదు. మహిళ తలుపులు తడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయగా.. సదరు మహిళ తన భర్తతో గొడవ పడిందని, బంధువుల దాడిలో గాయపడి సాయం కోసం పలు ఇళ్లకు వెళ్లి తలుపులు తట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ మహిళ కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

కనులపండువగా కుంభాభిషేకం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా హోసూర్ అమ్మన్ నగర్‌లో శ్రీ మహా రాజగణపతి ఆలయ నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల పూజలు జరిపారు. యాగశాలలో ఉంచిన పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోపుర కలశాలను అభిషేకించారు. అనంతరం పరివార దేవతలైన వినాయకుడు, మురుగన్, అమ్మవారి విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఉద్దేశపూర్వకంగానే 'సర్'పై స్టాలిన్ విమర్శలు'

టీనగర్, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజలు డీఎంకేను పూర్తిగా తిరస్కరించబోతున్నారనే విషయం ముందుగా తెలిసిపోవడంతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'ఎస్ఐఆర్' ప్రక్రియను విమర్శిస్తున్నారని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ రామలింగం ఆరోపించారు. ఆదివారం సేలం జిల్లా నెడుంజాలై నగర్‌లోని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కలిసిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీఎంకే, దాని మిత్రపక్షాలు ఒకవైపు 'ఎస్ఐఆర్'ను విమర్శిస్తూనే మరోవైపు ఎన్నికల అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని, మరణించిన వారి పేర్లను చేర్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

24, 26, 27 తేదీల్లో పలు మెము సర్వీసులు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మూరు-విళుపురం సెక్షనులోని విక్రవాండి యార్డులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా 24, 26, 27 తేదీల్లో కొన్ని మెము సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

- **66045** తాంబరం-విళుపురం మెము 09.45 రైలు దిండివనం వరకు నడుస్తుంది.
- **66046** విళుపురం-చెన్నై బీచ్ మెము 13.40 రైలు దిండివనం నుంచి బయలుదేరుతుంది.

బిహార్ ఫలితాలు తమిళనాడులో పునరావృతం: అన్నామలై

విలేకరులతో మాట్లాడుతున్న అన్నామలై

ప్యారిస్, న్యూస్‌టుడే: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తమిళనాడులోనూ పునరావృతం అవుతాయని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై విమర్శించారు. శివగంగై జిల్లా తిరుప్పత్తూర్‌లో శ్రీలంక సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఆ దేశ మంత్రి అయిన జీవన్ కుమరవేల్ తొండమాన్ వివాహం ఆదివారం జరిగింది. ఇందులో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భాజపా, శ్రీలంక సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్‌కు మధ్య పార్టీపరంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. బిహార్ ఎన్నికల్లో ఓటర్లకు ఇచ్చిన డబ్బులు తమిళులవని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ఆరోపించారని, అది తప్పుడు సమాచారమని కొట్టిపారేశారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మహిళల పురోగతికి మొదటి దశగా రూ.10 వేలు ఇచ్చారని, మిగిలిన డబ్బులు ఎన్నికల తర్వాత ఇస్తామని ప్రకటించారన్నారు. కాంగ్రెస్ రూ.2 లక్షలు ఇస్తామని చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. ప్రధాని మోదీ పలుకుబడి, సుపరిపాలన ఏర్పడాలని ప్రజలు ఇష్టపడుతున్నారని, కుటుంబ పాలనపై వ్యతిరేకత మొదలైన వాటి వల్ల 2026 తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కరూర్‌లో దోపిడీ దొంగల సంచారం

అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ నగరంలో ముసుగు ధరించిన దొంగలు సంచరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఆ మేరకు వేలాయుధంపాలయం పోలీసు ఇన్‌స్పెక్టర్ ఓంప్రకాశ్ విడుదల చేసిన ప్రకటనలో.. కొన్ని రోజుల క్రితం రాత్రి సమయంలో అరవక్కురిచ్చి, చుట్టుపక్కల గ్రామాలలో నలుగురికి పైగా వ్యక్తులు ట్రౌజర్, జట్టీ ధరించి మాస్క్, టోపీలతో దుడ్డుకర్రలు, కత్తులతో గృహాలలో చొరబడి బెదిరించి నగలు, నగదు దోచుకున్నట్టు ఫిర్యాదులందాయని గుర్తుచేశారు. అందువల్ల వేలాయుధంపాలయం పరిధిలోని నొయ్యల్, మరవాపాళయం, చేమంగి, తిరక్కాడుదురై, తవిట్టుపాళయం, దళవాపాళయం, తోట్టక్కురిచ్చి, కాగిదపురం, పున్నంచత్తిరం తదితర ప్రాంతాలలో ప్రజలు ఇంటి బయట నిద్రించవద్దని, తలుపులు జాగ్రత్తగా వేసుకోవాలని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఎవరైనా తలుపులు తడితే ఎవరో తెలుసుకోకుండా తెరవకూడదన్నారు. అనుమానం కలిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

59.70 మెట్రిక్ టన్నుల పాత సామగ్రి తొలగింపు

నిరుపయోగ సోఫాను తీసుకెళ్తున్న శుభ్రతా కార్మికులు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలకసంస్థ పరిధిలో ఘనవ్యర్థాల నిర్వహణ కింద శనివారం 59.70 మెట్రిక్ టన్నుల పాత సామగ్రిని సేకరించి తొలగించారు. ఇళ్లల్లోని నిరుపయోగ వస్తువులను బహిరంగ ప్రదేశాల్లో పారవేయడాన్ని నివారించడానికి జీసీసీ యంత్రాంగం సరికొత్త ప్రయత్నం చేపట్టింది. ఆ మేరకు ప్రజలు ఇచ్చే ముందస్తు సమాచారం మేరకు వారి ఇళ్లల్లోని నిరుపయోగమైన సోఫాలు, పరుపులు, చెక్క సామగ్రి, దుస్తులను ప్రతి శనివారం జీసీసీ యంత్రాంగం తొలగిస్తుంది. అక్టోబరు 11న ప్రారంభించిన ఈ చర్యల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ వరకు మొత్తం 325.57 మెట్రిక్ టన్నుల పాత సామగ్రిని సేకరించి తొలగించారు. ఈ శనివారం 75 మంది నుంచి అందుకున్న సమాచారం మేరకు 59.70 మెట్రిక్ టన్నుల పాత సామగ్రిని సేకరించి కొడుంగైయూర్‌లో దహనం చేశారు.

తరగతి గదులను ప్రారంభిస్తున్న నిగర్ షాజీ తదితరులు

అంతరిక్షంలోకి మానవుడిని పంపడానికి ప్రయోగాలు

- ఇస్రో శాస్త్రవేత్త నిగర్ షాజీ

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా వివిధ ప్రయోగాలు జరుగుతున్నాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్త నిగర్ షాజీ పేర్కొన్నారు. సూర్యునిపై అధ్యయనం చేయడానికి ఇస్రో 2023లో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం విజయవంతంగా భూమి కక్ష్యలోకి ప్రవేశించింది. ఈ ప్రాజెక్టు డైరెక్టర్‌గా తమిళనాడుకు చెందిన మహిళా శాస్త్రవేత్త నిగర్ షాజీ ఉన్నారు. ఆమె తన స్వస్థలం తెన్కాశి జిల్లాలోని సెంగోట్టైలో తాను చదువుకున్న ఎస్ఆర్ఎం ప్రభుత్వ మహిళా మహోన్నత పాఠశాలలో కొత్త తరగతి గదుల నిర్మాణానికి సాయం అందించారు. ఈ నేపథ్యంలో తరగతి గదుల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. నిగర్ షాజీ, జిల్లా కలెక్టర్ కమల్‌కిశోర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.

తామరభరణి నది ఉగ్రరూపం

- తీర ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరిక

టీనగర్, న్యూస్‌టుడే: పశ్చిమ కనుమల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రముఖ తామరభరణి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా పాపనాశం, శేర్వాలార్, మణిముత్తార్ వంటి ప్రధాన జలాశయాల నుంచి అదనపు నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో పలు జిల్లాల కలెక్టర్లు తీర ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా శ్రీవైకుంఠం, ఏరల్ తాలూకాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ప్రజలు నదిలోకి దిగడం లేదా తీర ప్రాంతాలకు వెళ్లడం మానుకోవాలని హెచ్చరించారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ప్రజలు ప్రభుత్వ సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

కోవై జిల్లాలో భారీ వర్షాలు

కోయంబత్తూరు: కోయంబత్తూరు, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆ మేరకు శనివారం రాత్రి కోవై నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం మళ్లీ వర్షం మొదలైంది. దీంతో గాంధీపురం, రైల్వేస్టేషన్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్ఎస్ పురం, పూల మార్కెట్, గణపతి తదితర ప్రాంతాల్లో నీరు నిలిచింది.

పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన

తిరునెల్వేలి, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా చేరన్‌మహాదేవి సర్కిల్‌లోని పలు గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టాన్ని అంచనా వేసేందుకు జరుగుతున్న సర్వే పనులను జిల్లా రెవెన్యూ అధికారి దురై ఆదివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేరన్‌మహాదేవి ప్రాంతంలోని చొక్కలింగపురం, గోపాలసముద్రం తదితర గ్రామాల్లోని అరటి తోటలు నేలకొరిగాయి. దెబ్బతిన్న పంటలను దురై ఆదివారం సందర్శించారు.

(c) eenadu

నన్ను నేనే మలచుకున్నా: మహత్

సామాజిక మాధ్యమాల్లో వైరలైన ఓ ఫొటో

చెన్నై, న్యూస్‌టుడే: బిగ్ బాస్ కార్యక్రమం ద్వారా పేరు పొందిన మహత్ రాఘవేంద్ర 'మంగాత్త', 'జిల్లా', 'చెన్నై 600028' రెండో భాగం, 'మానాడు' తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఓ చిత్రంలోని తన కథాపాత్ర కోసం బాక్సింగ్‌లో శిక్షణ కూడా పొందారు. ఈ నేపథ్యంలో ఆయన 'మెకానిక్' పేరిట విడుదల చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. దీని గురించి ఆయన మాట్లాడుతూ... కొన్ని నెలలుగా ఆత్మ పరిశీలన చేసుకుని తనను తానే మలచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సరికొత్త ఉద్దేశంతో మెరుగుపడిన వ్యక్తిగా మళ్లీ రంగంలోకి దిగడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. అందులో భాగంగా విడుదల చేసిన 'మెకానిక్' ఫొటోలు తన శరీర సౌష్టవాన్ని మాత్రమే కాకుండా తన కఠిన శ్రమనూ వెల్లడిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మంచి కథలను అభిమానులకు చేర్చే సినిమాల్లో భాగస్వామిగా ఉండాలని భావిస్తున్నట్లు, తన కళా ప్రస్థానంలో తర్వాతి దశకు ప్రవేశించాలని ఆసక్తితో నిరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరాశక్తి రెండో సింగిల్ ప్రోమో విడుదల

చిత్రంలోని ఓ సన్నివేశం

చెన్నై: సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్, శ్రీలీల జంటగా నటిస్తున్న 'పరాశక్తి'లో అథర్వ, రవి మోహన్, బాసిల్ జోసెఫ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ప్రస్తుతం చిత్రీకరణ పనులు ముగిసి నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. చిత్రం జనవరి 14న విడుదల కానున్న నేపథ్యంలో రెండో సింగిల్ 'రత్నమాల'ను 25వ తేదీ విడుదల చేయనున్నట్లు ప్రోమోను విడుదల చేసి చిత్రబృందం ప్రకటించింది.

ఎల్ఐకే రెండో సింగిల్ 27న...

చెన్నై: విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఎల్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ఇందులో ఎస్జే సూర్య, [illegible] కీలకపాత్రల్లో నటించారు. నయనతార, 7 స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించారు. చిత్రం డిసెంబరు 18న విడుదల కానున్న నేపథ్యంలో సెకండ్ సింగిల్ 'పట్టుమా'ను ఈ నెల 27న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పోస్టరును విడుదల చేసి ప్రకటించింది.

స్వానుభవం నుంచి పుట్టిన కథ మాస్క్: విక్రణన్ అశోక్

చెన్నై: వర్ధమాన దర్శకుడు విక్రణన్ అశోక్ దర్శకత్వంలో కవిన్, ఆండ్రియా ప్రధానపాత్రల్లో నటించిన 'మాస్క్' చిత్రం ఇటీవల విడుదలై వసూళ్ల వర్షం కురిపిస్తోంది. చిత్రం గురించి దర్శకుడు విక్రణన్ మాట్లాడుతూ... కొన్నేళ్ల కిందట తనను, తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసిన [illegible] మోసం అనుభవం నుంచి 'మాస్క్' కథ రూపొందిందని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు మోసం ప్రతిఘటించలేరని భావించి వారిని మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తమ దైనందిన బాధ్యతల వల్లే పలువురు ప్రతిఘటించలేదని తెలిపారు. అలాంటి ఓ వ్యక్తి ప్రతిఘటించి ఎదురుదెబ్బ తీసే అవకాశం వస్తే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచి ఈ చిత్రం కథ పుట్టుకొచ్చిందని పేర్కొన్నారు. తాను మోసపోయిన నగదు 17ఏళ్ల పోరాటం తర్వాత ఈ ఏడాది జూన్‌లో లభించిందని తెలిపారు.

అజిత్‌కు పురస్కారం..

సతీమణి షాలిని హర్షం

సామాజిక మాధ్యమాల్లో షాలినీ పంచుకున్న ఓ ఫొటో

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు అజిత్‌కుమార్ 'జెంటిల్‌మెన్ డ్రైవర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం పొందడంపై ఆయన సతీమణి, నటి షాలిని హర్షం వ్యక్తం చేశారు. ప్రొఫెషనల్ రేసర్‌గా ఎన్నో విజయాలు సాధించిన అజిత్‌కుమార్‌ను 'జెంటిల్‌మెన్ డ్రైవర్ ఆఫ్ ది ఇయర్ 2025' పురస్కారంతో ఫిలిప్ చార్రియల్ మోటార్ స్పోర్ట్స్ గ్రూపు సత్కరించింది. ఈ సందర్భంగా షాలినీ తన సామాజిక మాధ్యమ పేజీలో... పారిశ్రామిక ఔత్సాహికులు, రేసర్‌గా ఉన్న ఫిలిప్ చార్రియల్ గౌరవార్థం ఇటలీలోని వెనిస్‌లో ప్రదానం చేసిన ఈ పురస్కారం అందుకున్న తన భర్త వెంట నిలబడినందుకు గర్విస్తున్నానని తెలిపారు. అజిత్‌కుమార్‌తో ఉన్న ఫొటోలను పంచుకున్నారు.

లింక్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

చెరువులకు నీటి విడుదల

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చెన్నై నగర తాగునీటి అవసరాలు తీరుస్తున్న పూండి చెరువుకు 1450 క్యూసెక్‌ల నీరు చేరుకుంటోంది. దీంతో ఇక్కడి నుంచి పుళల్ చెరువుకు 200 క్యూసెక్‌లు, చెంబరంబాక్కం చెరువుకు 400 క్యూసెక్‌ల నీటిని లింక్ కాలువ ద్వారా ఆదివారం వదిలారు. పూండి చెరువు ఎత్తు 35 అడుగులు కాగా 3.231 టీఎంసీల నీటిని నిల్వజేయవచ్చు. ప్రస్తుతం చెరువులో 2.544 టీఎంసీల నీరుంది. అదేవిధంగా పుళల్ చెరువులో 2.741 టీఎంసీలు, చెంబరంబాక్కం చెరువులో 2.853 టీఎంసీల నీరుంది.

పోటీల్లో టీజేఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెరువాయల్‌లోని టీజేఎస్ పబ్లిక్ పాఠశాలలో చైల్డ్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖన, వ్యాసరచన, ముగ్గులు, వక్తృత్వ, నృత్య, క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. 55 పాఠశాలలకు చెందిన 197 మంది విద్యార్థులు పాల్గొన్నారు. టీజేఎస్ పాఠశాల విద్యార్థులు 20 బంగారు పతకాలు సాధించి సత్తాచాటారు. కరస్పాండెంటు మనోజ్, ప్రిన్సిపల్ కస్బార్ వారిని అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మాజీ మంత్రి వీరపాండి ఆర్ముగానికి నివాళి

టీనగర్, న్యూస్‌టుడే: డీఎంకే సేలం జిల్లా మాజీ కార్యదర్శి, రాష్ట్ర మాజీ మంత్రి వీరపాండి ఆర్ముగం వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ నేతలు ఆయన సమాధి వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మంత్రి రాజేంద్రన్ నేతృత్వంలో పార్టీ వర్గీయులు అనేకమంది సమాధి వరకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు.

పోలీసు లాంఛనాలతో ఈరోడు తమిళన్బన్ అంత్యక్రియలు

భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: కవి, ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఈరోడు తమిళన్బన్ భౌతికకాయానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ శనివారం నివాళులర్పించారు. కోయంబేడులోని నివాసంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా ఆదివారం భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

డీఎంకే పూండి యూనియన్ కార్యదర్శిగా మోతిలాల్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: డీఎంకే తిరువళ్లూరు పశ్చిమ జిల్లా పూండి పశ్చిమ యూనియన్ డీఎంకే కార్యదర్శిగా నైవేలికి చెందిన మోతిలాల్‌ను నియమించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో మోతిలాల్ చెన్నై మెరీనా తీరంలోని కలైజ్ఞర్ కరుణానిధి సమాధి వద్దకు వెళ్లి అంజలి ఘటించారు. మోతిలాల్ భార్య మహాలక్ష్మి పూండి యూనియన్ ఉపాధ్యక్షురాలిగా ఐదేళ్ల పాటు వ్యవహరించారు.

శిరస్త్రాణధారణతో ప్రయోజనాలపై అవగాహన

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తంజావూరులో శిరస్త్రాణం ధరించడంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అన్నాదురై విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ట్రాఫిక్ సీఐ రవిచంద్రన్ అధ్యక్షత వహించారు. శిరస్త్రాణం ధరించిన ద్విచక్ర వాహన చోదకులకు కిలో యాపిల్ పండ్లను అందజేశారు. అదేవిధంగా కార్లలో సీటు బెల్టులు ధరించిన వారికి కూడా ఫలాలు అందజేసి అభినందించారు.

పెంట్లాండ్ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరులోని పెంట్లాండ్ ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. రోగుల వివరాలు, అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ప్రసవ వార్డు సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు.

అమృతి 'జూ'లో వసతుల పరిశీలన

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లాలోని అమృతి వద్ద ఉన్న జంతు ప్రదర్శనశాల(జూ)ను ఆదివారం వండలూర్ జూ చీఫ్ కన్జర్వేటర్, డైరెక్టర్ రిటో సిరియాక్ సందర్శించారు. జూ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. జంతువుల సంరక్షణ చర్యలు, సందర్శకులకు సౌకర్యాలను పరిశీలించారు. వెంట జిల్లా అటవీశాఖ అధికారి అశోక్‌కుమార్, జూ అధికారులు ఉన్నారు.

అన్నాడీఎంకే ఎల్లాపురం యూనియన్ కార్యదర్శిగా కోదండన్

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే తిరువళ్లూరు ఉత్తర జిల్లా ఎల్లాపురం తూర్పు యూనియన్ కార్యదర్శిగా వడమదురైకి చెందిన కోదండన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోదండన్‌ను పార్టీ కార్యకర్తలు పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

సాంకేతికతతో కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించొచ్చు

జస్టిస్ డీవై చంద్రచూడ్

ప్రసంగిస్తున్న జస్టిస్ డీవై చంద్రచూడ్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో న్యాయస్థానాల్లో పెండింగ్ కేసు సంఖ్య తగ్గించవచ్చని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో ప్రముఖ గంగా ఆస్పత్రి శనివారం 11వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించింది. ఇందులో ముఖ్య అతిథిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పాల్గొన్నారు. ఆయనకు ఆస్పత్రి తరఫున పురస్కారాన్ని ఆస్పత్రి ఛైర్మన్ కనకవల్లి షణ్ముగనాథన్ ప్రదానం చేశారు. తర్వాత జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రసంగిస్తూ... కరోనా కాలంలో చాలా మంది మహమ్మారి బారినపడ్డారని, సుప్రీంకోర్టు ముందుకొచ్చి విచారణ జరిపి ప్రజలందరికీ ఉచితంగా టీకాలు వేయాలని ఆదేశించిందని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో కృత్రిమ మేధ(ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని, వీటి ఉపయోగం ద్వారా కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.

'నలం కాక్కుం స్టాలిన్' శిబిరం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీపం ఇరుంళంజేరిలోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నలం కాక్కుం స్టాలిన్ పథక వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ప్రారంభించి 57 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లు అందజేశారు. 35 మందితో కూడిన వైద్యుల బృందం 525 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేసింది. డీఎంకే కడంబత్తూరు యూనియన్ కార్యదర్శి రమేష్, వైద్యశాఖాధికారి డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఈరోడ్ నగర ఈస్ట్ జిల్లా మాజీ కార్యదర్శి కేఎస్ సింధూ షణ్ముగం ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆదివారం ఆయన నివాసానికి వెళ్లిన ఎడప్పాడి పళనిసామి ఆయన చిత్రపటానికి అంజలి ఘటించారు.
– విల్లివాక్కం, న్యూస్‌టుడే

గోపీరాజ్, కనిష్క, యువశ్రీ (పాతచిత్రాలు)

ఇద్దరు కుమార్తెలను హత్య చేసి తండ్రి ఆత్మహత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మదురైలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మదురై ఆలంకుళంకి చెందిన గోపీరాజ్(40) ఎలక్ట్రీషియన్. ఇతనికి భార్య గాయత్రి, కుమార్తెలు యువశ్రీ(10), కనిష్క(5) ఉన్నారు. ఇదిలా ఉండగా భార్య ప్రవర్తనపై గోపీరాజ్‌కు అనుమానం ఉండేది. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం గాయత్రి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గోపీరాజ్ తన ఇద్దరు కుమార్తెలకు ఆహారంలో విషం పెట్టి తినిపించాడు. కాసేపటికి పిల్లలు స్పృహకోల్పోయారు. అయినా చనిపోరేమోనని భావించి తీగతో గొంతు బిగించి హత్య చేశాడు. అనంతరం అతనూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి వారి ఇంటి నుంచి ఎలాంటి శబ్దాలు రాకపోవడంతో ఇరుగుపొరుగువారు వెళ్లి చూశారు. అప్పుడు ముగ్గురు మృతిచెంది కనిపించడంతో పోలీసులకి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లస్‌టూ విద్యార్థి బలవన్మరణం

గురుఅశ్విన్ (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడు జిల్లా గోపి సమీపంలోని వేట్టైకారన్‌కోవిల్‌కు చెందిన జ్ఞానశేఖరన్ సుధ దంపతులు. వీరు కారు మెకానిక్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. గురుఅశ్విన్(16), గురుదర్శన్(16) అనే కవలలున్నారు. ఇద్దరూ బొలవక్కాళిపాలయంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం జ్ఞానశేఖరన్, సుధ వర్క్‌షాపుకు వెళ్లారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన గురుదర్శన్ పరీక్ష రాసి సాయంత్రం వర్క్‌షాపుకు వెళ్లాడు. గురుఅశ్విన్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. తండ్రి పలుమార్లు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో సమీపంలోని వేల్‌మురుగన్ అనే వ్యక్తికి ఫోన్ చేసి ఇంటికి వెళ్లి గురు అశ్విన్‌కి ఫోన్ ఇవ్వాలని చెప్పారు. వేల్‌మురుగన్ ఇంటికి వెళ్లగా గురు అశ్విన్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. తల్లిదండ్రులు వెంటనే ఇంటికి చేరుకొని గోపి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో.. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో భార్యాభర్తలు సహా ముగ్గురి మృతి

సైదాపేట, న్యూస్‌టుడే: తెగిపడిన విద్యుత్తు తీగను తొక్కడంతో భార్యాభర్తలు సహా ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... కడలూరు జిల్లా సాత్తమంగళంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్డు పక్కనున్న చెట్టు విరిగి విద్యుత్తు స్తంభంపై పడింది. దీంతో విద్యుత్ తీగ తెగి కిందపడింది. ప్రమాదవశాత్తు దాన్ని తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై సూసై(70), అతని భార్య బిలోన్ మేరీ(60), వనదాస్ మేరీ(70) మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

ఆటోపై తాటి చెట్టు విరిగిపడి డ్రైవరు...

ప్రమాదానికి గురైన ఆటో

ప్యారిస్: చెన్నై తండయార్‌పేటకి చెందిన అబ్దుల్ వాహిద్(38) ఆటో డ్రైవరు. ఈయన ప్రతిరోజు పాఠశాల విద్యార్థులను తన ఆటోలో పాఠశాలకు తీసుకెళ్లి సాయంత్రం తీసుకొస్తుంటారు. ఇదిలా ఉండగా అయనావరానికి చెందిన విద్యార్థినిని శనివారం మధ్యాహ్నం నుంగంబాక్కంలో ఉన్న పాఠశాల నుంచి ఇంటికి తీసుకొస్తున్నారు. అయనావరం మెంటల్ హాస్పిటల్ అవుట్ పేషెంట్ విభాగం ప్రాంగణంలో ఉన్న తాటి చెట్టు అకస్మాత్తుగా రోడ్డుపై వెళ్తున్న అబ్దుల్ వాహిద్ ఆటోపై పడింది. ప్రమాదంలో అబ్దుల్ వాహిద్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న బాలిక ప్రాణాలతో బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న తాటి చెట్టు దానంతట అదే విరిగి పడినట్లు తెలిసింది.

యువకుడి మృతదేహం లభ్యం

టిప్లికేన్, న్యూస్‌టుడే: అరియలూరు రైల్వే గేటు వద్ద ఆదివారం ఉదయం ఓ యువకుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. ప్రాథమిక దర్యాప్తులో.. మృతుడు అల్లినగర్‌కి చెందిన హరిహరన్ అని, మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని తెలిసింది. దర్యాప్తు కొనసాగుతోంది.

నేల కూలిన ఓవర్‌హెడ్ ట్యాంకు

- తప్పిన పెను ప్రమాదం

కూలిన ఓవర్‌హెడ్ ట్యాంకు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: దిండుగల్ జిల్లా వేడచందూరు సమీపం మారంపాడిలో సుమారు వెయ్యి మంది నివసిస్తున్నారు. ఇక్కడ 1977లో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో కూల్చి కొత్త ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయంలో వినతులు అందజేసినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యలో ఆదివారం ఉదయం ట్యాంకు కుప్పకూలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

ప్రయాణికులు సురక్షితం

ప్రమాదానికి గురైన ఓ బస్సు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తంజావూరు నుంచి కుంభకోణానికి 50 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు బస్సు ఆదివారం ఉదయం బయలుదేరింది. ఎదురుగా కుంభకోణం నుంచి తంజావూరుకు బయలుదేరిన మరో ప్రైవేటు బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. నేడార్ ప్రాంతంలో రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో రెండు బస్సుల్లోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అయ్యంపేట పోలీసులు అక్కడకు చేరుకుని క్రేన్ల సాయంతో బస్సులను పక్కకు తొలగించారు.

క్రైం కార్నర్

ఇంటి యజమానురాలిపై అసభ్యకర పోస్టులు

అద్దెకుంటున్న యువకుడి అరెస్టు

రాబర్ట్

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుత్తణికి చెందిన 47ఏళ్ల మహిళకు చెన్నై కొరుక్కుపేటలో ఓ ఇల్లు ఉంది. అందులో రాబర్ట్ అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. ఇదిలా ఉండగా అద్దె సరిగా చెల్లించకపోవడంతో యజమానికి, అతనికి మధ్య గొడవ జరిగింది. దీంతో రాబర్ట్ ఇంటి యజమాని అయిన మహిళ ఫొటోతో అసభ్యకరంగా వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో ఆమెను సంప్రదించిన పలువురు అనుచితంగా మాట్లాడారు. దీంతో బాధితురాలు పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి రాబర్ట్‌ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మదురై మీనాక్షి ఆలయంలో ఆంధ్రా భక్తులను మోసగించిన ముగ్గురు...

ప్యారిస్: మదురై మీనాక్షి అమ్మన్ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు వస్తున్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ నుంచి 39 మంది అయ్యప్ప భక్తులు శనివారం ఆలయానికి వచ్చారు. ముగ్గురు వ్యక్తులు వారి వద్దకు వెళ్లి తాము ఆలయం తరఫున నియమించిన గైడ్లు అని పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరు రూ.250 ఇస్తే దర్శనం త్వరగా చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తామని చెప్పి వారి నుంచి మొత్తం రూ.9,750 వసూలు చేశారు. అనంతరం వారికి రూ.50 టిక్కెట్లు ఇచ్చి దర్శనానికి వెళ్లాలని చెప్పారు. దీంతో భక్తులు వారితో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకొని గైడ్లుగా మోసగించిన వెంకటేశ్, అమ్మైయప్పన్, గణేశన్‌లను అరెస్టు చేశారు.

మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా మహిళలను మోసగిస్తున్న కేటుగాడు...

అరెస్టయిన గోపీనాథ్

సైదాపేట: చెన్నై శివారు తాంబరం ప్రాంతానికి చెందిన గోపీనాథ్(24) పలు మ్యాట్రిమోనీ సైట్లలో తాను పెద్ద వ్యాపారవేత్తగా వివరాలు నమోదు చేసి ఖరీదైన కార్లు, విలాసవంతమైన ఇల్లు, పెద్ద పరిశ్రమల వద్ద తీసుకున్న ఫొటోలను పెట్టాడు. అతని వివరాలు చూసి ఐటీ ఉద్యోగం చేస్తున్న ఓ యువతి కుటుంబ సభ్యులు గోపీనాథ్‌ను సంప్రదించారు. పెళ్లికి అతను అంగీకరించాడు. రెండు నెలలుగా సదరు యువతితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. తాను పలు దేశాల్లో వ్యాపారాలు చేస్తున్నానని, తన బ్యాంకు ఖాతా స్తంభించటంతో నగదు తీయలేని పరిస్థితి ఏర్పడిందని యువతికి చెప్పి రూ.9.80 లక్షలు తీసుకున్నాడు. తర్వాత అతని ప్రవర్తనపై అనుమానం కలగడంతో యువతి ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీ ద్వారా గోపీనాథ్‌పై నిఘా పెట్టింది. అతను పారిశ్రామికవేత్తగా నటించి చాలామంది మహిళలను మోసం చేసినట్లు తెలిసింది. దీంతో తాంబరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రెండు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించగా గత మూడు నెలల్లో 12 మందికి పైగా మహిళలను మోసం చేసినట్లు తేలింది.

స్థిరాస్తి వ్యాపారిని కిడ్నాప్ చేసిన నలుగురు...

విల్లివాక్కం: కృష్ణగిరి జిల్లా శూలగిరి ప్రాంతానికి చెందిన డీఎంకే సభ్యుడు సీతారామన్(34) స్థిరాస్తి వ్యాపారి. ఈ నెల 21వ తేదీ ఓ మహిళ అతన్ని ఫోన్‌లో సంప్రదించి ఇంటి స్థలం కావాలని చెప్పింది. దీంతో ఆయన కారులో శూలగిరి నుంచి బత్తళప్పళ్లికి బయలుదేరారు. మార్గమధ్యలో అడ్డుకున్న దుండగులు ఆయన కారులోనే కిడ్నాప్ చేశారు. సీతారామన్‌కు సెల్‌ఫోన్ ఇచ్చి తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి రూ.5 కోట్లు తీసుకొచ్చేలా చేయాలని బెదిరించారు. అప్పుడు సీతారామన్ తెలివిగా వ్యవహరించి తెలిసిన వారికి తన లొకేషన్ షేర్ చేశారు. దీంతో అవతలి వారు ఆయన కిడ్నాప్‌నకు గురైనట్టు గ్రహించి హోసూర్ అడ్కో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సదరు లొకేషన్‌కు వెళ్లి కిడ్నాపర్లను చుట్టుముట్టారు. అనంతరం నిందితులు శంకర్(34), సురేష్(40), అజయ్(19), గోకులకణ్ణన్(23)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మోహన్, నాగరాజన్, మరో మోహన్, శ్వేత అనే మహిళ కోసం గాలిస్తున్నారు.

కానిస్టేబుల్‌పై గంజాయి వ్యాపారి కత్తితో దాడి

తుపాకీతో కాల్చి పట్టుకున్న పోలీసులు

సైదాపేట, న్యూస్‌టుడే: కడలూరు జిల్లా వల్లంపడుగై ప్రాంతానికి చెందిన నవీన్(24)పై చిదంబరం అన్నామలైనగర్ పోలీసు స్టేషన్‌లో గంజాయి విక్రయ కేసు నమోదైంది. పరారీలో ఉన్న నవీన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా అతను అన్నామలైనగర్ ప్రాంతంలో దాగి ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం ఉదయం ఇన్‌స్పెక్టర్ అంబేడ్కర్ నేతృత్వంలో పోలీసులు అక్కడకు వెళ్లారు. పోలీసులను చూసిన నవీన్ వారికి కత్తి చూపించి పారిపోయేందుకు యత్నించాడు. కానిస్టేబుల్ అయ్యప్పన్ పట్టుకునేందుకు యత్నించగా నిందితుడు కత్తితో పొడిచాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ అంబేడ్కర్ నవీన్ కాలిపై కాల్చడంతో కిందపడ్డాడు. అతన్ని, గాయపడిన కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా గంజాయితో గౌతమ్(27), అరుళ్(30)ను కూడా అరెస్టు చేశారు.

పెట్రోల్ బాంబు దాడుల కేసులో నిందితుడిపై గూండా చట్టం

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి నగరంలో పలు ప్రాంతాల్లో గతంలో జరిగిన పెట్రో బాంబు దాడుల కేసులకు సంబంధించిన కీలక నిందితుడిని పోలీసులు శనివారం గుండా చట్టం కింద అరెస్టు చేశారు. తిరునెల్వేలిలోని తచ్చనల్లూరుకు చెందిన కన్నబిరాన్ (46) స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద, ఇతర కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బాంబులతో దాడి చేశాడు. దీంతో తిరునెల్వేలి నగర డీసీపీ ప్రసన్నకుమార్ సిఫారసుతో సీపీ సంతోష్ హాదిమని ఉత్తర్వుల మేరకు శనివారం నిందితుడిని గూండా చట్టం కింద అరెస్టు చేసి కడలూర్ సెంట్రల్ జైలుకు తరలించారు.

పోక్సో కేసులో వృద్ధుడికి 15 ఏళ్ల జైలు శిక్ష

ప్యారిస్, న్యూస్‌టుడే: నేపాల్‌కి చెందిన దంపతులు చెన్నైలో రోడ్డు పక్కన తమ తొమ్మిదేళ్ల కుమార్తెతో నివసిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది మార్చిలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న బాలికను మైలాపూర్‌కి చెందిన సాలిబ్రాన్(60) లైంగిక వేధింపులకి గురిచేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మైలాపూర్ ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదు చేసి సాలిబ్రాన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై పోక్సో ప్రత్యేక కోర్టులో శనివారం ముగిసింది. నేరం రుజువు కావడంతో సాలిబ్రాన్‌కు 15ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అదేవిధంగా బాధితురాలికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు పరిహారం అందించాలని ఆదేశించారు.

వేలూరు జైలు నిఘా గోపురంపై ఎగిరిన డ్రోన్ స్వాధీనం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరులోని తొరప్పాడిలో పురుషుల సెంట్రల్ జైలు ఉంది. ఇందులో 800మందికి పైగా ఖైదీలు ఉన్నారు. ఆదివారం జైలు ఆవరణలోని నిఘా టవర్‌పై పోలీసులు భద్రతా విధుల్లో ఉండగా ఓ డ్రోన్ టవర్‌పై పడింది. పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని జైలు అధికారులకు అప్పగించారు. తర్వాత దానిని విచారణ కోసం పాగాయం పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

రొయ్య వెలవెల.. రైతు విలవిల..!

- తొమ్మిది నెలలుగా కలిసిరాని కాలం
- ఉమ్మడి జిల్లాలో రూ.3,240 కోట్లు ఆవిరి

కైకలూరు, మండవల్లి, ఉండి, న్యూస్‌టుడే

మిలియన్ డాలర్ల పంటైన రొయ్యల సాగులో రైతులకు కాలం కలిసి రావడం లేదు. రూ.లక్షల్లో పెట్టుబడులు కోట్లలోకి మారి అప్పుల తిప్పలు వెంటాడుతున్నాయి. ఒక పంట కాకపోతే మరో పంట అంటూ సాగు చేస్తున్నా.. ఫలితం లేదు. మరో పక్క ట్రంప్ సుంకాల బాంబులు పేల్చుతున్నా అదరక బెదరక ముందుకు సాగినా.. ఒక్క సారైనా కనికరించలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

✦ రొయ్యల సాగు 1.1 లక్షల ఎకరాలు ✦ రైతులు 28 వేలు వరకు. ✦ నెల రోజుల్లో పంట నష్టపోతే ఎకరాకు రూ.1.20 లక్షలు ఆవిరి. ✦ 90 వేల ఎకరాల్లో ఒక పంట నష్టం: రూ.1,080 కోట్లు ✦ మూడు పంటల్లో నష్టం: రూ.3,240 కోట్లు నష్టం.

కలిసిరాని వాతావరణం.. గడిచిన 9 నెలల్లో దాదాపు 6 నెలలు మబ్బులతో ఆడపా దడపా వర్షాలు పడుతుండటం చల్లని వాతావరణం తెల్ల మచ్చల వ్యాధికి వాహకంగా పని చేసింది. దీంతో అన్ని చోట్ల చెరువులు తుడిచి పెట్టుకుపోయాయి.

◗ మండవల్లికి చెందిన ఓ రైతు 30 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మూడు పంటలు నష్టపోవడంతో రూ.1.2 కోట్లు అప్పులపాలై ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గడిచిన 9 నెలల్లో వేల మంది రైతుల ఆర్థిక పరిస్థితి తలకిందులైంది.

నాణ్యత లేని సీడ్.. తల్లి రొయ్య నాణ్యత లేకపోవడం.. ఎక్కువ సార్లు సీడ్‌ను తీయడం, హేచరీ దశలోనే విబ్రియోసిస్ పెరిగిపోవడంతో సీడ్ నాణ్యత తగ్గిపోతోంది. వేసవికాలంలో విబ్రియో, వైట్ గట్, ఈహెచ్‌పీలు వెంటాడితే, మార్చి, జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ తెల్ల మచ్చల వ్యాధి(వైట్ స్పాట్) తీవ్రస్థాయిలో విజృంభించింది.

రైతుల స్వార్థం.. రొయ్యల సాగు సమష్టిగా చేస్తేనే మంచి ప్రయోజనాలు పొందే వీలుంటుంది. కాని రైతులు స్వార్థంతో వైరస్ వచ్చిన చెరువుల్లో మందులు పిచికారీ చేయకపోవడం, కనీసం పక్క రైతులను అప్రమత్తం చేయక పోవడం పరిపాటిగా మారింది.

అప్రమత్తత అవసరం రొయ్యల సాగులో అప్రమత్తత ఎంతో అవసరం. చెరువుల సిద్ధం చేసేప్పుడు శాస్త్రీయతను పాటించడం, నాణ్యమైన సీడ్‌ను పరీక్షించిన తర్వాతే చెరువులో వేసుకోవాలి. చెరువులోని రొయ్యలకు ఒత్తిడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. - నరసయ్య, జేడీ, మత్స్యశాఖ

మీనంతో పోటీ.. ఈతలో మేటి! 6లో

స్థానిక సంగ్రామానికి సన్నాహాలు!

- మూణ్నెల్ల ముందే ఎన్నికలు • కసరత్తు చేస్తున్న ఈసీ

'ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 909 గ్రామ పంచాయతీలు, 9,588 వార్డు స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. 2026 మార్చి 17తో పురపాలక సంఘాలకు, ఏప్రిల్ 2న గ్రామ పంచాయతీలకు, సెప్టెంబరు 3తో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగియనుంది.'

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. పంచాయతీ పాలకవర్గాల పాలనా గడువు ముగింపునకు.. మూణ్నెల్ల ముందే ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే 175 నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితా ఈసీ కార్యాలయం తీసుకుంది. పురపాలక సంఘాలు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయనుంది. రిజర్వేషన్లు ఖరారైన వెంటనే ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేయనుంది.

రిజర్వేషన్ల ఖరారులో.. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికి నెల రోజులకు పైగా సమయం పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరుకు రిజర్వేషన్ల ఖరారును పూర్తి చేసి.. మార్చిలో ఎన్నిక ప్రకటన ఇవ్వనున్నట్లు సమాచారం. ఏప్రిల్‌లో మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. ఈ మేరకు వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా తయారీ, పంచాయతీల వర్గీకరణ, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికి చర్యలు చేపట్టాలని ఎస్‌ఈసీ ఆదేశించింది. తదనుగుణంగా జిల్లా పంచాయతీరాజ్ అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది.

బొక్కిందంతా కక్కిస్తారా..?

రూ.5 కోట్ల బియ్యం కుంభకోణంపై లోతైన దర్యాప్తు

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో కైకలూరు ఎంఎల్ఎస్ గిడ్డంగుల్లో బయటపడిన భారీ బియ్యం కుంభకోణంలో లోతైన దర్యాప్తు జరుగుతోంది. ఇందులో అప్పటి ప్రభుత్వ పెద్దలపై ఆరోపణలు వచ్చాయి. కోట్లాది రూపాయల విలువైన బియ్యం, నిత్యావసర సరకులు మాయమైనట్లు ఆధారాలు లభించినా కేవలం రూ.72 లక్షలు మాత్రమే అవినీతి జరిగిందని అధికారులు మమ అనిపించారు. ఈ కుంభకోణంలో అక్షరాల రూ.5.45 కోట్లు విలువైన రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు గత అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

బియ్యం బస్తాల కింద అమర్చిన క్రేట్ చెక్కలు

అసలు జరిగిందిదే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 122 రేషన్ దుకాణాలకు చెందిన 5,526 బస్తాల బియ్యం, 4,556 కిలోల పంచదార, 3.5 టన్నుల కందిపప్పు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన 524 బస్తాల బియ్యం ఇవ్వకుండానే.. డీలర్లకు ఇచ్చినట్లు గోదాముల అధికారులు తప్పుడు ఆర్వోలు సృష్టించారు. లెక్కలు సరి చేసేందుకు బియ్యం బస్తాల మధ్య క్రేట్ చెక్కలను అమర్చి ఏమార్చారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఈ బండారం బయటపడింది. నష్టపోయిన డీలర్లు రెండేళ్లపాటు జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఆ పాపం నేటికీ వారిని వెంటాడుతోంది.

దొంగలు దొరుకుతారా? 2021 అక్టోబరులో బహిర్గతమైన ఈ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో బియ్యం కాకినాడ పోర్టుకు, పలువురు వైకాపా నేతల చేపల చెరువులకు మేతగా తరలించారని ఆరోపణలు ఉన్నాయి. అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని), ఎమ్మెల్యేగా ఉన్న దూలం నాగేశ్వరరావు దీనిపై కనీసం స్పందించిన దాఖలాలు లేవు. అయితే కుంభకోణంలో సస్పెండైన గోదాము ఇన్‌ఛార్జి, మరో ఇద్దరు నిందితులను మరోమారు లోతుగా విచారిస్తే అసలు దొంగలు బయటపడే అవకాశం ఉంది. మరి కూటమి ప్రభుత్వం పేదల బియ్యాన్ని భోంచేసిన తిమింగలాలపై కేసులు నమోదు చేసి ప్రజాధనాన్ని కక్కిస్తుందా? నష్టపోయిన డీలర్లకు భరోసా ఇస్తుందా అనేది ప్రశ్నగానే మారింది.

✦ దీనిపై ఇటీవల మండవల్లి పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంప్రదించగా.. రూ.5.45 కోట్లు పక్కదారి పట్టినట్లు గుర్తించామన్నారు. విజిలెన్స్‌తో లోతైన దర్యాప్తు చేయిస్తున్నట్లు తెలిపారు.

పవన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

నేడు ఉప ముఖ్యమంత్రి రాక

ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం (గ్రామీణ, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పవన్ కల్యాణ్ కొండపైన ఆలయం వద్దకు వెళ్లే మార్గంలో బారికేడింగ్, ఇనుప మెస్‌లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ పందిళ్లు వేశారు. ప్రాంగణమంతా గ్రీన్ మ్యాట్లు పరిచారు. ముఖ్యమైన వారిని మాత్రమే కొండపైకి అనుమతించేలా చర్యలు చేపట్టారు. ఆదివారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ అభిషేక్ గౌడ

పటిష్ఠ భద్రత.. సుమారు 318 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన ఆలయ ప్రాంగణంలో 12 సీసీ కెమెరాలు, మార్గం మధ్యలో మరో రెండు అమర్చారు. వాహనాలకు కొండ దిగువున పార్కింగ్ ఏర్పాటు చేశారు.

రోడ్డు మార్గంలోనే.. ముందుగా ప్రకటించిన విధంగా పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో రావడం లేదు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరంలో ప్రత్యేక విమానం దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నేరుగా మధ్యాహ్నం 12 గంటలకు కొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు చేరుకుంటారు. కార్యక్రమాల అనంతరం ఒంటిగంటకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్తారు.

గంగ తీసుకొచ్చి.. గంగానమ్మ పులకించి!

మేడలో కొలువుదీరిన అమ్మవారు

కలశానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు చంటి, ప్రభాకర్ తదితరులు

చెరువులోని బావిలో పూజలు చేసేందుకు పడవల్లో వెళ్తున్న ఆలయ సిబ్బంది

ఏలూరు తూర్పువీధి గంగానమ్మ జాతర ప్రతిష్ఠాత్మకంగా సాగుతోంది. ప్రధాన ఘట్టమైన అమ్మవారి పాదం భూమిపై మోపే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రధాన రైల్వేస్టేషన్ సమీప పురాతన చెరువు మధ్యనున్న బావి వద్దకు పడవల్లో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది వెళ్లారు. అక్కడ అమ్మవారిని శాస్త్రోక్తంగా బయటకు తీసి పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, కోలాటం, కళా బృందాల వేషధారణ మధ్య గంగానమ్మను నేలపైకి తీసుకొచ్చారు. ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. రెండు డ్రోన్ల ద్వారా బావి నీరు తీసుకొచ్చి.. భక్తులపై ప్రోక్షణ చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాశ్, మహేంద్ర, సాయిబాబు, బాలాజీ, శివరాం ప్రసాద్, కిశోర్, హనుమంతరావు తదితరులు పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

గళమెత్తేందుకు సిద్ధం

అమరావతి చేరుకున్న విద్యార్థులు

నిడమర్రు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా.. నమూనా శాసనసభలో ఎమ్మెల్యేలుగా తమ గళం వినిపించేందుకు ఎంపికైన విద్యార్థులు ఆదివారం అమరావతి చేరుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కొక్కరు ఎంపికైన విషయం విదితమే. వీరు ఈ నెల 26న తమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా వ్యవహరించనున్నారు. ముగ్గురు బాలికలకు ఒక గైడు, ఇద్దరు బాలురకు మరో గైడు నియమితులయ్యారు. విజయవాడ వెళ్లిన వారిలో గంధం గురుప్రసాద్(ఉంగుటూరు), సలాది నాగ వెంకట శ్రీమణికంఠ, సంపూర్ణ గణేశ్(దెందులూరు) జి.లిఖిత(ఏలూరు), కె.నిఖిల్ సాయి(పోలవరం), కె.వంశిక(చింతలపూడి), బి.గోపీ నాగచైతన్య(నూజివీడు), బి.అస్మిత సాయి(కైకలూరు) ఉన్నారు. గైడు టీచర్లుగా కె.సుబ్బరాజు(పెదనిండ్రకొలను), జి.రమణి(రంగాపురం) వ్యవహరిస్తున్నారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, ఏఎంవో రెడ్డి రామారావు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన నేడు

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ద్వారకాతిరుమల మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఐఎస్ జగన్నాథపురం చేరుకుని.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు దేవరపల్లి వెళ్లనున్నారు.

ఇల్లు వదిలి.. తల్లడిల్లి!

- పిల్లలతో సహా వెళ్లిపోతున్న వైనం
- అదృశ్యాలపై బాధిత కుటుంబాల్లో ఆందోళన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులు.. ఆత్మీయులు.. బంధువులు ఒక్కసారిగా కనిపించకుండాపోతే ఆ బాధ, ఆందోళన చెప్పనలవికాదు. ఆనందంగా సాగిపోతున్న దాంపత్యంలో ఒకరోజు భార్య లేదా భర్త ఇల్లు వదిలి వెళ్లిపోతే.. పిల్లలనూ తమ వెంట తీసుకెళ్లితే.. ఆ వేదన వర్ణనాతీతం. ఎక్కడికెళ్లారో.. ఎందుకెళ్లారో.. ఏమైపోయారో.. తెలియక మానసికంగా కుంగిపోవాల్సిన దుస్థితి. రోజులు గడుస్తున్నా.. వారి జాడ తెలియకపోతే.. ఎక్కడున్నారు? క్షేమంగా ఉన్నారా? ఏదైనా అఘాయిత్యం చేసుకున్నారా? అనే ఆలోచనలు మదిని తొలిచేస్తూ కుంగదీస్తుంటాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో పరిపాటిగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

✶ ఉంగుటూరు మండలానికి చెందిన ఓ వివాహిత ఇటీవల తన కుమార్తె, కుమారుడిని వెంట పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం పని ముగించుకొని ఇంటికొచ్చిన భర్తకు విషయం తెలియడంతో.. చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

✶ చేబ్రోలు పోలీస్టు స్టేషన్ పరిధిలో గత నెల 23న ఓ వివాహిత తనకంటే అయిదేళ్ల తక్కువ వయసున్న యువకుడితో తన ఇద్దరు కుమారులను తీసుకుని వెళ్లిపోయారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆ బాధ వర్ణనాతీతం.. ఉమ్మడి జిల్లాలో యుక్త వయసున్న వారు ఎక్కువగా ఇల్లు వదిలి వెళ్లిపోతున్నారు. చేతికొచ్చిన పిల్లలు ఎందుకు ఇల్లు విడిచారో తెలియక తల్లిదండ్రులు అల్లాడిపోతున్నారు. అలిగారా, ప్రేమ వ్యవహారమా, అనుకున్నది దక్కలేదని కుంగుబాటా తెలియక సతమతమవుతున్నారు. ఇక భార్యాభర్తల బంధంలో మనస్పర్థలు, ఆర్థిక సమస్యలు, ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలు అదృశ్యాలకు ప్రధాన కారణమవుతోంది.



ప్రతి సమస్యకూ పరిష్కారం ఆపదలొచ్చినప్పుడు.. సమస్యలు చుట్టిముట్టినప్పుడు ధైర్యంగా ఉండాలి. సరిగ్గా ఆలోచిస్తే ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుంది. ఆ దిశగా యోచించకపోవడంతోనే ఇంటి నుంచి వెళ్లిపోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం పరిపాటిగా మారుతోందని ఏలూరు సర్వజన ఆసుపత్రి మానసిక వైద్య విభాగం ఆచార్యుడు డాక్టర్ వంశీకృష్ణ చెబుతున్నారు. తమకు ఎదురైన వ్యధలను అధిగమించేందుకు మార్గాలు అన్వేషించాలని.. ఆత్మీయులతో పంచుకోవాలని.. అప్పుడే కచ్చితంగా పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నీటి గంట.. బడిలో మోగేదెన్నడంట?

నూజివీడు, న్యూస్‌టుడే

క్షేత్రస్థాయిలో వెతలు.. పర్యవేక్షణ లోపాలతో సర్కారు పాఠశాలల్లో నీటి గంట మోగడం లేదు. విద్యార్థి దశ నుంచి పిల్లలతో తగినంత నీరు తాగించి పలు రుగ్మతలు దూరం చేయాలన్నది ఈ కార్యక్రమ సంకల్పం. అయిదేళ్ల కిందట అమలైంది. కరోనా సమయంలో మరుగున పడింది. ఎన్ని పథకాలు పెట్టినా.. మార్గదర్శకాలు జారీ చేసినా.. సర్కారు విద్యాలయాల్లో శుద్ధ జల కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వంతోపాటు దాతలు, ఎన్నారైలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా చాలా పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు అమర్చారు. వాటిలో చాలా వరకు పనిచేయక పోవడం, బయట నుంచి నీరు తెచ్చి పెట్టాల్సి రావడం వంటి అంశాలు నీటి గంటను మోగనీయడం లేదు.

ఇలా తాగిస్తే.. ప్రతి పాఠశాలలో ఉదయం, మధ్యాహ్నం స్వల్ప విరామంలో తప్పకుండా నీరు తాగేలా చర్యలు చేపట్టాలి. దీంతోపాటు ఉదయం 10 గంటలు, ఆ తర్వాత 11.15, మధ్యాహ్నం 2, చివరిగా 3 గంటలకు నీటి గంట విధానాన్ని అమలు చేయాలి. ఇది కచ్చితంగా సాగేలా ప్రణాళిక అవసరం.

బృహత్తర విధానం.. ఆచరిస్తే ఆరోగ్యం

ఇంటి నుంచి సీసాలతో మంచినీరు తెచ్చుకున్న విద్యార్థినులు

పక్కాగా అమలయ్యేలా చర్యలు.. పాఠశాలలో బడి గంటకు ఇప్పటికే సమయం ఉంది. అయితే పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యంతో దానిని సరిగా అమలు చేయడం లేదు. అది విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. బడి గంట పక్కాగా అమలయ్యేలా ఆదేశాలిస్తా. - ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో, ఏలూరు

తగిన మోతాదులో.. పిల్లలకు నిర్ణీత సమయం ప్రకారం నీటిని తాగడం అలవాటు చేయాలి. తద్వారా మూత్రపిండాల సంబంధిత వ్యాధులతోపాటు అనేక రుగ్మతలను దూరం చేయవచ్చు. శరీరానికి తగినంత నీరందక పోతే రక్తం చిక్కబడుతుంది. తద్వారా తలనొప్పి, అలసట, కడుపునొప్పి, మూత్రం రంగు మారడం, ఒక్కోసారి రక్తం వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. - డా.పి.జె.అమృతం, జిల్లా వైద్యాధికారి.

జిల్లా సమాచారం... పాఠశాలలు: 2,231 విద్యార్థులు: 2,49,784

నేడు యథావిధిగా మీకోసం

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సత్యసాయి మార్గం అనుసరణీయం: కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలతో సత్య సాయిబాబా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన మార్గం అనుసరణీయమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సత్య సాయి ట్రస్టు ఆధ్వర్యాన విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ఏవో నాంచారయ్య, శ్రీసత్యసాయి సేవా సమితి ఏలూరు ఇన్‌ఛార్జి శాంతకుమార్, కన్వీనర్ రామారావు, సమన్వయకర్త డి.శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెట్రిసెల్వి

గోవిందా.. గోవిందా..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గోవిందా.. గోవిందా.. అంటూ వేలాది మంది భక్తులు ద్వారకాతిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. సెలవు రోజు కావడంతో వేలాదిగా తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి నిత్య కల్యాణంలో 90 జంటలు పాలుపంచుకున్నాయి. శ్రీవారి ఆలయానికి తూర్పు వైపున అనివేటి మండపంలో నిర్వహించిన కోలాట భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శ్రీవారి దర్శనం కోసం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

నేటి నుంచి రైతన్నా.. మీ కోసం

374 ఆర్ఎస్‌కేల పరిధిలో ఏర్పాట్లు

ఈనాడు-ఏలూరు: జిల్లాలో ఈ నెల 24 నుంచి జనవరి 3 దాకా వారం రోజులపాటు అన్నదాతల ఇంటి ముంగిటకే వ్యవసాయ, దాని అనుబంధ రంగాల సిబ్బంది వెళ్లి వారికి ఏం కావాలో వివరాలు తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. జిల్లాలో 374 రైతు సేవా కేంద్రాల పరిధిలో నిత్యం 33,660 మంది రైతులను కలుసుకునే ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా లాభసాటి వ్యవసాయం కోసం సీఎం సూచించిన ఐదు పంచ సూత్రాలను రైతులకు వివరిస్తారు. 24న నుంచి 29 దాకా 6 రోజులపాటు సేకరించిన సమాచారంతో డిసెంబరు 3న గ్రామ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి రైతుల ముందు ఉంచుతారు. ఈ మేరకు యంత్రాంగానికి అవగాహన కల్పించామని కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా చెప్పారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



జీఎస్‌టీ 5% అదనం

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

80080 12494

స్త్రీ నిధి.. మహిళల పెన్నిధి

వేల మందికి ఉపయోగం

నూజివీడు, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎలాంటి పూచీకత్తు లేకుండానే స్త్రీ నిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా 48 గంటల్లోనే రుణం మంజూరు చేస్తోంది. తాజాగా గ్రేడింగ్ ఆధారంగా రుణం మంజూరు శాతాన్ని పెంచడంతో మరింత లబ్ధి కలగనుంది.

మార్పులు ఇలా.. సంఘాల లావాదేవీల ఆధారంగా గ్రామైక్య సంఘాలకు ఏ, బి, సి, డి పేరిట గ్రేడింగ్ ఇస్తారు. ప్రతి రెండేళ్లకోసారి మార్పులు జరుగుతాయి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి రాకతో పరిశీలించి, కొత్త గ్రేడ్‌లు కేటాయించింది.

ప్రత్యేక దృష్టి.. గ్రేడింగ్ విధానం అమల్లోకి వచ్చిన కారణంగా మహిళా సంఘాలపై పర్యవేక్షణ పెరిగింది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలతో కూడిన లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

రూ.8 లక్షల వరకు.. మరో వైపు సభ్యుల వ్యక్తిగత రుణాన్ని కూడా పెంచారు. గతంలో ఒక్కొక్కరికీ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు అందించేవారు. ఇక నుంచి ఒక్కో సంఘానికి రూ.8 లక్షలిస్తారు. దీంతో వాటా పెరగనుంది. తీసుకున్న సొమ్ములో వెయ్యికి రూ.4 చొప్పన (రూ.లక్ష తీసుకుంటే రూ.400) వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒకవేళ లబ్ధిదారు మరణిస్తే మాఫీ చేస్తారు. తీసుకున్న రుణంపై 92 పైసల వడ్డీ పడుతుందని స్త్రీ నిధి విభాగం ఏలూరు ఏజీఎం చెన్నకేశవులు తెలిపారు.

జిల్లా సమాచారం ఇలా..

- స్వయం సహాయక సంఘాలు: 41,533
- ఈ ఏడాది స్త్రీనిధి రుణ మంజూరు లక్ష్యం: రూ.294 కోట్లు
- ఇప్పటి వరకు ఇచ్చింది: రూ.145 కోట్లు
- రుణం పొందిన వారు: 17,576

WALK-IN-INTERVIEW

MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT CUM RECOVERIES, ACT ASST., BID PAYABLE ASST. & OFFICE BOY FOR OUR PROPOSED NEW BRANCH AT TADEPALLIGUDEM

BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS & BID PAYABLE ASST:

Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/ financial institutions will be given preference.

Act Asst.:

The Candidate should be graduate and below 30 years of age with either B.Com. (General) or (Computers) and should have thorough knowledge of accounts, computers and good communication skills.

OFFICE BOY-1 POSITION:

SSC Passed male candidate with pleasing personality below 30 years of age.

Note: The selected candidates will have to undergo training at our Tanuku branch for about 1 to 2 months in all areas of operations of chit fund transactions and thereafter will be posted at our proposed new branch at Tadepalligudem.

Please attend **WALK-IN-INTERVIEW ON 25th November, 2025 (TUESDAY) AT OUR TANUKU BRANCH from 10.30 A.M. to 2.00 P.M.** alongwith latest Resume, xerox copies of certificates/ testimonials, recent colour passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank passbook first page at the following address:

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED.
D.No.26-3-19, 1st Floor, Satya Sneha Central, Above Union Bank of India, Alamurivari Street,
TANUKU - 534 211, ANDHRA PRADESH., ☎ Phone No. 08819-223505/ 221059.

(c) eenadu

ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025
Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner TV Partner Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్‌లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురు జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, [illegible]
ఈనాడు కార్యాలయం
తాడేపల్లిగూడెం - 534411
వివరాలకు: 99592 24506
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లో సంప్రదించొచ్చు.

మీనంతో పోటీ.. ఈతలో మేటి!

పతకాలు సాధిస్తున్న అక్కాతమ్ముళ్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆ అక్కాతమ్ముళ్లు.. ఈత కొలనులో దిగారంటే మీనంకన్నా వేగంగా ఈదేస్తున్నారు. వివిధ పోటీల్లో పాల్గొంటూ పతకాలు కొల్లగొడుతున్నారు. వారే ఏలూరులోని బిశ్వనాథ్ భర్తియా ఈత కొలను శిక్షకుడు గణేశ్ కుమార్తె భార్గవి, కుమారుడు స్వామినాయుడు. వీరిద్దరూ బాల్యం నుంచే ఈతలో సిద్ధహస్తులు. తాజాగా విశాఖపట్నం వేదికగా నిర్వహించిన పదో అంతర జిల్లాల ఈత పోటీల్లో అక్కాతమ్ముళ్లు పాల్గొని సత్తా చాటారు.

అయిదు విభాగాల్లో స్వర్ణాలు

నా పేరు స్వామినాయుడు. ఏడో తరగతి చదువుతున్నా. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన అంతర జిల్లాల ఈత పోటీల్లో పాల్గొని అయిదు విభాగాల్లో బంగారు పతకాలు సాధించా. గతంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ అనేక బహుమతులు అందుకున్నా. 2023లో భువనేశ్వర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ ఈత పోటీల్లో చెరో స్వర్ణం, రజతం, రెండు కాంస్య పతకాలు సాధించా. 2024లో విజయవాడ వేదికగా జరిగిన అంతర జిల్లాల పోటీల్లో అయిదు బంగారు పతకాలు పొందా. ఈ ఏడాది బెంగళూరులో నిర్వహించిన సబ్ జూనియర్ ఈత పోటీల్లో అయిదు స్వర్ణ పతకాలు ఖాతాలో వేసుకున్నా. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి పేరు తేవాలన్నదే లక్ష్యం.

తమ్ముడికి తీసిపోకుండా..



నా పేరు భార్గవి. ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా నాన్న పారా విభాగం ఈత పోటీల్లో అనేక బహుమతులు అందుకున్నారు. ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహంతో విజయపథాన దూసుకెళ్తున్నా. పలు ప్రాంతాల్లో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించా. గతేడాది ఖేలో ఇండియాలో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచా. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదగాలన్నదే ఆశయం.

బాస్కెట్ బాల్ విజేతలు.. కృష్ణా, తూర్పుగోదావరి జట్లు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతల వివరాలను టోర్నమెంట్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని తూర్పుగోదావరి, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం విశాఖపట్నం, నాలుగో స్థానాన్ని కృష్ణా జిల్లాలు సాధించాయన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కృష్ణా, ద్వితీయ స్థానం తూర్పుగోదావరి, తృతీయ స్థానం గుంటూరు, నాలుగో స్థానాన్ని చిత్తూరు జిల్లా జట్లు సాధించినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా అండర్ 17 బాలుర విభాగంలో వరుసగా 8వ సారి విజయం సాధించారన్నారు. డీవైఈవో పీఎస్ సుధాకర్, సీఐ పి.సత్యశ్రీనివాస్, బిస్ అధినేత బి.శ్యామ్, కరస్పాండెంట్ మెలోడి, అబ్జర్వర్ పి.కృష్ణ, 13 జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిమ్మలపై దాడి ఘటన.. పాలకొల్లులో సీఐడీ విచారణ

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో 2022లో టిడ్కో గృహాల ప్రారంభోత్సవ సమయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌లపై వైకాపా శ్రేణులు దాడికి పాల్పడిన ఘటనపై సీఐడీ బృందం ఆదివారం విచారణ జరిపింది. సీఐడీ ఏఎస్పీ పర్వీన్ ఆధ్వర్యంలో బృందం పాలకొల్లు టిడ్కో సముదాయానికి వచ్చి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించింది.

ఏం జరిగిందంటే.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను కొందరు లబ్ధిదారులకు స్వాధీనపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అప్పటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు తదితర వైకాపా నాయకులు హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేను వేదికపైకి ఆహ్వానించాల్సి ఉండగా దీనిని పాటించలేదు. ఈ నేపథ్యంలో నిమ్మలతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌లు వేదికపైకి వెళ్లేందుకు యత్నించగా వైకాపా నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని వారికి కిందికి తోసేశారు. వేదికపై నుంచి పడిపోయిన ఎమ్మెల్యేతో పాటు ఇతర తెదేపా నాయకులపై కొందరు వైకాపా వర్గీయులు దాడికి పాల్పడ్డారు. వారిలో కొందరి వద్ద మారణాయుధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై యలమంచిలికి చెందిన తెదేపా నాయకుడు తాడి శశిధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేయలేదు. దీనిపై నిమ్మల హైకోర్టును ఆశ్రయించారు.

ప్రశ్నించడాన్ని తట్టుకోలేక.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును సీఐడీకి అప్పగించారు. విజయవాడ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఐదుగురి బృందాన్ని ప్రభుత్వం నియమించింది. కేసు దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరం నుంచి వచ్చిన సీఐడీ పోలీసులు టిడ్కో లబ్ధిదారులు, ఫిర్యాదుదారుడిని విచారించారు. కుట్రపూరితంగా రామానాయుడిపై దాడికి పాల్పడ్డారని కొందరు లబ్ధిదారులు సీఐడీ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలో జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.బాల వెంకటేశ్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా టీవీఎస్‌వీ రమణరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.విష్ణుమూర్తి, కార్యదర్శిగా ఎన్.ధర్మారావు, సహాయ కార్యదర్శిగా ఎం.ప్రదీప్‌కుమార్, కోశాధికారిగా నాగజ్యోతి, సభ్యులుగా పి.రమాదేవి, మహ్మద్ సముద్దీన్, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.రవికుమార్, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఇ.రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఐక్యత చాటుతున్న నాయకులు

పీఎస్‌హెచ్‌ఎం ఫోరం నూతన కమిటీ ఏకగ్రీవం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా పీఎస్‌హెచ్‌ఎం ఫోరం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక పవరుపేటలోని నగరపాలకోన్నత పాఠశాలలో ఫోరం సమావేశం నిర్వహించి.. జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.పోతురాజు, అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎన్.కొండయ్య, ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, అదనపు కార్యదర్శిగా ఎ.మురళీకృష్ణ ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జి.మోహన్ పర్యవేక్షించారు.

ఆర్టీసీ గ్యారేజీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణకు డిమాండ్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు ఆర్టీసీ పెట్రోలు బంకు నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఎదుట ఆదివారం సంఘ నాయకులు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. 2021లో బంకు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిధుల దుర్వినియోగం అవుతున్నా.. అధికారులెందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అసలైన బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు నిరాహార దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

జిల్లాలో విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో సారా కార్యకలాపాలను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించారు. ఎక్సైజ్ జిల్లా అధికారి ఆవులయ్య ఆదేశానుసారం చింతలపూడి, లింగపాలెం, టి.నరసాపురం మండలాల్లో అధికారులు తమ సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సారా తయారు చేస్తున్న యడవల్లికి చెందిన పార్వతి, రాజుపోతేపల్లికి చెందిన మురళిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. టి.నరసాపురం మండలం వల్లంపట్లలో 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. విక్రేత సురేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. సహాయ జిల్లా ఎక్సైజ్ అధికారి పాండురంగారావు, సీఐ సత్యవతి, ఎస్సై ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ పోస్టులను తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. 4 పోస్టులు ఖాళీ ఉండగా.. నెలకు రూ.45 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. జ్యుడిషియల్ సర్వీసులో ఉద్యోగ విరమణ చేసిన, రాజీనామా చేసిన, జ్యుడిషియల్ మినిస్టీరియల్, సూపరింటెండెంట్ విభాగాల్లో పని చేసిన, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్వీసులో పని చేసి బార్ అసోసియేషన్‌లో కనీసం అయిదేళ్లు కేసులు వాదించిన వారు అర్హులన్నారు. ఔత్సాహికులు డిసెంబరు 12లోపు జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: లారీ డ్రైవర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన బాపులపాడు మండలం పెరికీడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన కొత్తూరి ప్రసాద్‌బాబు(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శనివారం బాపులపాడు మండలంలోని ఓ పరిశ్రమ నుంచి సరకు తీసుకుని అరిపిరాలలో చేపల చెరువు వద్ద దింపారు. ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో పెరికీడులో జాతీయ రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద లారీ నిలిపేశారు. గమనించిన స్థానికులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ప్రసాద్‌బాబు సీట్లో మృతి చెంది ఉన్నాడు. గుండె పోటుతో మృతి చెందాడా? అనారోగ్య కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాగులో మునిగి విద్యార్థి దుర్మరణం

వార్త తెలిసి గుండెపోటుతో నాయనమ్మ కన్నుమూత

యశ్వంత్ (పాత చిత్రం)

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: సరదాగా వాగులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సమీపాన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దొంతికుంట కాలనీకి చెందిన గుమ్మళ్ల యశ్వంత్(16) అశ్వారావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా స్నానాలు చేసేందుకు కామయ్యపాలెం వచ్చారు. వాగులో దిగాక లోతు తెలియక ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని పైకి తీశారు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే మనవడి మృతి వార్త తెలిసిన నాయనమ్మ వెంకమ్మ(72) గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బీచ్‌లో యువకుడు గల్లంతు

మోహన సాయి గణేశ్

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణాజిల్లా తేలప్రోలు వద్ద ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆయన ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. గణేశ్ సముద్రంలో స్నానానికి వెళ్లి అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. మెరైన్ సిబ్బంది, పోలీసులు, ఆ యువకుడి మిత్రులు, బంధువులు తీరంలో గాలింపు చేపట్టారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ వాహనం బోల్తా

14 మందికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలు

ఘటనా స్థలిలో బోల్తా పడిన వాహనం, క్షతగాత్రులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్ పురం ఐటీడీఏ సమీపాన రాజానగరం మార్గంలో జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ట్రాలీ వాహనం బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజంపాలేనికి చెందిన 25 మంది ఏలూరు జిల్లా భీమడోలు మండలం గున్నంపల్లిలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బయలుదేరారు. ఐటీడీఏ సమీపానికి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ట్రాలీ వాహనం ప్రమాదవశాత్తు రహదారి పక్కకు బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనాల్లో మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో పలువురు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. స్టీరింగ్ వదిలేయడం ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. బోల్తా పడిన వాహనాన్ని స్థానికుల సహాయంతో పైకి లేపారు.

రోడ్డు అంచులో పడి వృద్ధుడు..

కొమరాడ (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఈ నెల 20న స్కూటర్ నడుపుతూ ప్రమాదవశాత్తు రోడ్డు అంచులో పడి కొమరాడకు చెందిన రాట్నాల చినదేవయ్య (75)తీవ్రంగా గాయపడినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి తెలిపారు. అతను గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

లారీని ఢీకొని మరొకరు..

గొల్లవానితిప్ప (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: గొల్లవానితిప్పకు చెందిన తాళ్లూరి శామ్యూల్‌రాజు (21) ఆదివారం తెల్లవారుజామున భీమవరం నుంచి ఇంటికి వెళ్తుండగా గ్రామంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మృతి చెందినట్లు ఏఎస్సై వై.వి.సత్యనారాయణ తెలిపారు. అతని తాతయ్య ప్రభుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మా దారి.. జాతీయ రహదారి

కేంద్ర మంత్రిత్వ శాఖకు డీపీఆర్

ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇరుకు రహదారులు... పెరిగిన వాహనాల రద్దీ... తరచూ ఎక్కడో ఒకచోట రక్తమోడుతున్న దుస్థితి... ఈ సమస్యను పరిష్కరించి.. మెరుగైన రోడ్డును అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 165 విస్తరణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు పనులు చేపట్టే దిశగా అడుగులు వేసినా కోర్టు కేసులతో ముందుకు సాగలేదు. వాటి పరిష్కారం దిశగా గత వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వంలో కోర్టు, ఇతరత్రా ఎన్నో అవాంతరాలను దాటుకుని జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్)కు అనుమతి నిమిత్తం డీపీఆర్ వెళ్లింది.

చకచకా.. మేలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి జూన్ 14 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. ఏఏ గ్రామాల మీదుగా వెళ్తున్నాయో సర్వే నంబర్ల ఆధారంగా వారికి 3ఏ నోటీసులు జారీ చేశారు. అభ్యంతరాలు వ్యక్తమైన గ్రామాల్లో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎన్‌హెచ్ అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు, రైతుల నుంచి కారణాలను తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చొరవతో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆగస్టులో స్పష్టమైన ప్రకటన చేశారు.

ఎక్కడి నుంచి ఎక్కడికి
ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు
వెళ్లేది – ఆరు మండలాల్లో 20 గ్రామాల మీదుగా
దూరం - 45.92 కి.మీ.
భూసేకరణ సేకరణ 172.9235 హెక్టార్లు
ప్రాథమిక అంచనా రూ.3,256 కోట్లు

45.92 కి.మీ..
తొలిదశలో పామర్రు నుంచి ఆకివీడు వరకు 64 కి.మీ. రహదారి విస్తరణ పనులు చేశారు. రెండో దశలో 61.740 కి.మీ. నుంచి 107.660 కి.మీ. వరకు ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు 45.92 కిలోమీటర్లలో రహదారి విస్తరణకు చర్యలు చేపట్టారు.

వెళ్లేదిలా.. ఆకివీడు మండలంలో అజ్జమూరు నుంచి ఉండి మండలంలో చెరుకువాడ, పెదపుల్లేరు, చినపుల్లేరు, కాళ్ల మండలంలో కొలనపల్లి, సీసలి, జక్కరం, పెద అమిరం, వేంపాడు, కోపల్లె, భీమవరం మండలంలో చిన అమిరం, రాయలం, తాడేరు, భీమవరం, గునుపూడి, పాలకోడేరు మండలంలో విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వీరవాసరం మండలంలో వీరవాసరం గ్రామాల మీదుగా రహదారి వెళ్లేలా డీపీఆర్ పంపించారు.

● ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపించాము, రెండు మూడు వారాల్లో అనుమతులొస్తాయని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు.

మామిడి తోటల్లో దందా.. అరికట్టేదుందా?

- జోరుగా కోడి పందేలు, జూదాలు
- అడ్డూ అదుపూ లేని మట్టి తవ్వకాలు

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలో గ్రావెల్, రేషన్ బియ్యం, జూదం దందాలు జోరుగా సాగుతున్నాయి. మామిడి తోటలు, సరిహద్దు ప్రాంతాలు వీటికి వేదికలుగా మారుతున్నాయి. ఇటీవల మంత్రి పార్థసారథి సైతం నియోజకవర్గంలో జూదాల కట్టడికి చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించినప్పటికీ అన్ని మండలాల్లోనూ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

విచ్చలవిడిగా మూడు ముక్కలాట.. నూజివీడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విచ్చలవిడిగా మూడు ముక్కలాట, కోడి పందేలు జరుగుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లోని మామిడి తోటలను అందుకు వేదికలుగా ఎంచుకుంటున్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి, కనసానపల్లి, చొప్పరమెట్ల, ఈదులగూడెం, ఈదర, నూజివీడు మండలం సుంకొల్లు, తుక్కులూరు, మిట్టగూడెం, పోతురెడ్డిపల్లి, చాట్రాయి మండలంలోని కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం - నరసాపురం మధ్యలో, పర్వాతపురం, సి.గుడిపాడు, చీపురుగూడెం, బూరుగుగూడెం - పర్వతాపురం మధ్యలో, ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున జూదాలకు తెరతీస్తున్నారు. మరో పక్క నియోజకవర్గంలో జూదాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ స్పష్టం చేశారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు.. నూజివీడు నియోజకవర్గంలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఆగిరిపల్లి మండలంలోని చొప్పరమెట్ల, ఈదులగూడెం, అమ్మవారిగూడెం, నరసింగపాలెం తదితర గ్రామాల్లో రాత్రివేళ టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కొండలను కొల్లగొడుతూ గ్రావెల్ తవ్వేస్తున్నారు. నూజివీడు మండలం హనుమంతుల గూడెంలో ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలను గ్రామస్థులు అడ్డుకుని మీడియాకు సమాచారం ఇవ్వడంతో వారు మెల్లగా జారుకున్నారు. నూజివీడు సిద్ధార్థ నగర్ శివారులోని కొండగట్టు, శిలువు గట్టు తదితర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ రవాణా అవుతోంది. నూజివీడు డివిజన్‌లో అక్రమ తవ్వకాలను సహించేది లేదని కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ బి.వినూత్న స్పష్టం చేశారు.

EENADU Classifieds

AGRI BUSINESS
ప.గో. జిల్లా భీమవరానికి 12 కి.మి. దూరంలో 10 1/2 చెరువు, 6 ఎకరములు వరిభూమి విడివిడిగా అమ్మకం. Cont: 92477 76006.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. ✆ 7702184399.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS
Wanted Marketing Executive: Male 15-20K, Store Manager: M/F 10-15K, Sales Persons M/F 8-10K. Resume Send Whatsapp: 95050 66887.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.45 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

92.7FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉII 5 - ఉII 7
ఈ-మార్నింగ్స్	ఉII 7 - ఉII 11
నువ్వా నేనా	ఉII 11 - మII 2
సత్యభామ	మII 2 - సాII 5
లైట్ తీస్కో	సాII 5 - రాII 9
సరదాగా కాసేపు	రాII 9 - రాII 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రాII 12 - తెII 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

జన సైనికుడి కుటుంబానికి చేయూత

శర్మ కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న నాగబాబు

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలికి చెందిన జనసేన నాయకుడు తునికపాటి సూర్యకాంతశర్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబానికి పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు తాడేపల్లిలో ఆదివారం రూ.5 లక్షల బీమా చెక్కు అందజేశారు. శర్మ కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున అన్నివిధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు కొఠారు ఆదిశేషు, కొఠారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? కొమడవోలు పరిధి వి.వి.నగర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయాయి. రోజుల తరబడి మురుగు ముందుకెళ్లడం లేదు. దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద ఎక్కువ ఉంటోంది. సమస్య పరిష్కరించండి. **- నాగేశ్వరరావు, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు కాలువల్లో చెత్తాచెదారం తీయిస్తాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **- శివారెడ్డి, ఉప కమిషనర్**

దెందులూరు, న్యూస్‌టుడే: ? అన్నదాత సుఖీభవ సొమ్ము జమైంది. కానీ, ప్రధానమంత్రి కిసాన్ నగదు మాత్రం అందలేదు. సమస్య పరిష్కరించగలరు. **- రంగారావు, స్థానికుడు**

✔ సాంకేతిక కారణాలతో కొందరికి పీఎం కిసాన్ సొమ్ములు జమ కాలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. **- అనిల్‌కుమారి, ఏడీఏ**

పట్టుగొమ్మ.. అవినీతి చెమ్మ!

- వైకాపా హయాంలో గాడి తప్పిన పల్లె పాలన
- నిధులు కాజేసిన పలువురు సర్పంచులు, కార్యదర్శులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే



దేశానికి పట్టుగొమ్మలాంటి పల్లె పాలన వైకాపా హయాంలో గాడి తప్పింది. పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించింది. ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచులు, కార్యదర్శులు కుమ్మక్కై అరకొర నిధులను సైతం అందిన కాడికి కాజేశారు. అక్రమాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వైకాపా అధికారం కోల్పోగానే పలు పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు బయటకొస్తున్నాయి.

రికవరీ చేస్తేనే.. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో 166 పంచాయతీలున్నాయి. వైకాపా హయాంలో చాలా పంచాయతీలు అక్రమాలకు అడ్డాగా మారాయి. కాగితాల్లోనే పనులు చేసినట్లు చూపి.. వివిధ పన్నులు, లీజుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కొందరు సర్పంచులు, కార్యదర్శులు నొక్కేశారు. ఫిర్యాదులందిన పంచాయతీల్లో మాత్రమే విచారణ చేపట్టారు. ఇప్పటికీ వెలుగులోకి రానివి కోకొల్లలు. కొన్ని చోట్ల కూటమి నాయకులు సైతం బాధ్యులకు కొమ్ము కాస్తున్నారు.

చెక్కు పవర్ రద్దు చేసి.. సస్పెన్షన్‌కు గురైన కార్యదర్శులకు సగం జీతం వస్తోంది. సస్పెండ్ కాలాన్ని సెలవులుగా గడుపుతున్నారు. సర్పంచుల చెక్కు పవర్ రద్దు చేసి. . అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. ప్రతి ఆర్నెల్లకోసారి పంచాయతీల లావాదేవీలను డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు తనిఖీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ చాలా చోట్ల జరగడం లేదు. పంచాయతీలకు జనసత్వాలు రావాలంటే దుర్వినియోగమైన నిధులను రాబట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

➤ భీమడోలు పంచాయతీ అక్రమాలకు నిలయంగా మారింది. నిధుల దుర్వినియోగంపై స్థానికులు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఇరువురు డీఎల్‌పీవోలు మూడు సార్లు విచారించారు. 2019-24 మధ్య సుమారు రూ.2.50 కోట్లు దుర్వినియోగమైనట్లు తేలింది. నేటికీ చర్యలు తీసుకోలేదు. గుండుగొలను పంచాయతీ కార్యదర్శిపై ఆరుగురు వార్డు సభ్యులు ఫిర్యాదు చేయగా.. విచారణ కొలిక్కి రాలేదు.

➤ పెదవేగి మండలం నడిపల్లిలో సాధారణ, ఆర్థిక సంఘ నిధులు పక్కదారి పట్టాయన్న స్థానికుల ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టారు. రూ.11.80 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు.

➤ ఉంగుటూరు మండలం వెల్లమిల్లి పంచాయతీ నిధులను సర్పంచి, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై దోచేశారు. విచారణలో రూ.89,29,471 పక్కదారి పట్టించారని నిర్ధారించారు. సర్పంచి చెక్కు పవర్ రద్దు చేయగా. . పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

రెండు నియోజకవర్గాల వివరాలిలా..

మండలం	పంచాయతీలు
ఉంగుటూరు	27
భీమడోలు	13
నిడమర్రు	16
గణపవరం	25
దెందులూరు	17
పెదవేగి	30
పెదపాడు	23
ఏలూరు గ్రామీణ	15

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

పతకాలు చూపుతున్న క్యాడెట్లు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీలో విద్యార్థులు చేరాలని ప్రధానోపాధ్యాయిని సాయికుమారి సూచించారు. స్థానిక సీఆర్ఆర్ పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు 2కె పరుగులో పాల్గొన్నారు. అనంతరం దేశభక్తిని ప్రబోధించేలా సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎన్‌వో అనంత, హవల్దార్‌లు కాశీరావు, రమన్‌దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటికి జ్ఞాపిక ఇస్తున్న నిర్వాహకులు

ఎస్పీఎస్ అకాడమీ సేవలు అభినందనీయం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రెండు దశాబ్దాలకు పైగా ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సంగీత, బృందగానం, లయ విన్యాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వహీదా వాసు సారథ్యంలో విద్యార్థులు వందేమాతరం గీతం ఆలపించి శ్రోతలను రంజింపజేశారు. అనంతరం ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు రామకృష్ణ, వైఎంహెచ్ఏ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ప్రభుత్వ వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నమూనా శాసనసభకు ఎంపికైన సుబ్బమ్మదేవి పాఠశాల విద్యార్థిని జి.లితికను ఆదివారం ఆయన అభినందించారు.

జాతీయ స్థాయికి విద్యార్థి ఎంపిక

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇ.చార్లెస్ వెస్లీ జాతీయ స్థాయి అండర్-14 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నూజివీడులో ముద్దోజుఖ్యపాలెం కొనసాగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి.. జాతీయ స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు శర్మ, వ్యాయామోపాధ్యాయులు సురేశ్‌కుమార్, గవ్వా శ్రీనివాసరావు అభినందించారు. జాతీయ స్థాయిలో పోటీల్లోనూ ప్రతిభ చాటి పాఠశాలకు పేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

నల్లమాడు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. నల్లమాడులో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయానికి ఆదివారం వారు శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ.7 లక్షలు, రాష్ట్రీయ స్వరాజ్ అభియాన్ పథకం(ఆర్జీఎస్ఏ) కింద రూ.25 లక్షలు మొత్తం కలిపి రూ.32 లక్షలతో పంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యాలయానికి స్థలం వితరణ చేసిన పాతూరి వెంకట నారాయణ స్వామిని సత్కరించారు. సర్పంచి గౌతు రాము, తెదేపా, జనసేన మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్, పి.రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థల దాతను సత్కరిస్తున్న పత్సమట్ల, గన్ని

కొప్పుల వెలమల అభ్యున్నతికి కృషి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొప్పుల వెలమ కులస్థుల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తున్నట్లు ఆ సంఘ పట్టణాధ్యక్షుడు భీమవరపు పాపారావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం మహాజన సభ నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి మరడాని అమ్మతరావు అధ్యక్షత వహించారు. పాపారావు మాట్లాడుతూ.. కొప్పుల వెలమల్లోని పేద విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలు, రాత పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతిభావంతులైన పిల్లల ఉన్నత చదువుకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు శివప్రసాద్, అప్పారావు, ధనుంజయ, ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఒత్తిడి అధిగమించండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, న్యూస్‌టుడే: ఉద్యోగులు మానసికంగా ఉల్లాసంగా ఉండటం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. జానంపేటలో నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో ఆయన ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఒత్తిడితో ఉంటారని, ఇలాంటి కార్యక్రమాలతో సాంత్వన పొందగలరని చెప్పారు. అంతకుముందు ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

నిర్మించారు.. వదిలేశారు

ఉంగుటూరు మండలం నారాయణపురంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం(వెల్‌నెస్ సెంటర్) నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఈ కేంద్రానికి కేవలం విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకపోవడంతో.. వినియోగానికి దూరంగా ఉంచేశారు. ప్రస్తుతం దాత సమకూర్చిన ఇరుకు గదిలో సిబ్బంది సేవలందిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఉంగుటూరు

రంగు సీసా.. ఎందుకో తెలుసా!

మండల కేంద్రం నిడమర్రులో కుక్కల బెడద నివారణకు కొందరు తమ ఇళ్ల ముందు ఎరుపు రంగు సీసాలు ఉంచుతున్నారు. కుక్కలకు ఎరుపు రంగు పడదని.. ఈ రంగు నీళ్లను చూసి.. తమ ఇళ్ల వైపు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఒకరిని చూసి మరొకరు సీసాలు పెడుతుండటం గమనార్హం. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

దారి.. జర్రున జారి!

ఏలూరు నగరం పవరుపేట నుంచి నివాస థియేటర్ మీదుగా ఆర్ఆర్ పేట వెళ్లే రైల్వే కింద వంతెన మార్గంలో రహదారి కంటలేని వాహనదారులు హడలిపోతున్నారు. వంతెన దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు రోడ్డు అధ్వానంగా ఉండటంతో.. ఎక్కడ వాహనాలు జారిపోతాయోనని భయపడుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

మలుపు.. ప్రమాద పిలుపు

గణపవరం మండలం వరదరాజపురం నుంచి తేతలి పల్లిగూడెం వెళ్లే మార్గం మధ్యలోని వెలగపల్లి మలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. సీసీ రోడ్డు అంచున గుంత ఏర్పడి.. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు గొయ్యి గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, గణపవరం

చెత్త తొలగక.. చింత వీడక

ఏలూరు నగర శివారు మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో పారిశుద్ధ్యం లోపిస్తోంది. ఇక్కడ పంచాయతీ సిబ్బంది రోజూ చెత్త తొలగించకపోవడంతో.. కుండీల వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో కాలనీ వాసులు ముక్కులు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణం

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	12ఏ రైల్వేకాలనీ
బాలాజీ	ఇట్లు మీ ఎదవ
సత్యనారాయణ స్క్రీన్ 1	కాంత
సత్యనారాయణ స్క్రీన్ 2	ప్రేమంటే
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టి పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సంతాన ప్రాప్తిరస్తు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	పాంచ్‌మినార్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కాంత
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కాంత

ఆదివారం.. వైద్యానికి రాంరాం!

సిబ్బంది లేక రోగుల ఇబ్బందులు

ఉదయం 11 గంటలకు ఖాళీగా వైద్యుడి కుర్చీ

'పెదనిండ్రకొలనుకు చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ గేటు తలగడంతో.. తలకు రక్త గాయమైంది. ఆమెను ఉదయం 11.50 గంటలకు పీహెచ్‌సీకి తీసుకురాగా, ఎవరూ అందుబాటులో లేరు. అటెండరు గ్రామంలో ఉంటోన్న సూపర్‌వైజర్‌కు సమాచారం అందించగా.. ఆయన గంట తర్వాత వచ్చి బాలికకు కట్టుకట్టి పంపించారు.'

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం సెలవిచ్చేస్తున్నారు. వైద్యులు విధులకు రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీకి రోజూ 50 మందికి పైగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్య సేవలకు వస్తుంటారు. వారాంతాల్లో వైద్యులు విధులకు గైర్హాజరవుతుండటంతో.. వారంతా గంటల తరబడి నిరీక్షించి నిరాశగా వెనుతిరుగుతున్నారు.

16 పంచాయతీలకే ఒకటే.. నిడమర్రు మండలంలోని 16 పంచాయతీలకు పెదనిండ్రకొలను పీహెచ్‌సీయే ఆధారం. కొల్లేరు ప్రాంతం కావడంతో తరచూ ఇక్కడికి రోగులు వస్తుంటారు. గర్భిణులు, బాలింతలను చికిత్స నిమిత్తం పెదనిండ్రకొలనుకు తీసుకొస్తుంటారు. పీహెచ్‌సీలో మొత్తం రెండు వైద్యుల పోస్టులకు ఒకరే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులున్నారు. వీరు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేయాలి. కానీ ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు వైద్యులు, స్టాఫ్ నర్సులు రాలేదని రోగులు వాపోయారు. అటెండరుతో మందులిచ్చి పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆదివారం నాకు వారాంతపు సెలవు. ముగ్గురు స్టాఫ్ నర్సులు విధుల్లో ఉండాలి. వారెందుకు రాలేదో తెలియదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా' అని పీహెచ్‌సీ వైద్యాధికారి వర్మ తెలిపారు.

రాట్నాలమ్మ.. రక్షమాం

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.62,797 ఆదాయం లభించిందని ఆలయ పాలకమండలి ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

సూర్యనారాయణ నమో నమః

ఏలూరు ఆధ్యాత్మికం: పవరుపేటలోని సూర్య దేవాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి.. స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

హేమసుందర్‌కు జాతీయ పురస్కారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అభినయ నృత్య భారతి వ్యవస్థాపకుడు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ సప్నా ఎక్స్‌లెన్స్ జాతీయ పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి మునిరత్నం, వాస్తు నిపుణుడు కె.వి.రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. హేమసుందర్‌ను పలువురు నగరవాసులు అభినందించారు.

కలపర్రులో వాహన తనిఖీలు

పెదపాడు, న్యూస్‌టుడే: కలపర్రు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న ముగ్గురు చోదకులకు ఈ-చలానా విధించినట్లు ఏఎస్సై గజపతిరావు తెలిపారు.

బధిర విద్యాలయానికి వితరణ

ఏపూరు(పెదపాడు): ఏపూరులోని ఆదిత్య బధిరుల విద్యాలయానికి బొమ్ములూరుకు చెందిన వై.వి.రామాంజనేయులు ఆదివారం కుర్చీలు వితరణ చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా 60 మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఆకుల వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మను సేవలో అంబికా కృష్ణ

నిడదవోలు, న్యూస్‌టుడే: ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిఉన్న కోటసత్తెమ్మ వారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో ఏలూరు లయన్స్ క్లబ్, గో సంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏసియన్ వ్యాస్క్యులర్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 200 మంది పాల్గొని సేవలు పొందారు. వెరికోస్ వీన్స్ వ్యాధి నిర్ధారణ అయినవారిని హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్స అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ గవర్నర్ పాపారావు నాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివ, గోసంరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు జయబాబు, మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు: చికిత్స చేయించుకున్న వెరికోస్ వీన్స్ బాధితులు

తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఏలూరు టూటౌన్: తపన ఫౌండేషన్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగర పరిసరాల్లోని 14 గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు 20 మంది వైద్యులు, 100 మంది వైద్య విద్యార్థులు పాల్గొని పలువురికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. నిర్వాహకుడు డాక్టర్ సాగర్ కుళాయిరెడ్డి, వైద్యులు శ్రీనివాసరావు, విజయలక్ష్మి, సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

జగన్నాథపురం(పెదవేగి): బెయెర్షెబా మినిస్ట్రీస్ ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో.. జగన్నాథపురంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బెయెర్షెబా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ కె.సాల్మన్‌రాజు ప్రారంభించినారు. సుమారు 500 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

సర్వ మానవాళికి సత్యసాయి ఆదర్శనీయం

ఏలూరు: చిత్రపటానికి నమస్కరిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: సర్వ మానవాళికి సత్య సాయిబాబా ఆదర్శనీయుడని ఏఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా.. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదవేగి(పెదపాడు): పెదవేగి మండలం జానంపేటలో నియోజకవర్గ స్థాయి పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలుత ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పెదపాడు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సిబ్బంది సత్యసాయిబాబాకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలూరు గ్రామీణ: సత్యసాయి చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక రామకృష్ణాపురంలోని సత్య సాయి సేవా కేంద్రంలో సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై బాబాకు ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, తెదేపా నాయకుడు రామారావు, సత్య సాయి సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

పెదపాడు: నివాళులర్పిస్తున్న తహసీల్దారు కృష్ణజ్యోతి, సిబ్బంది

రహదారిపై ధాన్యం ఆరపోస్తున్న రైతులు

వాయుగండం! ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

భీమడోలు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గంలోని అన్నదాతలను వాయుగుండం హెచ్చరికలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ మాసూళ్లు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాల్లో నూర్పిళ్లు, ధాన్యం పట్టుబడులతో రైతులు తలమునకలై ఉన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, వాయుగుండంగా బలపడుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో.. హడావుడిగా మాసుళ్లు, ఆరబోతలు చేస్తున్నారు. చేతికొచ్చిన పంట చివరి నిమిషంలో నేలపాలు కాకూడదన్న ఉద్దేశంతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

వారం ఆగితే చాలు.. వర్షాలు వారం రోజులు ఆగితే చాలని.. తాము పూర్తి స్థాయిలో గట్టెక్కేస్తామని అన్నదాతలు చెబుతున్నారు. ఖరీఫ్‌లో భీమడోలు మండల వ్యాప్తంగా 12,800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయి. 6 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం తేమ 17శాతం లోపు ఉండాలన్న ప్రభుత్వ నిబంధనతో.. పంట మాసూళ్లు చేస్తున్న రైతులు రహదారులపై ధాన్యం రాశులను ఆరపెట్టుకుంటున్నారు. గ్రామాల్లోని రహదారులు ఆరపోసిన ధాన్యం రాశులతో నిండిపోతున్నాయి.

సమస్యల్లో 'విలీనం'!

శివారు గ్రామాల్లో కానరాని ప్రగతి

ఇందిరమ్మ కాలనీలో అధ్వానంగా అంతర్గత రోడ్డు

తంగెళ్లమూడి (ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కరవయ్యాయి. పారిశుద్ధ్య నిర్వహణ రోజురోజుకూ దిగజారుతోంది. నీటికి సైతం అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వెంకటాపురం, శనివారపుపేట, సత్రంపాడు, తంగెళ్లమూడి, కొమడవోలు, చొదిమెళ్ల, పోణంగి గ్రామ పంచాయతీలను సుమారు 15 ఏళ్ల క్రితం నగరపాలక సంస్థలో విలీనం చేశారు. అక్కడ ప్రగతి కనుమరుగవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మట్టి దారులే గతి.. విలీన గ్రామాల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే దారులన్నీ అధ్వానంగా మారుతున్నాయి. పలు ప్రాంతాలకెళ్లే రహదారులపై వర్షపు నీరు, మురుగు నిలిచిపోయి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. మాదేపల్లి, కొత్తూరు ఇందిరమ్మ కాలనీల్లోని రోడ్లపై ప్రయాణం నరకం చూపుతోందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. శనివారపుపేట ముస్లిం శ్మశాన వాటిక నుంచి విఘ్నేశ్వరస్వామి గుడి వరకు డ్రెయిన్ నిర్మించలేదు. ఫలితంగా మురుగు నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమలకు నిలయంగా మారడంతో.. రాత్రిళ్లు స్థానికులకు కంటిమీద కునుకు కరవైంది. పిల్లలు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

రూ.కోట్లలో ఆదాయమున్నా.. విలీన గ్రామాల్లో అధికంగా లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఇల్లు, కుళాయి పన్నులు, భవన నిర్మాణ, స్థిరాస్తి వ్యాపారం తదితరాలకు సంబంధించి శివారు ప్రాంతాల నుంచి నగరపాలక సంస్థకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. ఆ నిధుల్లో పది శాతం కూడా విలీన గ్రామాల అభివృద్ధికి వెచ్చించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. 'నగరపాలక సంస్థలోని విలీన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం. అక్కడ వసతుల మెరుగుకు చర్యలు తీసుకుంటాం. నిధుల లభ్యత బట్టి దశలవారీగా ప్రగతి పనులు చేపడతాం' అని ఉప కమిషనర్ శివారెడ్డి తెలిపారు.

ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: విశాఖపట్నం వేదికగా శని, ఆదివారాల్లో నిర్వహించిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. మొత్తం 16 పతకాలు కైవసం చేసుకున్నారు. బాలుర గ్రూప్-3 విభాగంలో స్వామి నాయుడు(అయిదు స్వర్ణ), బాలికల్లో ఎండీ సిద్రా (రెండు రజత), మోహన దీప్తి(రెండు కాంస్య) పతకాలు సొంతం చేసుకున్నారు. రెండో కేటగిరిలో ధను సాయి(స్వర్ణ, రజత, కాంస్యం) బి.భార్గవి(కాంస్యం), గ్రూప్-1 విభాగంలో ఎ.రిష్యంత్(కాంస్యం) కె.జ్యోత్స్నశ్రీ(కాంస్యం) పతకాలు సాధించినట్లు జిల్లా ఈత క్రీడా శిక్షణ సంఘం కార్యదర్శి మల్లికార్జున్, శిక్షకుడు రాజేంద్ర తెలిపారు.

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

గుబ్బల మంగమ్మకు పూజలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దింట్లమ్మకు అభిషేకాలు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరు లంక గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం కొల్లేటి కోట పెద్దింట్లమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉభయ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో దేవస్థానం కిక్కిరిసింది. అమ్మవారి మాలధారులు అధిక సంఖ్యలో వచ్చి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.

పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా స్వామి, అమ్మవార్లు

కల్యాణోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయాన్ని పచ్చి పూలు, మామిడి తోరణాలు, అరటి బాదులతో అలంకరించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు స్వామి, అమ్మవార్లను కొలువు దీర్చి పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరుగున పడేశారు!

నాలుగేళ్లుగా సాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలు

బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, న్యూస్‌టుడే: మన్యం, మెట్ట మండలాల్లో పలు గ్రామాల్లోని సచివాలయాల వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలు నాలుగేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సచివాలయాల ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే వారికి ఉపయోగపడే విధంగా రూ.3 లక్షల చొప్పున అంచనాతో వీటిని మంజూరు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. చేసిన పనులకు అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు మిగిలిన పనులు చేయకుండా చేతులెత్తేశారు. దీంతో సిబ్బంది, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

బుట్టాయగూడెం మండలంలో 18 మంజూరు చేసి నిర్మాణాలను పూర్తి చేశారు. జీలుగుమిల్లి మండలంలో అంకన్నగూడెం సచివాలయం పక్కన చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని పునాదులు, పిల్లర్లు, శ్లాబ్ వేసి వదిలేశారు. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రాచన్నగూడెం, కామయ్యపాలెం, పి.అంకంపాలెం, స్వర్ణవారిగూడెంలలో అసంపూర్తిగా ఉన్నాయి. 'ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

మేడేపల్లిలో మొండి స్తంభాలతో ఇలా..

పోలవరం మండలంలో 15 సచివాలయాలకు మంజూరు కాగా. 14 చోట్ల పూర్తయ్యాయి. గూటాలలో పనులు అసంపూర్తిగా నిలిపేశారు. చేసిన మేరకు నాలుగేళ్లయినా గుత్తేదారుకు నేటికీ బిల్లులు రాక మిగిలిన పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రగడపల్లిలో కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో తాళాలు వేశారు.

కొయ్యలగూడెం మండలంలో కన్నాపురం, సీతంపేట, యర్రంపేట, బోడిగూడెం, పరింపూడి, పొంగుటూరు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్నాయి. చిన్నచిన్న పనులే చేయాల్సి ఉంది. త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

వేలేరుపాడు మండలంలోని పోలవరం ముంపునకు గురికాని రామవరం, మేడేపల్లిలలో గల గ్రామ సచివాలయాల వద్ద సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పిల్లర్ల వరకు పనులు పూర్తి చేసి చేతులెత్తేశారు. అనంతరం సంబంధిత అధికారులెవరూ అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

పోలవరం, న్యూస్‌టుడే: ? పోలవరం పంచాయతీ పరిధిలో కొన్ని చోట్ల వీధిదీపాలు రేయింబవళ్లు వెలుగుతునే ఉన్నాయి. **- కె.రాయుడు, పోలవరం**

✔ఇక నుంచి పగలు దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **- కొండలరావు, కార్యదర్శి**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ?చింతలపూడి మెరక వీధిలో రహదారి మొత్తం గుంతలు పడి ఇబ్బందికరంగా మారింది. **- విజయలక్ష్మి, గృహిణి**

✔ మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

జనసైనికుడి కుటుంబానికి బీమా పరిహారం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అంకాలగూడెంలో రూ.500లతో జనసేన సభ్యత్వం పొందిన ఆ పార్టీ కార్యకర్త బోడ పవన్ కుమార్ కొన్ని నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో అతడి కుటుంబానికి రూ.5లక్షల బీమా పరిహారాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు మృతుడి తల్లి కాంతమ్మకు ఆదివారం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు చెక్కును అందజేసినట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

మృతుడి తల్లికి చెక్కు ఇస్తున్న నాగబాబు

వైభవంగా రాజగోపుర శిఖర ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో నూతన రాజగోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. రూ.4.50 కోట్లతో నిర్మించిన ఈ రాజగోపురం శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభమై ఆదివారం జరిగిన మహాపూర్ణాహుతి హోమంతో ముగిశాయి. ఉదయం ఆలయాన్ని, ప్రాంగణాన్ని పచ్చి పూలు, మామిడి తోరణాలు, అరటి బాదులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ట్రస్టీ నిమ్మలరావు, ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమకు సందర్శకుల తాకిడి

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలతో రేవు కిక్కిరిసింది. ఆలయ సందర్శన అనంతరం కొంత మంది సందర్శకులు ప్రాజెక్టు చూడటానికి బయలుదేరి.. అనుమతులు ఉంటే కాని చెక్‌పోస్టు వద్ద పోలీసులు వదలకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన: ఎమ్మెల్యేలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చింతలపూడి, పోలవరం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట, శ్రీనివాసపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైకాపా హయాంలో రహదారి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని, ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం సుమారు రూ.కోటి జడ్పీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అలాగే స్థానిక బైపాస్ నుంచి ములగలంపల్లి, అక్కంపేట రోడ్డును రూ.2.90 కోట్లతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, నాయకులు కుక్కల మాధవరావు, ఎలికే ప్రసాద్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కరాటం సాయి, ఆవల రాజేశ్, చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రోషన్‌కుమార్, బాలరాజు

శివాలయానికి వితరణ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయానికి ఓ దాత 8 ఇత్తడి కలశాలను కానుకగా ఇచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన కొక్కర్లపాటి వెంకటరామరాజు రూ.1.90 లక్షల విలువైన కలశాలను ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయనకు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం కూడా ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు.

ఆశీర్వచనం అందుకుంటున్న దాత కుటుంబ సభ్యులు

ఘనంగా సత్యసాయి శత జయంతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కార్యాలయంతో పాటు బొర్రంపాలెం, వెలగపాడు గ్రామాల్లో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన మనతను పలువురు కీర్తించారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. వేడుకల సందర్భంగా నిర్వహించిన సీతారామ కల్యాణం గానామృతం భక్తులను ఆకట్టుకుంది.

కామవరపుకోట, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంత వాసులకు తాగు నీటి అవసరాలు గోదావరి జలాలను అందించిన మహనీయుడు శ్రీసత్యసాయిబాబా అని ఎంపీడీవో బి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సాయిబాబా జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పరిపాలనాధికారి యర్రా గోపాలకృష్ణ అధ్యక్షతన సత్యసాయి బాబా జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి ఎంపీడీవో కేఆర్ఎస్ఎస్ ప్రసాద్ పూలమాలలు వేసి, బాబా విశిష్టతను వివరించారు.

కొయ్యలగూడెం: సేవకులను సత్కరిస్తున్న గ్రామస్థులు

నిధులు కేటాయింపుపై హర్షం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలంలోని రాజా పంగిడిగూడెంలో మసీదు అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు నిధులు మంజూరు చేయడంతో ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

25న పోలవరంలో జనవాణి

పోలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనవాణి కార్యక్రమం ఈ నెల 25న మంగళవారం పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాసబాబు తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

26న ఉద్యోగ మేళా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక సూర్య విద్యా సంస్థల ప్రాంగణంలో ఈ నెల 26న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఈడా సూర్యచంద్ర శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సుమారు 17కుపైగా కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని, వేయి మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంచినీటి ట్యాంకర్ అందజేత

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి పుట్టినరోజు సందర్భంగా వారి తాతయ్య, నాయనమ్మల జ్ఞాపకార్థం శ్రీనివాసపురం పంచాయతీకి రూ.1.50 లక్షల సొంత నిధులతో మంచి నీటి ట్యాంకర్‌ను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ట్యాంకర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి ట్యాంకర్ అందించారు.

ధర్మాజీగూడెంలో.. దాహం కేకలు

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇళ్లకు వారం రోజులుగా సక్రమంగా నీరు అందక నానా అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా.. అవి సరిపోవడం లేదు. తాగునీటి కోసం రోజూ ఎదురుచూడాల్సి వస్తోంది. వాటర్ ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా? అని బిందెలు, బకెట్లు, పెద్దపెద్ద డ్రమ్ములతో పడిగాపులు కాస్తున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మోటార్ మరమ్మతులకు గురి కావడంతో బాగు చేయించేందుకు పంపించామని, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. **- న్యూస్‌టుడే, చింతలపూడి**

వారధి లేక.. సాగు చేయలేక!

రాజవరం విద్యుత్తు ఉప కేంద్రం ఎదురుగా తిరుమలాపురం మార్గంలో పులివాగుపై వంతెన నిర్మించాలని రెండు గ్రామాల రైతులు కోరుతున్నారు. వానాకాలం వచ్చిందంటే ఉద్ధృతంగా ప్రవహించే వాగును దాటలేక, కిలోమీటర్ల కొద్దీ దూరం చుట్టూ తిరిగి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. సాగు సామగ్రి, కూలీలను వాహనాలపై తరలించడానికి రైతులు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. వాగుపై కనీసం కాజ్‌వే నిర్మించినా.. కొంతవరకైనా ఉపశమనం దక్కుతుందని కోరుతున్నారు. ఈ విషయమై చిన్న నీటివనరులశాఖ కొయ్యలగూడెం ఏఈ రాహుల్‌భాస్కర్ మాట్లాడుతూ.. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**

అసంపూర్తిగా పనులు.. దుమ్ముతో అవస్థలు

బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం మార్గంలో అసంపూర్తిగా పనులు నిలిచిన రహదారిపై వాహనదారులు రాకపోకలకు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. బూసరాజుపల్లి శివారు కొత్త సింగన్నపల్లి కాలనీ నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకు ఉపాధి హామీ పథకం కింద 5.8 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎప్పుడు చేపడతారు.. ఎప్పుడు పూర్తి చేస్తారు అనేది అయోమయంగా ఉంది. తాజాగా గోతులు సరిచేసే పనులు చేశారు. దీంతో రాళ్లు పైకి లేచి మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు వాహనాలు వెళ్తుంటే.. విపరీతంగా దుమ్ము లేస్తోంది. **- న్యూస్‌టుడే, బుట్టాయగూడెం**

శ్మశానం.. అధ్వానం..

మండలంలోని తడికలపూడి ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక అడవిని తలపిస్తోంది. దహన సంస్కారాలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో అక్కడికి వచ్చినవారు అవస్థలు పడుతున్నారు. రెండు ఎకరాల స్థలంలో ఉన్న శ్మశానవాటిక వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. కనీసం నిలబడేందుకు సైతం చోటు లేకుండా పోయింది. దహన సంస్కారాల అనంతరం స్నానం చేసేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువు వద్ద నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయమై రెండ్రోజుల కిందట ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. వీలైనంత త్వరలో శ్మశానాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, కామవరపుకోట**

ప్రచారం చేస్తున్న రామకృష్ణ, కాంచనమాల తదితరులు

స్వదేశీ ఉత్పత్తులు వినియోగించండి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని కోరుతూ భాజపా నాయకులు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద సీతప్పగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల ఇంటింటికీ వెళ్లి స్వదేశీ, స్వాభిమానం, స్వావలంబన తదితర అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. నాయకులు స్వరాజ్యలక్ష్మి, అరవాలరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖో-ఖో ఆడుతున్న విద్యార్థులు

డివిజన్ స్థాయి ఆటల పోటీలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అప్సా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్) డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహన్‌రావు అన్నారు. ముదినేపల్లిలోని ఇండో సాక్సన్, గౌతమ్ పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీలను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ కృష్ణ ప్రారంభించారు. పోటీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 15 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, ఖో-ఖో, త్రోబాల్, మ్యూజికల్ ఛైర్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, అర్జా ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఏవీ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.కనక దుర్గా భవాని, కోశాధికారి ఎస్వీ రాఘవయ్య, మదనకృష్ణ పాల్గొన్నారు

వైకల్య నిర్ధారణకు వైద్య శిబిరం

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు వైద్య శిబిరాన్ని సమగ్రా శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన పిల్లలకు ఉపకరణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు, సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

కొప్పుల వెలమల అభ్యున్నతికి కృషి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కొప్పుల వెలమ కులస్థుల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తున్నట్లు ఆ సంఘ పట్టణాధ్యక్షుడు భీమవరపు పాపారావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం మహాజన సభ నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి మరడాని అచ్యుతరావు అధ్యక్షత వహించారు. పాపారావు మాట్లాడుతూ.. కొప్పుల వెలమల్లోని పేద విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలు, రాత పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతిభావంతులైన పిల్లల ఉన్నత చదువుకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయికి ఎంపిక

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇ.చార్లెస్ వెస్లీ జాతీయ స్థాయి అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నూజివీడులో మూడ్రోజులపాటు కొనసాగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి.. జాతీయ స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు శర్మ, వ్యాయామోపాధ్యాయులు సురేశ్‌కుమార్, గవ్వా శ్రీనివాసరావు అభినందించారు. జాతీయ స్థాయిలో పోటీల్లోనూ ప్రతిభ చాటి పాఠశాలకు పేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

నినాదాలు చేస్తున్న ఇఫ్టూ నాయకులు

లేబర్ కోడ్‌ల అమలు నిలిపివేతకు డిమాండ్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌ల అమలును కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఎంసీ వద్ద ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏసు, నాగేంద్ర, వెంకటేశ్వరరావు, శ్రీను, రాజా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడన్న కోపంతో కలుపు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన నేటి కిరణ్‌కుమార్(18) ఏడో తరగతి వరకు చదివి మానేసి కూలీ పనులకు వెళ్తున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసై కూలీ పనులు మానేసి బాధ్యతారాహిత్యంగా ఉండటంతో అతని తండ్రి సుధాకర్ మందలించారు. దీంతో కిరణ్‌కుమార్ క్షణికావేశంలో ఈనెల 21న రాత్రి కలుపు మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు, విజయవాడ తరలించగా.. విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

పొగ మంచులో.. ప్రమాదం ముంచుకొస్తూ..

తెల్లవారినా కనిపించని దారులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: శీతాకాలం ప్రారంభం కావడంతో తెల్లవారుజామున పట్టణమంతా పొగమంచు ఆవరిస్తోంది. ఉదయాన్నే పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే వారికి రోడ్లు సరిగా కనిపించడం లేదు. దీంతో రహదారులపై తరచూ ప్రమాదాల జరుగుతున్నాయి. పలువురు మృత్యువాత పడుతున్నారు.

జంగారెడ్డిగూడెం: దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై ఇలా..

● జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ యువకుడు ఇటీవల ద్విచక్ర వాహనంపై బైపాస్‌లో వెళ్తున్నారు. దట్టంగా పొగమంచు అలుముకుని ఉండటంతో రహదారిపై స్థానిక ఎన్టీఆర్ నగర్ సమీపంలోని గోతులు కనిపించకపోవడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు అతడికి సపర్యలు చేసి అక్కడి నుంచి పంపించారు.

● ఇటీవల రాజమహేంద్రవరం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఓ లారీ వెళ్తోంది. మార్గం మధ్యలో దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి శివారులో ఇరువైపులా నిలుపుదల చేసిన వాహనం మంచు కారణంగా లారీ చోదకుడికి కనిపించలేదు. రహదారి అంచున లారీ ఉన్న సంగతి దగ్గరకు వచ్చిన తరువాత గుర్తించిన సదరు లారీ చోదకుడు అప్రమత్తమై లారీని పక్కకు లాగడంతో తుప్పల్లోకి దూసుకుపోయింది.

తప్పని తిప్పలు.. జంగారెడ్డిగూడెం డివిజన్ వ్యాప్తంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటలు దాటినా మంచు కురుస్తూనే ఉంటోంది. దీంతో రహదారులన్నీ పొగమంచుతో దర్శనమిస్తున్నాయి. లైట్లు వేసుకుని వెళ్తున్నా.. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మీదుగా అశ్వారావుపేటకు వెళ్లే దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై ఇరువైపులా ఇష్టానుసారంగా లారీలు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. దగ్గరికి వచ్చే వరకు ఆ వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం.. 'జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనాలు నడిపే సమయంలో చోదకులు ఏకాగ్రతతో ఉండాలి. హైవేల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా పోలీసు బీటు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నాం' అని సీఐ సుభాశ్ తెలిపారు.

సహజకవి బెనర్జీకి సత్కారం

కైకలూరు, న్యూస్‌టుడే: జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో రచయితలు, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కైకలూరుకు చెందిన సహజకవి దండే బెనర్జీ ఇందులో పాల్గొని 'జీవిత యానం - సాగే ఓ ప్రయాణం' శీర్షికతో కవితను రచించి గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశా బెనర్జీకి ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.

రాయితీ విత్తనాల పంపిణీ

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం కానుకొల్లు రైతుసేవా కేంద్రం వద్ద ప్రభుత్వం అందిస్తున్న రాయితీ మినుము విత్తనాలను తెదేపా నాయకులు రైతులకు అందించారు. ప్రస్తుతం కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలను ముందస్తుగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 12 క్వింటాళ్ల మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాస్ వివరించారు. కేజీ ధర రూ.138 ఉండే విత్తనాలు రాయితీపై రూ.96.60కు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో నాయకులు మాణిక్యాలరావు, తంబి పాల్గొన్నారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

డ్రగ్స్, గంజాయి బారిన పడొద్దు

మాట్లాడుతున్న సీఐ సత్య శ్రీనివాస్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని నూజివీడు సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాని పీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం కానుకొల్లు రైతుసేవా కేంద్రం వద్ద ప్రభుత్వం అందిస్తున్న రాయితీ మినుము విత్తనాలను తెదేపా నాయకులు రైతులకు అందించారు. ప్రస్తుతం కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలను ముందస్తుగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 12 క్వింటాళ్ల మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాస్ వివరించారు. కేజీ ధర రూ.138 ఉండే విత్తనాలు రాయితీపై రూ.96.60కు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో నాయకులు మాణిక్యాలరావు, తంబి పాల్గొన్నారు.

అన్నీ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలే!

పట్టింపుకోని టౌన్ ప్లానింగ్ విభాగం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పురపాలక సంఘంలో ఎక్కడ చూసినా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. సచివాలయ వ్యవస్థ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నప్పటికి ఒక్కరు కూడా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై దృష్టి పెట్టడం లేదు. వైకాపా హయాం నుంచి నేటి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వ స్థలంలోనూ భారీ భవంతులు వెలుస్తున్నాయి. రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదార్ల పరిస్థితి ఈ విధంగా ఉందనుకుంటే శివారు కాలనీల్లో మరీ బరితెగిస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. రహదారికి ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. ఇక్కడ ఒక్క భవనానికి కూడా పురపాలక అనుమతి లేదంటే అతిశయోక్తి కాదు. వేలాది రూపాయలకు అద్దెలకు ఇచ్చేవారు కొందరైతే సొంతంగా షాపులు ఏర్పాటు చేసుకున్నారు ఇంకొందరు. ఇక్కడ పేదల కాలనీ పేరుతో స్థలాలను ఇవ్వగా అనేక మంది ఈ స్థలాలను అమ్మేశారు. ఇప్పుడు పేదల కాలనీ బడా బాబులకు నిలయంగా మారుతోంది.

నోటీసులు జారీ చేస్తాం..

ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయకూడదు. కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారు విధిగా టౌన్ ప్లానింగ్ అనుమతి పొందాల్సి ఉంటుంది. నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలపై దృష్టి సారిస్తాం. **- పీరయ్య, మున్సిపల్ కమిషనర్, నూజివీడు**

దారి ఛిద్రం.. జర భద్రం

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం నుచ్చుమిల్లి ప్రధాన రోడ్డు నుంచి సామాజిక భవనం వరకు ఉన్న 500 మీటర్ల సీసీ రోడ్డు ముక్కలుగా మారి గ్రామస్థులను చిక్కుల్లో పడేస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఉండటంతో రోడ్డు నాణ్యత పూర్తిగా దెబ్బతింది. గత సంవత్సరం వచ్చిన కొల్లేరు వరదల కారణంగా నెల రోజుల పాటు నీటిలో ఉండిపోవడంతో అప్పటి నుంచి మరింతగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చిన్నపాటి వర్షానికి ఈ రహదారి మట్టి రోడ్డు కంటే దారుణంగా తయారవుతోంది. 1500 మందికి ఈ రోడ్డే ఆధారం. దీనిపై ఈవోపీఆర్డీ నారాయణను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొత్త రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామకృష్ణ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

జనసైనికుడి కుటుంబానికి బీమా సాయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కోమర్రులో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ(నాని) కుటుంబానికి బీమా రూ.5 లక్షలను ఆ పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అందించారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చెక్కు అందించారు. రామకృష్ణ జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకోవడంతో ఆ కుటుంబ సభ్యులకు సాయం అందింది. జనసేన నాయకులు ఏఎస్ బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

కలిదిండి, న్యూస్‌టుడే: జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు భరోసా లభిస్తోందని జనసేన మండలాధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్న బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురపు రాజబాబు అన్నారు. మండలంలోని కోరుకొల్లు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చన్నంశెట్టి శివ కొన్ని నెలల కిందట ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ క్రమంలో ఆదివారం తాడేపల్లిలోని ఓ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదుగా శివ సతీమణి సత్యవేణికి రూ.5 లక్షల చెక్కు అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని నాగబాబు ధైర్యం చెప్పారు. ఇందులో జడ్డు సుబ్రమణ్యం, చన్నంశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శోభనాచలుడి శాంతి కల్యాణం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనాచలుడి ఆలయంలో ఆదివారం మార్గశిర మూలా నక్షత్రం తదియ సందర్భంగా స్వామి వారి శాంతి కల్యాణాన్ని అర్చకుడు వేదాంతం శేషబాబు, జి. అనంత కృష్ణ, లీలా మనోహర్‌లు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, పంచామృత ఫలాభిషేకం, స్నపన, ప్రత్యేక అలంకరణ, సుదర్శన హోమం, శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన రమేష్, పూర్ణ శైలజ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈవో సీహెచ్ సాయి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో ఆదివారం మార్గశిర మాసం తృతీయ రోజు సందర్భంగా మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం శివ సహస్ర నామార్చన, పంచామృత, ఫలామృత అభిషేకాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి వైభవంగా నిర్వహించారు.

పెద్దింట్లమ్మకు విశేష పూజలు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరు లంక గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉభయ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో దేవస్థానం కిక్కిరిసింది. అమ్మవారి మాలధారులు అధిక సంఖ్యలో వచ్చి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో గన్ని.. అప్కాబ్ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఈవో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రాలతో సత్కరించారు. గన్ని వెంట తెదేపా రాష్ట్ర వడ్డి సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు, జనసేన నేత కొల్లి వరప్రసాద్, కూటమి నేతలు పాల్గొన్నారు.

అల్పపీడనంతో అన్నదాతల్లో ఆందోళన

ధాన్యంపై పరదా కప్పుతున్న రైతులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మొన్న వచ్చిన మొంథా తుపాను ప్రభావం రైతులపై తీవ్రంగా పడింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట పొట్ట, పాలు పోసుకునే దశకు చేరిన సమయంలో నేల వాలింది. ఈ ముప్పు నుంచి తేరుకుని కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారి ఈనెల 26 నుంచి వర్షాలు కురుస్తాయన్న విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. శని, ఆదివారాలు కారుమబ్బులు కమ్మేయడంతో కలవరపడ్డారు. పెదపాలపర్రు, చినపాలపర్రు, కోడూరు, ముదినేపల్లి, వడాలి, చిగురుకోట, పెదకామనపూడి, అల్లూరు, బొమ్మినంపాడు, కొర్రగుంటపాలెంలో రైతులు హడావుడిగా యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్నారు. అయితే ధాన్యంలో తేమశాతం 22కు పైగా ఉంటోంది. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం 17 లోపు ఉండాలి. వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే రంగు మారి మొలకలు వచ్చి పూర్తిగా నష్టపోతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పచ్చిగా ఉండగానే ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించి పలువురు దళారులకు విక్రయించుకోగా మరి కొంత మంది ఇళ్ల వద్ద భద్రపరచుకుంటున్నారు.

ప్రభుత్వ భూములకు నష్టం కలిగిస్తే చర్యలు

పంట కాలువ గట్టు చదును చేస్తున్న యంత్రం

కలిదిండి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జలవనరుల శాఖ కోరుకొల్లు సెక్షన్ ఏఈ బి.ఫణికుమార్ హెచ్చరించారు. మండలంలోని సానారుద్రవరం గ్రామంలో పోతుమర్రు కెనాల్‌కు అనుకుని ఉన్న పంట పొలాల్లో కొందరు రైతులు ఆదివారం పొక్లెయిన్ యంత్రంతో మట్టి మెరక పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చెంతనే ఉన్న కాలువ గట్టును ఆక్రమించేందుకు చదును చేశారు. సమాచారం తెలుసుకున్న జల వనరుల శాఖ, రెవెన్యూ అధికారులు పొలాల వద్దకు వెళ్లి కాలువ గట్లను పరిశీలించి పనులను నిలుపుదల చేయించారు. ఈ చర్యలకు పాల్పడిన వారందరికీ నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

స్వదేశీ వస్తువులనే వాడండి

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రజలందరూ స్వదేశీ వస్తువులనే వాడాలని విదేశీ వస్తువులను తగ్గించాలని భాజపా మండల ఉపాధ్యక్షుడు ఆముదాల క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం ముసునూరు మండలం రమణక్కపేటలో ఇంటింటా స్వదేశీ- ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమంపై పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. స్వదేశీ వస్తువులు వాడడం వల్ల దేశ ఆర్థికాభివృద్ధి చెందుతోందని తద్వారా ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించే అవకాశాలు ఉంటాయన్నారు. షేక్ నాగూర్ బీ, సయ్యద్ జరీనా పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

ముసునూరు, న్యూస్‌టుడే: ? గోగులంపాడు నుంచి లీలానగర్ వైపు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పక్కన ఉన్న పెద్ద చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఎవరి మీద పడతాయోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. **- అఖిల్, గోగులంపాడు**

✔ వెంటనే తొలగిస్తాం. **- బాబూరావు, ఆర్అండ్‌బీ డీఈ**

స్పందనకు వందనం

కలిదిండి, న్యూస్‌టుడే: మండలంలోని సానా రుద్రవరంలో పలు కాలనీల్లో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని స్థానికుడు రవితేజ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ సర్పంచి నున్న రాజేశ్వరమ్మ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

ఘనంగా సత్యసాయి జయంతి

భైరవపట్నం వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పలు సచివాలయాల్లో సత్యసాయి శత జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమణబాబు మాట్లాడుతూ సత్యసాయి పేదలకు అంతర్జాతీయ స్థాయి మెరుగైన వైద్యంతో పాటు లక్షలాది మంది దాహం కేకలు తీర్చినట్లు వివరించారు. ప్రేమ, కరుణ శాంతి మార్గాలతో ప్రజలను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించడంతో పాటు వాళ్ల అవసరాలు తీర్చినట్లు చెప్పారు. విద్యతోనే సమాజంలో పేదరికం రూపుమాపవచ్చని పెద్ద ఎత్తున పాఠశాలలు, కళాశాలలను నెలకొల్పి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామాల సర్పంచులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


ఉత్కంఠగా సాగుతున్న ఖో-ఖో

డివిజన్ స్థాయి ఆటల పోటీలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని అప్సా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్) డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహన్‌రావు అన్నారు. ముదినేపల్లిలోని ఇండో సాక్సన్, గౌతమ్ పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీలను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ కృష్ణ ప్రారంభించారు. పోటీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 15 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, ఖో-ఖో, త్రోబాల్, మ్యూజికల్ ఛైర్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, అర్జా ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఏవీ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.కనక దుర్గా భవాని, కోశాధికారి ఎస్వీ రాఘవయ్య, మదనకృష్ణ పాల్గొన్నారు

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● 'పది' విద్యార్థులపై దృష్టి ● పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

నియోజకవర్గం	పది విద్యార్థులు
నూజివీడు	3,856
కైకలూరు	2,761

నూజివీడు, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకం కావడంతో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గణితం, సైన్సు, ఆంగ్లం, సబ్జెక్టులపై సంసిద్ధం చేయడంలో మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. ఒత్తిడి లేకుండా రోజూ 10 నిమిషాల పాటు మానసిక ప్రశాంతతకు చేకూరే యోగా, ధ్యానం, క్రీడలు, వంటి అంశాలను ప్రణాళికలో పొందుపరిచారు. దీనికి అనుగుణంగా నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వివిధ మోడల్ పేపర్లతో ప్రాక్టీస్ చేయిస్తున్నారు.

అధిక మార్కులు సాధిస్తా...

సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు నేర్పించే మెలకువలు మంచి మార్కులు రావడానికి దోహదపడతాయి. భయపడితే నేర్చుకున్న అంశాలు మర్చి పోయే అవకాశం ఉంటుంది. అందుకే ఏ భయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక తరగతులకు హాజరై సాధన చేస్తున్నా. **- కంచర్ల సంజన, ఈదర**

అందరి సహకారంతో...

ఏకాగ్రతతో చదివితే మనసులో నిక్షిప్తమై ఉంటాయన్న ఉద్దేశంతో తెల్లవారు జామున లేచి చదువుతున్నా. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం కలిగింది. **-తొమ్మండ్రు నవిత, పోతవరప్పాడు**

సందేహాల నివృత్తికి అవకాశం..

ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నాం. ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లోని సందేశాలను వెంటనే నివృత్తి చేస్తున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలననే నమ్మకం కలిగింది. **- మొగదాటి సలోమి, మల్లిబోయినపల్లి**

ప్రణాళికతో చదువుతున్నాం..

పాఠశాలలో పది పరీక్షల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల్లోని సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడానికి స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నారు. అత్యధిక మార్కులు సాధించడానికి ప్రణాళిక ప్రకారం చదువుతున్నా. **- కారుకొండ బ్లెస్సీ, చొప్పరమెట్ల**

ఎంతో ప్రయోజనం..

పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. ఈ సారి తరగతుల్లో సగటు, మధ్యస్థంగా చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తర్ఫీదు ఇస్తున్నాం. **-పి.ఎస్.సుధాకర్, డీవైఈవో, నూజివీడు**

ఆఖరి మజిలీకి అవస్థలెన్నో

అధ్వానంగా శ్మశాన వాటికలు

వదర్లపాడులో అడవిలా మారి ఇలా..

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయి. గ్రామ పంచాయతీల ఆదరణ కొరవడటంతో అభివృద్ధికి నోచక మానవుడి ఆఖరి మజిలీలోనూ కష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. కైకలూరు పంచాయతీ పరిధిలోని దానగూడెంలో 400 నివాసాలు ఉండగా 800 వరకు జనాభా నివాసిస్తున్నారు. ఏళ్లకిందట సుమారు ఎకరం విస్తీర్ణంలో కేటాయించిన భూమిలోనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. రోడ్డు కంటే దిగువన ఉండటంతో చిన్నపాటి వర్షాలకే నీట మునుగుతోంది. ఇటీవల వర్షాల సమయంలో ఇద్దరు చనిపోగా శవాలను పూడ్చే అవకాశం లేకపోవడంతో చెంతనే ఉన్న కాలువ గట్టుపై పూడ్చాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు పునాదులు వేసి నిధులు లేవని అసంపూర్తిగా వదిలేశారు. మట్టి పూడిక చేసి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వదర్లపాడులోనూ..

మండలంలోని వదర్లపాడు శ్మశాన వాటిక పరిస్థితి ఈ కోవకే వస్తుంది. ఇది ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని ఉంది. ఏళ్లుగా చుట్టూ ప్రహరీ నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. చెంతనే ఆక్వా చెరువులు ఉండటంతో కొందరు రైతులు సైడు బోదెలను పూడ్చేసి నీరు బయటకు తోడటంతో శ్మశాన వాటిక నీట మునుగుతోంది. దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగి అంతిమ సంస్కారాలు చేసే వీలు లేకుండా పోయింది. ఎవరైనా చనిపోయిన సమయంలో వారి బంధువులు పిచ్చిమొక్కలు తొలగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై ఇరు గ్రామాల పంచాయతీ ఈవోలను సంప్రదించగా ఉన్నతాధికారులకు నివేదించి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్ బియ్యం లారీకి ప్రమాదం

ధ్వంసమైన వాహనం ముందు భాగం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీని ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొనడంతో రేషన్ బియ్యం సరఫరా చేసే లారీ ముందు భాగం ధ్వంసమైన సంఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లి వైపు నుంచి ఆదివారం మధ్యాహ్నం వడాలికి బియ్యం లోడుతో లారీ బయలు దేరింది. స్థానిక ఇసుక కాలవ సమీపంలో ముందు వెళ్తున్న లారీకి కుక్క అడ్డం రావడంతో సడన్ బ్రేకు వేశాడు. అది గమనించని రేషన్ బియ్యం లారీ డ్రైవర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. స్వల్ప గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

నీటి తొట్టె శుభ్రం చేయరూ..!

ముసునూరులో అపరిశుభ్రంగా ఇలా..

ముసునూరు, న్యూస్‌టుడే: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ప్రతి గ్రామంలో పశువుల నీటి తొట్టెలు నీరు అపరిశుభ్రంగా మారాయి. ముసునూరు మండలం వ్యాప్తంగా చాలాకాలం నుంచి నీటి తొట్టెలను శుభ్రం చేయించిన దాఖలాలు లేవు. శుభ్రం చేయకుండా నీరు నింపుతుండటంతో పాచి పట్టి దుర్వాసన వస్తున్నాయని, తొట్టెలను శుభ్రం చేయించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పశు పోషకులు చెబుతున్నారు. ఎంపీడీవో ఏసుబాబును వివరణ కోరగా సిబ్బందిని పంపించి తొట్టెలను వెంటనే శుభ్రం చేయిస్తామన్నారు.

జూదాలపై ఉక్కుపాదం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో జూదాలపై ఉక్కు పాదం మోపినట్లు ఎస్సై కె.శుభశేఖర్ స్పష్టం చేశారు. పోలీసులు ఆదివారం జూద శిబిరాలపై దాడులు నిర్వహించారు. ఈదర గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,500, నూగొండపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1100 స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

నిలిపివేతలో నిర్లక్ష్యం.. సిబ్బందికి ప్రాణసంకటం

విద్యుత్తు మరమ్మతుల్లో మృత్యు ఘంటికలు

ముదినేపల్లి, మండవల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ అధికారుల పర్యవేక్షణ లేమి. ఒకరి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా మరొకరు బాధ్యతలు నిర్వహణ.. వెరసి పలువురి విద్యుత్తు శాఖ సిబ్బంది ప్రాణాలు గాలిలో దీపాల్లో మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించాల్సిన లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు జాడ లేకుండా ఫోన్ల మీద పనులు చెబుతుండటంతో ప్రైవేటు వ్యక్తులు సైతం ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. విద్యుత్తు నిలివేతలో నిర్లక్ష్యం నిండు కుటుంబాలను రోడ్డున పడేస్తోంది.

ఎల్‌సీలో తప్పిదాలతోనే ప్రమాదాలు..

వాతావరణ మార్పులతో లైన్లపై చెట్ల కొమ్మలు పడి సరఫరాకు అంతరాయం ఏర్పడటం, నియంత్రికలు వద్ద ఫ్యూజులు కాలి పోవటం, తీగలు తెగిపోవడం వంటి సందర్భాల్లో స్థానికుల సూచనలు మేరకు ఉప కేంద్రాల్లో ఉండే సిబ్బంది, ఉన్నతాధికారులు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు. దీన్నే ఎల్‌సీ(లైన్ క్లియర్) అంటారు. లైన్ ఇన్‌స్పెక్టర్ (ఎల్ఐ) అనుమతితోనే ఆయా ఫీడర్ల పరిధిలో ఎల్‌సీ ఇవ్వాల్సి ఉంటుంది. ఎల్ఐలు ఎల్‌సీ ఇవ్వడం, రిటర్న్ సమయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మచ్చుకు కొన్ని...

విద్యుత్తు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఏపూరులో అక్టోబర్ 22న విద్యుత్తు తీగలను మరమ్మతులు చేస్తూ మండవల్లికి చెందిన చిగురుపాటి సుకుమార్ మృతి చెందాడు. ఇదే తరహాలో మండవల్లికి చెందిన వారు గత ఆరేడు ఏళ్లలో దాదాపు పది మంది వరకు మృతి చెందడం గమనార్హం. ఎక్కువగా విద్యుత్తు తీగలు, స్తంభాలు మార్చడానికి వెళ్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 11 మంది సిబ్బంది ఇలాంటి విద్యుత్తు ప్రమాదాలతో మృతి చెందారు.

ఇలా అయితే మేలు..

- స్తంభాలు, నియంత్రికల వద్ద మరమ్మతుల సమయంలో ఎర్త్ రాడ్ అమరిస్తే ప్రమాదాలు నుంచి తప్పించుకోవచ్చు.
- ఎల్‌సీలు ఇచ్చినా.. తీసుకున్నా.. తప్పక క్షేత్రస్థాయిలో సిబ్బందిని సంప్రదించాలి.
- టెస్టర్‌తో పరీక్షించాకే తీగల మరమ్మతులు ఉపక్రమించాలి.
- తప్పనిసరిగా గ్లౌజ్‌లు వేసుకోవాలి.
- ఏఈ, జేఈలు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో ఉంటూ పనులు పర్యవేక్షించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

చిన్న చిన్న మరమ్మతులు ఉన్నా తప్పక ఎల్‌సీ తీసుకున్నాకే పనులు చేయడం మంచిది. సిబ్బందికి దీనిపై ఎన్నో సార్లు అవగాహన కల్పిస్తున్నాం. మరో మారు దీనిపై ఏఈలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి జాగ్రత్తలు వివరిస్తాం. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు పాటిస్తాం. **- జీబీ శ్రీనివాస్, విద్యుత్తు ఈఈ**

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కులాలు అహేతుకం.. మతాలు నిషిద్ధం అంటూ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పలు అంశాలపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. నూజివీడు కమిటీ అధ్యక్షులు అరుణ్‌కుమార్, అంజిబాబు, శివరామకృష్ణ, రామజోగి అశోక్, శ్యామ్‌లు పాల్గొన్నారు.

సహజకవి బెనర్జీకి సత్కారం

ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టరు లక్ష్మీశా

కైకలూరు, న్యూస్‌టుడే: జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో రచయితలు, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కైకలూరుకు చెందిన సహజకవి దండె బెనర్జీ ఇందులో పాల్గొని 'జీవిత యానం - సాగే ఓ ప్రయాణం' శీర్షికతో కవితను రచించి గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశా బెనర్జీకి ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.

చింతా నాగమణి సేవలకు పురస్కారం.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరుకు చెందిన చింతా నాగమణి ఆధ్యాత్మిక రంగంలో చేసిన కృషికి తెలుగు వెలుగు మహా నంది పురస్కారం-2025 లభించింది. ఆ మేరకు ఈ నెల 21న విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను పలువురు అభినందించారు.

(c) eenadu

సేవకు రూపం.. మానవతకు ప్రతిబింబం

సత్యసాయి చిత్రపటం వద్ద హారతి ఇస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే కొండబాబు

సాయి నామ సంకీర్తనా గానంతో కాకినాడ రామారావుపేటలోని రంగసాయి మందిరం ఆదివారం మార్మోగింది. సత్యసాయిబాబా శత జయంతిని ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యసాయి వ్రతాల్లో వందల మంది పాల్గొన్నారు. సంకీర్తనలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మికతతో ఓలలాడింది. సాయంత్రం భజన అనంతరం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● భగవాన్ సత్యసాయిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపు నిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ వివేకానంద మందిరంలో సత్యసాయి శతజయంతిని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, మానవతా దృక్పథంతో అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, గాంధీనగర్, కాకినాడ కలెక్టరేట్

సామూహిక సత్యసాయి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఈ నగరానికి ఏమైంది?

రాత్రివేళ నిఘా కరవు.. పేట్రేగిపోతున్న అల్లరిమూకలు

'గత నెలలో కాకినాడ రేచర్లపేటకు చెందిన ఇద్దరు స్నేహితులు అర్ధరాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కల్పనా వంతెన సమీపంలో నలుగురు వ్యక్తులు ఆపి ఫోన్లు అడిగారు. వారు ఇవ్వకపోవడంతో గొడవ జరిగింది. అనంతరం స్నేహితులు పెట్రోలు బంకుకు వెళ్తుండగా ఆ నలుగురు ద్విచక్రవాహనంపై వచ్చి అడ్డగించి చాకుతో, బీరుసీసాతో వారిపై దాడిచేశారు. చుట్టుపక్కల వారు రావడంతో పరారయ్యారు.'

'ఇటీవల ఓ వైద్యుడు విధులు ముగించుకుని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించారు. అతని జేబులోని రూ.2500 నగదు లాకేసుకున్నారు. ఏటీఎం సెంటర్‌కు తీసుకెళ్లి ఇంకా డబ్బులు డ్రా చేసే ప్రయత్నం చేశారు. డాక్టరు స్నేహితుకు సమాచారం అందించారు. అక్కడికి ఓ కానిస్టేబుల్ రావడంతో దుండగులు వెళ్లిపోయారు.'

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

పెన్షనర్ల పారడైజ్‌గా, ఆకర్షణీయంగా పేరుగాంచిన కాకినాడ నగరంలో గంజాయి, మద్యం మత్తులో అల్లరిమూకలు, అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. నగర శివారు ప్రాంతాలతో పాటు నగర నడిబొడ్డున ఉన్న పలు ప్రాంతాలు వారికి అడ్డాగా మారుతున్నాయి. జాతీయ రహదారులపై వాహనాలను అడ్డగించి, ప్రజల నుంచి డబ్బులు, చరవాణులు, బంగారం దోచుకుంటున్నారు. వారు ఎదురు తిరిగితే వారిపై చాకులు, కత్తులతో వెంబడించి మరీ దాడికి పాల్పడుతున్నారు. దీంతో రాత్రిపూట బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

కల్పనా సెంటర్ కూడలి ప్రాంతం

ఎక్కడెక్కడంటే...

టౌన్ రైల్వేస్టేషన్, కల్పనా వంతెన, డెయిరీఫాం సెంటర్, మధురానగర్, చీడిగపొర, రేచర్లపేట, గోళీలపేట, మేకలకమేల, రామకృష్ణారావుపేట, రైల్వేట్రాక్ల చెంత, కొత్తకాకినాడ తదితర ప్రాంతాల్లో అల్లరిమూకలు తిష్ట వేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లోనూ ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకున్నాయి.

గస్తీకి సుస్తీ

నగరంలో రాత్రిపూట పోలీసుల నిఘా అంతంతమాత్రంగానే ఉంటుంది. గతంలో ఓ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బీట్లు కొన్ని బృందాలుగా ఏర్పడి గస్తీ నిర్వహించేవారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో లేకపోవడంతో దుండగులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత సమస్య తీవ్రంగా ఉంటుంది. ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి రాత్రి పూట నిఘా పెంచి నగరవాసులు భరోసా కల్పించాల్సిన అవసరముంది.

ఏమోనండి.. మాకు కనిపించదు..!

మైనింగ్ అక్రమాలపై స్పందించని యంత్రాంగం

ఈనాడు, కాకినాడ

ఈనాడు పరిశీలన

మైనింగ్ అక్రమార్కులు చేతుల్లో చిక్కి కొండలు కరిగిపోతున్నాయి.. గుట్టలు తరిగిపోతున్నాయి.. మట్టి మాయమైపోతోంది. వీటిపై ఫిర్యాదులు చేసినా అబ్బే మాకేం వినపడదు, కనపడదు అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారినా జిల్లాలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వైకాపా హయాంలో చక్రం తిప్పిన వారే ప్రస్తుత నేతలనూ మచ్చిక చేసుకుని వ్యవహారాలు చక్కదిద్దుతున్నారు.

అనుమతులు అంతంతే

జిల్లాలో అనుమతులున్న క్వారీల కంటే అక్రమ మైనింగే ఎక్కువ జరుగుతోంది. బండరాళ్లు మొదలుకొని కంకర, మట్టి వరకు అన్నింటా అడ్డగోలుగా తరలించుకుపోతున్నారు. వీటిని కట్టడి చేసే మైనింగ్‌శాఖ మొద్దునిద్ర వహిస్తుంది. దీనిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు వస్తున్నా జిల్లా అధికారులు వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. ఇటీవల భాజపా నేతలే విలేకరుల సమావేశం నిర్వహించి, మైనింగ్ మాయాజాలంపై ధ్వజమెత్తుతుండటం గమనార్హం. తహసీల్దారు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి మౌనం దాల్చుతున్నారు.

రామేశ్వరం మెట్టలో రాత్రి వేళ మైనింగ్ ఇలా..

పగలు చూస్తే కరిగిన గుట్టలే కనిపిస్తాయి

కళ్లముందే జరుగుతున్నా..

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో అక్రమంగా తవ్వి బండరాళ్లు తరలిస్తున్నారు. లీజు ఉన్న క్వారీల్లో తవ్వినట్లు చూపించి ఒకే బిల్లుపై పదుల సంఖ్యలో లారీలు తిప్పుతున్నారు.

జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట ప్రాంతాల్లోని సహజ వనరుల నుంచి ఇసుక, కంకర, మట్టి రోజూ వందల లారీలు తవ్వి తరలిస్తున్నారు. ఇటీవల ఏలేరు కాలువలో ఏకంగా చిన్నపాటి డ్రెడ్జర్లు పెట్టిమరీ ఇసుక తోడేశారు.

రామేశ్వరం మెట్టలో రాత్రిళ్లు ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేసి, కంకర పట్టుకుపోతున్నారు.

పెద్దాపురం, తుని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. ఇటీవల సామర్లకోట పరిధిలో గోదావరి పంట కాలువ గట్టు అక్రమించి ఓ రియల్టర్ చదును చేసేశాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేస్తే జలవనరుల శాఖ అధికారులు 'అబ్బే అతనేమీ ఆక్రమించలేదని మేమే అతని భూమిలో గట్టేశాం' అని ఫిర్యాదుదారుడికి సమాధానం ఇవ్వడం గమనార్హం. మైనింగ్ అక్రమాలపై ఆ శాఖ ఇన్‌ఛార్జి ఏడీ పణిభూషణరావుకు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

ఎత్తు వేశాడంటే ప్రత్యర్థి చిత్తే

పెద్దాపురం, న్యూస్‌టుడే: అరవై నాలుగు గళ్ల ఆటలో ఆ యువకుడు ఆరితేరాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాల పంట పండిస్తున్నాడు. తను ఎత్తు వేశాడంటే ప్రత్యర్థి చిత్తు కావాల్సిందే. అతనే పెద్దాపురం పట్టణానికి చెందిన ముప్పన జ్ఞాన సాయి సంతోష్.

ఆటపై మక్కువతో..

సాయి సంతోష్ సామర్లకోటలోని వైఆర్ఎల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి పవన్‌కుమార్.. కుమారుడికి ఆరేళ్ల వయసులో సరదాగా నేర్పించారు. అప్పటినుంచి ఆటపై మక్కువ పెంచుకున్నాడు. తర్వాత కాకినాడకు చెందిన శిక్షకుడు కేఎస్‌వీ ప్రసాద్ వద్ద శిక్షణ ఇప్పించారు.

100 పతకాలు..

ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో 100 పతకాలు సాధించాడు. 2023లో ఖతార్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. 2024లో బిహార్‌లో జరిగిన అంతర్జాతీయ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం పొందాడు. ఇటీవల మంగోలియాలో జరిగిన అండర్ 17 విభాగం స్కూల్ గేమ్స్ చదరంగం పోటీల్లో తృతీయస్థానం దక్కించుకున్నాడు. సెర్బియాలో జరిగే ప్రపంచ అండర్ 17 పోటీలకు తరపున అర్హత సాధించాడు. ప్రస్తుతం చదరంగంలో 2089 ఫైడ్ రేటింగ్‌లో ఉన్న సాయి సంతోష్ గ్రాండ్ మాస్టర్ కావాలనే లక్ష్యంతో ఉన్నాడు.

సాధించిన ట్రోఫీలతో ముప్పన జ్ఞాన సాయి సంతోష్

మార్మోగిన గోవింద నామస్మరణ

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కోలాహలంగా మారింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

బంగారు కావ్యం

వైద్యవిద్యలో 14 పతకాలు కైవసం

యువ

ఎంబీబీఎస్‌లో చేరడానికి ర్యాంకు తెచ్చుకోవడం ఓ ఎత్తు అయితే, తర్వాత క్లిష్టతరమైన సిలబస్‌ను చదవడం మరో ఎత్తు.. అలాంటి వైద్యవిద్యలో సత్తా చాటుతూ ఉత్తమ విద్యార్థిని నిలిచారు మానస కావ్య. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో చదువుతున్న కావ్య ఇటీవల జరిగిన వార్షికోత్సవంలో ఏకంగా 14 బంగారు పతకాలు సాధించి ఔరా అనిపించారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

ఎలా సాధించానంటే..

బంగారు పతకాల సాధనకు తాను చేసిన కృషిని కావ్య ఇలా వివరించారు. 'పరీక్షల సమయంలో ఎక్కువ కష్టపడతాను. రాత్రిపూట ఎక్కువ సమయం చదువుకు కేటాయిస్తాను. ఖాళీ సమయాల్లో, తరగతులు ఆయా కళాశాల లైబ్రరీకి వెళతాను. ఆఖరి పూర్తి సమయం సద్వినియోగం చేసుకుని, వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తాను. ఆ తర్వాత ఇంటికి వెళతాను. అమ్మతో పాటు నా బెస్ట్ ఫ్రెండ్ కవిత సహకారం ఎంతో ఉంది. కళాశాలలోనూ చక్కటి, ప్రశాంతమైన వాతావరణం ఉంది. చదువుతోపాటు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొంటాను. మొదటి ఏడాది నుంచి పలు సబ్జెక్టుల్లో నాలుగు, చివరి ఏడాదిలో మెడిసన్, సర్జరీ, బెస్ట్ ఔట్ గోయింగ్ తదితర విభాగాల్లో మొత్తం 10 బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉంది.'

కుటుంబ నేపథ్యం: కావ్యది గుంటూరు. తండ్రి చాగంటి వెంకటరెడ్డి ఆర్మీలో సుబేదార్ మేజర్‌గా చేస్తున్నారు. తల్లి శ్రీదేవి గృహిణి. తండ్రి ఉద్యోగరీత్యా ఆమె విద్యాభ్యాసం హరియాణా, దిల్లీ ప్రాంతాల్లో సాగింది. చిన్నప్పటి నుంచి మెడిసిన్ చేయాలనే కోరికతో పట్టుదలతో చదివి నీట్‌లో 400వ స్టేట్ ర్యాంకు సాధించారు. ఆల్‌ఇండియా కోటా ద్వారా ఆర్ఎంసీలో చేరారు. ప్రస్తుతం చివరి ఏడాది హౌస్ సర్జన్ చేస్తున్నారు.

చారిత్రక దర్గా.. మహిళలకే ప్రవేశం

మీకు? తెలుసా

దక్షిణ భారతదేశంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో ఉన్న బీబీ ఫాతెమాజహెరా దర్గా చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహ్మద్ ప్రవక్త తనయగా, కర్బలా యుద్ధభూమిలో అమరత్వం పొందిన ఇమామ్‌హసన్, ఇమామ్‌హుస్సేన్‌కు తల్లిగా ముస్లింలకు ఆరాధ్యనీయురాలుగా ఆమె అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది. 11వ శతాబ్దంలో ఇక్కడి దర్గా నిర్మితమైనట్లు సంఘనాయకులు చెబుతున్నారు. తాటాకులతో ఉండే ఇక్కడి ప్రదేశంలో క్రీ.శ.1576లో కట్టడం నిర్మితమైంది. 2022లో ఈ పురాతన కట్టడంపై రూ.కోటి వ్యయంతో గోళాకార స్తూపాన్ని నిర్మించారు. ముస్లిం క్యాలెండర్‌లో జమాదుసానీ(ఆఖర్) మాసంలో 3న అంటే నవంబరు 25 మంగళవారం పాశర్లపూడి దర్గాలోని ఫాతెమాజహెరాకు మహిళలు షహదత్(వర్ధంతి) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చెన్నై, హైదరాబాద్ సహా కృష్ణా జిల్లా మచిలీపట్నం, విజయవాడ, విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి అత్యధికంగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడ విశేషమేమిటంటే దర్గాలో దర్శనానికి మహిళలు తప్ప పురుషులు ఎవర్నీ అనుమతించరు. గర్భిణులను కూడా లోనికి వెళ్లనివ్వరు. మహిళలు తమ కోర్కెలను నెరవేరాలంటూ గాజులు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. -న్యూస్‌టుడే, మామిడికుదురు

పాశర్లపూడిలోని ఫాతెమాజహెరా పురాతన దర్గా

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా...

శ్రీవాణి ట్రస్టుచే భజన మందిరాల నిర్మాణాలకు అవకాశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: గ్రామాలు, కాలనీల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో వెనుకబడిన ప్రాంతాల్లో తితిదే ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా భజన మందిరాల నిర్మాణాలు చేపట్టేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. సంబంధిత ప్రాంతాల్లో భజన మండపాలకు స్థలాలు చూపిస్తే నిధులు కేటాయిస్తారు.

ఇవీ మార్గదర్శకాలు

భజన మండపాల నిర్మాణం చేపట్టే ప్రాంతంలో దేవాలయం ఉండకూడదు. గ్రామం, గిరిజన ప్రాంతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, ఇతర ప్రాంతాలు అర్హమైనవి. భజన మందిరాల నిర్మాణంలో ప్రజా విరాళం తప్పనిసరి కాదు. అనుమతించిన నిర్మాణాన్ని స్థానిక గ్రామ దేవాలయ కమిటీ దేవాదాయశాఖ అందజేసిన నమూనా ప్రకారం స్వయంగా చేపట్టొచ్చు. మంజూరు చేసిన మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లిస్తారు.

కేటాయింపు ఇలా..

విస్తీర్ణం (సెంట్లు)	నిధులు (రూ.లక్షలు)
5	10
8	15
10	20

ట్రస్టు మార్గదర్శకాల ప్రకారం భజన మందిరాలను మూడు వర్గాలుగా విభజించారు. ఇందులో ఐదు సెంట్ల భూమి ఉంటే రూ.10లక్షలు, 8 సెంట్లకు రూ.15 లక్షలు, 10 సెంట్లలో నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయనున్నారు.

'భూమికి సంబంధించి గ్రామకంఠమైతే వీఆర్వో, పంచాయితీ సెక్రటరీ తీర్మానం, ప్రైవేట్ వ్యక్తులైతే భజనమందిరానికి తాను భూమి దానం చేస్తున్నట్లు దాన పట్టా సమర్పించాల్సి ఉంటుంది. ఆలయ కమిటీలు, సమరసత సేవా ఫౌండేషన్, భక్తులు కమిటీలుగా ఏర్పడి నిర్మించవచ్చును. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరిచి లెక్కలు ఉంచాలి. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు.'

అప్పగిస్తే.. ఆదరిస్తారు

'శిశుగృహ'లో అనాథ పిల్లల సంరక్షణ

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

పిల్లలను పెంచి పోషించే స్థోమత లేని వారు, పిల్లలను ఎవరైనా దత్తత ఇచ్చేయాలని అనుకున్నవారు, అనాథ పిల్లలు, నిరాదరణకు గురైన వారు.. ఇలా పలు రకాల కారణాలతో పిల్లలను కొందరు తల్లిదండ్రులు అనాథలుగా వదిలేస్తున్నారు. ఇలా చేయొద్దని.. 'శిశు గృహ'కు అప్పగించండని అధికారులు సూచిస్తున్నారు. కాకినాడ నగరంలోని ప్రతాప్‌నగర్‌లో చేరదీసేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఈ సంరక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, కళాశాలలు, జనసంచార కూడళ్ల వద్ద పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తోంది. దత్తత మాసోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 5 వరకు వీటిని చేపడుతున్నారు.

మీ కోసం

కాకినాడ ప్రతాప్‌నగర్‌లో శిశుగృహ

దత్తత తీసుకోవచ్చు..

● శిశుగృహలో ఉండే చిన్నారులను 'కారా' నిబంధనలు అనుసరించి దత్తత కూడా ఇస్తారు. కావాల్సిన దంపతులు ముందుగా తమ పాన్ కార్డుతో కారా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ● కుటుంబం ఫొటోతో పాటు నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ, అఫిడవిట్‌తోపాటు తల్లిదండ్రులు ఇద్దరికి వైద్య పరీక్షలకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ● హోమ్ స్టడీ(గృహ అభ్యసన పత్రం)తో రూ.6 వేలు డీడీ రూపంలో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి పథకం సంచాలకులు, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థకు పొందుపరుస్తూ దరఖాస్తు సమర్పించాలి. చివరి దశలో మరికొన్ని నిబంధనలతో దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. ● దత్తతకు సంబంధించిన మరింత సమాచారానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో గాని, ఐసీడీఎస్, బాలల సంరక్షణ విభాగం కార్యాలయంలో సంప్రదించాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మి తెలిపారు.

సంప్రదించాల్సిన నంబర్లు

ప్రాజెక్టు డైరెక్టర్: 86391 40672
జిల్లా బాలల పరిరక్షణ అధికారి: 85550 60818
శిశుగృహ మేనేజర్: 89191 23488

మరింత రుచి.. నాణ్యత

మధ్యాహ్న భోజనం ఛార్జీల పెంపు

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట ఖర్చులను ప్రభుత్వం పెంచింది. దీంతో బడుల్లో ఇక నుంచి మరింత రుచికరంగా భోజనం అందించడానికి అవకాశం ఏర్పడింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి, అందరికీ పోషకాహారం అందించడానికి ఉద్దేశించిన ఈ పథకాన్ని గత వైకాపా ప్రభుత్వం సరిగా పట్టించుకోలేదు. పైగా నాసిరకం బియ్యాన్ని అందించేవారు. వాటితో వండిన అన్నం ముద్దగా ఉండటంతో పిల్లలు తినేవారు కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బడులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దాంతో భోజనం తినేవారి సంఖ్య పెరిగారు. తాజాగా వంట ఛార్జీలను పెంచటం వల్ల భోజనం మరింత నాణ్యతతో వడ్డించేందుకు అవకాశమేర్పడింది.

ఇవీ లెక్కలు..

ప్రాథమిక పాఠశాలలు:	1259
విద్యార్థులు:	51,256
ప్రాథమికోన్నత పాఠశాలలు:	104
పిల్లల సంఖ్య:	14,319
ఉన్నత పాఠశాలలు:	256
చదువుతున్నవారు:	97,387
భోజన నిర్వహణ కార్మికులు:	2,580

భోజనం చేస్తున్న విద్యార్థులు

పెరిగిన ఛార్జీలు ఇలా..

ప్రస్తుతం 1-5 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45 చొప్పున చెల్లిస్తున్నారు. దీన్ని రూ.6.19కి పెంచారు. 6-8 తరగతులకు రూ.8.17 నుంచి రూ.9.29కు, 9,10వ తరగతి విద్యార్థులకు రూ.8.17 నుంచి రూ.9.29కి పెంచారు.

అధ్వాన మార్గం.. అద్దంలా మారి..

ఈనాడు కథనానికి స్పందన

కాకినాడ - సామర్లకోట రహదారి గుంతలు, కంకర రాళ్లు తేలి అత్యంత ప్రమాదకరంగా మారింది.. తర్వాత మొంథా తుపానుతో రహదారి రూపురేఖలే మారిపోయాయి.. దీంతో ఈ మార్గం ప్రయాణికుల పాలిట నరకంలా మారింది.. దీనిపై గత నెల 23న 'కాకినాడ-సామర్లకోట.. వయా గుంతలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు రహదారికి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతోంది. - ఈనాడు, కాకినాడ

తీరప్రాంత రక్షణ గోడ సాకారంపై ఆశలు!

నేడు దిల్లీ వెళ్లనున్న కలెక్టర్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ వద్ద తీరప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి రూ.328 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. గతంలో ఒకసారి కలెక్టర్ షాన్‌మోహన్ దీనిపై దిల్లీ వెళ్లి ప్రాజెక్టు రిపోర్టు నివేదించారు. తాజాగా మళ్లీ పిలుపురావడంతో కలెక్టర్ సోమవారం సాయంత్రం కాకినాడ నుంచి బయలుదేరి దిల్లీ వెళ్లనున్నారు. ఆయన మంగళ, బుధవారాల్లో కేంద్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో రక్షణ గోడకు నిధులు మంజూరుపై ఆశలు చిగురిస్తున్నాయి.

నేడు వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. కలెక్టరేట్‌కు రాలేనివారు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని మీ-కోసం కాల్‌సెంటర్ 1100 సేవలను సంప్రదించి తెలుసుకోవచ్చని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

కుట్టేదెలా.. కట్టేదెలా!

మిషన్ల కోసం మహిళల ఎదురుచూపు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ప్రతి మహిళ స్వయం ఉపాధి పొందడం ద్వారా కుటుంబ వ్యవస్థ ఆర్థికంగా బలోపేతం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మహిళలకు మే, జూన్, జులైలో కుట్టు, అల్లికలపై శిక్షణ ఇచ్చారు. జీవనోపాధి పొందేలా ఉచితంగా కుట్టు మిషన్లు సైతం అందిస్తామని ప్రకటించారు. శిక్షణ పూర్తయినా ఇంతవరకు వాటిని ఇవ్వలేదు. రెండు సంస్థలు ఇప్పటికీ ధ్రువపత్రాలను అందించలేదు.

మొత్తం కేంద్రాలు: 50
నిధులు: రూ.9.48 కోట్లు
శిక్షణ పొందినవారు: 4,920
శిక్షణ పొందుతున్న మహిళలు
ఓసీలు: 2,211
ఈబీసీలు: 213

అన్ని అంశాలపై తర్ఫీదు

50 కేంద్రాల పరిధిలో రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక విడతగా, ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో విడతగా శిక్షణ ఇచ్చారు. ఇందులో మిషన్ కుట్టడంతో పాటు డిజైన్ ఆధారంగా దుస్తులు కత్తిరించడం వంటివి నిపుణులతో నేర్పించారు. అల్లికలపైనా శిక్షణ ఇచ్చారు. ఒక్కో మహిళకు శిక్షణ కాలంలో రూ.15,599 ఖర్చు చేశారు. వారికి 50 శాతం రాయితీతో రూ.2 లక్షల వరకు రుణం కల్పిస్తామని ప్రకటించారు. ఇవేవీ సాకారం కాకపోవడంతో మహిళలు నిరాశ చెందుతున్నారు.

జాబితా పంపించాం

శిక్షణ పొందిన మహిళల జాబితా ప్రభుత్వానికి పంపించారు. 75 శాతం హాజరు ఉన్నవారికి కుట్టు మిషన్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. పరికరాలు, ధ్రువపత్రాలు రాగానే అందిస్తాం.
- ఎ.శ్రీనివాసరావు, ఈడీ, బీసీ కార్పొరేషన్, కాకినాడ

యెహోవా భక్తుల మరణము ఆయన దృష్టికి విలువగలది. కీర్తన 116:15
ఆదరణ కూడిక
మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసి, మమ్మల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దిన మీరు మా నుండి భౌతికంగా దూరమైన ఎప్పటికీ మా హృదయాలలో కొలువైవుంటారు.

కీ.శే. కాలాపు సీతాదేవి గారు
Rtd. Sub Treasury Officer
జననం: 06-04-1945 మరణం: 20-11-2025
M.A., LL.B.
ఆదరణ కూడిక: ది.24-11-2025 సోమవారం ఉదయం 10 గంటలకు D.No: 66-9-4, ... సెల్: 98851 26463

(c) eenadu

లోవ.. భక్తజన తోవ

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థాన ప్రాంగణంలోని వసతి గృహాలు నిండిపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 14 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని దీంతో దేవస్థానానికి రూ.4.27 లక్షల ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

నేను సైతం.. పర్యావరణ పరిరక్షణకు..

పర్యావరణాన్ని రక్షించుకుంటే స్వచ్ఛమైన, ఆరోగ్యకర జీవితాన్ని గడపొచ్చని అవగాహన కల్పిస్తూ పశ్చిమబంగ రాష్ట్రం కోల్‌కతా సమీపంలోని హుగ్లీ ప్రాంతానికి చెందిన యువకుడు సుభోజిత్‌దాస్ సైకిల్‌యాత్ర చేస్తున్నారు. సైకిల్ ముందు భాగంలో గో గ్రీన్.. లైవ్ క్లీన్ బోర్డు ఏర్పాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహించుకునే అతడు ఈ నెల 10న హుగ్లీ నుంచి సైకిల్‌పై బయలుదేరి 14 రోజులకు జగ్గంపేట చేరుకున్నారు. కన్యాకుమారి వరకు రోడ్డు మార్గంలో సుమారు 2,965 కి.మీ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

తీరంలో సందడి

కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన చిన్నారులు, పెద్దలు తారతమ్యం లేకుండా ఆటపాటలతో కాలక్షేపం చేశారు. తీరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రత చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, సర్పవరం**

'టీకా.. ఆరోగ్యానికి లేదిక ధోకా'

తునిలో చిన్నారికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అప్పుడే పుట్టిన శిశువు నుంచి 16 ఏళ్ల వయసు వరకు వ్యాధి నిరోధక శక్తిని పెంచే టీకాలు విధిగా ఎప్పుడు వేయించాలో స్పష్టం చేస్తూ ప్రభుత్వం ప్రణాళిక చేసింది. నేషనల్ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ పేరిట కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అన్ని ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేసింది. అనేక మంది తల్లిదండ్రులకు అవగాహన లేక చిన్నారులకు సకాలంలో ఆయా వ్యాధి నిరోధక టీకాలు, చుక్కల మందులు వేయించలేకపోతున్నారు. ఆయా టీకాలు సకాలంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే పిల్లలకు వేయించాలి.

మీ కోసం

వేయించుకోవాల్సింది ఇలా...

● బిడ్డ పుట్టిన వెంటనే ఓపివి జీరో, బీసీజీ, హెచ్‌ఈపీ బి వేస్తారు. ● తర్వాత ఆరు వారాలకు ఓపీవి -1, ఆర్‌వివి -1, ఎఫ్‌ఐపీవి -1, పెంటావేలెంట్ -1, పీసీవీ -1 వేయించాలి. ● 10వ వారంలో ఓపీవి -2, ఆర్‌వివి -2, పెంటావేలెంట్ -2 ● 14వ వారంలో ఓపీవీ -3, ఆర్‌వివి -3, ఎఫ్‌ఐపీవి -2, పెంటావేలెంట్ -3, పీసీవీ -2 వేస్తారు. ● ఆ తర్వాత 9-12 నెలల వయసులో ఎంఆర్ -1, ఎఫ్‌ఐపీవి -3, పీసీవీ బూస్టర్, జెఈ -1, ● 16-24 నెలల్లో ఓపీవీ బూస్టర్, ఎంఆర్ -2, డీపీటీ బూస్టర్ -1, జేఈ-2 ఉంటాయి. ● పిల్లల వయసు 5-6 ఏళ్లకు చేరితే డీపీటీ బూస్టర్ -2, 10 ● 16 ఏళ్ల వయసు వారికి టీడీ వేస్తారు. ● గర్భిణీలకు కూడా టీడీ -1, టీడీ -2 లేక టీడీ బూస్టర్ వంటివి వేయించాల్సి ఉంటుంది. **– న్యూస్‌టుడే, తుని**

గర్భిణి మృతిపై విచారణకు నేడు డీఎంఈ రాక

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం చినవలసలకు చెందిన గర్భిణి మల్లీశ్వరి కాకినాడ జీజీహెచ్‌లో మృతిచెందిన ఘటనపై విచారణకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) సోమవారం కాకినాడ రానున్నారు. ఇప్పటికే ఈ ఘటనలో పీజీ వైద్యురాలిని ఆరునెలల పాటు సస్పెండ్ చేశారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

EENADU SPORTS LEAGUE 2025

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
FM Partner | TV Partner | Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు కార్యాలయం,
ఎన్‌హెచ్-16, హుకుంపేట,
రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సత్యదేవుడికి ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పూజలు

తూర్పు రాజగోపురం వద్ద బొజ్జిరెడ్డి తదితరులు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణస్వామిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బొజ్జిరెడ్డి దంపతులు వ్రతమాచరించి, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం గావించి స్వామి ప్రసాదం అందించారు. 59 ఆదివాసీ గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటు చేయాలని ఉపప్రణాళిక ప్రాంత ఆదివాసీల తరఫున పలువురు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ)ను పెదమల్లాపురంలో ఏర్పాటు చేయాలని, ఆదివాసీ గ్రామాల్లో తెగలన్నింటికీ రాజ్యాంగ హక్కులు కల్పించాలని కోరారు. ఆయన వెంట జిల్లా సాధికారిక గిరిజన సంక్షేమ అధికారి నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అలీ మేధి, నాయకులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏఐసీసీ పరిశీలకుడు అలీ మేధి తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలతో సంస్థాగత ఎన్నికలపై డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అలీ మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నియోజకవర్గాల వారీగా కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ పర్యటించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిశీలకులు కొత్తూరి శ్రీనివాసరావు, గౌతు సత్యేంద్రబాబు, మల్లిపూడి రాంబాబు, దాట్ల గాంధీరాజు, తాళ్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆలూరి

ఆలూరి విజయలక్ష్మిని సన్మానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అతిథులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: వైద్యురాలిగా, రచయిత్రిగా, కళల పరిరక్షకురాలిగా, సంఘ సేవకురాలిగా తనదైన ముద్ర వేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆదివారం దంటు కళాక్షేత్రంలో డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి 80 ఏళ్ల జీవనయాత్ర(అశీతి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ వైద్యురాలిగా ఎంత పనిఒత్తిడితో ఉన్నా కళ, సాహిత్యం పట్ల ఆమెకున్న మక్కువ ఎనలేనిదన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ వై.డి.రామారావు, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పూర్వ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఐ.వి.రావు, రోటరీ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్.రావు, మాజీ ఎంపి చంద్రు శ్రీహరిరావు, నాట్యాచార్యుడు కృష్ణకుమార్‌లు మాట్లాడుతూ గొప్ప ఆదర్శ మహిళా మూర్తిగా ఆలూరిని కొనియాడారు. అనంతరం ఆమెను సన్మానించారు. డాక్టర్ ఏ.సత్యవతి, డాక్టర్ కాదా వెంకటరమణ, మార్ని జానకిరామ్‌చౌదరి, అల్లూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి పసుమర్తి పద్మజావాణి రచించిన బతుకు రాదారిలో కథా సంపుటిని ఆవిష్కరించారు.

రూ.50 లక్షల విరాళం

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న తల్లీపిల్లల ఎమర్జెన్సీ వార్డు నిర్మాణానికి రూ.50 లక్షల విరాళాన్ని సంబంధిత వ్యక్తులకు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి అందజేశారు. ఆలూరి రచనల సాహితీ సమాలోచనలో వాడ్రేవు వీరలక్ష్మీదేవి, అవధానుల మణిబాబు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, అద్దేపల్లి ప్రభ ప్రసంగించారు.

కొనసాగుతున్న ఖోఖో పోటీలు

ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు అండర్-17 బాలురు విభాగంలో రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ప్రకాశం, విశాఖ, చిత్తూరు, గుంటూరు జిల్లా జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు పతకాలు అందజేస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.సుధారాణి తెలిపారు. రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామరెడ్డి, కోశాధికారి గోవిందరాజు, వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మాచరరావు, కె.పట్టాభిరామం, ప్రభువరప్రసాద్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు

కాకినాడ డీఎస్ఏలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర జూడో సంఘ సీఈవో వెంకట్, జిల్లా కోశాధికారి రమణ, ఛైర్మన్ వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విష్ణాలయంలో ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ, భక్తులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులోని సీతారామస్వామివారి దేవస్థానం (విష్ణాలయం)లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వస్తి వాచకం, విష్వక్సేన పూజ, పవిత్రోత్సవం, గోదర్శనం, పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు దంగేటి వారి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈనెల 22 నుంచి ప్రారంభమైన అభిషేకాలు, పూజలు, హోమాలు రెండు రోజులపాటు కొనసాగాయి. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, పేకేటి నాగేశ్వరరావు, కడారి తమ్మయ్యనాయుడు, మొగలి బాబ్జి, ఆలయ కమిటీ ప్రతినిధులు, దేవాదాయశాఖ అధికారులు, అర్చకులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు గీతాకృష్ణపై చర్యలు తీసుకోవాలి
పోలీసులకు 'మహాసేన' రాజేష్ ఫిర్యాదు

ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న 'మహాసేన' రాజేష్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దర్శకుడు గీతాకృష్ణపై ప్రత్తిపాడు పోలీసుస్టేషన్‌లో తెదేపా అధికార ప్రతినిధి, 'మహాసేన' రాజేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారంఎస్సై లక్ష్మీకాంతంకు ఫిర్యాదును అందజేశారు. అంతకుముందు సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియోను రాజేష్ విడుదల చేశారు. రిజర్వేషన్లు తదితర అంశాలపై గీతాకృష్ణ చేసిన వ్యాఖ్యలు కించపరిచేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

విద్యా సమస్యల పరిష్కారానికి కృషి

జి.వేమవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యారంగంలో వస్తున్న సమస్యలను పరిష్కారించడంలో ముందుంటుందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. జి.వేమవరంలో కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రైవేట్ విద్యా సంస్థల వన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుతగా ఉసిరి చెట్టు వద్ద పాఠశాలల కరస్పాండెంట్లు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. మూడుసార్లు మంత్రి సమక్షంలో పలు అంశాలపై చర్చించామన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం త్వరలోనే చెల్లిస్తుందన్నారు. యుపీఈఐఎఫ్ ఛైర్మన్ మతుకుమిల్లి విజయ్ మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు మొండి భీమశంకరం, జడ్పీ మాజీ ఛైర్మన్ దున్నా జనార్దనరావు, ప్రగళ్ల పాటి కనకరాజు, దున్నా శ్రీకాంత్, బోనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 98491 38626

TO LET

E/F 3BHK 1546 Sft. Flat available for rent. A block 1207 gated community velumuriviss Morampudi Rajahmundry. ✆ 8790249629

JOBS

Wanted Female Telecallers and male counselors qualification any degree, age limit: 25 to 45 Years (Must be Married) Salary upto: 16000/-. working location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU e Classifieds

WANTED Qualified & Experienced Candidate to teach Maths & Social Studies for Higher Classes. Walk-in: 22-11-25 & 24-11-25 from 10 am to 6 pm. ✆ 98491 36605.

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives - for Rajamundry/ Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Sahasra College - Kakinada Wanted Senior Lecturers & Junior Lecturers Maths, Physics & Chemistry, Lady Hostel Wardens & Telecallers, Pro's. Razole, Sakhenetipalli & Amalapuram. Cell: 94406 91781, 96525 11056, 80748 54469.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: రూ.15,000/-. 40 సంవత్సరాలలోపువారు మాత్రమే, Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్: 94909 98888.

రాజమండ్రి, బొమ్మూరు, కొవ్వూరుల్లో ప్రముఖ షోరూమ్స్, కాలేజీల్లో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 12 to 15 వేలు. రూం+భోజనం. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి ✆ 93922 69369.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. ✆ 7702184399.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)		19,000
పాతకాయ:	గండేరా	29,000
	గటగట	27,000
కొత్తకాయ:	గండేరా	28,000
	గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ		17,000-18,000
కొత్త (పచ్చి) కాయ		15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక ఓపీ (జెరియాట్రిక్స్ ఔట్ పేషెంట్) విభాగాన్ని మాజీ డీఎంఈ డా.ఎంబీఆర్ శర్మ ఆదివారం ప్రారంభించారు. తొలిరోజు మొత్తం 53 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారికి మందులను అందించారు. విశ్రాంత జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డా.శర్మ, డా.సీఎస్ఆర్ శర్మ, డా.ఎస్వీ రమణమూర్తి హాజరై సేవలందించారు. వారిని సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి సన్మానించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంవో డా.కోమల, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా.యశోదమ్మ, ఫ్లోరెన్స్, ఏపీఎన్‌జీజీవోస్ కార్యదర్శి పాలపర్తి మూర్తిబాబు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, అడబాల రత్న ప్రసాద్, రామారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, మోటారుసైకిల్ ఢీ
వ్యక్తి మృతి ● మరొకరికి తీవ్ర గాయాలు

కృష్ణారావు (పాత చిత్రం)

గొల్లప్రోలు, పిఠాపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీబస్సు, మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన గొల్లప్రోలు శివారు 216 జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలు శివారు వై జంక్షన్ దాటుతున్న ఆర్టీసీ బస్సు, కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వెళ్తున్న మోటారుసైకిల్ ఢీకొన్నాయి. ఈప్రమాదంలో బైక్ నడుపుతున్న నరసింగపురం గ్రామానికి చెందిన ఉండ్రు కృష్ణారావు అలియాస్ రాజు మృతి చెందినట్లు తెలిపారు. పిఠాపురం పట్టణ శివారు జగ్గయ్య చెరువుకు చెందిన గంధం శ్రీను తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. రాజు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ● రాజు పిఠాపురంలోని గోపాల్‌బాబా ఆశ్రమంలో వంటపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్)- 12½ రైల్వేకాలనీ, శివ, ప్రేమంటే, కాంత, హ్యాపీ బర్త్‌డే, మీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్)- ప్రేమంటే, ఇట్లు మీ ఎదవ, కలివి వనం, కాంత, లక్ష్మి- ది గర్ల్‌ఫ్రెండ్, సత్యగౌరి - 12½ రైల్వే కాలనీ, తిరుమల - ఆవారా, సీజన్... 1- 12½ రైల్వేకాలనీ, సీజన్ 2- ఫాంటమ్ మినార్ (ఇ.స్టా), మల్టీపోలిస్(మ.రా), శ్రీప్రియ - కొదమసింహం(ఉ.రా), ది గర్ల్‌ఫ్రెండ్(మ.సా)- పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి) - 12½ రైల్వే కాలనీ, , సూర్య 2 - ఆవారా(ఉ.మ), శివ.

కాకినాడ

గాంధీనగర్, న్యూస్‌టుడే:

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

టమాట- 32, వంకాయలు- 60, 68, 78, బెండకాయలు- 50, పచ్చిమిర్చి- 40, 48, 50, కాకరకాయ- 50, బీర- 58, కాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 36, క్యారెట్- 50, దొండకాయలు-36, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుళ్లు- 36, దోసకాయలు- 34, చిక్కుళ్లు- 80, 130, చేమదుంపలు- 30, 34, బీట్‌రూట్- 40, కీరదోస- 32, బీన్స్‌కాయలు- 60, అల్లం- 74, క్యాప్సికం- 90, బొబ్బర్లు- 56, చిలకడదుంపలు- 40, ఒకటి దొప్ప ఆనపకాయ- 35, 40, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 6, 7, మునగకాడ- 10, 12, మామిడికాయ- 20, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1 కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

గుంత పూడ్చారు.. చింత తీర్చారు!

నగరంలోని 40వ డివిజన్ రామారావుపేటలోని కీలకమైన నాగేశ్వరరావు వీధిలో రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతను పూడ్చారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేశారు. ఈ నెల 19న 'ఈనాడు'లో 'మధ్యలో గుంత.. తప్పని చింత' శీర్షికతో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

స్పందనకు సందర్భం

వెలిగిన వీధిదీపం..

కాకినాడ భాస్కర్‌నగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదని, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వీధిదీపం వెలిగేలా చర్యలు తీసుకున్నారు.
- న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

పూడిక తొలగదు.. మురుగు కదలదు

జగన్నాథపురం మహాలక్ష్మీనగర్ రహదారిలో శిథిలమైన ప్రధాన కాలువ

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఆకర్షణీయ నగరం కాకినాడలోని పలుచోట్ల ప్రధాన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికితోడు ఆ కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగంతా రోడ్లపైకి, సమీపంలో గల ఖాళీ స్థలాల్లోకి చేరుతున్నాయి. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఏళ్లనాటి నిర్మించిన కాలువలు శిథిలమైనా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏయే ప్రాంతాలంటే..

● జగన్నాథపురం మహాలక్ష్మీనగర్ ప్రధాన రహదారిలో కాలువ దెబ్బతింది. పూడికతీత నోచుకోకపోవడంతో చిన్నపాటి వర్షానికి మురుగంతా రోడ్డుపైకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● సురేష్‌నగర్‌లో పలుచోట్ల కాలువ దిమ్మెలు దెబ్బతినడంతో అందులో మురుగంతా సమీపంలో గల ఖాళీ స్థలాల్లో చేరి మురికి కూపాల్లా తయారవుతోంది. ● గోదారిగుంట మూడుగుళ్ల సమీపంలో కల్వర్ట్ జాయింట్‌లో మురుగు నీరు బయటపోయింది. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉండటంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ● అశోక్‌నగర్, గాంధీనగర్, ప్రతాప్‌నగర్, శశికాంత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త కాలువలు నిర్మించడంతోపాటు పూడిక తీత పనులు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

పతకాలు, ధ్రువపత్రాలతో చిన్నారులు

కాకినాడ వివేకానంద పార్కులో ఆదివారం సాయంత్రం ఓపెన్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో జూనియర్, సీనియర్ విభాగం నుంచి 5 నుంచి 17 సంవత్సరాల లోపు చిన్నారులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పరీక్ష సమయం కుదింపు తగదు

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీరాములు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: టైపు రైటింగ్ పరీక్ష సమయాన్ని రెండు రోజుల నుంచి ఒకరోజుకు కుదించడం తగదని ఆంధ్రప్రదేశ్ టైపురైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్(ఏపీటీఎస్ఐఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఇ.శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక రామారావుపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌బీటీఈటీ బోర్డు 2026, జనవరిలో జరిగే పరీక్షలను ఒకరోజుకు కుదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. ఈ విధానంతో సమయాభావం, సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఫీజు చెల్లింపునకు యూపీఐ పేమెంట్స్ విధానం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు సీవీ మోహనరావు, ఏజీకే మూర్తి, నరసింహులు, జి.శ్రీనివాస్, లక్ష్మి, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరులో జాప్యం తగదు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరులో తీరని జాప్యం విద్యార్థుల జీవితాలకు ప్రశ్నార్థకంగా మారిందని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్, ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసినా కొన్ని కళాశాలలు ప్రభుత్వం నుంచి సొమ్ము రాలేదని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మరికొన్ని చోట్ల ఫీజు కట్టకపోతే సెమిస్టర్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామంటూ నేరుగా మెసేజ్‌లు పంపిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేనేతను సంక్షోభం నుంచి కాపాడాలి

ఐక్యత చాటుతున్న సంఘ నేతలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వ్యవసాయం తర్వాత అత్యంత ప్రాముఖ్యం ఉన్న చేనేత రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కులాల సమాఖ్య నాయకులు కోరారు. రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం కొండలరావు... ఆదివారం కాకినాడలో నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పంపన రామకృష్ణ అధ్యక్షత వహించారు. సంక్షేమం... చేనేత పరిశ్రమ... అంశంపై రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించారు. చేనేత సంఘాలకు బకాయిలు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని, పావలా వడ్డీ రుణాలు వర్తింప చేయాలని, 30 రిబేటు ఏడాది పొడవున అమలు చేయాలని, జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, వివిధ జిల్లాల నాయకులు అందే జగదీశ్, దామెర్ల శ్రీకృష్ణ, కర్రా రవి, ...రి మల్లికార్జున, ఊటుకూరి సుబ్రహ్మణ్యం, పప్పు రాజారావు, అఖిలభారత పద్మశాలి పురోహిత సంఘ అధ్యక్షుడు ఆమంచి ఆంజనేయ గురుస్వామి, పేరిశెట్టి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘానికి 75 వసంతాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం 75 వసంతాల వేడుకకు సంబంధించి లోగోను ఆదివారం ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు ఆవిష్కరించారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతం చేయడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సంఘం గోదావరి జిల్లాలోనే 1950లో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా నాయకులు కుర్మారావు, ప్రకాష్, రమణారావు, శ్రీధర్, గణేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం, నాయకులు

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

మొక్క నాటుతున్న సంస్థ సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆల్‌ఈ జ్యువెల్ సంస్థ అధ్యక్షుడు ఎన్.కిషోర్‌కుమార్ అన్నారు. 'సమాజం కోసం 3 గంటలు' కార్యక్రమంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన బాలుర వసతిగృహంలో ఆదివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్థన్, హాస్టల్ వార్డెన్ డా.డి.వీరయ్య, డిప్యూటి వార్డెన్ డా.రాజేష్ సహకారంతో హాస్టల్ ప్రాంగణంలో పలు కొబ్బరి మొక్కలను నాటారు. అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

స్వచ్ఛతకు శ్రీకారం

పార్కును శుభ్రం చేస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు బృందాలుగా విడిపోయి కళాశాల పరిసర ప్రాంతాలతోపాటు, పబ్లిక్ పార్కును శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, పొడి చెత్తను సేకరించారు. అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, అశ్విని పర్యవేక్షించారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు

జీజీహెచ్‌లో సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యనిపుణులు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, రిటైర్డ్ ప్రొఫెసర్లు డా.శర్మ, సీఎస్ఆర్ శర్మ, రమణమూర్తి, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, సీఎస్ఆర్ ఎంవో డా.కోమల, డా.యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకపోతే.. ప్రమాదమే!

కాకినాడ గాంధీనగర్‌లోని కెనరా బ్యాంకు వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన గోడ శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అందులో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఫ్యూజు బాక్సుకు ఎలాంటి మూత ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.
-న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

అధ్వానంగా రహదారి..

కాకినాడ భాస్కర్‌నగర్ ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

నీటి వృథాను అరికట్టరూ..

నగరంలో తరచూ పలు రహదారులపై ఉన్న మంచినీటి పైపులైన్లు పగిలిపోతూ దర్శనమిస్తున్నాయి. కాకినాడ, భాస్కర్‌నగర్ ప్రధాన రహదారిపై పైపు లైను పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతుంది. గతకొంత కాలంగా ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. పైపులైన్లు మరమ్మతులు చేపట్టి వృథా అరికట్టాలని, ఇటువంటి పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని నగరవాసులు విన్నవిస్తున్నారు. -న్యూస్‌టుడే, మసీదుసెంటర్

పడితే తంటాయే..

కాకినాడ నగర శివారు అచ్యుతాపురం జనచైతన్యనగర్‌లో రహదారి పక్కన విద్యుత్తు సరఫరా లేని ఓ స్తంభం ప్రమాదకరంగా వేలాడుతోంది. వీధి మలుపు వద్ద ఓ పక్కకు వాలి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దానిని తొలగించాలని అక్కడి స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల సాయం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండలం పగడాలపేటకు చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త మల్లాడి రాజు మరణించగా, ఆయన కుటుంబానికి పార్టీ అధిష్ఠానం రూ.5లక్షల ఆర్థిక సాయం చేసింది. ఆదివారం మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో రాజు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెక్కును అందించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గ ప్రతినిధులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలోని వైద్య ఉద్యోగులు సంఘటితంగా ఉండి యూనియన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సాయి సత్యనారాయణ, గిరిబాబు పేర్కొన్నారు. జిల్లా సంఘ సర్వసభ్య సమావేశాన్ని కట్టమేను మోహన్‌రావు అధ్యక్షతన ఆదివారం కాకినాడ జీజీహెచ్‌లోని కార్యాలయంలో జరిగింది. అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పీవీవీ సుబ్బారావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా తోకల ప్రసాద్, అధ్యక్షురాలిగా ఎ.పద్మావతి, కార్యదర్శిగా ఎస్ఎం వల్లి, కోశాధికారిగా టి.రాణి, ఉపాధ్యక్షులుగా కుమారస్వామి, పరిమళ ప్రేమరత్నం, సుభాషిణి, భారతి, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రమాదేవి, సంయుక్త కార్యదర్శులుగా గంగాధరం, ప్రభాకరరావు, సత్యనారాయణ, ప్రసన్నకుమార్, నరేష్‌కుమార్, ఈసీ సభ్యులుగా సీహెచ్ రాజబాబు, ఎస్.రాజుబాబు, గణేష్, అప్పారావు, షేక్ అమాజీ, విజయకుమార్, చక్రధర్‌రావు, యాదవ్, మంగతాయారు, రమాదేవి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పీఎం ఆవాస్ యోజనతో పేదలకు గూడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై-2.0)తో పేదలకు సొంత గూడు సాకారం అవుతుందని భాజపా సీనియర్ నాయకుడు పైడా భావన ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 41వ డివిజన్‌లో పీఎంఏవై-2.0 కింద గృహానికి ఆయన భాజపా నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, మాజీ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ, గుత్తుల రామకృష్ణ, గోడి వెంకట్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

20 ద్విచక్రవాహనాల సీజ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కొత్తగా అద్దెకు వచ్చే వ్యక్తుల గుర్తింపు కార్డు, పూర్తి చిరునామా ధ్రువీకరించిన తర్వాత మాత్రమే అద్దెకు ఇవ్వాలని కాకినాడ పోర్టు సీఐ సునీల్‌కుమార్ సూచించారు. ఆదివారం తెల్లవారుజామున కాకినాడ దుమ్ములపేట అపార్ట్‌మెంట్స్ వద్ద జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో పోర్టు సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని, నెంబర్లు లేని 20 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఏదైనా అవాంఛనీయ ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సర్పవరం సీఐ, వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పోర్టు సీఐ సునీల్‌కుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మసీదుసెంటర్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కాకినాడ ఒకటో పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు. ఆదివారం కాకినాడ వన్‌టౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరి వృత్తిపనులు వారు జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు.

కష్టపడిన వారికి తెదేపాలో గుర్తింపు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపాలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. రాష్ట్ర పెరికి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీరభద్రరావు(బద్రి)ను ఆదివారం ఎమ్మెల్యే సత్కరించారు. పెరికి సంఘీయులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

భద్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

నిత్య సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య సుదర్శన హోమానికి కాకినాడకు చెందిన కాపగంటి వీరసూర్యప్రసాద్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతలకు అర్చకులు స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు.

పీసీసీ సభ్యుడు పోతురాజు మృతికి సంతాపం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు కుక్కల పోతురాజుయాదవ్(40) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి రాజు, దాట్ల గాంధీరాజు, పులగల రాజు, దాసరి రాజమోహన్, జనసేన నాయకుడు ఆకుల వెంకటరమణ తదితరులు పోతురాజు మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పోతురాజుయాదవ్ మృతదేహాన్ని సొంతూరు మచిలీపట్నానికి తరలించారు.

'చిగురించే పేజీలు' కథా సంపుటి ఆవిష్కరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన నవ మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో కవితల పోటీల్లో కాకినాడకు చెందిన దొండపాటి నాగజ్యోతి విజేతగా నిలిచారు. ఈసందర్భంగా ఆమె రచించిన కవితా సంపుటి చిగురించే పేజీలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా ఆవిష్కరించారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.సంజీవ్‌కుమార్ అన్నారు. పీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. ఎయిర్ వింగ్ అధికారి డా.జయదేవ్, నావెల్ వింగ్ అధికారి డా.పాండురంగారావు తదితరులున్నారు.

తెదేపా జోన్-2 సమన్వయకర్త రంగారావు నేడు రాక

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపా జోన్-2 సమన్వయకర్త, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన కాకినాడలోని జిల్లా తెదేపా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

26న రాజ్యాంగ పరిరక్షణ పోరాట దినోత్సవం

మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఈనెల 26న రాజ్యాంగ పరిరక్షణ పోరాట దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఏఐసీటీయూ రాష్ట్ర కన్వీనర్ జి.సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ ఏపీ, తెలంగాణా ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజులు మాట్లాడారు. కాకినాడ మెయిన్‌రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద జరిగే కార్యక్రమానికి రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై రాజ్యాంగ, ప్రజాస్వామ్య, కార్మిక హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

చిట్టడవి కాదు.. ఉద్యానమే!

ఆకర్షణీయ నగరం కాకినాడలో లక్షలు వ్యయం చేసి ఉద్యానాలను అభివృద్ధి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా దర్శనమిస్తున్నాయి. వెంకట్‌నగర్‌లో నగరపాలక ఉద్యానం అధ్వానస్థితిలో దర్శనమిస్తోంది. ప్రాంగణం.. ఓ వైపు పిచ్చిమొక్కలు, తూటికాడలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. మరో వైపు నడక దారిలో ఎండుకొమ్మలు పేరుకుపోయాయి. దీంతో నడక సాగించేందుకు సందర్శకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలను సకాలంలో తొలగించాలని వారు విజ్ఞప్తిచేస్తున్నారు.
-న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

వేలం నోటీసు

కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయమందు కుట్టు మిషన్స్, ఎంబ్రాయిడరి మగ్గాలు, సీలింగ్ ఫాన్స్, ప్లాస్టిక్, అల్యూమినియం, ఇత్తడి గంగాళములు, ఇనుప సామానులు, చెక్క పెట్టెలు, లైట్‌లు మరియు కెమెరాలు తేది. **27-11-2025 10 గం॥లకు** బహిరంగముగా వేలం వేయబడును. ఆసక్తి కలవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రూ. 500/-లు ధరావతు చెల్లించి పాల్గొనవచ్చును. ధరావతు సొమ్ము తిరిగి చెల్లించబడదు.
వివరములు కొరకు:
M.నరసింహమూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, సెల్: 94407 96510
సం/- సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కాకినాడ, కాకినాడ జిల్లా.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆలయ ప్రారంభోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి

సామర్లకోట: సామర్లకోట పట్టణం ఏఎంఆర్ డిపోలో సత్తెమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ ప్రారంభోత్సవం భక్తిశ్రద్ధలతో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంఆర్ డిపో మేనేజర్ రామకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, డీసీ చైతన్య మురళీకృష్ణ, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాస్, సరోజవాసు, తుమ్మల ప్రసాద్, ఏఎంఆర్ డిపో హమాలీల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, కార్యదర్శి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేస్తమా.. కుశలమా

పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ పాఠశాలలో 1983లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నరసింగపురంలోని రావువారి మామిడితోట అందుకు వేదికైంది. ఆకుల శేషగిరి, అబ్బా, సురేష్, నాగం రవికుమార్, మామిడాల సత్యకుమార్ వీరందరిని కొన్ని నెలలుగా వాట్సప్ గ్రూప్‌లో సంభాషించి ఒకటి చేశారు. 42 ఏళ్ల తరువాత కలిసిన వీరంతా సందడిగా గడిపారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ. 10 - మ. 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: సర్పవరం గ్రామం గాంధీ నగర్ మురుగుకాలువలో పూడిక తీయడం లేదు. **- ప్రకాశరావు**

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, సర్పవరం**

సమస్య: కరపమండలం పెద్దాపుర్రప్పాడు శివారు వై.సావారం ఎస్సీ పేటలో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. **- సూరిబాబు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, కరప**

సమస్య: స్థానిక శంకరయ్యపేటలో రహదారిపై చెత్తకుప్పలున్నాయి. వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. **- రాజు, పెద్దాపురం**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణ తెలపగా చెత్తకుప్పలు తొలగించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

సమస్య: పిఠాపురంలోని డ్రైవర్స్ కాలనీలో మురుగుకాలువల్లో నీరు రోడ్లపై చేరుతోంది. **- రాంబాబు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకరరావు చెప్పగా కార్మికులతో పూడికను తొలగించి, నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, పిఠాపురం**

సమస్య: గొల్లప్రోలు రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

రబీకి పుష్కలంగా సాగునీరు

• డిసెంబరు నుంచి విడుదల

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో రబీ సాగుకు పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గాలకు ఏలేరు, పీబీసీ జలాశయాల నుంచి సాగునీరు విడుదల చేయనున్నారు. ప్రస్తుతం రెండు చోట్ల నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎస్ఈ గోపినాథ్ ప్రకటించారు. ఈ నెల 21న సాగునీటి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో కూడా సాగునీటి లభ్యత, నిల్వలు, సాగునీటి ప్రణాళికపై చర్చించారు. ఈ నేపథ్యంలో శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా జలవనరుల శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు సాగు విస్తీర్ణం అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్ పనులు పూర్తి చేసి, రబీ సాగుకు రైతులను సమాయత్తం చేసేలా అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పిఠాపురం	18,000
పెద్దాపురం	13,000
కాకినాడ గ్రామీణం	8,000
ఆయకట్టు	ఎకరాలు
పీబీసీ	32,507
ఏలేరు	53,017

పిఠాపురంలోని ఏలేరు నీరు వచ్చే పంట కాలువ

కాలువల వ్యవస్థ మెరుగు

కాలువల వ్యవస్థ మెరుగుపడేలా చర్యలు చేపడతాం. మొంథా తుపాను ప్రభావానికి పలుప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు అవసరమైన నిధులకు నివేదించాం. ఏలేరు, పీబీసీ కాలువలో బాగు చేసి, శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం. కాలువల్లో గుర్రపుడెక్క, తూడు వంటి వ్యర్థాలు తొలగించే పనులు చేపడతాం.

- సంతోష్‌కుమార్, డీఈ, పీబీసీ, జలవనరులశాఖ, పిఠాపురం

25న సీపీఐ సమావేశం

సామర్లకోట, న్యూస్‌టుడే: సీపీఐ జిల్లా సమావేశం ఈనెల 25న కాకినాడలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. ఆదివారం స్థానిక విశ్వబ్రాహ్మణ సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ మెయిన్‌రోడ్డు ఎన్జీవో హోంలో నిర్వహించే ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పాల్గొంటారన్నారు. పి.సత్యనారాయణ, బొత్స శ్రీను, కోసింకోట కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి రైతన్నా మీకోసం

పెదపూడి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామంల్లో ఈనెల 24 నుంచి డిసెంబర్ 3 వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామని ఏవో ఎన్.సత్యప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అయిదు సూత్రాలను తెలియజేస్తారన్నారు. వీటి ద్వారా రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెరిగి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

సామర్లకోట: దేశంలో జరుగుతున్న ఉగ్రదాడుల నేపథ్యంలో సామర్లకోట పట్టణంలో పోలీసులు ఆదివారం అమ్మనమ్మ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ● **పెదపూడి:** ద్విచక్ర, త్రిచక్ర, కారు, జీపు తదితర వాహనాల రికార్డులన్నీ సక్రమంగా ఉండాలని పెదపూడి ఎస్సై తులసీరామ్ సూచించారు. ఆదివారం పెదపూడి మండలం రామేశ్వరం ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి కాలనీలో సోదాలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అచ్యుతాపురత్రయంలో జూద శిబిరంపై దాడిచేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాతావరణ కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు

మాట్లాడుతున్న విశ్రాంత డీఎంఈ డా.రాఘవేంద్రరావు

సర్పవరం, న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలిలో మార్పులు, వాతావరణ కాలుష్యం, రోగనిరోధకశక్తి తగ్గడం, శీతల వాతావరణం పెరగడంతో శ్వాసకోశ వ్యాధుల కేసులు పెరుగుతున్నాయని, వైద్యుల సలహాపై తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విశ్రాంత డీఎంఈ డా.రాఘవేంద్రరావు తెలిపారు. కాకినాడ అర్బన్ బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివారం లయన్స్‌క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో డా.రాఘవేంద్రరావు వాకర్స్ సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు ప్రసాదనాయుడు, వాకర్సు అధ్యక్షుడు ప్రసాదరావు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

సామర్లకోట: స్థానిక మణుగుల దిబ్బ సెంటర్ పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పురాతన ఆలయం సీతారామాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భూమి పూజ నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కూటమి నాయకులు సరోజ వాసు, పిట్టా జానకీరామారావు, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, ముత్యం రాజబాబు, పిల్లాడి సత్యవతి, తుమ్మల ప్రసాద్, శెట్టిబత్తుల దుర్గ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

తాటిపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని పెళ్లికుమారునిగా అమ్మవార్లను పెళ్లికుమార్తెలుగా చేస్తున్న వేదపండితులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో షష్ఠి ఉత్సవాల ప్రారంభ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పెళ్లి కుమారునిగా, అమ్మవార్లను పెళ్లికుమార్తెలుగా చేసి నెమలి పతాకంతో ధ్వజారోహణం చేశారు. పూజా కార్యక్రమాలు ఆలయ వేదపండితులు వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకులు ప్రభాకరశాస్త్రి, చైతన్యశర్మ నిర్వహించారు. ఆలయకమిటీ ఛైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు అమరాది వల్లీరామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 26 నుంచి డిసెంబరు 21వ తేదీ వరకూ షష్ఠి సంబరాలు జరుగుతాయని ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

మృతుని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు, పక్కన తుమ్మల రామస్వామి

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త కంది అప్పన్న ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును ఆదివారం కృష్ణా జిల్లా తాడేపల్లి వద్ద అన్నపూర్ణ ఫంక్షన్‌హాలులో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యుడు కొణిదల నాగేంద్రబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడి గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు ఆకుల సురేష్, బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన బందుల సుబ్బారావు కుటుంబాలకు జనసేన పార్టీ నుంచి రూ.5 లక్షల చొప్పున చెక్కులు ఆదివారం అందించారని జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అమరాది రవి తెలిపారు. వీరిద్దరూ ఇటీవలి ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాలకు అండగా నిలవాలని మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు చెక్కులు అందించారని వివరించారు.

సత్యసాయి మార్గం అనుసరణీయం

శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, యోగా గురువు భిక్షమయ్య

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం వలసపాకలలో ఆదివారం సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. యోగా గురువు దంగేటి సత్యనారాయణరావు అధ్యక్షతన ఎమ్మెల్యే పంతం నానాజీ, భిక్షమయ్య గురూజీ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఒకరోజు యోగా, ధ్యానంపై శిక్షణ, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.

కాజులూరు: గొల్లపాలెంలో సత్యసాయి శత జయంతోత్సవం సత్యసాయి భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా ధనరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబా పాదుకలతో రథోత్సవం వైభవంగా సాగింది. అనంతరం అన్నదానంతో పాటు 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కన్వీనర్ గొల్లపల్లి గంగారావు, ఎల్ఐసీ ప్రసాద్, కాకి గంగాభవాని, దాసరి బాబులు పాల్గొన్నారు.

పెదపూడి: పెదపూడి, సంపర గ్రామాల్లో సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి కోలాట నృత్యాలు, బ్యాండు మేళాలతో రథోత్సవం నిర్వహించారు.

పిఠాపురం: పిఠాపురం బొజ్జవారితోటలోని సత్యసాయి ఆశ్రమంలో సామూహిక శతరుద్రాభిషేకంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. నగర సంకీర్తన, పతాక ఆవిష్కరణ, ఉపన్యాసం, బహుమతుల ప్రదానం నిర్వహించారు. అనంతరం వెయ్యిమంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

ఎంఈవో-1 విశ్వనాథం బాధ్యతల స్వీకరణ

పెదపూడి: పెదపూడి ఎంఈవో-1 విశ్వనాథం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గాంధీ స్మారకోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఎంఈవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంఈవో-1గా పనిచేసిన కె.సత్యనారాయణపై సస్పెన్షన్‌కు గురవడంతో ఆయన స్థానంలో విశ్వనాథం బాధ్యతలు స్వీకరించారు.

అమ్మాయిలు.. దూసుకెళ్తున్నారు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యతోపాటు క్రికెట్, చిత్రలేఖనం, క్విజ్ వంటి వివిధ రంగాల్లో విద్యార్థినులు రాణిస్తూ దూసుకుపోతున్నారు. వారికి విద్యనందిస్తున్న పాఠశాలలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్విజ్‌లో పతకాలతో మెరుస్తూ..

పేరు: ఎండీ అయేషా **ఊరు:** పెద్దాపురం
చదువు: తొమ్మిదో తరగతి
ఎంచుకున్న రంగం: క్విజ్

ప్రతిభ: పట్టణానికి చెందిన రోటరీ క్లబ్, గ్రంథాలయంశాఖ, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు అయిదు వరకు పతకాలు కైవసం చేసుకుంది. అన్నీ కూడా ప్రథమ స్థానాలే.

ప్రస్తుతం: ప్రతిరోజూ జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, వార్తాపత్రికలు చదువుతోంది. ఈమెకు తల్లి శఫియానా ఎక్కువగా ప్రోత్సాహం అందిస్తున్నారు. డాక్టర్ కావడం తన లక్ష్యమన్నారు.

క్రికెట్‌లో రాణిస్తూ..

పేరు: వర్రే మీనా దీప్తి
ఊరు: పెద్దాపురం
చదువు: పదో తరగతి
ఎంచుకున్న క్రీడారంగం: క్రికెట్

ప్రతిభ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023, 2024, 2025లో అండర్ 15, 17 రెండు విభాగాల్లో కాకినాడ, విశాఖపట్నం, మంగళగిరిలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్లకు పాల్గొని పతకాలు సాధించింది.

ప్రస్తుతం: డిసెంబరు నెలలో ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించనున్న అండర్ 17 విభాగం రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నది. ఇండియా టీంలో ఆడాలనేది తన లక్ష్యం.

చిత్రం వేసిందంటే అబ్బురమే..

పేరు: సాయి సుష్మిత, **ఊరు:** పెద్దాపురం
చదువు: తొమ్మిదో తరగతి
ఎంచుకున్న రంగం: చిత్రలేఖనం

ప్రతిభ: పట్టణ, జిల్లా స్థాయిలో పెద్దాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పాల్గొంటే పతకంతో వస్తుంది. ఇప్పటి వరకు సుమారు అర డజను వరకు పతకాలు పొందింది.

ప్రస్తుతం: చిన్నప్పటి నుంచి సొంత ఆశక్తితో బొమ్మలు గీయడం నేర్చుకుంది. ఉన్నతంగా చదువుకొని ఉత్తమ చిత్రకారిణిగా స్థిరపడాలని తన కోరికగా చెప్పారు.

ఆకలి తీర్చి.. అండగా నిలిచి

తాళ్లరేవులో క్యారేజీతో భోజనం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఆపదొచ్చిందంటే చాలు.. వారు మేమున్నామంటూ ముందుకొస్తారు. నిరుపేదల ఆకలి తీర్చే అన్నదాతలుగా పెద్ద మనసు చాటుకుంటారు. మరోవైపు పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించి ఉన్నత చదువులకు అండగా నిలుస్తారు. వీధి వ్యాపారులకు గొడుగులు అందించి నీడనవుతారు. ఇలా ఏడాది పొడవునా పలు సేవా కార్యక్రమాలతో తాళ్లరేవు లయన్స్ క్లబ్ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడి క్లబ్‌లో 85 మంది సభ్యులున్నారు. వీరంతా వ్యాపార, ఆక్వా, వ్యవసాయం చేస్తుంటారు. ఖాళీ సమయాన్ని ఎక్కువ మంది క్లబ్ సేవలకు కేటాయిస్తారు.

ఇవీ కార్యక్రమాలు..

2022 జనవరిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిట్టూరి కృష్ణ.. లయన్స్ ఆర్య జనని ట్రస్ట్‌ను ప్రారంభించారు. దీని ద్వారా ప్రతి బుధవారం తాళ్లరేవు సీహెచ్‌సీకి ఆరోగ్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు ఉచిత భోజన ప్యాకెట్లు అందిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. 136 వారాలుగా భోజన ప్యాకెట్లు అందిస్తున్నారు. 2022 ఏప్రిల్‌లో లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య.. బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యులు భోజన పథకం ప్రారంభించారు. అనాథలు, నిరుపేదలను గుర్తించి రోజూ మధ్యాహ్నం ఇళ్లకు క్యారేజీతో భోజనాన్ని తీసుకెళ్లి ఇస్తారు. ఈ పథకం వెయ్యి రోజులకు పైగా కొనసాగుతోంది. లయన్స్ క్లబ్, దాతల సాయంతో నిరుపేదలకు భోజనం అందించి వారి ఆకలి తీర్చుతున్నారు.

ఉప్పాడలో సంతకాల సేకరణ

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై నిరసనగా ఆదివారం వైకాపా మండల అధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ఉప్పాడలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉప్పాడకు చెందిన మత్స్యకారుడు కారే కృష్ణ ఇటీవల బోటు ప్రమాదంలో మృతి చెందడంతో జనసేన సీనియర్ నాయకుడు గంటా విజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బాలుడి అదృశ్యంపై కేసు

కరప: కరప మండలం అరట్లకట్టలో బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.సునీత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. బిహార్‌లోని గార్‌రాంపూర్‌కు చెందిన పదిహేడేళ్ల ప్రిన్స్‌కుమార్ బతుకుదెరువు నిమిత్తం అదేగ్రామానికి చెందిన కొంతమందితో కలిసి అరట్లకట్టలోని రైస్‌మిల్లులో పనిచేసేందుకు వచ్చారు. ఈ నెల 15న రాత్రి నుంచి ప్రిన్స్‌కుమార్ కనిపించకుండా పోవడంతో పరిసర గ్రామాల్లో వెతికారు. లభ్యం కాకపోవడంతో తండ్రి ప్రదీప్‌సర్దార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు బాలుడికి మానసిక పరిస్థితి సరిగా ఉండదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వసతి గృహాల్లో వెతలు

పరిశీలన

బీసీ బాలికల వసతిగృహంలో స్టోర్ రూంలో ఖాళీగా ఉన్న మంచాలు

ఎస్సీ బాలుర వసతి గృహంలో మంచాలు లేక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

– న్యూస్‌టుడే, సామర్లకోట

సామర్లకోట పట్టణంలో వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

● స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులు నిద్రించే గదులు, వంటశాల, భోజన శాల స్లాబులు కారిపోతున్నాయి. పెచ్చులు ఊడిపోతున్నాయి. విద్యార్థుల మంచాలు స్టోర్ రూంలో పెట్టడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

● గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిటికీలకు తలుపులు, మెస్‌లు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. 165 మంది విద్యార్థులకు కేవలం 40 మంచాలు మాత్రమే ఉన్నాయి. కప్పుకునేందుకు రగ్గులు లేవు.

● ఎస్సీ బాలుర వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రాగంపేట రోడ్డులోని ప్రైవేటు భవనంలోకి రెండేళ్ల కిందట మార్చారు. విద్యార్థులకు మంచాలు, గ్రీజర్లు, రగ్గులు లేవు. ఆర్వో ప్లాంటు లేదు.

పెనుమర్తిలో అక్కూ ఎన్ఎస్ఎస్ శిబిరం

సర్పవరం: పెనుమర్తిలో వారం రోజుల పాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం సర్పంచి పెంకే ఆనందకుమార్ ప్రారంభించారు. ప్రోగ్రాం ఆఫీసర్ మాగంటి శ్రీదేవి ఆధ్వర్యంలో వాలంటీర్లు మొదటిరోజు గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. * రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ విశ్రాంత చీఫ్ అధికారిణి ఎ.త్రిపుల, ఎన్‌సీసీ అధికారిని జె.వీరవేణిలను ట్రస్టు అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, ప్రతినిధులు సన్మానించారు.

హక్కుల సాధనకు పోరుబాట పట్టాలి

తాళ్లరేవు: ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరుబాట పట్టాలని మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశాన్ని అధ్యక్షుడు ఎం.తాతారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.తాతారావు, కట్టా ఈశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా గోపి సత్యనారాయణను, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతులు

మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచి హరిబాబు

పిఠాపురం: పిఠాపురం మండలంలోని భీమ్‌నగర్ జంక్షన్ నుంచి గోకివాడకు రోడ్డు అధ్వానంగా ఉంది. రెండేళ్ల క్రితం రూ.కోటితో మరమ్మతు పనులు చేపట్టారు. వైకాపా హయాంలో గుత్తేదారుడికి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో గుత్తేదారుడు పనులు మధ్యలో వదిలేశారు. ఈ నేపథ్యంలో రహదారి దుస్థితి పై 'ఈనాడు'లో పలుమార్లు వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ర.భ.శాఖ ఏఈ లోవరాజు చొరవతో ప్రభుత్వం నుంచి గుత్తేదారుడికి బకాయి చెల్లించారు. దీంతో మిగిలిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

పిఠాపురం: ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, వేలాది విద్యార్థులు తరలివచ్చి సమస్యలపై చర్చించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో సభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. విద్యార్థులు ఐక్యంగా ఉంటేనే సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

నగదు దహనం కాలేదు

పిఠాపురం: పిఠాపురంలోని సెంట్రల్ బ్యాంకు ఏటీఎంకు శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి నిప్పుపెట్టాడు. ఈ ఘటనలో నగదు కాలిపోలేదని బ్యాంకు మేనేజర్ సాయిసుధ తెలిపారు. ఏసీలు, ఏటీఎం మిషన్ మాత్రమే పాక్షికంగా దెబ్బతిందని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు విచారిస్తున్నారని తెలిపారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

వాకతిప్పలో గత వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన రైతుభరోసా కేంద్ర నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బిల్లులు మంజూరులో జాప్యంతో నాడు గుత్తేదారు పనులు పూర్తి చేయలేదు. దాంతో ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

అప్రోచ్ లేక ఇక్కట్లు

పెద్దాపురం మండలం కొండపల్లి గ్రామం యాదవ కాలనీలో ప్రధాన రహదారి మార్గాన్ని కలుపుతూ అప్రోచ్ లేక కాలనీవాసులు నానా పాట్లు పడుతున్నారు. కాలనీలో కొంతవరకు రహదారి నిర్మించి మిగిలిన భాగాన్ని మట్టిగా విడిచిపెట్టడంతో రాకపోకలు సాగించే కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ మాట్లాడుతూ నిధులు మంజూరైన వెంటనే అప్రోచ్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

రహదారిని మూసేస్తున్నాయి

కరప మండలం కొరుపల్లి నుంచి అరట్లకట్ట వెళ్లే రహదారిలో ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగి మార్గాన్ని మూసేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ సాయిబాబా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా జంగిల్ క్లియరెన్స్ చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కరప

కల్వర్టు లేక ఇబ్బందులు

గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఈబీసీ కాలనీలో సిమెంటురోడ్డు, డ్రెయిన్ నిర్మించినా కల్వర్టు ఏర్పాటుచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు నిర్మించి ప్రజలు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు రూపొందించి కల్వర్టు నిర్మాణం జరిగేలా చూస్తామని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

భవనం శిథిలం

పిఠాపురంలోని చేపల మార్కెట్‌లో పూర్వం నిర్వహించిన షెడ్డు శిథిలమైంది. పెంకులూడిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అక్కడే ప్రతిరోజూ చేపల వ్యాపారం సాగిస్తున్నారు. ప్రజలు కూడా పెద్దఎత్తున చేపల విక్రయానికి వెళ్తుంటారు. గాలి, వాన సమయంలో భవనం కూలిపోయే ప్రమాదం ఉంది. కొత్తగా నిర్మించిన చేపల షెడ్లోకి వీరిని పంపిస్తే బాగుటుందని అక్కడి వ్యాపారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

వేలం నోటీసు

కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయమునందు కుట్టు మిషన్స్, ఎంబ్రాయిడరి మగ్గాలు, సీలింగ్ ఫాన్స్, ప్లాస్టిక్, అల్యూమినియం, ఇత్తడి గంగాళములు, ఇనుప సామానులు, చెక్క పెట్టెలు, లైట్లు మరియు కెమెరాలు తేది. **27-11-2025 10 గం॥లకు** బహిరంగముగా వేలం వేయబడును. ఆసక్తి కలవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రూ. 500/-లు ధరావతు చెల్లించి పాల్గొనవచ్చును. ధరావతు సొమ్ము తిరిగి చెల్లించబడదు.

వివరములు కొరకు:
M.నరసింహమూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, సెల్: 94407 96510
సం/- సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కాకినాడ, కాకినాడ జిల్లా,

(c) eenadu

పెదమల్లాపురం మండలం ఏర్పాటుకు వినతి

ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపప్రణాళికా ప్రాంతవాసులు

శంఖవరం, న్యూస్‌టుడే: పెదమల్లాపురం కేంద్రంగా మండలం, జీటీడీఏ ఏర్పాటు చేయాలని కోరుతూ ఉపప్రణాళిక ప్రాంతవాసులు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డికి కాకినాడలో వినతిపత్రం అందించారు. శంఖవరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, కోటనందూరు, ఏలేశ్వరం మండలాల్లోని ఉపప్రణాళిక ప్రాంతంలో 59 గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించాలని కోరారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

సౌర పలకల ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో ప్రశంస

తొండంగి: బెండపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 'పది' పూర్తి చేసిన కుంది బలరాం శివ రూపొందించిన సౌర పలకల ప్రాజెక్టుకు శనివారం భోపాల్‌లో జరిగిన 52వ జాతీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రశంసలు లభించాయని సైన్స్ ఉపాధ్యాయిని నాగజ్యోతి ఆదివారం తెలిపారు. ఈ ప్రాజెక్టును కేంద్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ దినేష్‌ప్రసాద్ తదితరులు పరిశీలించారన్నారు. శివ ప్రస్తుతం విజయవాడ ఇబ్రహీంపట్నంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

భోపాల్‌లో ప్రశంసాపత్రం అందుకుంటున్న శివ

ఘనంగా సత్యదేవుని రథసేవ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

అపరిశుభ్రంతో ఇక్కట్లు

సమస్య: గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామ ముఖద్వారంలో వ్యర్థాలు వేస్తున్నారు. చెత్తంతా గాలికి ఎగిరి ఇళ్లపై పడుతోంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
- సురేష్, బొర్రంపాలెం

సమాధానం: చెత్తను తొలగించి శుభ్రత చర్యలు చేపడతాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.
- శారద, పంచాయతీ కార్యదర్శి, బొర్రంపాలెం

వీధి దీపాలు ఏర్పాటుచేయరూ.!

సమస్య: మండలంలోని ఎ.కొత్తపల్లిలో వీధి దీపాలు రాత్రి సమయాల్లో వెలగడం లేదు. వీధి దీపాలు వేయించాలి.
- రమేష్, గ్రామస్థుడు

సమాధానం: రెండు రోజుల్లో వీధి దీపాలు వేయిస్తాం.
- రాము, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, తొండంగి

పంట కాలువల్లో పూడిక తీయించాలి.

సమస్య: ఏలేశ్వరంలో పంట కాలువలు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందిగా ఉంది. పంట విరామ సమయంలో కాలువలను శుభ్రం చేయించాలి.
- అప్పారావు, రైతు, పేరవరం

సమాధానం: సమస్యను జల వనరులు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కాలువల్లో సక్రమంగా నీరు ప్రవహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.
- ఏవీ రాజేష్, వ్యవసాయశాఖాధికారి, ఏలేశ్వరం - న్యూస్‌టుడే, ఏలేశ్వరం

మ్యూజియం వద్ద ఉపాధ్యాయ, విద్యార్థుల బృందం

సైన్స్ మ్యూజియం సందర్శన

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనుభవపూర్వక పర్యటనలో భాగంగా ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలను సందర్శించారు. సైన్స్, కాటన్ మ్యూజియం, రోడ్ కం రైలు వంతెన, ధవళేశ్వరం ఆనకట్టలను పరిశీలించారు. సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన పలు అంశాలను ఉపాధ్యాయ బృందం వివరించింది. ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, ఛైర్మన్ షేక్ సలీం, ఉపాధ్యాయుడు చిన్ని బాలబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు.. ఎప్పటికి చేరు?

గ్రామాల్లో ప్రజల అవస్థలు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి

ఇంటింటికీ కొళాయి ద్వారా తాగు నీరు అందించాలనే లక్ష్యం కొన్ని గ్రామాల్లో ఇంకా ఊరిస్తూనే ఉంది. జల్ జీవన్ పథకం ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణం, బోరు తవ్వకం, ఇంటింటికీ కొళాయి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ట్యాంకు నిర్మించాక నీరెక్కించే ఏర్పాటు, పైపులైన విస్తరణకు సాంకేతిక సమస్యతో పథకం అందుబాటులోకి రావడం లేదు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ. 54.36 కోట్లతో 210 పనులు చేపట్టగా గత ప్రభుత్వ హయాంలో 122 మాత్రమే పూర్తిచేయగలిగారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు జోరందుకున్నా ఇప్పటికీ 30 గ్రామాల్లో కొళాయి నీరు కలగానే ఉంది. పాత ట్యాంకులు వినియోగంలోకి తేవాలనే ప్రయత్నమూ ఫలించలేదు.

నిలిచిన పనులు..

- ఏలూరు గ్రామంలో రూ. 40.7 లక్షలతో నిర్మించిన ట్యాంకు రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ట్యాంకుకు నీరెక్కించే ఏర్పాటు చేయలేదు.
- ఉత్తరకంచిలో ఇంటింటికి కొళాయిలు వేశారు. ట్యాంకు పనులు పూర్తయ్యాయి. మోటారు వేసి నీటి సరఫరా చేయడానికి ఏడు నెలలుగా మీనమేషాలు లెక్కిస్తున్నారు. చిన్న ట్యాంకులు మూడు ఉన్నా నీరు సరిపోవడం లేదు. రెండు బోర్లు వేస్తే ఒకటి పనిచేయలేదు. గ్రామంలో 1200 కుటుంబాలు ఉండగా మెరక ప్రాంతాల్లో 300 కుటుంబాలకు నీరందడం లేదు.
- ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరంలో గతంలో కట్టిన ట్యాంకుల నుంచి పైపులైను విస్తరణ, కొత్త ట్యాంకు పనులు నిలిచిపోయాయి.
- ఏలేశ్వరం మండలంలోని 12 గ్రామాల్లో రూ. 8 కోట్లతో పనులు చేపట్టినా ట్యాంకుల నిర్మాణం పూర్తికాలేదు. పలుచోట్ల నీటి సరఫరా ప్రారంభించలేదు.
- శంఖవరం మండలంలో రూ. 15.38 కోట్లతో పనులు జరిగినా లక్ష్యం మేరకు నీరివ్వడం లేదు.
- రౌతులపూడి మండలంలోని 26 పంచాయతీలకు రూ. 16.17 కోట్లు మంజూరు చేయగా ఆరు గ్రామాల్లో నీరందించలేని పరిస్థితి కొనసాగుతోంది.

ఏలూరులో తాగునీటి పథకం ట్యాంకు

అధికారుల మాట..

జల్‌జీవన్ మిషన్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. ఏలూరు, ఉత్తరకంచి, పి.జె.పురం గ్రామాల్లో తాగునీటి సరఫరా సత్వరం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.
- సుబ్బలక్ష్మి, ఏఈఈ, ప్రత్తిపాడు

నేడు, రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తొండంగి: బెండపూడి ఫీడర్‌పై మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో సోమ, మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ వీరభద్రరావు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థం

శంఖవరం: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సీతారామ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కొంతంగి కొత్తూరులో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు తేలు వెంకటేశ్వరరావు, మొగిలి అర్జునరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

రౌతులపూడి: వాహన చోదకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి పాఠశాల సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పలువురు చోదకులకు చలానాలు విధించారు.

చిన్నారికి బహుమతి అందజేస్తున్న రామానంద

భగవద్గీత శ్లోకాల పోటీలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమంలో భగవద్గీత పోటీలు జరిగాయి. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. భగవద్గీత శ్లోకాలు కంఠస్థం చేసిన చిన్నారులు చక్కగా ఆలపించారు. విజేతలకు ఆంధ్ర అరుణాచలం వ్యవస్థాపకుడు స్వామి రామానంద, వీహెచ్‌పీ ప్రతినిధులు ఉదయ భాస్కర్‌రావు, ఈశ్వర దేవి, ఉప్పల తిరుపతయ్య, బచ్చు సత్య తదితరులు బహుమతులు అందజేశారు.

వైభవంగా సత్యసాయి శతజయంతి వేడుకలు

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న గ్రామస్థులు

గండేపల్లి, న్యూస్‌టుడే: సేవ చేయడం ద్వారా మనకు మంచి జరుగుతుందని తెలియజేసిన మహోన్నత వ్యక్తి పుట్టపర్తి సాయిబాబా అని తెదేపా నాయకుడు కందుల చిట్టిబాబు అన్నారు. ఆదివారం జడ్.రాగంపేటలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కుర్చీ ఊయల, పూలపాన్పులు ఏర్పాటు చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. 250 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు 100 మందికి పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కందుల చంటమ్మ, విజయ్, వినయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలోని శ్రీసత్యసాయి మందిరంలో పూజలు అనంతరం భజన, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయి బోధనలను అనుసరించడం ద్వారా సమాజం ఉన్నతంగా నిలుస్తుందన్నారు. మందిరం నిర్వాహకుడు మట్టే సుబ్బారావు, కౌన్సిలర్ అలమండ చలమయ్య, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో సత్యసాయి మందిరంలో పూజలు

జాతీయ రహదారి నిర్వహణపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, తొండంగి, శంఖవరం:

జాతీయ రహదారి అనుకుని ఉన్న రక్షణ గ్రిల్స్, రహదారిని కప్పేసిన ఇసుక మేటలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పడిపోయిన, తుప్పుపట్టిన ఇనుప గ్రిల్స్ స్థానంలో హైవే అధికారులు కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బెండపూడి, తమ్మయ్యపేట, కత్తిపూడి సమీపంలో ఉన్న రక్షణ గ్రిల్స్‌ను వాహనాలు ఢీకొట్టడంతో చాలాచోట్ల కింద పడి ఉన్నాయి. సంబంధిత అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు.

బెండపూడి హైవేపై కింద పడ్డ రక్షణ గ్రిల్స్

ఏడు కిలోమీటర్లు.. నాలుగు కూడళ్లు..

తొండంగి మండలంలో అన్నవరం నుంచి తమ్మయ్యపేట వరకు 7 కి.మీ. హైవే ఉంది. ఈ మార్గంలో పీఈచిన్నాయిపాలెం, బెండపూడి, తమ్మయ్యపేట, రావికంపాడు కూడళ్లు ఉన్నాయి. శంఖవరం మండలం పరిధిలో 6 కి.మీ. ఎన్‌హెచ్-16 ఉంది. సీతంపేట నుంచి వజ్రకూటం వరకు కత్తిపూడి పాతచెక్‌పోస్టు, వజ్రకూటం, శంఖవరం వెళ్లే మార్గం వద్ద కూడళ్లు ఉన్నాయి. ఈ మార్గంలో చాలాచోట్ల ఇసుకమేటలు హైవేని కప్పేశాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాడైన ఇనుపగ్రిల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, రహదారిపై ఉన్న ఇసుక మేటలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

చెరువు చుట్టూ ఇలా.. నడిచేదెలా..?

ప్రత్తిపాడులో చెరువు చుట్టూ నడక బాట అధ్వానంగా తయారయింది. బాటను పునరుద్ధరించి దుకాణాల వ్యర్థాలు, మురుగు చేరకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆక్రమణల బారి నుంచి మిగిలిన చెరువునైనా రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కొంత మంది ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె పుష్కరిణి పథకంలో చెరువును బాగు చేస్తామని అధికారులు చెప్పారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

మురుగు కదలక.. దోమలు వదలక..

యర్రంపాలెం వీధుల్లో కదలని మురుగు, దోమలతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల డ్రెయిన్లు లేకపోవడంతో నెలల తరబడి మురుగు తిష్ఠ వేస్తోంది. సమస్యను పంచాయతీ అధికారులకు తెలియజేసినా పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గండేపల్లి

విద్యుత్తు తీగలు.. నివాసితుల బెంబేలు

గోనేడలో ఇళ్లను తాకుతూ విద్యుత్తు తీగలు ఉండడంతో నివాసితులు బెంబేలెత్తిపోతున్నారు. పలు నివాసాలకు పైన పిట్టగోడలు కట్టడానికి భయపడుతున్నారు. కొన్నిచోట్ల మాత్రమే తీగలకు ప్లాస్టిక్ గొట్టాలు అమర్చారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నివాసాలను తాకుతున్న తీగలను మార్చాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కిర్లంపూడి

పేరుకుపోతున్న వ్యర్థాలు

నరేంద్రపట్నం గ్రామం చెత్తతో స్వాగతం పలుకుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు గాలికి రహదారిపైకి చేరుతున్నాయి. గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే విధంగా షెడ్లు నిర్మించినా తూతూమంత్రంగానే పనిచేస్తున్నాయి. తడి, పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు చేపట్టాలని అధికారులు చెబుతున్నా ఇక్కడి పాలకులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రామంలో పారిశుద్ధ్యం చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

ఇరుకు రోడ్డు.. అధిక లోడు

జగ్గంపేటలో సర్వీసు రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా ఉండటంతో భారీవాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొనుగోలుదారులు దుకాణాల వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. అధికలోడుతో వస్తున్న ఊకలారీలు తదితర భారీ వాహనాలు వంతెన అండర్‌పాస్ నుంచి మలుపు తిరిగేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్సై రఘునాథరావు తెలిపారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

పత్రాల్లేని 45 వాహనాల స్వాధీనం

దిబ్బలపాలెంలో పోలీసులు తనిఖీలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని దిబ్బలపాలెం గ్రామంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు నేతృత్వంలో పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 45 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మోటారు వెహికల్ చట్టాలపై అవగాహన కలిగించారు. అనుమానితులు సంచరించినా, ఏకారణం లేకుండా వలసవచ్చినా, ఎవరికైనా ఆశ్రయం కల్పించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు స్పష్టం చేశారు. ఉగ్రదాడులు, మావోయిస్టు కార్యకలాపాల నేపథ్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు సీఐ చెప్పారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలు రామలింగేశ్వరావు, లక్ష్మీకాంతం, శ్రీహరిబాబు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ సూర్యఅప్పారావు, పోలీసులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తుని పట్టణం, న్యూస్‌టుడే: ప్రమాదంలో మృతి చెందిన జనసైనికులు తాతపూడి చిన్నయ్య, కుర్రా వరలక్ష్మీ కుటుంబాలకు నాయకులు ఆర్థిక సహాయం అందించారు. మంగళగిరిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు చేతుల మీదుగా రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుని జనసేన నాయకులు నల్లం వాసు, అద్దేపల్లి బాలాజీ, గెడ్డమూరి నవీన్, దండెం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేలను కలిసిన పెరిక కార్పొరేషన్ ఛైర్మన్

జగ్గంపేట గ్రామీణం, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర పెరిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన వనపర్తి వీరభద్రరావు ఆదివారం తితిదే పాలకవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను జగ్గంపేటలో, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి తెదేపా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరభద్రరావును సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మల్లేపల్లి సొసైటీ ఛైర్మన్ దిడ్డి శ్రీను, భాజపా జిల్లా కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, నాయకులు ,పెరిక సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఛైర్మన్ వీరభద్రరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

లేబర్ కోడ్‌ల జీవోకు వ్యతిరేకంగా నిరసన

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌ల అమలు జీవోను వ్యతిరేకిస్తూ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రామవరం శివారు రంగవల్లినగర్ కాలనీలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధపడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సంఘ నాయకులు డాన్ శ్రీను, సోమరాజు, దేవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేట శివారు వేబ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిపాక గ్రామానికి చెందిన కాపవరపు నూకాపతి (56) దుర్మరణం పాలయ్యారు. స్కూటర్‌పై జగ్గంపేట వైపు వెళ్తుండగా కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి నుంచి పల్సర్ బైక్‌పై వేంగా వస్తున్న యువకుడు వెనుక నుంచి ఢీకొట్టాడు. అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన నూకాపతి తలకు తీవ్రగాయం కావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూకాపతికి భార్య పాపారత్నం, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో జరిగే వేడుకల్లో చురుగ్గా పాల్గొనే నూకాపతి దుర్మరణంతో మర్రిపాకలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాద ఘటనపై ఎస్సై రఘునాథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూకాపతి (పాత చిత్రం)

తుపాను భయం.. అయినకాడికి అమ్మకం

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

న్యూస్‌టుడే - గండేపల్లి

తుపాను హెచ్చరికలతో అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు. వర్షాలు వస్తే పెట్టుబడి కూడా రాదన్న భయంతో అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్నారు. వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టేందుకు వాతావరణ పరిస్థితులు, బరకాలు, స్థలాల కొరతతో ఆందోళనకుగురై తక్కువ ధరకే దళారులకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. గండేపల్లి మండలంలో వరి కోతలు పూర్తయినప్పటికీ జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ఇంకా కొనసాగుతున్నాయి. క్వింటాకు రూ. 2,320, డెబ్బై ఐదు కిలోలకు రూ. 1,700 చొప్పున ప్రభుత్వం ధర ప్రకటించింది. రైతులు మాత్రం రూ. 1400 నుంచి రూ. 1450కే దళారులకు విక్రయిస్తున్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రైతులు పెడచెవిన పెడుతున్నారు. తక్కువ ధరకే అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

మండలం	వరి విస్తీర్ణం	కోతలు పూర్తి (ఎకరాల్లో)	దిగుబడి	ధాన్యం కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)
గండేపల్లి	7,595	5,820	2,10,760	1,140
జగ్గంపేట	10,288	480	2,85,492	40
కిర్లంపూడి	13,010	750	3,61,027	240

తాళ్లూరులో ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్న రైతులు

కోతలు పూర్తికాలేదు..

వరి కోతలు గండేపల్లి మండలంలో 90 శాతం పూర్తికాగా జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో కొనసాగుతున్నాయి. ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోంది. దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రైతులకు చెబుతున్నాం.
- జె.లక్ష్మి, వ్యవసాయ అధికారిణి, గండేపల్లి

ఒంటిమామిడిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తొండంగి, న్యూస్‌టుడే: మండలంలోని ఒంటిమామిడిలో ఆదివారం సర్పంచి అంగుళూరి సుధాకర్ ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యబృందం హాజరై సుమారు 50 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. నాయకులు రాజాన రామకృష్ణ, చొక్కా కాశి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు తావులేకుండా ప్రయాణించండి

గండేపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదకరంగా వాహనాలు నిలపరాదని, చరవాణిలో మాట్లాడుతూ నడపొద్దని, అతివేగం ప్రాణాంతకమని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో జాతీయ రహదారిపై ఉన్న ప్రమాదకర కూడళ్లలో చోదకులకు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ప్రమాదాలకు తావు లేకుండా ప్రయాణించాలని ఆదివారం అవగాహన కల్పించారు. గండేపల్లి ఎస్సై శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రఘునాథరావు హెచ్చరించారు. గోకవరం రోడ్డులో ఆదివారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు ఇతర వాహనాలను నిలుపుదల చేసి చోదకులకు శ్వాస పరీక్షలు చేశారు. మద్యంతాగి వాహనాలు నడపడం వల్ల అనర్థాలను వివరించారు. మత్తుతో వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రైతన్నా.. మీకోసం.. సాగుకు సహకారం

● నేటి నుంచి ఇంటింటికి వ్యవసాయాధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈనెల 24 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమయ్యారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

● ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి 10 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజిస్తారు. ఒక్కో బృందం రోజుకు 30 క్లస్టర్లు (90 గృహాలు) సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో నీటి భద్రత, డిమాండ్ ఆధారంగా పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తారు. చిరుధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయాన్ని పెంచడం, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించడం, ప్రతి రైతుకూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో యూనిక్ ఐడీ నమోదుతో ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తారు.

● ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూడటం, పాడి పరిశ్రమతో పాటు పాలు, మాంసం ఉత్పత్తి పెంపునకు చర్యలు చేపడతారు. కోళ్ల పెంపకం, మాంసం ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల స్థాపనపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

జిల్లా	రైతు కుటుంబాలు	సాగు భూమి (హెక్టార్లలో..)
కర్నూలు	3,93,633	6 లక్షలు
నంద్యాల	2,33,626	4 లక్షలు

కార్యాచరణ ఇలా..

● ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు అధికారులు రైతుల గృహాలను సందర్శిస్తారు. సీఎం సందేశ లేఖ, కరపత్రం అందజేస్తారు.

● ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. రైతుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు.

● ఈనెల 30వ తేదీన రైతు సేవా కేంద్రాల స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

● డిసెంబరు 3వ తేదీన 2026-27 సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసేందుకు ప్రతి రైతు సేవా కేంద్రంలో కార్యశాల నిర్వహించనున్నారు.

నిధుల ఎత్తిపోత

అంశం	నంద్యాల	కర్నూలు
పథకాలు	39	61
పనిచేస్తున్నవి	14	11
పాక్షికంగా..	22	38
పని చేయనివి	3	12
ఆయకట్టు(ఎకరాల్లో)	58,201	37,454
నిధుల ప్రతిపాదన(రూ.కోట్లు)	47.28	40.82

కర్నూలు జల మండలి, న్యూస్‌టుడే: ఎత్తిపోతల పథకాలు బాగు చేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. గత వైకాపా సర్కారు చిల్లి గవ్వ ఇవ్వలేదు.. నిర్వహణ లేక 'నీరు'గారి పోయాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 100 ఎత్తిపోతల పథకాలతో 95,655 ఎకరాలకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. 60 పథకాల యంత్రాలు తుప్పుపట్టి పాక్షికంగా పనిచేస్తున్నాయి. 25 పథకాలు పనిచేస్తున్నాయి. 55 పథకాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని, వీటికి రూ.88.10 కోట్ల నిధులు అవసరమని ఏపీఎస్ఐడీసీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అర్హులకు గృహ యోగం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద పక్కాగృహాల కోసం జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ఈనెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ సహాయకులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అవినీతి గుట్టు.. కంప్యూటరీకరణతో రట్టు

పలు సహకార సంఘాల్లో యథేచ్ఛగా అక్రమాలు

అన్నదాతల ఆర్థికాభివృద్ధికి బాటలేయాల్సిన ప్రాథమిక సహకార సంఘాలు గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు వేదికగా మారాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు రైతుల ముసుగులో సొసైటీల సొమ్ము దోచుకున్నారు. అధికారులు సహకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంప్యూటరీకరణను వేగవంతం చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తైంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీనాటికి ఆడిట్ సైతం పూర్తి చేశారు. ఈ క్రమంలో పలు అక్రమాలు వెలుగుచూశాయి.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

24 వేల మంది ఏమయ్యారు?

1.14 లక్షల మంది రైతుల వివరాలతో ఈకేవైసీ చేపట్టారు. 90 వేల మంది ఈకేవైసీ పూర్తి చేశారు. 24 వేల మంది సభ్యుల ఆచూకీ కానరావడం లేదు. వారు ఎక్కడున్నారు? రుణాలు తీసుకుని డీఫాల్టర్ అయ్యారా అన్న కోణంలో డీసీసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

నిధుల స్వాహా

కొత్తపల్లి మండలం నాగంపల్లి సొసైటీ సీఈవో కోటేశ్వరరావు రైతుల నుంచి రికవరీ చేసిన రూ.40 లక్షలు స్వాహా చేశారు. డీసీసీబీ అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. రూ.10 లక్షలు రికవరీ చేశారు.

● చిప్పగిరి మండలం రామదుర్గం సొసైటీ సీఈవో ఏకంగా రూ.95 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసు నమోదుకు సహకార శాఖ అధికారులు సిఫార్సు చేశారు. ఆయన నుంచి రూ.25 లక్షలు రికవరీ చేశారు.

యంత్రసేవ పేరుతో ముంచారు

2021-22 నుంచి వైఎస్సార్ యంత్ర సేవ కేంద్రాలు (సీహెచ్‌సీ) పథకం కింద 1,100 రైతు సమూహాలకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు ఇచ్చేందుకు సహకార బ్యాంకు ద్వారా రూ.44 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇందులో గత నాలుగేళ్లలో సగం సంఘాలు మాత్రమే రూ.24 కోట్ల రుణ చెల్లింపులు చేశాయి. సగానికి పైగా సీహెచ్‌సీలకు సంబంధించి రైతు బృందాలు రుణ చెల్లింపులు చేయలేదు. మరోవైపు 500 రైతు సమూహాలు (సీహెచ్‌సీలు) డీఫాల్ట్ అయ్యాయి. దీంతో రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. మొత్తం సీహెచ్‌సీల నుంచి రూ.20 కోట్ల రుణాలు.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు సమూహాలను ఏర్పాటు చేయించిన వ్యవసాయ శాఖ ప్రస్తుతం రుణ బకాయిలపై నోరు మెదపడటం లేదు. దీంతో సహకార బ్యాంకుకు అప్పులు గుదిబండలా మారాయి.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, మాస్టర్ శిక్షకుడు

ఉపాధి మధురం

తేనెటీగల పెంపకంపై యువత ఆసక్తి చూపుతోంది. ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుండటంతో ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. ఎమ్మిగనూరులోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఎన్‌బీహెచ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. రెండు నెలల లోపే మూడో బృందానికి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో బ్యాచ్‌లో 35 మందికి శిక్షణ ఇస్తున్నారు. రాణి ఈగ, మగ ఈగలు, కూలీ ఈగల గురించి.. తేనె ఉత్పత్తిలో అవి పోషించే పాత్రపై శిక్షణ ఇస్తున్నారు. తేనెటీగల పెంపకం, సేకరణ, పెంపకానికి అనువైన రకాలు, ఉప ఉత్పత్తుల తయారీ, మార్కెట్ సదుపాయాలు వంటి వాటిపై 6 రోజుల శిక్షణ, ఆఖరి రోజు నల్లమల బీపార్క్‌లో క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తున్నారు. ఒక పెట్టెలో 50 వేల తేనెటీగలుంటే ఇందులో ఒక రాణి ఈగ, వంద వరకు మగ తేనెటీగలు, మిగిలినవి కూలీ ఈగలుంటాయి. రాణి ఈగ జీవిత కాలం 2 నుంచి 3 ఏళ్లు, మగ ఈగలు 6 నెలలు, కూలీ ఈగలు 45 నుంచి 60 రోజులు జీవిస్తాయి. ఏ పంటల్లో పెట్టెలు పెడితే ఎంత తేనె ఉత్పత్తి సాధించవచ్చు.. ఎంత కాలం నిల్వ ఉంటుంది.. తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ధ్రువపత్రం అందజేస్తామని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

గాజులదిన్నె చేపల ఉత్పత్తి కేంద్రంలో సీడు సిద్ధం చేస్తున్న మత్స్య సంఘం సభ్యులు

కాసులదిన్నె

కర్నూలు జిల్లాలో గాజులదిన్నె చేపల ఉత్పత్తి కేంద్రానికి ఎంతో పేరుంది. గత కొన్నేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతోపాటు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో మత్స్య కేంద్రంలోని చేపల కచ్చా పాండ్లలో చేపల సీడ్ తయారుచేసుకునే బాధ్యతను గాజులదిన్నె మత్స్యకార సంఘానికి జిల్లా మత్స్యశాఖ అప్పగించింది. మత్స్యకారులు.. సంఘం తరఫున సొంత ఖర్చులు వెచ్చించి హెక్టారు విస్తీర్ణంలో ఉన్న పాండ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. మరోవైపు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఈ ఏడాది కొత్తగా చేపల సీడు తయారుచేసే విధానాన్ని మత్స్యకారులకు చూపారు.

90 రోజులు.. రూ.6 లక్షల ఆదాయం

గాజులదిన్నె మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో గంగపుత్రులు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి కర్ణాటక రాష్ట్రం నుంచి కోటి వరకు కట్ల, మృగాల, రోహు రకాల చేపల స్పాన్ కొనుగోలు చేశారు. 90 రోజుల్లో ఇంచి పొడవు వచ్చేదాకా పెంచారు. దాణా కోసం మరో రూ.50 వేలు ఖర్చు చేశారు. మత్స్య దినోత్సవం నాటికి 20 లక్షల చేపల సీడు సిద్ధం చేసుకొని జలాశయంలో వదిలారు. 20 లక్షల చేపల సీడు కొనుగోలు చేయాలంటే రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని.. కేవలం 2 లక్షలతో సీడు సిద్ధం చేశామని.. రూ.6 లక్షల వరకు ఖర్చులు మిగిలాయని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. చేప పిల్లలను జలాశయంలో రెండేళ్లపాటు పెంచితే సుమారు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశముందని చెప్పారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

బతికున్నా.. చనిపోయినట్లు చూపారు

విఠల్‌రావు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: నేను బతికే ఉన్నా.. చనిపోయినట్లు చూపించి తన తాతల నాటి రూ.కోట్ల విలువ చేసే భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తమకు న్యాయం చేయాలని ఆదోని పట్టణానికి చెందిన జి.ఆర్.విఠల్‌రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు విఠల్‌రావు తెలిపిన వివరాల మేరకు.. తన తాత హనుమంతరావుకు చెందిన భవనం స్థానిక కంచిగారి వీధిలో ఉందని చెప్పారు. తన తండ్రి బాబురావు వారసులుగా తాను, రాధాబాయి, మైనవతి బాయి, అరుణ, సుమన్, శాంతబాయి, శ్రీనాథ్ (లేట్) ఉన్నామన్నారు. తాను, తన భార్య సునీతాబాయి గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నామని చెప్పారు. గత నెల 23వ తేదీన తన సోదరుడు శ్రీనాథ్ భార్య ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భవనాన్ని తన పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుందని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ సమయంలో తాను చనిపోయినట్లు డాక్యుమెంట్‌లో రాశారని.. తన భార్య రాకపోయినా.. వచ్చినట్లు చూపించి ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆయన విన్నవించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో తాత్కాలిక అధ్యాపకుల పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈనెల 23 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు. చిన్నటేకూరు జేఎల్ గణితం 1, కోవెలకుంట్ల జేఎల్ ఫిజిక్స్ 1, లక్ష్మాపురం టీజీటీ హిందీ 1 పోస్టు ఖాళీగా ఉందని వివరించారు. డిసెంబరు 2న దిన్నెదేవరపాడులో డెమో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు డిసెంబరు 1వ తేదీలోగా జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయాలు పల్లవించె

నంద్యాల పట్టణం నూనెపల్లెకు చెందిన పల్లవి బీఎస్సీ (అగ్రికల్చర్) చదువుతోంది. ఆమెకు మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. ఈ నేపథ్యంలో రైఫిల్ షూటింగ్‌తోపాటు ఫెన్సింగ్‌పైనా దృష్టి పెట్టింది. ఆమె తండ్రి వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో తర్ఫీదు ఇప్పించారు. అవసరమైన మెలకువలు నేర్చుకున్న పల్లవి వివిధ పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు కైవసం చేసుకోవడం విశేషం.

● గతేడాది కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే ఏడాది నవంబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించారు. అదే ఏడాది నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని చెప్పారు. దీని కోసం నిరంతరం సాధన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పాత పట్టణం

మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

సరకు తరిగి.. ధర పెరిగి

తేదీ	వచ్చిన సరకు (క్వింటాళ్లు)	గరిష్ఠ ధర (రూ.లలో)	మధ్యస్థ ధర (రూ.లలో)
17	160.30	3,000	2,500
18	165.45	3,400	2,700
19	175.20	4,000	3,000
20	161.25	4,200	3,500
21	172.75	4,400	3,700
22	162.65	5,000	4,000

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : పత్తికొండ మార్కెట్‌లో ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. విపణిలో శనివారం క్వింటా గరిష్ఠ ధర రూ.5 వేలు దాటింది. కనిష్ఠ ధర రూ.3 వేలు, మధ్యస్థ ధర రూ.4 వేలు పలికింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 162.65 క్వింటాళ్ల సరకును రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. వారం కిందట టమాటా క్వింటా రూ.3 వేలు పలకగా.. గత ఐదారు రోజులుగా ధరలో మార్పు వస్తూనే ఉంది. వర్షాల నేపథ్యంలో చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో తెగుళ్లు సోకడంతో నష్టం వాటిల్లింది. విపణికి టమాటా సరకు రావడం తగ్గిపోయింది. ఫలితంగా ధర పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనేకాక వివిధ ప్రాంతాల్లో టమాటాలకు మంచి గిరాకీ ఉండటంతో డిమాండ్ పెరిగింది. ఫలితంగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నోలీస్ తెలిపారు.

తూకాలతో మోసగించి.. రైతులను నిలువునా ముంచి

యంత్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పత్తి కొనుగోళ్ల సమయంలో వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా రైతులు పెద్దఎత్తున నష్టపోతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లింది. కలెక్టర్ సిరి ఆదేశాలమేరకు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో పలువురు అధికారులు గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని, కోసిగి తదితర మండలాల్లో పత్తి కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు, వేబ్రిడ్జిలు, జిన్నింగ్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. కొందరు వ్యాపారులు ఉపయోగిస్తున్న తూనిక యంత్రాల రీ-వెరిఫికేషన్, స్టాంపింగ్ గడువు దాటినట్లు గుర్తించారు. లీగల్ మెట్రాలజీ చట్టం-2009 ప్రకారం 12 కేసులు నమోదు చేశారు. రూ.90 వేల వరకు జరిమానా విధించారు.

పడితే బతుకు బండే



కర్నూలు నగర శివారు.. ప్రజానగర్ కాలనీ సమీపంలో కొండను తొలిచి జాతీయ రహదారి నిర్మించారు. బండ రాళ్లు దొర్లకుండా రక్షణ చర్యలు చేపట్టలేదు. ఫలితంగా అప్పుడప్పుడూ రాళ్లు దొర్లి పడుతున్నాయి. అనుకోని పరిస్థితుల్లో వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు పడితే పెను ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, కర్నూలు

ఈజీగా ప్రయాణించొచ్చు

● ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు

ప్రస్తుతం ఒకచోటు నుంచి మరో ప్రదేశానికి వెళ్లాలంటే వాహనం తప్పనిసరి. లేకుంటే సకాలంలో పనులు పూర్తికాని పరిస్థితి. వాహనాలు నడపాలంటే ఇంధనం అవసరం. కి.మీ. పెరిగేకొద్దీ ఖర్చు ఎక్కువవుతుంది. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా ఛార్జింగ్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, కార్లు, బస్సులు సైతం రోడ్లపై నడుస్తున్నాయి. విద్యుత్తు వాహనాల కొనుగోలుకు జనం సైతం ఆసక్తి చూపుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఛార్జింగ్ స్టేషన్ల కొరత వేధిస్తోంది. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇ-డ్రైవ్ పేరుతో నూతన పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

– న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో మొత్తం 42 ప్రాంతాలకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు అందాయి. ఇందులో భాగంగా మొదటి విడత కింద కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో 5 ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్తు శాఖ పరిధిలో రహదారులకు సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్లను గుర్తించి 5 నుంచి 10 సెంట్ల స్థలంలో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు శాఖ ఎంపిక చేసిన ప్రాంతాలు

	గుర్తించిన ప్రదేశాలు	తొలి విడత ఏర్పాటు
కర్నూలు	22	05
నంద్యాల	20	05

త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం

– ఆర్.ప్రదీప్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తు శాఖ

జిల్లా వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 10 ప్రాంతాల్లో.. రహదారులకు సమీపంలో ఉన్న విద్యుత్తు ఉప కేంద్రాల వద్ద ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఛార్జింగ్ స్టేషన్లను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం.

రహదారుల సమీపంలో..

● పీఎం ఇ.డ్రైవ్ పథకం కింద రహదారుల సమీపంలో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్, ఆస్పత్రులు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేయనున్నారు.

● తొలుత గ్రామస్థాయి, మండల, రాష్ట్ర, జాతీయ రహదారులను కలుపుతూ వెళ్లే ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్లు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వంద శాతం రాయితీ అందించనుంది.

గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగదు డిపాజిట్ యంత్రం (సీడీఎం), ఫోన్‌పే, గూగుల్‌పేలను అవకాశంగా చేసుకుని అక్రమ లావాదేవీలకు పాల్పడున్న సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల కోసం నగదు డిపాజిట్ చేయడం గాని, ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ ద్వారా డబ్బులు పంపడం చేయొద్దని ఆయన సూచించారు. కమీషన్ ఇస్తామని ఆశపెట్టి నేరాలు చేయిస్తారని, ఇది కూడా మనీలాండరింగ్, సైబర్ నేరాలతో సమానమని ఆయన పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరిగాయని చెప్పారు. ఎవరైనా అనుమానాస్పద లావాదేవీలు గుర్తించినా, సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయినవారు వెంటనే స్పందించి టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెప్పారు. వీటిపై నిరంతరం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నీళ్లున్నా.. కన్నీళ్లే

■ ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణమెప్పుడో
■ అన్నదాతలకు తప్పని కష్టాలు

ఈనాడు, కర్నూలు : కర్నూలు పశ్చిమ ప్రాంతానికి కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటైన ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) కుడి ప్రధాన కాలువ పనులు ఎప్పుడు మొదలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగించేందుకు జులైలోనే ఉత్తర్వులిచ్చినా నేటివరకు నిధులు విడుదల కాలేదు. 40 వేల ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాలకు తాగునీరు అందించేలా దీనిని రూపొందించారు. 2019లో తెదేపా ప్రభుత్వం ఆయా పనులకు సంబంధించి రూ.1985.42 కోట్లతో పరిపాలనపరమైన ఆమోదం తెలిపింది. టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థతో ఒప్పందం చేసుకుంది.

ఆర్డీఎస్ హెడ్ రెగ్యులేటర్

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు ఆపేయడంతో కీలక ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది.

నియోజకవర్గాలవారీగా ఆయకట్టు వివరాలు (ఎకరాల్లో..)

నియోజకవర్గం	ఆయకట్టు
మంత్రాలయం	12,140
ఎమ్మిగనూరు	18,699
కోడుమూరు	7,661
ఆలూరు	1500

బకాయిలు చెల్లించక..

గుత్తేదారు సంస్థ ఎన్‌సీసీ ఇప్పటివరకు రూ.12 కోట్ల విలువైన పనులు పూర్తి చేసింది. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు కదలలేదు. ప్రస్తుత ప్రభుత్వం పాత బకాయిలు ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుత బడ్జెట్లో రూ.15 కోట్లు కేటాయించింది. ఆ మేరకు అధికారులు రూ.5 కోట్ల విలువైన బిల్లులు చెల్లించాలని సిఫార్సు చేశారు. ప్రాజెక్టు పనుల్లో ఇప్పటివరకు 0.74 శాతం మాత్రమే పూర్తయ్యాయి. హెచ్.ఎన్.ఎస్.ఎస్. తరహాలో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తే తక్కువ వ్యవధిలోనే 40 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

భూసేకరణ ఎప్పుడో..

ఆర్డీఎస్ ప్రాజెక్టుకు 5,884.70 ఎకరాలు అవసరమని తేల్చారు. అందులో 1,172.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన 4,712.70 ఎకరాలు పట్టా భూములే. ఆయా భూముల్లో ప్రస్తుతానికి 1,475.70 ఎకరాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసినా పరిహారం చెల్లించాల్సి ఉంది. సుమారు రూ.150 కోట్లు విడుదల చేస్తే ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమవుతుంది.

ఏటా నాలుగు టీఎంసీలు వృథా..

ఆర్డీఎస్ ప్రాజెక్టుకు నాలుగు టీఎంసీల నీటి కేటాయింపు ఉంది. కానీ చుక్క నీటిని కూడా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో భాగంగా 160 కి.మీ.ల మేర కుడి కాలువ తవ్వాలి. దీనికింద 12,500 ఎకరాలు సాగులోకి వస్తుంది. కోసిగి, పెద్దకడబూరు, కొటేకల్లు, చిన్నమర్రివీడుల్లో నాలుగు జలాశయాలను నిర్మించాల్సి ఉంటుంది. ఫలితంగా కోసిగి పరిధిలో 5 వేలు, పెద్దకడబూరు పరిధిలో 5 వేలు, కోటేకల్లు పరిధిలో 15 వేలు, చిన్నమర్రివీడు జలాశయం పరిధిలో 2,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

జ్ఞాపకాల మదిలో..
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభ్యున్నతికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోను మా యదలోతుల్లోని
భావాలకు అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్‌ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్‌ లీగ్‌ (ఈఎస్‌ఎల్‌). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్‌ టోర్నీగా గిన్నిస్‌ బుక్‌ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్‌ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ ఈఎస్‌ఎల్‌ క్రికెట్‌ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్‌

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్‌ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్‌ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్‌ విభాగంలో ఇంటర్‌, పాలిటెక్నిక్‌, ఐటీఐ.. సీనియర్‌ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్‌, మెడికల్‌, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్‌-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్‌ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్‌ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్‌ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్‌ కం నాకౌట్‌ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్‌ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్‌), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్‌)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్‌ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్‌ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్‌ కీపర్‌ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్‌ ప్యాడ్లు, అండర్‌ గార్డ్స్‌, హ్యాండ్‌ గ్లోవ్స్‌, వైట్‌ డ్రెస్‌, వైట్‌ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్‌ కోసం

☛ రిజిస్ట్రేషన్‌ కోసం www.eenadu.net వెబ్‌సైట్‌ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్‌ చేసుకుని ప్రిన్సిపల్‌ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —

Energy Partner: నేషనల్‌ ఎగ్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE

District Sponsor: INTERNATIONAL DELHI PUBLIC SCHOOL Under the Aegis of KJR Educational Society, Kurnool

Digital Partner TV Partner Organised by

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్‌- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్‌- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్‌ లీగ్‌, ఈనాడు ఈవెంట్స్‌, ఈనాడు, మునగాలపాడు
కర్నూలు - 518004
వివరాలకు: 8008551771
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్‌ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్‌ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్‌-1: కళాశాల లెటర్‌ హెడ్‌పై టీమ్‌ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్‌ సంతకం, కాలేజ్‌ సీల్‌/ప్రిన్సిపల్‌ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్‌-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్‌ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్‌ డైరెక్టర్‌, ప్రిన్సిపల్‌ సంతకం, కాలేజ్‌ సీల్‌/ ప్రిన్సిపల్‌ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్‌-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్‌ ఫామ్‌ చివర ప్రిన్సిపల్‌ సంతకం, కాలేజ్‌ సీల్‌/ ప్రిన్సిపల్‌ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్‌-1: అసోసియేషన్‌ లెటర్‌ హెడ్‌పై టీమ్‌ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్‌/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్‌-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్‌ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్‌ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్‌/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్‌-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్‌ ఫామ్‌ చివర డిస్ట్రిక్ట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్‌/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్‌-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్‌ ఫామ్‌ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్‌ నంబరుతో పంపాలి.

నాకౌట్‌ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్‌, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సర్కస్‌ ఫీట్లు.. చోదకుల పాట్లు

కొలిమిగుండ్ల మండలంలో నాపరాళ్ల ట్రాక్టర్ల రాకపోకల్లో నిత్యం సాహసం చేయాల్సిందే. ఎక్కడైనా ఎగువన ఉన్న రహదారులపై ఉన్నచోట్ల డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో చోదకులు ధైర్యంగా, నైపుణ్యంతో ట్రాక్టరును నడపాలి. లోడు కారణంగా చోదక సమయంలో ఇంజిను పైకిలేస్తుంది. ఏమాత్రం భయపడినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. బతుకు తెరువుకోసం డ్రైవర్లకు ఇలాంటి ఫీట్లు తప్పవు. కొలిమిగుండ్ల శివారులోని జగనన్న కాలనీ సమీపంలో ఆదివారం కనిపించిదీ దృశ్యం. – న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల

లోకేశ్‌ సర్‌.. న్యాయం చేయండి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: 'గౌరవనీయులైన లోకేశ్‌ సర్‌, నా పేరు వంశిత, ఆదోని నెహ్రూ మెమోరియల్‌ పురపాలక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నేను మాక్‌ అసెంబ్లీకి సెలెక్ట్‌ అయ్యాను. కానీ నన్ను కాకుండా రెండో స్థానంలో వచ్చిన వారిని సెలెక్ట్‌ చేశారు సర్‌. డీఈవో ఆఫీస్‌లో అడిగితే.. పైన సెలెక్ట్‌ చేశారు. నేనేమీ చేయలేనన్నారు. దయచేసి నాకు న్యాయం చేయండి సర్‌.' అని విద్యార్థిని వంశిత నేరు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు 'ఎక్స్‌'లో పోస్టు చేసింది.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: అమరావతిలో నిర్వహించే మాక్‌ అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి విద్యార్థి ఎంపికలో వివాదం నెలకొంది. ఆళ్లగడ్డలోని డా. బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న మోక్షిత అనే విద్యార్థిని మాక్‌ అసెంబ్లీలో ఆళ్లగడ్డ ప్రతినిధిగా ఎంపిక చేస్తూ పురస్కారం కూడా అందించారు. కాగా మోక్షితను కాకుండా మూడోస్థానంలో నిలిచిన విద్యార్థిని ఎంపిక చేశారు. ఎంపికలో పారదర్శకత లోపించిందంటూ మోక్షిత బంధువులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారులపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలపరాదని నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో ఆదివారం బస్సు, లారీలు ఢీకొట్టిన ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ హైవేపై పార్కింగ్‌ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలని సూచించారు. రోడ్డుపై ఆపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బస్సు డ్రైవర్లు రోడ్లపై ఆపితే ప్రయాణికులు అప్రమత్తమై సురక్షిత ప్రదేశాల్లో నిలిపేలా చెప్పాలని ఆయన కోరారు.

కబడ్డీ విజేతలు ప.గో., చిత్తూరు జట్లు

బాలుర విజేత పశ్చిమ గోదావరి జట్టు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగర శివారులోని జొహరాపురంలో గత మూడు రోజుల పాటు జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్‌-17 బాల బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జట్టు కర్నూలుపై విజయం సాధించి ట్రోఫీ సాధించింది. కర్నూలు జట్టు రన్నర్‌గా, శ్రీకాకుళం మూడో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు శ్రీకాకుళంపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. శ్రీకాకుళం ద్వితీయ, కృష్ణా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఆల్‌ ఇండియా కబడ్డీ సంఘం మాజీ ఛైర్మన్‌ కేఈ ప్రభాకర్‌, కేడీసీసీబీ మాజీ ఛైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి టి.కృష్ణ తదితరులు బహుమతులు అందజేశారు.

ముగిసిన విశ్రాంత సైనికుల సంఘం ఎన్నికలు

గెలుపొందిన అభ్యర్థులతో ఎన్నికల కమిటీ సభ్యులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నగరంలోని బి.క్యాంపులో ఉన్న విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1100 ఓట్లకుగాను 555 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నాలుగు ప్యానళ్ల సభ్యులు బరిలో నిలిచారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్‌ జరిగింది. ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, పురుషోత్తం, కేడీ వీఎం. రెడ్డి, శేషిరెడ్డి, కృష్ణయ్యలు ఓటింగ్‌ సరళిని పరిశీలించారు. సాయంత్రం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అనంతరం విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.బాబురాజ్‌, ప్రధాన కార్యదర్శిగా ఫకృద్దీన్‌ అలీ అహమ్మద్‌, కోశాధికారిగా ఎం.గణేశ్‌ గెలిచినట్లు ప్రకటించారు.

నేడు డయల్‌ యువర్‌ సీఎండీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం 'డయల్‌ యువర్‌ సీఎండీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో 8977716661 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలను నేరుగా ఏపీఎస్పీడీసీఎల్‌ సీఎండీ శివశంకర్‌ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నిశీధిలో మృత్యుకేక

■ ఆగిన బస్సును ఢీకొట్టిన లారీ
■ ఇద్దరి దుర్మరణం.. తొమ్మిది మందికి గాయాలు

దెబ్బతిన్న బస్సు వెనుకభాగం

ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నిశీధిలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలకృత్యాల కోసం బస్సును ఆపగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా ఇద్దరు మృతి చెందారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

ఊహించని ఘటన

● హైదరాబాద్‌ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సు ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో రాగానే ప్రయాణికుల కాలకృత్యాలకు డ్రైవర్‌ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో వెనుక నుంచి పంట దిగుబడుల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వేగంతో కదిలి ముందు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి. ● బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్‌ షొరాణ్‌, ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్‌ ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఖాదర్‌వలి, మౌలాలీ, ఆసియాబేగం, హైదరాబాద్‌ నగరం ఉప్పల్‌కు చెందిన శ్రావ్యకు తీవ్రగాయాలు కావడంతో వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఒకే కంపెనీ ఉద్యోగులు

గడ్డం బద్రీనాథ్‌ (పాత చిత్రం)

ప్రమాదంలో వెనుక సీట్లలో కూర్చున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన గడ్డం బద్రినాథ్‌(25), విశాఖపట్నానికి చెందిన హరిత(22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. స్నేహితులు పుదుచ్చేరిలో ఉండటంతో వారి వద్దకు వెళ్లి అక్కడి నుంచి విహారయాత్రకు వెళ్లాలని హైదరాబాద్‌ నుంచి పయనమయ్యాడు. హరిత ముందు సీట్‌ రిజర్వేషన్‌ చేసుకోగా వెనుక వచ్చి కూర్చుంది. లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న ఇరువురు తనువు చాలించారు. ఒకే కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు స్నేహితులను ప్రమాదం బలితీసుకోవడంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది.

ఆటోడ్రైవర్‌ ప్రాణాలు కాపాడిన సీపీఆర్‌

ఆటోడ్రైవర్‌కు సీపీఆర్‌ చేస్తున్న అగ్నిమాపకశాఖ ఉద్యోగి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు అగ్నిమాపక కేంద్రం ఉద్యోగుల సమయస్ఫూర్తి ఓ ఆటోడ్రైవర్‌ ప్రాణం కాపాడింది. కర్నూలు కేంద్రానికి చెందిన ఉద్యోగులు జయరాముడు, రఘురాముడు విధుల నిమిత్తం ఫైరింజన్‌ వాహనంలో అనంతపురం జిల్లాకు వెళ్లి తిరిగి కర్నూలుకు బయలుదేరారు. చెట్లమల్లాపురం వద్ద జాతీయ రహదారిపై ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోడ్రైవర్‌ స్పృహ కోల్పోయి పడిపోయారు. ఇది గమనించిన ఫైర్‌మెన్‌ జయరాముడు వాహనం ఆపి ఆటోడ్రైవర్‌కు సీపీఆర్‌ చేశారు. దీంతో ఆయన స్పృహలోకి వచ్చి కోలుకోవడంతో ఆ దారిన వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

సత్యసాయి సేవలు చిరస్మరణీయం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : విద్య, వైద్యం, తాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా భగవాన్‌ సత్యసాయిబాబా అందించిన సేవలు చిరస్మరణీయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. కర్నూలు కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీ, కలెక్టర్‌ డా.ఎ.సిరి, జేసీ నూరుల్‌ ఖమర్‌ సత్యసాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్‌ డా.సిరి మాట్లాడుతూ.. ప్రేమే మన మతం, ప్రేమే మన కులం అని సత్యసాయిబాబా చూపిన మార్గాన్ని ప్రతిఒక్కరు అనుసరించాలన్నారు. కర్నూలులో అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ నూరుల్‌ ఖమర్‌, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సెట్కూరు సీఈవో వేణుగోపాల్‌, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, డీసీహెచ్‌ఎస్‌ డా.జఫ్రుల్లా, మలేరియా అధికారి నూకరాజు, ట్రస్ట్‌ ప్రెసిడెంట్‌ కృష్ణారెడ్డి, కన్వీనర్‌ అశోక్‌కుమార్‌, పి.లక్ష్మి, సరోజ, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్‌ డా.సిరి, జేసీ నూరుల్‌ ఖమర్‌, డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు

విద్యుదాఘాతంతో ఆస్తి నష్టం

ఆస్పరి, న్యూస్‌టుడే: అట్టెకల్లు గ్రామంలో ఆదివారం లలితమ్మ అనే మహిళ వంట చేసి, ఇంటి సమీపంలోని దుకాణం వద్దకు వచ్చారు. ఇంతలోనే విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి ఇంట్లోని ఫ్రిజ్‌ పేలింది. అగ్నిప్రమాదంతో బీరువాలోని రూ.2 లక్షల నగదు, 6 తులాల బంగారం, సామగ్రి కాలిపోయింది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

హంపలో పది అడుగుల పాము

హంప (మద్దికెర), న్యూస్‌టుడే: హంప గ్రామంలోని పొలాల్లో భారీ పామును పట్టుకున్నారు. గ్రామానికి చెందిన షేక్షావలి అనే రైతు పొలంలో పది అడుగుల పాము ఉన్నట్లు గుర్తించారు. గ్రామానికి చెందిన పాములు పట్టే వ్యక్తి సాయంతో ఎలాంటి ప్రమాదం లేకుండా దాన్ని పట్టుకున్నారు.

పామును చూపుతున్న స్థానికుడు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల ఇంటర్‌ విద్యార్థిని జయశాలి అథ్లెటిక్స్‌ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కర్నూలు నగరంలో గత వారం స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో అండర్‌-17 షాట్‌పుట్‌ పోటీలో పాల్గొన్న జయశాలి షాట్‌పుట్‌ బంతిని అందరికంటే దూరం విసిరి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ నెల 24వ తేదీ నుంచి వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో పాల్గొననుంది. కళాశాల ప్రిన్సిపల్‌ మురళీమోహన్‌, వ్యాయామ అధ్యాపకులు కంబిరెడ్డి తదితరులు అభినందించారు.

జయశాలి

అవగాహన సదస్సు నేడు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : చిరుధాన్యాల ఆహారం, పోషక విలువలపై సోమవారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అదితి చిరుధాన్యాల ప్రతినిధి సోమశేఖర్‌ తెలిపారు. పద్మశ్రీ డా.ఖాదర్‌వలి చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని వివరిస్తారని చెప్పారు. నగర, జిల్లా ప్రజలు సదస్సుకు హాజరై చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

పోటీల్లో విజేతలు.. శాసనసభకు విద్యార్థులు

★ మాక్‌ అసెంబ్లీలో పాల్గొననున్న 14 మంది

విద్యార్థులతో మాట్లాడుతున్న కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్‌

కర్నూలు విద్య, ఆదోని విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల దశ నుంచే చదువుతో పాటు సమాజ సమస్యలపై పోరాడేలా చైతన్యపరిచేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాజ్యాంగ సంబంధిత అంశాలపై వివిధ దశల్లో ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ చూపిన విద్యార్థుల్లో నియోజకవర్గం నుంచి ఒక్కరిని మాక్‌ అసెంబ్లీ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 14 మంది విద్యార్థులు రాష్ట్ర శాసనసభను సందర్శించే అవకాశం దక్కించుకున్నారు. ఈనెల 26వ తేదీన మాక్‌ అసెంబ్లీ నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో వీరు తమ నియోజకవర్గ ఎమ్మెల్యే తరహాలో అసెంబ్లీలో తమ ప్రాంత సమస్యలపై గళం విప్పడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై మాట్లాడనున్నారు. మాక్‌ అసెంబ్లీతో పాటు శాసనసభలో ఎమ్మెల్యే, మంత్రుల కార్యాలయాలు, గ్రంథాలయ సందర్శన ఉంటుంది. దీనికి సంబంధించిన విద్యార్థులతో కర్నూలు, నంద్యాల విద్యాశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పాఠశాలల్లో మాక్‌ అసెంబ్లీ కూడా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 23వ తేదీ సాయంత్రం నంద్యాల, కర్నూలు నుంచి అమరావతికి బయల్దేరనున్నారు.

కర్నూలు జిల్లా నుంచి వెళ్లనున్న విద్యార్థులు..

విద్యార్థి పేరు	తరగతి	పాఠశాల పేరు.. ప్రాంతం
ఎస్‌.దయాన్‌	10	జడ్పీహెచ్‌ఎస్‌ (బాలికలు), బి.క్యాంప్‌, కర్నూలు
కె.లోకేశ్వరరెడ్డి	10	జడ్పీహెచ్‌ఎస్‌, సి.బెళగల్‌
సి.గాయత్రి	10	డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకులం, వెల్దుర్తి
డి.నవీత్‌కుమార్‌	9	జడ్పీహెచ్‌ఎస్‌, దైవందిన్నె, ఎమ్మిగనూరు
ఎస్‌.వీరేంద్ర	9	జడ్పీహెచ్‌ఎస్‌, పెద్దకడబూరు
కె.గౌతమి	10	మున్సిపల్‌ హైస్కూల్‌, ఆదోని
పి.ప్రవీణ్‌కుమార్‌	10	జడ్పీహెచ్‌ఎస్‌, హాలహర్వి

అదృష్టంగా భావిస్తున్నా.. - కె.గౌతమి, పదో తరగతి, ఆదోని మున్సిపల్‌ ఉన్నత పాఠశాల



మాక్‌ అసెంబ్లీలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. ఆదోని నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు ప్రస్తావిస్తా. పరిష్కార మార్గాలకు సూచనలు చేస్తా. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయి. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పరిచయాలు ఏర్పడుతాయి. ఆయా ప్రాంతాలపై అవగాహన కలుగుతుంది.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోసిగి, న్యూస్‌టుడే: రైల్వే కూలీ పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై తోవి నాగరాజు ఆయన కుమారుడు ఆనంద్‌, మరొక వ్యక్తి రాకేష్‌ ముగ్గురు కలిసి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. కోసిగి మండలంలోని నేల కోసిగి గ్రామానికి వెళ్లే క్రాస్‌ రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కౌతాళం మండలం కామవారం గ్రామానికి చెందిన ఆనంద్‌ (18) ముఖం, తలపై బలమైన గాయాలు కావడంతో మృతి చెందాడు. తండ్రి నాగరాజు, మరో వ్యక్తి రాకేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ఎస్సై రమేష్‌ రెడ్డి, శిక్షణ ఎస్సై ఈశ్వర్‌రావులు చేరుకొని క్షతగాత్రులను ఆదోని తరలించారు. ఆనంద్‌ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని వారు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని ఓ రైతుకు చెందిన ఉల్లి పొలంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. గ్రామానికి చెందిన రైతు కోనప్ప పొలంలో ఉల్లి సాగు చేసి కోతకోశారు. పంటను తరలించే క్రమంలో ఆదివారం పొలానికి వెళ్లారు. అక్కడ 60 ఏళ్లకు పైగా వయసున్న ఓ వృద్ధుడి మృతదేహం కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే వారు ఎస్సై విజయ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఆటో బోల్తా ఏడుగురికి గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న మహిళను ఓ ఆటో ఢీకొట్టి.. అనంతరం పల్టీకొట్టిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. వెల్దుర్తి గ్రామానికి చెందిన బి.కళావతి అనే మహిళ.. తన కుమారుడు, కుమార్తె గోసాల, తాడిగడపల్లోని ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్‌ చదువుతున్నారు. ఆదివారం ఉదయం ఆమె పిల్లల వద్దకు వచ్చారు. ముగ్గురు కలిసి మధ్యాహ్నం సమయంలో భోజనం చేసేందుకు గంగూరు వెళ్లి.. హోటల్‌కి వెళ్లేందుకు బందరు రోడ్డు దాటుతుండగా.. మచిలీపట్నం వైపు వేగంగా వెళుతున్న ఓ ఆటో అదుపుతప్పి.. తొలుత కళావతిని ఢీకొట్టి.. అనంతరం పల్టీకొట్టింది. ఈ ఘటనలో కళావతికి బలమైన గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

పాముకాటుతో చికిత్స పొందుతూ..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పెద్దతుంబళం గ్రామానికి చెందిన నరసయ్య(45) పాము కాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై బి.మల్లికార్జున తెలిపారు. నరసయ్య గొర్రెల కాపరిగా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి జీవాల వద్ద పడుకునేందుకు వెళ్తుండగా.. పాము కాటుతో అస్వస్థతకు గురయ్యారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

Wanted Male Academic Principals qualification any Degree/ PG, Salary: 25000/- to 30,000/- having experience in Educational Sector will be preferable, Age limit: 30 to 45 years. Working location: Kurnool, Contact: 92487 33342.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్‌ బ్యాంక్స్‌/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్‌ క్యాష్‌/షిఫ్టింగ్‌ గోల్డెన్‌ ట్రేడింగ్‌ కం|| ✆ 7382114647.

PERSONAL CLASSIFIEDS

MISSING

I, Shaik Abdullah S/o. Shaik Yusuf Miah, Residing at H.No.32-241, Gadda Street, Kurnool. I have lost my Original Passport No.R1860073 while Travelling from Xerox Centre, Near One Town to my above residence, Gadda Street, KNL. On 14-10-2025, Anybody found Contact: 93902 88638.

అన్నిరకాల బిజినెస్‌ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్‌ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

TO LET

కర్నూలు - కల్లూరు ఎస్టేట్‌ నందు 3200 Sft. గోడౌన్‌, ఆటో నగర్‌ నందు 800 Sft గల గోడౌన్‌ బాడుగకు కలదు. సంప్ర ✆ 99855 50011.

JOBS

కస్టమర్‌ కేర్‌ ఎగ్జిక్యూటివ్స్‌ (F) కావలెను. ఇంటర్‌నేషనల్‌ రిప్యూటెడ్‌ మ్యాట్రిమోనియల్‌ కన్సల్టెన్సీ, కర్నూలు బ్రాంచి కొరకు సంప్ర|| 93938 23550.

గమనిక

క్లాసిఫైడ్‌ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అంకి శ్రీనివాస్, నిరంజన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని సుబ్రహ్మణ్య స్వామి వారి షష్ఠి వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ఏడాది ఆటల పోటీలు, నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు డిసెంబరు 4న

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆలూరులో డిసెంబరు 4న జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. నాయకులు సంజయ్, శశిధర్, జగన్, నరసింహారెడ్డి, విజయ్, రాజు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలంలోని బెల్డోణ ఎస్సీ కాలనీలో మురుగు కాల్వను శుభ్రం చేయాలి. – రవికుమార్, బెల్డోణ

✔: రెండ్రోజుల్లో శుభ్రం చేస్తాం. – సావిత్రమ్మ, సర్పంచి బెల్డోణ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని లంగరబావి వీధిలో పాండురంగస్వామి ఆలయ మలుపులో వీధి దీపం సరిగా వెలగడం లేదు. – వెంకటేష్, ఆదోని

✔: వీధి దీపం వెలిగేలా చర్యలు చేపడతాం. – నాసీర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: ఆస్పరిలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. దుర్వాసన వస్తోంది. – రంగన్న, రాజు, ఆస్పరి

✔: ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇటీవలే పొక్లెయిన్‌తో పనులు చేయించాం. పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. – విజయరాజు, పంచాయతీ కార్యదర్శి ఆస్పరి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. – కిష్టన్న, మద్దికెర

✔: పరిశీలించి వెంటనే తొలగింపు చర్యలు చేపడతాం. – శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

కోయిలకొండ(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ?: కోయిలకొండ గ్రామంలో కంబాలపాడుకు వెళ్లే ప్రధాన రోడ్డులో మురుగు కాల్వ లేక మురుగంతా రహదారులపైకి చేరుతోంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. – మనోజ్, కోయిలకొండ

✔: అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలుపంపుతాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీశ్వరయ్య, గ్రామ సర్పంచి

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎల్.కె. చిన్నప్ప, రేణుకా, మహారాణలు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకలు మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, షేక్‌సాబ్, రజాక్‌వలి, దాదాపీర, ఐ.రాజు, జి.ఉచ్చీరప్ప, శివబాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పూర్వ విద్యార్థులు

ఆధునిక యంత్రాలు..
అందని చికిత్సలు

ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వెంటిలేటర్ల సేవలు మూలకు చేరాయి. యంత్రాలు వచ్చినప్పటి నుంచి వినియోగించలేదు. కొవిడ్ సమయంలో అత్యవసర సేవల నిమిత్తం వీటిని కేంద్ర ప్రభుత్వం అందించింది. గత ప్రభుత్వం వీటి వినియోగంపై దృష్టి సారించకపోవడంతో వచ్చిన యంత్రాలు మూలకు చేరాయి. రూ.లక్షలు విలువ చేసే పది వెంటిలేటర్లు సేవలకు దూరంగా ఉన్నాయి. వీటికి అనుసంధానంగా రెండు ఆక్సిజన్ ప్లాంట్లు సైతం నిర్మించారు. అత్యవసర సమయంలో ఇవి ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

– న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి
డివిజన్ కేంద్రం: ఆదోని
పడకలు: 350
రోజు ఓపీ: 650 నుంచి 800
ఐపీ: 35-40

ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్లు

నిరుపయోగంగా దంత చికిత్స కుర్చీ

నిపుణుల కొరత

పేరుకే జిల్లా సర్వజన ఆస్పత్రి.. వైద్యులు మాత్రం ఆ స్థాయిలో లేరు. 150 మంది వైద్య నిపుణులు ఉండాలి. ఉన్నది 18 మంది వైద్యులు. అందులోనూ వెంటిలేటర్ల యంత్రాలు నడపాలంటే జనరల్ మెడిసిన్‌తో పాటు అనెస్థీషియా అవసరం. ఈ వైద్య నిపుణుల కొరత ఉంది. వీటి నిర్వహణ శిక్షణ సైతం పొందాల్సి ఉంటుంది. 24 గంటలు పనిచేసే యంత్రాలకు మూడు షిఫ్ట్‌ల్లో నిపుణులుండాలి. వారు లేకపోవడంతో యంత్రాల వినియోగం జరగడంలేదు. దీంతో అత్యవసర కేసులకు వీటి సేవలందితే, మరింత కోలుకునేందుకు దోహదపడుతుంది.

ప్రమాదాలు అధికం

ప్రధానంగా పశ్చిమ పల్లెల్లో అధ్వానపు రహదారులతో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. రోజూ ప్రమాద, అత్యవసర బాధితులు ఆసుపత్రులకు వస్తుంటారు. వీరిలో అధికంగా రహదారి ప్రమాద బాధితులు, పురుగు మందు ప్రభావం బారిన పడినవారు, గుండె, శ్వాసకోశ ఇబ్బందులు, కాలేయం తదితర సమస్యలతో వస్తుంటారు. వీరికి వెంటిలేటర్ల సేవలు ముఖ్యం. శ్వాస తీసుకోలేని స్థితి నుంచి ఉపశమనం కలిగించి, కోలుకునేలా చేయడంలో ఇవి కీలకం. దీంతో పాటు వైద్య నిపుణులు లేకపోవడంతో అత్యవసర కేసులను రెఫర్ చేస్తున్నారు. ఇలాంటి వారంతా వంద కి.మీ. దూరంలోని కర్నూలు, 80 కి.మీ. దూరంలోని బళ్లారి వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల పేదలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇక్కడి ఆస్పత్రికి వైద్య నిపుణులతో పాటు పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ తదితర నిపుణులను నియమించాలని స్థానిక వైద్యాధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. త్వరలో భర్తీ అయితే, ఈ ప్రాంతం వారికి వైద్య సేవలు అందుబాటులో రావడంతో పాటు దూరాభారం ఇబ్బందులు తొలగుతాయి. ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపుతుందని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

విద్యుత్తు నియంత్రికల వద్ద రక్షణ చర్యలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని వివిధ రహదారుల కూడళ్లలోని విద్యుత్తు నియంత్రికల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని విద్యుత్తుశాఖ ఏఈ మహేశ్వరెడ్డి తెలిపారు. పట్టణంలోని మొదటి విడతగా ఆరు చోట్ల విద్యుత్తు నియంత్రికల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.. ఉన్నతాధికారుల నుంచి అనుమతి లభించిందన్నారు. త్వరలో పనులు చేపడతామన్నారు.

రణమండల దారిలో యమగండం

ఆదోని పట్టణ శివారు రాంజల చెరువు కట్ట రక్షణ గోడ కూలిపోయింది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద చెరువుకు ఉన్న ఈ రహదారి మీదుగా రణమండల ఆంజనేయ స్వామి ఆలయం, ఎల్లమ్మవ్వ ఆలయం, దొడ్డనగేరి గ్రామం, సుల్తానపురం తదితర గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు అదుపుతప్పితే చెరువులో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

భవనాలపై చెట్టాపట్టాల్

సాధారణంగా చెట్లు నేలపై పెరగడం చూస్తుంటాం. ఆలూరు పట్టణంలోని కాస్మో పాలిటిన్ క్లబ్‌కు సంబంధించిన వెనుక వైపు ప్రహరీ, తహసీల్దారు కార్యాలయం భవనంపై చెట్లు పెరుగుతున్నాయి. ఇటు వైపు వచ్చిన వారు ప్రహరీ, కార్యాలయ భవనంపై పెరిగిన చెట్లను ఆసక్తిగా చూస్తూ.. వెళ్తున్నారు. చెట్లను తొలగించకపోతే ప్రహరీ, భవనానికి పగుళ్లిచ్చే ప్రమాదం లేకపోలేదు. – న్యూస్‌టుడే, ఆలూరు

కాస్మో పాలిటిన్ క్లబ్ ప్రహరీపై..

తహసీల్దారు కార్యాలయం భవనంపై..

అలాగే కవరుచేశారు

చెట్లు.. ప్రగతికి మెట్లు అని ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నో సందర్భాల్లో చెప్పిన మాటలు. వాటిని నాటడంలో కనీస సూచనలు పాటించలేదనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. ఇటీవల గూళ్యం గ్రామంలో సచివాలయం-1 ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కకు ఉన్న ప్లాస్టిక్ కవర్ తీసేసి గుంతలో నాటాలి. ఇవేమి పట్టించుకోకుండా కేవలం ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. మొక్కలకు కవరు అలాగే వదిలేశారు. ఇలాగే ఉంటే.. అవి ఎదిగేది ఎప్పుడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

రాకపోకలకు ఆటంకం

ఆదోని పట్టణం కిలిచినపేట పంచయ్యస్వామి మఠం ప్రాంతంలోని శివా వీధిలో ఆలయం ఎదుట విద్యుత్తు స్తంభం నడి వీధిలో ఉంది. అసలే ఇరుకు వీధి.. ఆపై స్తంభం మధ్యలో ఉండటంతో రాకపోకలకు అంతరాయంగా మారింది. నిత్యం జనం స్తంభాన్ని ఢీకొని గాయపడుతున్నారు. మరోచోటుకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

బోయబొంతిరాళ్ల కొండల్లో చిరుత సంచారం

బోయబొంతిరాళ్ల(కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామ సమీపంలో పులిచెర్ల గ్రామం వైపు ఉన్న బోయన్న కొండల్లో చిరుతను చూసినట్లు రైతులు చెబుతున్నారని సర్పంచి రవిమోహన్ తెలిపారు. ఆయన వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకొని పరిశీలించారు. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు, పశువులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా, గుంపులుగా వెళ్లాలని సూచించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండల పరిధిలోని దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి జలాభిషేకం, బండారు అర్చన, బిల్వార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, ఆకు పూజ, అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. కర్ణాటక, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు.

బీసీల సమస్యలపై పోరాటం కొనసాగించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కోరారు. హైదరాబాద్‌లో కృష్ణయ్య నివాసంలో ఆదివారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో బీసీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుయాదవ్, గిరిజన సంక్షేమ సలహా సంఘం సభ్యుడు పి.వెంకటపతి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్, తెదేపా రాష్ట్ర నాయకులు నరసింహచౌదరి ఉన్నారు.

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు

కార్యక్రమం ప్రారంభిస్తున్న చిన్మయ మిషన్ పెద్దలు

సన్మార్గంలో ముందుకు సాగాలి

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: యువత చెడు అలవాట్ల వైపు కాకుండా.. సన్మార్గంలో నడిచి, దేశసేవలో భాగస్వాములు కావాలని చిన్మయ మిషన్ అధ్యక్షుడు ఎగ్గటి ప్రతాప్ అన్నారు. స్థానిక చిన్మయ మిషన్ కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడారు. తమ దైనందిన జీవితంలో కొంత సమయం సమాజ హితానికి కేటాయించాలన్నారు. వైద్యురాలు కీర్తిప్రియ 165 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఔషధాలు అందించారు.

చెత్త తరలింపునకు ట్రాక్టర్

నలకదొడ్డి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: నలకదొడ్డి గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ, తరలింపు చేపటేందుకు ట్రాక్టర్ మంజూరైందని పంచాయతీ కార్యదర్శి దివ్య తెలిపారు. పంచాయతీ పరిధిలోని నలకదొడ్డి, మజరా గ్రామం అటికెలగుండు గ్రామాల్లో చెత్త సేకరణకు, తరలింపునకు ట్రాక్టర్ అందుబాటులోకి రావటంతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తెదేపా నాయకుల విజ్ఞప్తితో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రత్యేక చొరవతో పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు కావటం హర్షణీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ వద్ద పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు

బారికేడ్ పడిపోకుండా చర్యలు

స్పందనకు వందనం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని లంగరబావి వీధిలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్ కూలిపోకుండా ఉండేందుకు వెల్డింగ్ పనులు చేశారు. గత నెల 25న 'ఈనాడు' ఆధ్వర్యంలో పురపాలక సంఘం కమిషనర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ప్రమాదకరంగా ఉన్న బారికేడ్ అంశాన్ని మురళి అనే పట్టణ వాసి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన డీఈ రామ్మూర్తి బారికేడ్ కూలిపోకుండా వెల్డింగ్ పనులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తి శ్రద్ధలతో పెద్దమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ

అటికెలగుండు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: అటికెలగుండు గ్రామంలో పెద్దమ్మదేవి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, భక్తుల సహకారంతో సుమారు రూ.15లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయం నిర్మించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రతువుల అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఎనిమిది మందిపై కేసు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం ఎస్కేడీ కాలనీలోని సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో భక్తులు ప్రార్థనలు చేసే సమయంలో ఆటంకం కలిగించారని జ్యోతి అనే మహిళ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. చర్చిలో ఆదివారం ప్రార్థనలు చేస్తుండగా ఇబ్బందులకు గురి చేశారని తాయప్ప, అమృతరాజ్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుక్క దాడిలో గాయాలు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుందలోని పలు కాలనీల్లో శునకాల సంచారంతో స్థానికులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. పలు వీధుల్లో నలుగురిపై కుక్కలు దాడి చేశాయి. ఇందులో చిన్నారులు బోయ అంజలి, సిరాజ్‌తో పాటు యం.శివన్నగౌడ, సిరుగుప్ప మల్లికార్జునకు గాయాలయ్యాయి. వీరంతా హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. కుక్కలు వివిధ చర్మ సంబంధిత వ్యాధులతో సంచరిస్తున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి సేవాస్ఫూర్తి.. చెరగని కీర్తి

భగవాన్ సత్యసాయిబాబా చూపిన సేవా స్ఫూర్తి చెరగని కీర్తిని చాటిందని పలువురు వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కరవు కాటకాలకు నిలయమైన రాయలసీమ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏళ్ల కిందటే అనేక పథకాలు చేపట్టారన్నారు. విద్య, వైద్య సేవలు ఉచితంగా అందించి ఎందరికో ప్రాణభిక్ష పెట్టారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆయన సేవా కార్యక్రమాలు చూసి లక్షలాది మంది భక్తులు భాగస్వాములయ్యారు. సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. దేవనకొండ, చిప్పగిరి, మద్దికెర, వెల్దుర్తి, తుగ్గలి, కృష్ణగిరి, తదితర మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, బృందం

ఆలూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల నివాళి

ఆదోని పట్టణంలో శ్రీసత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ పి.కొండయ్య తదితరులు

పత్తికొండ ఎంపీడీవో కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్ తదితరులు

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని వక్తలు అన్నారు. ఆదోని పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఆవోపా, వామ్(వరల్డ్ ఆర్య వైశ్య మహాసభ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుశ్రుత ఫౌండేషన్ వారి ఏషియన్ వ్యాస్కులర్ ఆస్పత్రి, ఎన్టీఆర్ వైద్యసేవ సౌజన్యంతో ఉచిత రక్తనాళాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కాకుబాల్ నగేష్ కుమార్, ఆవోపా పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా, సభ్యులు రఘు, ప్రతాప్‌ఈరన్నశెట్టి, వెంకటేశ్వర్లు, రత్నయ్య, రాధకృష్ణ, ఆంజనేయులు, మమతాశ్రీ, శ్రీదేవి, మైత్రేయిమణి, అనిత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆంజనేయ సన్నిధిలో హోమాలు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని దివాకర్‌నగర్‌లో వెలసిన ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ వాసుల సహకారంతో ఆలయ ఆవరణలో హోమాది పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక సేవ అలవర్చుకునేందుకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి అన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు గోవిందు, ఈరమ్మ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు పురప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి జెండా ఊపి ప్రారంభించారు.

ఎన్‌సీసీ ర్యాలీ ప్రారంభిస్తున్న వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి

ముసురుతున్న మేఘాలు..
వరి రైతుల్లో దిగులు

హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందకుండా పోతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపై తుపాను ప్రభావం పడింది. వచ్చిన వరకైనా తీసుకుందామంటే మళ్లీ వాతావరణంలో మార్పులు రావడంతో కర్షకులు దిగులు చెందుతున్నారు.

ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి, హొళగుంద మండలాల్లో దిగువ కాల్వ కింద సాగు చేశారు. చిప్పగిరి మండలంలో హంద్రీనీవా, ఆలూరు బ్రాంచి కెనాల్ (ఏబీసీ) కింద వరి సాగు చేశారు. నియోజకవర్గంలో సుమారు మూడున్నర వేల ఎకరాల్లో సాగు చేశారు. గత నెలలో మొంథా తుపాను కారణంగా పంట ఎదుగుదల లేకపోవడంతో తెగుళ్లు, చీడపీడలు ఆశించాయి. అనుకున్నంత స్థాయిలో గింజలు గట్టిపడలేదు. సస్యరక్షణ చర్యలు కోసం రైతులు వివిధ రకాలు మందులు కోసం వేలాల్లో ఖర్చు చేశారు. ప్రస్తుతం తుపాను నేపథ్యంలో వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ సూచనలు జారీ చేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు వరి కోతలు ప్రారంభించారు. మేఘాలు కమ్ముకోవడంతో కోతలు కోసేందుకు రైతులు జంకుతున్నారు.

కోతకు వచ్చిన వరిపైరు

టార్పాలిన్ల కొరత

ప్రస్తుతం వరి కోతలు అక్కడక్కడ ప్రారంభమయ్యాయి. రైతులకు అవసరమైన టార్పాలిన్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని పంపిణీ చేసేందుకు అధికారులు సైతం దృష్టి సారించడం లేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా టార్పాలిన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అదును చూసి కోతలు కోయాలి

– జిలానీ బాషా, వ్యవసాయాధికారి

వరి కోతలు కోసేందుకు సమయం వచ్చింది. ఇప్పటికే కొంత మంది కోస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులు వస్తున్న నేపథ్యంలో, వర్షాలు కురిసే అవకాశం ఉంది. అన్నదాతలు చూసి వరి కోతలు చేపట్టాలి. తీరా కోతలు చేపట్టాక వర్షాలు కురిస్తే.. ధాన్యం తడిసే ప్రమాదం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

అన్నదాన సేవకు సత్కారం

హొళగుంద, న్యూస్‌టుడే: అన్నదాన సేవ చేసినందుకు హొళగుందకు చెందిన మంజునాథ్‌ను సిద్దలింగేశ్వర మఠం వారు ఆదివారం సన్మానించారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూర్ జిల్లా ఏడియార్ పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన సిద్దలింగేశ్వర మఠంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయన ఏటా కార్తిక మాసంలో అన్నదాన కార్యక్రమానికి తనవంతు సాయం చేస్తున్నారు. ఈ సేవలు గుర్తించి సిద్దలింగేశ్వర నిత్య దాసోహ సంస్థ వారు శాలువా, ప్రతిభ పురస్కారాన్ని అందించారు. ఆయన కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

మంజునాథ్‌ను సన్మానిస్తున్న స్వామీజీలు

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

కళ్లకు గంతలు కట్టుకొని కార్మికుల నిరసన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని బాధితులు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసనలు చేపట్టారు. పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో కార్మికులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో కార్మికుల గురించి పట్టించుకోలేదన్నారు. కరోనాలో సేవలందించిన కార్మికులు మృత్యువాతపడ్డారని వారి కుటుంబాలకు ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఐదేళ్లలో జగన్ పూర్తిగా విస్మరించగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా కుటుంబాలకు న్యాయం చేయలేదన్నారు. తక్షణమే స్పందించి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగన్న, ఏఐటీయూసీ తిమ్మగురుడు, విజయేంద్ర, భీమన్న, గౌడ్, కిరణ్, అశోక్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

25న ఉద్యోగ మేళా

కోడుమూరు గ్రామీణం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 25వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమంలో 10 కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,109

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,109 మధ్యస్థ ధర రూ.6,589 కనిష్ఠ ధర రూ.3,416లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,807 మధ్యస్థ ధర రూ.5,806 కనిష్ఠ ధర రూ.5,280 పలికింది.

సమస్యలతో సహవాసం.. కష్టాలతో సతమతం

☛ రహదారులు, తాగునీటికి ఇబ్బందులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో పలు కాలనీల్లో రహదారులు, తాగునీరు, మురుగు కాల్వలు, వీధి దీపాల సమస్యల నెలకొన్నాయి. పట్టణంలో వెంకటాపురం, ఎస్ఎంటీకాలనీ, రాఘవేంద్ర, పంపన్నగౌడ్ కాలనీలో సమస్యలు జటిలమయ్యాయి. వీటిపై గతంలో ఆ వార్డు కౌన్సిలర్లు మూడేళ్లుగా పనులు చేపట్టలేదని స్థానికులు వాపోయారు. ప్రధానంగా కంకర తేలిన రోడ్లతో ప్రతి రోజూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు వీధుల్లో భూగర్భ మురుగు కాల్వల కోసం తవ్విన రహదారి గుంతలు ఏర్పడింది. ఇళ్ల ముందు పడిన గుంతలతో నిత్యం కాలనీ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఐదోవీధిలో కంకర తేలిన దారి

పలుమార్లు విన్నవించినా..

వెంకటాపురంలో గుంటి రంగస్వామి దేవాలయం వీధి లోపల రెండో లైన్లో మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. శివుని గుడి వద్ద డ్రైనేజీ పూర్తిగా పూడిపోయింది. పాఠశాల పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రికకు సరైన రక్షణ వలయం ఏర్పాటు చేయలేదు. వెంకటాపురం నుంచి మిలటరీ కాలనీకి తారు రోడ్డు వేయాలని పదేపదే కౌన్సిల్ సభ్యులు విన్నవించినా పనులు చేపట్టలేదు. వీటితో రహదారి పొడవునా గుంతలు, మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. శివారు నాలుగు విద్యుత్తు స్తంభాలకు కొత్త వీధి దీపాలు అమర్చాల్సి ఉంది. మూడు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. తాగునీటి సమస్యతో దాదాపు కొన్ని ఇళ్లకు సరిగా సరఫరా కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. పైగేరిలో దాదాపు 50 ఇళ్లకు నీరు రావడం లేదు. మున్సిపాలిటీకి పన్నులు చెల్లించిన స్పందించడం లేదు. 20కి పైగానే వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లు నెలకొన్నాయి. ట్యాంకు చుట్టూ మురుగు నీరు ఉండడంతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. కాలనీలో నిత్యం సమస్యలు నిలయంగా మారుతున్నాయి.

ఎస్ఎంటీ కాలనీ శివారుల్లో...

మాత్రాల తిమ్మప్ప కాలనీలో దాదాపు 2వేల మంది జనాభా నివసిస్తున్నారు. కాలనీలో తిమ్మప్ప దేవాలయం సమీపంలో ఉన్న మూడు లైన్లలో కుళాయిలు ఉన్నా.. నీటి సరఫరా లేకపోవడంతో బాధితులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో రెండు చోట్ల రూ.లక్షతో బోరు వేసి ట్యాంకులు నిర్మించినా నీటి సరఫరా కావడం లేదు. మురుగు కాల్వల ఆక్రమణతో ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లపై విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. నిత్యం కాలనీలో తాగునీటి కోసం ప్రైవేటు వాటర్ ప్లాంట్ వద్ద నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు.

కాలనీ: వెంకటాపురం
వార్డులు : 23, నుంచి 29 వార్డుల వరకు
జనాభా: 15వేలు పైగానే
ఇళ్లు : 4200

పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్తు, మురుగు కాల్వలు, రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం కొత్తగా 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడంలో అన్ని ప్రాంతాలకు తాగునీటి పైపులైన్ వేస్తాం. విద్యుత్తు దీపాలను కొత్త వాటికి టెండర్లు పూర్తి చేశాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: రామలక్ష్మమ్మ కాలనీ సమీపంలో రోడ్లు గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. -సునీల్, కాలనీవాసి

✔: రహదారి మరమ్మతులు చేయిస్తాం -గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: క్విబుల్లా కాలనీలో డ్రైనేజీ పూర్తిగా చెత్తతో నిండటంతో దుర్వాసన వస్తోంది. -లక్ష్మన్న, కాలనీవాసి

✔: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: ఎస్ఎంటీ కాలనీలో కొత్త వీధి దీపం అమర్చండి. -సోమేష్ కాలనీవాసి

✔: వీధి దీపం అమరుస్తాం. -నీరజా, డీఈ

నందవరం, న్యూస్‌టుడే: ?: పోనకలదిన్నె గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. రెండు లేదా మూడు రోజులకు ఒక్కసారి వస్తోంది. అధికారులు స్పందించి రోజువారీగా సరఫరా చేయాలి. -మల్లికర్జున, పోనకలదిన్నె

✔: పోనకలదిన్నె గ్రామంలో తాగునీరు రోజువారీగా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. - బాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని మేకడోన గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. సమస్యను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. -నర్సయ్య, మేకడోన.

✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు చేపడతాం. -ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు

?: మండల కేంద్రంలోని రెడ్డిగారి రామలింగారెడ్డి కాలనీలో మురుగు కాల్వలు లేక ఇళ్ల ముందు గుంతలు తవ్వుకున్నాం. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు గుంతలు నిండి ఇళ్ల ముందు అపరిశుభ్రత నెలకొంది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. -మంగలి సూరి, పెద్దకడబూరు.

✔: కాలనీలో మురుగు కాల్వల ఏర్పాటు సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచితో చర్చించి ఏర్పాటు కోసం కృషి చేస్తాం. -ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

గుడేకల్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుడేకల్‌లో ఆదివారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సర్పంచ్ మాలనరసమ్మ, వీరశైవ సంఘం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్, రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ ఛైర్మన్ పురుషోత్తం గౌడ్, నాయకులు త్యాగరాజు, నాగేష్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా సాయిబాబా శత జయంతి వేడుకలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకను తహసీల్దారు పి.రాజేశ్వరి ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి తహసీల్దారు నివాళి అర్పించారు. సత్యసాయి జీవితం మానవాళికి ఎంతో ఆదర్శమని ఆమె కొనియాడారు. ఉప తహసీల్దారు రఘువీర, ఆర్ఐ రామయ్య, వీఆర్వో మున్నీరుబాషా, ఈశ్వర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సాయిబాబా చిత్రపటానికి పూలు వేసిన తహసీల్దారు రాజేశ్వరి

సత్యసాయి జీవితం అందరికీ ఆదర్శం

సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసిన అధికారులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజలకు పలు సేవలందించిన గొప్ప వ్యక్తి, దైవ స్వరూపమైన సత్యసాయిబాబాను స్మరించుకోవాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. ఎండీవో కార్యాలయం సమావేశ భవనంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి మాట్లాడుతూ పేద ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామాలను దత్తత తీసుకొని సమస్యలు పరిష్కరించారని తెలిపారు. విద్య, వైద్యం, అభివృద్ధి అనేక సంక్షేమ పథకాలను ట్రస్టు ద్వారా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక డీఈ నీరజా, ఎంపీడీవో బంగారమ్మ, వెలుగు, మెప్మా సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా జీవితం మానవాళికి ఆదర్శమని డీపీవో భాస్కర్ అన్నారు. మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయంలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీవో భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి చేసిన గొప్ప పనులను తెలియజేసి, ఆయన సేవలను కీర్తించారు. ఎంపీడీవో నూర్జహాన్, తహసీల్దార్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులు అర్పిస్తున్న డీపీవో భాస్కర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, సిబ్బంది

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఆదివారం ఆయా అధికారుల ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటలక్ష్మీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి రమణారెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో సత్యసాయిబాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో వెలసిన గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు జరిపారు. మూల నక్షత్రంలో ఆదివారం అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు నిర్వహించారు. విశేష అలంకరణ చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. హనుమాన్ చాలీసా మండల పారాయణం ఆరో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కంకర తేలి.. ప్రమాదకరంగా మారి

నందవరం మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. నందవరం మండలం నుంచి పోనకలదిన్నె, టి.సోమలగూడూరు గ్రామానికి వెళ్లే రహదారి 20 కి.మీటర్ల మేర ఉంది. మూడేళ్ల క్రితం ఈ రహదారి మరమ్మతులకు రూ.12.25లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారుడు లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. కంకర రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డు అంతా దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నారు.

-న్యూస్‌టుడే, నందవరం

పశువుల షెడ్డు.. పడక గదిగా..

పశుపోషణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలకు ప్రత్యేక పశువుల షెడ్లను మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులను అధికారులు గుర్తించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. షెడ్లు నిర్మించుకుంటామని నిజమైన రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా మంజూరు చేయడం లేదు. కొంతమంది లబ్ధిదారులు వీటిని సక్రమంగా వినియోగించుకోకుండా బిల్లు మంజూరైన తర్వాత వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారు. గోనెగండ్ల మండలంలోని పెద్దనెలటూరు గ్రామంలో ఓ రైతు పశువుల షెడ్డును పడక గదిగా మార్చుకున్నారు. షెడ్డు నిర్మాణం కోసం రూ.2.30 లక్షలు ఖర్చు చేశారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

కొత్త రోడ్డు.. పాడైపోయేలా..

మండలంలోని మేకడోన గ్రామం నుంచి కల్లుకుంటకు వరకు ఇటీవల వేసిన నూతన తారు రోడ్డు ఇప్పుడే పాడయ్యేలా ఉంది. మేకడోన గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఏర్పాటు చేసిన సాగు నీటి గొట్టపు ద్వారం నీరు లీకేజీ అయి రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ నీరు ఇలాగే ప్రవహిస్తే నూతన తారు రోడ్డు దెబ్బతింటుందని ప్రయాణికులు వాపోతున్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.30 కోట్లతో తారు రోడ్డు వేశారు. రోడ్డు వేసి వారం రోజుల తిరగక ముందే లీకేజీ ఏర్పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దకడబూరు

రూ.లక్షలు పెట్టినా.. లక్ష్యం చేరక

పురపాలక సంఘంలోని చెత్త చెదారాన్ని కంపోస్టు యార్డులో తొట్టెలలో నిల్వ చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలని లక్ష్యం. తొట్టెలు, షెడ్ల కోసం దాదాపు రూ.18లక్షలు ఖర్చు చేశారు. ఏళ్లుగా వృథాగా మారాయి. చెత్తతో పాటు వాన పాములు తరలించి తొట్టెల్లో నిల్వ చేస్తే సేంద్రియ ఎరువు తయారు అవుతుంది. కూటమి ప్రభుత్వం స్పందించి వర్మీ కంపోస్టు తయారు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. సేంద్రియ ఎరువుకు డిమాండు ఉండడంతో రైతులు నిత్యం అడిగి తిరిగిపోతున్నారు.

-న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

రహదారికి మరమ్మతులు

కృష్ణదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణదొడ్డి గ్రామాల్లో పొలాలకు వెళ్లే రహదారికి గ్రామ సర్పంచి చొరవ చూపి మరమ్మతులు చేశారు. ఈనెల 12వ తేదీన 'రహదారి.. అధ్వానంగా మారి' అనే శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు స్పందించారు. గ్రామ పంచాయతీ సర్పంచి రామాంజినేయులు స్పందించి ఎర్ర మొరుసుతో గుంతలుపడిన రహదారిని పూడ్చివేయించారు. రైతులకు రాకపోకలకు సులువుగా మార్చడంతో గ్రామస్థులు సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు వందనం

నేడు రచ్చుమర్రిలో అన్నదాత సుఖీభవ

మాధవరం(మంత్రాలయం), న్యూస్‌టుడే: రచ్చుమర్రి గ్రామంలో సోమవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరుకావాలని తెదేపా ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మాధవరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు పెద్దపీట వేస్తూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రచ్చుమర్రి గ్రామంలో సోమవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నందవరం, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో అక్రమ ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన నందవరం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నది నుంచి అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాగలదిన్నె గ్రామంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసి కర్నూలు మైనింగ్ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం పోలీసుస్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో ఉండాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో రౌడీషీటర్లు చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్సై వేణుగోపాల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఆదివారం ఠాణాలో ఆయన రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి మంచిగా నడుచుకోవాలని సూచనలు ఇచ్చారు.

నేత్రానందం.. నృత్యాభినయం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కన్నడ కళాకారుల భరతనాట్య ప్రదర్శనకు తుంగభద్ర తీరం, శ్రీమఠం వేదిక అయింది. బెంగళూరుకు చెందిన నాట్యకళా మైత్రీ స్కూల్ నిర్వాహకురాలు మైత్రీ కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమఠం యజ్ఞ మంటపంలో దాదాపు 36 మంది కళాకారులు భరతనాట్యం చేశారు. శ్రీమఠం సాంస్కృతిక కళల నిర్వాహకులు పద్మనాభాచార్ కళాకారులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.

భరతనాట్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీమఠానికి బంగారు హారం వితరణ

మంత్రాలయం, న్యూస్‌టుడే: విజయవాడకు చెందిన హైకోర్టు న్యాయవాది వేణుగోపాల్‌రెడ్డి, సుధారాణి దంపతులు రూ.లక్ష విలువ చేసే బంగారు హారాన్ని శ్రీమఠంకు అందజేసినట్లు మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. కుమారుడు గుణశేఖర్ రెడ్డి, కూతురు దేవిశ్రీలతో కలసి వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం శ్రీమఠం చేరుకోగా.. వీరికి బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే నారాయణ, మఠం అధికారులు స్వాగతం పలికారు. వీరు మేనేజర్‌ను కలిసి బంగారు హారాన్ని విరాళంగా అందజేశారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

మేనేజర్ వెంకటేశ్ జోషికి బంగారుహారం అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

అగ్రహారం(గోనెగండ్ల, న్యూస్‌టుడే): మండలంలోని బి.అగ్రహారంలో వ్యవసాయ కూలీ రామాంజిని(23) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులు ముక్కెన్న, వెంకటలక్ష్మి దంపతులకు కుమారుడు కొండంత అండగా ఉన్నారు.

గోనెగండ్ల,న్యూస్‌టుడే: మండలంలోని తిప్పనూరులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు మండల తెదేపా కన్వీనర్ తిరుపతయ్య నాయుడు ఆదివారం తెలిపారు. గ్రామంలో నిర్వహించే రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీడీవో రాముడు, ఉప తహసీల్దార్ పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటేష్ నాయక్ తెలిపారు.

సి.బెళగల్,న్యూస్‌టుడే: సి.బెళగల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌వో ఉమామల్లేశ్వరీ తెలిపారు.

ఆసుపత్రిలో రోగులకు అవస్థలు

☛ శిథిలమైన క్వార్టర్స్ తొలగింపులో జాప్యం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెరగడంతో రోగుల రాక కొంత కాలంగా పెరిగింది. ఇక్కడ కొన్ని సేవలు మొక్కుబడిగా అందుతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో శిథిల గదులు విష పురుగులకు నిలయంగా మారింది. పోలీసు పికెటింగ్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఇలా పలు సమస్యలు ఆసుపత్రిలో వేధిస్తున్నాయి.

వైద్య సేవలకు నిరీక్షిస్తున్న రోగులు

పెరిగిన ఓపీ

ప్రభుత్వ ఆసుపత్రి ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు పెద్ద దిక్కుగా మారింది. సోమ, శుక్రవారాల్లో ఓపీ 700వరకు, మిగతా రోజుల్లో నాలుగైదు వందలు ఉంటుంది. కొందరు వైద్యులు అంకితభావంతో పని చేస్తుంటే మరికొందరు మొక్కుబడిగా విధులు నిర్వహించడం గమనార్హం. హాజరు కోసమే విధులకు వస్తున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. నెలకు 200 నుంచి 300వరకు ప్రసవాలు చేస్తూ ముందు వరుసలో ఉంది. అయితే నవజాత మాతృత్వ మరణాలను తగ్గించాలన్నా ప్రభుత్వ ఉద్దేశం పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. ఇటీవల తల్లీబిడ్డ చనిపోవడం నిదర్శనం. గైనకాలజిస్టులను అవసరం మేరకు నియమించాలని గర్భిణులు, వారి కుటుంబసభ్యులు కోరుతున్నారు. కంటి చికిత్సలు ఆసుపత్రిలో ఉచితంగా చేస్తుండటంతో కంటి సమస్య ఉన్న రోగుల రాక పెరిగింది.

అత్యవసర సేవలు అందక

ఎమ్మిగనూరు పట్టణం నుంచి బళ్లారి, మంత్రాలయం మీదుగా రాయచూరు వరకు జాతీయ రహదారితో పాటు ఇతర రాష్ట్ర రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షతగాత్రులకు ప్రాథమిక వైద్య సేవలందించి అత్యవసర వైద్య సేవల కోసం 70కి.మీ దూరం ఉన్న కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. అక్కడికి వెళ్లేందుకు గంటన్నర సమయం పట్టడంతో మధ్యలోనే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల వేర్వేరు రహదారి ప్రమాదంలో గాయపడిన వారిని కర్నూలుకు తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు.

పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటులో జాప్యం

ఆసుపత్రికి రోగులు వారి సహాయకులు వెయ్యి మంది వస్తారు. పొలాలు, ఇతర ఘర్షణల్లో గొడవపడి గాయపడి వారిని ఆసుపత్రికి తీసుకొస్తారు. ఇక్కడ మళ్లీ గొడవకు దిగిన సంఘటనలో గతంలో చోటు చేసుకున్నాయి. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని రోగులు, వారి సహాయకులు విన్నవిస్తున్నారు. గతంలో ఏర్పాటుకు డీఎస్పీ సుముఖత వ్యక్తం చేసిన ఏడాది దాటినా అది అమలు కావడంలేదు.

విష పురుగుల నిలయం

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన క్వార్టర్లు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. వాటిలో పిచ్చి మొక్కలు, ముళ్ల కంప పెరిగి విష పురుగులకు నిలయంగా మారాయి. వాటిని తొలగిస్తే ఆసుపత్రి ఆవరణలో వాహనాలు నిలుపుకునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఆసుపత్రికి వెళ్లే దారిలో వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు.

మురుగు కాల్వ కాదు.. రహదారి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల మండలంలోని బైలుప్పల గ్రామ పంచాయతీలో రహదారంతా మురుగుమయంగా మారింది. గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ సమస్య ఏళ్ల తరబడి కాలనీవాసులను వేధిస్తోంది. మురుగు నీటిలోనే అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. డ్రైనేజీ కాల్వల నిర్వహణ అటకెక్కడంతో కాలనీ పరిసరాలన్నీ అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు కష్టాలు తీర్చాలని కోరారు.

మురుగుమయంగా మారిన ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి

(c) eenadu

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

ఎన్నికల హామీలు అమలు చేయాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సలాంఖాన్ భవనంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన ఆదివారం జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు సూర్యుడు, రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే :

?: ధర్మపేటలో దోమల బెడద అధికంగా ఉంది. ఫాగింగ్ చేయించాలి. **- స్థానికులు**

?: సంతోష్‌నగర్‌లో మురుగు కాలువలను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలతో పూడిపోయాయి. **- రమేష్, స్థానికుడు**

✔: ఫాగింగ్ చేయిస్తాం. కాలువలను శుభ్రం చేయిస్తాం. **- నగరపాలక అధికారులు**

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి

సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏరువాకశాస్త్రవేత్త డా.సుజాతమ్మ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాతమ్మ అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ సహకారంతో ఆత్మ ద్వారా ఎంపిక చేసిన ఇన్‌పుట్ డీలర్లకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాల పంటలు వర్షాభావ పరిస్థితుల్లో కూడా కనీస దిగుబడులు ఇస్తాయన్నారు. దేశీ కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ ఇన్‌పుట్ డీలర్లు చిరుధాన్యాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలన్నారు.

ఆకట్టుకున్న ఛైర్మన్ నాటకం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన రసరంజని సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ఛైర్మన్' సాంఘిక నాటకం ఆకట్టుకుంది. నాటక నిర్వాహకు రామ కోటేశ్వరరావు, నటులను కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు యాగంటీశ్వరప్ప, సీవీరెడ్డి, కేవీ రమణ, రమేష్ సత్కరించారు.

పనులు అసంపూర్తి.. నగరానికి దాహార్తి

- మూడేళ్లుగా కొనసాగుతున్న పైపులైను నిర్మాణం
- వేసవి నాటికి పూర్తి చేయాలని ప్రజల విన్నపం

సాగుతున్న పైపులైన్ పనులు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగర వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం చేపట్టిన పనులు మూడేళ్లుగా ముందుకు సాగడం లేదు. సుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు పంప్‌హౌస్ వరకు ఏర్పాటు చేస్తున్న పైపులైను నేటికీ పూర్తి కాలేదు. రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పురోగతి కరవైంది. దీంతో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. వేసవి లోగా పనులు పూర్తి చేసి కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండుమూడు రోజులకోసారి..

నగర పరిధిలోని కాలనీలకు రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. కల్లూరు కాలనీలకు మాత్రం రెండు మూడు రోజులకు ఒకసారే నీరు ఇస్తున్నారు. శివారు కాలనీలు.. విలీన గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డబ్బులు వెచ్చించి మంచినీరు కొంటున్నారు. నగరపాలక ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో కానరావడం లేదు.

20.5 కి.మీ.. రూ.84 కోట్లు

సుంకేసుల నుంచి కేసీ కాలువ ద్వారా నగరానికి ఇస్తున్న నీరు పలుచోట్ల వృథా అవుతోందని.. రైతులు పొలాలకు ఉపయోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. వృథాను అరికట్టేందుకు సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.84 కోట్ల వ్యయంతో 20.5 కి.మీ పైపులైన్ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే సుంకేసుల జలాశయం నుంచి నీళ్లు నేరుగా మునగాలపాడు పంప్‌హౌస్‌కు చేరతాయి. 2022 డిసెంబరులో పనులు ప్రారంభించారు. గతంలో రాజకీయ జోక్యం అధికంగా ఉండటం, కొంతమంది కమీషన్లు ఇవ్వాలని పట్టుబట్టడంతో పనులు నెమ్మదిగా చేశారని విమర్శలున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని చూసినా సాధ్యం కాలేదు.

నిల్వ సామర్థ్యం లేక చిక్కులు

నగరంలోని 52 వార్డుల్లో సుమారు 8 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. నగరానికి ప్రధాన నీటి వనరు సుంకేసుల జలాశయం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సామర్థ్యం 0.15 టీఎంసీ కాగా.. నగరానికి ఏడాదికి 1.7 టీఎంసీల నీరు అవసరం. ప్రతిరోజు నగర వాసులకు 125 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండగా ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ వరకు మాత్రమే సరఫరా చేస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలని ఆదేశించాం : పి.విశ్వనాథ్, నగరపాలక కమిషనర్

సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించాం. సుంకేసుల ప్రాజెక్టులో నీళ్లు ఉండటంతో పనులు జరగడం లేదంటున్నారు. 2026 ఫిబ్రవరి లేదా మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని వారు చెబుతున్నారు.

దారి విశాలం.. ప్రయాణం సురక్షితం

నగరంలోని వైద్య కళాశాల ఎదురుగా చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ పూర్తికావచ్చాయి. ఇక్కడ రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పటికే పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య మంత్రి టీజీ భరత్, అధికారులు, మసీదు కమిటీ కృషితో సామరస్యంగా పరిష్కారమైంది. నగరపాలక అధికారులు అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించి రహదారిని విస్తరించారు. ప్రస్తుతం తారు పనులు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించిన రోడ్డును మంత్రి భరత్ సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

అంకుర అపెక్స్ ఆసుపత్రి ప్రారంభం

ఆసుపత్రి ప్రారంభోత్సవంలో కేడీసీసీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంకుర అపెక్స్ ఫెర్టిలిటీ సెంటర్‌ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఎంసీ మల్లేశ్వరి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాంక్షించారు. డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అన్నిరకాల కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వి.రమణ, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప విమర్శించారు. నగరంలోని డీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 కంటే ముందే నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. బదిలీలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో రిలీవ్ చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో పతకాల పంట

క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్ఏ ఈత శిక్షకుడు నటరాజరావు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన సబ్‌జూనియర్, జూనియర్ వింటర్ అంతర్ జిల్లాల అక్వాటిక్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఒక స్వర్ణం, ఐదు రజత, ఐదు కాంస్య పతకాలు సాధించారు. గ్రూప్-1 బాలుర విభాగంలో దేవ్‌శృత్‌సాయి 800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు, 50, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం సాధించాడు బాలికల విభాగంలో హేమలత 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగం, 200 మీటర్ల మిడ్లేలో రజతాలు, 50, 100, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య పతకాలు అందుకుంది. గ్రూప్-2 బాలికల విభాగంలో కె.శ్రుతి 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య పతకం గెలుపొందింది. విజేతలను జిల్లా ఇన్‌ఛార్జి క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, డీఎస్ఏ ఈత శిక్షకుడు నటరాజరావు, అసోసియేషన్ అధ్యక్ష నరసింహ ఆచారి, కార్యదర్శి రామకృష్ణయాదవ్, తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి తైక్వాండోలో ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులతో ఫిరోజ్ అహమ్మద్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. ప్రభుత్వ టౌన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.కార్తిక్, వాసవీ జూనియర్ కళాశాల విద్యార్థిని గాయత్రి రజత పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఫిరోజ్‌అహమ్మద్, ప్రధాన కార్యదర్శి ప్రభాత్‌కుమార్‌శర్మ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో శిక్షకుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులతో సంఘం నాయకులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కాకినాడలో ఈనెల 15 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రెండు బంగారు, ఒక రజతం, పది కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను శరీన్‌నగర్‌లోని తైక్వాండో సెంటర్‌లో ఆదివారం భారత సెపక్‌తక్రా సంఘం ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు వెంకటేశ్, నాగన్న, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయ సాధనకు పోటీ పడాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడాకారులు విజయం కోసం పోటీపడాలని ఆర్ఐవో లాలప్ప సూచించారు. నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో ఆదివారం జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను జిల్లా ఇన్‌ఛార్జి క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర పోటీల పరిశీలకుడు పొలంకి గణేష్‌బాబు ప్రారంభించారు. క్రీడాకారుల స్వాగత నృత్యం అలరించింది. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 కార్యదర్శి రాఘవేంద్ర, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నసుంకన్న, వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు

నడక ఆరోగ్యానికి శ్రేయస్కరం

వాక్ ఫర్ హెల్త్ నడకను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. భాస్కర్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య పేర్కొన్నారు. ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని బళ్లారి చౌరస్తాలో ఉన్న ఆలయం నుంచి చేపట్టిన వాక్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఆరోగ్య భారతి సమితి సభ్యుడు డా.మోక్షేశ్వరుడు నడక వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. డా.కె.ఇ.శరత్ చంద్ర, డా.మల్లికార్జునరెడ్డి, ఆరోగ్య భారతి ప్రాంత కార్యదర్శి డా.రామశర్మ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మహిళా కార్యదర్శి స్వప్న, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ: నగరంలో సోమవారం ఉదయం 7 నుంచి 10 గంటల మధ్య విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ నగర్, ఇల్లూరునగర్, సీపీఎం కార్యాలయం, పాత ఈద్గా, మెడికవర్ ఆసుపత్రి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మొక్క నాటుతున్న ఎన్‌సీసీ అధికారులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాంత పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్‌సీసీతో దేశ భవిష్యత్తు అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనచోదకులకు మంత్రణం

ద్విచక్ర వాహనచోదకులకు మంత్రణం చేస్తున్న సీఐ తేజోమూర్తి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు తాలూకా అర్బన్ పోలీసుస్టేషన్ సీఐ తేజోమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం బి.తాండ్రపాడులో వాహనాల తనిఖీ చేపట్టారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనచోదకులకు మంత్రణం చేశారు. శిరస్త్రాణం ప్రాణాలు కాపాడుతుందని వివరించారు.

ప్రతిఒక్కరు సేవా స్ఫూర్తితో మెలగాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరు సేవా స్ఫూర్తితో మెలగాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. ఓర్వకల్లులోని బాలభారతి పాఠశాలలో ఓంప్లెస్ గౌరవ సలహాదారు విజయభారతి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి సేవలను కొనియాడారు. పొదుపు మహిళలు, తెదేపా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే : సత్యసాయిబాబా సేవలు మరువలేనివని జడ్పీ సీఈవో నాసరరెడ్డి పేర్కొన్నారు. ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సత్యసాయి జయంతి వేడుకలను నిర్వహించారు. తహసీల్దారు విద్యాసాగర్, ఎంపీడీవో నాగఅనసూయ, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఆధ్యాత్మికం : కర్నూలు నగరంలోని సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు, సేవాదళ్ సభ్యులు హాజరయ్యారు. సంగీత విభావరి, భక్తి గీతాల ఆలాపన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, భజన మండలి కన్వీనరు సందీప్‌కుమార్, భక్తులు హాజరయ్యారు.

కల్లూరు గ్రామీణం : కల్లూరు పట్టణ పరిధిలోని తారకరామ నగర్‌లో ఉన్న ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. నగరపాలక అధికారులు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు హాజరైన మహిళలు, విద్యార్థులు

కర్నూలు సత్యసాయి మందిరంలో భక్తిగీతాలు ఆలపిస్తున్న హరిప్రియ బృందం

సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

అభివృద్ధి జాడలేని.. పేదల కాలనీ

- పందిపాడు హౌసింగ్ లేఅవుట్‌లో వసతుల కొరత

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పందిపాడు ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఇక్కడ 2500 మందికి పట్టాలు మంజూరు చేయడంతో పాటు గృహాలు మంజూరు చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో దీనికి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌గా పేరు మార్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ నగర్‌గా మారింది. పేరు మారుస్తున్నారే తప్ప వసతులు మాత్రం కల్పించలేదు. దీంతో ప్రస్తుతం ఇక్కడ వందల సంఖ్యలోనే లబ్ధిదారులు నివసిస్తున్నారు. కాలనీకి వెళ్లేందుకు సరైన రహదారి కూడా లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

☛ ఈ కాలనీకి పదహారేళ్లుగా రహదారి ఏర్పాటు చేయలేదు. కల్లూరు చెన్నమ్మ కూడలి నుంచి కల్లూరు పారిశ్రామికవాడ, ముజఫర్‌నగర్ మీదుగా మట్టిదారిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కల్లూరు ఎస్టేట్ నుంచి రూ.30 లక్షలతో రహదారి మంజూరు చేసినట్లు నగరపాలక అధికారులు చెబుతున్నా అది కార్యరూపం దాల్చడం లేదు.

☛ కల్లూరు పారిశ్రామికవాడ నుంచి లేదా.. ముజఫర్‌నగర్ నుంచి పందిపాడు హౌసింగ్ కాలనీకి రహదారి నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మార్గాల్లో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినా వీధిదీపాలు మాత్రం అమర్చలేదు. దీంతో రాత్రిళ్లు చీకటి దారుల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రహదారులు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గుంతలమయమైన కల్లూరు పారిశ్రామికవాడ నుంచి వెళ్లే మట్టిదారి

ఓర్వకల్లు నుంచి ఎన్.కొంతలపాడు వరకు దారుణంగా దెబ్బతిన్న రహదారి

పల్లెలకు వెళ్లాలంటే పాట్లే

ఓర్వకల్లు న్యూస్‌టుడే : ఓర్వకల్లు మండలంలోని పలు గ్రామీణ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. ఎన్.కొంతలపాడు మీదుగా ఉప్పలపాడు వరకు, ఓర్వకల్లు బస్టాండు నుంచి మర్రిచెట్టు వరకు, తిప్పాయి పల్లె నుంచి బ్రాహ్మణపల్లె వరకు, బ్రాహ్మణ పల్లె నుంచి గుమ్మితం తండా, కేతవరం నుంచి పూడిచెర్ల, లొద్దిపల్లె నుంచి బైరాపురం, బ్రాహ్మణపల్లె నుంచి శకునాల వరకు రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు గ్రామీణులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆటేదైనా వీరికి తిరుగులేదు

- ఆర్చరీ, షూటింగ్ రగ్బీలో రాణిస్తున్న గురుకులం విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తించిన పలువురు విద్యార్థులు.. ఆటల బాట పట్టారు. ఇష్టమైన క్రీడల్లో శిక్షణ తీసుకుని పోటీల్లో సత్తా చాటుతూ విజయపథంలో సాగుతున్నారు. నగర శివారులోని చిన్నటేకూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శ్రీశాంత్, సురేష్‌లు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. ఆర్చరీ, షూటింగ్, రగ్బీ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటుతూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

శ్రీశాంత్ అదుర్స్

చిన్నటేకూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీశాంత్ ఆర్చరీ, షూటింగ్, రగ్బీ క్రీడల్లో రాణిస్తున్నాడు. ఆటలపై మక్కువతో నేర్చుకున్నాడు. పట్టుదలతో సాధన చేసి నైపుణ్యం పెంపొందించుకుని పోటీల్లో ప్రతిభ చూపుతున్నాడు. ★ 2025 అక్టోబరులో నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. ★ ఈనెల 6 నుంచి 7వ తేదీ వరకు అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో రికర్వు విభాగంలో నాలుగో స్థానం సాధించాడు. ★ ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఆదర్శ విద్యా మందిరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జట్టులో ఆడుతున్నారు.

శెభాష్.. సురేశ్

చిన్నటేకూరు సమీపంలోని అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సురేశ్ రగ్బీ, ఆర్చరీలో సత్తా చాటుతున్నాడు. ఆటల పట్ల ఆసక్తితో నేర్చుకుని నిత్య సాధనతో పట్టు సాధించాడు. ★ 2023లో నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలిపాడు. ★ 2024 అక్టోబరులో పశ్చిమగోదావరి జిల్లా పెద్దవేగి గ్రామంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం అందుకున్నాడు. ★ ఈనెల 7న అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. ★ ఈనెల 23 నుంచి కర్నూలులో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ రగ్బీ పోటీల్లో మిడిల్ విభాగంలో ఆడుతున్నాడు.

కోల్స్ చర్చి నూతన కార్యవర్గం ఎన్నిక

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి నూతన పాలక వర్గానికి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.సాలొమోన్, ఆర్ఈ అనిల్‌నాథ్, కోశాధికారిగా ఛార్లెస్, యూత్ డైరెక్టర్‌గా డా.పగడాల సుచిత్ర విజయ్, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా దాసరి స్వర్ణలత రాజ్, ప్రాపర్టీ కమిటీ ఛైర్మన్‌గా డా.థామస్, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఆర్పీ కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : అనంతపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు, కండక్టర్ మధ్య జరిగిన గొడవకు సంబంధించి కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఈనెల 22న రాత్రి తన భార్య పట్ల అనుచితంగా ప్రవర్తించాడని ప్రయాణికురాలి భర్త తన కుమారుడు, అతని స్నేహితులతో కలిసి బస్సు కండక్టర్, డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. బస్సులు అద్దాలు పగులగొట్టారు. కర్నూలు నగర శివారులోని గుత్తి పెట్రోలు బంకు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన అనంతపురానికి చెందిన బస్సు కండక్టర్ మురళీకృష్ణ, డ్రైవర్ పాండు రంగస్వామి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు ప్రయాణికురాలి భర్త కిరణ్, కుమారుడు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ప్రయాణికురాలి ఫిర్యాదు మేరకు బస్సు కండక్టర్‌పై కేసు నమోదు చేశారు.

పెద్దకర్మ



అనురాగం, ఆప్యాయతలను పంచిన అమృతమూర్తి, కుటుంబ శ్రేయస్సుకు ఎంతో శ్రమించి మమ్ములను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన కార్యశీలి కీ॥శే॥ శ్రీ ఆవుల నిరంజన్ రెడ్డి గారి మరణం మాకు తీరని లోటు. మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ ఆవుల నిరంజన్ రెడ్డి గారు
జననం: 14-12-1941 మరణం: 10-11-2025
భార్య: ఎ.తులసి

కుమారులు: ఎ.రామకృష్ణా రెడ్డి, ఎ.అనిల్‌కుమార్ రెడ్డి
కోడళ్లు: అనురాధ, రాధ
మనుమడు: ఎ.అంకిత్ రెడ్డి
మనుమరాళ్లు: ఎ.కృష్ణసాహితి, ఎ.సాయి అనన్యా

లంచ్: 24-11-2025న మా స్వగృహంలో మధ్యాహ్నం 12:30 గం॥లకు ఇంటి నెం. 43/192-సి, రోడ్ నెం. 7, ఎన్.ఆర్.పేట, నందు భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. అందరూ పాల్గొనవలసిందిగా సవినయంగా కోరుచున్నాము. కర్నూలు. సెల్: 9440504250.

(c) eenadu

రైతన్నా.. మీకోసం.. సాగుకు సహకారం

● నేటి నుంచి ఇంటింటికి వ్యవసాయాధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈనెల 24 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమయ్యారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

● ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి 10 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజిస్తారు. ఒక్కో బృందం రోజుకు 30 క్లస్టర్లు (90 గృహాలు) సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో నీటి భద్రత, డిమాండ్ ఆధారంగా పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తారు. చిరుధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయాన్ని పెంచడం, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించడం, ప్రతి రైతుకూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పథకంలో యూనిక్ ఐడీ నమోదుతో ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తారు.

● ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూడటం, పాడి పరిశ్రమతో పాటు పాలు, మాంసం ఉత్పత్తి పెంపునకు చర్యలు చేపడతారు. కోళ్ల పెంపకం, మాంసం ఉత్పత్తి, శుద్ధి కేంద్రాల స్థాపనపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

జిల్లా	రైతు కుటుంబాలు	సాగు భూమి (హెక్టార్లలో..)
కర్నూలు	3,93,633	6 లక్షలు
నంద్యాల	2,33,626	4 లక్షలు

కార్యాచరణ ఇలా..

● ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు అధికారులు రైతుల గృహాలను సందర్శిస్తారు. సీఎం సందేశ లేఖ, కరపత్రం అందజేస్తారు.

● ఏపీఏఐఎంఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తారు. రైతుల నుంచి సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు.

● ఈనెల 30వ తేదీన రైతు సేవా కేంద్రాల స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

● డిసెంబరు 3వ తేదీన 2026-27 సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసేందుకు ప్రతి రైతు సేవా కేంద్రంలో కార్యశాల నిర్వహించనున్నారు.

స్టేషన్‌కు అమృత్ ఫలాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 'అమృత్ భారత్' కింద పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించింది. కర్నూలు, నంద్యాల, డోన్, మంత్రాలయం, ఆదోని స్టేషన్లను ఈ పథకం కింద ఎంపిక చేశారు. డోన్ రైల్వేస్టేషన్‌కు మొదటి విడత కింద రూ.8.64 కోట్లు మంజూరైంది. ఈ నిధులతో పార్కింగ్, నిర్మాణం, ఆర్చీల ఏర్పాటు, బుకింగ్ కౌంటర్ పనులు చేపట్టారు. స్టేషన్‌లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఆర్చి నుంచి అప్రోచ్ రోడ్డు, అక్కడి నుంచి స్టేషన్ వరకు తారు రోడ్డు వేశారు. ఇప్పటికే స్టేషన్ ప్రాంగణంలో పనులు పూర్తయ్యాయి.

డోన్ స్టేషన్ ఆవరణలో నిర్మించిన తారు రోడ్డు

రెండో విడత కింద.. : 'అమృత్ భారత్'లో భాగంగా రెండో విడత కింద డోన్ స్టేషన్‌కు సుమారు రూ.50 కోట్లు మంజూరైంది. ఈ నిధులతో ప్లాట్‌ఫామ్‌లపై లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

అవినీతి గుట్టు.. కంప్యూటరీకరణతో రట్టు

పలు సహకార సంఘాల్లో యథేచ్ఛగా అక్రమాలు

అన్నదాతల ఆర్థికాభివృద్ధికి బాటలేయాల్సిన ప్రాథమిక సహకార సంఘాలు గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు వేదికగా మారాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు రైతు ముసుగులో సొసైటీల సొమ్ము దోచుకున్నారు. అధికారులు సహకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంప్యూటరీకరణ వేగవంతం చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తైంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీనాటికి ఆడిట్ సైతం పూర్తి చేశారు. ఈ క్రమంలో పలు అక్రమాలు వెలుగుచూశాయి.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

24 వేల మంది ఏమయ్యారు?

1.14 లక్షల మంది రైతుల వివరాలతో ఈకేవైసీ చేపట్టారు. 90 వేల మంది ఈకేవైసీ పూర్తి చేశారు. 24 వేల మంది సభ్యుల ఆచూకీ కానరావడం లేదు. వారు ఎక్కడున్నారు? రుణాలు తీసుకుని డీఫాల్టర్ అయ్యారా అన్న కోణంలో డీసీసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు.

యంత్రసేవ పేరుతో ముంచారు

2021-22 నుంచి వైఎస్సార్ యంత్ర సేవ కేంద్రాలు (సీహెచ్‌సీ) పథకం కింద 1,100 రైతు సమూహాలకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు ఇచ్చేందుకు సహకార బ్యాంకు ద్వారా రూ.44 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇందులో గత నాలుగేళ్లలో సగం సంఘాలు మాత్రమే రూ.24 కోట్ల రుణ చెల్లింపులు చేశాయి. సగానికి పైగా సీహెచ్‌సీలకు సంబంధించి రైతు బృందాలు రుణ చెల్లింపులు చేయలేదు. మరోవైపు 500 రైతు సమూహాలు (సీహెచ్‌సీలు) డిఫాల్ట్ అయ్యాయి. దీంతో రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. మొత్తం సీహెచ్‌సీల నుంచి రూ.20 కోట్ల రుణాలు.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు సమూహాలను ఏర్పాటు చేయించిన వ్యవసాయ శాఖ ప్రస్తుతం రుణ బకాయిలపై నోరు మెదపడం లేదు. దీంతో సహకార బ్యాంకుకు అప్పులు గుదిబండలా మారాయి.

నిధుల స్వాహా

కొత్తపల్లి మండలం నాగంపల్లి సొసైటీ సీఈవో కోటేశ్వరరావు రైతుల నుంచి రికవరీ చేసిన రూ.40 లక్షలు స్వాహా చేశారు. డీసీసీబీ అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. రూ.10 లక్షలు రికవరీ చేశారు.

● చిప్పగిరి మండలం రామదుర్గం సొసైటీ సీఈవో ఏకంగా రూ.95 లక్షలు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసు నమోదుకు సహకార శాఖ అధికారులు సిఫార్సు చేశారు. ఆయన నుంచి రూ.25 లక్షలు రికవరీ చేశారు.

ఉపాధి మధురం

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, మాస్టర్ శిక్షకుడు

తేనెటీగల పెంపకంపై యువత ఆసక్తి చూపుతోంది. ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుండటంతో ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. ఎమ్మిగనూరులోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఎన్‌బీహెచ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. రెండు నెలల లోపే మూడో బృందానికి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో బ్యాచ్‌లో 35 మందికి శిక్షణ ఇస్తున్నారు. రాణి ఈగ, మగ ఈగలు, కూలీ ఈగల గురించి.. తేనె ఉత్పత్తిలో అవి పోషించే పాత్రపై శిక్షణ ఇస్తున్నారు. తేనెటీగల పెంపకం, సేకరణ, పెంపకానికి అనువైన రకాలు, ఉప ఉత్పత్తుల తయారీ, మార్కెట్ సదుపాయాలు వంటి వాటిపై 6 రోజుల శిక్షణ, ఆఖరి రోజు నల్లమల బీపార్క్‌లో క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తున్నారు. ఒక పెట్టెలో 50 వేల తేనెటీగలుంటే ఇందులో ఒక రాణి ఈగ, వంద వరకు మగ తేనెటీగలు, మిగిలినవి కూలీ ఈగలుంటాయి. రాణి ఈగ జీవిత కాలం 2 నుంచి 3 ఏళ్లు, మగ ఈగలు 6 నెలలు, కూలీ ఈగలు 45 నుంచి 60 రోజులు జీవిస్తాయి. ఏ పంటల్లో పెట్టెలు పెడితే ఎంత తేనె ఉత్పత్తి సాధించవచ్చు.. ఎంత కాలం నిల్వ ఉంటుంది.. తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ధ్రువపత్రం అందజేస్తామని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

ఈజీగా ప్రయాణించొచ్చు

● ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు

ప్రస్తుతం ఒకచోటు నుంచి మరో ప్రదేశానికి వెళ్లాలంటే వాహనం తప్పనిసరి. లేకుంటే సకాలంలో పనులు పూర్తికాని పరిస్థితి. వాహనాలు నడపాలంటే ఇంధనం అవసరం. కి.మీ. పెరిగేకొద్దీ ఖర్చు ఎక్కువవుతుంది. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా ఛార్జింగ్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, కార్లు, బస్సులు సైతం రోడ్లపై నడుస్తున్నాయి. విద్యుత్తు వాహనాల కొనుగోలుకు జనం సైతం ఆసక్తి చూపుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఛార్జింగ్ స్టేషన్ల కొరత వేధిస్తోంది. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇ-డ్రైవ్ పేరుతో నూతన పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

– న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో మొత్తం 42 ప్రాంతాలకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు అందాయి. ఇందులో భాగంగా మొదటి విడత కింద కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో 5 ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్తు శాఖ పరిధిలో రహదారులకు సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్లను గుర్తించి 5 నుంచి 10 సెంట్ల స్థలంలో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు శాఖ ఎంపిక చేసిన ప్రాంతాలు

	గుర్తించిన ప్రదేశాలు	తొలి విడత ఏర్పాటు
కర్నూలు	22	05
నంద్యాల	20	05

త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం

– ఆర్.ప్రదీప్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తు శాఖ

జిల్లా వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 10 ప్రాంతాల్లో.. రహదారులకు సమీపంలో ఉన్న విద్యుత్తు ఉప కేంద్రాల వద్ద ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఛార్జింగ్ స్టేషన్లను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం.

రహదారుల సమీపంలో..

● పీఎం ఇ.డ్రైవ్ పథకం కింద రహదారుల సమీపంలో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్, ఆస్పత్రులు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేయనున్నారు.

● తొలుత గ్రామస్థాయి, మండల, రాష్ట్ర, జాతీయ రహదారులను కలుపుతూ వెళ్లే ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్లు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వంద శాతం రాయితీ అందించనుంది.

విజయాలు పల్లవించె

నంద్యాల పట్టణం నూనెపల్లెకు చెందిన పల్లవి బీఎస్సీ (అగ్రికల్చర్) చదువుతోంది. ఆమెకు మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. ఈ నేపథ్యంలో రైఫిల్ షూటింగ్‌తోపాటు ఫెన్సింగ్‌పైనా దృష్టి పెట్టింది. ఆమె తండ్రి వ్యాయామ ఉపాధ్యాయుడు కావడంతో తర్ఫీదు ఇప్పించారు. అవసరమైన మెలకువలు నేర్చుకున్న పల్లవి వివిధ పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు కైవసం చేసుకోవడం విశేషం.

● గతేడాది కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే ఏడాది నవంబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించారు. అదే ఏడాది నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని చెప్పారు. దీని కోసం నిరంతరం సాధన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పాత పట్టణం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరు కావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, పురపాలక, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

కాసులదిన్నె

గాజులదిన్నె చేపల ఉత్పత్తి కేంద్రంలో సీడు సిద్ధం చేస్తున్న మత్స్య సంఘం సభ్యులు

కర్నూలు జిల్లాలో గాజులదిన్నె చేపల ఉత్పత్తి కేంద్రానికి ఎంతో పేరుంది. గత కొన్నేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతోపాటు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో మత్స్య కేంద్రంలోని చేపల కచ్చా పాండ్లలో చేపల సీడ్ తయారుచేసుకునే బాధ్యతను గాజులదిన్నె మత్స్యకార సంఘానికి జిల్లా మత్స్యశాఖ అప్పగించింది. మత్స్యకారులు.. సంఘం తరపున సొంత ఖర్చులు వెచ్చించి హెక్టారు విస్తీర్ణంలో ఉన్న పాండ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. మరోవైపు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఈ ఏడాది కొత్తగా చేపల సీడు తయారుచేసే విధానాన్ని మత్స్యకారులకు చూపారు.

90 రోజులు.. రూ.6 లక్షల ఆదాయం

గాజులదిన్నె మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో గంగపుత్రులు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి కర్ణాటక రాష్ట్రం నుంచి కోటి వరకు కట్ల, మృగాల, రోహు రకాల చేపల స్పాన్ కొనుగోలు చేశారు. 90 రోజుల్లో ఇంచి దశ వచ్చేదాకా పెంచారు. దాణా కోసం మరో రూ.50 వేలు ఖర్చు చేశారు. మత్స్య దినోత్సవం నాటికి 20 లక్షల చేపల సీడు సిద్ధం చేసుకొని జలాశయంలో వదిలారు. 20 లక్షల చేపల సీడు కొనుగోలు చేయాలంటే రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని.. కేవలం 2 లక్షలతో సీడు సిద్ధం చేశామని.. రూ.6 లక్షల వరకు ఖర్చులు మిగిలాయని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. చేప పిల్లలను జలాశయంలో రెండేళ్లపాటు పెంచితే సుమారు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశముందని చెప్పారు. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

ఆరోగ్య మార్గం

బనగానపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.20 లక్షలతో నడక మార్గం ఏర్పాటు పనులు సాగుతున్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన సొంత నిధులతో ఈ పనులు చేయిస్తున్నారు. మైదానంలో ప్రతిరోజూ వందలాది మంది నడక సాగిస్తుంటారు. నడక మార్గం లేకపోవడంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి నిధులు మంజూరు చేశారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి

మైదానంలో జరుగుతున్న పనులు

నిత్యం నడక చేసేవారు	నిర్మాణానికి వెచ్చిస్తున్న నిధులు	మొత్తం వెడల్పు	పొడవు
400 మంది	రూ. 20 లక్షలు	4 మీటర్లు	400 మీటర్లు

● నడక మార్గం ఏర్పాటుచేసేందుకు వీలుగా గుంత తవ్వి 40 ఎంఎం మెటల్ వేసి చదును చేస్తారు. అనంతరం పైభాగాన వెట్ మిక్స్ మెటల్ వేస్తారు. ఆ తర్వాత చుట్టూ మొక్కల పెంపకం చేపడతారు. విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు బిగిస్తారు.. జనం నడక సాగించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు.

రుధిర దారులు.. అరచేతిలో ప్రాణాలు

● జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి (40వ నంబరు) నిత్యం రక్తసిక్తమవుతోంది. ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రహదారి నిర్వహణ అధ్వానంగా ఉండటం.. అక్కడక్కడా లోపాలున్నా వాటిని సరిదిద్దడం లేదు. టోల్‌గేటు వసూలుపై ఉన్న శ్రద్ధ రహదారిపై భద్రతపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం జాతీయ రహదారిపై వాహనాలు ఆపకూడదు. అయినప్పటికీ ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లెమెట్ట వద్ద జరిగిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

నిర్మించి.. వదిలేశారు

శిరివెళ్ల మండలం యర్రగుంట్ల వద్ద రూ.5 కోట్లతో ఎన్‌హెచ్ఏఐ రెస్ట్ ఏరియా ఏర్పాటుచేశారు. ఇక్కడ కాంక్రీటు నిర్మాణాలు తప్ప ఎలాంటి సౌకర్యాలు లేవు. పేరాయిపల్లె మెట్ట వద్ద జరిగిన రహదారి ప్రమాదానికి ఇదీ ఓ కారణమే. ఓ ప్రయాణికుడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సు దిగడం.. వెనుక నుంచి వచ్చిన లారీ.. బస్సును ఢీకొనడంతో ఇద్దరు చనిపోయారు.

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందు భాగం

బ్లాక్ స్పాట్లు గుర్తించినా..

40వ నంబరు జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ పట్టణ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు రెండూ ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. మద్దూరు, కూలూరు, పెద్ద బోదనం, శిరివెళ్ల, యర్రగుంట్ల, మసీదుపురం వద్దనున్న కూడళ్లు సైతం బ్లాక్‌స్పాట్లుగా ఉన్నాయి. అయ్యలూరుమెట్ట కూడలి, శాంతిరామ్ కళాశాల వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. బస్సులు, లారీలు నిర్దేశిత మార్గాల్లో కాకుండా నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారులపైకి చేరడం.. రహదారిపై వాహనాలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 40వ నంబరు ఎన్‌హెచ్‌పై ఈ ఏడాది జరిగిన ఘటనలు

ప్రమాదాలు	1,123
మృతులు	489
క్షతగాత్రులు	1,256

స్వచ్ఛంగా మూలకు.. సంకల్పం గాలికి



మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం పంచాయతీ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు గాను స్వచ్ఛ భారత్‌లో భాగంగా రూ.లక్షలు వెచ్చించి ప్రత్యేక వాహనాలు కొనుగోలు చేశారు. వీటిని కొద్దిరోజుల పాటు వినియోగించారు. కొన్ని వాహనాలు చిన్నపాటి మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో అన్నింటినీ మూలన పడేశారు. ఫలితంగా తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఇకనైనా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, ఆర్ఎస్ రంగాపురం (బేతంచెర్ల)

చేతికొచ్చిన దిగుబడులు.. తుపానుతో దిగులు

తుపాను గండం పొంచి ఉందన్న వార్తలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చాలా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన దిగుబడులు తడిసిపోయాయి. ఉన్న అరకొర పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో తుపాను గండంతోపాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం పడటంతో దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు పట్టలు కప్పే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ఉపాధి సరిదిద్ది.. అర్హులకు హామీనిచ్చి

72,365 బోగస్ కార్డుల రద్దు ● కొత్తవారికి పనులు

ఉపాధిహామీ పథకంలో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బోగస్ మస్టర్ల కట్టడికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ముఖ ఆధారిత హాజరు నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బోగస్ జాబ్‌కార్డులు బయటకు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 53 మండలాల్లో 72,365 ఉపాధి కార్డులను తొలగించేందుకు డ్వామా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 4,61,317 మంది శ్రామికులు ఉండగా వీరిలో 3,64,216 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 5,58,682 మందికిగాను 4,49,830 మంది పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

అక్రమాలకు అడ్డుకట్ట

ఉపాధి పథకంలో భాగంగా చేయని పనులు చేసినట్లు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నమోదయ్యాయి. క్షేత్ర సహాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. పనికి రాకున్నా వచ్చినట్లు చూపారు. పని ప్రదేశంలో గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలులోకి తెచ్చినా దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు.

మండ్లెంలో గ్రామసభ నిర్వహిస్తున్న డ్వామా అధికారులు

గ్రామ సభలు నిర్వహించి..

అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి చేశారు. కొత్తగా ఉపాధి జాబ్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు. ఈకేవైసీ సమస్యలతో రద్దైన కార్డులను, అర్హులైన వారికి పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. దొంగ కార్డులను సైతం గుర్తించారు.

ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం వివరాలు

మొత్తం శ్రామికులు	10,19,999
క్రియాశీలకంగా ఉన్నవారు	8,14,046
నమోదు కానివారు	1,24,636
ఈకేవైసీ పూర్తైనవారు	6,89,410

క్షేత్రస్థాయిలో పర్యటించి..

కర్నూలు జిల్లాలో 31,987, నంద్యాల జిల్లాలో 40,378 కార్డులను రద్దు చేసేందుకు డ్వామా అధికారులు నిర్ణయించారు. ఈకేవైసీ చేయించుకోని వారి కార్డులు యథావిధిగా రద్దు కానున్నాయి. నంద్యాల జిల్లాలో 6,150 మంది జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,015 మందికి కార్డులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 937 మందికి అందజేశారు. దొంగ కార్డులను రద్దు చేసి కొత్తగా జాబ్ కార్డులను ఇచ్చి ఉపాధి కల్పించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోసిగి, మద్దికెర, నందవరం, కోడుమూరు, పెద్దకడబూరు, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి మండలాల్లో చాలా ఏళ్లుగా అక్రమాలు జరిగాయి. నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, చాగలమర్రి, రుద్రవరం, గోస్పాడు, వెలుగోడు, ఆత్మకూరు, నందికొట్కూరు, గడివేముల మండలాల్లో జరిగిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు వేయాలని నిర్ణయించింది. ఫలితంగా అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

పెద్దకర్మ

జననం: 01-07-1956
మరణం: 14-11-2025
కీ॥శే॥ నర్రెద్దుల వెంకటలక్ష్మీ గారు
W/o. Late నర్రెద్దుల కృష్ణారెడ్డి గారు
ప్రేమ, ఆప్యాయత, మమతానురాగాలు పంచి, మా అందరి ఉన్నతికి నిరంతరం శ్రమించి మమ్ముల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దిన మా అమ్మ కీ॥శే॥ నర్రెద్దుల వెంకటలక్ష్మీ గారి పవిత్ర ఆత్మకు పరిపూర్ణ శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో..
కుమారులు: ఎన్.శివవేణుగోపాల్ రెడ్డి, ఎన్.రామేశ్వరరెడ్డి మరియు కోడళ్లు
మనుమళ్లు: హర్షిష్ రెడ్డి, షారిష్ రెడ్డి, శౌర్య వియాన్ష్ రెడ్డి, మనుమరాళ్లు: సాన్విక రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు & బంధుమిత్రులు
గమనిక: తేది: 24-11-2025 సోమవారం మా స్వగృహం H.No: 1-142, మెయిన్ బజార్, నెరవాడ గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల (జిల్లా) నందు పెద్దకర్మ జరుగును. సెల్: 90003 94466.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
Energy Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY
MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
District Sponsor
DELHI PUBLIC SCHOOL
Under the Aegis of KJR Educational Society, Kurnool
Digital Partner TV Partner Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, మునగాలపాడు
కర్నూలు - 518004
వివరాలకు: **8008551771**

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సర్కస్ ఫీట్లు.. చోదకుల పాట్లు

కొలిమిగుండ్ల మండలంలో నాపరాళ్ల ట్రాక్టర్ల రాకపోకల్లో నిత్యం సాహసం చేయాల్సిందే. ఎక్కడైనా ఎగువన ఉన్న రహదారులపై ఉన్నచోట్ల డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో చోదకులు ధైర్యంగా, నైపుణ్యంతో ట్రాక్టరును నడపాలి. లోడు కారణంగా చోదక సమయంలో ఇంజిను పైకిలేస్తోంది. ఏమాత్రం భయపడినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. బతుకు తెరువుకోసం డ్రైవర్లకు ఇలాంటి ఫీట్లు తప్పవు. కొలిమిగుండ్ల శివారులోని జగనన్న కాలనీ సమీపంలో ఆదివారం కనిపించిదీ దృశ్యం. – న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల

అన్సర్ జ్యూవెలర్స్ బ్రాంచి ప్రారంభం

ఆభరణాల ప్రదర్శనలో మంత్రి ఫరూక్ తదితరులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో అన్సర్ జ్యూవెలర్స్ నూతనంగా ఏర్పాటు చేసిన మూడో బ్రాంచిని ఆదివారం ప్రారంభించారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో మోర్ సూపర్ మార్కెట్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన బంగారు దుకాణాన్ని మంత్రి ఎన్ఎండీ ఫరూక్, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు రాజగోపాల్‌రెడ్డి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్, జీఎం గ్రూపు అధినేతలు జీఎం మొహిద్దీన్, జీఎం మాఫీరా, మహబూబ్ జిలాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్సర్ జ్యూవెలర్స్ అధినేతలు ఎస్.అమీర్, ఎస్.అన్సర్ మాట్లాడుతూ.. సరికొత్త ఆభరణాలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కిస్నా డైమండ్ లక్కీ డిప్‌లో విజేతగా నిలిచిన అనురాధకు కారును అందజేశారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారులపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలపరాదని నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో ఆదివారం బస్సు, లారీలు ఢీకొట్టిన ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ హైవేపై పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలని సూచించారు. రోడ్డుపై ఆపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బస్సు డ్రైవర్లు రోడ్లపై ఆపితే ప్రయాణికులు అప్రమత్తమై సురక్షిత ప్రదేశాల్లో నిలిపేలా చెప్పాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ఉత్తమ విద్య అందిస్తేనే గుర్తింపు

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తేనే గుర్తింపు వస్తుందని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'ఆపుస్మా' ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల మధ్య ఏమైనా సమస్యలు ఉంటే సమష్టి కృషితో పరిష్కరించుకోవాలని సూచించారు. నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అభివృద్ధి చెందటంతో పాటు పాఠశాలలను కూడా అభివృద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో బర్డ్స్ పాఠశాల కరెస్పాండెంట్ పాల్‌రాజారావు, సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, జిలా సమన్వయకర్త దస్తగిరి, రమణారెడ్డి పాల్గొన్నారు.

భీమలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

మంత్రి ఫరూక్, ఆలయ ఛైర్మన్ పసుపులేటి నారాయణను గజమాలతో సన్మానిస్తున్న తెదేపా కార్యకర్తలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: భీమలింగేశ్వర స్వామి(మూలమఠం) ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పసుపులేటి నారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆలయ కార్యనిర్వాహక అధికారి వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..నారాయణ ఆధ్వర్యంలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నూతన ఛైర్మన్ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి ఫరూక్‌లకు కృతజ్ఞతలు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులుగా నాగఫణిశర్మ, పెద్ద తిరుమలమ్మ, సుబ్బరాయుడు, వెంకటసుబ్బమ్మ, సుజాత, బాలుడు, వెంకటలక్ష్మి, గోపాల్ ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ అర్చకుడు వెంకటరమణ శాస్త్రి ఎక్స్ అఫీషియో సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మాజీ ఛైర్మన్ పాణ్యం రామయ్య, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, పారిశ్రామికవేత్త రాజారాం, నాయకులు చెన్నంశెట్టి, శ్రీనివాసులు, కామిని మల్లికార్జున, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

లోకేశ్ సర్.. న్యాయం చేయండి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: 'గౌరవనీయులైన లోకేశ్ సర్, నా పేరు వంశిత, ఆదోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నేను మాక్ అసెంబ్లీకి సెలెక్ట్ అయ్యాను. కానీ నన్ను కాకుండా రెండో స్థానంలో వచ్చిన వారిని సెలెక్ట్ చేశారు సర్. డీఈవో ఆఫీస్‌లో అడిగితే.. పైన సెలెక్ట్ చేశారు. నేనేమీ చేయలేనన్నారు. దయచేసి నాకు న్యాయం చేయండి సర్.' అని విద్యార్థిని వంశిత నేరు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు 'ఎక్స్'లో పోస్టు చేసింది.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి విద్యార్థి ఎంపికలో వివాదం నెలకొంది. ఆళ్లగడ్డలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న మోక్షిత అనే విద్యార్థిని మాక్ అసెంబ్లీలో ఆళ్లగడ్డ ప్రతినిధిగా ఎంపిక చేస్తూ పురస్కారం కూడా అందించారు. కాగా మోక్షితను కాకుండా మూడోస్థానంలో నిలిచిన విద్యార్థిని ఎంపిక చేశారు. ఎంపికలో పారదర్శకత లోపించిందంటూ మోక్షిత బంధువులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

నిశీధిలో మృత్యుకేక

■ ఆగిన బస్సును ఢీకొట్టిన లారీ
■ ఇద్దరి దుర్మరణం.. తొమ్మిది మందికి గాయాలు

ప్రమాదానికి గురైన బస్సు

ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నిశీధిలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలకృత్యాల కోసం బస్సును ఆపగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోవగా ఇద్దరు మృతి చెందారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

ఊహించని ఘటన

● హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో రాగానే ప్రయాణికుల కాలకృత్యాలకు డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో వెనుక నుంచి పంట దిగుబడుల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వేగంతో కదిలి ముందు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి. ● బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఖాదర్‌వలి, మౌలాలీ, ఆసియాబేగం, హైదరాబాద్ నగరం ఉప్పల్‌కు చెందిన శ్రావ్యకు తీవ్రగాయాలు కావడంతో వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఒకే కంపెనీ ఉద్యోగులు

గడ్డం బద్రీనాథ్ (పాత చిత్రం)

ప్రమాదంలో వెనుక సీట్లలో కూర్చున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృత్యువాతపడ్డారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన గడ్డం బద్రినాథ్(25), విశాఖపట్నానికి చెందిన హరిత(22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. స్నేహితులు పుదుచ్చేరిలో ఉండటంతో వారి వద్దకు వెళ్లి అక్కడి నుంచి విహారయాత్రకు వెళ్లాలని హైదరాబాద్ నుంచి పయనమయ్యాడు. హరిత ముందు సీట్ రిజర్వేషన్ చేసుకోగా వెనుక వచ్చి కూర్చుంది. లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న ఇరువురు తనువు చాలించారు. ఒకే కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు స్నేహితులను ప్రమాదం బలితీసుకోవడంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది.

కారులో లభ్యమైన అన్యమత గ్రంథం

శ్రీశైలంలో అన్యమత కారు కలకలం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో అన్యమత కారు కలకలం సృష్టించింది. భక్తుల రద్దీగా ఉన్న సమయంలో శనివారం రాత్రి అన్యమత సొసైటీకి చెందిన వ్యక్తి తన కారుతో శ్రీశైలానికి వచ్చారు. వాహనంపై అన్యమత చిహ్నాలు, లోపల అన్యమత గ్రంథం ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న దేవస్థానం ముఖ్య భద్రతాధికారి శ్రీనివాసరావు శివసదన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆగి ఉన్న వాహనాన్ని గుర్తించి, సెక్యూరిటీ సిబ్బందితో స్టిక్కర్లు అతికించారు. కారును క్షేత్రం నుంచి బయటకు పంపారు. అన్యమత చిహ్నాలు కలిగిన కారు దేవస్థానం టోల్‌గేటు ద్వారా ఎలా ప్రవేశించిందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంపై విమర్శలొస్తున్నాయి.

భగవాన్ సత్యసాయిబాబా ఆదర్శప్రాయులు

సత్యసాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా ప్రజలకు ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక సంజీవనగర్‌లోని సత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో రామునాయక్, పలువురు అధికారులతో కలిసి ఆమె సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి బోధనలు ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాలకు చేరాయన్నారు. విద్య, వైద్యం, తాగునీటి సరఫరా వంటి రంగాల్లో సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న సేవలు లక్షలాది ప్రజలకు వరమమన్నారు. ఇలాంటి సేవా తత్పరత అందరిలో పెరిగి సమాజంపై బాధ్యత కలగాలన్నారు. అనంతరం ముగ్గురు మహిళలకు కుట్టు యంత్రాలు, ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు.

చిరుధాన్యాల ఆహారంపై అవగాహన సదస్సు నేడు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : చిరుధాన్యాల ఆహారం, పోషక విలువలపై సోమవారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అదితి చిరుధాన్యాల ప్రతినిధి సోమశేఖర్ తెలిపారు. పద్మశ్రీ డా.ఖాదర్‌వలి చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని వివరిస్తారని చెప్పారు. నగర, జిల్లా ప్రజలు సదస్సుకు హాజరై చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

హరిత హోటల్ పేరుతో నకిలీ వెబ్‌సైట్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలోని పర్యాటక శాఖ, హరిత హోటల్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ నడుపుతున్న వ్యవహారం ఆదివారం వెలుగులోకి వచ్చింది. కొందరు సైబర్ కేటుగాళ్లు ఆన్‌లైన్‌లో ఏపీ టూరిజం, హరితా హోటల్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ నడుపుతున్నారు. ఈ విషయం తెలియక, బెంగళూరుకు చెందిన ఒక పర్యాటకుడు సదరు నకిలీ వెబ్‌సైట్‌ను సంప్రదించి వసతి గదుల కోసం రూ.15,950 ఫోన్ పే చేశారు. ఆ వెబ్‌సైట్ ద్వారా పొందిన రసీదును తీసుకొని వసతి కోసం ఆదివారం శ్రీశైలం వచ్చారు. హరిత రిసార్ట్స్ రిసెప్షన్‌లోకి వెళ్లి రసీదు చూపించగా, అది నకిలీదని సిబ్బంది చెప్పారు. దీంతో ఆ పర్యాటకుడు సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయినట్లు తెలుసుకొని ఖంగుతిన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ విషయంపై హరిత రిసార్ట్స్ మేనేజర్ పవన్ గణేష్‌ను వివరణ కోరగా.. పర్యాటకుడు మోసపోయిన ఘటనపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నకిలీ వెబ్‌సైట్‌పై స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పర్యాటకులు ప్రభుత్వ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలన్నారు. వసతి గదులు బుకింగ్ చేసుకునేటప్పుడు రుసుములను కేవలం డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారానే స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఫోన్‌పే చెల్లింపులు ఉండవని చెప్పారు. మరోవైపు ఈ వ్యవహారాన్ని స్థానిక పర్యాటక శాఖ అధికారులు జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. తాజా ఫిర్యాదుతో కేసు నమోదు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు.

పోటీల్లో విజేతలు.. శాసనసభకు విద్యార్థులు

☛ మాక్ అసెంబ్లీలో పాల్గొననున్న 14 మంది

విద్యార్థులతో నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి

కర్నూలు విద్య, డోన్ పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల దశ నుంచే చదువుతో పాటు సమాజ సమస్యలపై పోరాడేలా చైతన్యపరిచేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాజ్యాంగ సంబంధిత అంశాలపై వివిధ దశల్లో ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ చూపిన విద్యార్థుల్లో నియోజకవర్గం నుంచి ఒక్కరిని మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 14 మంది విద్యార్థులు రాష్ట్ర శాసనసభను సందర్శించే అవకాశం దక్కించుకున్నారు. ఈనెల 26వ తేదీన మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమంలో వీరు తమ నియోజకవర్గ ఎమ్మెల్యే తరహాలో అసెంబ్లీలో తమ ప్రాంత సమస్యలపై గళం విప్పడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై మాట్లాడనున్నారు. మాక్ అసెంబ్లీతో పాటు శాసనసభలో ఎమ్మెల్యే, మంత్రుల కార్యాలయాలు, గ్రంథాలయ సందర్శన ఉంటుంది. దీనికి సంబంధించిన విద్యార్థులతో కర్నూలు, నంద్యాల విద్యాశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ కూడా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 23వ తేదీ సాయంత్ర నంద్యాల, కర్నూలు నుంచి అమరావతికి బయల్దేరనున్నారు.

నంద్యాల జిల్లా నుంచి వెళ్లే విద్యార్థుల వివరాలు

విద్యార్థి పేరు	తరగతి	పాఠశాల.. ప్రాంతం
ఎ.భరత్ కుమార్	10	ఏపీఎంఎస్, ఆళ్లగడ్డ
ఎస్.రాజశేఖర్	10	జడ్పీహెచ్ఎస్, వెంకటాపురం, ఆత్మకూరు
సుగుణ	8	అంబేడ్కర్ గురుకులం, లక్ష్మీపురం, పగిడ్యాల
ఎల్.అమృత	10	ఏపీఎంఎస్, పాణ్యం
ఎస్.మహమ్మద్ నూరుల్లా	9	మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, నంద్యాల
వర్షిత	10	జడ్పీహెచ్ఎస్ (బాలికలు), బనగానపల్లి
పి.సుసన్న	8	అంబేడ్కర్ గురుకులం, డోన్

స్థానిక సమస్యలు ప్రస్తావిస్తా - పి.సుసన్న, ఎనిమిదో తరగతి, డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, డోన్

అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ ప్రతినిధిగా పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మాక్ అసెంబ్లీలో డోన్ ప్రాంత సమస్యలు గురించి, అవసరాలు గురించి, ప్రభుత్వం అందించాల్సిన చేయూత గురించి ప్రస్తావిస్తాను. ఇప్పటి వరకు ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని ఎవరూ కల్పించలేదు. అసెంబ్లీ అంటే పాఠ్యాంశాల్లో చదవడం తప్ప ప్రత్యక్షంగా చూడలేదు. ఇంతటి అవకాశాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను.

నంద్యాలలో రెచ్చిపోయిన దొంగలు

☛ 7 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. ఆదివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి ఏమీ లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. బాధితుడు సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు. . స్థానిక తెలుగుపేటలో నివాసముండే సుబ్రహ్మణ్యం ఇంటికి తాళం వేసి మేడపైన నిద్రిస్తున్నారు. ఉదయం కిందికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలోని దుస్తులు, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలోని ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు 250 గ్రాముల వెండి వస్తువులు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే పట్టణంలోని బొల్లెద్దుల వీధిలో గుర్రమ్మ అనే వృద్ధురాలు ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లగా.. తాళం పగులగొట్టిన దుండగులు ఇంటిని శోధించి వెళ్లారు. అదే వీధిలో మరో ఇంటి తాళం పగలగొడుతుండగా స్థానికులు నిద్ర లేవడంతో దొంగలు పరారయ్యారు.

బీరువాను పగలగొట్టిన దొంగలు

EENADU Classifieds

BUSINESS SERVICES

Wanted Male Academic Principals qualification any Degree/ PG, Salary: 25000/- to 30,000/- having experience in Educational Sector will be preferable, Age limit: 30 to 45 years. Working location: Kurnool, Contact: 92487 33342.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

PERSONAL CLASSIFIEDS

MISSING

I, Shaik Abdullah S/o. Shaik Yusuf Miah, Residing at H.No.32-241, Gadda Street, Kurnool. I have lost my Original Passport No.R1860073 while Travelling from Xerox Centre, Near One Town to my above residence, Gadda Street, KNL. On 14-10-2025, Anybody found Contact: 93902 88638.

TO LET

కర్నూలు - కల్లూరు ఎస్టేట్ నందు 3200 Sft. గోడౌన్, ఆటో నగర్ నందు 800 Sft గల గోడౌన్ బాడుగకు కలదు. సంప్ర ✆ 99855 50011.

JOBS

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ (F) కావలెను. ఇంటర్‌నేషనల్ రిప్యూటెడ్ మ్యాట్రిమోనియల్ కన్సల్టెన్సీ, కర్నూలు బ్రాంచి కొరకు సంప్ర॥ 93938 23550.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల
•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

వక్తృత్వ పోటీలతో వ్యక్తిత్వ వికాసం

ఉపన్యసిస్తున్న చైతన్య పాఠశాల విద్యార్థిని

బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ తాజుద్దీన్

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొనటం వల్ల వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని చైతన్య పాఠశాల కరస్పాండెంట్ ఆత్మకూరు తాజుద్దీన్ స్పష్టం చేశారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్న చైతన్య పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కుబ్రా మహేక్, షాయిస్తా ఫలక్, ఫసిహాలకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు సాజిదా, జుబేరియా, ఫర్జానాతోపాటు సిబ్బంది ఆస్మా, న్యామతున్నిసా, అఫ్సర్ అలీ, మోమిన్ ముర్తుజా హుసేన్ పాల్గొన్నారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతిభా పాటవ పోటీలు దోహదం చేస్తాయని ప్రిన్సిపల్ రవీంద్ర అన్నారు. నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పల్లవిరెడ్డి, హర్షిణిరెడ్డి, ఉమ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు క్లస్టర్ ప్రిన్సిపల్ సునీతరెడ్డి, డీన్ వివేకానందరెడ్డి బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న నారాయణ పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నేరాలకు స్వస్తి పలకండి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు నేరాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని ఎస్పీ సునీల్ షొరాణ్ సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టానికి విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో మంచి పేరు సంపాదిస్తూ కుటుంబాల భవిష్యత్తు కోసం మారాల్సిన అవసరముందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండిపళ్లెం వితరణ

పాణ్యంగ్రామీణ: కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు వెండిపళ్లెం, నగదు కానుకగా ఇచ్చినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. నంద్యాలకు చెందిన కోమ హేమేశ్వర్ కుటుంబసభ్యులు 200 గ్రాముల వెండిపళ్లెం ఇచ్చారన్నారు. పాణ్యం మండలం భూపనపాడుకు చెందిన ఆవుల సుదర్శన్ రూ.25 వేల నగదు, హైదరాబాదుకు చెందిన భారతి రూ.15 వేలు నగదు విరాళమిచ్చినట్లు పేర్కొన్నారు.

సముదాయం.. సమస్యలతో సహవాసం

◆ అపార్ట్‌మెంట్ వాసులకు తప్పని అవస్థలు ◆ రోగాలకు నిలయాలుగా ఖాళీ స్థలాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో అపార్ట్‌మెంట్ వాసులకు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. పన్నులు చెల్లిస్తున్నా పాట్లు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో బాలాజీ కాంప్లెక్స్, ఎస్బీఐ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్నాయి.

ఎన్జీవోస్ కాలనీలో ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు

పట్టణంలో సుమారు 100 అపార్టుమెంట్లు ఉండగా.. అందులో దాదాపు 30 వేల మంది జనాభా నివాసముంటున్నారు. వాటికి వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం తీసికట్టుగా మారింది. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు నిలిచి దోమలు, విషసర్పాల సంచారం అధికంగా ఉంది. ఇక్కడ ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని పురపాలక సిబ్బంది సరిగ్గా తొలగించడం లేదని, కాల్వలను శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు, కోతుల స్వైరవిహారంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తీసికట్టుగా పారిశుద్ధ్యం

- పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ ప్రాంతంలో అపార్టుమెంట్ల పక్కన చెత్తాచెదారాన్ని పురపాలక సిబ్బంది తొలగించలేదు. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొని దోమలకు ఆవాసంగా మారింది. రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- టెక్కెలోని భరతమాత గుడి నుంచి బాలాజీ కాంప్లెక్స్‌కు వెళ్లే దారిలో ఉన్న అపార్టుమెంట్ల బయట పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని చెబుతున్నారు.
- ఎస్బీఐ, ఎన్జీవోస్ కాలనీల్లో అపార్టమెంట్లను ఆనుకుని విద్యుత్తు తీగలు వెళ్తుండడంతో అపార్టుమెంటు వాసులు భయపడుతున్నారు. ఈ కాలనీల్లో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. అపార్టుమెంట్ల పక్కన పిచ్చి మొక్కలు అధికంగా పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి.
- సలీంనగర్‌లోని అపార్టుమెంట్ల ఇదే పరిస్థితి. కాల్వలు సరిగ్గా శుభ్రం చేయడం లేదు. దీంతో ఇక్కడ దోమల బెడద అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ?: నంద్యాలలోని ఎస్బీఐ కాలనీ, మెడికేర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న వీధిలో కాల్వలను శుభ్రం చేయడం లేదు. మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. - **రాజు, చంద్రశేఖర్, స్థానికులు**

✔: సిబ్బందిని పంపి కాల్వలను శుభ్రం చేయిస్తాం. - **లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాణ్యంగ్రామీణ, న్యూస్‌టుడే: ?: కొండజూటూరు గ్రామంలో ఇంటింటికి వచ్చి చెత్త సేకరణ చేయడం లేదు. గ్రామంలోని ఖాళీ స్థలాల్లో చెత్తను పారబోస్తున్నారు. - **రమేష్, గ్రామస్థుడు**

✔: ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ**

పగిడ్యాల, న్యూస్‌టుడే: ?: నెహ్రూనగర్‌లోని కేసీ కాల్వ వంతెన సమీపంలో రహదారి పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తుండటం వల్ల అపరిశుభ్రంగా మారి దుర్వాసన వస్తోంది. - **మద్దిలేటి, స్థానికుడు**

✔: పారిశుద్ధ్య సిబ్బందితో పనులు చేయిస్తాం. - **కూరకల రాజేశ్వరి, సర్పంచి**

?: పాత ముచ్చుమర్రి బీసీ కాలనీలోని ట్యాంకు సమీపంలో వారం రోజులుగా వీధిదీపం వెలగడం లేదు. - **మనోజ్, స్థానికుడు**

✔: విద్యుత్తు సిబ్బందికి సూచించి సమస్యను పరిష్కరిస్తాం. - **వీరన్న యాదవ్, గ్రామ కార్యదర్శి**

?: తూర్పు ప్రాతకోట నుంచి ఘణాపురానికి వెళ్లే రహదారిలో స్థానికులు ఇళ్ల వ్యర్థాలను పడేస్తున్నారు. - **తరుణ్, స్థానికుడు**

✔: ఆ ప్రాంతంలో వ్యర్థాలను పడేయకుండా చాటింపు వేయిస్తాం. - **శేషమ్మ, గ్రామ సర్పంచి**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: ఇందిరానగర్‌లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. - **అనీల్, ఇందిరానగర్**

✔: 15వ ఆర్థిక సంఘం నిధులతో రహదారి నిర్మిస్తాం. - **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

?: సంగమేశ్వరం సర్కిల్‌లో కాల్వల్లో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. - **రాము, స్థానికుడు**

✔: సిబ్బందితో కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు**

భయపెడుతున్న వానరాలు

మిడుతూరులో కోతుల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గుంపులుగా చేరి వాహనదారులు రాకపోకల సమయంలో దాడి చేస్తున్నాయి. ఇళ్లలోకి సైతం వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి వానరాలను బంధించి నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మిడుతూరు

కాలువ కాదు.. రహదారే

పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లోని నేషనల్ కాలేజీ వద్ద గత నెల రోజుల నుంచి కాలువ శుభ్రం చేయక పోవడంతో మురుగు నీరంతా రోడ్డు పైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతం నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

చేతి పంపు ఒట్టిపోయింది

నంద్యాల పట్టణం మూలసాగరంలోని మహిళల మరుగుదొడ్ల వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపు మరమ్మతులకు గురైంది. గతంలో దీనిని స్థానికులు వినియోగించుకునేవారు. పాడైపోయి ఏడాది దాటినా అధికారులు పట్టించుకోలేదు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తుందని, అధికారులు చర్యలు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

వన్యప్రాణులకు హాని చేస్తే జైలు శిక్ష

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: అడవుల్లోకి అక్రమంగా ప్రవేశించి వన్యప్రాణులకు హాని కలిగించినా, వాటి మాంసం విక్రయించినా అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కన్జర్వేటర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బండిఆత్మకూరు రేంజ్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల రక్షణ బాధ్యత అటవీ అధికారులతో పాటు ప్రజలందరిపై ఉందన్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రేంజ్ పరిధిలోని జాగుల్, పంగోలిన్ బేస్ క్యాంపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో నాసిర్‌ఝా, సిబ్బంది పాల్గొన్నారు.

మహానందీశుని సన్నిధిలో జేసీ దంపతులు

మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందికి నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ దంపతులు దర్శనార్థం వచ్చారు. గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, గోపూజలు చేశారు. అలంకార మండపంలో దేవస్థానం ఏఈవో ఎర్రమల మధు సత్కరించారు. వేదపండితులు రవిశంకర అవధాని తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ పీ.రమాదేవి పాల్గొన్నారు.

జేసీ దంపతులను సన్మానిస్తున్న ఏఈవో మధు

నందికొట్కూరు: సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

బండిఆత్మకూరు: నివాళి అర్పిస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, అధికారులు

సత్యసాయి బోధనలు స్ఫూర్తిదాయకం

సత్యసాయిబాబా జయంతి వేడుకలను పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి అధికారులు నివాళి అర్పించారు. పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతోపాటు పరస్పర సహకారం, పరోపకారంతో జీవించాలని సూచించారు.

- న్యూస్‌టుడే, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, నందికొట్కూరు, మిడుతూరు, ఆత్మకూరు

మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

మెగా ఉద్యోగ మేళాను 13న

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గుంటూరులో డిసెంబరు 13వ తేదీన నిర్వహించే బ్రాహ్మణ మెగా ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఆత్మకూరు తెదేపా కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే గోడపత్రాలు విడుదల చేశారు.

గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి బ్రాహ్మణ సమాఖ్య ముందుకు రావడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవకాశం కల్పించడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అడ్వైజరీ కమిటీ సభ్యుడు రంగనాథశర్మ, సమాఖ్య ఆత్మకూరు కన్వీనర్ సుదర్శనశర్మ, ఉపాధ్యక్షుడు ఇస్కాల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కాంగ్రెస్ కేంద్ర కమిటీ జిల్లాలో పర్యటన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల నియామక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ పరిశీలకులు, కేంద్ర కమిటీ సభ్యులైన కర్ణాటక ఎమ్మెల్యే ఎన్ఏ హారిస్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కేకేసీ రాష్ట్ర ఛైర్మన్ కృష్ణారెడ్డి, బి.రవిచంద్ర జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 30 నుంచి పర్యటిస్తారని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. గత ఏడేళ్లుగా పీసీసీ అధ్యక్షుల సహకారంతో డీసీసీ అధ్యక్షునిగా పనిచేశానన్నారు. నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా డీసీసీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకొంటూ కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జిగా, పాణ్యం నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతానని ఆయన ప్రకటించారు. ఆదివారం నంద్యాల డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో పనిచేస్తున్న ఆశావహులతో పాటు ప్రతి ఒక్కరూ ఈ పదవికి అర్హులేనన్నారు. దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డోన్ ఇన్‌ఛార్జి డా.మద్దిలేటి స్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్, బాలస్వామి, పఠాన్ హబీబ్ ఖాన్, రజాక్ వలి, హుస్సేన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ హాజరై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా భాస్కర్ రెడ్డి, సుందర్‌రావు, జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేవీ శివయ్య, ఉపాధ్యక్షులుగా తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, ఖాజా హుసేన్, రాములమ్మ, పుల్లయ్య, సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, కార్యదర్శులుగా మధు, చంద్రహాస్‌రెడ్డి, దస్తగిరి, నూరుల్లా, శైల, హమీద్‌బాషాను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీకి రాష్ట్ర కమిటి సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి ఏపీటీఎఫ్ సేవలు విస్తృతం చేస్తామన్నారు.

నూతనంగా ఎన్నికైన ఏపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

దొంగ అరెస్టు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆసుపత్రి రహదారిలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి మూడు తులాల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 19వ తేదీ ఇంటి యజమాని ప్రకాష్‌కుమార్ ఇంటికి తాళం వేసి కర్నూలుకు వెళ్లారు. ఇది గమనించిన నిందితుడు బంగిమౌలాలి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరపడి.. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలను అపహరించాడని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అందులో భాగంగా నిందితుడు బంగిమౌలాలిని ఆదివారం డిగ్రీ కళాశాల వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ చెప్పారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన సున్నం మహేష్ (50) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి వివరాల మేరకు. .మహేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవారు. అయితే ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొన్నారు. గుర్తించిన కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువులపాక దగ్ధం

సీతారామాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో ఆదివారం రాత్రి గాజా వెంకటసుబ్బయ్యకు చెందిన పశువులపాక దగ్ధం అయింది. ప్రమాద సమయంలో పాకలో ఉన్న పశువులను ప్రజలు బయటకు తీసుకొచ్చారు. డ్రిప్ పైపులు మంటల్లో కాలి బూడిద అయ్యాయని, దాదాపు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న నంద్యాల అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు. విద్యుదాఘాతంతోనే మంటలు చెలరేగినట్లు ప్రజలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

నంద్యాల నేరవిభాగం, వెలుగోడు, ఆత్మకూరు న్యూస్‌టుడే: జిల్లాలోని ఏడు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నిర్బంధ తనిఖీలు చేసినట్లు ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. ఆదివారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బయటిపేట, పాణ్యం, ఆత్మకూరు, వెలుగోడు, జూపాడుబంగ్లా, రేవనూరు, ప్యాపిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమానాస్పద, నేర చరిత్ర ఉన్న ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు, 145 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలన్నారు. పోలీస్ వారి తక్షణ సహాయం కోసం 112 నంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

కేసీ కాలువలో బాలుడి గల్లంతు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని పొన్నాపురం వద్ద కేసీ కాలువలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు కాలుజారి బాలుడు(17) గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న యువకులు సమాచారాన్ని బాలుడి తల్లిదండ్రులకు చేరవేశారు. వారు గ్రామీణ పోలీసులకు సమాచారమివ్వంతో.. బాలుడి బంధువులు, పోలీసులు కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: గోర్ బంజారా సంత్ సేవాలాల్ సంస్కృతి నిర్వహణ కమిటీ నూతన కార్యవర్గాన్ని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. పట్టణంలోని ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పుల్లన్న నాయక్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణానాయక్, కోశాధికారిగా మంత్రు నాయక్, గౌరవ అధ్యక్షుడిగా హాతి నాయక్, శంకర్ నాయక్, గౌరవ సలహాదారులుగా నారాయణ నాయక్, లక్ష్మనాయక్, ఉపాధ్యక్షులుగా పటాన్ నాయక్, డా.కాంతారావు నాయక్, కేశాలు నాయక్ తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గడివేముల: నంద్యాల రహదారిలో ఆదివారం వరిగడ్డి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. గడివేముల శివారులో సహకారసంఘం సమీపంలో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తాపడింది. మోత్కూరు నుంచి వరిగడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్ నెమ్మదిగా వస్తుండడంతో డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది.

నంద్యాల రైతునగరం: బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండు చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

నంద్యాల రైతునగరం: జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించడానికి దోహదపడుతుందని నంద్యాల, డోన్ డిప్యూటీ డీఈవోలు శంకర్ ప్రసాద్, వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు-2025 నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల నుంచి మండల స్థాయి పోటీల్లో విజేతలైన విద్యార్థులు పాల్గొనగా బహుమతులు ప్రదానం చేశారు.

ఆత్మకూరు: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండు చేశారు. ఆత్మకూరు ధనుంజయ సమావేశ భవనంలో ఆదివారం రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వినతిపత్రాలు సమర్పించినా స్పందించట్లేదన్నారు.

నిధులు పోసి.. నిరుపయోగంగా వదిలేసి

◆ అక్కరకు రాని షాదీఖానా భవనం
◆ గత ప్రభుత్వంలో వసతుల్లేకుండానే ప్రారంభం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో రూ.2 కోట్ల నిధులు ఖర్చు చేసి నిర్మించిన షాదీఖానా భవనం నిరుపయోగంగా మారింది. పట్టణ జనాభాలో సగానికిపైగా ముస్లిం, మైనార్టీలు ఉన్నారు. వారు నివసించే వీధులు, వార్డులు ఇరుకైనవి కావడంతో శుభకార్యాలు, వివాహాలు నిర్వహణకు కష్టంగా మారింది. సమస్యను అధిగమించడానికి 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసి షాదీఖానా పనులు ప్రారంభించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వసతులేవీ లేకుండానే హడావుడిగా రేకులతో భవనాన్ని ప్రారంభించింది. దీంతో అది ఎందుకు పనికిరాకుండా ఉంది.

ఆత్మకూరులోని షాదీఖానా భవనం

పేదలపై ఆర్థిక భారం

షాదీఖానా భవనం అక్కరకు రాక ప్రజలు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తున్నారు. వాటిలో రోజుకు రూ.15 వేల నుండి రూ.25 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాత షాదీఖానాలో నామమాత్రంగా ఫీజులు చెల్లించి పెళ్లిళ్లు చేసేవారు. గత ప్రభుత్వ తీరుతో నిర్మించిన భవనంలో.. ఇప్పటివరకు ఒక్క వివాహం జరగకపోవటం శోచనీయం.

ఒక్కటే పరిష్కార మార్గం

గత ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు షాదీఖానా గురించి పట్టించుకోకుండా ఎన్నికలకు ఆరు నెలలు ముందు రూ.2.20 కోట్లు విడుదల చేసి పనులు చేపట్టారు. అందులో మౌలిక వసతులైన నీరు, విద్యుత్తు, వంట గదులు, వధూవరులకు ప్రత్యేక గదులు, శౌచాలయాలు నిర్మించకుండానే నాటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. దీంతో భవనం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీ కూల్చివేశారు. రహదారి కోసం చేపట్టిన డ్రైనేజీ పనులు భవన ప్రవేశ ద్వారానికి దగ్గరగా చేపట్టారు. దీని వల్ల పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం భవనాన్ని వినియోగంలోకి తేవాలంటే డిజైన్ మార్చు చేసి, మరో పక్క స్థలం కొనుగోలు చేయటం ఒక్కటే మార్గం. కూటమి ప్రభుత్వంలోనైనా పునః సమీక్షించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం మైనార్టీలు కోరుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నందికొట్కూరు వారి కోర్టులో
E.P.No: 21/2024 in O.S.No 35/2021
కాటం రెడ్డి కిశోర్ కుమార్ రెడ్డి, వయస్సు 35 సం||లు, S/o జనార్దన్ రెడ్డి, హిందువు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్, R/O H.No.28/809/B, N.G.O's కాలనీ, నంద్యాల టౌన్ మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - D.Hr
-Vs-
[illegible] H.No.87/574, [illegible] B.Camp Post, [illegible] - J.Dr
వేలం ప్రకటన
[illegible]
వేలం వాయిదా తేదీ: 19-12-2025
కె.హుస్సేన్ బాషా, [illegible]
DHr తరపు అడ్వకేట్, నంద్యాల.
Cell: 94402 51292

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ప్రసంగించి.. బహుమతులు సాధించి

పోటీలకు హాజరైన విద్యార్థులు

విజేతలతో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు పోటీలు ఉపయోగపడతాయని కరస్పాండెంట్ గురుస్వామి అన్నారు. కోవెలకుంట్లలోని సాయి చిదానంద పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో పదోతరగతి విద్యార్థులు ముజామిల్, సుహానా, సాత్విక్ నాయుడు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి కరస్పాండెంట్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శనివారం శ్రీసుధ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీల్లో జి.బి.అవినాష్ (పదో తరగతి), వి.చైతన్య (తొమ్మిదో తరగతి), కె.అఖిల్ (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ మేరీ ఛార్లెస్, ఉపాధ్యాయులు నవీద్, శేఖర్, సలాంఖాన్ బహుమతులను అందజేశారు.

పోటీలో ఉపన్యసిస్తున్న విద్యార్థి

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సేవికా సమితి విభాగ్ అధ్యక్షురాలు విశాలాక్షి తెలిపారు. ఆదివారం సరస్వతి శిశుమందిర్ విద్యా పీఠం ఆధ్వర్యంలో 'సప్తశక్తి సంఘం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా మహిళా కన్వీనర్ అపర్ణ దీపిక తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: అరటి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో దిగుబడికి సరైన ధర లేక వందలాది ఎకరాల్లో అరటి పంటను రైతులు దున్నేస్తున్నారన్నారు.

నిధులు పుష్కలం.. అభివృద్ధికి అవకాశం

ఎల్‌ఎం కాంపౌండ్ వద్ద జరుగుతున్న రహదారి పనులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలికలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆళ్లగడ్డ-కోవెలకుంట్ల రహదారి దొర్నిపాడు వరకు అధ్వానంగా ఉండేది. గోతులమయంగా ఉన్న ఈ రహదారి పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఆళ్లగడ్డ-కోవెలకుంట్ల రహదారి నిర్మాణానికి ఈ ఏడాది జూన్ 11న భూమి పూజ చేశారు. అయితే రూ.2 కోట్ల విలువైన ఈ పనుల భూమి పూజ జరిగి నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం ముందుకు సాగలేదు. ఎట్టకేలకు ఈనెల 18న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

తీరనున్న సమస్యలు

● ఆళ్లగడ్డ పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్ నుంచి సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు ఆరు నెలల కింద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే చొరవతో రూ.25 లక్షల వ్యయంతో రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

● నాయీ బ్రాహ్మణ కాలనీలో కూడా రూ.33 లక్షలతో పనుల సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి.

● వీవర్స్ కాలనీ, చింతకుంటలో రూ.20 లక్షలతో రహదారి పనులు ప్రారంభంకానున్నాయి.

● పురపాలక మంత్రి పి.నారాయణ మంజూరు చేసి రూ.70 లక్షలతో పడకండ్లలో ప్రధాన కాల్వ వేయనున్నారు. ఆళ్లగడ్డకు ప్రత్యేకంగా మంత్రి రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 20 సీసీ రోడ్లు, 13 మురుగు కాల్వలు వేయనున్నారు. రూ.25 లక్షలతో వీధి దీపాలను కొనుగోలు చేయనున్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయండి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి డోన్ నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ ఇద్రూస్ బాషా పేర్కొన్నారు. విజయవాడలో ఏపీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన మహమ్మద్ ఫారూఖ్ షుబ్లీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్రూస్ బాషా మాట్లాడుతూ మైనార్టీల హక్కుల కోసం పాటు పడాలని కోరారు.

బేతంచెర్లలో కాలనీలకు మహర్దశ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలోని పలు ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. అభివృద్ధి పనులు కింద ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి.

చేపట్టే పనులివే..

● సుందరయ్య కాలనీలో సీసీ రోడ్డు, బోరు ఏర్పాటుకు రూ.25 లక్షలు, బుగ్గానిపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆర్‌సీఎం చర్చి సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం పక్కన రోడ్డు, కాల్వల నిర్మాణానికి రూ.10 లక్షలు, డ్రైవర్ల కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.28 లక్షలు, డోన్ రోడ్డులో మద్దిలేటి ఇంటి నుంచి గూటం శీను ఇంటి వరకు రూ.6 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు.

● డోన్ రోడ్డులో ఎల్లారెడ్డి ఫ్యాక్టరీ వద్ద రూ.11 లక్షలతో సీసీ రోడ్లు, ఎద్దుల మార్కెట్ లైనులో కాల్వల నిర్మాణానికి రూ.4.50 లక్షలు, ఎద్దుల మార్కెట్ లైనులో వెనుక వీధిలో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.19 లక్షలు, చాకలిపేట నుంచి సీఎస్ఐ చర్చి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.18.6 లక్షలు మంజూరైనట్లు ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. త్వరలోనే ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916, డోన్ పట్టణం: 94408 57790, బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: గ్రామ పంచాయతీ కార్యాలయం వెనక వీధిలో సీసీ రహదారి పూర్తిగా దెబ్బతింది. **- హుసేని, స్థానికుడు.**
✔: పరిశీలించి త్వరలో మరమ్మతులు చేయిస్తాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

బనగానపల్లె (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: వర్రగుడి గ్రామంలో కాల్వలు నిండి మురుగు పారుతూ దుర్వాసన వస్తోంది. **- వెంకట్రావు, వర్రగుడి.**
✔: సమస్యను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లె.**

ఆళ్లగడ్డ (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: అహోబిలం గ్రామంలో కొత్తకోట చెంచుగూడెంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. **- ఓబులేసు, అహోబిలం.**
✔: దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తాం. **- నూర్జహాన్, ఎంపీడీవో.**

బేతంచెర్ల: ?: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కుక్కల బెడద ఎక్కువైంది. **- కాలనీవాసులు.**
✔: కుక్కల సంతానోత్పత్తి కాకుండా చర్యలు తీసుకుంటాం. **- హరిప్రసాద్, కమిషనర్.**

?: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం పక్కనే పందుల సంచారం అధికంగా ఉంది. నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. **- కాలనీవాసులు.**
✔: పందుల యజమానులకు అవగాహన కల్పిస్తాం. **- హరిప్రసాద్, కమిషనర్.**

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: అంకిరెడ్డిపల్లె గ్రామంలో గల ఆశ్రమ ప్రాంతంలో వీధి దీపాలు వెలగటంలేదు. **- మద్దిలేటి, కాలనీవాసి.**
✔: వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అంకిరెడ్డిపల్లె.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని యర్రగుంట్ల సర్వీస్ రహదారి పక్కన ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. **- పరమేశ్వర్‌రావు.**
✔: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- శివమల్లేశ్వరప్ప, ఎంపీడీవో, శిరివెళ్ల.**

ఉపకాల్వ గండి పూడ్చివేత

రుద్రవరం, న్యూస్‌టుడే: తెలుగు గంగ 23వ బ్లాకు ఉపకాల్వకు ఇటీవల గండి పడింది. ఈనెల 22వ తేదీన 'ఈనాడు'లో 'తెలుగు గంగ ఉపకాల్వకు గండి' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి తాత్కాలికంగా గండిని పూడ్చివేశారు. దీంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

వంతెనకు మరమ్మతులు

ఇంజేడు (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: కుందర వాగు దుస్థితిపై 'ఈనాడు'లో అక్టోబరు 24న 'శిథిలావస్థలో వంతెన' అన్న శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ డీఈ రెడ్డి గోవిందు స్పందించారు. వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసి ఇరువైపులా ఇనుప చువ్వలు అమర్చారు. అధికారుల చొరవపై ఇంజేడు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

యంత్రం పనిచేయక.. దాహార్తి తీరక

బనగానపల్లి మండలంలోని ఎర్రగుడి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నీటి కష్టాలు తప్పడం లేదు. బడిలో శుద్ధజల యంత్రం నిరుపయోగంగా మారడంతో చిన్నారులు గ్రామంలోని కుళాయి వద్దకు వెళ్లి నీటిని తాగుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో 40 మంది విద్యార్థులున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఎర్రగుడి (బనగానపల్లి గ్రామీణం)

ఐదు గ్రామాల దారి.. అవస్థలే మరి

డోన్ మండలంలో ధర్మవరం నుంచి కనపకుంట గ్రామానికి వెళ్లే దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు గ్రామాల ప్రజలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారిలో మలుపులు కూడా అధికంగానే ఉన్నాయి. మలుపులు, గుంతలు అధికంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్ నేరవిభాగం

రహదారే కల్లం.. ప్రమాదాలతో కల్లోలం

మొక్కజొన్న దిగుబడి ఆరబెట్టేందుకు సరైన కల్లాలు లేకపోవడంతో రైతన్నలకు అవస్థలు తప్పడం లేదు. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామం నుంచి మద్దిలేటిస్వామి ఆలయానికి వెళ్లే దారి వెంట ఇలా ఆరబెట్టుకోవడంతో ఆలయానికి వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శాశ్వత కల్లాల నిర్మాణానికి యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల)

రాకపోకల కష్టాలు తీర్చరూ..

కొండుపల్లె నుంచి సర్వాయిపల్లెకు వెళ్లే పీఆర్ రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రాకపోకలకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. సర్వాయిపల్లె నుంచి కొండుపల్లె ఉన్నత పాఠశాలకు 15 మంది విద్యార్థులు ఈ మార్గం నుంచి రావాల్సి ఉంది. రోడ్డు అధ్వానంగా మారటంతో 2 కి.మీ. నడిచి ఎస్.లింగందిన్నె చేరుకొని అక్కడి నుంచి బస్సులో కొండుపల్లె పాఠశాలకు వస్తున్నారు.
– న్యూస్‌టుడే, కొండుపల్లె (ఉయ్యాలవాడ)

భక్తిశ్రద్ధలతో ముగిసిన ఉత్సవాలు

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండపేటలో హజరత్‌వలీ, మౌలాలి ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కిస్తీ ప్రసాదాన్ని దర్గా అధ్యక్షులు అబ్దుల్‌రహిమాన్ ఇంటి నుంచి దర్గాకు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. దర్గాను పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తదితరులు సందర్శించారు. చెక్కభజన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పెద్దలు

సంక్షిప్త సమాచారం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధిగా పాల్గొనే అవకాశం గురుకుల విద్యార్థిని పి.సుసన్నకు లభించిన విషయం తెలిసిందే. ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

డోన్, న్యూస్‌టుడే: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం నిర్వహిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడులు అన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.32 లక్షలు నిధులు విడుదల చేసినట్లు మండల పీఆర్ ఏఈ వెంకటయ్య తెలిపారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: చిలకలూరు గ్రామంలో భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠను గ్రామస్థులు నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గుల్లదుర్తి గ్రామంలోని సీతారామ ఆశ్రమంలో సోమ, మంగళవారాల్లో చిన్నమ్మ 69వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

సంజామల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్ల మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన రైతు భరత్‌కుమార్‌రెడ్డి పేరుసోములలో మూడు ఎకరాల్లో ఉల్లి సాగుచేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో గిట్టుబాటు ధరలేక పొలంలోనే వదిలేశారు. దీంతో ఆదివారం స్థానికులు ఉల్లిగడ్డలను సేకరించి ఇంటికి తీసుకెళ్లారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: సంజామలలో బీసీ వసతి గృహానికి ఆదివారం రోటరీ క్లబ్ సభ్యులు వార్డెన్ మునిరాజుకు మూడు పంకాలు విరాళంగా అందజేశారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రామంలో గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హనుమంతనాయక్ హెచ్చరించారు. కలుగొట్ల గ్రామంలో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: పూజల్లో పాల్గొన్న భక్తులు

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కనకాద్రిపల్లెలో అయ్యప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. బనగానపల్లి నియోజకవర్గం తెదేపా కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, సర్పంచి శివశంకర్, తెదేపా నాయకులు వెంకటమల్లారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఆలయంలో పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహ స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరి దేవి ఆలయం, యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తుల సందడితో కనిపించాయి. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

డోన్, న్యూస్‌టుడే: కొండపేటలోని ఎల్లమాంబేశ్వరి అమ్మవారికి భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అనుపాటి శ్రీనివాస్‌గౌడ్, రంగనాథ్, రంగన్న, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని చెరువుకట్ట గంగమ్మకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని గంగమ్మ ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రత్యేక పూజలు జరిపారు.

కోవెల అభివృద్ధికి విరాళం

అర్చకులకు విరాళం అందజేస్తున్న దాతలు

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయాభివృద్ధికి దాతలు రూ.50,116 విరాళం అందజేశారు. సర్వాయిపల్లె గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులకు నగదును అందజేశారు. అర్చకులు దాతలను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన

ఆళ్లగడ్డ, దొర్నిపాడు, న్యూస్‌టుడే: పార్టీ కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యులు మైలేరి మల్లయ్య అన్నారు. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన జమ్మి చిట్టిబాబు అనే జనసేన కార్యకర్త రహదారి ప్రమాదంలో మృతి చెందారు. సభ్యత్వం తీసుకునే సమయంలో ఆయన పేరిట బీమా కట్టినట్లు మైలేరి మల్లయ్య తెలిపారు. బాధిత కుటుంబానికి ఆదివారం జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు చేతుల మీదుగా బీమా చెక్కు అమరావతిలో అందించినట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న నాగబాబు

అన్నదాతల సంక్షేమానికి ప్రాధాన్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని తెదేపా టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, తెదేపా యువ నాయకులు ఆవుల ప్రతాప్ తెలియజేశారు. పట్టణంలోని బ్రహ్మంగారి మఠం ఆలయ ఆవరణలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం గోడ పత్రాలను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పెద్దనరసింహారెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కాలనీకి చెందిన నాయకంటి సుజాత(23) అనే మహిళకు గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. నొప్పి భరించలేక ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామానికి చెందిన మాబుచాన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఐదు నెలల గర్భిణి అయిన ఆమె ఐరన్ మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల తీసుకెళ్లారు. ఇంట్లో గొడవలతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డోన్, న్యూస్‌టుడే: డోన్ ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందటంలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. ఆదివారం డోన్ ప్రభుత్వ వైద్యశాలను సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర వైద్యసేవలందించాలనే సంకల్పంతో రూ.కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మించినా వైద్యసేవలు తూతూమంత్రంగానే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో నక్కి హరి, అశోక్, షమీంబేగం, పద్మావతి, మాధవి, సులోచన పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

అమలులో పోలీసు యాక్టు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో 30 పోలీసు యాక్టు అమల్లో ఉందని డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ యాక్టు అమల్లో ఉన్నందున ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించే ముందు అనుమతులు తీసుకోవాలన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఈ నెల 26న నిర్ధారణ పరీక్షల శిబిరం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్పీ మధుబాబు తెలిపారు. 18 ఏళ్ల లోపు విద్యార్థులు సదరం సర్టిఫికెట్ కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయ ఉపకరణాలను అందించేందుకు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. గుంతకల్లులో ఇటీవల దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌లో స్థానిక లోకో పైలెట్ సురేంద్రబాబు ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, పలువురు క్రీడాకారులు సన్మానించారు. కార్యక్రమంలో క్రీడాకారులు శబరీష్, రషీద్, రామకృష్ణ, కరుణాకర్, అశోక్, సురేంద్ర, ఇర్షద్‌బాషా పాల్గొన్నారు.

సురేంద్రబాబును సన్మానిస్తున్న క్రీడాకారులు

సత్యసాయి స్ఫూర్తి.. సేవా దీప్తి

బేతంచెర్ల: సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భక్తులు

డోన్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

ఆధ్యాత్మిక వికాసమే ధ్యేయంగా, సమాజ సేవే లక్ష్యంగా భగవాన్ సత్యసాయిబాబా చేసిన సేవలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆధ్యాత్మికవేత్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సేవా సంస్థల్లో ఆదివారం సత్యసాయి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, చాగలమర్రి, డోన్, అవుకు.

బనగానపల్లి గ్రామీణం: ఎంపీడీవో కార్యాలయంలో..

దోమల హోరు.. ప్రజల బేజారు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మున్సిపాలిటీలో దోమల నివారణకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఫాగింగ్ పేరిట ఖర్చు చేసే నిధులన్నీ పొగలో కలిసిపోతున్నాయి. పురపాలక సంఘం పరిధిలో ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. దోమల ఉద్ధృతి కారణంగా ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర విషజ్వరాల బారిన పడుతున్నారు.

మొక్కుబడిగా ఫాగింగ్

మరమ్మతులకు గురైన ఫాగింగ్ యంత్రం

ఆసుపత్రులకు పరుగులు

పట్టణంలో 32 వార్డులు, 18 వేలకు పైగా గృహాలు, 80 వేలకు పైగానే జనాభా నివసిస్తోంది. రహదారుల పక్కనున్న కుండీల్లో, వాటి చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు కాల్వల్లో పూడికతో పాటు వ్యర్థాలు పేరుకుపోయి మురుగు సరిగా ప్రవహించక దుర్గంధం వస్తోందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. వ్యాధుల కారణంగా ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా..

● వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, పొడి సున్నం సరిగా చల్లడం లేదు. కాల్వల్లో సూక్ష్మజీవుల నివారణకు బైటెక్స్ స్ప్రే చేయాలి. తడి ఉన్న ప్రదేశాల్లో, గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. వాటిని అరకొరగానే చేస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగు కోసం ఏటా రూ.20 లక్షలకు పైగానే ఖర్చు చేస్తున్నా.. ఫలితం లేకుండా పోతుంది.

● శ్రీనివాసనగర్, వైఎస్ఆర్ నగర్, శ్రీరామానగర్, ప్రభాకర్‌రెడ్డి నగర్, చిగురుమానుపేట, త్రివర్ణకాలనీ, సుజాతమ్మనగర్, పాతపేట, బేతంచెర్ల సర్కిల్, చాకిరేవుమిట్ట, కొత్త ఎల్ఐసీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కాల్వల్లో మురుగు కదలక, రహదారులపైకి చేరుతూ అస్తవ్యస్తంగా మారుతుంది.

పట్టించుకోని యంత్రాంగం

ఐదేళ్ల క్రితం రెండు ఫాగింగ్ యంత్రాలు మంజూరు కాగా ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. రెండేళ్ల క్రితం నాలుగు ఫాగింగ్ యంత్రాలు తెప్పించగా ప్రస్తుతం ఒకటి మాత్రమే పని చేస్తోంది. దాన్ని కూడా వినియోగించడం లేదు. బైటెక్స్ స్ప్రే యంత్రాలు ఆరు ఉండగా రెండు పనిచేయడం లేదు.

(c) eenadu

మాయమైన టైర్లు వాహనానికి బిగింపు

టైర్లు లేనప్పుడు కారు

టైర్లు బిగించిన తర్వాత..

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, వెల్దుర్తి: మాయమైన టైర్లు ఒక్కరాత్రిలో ప్రత్యక్షమవుతాయా? అదీ పోలీసులకే సాధ్యం. అవునండీ వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో నిలిపి ఉంచిన స్కార్పియో వాహనం టైర్లు మాయమై ఒక్కరాత్రిలోనే కనిపించాయి. గుండ్లపాడు తెదేపా నేతల జంట హత్య కేసులో నిందితులు వాడిన స్కార్పియో వాహనం వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో ఐదు నెలలుగా నిలిపి ఉంచారు. పదిరోజుల కిందట ఆ కారు టైర్లను పోలీసుస్టేషన్‌లో కీలక వ్యక్తే అమ్మేసుకున్నట్లు బయటకు వచ్చింది. ఈ విషయం పత్రికల్లో రావడంతో ఆదివారం ఉదయానికే కారు టైర్లు ప్రత్యక్షమయ్యాయి. ఖరీదైన టైర్ల స్థానంలో సాధారణమైనవి తెచ్చి బిగించడం గమనార్హం. కిందిస్థాయి అధికారి తప్పుల మీద తప్పులు చేస్తున్నా ఉన్నతాధికారులకు ముడుపులు అందుతుండటంతో ఈగ వాలనీయడం లేదని పోలీసు సిబ్బంది మధ్యే చర్చ నడుస్తోంది.

సత్యసాయి సందేశాలు మార్గదర్శకం

సత్యసాయి శతజయంత్యుత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం సాయిబాబా చిత్రపటానికి ఎస్పీ కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. భగవాన్ సత్యసాయి బోధించిన ఆధ్యాత్మిక విలువలు, సేవాభావం, సమానత్వం వంటి సందేశాలు నేటితరానికి మార్గదర్శకమన్నారు.

-న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

అక్రమ నిల్వ.. ఆయువు తీసింది

పేలుడు ఘటనతో ఉలిక్కిపడ్డ పాలువాయి

రెంటచింతల, గురజాల, న్యూస్‌టుడే: బయోడీజిల్ కేంద్రంలో మంటలు చెలరేగి యువకుడు సజీవదహనమైన ఘటనతో పాలువాయి ఉలిక్కిపడింది. సంఘటనా స్థలాన్ని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, కారంపూడి సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ మేరీకనకం సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. భవనానికి విద్యుత్తు సౌకర్యాన్ని తాత్కాలికంగా తొలగించారు. గురజాల ప్రభుత్వ వైద్యులు వాసు ఘటన స్థలంలోనే కాలిపోయిన యువకుడి మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. రషీద్ ఎముకలు డీఎన్‌ఏ పరీక్ష నిమిత్తం సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలలో 20 కేంద్రాలు

ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. పక్క మిద్దెపై ఉన్న నీళ్ల ట్యాంకరుకూ మంటలు అంటుకున్నాయి. సమీపంలో నివాస గృహాలు లేకపోవటంతో పెను ప్రమాదం తగ్గింది. పెట్రోలు బంకులో అమ్మే డీజిల్ లీటరు రూ. 98.16పైసలు కాగా, బయో డీజిల్ రూ.78కే లభిస్తుంది. లీటరుకు రూ.20 తగ్గటంతో సిమెంటు ఫ్యాక్టరీ లారీలకు బయో డీజిల్ వాడుతున్నారు. దీంతో 2019లో గురజాల రెవెన్యూ పరిధిలో దాదాపు 20 బయో డీజిల్ కేంద్రాలు వెలిశాయి. జీఎస్టీ అనుమతి తీసుకుంటే బయో డీజిల్ వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉందని అప్పట్లో ఏర్పాటు చేశారు. అధికారుల, పెట్రోలు బంకు యజమానుల ఒత్తిళ్లు, బయో డీజిల్ వాడకంపై వాహన యజమానులు ఆసక్తి చూపకపోవటంతో అన్ని బయో కేంద్రాలు మూసివేశారు. ప్రమాదం జరిగిన కేంద్రం సొంత అవసరాల కోసమే కావటంతో బోర్డు ఏర్పాటు చేయలేదు.

చివరి చూపునకు నోచుకోక..

పేలుడు ఘటనలో గురజాలకు చెందిన రషీద్ (24) సజీవదహనం కావడం స్థానికంగా విషాదం నింపింది. ప్రమాదంలో మృతదేహం ఆనవాళ్లు లేకుండా కాలిపోవడం, చివరి చూపునకు నోచుకోక పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలిసి గురజాలకు చెందిన బంధువులు ఘటనా స్థలానికి వచ్చారు. శవ పంచనామా అనంతరం రషీద్ ఎముకలను గురజాలకు తెచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

అడిగినంత ఇస్తేనే అర్జీ కదిలేది!

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

➺ పెదకూరపాడు మండలం జలాలపురంలో వైకాపా హయాంలో జరిగిన రీసర్వేలో మొత్తం ముగ్గురు రైతులకు సంబంధించి 20 ఎకరాల్లో 213, 158-బీ, 149-ఏ, 150-సీ, 145-3, ఇలా మొత్తం 13 సర్వేనంబర్లలో తప్పులు దొర్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ గ్రామసభలో అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో చేయితడిపితే ఆరునెలల తర్వాత సెప్టెంబరు 10న ఆర్డీవో కార్యాలయానికి కాగితాలు వచ్చాయి. ఇక్కడ ఏవో, సెక్షన్ ఆఫీసర్ వద్దే మూలుగుతున్నాయి. ఆర్డీవో టేబుల్ వద్దకు ఇంకా వెళ్లలేదు. ఇందులో ఒక రైతుది 18 ఎకరాలు ఉండటంతో కాస్త బేరం పెంచే ఆలోచనలో ఉన్నారు సదరు సిబ్బంది. ఇక ఇక్కడి నుంచి కలెక్టరేట్‌కు రావాల్సి ఉంది

➺ పెదకూరపాడు మండలం పాటిబండ్లకు చెందిన ఓ రైతు తన పొలం సర్వే నంబరులో తప్పులు సరిచేసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు అందరికీ ఇచ్చుకుంటూ రూ.70 వేలు ఖర్చు చేశాకే పని పూర్తయిందని తన సహచర రైతుల వద్ద వాపోవడంతో లంచాల విషయం బయటకు పొక్కింది.

రీసర్వే తప్పులు రెవెన్యూ సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. రీసర్వే దరఖాస్తు వచ్చిందంటే గ్రామ సర్వేయర్ మొదలు కలెక్టర్ కార్యాలయం ఏదో వరకు పండగే. వైకాపా హయాంలో

రెవెన్యూ సిబ్బంది కాసుల డిమాండ్

రెవెన్యూ సిబ్బందే తప్పులు చేసి.. వాటిని ఇపుడు సరిచేయడానికి డబ్బులు డిమాండ్ చేయడం అన్యాయమని, అయినా గత్యంతరం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 11 నెలలైనా ఇంతవరకు తమ అర్జీ జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు చేరుకోలేదని మధ్యలో ఇంకెంతమందికి చేయి తడపాలో అని వాపోతున్నారు. కార్యకర్తలం అని చెప్పినా డబ్బులు ఇవ్వనిదే ఫైల్ కదలదని తెగేసి చెబుతున్నారని, ఇక సామాన్యుల సంగతేమిటోనని వాపోతున్నారు. సర్వే నంబర్లలో తప్పులు వల్ల భూముల్ని అమ్ముకోవాలన్నా.. బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవాలన్నా వీలుకావడం లేదంటున్నారు.

మొత్తం సదస్సులు: 31

వచ్చిన అర్జీలు: 550

పరిష్కారమైనవి 100లోపే

❖ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని తగ్గించడానికి కూటమి ప్రభుత్వం ఎన్ని చేస్తున్నా అధికారులు, సిబ్బంది భయపడటం లేదు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఓ మహిళా సర్వేయర్ ఉన్నారు. ఆమె చెప్పిందే వేదం. విలేజ్ కాల్స్ సర్వే ద్వారా తన అవినీతి బయటపడుతుందని ఆన్‌లైన్ అయితే ఆలస్యం అవుతుందని చెప్పి ఆఫ్‌లైన్ (మాన్యువల్‌)లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని పూర్తవుతుందని రైతులను మభ్యపెడుతున్నారు. సర్వే ధ్రువపత్రాలు సైతం మాన్యువల్‌గా ఇస్తూ భారీగానే వసూళ్లకు పాల్పడుతున్నారు. తనకు అడ్డు ఉన్నారని డిప్యూటీ తహసీల్దారును బదిలీ చేయించారు. సర్వేయర్, తహసీల్దార్ కలిసి మండల రెవెన్యూ కార్యాలయాన్ని రియల్‌ఎస్టేట్ ఆఫీసులా మార్చారని పెదకూరపాడు నియోజకవర్గ వాసులు విమర్శలు చేస్తున్నారు.

ఒలింపిక్స్‌లో గెలుపొందే వరకు పరుగే!

మారథాన్‌లో రాణిస్తున్న ఆర్మీ ఉద్యోగి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

పతకాలతో అంకమ్మరావు

ఆర్మీలో ఉద్యోగం. మంచి జీతం. పెళ్లయి పిల్లలు. ఏదో సాధించామని చాలామంది రిలాక్స్ అవుతుంటారు. అతను మాత్రం ఉద్యోగం వచ్చాకే పరుగు మొదలెట్టారు. రిటైర్డ్ అయ్యేలోపు ఒక్కసారైనా ఇండియా జర్సీ వేసుకుని అంతర్జాతీయస్థాయిలో పరుగుపెట్టాలని పట్టుదలతో ప్రయత్నాలు చేస్తున్నారు. అతనే శావల్యాపురం మండలం కారుమంచికి చెందిన అంకమ్మరావు. తాజాగా పుణెలో 50 కి.మీ మారథాన్‌లో బంగారుపతకం సాధించారు. చిన్నప్పుడు మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. డిగ్రీ వరకు పరుగుపోటీల్లో ఎక్కడా పాల్గొనలేదు. ఆర్మీ సెలక్షన్‌లో ఎంపిక కోసం పరుగుపెట్టారు. ఉద్యోగం సాధించాక మరోసారి హైదరాబాద్‌లో జరిగిన మారథాన్‌లో ఆర్మీ తరఫున పరుగుపెట్టి మొదటిస్థానం రావడంతో తోటి స్నేహితులు ప్రోత్సహించారు. పరుగులో ఒక్కసారైనా దేశం తరఫున అంతర్జాతీయ స్థాయిలో పరుగు పోటీల్లో వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు.

ఆర్మీలో 5, 21, 42 కిలోమీటర్ల పరుగులో పోటీపడే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. కానీ 35 ఏళ్ల పైబడిన కావడంతో మారథాన్ విభాగంలో పోటీపడుతున్నారు. ఆర్మీలో ఈ విభాగం నుంచి ఎవరూ లేరు. అందుకే సొంతంగా శిక్షణ తీసుకుంటున్నారు. 12, 24 గంటల పాటు జరిగే జాతీయస్థాయి మారథాన్ పరుగులో మొత్తంగా 23 పతకాలు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో 50 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉండే కొండల్లో 550 కిలోమీటర్లు 10 రోజుల్లో పూర్తి చేసిన 15 మందిలో ఒకరిగా నిలిచారు. ఒకపక్క రోజువారీ విధులు నిర్వహిస్తూనే సాయంత్రం రెండుగంటలు, ఆదివారం పూర్తిగా కఠోర సాధన చేస్తున్నారు. ఒలింపిక్స్ లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. గతేడాది బెంగళూరులో ఒలింపిక్స్ అర్హత 24 గంటల మారథాన్ పరుగులో త్రుటిలో తప్పిపోయారు. వచ్చే ఏడాది జరిగే దానికోసం సిద్ధమవుతున్నారు. చెల్లెలి పెళ్లి. తమ్ముడి చదువు.. ఇలా అన్ని బాధ్యతలు చూస్తూనే అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న అంకమ్మరావు నేటితరానికి స్ఫూర్తిదాయకం.

ఆర్టీసీకి 1500 కొత్త బస్సులు

వినుకొండ: ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీకి కొత్తగా మరో 1500 బస్సులు రానున్నాయని నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. వినుకొండ డిపో, బస్టాండ్‌ను ఆదివారం ఆయన సందర్శించి బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీశక్తి పథకంపై ఆయన ప్రస్తావించగా ..పథకం బాగుందని బస్సుల సంఖ్య పెంచాలని వారు కోరగా కొత్త బస్సులు రాగానే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. బస్టాండ్‌లో వసతులు మెరుగు పరుస్తున్నామని వినుకొండ బస్టాండ్‌కు రంగులు వేయించి పాత మరుగుదొడ్ల స్థానంలో కొత్తవి నిర్మించాలని డిపో మేనేజర్ నాగేశ్వరరావును ఆదేశించారు. అంతకు ముందు గ్యారేజీలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి మొక్కు నాటారు. స్త్రీశక్తి పథకంతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని చెప్పారు. పొరుగు సేవల సిబ్బందికి ఇతరులతో సమానంగా వేతనాలు ఇచ్చే అంశాన్ని బోర్డు సమావేశంలో ప్రస్తావిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మెరుగైన సేవలందిస్తున్న కార్మికులను సన్మానించారు. కార్మికుల సమస్యలపై ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

వినుకొండ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

సంతగుడిపాడుకు ఆ పేరెలా..

పూర్వం 14వ శతాబ్దంలో విజయనగర రాజు శ్రీ కృష్ణదేవరాయలు తండ్రి తన పరివారంతో ప్రస్తుత సంతగుడిపాడు వైపు వేటకు వచ్చారు. ఆ సమయంలో వారికి దాహం కావటంతో సమీపంలో నీటికుంట వద్ద మంచి నీళ్లు తాగి ఇక్కడ ఓ గుడి కట్టిస్తే బాగుంటుందన్న ఆలోచనతో ప్రస్తుత శివాలయాన్ని నిర్మించి ఆ ప్రాంతానికి గుడిపాడుగా నామకరణం చేసినట్లు చారిత్రక కథనం ఉంది. అప్పట్లో గుడిపాడులో క్రమం తప్పకుండా సంత నిర్వహించేవారు. ఈ సంత జరిగే సమయంలో వేద పండితులు వేదాలు నేర్చుకునేవారు. దీంతో కాలక్రమంలో గుడిపాడు కాస్త సంతగుడిపాడుగా పిలుస్తున్నారు.

– సంతగుడిపాడు (రొంపిచర్ల), న్యూస్‌టుడే

ప్రారంభానికి ముందే పగుళ్లు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, మార్టూరు

జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి ప్రారంభించకుండానే పగుళ్లు వచ్చాయి. మొంథా తుపానుకు పలుచోట్ల కోతకు గురై దెబ్బతింది. రోడ్డు పైభాగం కూడా దెబ్బతినడంతో మళ్లీ తారు వేసి సరిచేశారు. మార్జిన్‌లో పగుళ్లు రావడంతో తొలగించి మరమ్మతులు చేపట్టారు. ప్రారంభానికి ముందే రోడ్డు నిర్మాణంలో పలు లోపాలు బహిర్గతమయ్యాయి. వాడరేవు-చిలకలూరిపేట జాతీయరహదారిలో ఒక వంతెన, చిలకలూరిపేట వద్ద బైపాస్‌లోకి అనుసంధాన రహదారి మినహా మిగిలిన రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలకు అనుమతించారు.

వాడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఏ నిర్మాణాన్ని ఆర్‌ఆర్ ఎస్‌ఎం ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఈపీసీ విధానంలో చేపట్టింది. మొత్తం 47 కిలోమీటర్ల దూరం నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని రూ.677.88 కోట్లతో పనులు చేశారు. ఫిబ్రవరి 2024లో మొదలైన పనులు ఫిబ్రవరి 2026 నాటికి పూర్తి చేయాలనేది ఒప్పందం. ఇప్పటికే 95 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

పర్చూరు-కారంచేడు మధ్య రోడ్డు నెర్రెలిచ్చి.. (మరమ్మతులకు ముందు)

వంతెన రివిట్‌మెంట్ వద్ద..

ఇనుప రెయిలింగ్ ఇలా..

కీలక రహదారి కావడంతో.. పల్నాడు, బాపట్ల జిల్లాలను అనుసంధానం చేయడంలో కీలకమైన రహదారి కావడంతో రద్దీ ఎక్కువగానే ఉంది. అక్టోబరులో వచ్చిన మొంథా తుపాను వరదకు పర్చూరు దాటిన తర్వాత కారంచేడు వైపు పర్చూరు వాగు వద్ద రోడ్డు కోతకు గురవడంతో చీలిపోయింది. మట్టిని సక్రమంగా రోలింగ్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. గుర్తించిన గుత్తేదారు సంస్థ రోడ్డు పగుళ్లు వచ్చిన వరకు తొలగించి మరమ్మతులు చేపట్టింది. అలాగే పర్చూరు వద్ద వాగుపై నిర్మించిన వంతెనకు ఒకవైపు మట్టికట్ట వర్షానికి కొట్టుకుపోవడంతో రెయిలింగ్ పడిపోయింది. రహదారి మధ్యలో డివైడర్‌లో వేసిన మట్టిలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో మొక్కల పెరుగుదలకు అడ్డంకిగా మారింది. జాతీయ రహదారి నిర్మాణంలో పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటే కొన్నాళ్లపాటు మరమ్మతులు ఉండవు. ఇక్కడ అందుకు భిన్నంగా అనేక లోపాలు బహిర్గతం కావడం గమనార్హం.

ప్రయోగాలు ఫలవంతమయ్యేలా..!

నేటి నుంచి గురువులకు కార్యశాల

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ప్రయోగాలు ఫలవంతమై విద్యార్థులు జాతీయస్థాయిలో మెరిసేలా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను(ఏటీఎల్) ఇక నుంచి మరింత పకడ్బందీగా నిర్వహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లు ఏటీఎల్‌లను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా లక్ష్యానికి దూరంగా ఉండిపోయాయి. పాఠశాలస్థాయిలోనే సైన్సుపై విద్యార్థుల్లో మక్కువ పెంచి సృజనాత్మకంగా వారిని తీర్చిదిద్దేలా గురువులకు శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి మూడ్రోజులపాటు ఏటీఎల్‌ల ఇన్‌ఛార్జులుగా ఉన్న ఉపాధ్యాయులకు నరసరావుపేటలోని శంకరభారతిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యశాల నిర్వహించనున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2017-18, 2020-21లో ఇన్నోవేషన్ మిషన్ ద్వారా జిల్లాలో ఏటీఎల్‌లను ఏర్పాటు చేసింది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు సమీప బడుల విద్యార్థులు, చదువుకు దూరంగా ఉండి సృజనాత్మక ఆలోచనలు ఉన్నవారు సైతం ప్రయోగాలు చేసుకునేందుకు అవసరమైన సాంకేతిక పరికరాల్ని కేంద్రాలకు అందించారు.

విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న నిపుణులు, గురువులు

మూడ్రోజులపాటు శిక్షణ.. మూడ్రోజులపాటు జరిగే కార్యశాలలో ఒక్కో సైన్సు ఉపాధ్యాయుడితో ఎనిమిది నూతన ప్రాజెక్టులను రూపకల్పన చేయించనున్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులు చేసిన పలు ప్రయోగాలను యాప్‌లో ప్రతినెలా అప్‌లోడ్ చేసేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు 298 ఉన్నాయి. కేజీబీవీలు 24, ఏపీ ఆదర్శ పాఠశాలలు 14, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు 10 ఉన్నాయి. వీటికి 23 విద్యాలయాల్లో ఏటీఎల్‌లను ఏర్పాటు చేశారు. ఏడు ఏపీ ఆదర్శ పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ మూడు, ఎయిడెడ్ పాఠశాల ఒకటి, 11 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏటీఎల్‌లు నడుస్తున్నాయి. వాటికి ఇన్‌ఛార్జులుగా ఉన్న ఉపాధ్యాయులతో కార్యశాల నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి రాజశేఖర్ తెలిపారు.

39,943 కుటుంబాలు ఏమయ్యాయి!

న్యూస్‌టుడే, నరసరావుపేట

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించింది. బోగస్ జాబ్‌కార్డులతో రూ.కోట్ల రుపాయల ప్రజాధనాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జేబుల్లో వేసుకున్నారు. కొందరు డ్వామా ఉద్యోగులు అక్రమార్కులకు సహకరించారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం, ఈకేవైసీతో బోగస్ జాబ్‌కార్డులు వేలాదిగా బయటపడుతున్నాయి. జాబ్ కార్డుల రద్దుతో అర్హులకు అన్యాయం జరగకుండా చూసేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

ఈకేవైసీ చేస్తున్న డ్వామా సిబ్బంది

మృతులు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లిన కుటుంబాల జాబ్‌కార్డులు చాలా కాలంగా కొనసాగుతున్నట్లు గ్రామసభల ద్వారా గుర్తించారు. కొందరు జాబ్‌కార్డుల్లో సభ్యులుగా ఉండి ఈకేవైసీ చేయించుకోలేదని నిర్ధారించి ఆ ప్రక్రియ వేగవంతం చేశారు. ఈకేవైసీ చేయించుకోకపోవడం పునరుద్ధరణకు నోచుకోని 39,943 జాబ్‌కార్డుల్లో సింహభాగం బోగస్‌గా డ్వామా, పీఆర్ అధికారులు అనుమానిస్తున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు **3,15,553**

జాబ్‌కార్డుల్లో నమోదైన శ్రామికులు **5,35,858**

రద్దు జాబితాలో ఉన్న జాబ్‌కార్డులు : **39,943**

ఈకేవైసీ చేయించుకోని శ్రామికులు : **91,075**

❖ రద్దు జాబితాలో ఉన్న జాబ్‌కార్డుల వివరాల్ని గ్రామ సభలో చదివి వినిపించడంతోపాటు గ్రామ పంచాయతీలో మూడుచోట్ల వారి జాబితాలను ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాలేమైనా ఉంటే స్వీకరించి జాబ్‌కార్డు పునరుద్ధరించనున్నారు. అదేవిధంగా కొత్తగా జాబ్‌కార్డులు అవసరమైన వారి నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించినట్లు డ్వామా సత్తెనపల్లి ఏపీడీ నారాయణ చెప్పారు.

రద్దు జాబితాలో జాబ్‌కార్డులు అధికంగా ఉన్న మండలాలు..

మండలం	జాబ్ కార్డులు	ఈకేవైసీ లేనివారు
అచ్చంపేట	2,861	5,508
నాదెండ్ల	2,726	5,141
నకరికల్లు	2,524	5,224
రెంటచింతల	2,445	5,736
కారంపూడి	2,437	4,715
అమరావతి	2,292	4,469

సొసైటీ అక్రమాలపై నివేదికివ్వండి

గుంటూరు: కురగల్లు సొసైటీలో రైతులు దాచుకున్న సొమ్మును అక్రమార్కులు దోచేయడంపై జిల్లా సహకార శాఖ అధికారి విచారించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సహకార శాఖ కమిషనర్ కె.శ్రీలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కురగల్లు సొసైటీలో అక్రమాలపై తీసుకున్న చర్యలను వివరించాలని, అనుమానిత వ్యక్తుల ఆస్తులను షరతులతో కూడిన అటాచ్‌మెంట్‌కు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెక్కుచెదరని నిర్మాణాలు

1929లో ప్రారంభించిన ఎంపీడీవో కార్యాలయ భవనం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేటలో వందేళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నేటికీ చెక్కుచెదరని పటిష్ఠతతో ఉన్నాయి. మరమ్మతులు, కాలానుగుణ అవసరాల నిమిత్తం మార్పులు మినహా ప్రభుత్వం మరేమీ చేయాల్సిన అవసరం లేదు. ఆంగ్లేయుల హయాంలో 1894-95లో ప్రస్తుత సబ్‌కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాలు, న్యాయస్థాన భవనాలు నిర్మించారు. అప్పట్లో గుంటూరు కలెక్టరేట్ పరిధిలో ఉన్న పల్నాడు ప్రాంతంపై పర్యవేక్షణ, శిస్తు వసూళ్ల కోసం ఈ భవనాలను నిర్మించారు. నరసరావుపేట కేంద్రంగా ఇప్పటి వరకు 60 మంది సబ్ కలెక్టర్లుగా, ఆర్డీవోలుగా విధులు నిర్వహించారు. ఈ ఏడాది జులైలో ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాలకు మరమ్మతులు చేశారు. ఇదిలా ఉండగా 1929లో నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనంలో అప్పట్లో న్యాయస్థానం కార్యకలాపాలు సాగేవి. పురాతన శైలిలో నిర్మాణం చేసినా నేటికీ పటిష్ఠంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

1894-95లో నిర్మించిన ఆర్డీవో కార్యాలయ భవనం

పల్నాటి ఉత్సవాలకు తెర

లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేసిన పీఠాధిపతి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : పల్నాటి వీరుల ఆరాధనలు ఆదివారం నిర్వహించిన కలిపాడుతో ముగిశాయి. శనివారం వీర్లదేవాలయంలో కోడిపోరు తర్వాత గ్రామోత్సవానికి బయలు దేరిన కొణతాలు తెల్లవార్లు కారంపూడిలోని ప్రతి వీధిలో తిరిగి గ్రామస్థుల నీరాజనాలు అందుకున్నాయి. ఆదివారం ఉదయం నాగులేటి గంగదారి మడుగులో కొణతాలకు పవిత్రస్నానాలు చేయించిన ఆచారవంతులు చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ దేవాలయాల్లో శంఖుతీర్థాలు తీసుకున్నారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఇల్లు చేరి ఆయనతో కలిసి వీర్లదేవాలయ ప్రాంగణంలోని లంకన్న ఒరుగు బండ చేరుకున్నాయి. అప్పటికే ఆచారవంతుడు లంకన్న వేషధారుగా అక్కడ మృతి చెందినట్లు పడుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ఆచారవంతులు, మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున లంకన్న ఒరుగు బండ వద్దకు చేరుకున్నారు. అతనికి శంఖుతీర్థమిచ్చి నాగులేరు గంగదారి మడుగులో స్నానం చేయించి కొణతాలు వీర్లదేవాయం చేరాయి. సాయంత్రం కొణతాలకు స్నానం చేయించి వీరగంధం పూసి వాటిని ధరించిన ఆచారవంతులు చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ దేవాలయాల్లో శంఖుతీర్థాలు తీసుకొన్నారు. పరుగులు పెడుతూ వీర్లదేవాయ ప్రాంగణంలో పీఠాధిపతి వద్ద శంఖుతీర్థం తీసుకొని అక్కడ ఏర్పాటు చేసిన కల్లిమండపంపై వాలీ యుద్ధంలో మరణించినట్లుగా ప్రదర్శించారు. చివరలో బ్రహ్మన్న ఆయుధానికి ఇదే తరహాలో క్రతువు నిర్వహించి పల్నాడు ఉత్సవాలకు తెరదించారు. కొణతాలు వాలిన తంగెడ మండల కోసం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పోటీ పడ్డారు. దీంతో ఐదురోజులపాటు జరిగిన పల్నాడు ఉత్సవాలు ముగిశాయి.

కొణతాల ఊరేగింపు



(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005
వివరాలకు: 7799102585, 8328360034
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
Digital Partner TV Partner Organised by

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు, గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు).

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సమాజ సేవే నిజమైన ఆధ్యాత్మికత

సత్యసాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో మురళి తదితరులు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రేమ, శాంతి, సత్యం, ధర్మ మార్గం అవలంబిస్తూ సమాజసేవ చేయడమే నిజమైన ఆధ్యాత్మికత అని తెలియజేసిన మహోన్నత వ్యక్తి సత్యసాయి బాబా అని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మానవసేవే-మాధవసేవ' సిద్ధాంతంతో సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహనీయుడని కొనియాడారు. ఆయన వెంట అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, ఆర్ఐ గోపి[illegible]నాథ్ తదితరులు ఉన్నారు. ✤ స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సేవకు ప్రతి రూపం.. సత్యసాయి అన్నారు. నరసరావుపేట ఆర్డీవో మధులత మాట్లాడుతూ ఎంతో మందికి తాగు నీరు అందించారని, ఎన్నో వైద్యాలయాలు స్థాపించి పేదలకు వైద్యం అందించారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

తూకంలో తేడాలుంటే చర్యలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: తూకంలో తేడాలుంటే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీకర్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్, బస్టాండ్, పల్నాడు రోడ్డు, చిలకలూరిపేట రోడ్డు, సత్తెనపల్లి రోడ్డులోని పలు చికెన్, మటన్ దుకాణాలను ఆదివారం తనిఖీ చేశారు. తప్పుడు తూకంతో ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించి ఏడుగురిపై కేసులు నమోదు చేసి రూ.7వేలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలో కోడెల శివప్రసాదరావు స్టేడియాన్ని అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేస్తామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న 69వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే యువ ఆటగాళ్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్టేడియాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. క్రీడా అధికారులు, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

మోడరన్ పెంటాథ్లాన్ అంతర్జాతీయ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థిని

శ్రీసబిత

ముప్పాళ్ల(ఈపూరు), న్యూస్‌టుడే: ఈపూరు మండలం ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని గమిడి శ్రీసబిత మోడరన్ పెంటాథ్లాన్ ఆటలో లేజర్ రన్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చుండు వెంకటరావు తెలిపారు. కళాశాలలో బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈమె ఈ ఏడాది సెప్టెంబరు 4న బిహార్‌లో జరిగిన జాతీయస్థాయి మోడరన్ పెంటాథ్లాన్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. దీంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందని, డిసెంబరు 8నుంచి 13వరకు దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈమెను కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టరు దరువూరి శ్రావ్య, అధ్యాపకులు అభినందించారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోండి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం మీ కోసం కాల్ సెంటర్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని, దానిని వినియోగించుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో ఈనెల 24న సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి తమ అర్జీ పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చున్నారు. గతంలో ఆర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఏఎన్‌యూ వాలీబాల్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబుతో కలిసి పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, ఏఎన్‌యూ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. పోటీల అనంతరం ఏఎన్‌యూ జట్టును ఎంపిక చేస్తారన్నారు. అన్ని అనుబంధ కళాశాలల జట్లు పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత

విజేతలతో శంకరమఠం ప్రతినిధులు తదితరులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్రపంచ మానవాళికి మార్గదర్శి భగవద్గీత అని వక్తలు తెలిపారు. గీతా జయంతి పురస్కరించుకొని తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక శంకరమఠంలో ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితంలో పలు సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీత అన్నారు. భగవద్గీత పోటీల్లో 70 మందికి పైగా పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాదరావు, రాము, నాగరాజు, అమరేశ్వరరావు, శంకరమఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ దినోత్సవం

క్యాడెట్ల కుర్చీలాట

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ దినోత్సవం పురస్కరించుకుని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 108 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. పురుషుల విభాగంలో క్రికెట్, వాలీబాల్, మహిళల విభాగంలో కుర్చీలాట, తాడు లాగే పోటీలు నిర్వహించారు. క్యాడెట్లకు సామూహిక విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ సామూహిక విందుతో సహకార భావన, పరస్పర గౌరవం, ఏకత్వం పెంపొందుతాయన్నారు. ఈనెల 25న నిర్వహించే వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఏఎన్‌వో ఎం.రాజేష్‌బాబు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల బలప్రదర్శన

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పల్నాటి వీరుల తిరునాళ్లను పురస్కరించుకొని రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 4 పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. ప్రథమ స్థానాన్ని ప్రకాశం జిల్లా పొట్లపాడుకు చెందిన మేడగం హర్షవర్ధన్ రెడ్డి ఎడ్లజత సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని తెలంగాణలోని మేళ్లచెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్‌రెడ్డి ఎడ్లజత, తృతీయ స్థానాన్ని క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన కడియం మణికంఠ ఎడ్లజత సొంతం చేసుకున్నాయి.

నేటి నుంచి రైతన్నా.. మీకోసం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా రైతన్నా.. మీకోసం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతుల సమస్యలను ఇంటి వద్దనే వినడం, పంట పరిస్థితి పరిశీలించడం, రాయితీ, బీమా, మార్కెట్ సమస్యలు పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించటానికి క్షేత్రస్థాయిలో బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు తెలిపారు.

కార్యక్రమం అమలు ఇలా.. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతుల ఇళ్ల సందర్శన, నవంబరు 30 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి రైతుల వద్ద సేకరించిన సమాచారంపై సమీక్ష, డిసెంబరు 3న 2025-26 రబీ, 2026 సంవత్సరానికి ఖరీఫ్, 2026-27 రబీ సీజన్‌కు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపు నిర్వహిస్తారు.

ఏడుగురితో బృందం.. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి అన్నదాతల నుంచి వివరాలు సేకరించటానికి ఏడుగురితో బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందానికి వీఏఏ నేతృత్వం వహిస్తారు. ఆయనతో పాటు వీఆర్వో, పశుసంవర్ధశాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విద్యుతుశాఖ సిబ్బంది, ప్రగతిశీల రైతు, సాగునీటి సంఘం, సొసైటీ, మార్కెట్‌యార్డు కమిటీ సభ్యుల్లో ఒకరు సభ్యులుగా ఉంటారు. వీరు రోజుకు 90 ఇళ్లను సందర్శించాల్సి ఉంటుంది. వీరు ఇళ్ల సందర్శనకు వెళ్లిన సమయంలో రసాయన ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయ విధానం, రాయితీ పథకాలు, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించటంతో పాటు గత రెండేళ్లలో పంటల సాగులో ఎదురైన ఇబ్బందులు, లాభాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. నూతన పంటల విధానం, మార్కెటింగ్, రాయితీ పథకాలు, రైతుల ఆరోగ్యం, వాతావరణ ప్రభావాలు, సాగునీరు పరిస్థితి, శాస్త్రీయ పద్ధతుల ద్వారా దిగుబడి పెంచే సూచనలు చేస్తారు.

✤ క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకున్నామని డీఏవో జగ్గారావు తెలిపారు.

మహిళా సాధికారతే నిజమైన శక్తి

ప్రసంగిస్తున్న సినీ నటుడు అలీ

దాచేపల్లి, న్యూస్‌టుడే: ప్రతి మగాడి విజయం వెనక ఒక స్త్రీ ఉంటుందని, ఆమె పరాశక్తి అని సినీ నటుడు అలీ అన్నారు. దాచేపల్లి పట్టణంలో అల్ నూర్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పొందుగల నుంచి దాచేపల్లి సభావేదిక వరకు స్థానికులు, అభిమానులు ర్యాలీగా ఆలీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్జీ కుటుంబంలో పుట్టి పెరిగిన వాడినని, ఈ రోజు ఈస్థాయికి రావడంలో ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలే కారణమన్నారు. స్త్రీలను గౌరవించే మన సంప్రదాయం ఎంతో గొప్పదని, మహిళలకు కుట్టు శిక్షణనిస్తూ ఉచితంగా మిషన్లు అందజేస్తున్న అల్ నూర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకు భవిష్యత్తులో ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు, మత పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు పాటిస్తేనే గనుల్లో ప్రగతి

భద్రత పరికరాలు పరిశీలిస్తున్న వేణుగోపాలస్వామి, తదితరులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: క్వారీ పరిశ్రమల్లో ప్రతి కార్మికుడు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని, ఆమేరకు యాజమాన్యాలు బాధ్యత వహించాలని సౌత్ సెంట్రల్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ కె.వేణుగోపాలస్వామి అన్నారు. ఆదివారం దాచేపల్లి మండలం గామాలపాడులోని ఆంధ్ర సిమెంట్స్ (సాగర్ గ్రూప్) పరిశ్రమలో 40వ గనుల భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ బృందం స్కిట్లు అలరించాయి. అనంతరం వేణుగోపాలస్వామి మాట్లాడుతూ పరిశ్రమలు, గనుల ప్రాంతాల్లో భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు పని చేసే ప్రాంగణంలో హెల్మెట్లు, బూట్లు, కళ్లజోళ్లు, హ్యాండ్‌గ్లౌజులు వంటి రక్షణ సామగ్రి తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ నాగేశ్వర్ మాట్లాడుతూ కార్మికుల్లో అవగాహన పెరిగితే ప్రమాదాలను 90 శాతం తగ్గించవచ్చని తెలిపారు. సాగర్ గ్రూప్ ప్రెసిడెంట్ గణేష్ మాట్లాడుతూ కంపెనీ స్థాపించిన నప్పటి నుంచి భద్రతను పాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సుబ్బారావు, ఏవీపీ నరేంద్రరెడ్డి, హెచ్‌ఆర్ విభాగ జీఎం మణిప్రసాద్, మైన్స్ జీఎం నరేంద్రరెడ్డి, ఏజీఎం శంకర్ నారాయణరెడ్డి, పలు విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్నాడు వీరుల ఆరాధన ఉత్సవాల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

నరసింహం (పాత చిత్రం)

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాడు వీరుల ఆరాధన ఉత్సవాల్లో చివరి రోజు అపశ్రుతి చోటుచేసుకుంది. కల్లిపాడును పురస్కరించుకుని కొణతాలకు పవిత్రస్నానాలు చేయించేందుకు ఆదివారం రాత్రి నాగులేరు గంగధారి మడుగులో ఆచారవంతులు దిగారు. అప్పటికే వీర్ల దేవాలయానికి విద్యుత్తు సరఫరా చేస్తున్న 11కేవీ విద్యుత్తు తీగ వాగులో పడి ఉంది. దీన్ని గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురై చిలకలూరిపేట బాబుగారి తోటకు చెందిన పినపెద్ద పల్లపు జాలా నరసింహం అలియాస్ జాలయ్య (48), ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన గదిబోయిన అంకంరాజు అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. వీరిలో జాలా నరసింహం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంకంరాజుకు సీపీఆర్ చేసి మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ఆయా గ్రామాలకు చెందిన 20మంది ఆచారవంతులతో కలిసి వీరు పాల్గొంటున్నారు. మృతుడికి భార్య రమాదేవి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉత్సవాల్లో ఇలాంటి అపశ్రుతి ఇదే మొదటిసారని కారంపూడి వాసులు అంటున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

చోదకుడిని కాపాడిన అయ్యప్ప భక్తులు


ఎన్నెస్పీ కాలువ నుంచి కారును బయటకు తీస్తూ.

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి ఎన్నెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటన కొమ్మాలపాడు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండకు చెందిన కె.పవన్‌కల్యాణ్ ఒక్కరే కారులో నరసరావుపేట నుంచి ఒంగోలు బయలుదేరారు. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిలో కొమ్మాలపాడు ఎన్నెస్పీ అద్దంకి బ్రాంచి కాలువ వంతెన సమీపానికి రాగానే అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి, నిండుగా నీళ్లున్న కాలువలోకి దూసుకెళ్లింది. నీటిలో మునిగిపోతున్న కారును కాలువలో స్నానానికి వెళ్లిన అయ్యప్ప భక్తులు గమనించారు. తక్షణం స్పందించారు. కారులో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసి, ప్రాణాలు కాపాడారు. ముందు భాగం నుజ్జయిన కారును కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోకుండా ఒక అంచుకు చేర్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కారును క్రేన్ సాయంతో బయటకు తీయించారు. కారులోని వ్యక్తిని కాపాడిన అయ్యప్ప స్వామి భక్తులను స్థానికులు అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 7095718191.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE
OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

JOBS

Wanted MBA Marketing/ Business Development/ Supply chain management to work a reputed company at Guntur. Mini 2 years experience. Contact: 91333 99257.

Paparao High School K.Uppalapadu, Prakasam (Dt). Wanted High School Telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female) Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. ✆ 7019326579, 9392182210.

జై గణేష్ గ్రూప్ గుంటూరులో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (ఆడ/మగ) 34 మెంబర్స్ కావలెను. జీతం: 15000+ PF+ESI. ✆ 96525 42277.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అః 10th, వ:30-65 సం॥.7989246788.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్త్కు డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలీకాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ॥ 10-20K ✆ 83743 25002 & 88858 79076.

చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్‌వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.

మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

25న విద్యుత్తు అదాలత్, అవగాహన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండలోని కారంపూడి రోడ్డులో చంద్ర షాపింగ్ మాల్ పక్కన ఈనెల 25న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్తు అదాలత్, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ రాంబాబు తెలిపారు. కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో జరిగే అదాలత్‌కు సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మాన్యుయేల్, ఫోరం సభ్యులు, ఎస్‌ఈ విజయకుమార్, విద్యుత్తు శాఖాధికారులు పాల్గొంటారన్నారు. డివిజన్‌లోని వినియోగదారులు తమ ఫిర్యాదులను సర్వీసు నంబర్, పూర్తి చిరునామా, సెల్ నెంబర్ వంటి వివరాలతో రాత పూర్వకంగా దరఖాస్తు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్తు అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్, బిల్లుల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? ఇటీవల కురిసిన వర్షాలకు పోటెత్తిన వరద నీరు పోయేందుకు పట్టణంలో ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల వెనుక పాలపాడు రోడ్డులో కొంతమేర తవ్వారు. ఆ ప్రాంతంలో గుంత పడింది. వర్షాలు తగ్గి రోజులు గడుస్తున్నా తవ్విన ప్రాంతాన్ని పూడ్చలేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. **- శ్రీనివాసరావు** ✔ తవ్విన ప్రాంతంలో మట్టి తోలించి గుంత పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- రఫీ, డీఈ, పురపాలక సంఘం** - న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

? పట్టణంలో రెడ్డి బజారు నుంచి కృష్ణమహల్ వెళ్లే రహదారిలో వ్యర్థాలను రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందిగా మారింది. **- వెంకట్రావు** ✔ రహదారిపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- రమణారావు, పారిశుద్ధ్య అధికారి** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలోని పల్నాడు- సత్తెనపల్లి ఔటర్‌రింగ్ రోడ్డులో వల్లప్ప చెరువు సమీపంలో రోడ్డు పక్కనే చెత్త పడేస్తున్నారు. ఆ ప్రాంతం డంపింగ్‌యార్డులా తయారై దుర్వాసన వస్తోంది. **- సుబ్బారావు, పాదచారి** ✔ రోడ్డు పక్కన చెత్త, వ్యర్థాలు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. **- రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి**
– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

ఖాళీ జాగా.. వేసేద్దాం పాగా

జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ఆక్రమణలు

అరండల్‌పేట (నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆక్రమణలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ ఆక్రమణదారులు పాగా వేస్తున్నారు. ఆక్రమణలు తొలగిస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన ఉండడం లేదు. ప్రభుత్వ ఆస్తుల గోడను ఆనుకుని, రోడ్ల వెంట ఖాళీ స్థలాల్లో యథేచ్ఛగా వ్యాపారాల పేరిట పక్కా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

జిల్లా వైద్యశాల ఎదుట ఆక్రమణలు

ఎక్కడెక్కడంటే.. ప్రధానంగా పట్టణంలో బస్టాండ్ వద్ద నుంచి హర్డు కళాశాల ఎదుట, సత్తెనపల్లి రోడ్డు, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో, స్టేషన్ రోడ్డులో ఆక్రమణలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఆక్రమణల కారణంగా రోడ్లు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో అల్లాడిపోతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని ప్రాంతాల్లో కొందరు మున్సిపల్ స్థలాలు ఆక్రమించి చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇచ్చేందుకు ముందస్తు అడ్వాన్సులు తీసుకోవటంతో పాటు ఎక్కువ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాజకీయ జోక్యమే కారణం?.. స్టేషన్ రోడ్డులో ఆర్డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ రోడ్డుపైనే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విద్యుత్తు, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో రోడ్డును ఆక్రమించి దిమ్మె నిర్మించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిమ్మెను తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులకు రాజకీయ నాయకుల ఒత్తిడి రావడంతో దాన్ని తొలగించకుండా నిలిపివేశారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఎదుట గతంలో అధికారులు ఆక్రమణలు తొలగించారు. తిరిగి రెండ్రోజుల్లోనే మళ్లి ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకుల అండదండలతోనే ఆక్రమణదారులు యథేచ్ఛగా మున్సిపల్ స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

తొలగింపు నిరంతర ప్రక్రియ.. పట్టణంలో ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో గుర్తించి తొలగిస్తున్నామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సాంబయ్య తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో గతంలో ఆక్రమణలు తొలగించాం. మళ్లీ ఆక్రమించి నిర్మాణాలు చేశారు. తిరిగి వాటిని తొలగించి మరోసారి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతర ప్రక్రియలా ఆక్రమణల తొలగింపు చేపడతాం.

సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ దివ్య తేజ అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఎంఏఎం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడ్రోజుల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి దివ్యతేజ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యం ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రజని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు, చిత్రంలో ఆర్టీసీ అధికారులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆర్టీసీ సిబ్బంది, ప్రజలకు చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రముఖ ఆసుపత్రులు చొరవ చూపాలని సూచించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల విజయవంతంలో కంచర్ల శ్రీనివాసరావు కృషి మరువలేనిదన్నారు. కంటి వైద్య శస్త్ర చికిత్సల నిర్వహణ, పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడంలో శంకర కంటి ఆసుపత్రి విశేష కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎస్‌కే కరీముల్లా, ఆర్టీసీ ఆర్‌ఎం అజితకుమారి, డీఎం రాంబాబు, డాక్టర్ శ్రీనివాసరావు, మువ్వ సుబ్బారావు, ప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నూజండ్ల, న్యూస్‌టుడే: రోడ్డును ఆక్రమించి సుబాబుల్ కర్ర వేయడంతో ప్రమాదం పొంచి ఉంది. వినుకొండ-నూజండ్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో నూజండ్లకు సమీపంలో కమ్మవారిపాలెం మైనర్ వద్ద రోడ్డుపై కర్ర తోలి అలాగే ఉంచారు. రాత్రిళ్లు కర్రలు దొర్లి ఇద్దరు ద్విచక్ర వాహనచోదకులు కింద పడి గాయాలపాలయ్యారు. సమస్యను ఏఈ నవ్య దృష్టికి తీసుకెళ్లగా కర్రలు రోడ్డును ఆక్రమించి వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కష్టాలు తీరే దారేది?

చిలకలూరిపేట మండలం పసుమర్రు వద్ద కాలనీకి వెళ్లే రహదారులు బురదతో నిండాయి. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసి రోజులు గడిచినా ఇక్కడ నీరు పోయే దారిలేదని వాపోతున్నారు. ముళ్ల కంపల కారణంగా విష సర్పాలు వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులను సంప్రదించగా తమ పరిధిలోది కాదని చెప్పడం గమనార్హం. – న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

ప్రజల హృదయాల్లో సత్యసాయికి సుస్థిర స్థానం

నరసరావుపేట సెంట్రల్, చిలకలూరిపేట గ్రామీణ, చిలకలూరిపేట పట్టణం, వినుకొండ, రొంపిచర్ల, న్యూస్‌టుడే : ప్రేమతో నిండిన సామాజిక సేవతో ప్రజల హృదయాల్లో నిలిచిన ఆధ్యాత్మిక యోగి సత్యసాయి అని వక్తలు కొనియాడారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో సత్యసాయి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు బాబా చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. చిలకలూరిపేట పురపాలక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొని నివాళి అర్పించారు. పురపాలకసంఘ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నరసరావుపేటలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే చదలవాడ దంపతులు పాల్గొన్నారు. సత్యసాయి సామాజిక సేవలను గుర్తు చేసుకున్నారు. వినుకొండలో సేవా సమితి సభ్యులు ఉదయం నగర సంకీర్తన అనంతరం కొత్తపేటలోని సత్య సాయిబాబా మందిరంలో భజన, సాయంత్రం వేద పఠనం, కేక్ కోసి ఊయల ఉత్సవం నిర్వహించారు. రాత్రి ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిసినట్లు సేవా సమితి కన్వీనర్ సాయిప్రసాద్ తెలిపారు.

ఆలయ ముఖ ద్వారానికి శంకుస్థాపన

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో గుంటి ఆంజనేయ స్వామి ఆలయ ముఖద్వారానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు టెంకాయ కొట్టి అంకురార్పణ చేశారు. ఇందుకయ్యే ఖర్చును పట్టణానికి చెందిన అబ్బురాజు వెంకటరామారావు, శ్రీనివాసమూర్తి కుటుంబ సభ్యులు భరిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు తెలిపారు.

నందికుంట విఘ్నేశ్వరుడికి పూజలు

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నెల రోజులకే పగుళ్లిచ్చాయి!

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మురుగు కాలువ నిర్మాణం జరిగి నెల రోజులు కాలేదు.. రోడ్డు వేయడం ఇంకా పూర్తి కాకుండానే కాలువ గోడలు పగిలిపోయాయి. మండలంలో జాలలపాలెం పంచాయతీ పరిధి గాయత్రినగర్‌లో ఇటీవల మురుగు కాలువలు నిర్మించి ఒకేసారి మూడడుగుల ఎత్తు వరకు రోడ్డుకు మట్టి తోలారు. మట్టిలో వచ్చిన పెద్ద రాళ్లు రోడ్డుకు వేయడంతో రోడ్డు మీదుగా లారీలు ప్రయాణించిన సమయంలో వాటి బరువుకు మట్టి కిందకు కుంగి రాళ్లు పక్కకు జరిగాయి. మట్టి కుంగిన చోట కాలువ గోడలు పగిలిపోయాయి. ఇలా ఉంటే మురుగు పారే అవకాశం ఉండదు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావును అడగ్గా ఒత్తిడి వల్ల కాలువ గోడలు పగిలి ఉండవచ్చుని, వెంటనే సరిచేయిస్తామని తెలిపారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకు చెకుముకి సంబరాలు



బహుమతి పొందిన విద్యార్థులతో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు చెకుముకి సంబరాలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సంబరాల్లో భాగంగా ఆదివారం చిలకలూరిపేటలోని హీలియోస్ సాదినేని చౌదరయ్య రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి 25 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో వినుకొండ గీతం పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మాచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు డిసెంబరు 21 నుంచి 23 వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమస్థానం పొందిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసరావుపేట రెండో పట్టణ ఎస్సైగా సౌందర్ రాజన్

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట రెండో పట్టణ ఎస్సైగా సౌందర్ రాజన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న హరిబాబును రొంపిచర్ల ఇన్‌ఛార్జి ఎస్సైగా నియమించారు. సౌందర్ రాజన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే అరవిందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

సామాజిక తనిఖీలు ప్రారంభం

నేడు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై 17వ విడత సామాజిన తనిఖీలు సోమవారం నుండి ప్రారంభమవుతాయని ఏపీవో పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ముందస్తు సమావేశం నిర్వహించి గ్రామ సభల వివరాలు, చేసిన పనులు, వ్యయాలు వెల్లడించారు. మొత్తం 587 పనులకు గాను రూ.12.80 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇందులో కూలీలకు రూ.8,16,94,770 కోట్లు కాగా మెటీరియల్‌కు రూ.4,63,98,944 కోట్లు వినియోగించినట్లు వివరించారు. తొలుత గ్రామాల్లో చేసిన పనుల కొలతలు తీసి కూలీలను విచారిస్తారన్నారు. ఆయా గ్రామాల్లో తనిఖీలకు వచ్చిన వారికి సహకరించి వారు అడిగిన వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఎస్‌ఆర్పీ తులసీ నాయక్, డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

వినుకొండ రూరల్: 11 కేవీ విద్యుత్తు ఫీడర్‌కు సంబంధించిన తీగల మార్పిడి, ఆధునికీకరణ పనులు ఉన్నందున సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విఠంరాజుపల్లిలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు వినుకొండ రూరల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాదెండ్లలో రైతన్నా.. మీకోసం

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ): సంక్షేమ ఫలాలు ప్రతి రైతుకు చేరే లక్ష్యంతో 'రైతన్నా - మీకోసం' కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల తెదేపా అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 8గంటలకు నాదెండ్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారన్నారు.

సేవలతో ప్రజల మన్ననలు పొందాలి

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మక్కెన, చిత్రంలో డాక్టర్ మణికంఠ సురేష్

వినుకొండ, న్యూస్‌టుడే: చక్కని వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలో కారంపూడి రోడ్డులోని సురేష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మణికంఠ సురేష్, మృదుల తేజస్విని అభినందించారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన వారికి అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

పోలేరమ్మ గుడి నిర్మాణానికి విరాళాలు

విరాళం అందిస్తున్న భక్తులు

వినుకొండ, న్యూస్‌టుడే: పోలేరమ్మ గుడి నిర్మాణానికి పలువురు విరాళాలు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం వారు ప్రధాన నిర్వాహకులు నల్లూరి పద్మను కలిసి నగదు అందజేశారు. పెరుమాళ్ల కోటిరత్నం జ్ఞాపకార్థం ఆమె భర్త లక్ష్మణరావు, కుమారుడు మణిశంకర్ రూ.1,11,116, మాటూరి రామాంజనేయులు సతీమణి జ్ఞానప్రసూన రూ.25,116, చిన్ని ఐరామమూర్తి భార్య పైకప్పునకు సరిపడ సిమెంట్ బస్తాలు, ఇసుక ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు.

నవోదయ నమూనా పరీక్షకు స్పందన

వినుకొండ, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ నమూనా పరీక్షకు ఆదివారం 200 మంది బాలబాలికలు హాజరయ్యారని గీతమ్స్ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. పరీక్ష పత్రాలను మండల విద్యాశాఖాధికారి జఫ్రుల్లా విడుదల చేశారు. విద్యార్థులు ఎన్. హర్షిణి, ఎం. గ్రీష్మంత్, పి. వెంకటసాయి ప్రతిభ చాటి వరుసగా రూ.2వేలు, రూ.1500, రూ.1000 నగదు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో రవీంద్ర సుభాని, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రగతిపథం

యడ్లపాడు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు గుంతలతో నిండాయని, కూటమి ప్రభుత్వ పాలనలో ప్రగతి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడులో జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం కూడలి వరకు రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు విస్తరణ, కల్వర్టులు, మురుగు కాలువల నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం-2 భవనం ప్రారంభించారు. పీబీసీ కాల్వ నుంచి మైదవోలులో మంచినీటి చెరువుకు రూ.15 లక్షల నిధులతో నిర్మించిన గ్రావిటీ పైప్‌లైన్ నిర్మాణం ప్రారంభించారు. అనంతరం లింగారావుపాలెంలో సీఆర్‌డీఏ నిధులతో రూ.2.23 కోట్లతో నిర్మించనున్న యడ్లపాడు-లింగారావుపాలెం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కామినేని సాయిబాబు, పోపూరి వెంకయ్య, రాఘవయ్య, వెంకటరత్తయ్య, పారా హరిబాబు, జరుగుల అంజేశ్వరరావు, జనసేన నేత తోట రాజారమేష్, భాజపా నేతలు పాల్గొన్నారు.

భాజపా అభ్యున్నతికి కృషి చేయాలి

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని భాజాపా పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశికుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నరసరావుపేట వన్‌టౌన్ అధ్యక్షుడు గుండా రాజేష్, మండల అధ్యక్షుడు పొందుగల వెంకటేశ్వరరావుకు నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సీనియర్ నాయకులు వల్లెపు కృపారావు, హనుమంతరావు, కిరణ్, ఆదిత్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

నూజండ్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు సమాజానికి మార్గ నిర్దేశకుడని ఎంఈవో రవిచంద్ర అన్నారు. నూజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు పానకాలరెడ్డిని ఘనంగా సన్మానించారు. ములకలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, శ్రీనివాసరావు, రామస్వామి, ఇసాక్, సుదర్శనబాబు తదితరులున్నారు.

ఏటీఎం విధానం అవలంబించాలి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రైతులు నిరంతరం కూరగాయలు పండించేందుకు ఏటీఎం విధానాన్ని అవలంబించాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి శివలక్ష్మి తెలిపారు. ఏనుగుపాలెంలో తన 20 సెంట్ల భూమిలో 18 రకాల కూరగాయలు విత్తనాలు నాటి వాటిని పండించే విధానాన్ని రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో చీడ, పీడల నివారణకు రసాయన పురుగు మందులు వినియోగించకుండా కషాయాన్ని వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

అపీ ఇవీ

26న నిరసన ర్యాలీ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: కార్మిక, కర్షకుల ఆధ్వర్యంలో ఈనెల 26న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ర్యాలీని స్థానికంగా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. చిత్రాలయ సెంటర్‌లో కార్మికులతో ఆదివారం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ర్యాలీ చేపడుతున్నామన్నారు. బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రంగయ్య, శ్రీను, నాగేశ్వరరావు, అంజిరెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చిలకలూరిపేట - కోటప్పకొండ మార్గంలో రోడ్డు చాలా చోట్ల దెబ్బతింది. దీనిపై గత నెల 25న 'వర్షాలకు దెబ్బతిన్న రహదారులు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు పురుషోత్తమపట్నం నుంచి యడవల్లి వరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. గుంతలు పూడ్చడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వెలిబుచ్చారు.

శుద్ధ జలం.. సురక్షితమేనా?

ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు

నూజండ్ల, న్యూస్‌టుడే

ప్రతి పల్లెకూ సరఫరా సాగుతోందిలా..

వినుకొండ నియోజకవర్గంలో నీటి శుద్ధి కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయిదు మండలాల పరిధిలో ఏడాది పొడవునా తాగునీటి సమస్య ఉండడం నీటి వ్యాపారులకు వరంగా మారింది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు కూడా కావడంతో గత్యంతరం లేక ప్రజలు ఈ నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. 200కు పైగా నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. వీటిలో కొన్ని మాత్రమే స్థానికంగా పంచాయతీల అనుమతితో ఏర్పాటు చేశారు.

మొక్కుబడి తనిఖీలు.. ప్రైవేటు శుద్ధ జల కేంద్రాల్లో తగిన ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆయా కేంద్రాల్లో తగిన ప్రామాణికాలు పాటించేలా చూడాల్సిన అధికారులు ఏడాదికి ఒకసారి కూడా తనిఖీలు చేయకపోవడంతో చాలా మంది నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల నూజండ్ల మండలంలో పలు గ్రామాల్లో డబ్బా నీరు తాగిన చిన్నారులకు నోటి పూత, అజీర్తి, ఎముకల్లో సాంద్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఆరోగ్య సమస్యలు ఇలా.. నీటి శుద్ధి విషయంలో తగిన ప్రమాణాలు పాటించకపోతే ఆరోగ్య సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లీటర్ నీటిలో నైట్రేట్లు 45 మి.గ్రా కంటే ఎక్కువగా ఉంటే బ్లూబేబీస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. 0.8 మి.గ్రా తక్కువ కాకుండా 1.2 మి.గ్రా మించకుండా ఫ్లోరైడ్ శాతం ఉండాలి. తక్కువ ఉంటే దంత సంబంధ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువైతే ఎముకలు బలహీనపడే ప్రమాదం ఉంది. తగిన శాతంలో అయోడిన్ లేకపోతే గౌట్ సమస్య తలెత్తుతుంది. క్లోరైడ్ ప్రమాణాలకు మించి ఉంటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపి అల్సర్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇనుప ధాతువు ఎక్కువైతే నీటి రుచి తగ్గుతుంది.

తాగునీరే కారణం..

తాగు నీటి వల్ల ఎక్కువ మంది వ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వస్తున్నారు. ఫ్లోరోసిస్, అల్సర్, కాళ్లు, కీళ్ల నొప్పుల సమస్యలతో ఎక్కువ మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు పూర్తిస్థాయిలో శుద్ధి కాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. **- వహీదా రెహమాన్, వైద్యాధికారి**

అనుమతి లేనివే ఎక్కువ..

నీటి శుద్ధి కేంద్రాల్లో గుర్తింపు లేనివే అధికం. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నాం. పంచాయతీల వారీగా నీటి శుద్ధి కేంద్రాల వివరాలు సేకరించి వాటి పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **- సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

పరీక్షలు చేయించడం లేదు.. నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ఏటా నీటిని పరీక్షించి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంది. వీటి ఏర్పాటుకు అన్ని శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి. అయితే దాదాపు ఏ కేంద్రానికి అనుమతులు లేవు. పంచాయతీ అనుమతి ఉందని కొందరు చెబుతున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందిస్తాం. నీటి నమూనాలను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపి నాణ్యతను పరిశీలించి, ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. **- ఆకాష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

కడుపునొప్పితో మహిళ మృతి

సరైన వైద్యం అందలేదని బంధువుల ఆందోళన

లక్ష్మి (పాత చిత్రం)

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పొట్లపాడుకు చెందిన యాదగిరి లక్ష్మి (20) కడుపునొప్పితో బాధపడుతుండటంతో వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో శనివారం చేర్చారు. అక్కడి వైద్యులు చికిత్స అందించగా ఆమె కోలుకోవడంతో ఇంటికి పంపారు. తిరిగి రాత్రి 9 గంటల సమయంలో మళ్లీ కడుపునొప్పి రావడంతో వినుకొండకు తీసుకొస్తుండగా వాంతులై స్పృహ కోల్పోయింది. వైద్యశాలలో చికిత్స అందించినా ఫలితం లేదని అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో సరైన వైద్యం అందక మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె భర్త యోగయ్య, బంధువులు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వేలూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని వేలూరు గ్రామంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బొంతా నాగయ్య (41)కు మూర్ఛవ్యాధి ఉంది. ఈనెల 19న గ్రామంలో రోడ్డుపై నడుస్తూ పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. అతనికి భార్య కోటమ్మ, ఇంటర్ చదివే కుమారుడు, పదో తరగతి చదివే కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కూరగాయలు తెచ్చేందుకు వెళ్లి..

తాతపూడి(చిలకలూరిపేట గ్రామీణ): మండలంలో తాతపూడి గ్రామానికి చెందిన సోమేపల్లి శ్రీనివాసరావు (60) బాపట్ల జిల్లా మార్టూరులో కూరగాయలు తెచ్చుకునేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం వెళ్లాడు. కూరగాయలు కొనుగోలు చేసి కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి సీపీఆర్ చేసినా ఫలితం లేదు. పోలీసులు అతని వివరాలు సేకరించి స్వగ్రామానికి మృతదేహం తరలించే ఏర్పాటు చేశారు.

8 ఆటోల్లో బ్యాటరీల చోరీ

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో మూడు గ్రామాల్లో రాత్రిళ్లు ఇళ్ల ముందు నిలిపి ఉంచిన 8 ఆటోల్లో బ్యాటరీలు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని యడ్లపాడులో ఆరు ఆటోలు, జగ్గాపురం, బోయపాలెం గ్రామాల్లో ఒక్కో ఆటో నుంచి శుక్రవారం రాత్రి దుండగులు బ్యాటరీలు అపహరించారు. మొత్తం రూ.60 వేల విలువైన బ్యాటరీలు పోయినట్లు బాధితులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

(c) eenadu

సత్తెనపల్లి
•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

అమరలింగేశ్వరుని సేవలో న్యాయమూర్తులు

పూజలో పాల్గొన్న జడ్జి ప్రియదర్శిని దంపతులు

గురజాల, దుర్గి, న్యూస్‌టుడే: వైద అమరలింగేశ్వరస్వామి ఆలయంలో జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని దంపతులు, సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. *అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి దేవాలయాన్ని మాచర్ల ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్, అదనపు సివిల్ జడ్జి పి.ప్రశాంతిలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.ఆదిశేషనాయుడు, ఆలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

పిడుగురాళ్ల, అచ్చంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగులగుడిలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై ఏర్పాటు చేసి ఊరేగించారు. భక్తులు కాళ్లతో స్వామివారి ఉత్సవ విగ్రహాల వెనక ఊరేగింపులో పాల్గొన్నారు. ★ స్థానిక షిర్డీసాయిబాబా దేవాలయం ఆవరణ, చిటికలేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గతంలో ధ్వజస్తంభం పిడుగుపాటుకు గురై పడిపోవడంతో ఆ స్థానంలో 26 అడుగుల ఎత్తుగల ధ్వజస్తంభాన్ని దాత ముప్పా రమేష్ సమకూర్చారు. రాజు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గ్రామంలో ప్రధానవీధిలో వీధిలైట్లు వెలగడంలేదు. **- రాజారావు, శివలింగాపురం** ✔ వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయిస్తాం. **- చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, వెల్దుర్తి

? పట్టణంలోని తాలుకా సెంటర్‌లో శ్రీనివాస థియేటర్ సమీపంలోని సామాజిక మరుగుదొడ్ల సముదాయం వద్ద రోడ్డుపైనే చెత్త, వ్యర్థాలు ఉంటున్నాయి. వాటిని తొలగించకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు, తాలుకా సెంటర్.**
✔ చెత్త, వ్యర్థాలను తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మారుస్తాం. వ్యాపారులు రోడ్డుపై చెత్త పడేస్తే జరిమానాలు విధిస్తాం. **- విజయసారథి, శానిటరి ఇన్‌స్పెక్టర్**
– న్యూస్‌టుడే, సత్తెనపల్లి

పల్లెటూరి పిల్లలు.. క్రీడల్లో పిడుగులు..!

కబడ్డీ, స్కేటింగ్‌లో రాణిస్తున్న విద్యార్థులు

జానపాడు, పిడుగురాళ్ల, నందిగామ, వెల్దుర్తి: గ్రామీణ ప్రాంత పిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. మూడేళ్ల నుంచి సాధన చేస్తూ మండల, జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కర్నూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒకరు పాల్గొన్నారు. మరొకరు తిరుపతిలో జరుగనున్న పోటీలకు సన్నద్ధమవుతున్నారు. జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. ఆ చిచ్చర పిడుగులే పుష్పలత, అక్షయ్ ప్రణీత్, తేజ్‌వర్షిత్.

జాతీయస్థాయిలో ఆడాలని..

మూడేళ్లుగా కబడ్డీ, ఖోఖో ఆడుతున్నా. గత ఏడాది పాఠశాల, మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాను. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండల, జిల్లాస్థాయి పోటీల్లో రాణించటంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కూతకు వెళ్లి పాయింట్ తెచ్చే రైడర్‌గా పేరు వచ్చింది. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ఆడాలన్నదే లక్ష్యం. **-ఎన్.పుష్పలత, శిరిగిరిపాడు**

రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం

మూడేళ్లుగా స్కేటింగ్ చేస్తున్నాను. గత ఏడాది గుంటూరులో జిల్లాస్థాయి పోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించా. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ పోటీల్లో మండల, జిల్లాస్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఈనెల ఆఖరులో తిరుపతిలో జరగనున్న పోటీలకు సన్నద్ధమవుతున్నా. **- కె.అక్షయ్‌ప్రణీత్, దొడ్లేరు**

నిత్యం సాధన చేస్తున్నా

రెండేళ్ల నుంచి స్కేటింగ్ సాధన చేస్తున్నా. గత ఏడాది జూనియర్ విభాగంలో మండలస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించా. ఈ ఏడాది పోటీలకు సన్నద్ధమవుతుండగా చేతి ఎముక విరిగింది. పోటీల నుంచి తప్పుకున్నా. కోలుకుని నిత్యం సాధన చేస్తున్నా. జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. **-కె.తేజవర్షిత్, దొడ్లేరు**

ప్రైవేటు పాఠశాలలు పారదర్శకంగా పనిచేయాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలు ఫీజుల విషయంలో సమతుల్యత పాటించాలని, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంపొందేలా పారదర్శకంగా పని చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దాచేపల్లి పట్టణంలోని నడికుడి రోడ్డులోని శ్రీనిధి కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేను ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులు సత్కరించారు. యరపతినేని మాట్లాడుతూ గ్రామీణ నుంచి పట్టణం వరకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందించడంలో ప్రైవేటు పాఠశాలల పాత్ర అమూల్యం అన్నారు. ఎంఈవో పిచాక పాణి, మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి నారాయణ, టీడీపీ చైర్మన్ భాస్కర్‌రావు, న్యాయవాదులు, పలు ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకుని..

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వృద్ధులు రోడ్డు పక్కన పడి ఉన్నారు. అటువైపుగా వస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు క్షతగాత్రులను అంబులెన్సును పిలిపించి ఆసుపత్రికి పంపించారు. చికిత్సకోసం రూ.10వేలు ఇచ్చారు. బాధితులు నుస్మెల్లంపల్లి గ్రామానికి చెందిన సాగర్ బాబు, ఏసుబాబు కృతజ్ఞత తెలిపారు.

నీటి కష్టాలు మళ్లీ మొదటికి

ట్యాంకర్ నీటిని పట్టుకుంటూ..

దుర్గి,న్యూస్‌టుడే: దుర్గిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గత నెల 31న పాఠశాలలో విద్యార్థులు స్నానానికి ఇబ్బందులు పడుతున్నారని ఈనాడులో వచ్చిన కథనానికి అప్పటికప్పుడు పంచాయతీ అధికారులు నీటి కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించారు. రెండ్రోజులుగా పంచాయతీకి సరఫరా చేసే బోరుకు మరమ్మతులకు గురవడంతో నీటి కష్టాలు తలెత్తాయి. పాఠశాల ప్రిన్సిపల్ ఆశాజ్యోతి, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి నాగయ్య సూచనతో శనివారం రాత్రి ఓబులేశునపల్లెకు చెందిన మండల తెదేపా నాయకుడు పశుమర్తి బుజ్జి, ఆదివారం ఉదయం మాచర్ల కేసీపీ సంస్థవారు చెరోక ట్యాంకు నీటిని సరఫరా చేయించారు. 274 మంది విద్యార్థులు వసతి పొందుతున్న పాఠశాలలో ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : పల్నాటి వీరుల తిరునాళ్లను పురస్కరించుకొని కాపు సంఘం నేతృత్వంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ఫ్రెండ్స్ సర్కిల్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ స్థానాన్ని బ్రహ్మనాయుడు సీసీ జట్టు సాధించింది. తృతీయ స్థానాన్ని నరేంద్ర సీసీ జట్టు సాధించగా విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందించారు.

జ్ఞాపికలతో విజేతలు

సత్యసాయి స్ఫూర్తిని కొనసాగిద్దాం

మాచర్ల (కారంపూడి), పిడుగురాళ్ల, రెంటచింతల, అమరావతి, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవా ఆచరణలో చూపిన సత్యసాయి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అనుసరించి కొనసాగించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం సత్యసాయి శత జయంతిని మాచర్ల పట్టణంలోని సొసైటీ కాలనీలో ఉన్న సత్యసాయి విద్యావిహార్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ★ పిడుగురాళ్ల పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో చిత్రపటాలను పూలు, నవధాన్యాలతో అందంగా అలంకరించారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యరపతినేని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ★ రెంటచింతలలో సాయి చిత్రపటాన్ని రథంలో పురవీధుల్లో ఊరేగించారు. ★ అమరావతిలో ఉదయం ఊరేగింపుతో కార్యక్రమాలు మొదలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, చేకూరి జాజిబాబు, సత్యనారాయణ, రమేష్, ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవో శివబాబు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో చిత్రపటం అలంకరణ

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడండి

అమరావతి, న్యూస్‌టుడే : పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఈవో రేఖను కోరారు. ఆదివారం ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. స్వామివారి అన్న ప్రసాదం నాణ్యత ఉండేలా, ఆలయంలో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాలలో అన్యమత ప్రచారం జరగకుండా చూడాలని కోరారు. ఆలయ భూములను పరిరక్షించి సక్రమంగా కౌలు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీహెచ్‌పీ నేతలు వెంకటేశ్వరరావు, గోపీకృష్ణ, నిరంజనరావు ఉన్నారు.

కార్మికులకు స్వెటర్ల పంపిణీ

పెదకూరపాడు, న్యూస్‌టుడే: జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ జన్మదినం సందర్భంగా ఆదివారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేతలు దాసరి రాంబాబు, మేదరమెట్ల సామిత్ చౌదరి ఏర్పాటు చేసిన కేకును రమేష్ కోసి కార్యకర్తలకు పంచారు. జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల వ్యవస్థాపకులు గుత్తా రాము మాష్టారు తోపుడు బండ్లను ఎమ్మెల్యే, రమేష్ చేతులమీదుగా పేదలకు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు స్వెటర్లు పంచిపెట్టారు. పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పెదకూరపాడు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో స్వామివారికి సద్ది ఏర్పాటు చేశారు. రాష్ట్ర డైరెక్టర్లు చిన్నారావు, గంగాధర్, నేతలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, అర్తిమళ్ల రమేష్

భట్రాజు కార్పొరేషన్ ఛైర్మన్‌కు సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సరికొండ వెంకటేశ్వరరాజు అలియాస్ మార్కెట్ రాజును ఆదివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ నాగరాజు సత్కరించారు. పదవికి వన్నెతెచ్చే విధంగా పనిచేయాలని రాజుకు కన్నా సూచించారు. అదేవిధంగా తెదేపా నియోజకవర్గ నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు(మల్లి), బీసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు వెంకటేశ్వరరాజును సన్మానించారు.

వెంకటేశ్వరరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా, మాజీ మేయర్ నాగరాజు

రోడ్డుపై మురుగుతో అవస్థలు

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి మండల పరిధిలోని మాదినపాడు గ్రామం చర్చి బజారులో కాలువలు లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు నడవటానికి వీలు లేకుండా పోయిందని, రోగాల బారిన పడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇలా పడుకుంటే.. ఎలా వెళ్లేది..!

సత్తెనపల్లి: కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారిపై పట్టణంలోని గుంటూరు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో పెట్రోలు బంకు ఎదురుగా గుంపుగా పశువులు చేరుతున్నాయి. తరచూ రోడ్డుపైకి వస్తున్న ఆవులతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవులను ప్రధాన రహదారిపైకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఆసుపత్రి రోడ్డు ఆక్రమణ

పెదకూరపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడు నుంచి పాటిబండ్ల వెళ్లే మార్గంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఈ రహదారికి ఇరువైపులా ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు, దుకాణాలు నెలకొల్పడంతో రహదారి కుచించుకు పోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రహదారిపైనే ఇనుము, అట్టపెట్టలు, ప్లాస్టిక్ తుక్కు విక్రయదారులు రహదారులు, కాల్వలు ఆక్రమించి ముందుకు వచ్చి మరి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, ఆ మార్గంలో పాటిబండ్ల వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకులు, పోలీసు అధికారులు చర్యలు చేపట్టకపోవటంపై తీవ్ర విమర్శలున్నాయి.

హెచ్చరికలు బేఖాతరు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రోడ్లు, మురుగు కాల్వల్లో చెత్త, వ్యర్థాలు పడేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని పురపాలక సంఘం చేస్తున్న హెచ్చరికల్ని చాలామంది బేఖాతరు చేస్తున్నారు. పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా కొత్తపేటలోకి వెళ్లే రోడ్డులో మురుగు కాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసి వాతావరణాన్ని అపరిశుభ్రంగా మార్చారు. పారిశుద్ధ్యంపై హెచ్చరిక ఫ్లెక్సీ ఉన్నచోటే పరిసరాలు అపరిశుభ్రంగా మార్చడం పర్యవేక్షణ లోపాన్ని తేటతెల్లం చేస్తోంది.

నాగార్జునకొండకు పర్యాటకుల తాకిడి

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. పర్యాటకులు, ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థుల సౌకర్యార్థం లాంచీ సర్వీసులు అందుబాటులో ఉండటంతో వాటిని వినియోగించుకున్నారు. విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ యూనిట్ మేనేజరు కె.మస్తాన్‌బాబు మాట్లాడుతూ లాంచీల ద్వారా కొండను దర్శించడంతో రూ.50 వేలు ఆదాయం వచ్చిందన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కారంపూడి, న్యూస్‌టుడే: కారంపూడి వీరుల ఉత్సవాల్లో ఆదివారం జరిగిన అపశ్రుతిపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యుదాఘాతంతో మృతిచెందిన ఆచారవంతులు జాల నరసింహాకు నివాళి అర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. మరో ఆచారవంతులు అంకారావు పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. చివరి రోజు ఇలా జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటామన్నారు.

మహనీయులారా మన్నించండి

అమరావతి: మండల పరిధిలోని లింగాపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో దాతలు సర్వేపల్లి రాధాకృష్ణన్, మహాత్మాగాంధీ, అబ్దుల్ కలాం, సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల రూపు మార్చేలా వాటి అవయవాలను రాళ్లతో కొట్టి రూపుకోల్పోయేలా చేశారు. దీనిపై ఉపాధ్యాయులు ఎన్ని సార్లు హెచ్చరించినా ఆకతాయిల తీరు మాత్రం మారడం లేదు. మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అడిగొప్పలలో ప్రత్యేక పూజలు

దుర్గి,న్యూస్‌టుడే : పల్నాట ప్రసిద్ధి చెందిన అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాదుతోపాటు ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు శనివారం రాత్రి నుంచే అమ్మవారి సన్నిధికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో, ఏసీ కె.ఆదిశేషనాయుడు పర్యవేక్షించారు.

ఘనంగా క్రీస్తురాజు పండగ

చెరుకొంపాలెం(అచ్చంపేట) న్యూస్‌టుడే: మండలంలోని చెరుకొంపాలెంలో ఆదివారం ఆర్‌సీఎం దేవాలయంలో క్రీస్తురాజు పండగ ఘనంగా జరిగింది. పెదకూరపాడు విచారణ గురువులు రాజారెడ్డి, ఎ.శౌరయ్య, మర్రెడ్డి, సహాయ గురువులు మరియపవన్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ కార్యక్రమం జరిగింది. కొవ్వొత్తులు కార్యక్రమం, తేరుప్రదక్షిణ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు శౌర్రెడ్డి క్రీస్తు ప్రభువుకు రూ.లక్ష విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారు. పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమల పయనం

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పట్టణం ఆదివారం అయ్యప్ప భజన, శరణాలతో మార్మోగింది. స్థానిక రంగనాయక స్వామి ఆలయం ప్రాంగణంలో సుమారు 60 మంది అయ్యప్ప స్వాములు 41 రోజుల దీక్షను పూర్తిచేసుకుని ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు సిద్ధమయ్యారు.

మేదర సంఘం అధ్యక్షుడిగా జొరిగె

అమరావతి, న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా మేదర సంఘ అధ్యక్షుడిగా అమరావతికి చెందిన జొరిగె వెంకట శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిలో మేదర సంఘ జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించింది. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తొమ్మల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా నాగినేని లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శిగా కొండ హనుమంతురావును ఎన్నుకున్నట్లు మేదర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మస్తానరావు తెలిపారు. వారితో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు.

భాజపా మండల అధ్యక్షుడిగా మున్వర్ బాజీ

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు మండల భాజపా మండల అధ్యక్షుడిగా మున్వర్ బాజీ నియమితులయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కామినేని హనుమంతురావు నియామక పత్రం అందజేశారు. కామినేని మాట్లాడుతూ పార్టీ మార్గదర్శకాలు, నియమనిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించాలని మున్వర్ బాజీకి సూచించారు.

వర్ల రామయ్య ఇంటికి యరపతినేని

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పట్టణంలోని ఇంటికి ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వచ్చారు. మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేని వర్ల రామయ్య దుశ్శాలువతో సత్కరించారు. ఆయన వెంట తెదేపా నాయకులు సయ్యద్ అమీర్ అలీ, కనిగిరి శ్రీనివాసరావు, పిల్లి చెన్నారావు, వల్లెపు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అవీ ఇవీ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నకరికల్లు, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నకరికల్లు ఎస్సై సతీశ్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

వెంకటేశ్వర్లు కుటుంబానికి పరామర్శ

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పులిపాడులోని కొమ్మినేని వెంకటేశ్వర్లు తల్లి వెంకమ్మ ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులను తితిదే పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ఆదివారం పరామర్శించారు. ఆయనవెంట జంగా సురేష్, కొమ్మినేని రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం కొత్తవంతెన దిగువన లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. 45-50 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, గుర్తుపట్టలేని స్థితిలో ఉందన్నారు.

చెకుముకి సంబరాలతో సృజనాత్మకత వెలికి తీత

బహుమతులు పొందిన విద్యార్థులతో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు చెకుముకి సంబరాలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సంబరాల్లో భాగంగా ఆదివారం చిలకలూరిపేటలోని హీలియోస్ సాదినేని చౌదరయ్య రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి 25 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో వినుకొండ గీతం పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మాచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు డిసెంబరు 21 నుంచి 23 వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమస్థానం పొందిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఎస్సై వేధింపులు భరించలేక పోతున్నా..’

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ‘ఎస్సై వేధింపులు భరించలేను.. ఈ లోకంలో ఉండను.. వెళ్లిపోతున్నా.. ఇదే నా చివరి కాల్ అంటూ ఓ యువకుడు తన మిత్రుడికి ఫోన్‌చేసి అదృశ్యమైన ఘటన వెల్దుర్తి స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసుల వేధింపుల వల్ల తమ కుమారుడు ఏమయ్యాడో తెలియడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పిచ్చయ్యబావితండాకు చెందిన రామావత్ గోవిందునాయక్‌కు అదే గ్రామానికి చెందిన కీర్తిబాయితో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కొన్నాళ్లనుంచి ఇద్దరిమధ్య మనస్పర్థలు ఉన్నాయి. కీర్తి తన తల్లిదండ్రులతో కలిసి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. శనివారం గోవింద్‌నాయక్‌ని స్టేషన్‌కి పిలిపించిన ఎస్సై సమందర్‌వలి తనదైన శైలిలో అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒకానొక దశలో తనభర్తని కొట్టొద్దని కీర్తి ఎస్సైని వేడుకునే స్థాయిలో కౌన్సెలింగ్ జరిగింది. శనివారం సాయంత్రం భార్యభర్తలిద్దరూ మాచర్లలోని ఇంటికి చేరుకున్నారు. గోవింద్‌నాయక్ తన మిత్రుడు శివాంజినేయులు నాయక్‌కి కాల్‌చేసి తర్వాత ఫోన్ కట్టేశాడు. ఎస్సై కొట్టడంతోనే తన కుమారుడు కనిపించకుండా పోయారని గోవింద్ తండ్రి హనుమంతునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలను నేరుగా గుర్తించి వాటి పరిష్కారానికే ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామంలో శివాలయంలో పూజలు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తేవాలని కోరారు. సభకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ,గుంటూరు 1 ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, నియోజకవర్గ పరిశీలకులు రాము, నాయకులు కంచేటి సాయిబాబు, వెన్నా సాంబశివారెడ్డి, ఏపూరి లక్ష్మీనారాయణ, ఏడుకొండలు, మొగల్‌జాన్, ఏపూరి నాగేశ్వరరావు, గంగాధర్, రాజన్‌బాబు, ముంతాజ్, నందిగం ఆశీర్వాదం తదితరులు మాట్లాడారు.

అమరావతి, న్యూస్‌టుడే : రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న వైకుంఠపురంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రానుండగా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశగా ఉన్నారు.

ఎర్రబాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పట్లవీడు గ్రామంలో ఇంటికి డోర్‌నెంబరు ప్లేట్లు అతికించేందుకు వెళ్లిన శివాజీ, సుమంత్ పనిముగించుకొన్ని మాచర్ల వెళ్తున్నారు. పట్లవీడు శివారులోకి రాగానే ఎదురుగా వినుకొండ మండలం ఉప్పరపాలేనికి చెందిన ఆంజనేయులు ద్విచక్రవాహనంపై వస్తూ వారిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివాజీ చేతికి, కాలికి బలమైన గాయాలవ్వగా, సుమంత్‌కు తలకు గాయాలై చెవులనుంచి రక్తం కారింది. క్షతగాత్రులను మాచర్ల సర్వజనాసుపత్రికి తరలించారు. ఆంజనేయులు పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మాచర్లలో చికిత్స పొందుతున్న శివాజీ, సుమంత్‌లది తూర్పు గోదావరి జిల్లా మండపేటగా తెలిసింది.

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం
సోమవారం నవంబరు 24, 2025

ఏవీ ప్రమాద హెచ్చరికలు

● ఘటనలప్పుడే హడావుడి

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతానగరం

- నాలుగు రోజుల క్రితం కురుపాం మండలం బియ్యాలవలసకు చెందిన ఎం.అన్నపు రాయుడు కళ్లికోట వద్ద నాగావళి నది దాటుతూ ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయారు.
- కొన్నిరోజుల కిందట సీతానగరం మండలంలోని సువర్ణముఖి నదిలో ఓ వ్యక్తి గల్లంతై మృతదేహంగా తేలాడు.
- గతేడాది మక్కువ మండలంలో ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గెడ్డలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.
- తాజాగా రబ్బరు డ్యామ్ వద్ద ముగ్గురు యువకులు గల్లంతయ్యారు

ఈ నాలుగు ఘటనలే కాదు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటా పదుల సంఖ్యలోనే మృత్యువాత పడుతున్నారు. కోనేర్లు, నదులు, డ్యామ్‌లు, గెడ్డల వద్ద గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం స్పందించడం లేదు.

మన్యం జిల్లాలో చిన్నా, పెద్ద నదులు, గెడ్డలు 25 నుంచి 30 వరకు ఉన్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో ఉప్పొంగుతున్నాయి. నెల రోజుల పాటు ప్రవాహ వేగం కనిపిస్తుంది. ఈ క్రమంలో అందులో దిగితే కొట్టుకుపోయే ముప్పు పొంచి ఉంది. నివారణలో భాగంగా ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ చర్యలు అవసరం. హెచ్చరిక బోర్డులు పెట్టడం, అటుగా ఎవరూ వెళ్లకుండా చూడడం, ఇసుక తవ్వకాలు ఆపడం.. తదితర పనులు తప్పనిసరి. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల వద్ద కంచెలు ఏర్పాటు చేయాలి. ఆయా పనులతో ప్రమాదాలకు ఆస్కారం ఉండదని పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఇంజినీరు తెలిపారు.

ఆశలు మునిగి.. కన్నీళ్లు మిగిలి

న్యూస్‌టుడే, పార్వతీపురం, కొమరాడ

కోటి ఆశలు కన్నీళ్లుగా మారాయి.. కళ్లెదుటే.. జలరక్కసి కోరల్లో మూడు ప్రాణాలు చిక్కుకున్నాయి.. ఒకరి వెంటే ఒకరు ఆర్తనాదాలతో కొట్టుకుపోతుంటే.. ఒడ్డునున్న స్నేహితుల రోదనలు మిన్నంటాయి.. ఆచూకీ దొరకక.. కన్నీరు ఆగక.. రక్షించు దేవుడా అంటూ కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరుల్ని కలచివేసిన ఘటన కొమరాడ మండలం సివిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. శుభకార్యం కోసం కలిసిన స్నేహితులంతా సరదాగా ఈతకు నదికి వెళ్లి ప్రమాదంలో పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలుడ్ని రక్షించాలని..

రాయగడ శరత్‌కుమార్(17), అరసాడ ప్రతాప్(29), పోతుజోడ సాయికృష్ణ, అరసాడ చందు, రాయగడ చక్రి, అధికారి లక్ష్మీనాయుడుతో పాటు మరికొందరు రబ్బరు డ్యామ్‌లోకి దిగారు. స్నానం చేస్తుండగా శరత్‌కుమార్ మునిగిపోయాడు. అతడిని రక్షించే క్రమంలో ప్రతాప్ గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న ముగ్గురు యువకులు గ్రామంలో ఉన్న అధికారి గోవిందనాయుడు(35), అతని తమ్ముడు జగదీష్‌కు చెప్పారు. వీరిద్దరూ వాళ్లని కాపాడేందుకు నదిలో దిగారు. ఇంతలో గోవిందనాయుడు ఊబిలో చిక్కుకున్నారు. కళ్లముందే కొట్టుకెళ్తున్న అన్నయ్యను చూసి జగదీష్ తల్లడిల్లిపోయాడు. సీఐ రంగనాథం, ఎస్సై నీలకంఠం, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

నదిలో కొట్టుకుపోతున్న శరత్‌కుమార్

ఎ.గోవిందనాయుడు
ఆర్.శరత్‌కుమార్
ఎ.ప్రతాప్

బోరుమన్న బాధితులు..

గోవిందనాయుడుకు ఏడు, అయిదేళ్ల వయసు గల కుమారులు స్వాతిక్, యోగేంద్ర ఉన్నారు. ఇటీవల అతని తండ్రి తవిటినాయుడు అనారోగ్యంతో చనిపోయారు. గ్రామంలో వెల్డింగ్ దుకాణం పెట్టుకుని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భార్య, పిల్లలు విలపిస్తున్నారు.

ఆరునెలల క్రితమే ఉద్యోగం..

సివినికి చెందిన కూలీలు లక్ష్మణ్, పార్వతి దంపతుల కుమారుడు ప్రతాప్. ఆర్థిక సమస్యలున్నా ఇంజినీరింగ్ చదివించారు. అతను ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. ఇంటికి వెలుగుదివ్వెగా మారాడని సంబరపడ్డామని, ఇంతలో ఘోరం జరిగిందని రోదిస్తున్నారు.

తిరిగొస్తానని.. సివిని వాసి, చోదకుడు శ్రీను పెద్ద కుమారుడు శరత్ కుమార్. పార్వతీపురంలో ఇంటర్ చదువుతున్నాడు. అందరితో కలిసి అలా తిరిగొస్తానని వెళ్లి, మునిగిపోయాడు

పెళ్లి కోసం వచ్చి..

సివిని గ్రామంలో ఆదివారం ఉదయం 5 గంటలకు జరిగిన స్నేహితుడి పెళ్లి కోసం వీరంతా ఒక్కచోట కలిశారు. పెళ్లిబాజాలు, మేళతాళాల మధ్య సందడి చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఏడుగురు మిత్రులు కలిసి జంఝావతి నది సమీపంలోని చెట్ల కింద భోజనాలు తిన్నారు. ఆపై..

3.45 గంటలకు.. స్నానానికి దిగారు.
3.50 కి..: శరత్‌కుమార్ గల్లంతు
4.00 కి..: ప్రతాప్ మునిగిపోయాడు
4.15 కి..: గోవిందనాయుడు గల్లంతు

విలపిస్తున్న గోవిందనాయుడు తమ్ముడు జగదీష్

రూపు కోల్పోయి, శిథిలావస్థకు చేరుతున్న గృహాలు

అదిగదిగో అనడమే..

కళ్లముందే కలల సౌధం కనిపిస్తోంది. కానీ వెళ్లలేని పరిస్థితి. చేతిలోనే పట్టాలు. కానీ గదిలో అడుగు పెట్టలేని దుస్థితి. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల అవస్థలివి. సాలూరు పట్టణానికి చెందిన 1440 మంది పేదలకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. కొంతమేర పనులు జరిగాక వైకాపా వచ్చింది. రివర్స్ టెండరు పేరుతో 192 పట్టాలను రద్దు చేసింది. పేదల పేరున బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చింది. రూపాయికే ఇల్లిస్తామని మభ్యపెట్టింది. కానీ ఏవీ పూర్తిచేయలేకపోయింది. ఆఖర్లో హడావుడిగా కొందరికి తాళాలిచ్చింది. సౌకర్యాలు లేకపోవడంతో అక్కడ ఉండలేని దుస్థితి. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్తు తదితర సదుపాయాలు లేక ఎవరూ సాహసించడం లేదు. దీంతో గోడలకు వేసిన రంగులు వదిలేస్తున్నాయి. ఆవరణతో పాటు సముదాయంపై పిచ్చిమొక్కలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల కిందట రోడ్డు కోసం తవ్విన గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించారని, త్వరలో పనులు చేపడతామని టిడ్కో డీఈ శశిధర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు

రోడ్డు కోసం తవ్వి వదిలేసిన గోతులు

లక్షల మందికి విద్య, వైద్యం అందించారు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: లక్షలాది మందికి విద్య, వైద్యం అందించిన సత్యసాయి అందరికీ ఆదర్శమని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం సాలూరులోని మండల పరిషత్తు కార్యాలయంలో సత్యసాయి శతజయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జ్యోతిని వెలిగించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతపురంతో పాటు ఎన్నో ప్రాంతాలకు తాగునీరు అందిస్తూ ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. గ్రామాల్లో సత్యసాయి సమితి సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మరింత మందికి అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రామచంద్రరావు, ఎంపీడీవో పార్వతి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి సంధ్యారాణి

హెచ్చరికల ఏర్పాటుకు ఆదేశం

పార్వతీపురం, పట్టణం: రబ్బరు డ్యామ్ వద్ద ముగ్గురు యువకుల గల్లంతైన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

తోటపల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

కురుపాం గ్రామీణం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం తోటపల్లి వేంకటేశ్వర స్వామి, కోదండ రామస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం జరిగింది. ఛైర్మన్‌గా మార్కొండ పకీరునాయుడు, సభ్యులుగా రెడ్డి రాజేశ్వరి, ఎస్.పకీరునాయుడు, గరుగుబిల్లి మీన, వావిలపల్లి పద్మజ, ముచ్చర్ల నారాయణరావు, ఆరిక జానకి, బొమ్మాలి సుభాషిణి, భగవాన్ వరప్రసాద్ మిశ్రో, ఎస్.లక్ష్మి, ఎం. కృష్ణంనాయుడు, వి. వెంకట అప్పలాచార్యులుతో ఈవో బి.శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్మన్ పకీరునాయుడు తదితరులు

శుద్ధ అబద్ధం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, విజయనగరం అర్బన్

సోకుతున్న రోగాల్లో 80 శాతం కలుషిత నీటి వల్లే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా నీటి శుద్ధియంత్రాలు అందించారు. వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టని కారణంగా ఎక్కడికక్కడే మరమ్మతులకు గురవుతున్నాయి.

పార్వతీపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేయని పరికరం

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల్లో చాలాచోట్ల శుద్ధమైన తాగునీరు అందడం లేదు. దీంతో కొందరు విద్యార్థులు కుళాయిలు, బోరుబావుల నుంచి తెచ్చుకుంటున్నారు. గతంలో మన్యంలో ఒకటి నుంచి రెండో తరగతి వారికి టైప్- 1 పరికరాలు 220 అందించారు. టైప్-2 224, టైప్- 3, 4 పరికరాలు 91 వరకు ఇచ్చారు. వాటిని ఏర్పాటు చేసిన మూన్నాళ్లకే దెబ్బతిన్నాయి. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల్లో 486 వరకు మరమ్మతులకు గురయ్యాయి. కొన్నిచోట్ల బాగుచేసినా మళ్లీ పాడవుతున్నాయి. ఉన్నత పాఠశాలల వారికి పెద్ద యంత్రాలు అందించారు. వాటిదీ అదే దుస్థితి.

జిల్లాల వారీగా పరికరాల తీరు..

అంశం	మన్యం	విజయనగరం
పాఠశాలలు	1,447	1745
విద్యార్థులు	96 వేలు	1.17 లక్షలు
మంజూరైనవి	975	1137
అమర్చనవి	186	57
అమర్చినవి	789	1080
పనిచేయనవి	486	150

సీసాలే ఆధారం..

పురపాలక సంఘాల్లోని విద్యాలయాలకు కుళాయి నీటినే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. పరికరాలున్నా రక్షిత నీరు దరిచేరక పోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈ యంత్రాలను ఓ ప్రైవేటు ఏజెన్సీ సమకూర్చింది. వారే బాగు చేయాల్సి ఉంది. అయితే ఫిర్యాదు చేసినా రావడం లేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పిల్లలందరికీ స్వచ్ఛమైన నీరు అందిస్తామని మన్యం జిల్లా డీఈవో రాజ్‌కుమార్ తెలిపారు.

శిఖపరువే చిన్నబోయేలా!!

సాలూరు మండలం పట్టుచెన్నూరు పంచాయతీ శిఖపరువు సమీపంలోని జలపాతానికి ఆదివారం సందర్శకులు తరలి వెళ్లారు. ఉదయం నుంచి వందలాది మంది చేరుకోవడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. ఎగువ నుంచి వస్తున్న నీళ్లలో జలకాలాటలాడుతూ యువతి, యువకులు సందడి చేశారు. కింది భాగంలోని రాళ్ల వద్ద పెద్దఎత్తున స్నానాలు ఆచరించారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

పరీక్ష కేంద్రానికి చేరుకోవడం సులభం

హాల్ టికెట్‌పై క్యూఆర్ కోడ్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థి పరీక్షలు రాసేందుకు గతేడాది పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని కేటాయించారు. కాంప్లెక్సులో దిగి వెళ్లాలి. సమీపంలోనే మరో ఉన్నత పాఠశాల ఉండడంతో పొరపాటున అక్కడికి వెళ్లిపోయాడు. తీరా నోటీస్‌బోర్డులో హాల్ టికెట్ నంబరు లేకపోవడంతో కిలోమీటరు దూరంలో ఉన్న ప్రధాన కేంద్రానికి పరుగు తీశాడు.

ఈ ఇబ్బంది ఆ విద్యార్థిదే కాదు. చాలామందికి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటి వరకు పల్లె ప్రాంతాల నుంచి పట్టణం వచ్చేవారు పరీక్ష కేంద్రాలను గుర్తించడం కష్టంగా ఉండేది. కొత్త సౌకర్యం కారణంగా ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలగనున్నాయి.

జంబ్లింగ్ విధానం..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1720 ఉన్నాయి. ఇందులో 10,500 మంది పదో తరగతి చదువుతున్నారు. ఏటా 70 కేంద్రాలు పెడుతున్నారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు, వీరఘట్టం ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. జంబ్లింగ్ విధానం కారణంగా ఎప్పటికప్పుడు మారుతూ ఉండాలి. క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ముందుగానే కేంద్రం వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని డీఈవో రాజ్‌కుమార్ తెలిపారు.

(c) eenadu

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్

Organised by: ఈనాడు

Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, పెదపాడు విలేజ్ శ్రీకాకుళం - 532 401
వివరాలకు: 90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

30న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.. క్రీడా విభాగం: ఇన్‌స్పైర్ లార్వెన్స్ స్కూల్‌లో అండర్-15 ఏపీ ఓపెన్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఏ రావు, కార్యదర్శి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8520886564 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "బాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

High Way facing 261Sq.Y site (VMRDA approved) Akshaya Nagar in Nelivada Vill., Bondapalli Mdl, VZM for sale ✆ 9676743732.

VZM నీళ్లట్యాంక్ & MIMS ఊటగెడ్డ దగ్గర 200 గజముల Bits '2' కలవు. Contact: 7416816888.

JOBS

లలిత హోండా 2 వీలర్ షోరూమ్స్‌లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. * బ్రాంచ్ మేనేజర్స్ - కొత్తూరు, పాలకొండ * కంప్యూటర్ ఆపరేటర్(M) - శ్రీకాకుళం బ్రాంచ్‌ల కొరకు ✆ 9492770556, 8498884111.

VZM 90రోజులు ఉచితంగా కంప్యూటర్ కోర్సు & ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టార్‌లో ట్రైనింగ్‌తోపాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (Pass), Inter, డిగ్రీ, ITI (పాస్/ఫెయిల్) Age: 18to35 ✆ 8919050156, 9493359472.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శాంతిమూర్తికి నృత్యాంజలి

చీపురుపల్లిలోని ఆంజనేయపురం సత్యసాయి ఆలయంలో స్వామికి వంద రకాల ప్రసాదాలను ఏర్పాటు చేసిన భక్తులు

కొత్తవలస, ఎస్.కోట, చీపురుపల్లి న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సాయి మందిరాల్లో ఉత్సవాలను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పతాకాలు ఆవిష్కరించారు. ఎస్.కోటలోని పెదఖండేపల్లి రోడ్డులో దత్తసాయి మందిరంలో స్వామికి పుష్పయాగం నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీప్రసన్న నృత్య కళా నికేతన్ విద్యార్థుల నృత్య ప్రదర్శనతో అలరించారు. కొత్తవలసలో బాలవికాస్ బాలల వేషధారణ ఆకట్టుకుంది.

కొత్తవలసలో వివిధ వేషధారణల్లో బాలవికాస్ బాలలు

సత్యసాయి మార్గం సమాజహితం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజానికి ఎనలేని సేవలు అందించిన సత్యసాయి మార్గాన్ని అంతా అనుసరించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని కంచరివీధి మందిరంలో శతజయంతి ఉత్సవంలో పాల్గొని, మాట్లాడారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టర్ వైశాలి, మందిరం కన్వీనర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాబా విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి దంపతులు, అధికారులు

ప్రతిభ చూపారు.. మన్యంలో మెరిశారు

జ్ఞాపికలతో విజేతలు, జేవీవీ సభ్యులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని వేదాంత కళాశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మాతమూరు(పాచిపెంట), తమ్మినాయుడు ఉన్నత పాఠశాల(పాలకొండ) ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరినాయుడు తెలిపారు. డిసెంబరు 21, 22, 23వ తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయి. ఏపీ మోడల్ స్కూల్(భామిని), బందలుప్పి, వంతరాం జడ్పీ పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 16 ప్రభుత్వ, ఆరు ప్రైవేటు పాఠశాలల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు బీవీ రమణ, ఉపాధ్యక్షులు గౌరీశ్వరరావు, సతీష్‌రాజు, కన్వీనర్ కె.మురళి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, లక్ష్మునాయుడు, అజయ్, ప్రిన్సిపల్ వెంకటరమణ విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

బండలు తొలచి.. దారిగా మలచి

స్వచ్ఛందంగా గ్రామానికి రోడ్డు బాగుచేసుకున్న గిరిజనులు

బొబ్బిలి మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోని దేవుడి బొడ్డవలస గిరిజన గ్రామానికి సరైన రహదారి లేదు. ఉన్నది కాస్తా వర్షాలకు పాడైంది. రోడ్డు పక్కనున్న గుట్ట రాళ్లు అడ్డంకిగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు మొర వినిపించినా స్పందన లేకపోవడంతో చేసేది లేక పలుగు పారపట్టి, నడుంబిగించిన గిరిజనులు రోడ్డు బాగు చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించిన స్పందించలేదని వాపోతున్నారు. సుమారు కిలోమీటరున్నర మేర శ్రమదానం చేసి గుట్టలు, రాళ్లు తొలగించి మార్గం చేసుకున్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

శుభకార్యంలో అవయవ దానానికి అంగీకారం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు డోల నాగరాజు, రమా దంపతుల కుమార్తె నిహారిక ఓణీల కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. ఈ మేరకు అంగీకార పత్రాలపై సంతకాలు చేసి మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు గోవిందరాజులకు అందజేశారు. పలువురు అభినందించారు.

పత్రాలపై సంతకాలు చేసి గోవిందరాజులకు అందజేస్తున్న నాగరాజు, రమా దంపతులు

ఆదివారం.. ఆనంద విహారం

సీతంపేట మన్యంలోని జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొన్నాయి. సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి కుటుంబాలు, స్నేహితులు, విద్యార్థులు సందర్శించి వన భోజనాలు చేశారు. ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో చిన్న, పెద్ద తేడా లేకుండా పలు సాహస, ఇతర క్రీడల్లో పాల్గొన్నారు. ఆనంద వేదిక వద్ద నృత్యాలు, సైకిళ్ల రైడింగ్‌తో కొత్త అనుభూతి పొందారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ తదితర జలపాతాల వద్ద జలకాలాడారు. ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్ట్సు ప్రాంతాలకు వెళ్లారు. ఆదివారం చీకటి పడిన తర్వాత పార్కులో జరిపిన క్రాకర్స్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సందర్శించారు. సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, సీతంపేట

బోటింగ్, ఊగే వంతెనపై పర్యాటకులు

మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తాగునీటి పథకాలకు మోక్షం!

న్యూస్‌టుడే: బొబ్బిలి

- ఇక పట్టణాల గొంతులు తడవనున్నాయ్
- రూ.కోట్లతో నిర్మాణాలకు అడుగులు

నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పథకాల నిర్మాణాలకు అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు గుర్తించినా నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత అంచనాలలో రూ.కోట్లలో అదనపు భారం పడినా, కూటమి ప్రభుత్వం పూర్తిచేసేందుకు అడుగులు వేస్తోంది. ఇప్పటికే వాటి డీపీఆర్‌లను ఆమోదించింది. టెండర్ల ప్రక్రియ చేపడుతోంది.

రూ.కోట్లలోనే భారం.. ఉమ్మడి జిల్లాలోని మూడు పురపాలక సంఘాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో పథకాల నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే ప్రణాళికలు రూపొందించారు. మూడు పట్టణాలకు రూ.171 కోట్లతో 23 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పథకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. అమలులో నిర్లక్ష్యం వహించారు. తాజా అంచనాలు రూ.218.98 కోట్లకు చేరుకున్నాయి. సాలూరుకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. సాంకేతిక అనుమతులొస్తే పనులు ప్రారంభించాల్సి ఉంది.

పాతబొబ్బిలిలో కుళాయి వద్ద పరిస్థితి

యూఐడీఎఫ్‌లో ఆ రెండు.. బొబ్బిలి, పార్వతీపురం పురపాలికల్లో 32 ఎంఎల్‌డీ నీటిని అందించేందుకు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యూఐడీఎఫ్) నుంచి నిధులు కేటాయించారు. గతంలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించినా గుత్తేదార్లు సకాలంలో చేయక బిల్లులు నిలిచిపోయాయి. దీనిని యూఐడీఎఫ్‌లోకి మార్చారు. గతంలో ఈ రెండింటికీ రూ.180 కోట్లు కేటాయించగా ప్రస్తుత అంచనాలు రూ.212.93 కోట్లకు చేరుకున్నాయి.

మార్చారు.. భారం తప్పలేదు.. రాజాం పురపాలిక, విజయనగరం నగరపాలక సంస్థల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు గతంలో అమృత్ పథకంలో పనులు చేపట్టారు. తర్వాత ఏఐఐబీలోకి మార్చారు. రాజాంకు రూ.9.82 కోట్లు, విజయనగరానికి రూ.66.36 కోట్లు కేటాయించారు. రెండు చోట్లా 13 ఎంఎల్‌డీల నీటిని అందించేందుకు ప్రతిపాదించారు. గతంలో వీటికి రూ.60 కోట్లతో ప్రతిపాదించగా, ప్రస్తుత అంచనాలు రూ.76.18 కోట్లకు చేరుకున్నాయి.

పురపాలిక	మంజూరైన నిధులు	నీటి సామర్థ్యం
సాలూరు	100.36	10
పాలకొండ	71.94	7
నెలిమర్ల	46.68	6
బొబ్బిలి	126.39	17
పార్వతీపురం	86.54	15
రాజాం	9.82	3
విజయనగరం	66.36	10

సాంకేతిక అనుమతులే తరువాయి.. పట్టణాల్లో తాగునీటి పథకాలకు మోక్షం దక్కింది. డీపీఆర్‌లు ఆమోదమయ్యాయి. సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది. అవి వచ్చాక టెండర్లు పిలిచి ఏజెన్సీలు ఖరారు చేస్తాం. పనులు ప్రారంభిస్తాం. అవి పూర్తయితే 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య ఉండదు. సాలూరు మున్సిపాలిటీలో పనులకు టెండర్లు పూర్తయ్యాయి.
– జ్యోతి, ప్రజారోగ్యశాఖ ఈఈ విజయనగరం

డాక్యుమెంటు కాపీలు ఇవ్వాలని వినతి

ఎస్.కోట: తమకు ఇచ్చిన అత్యవసర నోటీసుల్లో పేర్కొన్న డాక్యుమెంటు కాపీలు అందించాలని జిందాల్ బినామీ సాగుదారులు శనివారం తహసీల్దార్‌కు లేఖ అందించారు. అక్రమంగా పొందిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని తహసీల్దార్ గత సోమవారం 12 మందికి నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. తాము ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పరిహారం తీసుకున్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసి నిర్ధారించారన్నారు. ఇప్పుడు నోటీసులివ్వడం సరికాదన్నారు. డాక్యుమెంట్లు అందిస్తే చూసి సమాధానం చెబుతామన్నారు. సోమవారం లేఖలు పరిశీలించి చర్యలు చేపడతామని ఆదివారం తహసీల్దార్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

పూర్వ విద్యార్థుల సాయంతో నిర్మిస్తున్న ట్రాక్

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో మైదానంలో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా దీని నిర్మాణ ఆలోచనను ప్రధానోపాధ్యాయుడు రఘురాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అనుమతితో సుమారు రూ.1.60 లక్షలతో ఈ ట్రాక్ నిర్మాణాన్ని పూర్వ విద్యార్థులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు సైతం నిర్మించనున్నామని తెలిపారు. క్రీడాకారులు, పోలీసు శిక్షణ పొందే వారికి ఇది ఉపయోగ పడుతుందని వారు తెలిపారు.

పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలి

నెల్లిమర్ల: తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ సారిపల్లి గ్రామస్థులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 15.40 ఎకరాల భూమికి సంబంధించి పరిహారం కలెక్టర్ ద్వారా చెల్లించాలన్నారు. కోరాడపేట, ఏటీ.అగ్రహారం, పడాలపేట గ్రామాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కష్టాలు వింటారు.. నష్టాలు తీర్చుతారు

న్యూస్‌టుడే- రాజాం, పార్వతీపురం పట్టణం, సీతంపేట, వీరఘట్టం

నేటి నుంచి జిల్లాలో 'రైతన్నా- మీకోసం' కార్యక్రమం

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కర్షకులు సాంకేతికంగా నైపుణ్యం సాధించేలా చైతన్యం కల్పించేందుకు 'రైతన్నా- మీకోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి రైతు కుటుంబం ఇంటి తలుపుతడతారు. ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధిలో శాశ్వత మార్పు తీసుకురావడమే దీని లక్ష్యం.

రైతు సేవా కేంద్రాల వారీగా కార్యక్రమ ప్రణాళిక రూపొందించారు. గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఇంజినీరింగ్, విద్యుత్తు సహాయకులు, వీఆర్వో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్కెట్ కమిటీల పాలకవర్గాలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, పీఏసీఎస్, ప్రగతిశీల రైతులు, ఇతర ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. అవసరమైన కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ప్రస్తుత రబీ, వచ్చే ఖరీఫ్, రబీ.. మూడు సీజన్లకు కార్యాచరణ రూపొందిస్తారు. విజయనగరం జిల్లాలో 2.27 లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2.33 లక్షల ఎకరాలకు సంబంధించిన రైతు కుటుంబాలను సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో పేర్లు నమోదు చేస్తారు. ఒక్కో బృందంలో 6 నుంచి 8 మంది సభ్యులు ఉంటారు.

సీతంపేటలో యంత్రంతో సాగు పనుల్లో రైతు

క్లస్టర్ ప్రాతిపదికగా.. ప్రతి అయిదు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. ఒక్కో బృందం రోజుకు 90 కుటుంబాలను కలుస్తుంది. సీఎం సందేశలేఖ, కరపత్రం అందిస్తారు. రైతుల సూచనలు నమోదు చేస్తారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పిస్తారు. రైతుల సలహాలు, ఫిర్యాదులను క్రోడీకరించి డేటాను తయారుచేస్తారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 2 వరకు దీనిపై విశ్లేషిస్తారు. 2026-27 వ్యవసాయ ప్రణాళికను రూపొందించేందుకు ప్రతి ఆర్ఎస్‌కే పరిధిలో డిసెంబరు 3న కార్యశాల నిర్వహించాలని నిర్ణయించారు.

సీఎం లేఖలో ఉండేదిదే.. సీఎం లేఖను ప్రతి ఇంటికీ అందిస్తారు. జలాశయాలను పూర్తి చేసేందుకు నిధులు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం, వ్యవసాయంలో సాంకేతికత, సూక్ష్మ సేద్యానికి రాయితీ, ఆహారశుద్ధి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కు, పంటలకు గిట్టుబాటు ధర, అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద ప్రతి రైతు కుటుంబానికి రెండు విడతల్లో ఇప్పటికే రూ.14 వేలు జమ, పశుసంరక్షణ అంశాలు లేఖలో ప్రస్తావించారు. ఈ వారోత్సవాల్లో రైతులకు అవగాహన కల్పిస్తామని, అంతా భాగస్వామ్యం కావాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి తెలిపారు.

(c) eenadu

మళ్లిస్తే జలం.. పంటలు పుష్కలం

వృథాగా పోతున్న చిట్టిగెడ్డ నీరు

కొండల నడుమ సహజ సిద్ధంగా వచ్చే జీవ జలాలు ఉపయోగించుకోవడంలో ప్రభుత్వాలు, పాలకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఉపయోగకరమైన పనులు ముందుకు సాగడం లేదు. జియ్యమ్మవలస మండలంలోని అలమండ పంచాయతీ నిడగల్లుగూడ గిరిజన గ్రామానికి సమీపంలో చిట్టిగెడ్డపై 15 ఏళ్ల క్రితం సుమారు రూ.30 లక్షలతో చెక్ డ్యామ్ నిర్మించి వట్టిగెడ్డతో అనుసంధాన ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో గుత్తేదారు నిధులు ఉన్నంత వరకు పనులు చేసి మిగిలినవి వదిలేశారు. దీంతో లక్ష్యం నెరవేరలేదు.
– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

సగం చేసి.. వదిలేసి..

చిట్టిగెడ్డ నుంచి వట్టిగెడ్డ జలాశయం వరకూ తవ్విన కాలువలు సక్రమంగా లేవు. బండరాళ్లు ఉండటం, అప్పట్లో సగం పనులు మాత్రమే చేయడంతో నీరు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదు. నీరు వృథాగా మరోమార్గంలో పోతోంది. మరోపక్క చిట్టిగెడ్డ కింద సుమారు 300 వరకూ ఆయకట్టు భూములున్నాయి. వీటికి నీరు వెళ్లేందుకు స్థానికులు చిన్న కాలువలు తవ్వుకున్నారు. ఈ పరిణామాల మధ్య నీరు వట్టిగెడ్డకు అసలు అందడంలేదు.

ఎండుతున్న భూములు

వట్టిగెడ్డ వేసవిలో పూర్తిగా ఎండిపోతోంది. దీంతో ఏటా ఖరీఫ్‌లో వేల మంది రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎగువన ఉన్న మండలాల్లో వానలు కురిసి జలాశయం నిండితే సుమారు 17 వేల ఎకరాల సాగుకు పుష్కలంగా నీరు అందుతుంది. జలాశయంలో సరిపడా నీరు లేక నేటికీ చివరి భూములకు వట్టిగెడ్డ జలం అందడం లేదు. చిట్టిగెడ్డకు ఎగువ నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. దీన్ని వట్టిగెడ్డకు అనుసంధానం చేస్తే ఎగువన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో వానలు కురవకపోయినా.. నిండుతుంది. నిత్య సాగుకు వీలుగా రెండు పంటలకు నీరు అందించొచ్చు. గెడ్డలను కలిపే విషయమై పలుమార్లు రైతులు, వామ పక్షాలు ధర్నాలు, పాదయాత్రలు చేసినా పనులు పూర్తి కాలేదు.

ఏళ్లుగా పూర్తికాని వట్టిగెడ్డ-చిట్టిగెడ్డ అనుసంధానం

ప్రతిపాదనలు పంపిస్తాం

గతంలో కొంత నిధులతో అభివృద్ధి చేశాం. వట్టిగెడ్డతో చిట్టిగెడ్డ అనుసంధాన ప్రక్రియ పరిశీలిస్తాం. పూర్తిస్థాయిలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. – రవికుమార్, డీఈఈ, జలవనరులశాఖ, కురుపాం

దారంతా గడబిడ.. దరిచేరేంతవరకు దడ

కోతకు గురైన నీలంవలసకు వెళ్లే మార్గం..

రాయిగుడ్డివలస గ్రామ సమీపంలో ఇలా..

పాచిపెంట మండలం రాయిగుడ్డివలస, నందేడవలస కూడలి నుంచి నీలంవలస వరకు రహదారి పూర్తిగా పాడైంది. కోతకు గురై అధ్వానంగా మారింది. రాళ్లు తేలి రాకపోకలు సాగించలేని పరిస్థితి. భీమందొరవలస, నీలంవలస, సీతంపేట, రామభద్రపురం మండలాలకు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురివినాయుపేట పీహెచ్‌సీ, పూడి జీసీసీ డిపో, నందేడవలస వారపు సంత, సాలూరు మార్కెట్‌కు ఇదే మార్గం కావడంతో అవస్థలు తప్పడం లేదు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని జేఈ శంకరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

ఫెన్సింగ్‌లో మనోళ్ల సత్తా

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరంలో అండర్-17 విభాగంలో నిర్వహించిన క్రీడల్లో ఆరిక చరణ్, మండంగి అఖిల్‌చంద్రదేవ్, మండంగి శరత్‌బాబు, బిడ్డిక ఆదిత్యవర్ధన్, బిడ్డిక ప్రవీణ్‌కుమార్ ప్రతిభ కనబర్చారు. ఈనెల 24 నుంచి 26 వరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నట్లు శిక్షకుడు మాధవరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సంరక్షకుడు అప్పారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పనులాగి నాలుగేళ్లు.. పూర్తికి ఎన్నాళ్లు?



జమదాల సచివాలయ భవన నిర్మాణ పనులు నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. రూ.26 లక్షలతో ప్రారంభించిన పనులు చివరి దశలో ఆగాయి. జమదాల, లక్ష్మీపురం, కొత్త లక్ష్మీపురం, పొట్టిగదబవలస గ్రామాల ప్రజలు సమస్యలు చెప్పేందుకు ఇక్కడికే వస్తున్నారు. సదుపాయాలు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి పరిశీలించి, చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో కె.సత్యం అన్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

టైరు దిగితే.. ప్రమాదమే

తురకనాయుడు-నాగూరు మార్గంలో ర.భ ప్రధాన రహదారి బెర్మ్ కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో అటుగా వచ్చిన వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు జరగక ముందే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.భ జేఈ రామ్మోహన్ చెప్పారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

సభా ప్రాంగణం.. కూలేందుకు సిద్ధం

మేజర్ పంచాయతీ ఆవరణలో 2017లో నిర్మించిన సభావేదిక మరమ్మతులు లేక కూలేలా ఉంది. పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. బాగు చేసి వినియోగంలోకి తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు ఈ సభావేదిక వద్దే జరిగేవి. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం

మురుగు పారేదెలా..?

బలిజిపేట మండలం గంగాడ ప్రధాన రహదారిలో నివాసాల వాడుక నీరు రహదారిపైనే నిల్వ ఉంటోంది. ఈ గ్రామంలో రోడ్డు కన్నా కాలువలను ఎత్తులో నిర్మించడంతో ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో నివాసితులు అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలు పడితే పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ జేఈ నాగభూషణరావు వద్ద విషయం ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, బలిజిపేట

ఒక్కో అడుగు ముందుకు..

పాలకొండ ప్రధాన రహదారిలో ఆక్రమణలు రోజురోజుకీ మితిమీరుతున్నాయి. ఏలాం నుంచి అన్నవరం కూడలి వరకు ఇదే పరిస్థితి. ప్రధాన మార్గంలో వంద అడుగుల విస్తీర్ణంలో రహదారి ఉంది. కానీ బీటీ రోడ్డు మాత్రం 30 నుంచి 40 అడుగుల వరకే ఉంది. దీంతో ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే ఇరుగ్గా ఉన్న దారిలో ఇలా ఓ దుకాణ యజమాని ముందుకొచ్చి నిర్మాణం చేశారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పులిగుమ్మి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వెంటనే బాగు చేయించాలి. - వెంకటరమణ, పులిగుమ్మి ★ పరిశీలించి, ప్రతిపాదనలు చేయిస్తాం. - ప్రసాద్, ఎంఈవో-2 – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? గొడివాడ పంచాయతీ వీధి కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. - శంకర రావు, స్థానికుడు ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - ఉమామహేశ్వరి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? లక్ష్మీపురం బీసీ కాలనీలో పక్కా రహదారి లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉంది. - సత్యనారాయణ, స్థానికుడు ★ చర్యలు తీసుకుంటాం. - సత్యవతి, సర్పంచి - న్యూస్‌టుడే, సీతానగరం

? పి.లేవిడి సచివాలయ భవన నిర్మాణం చాలా కాలంగా అసంపూర్తిగా ఉండిపోయింది. -

వెంకటరమణ, స్థానికుడు ★ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. - డీఈ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ – కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

అన్నదాతల్లో ఆందోళన

ఖరీఫ్ సాగు పూర్తయ్యింది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే దశలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కోతలు పూర్తయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో కోతలకు కర్షకులు సిద్ధమవుతున్న తరుణంలో వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. పాలకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో పంట భూములు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 30 నుంచి 40 శాతం దాటి కోతలు పూర్తయ్యాయి. ఇటువంటి సమయంలో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, పాలకొండ

పొలంలో వరి పనలు

సమస్య చెప్పండి... పరిష్కారం పొందండి!

పాలకొండ పట్టణంలోని సమస్యలను కమిషనర్ రత్నరాజ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, పందులు, కుక్కల సంచారంతో అవస్థలు ఇలా సమస్య ఏదైనా కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. మీరు చేయాల్సిందల్లా కింది నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేయడమే.
– న్యూస్‌టుడే, పాలకొండ

★ తేదీ: 24.11.25 (సోమవారం)
★ సమయం : ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల మధ్య
★ చేయాల్సిన ఫోన్ నంబరు : 98499 44722

అంబరం.. సత్యసాయి జయంత్యుత్సవం

పాలకొండ: సెగిడి వీధిలో సత్యసాయి చిత్రపటం ఊరేగింపు

జీఎల్‌పురం తహసీల్దారు కార్యాలయంలో విప్ జగదీశ్వరి ఆధ్వర్యంలో..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీతంపేట సత్యసాయి మందిరం వద్ద జరిగిన వేడుకల్లో ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు. పేదలకు అమృత కలశాలు అందజేశారు. పాలకొండలో పీవో భక్తులతో కలిసి కేకు కత్తిరించారు. వెయ్యి మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సెగిడి వీధిలోని శివం మందిరంలో మహానగర సంకీర్తన అంబరాన్ని తాకింది. డీఈఈ రాధారాణి, సత్యసాయి సేవాసంస్థ రాష్ట్ర ఐటీ విభాగం బాధ్యుడు ఆర్.కిశోర్ పాల్గొన్నారు.

మరిపివలసలో సత్యసాయికి పూజలు

భామినిలో మండలంలో కె.ప్రభాకర్, సత్యనారాయణ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. గుమ్మలక్ష్మీపురం తహసీల్దారు కార్యాలయంలో విప్ జగదీశ్వరి, సీతానగరం మండలం మరిపివలసలో సమితి అధ్యక్షురాలు బి.వరలక్ష్మి, పాచిపెంటలో ఎంపీపీ ప్రమీల, కురుపాం ఎంపీడీవో కార్యాలయం వద్ద సిబ్బంది, బాబా సేవల్ని గుర్తుచేసుకున్నారు. వంతరాంలో సత్యసాయి సేవా సమితి కన్వీనరు పైడిరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం

సీతంపేటలో పేదలకు అమృత కలశాలు అందజేస్తున్న పీవో

పాలకొండ సెగిడివీధిలో బాబా విగ్రహం అలంకరణ

జెమ్స్ ఆసుపత్రి వైద్యులు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
– న్యూస్‌టుడే, సీతంపేట, పాలకొండ గ్రామీణం, భామిని, పాచిపెంట, పాలకొండ, గ్రామీణం, బలిజిపేట, సీతానగరం, కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం

తెరపై ఈనాడు

★ శ్రీ సినిమా(ఎస్‌వీబీ): రాజు వెడ్స్ రాంబాయి, శిశు-రోడ్ టు రివెంజ్ ★ టీబీఆర్: ప్రేమంటే, 12ఎ రైల్వే కాలనీ

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో రూపాయిల్లో..)
★ టమాటా: 52, ★ వంగ: 60, ★ బెండ: 50, ★ బీర: 47, ★ దొండ: 75, ★ చిక్కుడు: 47, ★ పచ్చిమిర్చి: 50, ★ కాకర: 35, ★ క్యారెట్: 65, ★ బీట్‌రూట్: 50, ★ ఉల్లి: 23, ★ బంగాళాదుంపలు: 22, ★ అల్లం: 85 ★ వెల్లుల్లి: 70, ★ క్యాప్సికమ్: 75, ★ అరటి(జత): 5, ★ ఆనప: 12
– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొమరాడ, న్యూస్‌టుడే: డంగభద్రకు చెందిన యు.నారాయణ(47) చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఈనెల 11న ప్రమాదవశాత్తూ జారిపడడంతో తలకు తీవ్రగాయమైంది. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రి, అక్కడి నుంచి విశాఖ తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై నీలకంఠం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహం

పెదవాల్తేరు(విశాఖపట్నం), న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈనెల 22న విశాఖలోని వుడా పార్కు లైట్ హౌస్ వద్దనున్న తీరంలో బుల్లయ్య కళాశాల డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు గల్లంతయ్యారు. వీరికోసం పోలీసులు, లైఫ్‌గార్డులు రెండు రోజులుగా గాలించారు. ఆదివారం ఉదయం సాలూరు ప్రాంతానికి చెందిన మానేపల్లి తేజేష్(20) మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మరో యువకుడు ఆదిత్య జాడ తెలియలేదని సీఐ పైడయ్య తెలిపారు.

విజేతలకు బహుమతులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండకు చెందిన సరదా చదువుల సంస్థ వారు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులను ఆదివారం అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన కత్తులకవిటికి చెందిన జి.చైతన్యకు రూ.5,000, అంబకండికి చెందిన వంశీకృష్ణకు రూ.3,000, తంపటాపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఐ.లహరికి రూ.రెండు వేల నగదు బహుమతులను ఎంఈవో ఆనందరావు, ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహన్, నారాయణరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు రమణ, సంపత్, వాసుదేవరావు, హేమనీ, సురేష్, రామకృష్ణ, వాసుదేవరావు తదితరులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వాట్సప్ గ్రీవెన్స్

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు సులభంగా వాట్సప్ గ్రీవెన్స్ ద్వారా ఆయన దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను చిత్రాలతో నేరుగా 72070 11891 నంబరుకు పంపాలి.
– న్యూస్‌టుడే, పాలకొండ

భోజన పథకాన్ని ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: భోజన పథకాన్ని ప్రైవేటీకరిస్తే ఉద్యమం చేస్తామని ఏపీ మధ్యాహ్న భోజన పథకం సంఘం నాయకులు స్పష్టం చేశారు. భోజన పథకాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని సంఘం నాయకులు చొక్కాపు సుశీల, ఆదమ్మ కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతిని ఆదివారం మంత్రి సంధ్యారాణి పీఏకు అందించారు. సభ్యులు ఉన్నారు.

ధనుంజయకు సత్కారం



జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలసకు చెందిన ఈపు ధనుంజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానికులు సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. నాయకులు వెంకటరమణ, మోహనరావు, రమేష్, సింహాచలం తదితరులు ఉన్నారు.

అయిదుగురి అరెస్టు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే : పట్టణంలోని జగన్నాథపురంలో జూదం ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోవిందరావు తెలిపారు. వీరి నుంచి రూ.3,700, అయిదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధులకు చేయూత

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటకు చెందిన పాలూరి సిద్ధార్థ ఆధ్వర్యంలో అక్కడి వృద్ధాశ్రమానికి చెందిన కొంత మంది వృద్ధులు ఆదివారం కాశీకి బయలుదేరారు. వీరికి ఎస్పీ మాధవ్‌రెడ్డి ఆదేశాలతో పట్టణ సీఐ మురళీధర్ ఆధ్వర్యంలో రాత్రి బస, ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఎస్సై పాపారావు, ఏఎస్సై శ్రీనివాసరావు దగ్గరుండి వారిని రైలు ఎక్కించారు.

ఆర్థిక సాయం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో వెలగవాడకు చెందిన జనసేన కార్యకర్త పోరాపు శివాజీ ఇటీవల మృతిచెందడంతో ఆయన భార్య అమరావతికి తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కె.నాగబాబు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఆ పార్టీ స్థానిక నాయకులు జి.సత్తిబాబు, జానీ, వినయ్ తదితరులు ఉన్నారు.

నలుగురు కార్యదర్శులపై వేటు

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన చంటి, వెంకటనాయుడు డీపీవోకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శితోపాటు గతంలో పనిచేసిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆత్మరక్షణ శిక్షణతో శారీరక దృఢత్వం

సీతానగరం, న్యూస్‌టుడే: విద్యార్థినులందరూ ఆత్మరక్షణ విద్య శిక్షణను సద్వినియోగం చేసుకుని, మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని సాధించాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి కోరారు. జోగింపేట కేజీబీవీ కేంద్రంగా రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణను ప్రారంభించారు. విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర బోర్డు డైరెక్టరు లక్ష్మణ, ఏపీసీ తేజేశ్వరరావు, తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో-2 వెంకటరమణ, ప్రత్యేకాధికారిణి సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం ఉప కేంద్రం పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. నిర్వహణ పనుల్లో భాగంగా కురుపాంలోని వైరిచర్ల కాలనీ, టీచర్స్ కాలనీ, ఐటీడీఏ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో మాతుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. పార్వతీపురం వేదార్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాల విద్యార్థులు సీహెచ్ సతీష్, , బి.కార్తిక్, పి.సుప్రియ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డు అందజేశారు. వారిని పాఠశాల హెచ్‌ఎం పైడిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహాసభలు విజయవంతం చేయాలి

గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న రమణారావు తదితరులు

సీతంపేట, న్యూస్‌టుడే: 18వ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి వచ్చే ఏడాది జనవరి నాలుగో తేదీ వరకు విశాఖ పట్టణంలో జరగనున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు తెలిపారు. సీతంపేటలో ఆదివారం వివిధ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎ.భాస్కరరావు, జి.శ్రీరాములు, అంజలి, ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్య విన్నారు.. పరిష్కారం చూపారు

ఈనాడు కథనానికి స్పందన

రహదారి శుభ్రం

సీతానగరం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ఈనెల 17న 'ఈనాడు'లో దీనిపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ సర్పంచి తేరే జమ్మ, ఈవో సురేష్‌ల ఆధ్వర్యంలో యంత్రం సహాయంతో ఇరువైపులా శుభ్రం చేశారు.

హమ్మయ్య.. బాగు పడింది

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ-సీతంపేట ప్రధాన రహదారి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ దారిలో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికుల అవస్థలపై ఈనెల 3న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. శనివారం నుంచి రోడ్డు పనులు ప్రారంభించారు.

లీకులు సరి చేసి.. శుభ్ర పరిచి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రి వెనుక భాగంలో ఆవరణ ఎట్టకేలకు శుభ్రపడింది. కొన్నిచోట్ల డ్రైనేజీ పైపుల లీకులను అరికట్టారు. దీంతో పరిసరాలు మెరుగయ్యాయి. ఇక్కడ కిటికీలకు తలుపులు లేకపోవడం, లీకులు తదితర సమస్యలపై గురువారం 'ఈనాడు'లో 'రంగులు భళా.. లోపలంతా డొల్ల' శీర్షికతో వచ్చిన కథనానికి డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు, పర్యవేక్షకురాలు నాగశివజ్యోతి స్పందించారు. మిగతా పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

కందకాల తవ్వకం

పాలకొండ, న్యూస్‌టుడే: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై ఈనెల 18న 'ఈనాడు'లో 'కన్ను పడిందా... కరకట్టైనా తెగాల్సిందే' శీర్షిక వచ్చిన కథనానికి తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి స్పందించారు. పోలీసుల ఆధ్వర్యంలో అంపిలి, మంగళాపురం గ్రామాల వద్ద జేసీబీతో కందకం ఏర్పాటు చేయించారు.

ప్రతిపాదనలు తయారు

పాచిపెంట, న్యూస్‌టుడే: గరిసిగుడ్డి పంచాయతీ జీలికవలస నుంచి మర్రిపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించామని ఐటీడీఏ కార్యనిర్వాహక ఇంజినీరు ఏ.మణిరాజు తెలిపారు. 'రాళ్లు.. రప్పలు.. ఎంటీ తిప్పలు' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు.

భవన నిర్మాణానికి అడుగులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలో వనరుల కేంద్రం నూతన భవన నిర్మాణానికి సమగ్రశిక్ష జేఈ వి.రామకృష్ణ కార్యాచరణ ప్రారంభించారు. 'నిధులున్నా.. పనులు కావట్లే!' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొలతలు వేసి, త్వరలో నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు.

(c) eenadu

హోరాహోరీ!

సింగరాయకొండలో క్రీడాసందడి మొదలైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, శిక్షకులు, సహాయకులు, ప్రేక్షకులతో ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది. తొలిరోజు కొన్ని జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. హ్యాండ్‌బాల్‌లో తలపడుతున్న కర్నూలు, అనంతపురం జట్ల క్రీడాకారులను చిత్రంలో చూడొచ్చు. –న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

సత్యసాయి... సదా స్మరామి



జిల్లావ్యాప్తంగా ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బాబా మందిరాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ పిల్లలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని గాంధీనగర్ జడ్పీ కాలనీ శ్రీ సత్యసాయిబాబా మందిరంలో నిర్వహించిన సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆ చిత్రమే ఇది. –న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం



ముద్దసానమ్మకు భక్తనీరాజనం

మార్కాపురం మండలం కోలభీమునిపాడు గ్రామశివారులో వెలిసిన ముద్దసానమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. –న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

పండిస్తే తెల్లబోవాల్సిందే!

జిల్లాలోని పొగాకు రైతుల ఇళ్లల్లో వైట్‌బర్లీ రకం పంట దిగుబడులు పేరుకుపోయాయి. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కర్షకుల ఇళ్లల్లో నిల్వ చేసిన పొగాకు దిగుబడులు నానిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ధర దక్కకపోవడంతోనే రైతులకు ఈ పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం వర్జీనియా పొగాకు ధర ఊరిస్తుండడంతో ఈ ఏడాదైనా ధర దక్కుతుందని ఆశ పడటం, మరో పంట సాగుపై ఆలోచన చేయకపోవడంతో రైతులు ఇష్టానుసారంగా వైట్‌బర్లీ పొగాకు సాగు చేస్తున్నారు. –ఈనాడు, ఒంగోలు

- ధరల పతనంతో వైట్‌బర్లీ పొగాకు రకంపై ఆంక్షలు
- ఇష్టానుసారంగా సాగు చేస్తున్నా కొరవడిన పర్యవేక్షణ

అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పొగాకు ఎగుమతులు లేకపోవడంతో ఈ ఏడాది నల్లబర్లీ, వైట్‌బర్లీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం నల్లబర్లీ సాగును పూర్తిగా నిషేధించగా, కంపెనీతో కొనుగోలు ఒప్పందం కుదిరితేనే వైట్‌బర్లీ సాగు చేపట్టాలని సూచించింది. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన లేమితో ఇప్పటికే వందలాది ఎకరాల్లో సాగు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంతకాలం ఆగగా, ప్రస్తుతం తిరిగి సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రధానంగా ఒంగోలు డివిజన్ పరిధిలో భారీగా సాగవుతోంది. వాస్తవానికి ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం ఏదైనా పొగాకు కంపెనీ తాము ఈ పంట కొనుగోలు చేస్తామని హామీ పత్రం ఇచ్చినప్పుడు మాత్రమే వైట్‌బర్లీ పంట వేయాలి. దీన్ని మండల, డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు పర్యవేక్షిస్తుండాలి. అధికార యంత్రాంగం ఇతర పనుల్లో నిమగ్నమవ్వడంతో క్షేత్రస్థాయిలో పంట సాగు కట్టడి కావడం లేదు.

ఒప్పందం చేసుకునేది ఎలా?

పొగాకు కంపెనీతో ఒప్పందం ఎలా ఉండాలనే విషయమై అధికారులు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రత్యేకించి పత్రంలో పొందుపరచాల్సిన అంశాలపై ఎలాంటి ఆలోచన చేయలేదు. దీంతో ఎలా ఒప్పందం చేసుకోవాలో ఇటు రైతులకు, అటు పొగాకు కంపెనీలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు పొగాకు నారు తెచ్చుకున్న రసీదులను ఒప్పంద పత్రంగా చూపుతున్నారు. ఈ నెల ఆరో తేదీన సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ అధ్యక్షతన పొగాకు కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామగ్రామాన పంట ఎక్కడ వేస్తున్నారో గుర్తించి అవగాహన కల్పించకుంటే వచ్చే ఏడాదీ రైతులు రోడ్డున పడటం ఖాయంగా కనిపిస్తోంది.

నిబంధనలు అమలు చేస్తాం

పొగాకు కొనుగోలుకు ఒప్పందం పత్రం ఎలా ఉండాలనేది తయారు చేస్తున్నాం. రైతు వద్ద ఒకటి, పొగాకు కంపెనీ వద్ద ఒకటి, వ్యవసాయశాఖ వద్ద ఒకటి ఉండేవిధంగా చూస్తాం. త్వరలో పొగాకు కంపెనీలతో జరిగే సమావేశంలో అన్ని వివరాలు సమగ్రంగా సేకరిస్తాం. నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, డీఏవో

అరుణ కిరణమే సమ్మోహన చిత్రమై!



ఆస్వాదించాలే గానీ ప్రకృతిలో ఐమిడి ఉన్న అందాలను తనివితీరా చూడొచ్చు. కొన్ని సహజసిద్ధంగా అలరిస్తే.. మరికొన్ని సమయానుసారంగా ఆకర్షిస్తాయి. సూర్య కిరణాలు పడమరన వాలుతూ.. లేత ఎరుపు రంగును విరజిమ్ముతూ ఎండిన చెట్టు.. పక్షుల కిలకిల రావాల మధ్య విరిసినట్లు పుష్పాలు తనదైన అందాలతో కనువిందు చేస్తున్న దృశ్యం రంగాపురం సమీపంలో ఇలా ఆవిష్కృతమైంది. –న్యూస్‌టుడే, అర్ధవీడు

ఆరో తరగతి నుంచే వృత్తి నైపుణ్య శిక్షణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వృత్తి నైపుణ్యాలపై ఆరోతరగతి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ వంటి 10 రకాల ట్రేడ్లపై విద్యార్థులకు బోధించేందుకు జిల్లాలోని 71 ఒకేషనల్ పాఠశాలలకు సమగ్రశిక్ష అభియాన్ ద్వారా పుస్తకాలు పంపిణీ చేసింది. ఈ విషయమై జీసీడీవో హేమలత మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఆరో తరగతి నుంచే అవగాహన, శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. పాఠశాలలకు సుమారు 20 వేల పుస్తకాలను పంపిణీ చేశామన్నారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ 6లో..

డిగ్రీ విద్యార్థుల్లో అయోమయం

బ్రాంచి మార్పునకు అవకాశమివ్వకుండా తక్షణ ప్రవేశాలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఆయోమయం నెలకొంది. సాధారణ ప్రవేశాలు పూర్తయి మూడు నెలలుగా తరగతులు జరుగుతున్నాయి. ఎవరైన విద్యార్థులు తీసుకున్న కోర్సు చదవలేని పరిస్థితి ఉంటే మరో బ్రాంచిలోకి మారడానికి అవకాశం కల్పిస్తారు. ఈ సారి ఉన్నత విద్యామండలి ఆ అవకాశం ఇవ్వకుండా తక్షణ ప్రవేశాలకు ఉత్తర్వులిచ్చింది. దీంతో బ్రాంచి మార్పునకు ఎదురుచూస్తున్న విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణ ప్రవేశాలకు సోమవారం వరకు అవకాశం కల్పించారు. ఇది పూర్తయితే దాదాపు అన్ని సీట్లు భర్తీ అవుతాయి. బ్రాంచి మార్పు కోరుకునేవారు మొదట తీసుకున్న బ్రాంచిలోనే కొనసాగాల్సి వస్తుంది. బీఎస్సీ ఏఐ బ్రాంచి కష్టంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. దానికి బదులు బీఏ, బీకాం కోర్సుల్లో చేరాలని నిర్ణయించుకున్నారు. జిల్లాలో 77 డిగ్రీ కళాశాలలుండగా, సుమారు 7 వేల మంది విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరారు. వీరిలో సుమారు 300 మంది బ్రాంచి మార్చుకునేందుకు ఎదురు చూస్తున్నారు. ఏటా ఇచ్చే అవకాశాన్ని ఈ సారి ఇవ్వకపోవడంతో వారిలో నిరాశ నెలకొంది.

అధ్యక్షా..!

- మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి 9 మంది విద్యార్థుల ఎంపిక

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

శాసనసభ కార్యకలాపాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల నుంచి ప్రాథమికంగా ముగ్గురేసి చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్ర విద్యాశాఖకు వివరాలు పంపగా, వారిలో ఒకరి చొప్పున ఎంపిక చేశారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 8 మందితోపాటు మార్షల్స్ పాత్రకు ఒకరిని ఎంపిక చేశారు. వీరందరిని డీఈవో ఎ.కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడలోని లయోలా కళాశాలకు ఆదివారం ప్రత్యేక బస్సులో తరలించారు. వీరితోపాటు ఎస్కార్ట్‌లుగా ఇద్దరు పాఠశాల ఉపాధ్యాయులు బయలుదేరి వెళ్లారు. ఎంపికైన విద్యార్థులకు సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇస్తారు. స్పీకర్, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ఎమ్మెల్యేలుగా ఎవరు నటించాలనేది శిక్షణ అనంతరం ఎంపిక చేస్తారు. బాలికలు రెండు చీరలు, బాలురు తెల్లని దుస్తులు వెంట తీసుకుని వెళ్లారు. మాక్ అసెంబ్లీ తిలకించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

ప్రత్యేక బస్సులో విజయవాడ బయలుదేరుతున్న విద్యార్థులు

ఎంపికైనవారు వీరే...

(నియోజకవర్గం, విద్యార్థి, తరగతి, పాఠశాల)

వైపాలెం: ఎం.నవదీప్, పదోతరగతి, త్రిపురాంతకం జడ్పీ ఉన్నత పాఠశాల; **దర్శి:** మహ్మద్‌ఫరూక్, 9వ తరగతి, నాగంబొట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల; **ఎస్ఎన్‌పాడు:** ఎన్.శ్రీను, పదోతరగతి, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల; **ఒంగోలు:** వి.లక్ష్మీపూజిత, పదోతరగతి, కొత్తపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల; **కొండపి:** ఎం.పవన్‌కుమార్, పదోతరగతి, జరుగుమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల; **గిద్దలూరు:** ఎన్.రమ్యశ్రీ, 9వ తరగతి, గిద్దలూరు జడ్పీ ఉన్నత పాఠశాల; **కనిగిరి:** రవి జితేంద్ర, 9వ తరగతి, వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల; **మార్కాపురం:** జి.వర్షిత, 9వ తరగతి, కలుజువ్వలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల; **మార్షల్:** కె.నాగరాజు, పదోతరగతి, గణపవరం ఏపీ గురుకుల పాఠశాల

విద్యుత్తు ఛార్జీలు తెలుసుకోండిలా..



విద్యుత్తు బిల్లులకు సంబంధించి కూటమి ప్రభుత్వం తాజాగా ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించింది. గృహ, వాణిజ్య విద్యుత్తు వినియోగంపై వినియోగదారులకు కచ్చితమైన వివరాలు చేరువ చేసింది. గృహ విద్యుత్తు వినియోగదారుల నుంచి 30 యూనిట్ల వరకు ఒక్కో యూనిట్‌కు రూ.1.90 వసూలు చేస్తుంది. అనంతరం 31 నుంచి 75 యూనిట్ల వరకు (45 యూనిట్లు) రూ.3, 76వ యూనిట్ నుంచి 125 యూనిట్ల వరకు (50 యూనిట్లు) రూ.4.50 చొప్పున వసూలు చేస్తుంది. ఇలా వినియోగించిన విద్యుత్తుతోపాటు అదనంగా ఫిక్స్‌డ్, కస్టమర్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఎఫ్‌పీపీసీఏ ఛార్జీలతో కలిపి మొత్తం బిల్లు వస్తుంది.

–న్యూస్‌టుడే, అర్ధవీడు

యూనిట్‌కు రూ.లలో

గృహవినియోగం

యూనిట్లు	ఛార్జీ
0-30	1.90
31-75	3.00
76-125	4.50
126-225	6.00
226-400	8.75
400పైన	9.75.

వాణిజ్య వినియోగం

యూనిట్లు	ఛార్జీ
0-50	5.40
51-100	7.65
101-300	9.05
301-500	9.60
500పైన	10.15

ఈ చెరువును చూస్తే పులికించాల్సిందే!

నీటితో కళకళలాడుతోంది నల్లమల అటవీ ప్రాంతంలోని పులి చెరువు. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో పులులు, చిరుతలతోపాటు 18వేలకుపైగా శాఖాహార జీవాలు దాహార్తి తీర్చేందుకు పలు నీటి వనరులున్నా ఈ పులి చెరువుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఇందులో మండు వేసవిలోనూ తాగునీరు పుష్కలంగా ఉంటుంది. పెద్దసంఖ్యలో పులులు ఈ చెరువు నీటితోనే దాహార్తిని తీర్చుకుంటుంటాయి. హైదరాబాద్, రాజమహేంద్రవరం అటవీ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందే ఉద్యోగులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈ చెరువును తప్పనిసరిగా సందర్శిస్తారు. ఇక్కడ పులుల అడుగులు, అవి చెట్లపై గీసిన గీతలను చూపి దాని జీవన విధానంపై శిక్షకులు వివరిస్తారు.. తుమ్మలబైలు సమీపంలోని జంగిల్ సఫారీకి వచ్చే పర్యాటకులకు ఇదో పర్యాటక ప్రదేశం.

–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పారిశ్రామికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, స్వామి

ఒంగోలు, న్యూస్‌టుడే: పారిశ్రామికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని త్రోవగుంట ఆటోనగర్‌లో రూ.10.94 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభ్యర్థన మేరకు రూ.10.94 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జిల్లాకు రూ.3,704 కోట్ల పెట్టుబడులతోపాటు 5 వేల ఉద్యోగావకాశాలు వచ్చాయని తెలిపారు. ముందుగా ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్డులో రూ.2.14 కోట్లతో నిర్మించనున్న జిల్లా భూగర్భగనులశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు

నిమ్మ కిలో రూ.పదే... నమ్ముకున్న రైతుకు వ్యధే!

జిల్లాలో 1,350 హెక్టార్లలో నిమ్మ సాగవుతుండగా, సింహభాగం కనిగిరి నియోజకవర్గంలో సాగవుతోంది. నిమ్మ ధర కిలో రూ.60 నుంచి రూ.10కు పడిపోయింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, బిహార్, మధ్యప్రదేశ్, బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లకు ఎగుమతుల్లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఎకరా సాగుకు రూ.40 వేల వరకు ఖర్చవుతుందని, దిగుబడులు బాగుండడంతో పాటు తెగుళ్లు లేకపోవడంతో మంచి ధర పలుకుతుందనుకుంటే నష్టాలే ఎదురయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. –న్యూస్‌టుడే, కనిగిరి

విహారం... ప్రత్యక్ష పరిజ్ఞానం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అచరణాత్మక అభ్యసన అనుభవాలతో ప్రత్యక్ష పరిజ్ఞానం అందిస్తూ శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచేందుకు ఏపీ సమగ్రశిక్ష అభియాన్ విహార యాత్రలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం నిధులు సైతం కేటాయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని గుండ్లాపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆదివారం భైరవకోన విహారయాత్రకు వెళ్లారు అక్కడ పారే జలపాతాలతో పాటు శైవక్షేత్రంను సందర్శించారు. ఇక్కడ విశిష్టతలతో పాటు శైవక్షేత్రం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. –న్యూస్‌టుడే, మద్దిపాడు

నేటి నుంచి రైతన్న మీ కోసం వారోత్సవాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు 'రైతన్న మీకోసం' వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతు కుటుంబాలను సందర్శించనున్నారు. 30వ తేదీ నుంచి నవంబరు 2వ తేదీ వరకు రైతు కుటుంబాల నుంచి సేకరించిన డేటా ఆధారంగా నివేదిక తయారు చేయాలి. చివరి రోజైన 3వ తేదీన రైతు సేవా కేంద్రాల్లో 2025-26 రబీ, ఖరీఫ్-2026, 2026-27 రబీ సీజన్లకు సంబంధించి వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏ శుభకార్యమైనా ఇక్కడి నుంచే

చిత్రంలో కనిపిస్తోంది కనిగిరి పట్టణ నడిబొడ్డున ఉన్న బొడ్డు చావిడి. దీనిని 15వ శతాబ్దంలో గజపతుల పాలనలో పెద్ద రాతితో నిర్మించారు. ప్రస్తుతం చావిడిపై విఘ్నేశ్వరాలయాన్ని నిర్మించగా, ఇక్కడ ప్రజలు నిత్యం పూజలు చేస్తుంటారు. గజపతుల కాలం నుంచి నేటికి కూడా ఉత్సవాలు గానీ, ఎలాంటి శుభ కార్యక్రమాలైన ఇక్కడ నుంచి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఏ కార్యమైనా ఇక్కడ నుంచి మొదలు పెడితే అంతా మంచి జరుగుతుందని ఇక్కడ ప్రజల నమ్మకం.

–న్యూస్‌టుడే, కనిగిరి

క్షేత్రస్థాయిలో తిరగక.. సగమూ జరగక!

- నత్త నడకన ఓటరు జాబితాల స్వచ్ఛీకరణ
- రెండు నెలల్లో పూర్తయింది 46.56 శాతమే

అర్హులైన ఓటర్లను తొలగించారంటూ బిహార్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వేళ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలు పరిశీలన చేపట్టారు. దీనిలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సెప్టెంబరు నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు 8,50,318 మంది (46.56 శాతం) ఓటర్లను మాత్రమే మ్యాపింగ్ చేశారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు, తహసీల్దార్లు ఆ దిశగా దృష్టిసారించకపోవడంతో నత్తనడకన సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. –న్యూస్‌టుడే, కలెక్టరేట్

కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బీఎల్వోలు

ఇటు పుట్టింట్లో.. అటు మెట్టినింట్లో..

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2002 నాటికి 15,61,302 మంది ఓటర్లు ఉండగా; ప్రస్తుతం 18,26,155 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బోగస్ ఓటర్లను గుర్తించేందుకు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఓటుహక్కుపై బీఎల్వోలు ఆరా తీస్తున్నారు. వీరందరికీ ఓటు ఎక్కడున్నా ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు. తద్వారా రెండేసి చోట్ల ఓటు ఉంటే గుర్తించి ఇతర ప్రాంతంలోని ఓటును తొలగించనున్నారు. వివాహం అనంతరం ఎక్కువ మంది మహిళలకు ఇటు పుట్టింట్లో, అటు మెట్టినింట్లో రెండేసి ఓట్లు ఉన్నట్లు వెలుగు చూసింది. ఒకచోట మాత్రమే ఓటు హక్కు ఉండేలా చూస్తున్నారు.

2002 జాబితాను పరిశీలిస్తూ...

2002లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా; 2009లో జరిగిన పునర్విభజనతో 12 నియోజకవర్గాలకు తగ్గాయి. దీంతో 2002తో పోలిస్తే ప్రస్తుతం జనాభా పెరిగిన నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ల సంఖ్య పెరిగింది. 2002 జాబితాల పరిశీలన క్రమంలో ఇంటి సంఖ్యల వారీగా ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్నారు. అప్పట్లో ఏ పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఆ తర్వాత ఎంత మంది కొత్తగా ఓటుహక్కు చేర్చుకున్నారు. 2002 నుంచి ఇప్పటికీ కూడా ఎవరైతే ఓటుహక్కు కలిగి ఉంటారో వారందరూ స్థానికులుగా భావిస్తారు. ఆ తర్వాత ఎవరైతే కొత్తగా ఓటు హక్కు పొందారో వారిని ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఓటు చేర్చుకున్నట్లు గుర్తిస్తారు. దీంతో ఒకే పేరు మీద రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే వాటిని గుర్తిస్తున్నారు. పాత జాబితాలో ఉండి ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఓటుహక్కు లేనివారి పేర్లను కూడా నమోదు చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అందుకు గల కారణాలు రాస్తున్నారు.

ఈడబ్ల్యూఎస్ పత్రం పొందండిలా!

అగ్రవర్ణ పేదలకు ఏడేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఎకనమికల్లీ వీకర్ సెక్షన్(ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల అమలుకు శ్రీకారం చుట్టింది. దీంతో అప్పటి నుంచి అన్ని తహసీల్దారు కార్యాలయాల్లోనూ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ మొదలైంది. ఈ పత్రాలు పొందిన అగ్రవర్ణ పేద పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్ పొందేందుకు వీలుంది. విద్యాసంస్థలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు చెల్లుబాటు కానుంది. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షకు ప్రకటన విడుదల కావడంతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. రానున్న మేలో ఎంసెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రాలకు ప్రాధాన్యం పెరిగింది. తొలుత మీ సేవా కేంద్రాలు లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో పేరు నమోదు చేసుకోవాలి. దీంతోపాటు బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, ఏడాదికి రూ.8 లక్షల ఆదాయంలోపు ఉన్నట్లు బ్యాంకు లావాదేవీల వివరాలు, ఆదాయ పన్ను చెల్లింపు పత్రాలు, అఫిడవిట్ ఫొటో జతపరచాలి. విద్యార్థులు తమ చిరునామాకు ఆధార్‌కార్డు, చదువుకు సంబంధించిన ధ్రువీకరణ, టీసీ, జనన ధ్రువీకరణపత్రంలో ఏదైనా ఒకదానితోపాటు ఫొటో ఇవ్వాల్సి ఉంటుంది. –న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

నిబంధనలివి

- దరఖాస్తుదారుని గత సంవత్సర ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి.
- అయిదెకరాలు, అంతకంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉండకూడదు. కుటుంబ నివాస గృహం వెయ్యి చదరపు అడుగులలోపు ఉండాలి.
- నివేశన స్థలం పురపాలికల్లో 100 చదరపు గజాలు, ఇతర ప్రాంతాల్లో 200 చదరపు గజాలు ఉండాలి.
- తమ ఆస్తులన్నింటినీ కుటుంబం ధ్రువీకరిస్తూ న్యాయవాది ద్వారా నోటరీ అఫిడవిట్‌తోపాటు కుటుంబ సభ్యులు వాంగ్మూలాన్ని దరఖాస్తుతోపాటు తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలి.
- దరఖాస్తు దారులు ఇతర ప్రాంతాలకు వలస పోయి అక్కడే స్థిరపడినట్లయితే సొంత మండలం నుంచి వలస ధ్రువీకరణపత్రం తెచ్చుకుని తహసీల్దారుకు సమర్పించాలి.

30 రోజుల వ్యవధిలో...

మీ సేవా కేంద్రం లేదా సచివాలయాల్లో దరఖాస్తు చేసి రుసుం చెల్లిస్తే 30 రోజుల వ్యవధిలో దరఖాస్తును పరిశీలించి అభ్యంతరాల్లేకుంటే జారీ చేస్తారు. వీఆర్వో, ఆర్.ఐ. తన విచారణ నివేదికలతో తహసీల్దారుకు ధ్రువీకరణ పత్రం నిమిత్తం సిఫార్సు చేస్తారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నచోటే ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది.



ఆ ఊరికి ఘాటెక్కువ!

కొమరోలు మండలం గుండ్రెడ్డిపల్లె గ్రామం మిర్చి వ్యాపారులకు పెట్టింది పేరు. గ్రామంలో 250 కుటుంబాలుండగా, అత్యధిక శాతం కుటుంబాలు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వీరు జిల్లాతోపాటు గుంటూరు, కర్నూలు జిల్లాలతో పాటు బళ్లారి ప్రాంతంలో మిర్చిని కొనుగోలు చేసి భోపాల్, లక్నో, నాగపూర్, జయపుర, రాజస్థాన్, కోట, చెన్నై, కొచ్చి, బెంగళూరు తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

–న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

(c) eenadu

ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

District Sponsor: QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE

Digital Partner: ఈనాడు.నెట్ | TV Partner: ఈటీవీ భారత్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).

● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు యూనిట్ కార్యాలయం,
పేర్నమిట్ట గ్రామం,
సంతనూతలపాడు మం 523 225
వివరాలకు: 800 8000 235, 91770 44423
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

మార్కెట్‌లో పట్టుగూళ్లకు మంచి ధరలు పలుకుతుండడంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. హిందూపురం, పలమనేరు తదితర మార్కెట్లలో కిలో పట్టుగూళ్ల ధరలు గరిష్ఠంగా రూ.800 వరకూ ఇటీవల పలికాయి. సగటున రూ.600కు పైగానే అమ్ముతుండడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

\- న్యూస్‌టుడే, కంభం

పట్టు పట్టు... లాభాలు వచ్చేట్టు!

గత పాలనలో గిట్టుబాటు కరవు

వైకాపా పాలనలో మల్బరీ సాగు చేసిన కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. అప్పట్లో జిల్లాలో సుమారు 1500 ఎకరాలకు పైగా సాగు ఉండగా, ప్రస్తుతం 500కు పడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రకాల ప్రోత్సాహకాలు అందిస్తోంది.

వంద ఎకరాల్లో పెరిగిన సాగు..

కొత్తగా ఈ ఏడాది వంద ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. మల్బరీ సాగు ఎక్కువగా పశ్చిమ ప్రకాశంలోని బేస్తవారపేట, గిద్దలూరు, రాచర్ల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల తదితర మండలాల్లో ఉంది. జిల్లాలో సోమవారం నుంచి వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రైతులకు మెరుగైన సూచనలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

◗ ఆశాజనకంగా పట్టుగూళ్ల ధరలు



పట్టుగూళ్లు

మొక్కలకు పెరిగిన రూ.29 వేలు

వైకాపా పాలనలో ఎకరం పొలంలో నాటే 5 వేల మొక్కలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.53 వేలు ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.82 వేలకు పెంచింది. ప్రభుత్వ సాయం సాధారణ రైతులకు ఎకరానికి 22,500 కాగా, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు ఇస్తోంది. మంచి ధరలు, ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మంచి ఆదాయం సాధించవచ్చు

పట్టుసాగుతో మంచి ఆదాయం సాధించవచ్చు. ఎకరానికి నెలకు రూ.50 వేల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో మల్బరీ సాగుకు అనుకూల వాతావరణం ఉంది. భూగర్భ జలాలు పెరిగాయి. రసాయన రహిత సాగుకు అనుకూలమైంది. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం సాధించేందుకు వీలుంటుంది. కొత్తగా సాగు చేయాలనుకునే రైతులు అధికారులను సంప్రదిస్తే రాయితీలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- పి.సుజయ్‌కుమార్, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి, ఒంగోలు

క్రీడాజ్యోతి వెలిగించి హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య తదితరులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు, క్రీడలూ విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం కావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సూచించారు. సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం అండర్-19 బాలబాలికల ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మంత్రితోపాటు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు హాజరై జ్యోతి వెలిగించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఐఈవో ఆంజనేయులు, ప్రిన్సిపల్ సౌజన్య, వ్యాయామ ఉపాధ్యాయులు శీనయ్య, ఎస్టీ ప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

లేబర్ కోడ్‌లు నిలిపివేయాలని 26న ధర్నా

ఒంగోలు గ్రామీణం: కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్‌లు అమలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న ఒంగోలులో నిర్వహించనున్న ద్విచక్ర వాహన ర్యాలీతోపాటు, ధర్నాను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కేంద్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ రోజున స్థానిక కర్నూలు రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద నుంచి అద్దంకి బస్టాండ్, పాత మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ; ఆ తర్వాత ధర్నా నిర్వహిస్తారన్నారు. 2021 డిసెంబర్ 9న పార్లమెంటు సాక్షిగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. పంట ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనిదినం, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, నాయకులు జి.శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నేత చుండూరి రంగారావు

విష్ణు యమహా షోరూంలో నూతన బైక్‌ల విడుదల

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీవిష్ణు యమహా షోరూంలో ఆదివారం నూతన ద్విచక్ర వాహనాలు ఎక్స్ఎస్ఆర్ 155 సీసీ, ఎఫ్‌టు రేర్ బైక్ 135 సీసీలను ఆదివారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మార్కెట్‌లోకి విడుదల చేశారు. కమిషనర్ మాట్లాడుతూ విష్ణు యమహా షోరూం వారు కస్టమర్లకు మంచి సర్వీసు అందిస్తూ అధునాతన మోడల్స్‌ను అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. షోరూం అధినేత సుబ్రహ్మణ్యం, విష్ణు మాట్లాడుతూ ఆదివారం ప్రవేశపెట్టిన ఎక్స్ఎస్ఆర్ 155 సీసీ బైక్ లిక్విడ్ కూల్ ఉంటుందని, ఎఫ్‌టు రేర్ బైక్‌కు ఎయిర్ కూలింగ్ ఉంటుందన్నారు. ప్రత్యేకమైన యాంటీ బ్రేకింగ్ సిస్టం ఉంటుందన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

బండ్లమూడి కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

సంతనూతలపాడు : చీమకుర్తి మండలం బండ్లమూడిలో ఇటీవల చోటుచేసుకున్న దళితులపై దాడి ఘటనకు సంబంధించి నమోదైన అట్రాసిటీ కేసులో ఐదుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కంట్లం ఏసుదాసు, తదితరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులైన జి.ఓబుల్‌రెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, వి.రమణారెడ్డి, వి.ఏడుకొండలు, పి.సంజీవులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 102/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 108, రిటైల్ లైవ్ - 135, చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్- 223

సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి

రాచర్ల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొదమల రాజేష్ (30) ఇటీవల కాలంలో అయిదెకరాల పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. పొలానికి నీళ్లు పెట్టేందుకు పరివర్తకం వద్ద త్రీ ఫేజ్ ఫ్యూజ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న దేవయ్య ఈ విషయాన్ని గమనించాడు. రాజేష్ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య సుజాత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జరుగుమల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన 16వ జాతీయ రహదారిపై మండలంలోని బిట్రగుంట సమీపంలోని పాలేటి వంతెనపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు భాగ్యనగర్ మూడో లైన్‌కు చెందిన మిన్ను శాంతికుమారి(30), మార్కాపురం మండలం మిట్టమీదపల్లికి చెందిన గుంతోటి ఉదయ్‌కిరణ్‌లు ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సులుగా పనిచేస్తున్నారు. జరుగుమల్లిలో ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. పాలేటి బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శాంతికుమారి అక్కడికక్కడే మృతిచెందగా.. వాహనం నడుపుతున్న ఉదయ్ కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతురాలి తండ్రి బహదూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మానసిక స్థితి బాగాలేక ఓ యువకుడు మద్యంలో ఎలుకల మందు కలిపి తాగి అనారోగ్యం పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన వై.పాలెం పట్టణంలోని ఎస్టీ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఎస్టీకాలనీలో రావూరి శ్రీకాంత్ (21) అనే యువకుడు ఈ నెల 17న మద్యంలో ఎలుకల మందు కలిపి తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని వైద్యశాల్లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు శ్రీకాంత్ సోదరుడు రావూరి సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్సై చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ మ్యాచ్‌లో పరస్పర దాడులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: క్రికెట్ మ్యాచ్‌లో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. చివరకు కేసుల నమోదు వరకు వెళ్లింది. స్థానిక మంగమూరు రోడ్డులో శనివారం కొందరు యువకులు క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ క్రమంలో ఇరు జట్ల మధ్య వివాదం చెలరేగింది. దీంతో క్రీడాకారులు బాహాబాహీకి దిగి దాడులు చేసుకోవడంతో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌లో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు జట్లకు చెందిన పలువురు క్రీడాకారులపై ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

తీవ్ర గాయాలతో హైమావతి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన నాగులుప్పలపాడులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లాపల్లి పారిశ్రామికవాడకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో గుర్రపుశాల వీరరాఘవులు, హైమావతి దంపతులు తమ కోడలితో కలిసి ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో వీరరాఘవులు భార్య హైమావతి (60)తో గొడవ పడ్డాడు. ఆగ్రహానికి గురై ఆమెపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు గట్టిగా కేకలు వేయగా, స్థానికులు అక్కడికి రాగా వీరరాఘవులు పరారయ్యాడు. ఆమెను 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పొగాకు కూలీలకు రక్షణ చట్టం అవసరం

మద్దిపాడు, న్యూస్‌టుడే: పొగాకు ముఠా (పచ్చాకు) కూలీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వాలు తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వెలుగు కార్యాలయం వద్ద పచ్చాకు కూలీలు, ముఠా మేస్త్రీలు, టోకర్లతో మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 200 మిలియన్ కిలోల పొగాకులో జిల్లా నుంచి 165 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయ్యి విదేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. ఆకు కొట్టుకుని వచ్చేటప్పుడు కూలీలకు ప్రమాదం జరిగితే వారి కుటుంబం రోడ్డున పడుతుందని, కాబట్టి వారి కోసం రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భూరగ శ్రీను, హరిబాబు, అంజయ్య, అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు

పులి దాడిలో కోడెదూడ మృతి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పులి దాడిలో కోడె దూడ మృతి చెందిన సంఘటన పెద్దబొమ్మలాపురం, గండిచెరువు సమీపంలోని తుంగుడు అటవీ ప్రాంతంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. బోడెనాయక్ తండాకు చెందిన ఆవులమంద శుక్రవారం మేతకు అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. మందలోని కోడె దూడ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆదివారం పశుపోషకులు వెతకగా దాని తల, పుర్రెలు కనిపించాయి. పులి దాడితోనే ఇలా జరిగిందని వారు గంజివారిపల్లె అటవీ రేంజ్ అధికారులకు సమాచారం అందించారు.

సీసీఎస్ నుంచి ఇద్దరు పాత నేరగాళ్ల పరారీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) నుంచి సినీ ఫక్కీలో ఇద్దరు పాత నేరగాళ్లు పరారయ్యారు. ఒంగోలుకు చెందిన వీరు గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాలు, దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గంజాయి కేసుల్లోనూ ప్రమేయం ఉంది. ఇటీవల వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సీసీఎస్ స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నారు. ఆదివారం ఉదయం వీరిద్దరూ పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి ఉడాయించారు. స్టేషన్ కింది అంతస్తులోని లాకప్‌లో వీరిని నిర్బంధించారు. లాకప్ తాళాలను సెల్‌కు సమీపంలోనే ఉంచారు. విధి నిర్వహణలో ఉన్న సెంట్రీ బయటకు వెళ్లిన సమయంలో వీరిద్దరూ లాకప్ తాళాలను చాకచక్యంగా తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయాన్ని సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే నిందితులు అక్కడి నుంచి ఉడాయించారు. పరారైన నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఒంగోలుకు చెందిన వీరిద్దరిపై పలు జిల్లాల్లో చోరీ కేసులున్నట్లు తెలిసింది.

గల్లంతైన సచివాలయ ఉద్యోగి మృతదేహం లభ్యం

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన సచివాలయ ఉద్యోగి శనివారం ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో జారిపడిన ఘటనకు సంబంధించి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఈ ఉదంతం త్రిపురాంతకం మండలంలోని దూపాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన **ముక్తిపూడి అనిల్**(36) దొనకొండ మండలంలోని పోలేపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం విధులకు వెళ్లే ముందు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని సాగర్ కాలువ వద్దకు వెళ్లి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో రాజ్‌కుమార్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి గజ ఈతగాళ్లతో సాగర్ కాలువలో గాలించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మండలంలోని హసనాపురం సమీపంలో అనిల్ మృతదేహాన్ని గుర్తించి స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్సై శివబసవరాజు మృతదేహాన్ని యర్రగొండపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ● రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భర్తను కోల్పోయిన తాను ఆ దుఃఖంలో నుంచి బయటకు రాక ముందే తోడు, అండగా ఉంటున్న ఒక్కగానొక్క కుమారుడు ఇలా మృతి చెందడం జీర్ణించుకోలేక పోతున్నానని.. త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన నా కొడుకు పాడె ఎక్కాడంటూ మృతుడి తల్లి మరియమ్మ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.ఫార్మసీ, Bachelor of Physiotherapy (BPT), B.Sc, నర్సింగ్, GNM నర్సింగ్, మేనేజ్‌మెంట్ సీట్లకై: 9866939320,7013448102

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

DISTANCE EDUCATION

వన్ సిట్టింగ్ డిగ్రీ, B.Tech, MBA, MCA, M.Sc, నర్సింగ్ కోర్సులకు గుజరాత్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్‌లో ప్రముఖ యూనివర్సిటీల నుండి ఇప్పించబడును. ఒంగోలు 7093621555

FINANCIAL SERVICES

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 7095718191.

JOBS

Paparao High School K.Uppalapadu, Prakasam (Dt). Wanted High School Telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female) Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. ✆ 7019326579, 9392182210.

Wanted Graphic Gesigner for Flex Shop Ongole 78936 27544, 95509 76649

ITC కంపెనీ ఒంగోలులో పనిచేయుటకు సేల్స్‌మెన్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. Q: 10th ఆపై Age: 20 to 30y. జీతం+ఇన్సెంటివ్స్. ఇంటర్వ్యూ: 22,24,25th. ✆ 6281198937

ఒంగోలు కర్నూల్‌రోడ్డులో Cheap & Best హెయిర్ సెలూన్ షాపు నందు పనిచేయుటకు Supervisors కావలెను. ✆: 99495 59898

కపిల్ గ్రూప్ మార్కెటింగ్ ఒంగోలు నందు పనిచేయుటకు మార్కెటింగ్ స్టాఫ్, రియల్ ఎస్టేట్ స్టాఫ్ కావలెను. మంచి జీతం ✆: 9505022019, 9848799788

ఒంగోలులోని మా లాయరు గారి ఆఫీసునందు పనిచేయుటకు DTP ఆపరేటర్ కావలెను. సంప్ర: 92474 44225, 93928 19099.

FACULTY/ TEACHERS

Social Teacher-8th to 10th Classes. Science, English Teachers - 6th, 7th, 8th Classes in a historical School, Chimakurthi. Salary: Based on your Talent. Contact: 8309231003, 9849856656.

DRIVERS

డ్రైవర్స్ కావలెను. ఒంగోలుటౌను ఫ్రూట్స్ షాపుకు TATA ACE, INDRA V-30 వ్యాన్‌కు బ్యాడ్జ్ లైసెన్స్‌కల నేషనల్ డ్రైవర్స్ కావలెను. ✆ 6304388821.

(c) eenadu

బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, తదితరులు

పేదలకు అమృత కలశాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, అతిథులు

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల పునరుద్ధరణ పనుల్లో భాగంగా నేడు (సోమవారం) సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మార్కాపురం సబ్ స్టేషన్ పరిధిలోని వేములకోట, కొట్టాలపల్లి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తును నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. ప్రజలు ముందస్తుగా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

నేటి నుంచి రైతన్న మీకోసం..

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలంలో సోమవారం నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం అన్ని రైతుసేవా కేంద్రాల పరిధిలో నిర్వహించనున్నట్లు ఏవో డి.శ్రీనివాసులరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు రైతు సేవాకేంద్రం పరిధిలోని రైతు కుటుంబాలను కలిసి సాంకేతిక సలహాలు, ముఖ్యమంత్రి సందేశాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ◗ పెద్దదోర్నాల: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ నెల 24 నుంచి 29 వరకు రైతన్నా...మీ కోసం వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ తెలిపారు.

సత్యసాయిబాబా సేవలు ఎనలేనివి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: సేవ, శాంతికి బ్రాండ్ అంబాసిడర్‌గా పుట్టపర్తి సత్యసాయి బాబా నిలిచిపోతారని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్ఎస్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన శత జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ చిరంజీవి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎం.వెంకటరెడ్డి, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ◗ గిద్దలూరు పట్టణం: సత్య సాయిబాబా సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం గిద్దలూరు పురపాలికలోని సత్యసాయిబాబా ప్రేమధ్యాన మందిరంలో సత్యసాయి జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా పేదలకు అమృత కలశాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎస్.అనంతరామయ్య, తహసీల్దారు ఎం.ఆంజనేయ రెడ్డి, కమిషనర్ ఎ.వి.రమణబాబు, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాలుగుళ్ల ప్రతాప్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ◗ యర్రగొండపాలెం పట్టణం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్. సర్దార్ హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, వీఆర్వోలు పోతులూరయ్య, నాసర్ వలీ, గోపాలుని ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వై.పాలెం: బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

◗ పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలో ఆదివారం సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థ సమకూర్చిన దుప్పట్లను తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి పేదలకు పంపిణీ చేశారు.

◗ కంభం, న్యూస్‌టుడే : పుట్టపర్తి సత్యసాయి బోధనలు ఆచరణీయమని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. సత్యసాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఈవో పసుపులేటి రంగయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◗ బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేటలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను తహసీల్దార్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పొదిలి: కొత్తూరులోని సాయి ధ్యాన మందిరంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

వానొస్తే.. వణుకే..
☛ చెరువులను తలపించేలా వీధులు
☛ పక్కా కాలువలు లేక ఇక్కట్లు

న్యూస్‌టుడే, బేస్తవారపేట

చిన్నపాటి వర్షం కురిసినా మార్కాపురం డివిజన్లోని పలు పంచాయతీల్లో రోడ్లు కాలువల్లా మారిపోతున్నాయి. వణుకుపుట్టిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా బేస్తవారపేట పంచాయతీ నిలుస్తోంది.

అరకొర రహదారి విస్తరణతో సమస్యలు

నాలుగేళ్ల కిందట డివిజన్లో చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులను అరకొరగా చేశారు. రహదారికి రెండువైపులా వర్షం, మురుగునీరు వెళ్లేందుకు వీలుగా కాలువ నిర్మాణం చేపట్టినప్పటికీ పంచాయతీలోని పలు వీధుల్లోని కాలువలను వాటికి అనుసంధానించ లేదు. దీంతో గృహాలు, అంతర్గత రహదారుల నుంచి వచ్చే నీరు బయటికి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. వర్షం కురిసిన ప్రతిసారీ పలు వీధుల్లోని రహదారులు, కాలువలు చెరువులను తలపిస్తున్నాయి.

◗ బీసీ కాలనీ, మర్రిచెట్టు వీధి, రాణీపేట, గొంట్లవారివీధి, గాంధీబజార్, జగన్నాయకుల వీధి తదితర వీధులు పెద్దపాటి కాలువలను తలపిస్తున్నాయి. నీరంతా ఇళ్లలోకి చేరిన ప్రతిసారీ అధికారులు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

గృహాల మధ్య మురుగునీటి తటాకాలు..

డివిజన్లోని పలు కాలనీలు, పంచాయతీల్లో పక్కా కాలువలు నిర్మించకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి తటాకాలను తలపిస్తోంది.

మొంథా తుపాను కారణంగా బీసీ కాలనీలో మోకాలి లోతులో నిలిచిన వర్షపు నీరు

◗ పట్టణంలోని చాలా ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా, జ్యోతి మెడికల్స్ దుకాణం వెనుకవైపు, అంకాలమ్మ ఆలయ సమీపంలో, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వెనుకవైపు ప్రాంతాల్లో ఇళ్ల పరిసరాల్లోనే మురుగునీటి తటాకాలు కనిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

వీధుల్లోని కాలువలను జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్న ప్రధాన మురుగు కాలువలకు అనుసంధానిస్తే మురుగు సమస్య తీరుతుంది. ఈ విషయమై ఇప్పటికే జాతీయ రహదారి అధికారులతో చర్చించాం.
– ఎ.వి. రంగనాయకులు, ఎంపీడీవో, బేస్తవారపేట.

సంఘాలు.. కార్యవర్గాలు

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు తాలుకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడుగా టి.నరేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలు తాలుకా అధ్యక్షుడు కొత్తపల్లె మంజేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సహ అధ్యక్షుడు ఎం.పీ.ఆవులయ్య, ఉపాధ్యక్షుడు డి.మల్లికార్జునరెడ్డి, ఐఎస్.తీర్థులు, సి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎన్.కాశీ రమణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అఖిల భారతీయ జాతీయ ఉపాధ్యాయ మహా సంఘం పిలుపు మేరకు పార్లమెంట్ సభ్యులందరికీ వినతి పత్రాలు ఇస్తున్నట్లు ఆపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులో వెలసిన అల్లూరి పోలేరమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పవన్‌కుమార్‌శర్మ వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా ఆలయంలో వెలిసిన నాగమయ్య విగ్రహాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

కోట సత్యమాంబ దేవికి బోనాలు

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారిని చందనం, పసుపు, కుంకుమలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టాలమ్మకు పూజలు చేశారు. కోట సత్యమాంబ నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేటలోని స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా కలిసి ఒక్క చోట చేరారు. అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి, విశ్రాంత ఎంఈవో చక్కా మాధవరావు, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, మౌలాలి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

నూతన గృహాలకు నమోదు చేసుకోండి

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 కింద ప్రభుత్వం ఇస్తున్న గృహాలకు అర్హులైన పేదలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ వై.పాలెం డీఈ ఎస్వీ సురేష్‌బాబు సూచించారు. సచివాలయంలోని ఇంజినీరింగ్ సహాయకుల వద్ద తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30తో గడువు ముగుస్తున్నందున ఇల్లు కావాల్సినవారు గమనించాలని కోరారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటివరకు 5,007 గృహాలకు డిమాండ్ సర్వే చేసినట్లు తెలిపారు. మీటర్ 2,073 సర్వే పూర్తిచేసినట్లు వివరించారు. ఇంటి స్థలం లేనివారిని నమోదు చేస్తున్నామన్నారు. ఆధార్, జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా, స్థలం పీసీ లేదా రిజిస్టర్ డాక్యుమెంట్ తీసుకెళ్లాలని కోరారు.

సర్వే చేస్తున్న హౌసింగ్ డీఈ, సిబ్బంది

ఐకమత్యంతో అభివృద్ధి సాధించుకోవాలి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: దళితులు మొత్తం ఐక్యమత్యంగా ఉండి అభివృద్ధిని సాధించుకోవాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది బంటు రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ అండ్ అంబేడ్కర్ ఆడిటోరియంలో బి.క్రిష్టఫర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేళనం, వనభోజన మహోత్సవం జరిగింది. ఈ సమావేశానికి కొర్రపోలు గురవయ్య అధ్యక్షత వహించారు. రవికుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగ ఫలాలు అనుభవించే విధంగా విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. వై.పాలెం నియోజకవర్గంలో దళితులు అన్ని పార్టీల వారు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. ఏ పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. వక్తలు మాట్లాడుతూ నియోజవర్గంలో మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నప్పటకీ వారి అభివృద్ధి ఆమడదూరంలో ఉందన్నారు. ముందుగా బంటు క్రిష్టఫర్ ఆధ్వర్యంలో మాదిగలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలక విన్సెంట్, సింగాప్రసాద్, ఓబులు, పల్లెపోగు జాషువా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాది బంటు రవికుమార్

ఎంపీడీవో ప్రసూనదేవి బాధ్యతల స్వీకరణ

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: దోర్నాల ఎంపీడీవోగా టి.ఎల్. ప్రసూన దేవి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను పంచాయతీ కార్యదర్శులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తోన్న విజయ డిప్యుటేషన్‌పై చీరాలకు వెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

త్రిపురాంతకం, న్యూస్‌టుడే

?: ఒడ్డుపాలెం పంచాయతీ కార్యాలయం సమీపంలోని మూల మలుపు వద్ద మురుగు నిలిచి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– సుధాకర్, స్థానికుడు

✓: సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.
మణికంఠ, పంచాయతీ కార్యదర్శి, ఒడ్డుపాలెం.

అభిజిత్ దాస్‌తో విశ్వహిందూ పరిషత్తు సభ్యులు

దేశం సుభిక్షంగా ఉండాలని పాదయాత్ర

కంభం: దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన 25 ఏళ్ల అభిజిత్ దాస్ పాదయాత్ర చేస్తున్నాడు. ఆయన శ్రీశైలం నుంచి తిరుపతి మీదుగా రామేశ్వరం వెళ్తూ ఆదివారం కంభంలో కొద్దిసేపు ఆగారు ఆయన జూన్ 18న నేపాల్‌లోని పశుపతినాథ్‌ను దర్శించుకొని యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. చివరిగా బద్రీనాథ్‌ను దర్శించుకోవడంతో యాత్ర పూర్తి అవుతుందని పేర్కొన్నారు. ఆయనకు విశ్వ హిందూ పరిషత్తు సభ్యులు దేవిరెడ్డి నాగేంద్రుడు, సోమిశెట్టి నారాయణ, గాధంశెట్టి కుమార్, శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జి.అబ్రహం డిమాండ్ చేశారు. బేస్తవారపేటలోని స్థానిక సచివాలయం-1 వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన లేబర్ చట్టాల వల్ల సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కును కోల్పోయే ప్రమాదముందన్నారు. దీంతో పాటు దశాబ్దాల కిందట సాధించుకున్న 8 గంటల పని విధానం రద్దయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, రమేష్, నాగేంద్ర, చాంద్ రసూల్, యోబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

ప్రభుత్వ కార్యాలయం.. స్వచ్ఛత శూన్యం

పొదిలి సచివాలయం-2 పరిధిలోని విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో నిర్మించిన రైతుసేవా కేంద్రం, సచివాలయం భవనాల్లో పారిశుద్ధ్య చర్యలు కరవై పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగాయి. మరుగుదొడ్లు కూడా నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు స్వచ్ఛతగా, పచ్చదనంతో ఉండాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా ఇక్కడ మాత్రం అవేమీ కనపడటం లేదు. సచివాలయానికి నిత్యం ప్రజలు ఏదో ఒకపనిపై వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల ఆవరణలో వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదిలి

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

కంభం, న్యూస్‌టుడే: ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని చౌక్‌సెంటర్‌లోని ఉర్దూ పాఠశాల ఆవరణలో ఆ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా డి. వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.అంకయ్య, కార్యదర్శిగా ఎస్‌డీ హఫీజ్, ఆర్థిక కార్యదర్శిగా జి.మార్క్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు ఖాసీం బాషా, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.నాగలక్ష్మి, జిల్లా కౌన్సిలర్లుగా డి.సిద్ధిక్, తిరుపతిరావులను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యర్రయ్య మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. ఎన్నికల అధికారిగా సుబ్బారాయుడు, పరిశీలకులుగా డి.నబిఖాన్‌లు వ్యవహరించారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

లక్ష్మీనరసింహుడి ఆలయాన్ని పొదిలిలోనే కొనసాగించాలి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి కొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మర్రిపూడి దేవాదాయ శాఖ గ్రూప్‌లో కలపడం సరికాదని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం పొదిలి మంజునాథ ఫంక్షన్‌హాలులో పలువురు సమావేశమై ఈ విషయమై చర్చించారు. ఇప్పటి వరకు పొదిలి ఎండోమెంట్ గ్రూప్ పరిధిలో ఉన్న పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మర్రిపూడి ఎండోమెంట్ గ్రూప్‌లో కలపడం సరికాదన్నారు. ఈ ప్రాంత ప్రజల, భక్తుల అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా మారుస్తారని పలువురు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు డి.రాంబాబు, కరీముల్లా బేగ్, జి.సి.సుబ్బారావు, వై.శేషగిరిరావు, కె.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరీముల్లాబేగ్

ప్రారంభానికి నోచని శుద్ధ జలప్లాంటు

మార్కాపురం గ్రామీణం: మండలంలోని చింతకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో నాడు-నేడు కార్యక్రమంలో ఈ పాఠశాల్లో నిర్మించిన శుద్ధజల ప్లాంటు ప్రారంభించలేదు. దాదాపు 90 శాతం పూర్తయినా అరకొర నిధులు వెచ్చించక నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లతో మంచినీరు తెచ్చుకొని వాడుకోవలసిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో ప్లాంటును బాగు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

చింతకుంట హైస్కూల్లో నిరుపయోగంగా ఆర్వో వాటర్‌ప్లాంటు

రూ.5 లక్షల బీమా చెక్కు పంపిణీ

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలంలోని విశ్వనాథపురానికి చెందిన జనసేన కార్యకర్త యల్లయ్య ఈ ఏడాది మార్చిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జనసేన కార్యకర్తల బీమా తరపున ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఎంఎల్సీ నాగబాబు ఆదివారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు అందించారు. జనసేన త్రిపురాంతకం మండల అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో యల్లయ్య భార్య వెంకట రమణకు రూ.5లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నాసరయ్య, నాని, రంగయ్య, గాలెయ్య ఉన్నారు.


చెక్కుతో యల్లయ్య కుటుంబం

శిబిరంలో పాల్గొన్న సేవాసంస్థ ప్రతినిధులు, వైద్యులు

'మానవత' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మార్కాపురం గ్రామీణం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బోడపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా స్త్రీల వైద్యనిపుణురాలు డాక్టర్ కనకదుర్గ, జనరల్ చికిత్స వైద్యుడు గోపాల్‌రెడ్డి, దంతవైద్యురాలు సౌమ్య పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రమణారెడ్డి, సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి రాము పాల్గొన్నారు.

వంట గదులు బాగుచేయండి సారూ..

బేస్తవారపేట: విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి మార్కాపురం పరిధిలోని పలుచోట్ల వంటగదులు లేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల గదులు లేకపోవడంతో తరగతి గదుల్లోనే వంట చేస్తున్నారు. కొన్ని చోట్ల నిర్వాహకులు తమ ఇళ్ల వద్దే వంట చేసుకుని పాఠశాలలకు తీసుకొస్తున్నారు. వర్షాలు, ఈదురుగాలులు వచ్చినప్పుడు వంట చేసేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. వంటగదులు లేని ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామన్నారు. త్వరలోనే పనులు మొదలుపెడతామని తెలిపారు.

మొక్కజొన్న.. నష్టాలే మిగులన్నా..

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

☛ నకిలీ విత్తనాలతో రైతుకు కష్టం

ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న పంట చాలామంది రైతులకు నష్టాలను మిగిల్చింది. విత్తనాలు నాణ్యంగా లేవని కొందరు, తుపాను కారణంగా సరైన దిగుబడి రాలేదని మరికొందరు రైతులు చెప్తున్నారు. జిల్లాలో దాదాపు 9వేల ఎకరాల్లో ఈపంట సాగైంది. పశ్చిమ ప్రాంతంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు మొక్కజొన్నకు ప్రాధాన్యతనిచ్చారు.

పొలాల్లోనే వదిలేస్తున్నారు..

వాతావరణం అనుకూలించకపోవడం, సరైన సీడింగ్ (పరపరాగ సంపర్కం) జరగకపోవడంతో చిన్నసైజు కండెలు రావడం, విత్తనాలు సరిగా పట్టకపోవడం వంటివి సాగాయి. దీంతో రైతులు చాలాచోట్ల పొలాల్లోనే వదిలేశారు. సీడ్ కంపెనీలు ఇచ్చిన విత్తనాలే తేడాగా ఉన్నాయని చాలామంది రైతులు సరఫరాదారులను నిలదీస్తున్నారు. మరికొన్నిచోట్ల పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల సదరు కంపెనీలే రబీకి కావాల్సిన విత్తనాలను, అవసరమైన పురుగు మందులు ఇచ్చి సాగుచేయిస్తున్నాయి. రైతు శ్రమ, దుక్కులు, కూలీల ఖర్చులతో కలిపి ఎకరాకు దాదాపు రూ.15-20వేల దాకా నష్టమొచ్చిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తగిన సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బోయలపల్లెలో రైతు వదిలేసిన మొక్కజొన్న పంట

విద్యార్థులతో కమలా పాఠశాల సిబ్బంది

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ

మార్కాపురం పట్టణం: పట్టణంలోని కమలా పాఠశాలలో ఎన్‌సీసీ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎన్‌సీసీ దుస్తులు ధరించి ప్రత్యేక డ్రిల్, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.పవన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశభక్తి, నైతిక విలువలు పెంపొందుతాయని చెప్పారు. జార్జి ఇంజినీరింగ్ కళాశాలలోనూ ఈ వేడుకలను నిర్వహించారు.

◗ కంభం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష అన్నారు. స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కళాశాల డీన్ ఎన్.సుబ్బారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, ఎన్‌సీసీ అధికారి ఆంజనేయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న వైద్యశాల సూపరింటెండెంట్ శిరీష

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

కంభం: కందుకూరు నియోజకవర్గం దారకానిపాడులో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు, ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన పవన్‌కుమార్‌కు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల బలిజ సేవా సంఘం సభ్యులు ఆదివారం రూ. 26,449 ఆర్థిక సాయం అందజేశారు. నెల్లూరు జిల్లా కావలిలో ఉంటున్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సూరే ప్రసాద్, ఉపాధ్యక్షులు తోట కోటేశ్వరరావు, కురంగి మల్లికార్జున, గౌరవ అధ్యక్షుడు పులి శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client Shriram Finance Ltd. Rep. by it's Branch Manager, **Markapur** Branch, Prakasam District, I issue the following **PUBLIC NOTICE** to general public.

One **Naru Nasar Reddy,** S/o **Nasaraiah** of **KAVALAKUNTLA** -Village and Post, Pullalacheruvu Mandal, Prakasam District intends to create Equitable Mortgage over the following schedule property of **him.** As such if any one have any claims, charges, mortgages, sale agreements, Court attachments, Court disputes etc. should be informed by them to me within Five days from the date of this public notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Prakasam District, Ongole Registration District, Yerragondapalem Sub-District, Yerragondapalem Mandal, Yerragonda palem Revenue Village and Grama Panchayaty Limits, near Door No.11-108, Vacant site measuring East to West : 42 feet, North to South : 12 feet to the extent of 55.99 Sq.Yrds or 47.03 Sq.Mtrs in Sy.No.57/1, Bounded by **East :** Markapur - Macherla road, **West :** Vacant site of Immadisetty Peraiah, **North :** Tin Sheets Shed of Immadisetty Peraiah, **South :** Tin Sheets Shed of Shaik Fazil.

Sd/- SHAIK YUSUF ALI, B.Com, LL.B., Advocate & Legal Advisor for Shriram Finance Ltd., 10th ward, Markapur -533316, Prakasam District (Cell No. 9440565787)

Markapur
Date: 23-11-2025

శ్రద్ధాంజలి
ప్రేమ, ఆప్యాయత అనురాగాలను మాకుపంచి మీ స్మృతులను మాత్రమే మాకు మిగిల్చి దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమళ్ళు, మనుమరాండ్రు మరియు బంధుమిత్రులు
కీ.శే. చింతల సంజీవరాయుడు గారు
గిద్దలూరు, మరణం: 14-11-2025
పెద్దకర్మ: తేది: 24-11-2025 సోమవారం గిద్దలూరు పట్టణం, గణేష్‌నగర్‌లోని మా స్వగృహం నందు జరుగును.

(c) eenadu

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

మహనీయుడు సత్యసాయిబాబా

కనిగిరి, న్యూస్‌టుడే: సత్య సాయిబాబా మనిషి రూపంలో ఉన్న దేవుడని ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో సత్యసాయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు, ఉచిత వైద్యం, విద్య అందించారని వివరించారు. ప్రేమ, కరుణ, సేవ అనే విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. తొలుత సాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఎన్.జయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి: సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, సిబ్బంది

● దర్శి: పేదల జీవితాల్లో వెలుగులు నింపిన దైవం సత్యసాయిబాబా అని దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలో బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన పొద్దుటూరి రసూల్‌బి శస్త్రచికిత్స నిమిత్తం మంజూరైన రూ.1.5 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ చెక్కును

దర్శి మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న గొట్టిపాటి లక్ష్మి, అధికారులు, నాయకులు

బాధిత కుటుంబ సభ్యులకు లక్ష్మి అందిజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బాబా చిత్రపటానికి ఎంపీడీవో కల్పన, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రావు తదితరులు నివాళులర్పించారు.

● కొండపి గ్రామీణం: తహసీల్దార్ కార్యాలయంలో సత్య సాయి చిత్రపటానికి డీటీ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● హనుమంతునిపాడు: భగవాన్ సత్యసాయి బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎంపీడీవో ఎం.రంగసుబ్బారాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తాళ్లూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద సాయిబాబా చిత్రపటానికి ఎంపీడీవో పి.అజిత, ఏఎస్సై సీహెచ్.భాస్కరరావు, పలువురు అధికారులు కలిసి పూలమాలలు వేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్యసాయి సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తహసీల్దారు బీవీ.రమణారావు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

దర్శి, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుంచి బయటపడవచ్చని సీఐ రామారావు సూచించారు. దర్శిలో ఆదివారం వివిధ ప్రమాదాలు, నేరాల నియంత్రణపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. శిరస్త్రాణం ధరించకపోవడం సరికాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. గంజాయి తాగడం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, బాలలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా నిర్వాకం.. సంపద సృష్టికి ఆటంకం

న్యూస్‌టుడే, కనిగిరి, పామూరు

ఉన్న వనరులను ఉపయోగించుకొని పల్లెలను పరిశుభ్రంగా చేయడంతోపాటు, పంచాయతీలకు ఆదాయార్జనే ధ్యేయంగా గత తెదేపా ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి గ్రామంలో చెత్త సేకరించి, అందులో తడి, పొడి వ్యర్థాలు వేరుచేసి.. వాటి నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేవారు. ఇందుకోసం గ్రీన్ అంబాసిడర్ల పేరుతో పారిశుద్ధ్య కార్మికులు, వారికి కావాల్సిన రిక్షాలు, చెత్త బుట్టలు అన్నింటినీ నాటి ప్రభుత్వం సమకూర్చింది. మేజర్ పంచాయతీ అయిన పామూరులో మరో అడుగు వేసి.. చెత్త నిర్వహణ బాధ్యతను ఓ సంస్థకు అప్పగించి ఏటా రూ. రెండు లక్షలు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేసింది. అంతా బాగా ఉన్న సమయంలో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం తన అయిదేళ్ల పాలనలో సంపద కేంద్రాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ఫలితంగా నేడు అది గేట్లకు తాళాలు వేసి నిరుపయోగంగా మారింది. ఇక్కడి ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీజీ విగ్రహం ఇందుకు మౌన సాక్షిగా నిలిచింది.

మూసివేసిన పామూరులోని సంపద తయారీ కేంద్రం

ఇక్కడి ఎరువుకు డిమాండు

కనిగిరి నియోజకవర్గంలో ప్రధాన వ్యాపార కేంద్రం పామూరు. ఇక్కడ సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేసేందుకు 2018లో క్యూబ్ బయో ఎనర్జీ సంస్థ సంపద కేంద్రం ఏర్పాటుకు సుమారు 2 ఎకరాలను లీజుకు తీసుకుంది. అందుకు సంబంధించి ప్రతి సంవత్సరం పంచాయతీకి రూ.2 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. రోజూ గ్రామంలో సుమారు రెండు టన్నుల పొడి, తడి చెత్తను సేకరించి ఎరువుగా మార్చేవారు. దీనిని కిలో రూ. 2.50లకే రైతులకు విక్రయించేవారు. తక్కువ రేటుకే వస్తుండడంతో కనిగిరి ప్రాంతంతో పాటు, జిల్లా నలుమూలల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. గత తెదేపా ప్రభుత్వంలో నిర్వహణ బాగానే ఉన్న ఈ కేంద్రం.. వైకాపా పాలనలో గాడి తప్పింది. కార్మికులను నియమించక, ఉన్న వారికి సరిగా జీతాలివ్వకపోవడంతో చెత్త సేకరణ, నిర్వహణ సరిగా జరగలేదు. దీంతో యంత్రాలు మూలకు చేరి తుప్పు పట్టిపోయాయి. సంపద కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త సేకరణ లేకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అరవింద మాట్లాడుతూ.. అయిదేళ్లుగా సంపద తయారీ కేంద్రం మూలకు చేరిందన్నారు. కార్మికులు పది మంది అవసరమన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులను నియమించి, యంత్రాలను బాగుచేయిస్తే ఏటా రూ.3 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

పనిచేయని చెత్త నిర్వహణ యంత్రం

ఆలయంలో ప్రదక్షిణలు చేసేందుకు బయలు దేరిన అర్చకులు, సిబ్బంది, భక్తులు

నారాయణ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. ఆలయంలో స్వామికి అభిషేకం, మహానివేదన, హారతి పూజలు జరిగాయి. స్వామివారి పల్లకీ సేవ, రథోత్సవం జరిగాయి. భక్తులు ఉత్సాహంగా పల్లకీ మోసి రథాన్ని లాగారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. పూజలు, అన్నదానం వద్ద కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చిన ఆదినారాయణ, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

గుంటిగంగలో అన్నదానం ప్రారంభం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత అన్నదాన పథకం ప్రారంభించారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సూచనలతో వందమంది భక్తులకు తొలిరోజు అన్నసంతర్పణ చేశారు. పూజారులు ప్రకాశరావు, కామేశ్వరశర్మ, బాలరాజు, విజయలక్ష్మి, ఈవో జి.వాసుబాబు, ఆర్‌ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఆదివారం మాత్రమే భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఈవో తెలిపారు.

భక్తులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ఆలయ సిబ్బంది

శాస్త్రీయ దృక్పథం అవసరం

దర్శి, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని శాస్త్రీయ దృక్పథంతో ఎదగాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం దర్శిలోని యూస్సీ విద్యాసంస్థల ఆవరణలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక స్పృహ, నైతిక విలువలు, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 54 బృందాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటిరెడ్డి, జేవీవీ ప్రతినిధులు చెన్నకృష్ణ, జయప్రకాష్, స్వరూపరెడ్డి, ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో విజేతలతో డీఎస్పీ లక్ష్మీనారాయణ, జేవీవీ ప్రతినిధులు

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని ఆల్ఫా ఒలంపియాడ్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను చక్కగా వివరించి ఆకట్టుకున్నారు. షేక్ ఆయేషా, షేక్ సాదియా, డి.గురుచంద్రలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రిన్సిపల్ కె.బిందు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.కిరణ్, రూపియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ బిందు, ఉపాధ్యాయులు

పీసీపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని ఆందోళన

పీసీపల్లి: పారిశ్రామిక వేత్తల లబ్ధికోసం కార్మిక కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక బ్యాంకు కూడలిలో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఇది కార్మికుల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు స్టీఫెన్, చెన్నయ్య, మధుసూదన్‌రావు, పిచ్చయ్య, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, మోషే పాల్గొన్నారు.

విహార యాత్రలతో మనో వికాసం

కనిగిరి, న్యూస్‌టుడే: మనో వికాసానికి విద్యా, వైజ్ఞానిక, విహార యాత్రలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు భైరవ కోన వెళ్లేందుకు ఆయన సొంత నిధులతో ఆదివారం పది బస్సులను ఏర్పాటు చేశారు. వీటిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండాలనే సంకల్పంతో విహార యాత్రకు పంపుతున్నట్లు తెలిపారు. చదువుకున్న వ్యక్తి తన కుటుంబానికే కాకుండా దేశానికి కూడా ఉపయోగ పడతారన్నారు. విద్యార్థుల్లో చదువుల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, క్రమశిక్షణకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. 500 మంది విద్యార్థులు జాగ్రత్తగా పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని అక్కడ విశిష్టతను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు విహార యాత్ర ఏర్పాటు చేసినందుకు ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, వెలిగండ్ల ఎంఈవోలు ఉడుమల నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటు చేసిన బస్సుల్లో విహార యాత్రకు వెళ్తున్న విద్యార్థినులు

రోడ్డుపైకి మురుగునీరు

కొండపిలోని పొదిలి రోడ్డులో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. దీని వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని దుకాణ యజమానులు వాపోతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌ను వివరణ కోరగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

ట్యాంకు కట్టారు.. పైపులైన్ మరిచారు

ఈ చిత్రంలోనిది తాళ్లూరు మండలం బొద్దికూరపాడు పంచాయతీ పరిధి చింతలపాలెంలోని మంచినీటి ట్యాంకు. అక్కడే వద్దే కుళాయిని ఏర్పాటు చేసినా.. మంచినీరు ఎప్పుడు సరఫరా అవుతుందో చెప్పలేని పరిస్థితి. ట్యాంకు నుంచి గ్రామంలోకి ప్రత్యేక పైపులైన్లు వేయాలని ఎన్నోసార్లు ప్రజలు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ కారణంగా ప్రజలంతా దూరంగా ఉన్న ట్యాంకు వద్దకు వచ్చి మంచినీరు మోసుకెళ్లాల్సి వస్తుంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలీ మాట్లాడుతూ.. ని త్వరిత గతిన సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

ప్రతి మొక్కా.. ప్రాణి లెక్క

కనిగిరి మండలంలో పొగాకు రైతులు ఆ మొక్కలను రక్షించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందు నాటిన మొక్కలను మొంథా తుపాను తీవ్రత వల్ల బతికించుకునేందుకు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అదను దాటుతుండడంతో వెనుకగా సాగు చేసే రైతులు నీటి తడులు అందక ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసి మొక్కలు నాటుకుంటున్నారు. మండలంలో సుమారు 4 వేల ఎకరాల్లో పొగాకు చేశారు. మాచవరం వద్ద ట్యాంకర్ నీటితో పొలాన్ని తడుపుతూ పొగాకు మొక్కలు నాటుతున్న చిత్రమిది. -న్యూస్‌టుడే, కనిగిరి

స్లాబు వేశారు.. వదిలేశారు

మండల కేంద్రం సి.ఎస్.పురం గ్రామ సచివాలయం-1 భవనం అసంపూర్తిగా నిలిచింది. వైకాపా ప్రభుత్వంలో పూర్తి కాకపోవడంతో ఏళ్ల తరబడి సచివాలయం-2 భవనంలోనే ఒకటో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రెండు సచివాలయాలను ఒకే చోట నిర్వహిస్తున్నారు. రూ.43.6 లక్షల నిధులతో సచివాలయ భవనం నిర్మించాల్సి ఉండగా స్లాబు వరకు పూర్తయింది. మిగిలిన పనులన్నీ చేయకుండా గుత్తేదారు నిలిపివేశారు. పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈఈ బ్రహ్మయ్య తెలిపారు. -న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

ఒక స్విచ్ వేయండి సారూ..!

జరుగుమల్లి మండలం బిట్రగుంట బీసీ కాలనీలో విద్యుత్తు దీపాల నిర్వహణ సరిగా లేదు. ఇక్కడ ఏర్పాటు చేసిన వీధి దీపాలు గత కొద్ది రోజులుగా పగటిపూట సైతం వెలుగుతున్నాయి. దీని వల్ల పంచాయతీకి విద్యుత్తు బిల్లుల భారం పెరుగుతుంది. ఇప్పటికైనా వీధి దీపాలు పగటిపూట వెలగకుండా ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి షఫీని వివరణ కోరగా.. వెంటనే స్విచ్ అమర్చుతామని తెలిపారు. -న్యూస్‌టుడే, జరుగుమల్లి

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: పీసీపల్లి మండలం పెదఅలవలపాడు పంచాయతీ పరిధిలోని కొత్తూరులో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. బయటకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. -గ్రామస్థులు

✓:త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. -రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

?:హెచ్‌ఎంపాడు మండలం ఎలికావారిపల్లి-కనిగిరి-కంభం క్రాస్ రోడ్డు వద్ద హెచ్చరిక బోర్డు లేదు. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. -ఎలికా శ్రీనివాసులు, గ్రామస్థుడు

✓: అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తాం. -బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

?:తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం ఎస్సీ కాలనీ ప్రధాన వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ ఇటువైపు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -కోటేశ్వరరావు, స్థానికుడు

✓:త్వరితగతిన కొత్త దీపాలు వేయిస్తాం. -పి.అజిత, ఎంపీడీవో

?: కురిచేడు మండలం దేకనకొండ పంచాయతీలోని మర్లపాలెంలో వాన కురిస్తే ప్రధాన వీధి జలమయమవుతుంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. -వెంకటేశ్వరరెడ్డి, స్థానికుడు

✓: రహదారి తక్కువ ఎత్తులో ఉండడంతో వర్షం కురిసినప్పుడు సమస్య ఏర్పడుతోంది. అది ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. సంబంధిత అధికారులకు తెలియజేశాం. -రమేష్, పంచాయతీ కార్యదర్శి

?: దొనకొండలో పందుల సంచారం ఎక్కువైంది. ఇళ్ల చుట్టూ ఉంటూ చిన్నారులను భయపెడుతూ వాహనాలకు అడ్డు పడుతున్నాయి. - వి.బాలు, స్థానికుడు

✓: పందులు గ్రామంలో పెంచకూడదని యజమానులకు నోటీసులు ఇస్తాం. - కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి

?:మర్రిపూడి మండలంలోని వెంకటకృష్ణాపురం ఎస్సీ కాలనీలో బోరు పనిచేయక నీటికి ఇబ్బందిగా ఉంటుంది. -రాజేష్, స్థానికుడు

✓:మెకానిక్‌ను పంపించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -జగదీష్, ఎంపీడీవో

-న్యూస్‌టుడే, పీసీపల్లి, హనుమంతునిపాడు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ, మర్రిపూడి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు(తాళ్లూరు), న్యూస్‌టుడే: ముండ్లమూరు మండలం మారెళ్ల సమీపంలో ఆదివారం ఎదురెదురుగా కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. మారెళ్లకు చెందిన యువకులు గొర్రె చరణ్, రాంబాబులు ద్విచక్ర వాహనంపై ముండ్లమూరు వైపు వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారును ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. 108 ఈఎంటీ జి.సునీత, పైలెట్ దారా కోటయ్యలు హుటాహుటిన వారిని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సస్య రక్షణ చర్యలపై అవగాహన

ముండ్లమూరు(తాళ్లూరు), న్యూస్‌టుడే: రైతులు ప్రస్తుతం సాగు చేస్తున్న వివిధ రకాల పంటల్లో పసుపు కొర్ర పురుగు సోకిందని, సత్వరం నివారించకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని బాపట్లలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. ముండ్లమూరులో ఆదివారం కొందరు విద్యార్థులు వరి పైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. క్రిమి కీటకాలు, తెగుళ్లను సకాలంలో నివారించ గలిగితే పంట ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తద్వారా రైతులు తప్పకుండా లాభాలు సాధించేందుకు వీలుంటుందని తెలిపారు. విద్యార్థులు పి.భరత్, పి.అర్జున్, ఎస్కే.బాజీ, అప్రమేయ, అనుపమ్‌రాయ్, రైతులు పాల్గొన్నారు.

వరి నాట్లు వేయడంలో సూచనలు చేస్తున్న విద్యార్థులు

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని దొడ్డ వెంకటపల్లిలో ఆదివారం అభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

● హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం అడ్డరోడ్డు వద్ద గల అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ముడుపులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, వెంగపల్లి సర్పంచి దశరథ తదితరులు పాల్గొన్నారు.

డీవీపల్లిలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, స్థానిక నాయకులు

విద్యార్థికి అభినందనలు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి మహమ్మద్ ఫరూక్ ఈ నెల 26న అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యాడు. దర్శి నియోజకవర్గం నుంచి అతడికి అవకాశం దక్కింది. ప్రధానోపాధ్యాయురాలు పి.అంజలి, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

అన్నదాన సత్రానికి భూమిపూజ

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని అనుమునిగిరి క్షేత్రంలో నిర్మించనున్న కాశినాయన రెడ్ల అన్నదాన సత్రం భవన నిర్మాణ పనులకు ఆ సంఘం నాయకులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

దారి పక్కనే దాగి ఉన్న ప్రమాదం!

న్యూస్‌టుడే, దర్శి, పామూరు

అవి రెండూ రద్దీ ప్రాంతాలే. ఒకటి మున్సిపాలిటీ కాగా, మరొకటి మేజర్ పంచాయతీ. అలాంటి చోట్ల ఏమాత్రం ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దర్శి-అద్దంకి ప్రధాన రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

ఆదమరిస్తే అంతే..

దర్శి పట్టణంలో రోడ్డు పక్కన కాలువలు కలిసే చోట గుంత ప్రమాదకరంగా మారింది. ఆదమరిస్తే వాహనదారులు అందులో పడి గాయాలపాలయ్యే అవకాశం ఉంది. స్థానిక అద్దంకి ప్రధాన రోడ్డులో కాలువ వద్ద గుంత కనిపిస్తుంది. రోడ్డు పక్కనే ఉండి దగ్గరకు వచ్చేంత వరకు వాహనదారులకు కనిపించడం లేదు. గంగవరం వెళ్లే రోడ్డు, అద్దంకి రహదారి కూడలిలో నిత్యం రద్దీగా ఉంటుంది. పొదిలి రోడ్డులో సాగర్ కాలువ, మూడో లైను మలుపులో మురుగు కాలువ గుంత ప్రమాదకరంగా కనిపిస్తుంది. గతంలో మలుపు తిరిగే క్రమంగా నాలుగు చక్రాల వాహనాలు ఇందులో దిగి ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామూరులో కాలువపై మూత తొలగించి, రహదారిపై వేసిన మట్టి

మట్టి తొలగించక ఇక్కట్లు..

మొంథా తుపాన్ సమయంలో కురిసిన అధిక వర్షాల వల్ల నీరు బయటకు వెళ్లేందుకు పామూరు-నెల్లూరు రోడ్డులో ఉన్న కాలువను జేసీబీ సాయంతో పంచాయతీ అధికారులు తెరిపించారు. అందులోని మట్టిని రోడ్డుపై వేశారు. దానిని ఇప్పటి వరకు తొలగించకపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువపై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి అరవింద మాట్లాడుతూ.. త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

దర్శి, తాళ్లూరు: దర్శి నియోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యులైన మూడు కుటుంబాలకు చెందిన వారికి ప్రమాద బీమా చెక్కులను అందించారు. తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు నాగబాబు చేతుల మీదుగా రూ.5 లక్షల చొప్పున ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. పార్టీ దర్శి నాయకులు పాపారావు, వెంకటరావు, కోటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● తాళ్లూరుకు చెందిన జనసేనపార్టీ కార్యకర్త పుప్పాళ్ల సాయిమణికంఠ 2021లో మద్దిపాడు మండలం దొడ్డవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ నాయకుడు నాగబాబు, తాళ్లూరు ఏరియా వాలంటీర్ దగ్గుబాటి వెంకట సుబ్బారావుల చేతుల మీదుగా సాయి మణికంఠ తల్లి సౌభాగ్యానికి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కన్నీటి పర్యంతమైన సౌభాగ్యాన్ని నాగబాబు ఓ దార్చారు. పార్టీ జిల్లా నాయకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మణికంఠ కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న నాగబాబు

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

మంత్రిని కలిసిన గ్రానైట్ యజమానులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగానున్న పలు గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘం ప్రతినిధులు ఆదివారం ఒంగోలులో రాష్ట్ర భూగర్భ గనుల మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. గనుల కార్యాలయ భవనం భూమిపూజకు వచ్చిన మంత్రికి తమ సమస్యలు విన్నవించినట్లు అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట శ్రీనివాసరావు, సుబ్బారావు, భవానీప్రసాద్, తదితరుల తెలిపారు.

మంత్రి రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

క్యాడెట్లతో కళాశాల అధినేత కల్యాణ చక్రవర్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ వేడుకలు నిర్వహించారు. కళాశాల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ చక్రవర్తి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 80 మంది క్యాడెట్లతో 34 బెటాలియన్ ఒంగోలు విభాగంలో యూనిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఇక్కడి విద్యార్థులు రెండుసార్లు జాతీయ స్థాయి క్యాంపునకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపల్ హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: మరో గ్రంథాలయ ఉద్యమం కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సుజాత నగర్‌లో అపెక్స్ హైస్కూల్‌లో వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొండపి మండల విద్యాశాఖాధికారి పచ్చవ రామారావు చేతుల మీదుగా వర్క్ షాప్ గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిభ కలిగిన పిల్లలకు టాలెంట్ సెర్చ్ ప్రోగ్రాం ప్రతి నెల నిర్వహించి, కొంతమందిని ఎంపిక చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం పిల్లల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేస్తోందని, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో గ్రంథాలయ ఉద్యమం కార్యదర్శి కాంతి నల్లూరి, సీప ప్రసాద్, బిందు రాణి, కరవది శివానంద హై స్కూల్ కరస్పాండెంట్ గీత, రాజశేఖర్ రెడ్డి, శివకోటిరెడ్డి, బాషా పాల్గొన్నారు.

గోడ పత్రాల ఆవిష్కరణలో మంచికంటి, పచ్చవ రామారావు తదితరులు

చరవాణి సద్వినియోగంతో భవిత

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శనివారం స్థానిక మాంటిస్సోరి స్కూలులో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'చరవాణి వినియోగం విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 7,8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. చరవాణి సద్వినియోగంతో మంచి పరిజ్ఞానం పొంది భవిష్యత్తులో రాణించవచ్చని వారు చెప్పారు. 8వ తరగతి విద్యార్థి సీహెచ్ హనుప్రీత్ ప్రథమ, అదే తరగతికి చెందిన ఐ. విష్ణువర్ధన్ ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి కేవీ హేమంత్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ శబరీనాథ్, ప్రిన్సిపల్ సురేష్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్మయి, నీలిమ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న మాంటిస్సోరి స్కూలు ప్రతినిధులు

సామరస్యంగా మెలగాలి

మద్దిపాడు, న్యూస్‌టుడే: దొడ్డవరప్పాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చిని సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారు సామరస్యంగా మెలగాలని కాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ పొగాకు పెంపకందారుల సమాఖ్య ఛైర్మన్ జయంత్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, మందపల్లి శ్రీను, డొప్పా శేషయ్య, అద్దేపల్లి భవానీ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు పోటీలు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు బుక్ రీడింగ్, కథలు చెప్పడం, గేమ్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యానోషు, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమయ్యేలా!

నెలాఖరు వరకు నమోదుకు అవకాశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే

పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయి. అందులో భాగంగా ప్రధాన మంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన కింద ఇళ్ల మంజూరు నిమిత్తం అధికారులు సర్వే చేపట్టి లబ్ధిదారులను గుర్తించారు. అవగాహన లేక కొంత మంది వినియోగించుకోలేదు. దీన్ని గుర్తించిన అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రంతో మాట్లాడి మరో అవకాశం కల్పించారు. ఈ మేరకు నెలాఖరులోపు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని గడువు విధించారు. క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటి డిమాండ్ సర్వే చేస్తున్నారు.

అల్లూరులో గృహనిర్మాణ సర్వేను పరిశీలిస్తున్న గృహనిర్మాణ అధికారి శ్రీనివాస ప్రసాద్

ప్రత్యేక యాప్‌లో వివరాలు

గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గతేడాది నవంబర్ నుంచి జులై వరకు పీఎంఏవై-2.0 కింద ఇళ్ల మంజూరు నిమిత్తం క్షేత్రస్థాయిలో ఏఈ, డీఈ, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు సర్వే నిర్వహించి, వారి పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అయినా సొంత నివాసస్థలం లేదా ఇంటి పట్టా కలిగి... ఇల్లు లేని పేదలు మిగిలి ఉండటంతో మరోసారి వారి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. పక్కా గృహానికి దరఖాస్తు చేసుకున్న మహిళలు ప్రస్తుతం ఉంటున్న నివాసం..కట్టుకోనున్న స్థలం వద్ద ఉన్న ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పీఎంఏవై అర్బన్-2.0 కింద పక్కా గృహం మంజూరైన లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు; పీఎంఏవై-2.0 గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.80 లక్షలు అందించనున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నవారికి సైతం యూనిట్ విలువ రూ.2.50 లక్షలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దానికి అనుగుణంగా సర్వే యాప్‌లో నమోదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మాత్రమే రూ.2.50 లక్షలు అందజేయాలని కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి.

పక్కాగృహాల సర్వేచిత్రం

మండలం	పక్కాగృహాలు
ఒంగోలు	105
కొత్తపట్నం	235
చీమకుర్తి	152
మద్దిపాడు	278
నాగులుప్పలపాడు	315
సంతనూతలపాడు	211

అర్హులు ఎవరంటే..

- గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన పట్టా అయినా కలిగి ఉండాలి. సదరు కాగితాల జిరాక్స్ పత్రాలను అందజేయాలి.
- తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండటంతోపాటు; ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ జిరాక్స్‌ను సమర్పించాలి.
- గతంలో గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రస్తుత పథకం వర్తించదు.

సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత మాతృశక్తి సభ్యులు

మాతృమూర్తి ప్రోత్సాహంతో ఉన్నతి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వ్యక్తి, సమాజ ఉన్నతికి మాతృమూర్తి ఇచ్చే ప్రోత్సాహం విలువ కట్టలేనిదని విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి ప్రాంత సంయోజిక గౌరీ సొదకార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో దక్షిణ బజార్ పెద్ద రామానుజ కూటంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత మాతృశక్తి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవి, బాలరాము, శ్రీనివాస గుప్తా, సీతారామయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా కవి సమ్మేళనాలు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సాంస్కృతిక సమితి, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సాహంగా జరిగిన కవి సమ్మేళనాల్లో అనేకమంది కవులు కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. ఒంగోలుకు చెందిన ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ తన కవితలను వినిపించారు. వర్తమాన సమస్యలను ఆయన కవిత్వంలో ప్రతిబింబించారు. తెలుగు, సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ విల్సన్, ఉత్సవ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ, సాహితీవేత్తలు, బిక్కి కృష్ణ, పూర్ణచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సీపీఐ నిత్యం పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో భాజపా ఏనాడూ ప్రజల పక్షాన పోరాడిన సందర్భాలు లేవన్నారు. ప్రస్తుత సమాజంలో కూడా ప్రజా ఉద్యమాలు, స్వాతంత్ర్య ఉద్యమాన్ని నీరు గార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సీపీఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. డిసెంబరు 26న తెలంగాణలోని ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ వేడుకలను జయప్రదం చేయాలన్నారు. పార్టీ నాయకులు ఆర్. వెంకటరావు మాట్లాడుతూ, ఒంగోలులోని పేదలందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ స్థలాల్లో ఎర్ర జెండాలు పాతనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎన్. మురళి, శ్రీరామ శ్రీనివాసరావు, కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి

కరాటేలో మెరిసిన విద్యార్థులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో చీమకుర్తికి చెందిన పలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కటాస్, పోరాట విభాగాల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారు. తదాగత్ మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు దేవరకొండ వెంకటేష్, శిక్షకులు డి.సుధాకర్, తదితరులు పతకాలు అందజేశారు. విజేతలను అభినందించారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఒంగోలు నగరం: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అఖిల భారతీయ జాతీయ ఉపాధ్యాయ మహా సంఘం పిలుపు మేరకు పార్లమెంట్ సభ్యులందరికీ వినతి పత్రాలు ఇస్తున్నట్లు ఆపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రస్తావించి విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హిమజ, జిల్లా అధ్యక్షులు మల్లికార్జునరావు, నాగప్రకాష్ తదితరులున్నారు.

మండపం వద్ద జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్వాములు

వేడుకగా అయ్యప్ప పడి భజన

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడి భజన వేడుకగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఉంచి భజనలు నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి నందిని దంపతులు పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి భిక్ష ఏర్పాటు చేశారు.

ఎంకేఆర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర నరసింహారెడ్డి

ఎంకేఆర్ ఆసుపత్రి ప్రారంభం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని అంజయ్య రోడ్డులోని బృందావన్ నగర్‌లో నెలకొల్పిన ఎంకేఆర్ ఆసుపత్రిని ఆదివారం మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకులు, యూరాలజిస్ట్ డాక్టర్ మాలకొండారెడ్డి, గైనికాలజిస్ట్ డాక్టర్ చైతన్యరెడ్డి అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాము అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, నగరంలోని వైద్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వచ్చిన వెంటనే పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. ఆదివారం కొత్తపట్నం గ్రామంలో నూతన మండల రైతు సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మండల సొసైటీ ఛైర్మన్ ద్వారబాకుల శ్రీనివాసులరావు, సొసైటీ డైరెక్టర్లు కొండూరి తిరుపతి, బలగాని సుభాష్ చంద్రబోస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన వారు రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. త్వరలోనే ఫిషింగ్ హార్బర్ కూడా ఏర్పాటు అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ సీతారామయ్య, మార్కెట్ ఛైర్మన్ వెంకట్రావు, ప్రకాశ్, జలరామ్, సర్పంచి శ్రావణి, శివారెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తి : నివాళులర్పిస్తున్న కమిషనర్, తదితరులు

సత్యసాయి బాట అనుసరణీయం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని మంత్రి స్వామి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, విద్య, వైద్యం, మారుమూల ప్రాంతాలకు తాగునీటి సరఫరా వంటి సేవా కార్యక్రమాలకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ, భక్తి, సేవాతత్వంతో ప్రజల గుండెల్లో సత్యసాయి చెరగని ముద్ర వేశారని కొనియాడారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో ఓబులేసు, మెప్మా పీడీ శ్రీహరి పాల్గొన్నారు.

- చీమకుర్తి: చీమకుర్తి పురపాలక కార్యాలయంలో ఆదివారం సత్య సాయిబాబా జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిషనర్ వై. రామకృష్ణయ్య, కౌన్సిలర్ గోరంట్ల అంజని, గొల్లపూడి కోటేశ్వరరావు, తదితరులు నివాళులర్పించారు.

ఒంగోలు : బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల అధికారులు

- ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్య సాయిబాబా మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ఎంపీడీవో రాజశేఖర్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం సత్య సాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో శేషబాబు, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు పాల్గొన్నారు.

'అభివృద్ధికి వైకాపా సర్పంచి అడ్డంకులు'

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామంలో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులకు వైకాపా సర్పంచి అడ్డుకట్ట వేస్తున్నారని తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు విమర్శించారు. తాము రూ.లక్షలు వెచ్చించి పనులు చేశామని, అయితే నేటికీ వైకాపా సర్పంచి సంబంధిత పత్రాలపై సంతకాలు పెట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు.

బాధితులకు ఎమ్మార్పీఎస్ బృందం పరామర్శ

చీమకుర్తి, న్యూస్‌టుడే : బండ్లమూడిలో దాడికి గురైన కుటుంబాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ, జిల్లా బాధ్యుడు సొట్ట నరేంద్ర మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్ మాదిగ తదితరులతో కూడిన బృందం బాధిత కుటుంబాలను పరామర్శించింది. దాడికి పాల్పడిన అగ్రకులం వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఎస్సీలపై పెట్టిన కేసును ఎత్తివేయాలని కోరారు. చీమకుర్తి మండల నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే:

?: మద్దిపాడు మండల కేంద్రంలోని పడమర వైపున ఉన్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో రెండు వైపులా కంప చెట్లు రహదారి మీదకు వస్తున్నాయి. ప్రజలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ఇరువైపులా మొలచిన చెట్లు తొలగించి ఇబ్బందులు లేకుండా చూడగలరు.

- పి.ప్రసన్న కుమార్, గ్రామ నివాసి

✓: మా సిబ్బందిని పంపించి పాఠశాలకు వెళ్లే దారిలో రెండు వైపులా ఉన్న కంప చెట్లు తొలగించి ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- నూరుల్లా, గ్రామ కార్యదర్శి, మద్దిపాడు

?: మద్దిపాడు మండలం వెల్లంపల్లి జాతీయ రహదారిపై మహిళా వ్యాపారులు సర్వీస్ రోడ్డుపై కూర్చుని జామ, సపోటా తదితరాలు అమ్ముతున్నారు. దీనివల్ల వాహనదారులు కాయల కొనుగోలుకు రోడ్‌మీదనే నిలుపుతున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. కాబట్టి వారిని కొంత మేర వెనకకు జరిపి ప్రమాదాలను నివారించండి.

- ముచ్చు సుబ్బారావు, వెల్లంపల్లి

✓: జాతీయ రహదారి అధికారులతో చర్చించి, హైవే మొబైల్ పోలీసుల ద్వారా వారిని నియంత్రిస్తాం. సర్వీస్ రోడ్‌లో పండ్లు, కాయలు విక్రయించకుండా చేస్తాం.

- వెంకట సూర్య, ఎస్ఐ, మద్దిపాడు

మద్యం శిబిరాలపై దాడులు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: అల్లూరు గ్రామ శివారులో మద్యం శిబిరాలపై ఆదివారం ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. చెరువుకట్ట వద్ద మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పరిసరాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ..బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిస్తే సహించేది లేదన్నారు. శాంతిభద్రతల కోసం ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పానకాలవారిపాలెంలో చోరీ : ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు మండలం పానకాలవారి పాలెంలో చోరీ జరిగింది. స్థానికంగా నివసించే ఎం.జయరావు ఇంటిలో దొంగలుపడి బీరువా లాకర్ పగులగొట్టి అందులో ఉన్న రూ.56 వేల నగదు అపహరించుకుపోయారు. దీనిపై బాధితుడు జయరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు : మద్దిపాడు : మండల పరిధిలో ఆదివారం సాయంత్రం జూదం ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. మద్దిపాడు ఎస్సై వెంకటసూర్య తెలిపిన వివరాల ప్రకారం..గుండ్లాపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.

బొమ్మ పలుకు

బిక్కుబిక్కుమంటున్న భావితరం

మండల కేంద్రంలోని తూర్పు ప్రాథమిక పాఠశాల స్లాబు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ పలువురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తినే వరండాలో కూడా స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీనిపై మండల పరిషత్ అధికారి జ్యోతిని వివరణ కోరగా, మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయించామని, త్వరలో అనుమతులు తీసుకుని మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. **- మద్దిపాడు, న్యూస్‌టుడే**

మండల కేంద్రం..చెత్తకు నిలయం

ఒక పక్క స్వచ్ఛ పట్టణాల రూపకల్పన చేస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఉండటం లేదు. సంతనూతలపాడులో చెత్త తొలగింపు సక్రమంగా జరగడం లేదు. విద్యుత్తు కార్యాలయం, జడ్పీహెచ్ఎస్ వద్ద పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, సంతనూతలపాడు**

సమావేశంలో పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పర్యావరణానికి విఘాతంగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించడానికి పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమం అమలు చేయాలని జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు కోరారు. ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొల్లా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొల్లా మధు, సహాయ కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థులకు కార్యశాలలు, సదస్సులు, వీడియో ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పునర్వినియోగ సంచుల పంపిణీ చేపట్టాలన్నారు. విద్యార్థులు వస్త్రంతో చేసిన సంచులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వాడేలా ప్రోత్సహించాలన్నారు. కార్పొరేషన్ ద్వారా తక్కువ ధరకు పునర్వినియోగ ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిన్నారి, చిట్టెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

ద్వితీయ వర్ధంతి



మంచికి మానవత్వానికి మారుపేరుగా నిలిచి మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన శ్రీమతి మద్దినేని పద్మావతి గారి మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ మద్దినేని వెంకటేశ్వర్లు గారు
మరణం: 21-11-2023

కీ॥శే॥ శ్రీమతి మద్దినేని పద్మావతి గారు
మరణం: 12-11-2025

కుమారుడు- కోడలు: మద్దినేని వెంకట్రావు - సునీత
మనుమరాలు: హారిణ్మయి సాయి మనుమడు: గణేష్ సాయి
కుమార్తె - అల్లుడు: గోగినేని హైమావతి - వెంకటేశ్వర్లు(లేటు)
మనుమరాళ్లు: పవిత్ర, ఆలయ
కుమార్తె - అల్లుడు: అలవల మల్లీశ్వరి - ఆంజనేయులు
మనుమడు: మహీధర్ సాయి
కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది.24-11-2025 సోమవారం నరసాయిపాలెం గ్రామము (పెద్దకొత్తపల్లి), మద్దిపాడు మం॥ మా స్వగృహము నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

(c) eenadu

వరదొచ్చినా.. ఆగదులే పరుగు

ఆ కట్టుకుంటున్న ఈ వంతెన దక్షిణ మధ్య రైల్వేలో అతి పెద్ద ఆర్ఓఆర్(రైల్ ఓవర్ రైల్ ఫ్లైఓవర్). నెల్లూరు, తిరుపతి జిల్లాల మధ్య గూడూరు సమీపంలో నిర్మించారు. గూడూరు రైల్వేస్టేషన్ జంక్షన్‌తో పాటు రైళ్ల ఇంటర్ ఛేంజ్‌కు వేదికగా కూడా ఉంది. మనుబోలు- గూడూరు మధ్య అధికంగా ఉన్న వాగులు, వంకలు పొంగి ప్రవహించడం వల్ల రైళ్ల పరుగుకు అంతరాయం కలిగి.. రైల్వేకి నష్టం కూడా జరిగేది. దీన్ని అధిగమించేందుకు దక్షిణ మధ్య రైల్వేలోనే అతిపెద్ద పొడవైన 2.2 కిలోమీటర్ల ఆర్ఓఆర్ నిర్మించి ఆశాఖ సత్ఫలితాలు పొందుతోంది. అలాగే రవాణా వ్యవస్థ మరింత మెరుగైంది.

– న్యూస్‌టుడే, చిట్టమూరు

కోటమిట్ట.. ఆక్రమణల్లో దిట్ట

ఆక్రమించిన బట్టేపాడు కోటమిట్ట స్థలం

న్యూస్‌టుడే, ఆత్మకూరు : ఆక్రమణలకు అంతేలేకుండా పోతోంది. నదులు, వాగులు, వంకలే కాదు.. రాజుల కాలంనాటి స్థలాలు, కట్టడాలు సైతం ఆక్రమిస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో బట్టేపాడు ఉంది. ఉదయగిరి రాజుల కాలంలో బట్టులవాడ గ్రామం ప్రాధాన్యం సంతరించుకొంది. సైనికులు నివాసం ఉండటంతోనే బట్టులవాడ కాలక్రమేణ బట్టేపాడుగా మారింది. ఇక్కడ సైనికుల స్థావరం అని చెప్పుకొనే స్థలాన్ని కోటమిట్ట అని పిలిచేవారు. స్థలం చుట్టూ కోటగోడల్లా ఉండే మట్టిగోడలు కాలక్రమంలో కరిగిపోయాయి. దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో కోటమిట్ట ఉండేదని, అది ప్రభుత్వ స్థలమని గ్రామస్థులు చెబుతున్నారు. దానిపై అక్రమార్కుల కన్నుపడి ఆక్రమించేశారు. ఐదు ఎకరాల్లో ప్రస్తుతం మూడు ఎకరాలు ఆక్రమణదారుల చెరలో ఉంది. దీని విలువ రూ.60 లక్షలు ఉంటుంది. తహసీల్దారు పద్మజాకుమారి స్పందిస్తూ స్థలం ఆక్రమణను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

విడిపోతామని వాళ్లు.. వీడనివ్వని వీళ్లు!

పోలీసులను ఆశ్రయిస్తున్న యువ జంటలు ● కౌన్సెలింగ్‌తో వారిలో మార్పు

● నగరానికి చెందిన ఓ యువతికి హైదరాబాద్‌కు చెందిన సురేష్‌తో వివాహమైంది. పెద్దలు కుదిర్చిన వివాహం.. అంగరంగ వైభవంగా చేశారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో హైదరాబాద్‌లోనే కాపురం పెట్టారు. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ.. విడాకులు కావాలని స్టేషన్ మెట్లెక్కారు. పోలీసులు నాలుగో సారి కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు.

● వివిధ స్టేషన్లకు భార్యాభర్తల నుంచి రోజుకు మూడు, నాలుగు ఫిర్యాదుల వంతున నెలకు దాదాపు వందకుపైగా వస్తుంటాయి. వాటిలో కేసులు నమోదయ్యేది కేవలం పది శాతమే. మిగిలిన వాటిలో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి భార్యాభర్తలను ఒక్కటిగా చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ప్రేమ వివాహాలు.. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు.. ఏవైనా సరే.. మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి. ఏడడుగులు నడిచి కలిసి మెలిసి ఉంటామని అగ్నిసాక్షిగా ఒక్కటవుతున్న వారు ఆదిలోనే బంధాన్ని తెంచుకుంటున్నారు. తన ఇగోను హర్ట్ చేసిందని యువకుడు.. తన మాటకు మర్యాద ఇవ్వలేదని యువతి పంతంతో పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. మహిళా పోలీసు స్టేషన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి జంటలు విడిపోకుండా చూస్తున్నారు.

నెల	ఫిర్యాదులు	కౌన్సెలింగ్	విడాకులు
జులై	90	270	10
ఆగస్టు	85	255	12
సెప్టెంబరు	95	285	13
అక్టోబరు	88	264	11
నవంబరు	78	234	9



● ఫిర్యాదులు ● కౌన్సెలింగ్ ● విడాకులు

అన్ని స్టేషన్లలో ఇలాంటి కేసులే..

జిల్లా వ్యాప్తంగా 54 పోలీసు స్టేషన్లు ఉండగా, నెల్లూరు నగరంలో ఆరు ఉన్నాయి. ప్రతి స్టేషన్లలోనూ భార్యాభర్తల ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వచ్చిన వాటిని నగరంలోని మహిళా పోలీసు స్టేషన్‌కు ప్రతిపాదిస్తుంటారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తూ.. వివాహ బంధం విశిష్టత, బంధాలు, బంధుత్వాలు గురించి తెలియజేస్తున్నారు. ఒకటి, రెండు, మూడు చివరకు నాలుగోసారి కూడా ఇస్తూ జంట విడిపోకుండా ఉండేందుకు కృషి చేస్తున్నారు. వారిలో మార్పు రాకుంటే కోర్టులో దరఖాస్తు చేసుకోవాలంటూ సలహా ఇస్తుంటారు. లేదంటే కేసులు నమోదు చేస్తున్నారు. ప్రతి నెలలో ఒక్కో స్టేషన్‌కు పది కేసులు భార్యాభర్తల ఫిర్యాదులే ఉంటున్నాయి.

కలిసుండేలా చూస్తున్నాం..

చిన్నపాటి గొడవలతో ఇగో దెబ్బతింటున్నట్లు స్టేషన్లకు వస్తున్నారు. ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చినదైనా సరే.. ఆ జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. చివరకు రాజీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. – సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసుస్టేషన్

గోపురం.. అబ్బురం

సాధారణంగా ఆలయాలకు గోపురాలు ఉంటుంటాయి. వాటిని వివిధ ఆకృతుల్లో నిర్మిస్తుంటారు. నెల్లూరులో ఓ ఆలయానికి ఏకంగా శివలింగాకృతిలో గోపురం నిర్మించగా ఆకట్టుకుంటోంది. పురాతన ఆలయాల్లో నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఒకటి. దీని పక్కనే కాకతీయుల కాలంలో రైతులకు సాగునీరు అందించేందుకు చెరువును ఏర్పాటు చేశారు. ఇదే స్వర్ణాల చెరువుగా పేరుగాంచింది. దీని మధ్యలో అప్పట్లో రాజులు శివలింగాన్ని ఏర్పాటు చేశారని పూర్వీకులు చెబుతుంటారు. నీరు పూర్తిగా అడుగంటినపుడే కనిపిస్తుందని ప్రతీతి. మరో శివలింగం నెల్లూరు గ్రామదేవత ఆలయానికి సమీపంలో ఉంది. వీటికి పూజలు చేసేవారని చెబుతుంటారు. కాలక్రమంలో ఆలయానికి సమీపంలోని శివలింగానికి చుట్టూ ఓ భక్తుడు ప్రహరీ నిర్మించాడు. ఇది ప్రస్తుతం స్వర్ణలింగేశ్వరస్వామిగా భాసిల్లుతోంది. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి కుమార్తె దీపా వెంకట్ సహకారంతో పలువురు నాయకులు ముందుకొచ్చి శివలింగానికి ఆలయాన్ని నిర్మించారు. అందులో భాగంగా గోపురాన్ని శివలింగాకృతిలో ఏర్పాటు చేయగా ఆకట్టుకుంటోంది. శివలింగంపై నిత్యం సూర్యకిరణాలు పడుతుండటం ఇక్కడి ప్రత్యేకం. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఎత్తిపోతల ఎప్పుడో?



కొమ్మరపూడి సమీపంలో అసంపూర్తిగా బావి

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

మూడు గ్రామాల పరిధిలోని నాలుగు చెరువులకు నీరందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకాల పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఫలితంగా రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ పరిసరాల్లో కొమ్మరపూడి ప్రాంతంలో ఎర్ర, నల్ల చెరువులున్నాయి. కొండ్లపూడి, దేవరపాలెం గ్రామాల పరిధిలోనూ మరో రెండు ఉన్నాయి.

వర్షాలు కురిసి నిండితే సాగునీటి సమస్యలు తలెత్తవు. లేకుంటే రైతులకు కష్టాలు తప్పవు. ఈ నేపథ్యంలో సంగం వద్ద పెన్నా నది నుంచి నెల్లూరు చెరువుకు వచ్చే ఎన్‌టీఎస్ ఛానల్ ద్వారా నాలుగు చెరువులకు నీరందించాలని తలచి సుమారు రూ.5.51 కోట్లతో కొమ్మరపూడి, కొండ్లపూడి1, 2, దేవరపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టెండర్లు పిలిచారు. 2021లో పనులు ప్రారంభమయ్యాయి. కొమ్మరపూడి క్రాస్ రోడ్డు సమీపంలో కాలువ సమీపంలో సంప్ పనులు పూర్తయ్యాయి. ఇన్‌టేక్ పైపులైన్ 90శాతం పూర్తి కాగా.. పంప్‌హౌస్ ప్లింత్‌లెవల్ వరకు జరిగాయి. అక్కడి నుంచి కొమ్మరపూడి చెరువు వరకు 4 కి.మీ. మేర సిమెంట్ పైపులు తీసుకువచ్చి రోడ్డుపక్కన వదిలేశారు. కొండ్లపూడి, దేవరపాలెం గ్రామాలకు సంబంధించి ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వం పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం, బిల్లులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు.

● కొద్ది రోజులుగా పనులు నిలిచాయి... తిరిగి ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తామని లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏఈ దీపక్‌కుమార్ తెలిపారు.

మార్చి నాటికి పూర్తయ్యేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తిపోతల పథకం పనుల్లో కదలిక వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనులను పునఃప్రారంభించారు. 2026 మార్చి నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. పనులు మొదలైనా గుత్తేదారుల మధ్య సమస్యలు తలెత్తి మళ్లీ నిలిచిపోయాయి. పూర్తయితే 761 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

విరులు.. సిరులు...

నెల్లూరు నగరంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. కూరగాయల మార్కెట్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇదే పరిస్థితి పూల మార్కెట్‌ది. ఆత్మకూరు బస్టాండుకు ఆనుకుని ఉన్న ఇక్కడ వందలాది మందికి ఉపాధి కలుగుతోంది. 20 రకాల పూలు దొరుకుతాయి. వ్యాపారులు బెంగళూరు, కడప తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలోని చిరు వ్యాపారులతోపాటు పక్క జిల్లాల వారికి విక్రయిస్తుంటారు. హోల్‌సేల్‌తో పాటు రిటైల్ వ్యాపారం జరుగుతోంది. ఇక్కడ రోజూ రూ.10 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతున్నట్లు దుకాణ నిర్వాహకులు తెలిపారు. – ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

హిమగిరులే లక్ష్యంగా.. విజయమే ధ్యాసగా

పర్వతారోహణకు 52 మంది దివ్యాంగులు



పర్వతారోహణ చేస్తున్న బధిర విద్యార్థి ప్రసాద్

న్యూస్‌టుడే, దుత్తలూరు

వారు దివ్యాంగులు.. మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. సాహసయాత్రకు సిద్ధమవుతున్నారు. అందునా పర్వతారోహణకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. హిమాలయ పర్వతాలు అధిరోహించేలా వారిని ప్రోత్సహిస్తోంది. సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో 'అడ్వెంచర్ స్పోర్ట్స్' పేరిట ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. జోనల్ స్థాయిలో జిల్లా నుంచి ప్రత్యేక అవసరాల పిల్లలను ఎంపిక చేసి సాహస యాత్రకు సిద్ధం చేస్తున్నారు.

● ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రగా పేర్కొంటున్న ఇందులో ఐదు వేల అడుగుల ఎత్తు వరకు పర్వతాలను అధిరోహించడానికి అనుమతిస్తారు. ఈ సాహసకృత్యంలో సత్తా చాటే ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉత్తమ పురస్కారాలు, బహుమతులు దక్కే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే జిల్లాలోని సర్వశిక్షా అభియాన్ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈసందర్భంగా సర్వ శిక్షా జిల్లా ఏపీసీ వెంకటసుబ్బయ్య, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి ఇటీవలే ఆదేశాలు వచ్చాయని, ఈ కార్యక్రమం కోసం జిల్లాలోని 34 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 52 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి పరీక్షల అనంతరం ఈ యాత్రకు సిద్ధం చేస్తామన్నారు. ముందుగా జోనల్... ఆతరువాత రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన అనంతరం తుదిగా హిమాలయాల అధిరోహణకు తీసుకెళ్తామన్నారు.

జాబితా సిద్ధం

ఈ నెల 28వ తేదీ ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఏబీఎం స్కూల్ గ్రౌండ్‌లో జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు. దీనికి 34 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 15 నుంచి 18 ఏళ్లలోపు వయసు ఉన్న 52 మంది విద్యార్థుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు.

చిరు ధాన్యం... సిరుల పథం!

పుట్టగొడుగులు

రమ్య బృందం తయారు చేసిన మిల్లెట్ స్నాక్స్

చేజర్ల, న్యూస్‌టుడే : కార్పొరేట్ ప్రపంచం పిలుస్తున్నా.. అటు చూడలేదు ఆ యువతి. ఎంచుకున్న మార్గంలో.. మొదటి ప్రయత్నంలోనే వైఫల్యం ఎదురైనా నిరాశ చెందలేదు. మరింత పకడ్బందీ ప్రణాళిక.. శ్రమతో.. స్వయం ఉపాధిలో ముందడుగేశారు మార్గాన్ని ఎంచుకున్నారు అల్లూరుకు చెందిన ధన్యాసి రమ్య.

మైహోం స్నాక్స్ పేరుతో...

మార్కెటింగ్, హెచ్ఆర్ విభాగంలో ఎంబీఏ పూర్తి చేసిన రమ్య.. శ్రేష్ఠమైన.. సేంద్రియ ఆహార ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉన్న గిరాకీని గుర్తించారు. దాన్ని అందిపుచ్చుకోవడంపై దృష్టి సారించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ తీసుకున్నారు. అనంతరం 'మైహోం మిల్లెట్ స్నాక్స్' పేరుతో సజ్జలు, రాగులు, ఇతర చిరు ధాన్యాలతో బిస్కెట్లు, కేకులు తయారీని ప్రారంభించారు. వాటిని విపణిలో విక్రయిస్తూ.. లాభాలు గడిస్తున్నారు.

వైఫల్యం ఎదురైనా...

తొలి ప్రయత్నంగా పుట్టగొడుగుల పెంపకం మొదలుపెట్టారు. సరైన పద్ధతులు అవలంబించకపోవడంతో నష్టాలు ఎదురయ్యారు. అయినప్పటికీ విత్తన నాణ్యత, గుదల నిర్వహణపై అవగాహన తెచ్చుకుని.. ప్రస్తుతం ప్రత్యేక గదిలో పెంపకం చేపడుతున్నారు. రూ. 3,500 విలువ చేసే ఒక విత్తనపు స్పాన్ సంచితో రూ. పది వేల విలువ చేసే పుట్టగొడుగులు ఉత్పత్తి చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రాలకు అనుబంధంగా ఉన్న మార్కెటింగ్ సంస్థలకు ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. అన్ని ఖర్చులు పోను నెలకు రూ. లక్ష వరకు సంపాదిస్తున్నారు. 'గిరాకీకి అనుగుణంగా మా పిన్ని అనూష ప్రోత్సాహంతో కేంద్రాన్ని విస్తరిస్తున్నా.. ఎక్కువ మంది గ్రామీణులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం. ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థను సైతం తీర్చిదిద్దుకుంటానన్న విశ్వాసాన్ని రమ్య వ్యక్తం చేస్తోంది.

ఈ మేయర్ మాకొద్దు..

సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు

తేల్చిచెప్పిన 40 మంది కార్పొరేటర్లు

నేడు అవిశ్వాస తీర్మానం నోటీసు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: 'ఈ మేయర్ మాకొద్దు.. అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారు.. మేయర్ దంపతుల అవినీతి వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది' అంటూ కార్పొరేటర్లు ఆరోపించారు. ఆదివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు 40 మంది సమావేశమై.. ఆమెను గద్దె దించాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. దంపతుల చేతివాటం వల్ల దస్త్రాలు కదలడం లేదని, కొత్త మేయర్ కావాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ల అభిప్రాయంతో ఏకీభవించిన మంత్రి, ఎమ్మెల్యే అవిశ్వాస తీర్మానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి అవిశ్వాస నోటీసును అందించనున్నారు.

71 డివిజన్లు చేయాలని నిర్ణయం

నగరంలో 54 డివిజన్లు ఉండగా.. వాటిని 71గా చేసేందుకు ప్రాథమికంగా విస్తరణ హద్దులు కూడా నిర్ణయించారు. కోఆప్షన్ సభ్యులతో పాటు కార్పొరేటర్ల సంఖ్య పెరగనుంది.

నాలుగేళ్లు పూర్తి కావడంతో..

నాలుగేళ్ల క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైకాపా నగరంలోని 54 డివిజన్లను కైవసం చేసుకుంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశీస్సులతో మేయర్ పీఠం స్రవంతి దక్కించుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైకాపాకు జిల్లాలో చావుదెబ్బ తగలడంతో ఆమె తటస్థంగా ఉంటున్నారు. నగరాభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి. నాలుగేళ్లు పూర్తి కావడంతో కూటమి ప్రభుత్వం మేయర్ పీఠంపై దృష్టి సారించింది. ఆమెను పదవి నుంచి దించేందుకు అవిశ్వాసం పెట్టనున్నారు. 27 మంది సభ్యులు ఉంటే సరిపోతుంది. తెదేపాకు 40 మంది బలం ఉంది. ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉండడంతో మేయర్ పీఠం కూటమి వశం కానుంది.

మాక్ అసెంబ్లీకి జిల్లా విద్యార్థులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : విజయవాడలో జరిగే మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఒక్కో విద్యార్థిని ఎంపిక చేసి ఆదివారం పంపారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు వీరిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో డీఈవో బాలాజీరావు

కవిత్వం కథనం.. విద్యార్థి హితం

యూత్‌ఫెస్టివల్ పోటీల్లో ప్రతిభ

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం : యువతలో దాగిఉన్న అపారమైన శక్తి సామర్థ్యాలు వినియోగించుకుంటే అద్భుతాలు సృష్టించొచ్చు. వాటిని నిజం చేశారు.. పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. కవిత్వం, కథన రచన చేసి గతనెల 23న నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో ప్రథమస్థానం సాధించారు. ఈనెల చివరిలో అమరావతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దంటూ..

యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాల బారిన పడి వారిలో ఉండే శక్తి సామర్థ్యాలు నాశనం చేసుకోకూడదు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలను చూస్తున్నాం. వాటిని సరి చేసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందంటూ అర్థం వచ్చేలా రాసిన కవిత్వానికి ప్రథమస్థానం లభించిందని కళాశాలలో మూడో సంవత్సరం డిగ్రీ చదువుతున్న జైస్వాల్ తెలిపారు. భవిష్యత్తులో ఎస్ఐ కావాలన్నది తన లక్ష్యమని చెబుతున్నాడు.

కళాశాలకు దూరమైతే కష్టాలే..

ప్రస్తుతం విద్యార్థులు పాఠశాల స్థాయిలో క్రమం తప్పకుండా తరగతులకు వెళ్తుంటారు. కళాశాలకు వెళ్లగానే స్వేచ్ఛ లభించినట్లుగా భావిస్తుంటారు. చెడు సావాసాల ఫలితంగా కళాశాలకు డుమ్మా కొట్టడం అలవాటుగా మారిపోతోంది. దీంతో విద్యకు దూరమై భవిష్యత్తులో ఇబ్బందులు పడుతున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. మంచి స్నేహితులుగా ఉన్న వారు అటువంటి వారిని కూడా మార్చి తిరిగి కళాశాలకు వచ్చేలా చేసిన సందర్భాలున్నాయి. ఇదే విషయాలను కథనంగా మలిచాడు.. మూడో సంవత్సరం బీఏ చదువుతున్న విద్యార్థి రావినూతల మహేష్.

అనధికార ప్లాట్లా... క్రమబద్ధీకరించుకోండిలా..

న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్), కందుకూరు పట్టణం

అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి అవకాశమిచ్చింది. గతంలో ఇచ్చిన గడువు ముగియగా.. దరఖాస్తు గడువును వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు పొడిగించింది. క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఈ ఏడాది జులైలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకాన్ని తీసుకొచ్చింది. 2025 జూన్ 30వ తేదీ లోపు అనధికార లేఅవుట్లుగా తేలినవి పథకానికి అర్హతగా ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు ఆత్మకూరు, కందుకూరు, కావలి మున్సిపాలిటీల్లో అనధికార లేఅవుట్లు, ప్లాట్లు భారీగానే ఉన్నాయి.

● ప్రయోజనాలు.. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి వెంటనే అనుమతులు పొందొచ్చు. గృహ రుణాలకు బ్యాంకులు అంగీకరిస్తాయి. ఓపెన్‌స్పేస్, బెటర్‌మెంట్ ఛార్జీల్లో రాయితీ లభిస్తుంది. లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు వీలుకలుగుతుంది.

అనధికార లేఅవుట్ పరిశీలిస్తున్న అధికారులు

దరఖాస్తు విధానం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు నుంచే ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. 2014-19 మధ్య కాలంలో నిర్దేశించిన బేసిక్ ధరలనే ఇప్పుడు కూడా అమలుచేస్తున్నారు. అనధికార ప్లాట్లు, లేఅవుట్లు కలిగిన వారు మున్సిపాలిటీలోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా lrsdtcp.ap.gov.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో సొంతంగా దరఖాస్తులను పొందుపరచొచ్చు.

అవసరమైన పత్రాలు

సేల్ డీడ్ డాక్యుమెంట్, లేఅవుట్ కాపీ అప్‌లోడ్ చేసి.. కనీస మొత్తంగా రూ.10వేలు చెల్లించాలి. దరఖాస్తు పత్రాలు అనుమతి పొందాక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ మార్కెట్ విలువలో 7శాతం(50 శాతం రాయితీతో) చెల్లించాల్సి ఉంటుంది.

పరిశీలన ప్రక్రియ

దరఖాస్తు చేసుకున్నాక నగర, మున్సిపల్ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి తాత్కాలిక లేఅవుట్ నమూనా తయారు చేస్తారు. కనీసం 30 అడుగుల రోడ్లు ఉండేలా డిజైన్ చేస్తారు. అభ్యంతరాలతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. అభ్యంతరాలు లేని ప్లాట్లకు మిగిలిన ఫీజు(7శాతం) వసూలు చేసి వెంటనే క్రమబద్ధీకరిస్తారు.

శ్రద్ధాంజలి

స్వర్గీయ శ్రీ పమిడిపాటి పద్మనాభరావు గారు

జీవన విధానంలో మీరు చూపే క్రమశిక్షణ
ఉపాధ్యాయ వృత్తిపట్ల మీలోని అంకితభావం,
సుదీర్ఘకాలం ప్రధాన ఉపాధ్యాయులుగా
పనిచేసిన మీరు చూపే నిబద్ధత,

స్వర్గీయ శ్రీ పమిడిపాటి పద్మనాభరావు గారు

ఆయుత్తు నాగరాజు
కొడూరు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative
Energy Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
RAO'S EDUCATIONAL INSTITUTIONS NELLORE
Digital Partner TV Partner Organised by

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళా జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోటీ లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణ పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).

● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు యూనిట్ కార్యాలయం, చెముడుగుంట (గ్రామం), వెంకటాచలం మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా.
వివరాలకు: 91549 90998
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రెండో రోజు వినియోగిస్తే ఒట్టు

ఎన్నికల సమయంలో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ట్రైసైకిళ్లను జిల్లాలోని పలు రెవెన్యూ కార్యాలయాలకు పంపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు మాత్రమే వాడారు. తర్వాత పొదలకూరు తహసీల్దారు కార్యాలయంలో మూలన పడేయడంతో తుప్పుపట్టి వృథాగా ఉన్నాయి. గ్రీవెన్స్‌లో ఎంతో మంది దివ్యాంగులు ట్రైసైకిళ్లు కావాలని వినతులిస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారులేమో పంచాయతీ ఎన్నికల్లో వినియోగిస్తామని చెబుతున్నారు. అప్పటి వరకు అవి బాగుంటే కదా..! అని వాటిని చూసిన వారు చర్చించుకుంటున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

యమపాశాలతో బెంబేలు

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో విద్యుత్తు సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు తరువాత పట్టించుకోలేదు. ఇటీవల ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ ద్వారా వినియోగదారులు, రైతులకు నేరుగా ఫోన్ చేసి అభిప్రాయాలు తెలుసుకొని సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తమైంది. రాపూరులోని దాలిచెరువు పొలాలకెళ్లే మార్గంలోని కాలనీలో విద్యుత్తు తీగలు, స్తంభాలు ఇళ్లపైనే ప్రమాదకరంగా ఉన్నాయి. డిస్కం అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, రాపూరు

నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (విద్య): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నామని రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7674034951 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మర్రిపాడు: బుధవాడ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు 108 వాహనంలో ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

శేరిలింగంపల్లి: గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. హఫీజ్‌పేట రైల్వే ట్రాక్ దగ్గర గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు ఎస్టీఎఫ్ బృందం సభ్యులకు సమాచారం అందింది. అక్కడ తనిఖీలు చేపట్టి శ్రావణపు నితీశ్‌కుమార్‌రెడ్డి, చెలిమెల విజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన వీరు.. ఓల్డ్ బేగంపేటలో నివాసం ఉంటున్నారు. నిందితులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఠాణాలో అప్పగించారు.

రుచికరంగా.. కడుపు నిండేలా..

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, బుచ్చి

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు పెంచడం.. బడి మానేసిన విద్యార్థుల సంఖ్య తగ్గించేందుకు మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచికరంగా నిర్వాహకులకు వడ్డించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో వంట ఛార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మెనూ పక్కాగా అమలయ్యేలా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ పెంపుదలకు నిర్ణయం తీసుకున్నారు.

పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

నిర్వాహకులకు మేలు...

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పులు చేసి వంటలు చేస్తూ అవస్థలు పడేవారు. పెరిగిన ధరలకనుగుణంగా ఆహారం చేయలేమని, కొంత పెంచాలని గత పాలనలో పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఉన్నంతలోనే ఆహారం వండడంతో నాణ్యమైన భోజనం అందని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నిర్వాహకుల్లో ఆశలు చిగురించాయి.

ఒక విద్యార్థికి పెంచారిలా..(రూ.లలో)

తరగతులు	ప్రస్తుతం	పెంచిన తర్వాత
1–5	5.45	6.19
6–ఇంటర్	8.17	9.29

2507 ప్రభుత్వ పాఠశాలల్లో...

జిల్లాలోని 2,507 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకం అమలవుతోంది. అక్షయపాత్ర ద్వారా 291 పాఠశాలల్లో ఇస్కాన్ సంస్థ, 89 పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా, 2,127 పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు బడి భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు 53 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేస్తున్నారు. మొత్తం 1.40 లక్షల మంది విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు.

ధూప దీప నైవేద్యాలకు రూ.118 కోట్లు

రాపూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని 426 ఆలయాల్లో నెలకు రూ.10 వేలు చొప్పున దూప దీప నైవేద్యాల కింద ప్రభుత్వం పీజీఎఫ్ కింద రూ.118 కోట్లు కేటాయించిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి పెంచలకోనలోని ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ.. పనులకు పీజీఎఫ్ పథకంలో రూ6.5 కోట్లు కేటాయించామని వివరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల సహకారంతో మాస్టర్ ప్లాన్ కింద పెంచలకోన పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమ్మవారి ఆలయ పనులు పూర్తి కాగానే, పెంచలస్వామి ఆలయ పనర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పెంచలకోన బ్రహ్మోత్సవాలతో పాటు దసరా శరన్నవరాత్రులు, కార్తికమాసం వేడుకల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 35 నుంచి 40 శాతం భక్తులు పెరిగారన్నారు. జిల్లాలో దెబ్బతిన్న ర.భ, పీఆర్ శాఖల పరిధిలోని అన్ని రహదారుల ఆధునికీకరణకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అంతకుముందు అధికారులు మంత్రి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఉప కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఈ సతీష్, ఏసీ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఉలవపాడు: చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీకి ఎంపికయినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి చదువుతున్న గోకుల్ చందు అండర్17స్కూలు గేమ్స్‌లో రాష్ట్రస్థాయిలో ప్రకాశం జిల్లా జట్టుకు ఆడి ప్రతిభ చూపారు. 29న కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

పది పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరేలా..!

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

● 2024 సంవత్సరంలో పదోతరగతి చదువుతున్న నెల్లూరు గ్రామీణ మండలానికి చెందిన ఒక విద్యార్థినికి నెల్లూరు నగరంలోని కార్పొరేట్ పాఠశాలలో కేంద్రం వేశారు. అదే పేరుతో పదుల సంఖ్యలో బ్రాంచీలు ఉన్నాయి. చిరునామా తెలియకపోవడంతో తండ్రి పరీక్ష కేంద్రాన్ని వెతుక్కుంటూ ఆటోలు మారుతూ, రెండు బ్రాంచీలు తిరిగారు. ఆ దారిన అందరినీ అడుగుతూ వెళ్లి సమయం మించి పోతుందన్న ఆందోళన నేపథ్యంలో వ్యయప్రయాసలతో చేరుకున్నారు.

● పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులకు తెలియని భయం..ఆందోళన ఉంటుంది. కొన్ని చోట్ల నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు పిల్లలను కేంద్రాలకు తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతంలోని ఏ వీధిలో, ఏ అపార్ట్‌మెంట్‌లో ఏ పాఠశాల ఉందో తెలుసుకోవడం కష్టం.. ఈ సమస్యలకు పరిష్కారంగా ప్రతి ఒక్కరి దగ్గర నేడు చరవాణులు అందుబాటులో ఉన్నాయి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సులువుగా వెళ్లేలా విద్యాశాఖ పరీక్ష హాల్ టికెట్‌పై క్యూఆర్ కోడ్‌ను ప్రచురించనుంది. చరవాణి ఉపయోగిస్తే కేంద్రం రూట్ మ్యాప్ కనిపించడంతో సులువుగా చేరుకోవచ్చు.

● పరీక్షల రోజున కేంద్రానికి చేరుకోవడం చాలా మందికి సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో జంబ్లింగ్ విధానంలో ఎవరికి ఎక్కడ పరీక్ష కేంద్రం కేటాయిస్తారో తెలియని పరిస్థితి. దీనికి తోడు ట్రాఫిక్ సమస్య సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి.

29,830 మంది విద్యార్థులకు సౌలభ్యం..

పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, కావలి, బుచ్చిరెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం కష్టంగా ఉండేది. కొన్ని చోట్ల గురుకుల పాఠశాలలు ఊరికి దూరంగా ఉన్నాయి. డీఈవో బాలాజీరావు మాట్లాడుతూ... విద్యార్థులకు హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ విధానం ఎంతో మేలు చేస్తుందన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.11,881
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.95,048
వెండి గ్రాము :	రూ.163.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	124
లేయర్	130
బ్రాయిలర్స్	224
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	221

మూడేళ్లలో 17 లక్షల ఇళ్లు: వాకాటి

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో 17 లక్షల ఇళ్లు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి వెల్లడించారు. ఆదివారం నగరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. మూడు నెలలకోసారి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుడుతున్నామని, రాజధాని నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUILDING CONSTRUCTION
Hotel Building Plans Statutory Approvals Consultant Required for a high raise in 50 cents. Cont: 92824 05555

EDUCATION
DISTANCE EDUCATION
10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, MSC, MCA, MBA, MLIS Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT : 9030030125

FINANCIAL SERVICES
Live Trading in your Demat account. Join us & Grow Together. Minimum account Balance 5 lakhs for details DSR money growth ✆ 9059521999

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా అతి తక్కువ వడ్డీకే ఇళ్ళు, స్థలాలు, పొలాలు, స్కూల్స్/ కాలేజీలు, ఫ్యాక్టరీలపై ఫైనాన్స్ లేదా లోన్స్ టేకోవర్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. నో సిబిల్/ నో బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. ✆ 7095718191.

REAL ESTATE
HOUSE FOR SALE
నెల్లూరు కృష్ణపట్నం రోడ్డు కాకుపల్లి సన్‌ఫార్మసీ కాలేజ్ ప్రక్కన 28 అం. స్థలంలో 40 అం. కట్టుబడి G+2 ఇండ్లు కార్ పార్కింగ్‌తో అమ్మబడును. 9885556475

PLOT FOR SALE
నెల్లూరు మైపాడు రోడ్డుకి కిసాన్ నగర్‌కు అతి దగ్గరలో 30 అంకణముల కమర్షియల్ ప్లాట్ అమ్మకమునకు కలదు. అంకణం: 3,50,000/-. ✆ 89191 88010

TO LET
నెల్లూరులో, పొదలకూరు రోడ్డు నిప్పోసెంటర్ దగ్గర ATMకి గానీ లేదా షాపునకు గానీ బాడుగకు ఇవ్వబడును. Contact ✆ 87544 84102, 83283 69996

JOBS
నవాబుపేటలోని ఆఫీసు నందు పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల లేడీ రిసెప్షనిస్ట్ మరియు హౌస్‌కీపింగ్ (లేడీ) కావలెను. Contact ✆ 62817 35370

వృద్ధాశ్రమములో పనిచేయుటకు వంటవారు, కేర్‌టేకర్స్ కావలెను. నారాయణరెడ్డిపేట Contact Number ✆ 63002 88170

మినిబైపాస్‌రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోలు బంకులో పనిచేయుటకు పంపు బాయ్స్, గర్ల్స్ కావలెను. జీ:15,000 Contact ✆ 89199 23469, 83418 28889

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... వివరాలకు..
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

దీపావెంకట్ జన్మదిన వేడుకలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ముందస్తు జన్మదిన వేడుకలు వెంకటాచలంలోని ట్రస్టు ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులతో కలిసి ఆమె కేకు కోయగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. దీపా వెంకట్ మాట్లాడుతూ... స్వగ్రామంలో అందరి మధ్య ట్రస్టులో జన్మదిన వేడుకలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్టు ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించి అక్షర, స్వర్ణభారత్ విద్యామందిర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సైరడ్, సోమా సాంకేతిక శిక్షణ కార్యాలయంలోని శిక్షణార్థులు, వృద్ధులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. భాజపా రాష్ట్ర నాయకులు సురేంద్ర రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్టు సమన్వయకర్త జనార్దన్ రాజు, వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి కేకు కోస్తున్న స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం: జేసీ

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తమని, ఆయన సందేశాలు కోట్లాది మంది భక్తుల హృదయాల్లో సంక్షిప్తమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నెల్లూరు కలెక్టరేట్‌లో సత్యసాయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలతో పుట్టపర్తికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని, రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చిన మానవతామూర్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించి విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారన్నారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు సురేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

మహిళ అనుమానాస్పద మృతి

నెల్లూరు (నేర విభాగం): మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వైనమిది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న వి.వరలక్ష్మి (35) ప్రభుత్వాస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. మనోహర్ అనే వ్యక్తిని కొన్నేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అతను మద్యానికి బానిసవడంతో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యులు సర్దిచెబుతున్నారు. శనివారం సాయంత్రం వరలక్ష్మి విధులు ముగించుకొని ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత ఆమె భర్త మనోహర్ నిద్ర లేపే ప్రయత్నం చేయగా.. స్పందన లేదు. దీంతో ఆమె సోదరుడు శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వగా.. అతను చేరుకుని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఆదివారం నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ డ్రైవర్ ఆటో చోరుడు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అతను ఆటో డ్రైవర్. ఆటోల దొంగ అవతారమెత్తారు. కామన్ తాళం చెవితో ఆటోలను అపహరించడం మొదలు పెట్టారు. ఒకటీ రెండు కాదు.. ఏకంగా ఆరు ఎత్తుకెళ్లి వాటి విడిభాగాలను విక్రయించారు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. వివరాలను ఆదివారం చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. దగదర్తి మండలానికి చెందిన జలదంకి మల్లికార్జున తన తాత ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ ఏడాది సెప్టెంబరు 29న నగరానికి వచ్చి ఓ ఆసుపత్రి ఎదుట ఆటోను పార్కింగ్ చేయగా అపహరణకు గురైంది. దీనిపై బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేయగా.. యల్లాయపాలేనికి చెందిన ఆటోడ్రైవర్ కదివేటి శ్రీకుమార్‌ను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఇప్పటివరకు ఆరు ఆటోలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. ఇతనిపై గతంలో రాపూరు, టీపీగూడూరు పోలీసుస్టేషన్లలో ఆటోల దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తించారు. రూ.4.61 లక్షల విలువైన ఆరు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్సై అబ్దుల్‌రజాక్, ఏఎస్సై రవిప్రసాద్, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం
సేవే అభిమతం

న్యూస్‌టుడే, వెంకటాచలం

వీఎస్‌యూ విద్యార్థినులు కేవలం తరగతి గదులకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటనకు వెళుతున్నారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ అవగాహన పెంచుకుంటున్నారు. ఏ విద్యార్థి అయినా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలంటే.. కేవలం చదువు ఒక్కటే కొలమానం కాదు. క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు అలవరచుకోవడంతో పాటు సమాజంపై అవగాహన, జీవితంలో ఎదగాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలు, వివిధ ప్రాంతాల్లోని సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలి. వీఎస్‌యూ విద్యార్థినులు (ఎన్‌ఎస్‌ఎస్)ను వేదికగా చేసుకుని సేవా కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు.

మొక్క నాటుతున్న విద్యార్థినులు

క్షేత్ర పర్యటనలు ఉపయుక్తం

– బి.చందు, ఎంబీఏ



విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనలు, సమైక్యతా శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఒక వైపు చదువుతూనే మరొక వైపు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీరుగా చేరి.. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలకు హాజరవుతున్నా. నాలో చాలా మార్పు వచ్చింది. క్రమశిక్షణ, సమయపాలన, ఎదుటి వ్యక్తులతో ఎలా మాట్లాడాలి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక వనరులు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కలిగింది.

అన్ని అంశాలపై అవగాహన

–చిన్న రంగమ్మ, ఎమ్మెస్సీ



విద్యార్థులు కేవలం తరగతి గదులకు పరిమితం కాకుండా సమాజంపై కొంత అవగాహన కలిగి ఉండాలి. ఎర్రగుంటలో వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొన్నా. గ్రామంలో సర్వే నిర్వహించి.. ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరాతీసి వాటిని నమోదు చేసుకున్నా. మరొక వైపు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చు

– కామాక్షి ప్రవళిక, సోషల్ వర్క్ విభాగం



జీవితంలో ఎదగాలంటే కేవలం చదువు ఒక్కటే ముఖ్యం కాదు. సమాజంతో పాటు ఇతర అంశాల్లోనూ అవగాహన ఉండాలి. అధికారుల ప్రోత్సాహంతో ఎన్‌ఎస్‌ఎస్‌లో వాలంటీరుగా చేరా. విద్యార్థులతో కలిసి శిబిరాల్లో పాల్గొంటే చాలా అంశాలు నేర్చుకోవచ్చు. శిబిరాల్లో నేర్పించే, సూచించే అంశాలను పాటిస్తే జీవితంలో ఉన్నత లక్ష్యాలకు సులువుగా చేరుకోవచ్చు. అవకాశం లభిస్తే జాతీయ సమైక్యతా శిబిరాలకు హాజరవుతా.

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

గేటు వద్ద ఆగిన వాహనదారులు

సాంకేతిక లోపం.. వాహనదారులకు నరకం

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలులో ఉన్న 144వ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు సాంకేతిక లోపాల కారణంగా ఆదివారం రెండు గంటలకు పైగానే మూతపడింది. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తీవ్ర అసౌకర్యానికి గురైన వారంతా దూరాభారమైనా.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించారు. రైల్వే సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్లు సమస్యను చక్కదిద్దారు.

మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యం

ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రజల్లో మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యంగా జమాతే ఇస్లామీ హింద్ పని చేస్తుందని ఆశాఖ జిల్లా అధ్యక్షురాలు పాతిమా పేర్కొన్నారు. స్థానిక దిలావర్‌బాయ్ వీధి మదరసాలో ఆదివారం ఉదయగిరి విభాగం అధ్యక్షురాలు ఆసియా ఆధ్వర్యంలో పొరుగువారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని వడ్డెపాలెం వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ దంపతుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి

కావలి, ఉదయగిరి, దుత్తలూరు: పట్టణంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలో భాగంగా ఆదివారం స్థానిక సత్యసాయిమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయగిరిలోని తహసీల్దారు కార్యాలయంలో సత్య సాయిబాబా చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు హజరత్ మస్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మండలకేంద్రమైన దుత్తలూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సత్యసాయి జయంతి వేడుకలను అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఉదయగిరి: మండలంలోని కొండాయపాలెం పంచాయతీ వెంకటప్పాపురంలో గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయం 41 రోజులు పూర్తయిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరు పట్టణం: పట్టణంలోని జనార్దన స్వామి ఆలయ ఆవరణలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామికి ఆదివారం భక్తులు తమలపాకులతో అలంకరణ చేశారు. ఈసందర్భంగా హనుమాన్ దీక్షా పరులు 108 హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

పెట్టె ఉంది ఖాళీగా.. ప్రథమ చికిత్సకు దూరంగా!

➡ మూడు నెలల క్రితం కందుకూరు నుంచి ఒంగోలు వెళ్తున్న నాన్‌స్టాప్ సర్వీసు బస్సు టీటీడీ సమీపంలో రహదారి పక్కకు వాలింది. ఈ ఘటనలో ఇద్దరికి కిటికీ రేకులు తెగి గాయాలయ్యాయి. రక్తం కారుతుండగా చేతి రుమాలు చుట్టుకుని తర్వాత వైద్యశాలలో చికిత్స పొందారు.

➡ గత నెల కందుకూరు నుంచి పెదపవని వెళ్లే బస్సులో సీటు దగ్గర ఉండే రేకు తెగి ఓ వ్యక్తి చేతికి గాయమైంది. బస్సులో ప్రథమ చికిత్స కిట్టు లేకపోవడం, రక్తం కారుతుండడంతో మాచవరంలో దిగి ప్రైవేటుగా ప్రథమ చికిత్స చేయించుకున్నారు.

➡ కందుకూరు డిపో పరిధిలో సుమారు 15 బస్సులను పరిశీలిస్తే ఏ ఒక్క దాంట్లో చికిత్సకు అవసరమైన మందులు కనిపించలేదు. కొన్ని బస్సుల్లో చెత్తపేపర్లు, అగ్గిపెట్టెలు, పాతవస్త్రాలు దర్శనమిచ్చాయి.

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మేడి పండు చూడ మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు అన్న చందంగా తయారైంది ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టె(ఫస్ట్ ఎయిడ్ బాక్సు)ల పరిస్థితి. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఇవి కచ్చితంగా ఉండాలి. పేరుకు మాత్రం పెట్టెలు కనిపిస్తున్నా.. తెరిచి చూస్తే ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పెదపవని వెళ్లే మార్గంలోని బస్సులో ఇలా..

జిల్లా పరిధిలోని ఏడు డిపోల్లో 625 బస్సులు రవాణా సాగిస్తున్నాయి. ఇందులో 135 అద్దెప్రాతిపదికన నడుస్తున్నాయి. రోజూ 2.25లక్షల నుంచి 2.50లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. అందులో 1.40 లక్షల నుంచి 1.60 లక్ష వరకు మహిళలే ఉన్నారు. గ్రామాలకు, దూరప్రాంతాలకు వెళ్లే సమయంలో అనుకోని ప్రమాదాలతో ఏ చిన్నగాయమైనా వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉండాల్సినవి

ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో అయోడిన్, యాంటిసెప్టిక్ క్రీమ్, దూది, కత్తెర, కాటన్‌బ్యాండ్, ఎలాస్టిక్ వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్ ఉండాలి. వీటితో గాయాలైన ప్రయాణికులకు కండక్టర్ ప్రథమ చికిత్స చేయాలి. ప్రమాద సమయంలో అంబులెన్స్‌లు వచ్చే వరకు కూడా గాయాలకు కట్టు కూడా కట్టడం లేదు.

ప్రతి బస్సులో ఉండేలా చర్యలు

బస్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఏర్పాటు చేసేందుకు ఇండెంట్ పెట్టాము. టెండర్లు పిలిచి వెంటనే వాటిని ఏర్పాటు చేస్తాం. ఇకపై బస్సుల తనిఖీ సమయంలో ముందు వీటిపైనే దృష్టి పెడతాం. **షమీమ్, జిల్లా ప్రజా రవాణాధికారి**

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: పోతులలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు వస్తున్నాయి. **- కోటయ్య, స్థానికుడు**

సమాధానం: ఇప్పటికే ఈ సమస్యపై అర్జీ అందింది. నిధుల సర్దుబాటు అయిన వెంటనే ప్రహరీ పనులు ప్రారంభిస్తాం. **- సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ వెంకటసుబ్బయ్య**

? పోలంపాడు కాలనీల్లో అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నాయి. వర్షం వస్తే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- తిరుపాలు**

✓ వీటిపైన త్వరలో రోడ్ల నిర్మాణం జరిగేలా చూస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం. **- రవీంద్ర, ఏఈ - న్యూస్‌టుడే, కలిగిరి**

? నందిపాడు నుంచి కావలి వరకు వెళ్లే రోడ్డు ప్రమాదకర మలుపులతోపాటు ధ్వంసమైంది. రాకపోకలు చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. **- నరసింహారావు, స్థానికుడు**

✓ రోడ్డును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం **- అనిల్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

? లింగసముద్రంలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. **- నరసింహం, గ్రామస్థుడు**

✓ పరిశీలించి వీధి దీపాలు బాగు చేయిస్తాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం. - న్యూస్‌టుడే, లింగసముద్రం**

? సున్నపుబట్టిలో రహదారి పక్కనే పేడ దిబ్బలు వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. **- వెంకటయ్య, స్థానికుడు**

✓ తగిన చర్యలు తీసుకుంటాం **- నాగరాజు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి-న్యూస్‌టుడే, దగదర్తి**

? కావలి పట్టణం ఉదయగిరి వంతెన కావలి నుంచి వంతెన కింది వైపున క్రిస్టియన్‌పేటకు వెళ్లే దారిలో మాంసం విక్రయించేవారు సామగ్రిని రోడ్డుపై పెడుతున్నారు. రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంటోంది. **- స్థానికుడు**

✓ పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం. **- శ్రావణ్‌కుమార్, కమిషనర్, పురపాలకసంఘం - న్యూస్‌టుడే, కావలి**

వైద్యశిబిరాలతో పేదలకు మేలు: ఎంపీ

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బద్దిపూడిలో కూనం సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు రాఘవరెడ్డి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కావలి ఐఎంఏకు రాష్ట్రస్థాయి అవార్డులు

కావలి, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి బ్రాంచికి రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు లభించాయి. ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి ఐఎంఏ వార్షిక సమావేశంలో ఈ అవార్డులు అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, వైద్య శిబిరాలు నిర్వహించడంతో ఐఎంఏ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు దిలీప్ భన్సాలీ, నందకిషోర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ కావలి బ్రాంచి అధ్యక్షుడు కామంచి సుబ్బారావు, కార్యదర్శి గోపి అవార్డులను అందుకున్నారు.

సర్వే ఉద్యోగుల సంఘం ఎన్నిక

బాలాజీ, శ్రీనివాసులును అభినందిస్తున్న సభ్యులు

కందుకూరు పట్టణం : కందుకూరు రెవెన్యూ డివిజన్ సర్వే ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ఎల్.బాలాజీ, ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యక్షునిగా జి.దశరదరామ్మూర్తి, సంయుక్త కార్యదర్శిగా వై.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కె.రమేష్ ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ సర్వేయర్ ప్రభాకర్ తదితరులు వీరిని అభినందించారు.

నేలచప్టా.. గతుకులమయం

మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట వెళ్లే రోడ్డులో మూడుచోట్ల ఉన్న నేల చప్టాలు గతుకులమయంగా ఉన్నాయి. దీంతో రాకపోకలు చేసే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కొద్దిపాటి వర్షం పడినా నీళ్లు నిలిచి ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

తాగునీరు వృథా

రోళ్లపాడు ప్రాజెక్టు వద్ద సీడబ్ల్యూఎస్ నుంచి చెర్లోపాలేనికి ఉన్న ప్రధాన పైపులైనులో శాఖవరం బస్టాండు దగ్గర లీకులు ఏర్పడ్డాయి. తాగునీరు వృథాగా పోతోంది. గతంలోనూ పైపులైనుకు మరమ్మతులు చేసి గుంతను పూడ్చలేదు. ఇటీవల మరలా లీకేజీ కావడంతో గుంత నిండా నీరు నిలిచింది. తాగునీరు కలుషితం అవుతుందని స్థానికులు అంటున్నారు. వెంటనే మరమ్మతులు చేసి గుంతను పూడ్చాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**

డివైడర్ నిర్మాణ పనుల ప్రారంభం

పట్టణంలోని పామూరురోడ్డులో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించిన నిర్మాణ పనులు మొదలయ్యాయి. మున్సిపల్ అధికారులు ఆదివారం రెండు జేసీబీ యంత్రాలతో డివైడర్‌కు సంబంధించి సీసీ రోడ్డు కటింగ్ పనులు చేపట్టారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

విద్యతోనే ఉన్నత శిఖరాలు

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. ఇటీవల ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) నమూనా పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. బహుమతులు అందజేశారు. పరీక్షలు నిర్వహించిన రత్నమ్మఫౌండేషన్ నిర్వాహకులు ప్రసాదరావును ప్రశంసించారు. **- న్యూస్‌టుడే, కావలి**

వరికుంటపాడులో జోరు వర్షం

వరికుంటపాడు మండలంలో ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ప్రధాన రోడ్డుతోపాటు వీధులన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. **- న్యూస్‌టుడే, వరికుంటపాడు**

క్రైమ్ కార్నర్

కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

కావలి, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయడంతో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన కుర్రా విష్ణుసాయికి పట్టణానికి చెందిన జి. శివానితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. గత కొన్నాళ్లగా అదనపు కట్నం కోసం అతను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. దీంతో బాధిత మహిళ పుట్టింటికి వచ్చేశారు. స్థానిక పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డీజిల్ అక్రమంగా విక్రయిస్తుండడంతో..

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు సమీపంలో జాతీయ రహదారిపై డీజిల్‌ను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు కృష్ణారెడ్డి అనే వ్యక్తి డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ వాహనాల నుంచి అక్రమంగా కొనుగోలు చేస్తుంటారు. వాటిని తిరిగి రహదారిపై ఉన్న లారీలకు బయట పెట్రోల్ బంకుల కంటే తక్కువకు విక్రయిస్తుంటారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అతడ్ని పట్టుకున్నారు. నిల్వ ఉన్న డీజిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చాకిచర్లలో పొలం వివాదంపై..

ఉలవపాడు, న్యూస్‌టుడే: పొలం విషయమై జరిగిన వివాదం గొడవకు దారితీసింది. ఎస్సై అంకమ్మ వివరాల మేరకు చాకిచర్లకు చెందిన మిరియం సుబ్బయ్య ఆదివారం పొలంలో పనిచేసుకుంటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన పాలకీర్తి వెంకటేశ్వర్లులతో పాటు మరో ఇద్దరు మహిళలు ఆ పొలం తమదంటూ గొడవకు దిగి దుర్భాషలాడారు. ఆ మేరకు సుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కలిగిరి, న్యూస్‌టుడే: గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం జాతీయరహదారి 167 బీజీపై పెద్దపాడు సమీపంలో ఈ ఘటన జరిగింది. వివరాల మేరకు వీరారెడ్డిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన శేషయ్య కావలి నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి 108 వాహనంలో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

తమిదపాడులో మద్యం స్వాధీనం

వింజమూరు, న్యూస్‌టుడే: మండలంలోని తమిదపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కలిగిరి ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.

వసతులు శూన్యం.. అవస్థలు అనేకం



బేతనీపేట పునాదుల వద్ద వర్షపు నీరు

బిట్రగుంట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ఆర్భాటంగా లేఅవుట్లు ఏర్పాటు చేసింది. వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేసింది. వద్దన్నా లేఅవుట్లు వేసి నిధులు దుర్వినియోగం చేసింది. చిన్నపాటి వర్షం కురిసినా నీళ్లు నిలుస్తున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఉండడంతో లబ్ధిదారులకు లబోదిబోమంటున్నారు. బోగోలు, విశ్వనాథరావు పేట మేజరు పంచాయతీల్లో ఈ పరిస్థితి ఉంది.

గోడు చెప్పినా వినలేదు

బోగోలులో 4, విశ్వనాథరావుపేటలో మూడు లేఅవుట్లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 750 మందికి పైగా స్థలాలు పంపిణీ చేసింది. విశ్వనాథరావుపేటలో వేసిన లేఅవుట్లకు గ్రామానికి అనుసంధానమైన దారులు లేవు. ఒకవైపు వాగులు, మరో వైపు కడనూతల చెరువు, ఇంకో వైపు రైల్వే స్థలాలు, ఓ లేఅవుట్ మధ్యలో సమాధులు ఉన్నాయని అక్కడకు మేము వెళ్లలేమని లబ్ధిదారులు గోడు చెప్పుకొన్నారు. అయినా వినలేదు. సకల సౌకర్యాలు కల్పిస్తామని అధికారులతో నమ్మబలికించి గుత్తేదారులు బిల్లులు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. చివరకు లబ్ధిదారులే అవస్థలు పడాల్సి వస్తోంది.

బోగోలు అయితే

బేతనీపేట లేఅవుట్ పల్లంలో ఉంది. ఎత్తు పెంచడం, రోడ్లు వేయడంలో నామమాత్రంగా వ్యవహరించడంతో ఇళ్ల పునాదుల చుట్టూ వర్షపునీరు చేరుతోంది. డ్రైనేజీ సౌకర్యం కూడా లేదు. బీఎంఆర్ వాటర్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు లేవు. ఇక్కడ నివసించేందుకు లబ్ధిదారులు ముందుకు వచ్చినా రోడ్లు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించడంలో వెనుకబాటుతనం కనిపిస్తుంది. తహసీల్దారు కార్యాలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో ఇళ్లు కట్టుకోవాలంటే నీటి సౌకర్యం లేదు. రోడ్డు దారుణంగా ఉంది. ఒక్క నీటి సరఫరాకే ట్యాంకర్లకు 10 నుంచి 12వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని భయపడి నిర్మించుకునేందుకు ఎవరూ సాహసించడం లేదు. కప్పరాళ్లతిప్ప లేఅవుట్‌లో కూడా మౌలిక సదుపాయాలు లేవు. ఈ విషయమై ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి లబ్ధిదార్లకు మేలు జరిగేలా కృషిచేస్తామన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగంతో ఆర్థికాభివృద్ధి

ఉదయగిరి, న్యూస్‌టుడే: విదేశీ వస్తువులపై ఆధారపడకుండా స్వదేశీ వస్తువులను వినియోగిస్తే గ్రామాలు ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తాయని మండల భాజపా నాయకులు అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యశాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కుర్రపల్లి, శకునాలపల్లి, పుల్లాయపల్లి, లింగమనేనిపల్లి, తదితర గ్రామాల్లో స్వదేశీ వస్తువులు వినియోగించాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ప్రసాద్, మాధవరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

అన్నదానం.. నిర్విరామం

20 ఏళ్లుగా దీక్షాపరులకు భిక్ష

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏళ్ల క్రితం ఆ భక్త మిత్ర బృందంలో వచ్చిన ఆలోచన నేటికీ నిర్విరామంగా కొనసాగుతూ వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించే అక్షయపాత్రగా నిలుస్తోంది శ్రీ అయ్యప్ప సేవా సంఘం. ఏటా కార్తికమాసం ప్రారంభం రోజు నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు దాదాపు రెండు నెలలు పాటు ఎందరో దీక్షాపరులకు, ఆపన్నులకు దాతల సహాయంతో ఆకలి తీర్చుతోంది.

అయ్యప్ప ఆలయ ఆవరణలో భిక్ష చేస్తున్న మాలధారులు

నిత్యం 600 మందికి

పట్టణానికి చెందిన కె.ఎస్. వెంకటేశ్వర్లు, కాటాచెంచురామయ్య, మాదాలవెంకటేశ్వర్లు, ఇస్కాలవెంకటనరసింహం, నలబోతులమురళి, దాసరిశ్రీను, ఉన్నంవీరాస్వాములు వివిధ వృత్తుల్లో ఉంటూ ఏటా దీక్షా కాలంలో ఒక చోటకు చేరేవారు. తోటి మాలధారులు మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లి భిక్ష చేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. దీంతో 2006లో అయ్యప్ప సేవాసంఘంగా ఏర్పడి పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్ప ఆలయంలో రేకుల షెడ్డు ఏర్పాటుచేసి రోజూ మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేశారు. మొదట్లో 50 మందికి అన్న వితరణ చేయగా ప్రస్తుతం ఆ సంఖ్య 600కు పైగా ఉంది.

దాతల సహకారంతోనే — ఉన్నం వీరాస్వామి, దాసరి శ్రీనివాసులు

అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమైన మొదట్లో ఇంత విజయవంతం అవుతుందని అనుకోలేదు. ప్రారంభంలో సహకరించిన దాతల సహకారం మరువలేనిది. నేడు ఇంతమంది మాలధారులకు భిక్ష పెట్టడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. కార్తిక మాసంలోనే కాకుండా ప్రతి బుధవారం వృద్ధులు, దివ్యాంగులు, పేదలకు ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్నాం.

దశాబ్దాల కల... నెరవేరేదెన్నడో..?

అధ్వానంగా మారిన రహదారి

దుత్తలూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఆ గ్రామ రహదారి దుస్థితి మాత్రం మారటంలేదు. గ్రామం పుట్టినప్పటి నుంచి రహదారి అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలోని నర్రవాడ- బండకిందపల్లి గ్రామాల రోడ్డు దుస్థితి ఇది. ఈ మార్గంలో చిన్నపాటి వర్షం కురిసినా నడవలేని పరిస్థితి. ఈవిషయమై పంచాయతీరాజ్ ఏఈ హజరత్‌ను వివరణ కోరగా గతంలోనే ఈ రహదారికి సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

మృతికి సంతాపం

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని చవటపుత్తేడు సర్పంచి పులి శీనయ్య తండ్రి యర్రయ్య మృతిచెందడంతో పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, పెన్నార్ డెల్టా ఆయకట్టు సంఘం ఉపాధ్యక్షుడు గిరిధర్ చవటపుత్తేడు వెళ్లి శీనయ్యను పరామర్శించి సానుభూతి తెలిపారు. మండల తెదేపా నాయకులు శ్రీహరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిదినాల పెంపు తగదు

కావలి, న్యూస్‌టుడే: కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు పదిగంటల పనిదినాలు తీసుకురావాలనే ప్రయత్నాలు సమర్థంగా తిప్పికొడతామని అఖిలభారత పోస్టల్ గ్రూప్-సీ ఉద్యోగుల సంఘ నాయకులు అన్నారు. ఆదివారం కావలిలో ఆ సంఘం జిల్లా ద్వైవార్షిక సమావేశాన్ని నిర్వహించారు. పని దినాల పెంపు తగదన్నారు. నాయకులు అనిల్, బీ శ్రీధర్‌బాబు, శ్రీనివాసమూర్తి, సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు ప్రమాదాలు చూడు

న్యూస్‌టుడే, దుత్తలూరు

జాతీయరహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించి లోడుతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో జాతీయరహదారులు విస్తరించడంతో వాహనాలు పరుగులు పెడుతున్నాయి. దీంతో నిత్యం ఎక్కడో ఒక చోట రహదారులు రక్తసిక్తమవుతున్నాయి.

జిల్లాలో దుత్తలూరు- వరికుంటపాడు- మర్రిపాడు మీదుగా వెళ్లే 565వ నంబరు, కావలి నుంచి సీతారామపురం వెళ్లే జాతీయ రహదారిని ఇటీవల నిర్మించారు. ఈ రహదారి 110 కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉంది. అలాగే నెల్లూరు నుంచి కడప జిల్లా వరకు 102 కిలోమీటర్ల మేర మరో జాతీయ రహదారి ఉంది. వీటిపై అధిక లోడు, మితిమీరిన వేగంతో దూసుకొచ్చే వాటితో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారులపై నిత్యం అధిక లోడుతో కలప, కంకర, ఇసుక లారీలు అధికలోడుతో నియంత్రణ లేకుండా దూసుకుపోతున్నా అధికారుల చర్యలు కరవయ్యాయి.

నిబంధనలు ఏంచెబుతున్నాయంటే...

❖ 10 టైర్ల లారీ లోడుతో కలిపి 28 టన్నులు మించి ఉండకూడదు. వీటిలో 35 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. ❖ 12 టైర్ల లారీ లోడుతో కలిపి 35 టన్నులు మించకూడదు. భారీ స్థాయిలో అధికలోడుతో కలప, కంకర, బండరాళ్లతో 40-45 టన్నులతో వెళుతున్నాయి. దీంతో ప్రమాదాలతోపాటు రహదారులు ఛిద్రమవుతున్నాయి. ❖ తనిఖీల్లో పరిమితికి మించి లోడు గుర్తిస్తే టన్నుకు రూ.2 వేలతోపాటు అదనంగా రూ. 20 వేలు అపరాధ రుసుం కట్టాలి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. ❖ రాత్రి వేళల్లో గస్తీ కాసే వివిధ శాఖల అధికారులు సైతం మామూళ్లు పుచ్చుకుని వదిలివేస్తున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాలతో ప్రమాదాలు జరగకముందే తగిన చర్యలు తీసుకుంటే చాలా వరకు ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

దుత్తలూరు కూడలిలో అధికలోడుతో వెళుతున్న కలప లారీ

నిఘా పెంచుతాం — సుధాకర్‌రావు, ఎంవీఐ, కావలి

అధికలోడుతో వెళ్లే వాహనాలపై నిఘా పెడతాం. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని దాడులు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాటిని గుర్తించి జరిమానా విధిస్తాం.

ఇవిగో ఉదాహరణలు

గత ఫిబ్రవరి 6న దుత్తలూరు మీదుగా అధిక లోడుతో వెళుతున్న తెల్లరాయి లారీని స్థానిక పోలీసులు పట్టుకొని గనుల శాఖ అధికారులకు అప్పగించగా రూ.20 వేలు జరిమానా విధించారు. ❖ వరికుంటపాడు వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గత ఆగస్టు 14న అధిక లోడుతో వెళుతున్న సిమెంటు లారీ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి.❖ దుత్తలూరు మండలంలో పిల్లాపేరు వాగు వద్ద గత ఏడాది సెప్టెంబరు 18న పరిమితికి మించిన లోడుతో వేగంగా వెళుతున్న టమాటాల లారీ పడిపోగా డ్రైవర్ మృతి చెందారు.

భూసార పరీక్షల్లో జింక్ లోపమే అధికం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: డివిజన్‌లో భూసార పరీక్షలకు సేకరించిన 3249 నమూనాల్లో సగానికి పైగా జింక్‌లోపం కనిపించిందని ఏడీఏ శేషారెడ్డి తెలిపారు. ఐదు మండలాల్లో ఖరీఫ్‌లో సేకరించిన మట్టిపరీక్షల్లో 1638 నమూనాల్లో కేవలం జింకుమాత్రమే లోపం కనిపించింది. ఇందులో కందుకూరు 378, వలేటివారిపాలెం 456, గుడ్లూరు 237, లింగసముద్రం 333, ఉలవపాడు 234 మంది రైతుల భూముల్లో జింకు దాతువు తక్కువగా ఉందని నివేదికలు అందాయని తెలిపారు. భూసారపరీక్షల కార్డులు రాగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. కందుకూరులో 25, గుడ్లూరులో 18, ఉలవపాడులో 24, లింగసముద్రం 20, వలేటివారిపాలెం 29 మంది రైతులకు పూర్తి రాయితీపై హెక్టారుకు 50కిలోల జింకు సరఫరా చేసి అధికారులు డెమోలు నిర్వహిస్తారని తెలిపారు. సోమవారం నుంచి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో వివిధశాఖల సిబ్బంది బృందంగా ఏర్పడి రైతుల ఇంటికి వెళ్లి వారికి సూచనలు, వివరాలు సేకరించేలా ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు.

గుంత.. చింత



కావలి పట్టణం బృందావనకాలనీ ముంగిట ఎంపీ ట్రంకురోడ్డుకు పక్కనే గుంతతో పొంచి ఉంది. దారిన పోయేవారిని అప్రమత్తం చేసేలా స్థానికులు అక్కడ ఓ కర్ర పాతారు. గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. ర.భ శాఖ ఏఈ గుండాల భరత్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. **కావలి, న్యూస్‌టుడే**

గృహాలు నిర్మించినా బిల్లులు మంజూరు కాలేదా..!

ఈనాడు మీతోడు

బుచ్చిరెడ్డిపాళెం పురపాలక పరిధితోపాటు రేబాల, దామరమడుగు, మినగల్లు, పంచేడు, సాల్మానాంబాపురం, జొన్నవాడ, పెనుబల్లి, కళాయకాగొల్లు, రెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు నూతన గృహాలు మంజూరు చేయడం లేదా..? నిర్మించిన వాటికి బిల్లులు మంజూరు కావడం లేదా..? గుత్తేదారులు సగం ఇళ్లు కట్టి వదిలేశారా..? కాలనీల్లో వసతులు సమకూర్చలేదా..? ఈ సమస్యలను నేరుగా గృహ నిర్మాణశాఖ ఏఈ కేసీ పెంచలయ్య దృష్టికి తీసుకురావచ్చు. ఇందు కోసం 'ఈనాడు- మీతోడు' ఆధ్వర్యంలో డయల్‌యువర్ ఏఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులకు దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు.

తేదీ : 25-11-2025 (మంగళవారం)
సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య

ఫోన్ నంబర్ 70939 30978

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ప్రభుత్వ ఆసుపత్రికి నేత్రదానం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: వెంకటాచలం మండలానికి చెందిన మోహన్ అనారోగ్యంతో నెల్లూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. కార్నియా రికవరీ స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలు సేకరించి, కుటుంబ సభ్యులకు నేత్ర దాన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : తోటపల్లిగూడూరు మండలం వరకవిపూడి నుంచి అనంతపురం గ్రామానికి వెళ్లే రోడ్డు గతుకులమయంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. – శివశంకర్
సమాధానం : రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.– రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు వద్ద చెరువుకట్ట రోడ్డు దిగే సమయంలో మలుపు ఉంది. కాలువకు ఇరువైపులా ఎలాంటి హద్దులు లేవు. అదుపుతప్పి వాహనదారులు పడిపోతున్నారు. కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – వెంకటేశ్వర్లు
✓ కాలువ వద్ద సరిహద్దు గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.–అలీ, ఇరిగేషన్ ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్తు దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. నాణ్యమైన విద్యుత్తు వృథా అవుతుంది. –మహేశ్, స్థానికుడు
✓ సమస్య పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

? ఇందుకూరుపేట మండల పరిధిలోని కొత్తూరు వద్ద పంట కాలువ రక్షణ గోడలు దెబ్బతినడంతో నీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. – రమణయ్య, స్థానికుడు
✓ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.– విజయభాస్కర్, ఇరిగేషన్ డీఈఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని లింగంపల్లి తోపులో బోరు మరమ్మతులకు గురైంది. ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. – హరి
✓ సమస్య పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

? సైదాపురం గిరిజన కాలనీలో అంతర్గత రోడ్లపై భారీగా పిచ్చిమొక్కలు పెరిగాయి. విషపురుగులతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. – స్థానికులు
✓ పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు చేపడతాం. – ఇంద్రాణి, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు మండలం కనుపర్తి రోడ్డు నిర్మించే క్రమంలో తారును తొలగించి కొత్త రోడ్డు వేసేందుకు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు పనులు చేపట్టలేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – వెంకటేశ్వర్లు
✓ సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –శ్రీసుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ

? మనుబోలు బీసీ కాలనీలోని నివాసాల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. – వెంకటేశ్
✓ సమస్య పరిష్కరిస్తాం.–గరుడయ్య, ఈవో

? మర్రిపాడు మండలం నేలగంపపాడులో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారింది.– రమేష్
✓ సమస్య పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తాం. – కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

? సంగం మండలం జెండాదిబ్బ పంచాయతీ అనుబంధ గ్రామమైన అరవపాళెం వద్ద అన్నారెడ్డిపాళెం రహదారి పక్కనే అపరిశుభ్రత అధికంగా ఉంది. – శ్రీనివాసులు, స్థానికుడు
✓ శుభ్రం చేయిస్తాం. – షాలెట్, ఎంపీడీవో

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇనమడుగులో రూ.1.98 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీహెచ్‌సీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో అనారోగ్య బాధితులకు రూ.6 కోట్లు ఆర్థిక సాయం చేసినట్లు పేర్కొన్నారు. పేదల ఆరోగ్య భద్రతకు సీఎం చంద్రబాబు 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' అనే పథకం ద్వారా రూ.25 లక్షల వైద్య సేవలు అందించేలా కృషి చేస్తున్నారని వివరించారు. జిల్లా వైద్యాధికారిణి సుజాత, స్థానిక వైద్యాధికారులు, ఇతర శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి

మనుబోలు, న్యూస్‌టుడే: యువతకు, పేదలకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలను స్థాపించడం అభినందనీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మనుబోలులో ఏర్పాటుచేసిన జీడిపప్పు ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. అనంతరం శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ... పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టిందన్నారు. నాణ్యమైన చిక్కీలు సరఫరా చేయాలని సూచించారు. పరిశ్రమ ఎండీ మేడికొండ శ్రీహరినాయుడు, రామానాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రాజాగౌడ్, వెంకటరమణయ్య, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మరక్షణకు ఆలంబనగా..!

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు చదువుకునే క్రమంలో పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రుల్లోనూ వారి రక్షణకు సంబంధించి కొన్ని చోట్ల స్థానిక పరిస్థితుల ప్రభావంతో భయాందోళన నెలకొంటోంది. విద్యార్థి దశలోనే బాలికలు యుద్ధ విద్యలో సుశిక్షితులుగా ఎదిగితే భవిష్యత్తులో ఆత్మరక్షణకు ఆలంబనగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో ప్రవేశపెట్టిన 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్' కార్యక్రమం ఆగిపోయింది. సమాజంలో చిన్నారులు, విద్యార్థినులపై లైంగిక దాడుల నేపథ్యంలో వారు సమర్థంగా ఎదుర్కొనేలా కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలో నిపుణులతో శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ● ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన బాలికల ఆత్మరక్షణ కార్యక్రమం వినియోగించుకోవాలన్నారు. వారానికి రెండు రోజులు శిక్షణ ఇవ్వాలని సూచించామన్నారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.

రెండు నెలలపాటు ప్రత్యేక శిక్షణ..

సర్వేపల్లి నియోజకవర్గంలో 114 పాఠశాలలతో పాటు మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మూడు గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో 2 వేల మంది వరకు విద్యార్థినులున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బాలికలకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు ఏడాది కాలం పాటు నిర్వహించిన తరువాత కొవిడ్ సమయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం నిలిపేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాలికల భద్రతపై దృష్టి పెట్టి కరాటే శిక్షణ ప్రారంభించింది. ఈ ఏడాది ఆత్మరక్షణ విద్యను పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటోంది. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు రెండు నెలలపాటు జరుగుతుంది. ప్రస్తుతం కరాటేపై శిక్షణ ఇస్తున్నారు. ప్రతి పాఠశాలలో రెండు నెలల్లో 20 తరగతులు నిర్వహించి విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నారు. ఒక్కో తరగతికి 90 నిమిషాలు చొప్పున నిర్వహించేలా మార్షల్ ఆర్ట్స్ సంస్థలకు బాధ్యత అప్పగించారు.

ఉపన్యాసంలో విద్యార్థుల ప్రతిభ

ఆత్మకూరు, పొదలకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు, పొదలకూరు మండలాల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. పాఠశాలల్లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న వారితో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

● ఆత్మకూరు పురపాలక పరిధిలో ఏపీ బాలికల గురుకుల ఉన్నతపాఠశాలలో జరిగిన పోటీల్లో వర్షిణి సాయిశ్రీ(ప్రథమ), శ్రీజ(ద్వితీయ), చరిణి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ డాక్టర్ రూత్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రేవతి సుప్రజ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

విజేతలతో కరస్పాండెంట్, డైరెక్టర్, ఉపాధ్యాయులు

● ఆత్మకూరులోని వెంకట్రావుపల్లి ప్రగతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో అర్శిక(ప్రథమ), రేవతిలక్ష్మి (ద్వితీయ), రేణు వైదిక(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు అందజేశారు.

● పొదలకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో నందిని(ప్రథమ), జయశ్రీ(ద్వితీయ), లీల(తృతీయ) స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని జ్యోతి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయిని విమల, విద్యార్థులు పాల్గొన్నారు.
విజేతలతో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయినులు

పొదలకూరు తాలూకా ఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పొదలకూరు, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం పొదలకూరు తాలూకా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నీటిపారుదలశాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా 11 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒకరు చొప్పున 11 మంది నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవం అయినట్లు రాపూరు తాలూకా అధ్యక్షులు ఎన్నికల అధికారి మల్లికార్జున్ ప్రకటించారు. పొదలకూరు తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా వాసుదేవరావు, ఉపాధ్యక్షులు షాన్‌వాజ్, రాజమోహన్, వెంగయ్య, కార్యదర్శి చిరంజీవులు, సంయుక్త కార్యదర్శులుగా రవీంద్రబాబు, వినోద్‌కుమార్, మాధవరావు, మహిళా కార్యదర్శిగా రాధాకుమారి, కోశాధికారిగా కామాక్షి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికల నిర్వాహకులుగా మధు, పరిశీలకులుగా విజయకుమార్ తదితరులు వ్యవహరించారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం

ఆత్మకూరులో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, సంగం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా, ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పురపాలక పరిధిలోని అభయాంజనేయ స్వామి ఆలయానికి వంశ పారంపర్య అధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఆలయ పాలకమండలి సభ్యులను నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, సోమశిల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు కేశవచౌదరి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జనార్దన్ నాయుడు, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ● సంగం మండలం సిద్ధిపురంలో రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నివేశన స్థలాలను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని మంత్రి ఆనం అధికారులకు సూచించారు. గాంధీజనసంఘం పర్యటనలో భాగంగా ఆయన సందర్భంగా కాలనీ వాసులు సమస్యలు విన్నవించారు. వెంటనే తహసీల్దారు సోమ్లానాయక్‌తో మాట్లాడారు. సమస్య పరిష్కరించాలని కోరారు. వెంగారెడ్డిపాళెం సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలోకి వెళ్లొద్దు

పొదలకూరు, న్యూస్‌టుడే: రానున్న రెండు, మూడురోజుల్లో భారీ వర్షాల కారణంగా పెన్నా పరీవాహక ప్రజలు నది సమీపంలోకి వెళ్లొద్దని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. సోమశిల ఆనకట్ట నుంచి 27,300 క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్న దృష్ట్యా, భారీ వర్షాలు పడే అవకాశమున్నందున ఎస్పీ ఆదేశాలు జారీ చేశారన్నారు. సూరాయపాళెం, విరువూరు, మహ్మదాపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సచివాలయానికి వెళ్లాలంటే యాతన

పొదలకూరు మూడో సచివాలయంలోకి వెళ్లాలంటే కార్యాలయం ఎదుట ఉన్న మడుగు దాటాల్సిందేనని వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించినా నీరు వెళ్లేందుకు సైడు కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో సమస్యలు తలెత్తున్నాయి. సచివాలయం ఎదుట నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొదలకూరు**

చెత్త తొలగించరూ

కోవూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డు నుంచి ఇనమడుగు కూడలికి వెళ్లే మార్గంలోని జంగం వీధిలో రోడ్డుపై చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సీజన్‌లో దోమలు ప్రబలి వ్యాధులు వచ్చే ప్రమాదముందని, కనీసం రెండు రోజులకు ఒకసారైనా శుభ్రం చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు. **– న్యూస్‌టుడే, కోవూరు**

ఇలాగైతే వ్యాధులు రావా..!

పొదలకూరు పెద్ద చెరువుకు వాగుల నుంచి నీరు సక్రమంగా చేరక కాలువల ఆక్రమణలతో ఎక్కడికక్కడ నీరు నిలిచింది. దోమల ఉద్ధృతి పెరిగి శ్రీనివాసనగర్, టైలర్స్‌కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలోకి నీరు సక్రమంగా వెళ్లక దుర్గంధం వెదజల్లుతూ విషజ్వరాలు, మలేరియా వంటి జ్వరాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**– న్యూస్‌టుడే, పొదలకూరు**

చినుకు పడితే.. ప్రయాణానికి వణుకు

సోమశిల-ఆత్మకూరు రహదారిలో కమ్మువారిపల్లి వద్ద చప్టాతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సిమెంటు దెబ్బతిని గుంతలు పడడంతో.. వర్షాల సమయంలో రాకపోకలకు కష్టంగా మారింది. శుక్రవారం కురిసిన వర్షానికి ప్రస్తుతం సమస్యగా ఉంది. అధికారులు వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య ఉన్నతాధికారులకు తెలుపుతామని అన్నారు. **– న్యూస్‌టుడే, అనంతసాగరం**

దుర్గంధమయం

కోవూరు పట్టణంలోని సచివాలయం వద్ద ఉన్న తాగు నీటి ట్యాంకు సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కొద్ది రోజుల నుంచి తొలగించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఈ దుస్థితి ఉన్నా పంచాయతీ, సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని, మండల అధికారులు పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.**– న్యూస్‌టుడే, కోవూరు**

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మనుబోలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ శివరామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరిపై నిఘా పెట్టామని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై రాకేశ్, సిబ్బంది ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి

కొడవలూరు, న్యూస్‌టుడే: రైలు కిందపడి యువకుడు మృతిచెందిన ఘటన కొడవలూరు రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. కొడవలూరు రైల్వేస్టేషన్ దిగువ లైన్‌లో యువకుడు(25) రైలుకింద పడి శనివారం రాత్రి మృతిచెందారు. కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై వెంకట్రావు పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని కుడితిపాలెం పెన్నానదిలో పడవలపై వెళ్లి జూద స్థావరంపై దాడి చేసి 12 మందిని అరెస్టు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోవూరు, ముత్తుకూరు పోలీసులు బృందంగా ఏర్పడి పక్కా సమాచారంతో శనివారం రాత్రి దాడులు నిర్వహించి వారిని అదుపులో తీసుకున్నారు. రూ. 3.22 లక్షల నగదు, మూడు కార్లు, ఆరు ద్విచక్రవాహనాలు, 14 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.

చెకుముకి పోటీల్లో బహుమతులు సొంతం

సంగం: బహుమతులతో విద్యార్థులు

సంగం,చేజర్ల, న్యూస్‌టుడే: గాంధీజనసంఘంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన భానుప్రకాశ్, సంతోష్, మహాలక్ష్మి జనవిజ్ఞాన వేదిక ఆదివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో జిల్లాస్థాయిలో తృతీయ స్థానంలో నిలవగా వారికి పురస్కారాలు, బహుమతులందించారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ● చేజర్ల లుంబినీ విద్యాలయానికి చెందిన హిమతేజ, వందన, అజహర్‌అలీలు మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. జేవీవీ ప్రతినిధులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మత్స్యకారులకు అవగాహన

విడవలూరు: పొన్నపూడి పెద్దపాలెం కొత్తూరులో ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సంస్థ రవీంద్ర చౌదరి సహకారంతో ప్రజాసేవా ఫౌండేషన్ నిర్వాహకుడు కొండూరు బాబు ఆధ్వర్యంలో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది.

విద్యార్థుల శ్రమదానం

పోతిరెడ్డిపాళెంలో పాల్గొన్న విద్యార్థులు

కోవూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: కోవూరులోని వైకేఆర్ అండ్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పోతిరెడ్డిపాలెంలో ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులు గ్రామంలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. వారం రోజుల పాటు జరిగే క్యాంపులో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రామాంజనేయులు తెలిపారు. ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన, అధ్యాపకులు పాల్గొన్నారు. ఇందుకూరుపేటలోని పున్నూరు ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో చివరి రోజు ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాజేశ్ పాల్గొన్నారు. ఆరోగ్య అవగాహన, పశువైద్యం, చెట్ల పెంపకం, స్వయం సహకార సంఘాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ మధుసూదన్ రావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ

జొన్నవాడ: పడిపూజలో పాల్గొన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, సంగం, న్యూస్‌టుడే: జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయం వద్ద అయ్యప్పల పడిపూజ అత్యంత భక్తిశ్రద్ధలతో కనుల పండువగా జరిగింది. ఆదివారం రాత్రి గురుస్వాములు, స్థానిక అయ్యప్పమాలధారణ స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ● సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో పలు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రభాతవేళలో ఆలయ ప్రాంగణంలో మాలధారులు హోమం చేశారు. సాయంత్రం స్వామి అయ్యప్ప ఉత్సవమూర్తితో గ్రామోత్సవం చేయగా గ్రామస్థులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పవిత్ర జలాలు తీసుకొస్తున్న మహిళలు

సంగం, న్యూస్‌టుడే: సిద్ధీపురం పంచాయతీ అనుబంధ గ్రామమైన అనసూయనగర్‌లో పోలేరమ్మ విగ్రహప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రభాతవేళలో గ్రామస్థులు పెన్నానదికి వెళ్లారు. అక్కడ గంగ పూజ చేసి పవిత్రజలాలను తీసుకుని, పోలేరమ్మ తల్లికి జేజేలు పలుకుతూ ఆలయం వద్దకు వచ్చారు. అక్కడ అమ్మవారి విగ్రహానికి జలాధివాసం నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి ప్రసాదాలు స్వీకరించారు.

వరద ప్రభావంతో డెల్టాకు నీటి విడుదల పెంపు

క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వెళుతున్న నీరు

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సోమశిల జలాశయానికి వరద పెరుగుతోంది. ప్రాజెక్టు అధికారులు ఆదివారం జలాశయం నుంచి 5, 6, 7 క్రస్ట్‌గేట్ల నుంచి 27,300 క్యూసెక్కుల నీటిని డెల్టాకు అదనంగా విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి మరింత పెరిగే అవకాశమున్నందున ప్రాజెక్టు సిబ్బంది డ్యాంపై అప్రమత్తంగా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ డెల్టాకు నీటి విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 23,842 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 74.863 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.711 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. 5, 6, 7 క్రస్టు గేట్ల ద్వారా 27,300, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 275 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

సత్యసాయి శత జయంతి వేడుక

సంగం, న్యూస్‌టుడే: పుట్టపర్తి సాయిబాబా శత జయంతి వేడుక ఆదివారం సంగంలో జరిగింది. తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద రెవెన్యూ సిబ్బంది పూల మాల సమర్పించి ప్రార్థనలు చేశారు. సత్యసాయి ట్రస్టు ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

శిథిలావస్థలో వంతెన.. వాహనదారులకు భద్రమేనా..?

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

రాపూరు-నెల్లూరు మార్గంలోని డేగపూడి వద్ద కండలేరు కాలువపై సుమారు యాభై సంవత్సరాల క్రితం బ్రిటీషు కాలం నాటి వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు సైతం దెబ్బతిని ప్రమాదం పొంచి ఉంది. ఇరుకు వంతెన కావడంతో ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. వంతెన కింది భాగంలో ఉన్న పిల్లర్లలో పగుళ్లు ఏర్పడి బలహీనమవుతుంది. వంతెనపై క్వార్ట్జ్, గ్రావెల్, ఇసుక, జామాయిల్ వంటి అధిక లోడుతో టిప్పర్లు, లారీలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి.

ప్రయాణిస్తున్న బస్సు

అక్కడ కూలినా మేల్కొనరా...

డేగపూడి-రాజుపాలెం వద్ద ఈనెల 18న కల్వర్టు కూలడంతో రాపూరు-నెల్లూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికంగా పునరుద్ధరించారు. ఈ మార్గంలో ఉన్న కీల వంతెన ప్రమాదకరంగా ఉంది. దీని కింద యాభై అడుగుల లోతులో కండలేరు జలాశయం నుంచి నీరు ప్రవహిస్తోంది. కూలితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వంతెన పరిస్థితిని పరిశీలించి మరో వంతెన నిర్మాణానికి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఏకైక మార్గం...కూలితే అనర్థం

నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా రాపూరు, వెంకటగిరి, తిరుపతి, గూడూరు, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలకు వెళ్లేందుకు అందుబాటులో ఉన్న ఏకైక మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ప్రమాదవశాత్తు వంతెన కూలితే గ్రామాలు, మండలాలతో పాటు పక్క జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ గ్రామ సభలు

విడవలూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ కూలీల సమస్యలు జరిగే పనులు గురించి గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ● ఎంపీడీవో కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనుల గురించి ఆడిట్ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది.

అంకితభావంతో పనిచేయండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన చేయాలని ఎస్‌ఎస్‌ఏ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుచ్చిలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్లస్టర్ సమావేశాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

వైభవంగా రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లాలో దేవాలయాలకు మంచి రోజులు వచ్చాయని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశంసించారు. ఆదివారం నగరంలోని రంగనాయకులపేటలో వెంకటమ్మ పేరంటాలు ఆలయంలో రూ.1.15 కోట్లతో రాజగోపుర నిర్మాణానికి పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 58 ఆలయాలను రూ.118.45 కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నగరపాలకసంస్థ ఉపమేయర్ రూప్‌కుమార్, దేవాదాయ శాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సిగ్నళ్లతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం: మంత్రి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: సిగ్నళ్లతో నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వాహనాధ్రపురం, రామలింగాపురం, వీఆర్సీ కూడలి, కనకమహల్ సెంటర్లలో రూ.1.39 కోట్లతో ఏర్పాటుచేసిన సిగ్నళ్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎస్పీ అజితతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏడు చోట్ల సిగ్నళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎల్ఈడీలు, బీటీఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆక్రమ కట్టడాల తొలగింపునకు ఆక్రమణదారులు సహకరించాలన్నారు. ఆక్రమణదారుల్లో పేదలు ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ని సీఎం తీసుకొచ్చారన్నారు. నవాబుపేటలో నెల్లూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. మార్కెట్ యార్డ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



సిగ్నళ్లను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎస్పీ అజిత

వేమిరెడ్డి దంపతులతో మంత్రి భేటీ

నెల్లూరు (మార్కెట్ సెంటర్): వేమిరెడ్డి దంపతులతో మాగుంట లేఅవుట్‌లోని వారినివాసంలో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

చదరంగం విజేతకు సత్కారం

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: చదరంగం పోటీల్లో ప్రతిభ చూపిన నగరానికి చెందిన డింపుల్ శ్రేయను భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్ తదితరులు ఆదివారం సత్కరించారు. ఆమె ఇటీవల పార్వతీపురంలో జరిగిన బాలికల అండర్-19 చదరంగం పోటీల్లో విజేతగా నిలవగా.. అభినందన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాజపా, ఆర్.ఎస్.ఎస్.నాయకులు టి.కొండయ్య, ఎన్.కిషోర్, పి.మురళి, నారాయణ, ప్రవీణ్‌కుమార్, సురేష్, మహేంద్ర పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రానున్న నాలుగైదు రోజులు పెన్నా పరీవాహక ప్రాంతం, తీర ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఆయా పోలీసుస్టేషన్ల అధికారులకు ఎస్పీ అజిత వేజెండ్ల సూచించారు. సోమశిల రిజర్వాయరు నుంచి నీటిని దిగువకు విడుదల చేయనుండడంతో ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. నదిలోకి ఎవరూ వెళ్లకుండా చూడాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 112, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సెల్లు కబుర్లు.. ప్రాణాలకు ఎసరు

- వెంకటేశ్వరపురానికి చెందిన షాహిద్ ద్విచక్ర వాహనంపై నగరానికి పెన్నా బ్రిడ్జి మీదుగా వస్తున్నాడు. ఇంతలో ఫోను రావడంతో ఒక చేత్తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నాడు. బ్రిడ్జిపై గుంత ఉండడంతో చూడక పడిపోయాడు. ఆ సమయంలో వెనుకగా వాహనాలు రాకపోవడంతో అతనికి ప్రమాదం తప్పింది.
- శ్రీనివాసులు బైక్‌పై వెళుతూ తలకు శిరస్త్రాణం ధరించాడు. ఫోను రావడంతో హెల్మెట్‌లోనే ఫోను పెట్టి మాట్లాడుతున్నాడు. గాంధీ బొమ్మ వద్ద ఎదురుగా వస్తున్న బైకును గమనించక ఢీకొని గాయాలపాలయ్యాడు.

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ఒక చేత్తో హ్యాండిల్.. మరో చేతిలో ఫోనులో సంభాషణ రావడం యువతకు ఫ్యాషన్‌గా మారింది. ప్రమాదమని తెలిసినా ఇలాగే చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరెందరో గాయపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నా.. స్పందన రావడం లేదు. ద్విచక్ర వాహనం.. ఆటో.. ట్రాక్టరు, బస్సు, లారీ ఏ వాహనమైనా సరే ఫోనులో మాటలు ఉండాల్సిందే.

మాట్లాడుతూ వెళుతున్న యువకులు

కేసుల వివరాలు

నెల	కేసులు
సెప్టెంబరు	2,050
అక్టోబరు	2,400
నవంబరు	2,800 (ఇప్పటి వరకు)

సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు

సెప్టెంబరు	615
అక్టోబరు	720
నవంబరు	840

ఇవీ అనర్థాలు

ఫోన్లో మాట్లాడుతుంటే ఏకాగ్రత కోల్పోతారు. వాహనాలను నియంత్రించలేరు. ఎదురుగా.. వెనుకగా వస్తున్న వాటిని గమనించలేరు. గుంతలు చూడక పోవడంతో ప్రమాదాలకు గురవుతారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులే అధికం: రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించిన ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధిస్తున్నారు. మూడు నెలల నుంచి ప్రధాన కూడళ్లు, బస్టాండ్, నగర ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధారణ, డ్రంకెన్ డ్రైవింగ్, లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితరాలపై జరిమానా విధిస్తున్నారు. ఎక్కువగా హెల్మెట్ లేకుండా, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదవుతున్నాయి.

పోరాట రథసారథులు కమ్యూనిస్టులే: సీపీఎం

మాట్లాడుతున్న మోహన్‌రావు

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజల పోరాటాలకు అండగా ఉంటుంది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులోని సీపీఎం కార్యాలయంలో రష్యాలో అక్టోబరు విప్లవం, సోషలిజం విశిష్టత అనే అంశంపై ఆదివారం సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం అన్ని విధాలుగా నష్టపోతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కమిటీ సభ్యులు జానా లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం.. రాకపోకలకు అంతరాయం

నెల్లూరు నగరం చంద్రబాబు నగర్ ప్రాంతంలోని మధ్య లానగర్‌లో రోడ్డు మధ్యలో స్తంభం ఉంది. అసలే అధ్వానంగా ఉన్న రోడ్డుకు తోడు స్తంభం మధ్యలో ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతం ముంపునకు గురవుతుండటంతో స్తంభం చుట్టూ నీరు చేరి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

రెండునెలలుగా నిర్లక్ష్యమే!

నగరంలో పలు వీధుల్లో రోడ్లు తవ్వి తిరిగి పూడ్చడం మరిచిపోతున్నారు. జడ్జీకాలనీ 9వ వీధిలో వాటర్ పైపులైన్ మరమ్మతుల కోసం రహదారి తవ్వారు. ఇప్పటికి రెండు మాసాలు గడుస్తున్నా తవ్విన చోట పూడ్చిపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతిసెంటర్)

రహదారిపై రాళ్ల తొలగింపు

స్పందనకు వందనం

ఆత్మకూరు బస్టాండ్ నుంచి బోసుబొమ్మ వరకు అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా సీసీ రోడ్డును తవ్వి రాళ్లు తీయడం మరిచారు. దాంతో రాకపోకలకు నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యపై శనివారం 'ఈనాడు' చిత్ర కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సిమెంట్ రాళ్లను తొలగించి రోడ్డును చదును చేశారు. –ఈనాడు, నెల్లూరు

రద్దీప్రాంతం.. రంధ్రంతో సతమతం

నగరంలోని సుజాతమ్మకాలనీలో ఇటీవల తాగునీటి పైపులైను లీకవుతుండటంతో మరమ్మతులు చేపట్టారు. తవ్విన మట్టితోనే పూడ్చేశారు. వర్షాలకు మట్టి కుంగిపోయి రంధ్రం ఏర్పడింది. వాహనాలు ఇరుక్కుపోయే అవకాశం ఉంది. జీఎన్‌టీరోడ్డులో నుంచి పొదలకూరు రోడ్డులోకి వచ్చే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

అజాగ్రత్తగా వెళితే ప్రమాదమే

డ్రైవర్ అజాగ్రత్త కారణంగా భవన నిర్మాణం కోసం తీసుకెళ్తున్న ఇనుప చువ్వలు బైపాస్ రోడ్డుపై పడిపోయాయి. ట్రాక్టర్‌పై తరలిస్తున్న వీటిని బంధించి తీసుకెళ్లక పోవడంతో స్పీడ్‌బ్రేకర్ల వద్ద జారి కింద పడి.. వెనుకనే వస్తున్న వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అక్కడివారు వాహనదారుడిని హెచ్చరించడంతో కింద పడిన వాటిని అందులో వేసుకొని వెళ్లారు. – ఈనాడు నెల్లూరు

వేడుకగా అయ్యప్ప పూజలు

పూజలకు వెళుతున్న అర్చకులు, భక్తులు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని వేదాయపాలెం అయ్యప్ప దేవాలయంలో కేరళ సంప్రదాయం ప్రకారం మండల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అర్చకులు పడికర్పూర దీపం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. శివేలి ఉత్సవం, భగవతి పూజ చేశారు. స్వామి విగ్రహ రూపాన్ని ఊరేగించారు.

ఇక్కట్లపై స్వాముల నిరసన

నెల్లూరు(జడ్పీ): శబరిమలలో రాష్ట్రానికి చెందిన భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అయ్యప్ప స్వామి భక్తులు కోరారు. ఈమేరకు అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అక్కడి ప్రభుత్వ తీరుతో ఇక్కడి నుంచి వెళ్లిన వారు నానాఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(జడ్పీ, నేరవిభాగం): సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. చిత్రపటానికి ఎస్పీ అజిత వేజెండ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయంలో సీఈవో శ్రీధర్‌రెడ్డి ఆధర్యంలో ఈ వేడుకలు చేపట్టారు. సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. పుర మందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీ మోహనరాజు తదితరులు పాల్గొన్నారు. గోమతి నగర్‌లోని సత్యసాయిబాబా మందిరంలో భక్త కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జడ్పీలో నివాళులర్పిస్తున్న సీఈవో శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది.. సత్యసాయి మందిరంలో భజనలు చేస్తున్న సాయి భక్తులు

బాడుగకని అడిగి.. కారు ఎత్తుకెళ్లారు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: బలవంతంగా కారు తీసుకెళ్లిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని మనుమసిద్ధినగర్‌లో గల డార్క్ యారో కారు షెడ్డులో షఫీఅహ్మద్ పనిచేస్తున్నారు. శనివారం కోటమిట్టకు చెందిన పెద్ద మసూద్, ఖైజర్, అబ్దుల్ హాఫీజ్, షారూక్ షెడ్డు దగ్గరకు వచ్చారు. కారు బాడుగకు కావాలని అడగ్గా.. అందుకు లేదని షఫీఅహ్మద్ చెప్పారు. దీంతో నలుగురు దురుసుగా ప్రవర్తించి షెడ్డులో ఉన్న కారును బలవంతంగా తీసుకెళ్లారు. ఈ విషయాన్ని యజమాని షోయబ్‌కు చెప్పి ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీలకు కౌన్సెలింగ్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసుస్టేషన్ల వారీగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ అజిత ఆదేశాల మేరకు స్టేషన్ హౌస్ అధికారులు తమ పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీ, కేడీ, డీసీ షీట్లు ఉన్న వారిని పిలిపించి సూచనలిచ్చారు. ప్రజాజీవనానికి భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వేణుగోపాల్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జిల్లా పీఎంపీ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన సాంస్కృతిక ఉత్సవాల్లో గజల్ శ్రీనివాస్ దీన్ని అందజేశారు. జిల్లాలో వైద్య, రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ పురస్కారం దక్కింది. జిల్లాకు చెందిన వసుజ్యోతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వసుంధర కూడా సత్కారం అందుకున్నారు.

పురస్కారం అందుకుంటున్న వేణుగోపాల్

ముత్తుకూరు రోడ్డులో అంధకారం

న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండే ముత్తుకూరు రోడ్డు వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈమార్గం నిత్యం ముత్తుకూరు, తోటపల్లి గూడూరు, మాదరాజుగూడూరు, కృష్ణపట్నం తదితర గ్రామాలకు వెళ్లే వారితో రద్దీగా ఉంటుంది. ఆకుతోట నుంచి ధనలక్ష్మీపురం వరకు వీధి దీపాలు వెలగడం లేదు. నెలల తరబడి వెలగకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రధాన రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి రోడ్డు మధ్యలో దీపాలు ఏర్పాటుచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ముత్తుకూరు రోడ్డులో వెలగని వీధి దీపాలు

నీటి పథకం.. నిర్వహణ లోపం

వాటర్ ట్యాంకుపై ధ్వంసమైన మూత

జిల్లా ప్రజలకు ఇంటింటికీ మంచినీటి సరఫరా చేయాలనే ఉద్దేశంతో మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అయితే కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది దృష్టి సారించడం లేదు. నెల్లూరు నగర నడిబొడ్డున గాంధీ సర్కిల్ స్వతంత్ర పార్కు పక్కన ఉన్న మంచినీటి ట్యాంకు నిర్వహణ లేక అధ్వానంగా మారింది. ట్యాంకుపై మందుబాబులు సీసాలు పగలగొట్టి వేయడంతోపాటు మూతను ధ్వంసం చేశారు. ట్యాంకులోకి కోతులు, పక్షులు వ్యర్థాలు పడేస్తున్నాయి. ట్యాంక్ నుంచి ప్రజలకు సరఫరా చేసే పైప్‌లైన్ కంట్రోల్ వాల్ చుట్టూ మురికి నీరు చేరి పురుగులు కనిపిస్తున్నాయి. అందులోనే చెత్తాచెదారం ఉంది. నీటిని తాగితే ప్రజలు రోగాల బారినపడి ఆస్పత్రిలో చేరాల్సిందే. ట్యాంక్ వద్ద క్లీనింగ్ వివరాలు లేవు.

– ఈనాడు, నెల్లూరు

మంచినీటి సరఫరా ట్యాంకు కంట్రోల్ వాల్ వద్ద మురుగునీరు

పక్కపక్కనే పనులతో ఆందోళన

దర్గామిట్ట రోడ్డు నుంచి అయ్యప్ప ఆలయం వరకు వరకు ఇటీవల ఓ ప్రైవేట్ కంపెనీ వారు భూగర్భంలో గ్యాస్ పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు గుర్తుగా ఎర్ర రాళ్లను ఏర్పాటు చేశారు. పలు చోట్ల ఆరోగ్యశాఖ అధికారులు ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌ను పైపులైన్‌కు సమీపాన ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ప్రభుత్వ ఆసుపత్రికి నేత్రదానం

నెల్లూరు(మార్కెట్ సెంటర్): వెంకటాచలం మండలానికి చెందిన మోహన్ అనారోగ్యంతో నెల్లూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. కార్నియా రికవరీ స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలు సేకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: నగరంలోని ఇరుగాళమ్మ సంఘంలో పందుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్ల మధ్య ఉన్న మురుగునీటిలో చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారవుతోంది. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. **– లలితమ్మ, స్థానికురాలు**

సమాధానం: సిబ్బందితో పందులను పట్టించేందుకు వెంటనే చర్యలు చేపడతాం.
– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? కపాడిపాలెంలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. ఇళ్లలో ఉండలేకున్నాం. **– సామ్రాజ్యం**

✓ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తాం.
– డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

26న దివ్యాంగులకు ఆటల పోటీలు

నెల్లూరు (క్రీడా విభాగం): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాలు, ఓపెన్ కేటగిరీలో అథ్లెటిక్స్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 88862 28444, 76600 34758, 94935 16317 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బధిర ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరులోని ఎన్జీవో భవనంలో ఆదివారం బధిర ఉద్యోగుల జిల్లా సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కిషోర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వినయ్‌కుమార్, ట్రెజరర్‌గా తిరుమలరావు, మహిళా కార్యదర్శిగా వైష్ణవి, సభ్యులుగా నర్మద, శివకుమార్, సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

తెరపై ఈనాడు

ఎం.1 సినిమాస్.: స్క్రీన్. 1 కొదమ సింహం (తెలుగు), శివ (తెలుగు) స్క్రీన్ .2 12ఏ రైల్వే కాలనీ (తెలుగు) స్క్రీన్..3. ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1.ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) స్క్రీన్ 2..కొదమసింహం (తెలుగు), ప్రేమంటే (తెలుగు), స్క్రీన్ 3. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), మస్తీ 4 (హిందీ) స్క్రీన్. 4.. శివ (తెలుగు, ఇంగ్లిష్) స్క్రీన్.5.. 12 ఏ రైల్వే కాలనీ (తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్. .1. ప్రేమంటే (తెలుగు), సిసు : రోడ్డు టు రివెంజ్ (ఇంగ్లిష్, తెలుగు) స్క్రీన్..2.. మఫ్టీ పోలీసు (తెలుగు) ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ప్రేమంటే (తెలుగు) స్క్రీన్..3.. 12ఏ రైల్వే కాలనీ (తెలుగు) స్క్రీన్..4..పాంచ్ మినార్ (తెలుగు), ది ఫేస్ ఆఫ్ ది ఫేసులెస్ (2025) (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు)

రోడ్డెక్కారో.. నడుము విరుగుద్ది! నగరంలో ఎక్కడ చూసినా గోతులు

దర్గామిట్ట ఎంజీ మాల్ ఎదురుగా ఛిద్రంగా మారిన రహదారి

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నగరంలో ఆర్అండ్‌బీ రహదారులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. అడుగడుగునా గతుకులతో భయపెడుతున్నాయి. బావుల్లాంటి గుంతలతో వాహనచోదకుల నడుములు విరుగుతున్నాయి. ప్రధానమైన జీఎన్‌టీ, మినీబైపాస్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వీటి పైకి వస్తే సురక్షితంగా తిరిగి ఇంటికి వెళతామన్న నమ్మకం లేకుండాపోయింది. ఎక్కడ ఏగోతిలో పడతామోనని నగరవాసులు హడలిపోతున్నారు. అడుగుకో గొయ్యి.. గజానికో గుంత.. అన్నట్లుగా తయారయ్యాయి. గత జనవరిలో నగరంలో రహదారులన్నీ బాగు చేశారు. ఈ పనులు తూతూమంత్రంగా చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు, ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. నగరం 150 చదరపు కిలోమీటర్లలో విస్తరించింది. 54 డివిజన్లలో దాదాపు 10 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరితో పాటు ఇతర మండలాల నుంచి నిత్యం మరో అయిదు లక్షల మంది వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వస్తుంటారు. వీరంతా అధ్వాన రహదారులపై పడరాని పాట్లు పడుతున్నారు.

జిల్లాలో వాహనాలు (సుమారుగా..)

కార్లు	82,317
ద్విచక్రవాహనాలు	7,35,812
మోపెడ్లు	49,120
జీపులు	1,101
మినీబస్సులు	2,356
ట్రాక్టర్లు	7,843
ట్రాక్టర్ ట్రైలర్లు	6,156
ఆటో రిక్షాలు	31,375
సరకు రవాణా ఆటోలు	9,823

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి

నెల్లూరు (విద్య): నగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి గణేష్ గోదంగవే మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవలు చేయడం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో ఎన్‌సీసీ విద్యార్థులు

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన **పోలిక వీరారెడ్డి తండ్రి వీరారెడ్డి, చిల్డ్రన్స్ పార్కు వెనుక, మధురనగర్, నెల్లూరు సిటీ** అనువారు ఇచ్చిన అనుమతి మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **చిరివెళ్ళ ఆనందరావు తండ్రి లేట్ కొండయ్య, హరనాథపురం, నెల్లూరు సిటీ** అనువారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు **చిరివెళ్ళ ఆనందరావు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **కాళితిరెడ్డి లక్ష్మీ భర్త కాళితిరెడ్డి పార్థసారథిరెడ్డి** అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది 09-02-2004** డాక్యుమెంటు నెం. 1714/2004 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **కాళితిరెడ్డి లక్ష్మీ** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **రాయపు జగన్మోహనరావు తండ్రి సుబ్బరామయ్య** అనువారి నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది 14-02-2002** డాక్యుమెంటు నెం. 578/2002 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **జగన్మోహనరావు** ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **శ్రీమతి సర్వేపల్లి కల్పలత భర్త లేట్ సర్వేపల్లి వెంకట సుబ్బుసుందరేశ్వర్** అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది 04-04-2001** డాక్యుమెంటు నెం. 2272/2001 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **కల్పలత** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు మరికొంత ఆస్తి ఆమె భర్తగారైన **సర్వేపల్లి వెంకట సుబ్బుసుందరేశ్వర్ గారి మరణానంతరం** అన్‌రిజిష్టర్డు వీలునామా **తేది 23-03-1992** ద్వారా సంక్రమించినదని, సదరు **సర్వేపల్లి వెంకట సుబ్బుసుందరేశ్వర్** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు మరికొంత ఆస్తి ఆయన అన్నగారైన అడ్వకేట్ **సర్వేపల్లి మల్లికార్జునశర్మ** గారితో కలిసి చేసుకొన్న రిజిష్టర్డు పంపకపత్రం **తేది 27-07-1975** డాక్యుమెంటు నెం. 2148/1975 ద్వారా చెందినదని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, ఆడుమానములు, జప్తులు, క్లయిమ్లు, లీజులు, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజులలోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖిత పూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు రి॥డి॥ యిలాకా నెల్లూరు స॥రి॥, నెల్లూరు మునిసిపాలిటీలో చేరిన నెల్లూరు **బిట్-2** ఏరియాలోని సర్వే నెం. 1307/1, 1315, 1337/1ర్లులోని భూమిని లే అవుట్ చేయబడిన ప్లాను దాఖలా ప్లాట్లలో సర్వే నెం. 1307/1, 1315ర్లులోని ప్లాటు నెం. 08రులోని విస్తీర్ణం 36 అంకణములా 68 చదరపు అడుగులున్ను, ప్లాటు నెం. 07రు 35 అంకణములా 55 చదరపు అడుగులలో ఉత్తర పార్శ్యంలోని 3 అంకణములా 04 చదరపు అడుగులు వెరశి 40 అంకణములు లేక 267.56 చ॥మీ॥లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు :** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం :** ప్లాటు నెం. 07రులోని మిగతా స్థలము, **పడమర :** ఇతరుల ప్లాట్లు, **ఉత్తరం :** ప్లాటు నెం. 09రు తాలూకు స్థలము. ఈ హద్దులలోని పై తెలిపిన 40 అంకణములు ఖాళీ స్థలము, యిందుకు సంబంధించిన మామూలు రాకపోకల యావత్తు యాజిమెంట్ సర్వహక్కులతోటి.

పెనుబాక గంగాధరరెడ్డి, B.Com. B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్: 98493 49333

ఆస్తుల క్రయవిక్రయాల్లో పారాహుషార్!

● హక్కుదారు నిర్ధారణలో జాగ్రత్తలు తీసుకోవాలి

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు క్రయవిక్రయాలు చేయాలంటే రిజిస్ట్రేషన్ ముఖ్యం. ఆయా వాటికి సంబంధించి రిజిస్టర్ అయిందా? హక్కుదారు ఎవ్వరు? నిబంధనల ప్రకారం ఉన్నాయా ? తదితరాలపై అమ్మకం, కొనుగోలు చేసే సమయంలో చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గొడవలు, ఆక్రమణలతో పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతుండటం చూస్తుంటాం. సరైన దస్త్రాలు, స్థిర, చర ఆస్తులకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు లేకపోతే నష్టపోవాల్సి ఉంటుంది.

ఏమి చేయాలంటే..!

★ ఎవరైనా ఆస్తి కొనుగోలు సమయంలో హక్కుదారు, ఏవైనా బకాయిలు ఉన్నాయా? అన్న విషయం నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

★ 'మీ భూమి' వెబ్‌సైట్ ద్వారా భూమి యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేసుకుని ఆస్తి అమ్మకందారు పేరిట ఉందా? లేదా అన్నది తెలుసుకోవచ్చు.

★ దస్తావేజుల ప్రతులు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరిది? ఎలా సంక్రమించిందన్న విషయాలు తెలుసుకొనే అవకాశం ఉంటుంది.

★ ఆస్తిని 'పవర్ ఆఫ్ అటార్నీ' ద్వారా పొందిన వ్యక్తి అమ్మకం చేస్తున్నప్పుడు హక్కులు ఉన్నాయా? లేవా అన్నది నిర్ధారించుకోవాలి.

★ పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాలు, అసెస్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు ముఖ్యం. ఈ వివరాల మదింపు రిజిస్టర్‌లో ఆస్తికి సంబంధించిన హక్కులు పరిశీలించుకోవాలి.

★ కొనుగోలు చేసే ఆస్తిపై వివాదాలు, ఇతరులకు హక్కులు లేవనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకున్నాకే ముందడుగు వేయాలి.

★ క్రయ దస్తావేజు రాసుకునే సమయానికి సదరు ఆస్తికి సంబంధించి ఆస్తి, నీటి పన్నులు, విద్యుత్తు బిల్లుల బకాయిలు లేకుండా చూసుకోవాలి.

మన రాష్ట్రం తరఫున పరేడ్‌లో కళాకారులు

ప్రశాంతి నిలయం ప్రధాన ద్వారం వద్ద కిక్కిరిసిన భక్తజనం

వేదఘోషతో ప్రదర్శనగా వస్తున్న వేదపండితులు, విద్యార్థులు

బాల వికాస్ చిన్నారుల నృత్యప్రదర్శన

సంప్రదాయ నృత్యాలతో...

సత్యకీర్తి.. విశ్వకాంతి!

■ సాయి నామస్మరణతో మార్మోగిన పుట్టపర్తి
■ అట్టహాసంగా బాబా శత జయంతి వేడుకలు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తి: ఏ నోట విన్నా సాయి నామస్మరణే. ఏ హృదయాన్ని మీటినా సత్యసాయి సంకీర్తనే. ప్రతి మాటలో.. ప్రతి పిలుపులో సాయిరాం.. మదినిండా కొలువుదీరిన సాయినాథుడిని కీర్తిస్తూ భజనలు తరించింది. శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరిగాయి. దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల మధ్య బాబా వేడుకలు కనువిందుగా సాగాయి. ప్రముఖ గాయకుడు మనో, డ్రమ్మర్ శివమణి.. గాన తాండవం నడుమ శ్రీసత్యసాయి పాటలు భక్తులను అలరించాయి. వేదపండితులు, వివిధ రాష్ట్రాలకు చెందిన సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు, బాలవికాస్ చిన్నారుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, మేళతాళాల నడుమ సాయినాథుడు ఆశీనులైన స్వర్ణరథాన్ని మందిరం నుంచి హిల్‌వ్యూ స్టేడియం వరకు ఊరేగించారు.

సాయిప్రేమ సజీవం..

ఉదయం 9.55 గంటలకు శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలు విద్యార్థుల వేదపఠనం, సాయికీర్తనలతో ప్రారంభించారు. వేదికపైకి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర మంత్రి లోకేశ్ ఆశీనులయ్యారు. 10 గంటలకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభోపన్యాసం చేశారు. సాయి మిషన్ నిత్యం సజీవంగా కొనసాగుతుందన్నారు. సాయి చూపిన ప్రేమ, సేవమార్గంలో ట్రస్టు పయనిస్తుందని స్పష్టం చేశారు. వేడుకలకు హాజరైన ముఖ్యఅతిథులు, భక్తజనానికి ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి, ఉపరాష్ట్రపతి మాటామంతీ..

'మనో'గానం.. డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

అలరించిన బాలవికాస్ చిన్నారులు

సత్యసాయి శతజయంతి వేడుకల్లో 18 రాష్ట్రాల బాలవికాస్ చిన్నారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హిల్‌వ్యూ స్టేడియంలో గుజరాత్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన బాలల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కళకళలాడిన స్టేడియం

సాయినాథుడి వందేళ్ల పండుగ తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఉదయం 7 గంటల నుంచే హిల్‌వ్యూ స్టేడియం చేరుకున్నారు. సాయి చూపిన సేవామార్గాన్ని అనుసరిస్తూ పేద, ధని, ప్రముఖులు అనే తేడా లేకుండా తెల్లటి వస్త్రాలు, టోపీలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు సేవాదళ్ సభ్యులు, పోలీసులు మార్గనిర్దేశం చేశారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భక్తుడి అవసరం తెలుసుకొని సహాయం అందించారు. ఉమ్మడి అనంతపురం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించుకున్నారు. భక్తుల రాకతో పుట్టపర్తి పురవీధులు కిటకిటలాడాయి.


ఇరువురు సీఎంల ఆత్మీయ కరచాలనం

కలెక్టర్, ఎస్పీ నిరంతర పర్యవేక్షణ

వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్... ట్రస్టు వర్గాలు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించారు. వీవీఐపీల రాకపోకలతో పాటు, స్టేడియం, ప్రశాంతి నిలయం, పట్టణ వీధుల్లో తిరుగుతూ.. వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

విశ్రాంత జీవుల పింఛను కష్టాలు

■ రూ.వెయ్యి నుంచి 4 వేలలోపే రావడంతో అవస్థలు
■ కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన

కదిరి, న్యూస్‌టుడే: పదవీ విరమణ చేస్తే పింఛను వస్తుంది.. శేషజీవితం సజావుగా సాగుతుంది. ఎవరైనా అనుకునేది ఇదే. అయితే ఆర్టీసీలో పింఛను జీవులు టెన్షన్ జీవితం గడపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రతా సాయం కంటే తక్కువ పింఛను వస్తోంది. విశ్రాంత ఉద్యోగులు మృతిచెందితే వారి భార్యలకు వితంతు పింఛను ఇస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందినా ఎన్టీఆర్ భరోసా పింఛనుకు ఉద్యోగి అని చూపుతుండటంతో లబ్ధి పొందలేకున్నట్లు వాపోతున్నారు. కదిరి డిపో పరిధిలో ఆర్టీసీ విరమణ ఉద్యోగులు 159 మంది, విశ్రాంత ఉద్యోగులైన భర్తలు మృతిచెందిన వితంతువులు 68 మంది ఉన్నారు.

● రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4 వేలు వస్తోంది. ఆర్టీసీ విమరణ ఉద్యోగులకు రూ.వెయ్యి నుంచి రూ.4వేలలోపే రావటంతో దీనావస్థ వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం 1995లో పెన్షన్ పథకం పెట్టింది. తర్వాత ఈపీఎఫ్ చందాదారులు సర్వీసులో ఉండి మృతిచెందినా, ఉద్యోగ విరమణ పొందినా పింఛను కల్పించింది. ఎన్డీయే ప్రభుత్వం 2014లో మినిమం పింఛను రూ.వెయ్యి చేసింది. తర్వాత పదేళ్లయినా కేంద్రం పెంచడం లేదని వాపోతున్నారు. శేష జీవితం గడపాలంటే కనిష్ఠ పింఛను రూ.7,500తో ఆదుకోవాలంటున్నారు.

బతుకు భారం

- అబ్బాస్‌అలీఖాన్, విశ్రాంత సీనియర్ సహాయకులు



ఆర్టీసీలో సీనియర్ సహాయకుడిగా పనిచేశాను. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ పొందాను. రూ.4,800 పింఛను వస్తోంది. ఇంకా పెళ్లి చేయాల్సిన కుమార్తె. ఉద్యోగ అన్వేషణలోని కుమారుడి బాగోగులు చూడాల్సి ఉంది. దీనికితోడు నాకు అనారోగ్యం కావటంతో స్టంట్ వేయించుకున్నా. ఏటా రూ.లక్షకుపైగా వైద్యం ఖర్చులు భరించాల్సి ఉంది. కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలి. చాలీ, చాలనీ పింఛనుతో బతుకు భారంగా మారింది.

రూ.వెయ్యి వస్తుంది - షేక్ ఆషాబి, పింఛనుదారు

నా భర్త ముస్కీన్ ఆర్టీసీలో హెల్పర్‌గా పనిచేసేవారు. ఆయన మృతిచెందారు. నాకు 86 ఏళ్ల వయసు. వయో భారానికి తోడు గుండె జబ్బు, షుగర్, బీపీలు ఉన్నాయి. రూ.వెయ్యి మాత్రమే పింఛను వస్తోంది. అద్దె ఇంట్లో ఒంటరిగా జీవనం చేస్తున్నాను. అరకొర పింఛను మందులకే చాలదు. కొడుకున్నా వేరుగా ఉంటున్నారు. షూమార్ట్‌లో పని చేసే అతనికి జీతం అంతంత మాత్రమే. కేంద్రమే కనిష్ఠ పింఛను రూ.7500 చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

కరిగించేసి.. దోచేసి!

■ ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

కదిరి పట్టణం, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమార్కుల ధనదాహానికి పచ్చనిచెట్లతో కూడిన కొండలు కరిగిపోతున్నాయి. ఎర్రమట్టి కోసం యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. కుటాగుళ్ల నుంచి కదిరి మండలం పందులకుంటకు వెళ్లే మార్గంలోని కొండలను మట్టివ్యాపారులు భారీ యంత్రాలతో కరిగించేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి జేబులు నింపుకొంటున్నారు.

ఈనాడు ప్రత్యేక పరిశీలన

● గతంలో పనికి ఆహార పథకం కింద వేప, సీతాఫలం విత్తనాలను కొండలపై చల్లడంతో వృక్షాలుగా ఎదిగాయి. పచ్చనిచెట్లతో కళకళలాడుతున్న కొండలో అక్రమార్కుల ఆగడాలకు నేలకొరిగాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కొండను తవ్వేస్తున్న విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని గ్రామీణులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కడప రాతికొండను 150 అడుగులలోతు తవ్వేస్తున్నారు. దీంతో కుటాగుళ్ల, బోయరామన్నపల్లి, కదిరికుంట్లపల్లి, హనుమంతరావుపల్లి, జౌకల, చలమకుంట్లపల్లి గ్రామాల్లో పశువులకు గ్రాసం లేకుండా పోతోందని కాపరులు వాపోతున్నారు.

● సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప రాతికొండను లక్ష్యంగా చేసుకున్న అక్రమార్కులు మట్టిని తవ్వి.. రాత్రివేళల్లో తరలిస్తున్నారు. బిల్డర్లతో ఒప్పందం చేసుకుని రవాణా సాగిస్తున్నారు. టిప్పర్ మట్టికి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.1000లకు విక్రయిస్తున్నారు.

కొండను తవ్వుతున్నారు ఇలా..

తగిన చర్యలు తీసుకుంటాం

-మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

కొండను తవ్వేసి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారంగా అడవులు రూపుకోల్పోయేలా చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతాం.

26న పాలిటెక్నిక్‌లో ఉద్యోగమేళా

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. మేళాకు కాంగ్నిజెంట్, రెడ్డీస్ లేబొరేటరీస్, విప్రో హైడ్రాలసిస్, యంగ్ ఇండియా సంస్థలతోపాటు 8 మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు రానున్నారని, నైపుణ్యాలు, ప్రతిభ ఆధారంగా కొలువులకు ఎంపిక చేస్తారని ఆయన వివరించారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.



వైకాపా ప్రభుత్వంలో నష్టపోయాం.. న్యాయం చేయండి

లోకేశ్‌కు తెదేపా కార్యకర్తల వినతులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రోద్బలంతో పోలీసులు తమపై అక్రమ కేసులు బనాయించారని.. వాటిని విచారించి ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ముదిగుబ్బ మండలం మలకవేములకు చెందిన డి.లోకేశ్ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన లోకేశ్ ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. చెన్నేకొత్తపల్లి గ్రామంలో తాను కొనుగోలు చేసిన రెండున్నర సెంట్ల స్థలాన్ని గత వైకాపా ప్రభుత్వంలో హనుమంతరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడని, విచారించి న్యాయం చేయాలని ముదిగుబ్బ మండలం మాకర్లకుంటపల్లికి చెందిన టి.నాగభూషణం విన్నవించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు సాయం చేయాలని బుక్కపట్నంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు రామాంజనేయులు కోరారు. ఎంఏ బీఈడీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పుట్టపర్తికి చెందిన జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వినతులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి అర్జీదారులకు హామీ ఇచ్చారు.

అర్జీ స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

తీగల మార్పు.. తొలగనున్న ముప్పు

■ పురంలో విద్యుత్తు సమస్యకు పరిష్కారం

బాలాజీనగర్‌లో ఇళ్లపై తీగలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మీదనే 33కేవీ విద్యుత్తు తీగలు వెళ్లడంతో అదనపు నిర్మాణాల మాట దేవుడెరుగు.. పైకెక్కి దుస్తులు ఆరేసుకోవాలన్నా ప్రమాదమే. ఆయా ప్రాంతాల్లో గత 20 ఏళ్లలో విద్యుత్తు తీగలు తగలి 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడి.. ఆసుపత్రి పాలయ్యారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూశారు.

ఎక్కడెక్కడంటే..

★ గురునాథ్ సర్కిల్ నుంచి రహమత్‌పురం వరకు బైపాస్ రోడ్డులో పలుచోట్ల అడుగులు మాత్రమే ఉండటం, అక్కడే స్తంభాలు వేయడంతో రద్దీ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ రహమత్‌పురంలోని బైపాస్ రోడ్‌లో ఇళ్ల పక్కన భారీ స్తంభాలు వేసి, ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ రైల్వే రోడ్ అభివృద్ధికి దాదాపు రూ.10 కోట్లు వెచ్చించి రహదారిని విస్తరిస్తున్నారు. విస్తరణకు స్తంభాలు అడ్డుగా నిలిచాయి. దీంతో నిర్మాణ పనులను ప్రారంభించలేని పరిస్థితి తలెత్తింది.

రూ.8.5కోట్లు కేటాయింపు

రైల్వే రోడ్‌లో విద్యుత్తు స్తంభాలు, లైన్ల తొలగింపునకు రూ.2.8 కోట్లు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి రహమత్‌పురం వరకు రూ.2.45 కోట్లు, హస్నాబాద్‌లో ఇళ్ల మీద ఉన్న లైన్ల తొలగింపునకు రూ.1.65 కోట్లు, ఇతర పనులకు రూ.1.6 కోట్లు కేటాయించారు.

త్వరలో టెండర్లు..

-మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

పట్టణాభివృద్ధికి తాజాగా మంజూరు చేసిన ప్రత్యేక నిధులకు సంబంధించి, సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేసి టెండర్లు పిలుస్తాం. తరువాత పనులు చేయిస్తాం.

మౌనిగిరి క్షేత్రం వార్షికోత్సవాలు ప్రారంభం

రాప్తాడు: హంపాపురం గ్రామం మౌనిగిరి క్షేత్రంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి 8వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ వార్షికోత్సవాలను కర్ణాటక లోకాయుక్త చీఫ్ జస్టిస్ బి.వీరప్ప జ్యోతి వెలిగించి కార్యక్రమాలు ప్రారంభించారు. మౌనిగిరి క్షేత్ర వ్యవస్థాపకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ వార్షికోత్సవాలు మూడు రోజులు జరుగుతున్నట్లు తెలిపారు. మంగళవారం హనుమంతుడికి 1000 లీటర్ల పాలతో మహాభిషేకం, పదివేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్షేత్రంలో కర్ణాటక లోకాయుక్త చీఫ్ జస్టిస్ బి.వీరప్ప కుటుంబ సభ్యులు

ట్విటర్ వేదికగా మంత్రి లోకేశ్ అభినందనలు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని పైదొడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న బుకెరా మిరెడ్డిపల్లి కౌసల్యను ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ట్విటర్ వేదికగా ఆదివారం అభినందించారు. విద్యార్థులతో కలిసి ఒకరిగా మారి ఆటపాటలతో వారిని అలరిస్తూ, సామెతలు, సూక్తులతో బోధిస్తున్నారని గుర్తించారు. ఆంగ్లం, గణిత పాఠాలు సులభంగా వివిధ పద్ధతులతో నేర్పిస్తుండటం ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యా సేవ బాగుందని అభినందనీయమని ట్విటర్ పూదిగా మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు కౌసల్యను స్థానిక ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయురాలు కౌసల్య

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, ప్రముఖ డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నచో మా దుకాణంలో విడిపించి కొంటాము. స్వాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డన్ ట్రేడింగ్ కం) © 7382114647.

REAL ESTATE

HOUSE FOR SALE

KLD రోడ్డుకు Ahuda, RERA అనుమతి కలిగి, అన్ని సౌకర్యాల Venture లందు Double, Duplex హౌస్‌లు 90%లోన్‌తో కలవు. © 9866011539, 9963484888.

PLOT FOR SALE

ఉరవకొండ నందు అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన క్యూరింబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

ATP-తాడిపత్రి రోడ్డి ఏస్పెండిషియల్ స్కూల్ ఎదురుగా రోడ్ నుంచి కెవలిలో AHUDA అప్రూవ్ డ: 40 అ||లు రోడ్, డ: 30 అ||లు రోడ్ కార్నర్ 10 సెంట్లుస్థలం అమ్మబడును. © 9581196786.

JOBS

అటెండెంట్ కావలెను (పురుష) 63 సం. వయస్సు గల ఒంటరి పురుషునికి సహకారం అందించుటకు కావలెను. వసతి, భోజనం, జీతం. రామ్‌నగర్. 9393724047.

అనంతపురం టౌన్‌లో పనిచేయుటకు ఇడ్లీ-వడ, పూరి, దోశలు చేయువారు రుచికరముగా కావలెను. వసతి కలదు. మంచి జీతం కల్పించబడును. © 83097 18300.

SECURITY GUARDS

క్రింది ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ మరియు సెక్యూరిటీ గార్డులు కావలెను. అనంతపూర్, హిందూపూర్, కదిరి, పామిడి, తాడిపత్రి, పుట్టపర్తి, గుత్తి, ధర్మవరం. © 8008800542, 9000492993.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రకటనదారులు ముందు జరిగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారు రులు కస్టమర్లకు అందించే ఉత్పత్తులు సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసినా ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా తగిన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనను పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలతో ఈ.ఎస్.టి 5% వర్తించబడును.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: MITS Deemed to be University — Madanapalle Institute of Technology & Science

TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు | Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా: ఈనాడు కార్యాలయం, ఈవెంట్స్ డిపార్ట్‌మెంట్, బెంగుళూరు హైవే, రాప్తాడు, అనంతపురం - 515001

వివరాలకు: 80080 01704

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

తెలంగాణ సీఎంకు అశోక స్తూపం బహూకరణ

సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పుట్టపర్తికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, సవిత మన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సవిత రేవంత్‌రెడ్డికి అశోక స్తూపం ప్రతిమను బహూకరించారు.

– న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

సిరి ధాన్యాల వినియోగంతో సంపూర్ణారోగ్యం

కుందుర్పి, న్యూస్‌టుడే: సిరి ధాన్యాల వినియోగం అలవాటు చేసుకున్న వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి ఆరోగ్య నిపుణులు, పద్మశ్రీ డా.ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఎనుములదొడ్డిలోని విలువల బడిలో ఆదివారం 'సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలతో పోల్చుకుంటే గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతితో అలిపించే వేర్లు, ఆకులు, ఆహారం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. పాఠశాలల్లో చిరు ధాన్యాల వినియోగంపై బోధన చేయాలన్నారు. రచయిత్రి శశికళ, గేట్స్ కళాశాల ప్రతినిధులు వాణి, గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్‌కే ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖాదర్‌వలి

ప్రొటోకాల్ తీరుపై ఎంపీ ఆగ్రహం

ఈనాడు, అనంతపురం: ఉపరాష్ట్రపతి పుట్టపర్తి పర్యటనలో భాగంగా ప్రొటోకాల్ జాబితాలో పేరు లేకపోవడంపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలికేందుకు శ్రీసత్యసాయి జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. ఆ సమయంలో ప్రొటోకాల్ జాబితాలో పేర్లు లేవని.. బయటకు వెళ్లాలని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో ఎంపీ.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాగతం పలికేందుకు వస్తున్నట్లు ఒకరోజు ముందుగానే చెప్పినా జాబితాలో తమ పేర్లు ఎందుకు చేర్చలేదని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణను నిలదీశారు. ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధులు విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేశారు.

విజ్ఞానం పాఠ్యాంశం కాదు.. జీవన విధానం

పెనుకొండ, న్యూస్‌టుడే: విజ్ఞానశాస్త్రం పాఠ్యాంశం మాత్రమే కాదని, పాఠశాలలో నేర్చుకున్న విజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్లోబల్‌విజన్ సీబీఎస్ఈ పాఠశాలలో జేవీవీ (జన విజ్ఞాన వేదిక) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. విజ్ఞానశాస్త్రం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) స్థాయికి అభివృద్ధి చెందినా చదువుకున్న మేధావుల్లో మూఢ విశ్వాసాల వల్ల నష్టపోతున్నారన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలో గ్లోబల్‌విజన్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు, హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి ఎం.వి.కే నబీ వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఆదిశేషు, జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేశ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గ్లోబల్‌విజన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఎంఈవో రాఘవయ్య, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ప్రతినిధులు

పీఈటీ జగన్‌మోహన్‌రెడ్డికి సన్మానం

ఉపాధ్యాయులతో పీఈటీ జగన్‌మోహన్‌రెడ్డి

పిల్లలపల్లి (బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మూడు రోజుల కిందట గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీల్లో బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో డిస్కస్‌త్రో, లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన జగన్‌మోహన్‌రెడ్డిని స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులతో పాటు ఆ పాఠశాల హెచ్ఎం బసవరాజు, గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు.

శతక్కొట్టిన లోహిత్

భారీ స్కోరు దిశగా ఆంధ్ర

అనంతపురం (క్రీడలు, న్యూస్‌టుడే): అంతర్రాష్ట్ర అండర్-19 కూచ్ బెహర్ ట్రోఫీ నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు ఒడిశా జట్టుపై 80 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కేవలం 56 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆంధ్ర జట్టును లోహిత్ లక్ష్మీనారాయణ (101) అద్భుతమైన శతకంతో జట్టును ఆదుకున్నాడు. ఎస్ఎస్ లోహిత్ (60), జయంత్‌కృష్ణ (21), జి.మనీష్‌రెడ్డి (21)లు ఓ మోస్తరుగా బ్యాటింగ్‌లో రాణించి జట్టును ఆదుకున్నారు. ఒడిశా బౌలర్లు రాజ్‌యాదవ్ (3/56), సంబిత్ కె బెజ (2/52) విజృంభించి ఆంధ్ర జట్టు బ్యాటర్ల భరతం పట్టే ప్రయత్నం చేశారు. ఆంధ్ర బ్యాటర్లు రెండో రోజు విజృంభిస్తే మొదటి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు చేయనుంది. ఈ పోటీలను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి జి.మురళీకృష్ణ, ఏసీఏ ఎం.ఎం.కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

లోహిత్ లక్ష్మీనారాయణ

పెనకచర్ల డ్యాంలోకి ట్రాక్టర్!

గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య



వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం జె.రాంపురం శివారు గొల్లపల్లిలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రామాంజనేయులుకు చెందిన ట్రాక్టర్‌ను పెనకచర్ల డ్యాం నీళ్లలోకి వదలడంతో పాటు ఆయన పొలంలోని గేట్‌వాల్స్, బిందుసేద్యం పరికరాలు ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయారు. ఆదివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహానంది, ఎస్సై నాగస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పొలంలోని వ్యవసాయ పరికరాల ధ్వంసంతో రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు.

పర్యావరణ సమతుల్యతలో పక్షులు కీలకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యతలో పక్షుల ప్రాముఖ్యతను గుర్తించడం, విద్యార్థుల్లో ప్రకృతిపై అవగాహన కల్పించడంలో భాగంగా బర్డ్‌వాక్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎస్కేయూ జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న కొత్తకొత్త పక్షులు, వలస పక్షులను గుర్తించారు. పక్షులు ఏర్పాటు చేసుకొన్న వివిధ రకాల గూళ్లను పరిశీలించారు. ఆధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం పక్షుల రంగులు, అరుపులు, వాటిని ఎలా గుర్తించాలో తెలియజేశారు. వివిధ వర్గాల ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్షులను వీక్షిస్తున్న ప్రకృతి ప్రేమికులు

కనువిందుగా... సత్యసాయి జోలసేవ

సాయినామాలపై నీళ్లు వేస్తున్న ఏనుగు

సంగీత కచేరీ నిర్వహిస్తున్న పండిట్ అజయ్ చక్రవర్తి బృందం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని హిల్‌వ్యూ స్టేడియంలో వేలాది మంది భక్తజనం నడుమ జోలసేవ కమనీయంగా జరిగింది. జోలసేవను భక్తులు తిలకించి పరవశించిపోయారు. ఊయలలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి, జోలను ఊపుతూ భక్తులు తన్మయం చెందారు. ప్రముఖ సంగీత గాయకుడు పండిట్ అజయ్ కౌశిక చక్రవర్తి, నవీన్ బృందం "ది ఈటర్నల్ సింఫనీ" సుమధుర స్వరాలతో సంగీత కచేరీ ఆధ్యాత్మిక వైభవం, సేవా కార్యక్రమాలు ప్రదర్శిస్తూ డ్రోన్ల ద్వారా లేజర్‌షో ప్రదర్శించారు. బాణసంచా కాల్పులు సంబరాలు నిర్వహించారు. కచేరీ బృందాన్ని ట్రస్ట్ రత్నాకర్, సతీమణి హిమవాహిని ఘనంగా సన్మానించారు.

ఎస్కేయూలో విద్యార్థిపై దాడి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ చేస్తున్న వంశీకృష్ణ అనే విద్యార్థిపై బయటి వ్యక్తులు శనివారం రాత్రి దాడి చేశారు. ఎమ్మెన్నీ హాస్టల్ వద్ద చదువుతున్న వంశీకృష్ణ రాత్రి వసతిగృహం వద్ద వెళ్తుండగా ఇద్దరు యువకులు అడ్డగించారు. సంబంధం లేకపోయినా పిడిగుద్దులు గుద్దారు. దీంతో ఆ విద్యార్థి కన్ను వద్ద గాయమైంది. ఇతర విద్యార్థులంతా కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యాయత్న బాధితుడిని రక్షించిన పోలీసులు

పామిడి, న్యూస్‌టుడే: శ్రీ కుటుంబ కలహాలతో విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించిన బాధితుడిని పోలీసులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన రాచూరి రాజు అనే వ్యక్తి ఆదివారం ఫినాయిల్ తాగుతూ, బంధువులకు చరవాణిలో సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు పామిడి పోలీస్‌స్టేషన్‌కు విషయం తెలిపారు. ఎస్సై రవిప్రసాద్ ఆదేశాలతో సిబ్బంది రామాంజనేయులు, పోలీసులు రవీంద్ర, ఇమ్రాన్ సాంకేతికత సాయంతో పామిడి కొండాపురం రైల్వేగేట్ సమీపంలో గుర్తించారు. అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు సురక్షితంగా ఉన్నాడని చెప్పారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అపస్మారక స్థితిలో పడిఉన్న రాచూరి రాజు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో హమాలీ మృతిచెందిన ఘటన వజ్రకరూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల ద్వారా తెలిసిన వివరాలిలా... కోనేకల్లు మండలం సొల్లాపురానికి చెందిన పవన్(32), రాము హమాలీలు. వారిద్దరూ ద్విచక్ర వాహనంపై ఆదివారం వజ్రకరూరులోని పవన్ బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. క్రమంలో వీరిని ప్యాపిలి సమీపంలో గుంతకల్లు ప్రధాన దారిలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాము పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద వివరాలను ఉరవకొండ ఎస్సై జనార్దన్ నాయుడు తెలిపారు.

పవన్

మరో ప్రమాదంలో...: ఉరవకొండ మండలం చిన్న ముష్టూరులో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో శివరామిరెడ్డి కాలికి చెందిన ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

క్రైమ్.. కార్నర్

గోరంట్ల మండలం కరావులపల్లిలో..

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలం కరావులపల్లి సమీపంలో ఆదివారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో ఇదే మండలం వానవోలు గ్రామానికి చెందిన వెంకటేష్(30) దుర్మరణం పాలయ్యారు. వివరాలిలా.. పుట్టపర్తి మండలంలోని కప్పలబండలో వెంకటేష్ బంధువుల ఇంటిలో శనివారం జరిగిన జన్మదిన వేడుకల్లో భార్యాపిల్లలతో కలిసి పాల్గొన్నారు. ఆదివారం ద్విచక్రవాహనంలో ఒక్కడే సొంతూరుకు వస్తున్నాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో తీవ్రంగా గాయపడ్డ నట్లు భావిస్తున్నారు. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించి 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్తుండగా కొంతసేపటికే మృతిచెందాడు. ఆతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్థులు వివరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం కరిదిపల్లికి చెందిన కమ్మచౌదరి(40) అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భార్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పంటల సాగుకు రూ.10 లక్షల దాకా అప్పు అయ్యాయి. దిగుబడులు సక్రమంగా రాలేకపోవడంతో నష్టాలు వచ్చి అప్పులు తీరే మార్గం లేక మనస్తాపానికి గురైన కమ్మచౌదరి శనివారం రాత్రి పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కళ్యాణదుర్గం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కమ్మచౌదరి

తండ్రి వంట చేయలేదని కుమారుడు..

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆదివారం పట్టాలపై గూడ్స్ రైలు కిందపడి శ్రీనివాసులు (38) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. శ్రీనివాసులుకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. భార్య విడాకులు ఇచ్చింది. తల్లి ఇది వరకే మృతిచెందింది. తండ్రి లక్ష్మీనారాయణతో కలిసి ఉంటున్నాడు. కుమారుడికి తండ్రి భోజనం చేసి పెడుతుండేవాడు. శనివారం రాత్రి ఇంట్లో వంట చేయలేదని, బయటకు వెళ్లి హోటల్లో తిని రావాలని శ్రీనివాసులుకు తండ్రి లక్ష్మీనారాయణ తెలిపారు. దీంతో కుమారుడు కోపడి ఇంటి నుంచి వెళ్లిపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

కొడికొండ పాత చెరువుకు గండి

పొలాల్లోకి వృథాగా పోతున్న చెరువు నీరు

చిలమత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొడికొండ పాత చెరువుకు ఆదివారం గండి పడింది. ఈ విషయంపై స్థానికుల ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించిన వారు ఎంతసేపటికీ రాలేదు. దీంతో చేసేది లేక చెరువుకు మట్టి సంచులను వేసుకుని యువకులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో చేరి పూడ్చడానికి ప్రయత్నం చేశారు. గండి పడటంతో పక్కన ఉన్న పొలాల్లోకి నీరు వృథాగా పోతోంది.

కనకదాసకు జ్యోతుల ఉత్సవం

కల్లూరులో జ్యోతుల ఊరేగింపులో భక్తులు

లేపాక్షి, న్యూస్‌టుడే: కల్లూరు, గలిబిపల్లిలో ఆదివారం కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను మోసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు బాలాజీ, తెదేపా మండల కన్వీనర్ అబిలాష్, నాయకులు వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల విశ్వకప్ విజయంపై సంబరాలు

మడకశిర, న్యూస్‌టుడే: మహిళల అంధుల టీ-20 ప్రపంచకప్‌ను భారత జట్టు కైవసం చేసుకోవడంతో ఆదివారం మడకశిరలోని స్థానిక క్రీడా మైదానంలో క్రీడాకారులు, అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. జట్టు సారథిగా మడకశిర నియోజకవర్గానికి చెందిన దీపిక వ్యవహరించడం అందరికీ గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కేక్ కోసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు జరుపుకొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న అభినందనలు తెలియజేశారు.

కేక్ కోసి సంబరాలు జరుపుకొంటున్న క్రీడాకారులు

కాలనీలు.. ఏవీ మౌలికవసతులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని దండురోడ్డులోని హనుమాన్‌నగర్, వెంకటేశ్వరనగర్, వినాయకనగర్, సమీపంలోని మరో రెండు కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకవర్గం సభ్యులు కరుణలేదా అని నివాసితులు వాపోతున్నారు. ఏళ్ల గడుస్తున్నా తాత్కాలిక సౌకర్యాలే ఇక్కడ నివసించేవారికి శరణ్యం. ఈ ప్రాంతాల్లో 967 గృహాలుండి 3879మంది జనాభా ఉన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, సంపన్న వర్గాల కుటుంబాలే ఉన్నాయి. సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుచేయడానికి అధికారులు అనేకసార్లు సర్వే చేసి వెళుతున్నారేకాని ఆచరణలో అమలు చేయడంలేదని విమర్శలు ఉన్నాయి.

దండురోడ్డు సమీపంలోని హనుమాన్‌నగర్‌లో తాత్కాలిక మట్టిరోడ్డు

అంచెలంచెలుగా అభివృద్ధి పనులు

కనీస సౌకర్యాలు కల్పించడంలో కాలనీల్లో అంచెలంచెలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఆ ప్రాంతాల పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రత్యామ్నాయ సౌకర్యాలు సమకూర్చేలా చూస్తాం. -మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

ఉత్పన్నమయ్యే ఇబ్బందులివే..

- మట్టిరోడ్లు ఉండటంతో వర్షం వస్తే బురదమయంగా తయారై వాహనాల రాకపోకలకు అంతరాయం.
- సిమెంటు కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది.
- వీధి దీపాలు ప్రాంతాల్లో ఏర్పాటు లేకపోవడంతో రాత్రి సమయంలో ఇళ్ల బయటకు రావాలన్నా లోపలికి వెళ్లాలన్నా ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- దేవాలయాలు, ప్రార్థన మందిరాలు ఉన్న చోట్ల పారిశుద్ధ్య వ్యవస్థ సక్రమంగాలేదు. దోమలు, పందుల ప్రభావం ఎక్కువగా ఉంది.
- మున్సిపల్ కుళాయిల్లో సక్రమంగా నీరు వదలకపోవడంతో నిత్యం వాడుకునే నీటి కోసం మహిళలకు సమస్యగా తయారైంది.

పురంలో ఆసుపత్రి ప్రారంభం

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని అబాద్‌పేటలో డా.వెంకటరమణ ఆధ్వర్యంలో అదితి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నూతనంగా నిర్మించారు. ఆదివారం దాన్ని ఉమ్మడి అనంత జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్‌లు ప్రారంభించారు. ఇందులో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డా.అంజన్ కుమార్, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కల్లూరాపురం బీసీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. -రంగనాథ్
సమాధానం: రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. -లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి

సమస్య: పూజారిపల్లి ఇందిరమ్మకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. -మురళి
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -కవిత, సర్పంచి, కొంకల్లు
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: పులకుంట పంచాయతీలోని రాజీవ్‌కాలనీలో విద్యుత్తు దీపాల స్తంభాలు ఏర్పాటుచేయాలి. -నారాయణప్ప
సమాధానం: అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయించేలా చూస్తాం. -రామాంజనమ్మ, ఎంపీటీసీ.
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

గుంతలకు మరమ్మతు

మడకశిర గ్రామీణం: జక్కేపల్లి గ్రామంలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి కోతకు గురై గుంతలుగా మారింది. సమస్యపై శనివారం చిత్రవార్త ప్రచురించడంతో పంచాయతీ కార్యదర్శి జయంత్‌రెడ్డి స్పందించారు. ఆదివారం హిటాచీ సహాయంతో గుంతలను పూడ్చించారు.

చెత్త తొలగింపు

చిలమత్తూరు: చిలమత్తూరు బీసీకాలనీలోని చెత్తను తొలగించారు. దీనిపై చిత్రవార్త రావడంతో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి సావిత్రి స్పందించి సిబ్బందిచేత చెత్తను తొలగింపజేశారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకూడదని చుట్టుపక్కల ఇంటి యజమానులకు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పరిగి, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్న పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డి.హర్షవల్లి, మంజుశ్, సిరిమల్లిక, గంగమ్మ, స్వాతి, కల్యాణ్, వర్షిత, నవరత్న, లిఖిత్‌కౌర్ ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్‌జూనియర్ కబడ్డీపోటీల్లో హర్షవల్లి, ఎం.మంజుశ్, నవరత్న, రాజు అనే విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని హెచ్‌ఎం కృపాసత్యరాజ్, పీఈటీ వినోద్, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అశ్వర్థ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కృపాసత్యరాజ్, పీఈటీ వినోద్

ఎమ్మెల్యే ఇంటి వద్ద నేడు ఫిర్యాదుల స్వీకరణ

హిందూపురం, న్యూస్‌టుడే: శాసనసభ్యుడు బాలకృష్ణ ఆదేశాల మేరకు పట్టణం చౌడేశ్వరి కాలనీలోని ఎమ్మెల్యే నివాస గృహం వద్ద సోమవారం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్‌సెల్ (ఫిర్యాదుల స్వీకరణ) ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యదర్శి వీరయ్య తెలిపారు. హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

దెబ్బతిన్న కల్వర్టు.. ప్రమాదకరంగా చువ్వలు

సోమందేపల్లిలో గ్రామ ప్రధాన రహదారిపై ఒక కల్వర్టు దెబ్బతిని ఇనుప చువ్వలు బయట పడటంతో ప్రమాదకరంగా మారింది. మారుతీనగర్ వద్దగల ఈ కల్వర్టుపై పాదచారులు, వాహనాల చోదకుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండటం వలన ముఖ్యంగా రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మురుగు కాలువపై నిర్మించిన ఇక్కడి కల్వర్టుపై కంకర, సిమెంటు పోయి.. ఇనుప చువ్వలు కనిపిస్తుండటంతో ఎప్పుడు, ఎవరు ఏ ప్రమాదానికి గురవుతారోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై మండల ఇంజినీర్ రవికుమార్ మాట్లాడుతూ వెంటనే పరిశీలించి, మరమ్మతులు చేపడతామని చెప్పారు. -న్యూస్‌టుడే, సోమందేపల్లి

ప్రశాంతనిలయంలో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లల చేత కేక్ కట్ చేయిస్తున్న సత్యసాయిసేవా సమితి సభ్యులు

నాగానపల్లిలో జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ఛైర్మన్ రమణారెడ్డి, చిన్నారులు

పెనుకొండలోని ఓడుకాణం వద్ద మానవహక్కుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించిన భక్తులు

భక్తిశ్రద్ధలతో సత్యసాయి శతజయంతి

గోరంట్లలో శ్రీసత్యసాయి భజన అనంతరం నారాయణసేవలో భక్తులు

శ్రీ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఆదివారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో భక్తులు బాబా చిత్రపటాలను ఊరేగిస్తూ నగరసంకీర్తనలు చేశారు. భజన మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. హిందూపురంలో 250 రకాల పిండి వంటకాలను సాయికి భక్తులు సమర్పించారు. పేద మహిళలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. -న్యూస్‌టుడే బృందం

పురం: చీరలు పంపిణీ చేస్తున్న సాయి భక్తులు

చిలమత్తూరులో ఊరేగింపులో భక్తులు

వేగంగా నిర్మాణం.. మరి క్యూరింగ్ ?

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని రాచూరులో చేపడుతున్న రక్షిత ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నిర్మాణ పనుల మన్నిక కోసం వాటి పగుళ్లను నివారించడానికి సరైన క్యూరింగ్ చేయాల్సి ఉంది. 40 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకు ఈ పనులు తీసుకున్న గుత్తేదారు క్యూరింగ్ లేకుండా వాటి పైకప్పు పనుల నిర్మాణాన్ని శరవేగంగా కొనసాగుతున్నాయని స్థానికులు వాపోయారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యాంగా పైకప్పు నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులును వివరణ కోరగా గ్రామాన్ని సందర్శించి ట్యాంకు నిర్మాణం పనులను పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ఈవిషయంపై గుత్తేదారు రమేశ్ మాట్లాడుతూ నిర్మాణం పనులలో భాగంగా సిమెంటు పిల్లర్లకు సక్రమంగా క్యూరింగ్ చేసిన తర్వాతే పైకప్పు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

రాచూరులో ట్యాంకు పైకప్పు నిర్మాణం పనులు చేపడుతున్న కూలీలు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర పట్టణ పరిధిలోని మధుగిరి రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని చూసి స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. యువకుడు ఎవరనేది ఇంతవరకు తెలియక పోవడంతో పోలీసులు వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

నేటి నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి డిసెంబరు 2 వరకు నిర్వహించే రైతన్న మీకోసం కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయాధికారి సురేంద్రనాయక్ కోరారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

పరిగి, న్యూస్‌టుడే: పరిగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలకు చెందిన సచివాలయాల ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా జరిగింది. ప్రారంభ మ్యాచ్‌లో హిందూపురం, చిలమత్తూరు సచివాలయ జట్లు తలపడగా చిలమత్తూరు జట్టు విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో పరిగి, లేపాక్షి జట్లు పోటీ పడగా లేపాక్షి జట్టు విజయం సాధించింది.

పుచ్చకాయ పంట ధ్వంసం.. ఫిర్యాదు

ధ్వంసం చేసిన పంటను చూపిస్తున్న రైతు

అగళి, న్యూస్‌టుడే: కురుసాంగనపల్లి గ్రామానికి చెందిన రైతు జుంజప్ప పొలంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పుచ్చకాయ పంటను ధ్వంసం చేశారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధితుడు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పు చేసి లక్ష రుపాయల పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశానని, తన పొలంలో పంటలు బాగా పెరగడంతో గిట్టనివారు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకర మలుపులో జాగ్రత్త..

అగళి నుంచి రొళ్లకు వెళ్లే ప్రధాన రహదారిలోని మధూడి సమీపంలో ఓ మలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రోడ్డులో వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మలుపులో కంపచెట్లు ఏపుగా పెరగడంతో రోడ్డు కనపడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, అగళి

పైపులు పగిలి.. నీళ్లు రాక రెండేళ్లు

నిద్రఘట్ట గొల్లహట్టి వద్ద ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయి నుంచి రెండేళ్లుగా నీళ్లు రావడం లేదని గొల్లహట్టి వాసులు వాపోతున్నారు. శివారు ప్రాంతంలో ఉన్న పైప్‌లైన్ పగిలి మరమ్మతు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా సంబంధిత ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం

శుద్ధజలం అందేదెన్నడో?

వన్నార్నహళ్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం వృథాగా ఉంది. దీంతో ప్రజలు రొళ్ల కేంద్రానికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి లక్షలు వెచ్చించి శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేసి పూర్తి చేయలేకపోయారు. ఈ విషయంపై ఎంపీడీవో నాగేశ్వరశాస్త్రిని వివరణ కోరగా పరిశీలించి నీటిని అందిస్తామన్నారు. -న్యూస్‌టుడే, రొళ్ల

ఒరిగిన స్తంభం.. విరిగితే ప్రమాదం

నారనాగేపల్లి రోడ్డు పక్కనే ఓ రైతు పొలంలో 11 కేవీ విద్యుత్తు స్తంభం ఒరిగిందని, పక్కనే ఉన్న ఓ చెట్టు కొమ్మల ఆసరాతో నిలిచిందని, గాలి వీస్తే పడిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోయారు. ఈ విషయంపై ఏఈ శ్రీనివాసమూర్తిని వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, రొద్దం

నియంత్రిక.. ప్రమాద ఘంటిక

గుడిబండ, చిగతుర్పి రోడ్డులో విద్యుత్తు నియంత్రిక రోడ్డు పక్కనే ఉండి ప్రమాదం పొంచి ఉంది. చేతి కందేలా ఫ్యూజులు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కంచెవేయడమో, ఇతర ప్రాంతానికి మార్చడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏఈ విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యుత్తు ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

నీరు నింపక వృథాగా తొట్టె

భక్తరపల్లి గ్రామంలోని ఉప్పార్లపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న పశువుల తొట్టెకు నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారింది. తొట్టె చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అశ్వర్థరెడ్డి మాట్లాడుతూ తొట్టెకు నీరు నింపేందుకు చర్యలు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

శుద్ధజల కేంద్రాల ఏర్పాటుకు విరాళం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం నియోజకవర్గంలో ఆరు చోట్ల శుద్ధజల కేంద్రాల ఏర్పాటుకు ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో ఏపీ టెక్నాలజీస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ రూ. 30 లక్షలు విరాళం అందించినట్లు ఎమ్మెల్యే కార్యదర్శులు వీరయ్య, బాలాజీ తెలిపారు. ఈ చెక్కును ఆ సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆదివారం అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి అందించినట్లు వివరించారు. ఈ నిధులతో త్వరలో పురపాలక సంఘం పరిధిలోని మోతుకపల్లి, ముద్దిరెడ్డిపల్లి, చౌడేశ్వరికాలనీ, చిలమత్తూరు మండలం మదిరేపల్లి, హిందూపురం గ్రామీణ మండలం అప్పలకుంట, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.


చెక్కు అందిస్తున్న సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

ముళ్ల పొదల్లోనే బస్సు.. పట్టించుకోని అధికారులు

ముళ్లపొదల్లో నిలిచిపోయిన ఓ ప్రైవేటు బస్సు

రెండు దశాబ్దాల క్రితం రవాణాశాఖ అధికారులు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును జప్తు చేశారు. ఆ బస్సుకు సంబంధించి యజమాని, అధికారులు పట్టించుకోకపోవడంతో 20 ఏళ్లుగా రవాణాశాఖ చెక్‌పోస్టులోనే నిలిచిపోయింది. పెనుకొండలోని ఆర్టీఏ చెక్‌పోస్టు 2010కి ముందు పెనుకొండ పట్టణంలోని 7వ నంబరు జాతీయ రహదారిపై నిర్వహించేవారు. జాతీయ రహదారి విస్తరించాక 44వ జాతీయ రహదారిగా ఏర్పడి పట్టణం బయట నుంచి బైపాస్ వేయడంతో చెక్‌పోస్టును పులేకమ్మ ఆలయం సమీపంలోకి మార్చారు. కేసులో పట్టుబడిన బస్సు, మరిన్ని వాహనాలను అక్కడికి తీసుకెళ్లి రోడ్డు పక్కన నిలిపారు. గత వైకాపా పాలనలో ఆర్టీఏ చెక్‌పోస్టులు మూసివేయడంతో కేసుల్లోని వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇదిగో ఇలా బస్సును గుర్తించలేనంతగా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. కనీసం వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెనుకొండ

లేపాక్షి ఆలయ సందర్శన

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ బజరంగ్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, వేలాడేస్తంభం, ఏకశిలా నంది విగ్రహం తదితర ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆయన వెంట వీహెచ్‌పీ ప్రతినిధులు చలపతి, జగదీష్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బజరంగ్‌లాల్‌ను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న ప్రతినిధులు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: Hindupur
E.P.No: 02/2021 In O.S.No. 179/2010

Between :
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Anantapur ... Petitioner/D.Hr
And
T.Ramanjineyulu & Others ... Respondents / J.Dr

To,
J.Dr: 2 : N.Nagabhushana, S/o N.Chandrayudu, Now R/o D.No.23-1-195, Prashanthi Nagar, Hindupur.

J.Dr. 02 కి Order 21 Rule 43 CPC నోటీసు

Petitioner బాకీ మొత్తం Rs. 4,21,038-00 లు రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన EPలో 02వ J.Dr అయిన మీరు 05-12-2025 వ తేదిన హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరు గానీ, మీ తరుపున వకీలు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును

(By Order of the Court)

G.R.Siddagangappa,
Advocate For The Petitioner, Hindupur.

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

మొక్క నాటుతున్న ఎన్‌హెచ్‌ఆర్సీ ఎన్డీటీ సభ్యులు

వంద మొక్కలు నాటారు..

కదిరి: సత్యసాయి బాబా శతజయంతిని పురస్కరించుకుని ఎన్‌హెచ్‌ఆర్సీ ఎన్డీటీ (నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఆధ్వర్యంలో వంద మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఆదివారం స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటించారు. కార్యక్రమంలో షేక్షావలి, మహేశ్, జగదీశ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో తెలంగాణ సీఎం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పుట్టపర్తి వచ్చారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి సమాధిని ఆయన దర్శించుకున్నారు. మందిరంలో సీఎంకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సాదర స్వాగతం పలికారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

బాబా సమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న రేవంత్‌రెడ్డి

వైభవం.. సత్యసాయి శతజయంత్యుత్సవం

భక్తులతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, బుక్కపట్నం, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి వేడుకతో పుట్టపర్తి జనసంద్రంగా మారింది. బాబా మహాసమాధి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రైల్వేస్టేషన్, విమానాశ్రయం, గణేశ్ కూడలి మీదుగా ప్రశాంతి నిలయం వరకు ప్రధాన రహదారి భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రధాన ద్వారం వద్ద భక్తులు సాయిగీతాలను ఆలపించటం, స్తుతించటం సందడిగా మారింది. బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తూ నగర సంకీర్తనలు చేశారు. ఎవరినోటా విన్నా "సాయిరాం" అన్న నామమే వినిపించింది. విదేశీ భక్తులు సైతం నగర సంకీర్తనలో పాల్గొన్నారు.

వాసవీ సత్రంలో భోజనాలు వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

పుట్టపర్తికి పోటెత్తిన భక్తులు

ఉదయం నుంచి రాత్రి వరకు నారాయణసేవ

ప్రశాంతినిలయంతో పాటు పడమర ద్వారం, గణేష్‌కూడలి, రైల్వేస్టేషన్, కర్ణాటకనాగేపల్లి వద్ద మహిళలు, పురుషులకు వేర్వేరు కౌంటర్ల ద్వారా సేవాదళ్ సభ్యులు ఉదయం 6 నుంచి రాత్రి 11గంటల వరకు భోజనం, వసతి కల్పించారు. మందిరంలో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా బ్యాటరీ వాహనాల ద్వారా చేర్చారు.

అంతర్జాతీయ వైద్యశిబిరంలో రద్దీ

వేడుకలకు తరలివచ్చిన భక్తులు అంతర్జాతీయ వైద్యశిబిరానికి వెళ్లడంతో వైద్యులు, సిబ్బంది ఎంతో ప్రేమతో సేవలందించారు. అవసరమైన పరికరాలను ఉచితంగా అందించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు 65 మంది వైద్యులు, 140 మంది సిబ్బంది దాదాపు 8,400 మందికి వైద్యసేవలందించారు.

● భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడిపారు. అనంతపురం, ధర్మవరం, పెనుకొండ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వెళ్లేవారికి చిత్రావతి హారతి ఘాట్ వద్ద, కదిరి, ముదిగుబ్బ, తిరుపతి, నల్లమాడ ప్రాంతాలకు చిత్రావతి కాజ్‌వే వద్ద నుంచి రవాణా సౌకర్యం కల్పించారు.

ఉత్సవాల్లో పాల్గొన్న సాయికుమార్ తదితరులు

బాబా చిత్రపటం ఊరేగింపు

నిత్య స్ఫూర్తి ప్రదాత!

రామగిరి, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మానవాళికి నిత్య స్ఫూర్తి ప్రదాతని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం సాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకొని బాబా చిత్రాన్ని పెన్నుతో చిత్రీకరించి భక్తిని చాటుకున్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా నృత్య కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం వీక్షకులను అలరించింది. ఆదివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ పుట్టపర్తి శిల్పారామంలో బెంగళూరు రాగిణి అయ్యర్ శిష్య బృందం ఆనంద నర్తన గణపతి, బ్రహ్మమొక్కటే... హరినారాయణ కౌత్వం మీరాభజన వంటి 13 పాటలకు అభినయించిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం నృత్య కళాకారులకు శిల్పారామం నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సాయి చూపిన సేవామార్గంలో...

సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా భక్తులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు కూడళ్లలో అన్నదానాలు చేసి, తాగునీటి సీసాలు అందించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ఉద్యోగులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

రక్తదానం చేస్తున్న భక్తులు

దశావతార పల్లకీలో బాబా చిత్రపటం ఊరేగింపు

సత్యసాయి శతజయంతిని ఆదివారం పుట్టపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు దశావతారాల తరువాత పదకొండవ అవతారం సత్యసాయిబాబా అన్నట్లుగా దశావతార పల్లకీలో బాబా చిత్రపటాన్ని, పదకొండవ పల్లకీలో విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా
పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: తలుపుల మండలంలోని ఓబీఆర్ కొత్తపల్లి చెరువు మరువ పారుతోంది. ఆ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. కల్వర్టు నిర్మిస్తే ఉపయుక్తంగా ఉంటుంది. **- గ్రామస్థులు**

సమాధానం: రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మిస్తాం.
- హనుమంతయ్య, డీఈ, పీఐయూ
– న్యూస్‌టుడే, తలుపుల

సమస్య: ధర్మవరం పట్టణంలోని తారకరామాపురం, గుట్టకిందపల్లి ప్రధాన రహదారులకు ఇరువైపులా చెత్త కుప్పలకు నిప్పు పెడుతుండటంతో పొగ వ్యాపించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలి. **- వాహనచోదకులు**

సమాధానం: చెత్తను తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్యామ్‌సన్, శానిటేషన్ అధికారి**
– న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తిని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గోకులంలో చిన్నపిల్లల పార్కు, కర్ణాటకనాగేపల్లి కూడలిలో ఏర్పాటు చేసిన పల్లె ఉమా బస్‌సెల్టర్‌ను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సత్యసాయి శతజయంతి వేడుకలకు విచ్చేసిన ప్రముఖులందరికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలుగా శ్రమించి సేవలందించిన అన్ని శాఖల అధికారులను అభినందిచారు.

పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

సర్వే ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి రెవెన్యూ డివిజన్‌లో పని చేస్తున్న సర్వే ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, కార్యదర్శిగా షహతాజ్, సంయుక్త కార్యదర్శిగా ఆదర్శ్‌రెడ్డి, కోశాధికారిగా అభిషేక్ మరో ఆరుగురిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఆర్డీఓ వీవీఎస్‌శర్మ అభినందించారు.

ఆర్డీఓ వీవీఎస్‌శర్మతో నూతన కార్యవర్గ సభ్యులు

భగవద్గీత పఠనంలో ప్రతిభ

షీల్డులు, ప్రశంసాపత్రాలతో విజేతలు

కదిరి, న్యూస్‌టుడే: గీతా జయంతిని సందర్భంగా ఆదివారం కదిరిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో భగవద్గీత కంఠస్థ పఠన తి.తి.దే. ధర్మప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. పఠన పోటీలను 6నుంచి 9వ తరగతి, 10నుంచి ప్రథమ ఇంటర్ విద్యార్థులకు రెండు విభాగాలుగా నిర్వహించారు. ఈ పోటీలలో 6 నుంచి 9వ తరగతి విభాగంలో కదిరి వాల్మీకి పాఠశాల విద్యార్థి అవంతిక ప్రథమ, ధర్మవరం విద్యార్థి సిరిలక్ష్మీ ద్వితీయ, హరీష్ పాఠశాల రూపశ్రీ తృతీయ స్థానాల్లో నిలిచారు. 10వ తరగతి, ప్రథమ ఇంటర్ విభాగంలో వాల్మీకి పాఠశాల విద్యార్థి బి.వనజ ప్రథమ, బి.ఉదయిని ద్వితీయ, ఎస్.హప్స తృతీయ స్థానాలలో ప్రతిభ చాటినట్లు తి.తి.దే ధర్మచార్యులు శేషు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాగప్ప, కె.సుందరమోహన్‌రెడ్డి, బి.నారాయణప్ప, సి.బయన్న, ఓంప్రకాష్ వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంత జిల్లా తి.తి.దే ఉద్యోగి రామమోహన్, కె.బాబు, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తచెరువు కూడలిలో సందడి

కొత్తచెరువు: శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలతో ఆదివారం సందడి నెలకొంది. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు పుట్టపర్తికి తరలివెళ్లారు. పెనుకొండ, ధర్మవరం మార్గాల వైపు నుంచి వాహనాలు కూడలి మీదుగానే వెళ్లాల్సి ఉండటంతో ఉదయం రెండు గంటల పాటు వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు నియంత్రించడంతో రాకపోకలు సాఫీగా సాగాయి. కూడలిలోని ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, బుక్కపట్నం రోడ్లలో పలువురు సత్యసాయి చిత్రపటాల దగ్గర పూజలు నిర్వహించి నివాళులర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

కొక్కంటిక్రాస్(తనకల్లు), న్యూస్‌టుడే: కొక్కంటిక్రాస్‌లో ఏడుగురు గర్భిణులకు సత్యన్నసేన ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సంకు వెంకటరమణ, విశ్వనాథ పాల్గొన్నారు.

తాడిమర్రి: పూజలు చేస్తున్న కార్మికులు

చెన్నేకొత్తపల్లి: కేక్ కోస్తున్న భాజపా నాయకులు

ప్రేమమూర్తికి ప్రత్యేక పూజలు

ప్రేమమూర్తి సత్యసాయిబాబా శత జయంతిని ఆదివారం భక్తులు వైభవంగా జరుపుకొన్నారు. సత్యసాయి చిత్రపటాలకు పూజలు చేశారు. బాబా సంకీర్తనలను ఆలపించారు. కేకులు కోశారు. అన్నదానాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి బృందం, చెన్నేకొత్తపల్లి

నల్లమాడ: శిర్డీసాయిబాబా గుడిలో..

తలుపుల: బాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భక్తులు

ధర్మవరం: భక్తులకు అన్నదానం

ధర్మవరం: సాంస్కృతిక మండలి వద్ద సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం పట్టణం: ఉన్నతాధికారుల చర్యలతో వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల ప్రాణాల మీదకు వస్తున్నాయని ఏపీ విలేజ్, వార్డు అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మహబూబ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత శనివారం జీవీఎంసీ పరిధిలో వార్డు వెల్ఫేర్ నూకరాజు అధికారుల ఒత్తిడి తాళలేక హఠాన్మరణం చెందాడన్నారు. దీనికి కారణమైన ఆ జోన్-3 కమిషనర్ శ్రీచక్రవర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పోటీలో పాల్గొన్న ఇరుజట్ల క్రీడాకారులు

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీనియర్స్, జూనియర్స్ జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన సీనియర్స్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఇందులో షాదాన్ 90, నర్సింహా 25, మహమ్మద్ 25 పరుగులు చేశారు. బౌలర్లు సాయి, తరుణ్, నందు రెండేసి వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన జూనియర్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 210 పరుగులతో ఓటమి చెందింది. ఇందులో ప్రణయ్ 85, సాయి 40, దేవేంద్ర 20 పరుగులు చేశారు. బౌలర్లు బాదల్‌వలి మూడు, గనీమ్ 2 వికెట్లు తీసినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మధ్యాహ్నం అండర్-12 జట్టుకు మ్యాచ్ జరిగిందన్నారు. ప్లేయర్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు నాగరాజు, శీనా, గణేష్, మహబూబ్ బాషా, అనిల్, ముబారక్ పాల్గొన్నారు.

పశువులకు మేతగా అరటి

అరటి ధరలు భారీగా పడిపోయాయి. టన్ను రూ.వెయ్యి నుంచి రెండు వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో కాయలను కోనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో తోటల్లోనే అవి మగ్గిపోతూ.. రాలిపోతున్నాయి. చేసేది లేక రైతులు కాయలను పశువులకు మేతగా తరలిస్తున్నారు. తాడిమర్రి మండలం చిల్లకొండాయపల్లి గ్రామానికి చెందిన జనార్ధన్ అనే రైతు మూడెకరాల్లో రూ.2.50 లక్షలు ఖర్చుచేసి అరటి పంట సాగు చేసారు. ధర లేకపోవడంతో పశువుల మేతగా రోజు అర టన్ను కాయలను తరలిస్తున్నారు. **– న్యూస్‌టుడే, తాడిమర్రి**

రహదారికి మోక్షమెన్నడో?

కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో గాండ్లపెంట, రెక్కమాను, ధనియానిచెరువు తదితర గ్రామాల సమీపంలో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వర్షం పడినప్పుడు గుంతల్లోకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. ఈవిషయమై ఆర్‌అండ్‌బీ డీఈ గిరి వివరణ కోరగా కదిరి నుంచి ఎన్పీకుంట వరకు ఐదు చోట్ల సుమారు 1.65 కిలోమీటర్ల మేర సీసీ రహదారులకు రూ.2.70 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. **– న్యూస్‌టుడే, గాండ్లపెంట**

పదోన్నతుల్లో న్యాయం చేయండి

డిప్యూటీ సీఎం ఓఎస్‌డీకి వినతి అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతుల్లో జోన్-4 పంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణకి డీఎల్‌డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పదోన్నతుల్లో మినిస్ట్రీయల్ సిబ్బందికి 80 శాతం ఇవ్వడం వల్ల పంచాయతీ కార్యదర్శుల కోటాలోని వారికి అన్యాయం జరుగుతోందని, పంచాయతీ కార్యదర్శుల కోటా పదోన్నతులు మాకే ఇచ్చివిధంగా చర్యలు తీసుకోవాలని వారు ఓఎస్‌డీని కోరారు. గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు ఇవ్వడం లేదా అడ్‌హక్ ద్వారా డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శులు భాస్కర్, విజయ్, గోపీనాథ్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శిథిల గదులు.. అరచేతిలో ప్రాణాలు

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల మండలంలోని పులిగుండ్లపల్లి పంచాయతీ జ్యోతివాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల గదులు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు పెచ్చులూడుతోంది. గత్యంతరం లేక ఆ భవనంలోనే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని ఉపాధ్యాయురాలు రమణమ్మ వాపోయారు. పాఠశాలలో 9 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎప్పుడో నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రెండు గదులకుగాను ఒకటి పూర్తిగా శిథిలమైంది. మరో గదిలోనూ పెచ్చులూడి పడుతూ శ్లాబ్‌కు అమర్చిన ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. విద్యార్థులు అక్కడే ఓ మూలన కూర్చొని బిక్కుబిక్కుమంటూ విద్యా బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడేమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో వెంకటరాముడును వివరణ కోరగా ప్రభుత్వానికి నివేదించాము. నిధులు మంజూరు కాగానే నూతన గదుల నిర్మాణం చేపడతామన్నారు.

పెచ్చులూడుతున్న గదిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

సామగ్రి దగ్ధం

ఓబుళదేవరచెరువు: మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన బీరే కరుణాకర్‌నాయుడు ఇంటిలో ఆదివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో ఫ్రిజ్, బీరువాతో పాటు తిండిగింజలు కాలిబూడిదైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయారు.

రాయితీ ఉలవలకు తగ్గిన డిమాండ్

తలుపుల, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న ఉలవలకు అన్నదాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అదును, పదును పోయాక పంట సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు కూడా దక్కవని రైతులు చెబుతున్నారు. ఉలవలను గత నెల 11 నుంచి 24 మధ్యలో వచ్చిన చిత్తకార్తెలోనే ఎక్కువగా సాగు చేశారు. ప్రభుత్వం ఒక్కో రైతు సేవా కేంద్రానికి 30 క్వింటాళ్ల చొప్పున 13 ఆర్ఎస్‌కేలకుగాను 390 క్వింటాళ్లు సరఫరా చేసింది. 10 కిలోల ప్యాకెట్ ధర రూ.448 కాగా ఇందులో రూ.336 రాయితీ పోను రైతు రూ.112 మాత్రమే చెల్లించాల్సి ఉంది. తక్కువ మొత్తం కూడా చెల్లించి తీసుకుపోవడానికి రైతులు ఆసక్తి చూపించలేదని అధికారులు సైతం చెబుతున్నారు. ఈనెల 14 నుంచి ఉలవలను మండలంలో పంపిణీ చేస్తున్నా ఇప్పటివరకు రైతులు సగం కూడా తీసుకుపోలేదని ఏఈవో రాఘవేంద్రనాయక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని కొడవండ్లపల్లి గ్రామంలో ఆదివారం కుళ్లాయప్ప అనే పాడిరైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గడ్డిని మేసేందుకు వెళ్లిన ఆవు విద్యుత్తు తీగలను తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. సుమారు రూ.90 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. విద్యుత్తు శాఖ అధికారులు తీగలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతు ఆరోపించారు. ఈ మేరకు ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం దుకాణానికి నిప్పు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలాజీ మద్యం దుకాణానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లింది. దుకాణ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం దుకాణంలో మంటలు చెలరేగుతున్నాయని సమాచారం వచ్చింది. అక్కడకు వెళ్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దుకాణంలోని లక్షల్లో సరకును నిల్వ చేసినట్లు చెప్పారు. అది పూర్తిగా దగ్ధమైనట్లు వాపోయారు. కొంత నగదు కూడా కాలిపోయిందన్నారు.

కారు పార్కింగ్ విషయంలో ఘర్షణ

కారులో వచ్చిన వారిపై దాడి చేస్తున్న హోటల్ సిబ్బంది

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి అంబేడ్కర్ కూడలిలో కారు పార్కింగ్ విషయంలో చోటుచేసుకున్న వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కదిరి అమీన్ నగర్‌కు చెందిన ధనుంజయ తమ బంధువులను ఇంటికి తీసుకెళ్లేందుకు కారులో వచ్చి ఓ హోటల్ ఎదుట ఆపారు. అయితే కారును అడ్డుగా ఆపొద్దని హోటల్ సిబ్బంది ఆయనకు సూచించారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాట పెరగడంతో హోటల్ సిబ్బంది ధనుంజయపై దాడికి దిగారు. అడ్డుకునేందుకు వచ్చిన బంధువులనూ చితకబాదారు. అరుపులు కేకలతో ఆ ప్రాంతం కాసేపు దద్దరిల్లింది. పెద్దసంఖ్యలో జనం గుమికూడటంతో పోలీసులు చేరుకుని గుంపును చెదరగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన నరసింహ, మురళి, బాదుల్లా, శేషగిరి, శివతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యసాయినగర్‌లో చెత్త విషయమై ఆదివారం కృష్ణమ్మ, శంకరయ్య దంపతులతో గాయత్రి, శేఖర్ దంపతులు గొడవపడ్డారు. తమ ఇంటి ముందు చెత్త వేస్తుండటంతో ప్రశ్నించినందుకు వారు కర్రతో దాడి చేసి గాయపరిచారని కృష్ణమ్మ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

(c) eenadu

నిశీధి వేళ మృత్యుఘోష..!

● ఎత్తురాళ్లపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● దైవ దర్శనానికి వెళ్తున్న నలుగురు మధ్యప్రదేశ్ వాసుల మృతి, మరో నలుగురి పరిస్థితి విషమం

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి, నరసన్నపేట

వారంతా దైవ దర్శనానికి ఎంతో ఉత్సాహంగా బయలుదేరారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటూ ముందుకు సాగుతున్నారు. నిశీధి వేళ వెంటాడిన మృత్యువు నిద్రలో ఉన్న కొందరి ఊపిరి తీసేసింది. కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మధ్యప్రదేశ్ వాసులు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు

భురేసింగ్ పవార్



విజయసింగ్ తోమర్

ఖసియాల్‌సింగ్

పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన 9 మంది బంధువులు వివిధ రాష్ట్రాల్లో దేవాలయాలను సందర్శించడానికి ఓ వాహనంలో బయలుదేరారు. పూరీలో జగన్నాథస్వామిని దర్శించుకుని శ్రీశైలం పయనమయ్యారు. గాఢ నిద్రలో ఉండగా వాహనం ఎత్తురాళ్లపాడు వద్దకు చేరుకునే సరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. భారీ శబ్దం, చిమ్మ చీకటి.. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఏం జరిగిందో తెలిసేలోపే నలుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. డ్రైవర్‌తో సహా ఆరుగురు గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం తెలియగానే ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులు ఖర్గోన్, ఖండ్వా జిల్లాలకు చెందిన వారని గుర్తించారు. ఘటనలో విజయసింగ్ తోమర్ (65), భురేసింగ్ పవార్ (60), ఖసియాల్‌సింగ్ (65), మహిళ సంతోషిభాయ్ (60) దుర్మరణం చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి తరలించారు. గాయపడిన డ్రైవర్ సునీల్‌సింగ్ పటేల్, శకుంతల తోమర్, షేరాభాయ్‌పటేల్, సంతోషిభాయ్, సావిత్రిభాయ్, సుమన్‌భాయ్‌లను నరసన్నపేట తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యులకు సూచించారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సత్యనారాయణ ఉన్నారు.

ఆగని రుధిర ధార..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం, కాశీబుగ్గ

జిల్లాలో రహదారులు తరచూ రక్తమోడుతున్నాయి. 3 నెలలకోసారి రోడ్డు ప్రమాదాలపై జిల్లా యంత్రాంగం సమీక్షించి అప్రమత్తమవుతున్నా ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు, ట్రాఫిక్ విభాగాలు వాహనాల వేగాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తున్నా ప్రమాదాలు చోటుచేసుకుని మృత్యువాత పడుతున్నారు.

కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో నజ్జయిన వాహనం

ఈ స్టేషన్ల పరిధిలోనే అధికం..

జాతీయ రహదారిపైనే ఎక్కువ ప్రమాదాలు

జిల్లాలో 163 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. దీనిపై 36 బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి, సోంపేట, బారువ, మందస, కాశీబుగ్గ, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం గ్రామీణం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

★ జాతీయ రహదారిపై పలాస మండలం శాసనాం నుంచి నెమలినారాయణపురం వరకు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 1, 2 తేదీల్లో ఒకేచోట జరిగిన ఘటనల్లో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ మార్గంలో నెలకు సగటున రెండు ప్రమాదాలు జరుగుతున్నాయి.

● ఆగస్టు నుంచి ఈ నెల 23 వరకు చోటుచేసుకున్న

ప్రమాదాలు: 125

మృతులు: 48 మంది

కారణాలివే..

★ జాతీయ రహదారిపై 80 కిలోమీటర్ల వేగానికి మించి ప్రయాణించడం ★ యూటర్న్‌లు, కూడళ్లలో నిర్లక్ష్యంగా మలుపు తిప్పడం. ★ గ్రామాల వద్ద ఇరువైపులా చూడకుండా రోడ్డు దాటించడం. ★ ఎత్తు పల్లాలున్న చోట నియంత్రణ కోల్పోవడం. ★ ఎక్కువగా రాత్రి వేళ, తెల్లవారుజామున ప్రమాదాలు జరుగుతున్నాయి.

వేగంగా నడపడంతోనే..

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళ చోదకులు విశ్రాంతి లేకుండా వేగంగా వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

సాయి దివ్య రూపం.. జ్ఞాన కాంతి దీపం

జిల్లావ్యాప్తంగా ఆదివారం సత్యసాయి శతజయంత్యుత్సవాలు కనులపండువగా నిర్వహించారు. బాబా మందిరాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి సంకీర్తనలు ఆలపించారు. రథోత్సవం, ఊరేగింపు వైభవంగా జరిగాయి. మహిళల కోలాటం, పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అన్నిచోట్లా అన్నసమారాధనలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని సత్యసాయి పెద్ద మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలువురు ప్రముఖులు బాబాకు పూజలు చేస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

కుట్టడం ఆపం..! నిద్ర పట్టనివ్వం..!

● పట్టణాల్లో దోమల దండయాత్ర

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం

న్యూస్‌టుడే పరిశీలన

జిల్లాలోని పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం.. ఇళ్ల ముందే వాడుక నీరు నిలిచి ఉండటం.. దోమల నివారణకు మందు పిచికారీ చేయకపోవడం, ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరడం ఇతర కారణాలతో ప్రజలకు కంటి మీద కునుకు ఉండటం లేదు. మురుగుదొడ్ల గొట్టాలకు నెట్ కట్టకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. మరోవైపు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నా సమస్య పరిష్కారం కాకపోగా తీవ్రత పెరుగుతుండటం గమనార్హం.

మూలకు చేరిన యంత్రాలు

✪ పలాస - కాశీబుగ్గ ✦31 ▼16 ✷64 వేలు

జంట పట్టణాల పరిధిలో మురుగు గుంతలు, వాడుక నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో దోమల మోత తప్పడం లేదు. రెండు ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. పారిశుధ్య కార్మికుల కొరత, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. 2025-26 బడ్జెట్‌లో సుమారు రూ.3 లక్షలు కేటాయించగా ఫాగింగ్‌కు సంబంధించి నిధులు ఖర్చు చేయలేదు.

✪పురపాలక సంఘం ✦వార్డులు ▼సచివాలయాలు ✷జనాభా

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

పని చేస్తున్నవి రెండే..

✪ ఇచ్ఛాపురం ✦23 ▼10 ✷46 వేలు

నాలుగు ఫాగింగ్ యంత్రాలు ఉండగా రెండే పని చేస్తున్నాయి. రోజూ సాయంత్రం వాటిని వినియోగించాల్సి ఉన్నా వారంలో నాలుగు రోజులు వివిధ వార్డుల్లో తిప్పుతున్నారు. 2025-26 బడ్జెట్‌లో రూ.1.50 లక్షలు కేటాయించగా ఈ నెల 23 వరకు రూ.60 వేలు వినియోగించినట్లు లెక్కల్లో చూపారు.

ప్రజలపై ఆర్థిక భారం

పట్టణాల్లో ఏడాది పొడవునా దోమలు విజృంభిస్తుండటంతో ద్రావణాలు, అగరబత్తీలు వినియోగిస్తున్నారు. నెలకు ఒక్కో కుటుంబం రూ.200 వరకు ఖర్చు చేస్తోంది. ద్రావణాల వినియోగంతో వృద్ధులు, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తప్పని ఇక్కట్లు

నాలుగు ఫాగింగ్ యంత్రాల్లో రెండు పని చేయకపోగా.. అందుబాటులో ఉన్నవీ వినియోగించడం లేదు. మురుగు గుంతల్లో లార్వా నివారణకు రసాయనాలు పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.6 లక్షలు కేటాయించగా.. రూ.3.50 లక్షలు ఖర్చు చేశారు.

✪ ఆమదాలవలస ✦23 ▼11 ✷49 వేలు

భారీ వ్యయం.. ఫలితం శూన్యం

✪ నగరపాలకసంస్థ : శ్రీకాకుళం
✦ డివిజన్లు: 50
▼ వార్డు సచివాలయాలు: 48
✷ జనాభా: 1.85 లక్షలు

ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా ఇటీవల వినియోగించిన దాఖలాలు లేవు. నీరు నిలిచి ఉన్న ప్రాంతాలు, కాలువల్లో గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్ వేయడం, ఇతర రసాయనాలు వాడటం లేదు. 2025-26 బడ్జెట్‌లో రూ.15 లక్షలు కేటాయించగా ఇప్పటివరకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు.

ఇంట్లో పోగులు.. కళ్లలో సుడులు..!

న్యూస్‌టుడే, లావేరు

తెల్ల బంగారంగా పిలుచుకునే పత్తి పంట సాగు చేసిన రైతుల కళ్లల్లో కన్నీరు తెప్పిస్తోంది. తొలి దశలో వర్షాలు సకాలంలో కురవక కొంత మేర నష్టపోగా చేతికందే సమయానికి తుపాను ప్రభావంతో చాలావరకు దెబ్బతింది. ఉన్న కాస్త పంటను అష్టకష్టాలు పడి కాపాడుకుంటే మద్దతు ధర, విక్రయించుకునే దారి కనిపించక.. ఇంట్లో నిల్వ ఉంచలేక ఆవేదన చెందుతున్నారు.

ఎచ్చెర్ల మండలం అదపాకలో నిల్వ చేసిన పత్తి

పాలాల్లోనే వదిలేస్తున్నారు..

● ఖరీఫ్‌లో లావేరు, కొత్తూరు, మందస, రణస్థలం, హిరమండలం, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, ఎచ్చెర్ల, జి.సిగడాం తదితర మండలాల్లో 1,970 ఎకరాల్లో పత్తి సాగు చేశారు.

● పొలాల్లో తీసిన పంటను గత 2 నెలలుగా ఇళ్లలోనే దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కోత ఖర్చులు దండగని కొన్ని చోట్ల పొలాల్లోనే వదిలేస్తున్నారు.

దళారుల దందాతో రైతులకు ఇబ్బందులు

మండలం	సాగు (హెక్టార్లలో..)
లావేరు	400
కొత్తూరు	200
మందస	67
రణస్థలం	50

● దళారులంతా ఒకటై వారికి నచ్చిన ధర నిర్ణయిస్తున్నారు. గ్రామాల్లో వారి దందా జోరుగా నడుస్తోంది. ప్రస్తుతం పంట బాగుంటే క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు కొనుగోలు చేస్తున్నారు.

తగ్గిన దిగుబడులు

★ వర్షాభావం, వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

★ ఎకరా సాగుకు సుమారు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు అవుతోంది.

★ బాగా పండితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. ఈ పరిస్థితి జిల్లాలో ఎక్కడా లేదు.

రాజాం వెళ్లాల్సిందే..

● కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈ ఏడాది క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది.

● గిట్టుబాటుకు విక్రయించాలంటే విజయనగరం జిల్లా రాజాంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలి. అక్కడికి వెళ్లాలంటే రవాణా, కూలీ, ఇతర ఖర్చులు రైతులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. తేమ శాతం ఎక్కువగా ఉంటే తిరిగి పంపుతున్నారని వాపోతున్నారు.

● జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటే సుమారు 8 వేల ఎకరాల్లో పంట సాగు చేయాలని అధికారులు చెబుతున్నారు.

● ఇళ్లలో పంటను ఉంచుకోలేక.. విక్రయించుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెగుళ్లు, వర్షాల బెడదను అధిగమించి కాపాడుకుంటే అమ్ముకోవడానికి అష్టకష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి..

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు సంబంధించి రాజాం, సాలూరు, రామభద్రపురంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ-పంటలో నమోదు చేసుకున్న రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలు వద్ద విక్రయించుకోవచ్చు. 8 నుంచి 12 మధ్యలో తేమ శాతం ఉంటే పంటకు మంచి మద్దతు ధర వస్తుంది. దళారులను నమ్మి మోసపోవద్దు.

– బి.రవికుమార్, ఏడీ (ఎఫ్ఏసీ), మార్కెటింగ్ శాఖ, శ్రీకాకుళం

ఆదిత్యుని ఆదాయం రూ.7.68 లక్షలు

అరసవల్లిలో సూర్యనారాయణస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొందరు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఇంద్రపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.7.68 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



చెకుముకి పోటీల్లో సత్తా

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. సారవకోట మండలం చినకిట్టాలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్రైవేటు విభాగంలో శ్రీకాకుళం నగరంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

మొదటి బహుమతి పొందిన చినకిట్టాలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉజ్జిడిమెట్టను ఊడ్చేస్తున్నారు..!

రాత్రి వేళ యథేచ్ఛగా కంకర తవ్వకాలు

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస, మందస మండలాల రెవెన్యూ పరిధి ఉజ్జిడిమెట్టలో కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి వేళ యంత్రాలతో ఇష్టానుసారం తవ్వేసి టిప్పర్లలో లేఅవుట్లకు తరలిస్తున్నారు. మూడేళ్ల కిందట విశాఖపట్నంలోని ఓ కార్పొరేట్ స్థిరాస్తి సంస్థ ఇక్కడ లేఅవుట్ వేయగా మావోయిస్ట్ పార్టీ పేరిట హెచ్చరికలు వచ్చాయని కార్యకలాపాలు ఆగిపోయాయి. కొన్ని రోజులుగా అదే ప్రాంతంలో కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

★ పలాస, మందస మండలాల పరిధిలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉజ్జిడిమెట్ట ఉంది.

★ కొన్ని దశాబ్దాలుగా పనికి రాని మొక్కలతో ఉండేది.

★ వైకాపా పాలనలో పలాసకు చెందిన కొంత మంది నుంచి విశాఖకు చెందిన ఓ కార్పొరేట్ స్థిరాస్తి వ్యాపార సంస్థ కొనుగోలు చేసి లేఅవుట్ వేసింది.

★ అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు నిర్వాహకులకు సహకారం అందించారని పేర్కొంటూ మావోయిస్ట్ పార్టీ పేరిట హెచ్చరిక లేఖ విడుదలైంది.

★ ఉజ్జిడిమెట్ట మావోయిస్టు అమరుల కుటుంబీకులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించినట్లు ప్రచారం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఆ సంస్థ నిర్వాహకులను హెచ్చరించడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి.

★ కొన్ని రోజులుగా రాత్రి వేళ యంత్రాలతో కంకర తవ్వేస్తున్నారు. రోజూ పెద్దఎత్తున టిప్పర్లలో తరలిస్తుండటంతో ఉజ్జిడిమెట్ట రూపు మారిపోయింది. ఈ విషయమై ఆర్డీవో జి.వెంకటేశ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా 'ఆ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ పరిధిలో ఉంటే చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

(c) eenadu

లెక్క తెలిస్తే.. నగదు ఆదా..!

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే

మనం వినియోగించే విద్యుత్తును యూనిట్లలో కొలుస్తారన్నది తెలిసిందే. మరి ఆ యూనిట్లు ఖర్చవుతున్న కొలది ధర మారుతుందని వినియోగదారులు గుర్తించాలి. అవగాహనతో విద్యుత వాడితే ఛార్జీలు సైతం తగ్గుతాయి. అసలు ఎంత ఖర్చవుతుంది తదితర వివరాలన్నీ బిల్లులోనే ఉంటాయి.

● పలాస పట్టణానికి చెందిన ఒక వ్యక్తి 138 యూనిట్లు వినియోగించడంతో రూ.828 బిల్లు రాగా మరో వ్యక్తి 125 యూనిట్లు వాడితే రూ.562.5 మాత్రమే కట్టారు. 13 యూనిట్ల తేడాకు మొదటి వ్యక్తి రూ.266లు కట్టాల్సి వచ్చింది. యూనిట్ల వినియోగంపై అవగాహన ఉంటే ప్రతి వినియోగదారుడు డబ్బులు ఆదా చేయొచ్చు.

● విద్యుత్తు బిల్లులు విద్యుత్తు శాఖ కార్యాలయానికి వెళ్లకుండా ఆన్‌లైన్‌లో చెల్లించేయొచ్చన్న విషయం తెలిసిందే. ఇందుకు కొన్ని యాప్‌లు ఉపయోగిస్తారు. అలా వేరే యాప్‌నకు వెళ్లకుండా బిల్లుపైనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కట్టేయొచ్చు.

● యూనిట్ల వినియోగం కంటే అధిక బిల్లు వచ్చినా.. ఇతర ఏ సమస్య అయినా.. ఈపీడీసీఎల్ యాప్, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. లేదా టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయొచ్చు.

గృహ విద్యుత్తు ఛార్జీలు ఇలా..

యూనిట్లు	ధర (రూ.లలో)
0-30	1.90
30-75	3.00
76-125	4.50
126-225	6.00
226-400	8.75
401పైన	9.75

వాణిజ్య విద్యుత్తు ఛార్జీలు ఇలా..

యూనిట్లు	ధర (రూ.లలో)
0-50	5.40
51-100	7.65
101-300	9.05
301-500	9.60
500 పైన	10.15

● ఏపీఈపీడీసీఎల్ సంస్థ బిల్లు వెనక భాగంలో గృహ, వాణిజ్య వినియోగం సంబంధించి యూనిట్లు, ధరలు పట్టిక సైతం ముద్రించారు. ఆ ప్రకారం విద్యుత్తు వినియోగించొచ్చు.

● జిల్లాలో అన్ని రకాల విద్యుత్తు కనెక్షన్లు దాదాపు 8 లక్షలు ఉన్నాయి. సుమారు రూ. 50 కోట్లకు పైగా ఆదాయం విద్యుత్తు శాఖకు సమకూరుతుంది.

నైతిక విలువలు పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకంగా వ్యవహరిస్తోందని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఎన్‌సీసీ అధికారి వై.పోలినాయుడు పేర్కొన్నారు. 78వ ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం ఎన్‌సీసీ ద్వారా అలవడతాయన్నారు. స్వచ్ఛభారత్, పునీత సాగర్ అభియాన్, ఫిట్ ఇండియా, రక్తదాన శిబిరాలు తదితర వాటికి సంబంధించి అవగాహన కల్పించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎన్‌సీసీ అధికారి మేజర్ వంగా మహేష్, సీనియర్ వింగ్ గర్ల్స్ కేర్ టేకర్ ఎం.పావని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వై.పోలినాయుడు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉద్యోగుల ఉమ్మడి హక్కుల సాధనకు ఉద్యోగులంతా ఐక్యంగా పనిచేయాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్, రెవెన్యూ సర్వీసుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం వచ్చిన ఆయన రెవెన్యూ అతిథి గృహంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉద్యమం చేయడం ఏపీ జేఏసీ ప్రధాన లక్ష్యం కాదని, సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని, తప్పకుండా ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వీలైనంత త్వరలో పరిష్కారం చూపుతారనే నమ్మకం ఉందన్నారు. 2026 ఫిబ్రవరి 5న ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్, కె.శ్రీరాములు, సెక్రటరీ జనరల్ ఎస్.వి.రమణ, మహిళా విభాగం ఛైర్మన్ ప్రవల్లిక ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

అర్జీల స్వీకరణ

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలపై వినతులను స్వీకరించారు. దివ్యాంగులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే చరవాణిలో అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.

కలప రవాణాకు అడ్డేదీ?

జి.సిగడాం మండలంలో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. చెట్లు నరికి రాజాం మండల కేంద్రంలో కర్రల డిపోలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. వాల్టా చట్టం కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కలప పట్టణాలకు తరలిపోతోంది. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సరిత వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం

నీరందించండి.. కాపాడండి..!

గార (చల్లపేట), న్యూస్‌టుడే: చివరి దశలో ఉన్న వరి పంటకు నీరందించాలని గార మండలం అంపోలు, చల్లపేట, లింగాలవలస, దీపావళి ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు అధికారులను కోరారు. వంశధార కుడి కాలువ శివారు ఆయకట్టులో అంపోలు, గొంటి పంచాయతీల్లో మొంథా తుపాను కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో పంటకు నష్టం కలిగి మళ్లీ నాట్లు వేయాల్సి వచ్చిందని మరో తడి కావాలని, 200 ఎకరాలకు నీరు అవసరమవుతుందన్నారు. వంశధార ఏఈ సురేష్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఈ నెలాఖరు వరకు కాలువ ద్వారా నీరు అందిస్తామన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P. 133/2019 IN A.R.C. 196 /2015

BETWEEN:
M/s Shriram City Union finance ltd having its Registered office at 123, Angappa Naiken Street, Chennai, and having its Administrative office At 3-6-478, 4th floor, Anand Estates Liberty road Himayath Nagar, Hyderabad, having its branch Office at Srikakulam represented by its GPA Sri. K.V.Ramana, Now Represented by its GPA Holder Sri. P.Jagadeswara Rao ..Decree Holder
AND
K.TIRUMALA RAO & ANOTHER ..Judgment Debtor
R1. K. Tirumala Rao, S/o Krishna Murthy, D.No.1-187, Venkateswara Rao Colony, Tekkali (Vill. & Mandal), Srikakulam Dist.
R2. K. Ramprasad, S/o Appa Rao, Bhavani Nagar,Tekkali (Vill. & Mandal), Srikakulam Dist.

వేలం ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేదీ 11-12-2025 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS :
Schedule-I (property covered under document No 948 / 2012) Srikakulam dist tekkali sub-registry. Tekkali mandalam, Parusurampuram Panchayath and village accounts two bits of dry land covered by S.No 42/1A an extent of A.c 0.48 cents and S.No. 44 / 2008 an extent of A.c. 0.29 cents totaling an extent of A.c.0.77 cents of vacant land is bounded by.
Item No 1: An extent of A.c 0.48 Cents covered by S.No 42/1A is Bounded by East: wet land of Korada Attachhalamma, South: Water flowing canal, West: wet land of Thadina Rama Swamy, North: wet land of Thadina Rama Swamy
Item No 2: An extent of A.c 0.29 Cents covered by S.No 44/8 is Bounded by, East: wet land of Bandapu Sreeramulu, South: Water flowing canal, West: wet land of Thadina Rama Swamy, North: wet land of Sadhu Charam Mahapatro.
Schedule-II (property covered under document No 1007/2012), Srikakulam district, Tekkali sub-registry, Tekkali mandalam, Akkavaram Panchayath Syamsundarapuram village accounts S.No 290/1 an extent of A.c.0.25 out of total Extent of A.c.1.00 cents southern side mango tope is bounded By East: Dry land of Gunta Vanamma & Jagati Metturalli Etc., South: Mango tope of Potnuru Savitramma, West: dry land of Vallabha Bharamaramba, North: Dry land of Dasari Padmavathi.
DHR value : 13,00,000/- Amine Value : 30,00,000/-
Hearing date : 11-12-2025 Further Hearing date : 22-12-2025
MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Phone No : 9849178948, 9704986271, 9866509590, 9849824246

మూడువారాల కిందట.. బాహుదానది ఉగ్రరూపం

బాహుదా.. నెలలో ఇంత డీలా

మొంథా తుపాను ప్రభావంతో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు గత నెల 27, 28 తేదీల్లో బాహుదానది ఉగ్రరూపం దాల్చింది. 51వేల క్యూసెక్కులు వరద చేరడంతో 500 హెక్టార్ల వరకు పంటలు దెబ్బతిన్నాయి. నదీతీరంలో 25 అడుగుల ఎత్తులో ఉన్న శివయ్య పీకల్లోతు వరకు నీట మునిగారు.. అదంతా రెండో వారానికే క్షీణదశకు రావడంతో, బెల్లుపడ రైతులు మేల్కొని, శ్రమదానంతో నీటికి అడ్డుకట్ట వేశారు. దీంతో ఉత్తరాయణం వద్ద కాస్తా నీరు నిలిచింది. బాహుదా రోడ్డు, రైలు వంతెనల నడుమ నీరు చాలా వరకు క్షీణించి, కాలువలా మారింది. నీటికి ఎక్కడా అడ్డుకట్ట లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



ఇప్పుడిలా

EENADU Classifieds

REAL ESTATE

LEASE/ RENT

పెదపాడు ఈనాడు ఆఫీసు ప్రక్కన శ్రీకాకుళం హైవేకి ఆనుకొని ఎకరా20సెంట్లు ప్లాట్ లీజుకు ఇవ్వబడును. న్యూకోలనీ డైమండ్ పార్క్ దగ్గర 10సెంట్లులో ఉన్న ఇల్లు కమర్షియల్ పర్పస్ కొరకు అద్దెకు ఇవ్వబడును ✆ 9848132187, 7989939576

చరణ్ గ్రూప్‌లో మార్కెటింగ్ అవకాశాలు! మీ నైపుణ్యానికి విలువ, మీ భవిష్యత్‌కు స్థిరత్వం! ఆసక్తిగలవారు సంప్ర॥. మెడికవర్ లైన్, యూనియన్ బ్యాంక్ ఎదురుగా, శ్రీకాకుళం. ✆ 7893582285.

FACULTY/ TEACHERS

Wanted English Faculty for Higher Class. Contact : 9440609803, 9700636803.

JOBS

లలిత హోండా 2 వీలర్ షోరూమ్స్‌లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. * బ్రాంచ్ మేనేజర్స్ - కొత్తూరు, పాలకొండ * కంప్యూటర్ ఆపరేటర్(M) - శ్రీకాకుళం బ్రాంచ్‌ల కొరకు ✆9492770556, 8498884111.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).

● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. . గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, పెదపాడు విలేజ్ శ్రీకాకుళం - 532 401
వివరాలకు: 90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

భోజనం.. మరింత రుచికరం

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు : 2067 ఉన్నత పాఠశాలలు: 360 మొత్తం విద్యార్థులు: 1,34,885

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, పొందూరు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి సన్నబియ్యం అందజేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో భోజనం తినేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

● ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ్ ద్వారా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు వంట ఛార్జీలను పెంచింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా పథకం మరింత బలోపేతమవుతుందని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని కోరారు.

పెరిగిన మధ్యాహ్న భోజనం వంట ఛార్జీలు

పెంచిన ధరలు వివరాలు ఒక్కొక్కరికి

తరగతులు	గతంలో రూ.	ప్రస్తుతం రూ.
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి ఇంటర్	8.17	9.29
ఇంటర్	8.17	9.29

● ప్రస్తుతం నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం అందజేసే ఛార్జీలను ఇంకొంచెం పెంచి ఉంటే బాగుంటుందని నిర్వాహకులు అభిప్రాయ పడ్డారు. పెంచిన ధరలు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అమలు కానున్నాయి.

సాగర తీరాన.. సౌర కాంతులు..!

మండలాలు: 9 గ్రామాలు: 82	ఏర్పాటు చేయాల్సిన దీపాలు: 1726	అమర్చినవి: 797

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్, కాశీబుగ్గ

● దేవునల్తాడ గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తీరానికి నడిచి వెళ్తుండగా ఆ అంధకారంలో హైనాలు వారిపై దాడికి యత్నించాయి. చేతిలో ఉన్న సామగ్రితో అడ్డుకుని ప్రాణాలతో బయటపడ్డారు.

సముద్ర తీర ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు మత్స్యకారులకు ఎదురవుతున్నాయి. దీంతో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కోల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జిల్లాకు సీఎస్ఆర్ నిధుల కింద రూ.4 కోట్లు అందజేసింది. 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న తీరంలో సౌర విద్యుత్తు దీపాలు అమర్చనున్నారు. నెడ్‌క్యాప్ పర్యవేక్షణలో ఆర్కే సొల్యూషన్స్ సంస్థ పనులు చేపడుతోంది.



ఇచ్ఛాపురం మండలంలోని ఇద్దివాని పాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు

● జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. 11 మండలాల్లో తీరం వెంబడి అనేక మత్స్యకార గ్రామాలున్నాయి. శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 9 మండలాలు ఉన్నాయి. ఇంటి నుంచి మత్స్యకారులు తీరానికి చేరుకోవాలంటే 2 నుంచి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. నిత్యం అర్ధరాత్రి సమయంలో వలలు, ఇతర సామగ్రి తీసుకుని బయల్దేరుతారు. ఈ క్రమంలో పాములు, ఇతర విష కీటకాలు, వన్య ప్రాణుల నుంచి ప్రమాదాలు ఎదురవుతున్నాయి. దీపాలు ఏర్పాటు చేస్తే వీరికి ప్రయోజనకరంగా మారుతుంది.

● మైదానం, ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలు సాగుతుండటంతో అడవుల్లో ఆవాసాలు కరవై వన్య ప్రాణులు తీరానికి చేరుతున్నాయి. అడవి పందులు, హైనా, కోతులు, పాముల సంచారం తీరంలో ఇటీవల పెరిగింది. ఈ కారణంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మత్స్యకార సాగర్ మాల పేరిట కార్యక్రమాన్ని రూపొందించి దీపాలు ఏర్పాటు చేయనున్నారు.

● 'ఉపాధి నిధులతో తీరంలో రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నాం. సాగర్‌మాల కార్యక్రమంలో భాగంగా దీపాలు ఏర్పాటు చేస్తాం.' అని నెడ్‌క్యాప్ అభివృద్ధి అధికారి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు.

దూడ మృతిపై నిరసన

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి ఆదిత్యాలయంలో పుంగనూరు జాతికి చెందిన దూడ మృతిపై బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు అరసవల్లి సూర్యనారాయణస్వామి ఈవో కేఎన్‌వీడీ ప్రసాద్‌ను ప్రశ్నించారు. ఆదివారం ఆలయ గోశాలను పరిశీలించి నిరసన తెలిపారు. మృతికి ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈవో స్పందిస్తూ గోశాలలో 13 ఆవులు, దూడలు ఉన్నాయని భక్తులు వాటికి ఆహారం పెడుతుండటంతో అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నాయని తెలిపారు. త్వరలోనే 1.50 ఎకరాల స్థలాన్ని సేకరించి గోశాల నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఈవోతో మాట్లాడుతున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ ప్రతినిధులు

విద్యుదాఘాతంతో వంటమనిషి మృతి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పెద్దబ్రాహ్మణ వీధిలో విద్యుదాఘాతానికి గురై వంటమనిషి బిసాయి లక్ష్మణరావు (38) ఆదివారం మృతి చెందారు. ఇంటి మరమ్మతులు జరుగుతున్న సమయంలో పొరపాటున విద్యుత్తు తీగను తాకడంతో ప్రమాదం జరిగింది. కొన ఊపిరితో ఉన్న ఆయన్ను టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా, వైద్యులు సీపీఆర్ చేసి బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సోదరుడు బిసాయి రామచంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి జారి పడి ప్రయాణికుడి దుర్మరణం

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలికి చెందిన లోపింటి ఆనందరావు(39) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆనందరావు విశాఖలో కూలి పనులు చేసుకుంటున్నారు. ఆయన చెన్నై-హౌరా మెయిల్‌లో కంచిలికి వస్తున్న సమయంలో సోంపేట రైలు నిలయానికి సమీపంలో రైలు నుంచి జారి పడిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సోంపేట రైలు నిలయం స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు పలాస జీఆర్పీ ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం కళాకారుల ప్రదర్శన

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ తిరువీధిలో శాస్త్రీయ నృత్యప్రదర్శన చేస్తున్న బాలికలు

తిరుపతి మహతి కళావేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధి తిరుచానూరు పద్మావతిదేవి దేవస్థానంలో జరిగిన కార్తిక బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం కళాకారులు శాస్త్రీయ నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పట్టణంలోని వెంకటేశ్వర డాన్స్ అకాడమీ కళాకారుల బృందం బుధ, శుక్ర, శనివారాల్లో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నాగురుస్వామి, జయలక్ష్మి పట్నాయక్ తెలిపారు. కూచిపూడి గ్రామ నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు జరిగాయని, బుధవారం అమ్మవారి తిరువీధి సందర్భంగా మాడ వీధుల్లో నృత్యనీరాజనం సమర్పించారు. శుక్రవారం మహతి కళావేదికపై శనివారం శిల్పారామంలో నృత్యప్రదర్శన జరిగిందన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది శేషవస్త్రాలతో కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందించారని వివరించారు. కావ్య, శైలు, పూజ, విజయలక్ష్మి, శ్వేతారాణి, జాగృతి, దీపిక, జైత్రి, జాహ్నవి, లిఖిత, పల్లవి, సింధు, మధు, చంద్రకళ, పూజ, అక్షయ, హేమలత, సుజాత, గాయత్రి పాల్గొన్నారు.

పనులు స్తంభన.. నరక యాతన

ఇచ్ఛాపురం పురపాలకసంఘంలో రూ.60 లక్షలతో చేపడుతున్న మధ్య దీపస్తంభాల ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు 15 రోజుల కిందట గుత్తేదారు రోడ్డు మధ్య డివైడర్ పక్కన గోతులు తీసి పనులు పూర్తిచేయకుండా అలా వదిలేశారు. విద్యుత్తు తీగలు అమర్చాల్సి ఉంది.. ఆ పనులూ చేయలేదు. డివైడర్ మధ్యలో స్తంభాలను పాతేందుకు కొంత మేర డివైడర్ కాంక్రీట్‌ను తొలగించారు. ఆ వ్యర్థాలూ రోడ్డుపైనే ఉన్నాయి. పనులు జరుగుతున్నప్పుడు వాటిని గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అలా చేయకపోవడంతో పలువురు వాహనదారులు గాయపడుతున్నారు. అసలే మలుపు.. ఆపై ఇరుకు.. దానికి తోడు, వ్యర్థాలు రోడ్డుపైనే ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై సుడా డీఈఈ సురేష్ స్పందిస్తూ, గుత్తేదారుకు ప్రజాభద్రత విషయమై అవసరమైన సూచనలు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉద్యానాలు.. ఉసూరుమంటున్నాయి..

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల పరిధిలో పార్కులు అధ్వానంగా ఉన్నాయి. పాలకవర్గాలు మారుతున్నా ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో అభివృద్ధి లేక ఇలా తయారయ్యాయి. సాధారణ, ప్రత్యేక నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తే పట్టణవాసులు ఆహ్లాదం పొందే అవకాశం ఉంది.

పలాస ముత్యాలమ్మ కోనేరులో దుస్థితి

పలాస-కాశీబుగ్గ పుర పరిధి ముత్యాలమ్మకోనేరు, నెహ్రూపార్కులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జంట పట్టణాలకు చెందిన పలువురు పార్కులో నడుస్తుంటారు. దీపాలు లేకపోవడంతో రాత్రి పూట భయంభయంగా నడవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. చిన్నారులు విరిగిన పరికరాలతోనే ఆటలాడి నిరాశతో వెనుదిరుగుతున్నారు.

• కోనేరులో పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో విషకీటకాలు సంచరిస్తాయనే భయంతోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఉద్యానానికి రెండువైపులా ప్రహరీ నిర్మాణ పనులు సగంలోనే ఆగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మౌలిక సదుపాయాలు కల్పించి కాపలాదారులను ఏర్పాటు చేయాలని జంట పట్టణాల వాసులు కోరుతున్నారు.

• ఇచ్ఛాపురం పట్టణానికే కాదు.. మండలానికి కూడా ఏకైక ఉద్యానం గాంధీ పార్కు. పుర పరిధిలో రెండు పార్కులున్నా ఇదొక్కటే వినియోగంలో ఉంది. పుర పాలనలో నానాటికి తీసికట్టులా మిగిలింది. పాలకమండళ్లు రూ.లక్షలు వెచ్చిస్తున్నా ఏవీ ఉపయోగకరంగా లేవు. కనీస ఆటపరికరాలు లేవు. ఊయలలు లేవు. జలవినోదిని పేరిట ఆరేళ్ల కిందట పెట్టిన ఫౌంటెయిన్ ఏడాదిలోనే మూలకు చేరింది. ప్రస్తుతం స్టీలు కుర్చీలు, మహిళల జిమ్ ఉపకరణాలే మిగిలాయి. కంచ్రవీధి వద్ద పార్కుకు స్థలమున్నా కనీస అభివృద్ధి చేయక నిరుపయోగంగా మారింది.

• ముత్యాలమ్మ కోనేరు, నెహ్రూపార్కులో మౌలిక సదుపాయాల కల్పన కోసం పరిశీలిస్తున్నామని, త్వరలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఇ.శ్రీనివాసులు తెలిపారు.

• 'ఉద్యానం అభివృద్ధికి కౌన్సిల్ తీర్మానాలు చేశాం. ఆ నిధులతో కొంత వరకు అభివృద్ధి జరిపాం. ప్రహరీ నిర్మాణం, నడకదారి, మొక్కలు నాటడం చేశాం. ఆటపరికరాలు ఏర్పాటుకు నిధులు కేటాయించాం. గుత్తేదారు ఆలస్యం చేయడంతో పనులు జరగలేదని' కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

తీరాల్లో సందడి

డొంకూరు, లక్ష్మీపురం, అక్కుపల్లి సాగరతీర ప్రాంతాలు సందర్శకుల సందడితో కిటకిటలాడాయి. ఒడిశాతోపాటు ఆంధ్రాకు చెందిన పలువురు పర్యాటకులు సముద్రపు ఒడ్డున సేదతీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలు, పెద్దలు వనభోజనాలతో సరదాగా గడిపారు. అనంతరం సముద్ర తీరానికి వెళ్లి సముద్రస్నానాలు చేస్తూ ఉత్సాహంగా సేదతీరారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 8008574279 9063144707

?: ప్రభుత్వ ఆసుపత్రి ముఖద్వారం సమీపంలో రోడ్డు పక్కనున్న చెత్త ఇబ్బందికరంగా ఉంది - **పి.దేవరాజు, ఇచ్ఛాపురం** సమాధానం: చర్యలు తీసుకుంటాం. - **పి.ఉపేంద్రకుమార్, ఎంఎస్ఐ** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం ?: గంగువాడ ఎస్సీ వీధిలో కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ●: ప్రతిపాదనలున్నాయి. నిధులు మంజూరు కాగానే పనులు మొదలుపెడతాం. - **ఆశ, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

పలాస-కాశీబుగ్గ 18వ వార్డు రోటరీనగర్‌లో కాలువలు శుభ్రం చేశారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఆదివారం పారిశుద్ధ్య విభాగ అధికారులు స్పందించారు. రహదారికి ఇరువైపులా ఉండే పనికిరాని మొక్కలు తొలగించారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సచివాలయ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

గుంత పూడ్చారు.. మండపల్లి కూడలి వద్ద భారీ గుంతలుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత నెల 27న 'అడుగడుగునా అధ్వానమే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి రోడ్లు, భవనాల శాఖ జేఈ విక్రమ్ స్పందించారు. రోడ్డుపై గుంతను పూడ్చి సమస్య పరిష్కరించారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నడవలేం.. ముందుకు సాగలేం..

బాలకృష్ణాపురం నుంచి మునిభద్ర వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. నాలుగేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి రాళ్లు పరిచి వదిలేశారు. దీంతో అప్పటి నుంచి వాహనాలు కదలక వాహనదారులు.. నడవలేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉందని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

బండి వస్తోంది.. జరగండి!

ఇక్కడ భారీ లోడుతో వెళ్తోంది లారీ కాదు.. ట్రాక్టర్. బెండిగేటు నుంచి పూండి వైపు ఓ ట్రాక్టర్ పరిమితికి మించి నూక లోడుతో ప్రమాదకరంగా వెళ్తుంది. కాగా మరో వైపు అటు నుంచి వచ్చే వాహనదారులకు అవస్థలు తప్పలేదు. అది ఒక లైను రోడ్డు కావడంతోపాటు ఇరువైపులా బెర్ములు లేక గోతులతో భయంకరంగా మారింది. ఆయా వాహనదారులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఇసుక డంప్ కాదండీ బాబూ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఇసుక కుప్పతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పై అంతస్తు నిర్మాణ పనుల కోసం వేసిన ఇసుకపై కుక్కలు, ఆవులు మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. దీనికితోడు బస్సులు వచ్చే సమయంలో నిలుపుదల చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. గుత్తేదారుకి సమాచారం అందించి ఇసుక కుప్ప తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

దారి చూపరూ..

బిడిమి-మీలంగుగువాడ రహదారి నుంచి రాంపురం వెళ్లే మట్టి రోడ్డు ఇది. పదేళ్ల కిందట ఉపాధి పథకం ద్వారా నిర్మించారు. కనీస మరమ్మతులు లేకపోవడంతో ఏటా వర్షాలకు కోతకు గురవ్వడంతోపాటు రెండు వైపులా పొదలతో మూసుకుపోతోంది. ఎలుగుబంట్లు తిరిగే ప్రాంతం కావడంతో రాకపోకలకు జనం భయపడుతున్నారు. ఉపాధి పనులు ప్రారంభమవ్వగానే పొదలు తొలగించి, రహదారిని అభివృద్ధి చేస్తామని సర్పంచి ధర్మారావు తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

పలకల నడుమ.. ప్రమాదం

ఇచ్ఛాపురం పుర పరిధి పప్పులవీధి నుంచి రథం వీధికి చేరే మార్గంలో కాలువపై ఉన్న పలకలు ప్రమాదకరంగా మారాయి. ఉన్న నాలుగు పలకలూ సవ్యంగా లేకపోవడం, వాటి నడుమ ఖాళీస్థలం ఉండటంతో రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలకలు సరిచేసి, వాటిపై కాంక్రీటు పోరవేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మందసలో మహానగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల నృత్యం

చండీపుట్టుగలో సామూహిక కుంకుమ పూజలు

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు

సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో భజనలు చేస్తూ తిరువీధులు నిర్వహించారు. సామూహిక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధనలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో పలాస సత్యసాయి సేవాసమితి, కాశీబుగ్గ సేవా సమితి, సత్యసాయి స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి రఘురామరాజు ఆధ్వర్యంలో సంగీత విభావరి, కేక్ కోసి ఉయ్యాలోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్ఛాపురంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రఘు పాత్రుని గోపాలరావు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, పతాకావిష్కరణ, సత్యసాయి అష్టోత్తర పూజ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. విజయకుమార్ రథో కుటుంబ సభ్యులు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. – న్యూస్‌టుడే బృందం

ఇచ్ఛాపురంలో..

వజ్రపుకొత్తూరు మండలం బైపల్లిలో...

కాశీబుగ్గ సత్యసాయి సేవాసమితిలో..

పూజలందుకుంటున్న ధనరాజతులసమ్మ

లొద్దపుట్టి కూడలి వద్ద కొలువుదీరిన ధనరాజతులసమ్మ ప్రాంగణమంతా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మహిళలు పసుపు నీటితో అభిషేకాలు, కుంకుమ, సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి ఒడిశాతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. గ్రామ చల్లదనం కోసం వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక ఘటాలు సమర్పించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

వైభవంగా రుద్రాభిషేకాలు

కపాసుకుద్దిలో శ్రీరామలింగేశ్వరాలయంలో 40వ శివమండల దీక్షలు విరమణ సందర్భంగా ఆలయంలో భక్తులు రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

శోభాయాత్ర: సోంపేట: అయ్యప్ప, శ్రీరామ, శంకర, భవానీ మాల ధారణ స్వాముల శోభాయాత్ర ఆదివారం నిర్వహించారు. సోంపేట నేతాజీ నగర్‌లో శ్రీరామ సన్నిధానం వద్ద తెప్పల రవిస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. నేతాజీనగర్ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి కోదండరామస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది.

ఉపాధ్యాయ సంఘ నేతల పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేతలు

కవిటి/గ్రామీణం, న్యూస్‌టుడే: జగతి జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు పాండవ కిరణ్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో ఆ కుటుంబాన్ని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, గౌరవ సలహాదారులు బి.బాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రాట్యూటీ, పింఛనుతోపాటు కారుణ్య నియామకం రావడానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సింహాచలం, పూర్వపు అధ్యక్షుడు బెందాళం శోభనబాబు, రాష్ట్ర కౌన్సిలర్ బి.ఈశ్వర్, బి.శంకరం, నర్తు సోమేష్, తేజేశ్వరరావు, లోకనాథం, ధర్మారావు పాల్గొన్నారు. ● ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులకు గణితం బోధించే వారు కరవయ్యారని, తక్షణమే సంబంధిత ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

12 మంది జూదరుల అరెస్టు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: అక్కుపల్లి శివసాగర తీరం సమీప తోటలో ఆదివారం జూదమాడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ గ్రామీణ సీఐ తిరుపతి తెలిపారు. జూదరుల నుంచి రూ.11,300 నగదు స్వాధీన పరుచుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పశువులు అడగలేవని అలుసా..

నియోజకవర్గంలో ఇద్దరే వైద్యులు

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

మూగజీవాలకు వైద్య సేవలు సక్రమంగా అందక పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల కొరతతో పశువులకు వైద్యం అందక నాటు వైద్యులను ఆశ్రయిస్తున్నామని, సకాలంలో వైద్యం చేయలేక కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. పశువుల కోసం అమలు చేస్తున్న పథకాల విషయంలోనూ ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

పశువైద్యులు లేక మూతపడిన ఈదుపురం వైద్యశాల

ఇదీ పరిస్థితి..

ఇచ్ఛాపురం నియోజవర్గంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 10 వరకు ఆసుపత్రులుంటే ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నారు. కవిటి మండలంలో కవిటి, బొరివంక, కంచిలి మండలంలో మకరాంపురం, కంచిలి, ఎంఎస్.పల్లిలో పశువుల ఆసుపత్రులున్నాయి. కంచిలిలో పని చేస్తున్న టి.శిరీషకు రెండు మండలాల్లోని ఐదు ఆసుపత్రుల బాధ్యతలు అప్పగించారు.

● ఇచ్ఛాపురం మండలంలో ఈదుపురం, కొలిగాం, ఇచ్ఛాపురం, సోంపేట మండలంలో సోంపేట, బారువ, మామిడిపల్లి, బేసిరామచంద్రాపురం గ్రామాల్లో పశువుల ఆసుపత్రులుంటే సోంపేటలో పని చేస్తున్న పశువైద్యురాలు బి.శిరీషకు వీటి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆ ఇద్దరూ ఏ ఆసుపత్రికి సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

రెండు గేదెలు చనిపోయాయి

బొరివంక పశువుల ఆసుపత్రిలో వైద్యుడి కోసం పలుమార్లు వెళ్లినా అక్కడ ఎవరూ లేకపోవడంతో అనారోగ్యంతో ఉన్న రెండు గేదెలు చనిపోయాయి. దీంతోపాటు గడ్డి విత్తనాలు, ఇతర పథకాలపైనా అవగాహన కల్పించే వారు కరవయ్యారు.- **కరగాన గోపాల్, పశువుల యజమాని, మునిపుట్టుగ**

పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తున్నాం..

పశు వైద్యుల కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొత్త పోస్టులు భర్తీ చేసినప్పుడు అన్ని ఆసుపత్రుల్లో పూర్తి స్థాయి వైద్యులను నియమిస్తాం. పశు కాపర్లకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందిస్తున్నాం. సీజనల్ వ్యాధులకు టీకాలు వేశాం. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ అప్పలస్వామి, పశుసంవర్ధక శాఖ ఏడీ, సోంపేట

ఎస్సై బాధ్యతల స్వీకరణ

జనార్దనరావు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం గ్రామీణ ఎస్సైగా ఆర్.జనార్దనరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు బదిలీపై వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో శ్రీకాకుళం నుంచి జనార్దనరావు చేరారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

కేంద్ర మంత్రి దృష్టికి సమస్యలు

రామ్మోహన్ నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా మండలాధ్యక్షుడు పద్మనాభం, మాజీ ఎంపీపీ ఢిల్లీరావు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలం కీర్తిపురం-పాయితారి గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెదేపా మండలాధ్యక్షుడు లోపింటి పద్మనాభం తెలిపారు. మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తదితరులతో ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందించామన్నారు. కీర్తిపురంలో సామాజిక భవనం మంజూరు చేయాలని, శ్మశాన వాటికలో నీడనిచ్చే షెడ్డు నిర్మించాలని కోరామని పేర్కొన్నారు.

ఆలయ మండప నిర్మాణానికి భూమి పూజ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: బొరివంకలో ఆంజనేయ ఆలయ మండప నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఆనంద రౌళో సుమారు రూ.3 లక్షల విరాళం అందించారు. మోహనరావు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పూండి రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

పూండి రైల్వేస్టేషన్ వద్ద ప్రస్తుతం పట్టాల మధ్యలో ఉన్న పాత స్లీపర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం రైల్వే సిబ్బందితోపాటు ప్రైవేట్ కార్మికులతో డౌన్‌లైన్‌లో కొత్త స్లీపర్లు అమర్చే పనులు చకచకా చేపట్టారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మహిళా సమాఖ్య కార్యవర్గ ఎన్నిక

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ఏడో వార్డులోని సంతానలక్ష్మి మహిళా సమాఖ్య మహాజన సభను ఉప్పలవీధి అమ్మవారి మండపం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య బలోపేతం, సంఘ సభ్యుల ఆర్థిక అభ్యున్నతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా గుజ్జు లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కాయ సీత, కార్యదర్శిగా నదిక జమున, సంయుక్త కార్యదర్శిగా పరపటి పుణ్యవతి, కోశాధికారిగా రంగాల శ్రీదేవి ఎన్నికయ్యారు. వారితో పట్టణ ఆర్పీ ప్రమాణస్వీకారం చేయించారు. కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వి.సంతోష్, సీవో సంతోష్ పట్నాయక్, ఆర్.శ్రీను, బర్ల లక్ష్మణరావు మెప్మా అధికారులు, టీఆర్పీ, ఆర్పీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్కులు అభివృద్ధి చేయాలని వినతి

పలాస, న్యూస్‌టుడే: ముత్యాలమ్మకోనేరు పార్కును అభివృద్ధి చేయాలని వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. ముత్యాలమ్మకోనేరు, నెహ్రూపార్కులను ఆదివారం కమిషనర్ ఇ.శ్రీనివాసులు పరిశీలించారు. పార్కులో ప్రహరీ నిర్మాణం, దీపాలు వేసి కాపలాదారుడిని నియమిస్తామన్నారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు పండిత రాజేంద్ర, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డి.నర్సింహులు పాల్గొన్నారు.

పలాస ముత్యాలమ్మకోనేరు వద్ద కమిషనర్ శ్రీనివాసులకు విన్నవిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

24 నుంచి 'రైతన్న మీకోసం'

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: 'రైతన్న మీకోసం' వారోత్సవాలు ఈనెల 24 నుంచి డిసెంబరు 3 వరకు నిర్వహించనున్నట్లు పలాస ఎంపీడీవో వసంతకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల ఉద్యోగులను జట్లుగా విభజించి ప్రతి రైతు ఇంటికి పంపిస్తామని, వారు వ్యవసాయం ఎలా ఉంది, ఆదాయం ఎంత వస్తుంది, లాభసాటిగా ఉందా, లేదా తదితర అంశాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఆ వివరాలను ప్రభుత్వానికి చేరవేస్తామన్నారు. సీఎం పంపించిన లేఖను రైతులకు అందించనున్నామని తెలిపారు.

హార్దిక శుభాకాంక్షలు
మిత్రులు, శ్రేయోభిలాషి
శ్రీ కొండా శంకర్ రెడ్డి గారు AP రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులు అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ...
విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం - ఇచ్ఛాపురం
అధ్యక్షులు: సింహాద్రి ప్రసాద్ ఆచారి
సంఘ పెద్దలు
సింహాద్రి నాగేశ్వరరావు, అద్దంకి కృష్ణ ఆచారి
బి. లింగరాజు ఆచారి, కె. బాలు ఆచారి,
ఎల్. అన్నాజీ ఆచారి, కె. రాజు ఆచారి
శ్రీ కొండా శంకర్ రెడ్డి గారు
AP స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్, ఇచ్ఛాపురం

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలు వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్‌లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

వద్దన్నా.. యథేచ్ఛగా విక్రయాలు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: దావరలోని ఓ పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ ధరకు డీజిల్ విక్రయించి మోసం చేసిన ఘటన ఈనెల 19న వెలుగు చూసింది. స్థానికులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో తాత్కాలికంగా విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సదరు బంకులో రెండు రోజులుగా యథేచ్ఛగా విక్రయాలు జరుగుతుండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ సూర్యప్రకాశ్ అన్నారు.

భాజపా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా నాయకులు పూడి తిరుపతిరావు అన్నారు. ఆదివారం టెక్కలిలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. జర్జాన రాజీ, నడుపూరు లక్ష్మీనారాయణ, బూరె నరేంద్రచక్రవర్తి, రాజకుమార్, జన్ని పరమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజ హితం.. సత్యసాయి మార్గం

సత్యసాయి సేవా మార్గం సమాజ హితానికి తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మందిరాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి, పేదలకు నిత్యావసర సరకులు, చీరలు, దుప్పట్లు అందించారు. బాల వికాస్ చిన్నారులతో ఊరేగింపు, అన్నదానాలు, గ్రామసేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే బృందం

అంపురంలో అన్నదానం అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం ప్రేమసాయి వృద్ధాశ్రమంలో..

దోలలో వృద్ధురాలికి దుప్పటి అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కోటబొమ్మాళి ప్రధాన రహదారిలో నగర సంకీర్తన

రైల్వేస్టేషన్ సమీపంలో గాయాలతో యువకుడు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఓ యువకుడు గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడిని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడు టెక్కలి మండలం రౌతుపురానికి చెందిన టి.ఎర్రయ్యగా గుర్తించారు. మద్యం తాగి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

యువ.. సామాజిక సేవ

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం, నరసన్నపేట

★ నియోజకవర్గాలు:	టెక్కలి, నరసన్నపేట
★ డిగ్రీ కళాశాలలు:	12
★ ఎన్ఎస్ఎస్ సేవలందిస్తున్నవి:	7
★ యూనిట్లు:	12
★ వాలంటీర్ల సంఖ్య:	1,200
★ నిర్వహించిన శిబిరాలు:	118

కె.కొత్తూరులో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కావడంలేదు. పల్లె ప్రజల జీవన విధానాన్ని తెలుసుకుని వారిని చైతన్య పరిచేందుకు ముందుకొస్తున్నారు. జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్)లో వాలంటీర్లుగా చేరుతూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములవుతున్నారు. గ్రామాలను దత్తత తీసుకుని ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సేవే లక్ష్యంగా కార్యక్రమాలు

టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహిస్తున్నారు. టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కె.కొత్తూరు గ్రామాన్ని దత్తత తీసుకుంది. రక్తదాన, వైద్య శిబిరాలతో పాటు ఎన్నికల విధుల్లోనూ పాలుపంచుకుంది. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు ఇటీవల సన్యాసినీలాపురం, డమర, సవరకిల్లి గ్రామాల్లో వారం రోజుల పాటు శిబిరాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పద్మావతి, జ్ఞానజ్యోతి, డీఆర్ఎన్, ఎల్‌వీఆర్, జలుమూరు మండలంలోని వంశధార డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు నడుస్తున్నాయి. వీటి ద్వారా జీఎస్టీ, క్యాన్సర్, పిల్లల రక్షణ, మహిళలపై దాడులు, ఓటు హక్కు ప్రాధాన్యం గురించి వాలంటీర్లు వివరిస్తున్నారు.

కొత్త అనుభూతి పొందుతున్నాం

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల్లో వారం రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య ఉండి, వారి కష్టసుఖాలు తెలుసుకుని కొత్త అనుభూతి పొందుతున్నాం. ఐక్యతకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు అద్దం పడుతున్నాయి. దేశ సమైక్యతకు ఇది ఎంతో తోడ్పాటునిస్తుంది. సర్వేలు, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థి దశ నుంచే క్షేత్రస్థాయి పరిస్థితిపై అవగాహన కలుగుతోంది.

– బి.సోనియా, బీకాం ద్వితీయ సంవత్సరం, పద్మావతి డిగ్రీ కళాశాల, నరసన్నపేట

వ్యక్తిత్వ వికాసానికి నాంది.. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది మంచి పౌరులుగా తయారు చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం. గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరాల సమయంలో వాలంటీర్లు ప్రజలతో మమేకమవుతున్నారు. వారిలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, బృందాల్లో పనిచేయగల శక్తి సామర్థ్యాలు పెరిగి జీవితంలో రాణించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కె.రాములు, వెంకట మారుతీప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవోలు, పద్మావతి డిగ్రీ కళాశాల (నరసన్నపేట), ఐతమ్ (టెక్కలి)

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తలగాం కూడలి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు హెచ్ లైను విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. స్తంభం నుజ్జయి తీగలు వేలాడుతుంటే స్థానికులు విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం అందించారు. కారు నడుపుతున్న వ్యక్తులు కొంతదూరం వెళ్లాక వాహనం ఆగిపోవడంతో విడిచిపెట్టి వెళ్లిపోయారు.

సొంతగూటికి చేరిన వలస పక్షులు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఉర్లాం గ్రామానికి చెందిన వ్యక్తులు ఉపాధి, ఉద్యోగ రీత్యా దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. కొంతకాలం క్రితం స్థానిక యువత 'ఊరే మన ఊపిరి' పేరిట మూడు వారాల కిందట ఒక వీడియో రూపొందించి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో వేరు వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఆదివారం ఉర్లాంలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆపదలో ఉన్నవారి కోసం ఉపయోగించేందుకు నిధులు సమకూర్చారు.

సమావేశమైన ఉర్లాం వాసులు

అల్లుకుంటున్నా అలసత్వమేనా..?

కొత్తూరు మండలంలోని పారాపురంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు తీగలకు పనికిరాని మొక్కలు అల్లుకుంటున్నాయి. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

వారం రోజులుగా దాహం కేకలు

జలుమూరు మండలం చల్లవానిపేట జగనన్న కాలనీ వాసులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా శ్రీముఖలింగం తాగునీటి ప్రాజెక్టు ద్వారా సరఫరా నిలిచిపోవడంతో సమీపంలోని నేలబావుల నీరు తెచ్చుకుంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తామని గ్రామీణ తాగునీటి విభాగం జేఈ మధుసూదనరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

భవనం.. భయానకం..!

సారవకోట మండలం అన్నుపురం గ్రామంలోని జీసీసీ భవనం శిథిలావస్థకు చేరింది. ఐటీడీఏ ద్వారా తక్కువ ధరకు నిత్యావసర సరకులు విక్రయించేందుకు దీన్ని నిర్మించారు. వినియోగంలో లేకపోవడంతో కొందరు పశువులు కడుతున్నారు. భవనం నేలమట్టం చేయించి, స్థలాన్ని ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తికి తెలియజేస్తామని సర్పంచి భీమారావు చెప్పారు. – న్యూస్‌టుడే, సారవకోట

కాలువల్లేక కష్టాలు

ఎల్ఎన్‌పేట పరిధి శ్రీనివాస్ నగర్‌కు చెందిన ప్రజలు కాలువల్లేక ఇక్కట్లు పడుతున్నారు. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని, సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే గోవిందరావుకు తెలియజేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

వ్యర్థాల తొలగింపు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఉర్లాం రక్షిత నీటి పథకం ట్యాంకు వద్ద చెత్తను నిల్వ చేయడంపై ఈ నెల 22న 'చి(చె)త్తశుద్ధి కరవు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ఈవోపీఆర్డీ అల్లెన రమేష్ స్పందించి చర్యలు తీసుకున్నారు. ★ ఉర్లాం సచివాలయం చెంతనే వ్యర్థాలు పేరుకుపోవడంపై 'కాస్త ఇటు చూసి వెళ్లండి' శీర్షికతో ఈ నెల 21న వార్త వెలువడింది. దీంతో సిబ్బంది చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించారు.

స్పందనకు వందనం

ఎట్టకేలకు శుభ్రం చేశారు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ చేపల బజారు నిర్వహణకు నోచుకోక పోవడంతో దయనీయంగా మారిన వైనంపై 'ఇదీ చేపల బజారు' శీర్షికతో ఈ నెల 21న 'ఈనాడు'లో వార్త వెలువడింది. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి అధికారులను ఆదేశించడంతో బజారు పరిసరాలను శుభ్రం చేయించారు.

విశ్రాంత ఉద్యోగి వితరణ

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గొనపపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మళ్ల పద్మలోచన తల్లిదండ్రులు నరసమ్మ, అప్పన్న, మామ అప్పన్న జ్ఞాపకార్థం రూ.1.6 లక్షలతో గ్రామంలో శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. భవనంతో పాటు సిమెంట్ బల్లలను కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రారంభించారు.

ఆటో బోల్తా.. బాలుడికి గాయాలు

పాతపట్నం, న్యూస్‌టుడే: కొరసవాడ సమీపంలో ఆటో బోల్తా పడి ఓ బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. కొరసవాడకు చెందిన బొమ్మాళి మన్మథరావు ఆటోలో అదే గ్రామానికి చెందిన లోపింటి భరత్ రొంపివలస వెళ్తుండగా మలుపు సమీపంలో వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని పాతపట్నం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెట్టూరు ఉపాధ్యాయిని ప్రతిభ

కొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన కవిత పోటీల్లో మెట్టూరు హిందీ ఉపాధ్యాయిని ఎ.కామేశ్వరి ప్రతిభ కనబరిచారు. ఆమె రచించిన 'సౌగంధిక పుష్పాలు' కవితకు అవార్డు రావడంతో పలువురు అభినందించారు.

నేటి నుంచి రైతన్న మీకోసం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: రైతన్న మీకోసం కార్యక్రమం నేటి నుంచి ఈనెల 29 వరకు నిర్వహించనున్నట్లు ఏవో ఎస్.దానకర్ణుడు పేర్కొన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని సిబ్బంది, మండల, క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఔషధ చట్టాన్ని అనుసరించాలి

టెక్కలి పట్టణం: ఔషధ నియంత్రణ చట్టాన్ని అనుసరించి దుకాణాల్లో మందులు విక్రయించాలని టెక్కలి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శిష్టు జగం అన్నారు. ఆదివారం తేలినీలాపురం పక్షుల విడిదికేంద్రంలో సంఘ వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మందుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ అవార్డు అందజేత

హిరమండలం, న్యూస్‌టుడే: పెద్దకోరాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ ఆదివారం గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. విశాఖ మదర్ థెరిస్సా ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఈ అవార్డును అందజేశారు.

ఆర్టీసీ బస్సు నడపండి

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట కూడలి నుంచి లక్ష్మీనర్సుపేట మీదుగా మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, తురకపేట మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని తెదేపా నాయకుడు వైశ్యరాజు పాండురాజు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కోరారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో వినతి పత్రం అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాపరులు

కొత్తూరు, సారవకోట, న్యూస్‌టుడే: కొత్తూరు మండలం బత్తిలి రహదారిలో అయ్యప్ప పడిపూజ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, వైకాపా నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవానీ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ★ కోదడ్డపనస గ్రామ సమీప కొండపై కొలువైన అయ్యప్ప స్వామి సన్నిధిలో, శ్రీకాకుళంకు చెందిన గణేష్ గురుస్వామి ఆధ్వర్యంలో దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్లన్నకు భస్మాభిషేకం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి శైవక్షేత్రంలో ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చీడిపూడి వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని చీడిపూడి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు పీసపాటి రామానుజాచార్యులు ఆదివారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లగా తలుపు గెడలు తొలగించి ఉండటాన్ని గుర్తించి సారవకోట పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ బి.అనీల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. గర్భగుడిలోని వెండి ఆభరణాలు, ఇత్తడి వస్తువుల అపహరణకు గురైనట్లు అర్చకుడు పోలీసులకు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.18 వేలు ఉంటుందని అంచనా. ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు మొదట సీసీ కెమెరాల తీగలు కత్తిరించారు. హార్డ్ డిస్కులు తొలగించి వారితోనే తీసుకుపోయారు. హుండీ సైతం పట్టుకుపోయారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నైతిక విలువలు అవసరం

మాట్లాడుతున్న విశ్రాంత తహసీల్దార్ లింగరాజు

నరసన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైతిక విలువలు అవసరమని విశ్రాంత తహసీల్దార్ యు.లింగరాజు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో రాము పాల్గొన్నారు.

వైకాపా రాష్ట్ర కళింగ విభాగ అధ్యక్షుడికి సత్కారం

నరసన్నపేట, న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర కళింగ సామాజిక వర్గం విభాగ అధ్యక్షుడిగా నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయన్ను అభినందించారు. అనంతరం స్థానిక కళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మురళిని సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు బలగ మురళి, అధ్యక్షుడు పూర్ణారావు, ప్రతినిధులు సోమేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.

ఆరంగి మురళిని సన్మానిస్తున్న కళింగ సంక్షేమ సంఘ ప్రతినిధులు

పనితీరుకు గుర్తింపు

ఎస్పీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై అశోక్‌బాబు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు ఎస్ఐ బి.అశోక్‌బాబుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తన కార్యాలయంలో ఆదివారం ప్రశంసా పత్రం అందించి అభినందించారు. నరసన్నపేట బంగారు వర్తకుడు గుప్త హత్య కేసు, పలు గంజాయి కేసుల ఛేదనలో కీలకపాత్ర పోషించి నిందితులను సకాలంలో పట్టుకోవడంతో ఈ ప్రశంస దక్కిందని ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ.. నరసన్నపేట గ్రామీణం: జల్లువానిపేటకు చెందిన జల్లు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ఆదివారం పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఉన్నారు.

రాళ్లపాడు యువకుడికి అభినందన

పోలాకి, న్యూస్‌టుడే: రాళ్లపాడు గ్రామానికి చెందిన గేదెల నీలయ్య ఆదివారం విజయవాడలో రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'నవయుగ వైతాళికుడు గురజాడ' అనే అంశంపై కవితను చదివి వినిపించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ అభినందించారు.

ధర్మాన్ని ఆచరించాలి

సారవకోట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని పాలకొండకు చెందిన ఉపాధ్యాయుడు అప్పలరాజు కోరారు. బుడితి గ్రామంలో ఆదివారం స్థానిక దివ్యజీవన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమేశ్వరరావు, అల్లు రామయ్య, వారణాసి ఆనందరావు పాల్గొన్నారు.

ఉజ్జయినీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంపచోడవరం గ్రామానికి చెందిన బొజ్జిరెడ్డిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించడంతో మొక్కులు చెల్లించినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

అమ్మో.. అంగన్‌వాడీ భవనం..!

– న్యూస్‌టుడే, జలుమూరు, నరసన్నపేట, సారవకోట, పోలాకి

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. వీటిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పిల్లలకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను నేర్పిస్తున్నారు. అలాంటి కేంద్రాలు శిథిలావస్థకు చేరుకోవడంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. కొన్నిచోట్ల సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతుల మధ్య అద్దె భవనాల్లో ఇక్కట్లు పడుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	కేంద్రాలు	సొంత భవనాలు ఉన్నవి	పరాయి పంచన నిర్వహణ
జలుమూరు	98	69	29
సారవకోట	95	70	25
నరసన్నపేట	115	98	17
పోలాకి	122	79	43

ఇదీ పరిస్థితి.. జలుమూరు మండలం రామయ్యవలసలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాలలో నిర్వహిస్తున్నప్పటికీ శిథిలం కావడంతో వర్షాకాలంలో గదిలోకి నీరు చేరుతోంది. రేకులు పాడయ్యాయి. టెక్కలిపాడులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మట్టవానిపేట కేంద్రం గోడలు బీటలు వారాయి. హుస్సేనుపురంలో భవనం ఏడేళ్లుగా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. కత్తిరివానిపేట, వెంకటాపురం కేంద్రాలకు వైకాపా హయాంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తికాలేదు.

● నరసన్నపేట పట్టణంలోని భవానీపురం అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోపాలపెంట- 1, నరసన్నపేట- 8, చెన్నాపురం, బాడాం కేంద్రాల భవనాల పరిస్థితి ఇలాగే ఉంది. పోలాకి ఎస్సీ కాలనీలో నిర్మాణం పిల్లర్ల దశలో ఆగిపోయింది. డోల, ప్రియాగ్రహారం, వెదుళ్లవలస, పిరువాడ కేంద్రాల భవనాలు రేపోమాపో కూలేలా ఉన్నాయి.

పోలాకి ఎస్సీ కాలనీలో పునాదుల దశలో నిలిచిన నిర్మాణం

బీటలు వారిన మట్టవానిపేట అంగన్‌వాడీ కేంద్రం భవనం

● సారవకోట మండలంలోని కుమ్మరిగుంట, ధర్మలక్ష్మీపురం, మహశింగి కేంద్రాలను ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. వంట సైతం అక్కడే చేస్తుండటంతో చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

శిథిలావస్థకు చేరిన కేంద్రాలను గుర్తించాం. భవనాలు లేని చోట స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే చేపడతాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

– వంశీప్రియ, శోభారాణి, సీడీపీవోలు సారవకోట, నరసన్నపేట

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

మూడు నెలలుగా మూలకు..

ఎచ్చెర్ల మండలం బిలకాలేలింలో వీధి కుళాయిలు మూడు నెలల నుంచి పనిచేయకపోవడంతో స్థానికులు తాగునీటికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో 58 గ్రామాలకు సమగ్ర రక్షిత మంచి నీటి పథకం ద్వారా తాగునీరు అందాల్సి ఉన్నా సరఫరా కావడం లేదని గ్రామస్థులు తెలియజేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ఆర్.విజయసాగర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

★ మారుతి: మ్యాడ్ పోలీస్ ★ కిన్నెర: పాంచ్ మినార్ ★ కీర్తన: కాంత ★ కీర్తిక: ది గర్ల్‌ఫ్రెండ్ ★ ఎస్వీసీ(రామలక్ష్మణ): ప్రేమంటే ★ సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి ★ సన్‌ఫ్లెక్స్: 12ఎ రైల్వే కాలనీ ★ సరస్వతి: సినిమా - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

సమస్య: గేదెలవానిపేట గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో గుంతల్లో మురుగు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. రమేష్, స్థానికుడు

సమాధానం: మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

? కె.మన్నయ్యపేట ప్రధాన రహదారిలో విద్యుత్తు దీపాలు వెలగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాసు, స్థానికుడు ★ దీపాలు వెలిగేలా చూస్తాం. - టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

- న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

? శ్రీకాకుళం నగరంలోని కత్తెరవీధిలో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి పరిసరాలు అపరిశుభ్రత, దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - పి.అన్నారావు, కత్తెరవీధి

★: పూడిక తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

స్పందించారు.. తొలగించారు..

స్పందన వందనం

గార (కళింగపట్నం), న్యూస్‌టుడే: గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాలపేట ఎస్సీ కాలనీలో కాలువల్లో తీసిన చెత్తను ఆదివారం తొలగించారు. అక్కడే పడివేయడంతో ఈ నెల 22న 'ఎక్కడి చెత్త అక్కడే' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కార్మికుల సాయంతో తొలగించారు.

మార్మోగిన సత్యసాయి నామస్మరణ

రణస్థలం: సత్యసాయికి పూజలు చేస్తున్న భక్తులు

పొందూరు: సత్యసాయి పల్లకీ మోస్తున్న మహిళలు

సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారికంగా బాబా జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తులతోపాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యసాయి మందిరాల పరిధిలో తెల్లవారుజామున నగర సంకీర్తనతో ఉత్సవాలు ప్రారంభించారు. సత్యసాయి చిత్రపటాలను పల్లకిలో ఉంచి తిరువీధి నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. వేడుకల దృష్ట్యా విశేషం చేశారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, లావేరు, బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు గ్రామీణం, రణస్థలం, గార

పీఎన్ కాలనీలో సత్యసాయి మందిరంలో ఊయల ఉత్సవం, భజన

న్యూకాలనీ సత్యసాయి మందిరంలో కేంద్రమంత్రి పూజలు

పొగతో తంటా..!

ఇరుకు గదుల్లో వండేందుకు సిబ్బంది అవస్థలు

- న్యూస్‌టుడే, పొందూరు, సరుబుజ్జిలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటలు చేసేందుకు సరైన సౌకర్యాలు లేక కార్మికులు అవస్థలు పడాల్సి వస్తోంది. పాఠశాలల వద్ద గతంలో నిర్మించిన వంట గదులకు పొగ గొట్టాలు(చిమ్నీలు) ఏర్పాటు చేయకపోవడంతో పొగతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల వంట గదులు లేక బయట వంట చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం పొగ పీల్చాల్సిన పరిస్థితి నెలకొంది.

సరుబుజ్జిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పొగతో ఇబ్బంది పడుతున్న భోజన కార్మికులు

★ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వంట గదుల్లేని పాఠశాలలు 131 పైగా ఉన్నాయి. ఆయా బడుల్లో ఆరుబయటే మధ్యాహ్న భోజన కార్మికులు వంటచేయాల్సి వస్తోంది. దీంతో పొగ తదితర గదుల్లోకి వ్యాపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి.

మండలాల వారీగా వివరాలు

	పాఠశాలలు	వంట గదులు లేనివి
పొందూరు	70	15
సరుబుజ్జిలి	53	16
బూర్జ	63	24

★ పలు పాఠశాలలకు వంట గదులు ఇరుకుగా ఉండటంతో వంట పాత్రలు ఉంచేందుకు మాత్రమే వాటిని వినియోగిస్తున్నారు. దీనికి తోడు వంట చేసేందుకు కట్టెల పొయ్యిలు వాడటంతో పొగతో అవస్థలు తప్పడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

వంట గదులు లేని పాఠశాలల గుర్తించి వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. గదులు ఉన్న బడుల్లో నిర్వాహకులకు గ్యాస్ పొయ్యిలు మీద వంటలు చేయాలని సూచించాం. మిగతా చోట్ల పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - రాజారావు, బాలరాజు, శ్యామసుందరరావు, మూడు మండలాల విద్యాశాఖాధికారులు

బావి పరిసరాలు అధ్వానం

సరుబుజ్జిలి మండలంలోని మర్రిపాడు గ్రామంలో నేల బావి చుట్టూ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ప్లాట్‌ఫాం చుట్టూ నాచు పేరుకుపోవడంతో స్థానికులు నీటిని పట్టుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ రామారావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పంచాయతీ కార్యదర్శిని ఆదేశించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పడకేసిన పారిశుద్ధ్యం

పొందూరు మండలం దళ్లవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన మార్గంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

అంత్యక్రియలకు అవస్థే

సరుబుజ్జిలి మండలం పెద్దపాలెంలో శ్మశానవాటిక పనికిరాని మొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. కనీసం లోపలకు వెళ్లేందుకు సైతం వీలు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామారావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా శ్మశానవాటికను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ప్రమాదమని తెలిసినా వదిలేశారు..

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్లాట్ ఫాంపై విద్యుత్తు తీగలు, ఇనుపరాడ్లు తదితర వస్తువులు అక్కడే విడిచిపెడుతున్నారు. దీంతో రైళ్లు వచ్చే సమయానికి ప్రయాణికులు పరుగులు తీసే క్రమంలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఈ సమస్యను రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

వ్యర్థాలతో ఇక్కట్లు

శ్రీకాకుళం నగరంలోని ఎల్‌బీఎస్ పార్కు ప్రాంతంలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. కార్మికులు చెత్త సేకరణ సక్రమంగా చేపట్టకపోవడంతో స్థానికులు ఇళ్లలో చెత్తను పార్కు పరిసరాల్లో పడేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

కేంద్రమంత్రితో పలువురి భేటీ

కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర తెదేపా అధ్యక్షుడు

కలెక్టరేట్(శ్రీకాకుళం), రణస్థలం, న్యూస్‌టుడే: శ్రీకాకుళ నగర తెదేపా అధ్యక్షుడిగా నియమితులైన పాండ్రంకి శంకర్ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రిని సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ★ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని ఎస్సీ కమిషన్ సభ్యునిగా నియమితులైన ముక్కు ఆదినారాయణ కలిశారు. శ్రీకాకుళంలోని మంత్రి కార్యాలయంలో ఎస్సీ కమిషన్ సభ్యుడిని రామ్మోహనాయుడు సత్కరించారు.

భగవద్గీత విజేతలకు బహుమతులు

ఆమదాలవలస మండలం లొద్దలపేట గ్రామానికి చెందిన బొంగు సన్యాసిరావు ప్రస్తుత అరసవల్లి క్రాంతి శ్రీకాకుళం తిరుమల ఆలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పోటీల్లో విజయం సాధించారు. పొందూరు మండలం తాడివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న వీరు 6, 7 తరగతుల విభాగంలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. వీరికి విశ్రాంతి ఉపాధ్యాయులు పైడి శ్రీరామమూర్తి రోజూ భగవద్గీతపై శిక్షణ ఇస్తున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు విజేతలుగా నిలవడంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

రోడ్డుపై మురుగు పరుగు..

పొందూరు మండలం కింతలి ప్రధాన రహదారిపై మురుగు పరుగులు తీస్తుంది. కాలువలు లేకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైకి చేరి నిల్వ ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని చెబుతున్నారు. రాకపోకలు సాగించే వాహనదారులు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. మురుగును శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం పట్టణంలోని సంగమేశ్వరాలయం ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుని రోజంతా ఉత్సాహంగా గడిపారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

బహుమతులు సాధించిన విద్యార్థులతో ఏపీయూటీఎఫ్ శాఖ రాష్ట్ర, జిల్లాశాఖ ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పోటీతత్వ పెంచేలా సెలవురోజుల్లో సైతం వివిధ రకాల నమూనా పరీక్షలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృషి అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి కారు పున్నయ్య అన్నారు. మండలంలోని పోలీసు క్వార్టర్స్ వద్దగల స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీయూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి నమూనా నవోదయ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు నాలుగు మండలాల నుంచి 209 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఏపీయూటీఎఫ్ రాష్ట్రశాఖ కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.అప్పారావు, వై.ఉమాశంకర్, జిల్లా కార్యదర్శులు జి.సురేష్, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎస్.స్వర్ణ బహుమతులందజేశారు. ఉపాధ్యాయులు బి.వెంకటేశ్, ఆర్.జగదీశ్ పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకుందాం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జనార్దన్

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కనుగులవానిపేటలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. విశాఖకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ జనార్దన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని తెలిపారు. భారతీయ సంస్కృతి మహోన్నతమైనదన్నారు. స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ దయానిధి మాట్లాడుతూ హైందవులు సమైక్యంగా జీవించాలని తెలిపారు.

అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి భూమి వితరణ

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం తాడివలసలో అయ్యప్పస్వామి శాశ్వత సన్నిధానం నిర్మాణం కోసం గ్రామానికి చెందిన పైడి కృష్ణారావు 12 సెంట్ల భూమిని ఉదారంగా దానం చేశారు. గ్రామంలో పెద్దఎత్తున భక్తులు అయ్యప్ప మాలధారణ చేస్తుండటంతో వారికి కోసం బీసీ కాలనీలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం పక్కన స్థలంలో గ్రామస్థులు సహకారంతో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టి పదేళ్లుగా అక్కడే పూజలు చేస్తున్నారు. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరగడంతో శాశ్వత సన్నిధానం కోసం భూమిని వితరణ చేస్తున్నట్లు కృష్ణారావు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆదివారం అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆదివారం.. సరదా తీరం..!

మొగదాలపాడు తీరంలో సందర్శకుల సందడి

గార, న్యూస్‌టుడే: పిక్నిక్ సందడి సాగర తీరాల్లో స్పష్టం కనిపించింది. ఆదివారం మండలంలోని కళింగపట్నం-మత్స్యలేశం, మొగదాలపాడు తీరంలో రద్దీ నెలకొంది. సూర్యాస్తమయం అవుతున్నా.. సందర్శకులు సముద్ర స్నానాలు చేస్తూ.. ఆనందంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్ సీఐ ప్రసాదరావు సిబ్బందితో పర్యవేక్షించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువతకు అవగాహన కలిగించారు.

కోతకు గురవుతోంది...

బూర్జ మండలంలోని గోపీదేవిపేట నుంచి సరుబుజ్జిలి వెళ్లే రహదారి మదనాపురం-అనంతగిరిపేటల మధ్య కోతకు గురవుతోంది. సుమారు 12 కి.మీ మేర ఇరువైపులా కొన్నిచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోనే పర్లాఖెముండి నుంచి పార్వతీపురం మధ్య గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంచు కోతకు గురికావడంతో రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్‌తో ప్రస్తావించగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, బూర్జ

పూడిక తీయండి

పొందూరు మండలం ధర్మపురంలో కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దోమల బెడదతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

పుస్తకమే మంచి స్నేహితుడు

పుస్తకాలు ప్రదర్శిస్తున్న కవులు, రచయితలు

ఆమదాలవలస పట్టణం, లావేరు, న్యూస్‌టుడే: పుస్తకమే మంచి స్నేహితుడు అని విశ్వసాహితి అధ్యక్షుడు పొన్నాడ వరాహనర్సింహులు అన్నారు. విశ్వసాహితి వార్షికోత్సవ సాహిత్య గోష్ఠి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొన్నాడ అప్పలనర్సమ్మ ట్రస్టు ఆధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆధునిక భాషా వ్యామోహంలో మాతృభాషను విడిచిపెడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

❖ విద్యార్థి దశ నుంచి మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు, బాలసాహిత్యం తదితర పుస్తకాలను చదివించారు. పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉపనిషన్మందిరంలో ప్రవచనం

ఉపనిషన్మందిరంలో పరాత్మానంద సరస్వతికి సత్కారం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పాలకొండ రోడ్డులో కోదండరామాలయం ప్రాంగణంలో ఉపనిషన్మందిరంలో ఆదివారం చిన్మయి మిషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు పరాత్మానంద సరస్వతి ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆయన భగవద్గీత పంచామృతం అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిరం ప్రతినిధులు సాయి ప్రసాద్ అప్పల కొండ, సూరిబాబు, బాబూరావు, నరసింహమూర్తిలు ఆయనను సత్కరించారు.

వాణిజ్య పంటలపై మక్కువ

ధర పలకడంతో నీలగిరి, సరుగుడిపై రైతుల ఆసక్తి

- న్యూస్‌టుడే, రణస్థలం

ప్రస్తుతం సాగు ఖర్చులు పెరిగిపోవడం, శాశ్వత సాగునీటి వనరులు లేక, ఉన్న వాటితో ప్రయోజనం పొందక ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో రైతులు నీలగిరి, సరుగుడు పంటలపై మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతంలో వర్షాధార భూములే అధికంగా ఉండటంతో మూడేళ్లుగా వాణిజ్య పంటలపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల కాలంలో సరుగుడు, నీలగిరి ధర పెరగడంతో దీనిపై అన్నదాతలు దృష్టిసారిస్తున్నారు.

చినయామాలపేట వద్ద సాగు చేస్తున్న నీలగిరితోట

★ చెరువుల కింద పల్లపు భూముల్లో వరి సాగు, మెట్ట భూముల్లో వేరుశనగ, అపరాలు పండించేవారు. తర్వాత రెండు రకాల భూముల్లోనూ కొన్నాళ్ల పాటు మొక్కజొన్నసాగు చేశారు. ప్రస్తుతం కూలీల రేట్లు, ఎరువులు విరివిగా లభించకపోవడం వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో సాగు పరిస్థితి

సంవత్సరం	విస్తీర్ణం
2023-24	2,500
2024-25	4,550
2025-26	9,500

★ ఈ పంటకు సాగు ఖర్చు తక్కువ కావడం, పంటను సంరక్షిస్తే మూడు, నాలుగేళ్లలో చేతి కొచ్చేస్తుండటంతో ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు.

దీర్ఘ కాలంలో ధర తగ్గుతుంది..

సరుగుడు, నీలగిరి పంటల సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా గత మూడేళ్లుగా మంచి ధర లభిస్తుండడంతో అన్నదాతలు ఈ పంటలపై మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు నీరు అధికంగా వినియోగం కావడంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముంది. రైతులంతా ఒకే ఏడాది సాగు చేస్తే దీర్ఘకాలంలో ధర తగ్గే అవకాశముంది. - వి.శ్రీనివాసరావు, ఏడీఏ, రణస్థలం

(c) eenadu

చల్లని తల్లికి చాంగుభళా!

తిరుచానూరు, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో శ్రీపద్మావతీ అమ్మవారు ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై వెన్నముద్ద కృష్ణుడి రూపంలో భక్తులకు సాక్షాత్కరించారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీయోగనారాయణుడి రూపంలో దర్శనమిచ్చారు.

నేటి సేవలు

ఉదయం 9.15: రథోత్సవం

రాత్రి 7.00: అశ్వవాహనం

మేఘాల సోయగం.. మది పరవశం

తిరుమలలో రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. శేషాచలం అటవీ ప్రాంతం మీదుగా కొండపైకి వచ్చే మార్గాల్లో తేలియాడుతున్న మేఘాలు, జలపాతాలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, తిరుమల

ఈనాడు తిరుపతి

దరఖాస్తు చేయండి.. ఇల్లు పొందండి

ఈ నెల 30 వరకు గడువు

తిరుపతి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మాణం చేపట్టలేని వారితో పాటు, స్థలాలు లేనివారికి ప్రభుత్వం దరఖాస్తుకు అవకాశం ఇచ్చింది. – న్యూస్‌టుడే, తిరుపతి (జీవకోన)

ఇలా చేయండి.. • పీఎంఏవైజీ 2.0 పథకంలో భాగంగా పేదలకు ఇంటి సౌకర్యం కల్పించడమే ధ్యేయం. • జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతా పాసు పుస్తకం వివరాలను సచివాలయంలో సమర్పించాలి. • వాటిని సచివాలయ, మండల ఇంజినీరింగ్ సహాయకులు పరిశీలిస్తారు. వారు ఇళ్లకే వచ్చి ముఖ గుర్తింపు ద్వారా యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. • దీని కోసం ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉంది. • ఇప్పుడు దరఖాస్తు చేస్తే రానున్న అయిదేళ్లలో స్థలాలు కేటాయించి నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటుందని ప్రభుత్వ భావన.

నమోదు తప్పనిసరి

వివరాలను పీఎంఏవై- ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ఎ.శ్రీనివాసరావు సూచిస్తున్నారు. రానున్న అయిదేళ్లలో కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు చెప్పారు.

46 వేల బోగస్‌కార్డులు

ఉపాధి హామీలో అంతులేని అక్రమాలు

పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేతనదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో బోగస్ కార్డులు బయట పడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొందరు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండటంతో మరిన్ని బయట పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

జిల్లాలో వివరాలు..

• ఉపాధి వేతనదారులు: 3,16,373 మంది

• ఈకేవైసీ జరిగింది: 2,85,833

• చేయించుకోవాల్సింది: 30,540

90 శాతం పూర్తి..

ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు జాబ్ కార్డులున్న 90 శాతం మందికి ఈకేవైసీ పూర్తయింది. వాటిని పరిశీలించిన అధికారులు 46 వేల బోగస్ కార్డులను గుర్తించి రద్దు చేశారు. రద్దయిన వారిలో ఎవరైనా అర్హులు ఉంటే మరోసారి అప్పీలు చేసుకోవచ్చని సూచించారు.

ఎన్నో అవకతవకలు..

గత ప్రభుత్వ పాలనలో చాలా వరకు అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు పనులకు రాకుండానే ఇళ్ల వద్ద ఉంటూ వేతనాలు పొందినట్లు గుర్తించారు. రోజూ వచ్చే కూలి సొమ్ములో కొంత స్థానిక నాయకుల ఖాతాల్లోకి చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. మస్టర్లలో తప్పులు, వేతనాల చెల్లింపులో అక్రమాలు, జాబ్‌కార్డులో ఉన్న చిరునామాలో వేతనదారు ఉండకపోవడం, ఉద్యాన పంటల కోసం ఉపాధి కార్డులు తీసుకోవడం మొదలైన అవకతవకలు జరిగాయి. ఈ లెక్కన రూ.కోట్లలో సొమ్ము పక్కదారి పట్టినట్లు అధికారులు భావిస్తున్నారు.

– న్యూస్‌టుడే, తిరుపతి భవానీనగర్

పుంగనూరు.. పశుజాతి మాణిక్యం

పుంగనూరు, న్యూస్‌టుడే: చిట్టి.. పొట్టి కాళ్లు.. అందమైన ఆకృతి.. ఆకర్షించే అమాయకత్వం.. చూపరులను కట్టిపడేసే సొగసు పుంగనూరు గోవుల సొంతం. కరవు పరిస్థితులను సైతం తట్టుకొని మనుగడ సాగించడం వీటి ప్రత్యేకత. ఒకప్పుడు ఇంటింటికీ ఒకటి చొప్పున కనిపించే ఆవులు క్రమేపీ అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. కొందరు రైతులు మాత్రం వీటి సంరక్షణలో తమ పాత్ర పోషిస్తున్నారు.

• కేంద్రం తపాలా కవరుపై పుంగనూరు జాతి పశువుల ఫొటోలు ముద్రించి 2022 ఫిబ్రవరిలో విడుదల చేసింది.

• తిరుమల క్షేత్రంలోని తితిదే గోశాలలో పుంగనూరు ఆవులు పెంచుతూ వాటి పాలు స్వామివారి అభిషేకానికి వాడుతున్నారు.

రూ.100 కోట్లతో పరిశోధన..: పుంగనూరు జాతి పశు ఉత్పత్తికి ప్రభుత్వం మిషన్ పుంగనూరు చేపట్టింది. ఆరోగ్యవంతమైన జాతి ఎద్దుల నుంచి వీర్యం సేకరించి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తారు. ఎండిలో ట్రాన్స్‌ఫర్, ఇన్‌విట్రో ఇన్‌వైలో కృత్రిమ విధానాలతో మనుగడ కాపాడేలా చూస్తున్నారు. రూ.100 కోట్లతో పలమనేరు, పులివెందులలో పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

లీటరు పాలు రూ.100 పైనే..

• దేశీయ ఆవు జీవిత కాలంలో 7 నుంచి 8 దూడలకు జన్మనిస్తుంది. కానీ పుంగనూరు ఆవులు 13 వరకు పిల్లలకు జన్మనిస్తాయి. • ఈ ఆవు 70 నుంచి 90 సెం.మీ ఎత్తు, 115 నుంచి 200 కిలోల బరువు కలిగి ఉంటుంది. • రోజుకు 2 నుంచి 3 లీటర్ల పాలు మాత్రమే ఇస్తాయి. • సాధారణ ఆవు పాలల్లో 3 నుంచి 4 శాతం వెన్న ఉంటే, వీటిలో 8 శాతం ఉంటుంది. అందుకే ఈ పాల ధర లీటరు రూ.100పైనే. • జిల్లా వ్యాప్తంగా వీటి సంఖ్య వెయ్యి లోపు ఉంటుంది.

చోదకా.. ఇదిగో సూచిక

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులు జోరుగా సాగుతున్నాయి. జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసింది. కానీ కొందరు పెడచెవిన పెడతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ సూచిక ఏం చెబుతుందో పరిశీలించి జాగ్రత్తలు తీసుకుందాం. – న్యూస్‌టుడే, పుత్తూరు

చూడండి.. గమ్యస్థానం చేరండి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివరాలు..

- వాహనాల రాకపోకలు: రోజూ వేలల్లో
- ఏడాదిలో ప్రమాదాలు: 1,050
- ద్విచక్ర వాహనాలు: 659
- భారీ వాహనాలు: 135
- కార్లు, ఇతర వాహనాలు: 256
- మృతులు: 425
- క్షతగాత్రులు: 1,165

వేగ నియంత్రణ..

జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ఎడమ వైపు గ్రామీణ రోడ్డు ఉందని సూచన. అటు నుంచి వాహనాలొచ్చే అవకాశం ఉంటుంది. వేగం నియంత్రణలో ఉంచుకోవాలి.

వంతెన ఉందని..

ఈ సూచిక ఇరుకైన వంతెన ఉందని తెలుపుతుంది. ఈ ప్రాంతంలో వేగంగా వెళ్లినా, వాహనాలు నిలిపేసినా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

దూకుడు వద్దని..

వాహనాలు నడిపే సమయంలో డివైడర్ల మధ్య ఖాళీ గురించి ఈ గుర్తు సూచిస్తుంది. రోడ్లలో మలుపు తిరగడానికి.. 2, 3 మార్గాలను కలపడానికి, రోడ్డు క్రాస్ చేయాలని సూచిస్తాయి. ఇక్కడ నెమ్మదిగా వెళ్లాలి.

పనులు చేస్తున్నారని..

ఈ రోడ్డులో ముందు పనులు జరుగుతున్నాయి వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని దీని అర్థం. అక్కడ నుంచే వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లాల్సి ఉంటుంది.

కుడి.. ఎడమలు..

రహదారికి ఎడమ వైపు వెళ్లమని నిర్దేశించే సంకేతమిది. డివైడర్, మలుపులున్నా ఆ ప్రాంతాల్లో వాహనాలు తిరుగుతాయని, ఎడమవైపు వెళ్లాలని అర్థం. అదే కుడి వైపునకు సూచిక ఉంటే అటుగా వెళ్లొచ్చు.

అందరూ పాటించాల్సిందే..

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పనుల నేపథ్యంలో సూచికలు పెట్టిస్తున్నాం. చోదకులకు అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అందరూ నిబంధనలు పాటిస్తే ప్రయాణం సాఫీగా సాగుతుంది. – చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

పాఠశాలలు, కళాశాలలు..

రోడ్డుపై ఈ సూచికలుంటే ఆ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉన్నట్లు వాహన చోదకులు గుర్తించుకోవాలి. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వారితో పాటు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.

అధిగమించవద్దని..

ఈ సంకేతం కనిపిస్తే ముందున్న వాహనాలను అధిగమించవద్దని అర్థం చేసుకోవాలి. దాన్ని విస్మరిస్తే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరిస్తుంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని మండల, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

డయల్ యువర్ సీఎండీ

సమయం: ఉదయం 10-12 గంటల వరకు

చరవాణి నంబరు: 89777 16661

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు.

సప్తపది.. ప్రకృతి ఒడి

ఫంక్షన్ హాలు.. ప్లాస్టిక్ పూలు.. విద్యుత్తు దీపాలు.. పాటల హోరు.. సాధారణంగా వివాహ వేడుకల్లో ఇవే చూస్తుంటాం. కానీ అందరికంటే భిన్నంగా కొబ్బరితోటలో.. పచ్చని పందిరిలో.. ప్రకృతి ఒడిలో మూడుముళ్ల ముచ్చట తీర్చుకుంటే ఎలా ఉంటుంది.. నింద్ర మండలం ఇరుగువాయి గ్రామంలో ఆదివారం ఓ వివాహ వేడుక ఇలాగే జరిగింది. విశాఖలో స్థిరపడిన గిరిబాబు స్వగ్రామం నింద్ర. ఈయన కుమార్తె పూజిత తన వివాహం సొంతూరిలో గ్రామస్థుల మధ్య.. తమకున్న కొబ్బరితోటలో చేసుకోవాలని ఉందని తండ్రికి చెప్పారు. కుమార్తె కోరికతో బంధుమిత్రులందరినీ ఆహ్వానించి సంప్రదాయబద్ధంగా తోటలో వివాహం చేశారు. – న్యూస్‌టుడే, నింద్ర

దీనిని ఏమందురో..?

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చెల్లూరు జలాశయానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్యాం నిండి పొంగిపొర్లుతోంది. కొండల మధ్య జలాశయం ఆహ్లాదకరంగా ఉండటంతో వందలాది మంది వచ్చి సేదతీరుతున్నారు. కొంతమంది యువత మద్యం తాగుతున్నారు. నీటిలోకి దిగి ఈత కొడుతున్నారు. మరికొందరు కుటుంబాలు, స్నేహితులతో వచ్చి ప్రమాదకరంగా స్వీయ చిత్రాలు తీసుకుంటున్నారు. – ఈనాడు, తిరుపతి

వాడని సిమ్ కార్డులను తొలగించుకున్నారా..?

పుత్తూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో మోసగిస్తున్నారు. సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు మోసాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే మన పేరు మీద సిమ్‌కార్డులు పుట్టుకొస్తున్నాయి. నేరగాళ్లు మన పేరుతో ఉన్న సిమ్‌ను యాక్టివేట్ చేసి అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డుతో మన పేరు మీద ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయో, సులువుగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం "సంచార్ సాథీ మొబైల్ యాప్'ను అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం.

మోసం చేసేందుకు సవాలక్ష మార్గాలు..

కొత్త సిమ్‌కార్డు తీసుకునేందుకు దుకాణానికి వెళ్లినప్పుడు వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, వేలిముద్రలు తీసుకుంటుంటారు. కొంతమంది నేరగాళ్లు వేలిముద్రలు, ఐరిస్ సేకరించే ప్రక్రియ ఒకటికి రెండు సార్లు చేస్తారు. దీంతో రెండు సిమ్‌కార్డులు మన పేరు మీద నమోదవుతాయి. మనం అడిగిన సిమ్ తీసుకుని మనం అక్కడి నుంచి వెళ్లిపోయాక .. రెండోది మనకు తెలియకుండా వారి వద్ద ఉండిపోతుంది. వీటిని అధిక ధరలకు సైబర్ నేరగాళ్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇలా పసిగట్టవచ్చు..

సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో ఈ మోసాలకు చెక్ పెట్టొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో యాప్ అందుబాటులో ఉంది. అదే విధంగా www.sancharsaathi.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి అందులో సిటిజన్ సెంట్రిక్ సేవలకు సంబంధించి పలు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'నో మొబైల్ కనెక్షన్ ఇన్ యువర్ నేమ్'పై క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన పది అంకెల చరవాణి కింద క్యాప్చా నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆపై మన పేరు మీద నమోదైన సిమ్‌కార్డు నంబర్లు కనిపిస్తాయి. ఆ నంబర్ ఎంపిక చేస్తే నాట్‌మై నంబర్, రిక్వైర్డ్, నాట్ రిక్వైర్డ్ ఎంపికలు వస్తాయి. వీటిలో ఒకటి ఎంచుకుని ఫిర్యాదు చేయవచ్చు.

టెట్‌కు 7,514 మంది దరఖాస్తు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 7,514 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి డిసెంబరు 3న హాల్‌టికెట్లు జారీ చేయనున్నట్లు సమాచారం. 10వ తేదీ నుంచి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

నేటి పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పోలీస్ శాఖ పేర్కొంది. తిరుచానూరు అమ్మవారి పంచమి వేడుకల ఏర్పాట్లలో భాగంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

పరదేశీ ప్రశస్తి.. శ్రీకాళహస్తి

రాహుకేతు పూజలపై విదేశీయుల ఆసక్తి

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఆలయ సందర్శనకు ఏటా విదేశీయుల తాకిడి పెరుగుతోంది. సాధారణంగా ఇతర దేశాల నుంచి వచ్చే వారు ఇక్కడి పర్యటక, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించడానికి వస్తుంటారు. కానీ ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులు మాత్రం ప్రత్యేకం. రాహు, కేతు పూజలు సైతం చేయించుకోవడం విశేషం.

హస్తకళలపై మక్కువ: అంతర్జాతీయ గుర్తింపు పొందిన కళంకారీ శ్రీకాళహస్తికి పెట్టింది పేరు. ఇక్కడి కళాకారులు తయారు చేసే కొయ్య బొమ్మలకు ప్రపంచ దేశాల్లో మంచి ఆదరణ లభిస్తోంది. విదేశీ భక్తులు దర్శనానంతరం వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వీరి కారణంగా ఆలయ పరిసరాల్లో హస్తకళల దుకాణాలు ఎక్కువయ్యాయి.

ఎక్కడెక్కడి నుంచి.. రష్యా, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఇటలీ

శాంతి మండపంలో రాహు, కేతు పూజలు చేయించుకుంటున్న జపాన్ దేశీయులు

సంప్రదాయ వస్త్రధారణతో..

చెన్నై, ముంబయి, దిల్లీ, బెంగళూరులో యోగా విద్యనభ్యసించడానికి విదేశీ మహిళలు వస్తుంటారు. వీరిలో చాలామంది శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో వస్త్రధారణ విషయంలో పెద్దగా ఆంక్షలు లేవు. దీంతో చాలామంది జీన్స్, టీషర్టు వేసుకొని వస్తుంటారు. పరదేశీ మహిళలు చీరకట్టులో, పురుషులు పంచె, చొక్కా ధరిస్తుండటం గమనార్హం. ఇక్కడి శిల్పకళా సౌందర్యం కూడా వారి ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.

సంవత్సరం	2021-22	2022-23	2023-24	2024-25	2025-26
విదేశీ భక్తులు	4200	4500	7100	8700	10,100
కరెన్సీ నోట్లు	950	1200	1,500	1,750	1,960

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 75,082 మంది దర్శించుకున్నారు. రూ.2.87 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి.

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

8008555167, 9154991499

మేనకూరు.. ఉద్యోగాల మణిహారం

■ రూ.10,391.93 కోట్ల పెట్టుబడులు

■ 7 వేల మందికి ఉద్యోగావకాశాలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీలు, సులభతర వాణిజ్యం, సింగిల్ డెస్క్ పాలసీ విధానంతో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

అయిదు నెలల కాలంలో..

నాయుడుపేట పట్టణంలోని పారిశ్రామిక వాడల్లో అయిదు నెలల కాలంలోనే రూ10,393.93 కోట్ల పెట్టుబడులతో 9 భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కలిగింది. మేనకూరు పారిశ్రామిక వాడలోనే 2026 నాటికి 7 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఏర్పడింది.

పారిశ్రామికవాడలో నిర్మాణంలో కార్బన్ పరిశ్రమ

5 నెలల్లో పరిశ్రమలు.. (✪ పరిశ్రమ ❖ పెట్టుబడి (రూ.కోట్లలో) ❒ ఉద్యోగాలు)

పరిశ్రమ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగాలు
ప్రీమియర్ ఎనర్జీ	1,743	2,200
ఫిల్ఫిస్ కార్బన్	3,000	1,000
బిర్లా కార్బన్	1,793	500
వాల్టన్ ల్యాబ్	1,743	415
గ్రీన్‌ల్యామ్ సౌత్ లిమిటెడ్	595	850
బీసీబీ ఎలక్ట్రానిక్స్	700	1,000
ఇథనాల్ పరిశ్రమలు-2	819.70	200

భూముల కేటాయింపు పూర్తి..

ప్రీమియర్ ఎనర్జీకి చెందిన సౌరఫలకాలు, సోలార్ మాడ్యూల్స్ సెల్ తయారీ, బిర్లా కార్బన్, ఫిల్ఫిస్ కార్బన్‌తో పాటు తాజాగా పీసీబీల ఎలక్ట్రానిక్స్, వాల్టాన్ ల్యాబ్స్, గ్రీన్ ల్యామ్ సౌత్ లిమిటెడ్ కంపెనీలు పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాయి. ఇప్పటికే ప్రీమియర్ ఎనర్జీ, కార్బన్ పరిశ్రమల భవన నిర్మాణాలు కొలిక్కి వచ్చాయి. మిగిలిన వాటికి భూముల కేటాయింపు పూర్తయింది.

28 నుంచి షోడశదిన సుందరకాండ పారాయణం

తిరుమల, న్యూస్‌టుడే: లోకకల్యాణం కోసం ఈనెల 28 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు స్థానిక వసంతమండపంలో షోడశదిన సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఈనెల 27న సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పారాయణంలో భాగంగా రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదపాఠశాలలో ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్టానం నిర్వహించనున్నారు. డిసెంబర్ 13వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో పూర్ణాహుతితో కార్యక్రమం పరిసమాప్తమవుతుంది.

(c) eenadu

10.30 తర్వాతే పుణ్యస్నానాలకు అనుమతి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి అమ్మ వారి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం జరిగే చివరి ఘట్టమైన పంచమీతీర్థానికి సర్వం సిద్ధం చేసినట్లు తితిదే జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఆదివారం అధికారులతో కలిసి పంచమీతీర్థం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉదయం 10.30 గంటల తరువాత మాత్రమే భక్తులను పుష్కరిణిలో పుణ్య స్నానాలకు అనుమతిస్తామని చెప్పారు. పంచమీ తీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

పంచమీతీర్థానికి సిద్ధమైన పుష్కరిణి

మరిన్ని వివరాలు

- వేర్వేరుగా పుష్కరిణిలోకి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు.
- పద్మసరోవరంలోకి వెళ్లేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూడి కూడలి, నవజీవన్ ఆసుపత్రి సమీపంలో క్యూలైన్ల ఏర్పాటు.
- 900: శ్రీవారి సేవకుల సేవలు.
- తితిదే సిబ్బంది 600 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ 200, ఎన్‌సీసీ విద్యార్థులు 200, పోలీసు సిబ్బంది 1,600 మందితో భద్రతా ఏర్పాట్లు.
- 150: అన్న ప్రసాదాల కౌంటర్లు.
- తోళప్పగార్డెన్స్, ఉన్నత పాఠశాల ఆవరణ, అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో, పూడి రోడ్డు తదితర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం.
- 284: శాశ్వత, తాత్కాలిక మొబైల్ మరుగుదొడ్ల ఏర్పాటు.
- 3 ప్రాథమిక చికిత్స కేంద్రాలు, 5 అంబులెన్స్‌లు అందుబాటులో.
- 120: సీసీ కెమెరాలతో నిఘా
- 9: డ్రోన్లతో ఏరియల్ వ్యూ.

- **పార్కింగ్ పాయింట్లు:** శిల్పారామం, తనపల్లి కూడలి, మార్కెట్‌యార్డు, రామానాయుడు కల్యాణ మండపం, పూడి కూడలి, తిరుచానూరు దళితవాడ.

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: MITS Deemed to be University, www.mits.ac.in, MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
FM Partner: Mee FM · TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ · Organised by: ఈనాడు
Digital Partner: ఈనాడు.net, ETV BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. . గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, నేంద్రగుంట(వి&పో), పాకాల(మం), తిరుపతి(జి) - 517112
వివరాలకు: 90634 38851, 80087 05935
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, (యానాది), నెల్లూరు

పునః టెండరు ప్రకటన

ఆర్. నెం. DCP/TPTY/01-RE-TENDERS/2025-26 తేది: 24–11–2025.

తిరుపతి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు(16) 2025-26 విద్యా సంవత్సరానికి కావలసిన స్కిన్‌లెస్ బ్రాయిలర్ చికెన్, హోమ్ డెలివరీ మరియు అప్పు ప్రాతిపాదికన సరఫరా చేయుటకు ఆసక్తి కలిగిన వ్యాపారుల నుండి పునఃటెండర్లు కోరబడుచున్నాము. టెండరు ఫారం రుసుము రూ.10,000/- (అక్షరాలా పది వేల రూపాయలు మాత్రమే)ను డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా " The Principal, APTWR School(B), Chennur " వారి పేరున చెల్లించి టెండర్ ఫారం మరియు షెడ్యూలును ప్రిన్సిపాల్, APTWR School(B), గూడూరు @ చెన్నూర్, తిరుపతి జిల్లా వారి కార్యాలయం నుండి తేదీ: 24–11--2025 నుండి 26–11–2025 సాయంత్రం 04:00 గం. ల లోపు కార్యాలయం పనివేళలలో పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు ఫారములను (షెడ్యూల్)ను తేదీ: 27– 11–2025 సా. 03:00గం., లోగా పైన పేర్కొన్న ప్రిన్సిపాల్ వారి కార్యాలయంలో స్వయముగా సమర్పించవలెను. పోస్ట్ ద్వారా టెండర్లు స్వీకరించబడవు. నిర్దేశిత గడువులోగా అందిన టెండర్లను ఐ.టి.డి.ఏ. కార్యాలయంలో తేది. 28–11–2025న మధ్యాహ్నం గం. 11:00లకు కమిటీ సమక్షములో టెండర్లను తెరుపబడును లేదా తరువాత తెలియపరుస్తాము. విద్యాలయాల స్థలాలు మరియు ఇతర వివరముల కొరకు కన్వీనర్ ప్రిన్సిపాల్ వారిని 9440446116 ఫోన్ ద్వారా గాని లేదా స్వయముగా గాని సంప్రదించవచ్చును. పై విషయములలో టెండరు గడువు పొడిగించుట గాని లేదా పూర్తిగా రద్దుచేయుటకు గాని పూర్తి అధికారములు క్రింది సంతకందారునికి కలదు.

ప్రాజెక్ట్ అధికారి / ఛైర్మన్,
కొనుగోలు కమిటి, ఐటీడీఏ (యానాదులు), శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
ఖమ్మం-2 గాంధీచౌక్ బ్రాంచ్ (03111) గాంధీచౌక్, ఖమ్మం-507003.
E-Mail : ubin0803111@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన 8(1) స్థిరాస్తికోసం

అధీకృత అధికారిగా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీచౌక్ బ్రాంచ్, గాంధీచౌక్, ఖమ్మం** యొక్క దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుకోవాల్సిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా సదరు నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 6,78,69,751.41 (అక్షరాల ఆరు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల అరవై తొమ్మిది వేల ఏడు వందల యాభై ఒక్క రూపాయల నలభై ఒక్క పైసలు మాత్రమే)** మరియు వడ్డీ తిరిగి చెల్లించవలసిందిగా **ఋణగ్రహీతలు/డైరెక్టర్స్/హామీదారులు : మెస్సర్స్ వైష్ణవి డయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్,** పునబాక గ్రామం & పోస్ట్, పెల్లకూరు మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బాధ్యులు అయిన డైరెక్టర్లు **01) శ్రీ పామిల్ జైన్ (డైరెక్టర్),** తండ్రి : హేమచంద్ జైన్, ఇ.నెం.199, ద్రోణపురి, జి.యం.యస్.రోడ్, కన్వాలి, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్–248001, **02) శ్రీ విపిన్ జైన్ (డైరెక్టర్),** తండ్రి : హేమచంద్ జైన్, ఇ.నెం.33, లేన్ 2, ద్రోణపురి, వార్డు నెం.49, కన్వాలి, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్–248001, **03) శ్రీ రాజేష్ కుమార్ చౌడ (హామీదారులు)** తండ్రి : మన్సుఖలాల్ చౌడ ఇ.నెం.2-3-99, గాంధీచౌక్, ఖమ్మం, తెలంగాణ–507003, **04) శ్రీ దివ్వెల వెంకటేశ్వరరావు (హామీదారులు),** తండ్రి : సూర్యప్రకాష్ రావు, ఇ.నెం.3-8-216/217, జహీర్‌పుర, గాంధీచౌక్, ఖమ్మం, తెలంగాణ–507003, **05) శ్రీ మురలీధర్ భుటడ (హామీదారులు)** తండ్రి : పన్నాలాల్, ఇ.నెం.2-2-2, గాంధీచౌక్, ఇల్లందు, ఖమ్మం జిల్లా, తెలంగాణ–507123, **06) శ్రీ దయారాం శ్రావన్ కుమార్ (హామీదారులు)** తండ్రి : దయారాం ఫ్లాట్ నెం.65, అంబియన్స్ ఫోర్ట్ కాలనీ, పిల్లర్ నెం.125 ఎదురుగా, అత్తాపూర్, రాజేంద్రనగర్, హైదరాబాద్, తెలంగాణ–500048, **07) మెస్సర్స్ శ్రీ వైష్ణవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, (కార్పోరేట్ హామీదారులు),** సర్వే నెం. 254/ఎ, 254/ఎ/ఎ, 44/3/ఎ, గుండ్రాతిమడుగు గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ–507165 లకు ది. 15–04–2025 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు.

సదరు పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతతో పాటు హామీదారు కూడా విఫలమైనందున, ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా ! సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవాల్సిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు / ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తులను దిగువ సంతకందారు **ది. 18–11–2025** నాడు లాంచనముగా స్వాధీనపరచుకున్నారు.

ముఖ్యంగా ఋణగ్రహీతకు / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ! సదరు ఆస్తులతో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులతో జరిపే ఎట్టి లావాదేవీలైన **రూ. 1,31,45,531.84 (అక్షరాల ఒక కోటి ముప్పై ఒక్క లక్షల నలభై ఐదు వేల ఐదు వందల ముప్పై రూపాయ ఎనభై నాలుగు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మొత్తానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యాపేట బ్రాంచ్ యొక్క ఋణ సంబంధ తాకట్టుకు లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తిని విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసినదిగా ఋణగ్రహీతలను కోరడమైనది.

స్థిరాస్థి యొక్క వివరములు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పెల్లకూరు మండలం, పునబాక గ్రామం సర్వే నెం. 381/2, విస్తీర్ణం ఎ. 9.25 సెంట్లు పారిశ్రామిక ఫ్యాక్టరీ స్థలం మరియు భవనం, ప్లాంటు మిషనరీ మొత్తం యావదాస్థి యొక్క **సరిహద్దులు : తూర్పు :** శాఖామూరి విజయలక్ష్మి మరియు శాఖామూరి సుశీలమ్మ గార్ల భూమి, **పడమర :** పునబాక రోడ్డు, **ఉత్తరం :** మట్టి రోడ్డు మరియు గొంగిరెడ్డి సుధాకర్ రెడ్డి మరియు ఇతరుల భూమి, **దక్షిణం :** చెంబేడు రోడ్డు.

తేది : 18-11-2025, స్థలం : పునబాక, సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రబీ.. లేదిక వరి

మిగిలిపోయిన 1010 ధాన్యాన్ని లారీలో తీసుకెళ్తున్న మిల్లర్లు

- రైతు సేవకు దూరంగా ఏపీసీడ్స్
- ఆవేదనలో సంస్థ వాటాదారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రైతు సేవకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) దూరం అవుతోంది. తాజాగా రబీ సీజన్ దృష్ట్యా విత్తన లక్ష్యం 15 వేలు క్వింటాళ్లు చేయాలని తలచినా ఇప్పటి వరకు ఒక్క గింజా అందుబాటులో ఉంచక పోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెస్తారు.. ఇస్తారంటూ

నిరీక్షిస్తూ రోజులు లెక్కబెట్టుకుంటూ వచ్చిన రైతుల ఆశలను నిలువునా ముంచేసింది. ఏటా రైతులను ఆదుకుంటూ వస్తున్న ఏపీసీడ్స్ విత్తన లక్ష్యంగా ఈ రబీ సీజన్‌కు ఒక్క గింజా ఇవ్వక పోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సీజన్ ముగియడంతో రైతులందరూ ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. ఇదే కొనసాగితే రైతు సేవలో ఏళ్ల చరిత్ర కలిగిన ఏపీసీడ్స్‌ను శాశ్వతంగా మూతవేసుకోవాల్సిందే మరి. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు, పాలకులు దీనిపై మరింత శ్రద్ధ చూపాల్సి ఉంది.

■ **ఎందుకిలా..:** ఏటా 50 వేల క్వింటాళ్లు విత్తనోత్పత్తి కింద లక్ష్యం నిర్దేశం చేస్తూ వస్తున్న ఏపీసీడ్స్ ఈ దఫా లక్ష్యం దిశగా అడుగులు వేయలేక పోయింది. దాదాపు మూడు దశాబ్దాలుగా వరి రకాలకు సంబంధించి ఫౌండేషన్ విత్తనాలను వాటాదారులైన రైతులకు బైబ్యాక్ పద్ధతిన ఇవ్వడం, వాళ్ల పంటలు పండించాక ఆ ధాన్యాన్ని తిరిగి కొనుగోలు చేస్తూ వస్తోంది. కరోనా తరువాత మిగులు ధాన్యంతో అప్పుల ఊబిలోకి చేరుతోంది. ప్రధానంగా ప్రైవేటు వ్యాపారుల బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశించడం, తక్కువ ధరలకు రైతులకు అవసరమైన అన్ని రకాలను అందుబాటులో ఉంచుతూ వస్తోంది. తాజాగా గత ఏడాది రబీలో మిగిలిపోయిన 1010 ధాన్యం రకాన్ని రూ.2 కోట్లు నష్టంతో ప్రస్తుతం మిల్లర్లకు అమ్ముకుంటోంది. అలాగే ఖరీఫ్‌లో సిద్ధం చేసిన కేఎన్ఎం 1638 రకం అదే తరహాలో మిగిలిపోవడం గమనార్హం.

పచ్చిరొట్ట విత్తనాల సాగుకు శ్రీకారం

వరి విత్తనాలు ఏటా మిగిలి పోతున్నాయి. వాటిని నష్టాలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. రెండేళ్లలో దాదాపు రూ.3 కోట్ల వరకు నష్టాలు తప్పలేదు. ఆ కారణంగానే విత్తనోత్పత్తి కింద వరి వంగడాలు పంపిణీ చేయలేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పచ్చిరొట్ట విత్తనాల సాగుకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించాం. వీటి సాగుకు మరింత సమయముంది. వాటాదారులైన రైతులను ఒప్పించి వీటి సాగుకు శ్రీకారం చుట్టేలా అవగాహన తెస్తున్నాం.

- జగదీష్, జిల్లా మేనేజరు, ఏపీసీడ్స్

తిరుమలకు కూరగాయల వితరణ

పలమనేరు, న్యూస్‌టుడే: తిరుమల వెంగమాంబ అన్నదాన సత్రానికి పట్టణానికి చెందిన నాగమల్లీశ్వరి, పత్తిహరినాథ్, శ్రీకాంత్, కదిరి సుబ్రహ్మణ్యం, జయరాం రెడ్డి 13 టన్నుల కూరగాయలను ఆదివారం వితరణగా అందజేశారు. పలమనేరు మార్కెట్ నుంచి ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపారు. సీఐ మురళీమోహన్, ఎస్సై లోకేశ్, కాప్పల్లి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు వసతులు కల్పించి పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము
శ్రీకాళహస్తి :: తిరుపతి జిల్లా
ప్రకటన

ఆర్.సి.నెం.Rev-59-ADMOLA/3/2025, తేది: 23-11-2025

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము, శ్రీకాళహస్తి హక్కు భుక్తములలో గల ఈ క్రింద తెలిపిన గ్రామములో ఉన్న దేవస్థానము భూములను స్వాధీనము చేసిన రోజు నుండి (3) సంవత్సరముల కాలమునకు అనగా 2025 నుండి 2028 వరకు కౌలుకు ఇచ్చుటకు బహిరంగ వేలము నిర్వహించబడుచున్నది. ఆసక్తిగల రైతులు తమ డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

వ. సం.	గ్రామం	విస్తీర్ణం	వర్గీకరణ	కాల పరిమితి	చెల్లించవలసిన ధరావత్తు రూ.	వేలము జరుగు ప్రదేశము తేది, సమయం
1	2	3	4	5	6	7
1	శ్రీకాళహస్తి	ఎ.3.32C (కైలాస పర్వతములలో ఒక భాగమైన)	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, శ్రీకాళహస్తి తేది: 01.12.2025 ఉ:11.00 గం॥లకు
2	శ్రీకాళహస్తి	ఎ.4.06Cts (రామాపురము బి.టి.రోడ్డు నుండి శ్రీ వెయ్యిలింగాల కోన వరకు గిరి ప్రదక్షణ మార్గము)	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, శ్రీకాళహస్తి తేది: 01.12.2025 ఉ:11.00 గం॥లకు
3	బోడిరెడ్డికండ్రిగ (మహాదేవపురం)	ఎ.1.05సెంట్స్	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	గ్రామపంచాయతీ కార్యాలయం/ సచివాలయం, బోడిరెడ్డికండ్రిగ, తేది: 01.12.2025 మ:3.00 గం॥లకు
4.	సుబ్బానాయుడు కండ్రిగ (శ్రీకాళహస్తి మం.)	ఎ.8.08సెంట్స్	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	గ్రామపంచాయతీ కార్యాలయం/ సచివాలయం, బోడిరెడ్డికండ్రిగ తేది: 02.12.2025 ఉ:11.00 గం॥లకు
5	బొక్కిసం పాలెం	ఎ.1.02సెంట్స్	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	బొక్కిసంపాలెం, తేది: 02.12.2025 ఉ:11.00 గం॥లకు
6	కాపుగున్నేరు గ్రామము	ఎ.2.29సెంట్స్ ఎ.0.96సెంట్స్ ఎ.0.49సెంట్స్	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/- రూ.1,000/- రూ.1,000/-	గ్రామపంచాయతీ కార్యాలయం/ సచివాలయం, కాపుగున్నేరు తేది: 02.12.2025 మ:3.00 గం॥లకు
7	పాతగుంట	ఎ.3.72సెంట్స్	పుంజ (Dry)	స్వాధీనం చేసిన దినము నుండి 3సం॥లు కాలం వరకు	రూ.5,000/-	గ్రామపంచాయతీ కార్యాలయం/ సచివాలయం, పాతగుంట తేది: 03.12.2025 ఉ:11.00 గం॥లకు

ఇతర వివరములకు ఈ దిగువ ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
సెల్ నెం: 7013014433/ 9912652553/ 9866456141

THIPPAREDDY BAPI REDDY
కార్యనిర్వహణాధికారి

ప్రముఖులు రాలేదు.. అంధకారం పోలేదు

మంగళం ఆర్టీవో కార్యాలయం కూడలి నుంచి కరకంబాడి వైపు డివైడర్ మధ్యలో ఏడాది క్రితం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇవి తిరుపతికి ప్రముఖులు వచ్చినప్పుడు మాత్రమే వెలుగుతున్నాయి. మిగిలిన సమయంలో చీకట్లే. వాహనాల లైట్ల వెలుగులోనే వాహనదారులు రాకపోకలు సాగించాలి. అంధకారంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- ఈనాడు, తిరుపతి**

మొత్తం తవ్వేశారు.. స్తంభం వదిలేశారు..

ఇసుకాసురుల దాహానికి పలమనేరు పట్టణంలోని చిన్నూరు చెరువు రూపురేఖలు కోల్పోయింది. ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. యంత్రాలతో అడ్డగోలుగా తవ్వేశారు. చివరికి విద్యుత్తు స్తంభం ఉండటంతో చిన్న దిబ్బను వదిలేశారు.

- న్యూస్‌టుడే, పలమనేరు

10 వేల టోకెన్ల జారీ

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 10 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌తో జిల్లా, స్థానిక న్యాయమూర్తులు

శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి. హెచ్. మానవేంద్రనాథ్‌రాయ్ వాయులింగేశ్వరుణ్ని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి అరుణసారిక, ప్రొటోకాల్ న్యాయమూర్తి గురునాథం, స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, బేబీరాణి, కృష్ణప్రియలతో పాటు ఆలయ ఏఈవో మోహన్, ఏపీఆర్‌వో రవి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఉదయం బ్రేక్‌లో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి, సినీనటి నిక్కీ గల్రానీ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

జస్టిస్ ఏవీ శేషసాయి కుటుంబం

సినీనటి నిక్కీ గల్రానీ

'తప్పుగా మాట్లాడా.. క్షమించండి'

మాట్లాడుతున్న శివజ్యోతి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ప్రసాదంపై తాను మాట్లాడిన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే తనను క్షమించాలని యాంకర్ శివజ్యోతి కోరారు. ఆదివారం తన సోషల్ మీడియా ఖాతాలో విడుదల చేసిన వీడియోలో ఆమె మాట్లాడుతూ.. తాను తప్పుడు ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. శ్రీవాణి దర్శన టికెట్ల క్యూలైన్‌లో నిల్చున్నామనే ఉద్దేశంతో మాత్రమే అలా అన్నానన్నారు. తన తోపాటు తన తమ్ముడి తరఫునా క్షమాపణలు చెబుతున్నానన్నారు.

EENADU Classifieds

BUILDING CONSTRUCTION
Hotel Building Plans Statutory Approvals Consultant Required for a high raise in 50 cents. Cont: 92824 05555.

REAL ESTATE
PLOT FOR SALE

GENERAL
తిరుపతి-A రంగంపేట మోహన్‌బాబు స్కూల్ వెనుక 30x44 అం|| ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ ప్లాట్స్ అమ్మబడును. ✆ 73828 81119, 90147 27359.

JOBS
WANTED CHEMIST (Male) B.Sc., Chemistry/ B.Pharmacy M/s. Coastal Laboratories, Akkampeta, TADA. 70133 32427, info@coastal-labs.com.

MGBబజాజ్‌షోరూం తిరుపతి నందు టీంలీడర్స్ (M), వరదాయపాళెం, పుత్తూరు, నగరినందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M)-6, టెలికాలర్ (F)-3 కావలెను జీతం: 12K-15K. ✆ 9154993869, 9246777877.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE Ee WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

బంగారు గొడుగు ఉత్సవం

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారికి సోమవారం ఉదయం జరిగే రథోత్సవాన్ని పురస్కరించుకుని పైభాగంలో అలంకరించే బంగారు గొడుగు ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బంగారు గొడుగు ధర్మకర్త రామనాథన్ అమ్మవారి ఆలయం వెలుపల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు గొడుగును ఆలయ ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు పాల్గొన్నారు.

నేడు మల్లంగుంటలో ఎమ్మెల్యే నాని పర్యటన

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: మల్లంగుంట గ్రామంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పర్యటించనున్నారు. రైతన్నా మీకోసంలో భాగంగా ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయనున్నారని ఏవో సుబ్బారావు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: పద్మావతీ డిగ్రీ కళాశాల ఎదురుగా ఖాళీ స్థలంలో పందులు పోషిస్తున్నారు. కొందరు అనధికారిక వ్యక్తులు వాటికి ఆహారం తెచ్చి అందిస్తున్నారు. పందులు రోడ్డుపై తిరుగుతూ ఇబ్బంది పెడుతున్నాయి. **- చేతన్, పద్మావతినగర్**

సమాధానం: వాటి యజమానులను హెచ్చరించి తరలింపు చర్యలు చేపడతాం.

- గుణశేఖర్, పశువైద్యాధికారి, నగరపాలిక

సమస్య: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న కూడలి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డు దెబ్బతినడంతో పాటు వాహనాల రాకపోకలు సక్రమంగా లేక ట్రాఫిక్ స్తంభిస్తోంది. **- జగదీష్, వైకుంఠపురం**

సమాధానం: పరిశీలించి క్రమబద్ధీకరణ చర్యలు చేపడతాం. **- అమరయ్య, ఉప కమిషనర్, నగరపాలిక**

సమస్య: రాజన్న పార్కు ప్రవేశ మార్గం దిక్కున తప్ప మూడు దిక్కుల్లో అపరిశుభ్రత ఉంది. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వైపు ఎప్పుడూ చెత్త దిబ్బలు వేస్తుంటారు. **- నగేష్, భవానీనగర్**

సమాధానం: పార్కు పరిసరాల్లో వెంటనే చెత్త శుభ్రం చేయిస్తాం. **- యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక**

సమస్య: బాలాజీ కాలనీ సర్కిల్ నుంచి ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వరకు ఫుట్‌పాత్‌పై పెద్ద సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడం, ఫుట్‌పాత్‌లు దుకాణాలతో నిండిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. **- భార్గవ్, విద్యార్థి**

సమాధానం: పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులను ఆదేశించి ఆక్రమణలు తొలగిస్తాం.

- అమరయ్య, ఉపకమిషనర్

పద్మాంబ ముఖారవిందం

తిరుచానూరు: సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

వాహనసేవ ముందు కళాకారుల ప్రదర్శన

హోరాహోరీగా హాకీ పోటీలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో రెండో రోజు ఆదివారం అండర్-14 హాకీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. లీగ్ పోటీలను నాలుగు గ్రూపులుగా విభజించారు. లీగ్ పోటీల్లో గ్రూప్ విన్నర్లు, రన్నర్లలో బాలుర జట్లు ఎనిమిది, బాలికల జట్లు ఎనిమిది నాకౌట్‌కు చేరుకున్నాయి.

నడకదారి మాయం

తిరుపతిలో ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాలు

తిరుపతి న్యూ బాలాజీ కాలనీలో రోడ్డుపై ఏర్పాటు చేసిన ఓ దుకాణాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. ఇటీవల కమిషనర్ మౌర్య కాలనీలో అన్న క్యాంటీన్‌కు వచ్చిన సమయంలో దీన్ని గమనించి తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపట్టారు.

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు వెలుస్తున్నాయి. వాటి వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. వారు నేతల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎప్పుడో కమిషనర్ చూసి తొలగించాలి తప్ప.. అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పదే పదే ఆదేశిస్తున్నా..

తిరుపతి నగరంలో ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలు, కాలువలపై ఉండే దుకాణాలు తొలగించాలని కమిషనర్ ఆదేశాలతో నగర పాలక సంస్థ కార్యాలయం పదేపదే ప్రకటనలు జారీ చేస్తుంది. కానీ ఎక్కడా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సైతం కనీస చర్యలు చేపట్టడం లేదు. బస్టాండ్, రైల్వే స్టేషన్, తిరుమల బైపాస్ రోడ్డు, అలిపిరి, బాబూ జగ్జీవన్‌రామ్ పార్కు రోడ్డు, బైరాగి పట్టెడ, మహిళా వర్సిటీ రోడ్డు, ఎస్వీయూ రోడ్డు అన్ని ప్రాంతాల్లోనూ ఆక్రమించేశారు.

అనుమతులు ఇచ్చేది నాయకులే..

వైకాపా పాలనలో ఫుట్‌పాత్‌పై దుకాణాల ఏర్పాటుకు అనుమతులు నాయకులే ఇచ్చేవారు. కార్పొరేటర్, డివిజన్ స్థాయి నాయకుల అనుమతితో దుకాణాలు ఏర్పాటు చేస్తే అధికారులు అటువైపు వెళ్లేవారు కాదు. డిపాజిట్‌తో పాటు అద్దెలు చెల్లించే అవకాశం ఇవ్వడంతో దుకాణాలు ఎక్కడికక్కడ వెలిశాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పలువురు నేతలు సైతం అనధికారికంగా షాపులు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎస్వీయూకు ఉత్తమ ర్యాంకు

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూ టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్‌లో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసిందని వీసీ నరసింగరావు ఆదివారం తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన 601-800 గ్లోబల్ బ్యాండ్‌లో స్థానం సంపాదించిందని, ఈ గుర్తింపు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన ఆవిష్కరణల ప్రపంచ స్థాయి విద్యారంగాల్లో పెరిగిన విశ్వవిద్యాలయం బలాన్ని ప్రతిఫలిస్తుందని చెప్పారు.

లోకేశ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

బీమా చెక్కు అందజేత

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు పంచాయతీకి చెందిన పెనుగొండ లోకేశ్ ఇటీవల మృతిచెందాడు. జనసేనలో లోకేశ్‌కు క్రియాశీలక సభ్యత్వం ఉంది. దీంతో ఆదివారం విజయవాడలో ప్రమాద బీమా చెక్కు రూ.5 లక్షలు లోకేశ్ భార్య యామినికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు. నాయకులు దేవర మనోహర్, సంజీవి హరి, రఘు పాల్గొన్నారు.

చోరీ ఘటనలో వేగం పెంచిన పోలీసులు.. రేణిగుంట: అమరరాజ కార్మికుల నివాస సముదాయంలోని ఏడు గృహాల్లో శనివారం చోరీ జరిగిన విషయం విదితమే. దీంతో పోలీసులు ఈ చోరీని సవాలుగా తీసుకుని విచారణలో వేగం పెంచారు. ఇప్పటికే వేలిముద్ర నిపుణులు ఇళ్లలో వేలిముద్రలను సేకరించారు. ఆదివారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఇక్కడ ఇటీవల రాకపోకలు సాగించిన వారి వివరాలను సేకరిస్తున్నారు.

పూడనున్న గుంతలు

- నియోజకవర్గంలో త్వరలో 400 కి.మీ. మరమ్మతులు
- కి.మీ.కు రూ.20 వేలు మంజూరు

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: వరుస వాయుగుండాలు, అల్పపీడనాలకు తోడు మొంథా తుపాను తోడవ్వడంతో నియోజకవర్గంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం గుంతల మరమ్మతుకు నివేదికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించింది. రహదారులు భవనాల శాఖ ఇంజినీర్లు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 400 కి.మీ వరకు వర్షాలకు గుంతలు ఏర్పడినట్టు గుర్తించి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం నుంచి మరమ్మతులు చేపట్టడానికి అనుమతులు రావడంతో వాహన చోదకులకు త్వరలో ఇబ్బందులు తొలగనున్నాయి.

అధిక బరువు వాహనాల కారణంగా..

చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల రైతులు పండించిన పంటలను తిరుపతికి తీసుకొచ్చి విక్రయిస్తారు. సామాన్యులు సైతం తమ పనుల కోసం తిరుపతికి రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామీణ మండలం, చంద్రగిరి మండలాల్లో సుమారు 6-7 కంకర క్వారీలు నిర్వహిస్తున్నారు. 30-40 టన్నుల సామర్థ్యం గల టిప్పర్లు కంకర, ముగ్గుపిండిని తరలిస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్లు, ఇటుక ట్రాక్టర్లు వందల ట్రిప్పులతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఎడతెగని వర్షాలకు తోడు సామర్థ్యానికి మించి టిప్పర్లు లోడు వేసుకుని వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రాత్రి వేళ ఈ ఏది గుంతో ఏది రోడ్డో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

వేదాంతపురం జాతీయ రహదారి కూడలి వద్ద దుస్థితిలో రోడ్డు

వర్షాలు ఆగిన వెంటనే పనులు

వర్షాలకు తారు రోడ్లు కంకరతేలి గుంతలమయంగా మారాయి. ఈ నేపథ్యంలో వీటి మరమ్మతుకు కి.మీ రూ.20 వేలు మంజూరు చేసింది. ఆరు మండలాల్లో సుమారు 400 కి.మీ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి సుమారు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. వర్షాలు ఆగిన తర్వాత ఆరు మండలాల్లో ర.భ.శాఖ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చి, రోడ్ల మరమ్మతు చేయనున్నారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత వెంకటసుబ్బయ్య

26న కార్మికుల ధర్నా

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు కాలరాసేలా ఉన్న లేబర్ కోడ్‌ల ఆర్డినెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా ఇన్‌ఛార్జి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు రవి, శ్రీరాములు, కేవై రాజా, శివకుమార్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాగుచేసేవారే లేరా?

ఎస్వీ యూనివర్సిటీ పరిపాలన భవనం పైభాగంలో ఉన్న గడియారం తరచూ మరమ్మతులకు గురవుతోంది. సమయం తప్పుగా చూపుతోంది. విద్యార్థులు సమయం తెలియక తికమక పడుతున్నారు. వర్సిటీ పాలనా యంత్రాంగం కానీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు కానీ దీని గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

-న్యూస్‌టుడే, తిరుపతి(ఎస్వీయూ)

బాబోయ్ శునకాలు

రామచంద్రాపురం నుంచి అప్పలాయగుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో నడవలూరు సమీపంలో శునకాలు రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయి. రాకపోకలకు ద్విచక్ర వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. శునకాలను పట్టించడానికి పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రామచంద్రాపురం**

బురద రోడ్డుతో అవస్థలు

ముత్యాలరెడ్డిపల్లి పరిధిలోని రాయల్‌నగర్‌లోని సాంఘిక సేవాలయం వద్ద రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పైపులు వేయడానికి రోడ్డును తవ్వారు. గోతులు పూడ్చారు. వాటికి అతుకులు వేయలేదు. ఈ మట్టి వర్షాలకు రోడ్డు మీదకు చేరి బురదమయంగా మారింది. రోడ్డు పక్క వ్యర్థాలు సక్రమంగా తొలగించడం లేదు. **-న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణం)**

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

చంద్రమౌళి నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పులివర్తి సుధారెడ్డి, నాయకులు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: కమ్మపల్లి గ్రామానికి చెందిన గుర్రం చంద్రమౌళి(చంద్రశేఖర్) నాయుడు ఇటీవల మృతి చెందారు. ఆయన జన్మించిన గ్రామానికి ఉపయోగపడాలనే ఆలోచనతో కుటుంబ సభ్యులు రూ.30 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు నిర్మించారు. ఆదివారం ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి ఆ హాలును ప్రారంభించారు. చంద్రమౌళి సతీమణి ఇంద్రాణి, కుటుంబ సభ్యులు గౌతం, సుప్రియలను అభినందించారు. నాయకులు చినబాబు, తిరుమలరెడ్డి, నీలకంఠచౌదరి, కేశవులునాయుడు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో భరత్ రెడ్డి తదితరులు

ఫ్రెష్ టు ఫ్రెష్ షోరూం ప్రారంభం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: నగరంలోని మధ్యతరగతి కుటుంబాలకు అన్ని రకాల వస్తువులను గిట్టుబాటు ధరలకు అందించడమే తమ సూపర్ మార్కెట్ లక్ష్యమని ఫ్రెష్ టు ఫ్రెష్ డీలర్ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైరాగిపట్టెడలో రెండో సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. మూడో బ్రాంచ్‌ను డిసెంబర్‌లో తిమ్మినాయుడుపాలెం వద్ద త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

నిస్వార్థ సేవకు నిదర్శనం సత్యసాయి

నగరపాలక కార్యాలయంలో బాబాకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలిక, తుడా కార్యాలయాల్లో ఆదివారం పుట్టపర్తి శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరపాలిక ఉప కమిషనర్ అమరయ్య, తుడా కార్యాలయంలో కార్యదర్శి డా.శ్రీకాంత్ బాబు నేతృత్వంలో ఉద్యోగులు సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ప్రజలకు నిస్వార్థ సేవ చేస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు.

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సత్యసాయి బాబు శతజయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి డీఆర్వో నరసింహులు నివాళులర్పించారు.

బరిలో దిగితే.. పతకాలు సొంతం

✦ క్రీడల్లో పద్మావతీ డిగ్రీ కళాశాల విద్యార్థినుల సత్తా

క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో శ్రీ పద్మావతీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటుతున్నారు. ఇటీవల ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ జిల్లా స్థాయి పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తో పాటు పలు పతకాలు సాధించారు.

ఆత్మవిశ్వాసం పెంచాయి..

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. అవి నాలో ఆత్మవిశ్వాసం నింపాయి. పద్మావతి కళాశాలలో ఖోఖో, వాలీబాల్, పరుగు పోటీల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ఎస్వీయూ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఖోఖో, పరుగు పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచాను.

- ఎన్.తనూజ, బీకాం విద్యార్థిని

నాయకత్వ లక్షణాలు..

బాస్కెట్‌బాల్‌లో ప్రథమ స్థానం సాధించా. అథ్లెటిక్స్‌లో 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొన్నా. 4 వందల మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి పతకం సాధించా. మూడేళ్లుగా ఈ పోటీలో నేనే విజేతగా నిలుస్తున్నా. క్రీడల్లో పాల్గొంటే నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. **- బి.భవ్యశ్రీ, బీకాం విద్యార్థిని**

ఉపకారవేతనాలకు ఎంపిక

గతంతో పోల్చితే ప్రస్తుతం అమ్మాయిలకు అవకాశాలు పెరిగాయి. క్రీడారంగంలో మహిళల సంఖ్య మరింతగా పెరగాలి. నేను నాలుగు సార్లు రాష్ట్రస్థాయి ఖోఖో, బాస్కెట్‌బాల్ క్రీడల్లో పాల్గొంటున్నా. ఎస్వీయూ జట్టు తరఫున బెంగళూరు, కేరళలో బాస్కెట్‌బాల్ ఆడి విజేతగా నిలిచాం. ఎస్వీయూ నుంచి రూ.6 వేలు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యా. **- ఎల్.హర్షిత, బీఎస్సీ విద్యార్థిని**

చిన్ననాటి నుంచి..

నేను ఆరో తరగతి నుంచి క్రీడల్లో పాల్గొంటున్నా. వాలీబాల్, షాట్‌పుట్, బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో నాలుగు సార్లు ప్రథమ స్థానంలో నిలిచా. గతేడాది వాలీబాల్ విజేత జట్టులో ఉన్నా. బ్యాడ్మింటన్, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించా. ఎస్వీయూ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నాం.

- హెచ్.శిరీష, బీకాం విద్యార్థిని

మహిళల కోసం పింక్ మరుగుదొడ్డి

తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత పింక్ టాయిలెట్ ఏర్పాటు చేశారు. పరిశుభ్రంగా, సౌకర్యాలతో ఉండేలా నగరపాలక అధికారులు చర్యలు తీసుకున్నారు. శానిటరీ న్యాప్‌కిన్స్ ఏర్పాటు చేశారు. మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. సోలార్ విద్యుత్తు ఉపయోగిస్తున్నారు. **-ఈనాడు, తిరుపతి**

విద్యార్థులపై దాడి.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇద్దరు విద్యార్థులపై దాడి చేసి దూషించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన శివశంకర్ నాయక్, బాబు నాయక్ ఎస్వీయూలో ఎంఏ చదువుతున్నారు. వారు నగరంలోని ఓ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌కు అడ్మిషన్ కోసం వెళ్లారు. ఆ సమయంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నారాయణతోపాటు స్నేహితుడు జగదీష్ అక్కడ ఉన్నారు. విద్యార్థులు తాము విద్యార్థి సంఘం నాయకులుగా చెప్పడంతో మాటామాటా పెరిగింది. దీంతో జగదీష్ వారిపై దాడి చేస్తూ కులం పేరుతో దూషించారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దాడితోపాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కనుమ రహదారిలో అడ్డుగా లారీ

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: భాకరాపేట కనుమ రహదారిలో ఎస్ మలుపు వద్ద ఆదివారం మధ్యాహ్నం భారీ లారీ అడ్డుగా నిలిచిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై నుంచి అనంతపురానికి కెమికల్ రాళ్లతో వెళ్తున్న భారీ వాహనం భాకరాపేట కనుమను అధిగమించలేక ఇక్కడ ఆగిపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న చంద్రగిరి పోలీసులు క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

శ్రీమలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ.. ఏర్పేడు, న్యూస్‌టుడే: శ్రీ వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పేడులోని వెంకటగిరి నూతన బైపాస్ రోడ్డు కూడలిలో ఆదివారం ఘనంగా శ్రీ సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల్లో శ్రీ గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, గురుపూజ, వివిధ రకాల హోమాలను చేపట్టి స్వామివారి విగ్రహానికి శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వాహకులు పంపిణీ చేశారు. ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, వెంకటరమణారెడ్డి, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామికి కుంభాభిషేకం

బీఎన్‌కండ్రిగ: బీఎన్‌కండ్రిగ ఎస్సీఐ సమీపంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు గణేష్‌శెట్టి, చంద్రశేఖర్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్మించిన నూతన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పండితులు హరితేజ స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

నారా భువనేశ్వరికి నాప్‌కిన్‌ల అందజేత

భువనేశ్వరికి నాప్ కిన్లను అందజేస్తున్న మల్లికార్జున్ చౌదరి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: శ్రీసిటీలోని స్లైట్ ఎకో ఇండస్ట్రీస్ కంపెనీ ఎండీ పరుచూరి మల్లికార్జున్ చౌదరి ఎన్టీఆర్ ట్రస్టుకు తమ తొలి ఉత్పత్తులు పదివేల నాప్ కిన్లు పంపిణీ చేశారు. ఆదివారం కుప్పం పర్యటనకు వచ్చిన ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్ నారా భువనేశ్వరి చేతుల మీదుగా తమ కంపెనీ తొలి ఉత్పత్తులను ఆవిష్కరించి నాప్ కిన్లు ట్రస్టుకు వితరణగా అందజేశారు. ఉత్పత్తులను నారా భువనేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టమని ఎండీ పరుచూరి మల్లికార్జున్ చౌదరి అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బత్తులవల్లం విద్యార్థులు

నజ్మీ

ఉదయ్‌కుమార్

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని బత్తులవల్లం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. శనివారం మంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్‌-17 విభాగంలో పదో తరగతి విద్యార్థి నజ్మీ, అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఉదయ్‌కుమార్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో అహోబిలంలో జరగనున్న రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో నజ్మీ ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొననుంది. ఉదయ్‌కుమార్ చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పోటీలో పాల్గొననున్నారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు బందిల కుమార్‌లను ప్రధానోపాధ్యాయులు జయసుధ, ఉపాధ్యాయులు అభినందించారు.

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని పల్లమాల ప్రాథమిక పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి ఎంఈవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయిని పద్మావతిలు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. గ్రామస్థులు మోహన చౌదరితో ఆల్ఫా ఇండ్ అసోసియేషన్ న్యూయార్కు, వారి ఆర్థిక సహకారంతో రూ.లక్షా48 వేలతో భోజనశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ ప్రమీల, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, అనురాధ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం.. పట్టని వైనం

కోతకు గురైన రహదారి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పుతలపట్టు-నాయుడుపేట పాత రోడ్డులో ఇప్పటికీ వాహనాల రాకపోకలు యథేచ్ఛగా ప్రయాణిస్తున్నాయి. పట్టణంలోని పానగల్ సమీపంలోని నక్కలకాల్వ పక్కన ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అక్కడున్న నేల కోతకు గురై ప్రమాదకరంగా మారింది.

వర్షం.. ప్రమాదాలకు ఆస్కారం

అసలే వర్షా కాలం. రాత్రయితే తేలికపాటి వర్షం పడుతోంది. రాత్రి వేళల్లో మంచు కురుస్తోంది. దీంతో పరిసర ప్రాంతాలు కన్పించడం కష్టసాధ్యంగా మారుతోంది. వాహనాల రాకపోకల నేపథ్యంలో ఇక్కడి ప్రమాదకర పరిస్థితిని గమనించకుండా ఏవైనా వాహనాలు ఇటు వైపుగా దూసుకెళ్తే ఊహించని ప్రమాదం సంభవిస్తుంది.

భద్రత చర్యలు అవశ్యం

నక్కల కాల్వపై వంతెన సమీపంలో మట్టి కోతకు గురికావడంతో భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. ఇక్కడి పరిస్థితిని ఆలాగే వదిలేస్తే ప్రమాదం జరిగే అవకాశం లేక పోలేదు. తాత్కాలికంగా ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే విధంగా రక్షణ వలయంగా గోడను నిర్మించడం, అంతలోపు ఇనుప డివైడర్లను అక్కడ ఉంచడం ద్వారా వాహన చోదకులు ఇక్కడి ప్రమాదంపై అప్రమత్తం అయ్యే అవకాశముంది. ఆ దిశగా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: నాగలాపురం బ్రాహ్మణ వీధిలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డుపై వ్యర్థాలు పేరుకుపోయాయి. **- వరదామన్**

● **సమాధానం:** రెండు రోజుల్లో శుభ్రత పనులు చేయిస్తాం. **- సునీత, ఉపసర్పంచి**

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: **సమస్య:** శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి ఎస్టీ కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో వర్షాలతో నీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- గణేష్, స్థానికుడు**

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో చర్చించి వర్షపునీరు నిల్వచేరకుండా తగు చర్యలు తీసుకుంటాం. **- పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో, శ్రీకాళహస్తి**

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: జీఎన్‌కండ్రిగలో పలు వీధుల్లో చెత్త నిల్వలు పేరుకు పోవడంతో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- రవి**

సమాధానం: వీధుల్లో చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- సృజన, పంచాయతీ కార్యదర్శి**

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: బైటకొడియం బేడు ఎస్సీకాలనీలో వీధిబోరు పని చేయడం లేదు. విద్యుత్తు సరఫరా లేని సమయంలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బోరుకు మరమ్మతులు చేయించాలి. **- బాబు**

సమాధానం: వారం రోజుల్లో వీధిబోరుకు మరమ్మతులు చేయిస్తాం. **- మదనమోహన్‌రెడ్డి, సర్పంచి**

సత్యవేడు, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక మసీదు వద్ద స్థానికులు, దుకాణదారులు నిత్యం చెత్త కుప్పలు వేస్తున్నారు. దీంతో తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. **- రుక్మిణి**

సమాధానం: చెత్త వేయరాదని గతంలో స్థానికులకు, దుకాణ దారులకు అవగాహన కల్పించాం. మరోమారు చెప్పి చూస్తాం. లేకపోతే నోటీసులు జారీ చేస్తాం. చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

- మునిరవికుమార్, పంచాయతీ కార్యదర్శి

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రేమతత్వం.. సేవాతత్పరత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎదుటి వారిపట్ల ప్రేమ కలిగి ఉండటం, పేదలకు సాయం చేయడం సత్యసాయిబాబా నిర్దేశించిన మార్గాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. సాయి సేవా సమితి నేతృత్వంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రశేఖర్, సత్య సాయి సేవా ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. **ఏర్పేడు, న్యూస్‌టుడే:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను ఏర్పేడు, కాళహస్తి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి ఆధ్వర్యంలో బండారుపల్లి గ్రామ సచివాలయం ఎదుట సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి స్థానికులు పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యంయాదవ్, శివశంకర్‌రెడ్డి, రమణ, ధనంజయులు పాల్గొన్నారు. **రేణిగుంట:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవో పీఆర్‌డీ ప్రభురావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

న్యాయమూర్తి జస్టిస్ తాతా వితస్థగంజుతో ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి సేవలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వితస్థ గంజు పాల్గొన్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, ఏపీఆర్‌వో రవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి చెన్నైకు చెందిన సెల్వవర్షిణి దంపతులు రూ.50,116లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదు చెక్కును ఆలయ ప్రొటోకాల్ ఏఈవో మోహన్‌కు అందజేశారు. ఏపీఆర్‌వో శేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విరగక ముందే మేల్కోండి

దశాబ్దాల నాటి విద్యుత్తు స్తంభం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలోని ఆలయం సమీపంలో ఓ విద్యుత్తు స్తంభం కింద భాగంలో పెచ్చులూడిపోయింది. ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరింత పాడై పడిపోయే అవకాశం ఉందని, ప్రమాదం జరగక ముందే కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

చినుకు పడితే మడుగు

ఏర్పేడు మండలంలోని మేర్లపాక అంగన్‌వాడీ భవనం పురాతన కాలంనాటిది కావడంతో పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి చినుకుపడినా భవనంలో మడుగులా నీరు చేరుతుంది. దీంతో ఏ సమయంలో ఏప్రమాదం జరుగుతుందోనని భయాందోళనల మధ్య అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక వర్షా కాలంలో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల వరండాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే పాత భవనం ప్రమాదాలకు నిలయంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

వేటొద్దు.. విషాద ఘటనకు సాక్ష్యం కావొద్దు

ఉరుకుల పరుగుల కాలంలో కాసింత ఆటవిడుపు దొరికితే ఆ క్షణాలను మైమరచి ఆస్వాదించడం సహజం. పైగా చిన్నారులైతే చేసే సందడి అంతా ఇంతా కాదు. తొట్టంబేడు మండలం పొయ్య సమీపంలో రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారి పక్కన చెరువు కలుజు కాలువ గట్టుపై ఆదివారం సెలవుదినం కావడంతో స్థానిక గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు సరదాగా చేపల వేట సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈతకు, చేపలు పట్టేందుకు వెళ్లి పదుల సంఖ్యలో చిన్నారులు గల్లంతై కన్నవారికి కడుపుకోత మిగిల్చిన విషయం తెలిసిందే. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

కొనసాగుతున్న అక్రమ రవాణా

భైరాజులకండ్రిగ నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న గ్రావెల్ ట్రాక్టర్

కేవీబీపురం, న్యూస్‌టుడే: గ్రావెల్ అక్రమ రవాణా కొనసాగుతోంది. మండలంలోని బ్రాహ్మణపల్లి, భైరాజులకండ్రిగ, రంగయ్యగుంట, ఎస్ఎల్ పురం గ్రామాలకు సమీపంలోని కొండల్లో గ్రావెల్ తరలించేందుకు అక్రమార్కులు రాత్రి పగళ్లు కష్టపడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా యంత్రాలను వినియోగించి గుట్టుచప్పుడు కాకుండా పట్టణాలకు తరలిస్తున్నారు. ఈప్రాంతాల్లో నాణ్యమైన గ్రావెల్ దొరుకుతుండటంతో అక్రమార్కులు ఈగ్రామాలను ఎంచుకుంటున్నారు. ఎర్ర గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండటంతో ట్రాక్టర్ రూ.1,200 నుంచి రూ.1,500 వరకు విక్రయించుకుంటూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. సమస్య పట్ల స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా అక్రమార్కులకు వంత పలుకుతున్నారు. గ్రావెల్ అక్రమ రవాణా అక్రమార్కులకే కాదు.. అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న అక్రమార్కుల గుట్టురట్టు చేసి ప్రభుత్వ సంపదకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

కొండ వద్ద ఆందోళన చేస్తున్న ఎగువపూడి గ్రామస్థులు

‘కాలుష్యం తెచ్చే క్వారీ మాకొద్దు బాబోయ్’

కేవీబీపురం: నిత్యం కాలుష్యం వెదజల్లే క్వారీ మాకొద్దు బాబోయ్ అంటూ మండలంలోని ఎగువపూడి గ్రామస్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. మండలంలోని ఎగువపూడి గ్రామానికి సమీపంలోని కొండల్లో నూతన క్వారీకి జిల్లా అధికారులు అనుమతులు ఇవ్వడంపై స్థానికులు మండి పడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీ ఏర్పాటు చేయాలంటే కనీసం గ్రామస్థులతో గ్రామ సభ ఏర్పాటు చేయాలన్నారు. స్థానికులకు కాలుష్యం లేకుండా తీసుకునే చర్యలు వివరించాలన్నారు. గ్రామస్థుల అనుమతి పొందిన తరువాతనే క్వారీ నిర్మాణం చేపట్టాలని.. అలా కాకుండా ఏకంగా ప్రారంభానికి సిద్ధం చేయడం విడ్డూరమని వాపోయారు. కొండలు ఉండటంతో పశువుల మేతకు అనువైన స్థలమని అలాంటి ప్రదేశంలోనే క్వారీ ఏర్పాటు చేస్తే ఇబ్బందికరమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎగువపూడిలో నిర్మించే క్వారీ ఏర్పాటును రద్దు చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు.

లక్ష్యంతోనే విజయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని శ్రమించడంతో సులభతరంగా విజయాలను సాధించవచ్చునని ఎస్ఓఎస్ రీసోర్స్ పర్సన్ డా.ఎస్.రత్నశేఖర్ తెలిపారు. మండలంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో ఆదివారం కుటుంబ బలోపేతం, పదో తరగతి తర్వాత తీసుకోవాల్సిన వివిధ కోర్సుల వివరాల గురించి దత్తత గ్రామాల్లోని వంద మంది విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ భవిష్యత్తుకు తీసుకోవాల్సిన ప్రణాళికల విధానం వివరించారు. ఇంటర్ గ్రూపులు, పాలిటెక్నిక్, ఐటీఐ, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, వాటి ఉపయోగాలు గురించి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, మునిరత్నం, వెంకటరమణ పాల్గొన్నారు.

‘పూజా సామగ్రి అంటకట్టవద్దు’.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి దర్శనార్థం వచ్చే భక్తులకు అవసరం లేకున్నా పూజా సామగ్రి, దీపాలు అంటకట్టడాన్ని ట్రస్టుబోర్డు ఛైర్మన్ కార్యాలయ సహాయకులు అడ్డు చెప్పారు. దుకాణ దారులు మోసాలకు గురిచేస్తుంటే ఏం చేస్తున్నారని ఆదివారం అక్కడి అర్చకులను నిలదీశారు.

వైద్య శిబిరానికి స్పందన.. బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: కాటూరులో పీపుల్స్ వెల్‌ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా డా.లక్ష్మీనారాయణ, డా.రాజేష్, డా.భవ్య సమీప గ్రామ ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షులు డా.ఏడుకొండలు, సభ్యులు పాల్గొన్నారు

‘రైతన్నా మీకోసం’ విజయవంతమే లక్ష్యం

మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘రైతన్నా మీకోసం ఐదు సూత్రాలు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెదేపా రాష్ట్ర అధికారప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కోరారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు ముందస్తు పెట్టుబడి కింద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో పంటల సాగుకు సంబంధించి మెలకువలు తెలియజేసేందుకు వీలుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నేతలు రాఘవులు, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెంచయ్యనాయుడుకు ఘన సత్కారం

శ్రీకాళహస్తి: మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన చెంచయ్యనాయుడును సహకార బ్యాంకు ఛైర్మన్ ఖాదర్‌బాషా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం రంగయ్యనాయుడు నివాస గృహంలో ఆయన్ను కలసి సత్కరించారు. బ్యాంకు వైస్ ఛైర్మన్ గోవర్ధన్, డైరెక్టర్లు అనిల్‌కుమార్, రాంబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్యాన్లు వితరణ

ఏర్పేడు : గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయానికి భీమవరానికి చెందిన వెంకటరమణ నాలుగు ఫ్యాన్లు, వైర్లు వితరణగాఅందజేశారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని సామగ్రిని పంపిణీ చేశారు. అధికారులు దాతలకు శ్రీఆనంద వల్లీదేవి సమేత శ్రీపరశురామేశ్వరస్వామి దర్శన ఏర్పాట్లు చేసి వేదపండితుల మంత్రోచ్ఛారణలతో దాతలను అభినందించారు.

బెదిరింపులపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగిన మహిళపై పురపాలక సంఘ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. సన్నిధివీధిలో అక్రమ కట్టడాన్ని కూలదోసే సమయంలో అక్కడి దుకాణ యజమానురాలు ఉరివేసుకునేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. చనిపోతానంటూ బెదిరింపులకు గురిచేయడంపై పురపాలక సంఘ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో దుకాణ దారులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఇబ్బందుల్లో.. ‘పుర’ అధికారులు

శ్రీకాళహస్తి: సన్నిధివీధిలో ఆక్రమణల తొలగింపు అంశం పురపాలక సంఘ అధికారులకు ఇబ్బందులను తెచ్చిపెట్టనుంది. సాధారణంగా ఎవ్వైనా అక్రమ కట్టడాలను తొలగించాలంటే ముందస్తుగా సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. ఇటీవల సన్నిధివీధిలో తొలగించిన దుకాణం విషయానికి సంబంధించి అలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండా కూలదోశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం.

వీధి దీపాల ఏర్పాటు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లి పంచాయతీ ఎస్సీకాలనీలో ఎట్టకేలకు వీధిదీపాలను ఏర్పాటు చేశారు. వీధిదీపాలు లేక రాత్రివేళల్లో పాముల బెడదతో ప్రజలు ఈ నెల 20వ తేదీన ‘ఈనాడు’లో ‘మేమున్నాం..మీకు తోడుగా’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి దుడ్డు వేణుగోపాల్ వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. **నాగలాపురం, న్యూస్‌టుడే:** మండలంలోని గోళ్లవారికండ్రిగలో వీధి దీపాలను సర్పంచి పళని ఆదివారం పునరుద్ధరించారు. గ్రామంలో వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రివేళల్లో అంధకారం అలముకోవడంపై ఈనెల 22వ తేదీన ‘మేమున్నాం.. మీకు తోడుగా.’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన పాడైన వీధి దీపాల స్థానంలో నూతన దీపాలను ఏర్పాటు చేశారు.

స్పందనకు వందనం

వెలుగులొచ్చాయి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ బంగారమ్మ కాలనీలో పలుచోట్ల వీధి దీపాలు వెలగక పోవడంతో అంధకారంతో స్థానికులు అగచాట్లు పడుతున్నారు. దీనిపై ఇటీవల ‘ఈనాడు’లో ‘మేమున్నాం-మీకుతోడుగా’తో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సర్పంచి కొత్త దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

పల్లె వీధులు.. మురుగు కూపాలు

సంతవేలూరులో బురదగా మారిన వీధి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని కొన్ని పల్లెల్లో వీధులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో అడుగు తీసి అడుగు వేసేపరిస్థితి లేదు. పలు ప్రాంతాలు బంక మట్టి నేలలు కావడంతో వర్షాలకు బురదగా మారడంతో ఈ మాత్రం అడుగు తడబడగానే కాలుజారి కింద పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో వీధుల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది. పలు గ్రామాలకు సిమెంటు రోడ్లు మంజూరవుతున్నా, పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో పల్లె వీధులు అధ్వానంగా మారాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు అధ్వానంగా ఉన్న వీధులను గుర్తించి సీసీరోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అడుగు తీసి అడుగు వేయలేం

ఈ చిత్రం వరదయ్యపాళెం మండలం సంతవేలూరు ఎస్సీకాలనీలోనిది. ప్రస్తుత వర్షాలకు ఓ వీధి ఇలా తయారైంది. బంకమన్ను కావడంతో అడుగు పెట్టగానే ఏమాత్రం తడబడితే కాలుజారి కింద పడే ప్రమాదం ఉంది. స్థానికులు ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే ఓ సాహసం చేయాల్సిందే. ముఖ్యంగా వృద్ధుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇతరుల సాయంతో నడవాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితులు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నెలకొంది.

వరదయ్యపాళెం ఎస్సీకాలనీలో అధ్వానంగా వీధి

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరు, ముస్లింపాళెం, గొసియానగర్, కళత్తూరు ఎస్సీకాలనీ, వరదయ్యపాళెం పంచాయతీలోని ఎస్సీకాలనీ, అరుంధతీవాడ, వడ్డిపాళెం, లక్ష్మీపురం, సాధనవారిపాళెం, కడూరు ఎస్సీకాలనీ, సీఎల్‌ఎన్‌పల్లి ఎస్సీకాలనీ, కారిపాకం, పాండూరులలో వీధులు అధ్వానంగా ఉన్నాయి.

● నాగలాపురం మండలంలో అడవికండ్రిగ, టీపీకోట, ఎస్ఎస్‌పురం, వేంబాక్కం గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ● కేవీబీపురం మండలంలో పెరిందేశం, కళత్తూరు, ఆదవరం, కల్లూరు, ఆదరం, అంజూరుపాళెం గ్రామాల్లో రోడ్లు దుస్థితికి చేరాయి.

● నారాయణవనం మండలంలో ఎరికంబట్టు, వెత్తలతడుకు, బొబ్బరాజుపాళెం, గోవిందప్పనాయుడుకండ్రిగ ఎస్సీకాలనీలో ఇదే పరిస్థితి నెలకొంది. ● సత్యవేడు మండలంలో ఉలవచేను, వానెల్లూరు, కొత్తమారికుప్పం, మల్లావారిపాలెం ఈస్ట్ ఎస్సీకాలనీ, పుదుకుప్పం, బీఎన్‌కండ్రిగ మండలంలో కాంపాళెం, వేణుగోపాలపురం, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, తహనగర్‌లలో వీధులు బురదగా మారాయి.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గామిట్ట వీధికి చెందిన శివయ్య (47) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం కారు ఢీకొని మృతి చెందాడు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ఘటనలో వేగం పెంచిన పోలీసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: అమరరాజ కార్మికుల నివాస సముదాయంలోని ఏడు గృహాల్లో శనివారం చోరీ జరిగిన విషయం విదితమే. దీంతో పోలీసులు ఈ చోరీని సవాలుగా తీసుకుని విచారణలో వేగం పెంచారు. ఇప్పటికే వేలిముద్ర నిపుణులు ఇళ్లలో వేలిముద్రలను సేకరించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆదివారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సీఐ జయచంద్ర సీసీటీవీల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. అదే విధంగా ఇక్కడ ఇటీవల రాకపోకలు సాగించిన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ చోరీలో 450 గ్రాముల బంగారం, మూడు కేజీల వెండి అపహరణకు గురైన విషయం విదితమే.

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గూడూరు పట్టణం, గ్రామీణం, ,వాకాడు: ఈనెల 24, 25న విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ నరేంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయుడుపేట- కృష్ణపట్నం పోర్టు ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు సంబంధించి చెందోడు సబ్ స్టేషన్‌కి వచ్చే 132 కేవీ లైన్‌లో రెండు టవర్ల నిర్మాణం జరుగుతుండటం వల్ల అంతరాయం ఉంటుందని ఆయన చెప్పారు. చెందోడు సబ్ స్టేషన్ లోడ్‌ను గొటిప్రోలు, గూడూరు సబ్ స్టేషన్‌కి మళ్లించనున్నట్లు వివరించారు. చిల్లకూరు మండలంలోని చింతవరం, వరగలి, తమ్మినపట్నం, కోట మండలంలోని కోట, విద్యానగర్, సిద్ధవరం, కొత్తపాలెం ప్రాంతాల్లో కొన్ని ఫీడర్ల కింద లో వోల్టేజ్ సమస్య ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	124
లేయర్	130
బ్రాయిలర్స్	224
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	221

నేటి ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే

బాలాయపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారని తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. సమస్యలపై వినతులు ఇచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో ప్రతిభ

బహుమతులు అందుకుంటున్న గూడూరు విద్యార్థులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సైన్స్ సంబరాలు-2025 వేడుకల్లో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో పట్టణంలోని ఎల్‌ఏపీ పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారని చెప్పారు. విద్యార్థులు చరణ్, హర్ష, వినీల్ కుమార్‌లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఆకాశం మేఘావృతం.. అన్నదాతల్లో కలవరం

▸ తరచూ వర్షాలతో పంటకు వాటిల్లుతున్న నష్టం
▸ వరినాట్లకు అంతరాయంగా తాజా అల్పపీడనం

నాయుడుపేట, న్యూస్‌టుడే: డివిజన్‌లో రబీకి వరినాట్లు వేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాత కలవరానికి గురవుతున్నాడు. గత నెలరోజుల నుంచి తరచూ వర్షం కురవడంతో పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. ప్రస్తుతం మళ్లీ మూడు రోజుల నుంచి మేఘావృతం కావడంతో రబీ సాగుకు తీవ్ర అంతరాయం కలగనుంది.

నాయుడుపేట వ్యవసాయ సబ్‌డివిజన్‌లో సాగు విస్తీర్ణం ఎకరాల్లో

నాయుడుపేట	పెళ్లకూరు	చిట్టమూరు	వాకాడు	కోట
15,587	19,950	29,865	17,972	13,619

ముంచేసిన మొంథా

గత నెలలో మొంథా తుపాను ప్రభావంతో వారం రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పలుచోట్ల నారుమళ్లకు నష్టం జరిగింది. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు స్వర్ణముఖి మామిడికాలువ, తెలుగుగంగ బ్రాంచి కాలువలు ప్రవహించడంతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి వానలు తగ్గుముఖం పట్టిన అనంతరం వారం రోజుల నుంచి నాయుడుపేట, సూళ్లూరుపేట వ్యవసాయ సబ్‌డివిజన్లలో రైతులు నారు మళ్లు వేయడం ప్రారంభించారు. పొలాలు దుక్కిచేయడం. నారు పీకడం, వరినాట్లు వేయడం, రసాయన ఎరువులు పిచికారీ చేయడం వంటి పనుల్లో కర్షకుడు నిమగ్నమయ్యాడు.

జీలపాటూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

పొలాల్లో నీటితడి

బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో అల్పపీడనం ఏర్పడి దీని ప్రభావంతో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత మూడు రోజుల నుంచి ఒక మాదిరిగా వర్షాలు కురవడంతో పొలాల్లో నీటితడి అలాగే ఉండిపోయింది. తాజాగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు ఎక్కడ మళ్లీ నీటిలో మునుగుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే నాట్లు వేసే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య: సూళ్లూరుపేట నుంచి సుగ్గుపల్లి గ్రామం మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే ఆర్టీసీ బస్సు మూడు నెలల నుంచి రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– గాలి.వెంకటరమణారెడ్డి, సుగ్గుపల్లి గ్రామం

సమాధానం: ఈనెల 24 నుంచి శ్రీకాళహస్తికి బస్సు సౌకర్యం ఉంటుంది.
– కళ, ఆర్టీసీ డిపో మేనేజర్, సూళ్లూరుపేట

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి సేవలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వితస్థగంజు పాల్గొన్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, ఏపీఆర్‌వో రవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

ప్రదర్శనలో ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ దినోత్సవాన్ని విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సైకిల్ ర్యాలీ చేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. **వెంకటగిరి:** విద్యార్థులు సేవా తత్వం అలవరచుకోవాలని ఏపీపీ ప్రభుత్వ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. అధ్యాపకులు జ్యోతిశ్వర నాయుడు, హనుమంతరావు, యుగంధర్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ, మేనకూరు సెజ్, తిరుపతిలోని ఈఎంసీ క్లస్టర్ పరిధిలోని 14 బహుళ జాతీయ పరిశ్రమల్లో దాదాపు 720 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పాసైన వారు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

శ్రీమలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఏర్పేడు: శ్రీ వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పేడులోని వెంకటగిరి నూతన బైపాస్ రోడ్డు కూడలిలో ఆదివారం ఘనంగా శ్రీ సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలో శ్రీ గణపతిపూజ, వాస్తుపూజ, కలశ స్థాపన, గురుపూజ, హోమాలు చేపట్టి స్వామివారి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. అన్నదానం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, వెంకటరమణారెడ్డి, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

అందాలకు మెరుగు.. స్వశక్తితో పరుగు

◆ బ్యూటీషియన్ రంగంలో రాణిస్తున్న అతివలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వారంతా తమ కుటుంబ ఓ ప్రత్యేకత ఉండాలని భావించారు. కుటుంబ బాధ్యతల్లో భాగం పంచుకుంటూనే స్వశక్తితో జీవితంలో ఎదగాలనుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని ఉపయోగించుకున్నారు. పట్టణంలోని సునీత సేవా సంస్థ అందించిన ఉచిత బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ తీసుకున్నారు. అనంతరం సౌందర్యశాలలను ఏర్పాటుచేసి బ్యూటీషియన్ రంగంలో తమదైన ముద్రవేస్తున్నారు. ఆర్థికంగా ఎదిగి పలువురికి ఉపాధి కల్పిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలిచిన అతివలపై ప్రత్యేక కథనం.

పనితనాన్ని నిరూపించుకొని

ఉమ్మడి నెల్లూరు జిల్లా సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన మహిత బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకున్నారు. పెళ్లిళ్లు, పండగల్లో బ్యూటీషియన్‌గా చేస్తూ పనితనాన్ని నిరూపించుకున్నారు. గూడూరుతో పాటు ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అనేక పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతుల అందాలను మెరుగులు పెడుతూ, ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

పేద కుటుంబాల వారికి శిక్షణ

గూడూరు పట్టణంలోని రాజీవ్ దిలో రాధా షీ బ్యూటీ పార్లర్ నడుపుతున్నారు. 10 ఏళ్లుగా ఈ రంగంలో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి చెందారు. ఎన్నో పెళ్లిళ్లు, శుభకార్యాల్లో మహిళల అందాలకు మెరుగులు దిద్దారు. పేద కుటుంబాలకి చెందిన యువతులకు తక్కువ ఖర్చుతో బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వారి జీవితంలో సంతోషం నింపుతున్నారు.

సమాజ సేవకు పూనుకొని

గూడూరు రెండో పట్టణంలోని మాళవ్యానగర్‌లో రాజేశ్వరి హనీ బ్యూటీపార్లర్‌ను నిర్వహిస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా బ్యూటీషియన్ రంగంలో రాణిస్తూ ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నారు. పలువురు యువతులకు శిక్షణ ఇస్తూ, సమాజ సేవకి పూనుకున్నారు. అందాల రంగంలో రాజీ లేకుండా రాణిస్తున్నారు.

చిల్లకూరు: చిత్రపటానికి నమస్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు ✦ వెంకటగిరిలో నగరోత్సవం ✦ సూళ్లూరుపేటలో పాల్గొన్న ఆర్డీవో కిరణ్మయి

సత్యసాయికి ఘన నివాళి

చిల్లకూరు, వెంకటగిరి, గూడూరు పట్టణం, సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట: పుట్టపర్తి శ్రీసత్యసాయి శత జయంతిని చిల్లకూరు, వెంకటగిరి, గూడూరు పట్టణం, సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేటలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది సత్యసాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ మండల కేంద్రాల్లోని బాబా మందిరాల్లో భక్తులు పూజలు చేసి, ధ్యానం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఆసుపత్రి నిర్వహణకు అనారోగ్యం



తడలో ఓబుల్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రి నిర్వహణకు నీళ్లొదిలేశారు. ఆసుపత్రి భవనంపై చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక గోడలపై నుంచి కారుతోంది. ఆసుపత్రి చుట్టూ చెత్త పేరుకుపోతోంది. చీమల పుట్టలు సైతం పెరుగుతున్నాయి. గోడలపై మొక్కలు పెరుగుతున్నాయి. ఆసుపత్రి లోపల, బయట శుభ్రత చర్యలు చేపట్టడం లేదు. పరిశుభ్రత లోపించింది. **- న్యూస్‌టుడే, తడ**

లక్ష్మణ్‌నగర్.. మట్టిరోడ్లు

పట్టణంలోని 24వ వార్డు లక్ష్మణ్‌నగర్‌లో గత కొన్నేళ్లగా స్థానికులు మట్టి రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ ప్రజావసరాలకు ఉపయోగపడే వాటిపై అధికారులు, పాలకులు దృష్టిసారించడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా వీధిలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. **- న్యూస్‌టుడే, నాయుడుపేట**

కల్వర్టు.. ప్రమాదం జరిగేట్టు

మండలంలోని కలవకూరు సమీపంలో ర.భ శాఖ రోడ్డుపై ఉన్న కల్వర్టు శ్లాబ్ శిథిలావస్థకు చేరింది. శ్లాబుకు రంధ్రాలు పడి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. పంట కాలువపై నిర్మించిన కల్వర్టుపై భారీ సామర్థ్యం ఉన్న ఇసుక లారీలు నిత్యం తిరగడంతో మరింతగా దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా పరిణమించింది. కల్వర్టుకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెళ్లకూరు**

గుండె గతుక్కుమంటోంది

సూళ్లూరుపేట నుంచి పిండిపాళెం మీదుగా శ్రీధనమల్లి, కోట, వాకాడుకు వెళ్లే ర.భ శాఖ రహదారి పిండిపాళెం వద్ద ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దుస్థితికి చేరింది. ఈ దారిలో వెళ్లాలంటే చోదకులు హడలెత్తిపోతున్నారు. శ్రీధనమల్లి నుంచి పిండిపాళెం వరకు సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేసి గుంతలు పూడ్చాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం**

భవనంపై కొమ్మలు.. కింద పిల్లలు

సూళ్లూరుపేట మండలం కొనుంబట్టు గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వృక్షం వేర్లతోటి లేచిపోయి స్కూలు భవనంపై వాలిపోయి ఉంది. ఈ చెట్టు కింద విద్యార్థులు ఆటకుంటుంటారు. పెద్ద గాలులు వీస్తే చెట్టు కింద పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కొని చెట్టును తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం**

చెందోడులో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని చెందోడులో ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గూడూరుకు చెందిన మెడిపల్స్ రక్తనిధి నిర్వాహకులు దాతల వద్ద రక్తం సేకరించారు. మెడిపల్స్ రక్తనిధి నిర్వాహకులు సురేష్, సంస్థ ఛైర్మన్ లీలా మోహన్‌కృష్ణ, విజయలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

లోకాయుక్త కమిషనర్‌తో భేటీ

వెంకటగిరి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం లోకాయుక్త కమిషనర్ కోనా వంశీకృష్ణను జనసేన నేత తోట కృష్ణయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం వెంకటగిరిలోని స్వగృహానికి వచ్చిన లోకాయుక్త కమిషనర్‌ను కలిసి సత్కరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. పాలకేంద్రం వద్ద నిర్మించనున్న ఆర్చి పనులను వివరించారు. పలువురు ప్రముఖులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది

కోట, న్యూస్‌టుడే: మహత్తరమైన భారత రాజ్యాంగం నేడు ప్రమాదకర పరిస్థితిలో ఉందని దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బహుజన ఐక్య వేదిక, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, జేఏసీ నాయకులు పేర్కొన్నారు. కోటలో ఆదివారం బహుజన ఐక్య వేదిక, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, జేఏసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. బహుజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, రేంజర్ రాజేష్, ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి'

వెంకటగిరి: కేంద్రం మావోయిస్టులపై చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని మార్పు సంస్థ వ్యవస్థాపకుడు పవన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగపరంగా ఆదివాసీలకు వారి హక్కులను కల్పించాలన్నారు.

'పూజా సామగ్రి అంటకట్టవద్దు'

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి దర్శనార్థం వచ్చే భక్తులకు అవసరం లేకున్నా పూజా సామగ్రి, దీపాలు అంటకట్టడాన్ని ట్రస్టుబోర్డు ఛైర్మన్ కార్యాలయ సహాయకులు అడ్డు చెప్పారు. దుకాణ దారులు మోసాలకు గురిచేస్తుంటే ఏం చేస్తున్నారని ఆదివారం అక్కడి అర్చకులను నిలదీశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్జావారిపాలెంకు చెందిన సుప్రియ(50) అనే మహిళ మృతి చెందారు. ఎస్సై పవన్‌కుమార్ వివరాల మేరకు సుప్రియ కుమారుడితో కలసి ద్విచక్ర వాహనంపై విద్యానగర్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా వెనుక ఉన్న ఆమె ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

పేరు గొప్ప.. అభివృద్ధి డొల్ల

✦ దుగరాజపట్నం గ్రామస్థుల ఆవేదన

గూడూరు గ్రామీణం- వాకాడు, న్యూస్‌టుడే: దుగరాజపట్నం పేరు దేశంలోనే గుర్తింపు పొందింది. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుగరాజపట్నం ఓడరేవును ప్రతిపాదించింది. అయితే గ్రామం అటవీ శాఖ పరిధిలో ఉందంటూ ఓడరేవును పక్కన ఉన్న తూపిలిపాలెంలో నిర్మించాలని భూములు గుర్తించారు. అక్కడ కూడా దుగరాజపట్నం ఓడరేవుగానే నామకరణం చేశారు. అలాగే గూడూరు- దుగరాజపట్నం, నాయుడుపేట- దుగరాజపట్నం రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఈ రోడ్లు కూడా గ్రామం వరకు నిర్మించలేదు. మధ్యలోనే నిర్మించి నిలిపివేశారు. గ్రామంలో రోడ్డు గత అయిదేళ్లుగా గుంతలమయంగా మారింది. వర్షం వస్తే నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. అభివృద్ధి పేరు మాత్రం ఊరి పేరు మీదుగానే జరుగుతున్నా గ్రామంలో ఏమాత్రం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గ్రామంలో గుంతలమయంగా రోడ్డు

జిల్లాలో పెద్ద తీరప్రాంత గ్రామం

మండలంలోనే దుగరాజపట్నం మేజర్ పంచాయతీ. దీని పరిధిలో 8 మజరా గ్రామాలున్నాయి. వీటిలో నాలుగు మత్స్యకార గ్రామాలు పెద్దవి. జిల్లాలోనే పెద్ద తీర ప్రాంత గ్రామం.

ఆక్వా సాగుకు రాని అనుమతులు

రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు అందించే రాయితీ కూడా తమ గ్రామానికి వర్తించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను దీనిపై ప్రశ్నిస్తే అటవీ శాఖ పరిధిలో ఉందంటూ సమాధానమిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ ఆక్వా రైతులు ఇటీవల జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు కూడా దిగారు. గ్రామంలో ఆక్వా సాగుకు అనుమతులు ఇవ్వమని అధికారులు తెగేసి చెబుతున్నారు. మొన్నటి వరకు ఇచ్చిన అనుమతులు ఇప్పుడు ఏమైనట్లు అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణానికి నోచుకోని కాలువ

వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ నీరు దుగరాజపట్నం గ్రామ చెరువులోకి నేరుగా చేరేలా ప్రత్యేక కాలువ తవ్వాలని 15 ఏళ్ల కిందట రూ.62 లక్షల నిధులను మంజూరు చేశారు. అయినా కాలువ నిర్మాణం నేటికీ జరగలేదు.

చెరువులో పడి వృద్ధురాలు ..

సుబ్బమ్మ (పాత చిత్రం)

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పశువుల పేడను తీసుకెళ్లిన దబర కడిగేందుకు చెరువు దగ్గరకెళ్లి ఓ మహిళ జారిపడి చనిపోయిన విషాద ఘటన మండలంలోని చుట్టి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బాలాయపల్లి పంచాయతి చుట్టి గ్రామానికి చెందిన ఆవుల సుబ్బమ్మ (62) ఆదివారం ఉదయం ఇంటి దగ్గర పశువుల పేడను అల్యూమినియం దబరలో తీసుకెళ్లి దిబ్బలో వేసింది. పక్కనే ఉన్న చెరువులో దబరతో పాటు చేతులు కడిగే ప్రయత్నంలో నీటిలో పడిపోయి, ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మాల్యాద్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తడ, న్యూస్‌టుడే: కొండూరు పంచాయతీ పరిధిలోని మాంబట్టు సెజ్‌రోడ్డు కూడలిలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు సూళ్లూరుపేట నుంచి మాంబట్టు పారిశ్రామికవాడలోని భారత్‌ఫోర్జ్ పరిశ్రమలో పనిచేసే బిహార్‌కు చెందిన కూలీలు ద్విచక్ర వాహనంపై గ్యాస్ సిలిండర్‌తో కూడలిలో మలుపు తిరుగుతుండగా, అదే మార్గంలో చెన్నైకు వెళ్లే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పింకూ కుమార్, అఖిలేష్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు.

అంత్యక్రియలు

స్వర్గీయ శ్రీ లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు
ఈశ్వరవాక, చిట్టమూరు మండలం
YSRCP సీనియర్ నాయకులు

ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అణువణువునా నింపుకున్న మహోన్నత వ్యక్తి
మనసున్న మారాజు, ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే గొప్ప మనసున్న వ్యక్తి
శ్రీ లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు
తేది 23-11-2025 ఆదివారము స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
అశ్రు నయనాలతో...
కుటుంబ సభ్యులు

అంత్యక్రియలు : తేది : 24-11-2025 సోమవారం విద్యానగర్‌లోని DRR అపార్ట్‌మెంట్ TTD రోడ్ నుండి గం॥ 2.30 ని॥లకు అంత్యక్రియలు జరుగును. కావున తెలియజేయడమైనది.

(c) eenadu

ఈనాడు
విశాఖపట్నం
సోమవారం 24 నవంబరు 2025

కొవిడ్ వైరస్ 'గుట్టు'రట్టు..!

ఏయూ విద్యార్థుల పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులు కొవిడ్-19 వైరస్‌పై చేసిన పరిశోధనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. వీరి పరిశోధనలో టీకా నుంచి కొవిడ్ వైరస్ తప్పించుకున్నట్లు గుర్తించారు. ఏయూ టీకాబ్స్-ఇ ప్రయోగశాల వ్యవస్థాపకులు డాక్టర్ రవికిరణ్ యేడిది విద్యార్థుల బృందానికి మార్గదర్శకత్వం వహించారు. 'కొవిడ్ వైరస్ స్పైక్ ప్రొటీన్‌లో కొన్ని భాగాలు అస్థిరత్వం కలిగి ఉంటాయి. ఘన స్థితిలో ఉన్న అవి క్షణ కాలంపాటు ద్రవ స్థితిలోకి పరివర్తనం చెందుతుంటాయి. దీంతో కొవిడ్-19 టీకా వేసుకున్న వ్యక్తిలో ఉత్పత్తి అయిన ప్రతినిరోధకాలు అయోమయ స్థితిని ఎదుర్కొని వైరస్‌ను నిరోధించే సామర్థ్యాన్ని కోల్పోతాయి.' అని విద్యార్థుల పరిశోధనలో తేలింది.

★ విద్యార్థులు మణికంఠ పోడసాని (ఎం.ఫార్మసీ), అభినవ్ గ్రంధి (ఫార్మా డీ), నిహారిక మూకల (ఎమ్మెస్సీ), జాహ్నవి చింతలపాటి (ఎమ్మెస్సీ), మాధురి విస్సాప్రగడ (ఎమ్మెస్సీ)లు వరుసగా బయో ఫిజిక్స్, కంప్యూటర్ సిమ్యులేషన్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ, జీన్‌క్లోనింగ్ ప్రయోగాలు చేయగా మధుమిత అగ్గున్న (ఎమ్మెస్సీ) పలు సాఫ్ట్‌వేర్ పద్ధతులను ఆ ప్రయోగాలకు జోడించింది. ఇటీవల ఈ పరిశోధక పత్రం ప్రతిష్ఠాత్మక ఎల్సేవియర్ అంతర్జాతీయ జర్నల్ బి.బి.ఎ.లో ప్రచురితమైంది.

పరిశోధన పత్రాన్ని వీసీ ఆచార్య రాజశేఖర్‌కు అందిస్తున్న రవికిరణ్

★ భవిష్యత్తులో కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలను బయోటెక్నాలజీతో అనుసంధానించి కొవిడ్-19 టీకా సమర్థతను పెంచవచ్చని రవికిరణ్ తెలిపారు. నూతన ఆవిష్కరణ సాధించినందుకు ఆయనకు, విద్యార్థి బృందానికి వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ అభినందనలు తెలిపారు.

ప్రేమమూర్తి.. సేవా దీప్తి..

భగవాన్ సత్యసాయిబాబా శత జయంతిని ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎంవీపీకాలనీలోని సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో సత్యసాయి చిత్రపటాన్ని కొలువుదీర్చి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేశారు. – న్యూస్‌టుడే, మద్దిలపాలెం

ఏడాది కోర్సు.. ఉపాధి భేష్..!

'దయాల్బాగ్'లో బైక్ మెకానిజంలో శిక్షణ

సంస్థ చిరునామా: విశాలాక్షినగర్ (కైలాసగిరి కూడలి)	
కోర్సు: ద్విచక్రవాహనాల మరమ్మతు	శిక్షణ వ్యవధి: ఏడాది కాలం
	విద్యార్హత : కనీసం పదోతరగతి

ఒక బ్యాచ్‌లో శిక్షణ: 25 మందికి
ఐదేళ్లలో తర్ఫీదు: 92 మంది
ఉద్యోగావకాశాలు: 65 మంది

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

ఆర్థిక, ఇతర కారణాలతో పదో తరగతి, ఇంటర్ వరకే చదివిన యువతకు వృత్తివిద్యలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది దయాల్బాగ్ విద్యాకేంద్రం. ప్రస్తుతం ద్విచక్ర వాహన మరమ్మతుల(బైక్ మెకానిజం) కోర్సు నిర్వహిస్తున్నారు. నిపుణులైన శిక్షకులతో థియరీ, ప్రాక్టికల్స్‌లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం ధ్రువపత్రం అందజేయడంతోపాటు ద్విచక్ర వాహనాల షోరూమ్‌లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

ద్విచక్రవాహన మరమ్మతులో తర్ఫీదు పొందుతున్న యువత

నేర్పించే అంశాలు ఇవీ..: యమహా సంస్థ నుంచి శిక్షితులైన సిబ్బంది వచ్చి ద్విచక్ర వాహనాల మరమ్మతులో మెలకువలు, విడిభాగాల బిగింపు, ఇంజిను నిర్వహణపై తర్ఫీదు ఇస్తారు. మొదటి మూడు నెలలు ద్విచక్రవాహన భాగాల గురించి అవగాహన కల్పిస్తారు. తరువాత ఒక్కో భాగాన్ని విడదీసి వాటి నిర్వహణ గురించి వివరిస్తారు. ఆరు నెలల తర్వాత ఇంజిన్ సర్వీసింగ్, అందులో వివిధ భాగాల పనితీరు, వాటిని తిరిగి బిగించడం నేర్పిస్తారు. ఎనిమిదో నెల నుంచి 10వ నెల వరకు ద్విచక్రవాహనాన్ని పూర్తిగా విడదీసి, అన్ని భాగాలను విజయవంతంగా బిగించేలా ప్రయోగాలు చేయిస్తారు. పది నుంచి 12 నెలల వ్యవధిలో యమహా షోరూంకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యక్షంగా తర్ఫీదు అందిస్తారు.

వెంటనే ఉపాధి అవకాశాలు: ఐదేళ్ల క్రితం ద్విచక్రవాహన మరమ్మతుల కోర్సు ప్రారంభించాం. మొదట్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు వచ్చేవారు. రెండేళ్ల నుంచి మంచి స్పందన వస్తోంది. యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని మా మత గురువు లాల్ సాహెబ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కోర్సు నిర్వహిస్తున్నాం. ఈ ఐదేళ్లలో 70శాతం వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు.



– దక్షిణామూర్తి, కోర్సుల సమన్వయకర్త

మొక్కేస్తూ... మెక్కేస్తూ!

★ పచ్చదనం పేరిటన ఇష్టారాజ్యం
★ రెండున్నరేళ్లలో రూ.33 కోట్ల ఖర్చు
★ ఇటీవల మరో రూ.10 కోట్లతో పనులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : పచ్చదనం పేరిట ప్రజాధనం వృథా అవుతోంది. నగరంలో నిర్వహిస్తున్న సదస్సుల దృష్ట్యా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా... ఆ స్థాయిలో ఫలితాలు ఉండడం లేదు. కొందరు అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నా... ఉన్నతాధికారులు స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇటీవల ఆర్కేబీచ్ మార్గంలో చేపట్టిన పనులు

వైకాపా హయాంలో...: 2023 మార్చిలో జి-20 భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. విమానాశ్రయం నుంచి రుషికొండ సమీపం వరకు పచ్చదనం అభివృద్ధి చేశారు. జాతీయ రహదారి డివైడర్‌పై కొత్త మట్టి పోసి, మొక్కలు నాటారు. ఆర్కేబీచ్ నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు ఉన్న డివైడర్‌పై అందమైన ఉద్యానవన మొక్కల్ని నాటారు. వాటి సంరక్షణకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అలా పచ్చదనం కోసం రూ.30 కోట్లు ఖర్చు చేశారు. అప్పటి నుంచి నిర్వహణ ఖర్చుల కింద మరో రూ.3 కోట్లు నిధులు వెచ్చించారు. ప్రస్తుతం ఆర్కేబీచ్-రాడిసన్ బ్లూ మార్గంలో తప్పితే ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదు. దీనిపై విచారణ చేయిస్తే.. బాధ్యులెవరో తెలుస్తుంది.

మళ్లీ ఇటీవల... ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో మరో రూ.10 కోట్లతో పచ్చదనం అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే జీవీఎంసీ కొనుగోలు చేసిన మొక్కలు ఎన్ని..? అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చిన మొక్కలు ఎన్ని..? నేలపై నాటినవి ఎన్ని..? తాత్కాలికంగా కుండీల్లో నాటినవి ఎన్ని..? వాటి నిర్వహణ ఎవరిది...? తదితర అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే పచ్చదనం అభివృద్ధి చెందుతుంది. లేనిపక్షంలో నిధులన్నీ మళ్లీ వృథా అయినట్టే.

కాసులు కొట్టు.. పోస్టులు పట్టు..!

ఏయూ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు
భారీగా డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రక్రియలో వర్సిటీ అధికారులు పారదర్శకత పాటించలేదనే ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పోస్టులను అనర్హులకు ఇవ్వాలని కొందరు పెద్దలు ఒత్తిడి చేయగా ఏయూ అధికారులు ఆ ప్రక్రియను పక్కన పెట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత వర్సిటీలోని అదే వ్యక్తులు ఫైలును ముందుకు కదిలించడంతో కృతకృత్యులయ్యారు. దీని వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయని తెలుస్తోంది.

నాలుగేళ్ల కిందట ప్రకటన..: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 33 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2018లో ప్రకటన జారీ చేశారు. కొన్ని కారణాలతో నాడు ఆ ప్రక్రియ నిలిచిపోయింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత 2021లో మళ్లీ ప్రకటన జారీ చేశారు. అప్పట్లో ఈ పోస్టులకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో కొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని అప్పట్లో సీఎంవో నుంచే ఒత్తిళ్లు వచ్చాయి. ఏయూలోని మహిళా ఉద్యోగి ఒకరు ఆయా దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలించగా నకిలీవని గుర్తించారు. వాటిని ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డులకు పంపించగా.. ఆయా బోర్డులు కూడా నకిలీవని నిర్ధారించాయి. దీంతో నాడు ఆ పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు ధైర్యం చేయలేదు. ఫలితంగా ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది.

తెర వెనుక ఆ నలుగురు: ప్రభుత్వం మారిన తర్వాత అప్పట్లో ఒత్తిడి తీసుకొచ్చిన అభ్యర్థుల్లో 28మందికి రెండు నెలల క్రితం ఉద్యోగాలు ఇస్తూ ప్రస్తుత అధికారులు నేరుగా ఉత్తర్వులు ఇవ్వడం వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశమైంది. గుట్టుచప్పుడు కాకుండా భర్తీ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో పోస్టును రూ.లక్షలకు అమ్ముకున్నారని, ఏయూలోని నలుగురు వ్యక్తులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారని ఆరోపణలు వస్తున్నాయి.

జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాల మేరకు..: 'గత ప్రభుత్వ హయాంలోనే దరఖాస్తులను పరిశీలించి ఫైలు తయారు చేశారు. ఆ ఫైలును అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశించింది. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో పోస్టులను భర్తీ చేశామ'ని రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తెలిపారు. తాము కొత్తగా చేసింది ఏమీ లేదన్నారు.

మూడు చోట్ల ప్రసాద విక్రయాలు

కనకమహాలక్ష్మికి 'మార్గశిర' పూజలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారికి శ్రీచక్ర నవావర్చన, లక్ష్మీహోమం, వేద, సప్తశతీ పారాయణం, మహా విద్యాపారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా టి.ఆనంద్ కుమార్ మిమిక్రీ ఏర్పాటు చేశారు.

★ భక్తుల సౌకర్యార్థం అమ్మవారి దేవస్థానం పార్కింగ్ వద్ద రెండు, బురుజుపేట అవుట్‌గేట్ వద్ద రెండు, టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఒకటి చొప్పున ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఈవో శోభారాణి తెలిపారు.

★ వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు మార్గశిరమాసం గురువారాల్లో మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల మధ్యలో దర్శనాలకు ఏర్పాట్లు చేశామన్నారు.

అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

దేశభక్తి.. కళా యుక్తి..

నడుముకు రింగ్.. చేతుల్లో మువ్వన్నెల పతాకాలు.. తలపై మండుతున్న దీపాలను అలంకరించుకుని లయ తప్పకుండా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం చూపరులను కట్టి పడేసింది. ఈ అద్భుత దృశ్యం ఆదివారం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆవిష్కృతమైంది. 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
–న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం

వ్యర్థాలు వేయకుండా.. వినూత్న ఆలోచన..!

కాలనీల్లోని ఖాళీ స్థలాల వద్ద కొందరు వ్యర్థాలు పారబోస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం ఉండటం లేదు. దీంతో జీవీఎంసీ, కొంతమంది స్థానికులు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాన్ని శుభ్రం చేసి దేవుడి ఫొటోలు పెట్టి ముగ్గులు వేయడం, కుండీల్లో మొక్కలు ఉంచడం వంటి చర్యలు తీసుకున్నారు. ఇవి సత్ఫలితాలు ఇస్తుండటంతో నగరమంతా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మాధవధార

కళింగనగర్ ప్రధాన రహదారిలో..

TANISHQ
A TATA PRODUCT
VIP Road Jewellery Showroom requires
RETAIL SALES OFFICER
Male candidates having relevant retail experience will be preferred.
Freshers can also apply.
Walk-in Interview
(24th to 26th November 2025 between 11 am & 2 pm) at
Tanishq, VIP Road, Vizag
Ph : 2592122/23

మెస్సీ 'కిక్'.. కిర్రాక్..!

వడ్డాది మెస్సీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం రెల్లివీధికి చెందిన వడ్డాది మెస్సీ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 19 నుంచి 21 వరకు సత్యసాయి జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) పోటీల్లో పాల్గొన్న మెస్సీ.. ప్రతిభ చూపి, అండర్-14 బాలుర విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. రాష్ట్రం నుంచి జాతీయ జట్టుకు ఎంపికైన ముగ్గురిలో మెస్సీ ఒకడు.

★ వైజాగ్ గూడ్స్ కార్గో బెర్త్ (వీజీసీబీ-వేదాంత) సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది జులై నుంచి 50 మంది క్రీడాకారులకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో తర్ఫీదు పొందిన మెస్సీ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందని వీజీసీబీ సీఎస్ఆర్ మేనేజర్ జేఎస్.శ్రీలక్ష్మి తెలిపారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..
★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈపీఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ
6లో

మనోనేత్రమే కరుణాస్త్రం..!

★ ఫైనల్ మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్
★ గిరిజన బాలికపై సర్వత్రా ప్రశంసల వర్షం

పాంగి కరుణకుమారి

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భారత అంధ మహిళల క్రికెట్ జట్టు తొలిసారి టీ-20 ప్రపంచకప్ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను ఏడు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారి 27 బంతుల్లో 42 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయపథాన నడిపించింది.

గిరిజన గ్రామం నుంచి అంతర్జాతీయ క్రికెట్‌లోకి..: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కూలీలైన రాంబాబు, సంధ్య దంపతుల నలుగురు పిల్లల్లో కరుణ రెండో సంతానం. ఈమెకి అన్న, ఇద్దరు చెల్లెళ్లు. పుట్టుకతోనే దృష్టి లోపంతో బాధపడుతున్నా తల్లిదండ్రులు మిగిలిన పిల్లల్లాగే గ్రామంలోని పాఠశాలలో ఏడో తరగతి వరకూ చదివించారు. అనంతరం విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులోని ఎండాడ వద్దనున్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం ఇక్కడ పదో తరగతి చదువుతోంది.

అక్కడ పరుగుల వరదతో అవకాశం..: మూడేళ్ల కిందట ఆంధ్ర జట్టుకి ఎంపికైన కరుణకుమారి నిలకడగా రాణిస్తూ పరుగుల వరద పారించడంతో ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచకప్ టీ-20 జట్టుకు దేశం తరపున ఎంపికైంది. గతంలో వరల్డ్ గేమ్స్‌లో క్రికెటర్‌గా రాణించిన మాగుపల్లి సత్యవతి కోచ్‌గా ఉండటంతో ఆమె మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగింది. వన్‌డౌన్ లేదా సెకెండ్ డౌన్‌లో దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలర్‌గానూ రాణించడం ఈమెకు కలిసొచ్చింది.

అంతర్జాతీయ, దేశవాళీ టీ-20 క్రికెట్‌లో గణాంకాలు..

	మ్యాచ్‌లు	పరుగులు	అత్యధికం	హాఫ్‌సెంచరీలు	వికెట్లు
అంతర్జాతీయం	5	129	42	0	1
దేశవాళీ	17	412	67	3	6

తొలి ప్రపంచకప్ గర్వంగా ఉంది..: ఎండాడ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరడం నా జీవితాన్ని మార్చి వేసింది. ప్రిన్సిపల్ విజయ, కోచ్ సత్యవతిల ప్రోత్సాహంతో జాతీయ జట్టుకి ఎంపికయ్యాను. ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన నేను తల్లిదండ్రుల సహకారంతో ఇక్కడి వరకు రాగలిగాను. ప్రపంచకప్ జట్టులో తెలుగు రాష్ట్రాల నుంచి ఏకైక భాగస్వామిని కావడం, దేశానికి తొలి ప్రపంచకప్‌ను అందించడం గర్వకారణంగా ఉంది.
– పాంగి కరుణకుమారి, టీ-20 ప్రపంచకప్ విజేత జట్టు క్రీడాకారిణి

జయహో.. 'విశాఖ'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి పదో వింటర్ సబ్ జూనియర్, జూనియర్ ఈత పోటీలు ఆదివారం బీచ్‌రోడ్డులోని ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు వద్ద ముగిశాయి. విశాఖ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగాల్లో బి.పృథ్వీతేజ్(ఎన్టీఆర్ జిల్లా), సీహెచ్.గౌతమ్ (గుంటూరు), ప్రీతి(విశాఖ) ఛాంపియన్లుగా నిలిచారు. 'ద' జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఏపీ స్విమ్మింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, మోహన్‌వెంకట్రామ్ పాల్గొన్నారు.

విశాఖ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

alwar das group
SIMS Estd. 1996
Scaling READ
SRINIVASA INSTITUTE OF MANAGEMENT STUDIES
(Affiliated to Andhra University, Approved by AICTE, Govt. of India)
BBA SPOT & MANAGEMENT QUOTA ADMISSIONS
Last Date for Admissions 28-11-2025 - 04.00 PM
Call: 97010-06001, 83747-14324
Few BBA Spot / Management Quota (B-Category) Seats are available with Lowest Fees. Eligibility: 50% Marks in Inter.
CAMPUS HIGHLIGHTS
❖Located in a 12 Acre Lush Green Campus ❖Digitized Library
❖Amphi Theatre ❖Girls Hostel Available
❖Indoor & Outdoor Sports ❖Seminar Hall
❖Placement as Priority
Alwardas Educational Campus, Law College Jn., Opp. International Cricket Stadium, P.M.Palem, Vizag.

మిద్దె తోట.. ఆరోగ్యానికి బాట!

మురళీనగర్, న్యూస్‌టుడే: కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరాన్ని పచ్చనివనంలా మార్చేందుకు నిర్ణయించుకున్న ఆ మహిళలు చేతులు కలిపారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెనింగ్ పేరుతో వనమాలి, మన కూరగాయలతోట అనే రెండు సంస్థలను స్థాపించారు. ప్రస్తుతం ఈ గ్రూపుల్లో నగరానికి చెందిన సుమారు 3వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు.

వనమాలి లక్ష్యం: మన ఆహారాన్ని మనమే సేంద్రియ పద్ధతిలో పండించుకోవడం.
★ రసాయనాలు లేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందరికీ అందేలా చూడటం.

ఓ సభ్యురాలి ఇంటిపై పెంచిన మొక్కలు

ప్రతి నెలా సమావేశాలు: నగరాల్లో ఇళ్ల ముందు స్థలాలు లేకపోవడంతో మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ తక్కువ స్థలంలోనే పచ్చదనాన్ని పెంపొందించడంపై వీరు దృష్టి సారిస్తున్నారు. ప్రతినెలా ఒక్కో ప్రాంతంలో సభ్యులంతా సమావేశమై విత్తనాలు, మొక్కలు ఇచ్చిపుచ్చుకుంటారు. సీనియర్ గార్డెనర్స్ సూచనలను స్వీకరించి అమలు చేస్తారు. కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలతో కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. భవిష్యత్తులో వారు మొక్కలపై మమకారాన్ని పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యం: బహుళ అంతస్తుల్లో ఉన్నవారంతా ఒకేచోట తోటలు పెంచుకునేలా కమ్యూనిటీ గార్డెనింగ్‌ను ప్రోత్సహిస్తున్నాం. కనుమరుగైపోతున్న పాతరకం ఆకు కూరలు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వాటి విత్తనాలను ఉత్పత్తి చేసి సభ్యులకు పంచుతున్నాం. నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా కార్యకలాపాలు సాగిస్తున్నాం.
– అరుణ అరవల, సరిత మల్ల, జ్యోతి నాదెళ్ల, వనమాలి, మన కూరగాయల తోట సంస్థల ప్రతినిధులు

నిర్యాణము
శ్రీ C.K. MURTHY గారు
16-11-2025 ఆదివారం నాడు హైదరాబాద్‌లో స్వర్గస్థులైనారని తెలుపుటకు విచారిస్తున్నాము.
కుటుంబసభ్యులు
జానకి చిట్టూరి
అనిల్, బినా, డిలాన్ & హడ్సన్ చిట్టూరి
లీనా, కిరణ్ & రియా వుప్పల
శ్రీ చిట్టూరి కృష్ణమూర్తి
(Sri C.K. Murthy)
5 మార్చి 1943 - 16 నవంబరు 2025
పెద్దకర్మ తే: 26-11-2025 బుధవారం లాంకోహిల్స్, క్లబ్ హౌస్, మణికొండ, హైదరాబాద్. ✆ 9666895906

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

ఏలేరు.. గలగలపారే ఏరులా!

కాలువలో కొనసాగుతున్న పూడికతీత పనులు

★ డ్రెడ్జింగ్ విధానంలో పూడికతీత
★ వచ్చే ఏడాది మార్చికి పనులు పూర్తి

అగనంపూడి, న్యూస్‌టుడే : విశాఖ నగరంతో పాటు పలు పరిశ్రమల నీటి అవసరాలు తీరుస్తున్న ఏలేరు కాలువలో పూడికతీతకు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. నీటి సరఫరా ఆగితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున డ్రెడ్జింగ్ పద్ధతిలో పూడికను తొలగిస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో మట్టిని తొలగించి కాలువలో నీటి ప్రవాహాన్ని పెంచుతున్నారు. జీవీఎంసీ, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, గంగవరం పోర్టు, ఏపీఐఐసీ(ఫార్మాసిటీ ఇతర పరిశ్రమలు)కు ఏలేరు నీరే ప్రధాన ఆధారం. గత కొన్నేళ్లుగా నిర్వహణ పనులు లేక పెద్దఎత్తున కాలువలో పూడిక పేరుకుపోయింది. దీంతో ఏలేశ్వరం నుంచి నగరంలోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వచ్చే జలాల్లో ఎక్కువ శాతం వృథా అవుతున్నాయి. దీని నివారణకు నీటి సరఫరా విభాగ అధికారులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

★ పోలవరం ప్రాజెక్టు ఎడమకాలువ ప్యాకేజీ-8 కింద ఈ ఏడాది జూన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. తాళ్లపాలెం నుంచి కేబీఆర్ వరకూ డ్రెడ్జింగ్ పద్ధతిలో పూడిక తీస్తున్నారు. పంటుపై పొక్లెయిన్లను నిలిపి కాలువలో మట్టి తవ్వుతున్నారు. ఆ మట్టిని వెనుక ఉన్న మరో పంటుపై ఉంచిన తొట్టెలో వేస్తున్నారు. తాళ్ల సాయంతో ఆ తొట్టెను ఒడ్డుకు తీసుకొచ్చి అందులోని మట్టిని మరో పొక్లయిన్ ద్వారా ఒడ్డుకు చేరవేస్తున్నారు. ప్రస్తుతం తాడి, అగనంపూడిల మధ్య కాలువలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

భవిష్యత్తు అవసరాల కోసమే..: వచ్చే ఏడాది మార్చికల్లా పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ లోపు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. విశాఖ నగరానికి ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు సరిపోతుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టాం. పూడికతీత పూర్తయితే పూర్తిస్థాయి నీటి సరఫరా జరుగుతుంది. భవిష్యత్తులో తాగునీటికి కొరత ఉండదు. – ఉమేష్‌కుమార్, ఈఈ, నీటి సరఫరా విభాగం, పోలవరం ప్రాజెక్టు

(c) eenadu

జూకు పోటెత్తిన సందర్శకులు

ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం విశాఖ జంతు ప్రదర్శనశాల (జూ పార్కు) సందర్శకులతో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను తిలకించడంతో పాటు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, హంసలు, కోతులు, ఖడ్గమృగాలు, ఏనుగులు, జిరాఫీలు, చింపాజీలు, పాములు, పులులు సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకున్నారు. చెట్ల కింద, షెల్టర్లలో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. జాతీయ రహదారి ప్రధాన ద్వారం, బీచ్‌రోడ్డులో సాగర్ ద్వారం నుంచి ఆదివారం ఒక్కరోజు 10,352 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సందర్శకులతో పాటు లోపలకు ప్రవేశించిన వాహనాల ద్వారా రూ.7,63,450 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. సమీప కంబాలకొండ ఎకో టూరిజం పార్కుకు ఆదివారం 800 మంది రాగా రూ.59 వేలు ఆదాయం వచ్చినట్లు రేంజ్ అధికారి శాస్త్రి తెలిపారు.

పర్యావరణ హితానికి 'ఎస్‌బీఐ గ్రీన్ మారథాన్'

మారథాన్‌లో పాల్గొన్న ఎస్‌బీఐ సిబ్బంది, విద్యార్థులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పర్యావరణ హితం కోసం గ్రీన్ మారథాన్ కార్యక్రమాన్ని బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించారు. మారథాన్‌ను ఎస్‌బీఐ డిప్యూటీ చీఫ్ మేనేజర్ రాహుల్ జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ఎస్‌బీఐ సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరుగులో పాల్గొన్నారు. ఆర్గానిక్, కాటన్ వస్త్రాలు ధరించి జీరో వేస్ట్‌ను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. మారథాన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. పీఆర్వో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్ షట్‌డౌన్

పరవాడ, న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్‌ను శనివారం అర్ధరాత్రి తాత్కాలికంగా షట్‌డౌన్ చేశారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం ఉత్పత్తి నిలిపి వేశారు. ఈ పనులు పూర్తికావడానికి సుమారు రెండు నెలలు సమయం పట్టే అవకాశముంది. పనులు పూర్తయిన అనంతరం విద్యుత్తు ఉత్పత్తిని పునఃప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా 2, 3, 4 యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని కార్మిక వర్గాలు పేర్కొన్నాయి.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా : ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ, డోర్ నెం.45-40-42, 3వ అంతస్తు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.

వివరాలకు: 9618775577

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —

Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు

Digital Partner ఈనాడు.నెట్ | TV Partner ఈటీవీ భారత్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Organised by ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

పేదల వైద్యుడు కె.ఎస్.ప్రకాశరావు మృతి

డాక్టర్ కె.ఎస్. ప్రకాశరావు (పాతచిత్రం)

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలో ఫీవర్ ఆసుపత్రిని స్థాపించి నిరుపేదలకు నామమాత్రపు రుసుంతో గత 60 ఏళ్లుగా వైద్య సేవలు అందించి పేదల వైద్యుడిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ కె.ఎస్.ప్రకాశరావు(85) అనారోగ్యం కారణంగా శనివారం రాత్రి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమార్తె, కుమారుడు విశాఖలోనే వైద్యులుగా స్థిరపడ్డారు. కె.ఎస్.ప్రకాశరావు మృతదేహాన్ని నగరానికి చెందిన పలువురు వైద్యులు, ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. డాక్టర్ ప్రకాశరావు పేదలకు అందించిన సేవలను, ఆయనపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని గుర్తు చేసుకున్నారు. కేవలం రూ.20 నామమాత్రపు రుసుం తీసుకొని రూ.100 లోపే ఖర్చు అయ్యే మందులతో రోగాన్ని నయం చేసేవారని స్థానికులు చెబుతున్నారు. సోమవారం ఉదయం వారి స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభించి కాన్వెంట్ కూడలి వద్దనున్న శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని అతని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవోపేతంగా అయ్యప్పస్వామి సన్నిధానం పూజలు

పెందుర్తి మండలం ప్రహ్లాదపురం దరి అప్పన్నపాలెం శ్రీకృష్ణుడి గుడి దగ్గర ఆదివారం రాత్రి భారీ సన్నిధానం పూజలు వైభవోపేతంగా జరిగాయి. శ్రీధర్మ శాస్త్ర ద్రావిడ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో నగరం నలుమూలల నుంచి వేలాది మంది అయ్యప్ప దీక్షాధారులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పెందుర్తి

ఒడ్డుకు కొట్టుకొచ్చిన విద్యార్థి మృతదేహం

పెదవాల్తేరు(విశాఖపట్నం), న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈనెల 22న వుడా పార్కు లైట్ హౌస్ వద్దనున్న తీరంలో బుల్లయ్య కళాశాల డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు గల్లంతైన విషయం విదితమే. వీరికోసం పోలీసులు, లైఫ్‌గార్డులు గత రెండు రోజులుగా గాలించారు. ఆదివారం ఉదయం మన్యం జిల్లా సాలూరు ప్రాంతానికి చెందిన మానేపల్లి తేజేష్(20) మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మరో యువకుడు ఆదిత్య జాడ ఇప్పటికీ తెలియలేదని సీఐ పైడయ్య తెలిపారు. తేజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

విక్టోరియా పోర్టుకు చేరుకున్న ఐఎన్ఎస్ సావిత్రి

సింధియా, న్యూస్‌టుడే : హిందు మహాసముద్ర (ఐవోఆర్) ప్రాంతం భద్రత కోసం చేపడుతున్న ఆపరేషనల్ గస్తీలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సావిత్రి యుద్ధనౌక పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఈనెల 22న సీషెల్స్ దేశంలోని పోర్టు విక్టోరియాకు చేరుకుందన్నారు. సీషెల్స్ తీరగస్తీ దళానికి భారత నౌకాదళం సంక్లిష్ట విడిభాగాలను అందజేసినట్టు వెల్లడించాయి. ఐవోఆర్ పరిధిలో భద్రత భాగస్వామ్యదారుడిగా ఇండియా నిలిచిందని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

సీషెల్స్ తీరం వద్ద భారత నేవీ నౌక సావిత్రి సిబ్బంది

ఎన్‌సీసీ శిక్షణ ఎంతో ఉపయుక్తం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ శిక్షణతో ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ అలవాటై, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏయూ వీసీ ఆచార్య జీపీ. రాజశేఖర్, వైస్ అడ్మిరల్ సుశీల్‌మేనన్ హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణతో క్యాడెట్లకు అనేక ప్రయోజనాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, వైస్ అడ్మిరల్ సుశీల్ మేనన్, తదితరులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

నేడు ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా సోమవారం కలెక్టరేట్‌లో, జీవీఎంసీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుంది. కలెక్టరేట్‌లో అందించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు కాల్ సెంటర్ (1100) సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

'ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఉక్కు పరిరక్షణ కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షా శిబిరంలో ఆదివారం పలువురు నాయకులు మాట్లాడారు. ప్లాంట్‌ను విభాగాల వారీగా ప్రైవేటీకరణ చేసి, ఆ తర్వాత పూర్తిగా కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న ప్లాంట్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయురాలు తులసీచందు శిబిరానికి సంఘీభావం ప్రకటించారు. ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో నినాదాలు చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ : విశాఖపట్నం జిల్లా
జాయింట్ కలెక్టర్ / చైర్మన్, డి.పి.సి. వారి ఉత్తర్వులు

ఇ–టెండర్: పని పేరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా క్రింది మెటీరియల్ కొనుగోలు ప్రక్రియ-ఆర్థిక సంవత్సరం- 2025-26. వివరములకు: https://tender.apeprocurement.gov.in ప్రింటింగ్ & స్టేషనరీ: e Tender ID No.866837 పై ఇ-టెండర్‌నకు సంబంధించిన వివరములు ఈ దిగువ చూపడమైనది. (1) ఇ-టెండర్ డౌన్లోడ్ ప్రక్రియ ప్రారంభ తేదీ. 24-11-2025 గం.10.30 ని. (2) ఇ-టెండర్ బిడ్ సమర్పించుటకు ఆఖరు తేదీ.29-11-2025 గం.05.30 ని. (3)ఇ-టెండర్ తెరుచు తేదీ.03-12-2025 గం.11.00 నిలకు పథక సంచాలకుల వారి కార్యాలయము, విశాఖపట్నం సంప్రదించవలసిన మొబైల్ నెం: 7993317122 సం/- జాయింట్ కలెక్టర్/ చైర్మన్, డి.పి.సి. విశాఖపట్నం జిల్లా

గీతాలు ఆలపిస్తున్న కళాబృందం సభ్యులు

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, తదితరులు

సత్యసాయి బోధనలు అనుసరణీయం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయిబాబా శత జయంతిని ఆదివారం ఎంవీపీకాలనీలోని సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నగర ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరై భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం సత్యసాయిబాబా వందేళ్ల పుస్తకాన్ని ఆవిష్కరించి, బాబా బోధనలు అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. భక్తులు భజనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమాలను భారీ ఎల్ఈడీ తెరలపై వీక్షించారు. సత్యసాయి సేవా సిటీ సమితి కన్వీనర్ బి.సాయికుమార్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డు అనుమానాస్పద మృతి

బి.కృష్ణారావు (పాతచిత్రం)

ఎన్ఏడీకూడలి(కరాస), న్యూస్‌టుడే : స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రైలు పట్టాలపై అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన విశాఖపట్నం జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 104 ఏరియాలో జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 57వ వార్డు ఆశవానిపాలేనికి చెందిన బి.కృష్ణారావు(56) స్టీల్‌ప్లాంట్‌లో డిప్యుటేషన్ ప్రాతిపదికన హోంగార్డుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం 104 ఏరియాలోని రైలుపట్టాలపై పురుషుడి మృతదేహం ఉన్నట్లు రైల్వేపోలీసులు గుర్తించారు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదమా లేక ఆత్మహత్యా? అనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుడి భార్య గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని శవపంచనామాకు కేజీహెచ్‌కు తరలించారు. కూరగాయలు తెస్తానని చెప్పి.. అనంతలోకాలకు వెళ్లిపోయాడంటూ కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతున్నారు. కృష్ణారావు ఈనెల 21 నుంచి 25 వరకు విధులకు సెలవు పెట్టినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

Caravan Sales: Suitable for Farm House, Resorts & Staying Purpose. Price: 13 Lacs. ✆ 7675950509, 9885884213.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

Well maintained restaurant with continental menu and equipment near dwarakanagar near to complex available for sale or run/ maintain on monthly profit/sharing basis. Contact:9848487871

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft. New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం /నవరవిల్లి Nr. ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు. కమర్షియల్ 2000 గ॥లు VMRDA RERA నెం.తో కలదు. 9493244471, 9396972239

JOBS

Golden Opportunity to Earn Un-Limited income for everyone (M/F) as part/ full time just Reffer VRS/ RTD employees with zero investment not MLM trust (Face value) is your earnings. (5K-10K/ Day) Preference to Team Leaders/ Tax Consultants/ Bank Managers/ Working Professionals ✆ 8790189686

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

Wanted Female Telecallers Qualification any Degree, Age Limit: 25 to 45 years (Must be Married) Salary upto: 14000/-. Working Location: Master Minds College, Gajuwaka Vizag. Contact: 92487 13330.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

Wanted Male Worker for Musical Showroom @ Sampath Vinayaka Temple Road, Asilmetta. Salary: 12,000. Ph: 9949466685

ఉద్యోగ అవకాశం (ప్రతిభావంతులకు)

ప్రముఖ అగ్రగామి సంస్థల 25సం॥ పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ క్రింది JOBsకు అభ్యర్థులను ఎంపిక చేయబడును.
- ఆఫీస్ ఇన్‌ఛార్జెస్ : M/F
- ఆఫీస్ అసిస్టెంట్స్ : M/F
- టెలీ కాలర్స్ : M/F

అర్హత: కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో పదవీ విరమణ చేయువారు మరియు ప్రైవేట్ సంస్థల్లో పనిచేయువారు అర్హులు. ఆదాయం: నెలకు 50వేలు రూ॥ నుండి లక్షా20వేలు వరకు నిర్ణయించబడినది. (నెగోషియబుల్) Note: 1. పార్ట్ టైం జాబ్ చేయువారికి కూడా అవకాశం కల్పించబడును. 2. ఇదివరలో మీయొక్క Job, అర్హతలను బట్టి ఇంటర్వ్యూ సమయంలో మీ స్థాయి Package నిర్ణయించబడును.

ఇంటర్వ్యూ తేదీలు: 24, 25 & 26 నవంబర్ 25

Con: K.B.S.SEKHAR Doctors Colony, VSP Ph: 9290060887 9177296835

మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (F), Marketing Executives (M) Min. 1 Year. Exp. కావలెను. Ph: 9703398398.

షర్ట్స్, జీన్స్ & T. షర్ట్స్ మార్కెటింగ్ చేయుటకు సేల్స్ బాయ్స్ కావలెను 2 వీలర్ ఉన్నవారికి ప్రాధాన్యం కలదు. జీతం + కమీషన్ ఇవ్వబడును. 7386521199.

వైజాగ్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి MM, CMM జాబ్‌లకు స్త్రీ/ పు॥ అభ్యర్థులు కావలెను. మంచి రెమ్యునరేషన్/ కమీషన్ కలదు. 9704421081.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. Contact Phone Number: 7702184399

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రజల హక్కులకు అంబేడ్కర్ రక్షణ

సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య కంచి ఐలయ్య

సీతంపేట, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దళిత, బహుజనులపై ఉందని ఆచార్య కంచి ఐలయ్య అన్నారు. నగరంలోని రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం 'భీమ్‌సేన వార్' ఆధ్వర్యంలో 'ఈ రాజ్యాంగం లేకుండా భారతదేశం మనుగడ సాగిస్తుందా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐలయ్య మాట్లాడుతూ దేశ ప్రజల హక్కులకు రక్షణ కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆర్.ఎస్.ఎస్, భాజపా నేతలు రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు మాట్లాడుతూ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, మనువాదంపై అనేక వీడియోలు చేస్తున్న క్రమంలో తనపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూఢనమ్మకాల వ్యతిరేక వేదిక జాతీయ అధ్యక్షుడు బైరి నరేశ్ మాట్లాడుతూ అంబేడ్కర్ అభిమానులు ప్రచారకులుగా, కార్యకర్తలుగా మారాలన్నారు. భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బహుజన కళా మండలి వ్యవస్థాపకుడు ఉదయభాస్కర్, బీర రత్నకుమారి, కె.చిన్నారావు, జె.వి.ప్రభాకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమ్‌సేన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. భీమ్‌సేన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.రవిసిద్ధార్థ ఆధ్వర్యంలో సభ్యులు సంస్థ జెండాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. కేజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనబాబు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న భీమ్‌సేన్ ప్రతినిధులు

తీవ్ర విషాదంలోనూ అవయవదానం

కనకారావు (పాతచిత్రం)

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస శివాలయం వద్ద మూడ్రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఎర్నింటి కనకారావు (46) అవయవాలను కుటుంబీకులు ఆదివారం దానం చేశారు. ఆయన భార్య సూరమ్మ, కుమారుడు వాసు అంగీకారంతో మాతృభూమి సేవా సంఘం ప్రతినిధి కిట్టుకి మృతదేహాన్ని అప్పగించారు. మృతుని స్వస్థలం విజయనగరం జిల్లా గొండ్యపాలెం గ్రామం.

నూతన నియామకాలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : భారత పవర్ లిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షునిగా, కార్యదర్శిగా నగరానికి చెందిన మద్ది ప్రభాకరరావు, సకల కోటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రభాకరరావు ప్రస్తుతం ఏపీ పవర్ లిఫ్టింగ్ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. కోటేశ్వరరావు అంతర్జాతీయ రిఫరీగా, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడిగా సేవలు అందించారు. ఆదివారం కేరళలో జరిగిన సంఘం వార్షిక సమావేశంలో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన వారికి ఏపీ పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు గంటా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, కోశాధికారి సీహెచ్.శేషుబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వి.సంజీవ్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఎం.ప్రభాకరరావు

ఎస్.కోటేశ్వరరావు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్డ్	184	206
స్కిన్‌లెస్	210	216

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **ప్రేమంటే** (మార్నింగ్, ఫస్ట్ షో), **12ఎ రైల్వేకాలనీ** (మ్యాట్నీ, సెకెండ్ షో) స్క్రీన్-2 - **రాజు వెడ్స్ రాంబాయి**

భర్త ఇంటికి తిరిగి రాలేదని భార్య ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే : ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాయుడుతోట దరి రవినగర్‌కు చెందిన సిరిశెట్టి నాగరాజు(36)కు గత కొన్నాళ్లుగా మానసికస్థితి సరిగా లేక ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ అదృశ్యం కేసు నమోదు చేసి హెచ్‌సీ జి.అప్పారావుకు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్ ప్రధాన కాలువలు శుభ్రంగా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
– అప్పారావు, శ్రీనివాసనగర్. ✓: కాలువలను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం.
– అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్–8

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - పి.వెంకటేశ్, సబ్బవరం ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి
?: సబ్బవరం సాయినగర్ కాలనీ నుంచి వచ్చే వాడుక నీరు వ్యాపార దుకాణాల ముందు నిలిచిపోతోంది. – కె.గంగునాయుడు, సబ్బవరం. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ సమావేశంలో చర్చించి కాలువ తవ్వే ఏర్పాటు చేస్తాం.
– డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం.

ఆదమరిస్తే అంతే..!

తరచూ జరుగుతున్న ప్రమాదాలు

వేపగుంట, న్యూస్‌టుడే

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే బీఆర్టీఎస్ రహదారి అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా మారింది. మొంథా తుపానుకు కురిసిన భారీవర్షాలకు గోతులు పెద్దవిగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. పెద్దపెద్ద గోతులు జీవీఎంసీ అధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు కనిపిస్తున్నా గోతులు పూడ్పించాలన్న ఆలోచన అధికారులకు ఉండటం లేదు. దీంతో ద్విచక్రవాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకర గోతులను పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు. ★ బీఆర్టీఎస్ రహదారిలో ఎక్కువగా ప్రైవేటు కేబుల్ సంస్థలు తవ్విన గోతులే ఉన్నాయి. ఆ సంస్థలు సక్రమంగా గోతులను పూడ్చకుండా వదిలేశాయి. కొన్నిచోట్ల తూతూమంత్రంగా పూడ్చి చేతులు దులుపుకొన్నాయి. దీంతో వర్షాలకు రహదారులు పూర్తిగా కోసుకుపోయి పెద్దపెద్ద గోతుల్లా మారాయి.

ఎక్కడ ప్రమాదకరంగా ఉన్నాయంటే..:
★ వేపగుంట నుంచి పినగాడి వెళ్లే సర్వీసు రహదారిలో పెద్దపెద్ద గోతులు ఉన్నాయి. రాత్రివేళల్లో ఆ గోతుల్లో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు.
★ వేపగుంట నుంచి పెందుర్తి వెళ్లే రహదారిలో వేపగుంట రామాలయం, సంతోషనగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం కూడళ్ల వద్ద, వేపగుంట నుంచి గోపాలపట్నం వెళ్లే రహదారిలో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. ★ జీవీఎంసీ అధికారులు వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి రహదారులపై ప్రత్యేక లేయరు వేసి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీకాలనీ ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా గొయ్యి..

ఇలాంటి స్టాపర్లు ప్రమాదాలను నిలువరించేనా..

పరిశీలించి తగుచర్యలు తీసుకుంటాం..

బీఆర్టీఎస్ రహదారిలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు గోతులు పెద్దవై ప్రమాకరంగానే మారాయి. ప్రయివేటు సంస్థల కారణంగా పాడైన రహదారులను ఆ సంస్థల యాజమాన్యాలకు సమాచారం పంపి తగు చర్యలు తీసుకుంటాం. – శంకర్రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనరు, జోన్–8,

పద్మనాభుడి సేవలో ఎంపీ శ్రీభరత్

ఎంపీ శ్రీభరత్‌కు వేదాశీర్వాదం చేస్తున్న ఆలయ అర్చకులు

పద్మనాభం, న్యూస్‌టుడే: విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదివారం పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువున కుంతీమాధవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. పద్మనాభం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు ఎంపీకి స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి నీరు లీకవకుండా చేసిన విధానాన్ని అనంత పద్మనాభ స్వామి, కుంతీమాధవ స్వామి ఆలయాలకు కూడా చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపట్టాలని, ఆలయ ముఖద్వారం నిర్మించాలని ఎంపీకి ఎంపీటీసీ దంపతులు విన్నవించారు. కార్యక్రమంలో మండల తెదేపా యువజన అధ్యక్షుడు కేవీ.సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.సుమంత్‌నాయుడు, ఆలయ ఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి, సీతారాముల మహిమల్ని అభివర్ణిస్తూ గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ (విశాఖ) అధ్యక్షుడు సాంబాదాస్ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు.

అలరించిన సినీ సంగీత విభావరి

అల్లిపురం, న్యూస్‌టుడే : నగరంలోని డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కడలి సంస్థ పుండరీకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాన్ని వాల్తేర్ రైల్వే డివిజన్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలు అందించిన కొణతాల రాజును కడలి సంస్థ సభ్యులు సన్మానించారు.

ఆగని తాబేళ్ల మృత్యువాత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ తీరానికి ఆదివారం సముద్రంలో నుంచి ఓ పెద్ద మృత తాబేలు కొట్టుకొచ్చింది. ఇటీవల నుంచి రుషికొండ తదితర ఇక్కడి పరిసర తీరాలకు ఎక్కువగా పలు తాబేళ్ల ముఖ భాగంలోని గాయాలతో విగతజీవులుగా చేరుతుండటం అందరినీ కలచివేస్తున్న విషయం. పడవల ఇంజిన్ల చక్రాలు తగిలి లేదా వలల్లో చిక్కుకున్నప్పుడు భయాందోళనకు గురై ఎక్కువగా మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని మత్స్యశాఖాధికారులు పేర్కొంటున్నారు. కూర్మాలకు ఇలాంటి దుస్థితి తలెత్తడం పట్ల పర్యావరణ ప్రేమికులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

రౌడీషీటర్లు గీత దాటితే కఠిన చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ స్వామినాయుడు సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ జరిపారు. ప్రస్తుతం వారి కుటుంబ నేపథ్యం, జీవనోపాధి మార్గాలపై ఆరా తీశారు. నేరాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. గీత దాటితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ స్వామినాయుడు, పోలీసులు

కుటుంబ సభ్యులకు క్షతగాత్రుడి అప్పగింత

ఇందల్ కుమార్‌ను బంధువులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్

పెందుర్తి, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ వద్ద గాయాలతో ఉన్న ఓ వ్యక్తిని సంరక్షించిన పోలీసులు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనికి సంబంధించి పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన ఇందల్ కుమార్(28) ఈనెల 16న తోటివారితో కలిసి కూలిపని కోసం రాజమహేంద్రవరం వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయి గాయాలపాలయ్యాడు. రోడ్డు పక్కన ఉన్న అతడికి పెందుర్తి పోలీసులు చికిత్స చేయించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఇందల్ కుమార్ కుటుంబానికి సమాచారం అందించి విశాఖ రప్పించి ఆదివారం అతడిని వారికి అప్పగించారు.

యువత భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి, భాగస్వామ్యం ఎంతో కీలకమని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం పాపయ్యరాజుపాలెం దగ్గర ఎన్ఏడీ లేఅవుట్‌లో పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ముమ్మన ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు రహదారికి ఇరువైపుల మొక్కలు నాటారు. కళాశాల కరస్పాండెంట్ టి.వియోపిలస్, కాలనీ సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ లేఅవుట్‌లో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వైభవంగా శ్రీకృష్ణార్పణం

శ్రీకృష్ణలీల సంకీర్తన చేస్తున్న కళాకారులు

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధా మదనమోహన్ స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీమాదాసు సంకీర్తన ప్రచార సమితి కళాకారులు కాళిప్రసాద్ సమక్షంలో జి.సునీత, జి.విద్యలక్ష్మి, పి.లక్ష్మి శిరీష, ఏ.సరిత, కె.మాధవి లత, కె.శ్రీలక్ష్మి, సి.రమాదేవి, శివకుమార్, సిహెచ్.దుర్గప్రసాద్ శ్రీకృష్ణలీలల సంకీర్తన చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస, యదురాజా భక్తదాస, అంబరీషదాస తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు ఆ ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జింకలు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి వస్తున్న జింక

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం దరి గోరే విశ్వేశ్వర కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడును కాలనీవాసులు కోరారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించారు. రోడ్లు, కాలువలు లేక ఇబ్బందిపడుతున్నామని, ముదురు, దోమలతో అవస్థలు పడుతున్నట్లు ఆయనకు వివరించారు. దీనిపై కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారని వారు అన్నారు.

కార్పొరేటర్ ముమ్మనకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ సోమవారం ఉదయం 10 గంటలకు సబ్బవరం తహసీల్దారు కార్యాలయానికి వస్తారని ఏఎంసీ మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకుంటే సమస్యలు పరిష్కారం చేశారో లేదో అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

సత్యసాయి జీవితం సమాజానికి ఆదర్శం

పెందుర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా స్వయంగా సేవా మార్గాన్ని అనుసరించడంతో పాటు సమాజానికి స్ఫూర్తి నింపి ఆదర్శంగా నిలిచారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. చినముషిడివాడలోని సత్యసాయి మందిరం, సుజాతనగర్‌లోని సత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సుజాతనగర్‌లోని ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు, దుస్తులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణలు జరిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శానాపతి శంకర్రావు, సింహాచలం మాజీ ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట, ప్రహ్లాదపురం సత్య సాయిబాబా ఆలయాల్లో ఆదివారం శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వేపగుంట కృష్ణరాయపురం భజన మండలి కన్వీనరు అక్కునాయుడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడులు పాల్గొని పూజలు చేశారు. ప్రహ్లాదపురం కన్వీనరు డి.కె.పి.రాజు, గ్రూపు లీడర్ ముత్యాల నాయుడుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: మండల కార్యాలయంలో సత్యసాయి శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దారు బి.చిన్ని కృష్ణ, సబ్బవరం సర్పంచి దెడ్డం ప్రసాదరావు, బోకం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు పలువురు భక్తులు హాజరై సత్యసాయి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సుమారు 3 వేల మందికి అన్నసమారాధన చేపట్టారు. బలిరెడ్డి అప్పారావు, మామిడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో భజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, తదితరులు

సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో..

సబ్బవరం సాయినగర్ కాలనీలో..

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవంలో పంచకర్ల వెంకటేశ్వరరావు, తదితరులు

సుజాతనగర్ భజన మండలిలో..

వేపగుంట ఎస్సీబీసీ కాలనీలో..

ప్రహ్లాదపురంలో..

ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు

వేపగుంట, న్యూస్‌టుడే: అప్పన్న స్వామి - భరత్ నగర్ రహదారిలో గోపీజనవల్లభస్వామి ఆలయ సమీప ప్రాంగణంలో అయ్యప్ప స్వామి సన్నిధానం పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర ద్రవిడ సేవాసంఘం ఆధ్వర్యంలో శబరిమల పూర్వ ప్రధాన మేల్‌శాంతి బ్రహ్మశ్రీ పీ.జీ.మురళి నంబూద్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సన్నిధానం పూజకు నగరంలో పలు పీఠాల నుంచి సుమారు నాలుగు వేల మంది స్వాములు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పరశురామ పురస్కార గ్రహీత నీలం బాలాజీ గురుస్వామి, కోనసీమ జిల్లా చిరుతపూడికి చెందిన జాతీయస్థాయి అవార్డు గ్రహీత రాజేశ్ గురుస్వాములు భక్తి గీతాలు ఆలపించారు. స్థానిక కార్పొరేటరు రాపర్తి కన్నా తదితరులు హాజరై పూజలో పాల్గొన్నారు.

అప్పన్నపాలెం శ్రీకృష్ణుడి గుడి వద్ద అయ్యప్పల పూజలు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీది కీలకపాత్ర

పెందుర్తి, న్యూస్‌టుడే : యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల కరస్పాండెంట్ కేఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు ఉత్సాహంగా పాల్గొని గౌరవ వందనం, మార్చ్ ఫస్ట్ చేశారు. పతాకావిష్కరణ చేసి ఎన్‌సీసీ గీతం ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అక్షిత్ వర్మ, వైష్ణవి వర్మ, ఉప ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఎన్‌సీసీ అధికారులు రోజా, శేఖర్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్కేటింగ్ పోటీలకు శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : నగరంలో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న 63వ జాతీయ స్కేటింగ్ పోటీలకు ఉక్కు ఇందిరా పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ఈనెల 20వ తేదీ నుంచి డిసెంబరు 2 వరకూ శిక్షణ ఇస్తున్నారు. అనంతపురం, కృష్ణా, నెల్లూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల నుంచి సుమారు 211 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

సాధన చేస్తున్న స్కేటింగ్ క్రీడాకారులు

ఆటోడ్రైవర్ నిజాయతీ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి నెల్లిముక్కుకాలనీకి వరలక్ష్మి ఇంటికి వస్తుండగా.. ఆదివారం ఆటోలో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయారు. దీనిపై న్యూపోర్టు క్రైం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే ఆటోడ్రైవర్ శ్రీనివాస్ నేరుగా స్టేషన్‌కు వచ్చి బ్యాగును పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ అప్పలరాజు బాధితురాలికి బ్యాగును అందించి ఆటోడ్రైవర్‌ను అభినందించారు.

బ్యాగును అందజేస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్, ఎస్ఐ అప్పలరాజు తదితరులు

రైతుబజార్ నిర్వహణపై ఆగ్రహం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం రైతుబజార్ నిర్వహణపై మార్కెట్‌శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలను పరిశీలించారు. టమాటా ధరలు, సరఫరాపై ఆరా తీశారు. బజార్‌లో ఎక్కడికక్కడే కూరగాయల నిల్వలు, వ్యర్థాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గృహమిత్ర, పండ్ల దుకాణాలను పరిశీలించారు.

రైతుకార్డును పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్ కిరణ్

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన నిందితుడు జయసేన్ అక్రమంగా విశాఖకు గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయిని 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపాలెం సమీపంలోని శ్మశానవాటిక వద్ద కణితి కాలనీకి చెందిన కాండ్రేగుల ఓంకార్ (25), వడ్లపూడికి చెందిన దెండేటి సందీప్ (28) గంజాయి తరలిస్తుండగా పోలీసు తనిఖీలో పట్టుకున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

'కనకమహాలక్ష్మి' ఉత్సవ కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాత నగరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నూతన కమిటీ కొనసాగుతుంది. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ సిఫార్సుల మేరకు కమిటీ సభ్యులుగా జనసేన నుంచి కందుల నాగరాజు, వాకముళ్ల అక్కలనాయుడు, ధనాలకోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లబిల్లి వెంకటలక్ష్మి, తెదేపా నుంచి కేదారి లక్ష్మి, ఇంధన భద్రరావు, మేడపాటి శ్రీధర్, యాండ్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కృష్ణారావు, ఎం.లక్ష్మీనాగేశ్వరరావు, భాజపా నుంచి కొప్పుల రామ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. వారితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ కమిటీ సభ్యుడిగా కొనసాగనున్నారు. ★ ఉత్సవాల నేపథ్యంలో ఆలయ వర్గాలకు కమిటీ సభ్యులు సహాయ, సహకారాలు అందించాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు అమ్మవారి ఆలయానికి ట్రస్టుబోర్డు ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీతో కీలక నిర్ణయాలు తీసుకునే వీలుండదు.

PUBLIC NOTICE

Under the instructions of my clients (1) Dr. Utharavalli Navya, D/o Sri P.V.S. Lakshmi Prasad and (2) Sri Puvvula Anvesh, S/o Sri P.V.S. Lakshmi Prasad, Residents of Flat No. SK 15-6, Paramount towers, Sriram Panorama Hills, Yendada, Visakhapatnam-530045, We are issuing this public notice.

Sri P.V.S. Lakshmi Prasad and Smt. Puvvula Lakshmi, Retired Manager, LIC, R/o Sujathanagar, Visakhapatnam, are the parents of my clients and they are separated by virtue of a decree of divorce granted by the Family Court, Visakhapatnam in the month of November 2009. Since then, they are living separately and my clients are in the care and custody of their father only and there is no relationship between the mother and the children.

My clients reliably learnt that Smt. Puvvula Lakshmi is borrowing different amounts from different people, even though, there is no need of borrowing as she is getting a reasonable amount of pension every month. She is mentally unstable and she refuses medical treatment. When she is not repaying the sundry debts, the money lenders are approaching my clients making illegal demands, even though, my clients are no way responsible or liable.

This is to inform the general public that my clients are no way concerned with the activities of borrowing or lending money by Smt. Puvvula Lakshmi.

BVRR ASSOCIATES
B.V.RAMANJANEYA RAO
B.CHITTARANJAN KUMAR & B.V. KALPANA
Advocates
D.No. 49-28-9, Madhuranagar
Visakhapatnam -530016. **Ph: 9848483399**

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- మఫ్టీ పోలీస్
రాములమ్మ- 12 ఏ రైల్వే కాలనీ
తాతా- ప్రేమంటే
సప్తగిరి- రాజు వెడ్స్ రాంబాయి

నేటి నుంచి 'రైతన్నా.. మీ కోసం'

దాకమర్రి(తగరపువలస), న్యూస్‌టుడే: 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు భీమిలి మండల వ్యవసాయాధికారిణి శివకోమలి చెప్పారు. వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన బృందాలు రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, వారి అవసరాలు, సమస్యలపై వివరాలను సేకరించనున్నారన్నారు. రైతులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు.

'కనకమహాలక్ష్మి' ఉత్సవ కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నూతన కమిటీ కొనసాగుతుంది. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ సిఫార్సుల మేరకు కమిటీ సభ్యులుగా జనసేన నుంచి కందుల నాగరాజు, వాకముళ్ల అక్కలనాయుడు, ధనాలకోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లబిల్లి వెంకటలక్ష్మి, తెదేపా నుంచి కేదారి లక్ష్మి, ఇంధన భద్రరావు, మేడపాటి శ్రీధర్, యాంద్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కృష్ణారావు, ఎం.లక్ష్మీనాగేశ్వరరావు, భాజపా నుంచి కొప్పుల రామ్‌కుమార్‌కు అవకాశం దక్కింది.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: సమస్య: సాయిరాంకాలనీ (మధురవాడ)లో కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నాం. – కాలనీ వాసులు, ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జెడ్సీ

?: తారకరామానగర్ (రుషికొండ)లో పందుల బెడద తీవ్రంగా ఉంది. – లక్ష్మి, తారకరామానగర్, ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: తారకరామానగర్(రుషికొండ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – రుషికొండ వాసులు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: మారికవలస (మధురవాడ) సర్వీస్ రోడ్డులో ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. – రవివర్మ, మారికవలస, ✓: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తాం. – పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

దోమలతో సహవాసం.. కానరాని ఫాగింగ్

కొమ్మాది, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-2 పరిధిలో కొన్ని నెలలుగా ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిపోయింది. దీంతో డెంగీ, మలేరియా తదితర రోగాలబారిన పడుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ జీవీఎంసీ జోన్-2 పరిధిలో 5 నుంచి 13 వార్డుల్లో 106304 గృహాలు ఉన్నాయి. ఆయా వార్డుల్లో ఎక్కడ చూసినా మురుగునీటి గుంతలు, కాలువల్లో నిలిచిపోయిన మురుగువ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండటం, ఇళ్లల్లో మంచినీటి ట్యాంకుల్లో చాలా చోట్ల నీరు నిల్వ ఉండటంతో దోమల వృద్ధి వేగంగా జరుగుతోంది. ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్‌వో) ఎక్కడా జరగడం లేదు. దీంతో పలువురు రోగాలబారిన పడుతున్నారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే రోజుకు వందల తరబడి జ్వరపీడితులు వరుస కడుతున్నారంటే ఇక్కడ దోమల నివారణ ఏ విధంగా జరుగుతుందో, వీటి కోసం కేటాయించే నిధులు ఎలా పక్కదారి పడుతున్నాయోనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొమ్మాది టీచర్స్ లే-అవుట్‌లో వసతి గృహం ముందు మురుగు నిల్వలు

■ జోన్-2లో 5 నుంచి 13 వార్డులకు 35 మంది మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో అవుట్‌సోర్సింగ్ కింద 29 మంది, శాశ్వత ఉద్యోగులు ఆరుగురు ఉన్నారు. మినీ ఫాగింగ్ యంత్రాలు ఆరు, మెగా ఫాగింగ్ యంత్రం ఒకటి ఉండగా వీటిని సిబ్బంది వినియోగించి దోమల నియంత్రణకు చర్యలు చేపడతారు. సీజనల్ సిబ్బంది 46 మంది ఇంటింటికి వెళ్లి 'ఏఎల్‌వో' విధులు చేపట్టి జనావాసాల మధ్య మురుగునీరు, వర్షపునీరు, కొబ్బరి బొండాలు, ఇళ్లల్లోని సంపులు, ట్యాంకులు, వాడుకలో లేని కూలర్లు, పూల కుండీలు తదితర వాటిని పరిశీలించి దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ అవేవీ కానరావడం లేదు. బ్యానర్లు పట్టుకుని శుక్రవారం ఫ్రైడే డ్రైడే అంటూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

జన సైనికులకు బీమా చెక్కుల అందజేత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మృతి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగిన రుషికొండ ప్రాంతానికి చెందిన గద్దిపల్లి దినేష్ కుటుంబ సభ్యులకు అమరావతిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రూ.5 లక్షల ప్రమాదబీమా చెక్ అందజేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ నాగబాబు, ఎంఎస్ఎంఈ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు, భీమిలి జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, ఎనిమిదో వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్ సమక్షంలో చెక్కును అందించారు. దీంతో పాటు భీమిలి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం రూ.25 లక్షల చెక్కులను ఆదివారం అందించినట్లు నేతలు పేర్కొన్నారు. ఉమ్మిడి ప్రవీణ్‌కుమార్ తదితర పార్టీ క్రియాశీలక వాలంటీర్లు పాల్గొన్నారు.

దినేష్ కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్

భీమిలి నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: జనసేనలో సభ్యత్వం కలిగి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబీకులకు తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బీమా చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. జనసేన నేత, ఎమ్మెల్సీ కె.నాగబాబు, భీమిలి నియోజకవర్గం నేతలతో కలిసి అయిదు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బాధితులకు అందజేశారు. భీమిలి గ్రామీణ మండలంలో రెండు, 98వ వార్డులో ఒకరికి, ఎనిమిదో వార్డులో ఇద్దరికి వీటిని ఇచ్చారు. కార్యక్రమంలో పంచకర్ల సందీప్, మండల శాఖ అధ్యక్షులు నక్కా శ్రీధర్, నాయకులు కృష్ణయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

శుభ్రతకు చర్యలు

ఎండాడ, న్యూస్‌టుడే: బక్కన్నపాలెం (మధురవాడ)లో రామాలయం వెనుక పరిసరాల కాలువల్లో మురుగునీరు బయటకు రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ పూడిక తొలగించి శుభ్రత చర్యలు చేపట్టారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మధురవాడ, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటే నష్ట నివారణ తగ్గుతుందని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ షేక్ బెహరా అన్నారు. ఏడోవార్డు చంద్రంపాలెంలో ఆదివారం సాయంత్రం వంట గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. మహిళలను భాగస్వాములను చేసి వారితో స్వయంగా మంటలు ఆర్పించి మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

జాతరలో అలరించిన నృత్యాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కళావేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నగరానికి చెందిన శ్రీసిద్ధేంద్రయోగి నాట్యాలయం చిన్నారులు సుమద, మోహన్, ఆశ్రిత, జస్విత, లలిత, లక్ష్మి, త్రివేణి, సౌమ్య తదితరులంతా వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు మోహనలక్ష్మీ దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

సేవలకు సత్కారం

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతానికి చెందిన కపర్ది ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీదత్తస్వామిని శ్రీమోక్షసదన్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం సత్కరించారు. కార్తిక మాసం పురస్కరించుకుని 30 రోజుల పాటు వారణాసిలో ప్రజల క్షేమం కోరుతూ శివనామస్మరణతో విశేష అభిషేకాలు చేయడంతో పాటు అన్నసమారాధన చేపట్టారు. ఈ సేవలను గుర్తించిన కాశీలో శ్రీమోక్షసదన్ ట్రస్ట్ బృందం ఆయన్ను సత్కరించింది.

దత్తుస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కల్యాణకట్ట నిర్మాణానికి చర్యలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సాగర తిరుమల క్షేత్రంపై వేంచేసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో దాతల తోడ్పాటుతో కల్యాణకట్టను నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు భీమిలిలో బంగారు వర్తకుడు స్వర్గీయ విజ్జపు దానయ్య శెట్టి కుమారులు విజ్జపు శ్రీకాంత్, శ్రీనివాస్ అందించే నిధులతో నిర్మించనున్న కల్యాణకట్టకు ఆదివారం భూమి పూజ చేశారు. ఇందులో భాగంగా కేశఖండనశాల, స్నానాల గదులను నిర్మించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ప్రతినిధులు రేలంగి అప్పలనర్సయ్య, కె.ముత్యాలరావు పాల్గొన్నారు.

కల్యాణకట్ట నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆగని తాబేళ్ల మృత్యువాత

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ తీరానికి ఆదివారం సముద్రంలో నుంచి ఓ పెద్ద మృత తాబేలు కొట్టుకొచ్చింది. ఇటీవల నుంచి రుషికొండ తదితర ఇక్కడి పరిసర తీరాలకు ఎక్కువగా పలు తాబేళ్లు ముఖ భాగంలోని గాయాలతో విగతజీవులుగా చేరుతుండటం అందరినీ కలచివేస్తున్న విషయం. పడవల ఇంజిన్ల చక్రాలు తగిలి లేదా వలల్లో చిక్కుకున్నపుడు భయాందోళనకు గురై ఎక్కువగా మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని మత్స్యశాఖాధికారులు పేర్కొంటున్నారు. కూర్మాలకు ఇలాంటి దుస్థితి తలెత్తడం పట్ల పర్యావరణ ప్రేమికులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

షెడ్డులో విలువైన సామగ్రి చోరీ

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి గ్రామీణ మండలంలోని మంగమారిపేట కడలి తీరానికి సమీపంలో ఉన్న ఓ షెడ్డులోని విలువైన సామగ్రి చోరీపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై సూర్యప్రకాశ్ తెలిపారు. నగరానికి చెందిన శ్రీధర్‌వర్మ అనే వ్యక్తి తన సొంత జిరాయితీ స్థలంలో ప్రహరీ నిర్మించి అందులో రేకుల షెడ్డును కట్టారు. ఇందులోని సుమారు రూ.2 లక్షల విలువైన నీటి మోటారు, పైపులు, సీసీ కెమెరాలు, ఇతర సామగ్రిని అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన నిందితుడు అక్రమంగా విశాఖ నుంచి గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయి 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో ప్రభుత్వ పింఛనుదారులకు శాశ్వత సంక్షేమ భవనం ఏర్పాటు కోసం తన వంతుగా తోడ్పాటు అందిస్తానని జలవనరుల శాఖ విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉత్తాడ అప్పారావు అన్నారు. భీమిలి తాలూకా ప్రభుత్వ పింఛనుదారుల సంఘం, భీమిలి బీచ్ ఫ్రెండ్స్ (బీబీఎఫ్) సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గొల్లలపాలెం వద్ద ఆదివారం వనసమారాధన నిర్వహించారు. పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు టి.బీమారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 80 ఏళ్ల వయసు కలిగిన ఉత్తాడ అప్పారావును సత్కరించారు. రెండు సంఘాల తరఫున ఉచిత వైద్య శిబిరాలు, పచ్చదనం పెంపుదల కోసం కృషి చేయాలని నిర్ణయించారు. నిర్వాహకులు బి.ఈశ్వరరావు, ఎ.ఆనందరావు, కె.ఎస్.నాయుడు, ఎ.ఎస్.శంకర్‌కుమార్, పాల్గొన్నారు.

ఉత్తాడ అప్పారావును సత్కరిస్తున్న ప్రభుత్వ పింఛనుదారులు, బీబీఎఫ్ ప్రతినిధులు

రోడ్డుపై గుంతలతో ఇక్కట్లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

సంగివలస జాతీయరహదారి నుంచి ఎన్నారై ఆస్పత్రి కూడలి నుంచి ఇటు తగరపువలస అటు నమ్మివానిపేట గ్రామాలకు పోయే అనుసంధాన మార్గం అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు అయిన ఈ రోడ్డు మధ్యలో గోతులు ఉండటంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

సంగివలస ఎన్నారై రోడ్డు మధ్యలో ఇలా..

పద్మనాభుడి సేవలో ఎంపీ శ్రీభరత్

పద్మనాభం, న్యూస్‌టుడే: విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదివారం పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన కుంతీమాధవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. పద్మనాభం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు ఎంపీకి స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి నీరు లీకవకుండా చేసిన విధానాన్ని అనంత పద్మనాభ స్వామి, కుంతీమాధవ స్వామి ఆలయాలకు కూడా చేయూతనందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపట్టాలని, ఆలయ ముఖద్వారం నిర్మించాలని ఎంపీకి ఎంపీటీసీ దంపతులు విన్నవించారు. కార్యక్రమంలో మండల తెదేపా యువజన అధ్యక్షుడు కేవీ. సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.సుమంత్‌నాయుడు, ఆలయ ఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు వేదాశీర్వాదం చేస్తున్న ఆలయ అర్చకులు

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు దాని ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జింకలు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి వస్తున్న జింక

ఘనంగా భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి

అడివివరంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ పీవీ నరసింహం, తదితరులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భజన మండలి కన్వీనర్ దాట్ల రాజీవ్ లోచన్ పర్యవేక్షణలో సత్యసాయి మందిరం వద్ద జరిగిన వేడుకల్లో తొలుత బాబా చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, వార్డు తెదేపా అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పూజల్లో పాల్గొని సత్యసాయి ప్రసాదం స్వీకరించారు.

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా సాగర్‌నగర్ శ్రీసత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి అన్నసమారాధన చేశారు. దాదాపు 100 మంది జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్‌బాక్సులు, పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, భక్తి గీతాలాపనలు, కోలాటాలు, భజనల నిర్వహణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భీమిలి సమితి కన్వీనర్ మొల్లి సూర్య సన్యాసిరావు ఆధ్వర్యంలో భక్తులు ఉదయం నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం సత్యసాయి మందిరంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. వేద పఠనం చేసిన దుప్పట్ల పంపిణీ చేపట్టారు. సాయంత్రం బాలవికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భీమిలిలో సత్యసాయి భక్తుల నగర సంకీర్తన..

ఆనందపురం, న్యూస్‌టుడే: గొట్టిపల్లి గ్రామంలో సత్యసాయి జ్యోతిర్గమయ సేవా మందిరంలో ఆదివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో పల్లకి సేవ చేపట్టారు. అనంతరం సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డబ్బీరు విజయకుమార్, కోరాడ తమ్మునాయుడు, డి.పి.రాజు, శరత్‌కుమార్, డి.వి.ఎస్. కిరణ్, డి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి సత్యసాయి మందిరంలో భజన కార్యక్రమం



గొట్టిపల్లి గ్రామంలో..

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరే రామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి, సీతారాముల మహిమల్ని అభివర్ణిస్తూ గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ (విశాఖ) అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీ నితాయిసేవిని ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు.

వైభవంగా శ్రీకృష్ణార్పణం

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధా మదన్‌మోహన్ స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామదాసు సంకీర్త ప్రచార సమితి కళాకారులు కాళీప్రసాద్ సమక్షంలో జి.సునీత, జి.విద్యలక్ష్మి, పి.లక్ష్మి శిరీష, ఏ.సరిత, కె.మాధవిలత, కె.శ్రీలక్ష్మి, సి.రమాదేవి, శివకుమార్, సి హెచ్.దుర్గప్రసాద్ శ్రీకృష్ణలీలల సంకీర్తన చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస, యదురాజా భక్తదాస, అంబరీషదాస తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణలీలల సంకీర్తన చేస్తున్న కళాకారులు

జీవీఎంసీ స్థలాల్లో.. భారీ కంటైనర్లు

పీఎంపాలెం, న్యూస్‌టుడే

జీవీఎంసీ ఆరోవార్డు క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన అనధికారికంగా భారీ కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియం వద్ద ఎంస్‌కే ప్రసాద్ గేటు సమీపంలో జీవీఎంసీ ఖాళీ స్థలం ఆక్రమించి భారీ కంటైనర్‌లో బట్టల దుకాణం తెరిచారు. అలాగే సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల రహదారిలో నిబంధనలు అతిక్రమించి నివాస సముదాయాన్ని రెస్టారెంట్‌గా మార్చడంతో పాటు రోడ్డు పక్కన టీ దుకాణం పేరుతో రాత్రికి రాత్రి కంటైనర్ పెట్టారు. నెల రోజుల క్రితం ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరుతో రోడ్ల పక్కన చిరు దుకాణాలను జీవీఎంసీ తొలగించింది. ఇక్కడ మాత్రం రూ.3 నుంచి రూ.4 లక్షలు ఖరీదు చేసే భారీ కంటైనర్లు పెడుతున్నా ప్రణాళిక విభాగం అధికారులు తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్టేడియం వద్ద జీవీఎంసీ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్

అలరించిన సినీ సంగీత విభావరి

అల్లిపురం: డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కడలి సంస్థ పుండరీకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాన్ని వాల్తేర్ రైల్వే డివిజన్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలు అందించిన కొణతాల రాజును కడలి సంస్థ సభ్యులు సన్మానించారు.

దాడి ఘటనలో తండ్రీకొడుకులపై కేసు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జామియా మసీదులో ఓ వ్యక్తిపై తండ్రి కొడుకులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటనలో నిందితులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎ.ఎస్.ఐ.నూకరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 21న మసీదులో ప్రార్థనల సమయంలో పాత గొడవల నేపథ్యంలో తండ్రి షేక్ అన్వర్, కుమారులు షేక్ హుస్సేన్, షేక్ హుస్సేన్ అనే వ్యక్తులు షేక్ అబ్దుల్ గనీ అనే యువకునిపై దాడి చేసి బయటకు ఈడ్చుకుంటూ వెళ్లి చేతులతో పాటు రాయితో గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తండ్రీకుమారులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (JUNIOR DIVISION), MADANAPALLE
O.S. No. 489 of 2024
Plaintiff: Bandapalli Venkataramana Reddy
//Vs//
Defendant: Koramutla Surya Sekhar
SUMMONS TO DEFENDANT
Koramutla Surya Sekhar, S/o K.Lakshminarayana, Residing at D.No.19-115, LIG-32, Last Bus Stop, Pothina Mallayyapalem, Vishakapatnam Post-530041, Andhra Pradesh, Cell No. 9963597315.
Please take summons that the above matter stands posted to 05-12-2025 for your appearance. Hence your appearance before this Hon'ble court on 05-12-2025 at 10-30 A.M. either in person or through your advocate, else the matter will be decided exparte in your absence.
//By Order of the Court//
Counsel for Plaintiffs
Sri S.Prabhakar Reddy, B.Sc., LL.B.,
Sri M.Raghunatha, B.A., LL.B.,
Advocates, Madanapalle.

(c) eenadu

విశాఖ తూర్పు

ఆకట్టుకున్న వేదాంత శ్రవణం

ప్రసంగిస్తున్న విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని తి.తి.దే.కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం గురువైభవం పేరిట వేదాంత శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం శ్రీ శృంగేరి శారదాపీఠం అనుబంధ సంస్థ అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద శాస్త్ర పండితులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి పాల్గొని.. పలు అంశాలపై బోధనలు చేశారు. నిర్వాహక ప్రతినిధులు రవికుమార్, రాంబాబు, రామచంద్రశేఖరశర్మ, కార్తికేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీ రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి, తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. –నబీ, మంగాపురంకాలనీ. ✓:తక్షణమే సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. –శ్రీనివాస్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 11వ వార్డు కైలాస్‌నగర్, అప్సరకాలనీ, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లోని కొళాయిల్లో నీళ్లు తక్కువగా వస్తున్నాయి. – కె.సూర్యనారాయణ ✓: సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.– చంద్రశేఖర్, సూపర్‌వైజర్ నీటి సరఫరా విభాగం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: పెదవాల్తేరు చేపలబజారు వద్ద చెత్త పేరుకుపోయింది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దుర్వాసనతో స్థానికులు ఉండలేకపోతున్నారు. – రామలక్ష్మి ✓: సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం.–శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం



దోమల నివారణకు చర్యలు: విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: వెంకోజీపాలెం దోబీకాలనీలో దోమలు అధికమయ్యాయని, ప్రతిరోజు చెత్త సేకరణ వాహనం రావడం లేదని, ప్రధాన గెడ్డలో వ్యర్థాలు వేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మలేరియా విభాగం అధికారి బోయిన శ్రీనివాస్ సిబ్బందిని పంపించి ఫాగింగ్ చేయించారు.

వీధి కాలువలు శుభ్రం: ఆరిలోవ, న్యూస్‌టుడే: పైనాపిల్ కాలనీలో వీధి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నిల్వల కారణంగా దుర్వాసన, దోమలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 18న ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు స్పందించారు. సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయించారు.

కదలని మురుగు.. వెలగని దీపాలు

19వ వార్డులో సమస్యల తిష్ఠ

అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 19వ వార్డు బీచ్‌రోడ్డులో గాదిరాజు ప్యాలెస్ సమీప వాసవానిపాలెం, శివగణేష్‌నగర్, జాలారిఎండాడ ప్రాంతాల్లో అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..!: ■ ఆయా కాలనీల్లోని మురుగు కాలువలు శిథిలమై అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ పూడికలతో నిండిపోవడంతో మురుగు నీరు స్తంభిస్తుంది. తీవ్ర దుర్వాసనతో పాటు, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ■ వీధుల్లో విద్యుత్తు స్తంభాలపై ఏర్పాటు చేసిన దీపాలు సరిగా వెలగకపోవడంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. ■ ఎక్కడికక్కడ గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు పలువురిపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఒంటరిగా వెళ్లే వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. ■ కాలనీల్లో ఉన్న చేతి పంపులు మరమ్మతులకు గురవడంతో స్థానికులకు నీటి కష్టాలు తప్పడం లేదు.

■ దీనికితోడు ఎక్కడికక్కడ రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. కొన్ని చోట్ల భవన నిర్మాణ సామగ్రిని రోడ్లపైనే నిల్వ ఉంచడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి... ఆయా సమస్యల్ని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వాసవానిపాలెం రహదారిపైనే భవన నిర్మాణ సామగ్రి

కైలాసగిరికి పర్యాటకుల తాకిడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. రోప్‌వే ద్వారా కొండపైకి 1200 మంది వెళ్లారని నిర్వాహకులు తెలిపారు. జిప్‌లైనర్, స్కై సైక్లింగ్, టాయ్‌ట్రైన్, శివపార్వతుల విగ్రహాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. ముడసర్లోవ, తెన్నేటి పార్కులకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ఆనందంగా గడిపారు. విద్యాసంస్థలు, కాలనీ, కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు చేసి ఆటలు, పాటలతో సందడిగా గడిపారు.

తవ్వి వదిలేస్తే.. పూడ్చేదెవరు..

దర్పణం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఆరిలోవ అంబేడ్కర్ కూడలి నుంచి టీఐసీ పాయింట్‌కు వెళ్లే దారిలో ఓ పాఠశాల వీధిలో మంచినీటి కొళాయి పైపులైన్ కోసం నెల రోజుల క్రితం గోతులు తవ్వి వాటిని పూడ్చకపోవటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు పలుమార్లు గుంతల్లో పడి గాయాలపాలయ్యారు. అసలే ఇరుకుదారి కావటంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని తక్షణం ఈ గోతులు పూడ్చి సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వీఎంఆర్‌డీఏలో పీజీఆర్ఎస్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించి పరిశీలిస్తారన్నారు. ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ప్రకటనలో పేర్కొన్నారు.

తెదేపాలో పని చేసే వారికి గుర్తింపు

కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 19వ వార్డు తెదేపా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఎంవీపీకాలనీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణం చేయించారు. వార్డు అధ్యక్షుడిగా సీహెచ్.పోలారావు, ప్రధాన కార్యదర్శిగా పైడిరాజు, తెలుగు యువత అధ్యక్షుడిగా ఎ.రవి, బీసీసెల్ అధ్యక్షుడిగా ఆర్.వీర్రాజు బాధ్యతలు స్వీకరించారు. తెదేపాలో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. తి.తి.దే స్థానిక అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ సీహెచ్‌వీ.పట్టాభిరాం, ఇతరులు బాపిరాజు, సతీష్ పాల్గొన్నారు.

మ్యూజిక్ అకాడమీ వార్షిక వేడుకలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : మద్దిలపాలెం సమీప పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి విశాఖ మ్యూజిక్ అకాడమీ వార్షిక వేడుకలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు కొనసాగే వేడుకల్లో భాగంగా తొలిరోజు చెన్నైకి చెందిన డాక్టర్ బేబిశ్రీరామ్ గాత్రకచేరి ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎం.సత్యనారాయణ(వయోలిన్), ధర్మారావు(మృదంగం), జి.వెంకటేష్ (మోర్సింగ్)పై సహకారం అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఛైర్మన్ ధర్మేందర్ వరద, విశాఖ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు కేవీ.రామ్మూర్తి, కార్యదర్శి వి.చంద్రశేఖర్, సీహెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాత్రకచేరి చేస్తున్న బేబిశ్రీరామ్, ఇతర కళాకారులు

'మెదడు పోటు' చికిత్సపై కార్యశాల



కార్యశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్యులు, నిర్వాహకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని నోవోటెల్ హోటల్లో ఆదివారం ఉదయం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెదడు పోటు(బ్రెయిన్ స్ట్రోక్) చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యూరో సర్జన్ డాక్టర్ శివశంకర్ దల్లె జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడు పోటు చికిత్సలో కొత్తగా వచ్చే వైద్య విధానం, అత్యాధునిక పద్ధతులు, సాంకేతిక పరికరాల వినియోగంపై వివరించారు. గుండె పోటుతో నొప్పి తెలుస్తుందని, మెదడు పోటుతో నొప్పి తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు ఉదయ్, లిమాయి మాధ్యూ, చరణ్, అరవింద వర్మ, సుమారు 350 మంది సీనియర్, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

నాగవంశీయుల అభ్యున్నతికి కృషి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నాగవంశం కులాలకు ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేస్తానని ఏపీ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్, జీవీఎంసీ పదో వార్డు తెదేపా అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు పేర్కొన్నారు. ఇటీవల ఆయన కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైనందున నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముని మోహనకృష్ణ బుగత సత్యనారాయణ, గాడు సన్యాసినాయుడు, సూరల సత్యారావు, బుగత నర్సింగరావు, కంటుబోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పలనాయుడును అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

'కనకమహాలక్ష్మి' ఉత్సవ కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నూతన కమిటీ కొనసాగుతుంది. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ సిఫార్సుల మేరకు కమిటీ సభ్యులుగా జనసేన నుంచి కందుల నాగరాజు, వాకముళ్ల అక్కలనాయుడు, ధనాల కోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లబిల్లి వెంకటలక్ష్మి, తెదేపా నుంచి కేదారి లక్ష్మి, ఇందన భద్రరావు, మేడపాటి శ్రీధర్, యాంద్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కృష్ణారావు, ఎం.లక్ష్మీనాగేశ్వరరావు, భాజపా నుంచి కొప్పుల రామ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. వారితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ కమిటీ సభ్యుడిగా కొనసాగనున్నారు. ★ ఉత్సవాల నేపథ్యంలో ఆలయ వర్గాలకు కమిటీ సభ్యులు సహాయ, సహకారాలు అందించాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు అమ్మవారి ఆలయానికి ట్రస్టుబోర్డు ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీతో కీలక నిర్ణయాలు తీసుకునే వీలుండదు.

ఘనంగా సత్యసాయి జయంతి

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పదో వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద మార్గ ఆశ్రమంలో విద్యార్థులతో భజనలు, ధ్యానం చేయించారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, మధ్యాహ్న భోజనం అందించారు. ఆశ్రమ నిర్వాహకులు స్వామి సౌమ్యానంద అవదూత, ట్రస్ట్ ప్రతినిధులు ఆంజనేయ పాత్రో, నారాయణ పండా భజన మండలి ప్రతినిధులు వేణుగోపాల్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ బీటీఆర్ నగర్‌లో ఉన్న భగవాన్ సత్యసాయి సేవా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, నామ సంకీర్తన, భజనలు అనంతరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భజన మండలి కన్వీనర్ ఎం.రాజు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు, పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక భజనలు జరిపారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీనివాసరావు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి భజనమండలి ప్రతినిధులు

ఆరిలోవ మందిరంలో అలంకరణ

కార్మికులకు దుస్తుల పంపిణీ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 19వ వార్డులో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం సమకూర్చిన వస్త్రాలను ఆదివారం వార్డు కార్పొరేటర్ ఎన్.నూకరత్నం చేతుల మీదుగా కార్మికులకు అందించారు. నగర శుభ్రతలో కార్మికుల పాత్ర కీలకమని నూకరత్నం అన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ వై.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు ఆగి ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జింకలు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతల వివరాలను టోర్నమెంట్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని తూర్పుగోదావరి, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం విశాఖపట్నం, నాలుగో స్థానాన్ని కృష్ణా జిల్లాలు సాధించాయన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కృష్ణా, ద్వితీయ స్థానం తూర్పుగోదావరి, తృతీయ స్థానం గుంటూరు, నాలుగో స్థానాన్ని చిత్తూరు జిల్లా జట్లు సాధించినట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన నిందితుడు జయసేన్ అక్రమంగా విశాఖకు గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయిని 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు

అల్లిపురం, న్యూస్‌టుడే : నగరంలోని డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కడలి సంస్థ పుండరీకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాన్ని వాల్తేర్ రైల్వే డివిజన్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలు అందించిన కొణతాల రాజును కడలి సంస్థ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎం.వి.రాజశేఖర్, అరుణకాంత్, ప్రకాశరావు, ఇందిరా పట్నాయక్, పలువురు కళాభిమానులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపల్ వై.లక్ష్మి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో భాగంగా క్యాడెట్లకు పరుగు, త్రోబాల్, ఇతర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్యాడెట్లకు వైస్ ప్రిన్సిపల్ వై.లక్ష్మి, అధ్యాపకులు నివేదిత, ఆర్.కిరణ్మయి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ...దేశభక్తి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బే కాలనీ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో స్థానికులు, సభ్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. తెదేపా నాయకుడు బైరెడ్డి పోతన్న రెడ్డి, లాసన్స్‌బేకాలనీ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న పార్కు వాకర్స్ సభ్యులు

జాతరలో అలరించిన నృత్యాలు

బాలికల నృత్య ప్రదర్శన

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కళావేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నగరానికి చెందిన శ్రీసిద్ధేంద్రయోగి నాట్యాలయం చిన్నారులు సుమద, మోహన్, ఆశ్రిత, జస్విత, లలిత, లక్ష్మి, త్రివేణి, సౌమ్య తదితరులంతా వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు మోహనలక్ష్మి దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు, దాతలు

జగదాంబ కూడలి, న్యూస్‌టుడే : పాతనగరంలో కొలువైన శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ పునర్నిర్మాణ పూజలు నిర్వహించారు. స్థానికంగా రోడ్డు విస్తరణలో భాగంగా 2023వ సంవత్సరంలో సుమారు 16 అడుగుల వెడల్పులో ఉన్న ఆలయ ముఖద్వారం, ధ్వజ స్తంభం, నవగ్రహం మండపం తొలగించారు. అప్పటి నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు దాతల సాయంతో ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి హామీ

పద్మనాభం, న్యూస్‌టుడే: విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదివారం పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన కుంతీమాధవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. పద్మనాభం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు ఎంపీకి స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి నీరు లీకవకుండా చేసిన విధానాన్ని అనంత పద్మనాభ స్వామి, కుంతీమాధవ స్వామి ఆలయాలకు కూడా చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపట్టాలని, ఆలయ ముఖద్వారం నిర్మించాలని ఎంపీకి ఎంపీటీసీ దంపతులు విన్నవించారు. కార్యక్రమంలో మండల తెదేపా యువజన అధ్యక్షుడు కేవీ.సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.సుమంత్‌నాయుడు, ఆలయ ఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు వేదాశీర్వాదం చేస్తున్న అర్చకులు

వెటర్నరీ వైద్యులకు అవగాహన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వైజాగ్ పెట్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్(వి.పి.పి.ఎ) ఆధ్వర్యంలో వెటర్నరీ కార్డియాలజీ, ఈసీజీ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆదివారం డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ నెరళ్ల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్‌కుమార్, కోశాధికారి డాక్టర్ రాజేష్ సహకారంతో జరిగిన సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వెటర్నరీ కార్డియాలజీ నిపుణురాలు డాక్టర్ రంజిత తివారీ ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. విశాఖలోని జంతువులకు మెరుగైన గుండె సంబంధిత వైద్య సేవలందించేందుకు ఇది ఒక ప్రధాన ముందడుగని వి.పి.పి.ఎ ప్రతినిధులు తెలిపారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాల వల్ల సభ్యుల నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్య సేవలందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

వైద్యులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు రంజిత తివారీ

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : అదృశ్యమైన యువతి ఆచూకీ కనిపెట్టిన పోలీసులు, ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం మహారాణిపేట సీఐ దివాకర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... పాడేరుకు చెందిన యువతి(20) సుమారు రెండు వారాల కిందట జగదాంబకూడలిలోని బంధువులు ఇంటికి వచ్చి, అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు యువతిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

నిశీధిలో మృత్యుకేక

బస్సును ఢీకొట్టిన లారీ.. ఇద్దరి దుర్మరణం

ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : నిశీధిలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలకృత్యాల కోసం బస్సును ఆపగా, లారీ వచ్చి ఆ బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఆ వివరాలు... హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును పేరాయిపల్లె మెట్ట సమీపంలో రోడ్డు పక్కన నిలపగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న బస్సు కదిలి ముందున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లలో కూర్చున్న తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన బద్రీనాథ్(25), విశాఖపట్నానికి చెందిన హరిత (22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. పుదుచ్చేరిలో ఉన్న స్నేహితుల వద్దకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలైన ఘటన నగరంలోని ఆటోమోటివ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎంవీపీ స్టేషన్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుకతోటకు చెందిన పి.రాజేష్‌రెడ్డి తన కుమార్తె హంసఖ్య(9)తో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఆటోమోటివ్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కృష్ణా కళాశాల వైపు నుంచి వేగంగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. దీంతో ఇద్దరి కాలికి తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు వారిద్దరినీ వెంకోజీపాలెంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. సీఐ ప్రసాద్ కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం.. ఆర్టీసీ డ్రైవర్ అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రయాణికురాలి బ్యాగు చోరీ చేసిన కేసులో నిందితుడు ఆర్టీసీ డ్రైవర్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ద్వారకా సీఐ చక్రధరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిపాలెంలో నివాసముంటున్న బి.లీలావతి ఇటీవల తన కుటుంబ సభ్యులతో నిడదవోలులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి 19న సాయంత్రం 5 గంటల సమయంలో రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణిస్తూ నిద్రలోకి జారుకున్నారు. రాత్రి 8 గంటలకు నగరానికి చేరుకున్నారు. మరుసటి రోజు తన బ్యాగులోని పర్స్ వెతికితే కనిపించలేదు. అందులో 93 గ్రాముల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి పట్టీలు, ఏటీఎం కార్డు ఉంది. 21న ఎంవీపీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏటీఎం ద్వారా రూ.10 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో ఏటీఎం వద్దకు వెళ్లి ఫుటేజీ పరిశీలించారు. చోరీకి ప్రధాన కారకుడు బస్సు డ్రైవర్ నాగసూర్య వరప్రసాద్‌గా గుర్తించారు. 22న అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

నిశీధిలో మృత్యుకేక

అళ్లగడ్డ, న్యూస్‌టుడే: నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలక్షణాల్లో కనుమూసిన వారు... నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఆ వివరాలు... హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ట్రావెల్స్ బస్సును పేరాయిపల్లె మెట్ట సమీపంలో రోడ్డు పక్కన నిలిపారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న బస్సు ముందున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లలో కూర్చున్న తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన ప్రదీప్‌కుమార్(25), నగరానికి చెందిన హారిక (22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: టీపీటీకాలనీ తపాలా కార్యాలయం సమీపంలో కేబుల్ వైర్లను గుట్టలుగా వేయడంతో వాహనాలు నిలిపేందుకు వీలు పడటం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – రాజు ✓: వాటిని తరలించేలా చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్రావు, వార్డు పారిశుద్ధ్య అధికారి

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 50వ వార్డు కోలగూరులోని ఎన్‌ఎస్75/100 నెంబరు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదు. – నరసింహారావు ✓: సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – అర్జున, వీధి దీపాల ఏఈ

న్యూస్‌టుడే, జగదాంబకూడలి: జీవీఎంసీ 36వ వార్డు టౌన్‌కొత్తరోడ్డు నుంచి నుస్సపు వీధికి వెళ్లే మార్గం రోడ్డు మధ్యలో ఉన్న చెత్తకుండీ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను సకాలంలో తొలగించడం లేదు. తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. – అహ్మద్‌ఖాన్, స్థానికుడు ✓: పరిశీలించి, తక్షణమే శుభ్రత పనులు చేయిస్తాం.– అప్పారావు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

దీపాలు వెలిగించారు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 31వ వార్డు రెల్లివీధి వినాయకుడి ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : అదృశ్యమైన యువతి ఆచూకీ కనిపెట్టిన పోలీసులు, ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం మహారాణిపేట సీఐ దివాకర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... పాడేరుకు చెందిన యువతి(20) సుమారు రెండు వారాల కిందట జగదాంబకూడలిలోని బంధువుల ఇంటికి వచ్చి, అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు యువతిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ఒడిశాలోని కోరాపుట్ నుంచి నిందితుడు జయకుమార్ అక్రమంగా విశాఖకు గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయిని 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరుకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

నేడు వీఎంఆర్‌డీఏలో పీజీఆర్ఎస్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించి పరిశీలిస్తారన్నారు. ఫిర్యాదులను పరిష్కరించేలా తగిన చర్యలు చేపడతామని ప్రకటనలో పేర్కొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం.. ఆర్టీసీ డ్రైవర్ అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రయాణికురాలి బ్యాగు చోరీ చేసిన కేసులో నిందితుడు ఆర్టీసీ డ్రైవర్‌ను ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ద్వారకా సీఐ చక్రధరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిపాలెంలో నివాసముంటున్న బి.లీలావతి జీవీఎంసీ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 19న సాయంత్రం 5

గంటల సమయంలో రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కారు. రాత్రి 8 గంటలకు నగరానికి చేరుకున్నారు. మరుసటి రోజు తన బ్యాగులోని పర్సు వెతికితే కనిపించలేదు. అందులో 93 గ్రాముల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి పట్టీలు, ఏటీఎం కార్డు ఉంది. 21న ఎంవీపీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవిమహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏటీఎం ద్వారా రూ.10 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో ఏటీఎం వద్దకు వెళ్లి ఫుటేజీ పరిశీలించారు. చోరీకి ప్రధాన కారకుడు బస్సు డ్రైవర్ నాగేశ్వరరావుప్రసాద్‌గా గుర్తించారు. 22న అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం చేసినట్లు అంగీకరించారు. అతని వద్ద నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

'కనకమహాలక్ష్మి' ఉత్సవ కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నూతన కమిటీ కొనసాగుతుంది. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ సిఫార్సుల మేరకు కమిటీ సభ్యులుగా జనసేన నుంచి కందుల నాగరాజు, వాకముళ్ల అప్పలనాయుడు, దనాలకోట మాధురి, చింతపల్లి విమలకుమారి, నల్లపల్లి వెంకటలక్ష్మి, తెదేపా నుంచి కేదారి లక్ష్మి, ఇందన భద్రరావు, మేడపాటి శ్రీధర్, యాండ్ర విజయలక్ష్మి, భూమిరెడ్డి కృష్ణారావు, ఎం.లక్ష్మీనాగేశ్వరరావు, భాజపా నుంచి కొప్పల రామ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. వారితో పాటు ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ కమిటీ సభ్యుడిగా కొనసాగనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ వర్గాలకు కమిటీ సభ్యులు సహాయ, సహకారాలు అందించాలని కమిషనర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు అమ్మవారి ఆలయానికి ట్రస్టు బోర్డు ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన తాత్కాలిక కమిటీతో కీలక నిర్ణయాలు తీసుకునే వీలుండదు.

జరగని విస్తరణ.. అందని పరిహారం

మాధవధార, న్యూస్‌టుడే

జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ రోడ్డు విస్తరణ పనులు గత రెండున్నరేళ్లుగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్య పరిష్కారం అవుతుందని ఎదురుచూస్తున్న కాలనీ వాసులకు నిరాశే ఎదురవుతోంది. రెండున్నరేళ్ల క్రితం అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా మొత్తం 23 మంది తమ ఇళ్లను కోల్పోతున్నారని గుర్తించారు. వారికి పరిహారంతో పాటు టీడీఆర్ బాండ్లను అప్పట్లో ప్రకటించారు. అయితే బాధితులు ఒక్కొక్కరికి ఒక్కోలా పరిహారం, టీడీఆర్ బాండ్ల జారీలో ఇబ్బందులు తలెత్తాయి. కొంతమంది అప్పట్లో దీనిని వ్యతిరేకించి అందరికీ సమానంగా ఇవ్వాలని కోరారు. జీవీఎంసీ అధికారులు, ఇళ్లు కోల్పోయిన బాధితులు పలుమార్లు చర్చించి కొంత మందికి పరిహారం కూడా అందించారు. ముగ్గురు

నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

వ్యక్తులు కొలతలు, పరిహారం, టీడీఆర్ బాండ్ల సక్రమంగా ఇవ్వడం లేదంటూ కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం స్టే విధించింది. దీంతో జీవీఎంసీ అధికారులు బాధితులతో చర్చించి అందరికీ టీడీఆర్ బాండ్లు ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో సమస్యని పరిష్కరిస్తామని చెప్పి నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా కూటమి ప్రభుత్వమైనా తగుచర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

◆ కొంతమంది జీవనోపాధి కోసం పలు బడ్డీలు, షాపులను పెట్టుకుని జీవించేవారు. విస్తరణలో భాగంగా వాటిని తొలగించి ఇళ్లను సైతం కూల్చివేశారు. దీంతో వారందరూ జీవనోపాధి కోల్పోయామని వాపోతున్నారు. కూల్చివేసిన స్థలంలో మైనా చిన్న, చిన్న బడ్డీలు పెట్టుకుందామన్నా జీవీఎంసీ అధికారులు వచ్చి తొలగించేస్తున్నారని చెబుతున్నారు. మా సమస్యని పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు దాని ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జంతువులు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి వస్తున్న జింక

ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపల్ వై.లక్ష్మి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో భాగంగా క్యాడెట్లకు పరుగు, త్రోబాల్, ఇతర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్యాడెట్లకు వైస్ ప్రిన్సిపల్ వై.లక్ష్మి, అధ్యాపకులు నివేదిత, ఆర్.కిరణ్మయి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ...దేశభక్తి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అక్కయ్యపాలెంలో కార్డన్‌సెర్చ్

గురుద్వారా, న్యూస్‌టుడే: నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నాలుగో పట్టణ పోలీసులు ఆదివారం ఉదయం స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఉమాకాంత్, ఎస్సైలు చిన్నమనాయుడు, బాలకృష్ణలతో కలిసి అక్కయ్యపాలెం, నందగిరినగర్ ప్రతి ఇంటిని నిశితంగా తనిఖీలు చేసి వారి వివరాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 10 వాహనాలు, పొగాకు సంబంధిత ఉత్పత్తులను సరిగా లేని రెండు వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ ఉమాకాంత్, ఎస్సై చిన్నమనాయుడు

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

వైద్యులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150 మందికి పైగా పాల్గొని వైద్యసేవలు అందుకున్నారు. ఈ సందర్భంగా వాసన్ ఐకేర్ ఆసుపత్రి వైద్యులు ఉదయ్ మాట్లాడుతూ నడక, వ్యాయామాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా వంటల్లో నూనె శాతం తగ్గించాలని సూచించారు. క్లోవ్ డెంటల్ ఆసుపత్రి సిబ్బంది శిబిరానికి వచ్చినవారికి దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు వైద్యులను శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

నిత్య అన్నసమారాధన మహా పుణ్యం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అయ్యప్ప మాలధారణ ధరించిన వేలాది మంది భక్తులకు ప్రతిరోజూ నిత్య అన్న సమారాధన(భిక్ష) నిర్వహించడం గొప్ప విషయమని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు కొనియాడారు. పోర్టు ఆసుపత్రి ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఖాళీ మైదానంలోని యెమిలీ అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భిక్ష కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని వడ్డన చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

పూజల్లో పాల్గొన్న జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు దంపతులు

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పాతనగరంలో కొలువైన శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ పునర్నిర్మాణ పూజలు నిర్వహించారు. స్థానికంగా రోడ్డు విస్తరణలో భాగంగా 2023వ సంవత్సరంలో సుమారు 16 అడుగుల వెడల్పులో ఉన్న ఆలయ ముఖద్వారం, ధ్వజస్తంభం, నవగ్రహం మండపం తొలగించారు. అప్పటి నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు దాతల సాయంతో ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని నిర్వాహకులు తెలిపారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు, దాతలు

ఘనంగా మరిడిమాంబ ఉత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం 30వ వార్డు పరిధి రెల్లివీధిలో కొలువైన శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల నిర్వహణకు తన వంతు సాయం చేస్తానని, స్థానికులంతా ఐక్యంగా ఉత్సవాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యజ్ఞశ్రీ, మహి, తేజ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వనభోజనాల సందడి

వనభోజనాల్లో పాల్గొన్న భక్తులు

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధారలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. స్థానిక తోటల్లో, వేణుగోపాల స్వామి ఆలయాల వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలు అసోసియేషన్, మహిళ, యువత, కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనభోజనాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు. ఇక్కడ నిరంతరం ప్రవహించే జలధార వద్ద స్నానమాచరించి, మాధవస్వామి, వేణుగోపాలస్వామి, శివాలయాల వద్ద పూజలు చేశారు.

మానవాళికి ప్రేమతత్వం చూపిన సేవామూర్తి సత్యసాయి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో ఆదివారం సత్యసాయిబాబా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, అధ్యక్షులు సూరాడ అప్పారావు, ఇతర ప్రతినిధులు శర్మ, రామకృష్ణ, రాఘవేంద్రమిశ్రా, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయిబాబా సేవలు ఆదర్శనీయమని, ఆయన బోధనలు అనుసరణీయమని జిల్లా సంయుక్త కలెక్టర్ (జేసీ) కె.మయూర్‌అశోక్ అన్నారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు కల్యాణి, జిల్లా అధికారి మాధవి, సత్యసాయి సేవా సమితి జిల్లా యూత్ కో-ఆర్డినేటరు జి.ప్రశాంత్, కలెక్టరేట్ ఏఓ బీవీ.రాణి తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: మానవాళికి ప్రేమతత్వం పంచిన సేవా స్ఫూర్తి ప్రదాత భగవాన్ సత్యసాయి 100వ జయంతి వేడుకలను ఆదివారం సత్యసాయి వరాహలక్ష్మి నృసింహ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు జరిగిన మహానగర సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిగీతాలను ఆలపించారు. 9 గంటలకు బిర్లా కూడలి, మాధవధార పరిసర ప్రాంతాల్లోని జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులకు సత్యసాయి ప్రసాదాన్ని అందజేశారు. సామూహిక సహస్రనామ స్తోత్ర పూజలో మహిళా భక్తులు అధికసంఖ్యలో

మురళీనగర్‌లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

మహానగర సంకీర్తన చేస్తూ..

పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన మహా నారాయణ సేవలో పరిసర ప్రాంతీయులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఊయలసేవ, సామూహిక దీపారాధన పూజలు జరిపారు.

✦ 49వ వార్డు పట్టాభిరెడ్డితోటలోని భగవాన్ సత్య సాయి సేవా కేంద్రంలో నారాయణ సేవ, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పుట్టపర్తి పూర్వ విద్యార్థి కె.కార్తిక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ స్వామి తెలిపిన ప్రేమ, సేవ మార్గాల్లో నడుచుకుంటే ముక్తి లభిస్తుందన్నారు. రాత్రి నిర్వహించిన అఖండ జ్యోతిలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కన్వీనర్ సాయిరాంనాయుడు, సాయి సేవకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: తాటిచెట్లపాలెం సత్య సాయి భజన మండలి(రైల్వే ఏరియా) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఓం కారం, సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణాలు జరిపారు. అనంతరం మంగళ హారతి అందజేసి భక్తులకు విభూది, ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ పి.ప్రసాదరావు, భజన మండలి పతాధికారులు, కాలనీ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాతనగరంలో వస్త్రాలు అందజేస్తున్న సంస్థ గౌరవ అధ్యక్షులు జహీర్‌అహ్మద్

తాటిచెట్లపాలెంలో భజనలు చేస్తున్న విద్యార్థులు

మాట్లాడుతున్న పుట్టపర్తి పూర్వ విద్యార్థి కార్తిక్

సత్యసాయిబాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ మయూర్‌అశోక్, సేవా సమితి సభ్యులు

యాదవ భవనం నిర్మాణానికి సహకరించాలని వినతి

సీతంపేట, వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎండాడలో యాదవ భవనం నిర్మాణం జరిగేలా ప్రయత్నించాలని కోరుతూ జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు ఎల్.సి.అప్పలనారాయణ, ప్రచార కార్యదర్శి నక్క సాంబశివరావు నగరానికి వచ్చిన ఆచార్య కంచి ఐలయ్యను కోరారు. ఈ మేరకు ఆదివారం రామాటాకీస్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించి యాదవ కుల పెద్దలతో చర్చించి మాట్లాడుతానని తెలిపారు.

కంచి ఐలయ్యకు వినతిపత్రం ఇస్తున్న అప్పలనారాయణ, సాంబశివరావు

వెటర్నరీ వైద్యులకు అవగాహన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వైజాగ్ పెట్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్(వి.పి.పి.ఎ) ఆధ్వర్యంలో వెటర్నరీ కార్డియాలజీ, ఈసీజీ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆదివారం డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ నెరళ్ల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్‌కుమార్, కోశాధికారి డాక్టర్ రాజేష్ సహకారంతో జరిగిన సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వెటర్నరీ కార్డియాలజీ నిపుణురాలు డాక్టర్ రంజిత తివారీ ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. విశాఖలోని జంతువులకు మెరుగైన గుండె సంబంధిత వైద్య సేవలందించేందుకు ఇది ఒక ప్రధాన ముందడుగని వి.పి.పి.ఎ ప్రతినిధులు తెలిపారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాల వల్ల సభ్యుల నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్య సేవలందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

వైద్యులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు రంజిత తివారీ

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతల వివరాలను టోర్నమెంట్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని తూర్పుగోదావరి, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం విశాఖపట్నం, నాలుగో స్థానాన్ని కృష్ణా జిల్లాలు సాధించాయన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కృష్ణా, ద్వితీయ స్థానం తూర్పుగోదావరి, తృతీయ స్థానం గుంటూరు, నాలుగో స్థానాన్ని చిత్తూరు జిల్లా జట్లు సాధించినట్లు తెలిపారు.

కైలాసగిరికి పర్యాటకుల తాకిడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. రోప్‌వే ద్వారా కొండపైకి 1200 మంది వెళ్లారని నిర్వాహకులు తెలిపారు. జిప్‌లైనర్, స్కై సైక్లింగ్, టాయ్‌ట్రైన్, శివపార్వతుల విగ్రహాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. ముడసర్లోవ, తెన్నేటి పార్కులకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ఆనందంగా గడిపారు. విద్యాసంస్థలు, కాలనీ, కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు చేసి ఆటలు, పాటలతో సందడిగా గడిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

అల్లిపురం, న్యూస్‌టుడే : నగరంలోని డాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కడలి సంస్థ పుండరీ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమాన్ని వాల్తేర్ రైల్వే డివిజన్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక రంగానికి విశేషమైన సేవలు అందించిన కొణతాల రాజును కడలి సంస్థ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎం.వి.రాజశేఖర్, అరుణ కాంత్, ప్రకాశరావు, ఇందిరా పట్నాయక్, పలువురు కళాభిమానులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు

శ్రద్ధాంజలి

శ్రీ చింతలపూడి రాంబాబు గారు
District & Sessions Judge (RTP)
(అక్టోబర్ 12, 1941 -నవంబరు 14, 2025)
తేది : 24-11-2025 11.00 గం॥ నుండి
వేదిక :
ఉడాకమ్యూనిటీ హాల్ మాధవధార,
మాధవధార ఉడాకోలనీ, విశాఖపట్నం 530 018.
పిల్లలు : దినేష్ కుమార్, పురుషోత్తం కుమార్, అనూరాధ అమ్మల్
సెల్ నెంబర్స్ : 9393101853, 9032266199, 8237721336

(c) eenadu

గాజువాక
●గాజువాక ●విశాఖ పశ్చిమం

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన నిందితుడు జయసేన్ అక్రమంగా విశాఖకు గంజాయి రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. సుమారు 22 కిలోల గంజాయిని 8 ప్యాకెట్లలో సిద్ధం చేసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నిందితుడిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం అదుపులోకి తీసుకుంది. సరకు స్వాధీనం చేసుకుని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

బీమా పరిహారం అందజేత

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వాంబేకాలనీకి చెందిన జనసేన కార్యకర్త కె.మాధురి (26) ఇటీవల రైలు ప్రమాదంతో దుర్మరణం చెందగా రూ.5 లక్షలు బీమా పరిహారాన్ని అందించారు. మంగళగిరిలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాధురి కుటుంబ సభ్యులకు చెక్కును జనసేన శాసనమండలి సభ్యుడు నాగబాబు, ఎంఎస్ఎంఈ ఛైర్మన్ టి.శివశంకర్ చేతుల మీదుగా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో రాట పూజ

సింధియా, న్యూస్‌టుడే: ఈనెల 26న జరగనున్న సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవానికి ఆదివారం పలు ఆలయాల్లో రాట పూజలు నిర్వహించారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద ఉదయం రాట పూజ జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఆ రోజున కావడి ఉత్సవాన్ని కూడా ఘనంగా జరుపుతామని నిర్వాహకులు రామకృష్ణ వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: శీలానగర్ పంచవటి టౌన్‌షిప్ దారిలో వీధి దీపాలు రోజుల తరబడి వెలగడం లేదు. దారంతా ఒకటే చీకటిగా ఉంటోంది. –సత్యప్రసాద్, పంచవటి,
సమాధానం: సిబ్బందిని పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

ప్రత్యేక శుభ్రతా పనులు

వుడాకాలనీ (గాజువాక), న్యూస్‌టుడే : రోజుల తరబడి శుభ్రతకు నోచుకోని వుడాకాలనీ టింఫనీ స్కూలురోడ్డులోని డ్రైన్లలో ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది గ్యాంగ్ వర్కు పేరుతో ప్రత్యేక శుభ్రతా పనులు చేపట్టారు. 'ఈనాడులో' ఆదివారం 'మేమున్నాం మీకుతోడుగా.'లో వచ్చిన వార్తలకు అధికారులు స్పందించారు. గ్యాంగ్ వర్కు పేరుతో వుడాకాలనీ, కూర్మన్నపాలెంలో కాలువలను తీర్చిదిద్దారు.

'స్మార్ట్ వెండింగ్ జోన్లు' వస్తున్నాయ్..

గాజువాకలో నాలుగు చోట్ల ఏర్పాటుకు యోచన

గాజువాక, న్యూస్‌టుడే : పట్టణంలో అర్హులైన వీధి విక్రయదారులకు ఆధునిక సదుపాయాలతో స్మార్ట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈ మేరకు జీవీఎంసీ పట్టణ సామాజిక అభివృద్ధి (యూసీడీ) విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణీకరణలో భాగంగా ఇటీవల రహదారుల పక్కన అనధికార దుకాణాలు, బడ్డీలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా స్మార్ట్ వెండింగ్ జోన్లను తెర ముందుకు తెచ్చారు.

నెల్లూరులో కార్పొరేషన్ నిర్మించిన దుకాణాలు

ఒక్కో అడుగు ముందుకు

గాజువాకలో వీధి విక్రయదారులు సుమారు 1200 మంది వరకూ ఉన్నారు. తొలిదశలో 300 మందికి దుకాణాలు కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందించారు. నెల్లూరులో ఒక్కో దుకాణానికి బ్యాంక్ లింకేజీ కింద సబ్సిడీపై రుణాలు ఇప్పించి దుకాణాలు కేటాయించిన మాదిరిగా ఇక్కడ కూడా అ విధానం అమలుకు యోచిస్తున్నారు. జీవీఎంసీలో రిజిస్టర్డ్ దుకాణదారులకు స్మార్ట్ వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పిస్తారు. ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెండర్లతో ప్రత్యేకంగా సమావేశమై రహదారుల ఆక్రమణలు తగదని సూచించారు. త్వరితగతిన వెండింగ్ జోన్లను అందుబాటులోకి తేవాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా సంబంధిత అధికారులు స్థలాల పరిశీలన, బ్యాంకర్లతో సమాలోచనలు సాగిస్తున్నారు.

పరిశీలన..

నగరవ్యాప్తంగా 21 చోట్ల వీటిని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించగా.. గాజువాకలో 4 చోట్ల స్థల పరిశీలన చేపట్టారు. నెల్లూరు కార్పొరేషన్లో ప్రస్తుతం ఈ జోన్ల విధానం మంచి ఫలితాలివ్వడంతో ఇక్కడ కూడా అమల్లోకి తేవడానికి నిర్ణయించారు. గాజువాక జోనల్ కార్యాలయం పక్కన ప్రస్తుతం క్లాప్ వాహనాలను పార్కు చేస్తున్న స్థలం, దువ్వాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద, కణితిరోడ్డు వంటిల్లు మీడియం పార్కు, పాతగాజువాక జీవీఎంసీ వాణిజ్య సముదాయం వద్ద ఈ జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు యూసీడీ అధికారులు తెలిపారు.

స్మార్ట్ జోన్లతో మేలు

వీధి విక్రయదారులకు స్మార్ట్ వెండింగ్ జోన్ల వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రహదారులు, పట్టణ కూడళ్లలో అడ్డదిడ్డ వ్యాపారాల కారణంగా ట్రాఫిక్, ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. అర్హులైన వ్యాపారులను గుర్తించి ఈ జోన్లలో అవకాశం కల్పిస్తారు. యూసీడీ విభాగం సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. –బీఆర్ఎస్ శేషాద్రి, జెడీ

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, శిష్టకరణాల రాష్ట్ర, జిల్లా సంఘం ప్రతినిధులు

గాజువాక, న్యూస్‌టుడే : సమాజంలో శిష్టకరణాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం కణితిరోడ్డు లయన్స్‌క్లబ్ భవన్‌లో గాజువాక శిష్టకరణాల కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, ఆత్మీయ కలయిక జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక భవన నిర్మాణానికి అవసరమైన స్థలం మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు అక్కు మహంతి రాజా, నూతన అధ్యక్ష కార్యదర్శులుగా నాగమంత్రి వెంకటేశ్వరరావు, బసంతి తిరుపతిరావు, ప్రతినిధులు కరకవలస గౌరీప్రసాద్, ప్రతాపరావు శ్రీనివాసరావు, బలివాడ సత్యారావు, ఎం.సత్యనారాయణ, ఎం.సుబ్రహ్మణ్యప్రసాద్, శ్రీహరి తదితరులు ప్రమాణం చేశారు.

పశ్చిమ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న గణబాబు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి స్పష్టమైన మాస్టర్ ప్లాన్‌తో ముందుకెళ్తానని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు రజకకాలనీలో సుమారు రూ.19.90 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనం ఆయన చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జెడ్పీ శంకరరావు, తెదేపా నాయకులు అరుణ్‌కుమార్, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిశీధిలో మృత్యుకేక

■ ఆగిన బస్సును ఢీకొట్టిన లారీ
■ ఇద్దరి దుర్మరణం.. తొమ్మిది మందికి గాయాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నిశీధిలో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఊహించని ప్రమాదం దూసుకొచ్చింది. కాలకృత్యాల కోసం బస్సును ఆపగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోవగా ఇద్దరు మృతి చెందారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

ఊహించని ఘటన:

★ హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వెళ్తున్న మైత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలోరాగానే ప్రయాణికుల కాలకృత్యాలకు డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో వెనుక నుంచి పంట దిగుబడుల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వేగంతో కదిలి ముందు నిలబడి ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి.

★ బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా ఇద్దరు మృత్యువాతపడ్డారు. తొమ్మిది మందికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదానికి గురైన బస్సు

★ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన గడ్డం బద్రినాథ్(25), విశాఖపట్నానికి చెందిన హరిత(22) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. గడ్డం బద్రినాథ్ ఏడాదిన్నర క్రితమే కొలువు సాధించాడు. ★ హరిత ముందు సీట్ రిజర్వేషన్ చేసుకోగా వెనుక వచ్చి కూర్చుంది. లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న ఇరువురు తనువు చాలించారు. ఒకే కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు స్నేహితులను ప్రమాదం బలితీసుకోవడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం మిగిలింది.

రైతుబజార్ నిర్వహణపై ఆగ్రహం

రైతుకార్డును పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాస్ కిరణ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం రైతుబజార్ నిర్వహణపై మార్కెట్‌శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలను పరిశీలించారు. టమాటా ధరలు, సరఫరాపై ఆరా తీశారు. బజార్‌లో ఎక్కడికక్కడే కూరగాయల నిల్వలు, వ్యర్థాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గృహమిత్ర, పండ్ల దుకాణాలను పరిశీలించారు.

ఆటోడ్రైవర్ నిజాయతీ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి నెల్లిముక్కుకాలనీకి వరలక్ష్మి ఇంటికి వస్తుండగా.. ఆదివారం ఆటోలో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయారు. దీనిపై న్యూపోర్టు క్రైం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే ఆటోడ్రైవర్ శ్రీనివాస్ నేరుగా స్టేషన్‌కు వచ్చి బ్యాగును పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ అప్పలరాజు బాధితురాలికి బ్యాగును అందించి ఆటోడ్రైవర్‌ను అభినందించారు.

బ్యాగును అందజేస్తున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్, ఎస్ఐ అప్పలరాజు, తదితరులు

డ్రోన్లతో నిరంతర నిఘా

నిర్మానుష్య ప్రాంతాలపై దృష్టి

సింహాచలం రైల్వేస్టేషన్ పరిసరాలు

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక సీఐ లెంక సన్యాసినాయుడు నేతృత్వంలో సిబ్బందితో డ్రోన్ల ద్వారా తనిఖీలు చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో జూదం, బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాలు, గంజాయి డెన్‌లపై నిఘా ఉంచారు. ముఖ్యంగా కొత్తపాలెం శివారు భగత్‌సింగ్‌నగర్, ఎల్లపువానిపాలెం, చంద్రనగర్, సింహాచలం రైల్వేస్టేషన్, పాతగోపాలపట్నం, అడివివరం, గోశాల, సింహాచలం కొండపైన, ఇందిరానగర్, లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో డ్రోన్లను పంపించి కీలకమైన డెన్‌లను గుర్తించి వాటిపై దృష్టి పెట్టారు. గత నెల డ్రోన్ సాయంతో ముళ్లపొదల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇలాంటి నిర్మానుష్య ప్రాంతాలపైనే దృష్టి

కైలాసగిరికి పర్యాటకుల తాకిడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. రోప్‌వే ద్వారా కొండపైకి 1200 మంది వెళ్లారని నిర్వాహకులు తెలిపారు. జిప్‌లైనర్, స్కై సైక్లింగ్, టాయ్‌ట్రైన్, శివపార్వతుల విగ్రహాల వద్ద సందర్శకులు సందడి చేశారు. ముడసర్లోవ, తెన్నేటి పార్కులకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ఆనందంగా గడిపారు. విద్యాసంస్థలు, కాలనీ, కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు చేసి ఆటలు, పాటలతో సందడిగా గడిపారు.

నేడు వీఎంఆర్‌డీఏలో పీజీఆర్ఎస్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించి పరిశీలిస్తారన్నారు. ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ప్రకటనలో పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులకు బాలిక అప్పగింత

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంటి నుంచి పారిపోయిన బాలికను దువ్వాడ పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు ఆదివారం అప్పగించారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడికి చెందిన ఓ బాలిక గత నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నగరంలోని ఆరిలోవలో ఉంటున్న బాలికను గుర్తించి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నెల్లిముక్కు(పెదగంట్యాడ), న్యూస్‌టుడే : గాజువాక 75వ వార్డులో రూ. 30లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆదివారం కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, డీఈ అప్పారావు, ఏఈలు పరిశీలించారు. నెల్లిముక్కు, కండేపల్లివీధి, పెదగంట్యాడలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులను పరిశీలించి గుత్తేదారులకు పలు సూచనలిచ్చారు. నాణ్యతకు ఢోకాలేకుండా చూడాలని పేర్కొన్నారు.

పేదలకు వస్త్రాలు అందిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు

అగనంపూడిలోని సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వివిధ వేషధారణలతో చిన్నారులు

అక్కిరెడ్డిపాలెంలో సత్యసాయికి భక్తుల పూజలు

ఉక్కునగరంలో స్వామివారి ప్రసాదం, పటం, విభూది అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

సత్యసాయి మార్గం అనుసరణీయం: మేయర్

గాజువాక, పెదగంట్యాడ, అగనంపూడి, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయి చూపిన మార్గం అనుసరణీయని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సత్యసాయి శత జయంతిని పురస్కరించుకుని 65వ వార్డులో రక్తదాన శిబిరం, పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ★ పెదగంట్యాడ వెంపల్లినగర్‌లో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వడ్లపూడి లక్ష్మీపురం కాలనీలో సత్యసాయి పూజల్లో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ★ కొత్తగాజువాక సాయిరాంనగర్‌లో సాయికృపా మందిరంలో కన్వీనర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో నారాయణ సేవలో భాగంగా పేదలకు దుప్పట్లు, చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

ఉక్కునగరంలో..: ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3)న్యూస్‌టుడే : ఉక్కునగరంలో జరిగిన సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాజపా మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి, జి.రామకృష్ణ, ఎన్.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్తు దీపాల ఏర్పాటు

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 79వ వార్డు పరిధిలో వీధి దీపాల సమస్యపై ఫిర్యాదులు అందని నేపథ్యంలో నూతనంగా 52 వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అగనంపూడి, దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం ప్రాంతాల్లోని కాలనీల్లో మూడు రోజుల పాటు పనులు చేసి దీపాలను బిగించి కనెక్షన్ ఇచ్చారు. దీంతో కాలనీల్లో విద్యుత్తు కాంతులు ప్రసరిస్తున్నాయి.

గౌరీ సేవా సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: శీలానగర్ దరి దాసరి పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఆదివారం నాతయ్యపాలెం-అక్కిరెడ్డిపాలెం గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సుమారు 150 కుటుంబాలు హాజరయ్యాయి. సంఘ అధ్యక్షులు, కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్, మధ్యాహ్నం ప్రాంగణంలో భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు శిక్షణ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : నగరంలో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకూ జరగనున్న 63వ జాతీయ స్కేటింగ్ పోటీలకు ఉక్కు ఇందిరా పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ఈనెల 20వ తేదీ నుంచి డిసెంబరు 2 వరకూ శిక్షణ ఇస్తున్నారు. అనంతపురం, కృష్ణా, నెల్లూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల నుంచి సుమారు 211 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

సాధన చేస్తున్న స్కేటింగ్ క్రీడాకారులు

యోగాతో మానసిక వికాసం

యోగా గురువును సత్కరిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నిత్యం యోగాతో మానసిక పరివర్తన సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో శ్రీశాంతియోగ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గీతం యూనివర్సిటీ యోగా ప్రొఫెసర్ రామారావు, కార్పొరేటర్ పల్లా శ్రీను, యోగా గురువు కనకారావు యోగ, ధ్యాన సాధనల వల్ల ప్రయోజనాలను వివరించారు. అనంతరం పలువురు యోగా గురువులు, వక్తలను నిర్వాహకులు సత్కరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపాలెం సమీపంలోని శ్మశానవాటిక వద్ద కణితికాలనీకి చెందిన కాండ్రేగుల ఓంకార్ (25), వడ్లపూడికి చెందిన దెందేటి సందీప్ (28) గంజాయి తరలిస్తుండగా పోలీసు తనిఖీలో పట్టుకున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. లక్షలు వెచ్చించి.. లక్ష్యం మరిచి..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ప్రజా అవసరాలకోసం లక్షలు వెచ్చించి శ్రీనగర్-సుందరయ్యకాలనీ రోడ్డుపై జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయం దిక్కు మొక్కూలేకుండా పడుంది. పదేళ్లక్రితం జీవీఎంసీ సాధారణ నిధులతో అప్పట్లో రూ.7 లక్షలతో 14 దుకాణాలను నిర్మించి చిరువ్యాపారులకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఇక్కడే మార్కెట్ వస్తుందని ప్రచారం జరిగింది. అట్టహాసంగా వీటిని నిర్మించినా ఆ తర్వాత ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీంతో చివరకు పార్కింగ్ స్థలంగా, పారిశుద్ధ్య సిబ్బంది పనిముట్లు పెట్టుకునే ప్రదేశంగా మారిపోయింది. నివాసితుల మార్కెట్ అవసరాలను గుర్తించి ఇకనైనా దుకాణాలను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఈ మ్యాన్‌హోల్ చూశారా ?

రోడ్డుకన్నా ఎక్కువ ఎత్తులో మ్యాన్‌హోల్

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే : చిత్రంలో ఉన్న ఈ మ్యాన్‌హోల్ మూత చూశారా.. రోడ్డుకు ఎంత ఎత్తులో ఉందో.. పగటి పూట అయితే కనిపిస్తుంది. కాస్త పక్కనుంచి వెళ్లే అవకాశం ఉంది. అయితే రాత్రిళ్లు రోడ్డే అనుకుని వాహనాలు వెళ్తే దీనిని ఢీకొని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గాజువాక 71వ వార్డు అఫీషియల్‌కాలనీలోని రహదారిలోనిది ఈ చిత్రం. అధికారులు స్పందించి ఇలాంటి మ్యాన్‌హోల్ మూతలను రోడ్డుకు సమాంతరంగా వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది.

గోపాలపట్నంలో సినిమాలు
శ్రీనరసింహ: 12ఏ రైల్వేకాలనీ,
నరసింహం: జిగిరీస్
మౌర్య: ప్రేమంటే
ఎస్జీబీఎల్‌లో: స్క్రీన్-1: సీసు: రోడ్డు టు రివేంజ్, స్క్రీన్-2: 12ఏ రైల్వే కాలనీ, స్క్రీన్-3: రాజు వెడ్స్ రాంబాయి, స్క్రీన్-4: ప్రేమంటే

కొండచరియలు జారుతున్నాయి...

యారాడ (మల్కాపురం) న్యూస్‌టుడే : యారాడ ఘాట్‌రోడ్డులో వర్షాల సమయంలో కొండచరియలు జారడం ఆందోళన కలిగిస్తోంది. ముందే రాళ్ల బీటలు వారిన చోట రక్షణ చర్యలు తీసుకుంటే మంచిది. ఆయా చోట్ల రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇటీవల మొంథా తుపాను సమయంలో యారాడ ఘాట్‌రోడ్డులో కొంచచరియలు జారిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ జారిన కొండచరియలు కనీసం ఇప్పటి వరకు తొలగించకపోవడం విశేషం. కనీసం జారిన బండ రాళ్లను అధికారులు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మొంథా తుపానుకు జారిన కొండచరియ

జాతీయ రహదారిపైకి జింక రాక

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జాతీయ రహదారిపై ఆదివారం ఓ జింక పిల్ల రోడ్డుపైకి వచ్చి హల్‌చల్ చేసింది. సమీప కంబాలకొండ ప్రాంతంలో సంచరించే ఈ జింక హఠాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కొంతసేపు బెదురు చూపులు చూస్తూ జనవాసాల మధ్య సంచరించింది. ఈలోగా ప్రయాణికులు ఆగి ఫొటోలు తీసుకున్నారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జంతువులు బయటకు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలు జింకలు ఇలా రహదారులపైకి వచ్చి మృత్యువాత పడ్డాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైకి వస్తున్న జింక

అనురాగమూర్తికి అశ్రునివాళి
మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించి దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కుమారుడు - కోడలు: ఈటి కృష్ణప్రసాద్ - ముకుందవల్లి
మనుమరాలు, మనుమడు: జాహ్నవి భాను, రిషికేష్
కుమార్తె - అల్లుడు: జయశ్రీ - సంద్రాన సూర్య చంద్రరావు
మనుమలు: కిరణ్ దుర్గ శ్రీనివాసరావు, జయసూర్య కృష్ణ
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

కీ॥శే॥ ఈటి ఆదిలక్ష్మిగారు
భర్త: (లేటు) శ్రీ ఈటి అప్పారావు గారు
Retd. Quay. Foreman, VPT
జననం: 11-07-1948 మరణం: 14-11-2025
పెద్దకర్మ: తేది. 24-11-2025 (సోమవారం) మధ్యాహ్నం 12 గం॥ల నుండి
డో.నెం: 21-34/10, విమాన్‌నగర్, ఎన్.ఎ.డి. పోస్ట్, విశాఖపట్నంలో మాస్వగృహం నందు జరుగును. ఫోన్: 9550293618

(c) eenadu

ఈనాడు
విజయనగరం
సోమవారం నవంబరు 24, 2025

జన్మదినోత్సవ



నీతి, నిజాయితీలకు పెట్టింది పేరు పూసపాటి వంశీయులు...
సామాన్య జీవితం గడుపుతూ నిత్యం పేద ప్రజల సేవలో ముందుకు వెళుతూ...
విజయనగరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మన యువ శాసనసభ్యురాలు
శ్రీమతి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గారికి జన్మదిన శుభాకాంక్షలు...



అవనాపు విజయ్, భార్గవి
విజయనగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు

(c) eenadu

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు ఉత్తరం క్రీడ | Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, పెదపాడు విలేజ్ శ్రీకాకుళం - 532 401
వివరాలకు: 90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

శాంతిమూర్తికి నృత్యాంజలి

చీపురుపల్లిలోని ఆంజనేయపురం సత్యసాయి ఆలయంలో స్వామికి వంద రకాల ప్రసాదాలు ఏర్పాటు చేసిన భక్తులు

కొత్తవలస, ఎస్.కోట, చీపురుపల్లి న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సాయి మందిరాల్లో ఉత్సవాలను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పతకాలు ఆవిష్కరించారు. ఎస్.కోటలోని పెదఖండేపల్లి రోడ్డులో దత్తసాయి మందిరంలో స్వామికి పుష్పయాగం నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీప్రసన్న నృత్య కళా నికేతన్ విద్యార్థుల నృత్య ప్రదర్శనతో అలరించారు. కొత్తవలసలో బాలవికాస్ బాలల వేషధారణ ఆకట్టుకుంది.

కొత్తవలసలో వివిధ వేషధారణల్లో బాలవికాస్ బాలలు

సత్యసాయి మార్గం సమాజహితం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజానికి ఎనలేని సేవలు అందించిన సత్యసాయి మార్గాన్ని అంతా అనుసరించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని కంచరివీధి మందిరంలో శతజయంతి ఉత్సవంలో పాల్గొని, మాట్లాడారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టర్ వైశాలి, మందిరం కన్వీనర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాబా విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి దంపతులు, అధికారులు

ప్రతిభ చూపారు.. మన్యంలో మెరిశారు

జ్ఞాపికలతో విజేతలు, జేవీవీ సభ్యులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని వేదాంత కళాశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మక్కువ మూరు(పాచిపెంట), తమ్మినాయుడు ఉన్నత పాఠశాల(పాలకొండ) ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరీనాయుడు తెలిపారు. డిసెంబరు 21, 22, 23వ తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయి. ఏపీ మోడల్ స్కూల్(భామిని), బందలుప్పి, వంతరాం జడ్పీ పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 16 ప్రభుత్వ, ఆరు ప్రైవేటు పాఠశాలల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు బీవీ రమణ, ఉపాధ్యక్షులు గౌరీశ్వరరావు, సతీష్‌రాజు, కన్వీనర్ కె.మురళి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, లక్ష్మునాయుడు, అజయ్, ప్రిన్సిపల్ వెంకటరమణ విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

బండలు తొలచి.. దారిగా మలచి

స్వచ్ఛందంగా గ్రామానికి రోడ్డు బాగుచేసుకున్న గిరిజనులు

బొబ్బిలి మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోని దేవుడి బొడ్డవలస గిరిజన గ్రామానికి సరైన రహదారి లేదు. ఉన్నది కాస్తా వర్షాలకు పాడైంది. రోడ్డు పక్కనున్న గుట్ట రాళ్లు అడ్డంగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు మొర విన్నవించినా స్పందన లేకపోవడంతో చేసేది లేక పలువురు పారపట్టి, నడుంబిగించిన గిరిజనులు రోడ్డు బాగు చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా స్పందించలేదని వాపోతున్నారు. సుమారు కిలోమీటరున్నర మేర శ్రమదానం చేసి గుట్టలు, రాళ్లు తొలగించి మార్గం చేసుకున్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

శుభకార్యంలో అవయవ దానానికి అంగీకారం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు దోల నాగరాజు, రమా దంపతుల కుమార్తె నిహారిక ఓణీల కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. ఈ మేరకు అంగీకార పత్రాలపై సంతకాలు చేసి మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు గోవిందరాజులకు అందజేశారు. పలువురు అభినందించారు.

పత్రాలపై సంతకాలు చేసి గోవిందరాజులకు అందజేస్తున్న నాగరాజు, రమా దంపతులు

ఆదివారం.. ఆనంద విహారం

సీతంపేట మన్యంలోని జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొన్నాయి. సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి కుటుంబాలు, స్నేహితులు, విద్యార్థులు సందర్శించి వన భోజనాలు చేశారు. ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో చిన్న, పెద్ద తేడా లేకుండా పలు సాహస, ఇతర క్రీడల్లో పాల్గొన్నారు. ఆనంద వేదిక వద్ద నృత్యాలు, సైకిళ్ల రైడింగ్‌తో కొత్త అనుభూతి పొందారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ తదితర జలపాతాల వద్ద జలకాలాడారు. ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్ట్సు ప్రాంతాలకు వెళ్లారు. ఆదివారం చీకటి పడిన తర్వాత పార్కులో జరిపిన క్రాకర్స్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సందర్శించారు. సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, సీతంపేట

బోటింగ్, ఊగే వంతెనపై పర్యాటకులు

మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

30న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.. క్రీడా విభాగం: ఇన్‌స్పైర్ లార్వెన్స్ స్కూల్‌లో అండర్-15 ఏపీ ఓపెన్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఏ రావు, కార్యదర్శి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8520886564 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "బాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

High Way facing 261Sq.Y site (VMRDA approved) Akshaya Nagar in Nelivada Vill., Bondapalli Mdl, VZM for sale ✆ 9676743732.

VZM నీళ్లట్యాంక్ & MIMS ఊటగెడ్డ దగ్గర 200 గజముల Bits '2' కలవు. Contact: 7416816888.

JOBS

లలిత హోండా 2 వీలర్ షోరూమ్స్‌లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. * బ్రాంచ్ మేనేజర్స్ - కొత్తూరు, పాలకొండ * కంప్యూటర్ ఆపరేటర్(M) - శ్రీకాకుళం బ్రాంచ్‌ల కొరకు ✆ 9492770556. 8498884111.

VZM 90రోజులు ఉచితంగా కంప్యూటర్ కోర్సు & ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టార్‌లో ట్రైనింగ్‌తోపాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (Pass), Inter, డిగ్రీ, ITI (పాస్/ఫెయిల్) Age: 18to35 ✆ 8919050156, 9493359472.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తాగునీటి పథకాలకు మోక్షం!

- ఇక పట్టణాల గొంతులు తడవనున్నాయ్
- రూ.కోట్లతో నిర్మాణాలకు అడుగులు

న్యూస్‌టుడే: బొబ్బిలి

నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పథకాల నిర్మాణాలకు అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు గుర్తించినా నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత అంచనాలలో రూ.కోట్లలో అదనపు భారం పడినా, కూటమి ప్రభుత్వం పూర్తిచేసేందుకు అడుగులు వేస్తోంది. ఇప్పటికే వాటి డీపీఆర్‌లను ఆమోదించింది. టెండర్ల ప్రక్రియ చేపడుతోంది.

రూ.కోట్లలోనే భారం..

ఉమ్మడి జిల్లాలోని మూడు పురపాలక సంఘాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో పథకాల నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే ప్రణాళికలు రూపొందించారు. మూడు పట్టణాలకు రూ.171 కోట్లతో 23 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పథకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. అమలులో నిర్లక్ష్యం వహించారు. తాజా అంచనాలు రూ.218.98 కోట్లకు చేరుకున్నాయి. సాలూరుకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. సాంకేతిక అనుమతులొస్తే పనులు ప్రారంభించాల్సి ఉంది.

పాతబొబ్బిలిలో కుళాయి వద్ద పరిస్థితి

యూఐడీఎఫ్‌లో ఆ రెండు.. బొబ్బిలి, పార్వతీపురం పురపాలికల్లో 32 ఎంఎల్‌డీ నీటిని అందించేందుకు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యూఐడీఎఫ్) నుంచి నిధులు కేటాయించారు. గతంలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించినా గుత్తేదార్లు సకాలంలో చేయక బిల్లులు నిలిచిపోయాయి. దీనిని యూఐడీఎఫ్‌లోకి మార్చారు. గతంలో ఈ రెండింటికీ రూ.180 కోట్లు కేటాయించగా ప్రస్తుత అంచనాలు రూ.212.93 కోట్లకు చేరుకున్నాయి.

మార్చారు.. భారం తప్పలేదు.. రాజాం పురపాలిక, విజయనగరం నగరపాలక సంస్థల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు గతంలో అమృత్ పథకంలో పనులు చేపట్టారు. తర్వాత ఏఐఐబీలోకి మార్చారు. రాజాంకు రూ.9.82 కోట్లు, విజయనగరానికి రూ.66.36 కోట్లు కేటాయించారు. రెండు చోట్లా 13 ఎంఎల్‌డీల నీటిని అందించేందుకు ప్రతిపాదించారు. గతంలో వీటికి రూ.60 కోట్లతో ప్రతిపాదించగా, ప్రస్తుత అంచనాలు రూ.76.18 కోట్లకు చేరుకున్నాయి.

పురపాలిక	మంజూరైన నిధులు	నీటి సామర్థ్యం
సాలూరు	100.36	10
పాలకొండ	71.94	7
నెలిమర్ల	46.68	6
బొబ్బిలి	126.39	17
పార్వతీపురం	86.54	15
రాజాం	9.82	3
విజయనగరం	66.36	10

సాంకేతిక అనుమతులే తరువాయి.. పట్టణాల్లో తాగునీటి పథకాలకు మోక్షం దక్కింది. డీపీఆర్‌లు ఆమోదమయ్యాయి. సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది. అవి వచ్చాక టెండర్లు పిలిచి ఏజెన్సీలు ఖరారు చేస్తాం. పనులు ప్రారంభిస్తాం. అవి పూర్తయితే 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య ఉండదు. సాలూరు మున్సిపాలిటీలో పనులకు టెండర్లు పూర్తయ్యాయి.
– జ్యోతి, ప్రజారోగ్యశాఖ ఈఈ విజయనగరం

డాక్యుమెంటు కాపీలు ఇవ్వాలని వినతి

ఎస్.కోట: తమకు ఇచ్చిన అత్యవసర నోటీసుల్లో పేర్కొన్న డాక్యుమెంటు కాపీలు అందించాలని జిందాల్ బినామీ సాగుదారులు శనివారం తహసీల్దార్‌కు లేఖ అందించారు. అక్రమంగా పొందిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని తహసీల్దార్ గత సోమవారం 12 మందికి నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. తాము ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పరిహారం తీసుకున్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసి నిర్ధారించారన్నారు. ఇప్పుడు నోటీసులివ్వడం సరికాదన్నారు. డాక్యుమెంట్లు అందిస్తే చూసి సమాధానం చెబుతామన్నారు. సోమవారం లేఖలు పరిశీలించి చర్యలు చేపడతామని ఆదివారం తహసీల్దార్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

పూర్వ విద్యార్థుల సాయంతో నిర్మిస్తున్న ట్రాక్

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో మైదానంలో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా దీని నిర్మాణ ఆలోచనను ప్రధానోపాధ్యాయుడు రఘురాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అనుమతితో సుమారు రూ.1.60 లక్షలతో ఈ ట్రాక్ నిర్మాణాన్ని పూర్వ విద్యార్థులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు సైతం నిర్మించనున్నామని తెలిపారు. క్రీడాకారులు, పోలీసు శిక్షణ పొందే వారికి ఇది ఉపయోగ పడుతుందని వారు తెలిపారు.

పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలి

నెల్లిమర్ల: తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ సారిపల్లి గ్రామస్థులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 15.40 ఎకరాల భూమికి సంబంధించి పరిహారం కలెక్టర్ ద్వారా చెల్లించాలన్నారు. కోరాడపేట, ఏటీ.అగ్రహారం, పడాలపేట గ్రామాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కష్టాలు వింటారు.. నష్టాలు తీర్చుతారు

నేటి నుంచి జిల్లాలో 'రైతన్నా- మీకోసం' కార్యక్రమం

న్యూస్‌టుడే- రాజాం, పార్వతీపురం పట్టణం, సీతంపేట, వీరఘట్టం

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కర్షకులు సాంకేతికంగా నైపుణ్యం సాధించేలా చైతన్యం కల్పించేందుకు 'రైతన్నా- మీకోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి రైతు కుటుంబం ఇంటి తలుపుతడతారు. ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధిలో శాశ్వత మార్పు తీసుకురావడమే దీని లక్ష్యం.

రైతు సేవా కేంద్రాల వారీగా కార్యక్రమ ప్రణాళిక రూపొందించారు. గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఇంజినీరింగ్, విద్యుత్తు సహాయకులు, వీఆర్వో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్కెట్ కమిటీల పాలకవర్గాలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, పీఏసీఎస్, ప్రగతిశీల రైతులు, ఇతర ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. అవసరమైన కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ప్రస్తుత రబీ, వచ్చే ఖరీఫ్, రబీ.. మూడు సీజన్లకు కార్యాచరణ రూపొందిస్తారు. విజయనగరం జిల్లాలో 2.27 లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2.33 లక్షల ఎకరాలకు సంబంధించిన రైతు కుటుంబాలను సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో పేర్లు నమోదు చేస్తారు. ఒక్కో బృందంలో 6 నుంచి 8 మంది సభ్యులు ఉంటారు.

సీతంపేటలో యంత్రంతో సాగు పనుల్లో రైతు

క్లస్టర్ ప్రాతిపదికగా..

ప్రతి అయిదు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. ఒక్కో బృందం రోజుకు 90 కుటుంబాలను కలుస్తుంది. సీఎం సందేశలేఖ, కరపత్రం అందిస్తారు. రైతుల సూచనలు నమోదు చేస్తారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పిస్తారు. రైతుల సలహాలు, ఫిర్యాదులను క్రోడీకరించి డేటాను తయారుచేస్తారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 2 వరకు దీనిపై విశ్లేషిస్తారు. 2026-27 వ్యవసాయ ప్రణాళికను రూపొందించేందుకు ప్రతి ఆర్ఎస్‌కే పరిధిలో డిసెంబరు 3న కార్యశాల నిర్వహించాలని నిర్ణయించారు.

సీఎం లేఖలో ఉండేదిదే.. సీఎం లేఖను ప్రతి ఇంటికీ అందిస్తారు. జలాశయాలను పూర్తి చేసేందుకు నిధులు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం, వ్యవసాయంలో సాంకేతికత, సూక్ష్మ సేద్యానికి రాయితీ, ఆహారశుద్ధి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కు, పంటలకు గిట్టుబాటు ధర, అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద ప్రతి రైతు కుటుంబానికి రెండు విడతల్లో ఇప్పటికే రూ.14 వేలు జమ, పశుసంరక్షణ అంశాలు లేఖలో ప్రస్తావించారు. ఈ వారోత్సవాల్లో రైతులకు అవగాహన కల్పిస్తామని, అంతా భాగస్వామ్యం కావాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి తెలిపారు.

(c) eenadu

ఈనాడు
విజయనగరం
సోమవారం నవంబరు 24, 2025

ఏపీ ప్రమాద హెచ్చరికలు

● ఘటనలప్పుడే హడావుడి

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతానగరం

- నాలుగు రోజుల క్రితం కురుపాం మండలం బియ్యాలవలసకు చెందిన ఎం.అన్నపు రాయుడు కళ్లికోట వద్ద నాగావళి నది దాటుతూ ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయారు.
- కొన్నిరోజుల కిందట సీతానగరం మండలంలోని సువర్ణముఖి నదిలో ఓ వ్యక్తి గల్లంతై మృతదేహంగా తేలాడు.
- గతేడాది మక్కువ మండలంలో ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గెడ్డలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.
- తాజాగా రబ్బరు డ్యామ్ వద్ద ముగ్గురు యువకులు గల్లంతయ్యారు

ఈ నాలుగు ఘటనలే కాదు. నిత్యం ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటా పదుల సంఖ్యలోనే మృత్యువాత పడుతున్నారు. కోనేర్లు, నదులు, డ్యామ్‌లు, గెడ్డల వద్ద గల్లంతై ప్రాణాలు కోల్పోతున్నారు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం స్పందించడం లేదు.

మన్యం జిల్లాలో చిన్నా, పెద్ద నదులు, గెడ్డలు 25 నుంచి 30 వరకు ఉన్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో ఉప్పొంగుతున్నాయి. నెల రోజుల పాటు ప్రవాహ వేగం కనిపిస్తుంది. ఈ క్రమంలో అందులో దిగితే కొట్టుకుపోయే ముప్పు పొంచి ఉంది. నివారణలో భాగంగా ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ చర్యలు అవసరం. హెచ్చరిక బోర్డులు పెట్టడం, అటుగా ఎవరూ వెళ్లకుండా చూడడం, ఇసుక తవ్వకాలు ఆపడం.. తదితర పనులు తప్పనిసరి. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల వద్ద కంచెలు ఏర్పాటు చేయాలి. ఆయా పనులతో ప్రమాదాలకు ఆస్కారం ఉండదని పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఇంజినీరు తెలిపారు.

ఆశలు మునిగి.. కన్నీళ్లు మిగిలి

న్యూస్‌టుడే, పార్వతీపురం, కొమరాడ

కోటి ఆశలు కన్నీళ్లుగా మారాయి.. కళ్లెదుటే.. జలరక్కసి కోరల్లో మూడు ప్రాణాలు చిక్కుకున్నాయి.. ఒకరి వెంటే ఒకరు ఆర్తనాదాలతో కొట్టుకుపోతుంటే. ఒడ్డునున్న స్నేహితుల రోదనలు మిన్నంటాయి.. ఆచూకీ దొరకక.. కన్నీరు ఆగక.. రక్షించు దేవుడా అంటూ కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరుల్ని కలచివేసిన ఘటన కొమరాడ మండలం సివిని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. శుభకార్యం కోసం కలిసిన స్నేహితులంతా సరదాగా ఈతకు నదికి వెళ్లి ప్రమాదంలో పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నదిలో కొట్టుకుపోతున్న శరత్‌కుమార్

బాలుడ్ని రక్షించాలని..

రాయగడ శరత్‌కుమార్(17), అరసాడ ప్రతాప్(29), పోతుజోడ సాయికృష్ణ, అరసాడ చందు, రాయగడ చక్రి, అధికారి లక్ష్మీనాయుడుతో పాటు మరికొందరు రబ్బరు డ్యామ్‌లోకి దిగారు. స్నానం చేస్తుండగా శరత్‌కుమార్ మునిగిపోయాడు. అతడిని రక్షించే క్రమంలో ప్రతాప్ గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న ముగ్గురు యువకులు గ్రామంలో ఉన్న అధికారి గోవిందనాయుడు(35), అతని తమ్ముడు జగదీష్‌కు చెప్పారు. వీరిద్దరూ వాళ్లని కాపాడేందుకు నదిలో దిగారు. ఇంతలో గోవిందనాయుడు ఊబిలో చిక్కుకున్నారు. కళ్లముందే కొట్టుకెళ్తున్న అన్నయ్యను చూసి జగదీష్ తల్లడిల్లిపోయాడు. సీఐ రంగనాథం, ఎస్సై నీలకంఠం, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

ఎ.గోవిందనాయుడు

ఆర్.శరత్‌కుమార్

ఎ.ప్రతాప్

బోరుమన్న బాధితులు..

గోవిందనాయుడుకు ఏడు, అయిదేళ్ల వయసు గల కుమారులు స్వాతిక్, యోగేంద్ర ఉన్నారు. ఇటీవల అతని తండ్రి తవిటినాయుడు అనారోగ్యంతో చనిపోయారు. గ్రామంలో వెల్డింగ్ దుకాణం పెట్టుకుని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భార్య, పిల్లలు విలపిస్తున్నారు.

ఆరునెలల క్రితమే ఉద్యోగం..

సివినికి చెందిన కూలీలు లక్ష్మణ్, పార్వతి దంపతుల కుమారుడు ప్రతాప్. ఆర్థిక సమస్యలున్నా ఇంజినీరింగ్ చదివించారు. అతను ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. ఇంటికి వెలుగుదివ్వెగా మారాడని సంబరపడ్డామని, ఇంతలో ఘోరం జరిగిందని రోదిస్తున్నారు.

పెళ్లి కోసం వచ్చి..

సివిని గ్రామంలో ఆదివారం ఉదయం 5 గంటలకు జరిగిన స్నేహితుడి పెళ్లి కోసం వీరంతా ఒక్కచోట కలిశారు. పెళ్లిబాజాలు, మేళతాళాల మధ్య సందడి చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఏడుగురు మిత్రులు కలిసి జంఝావతి నది సమీపంలోని చెట్ల కింద భోజనాలు తిన్నారు. ఆపై..

3.45 గంటలకు.. స్నానానికి దిగారు.
3.50 కి..: శరత్‌కుమార్ గల్లంతు
4.00 కి..: ప్రతాప్ మునిగిపోయాడు
4.15 కి..: గోవిందనాయుడు గల్లంతు

తిరిగొస్తానని.. సివిని వాసి, చోదకుడు శ్రీను పెద్ద కుమారుడు శరత్ కుమార్. పార్వతీపురంలో ఇంటర్ చదువుతున్నాడు. అందరితో కలిసి అలా తిరిగొస్తానని వెళ్లి, మునిగిపోయాడు

విలపిస్తున్న గోవిందనాయుడు తమ్ముడు జగదీష్

బాలుడ్ని మింగేసిన కోనేరు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని బాలుడ్ని ఓ చెరువు మింగేసింది. మరో విద్యార్థిని ఆసుపత్రిపాల్జేసింది. ఈ విషాదకర ఘటన పూసపాటిరేగ మండలంలో ఆదివారం వేకువజామున జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. వెంపడాం గ్రామానికి చెందిన కిలారి బోధన్(8), ఎడ్ల చక్రి(12) భవానీమాల ధరించారు. ఇద్దరూ కలిసి స్నానం చేసేందుకు పేరాపురం సమీపంలోని కోనేరుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో ఒక్కసారిగా మునిగిపోయారు. సమీపంలో ఉన్న ఎం.అప్పన్న అనే వ్యక్తి చూసి, పరుగున వచ్చి బయటకు తీశారు. అప్పటికే బోధన్ మృతిచెందాడు. చక్రిని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు కాలేదు.

బోధన్(పాతచిత్రం)

ఒక్కగానొక్క కుమారుడు..

వెంపడాంకు చెందిన శ్రీనివాస్, పద్మలది ప్రేమ వివాహం. వీరికి ఒక్కగానొక్క కుమారుడు బోధన్ ఉన్నాడు. దీంతో అల్లారుముద్దుగా పెంచారు. పేరాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. మొక్కు చెల్లింపులో భాగంగా ఇటీవల అర్ధమాల వేయించారు. రోజూ తోటి భవానీలతో కలిసి స్నానానికి వెళ్లేవాడు. ఆదివారం మాత్రం మరో బాలుడితో వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

బావిలో పడి కార్మికుడి మృతి

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలం ఎ.రావివలస పంచాయతీ జోగపేట గ్రామంలోనూ ఓ వ్యక్తిని బావి బలి తీసుకుంది. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వి.రాంబాబు(42) బావిలోకి దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు కోల్పోయాడు. తాపీపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అతడికి భార్య, 19 ఏళ్ల కుమారుడున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

పరీక్ష కేంద్రానికి చేరుకోవడం ఇక సులభం

హాల్ టిక్కెట్‌పై క్యూఆర్ కోడ్

పార్వతీపురం పట్టణం, విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గరుగుబిల్లి ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థి పరీక్షలు రాసేందుకు గతేడాది పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని కేటాయించారు. కాంప్లెక్సులో దిగి వెళ్లాలి. సమీపంలోనే మరో ఉన్నత పాఠశాల ఉండడంతో పొరపాటున అక్కడికి వెళ్లిపోయాడు. తీరా నోటీస్‌బోర్డులో హాల్ టికెట్ నంబరు లేకపోవడంతో కిలోమీటరు దూరంలో ఉన్న ప్రధాన కేంద్రానికి పరుగు తీశాడు..

ఈ ఇబ్బంది ఆ విద్యార్థిదే కాదు. చాలామందికి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం హాల్ టిక్కెట్లపై క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటి వరకు పల్లె ప్రాంతాల నుంచి పట్టణం వచ్చేవారు పరీక్ష కేంద్రాలను గుర్తించడం కష్టంగా ఉండేది. కొత్త సౌకర్యం కారణంగా ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలగనున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సేవారుషి.. సత్యాన్వేషి

ఓం మందిరంలో ప్రసిద్ధ ఆలయాల నమూనాలతో బాల వికాస్ విద్యార్థులు

మహోన్నత తత్వానికి పుట్టపర్తి సత్య సాయి బాబా నిలువుటద్దమని, ఆయనో సేవారుషి, సత్యాన్వేషి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంత్యుత్సవం సందర్భంగా విజయనగరంలోని ఓం మందిరంలో కొలువుదీరిన విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, నామ సంకీర్తన, పతాకావిష్కరణ, గురుపాదుకా పూజ, అష్టోత్తరపూజ, సత్యసాయినాథుని మూలవిరాట్‌కు జలాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా దేశంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల నమూనాలను బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

పూజలందుకున్న సత్యసాయి బాబా

శుద్ధ అబద్ధం

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

పాఠశాలల్లో కానరాని తాగునీరు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, పార్వతీపురం పట్టణం

సోకుతున్న రోగాల్లో 80 శాతం కలుషిత నీటి వల్లే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా నీటి శుద్ధియంత్రాలు అందించారు. వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టని కారణంగా ఎక్కడికక్కడే మరమ్మతులకు గురవుతున్నాయి.

పార్వతీపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేయని పరికరం

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల్లో చాలాచోట్ల శుద్ధమైన తాగునీరు అందడం లేదు. దీంతో కొందరు విద్యార్థులు కుళాయిలు, బోరుబావుల నుంచి తెచ్చుకుంటున్నారు. గతంలో మన్యంలో ఒకటి నుంచి రెండో తరగతి వారికి టైప్- 1 పరికరాలు 220 అందించారు. టైప్-2 224, టైప్- 3, 4 పరికరాలు 91 వరకు ఇచ్చారు. వాటిని ఏర్పాటు చేసిన మూన్నాళ్లకే దెబ్బతిన్నాయి. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల్లో 486 వరకు మరమ్మతులకు గురయ్యాయి. కొన్నిచోట్ల బాగుచేసినా మళ్లీ పాడవుతున్నాయి. ఉన్నత పాఠశాలల వారికి పెద్ద యంత్రాలు అందించారు. వాటిదీ అదే దుస్థితి.

జిల్లాల వారీగా పరికరాల తీరు..

అంశం	మన్యం	విజయనగరం
పాఠశాలలు	1,447	1745
విద్యార్థులు	96 వేలు	1.17 లక్షలు
మంజూరైనవి	975	1137
అమర్చనవి	186	57
అమర్చినవి	789	1080
పనిచేయనవి	486	150

సీసాలే ఆధారం..

పురపాలక సంఘాల్లోని విద్యాలయాలకు కుళాయి నీటినే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. పరికరాలున్నా రక్షిత నీరు దరిచేరక పోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈ యంత్రాలను ఓ ప్రైవేటు ఏజెన్సీ సమకూర్చింది. వారే బాగు చేయాల్సి ఉంది. అయితే ఫిర్యాదు చేసినా రావడం లేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పిల్లలందరికీ స్వచ్ఛమైన నీరు అందిస్తామని మన్యం జిల్లా డీఈవో రాజ్‌కుమార్ తెలిపారు.

హాయిగా బజ్జో బుజ్జాయి

రాజాం, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రిల్లో ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2016లో బేబీ కిట్ల పథకాన్ని తెదేపా అమల్లోకి తీసుకురాగా.. 2021లో వైకాపా నిలిపేసింది. కూటమి రాకతో పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి బిడ్డకూ రూ.1,989.27 విలువైన సామగ్రి అందనుంది. జిల్లాకు 8 వేల వరకు కావాలని ఇండెంట్ పెట్టారు. బాలింత ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిల్లో ప్రసవాలయ్యే వారికి ఇదో గొప్ప అవకాశమని డీఎంహెచ్‌వో జీవనరాణి అన్నారు.

వీటి పరిధిలో ఉంటే..

● పీహెచ్‌సీలు: 50 ● యూపీహెచ్‌సీలు: 18 ● ఆరోగ్యవెల్‌నెస్ కేంద్రాలు: 482 ● సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 4 ● ప్రాంతీయా సుపత్రులు: 4 ● జిల్లా కేంద్ర ఆసుపత్రి: ఒకటి

కిట్‌లో ఉండేవి ఇవీ..

● పోర్టబుల్ బెడ్ ● వాటర్ ప్రూఫ్ షీట్ ● నాప్కిన్లు ఆరు ● రెండు తువ్వాళ్లు ● పౌడర్ ● ఆయిల్ ● షాంపూ ● బొమ్మ ● డ్రస్‌లు రెండు ● సబ్బులు రెండు ● సబ్బు పెట్టె ● బ్యాగు ● దోమతెరతో కూడిన పరుపు.

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో గత రెండేళ్లలో ప్రసవాలు	2023-24:	2024-25:
	8,942	8,406

పట్టుఖో.. పతకం గెల్చుఖో

తలపడుతున్న క్రీడాకారిణులు

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు విజయనగరంలోని విజ్జీ మైదానంలో ఆదివారం సాయంత్రం సందడిగా ప్రారంభమయ్యాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజయనగరం- గుంటూరు జిల్లాల మధ్య తొలి మ్యాచ్ సాగింది. ఈ సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శనలు, ఇతర సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపీసీ రామారావు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి, ఎంఈవో సత్యవతి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

బాలికల నృత్య ప్రదర్శన

(c) eenadu

ఈఎస్ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయెె..

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు
Digital Partner: ఈనాడు.నెట్, ఈటీవీ BHARAT

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, పెదపాడు విలేజ్
శ్రీకాకుళం - 532 401
వివరాలకు:
90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

శాంతిమూర్తికి నృత్యాంజలి

చీపురుపల్లిలోని ఆంజనేయపురం సత్యసాయి ఆలయంలో స్వామికి వంద రకాల ప్రసాదాలను ఏర్పాటు చేసిన భక్తులు

కొత్తవలస, ఎస్.కోట, చీపురుపల్లి న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సాయి మందిరాల్లో ఉత్సవాలను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పతాకాలు ఆవిష్కరించారు. ఎస్.కోటలోని పెదఖండేపల్లి రోడ్డులో దత్తసాయి మందిరంలో స్వామికి పుష్పయాగం నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీప్రసన్న నృత్య కళా నికేతన్ విద్యార్థుల నృత్య ప్రదర్శనతో అలరించారు. కొత్తవలసలో బాలవికాస్ బాలల వేషధారణ ఆకట్టుకుంది.

కొత్తవలసలో వివిధ వేషధారణల్లో బాలవికాస్ బాలలు

సత్యసాయి మార్గం సమాజహితం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజానికి ఎనలేని సేవలు అందించిన సత్యసాయి మార్గాన్ని అంతా అనుసరించాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని కంచరివీధి మందిరంలో శతజయంతి ఉత్సవంలో పాల్గొని, మాట్లాడారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టర్ వైశాలి, మందిరం కన్వీనర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాబా విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి దంపతులు, అధికారులు

ప్రతిభ చూపారు.. మన్యంలో మెరిశారు

జ్ఞాపికలతో విజేతలు, జేవీవీ సభ్యులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని వేదాంత కళాశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మాతమూరు(పాచిపెంట), తమ్మినాయుడు ఉన్నత పాఠశాల(పాలకొండ) ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరినాయుడు తెలిపారు. డిసెంబరు 21, 22, 23వ తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయి. ఏపీ మోడల్ స్కూల్(భామిని), బందలుప్పి, వంతరాం జడ్పీ పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 16 ప్రభుత్వ, ఆరు ప్రైవేటు పాఠశాలల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు బీవీ రమణ, ఉపాధ్యక్షులు గౌరీశ్వరరావు, సతీష్‌రాజు, కన్వీనర్ కె.మురళి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, లక్ష్మునాయుడు, అజయ్, ప్రిన్సిపల్ వెంకటరమణ విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

బండలు తొలచి.. దారిగా మలచి

స్వచ్ఛందంగా గ్రామానికి రోడ్డు బాగుచేసుకున్న గిరిజనులు

బొబ్బిలి మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోని దేవుడి బొడ్డవలస గిరిజన గ్రామానికి సరైన రహదారి లేదు. ఉన్నది కాస్తా వర్షాలకు పాడైంది. రోడ్డు పక్కనున్న గుట్ట రాళ్లు అడ్డంకిగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు మొర వినిపించినా స్పందన లేకపోవడంతో చేసేది లేక పలుగు పారపట్టి, నడుంబిగించిన గిరిజనులు రోడ్డు బాగు చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించిన స్పందించలేదని వాపోతున్నారు. సుమారు కిలోమీటరున్నర మేర శ్రమదానం చేసి గుట్టలు, రాళ్లు తొలగించి మార్గం చేసుకున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

శుభకార్యంలో అవయవ దానానికి అంగీకారం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన ఉపాధ్యాయుడు డోల నాగరాజు, రమా దంపతుల కుమార్తె నిహారిక ఓణీల కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. ఈ మేరకు అంగీకార పత్రాలపై సంతకాలు చేసి మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు గోవిందరాజులకు అందజేశారు. పలువురు అభినందించారు.

పత్రాలపై సంతకాలు చేసి గోవిందరాజులకు అందజేస్తున్న నాగరాజు, రమా దంపతులు

ఆదివారం.. ఆనంద విహారం

సీతంపేట మన్యంలోని జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొన్నాయి. సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి కుటుంబాలు, స్నేహితులు, విద్యార్థులు సందర్శించి వన భోజనాలు చేశారు. ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో చిన్న, పెద్ద తేడా లేకుండా పలు సాహస, ఇతర క్రీడల్లో పాల్గొన్నారు. ఆనంద వేదిక వద్ద నృత్యాలు, సైకిళ్ల రైడింగ్‌తో కొత్త అనుభూతి పొందారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ తదితర జలపాతాల వద్ద జలకాలాడారు. ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్టు ప్రాంతాలకు వెళ్లారు. ఆదివారం చీకటి పడిన తర్వాత పార్కులో జరిపిన క్రాకర్స్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సందర్శించారు. సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, సీతంపేట

బోటింగ్, ఊగే వంతెనపై పర్యాటకులు

మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

30న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.. క్రీడా విభాగం: ఇన్‌స్పైర్ లార్వెన్స్ స్కూల్‌లో అండర్-15 ఏపీ ఓపెన్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఏ రావు, కార్యదర్శి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8520886564 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "బాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

High Way facing 261Sq.Y site (VMRDA approved) Akshaya Nagar in Nelivada Vill., Bondapalli Mdl, VZM for sale ✆ 9676743732.

VZM నీళ్ళట్యాంక్ & MIMS ఊటగెడ్డ దగ్గర 200 గజముల Bits '2' కలవు. Contact: 7416816888.

JOBS

లలిత హోండా 2 వీలర్ షోరూమ్స్‌లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. * బ్రాంచ్ మేనేజర్స్ - కొత్తూరు, పాలకొండ * కంప్యూటర్ ఆపరేటర్(M) - శ్రీకాకుళం బ్రాంచ్‌ల కొరకు ✆ 9492770556. 8498884111.

VZM 90రోజులు ఉచితంగా కంప్యూటర్ కోర్సు & ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టార్‌లో ట్రైనింగ్‌తోపాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (Pass), Inter, డిగ్రీ, ITI (పాస్/ఫెయిల్) Age: 18to35 ✆ 8919050156, 9493359472.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తాగునీటి పథకాలకు మోక్షం!

న్యూస్‌టుడే: బొబ్బిలి

నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పథకాల నిర్మాణాలకు అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు గుర్తించినా నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుత అంచనాలలో రూ.కోట్లలో అదనపు భారం పడినా, కూటమి ప్రభుత్వం పూర్తిచేసేందుకు అడుగులు వేస్తోంది. ఇప్పటికే వాటి డీపీఆర్‌లను ఆమోదించింది. టెండర్ల ప్రక్రియ చేపడుతోంది.

- ఇక పట్టణాల గొంతులు తడవనున్నాయ్
- రూ.కోట్లతో నిర్మాణాలకు అడుగులు

పురపాలిక	మంజూరైన నిధులు	నీటి సామర్థ్యం
సాలూరు	100.36	10
పాలకొండ	71.94	7
నెలిమర్ల	46.68	6
బొబ్బిలి	126.39	17
పార్వతీపురం	86.54	15
రాజాం	9.82	3
విజయనగరం	66.36	10

పాతబొబ్బిలిలో కుళాయి వద్ద పరిస్థితి

రూ.కోట్లలోనే భారం.. ఉమ్మడి జిల్లాలోని మూడు పురపాలక సంఘాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో పథకాల నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే ప్రణాళికలు రూపొందించారు. మూడు పట్టణాలకు రూ.171 కోట్లతో 23 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పథకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. అమలులో నిర్లక్ష్యం వహించారు. తాజా అంచనాలు రూ.218.98 కోట్లకు చేరుకున్నాయి. సాలూరుకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. సాంకేతిక అనుమతులొస్తే పనులు ప్రారంభించాల్సి ఉంది.

యూఐడీఎఫ్‌లో ఆ రెండు.. బొబ్బిలి, పార్వతీపురం పురపాలికల్లో 32 ఎంఎల్‌డీ నీటిని అందించేందుకు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యూఐడీఎఫ్) నుంచి నిధులు కేటాయించారు. గతంలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించినా గుత్తేదార్లు సకాలంలో చేయక బిల్లులు నిలిచిపోయాయి. దీనిని యూఐడీఎఫ్‌లోకి మార్చారు. గతంలో ఈ రెండింటికీ రూ.180 కోట్లు కేటాయించగా ప్రస్తుత అంచనాలు రూ.212.93 కోట్లకు చేరుకున్నాయి.

మార్చారు.. భారం తప్పలేదు.. రాజాం పురపాలిక, విజయనగరం నగరపాలక సంస్థల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు గతంలో అమృత్ పథకంలో పనులు చేపట్టారు. తర్వాత ఏఐఐబీలోకి మార్చారు. రాజాంకు రూ.9.82 కోట్లు, విజయనగరానికి రూ.66.36 కోట్లు కేటాయించారు. రెండు చోట్లా 13 ఎంఎల్‌డీల నీటిని అందించేందుకు ప్రతిపాదించారు. గతంలో వీటికి రూ.60 కోట్లతో ప్రతిపాదించగా, ప్రస్తుత అంచనాలు రూ.76.18 కోట్లకు చేరుకున్నాయి.

సాంకేతిక అనుమతులే తరువాయి.. పట్టణాల్లో తాగునీటి పథకాలకు మోక్షం దక్కింది. డీపీఆర్‌లు ఆమోదమయ్యాయి. సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది. అవి వచ్చాక టెండర్లు పిలిచి ఏజెన్సీలు ఖరారు చేస్తాం. పనులు ప్రారంభిస్తాం. అవి పూర్తయితే 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య ఉండదు. సాలూరు మున్సిపాలిటీలో పనులకు టెండర్లు పూర్తయ్యాయి. – జ్యోతి, ప్రజారోగ్యశాఖ ఈఈ విజయనగరం

డాక్యుమెంటు కాపీలు ఇవ్వాలని వినతి

ఎస్.కోట: తమకు ఇచ్చిన అత్యవసర నోటీసుల్లో పేర్కొన్న డాక్యుమెంటు కాపీలు అందించాలని జిందాల్ బినామీ సాగుదారులు శనివారం తహసీల్దార్‌కు లేఖ అందించారు. అక్రమంగా పొందిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని తహసీల్దార్ గత సోమవారం 12 మందికి నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. తాము ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పరిహారం తీసుకున్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసి నిర్ధారించారన్నారు. ఇప్పుడు నోటీసులివ్వడం సరికాదన్నారు. డాక్యుమెంట్లు అందిస్తే చూసి సమాధానం చెబుతామన్నారు. సోమవారం లేఖలు పరిశీలించి చర్యలు చేపడతామని ఆదివారం తహసీల్దార్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

పూర్వ విద్యార్థుల సాయంతో నిర్మిస్తున్న ట్రాక్

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో మైదానంలో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా దీని నిర్మాణ ఆలోచనను ప్రధానోపాధ్యాయుడు రఘురాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అనుమతితో సుమారు రూ.1.60 లక్షలతో ఈ ట్రాక్ నిర్మాణాన్ని పూర్వ విద్యార్థులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు సైతం నిర్మించనున్నామని తెలిపారు. క్రీడాకారులు, పోలీసు శిక్షణ పొందే వారికి ఇది ఉపయోగ పడుతుందని వారు తెలిపారు.

పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలి

నెల్లిమర్ల: తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పీఏఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ సారిపల్లి గ్రామస్థులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 15.40 ఎకరాల భూమికి సంబంధించి పరిహారం కలెక్టర్ ద్వారా చెల్లించాలన్నారు. కోరాడపేట, ఏటీ.అగ్రహారం, పడాలపేట గ్రామాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కష్టాలు వింటారు.. నష్టాలు తీర్చుతారు

న్యూస్‌టుడే- రాజాం, పార్వతీపురం పట్టణం, సీతంపేట, వీరఘట్టం

నేటి నుంచి జిల్లాలో 'రైతన్నా- మీకోసం' కార్యక్రమం

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కర్షకులు సాంకేతికంగా నైపుణ్యం సాధించేలా చైతన్యం కల్పించేందుకు 'రైతన్నా- మీకోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి రైతు కుటుంబం ఇంటి తలుపుతడతారు. ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధిలో శాశ్వత మార్పు తీసుకురావడమే దీని లక్ష్యం.

రైతు సేవా కేంద్రాల వారీగా కార్యక్రమ ప్రణాళిక రూపొందించారు. గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఇంజినీరింగ్, విద్యుత్తు సహాయకులు, వీఆర్వో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్కెట్ కమిటీల పాలకవర్గాలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, పీఏసీఎస్, ప్రగతిశీల రైతులు, ఇతర ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. అవసరమైన కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ప్రస్తుత రబీ, వచ్చే ఖరీఫ్, రబీ.. మూడు సీజన్లకు కార్యాచరణ రూపొందిస్తారు. విజయనగరం జిల్లాలో 2.27 లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2.33 లక్షల ఎకరాలకు సంబంధించిన రైతు కుటుంబాలను సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో పేర్లు నమోదు చేస్తారు. ఒక్కో బృందంలో 6 నుంచి 8 మంది సభ్యులు ఉంటారు.

సీతంపేటలో యంత్రంతో సాగు పనుల్లో రైతు

క్లస్టర్ ప్రాతిపదికగా.. ప్రతి అయిదు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించారు. ఒక్కో బృందం రోజుకు 90 కుటుంబాలను కలుస్తుంది. సీఎం సందేశలేఖ, కరపత్రం అందిస్తారు. రైతుల సూచనలు నమోదు చేస్తారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పిస్తారు. రైతుల సలహాలు, ఫిర్యాదులను క్రోడీకరించి డేటాను తయారుచేస్తారు. ఈనెల 30 నుంచి డిసెంబరు 2 వరకు దీనిపై విశ్లేషిస్తారు. 2026-27 వ్యవసాయ ప్రణాళికను రూపొందించేందుకు ప్రతి ఆర్ఎస్‌కే పరిధిలో డిసెంబరు 3న కార్యశాల నిర్వహించాలని నిర్ణయించారు.

సీఎం లేఖలో ఉండేదిదే.. సీఎం లేఖను ప్రతి ఇంటికీ అందిస్తారు. జలాశయాలను పూర్తి చేసేందుకు నిధులు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం, వ్యవసాయంలో సాంకేతికత, సూక్ష్మ సేద్యానికి రాయితీ, ఆహారశుద్ధి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కు, పంటలకు గిట్టుబాటు ధర, అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద ప్రతి రైతు కుటుంబానికి రెండు విడతల్లో ఇప్పటికే రూ.14 వేలు జమ, పశుసంరక్షణ అంశాలు లేఖలో ప్రస్తావించారు. ఈ వారోత్సవాల్లో రైతులకు అవగాహన కల్పిస్తామని, అంతా భాగస్వామ్యం కావాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి తెలిపారు.

(c) eenadu

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? పెనసాం మీదుగా నీలావతి వెళ్లే సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరింది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ★ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. పనులు చేపడతాం. **- సల్మాన్, ప్రాజెక్టు జేఈ** – గంట్యాడ గ్రామీణం

? స్వచ్ఛభారత్- స్వచ్ఛ జగన్నాథపురం పేరుతో నిర్మించిన సిమెంటు కుండీలు చెత్తతో నిండిపోయాయి. దుర్వాసన వస్తోంది. చెత్త సంపద కేంద్రం లేకపోవడంతో కుండీల్లోనే వ్యర్థాలు పడేస్తున్నారు. - **స్థానికులు** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **- భాస్కరరావు, డిప్యూటీ ఎంపీడీవో** – బొబ్బిలి గ్రామీణం

? కోడూరు గ్రామంలో ఉన్నత పాఠశాల ముందు వ్యర్థాలు వేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్నాం. - **విద్యార్థులు** ★ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, చర్యలు తీసుకుంటాం. **- దేవకుమార్, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, బాడంగి

? రామభద్రపురంలోని వసంతుల, అగురు, చింతల వీధుల్లో సీసీ రోడ్లు సక్రమంగా లేవు. ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఇబ్బందులు తీరుస్తాం. **- సూరిబాబు, ఈవో** – రామభద్రపురం

? ఏపీపురం శివారున తాగునీటి పైపు లీకై నీరు వృథాగా పోతోంది. బురదమయంగా మారుతోంది. - **స్థానికులు** ★ చర్యలు తీసుకుంటాం. **- శ్రీచరణ్, జేఈ** – రేగిడి

? వీవీఆర్‌పేటలో తాగునీటి బోరు రెండు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. నేటికీ బాగుచేయలేదు. **- శంబాన చంద్రశేఖర్** ★ బోరుకు మరమ్మతులు చేపడతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ** – న్యూస్‌టుడే, వంగర

అందుబాటులోకి మరో ఫ్రీజర్

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మృతదేహాలను భద్రపరిచే రూ.75 వేలు విలువైన ఉచిత ఫ్రీజర్‌ను ఆదివారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే రెండు ఫ్రీజర్ల ద్వారా సేవలు అందిస్తున్నారు. ఇక నుంచి మూడు అందుబాటులో ఉంటాయని ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్ తెలిపారు. అవసరమైన వారు తీసుకెళ్లొచ్చన్నారు. బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో) ★ టమాటా: 70 ★ వంకాయలు: 70/85 ★ దొండ: 60 ★ బీర: 60 ★ బెండ: 60 ★ కాకర: 60 ★ చిక్కుడు: 60 ★ ఆనపకాయ (ఒకటి): 30 ★ అరటి (జత): 20 ★ మునగ: 70 ★ఉల్లి: 30 ★ బంగాళదుంపలు: 30 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 80 ★ పచ్చిమిర్చి: 60 ★ క్యాబేజీ: 40 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

● ఎస్వీసీ సీతారామా: **12 ఏ రైల్వే కాలనీ** ● ఎస్వీసీ సీతారామా మినీ: **కొదమ సింహం, పాంచ్‌మినార్** ● ఎస్వీసీ అప్సర: **ప్రేమంటే** – న్యూస్‌టుడే, రాజాం ● లక్ష్మీ: **మఫ్టీ పోలీస్** ● వాసవి: **రాజు వెడ్స్ రాంబాయి** ● టీబీఆర్ స్క్రీన్-1: **12 ఏ రైల్వే కాలనీ** ● టీబీఆర్ స్క్రీన్-2: **ప్రేమంటే** – న్యూస్‌టుడే, బొబ్బిలి

పట్టణ జనం.. సమస్యలతో సతమతం

న్యూస్‌టుడే- రాజాం

రాజాం పురపాలిక పరిధిలోని ప్రజలను మౌలిక వసతుల లేమి వేధిస్తోంది. నిధులున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. సాధారణ, ఉప ప్రణాళిక, ఆర్థిక సంఘం నిధులు రూ.కోట్ల మేర మూలుగుతున్నాయి. చేపట్టాల్సిన పనులన్నీ పూర్తయితే ప్రజలకు రహదారులు, కాలువలు ఇతర మౌలిక వసతుల సమస్యలు తీరుతాయి. గతంలో టెండర్లు పిలిచినవీ ఇప్పటివరకు పూర్తిచేయలేకపోయారు.

❖ సాధారణ నిధులు రూ.543.42 లక్షలతో 89 పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచారు. ఇందులో రూ.388.51 లక్షలతో 64 పనులు మొదలుపెట్టారు. రూ.141.91 లక్షలతో 24 మాత్రమే పూర్తిచేశారు. మిగతావి పడకేశాయి.

❖ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.254.74 లక్షలతో 37 పనులు ప్రతిపాదించారు. రూ.204.49 లక్షల విలువైన 27 పనులు మొదలుపెట్టారు. రూ.44.25 లక్షలతో తొమ్మిది మాత్రమే పూర్తిచేశారు. రూ.6 లక్షలతో మరొకటి ప్రగతిలో ఉన్నట్లు చూపుతున్నారు. మిగతావాటి సంగతి అంతే.

మురికి కూపంలా వీధులు..

ప్రణాళిక లేని నిర్మాణాల కారణంగా పట్టణాన్ని మురుగు ముంచెత్తుతోంది. ఇరుకు రహదారులు, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వంటివి అడ్డంకులుగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా.. కాలనీలను వరద చుట్టుముడుతోంది. కాలువల నిర్మాణానికి స్థలం ఇబ్బందిగా మారింది. జిరాయితీ పొలాలను సేకరించాల్సి ఉండడంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. దీనికి పరిష్కారం చూపేలా ఇటీవల మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. నిధులు మంజూరైనా.. స్థలం సేకరించకపోవడంతో ఆటంకాలు తొలగడం లేదు. పట్టణంలో రహదారులను విస్తరించినా ట్రాఫిక్ ఇబ్బందులు వీడడం లేదు. రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

అమ్మవారి కాలనీ ఆరో లైన్‌లో ఇళ్ల చుట్టూ మురుగునీరు

కూనారిల్లుతున్న కోనేర్లు..

డోలపేట, మెంటిపేట, చినచెరువుగట్టు, కొండంపేట తదితర చోట్ల కోనేర్లు మురికి కూపాలుగా కనిపిస్తున్నాయి. వీటిని ఉద్యానాలుగా తీర్చిదిద్దాలని రెండు దశాబ్దాలుగా కోరుతున్నా ఫలితం లేదు. రద్దీ ప్రాంతాల నడుమ ఉండడం, నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. వీటిని సుందరంగా తీర్చిదిద్ది పిల్లలకు ఆట సామగ్రి, పెద్దలకు కసరత్తు పరికరాలు, వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. సమస్యలన్నీ పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని రాజాం పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు చెప్పారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం

క్యాడెట్‌కు బహుమతి అందిస్తున్న డీఎస్పీ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. ఆదివారం చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఓటమి నుంచి విజయం వైపు సాగాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్లుగా నిలిచిన ఎస్.హేమంత్‌కుమార్, ఎస్.ప్రవల్లిక, ఎ.జ్యోత్స్నలకు బహుమతులు అందజేశారు. సీఐ శంకరరావు, ఎస్సై దామోదరరావు, హెచ్ఎం ఉమామహేశ్వరి, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసరావు, తెదేపా పట్టణాధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి ఎస్‌డీఎస్ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఆర్‌సీహెచ్ సురేష్‌కుమార్, ఎం.సతీష్‌కుమార్, కేర్ టేకర్ ఎస్.రమావతి, కళాశాల కార్యదర్శి రవి ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించారు. కళాశాల పూర్వవిద్యార్థి, అగ్నివీర్ సైనికుడు ఎ.దుర్గాప్రసాద్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 33 యూనిట్లు రక్తం దానం చేశారు.

జనసైనికుడి కుటుంబానికి సాయం.. బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం చింతాడ గ్రామానికి చెందిన జనసైనికుడు సుధీర్ ఇటీవల పాముకాటుతో మృతి చెందారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో ఆదివారం విజయవాడలో సుధీర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ నాగబాబు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, పి.బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ లేదు.. ఇబ్బందులు తప్పవు

బొండపల్లి మండలం రోళ్లవాక ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తది నిర్మించేందుకు ఉన్నది తొలగించారు. పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. దేవుపల్లి, బోడసింగిపేటలోనూ ఇదే పరిస్థితి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని, కుక్కలు, పందులు సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని ఎంఈవో ఏవీ రమణ అన్నారు. పనులు పూర్తిచేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బొండపల్లి

నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

బాడంగి మండలం కోడూరులో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సచివాలయం-1 భవన నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. అప్పట్లో రూ.40 లక్షలు మంజూరు కాగా రూ.7 లక్షల విలువైన పనులు మాత్రమే చేశారు. సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బంది కోరుతున్నారు. విషయం ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. – న్యూస్‌టుడే, బాడంగి

ఆక్రమణల హోరు.. మురుగు జోరు

గరివిడి మండలం శివరాం గ్రామం మురికి కూపంలా తయారైంది. దుర్గంధం, దోమల విజృంభణతో ఇబ్బందులు పడుతున్నారు. చీపురుపల్లి నుంచి బొప్పడాం వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి శివరాం మీదుగా వెళ్తోంది. గ్రామంలోని వాడుకనీరంతా పొలాల్లోకి వస్తోందని రైతులు ఒకప్పుడు కాలువలను కప్పేశారు. మరో వైపు స్థానికులు కొందరు కబ్జాలు చేశారు. దీంతో రోడ్డు పొడవునా మురుగు నిల్వ ఉంటోంది. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. – న్యూస్‌టుడే, గరివిడి

మైదానం కాదు.. చెరువే..!

రాజాం పట్టణ పరిధిలోని కొండంపేట ప్రాంతంలో రాజాం- రామభద్రపురం ప్రధాన రహదారి నుంచి బుచ్చింపేట వెళ్లే మార్గం పక్కనున్న పీతల చెరువు అధ్వానంగా మారింది. నిండా పూడికలు, వ్యర్థాలతో దారుణంగా తయారైంది. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. చెరువును శుభ్రపరిచి, పార్కుగా మార్చాలని కోరుతున్నారు. విషయం కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

రక్షణ గోడ నిర్మించండి సారూ..!

రామభద్రపురం మండలం తారాపురంలో నల్లగెడ్డకు ఇరువైపులా రక్షణగోడ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గెడ్డ పొంగడంతో పలు వీధులు, ఇళ్లల్లోకి నీరు చేరింది. గెడ్డ పొంగిన ప్రతిసారీ ఇదే దుస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డకు ఇరువైపులా రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు. విషయం ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా.. ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

తెదేపాలో 50 కుటుంబాల చేరిక

మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన కుటుంబాలు

గంట్యాడ, న్యూస్‌టుడే: గంట్యాడకు చెందిన 50 కుటుంబాలు ఆదివారం వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. విజయనగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. భైరాగి వర్మరాజు, భైరాగి మురళీరాజు, ఎమ్ఎస్ఎన్ రాజు తదితరులు ఉన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు, నాయకుడు చినరామునాయుడు, సర్పంచి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే ధ్యేయం

ఎమ్మెల్యేతో పార్టీలో చేరినవారు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆదివారం మెరకముడిదాం మండలం బుదరాయవలస మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలి బంగారునాయుడుతో పాటు మరికొంత మంది వైకాపాను వీడి ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరారు. రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు, నాయకులు సన్యాసినాయుడు, మోతీలాల్ నాయుడు, చందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో సత్తా

మెరకముడిదాం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో మెరకముడిదాం మండలం గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని ప్రిన్సిపల్ డీవీఎస్ అరుణకుమారి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో డి.వెంకటేష్ (పదో తరగతి), కె.వెంకటేష్, నవీన్ కుమార్ (తొమ్మిదో తరగతి) సత్తా చాటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అభినందించారు.

ద్విచక్ర వాహనదారులకు జరిమానా.. రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని కేర్ ఆసుపత్రి కూడలిలో ఆదివారం సాయంత్రం గ్రామీణ సీఐ హెచ్.ఉపేంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనల ప్రకారం నామ ఫలకాలు లేకపోవడం, ముగ్గురు ప్రయాణించడం తదితర కారణాలతో 12 మంది ద్విచక్ర వాహనదారులకు రూ.2,220 అపరాధ రుసుము విధించారు.

పొలాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

న్యూస్‌టుడే- గజపతినగరం

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని నియమించి, అవసరమైన సామగ్రిని అందించింది. కానీ చెల్లింపులు జరిపేందుకు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో కొనుగోళ్లు జరగడంలేదు. బ్యాంకులకు దరఖాస్తులు చేశామని, పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. కల్లాల్లోని ధాన్యం విక్రయించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు తుపాను భయం వెంటాడుతోంది.

మరుపల్లి పొలాల్లో ధాన్యం బస్తాలు

గత సీజన్‌లో మిల్లర్లకు ఇవ్వాల్సిన బకాయిలను మిల్లులు బ్యాంకు గ్యారెంటీలుగా మార్చుకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గజపతినగరం మండలంలోని మిల్లులకు రూ.1.20 కోట్లు, గంట్యాడ మండలంలో రూ.80 లక్షలు, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లోని మిల్లర్లకు రూ.20 లక్షల వరకు బకాయిలు విడుదల చేసింది. ఆ నిధులతో కలిపి గ్యారెంటీలు చెల్లించాలని అధికారులు మిల్లర్లను కోరుతున్నారు. వారు చెల్లిస్తేనే కొనుగోలు అవకాశముంది.

ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు వివరాలు..

మండలం	మిల్లులు	ఆర్ఎస్‌కేలు	కొనుగోలు (టన్నుల్లో)
గజపతినగరం	8	19	48
బొండపల్లి	3	15	0
దత్తిరాజేరు	5	17	0
గంట్యాడ	10	20	0
మెంటాడ	6	19	152

మిల్లర్ల నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గ్యారెంటీల దస్త్రాలు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. సోమవారం నాటికి అన్ని మిల్లుల నుంచి వచ్చే అవకాశం ఉంది. ధాన్యం తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం. – **తిరుపతిరావు, సత్యనారాయణ, సత్యనారాయణమూర్తి, గజపతినగరం, మెంటాడ, గంట్యాడ పౌరసరఫరాల ఉప తహసీల్దార్లు**

గిరిజనులకు అవగాహన

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం తాటిపూడి అవతల ఉన్న గిరిజన గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీడీవో రమణమూర్తి అన్నారు. దిగువకొండపర్తి పంచాయతీ పరిధిలో మూడురోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఉపాధి పనులు పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు లేనివారు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో హాజరుకావాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయం ప్రారంభం

మెంటాడ, న్యూస్‌టుడే: పిట్టాడలో పైడితల్లి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 24న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, ఊరేగింపు, 25న కుంకుమపూజలు, ధాన్యాదివాసం, చివరి రోజైన బుధవారం శిఖర, విగ్రహ ప్రతిష్ఠ, అమ్మవారి దర్శనం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

యోగాతో రుగ్మతలు దూరం

రాజాం, న్యూస్‌టుడే: నిత్య యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రాజాం గ్రామీణ సీఐ హెచ్ ఉపేంద్ర అన్నారు. ఆదివారం రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. యోగా వికాస్ శిక్షకుడు కె.శ్రీనివాస్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

బాబా మార్గం.. అనుసరణీయం

న్యూస్‌టుడే బృందం: బాబా మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అన్న, వస్త్రదానాలు చేపట్టారు. పుర వీధుల్లో ఊరేగింపులు నిర్వహించారు. మహానగర సంకీర్తన, జ్యోతి ప్రజ్వలన, పుష్పాలంకరణ, సహస్రనామ పూజ, మహానారాయణసేవ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ● మెంటాడ: బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి మీసాలపేటలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు.

బొండపల్లి: కొవ్వాడపేటలో నృత్య ప్రదర్శన

రామభద్రపురంలో పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

బొబ్బిలిలో ఆకట్టుకున్న బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు

రామచంద్ర జీవితం.. యువతకు స్ఫూర్తి

కోటిబాబును సత్కరిస్తున్న వేదిక సభ్యులు

రాజాం, న్యూస్‌టుడే: తిరుమల రామచంద్ర జీవితం నేటి యువతకు స్ఫూర్తని సాహితీవేత్త పొట్నూరు కోటిబాబు తెలిపారు. రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం 'సాహితీ సదస్సు' జరిగింది. 'హంపి నుంచి హరప్పా దాకా తిరుమల రామచంద్ర జీవన పోరాటం' అనే అంశంపై ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, భాషావేత్తగా, రచయితగా, సైనికుడిగా, పాత్రికేయుడిగా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. సభ్యులు కోటిబాబును సత్కరించారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, నల్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండు చేశారు. కగార్ పేరుతో అమాయక గిరిజనులను పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. బొబ్బిలి పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలని కలలు కంటున్నారని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు అన్నారు. నాయకులు పోల ఈశ్వరరావు, పి.శంకరరావు, ఎం.గోపాలం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిరసన

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఆదివారం సిటు ఆధ్వర్యంలో బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం కూడలి వద్ద నిరసన చేపట్టారు. కోడ్‌లకు సంబంధించిన ప్రతులను కార్మికులు దహనం చేశారు. ఈ విధానంతో కార్మికులకు పని భద్రత ఉండదని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు శంకరరావు అన్నారు. పురపాలిక పారిశుద్ధ్య కార్మిక సంఘ నాయకులు యుగంధర్, జి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తోందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. ఆదివారం మెరకముడిదాం మండలం సాతాంవలస పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని, దళారుల బారినపడొద్దని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఛైర్మన్ అప్పలనాయుడు, మండలాధ్యక్షుడు సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ మోతీలాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

రాజాం పురపాలిక పరిధి సారథి గ్రామానికి వెళ్లే దారిలో రెల్లిగెడ్డ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో సారథి, సోమరాజుపేట, గుయ్యానవలస గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మలుపు వద్ద ఎటువంటి సూచికలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం ఆర్ అండ్‌బీ జేఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా.. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

ఈనాడు కథనానికి స్పందన

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

బొబ్బిలి గ్రామీణం: గ్రామ సచివాలయాలకు పనులపై వచ్చే ప్రజల కోసం గతంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా ఉండిపోయాయి. దీనిపై సెప్టెంబర్ 24న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. సగానికిపైగా పూర్తయినట్లు డీఈ డిల్లేశ్వరరావు తెలిపారు.

గుంత చింత తీరింది

బొబ్బిలి: పట్టణంలోని రాజా కళాశాల దారిలో భారీ గుంత ఏర్పడి నిత్యం వాహనాలు కూరుకుపోతున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించడంతో పుర అధికారులు స్పందించారు. గుంతను పూడ్చివేశారు. సమీపంలోని దుకాణాల నుంచి వాడుకనీరు రహదారిపైకి రాకుండా చూడాలని యజమానులకు నోటీసులు ఇచ్చారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

రామభద్రపురం: రామభద్రపురం మేజర్ పంచాయతీలో తాగునీటి మోటారు మరమ్మతులకు గురై ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈనెల 21న వార్త ప్రచురితమవడంతో ఈవో సూరిబాబు స్పందించారు. మోటారు బాగుచేసి, సరఫరా పునరుద్ధరించారు.

విద్యుత్తు స్తంభం మార్పు

గుర్ల: దేవునికణపాకలో విద్యుత్తు స్తంభం ఒకవైపు వాలింది. తాడే ఆధారంగా ఉండేది. దీనిపై వార్త ప్రచురితమవడంతో రెస్కో అధికారులు స్పందించారు. స్తంభాన్ని మార్చి, దానికి దన్నుగా మరో స్తంభం పెట్టారు.

ట్యాంకు పరిసరాలు మెరుగు

గరివిడి: గరివిడికి తాగునీరు అందించేందుకు 250 కిలో లీటర్ల నీటి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన పథకం ట్యాంకు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షం నీరు నిల్వ ఉండేది. ట్యాంకు కింద భాగంలోని వాల్వులు పూర్తిగా మునిగేవి. దీనిపై పలుమార్లు వార్తలు ప్రచురించడంతో మేజరు పంచాయతీ సిబ్బంది స్పందించారు. మట్టితో నింపి ఎత్తు చేయించినట్లు ఈవో నాగమణి తెలిపారు.

కల్వర్టు నిర్మాణం ప్రారంభం

దత్తిరాజేరు: కోమటిపల్లి నుంచి గర్భాం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మార్గంలో గొభ్యాం వద్ద కల్వర్టు కూలిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. పనులు ప్రారంభమయ్యాయి. రూ.24 లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు ఏఈ అజయ్ భార్గవ్ తెలిపారు.

వ్యర్థాల తొలగింపు

గంట్యాడ గ్రామీణం: గింజేరు గ్రామంలో పాఠశాల పరిసరాలు చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. తీవ్ర దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈనెల 3న వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. వ్యర్థాలు తొలగింపజేశారు.

సూచిక బోర్డు ఏర్పాటు

రాజాం పట్టణం: రాజాం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రధాన ద్వారం వద్ద సూచిక బోర్డు లేక కొత్తవారు ఇబ్బందులు పడేవారు. దీనిపై వార్త ప్రచురితమవడంతో కళాశాల ప్రధానాచార్యులు స్పందించారు. పట్టణంలోని ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గేటు, పేరు తెలిపే సూచిక ఏర్పాటు చేశారు.

ప్రమాదం తప్పింది

గజపతినగరం: పురిటిపెంట బాలాజీనగర్ కాలనీలోకి వెళ్లే రహదారిలో పైపులైను మరమ్మతులకు తవ్విన గోతిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో చోదకులు ప్రమాదాల బారిన పడేవారు. దీనిపై ఈనెల 19న 'తవ్వారు.. పూడ్చకుండా వదిలారు' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమవడంతో కార్యదర్శి జనార్దనరావు స్పందించారు. సిబ్బందితో గోతిని పూడ్చివేయించారు.

వీధుల్లో చెత్త.. ప్రజలకు చింత

గజపతినగరం మండలం పురిటిపెంట పంచాయతీలో వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త వేస్తున్నారు. పందులను వదిలేస్తుండడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. దుర్గంధం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు వద్ద ప్రస్తావించగా.. వాహనాల సమస్యతో చెత్త తరలించేందుకు ఇబ్బంది పడుతున్నామని, త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

(c) eenadu

సైన్స్ విజ్ఞానం పెంచడమే లక్ష్యం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై జిజ్ఞాసను పెంచడమే చెకుముకి సంబరాల లక్ష్యమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.రాజ్‌గోపాల్ అన్నారు. ఆదివారం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా వంద మంది 33 బృందాలుగా పోటీల్లో పాల్గొన్నారు. గర్భాం ఆదర్శపాఠశాల (ప్రథమ), కుమరాం జడ్పీహెచ్‌ఎస్, అంబఖండి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. ప్రైవేటు విభాగంలో విజయనగరం, రాజాం సన్ పాఠశాలలు, గరివిడి గోదావరి షరాఫ్ పాఠశాలల విద్యార్థులు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వేదిక నాయకులు

చిగురించిన ఆశలు.. అందొచ్చే దిగుబడులు

కొత్తవలసలో కోతకు సిద్ధమైన వరి

కొత్తవలస, న్యూస్‌టుడే: వరి కోతలు మొదలయ్యాయి. మొంథా తుపాను, అధిక వర్షాలు కొంత ఇబ్బంది పెట్టినా ఈ ఏడాది వరి దిగుబడి బాగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు, రైతులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఎకరాకు కనీసం 2.2 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. ఈ సీజన్‌లో ఎకరాకు 2.5 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందంటున్నారు. కొత్తవలస మండలం తుమ్మికాపల్లిలో ఇటీవల నిర్వహించిన పంటకోత ప్రయోగంలో ఎకరాకి 2.3 మెట్రిక్ టన్నుల దిగుబడి నమోదైనట్లు అధికారులు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలోని అయిదు మండలాల్లో ఈ ఖరీఫ్‌లో 53,646.2 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైనట్లు 'ఈ-క్రాప్'లో నమోదైంది. దీని ప్రకారం 1,25,817 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రైతుల అవసరాల మినహా 1,01,993 మె.ట. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికోసం అయిదు మండలాల్లో 65 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఇదీ పరిస్థితి..

మండలం	సాగు విస్తీర్ణం	ఉత్పత్తి అంచనా	కొనుగోలు	కేంద్రాలు
జామి	15,122	35,709	29,117	20
కొత్తవలస	2,779.54	6,532	5,368	06
లక్కవరపుకోట	10,261.77	24,057	19,398	12
శృంగవరపుకోట	14,115.10	32,917	26,095	14
వేపాడ	11,367.79	26,602	22,015	13

మద్దతు ధరకే విక్రయించుకోండి

ఈ ఏడాది వరి దిగుబడులు అన్నిచోట్లా పెరిగాయి. అంచనాకు మించి నమోదవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చు.

- వి.హరికృష్ణ, ఇన్‌ఛార్జి ఏడీఏ, కొత్తవలస

విద్యార్థుల భవితకు ఎన్‌సీసీ పునాది

కొత్తవలస, న్యూస్‌టుడే: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తుందని ఎస్సై ఎన్.జోగారావు అన్నారు. బలిఘట్టంలోని ప్రగతి విద్యా సంస్థల్లో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు వెపన్, జనరల్ డ్రిల్లింగ్, యోగా ప్రదర్శించారు. విద్యా సంస్థల ఛైర్మన్ వి.రమాదేవి, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, గొంప అయ్యన్న, డిఫెన్స్ అకాడమి ప్రిన్సిపల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని కాపుసోంపురం ఏఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఎస్.కోట న్యాయవాదుల సంఘం వన భోజన కార్యక్రమం నిర్వహించారు. వీరితోపాటు కోర్టు సిబ్బంది పాల్గొని ఆటపాటలతో సందడిగా గడిపారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మిని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, ఏపీపీ రమణమ్మ, ఏజీపీ టి.వెంకటరమణ, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.రామారావు, కోశాధికారి బి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షుడు బి.వెంకటరావు, ఉప కార్యదర్శి బి.రామకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి కనకలక్ష్మికి జ్ఞాపిక అందిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిదేముడు

వృత్తివిద్యకు ప్రాధాన్యం కల్పించాలి

మాట్లాడుతున్న ప్రకాషరావు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా వృత్తివిద్యకు ప్రాధాన్యత కల్పించాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాషరావు అన్నారు. పూల్‌బాగ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఆదివారం స్కౌట్ మాస్టర్ల ప్రాథమిక శిక్షణ కోర్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా చేపడుతున్నామన్నారు. బాల్యం నుంచే నిజాయతీ, నిబద్ధత కలిగేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కమిషనర్లు రాజు, విజయకుమార్, ఉపాధ్యక్షుడు త్రినాథనాయుడు, ప్రవీణ్‌కుమార్, ఎస్ఎస్ దొర, నారాయణరావు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంటు ఉద్యోగులుగా గుర్తించాలని, వారితో సమానంగా అన్ని అలవెన్సులు ఇవ్వాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, కార్యదర్శి మర్రెడ్డి, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో మాట్లాడారు. సర్కిల్ కార్యదర్శి వైమర్‌రెడ్డి, నందికేశ్వరరావు, హేమలత, సురేంద్ర, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, శంకర్‌నాయుడు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీఈటీలు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఓపీ జిందాల్ భారతి పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీవీఎస్ఎస్ విశ్వనాథం, వ్యాయామ ఉపాధ్యాయులు పి.అప్పలనాయుడు, సంధ్య తెలిపారు. అండర్-14 ఫుట్‌బాల్‌కు జి.పార్థు, క్రికెట్‌కి వై.భరద్వాజ్, బాస్కెట్ బాల్‌కి ఎ.యోగీ కార్తీక్, కె.రాహుల్, డి.చాతుర్య, జి.వైష్ణవి, అండర్-17 ఫుట్‌బాల్‌కు జి.ప్రణవ్ సిద్ధార్థ, బాస్కెట్‌బాల్‌కి పి.వి.కార్తికేయ, కె.చాత్విక్, చదరంగం పోటీలకు జె.మానస ఎంపికయ్యారు. వీరిని పాఠశాల కార్యదర్శి దినేష్‌శర్మ, సహాయ కార్యదర్శి జె.గోపాలకృష్ణ అభినందించారు.

* లక్కవరపుకోట: చందులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు భాను లోహిత్, టి.దుర్గాభవానీ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు, క్రీడలూ విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం కావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సూచించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించారు. తొలిరోజు విజయనగరం జిల్లా చిత్తూరుతో విజేతగా నిలిచింది.

బాధితులకు సహాయనిధి అండ

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న నియోజకవర్గంలోని 22 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.14.03 లక్షల చెక్కులను ఆదివారం పూసపాటిరేగ తెదేపా కార్యాలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కె.బంగార్రాజు అందజేశారు. నాయకులు చిన్నంనాయుడు, తమ్మినాయుడు, ప్రసాద్‌రావు, శంకరరావు, సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెక్కులను అందజేస్తున్న బంగార్రాజు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: RANGA REDDY DISTRICT: AT KUKATPALLY
O.S. No. 994 OF 2024
Between:-
State Bank of India, Corporate Salary Branch ...PLAINTIFF
AND
Mr. MARRAPU HEMASUNDARA RAO ...DEFENDANT
To
Mr. MARRAPU HEMASUNDARA RAO, R/o. H.No. 064, Chinnayyapeta, Therlam Mandalam, Vizianagaram, Andhra Pradesh - 535 126.
Please take notice that the above mentioned Plaintiff filed above Suit for Recovery of Money of Rs. 1,66,797/- against Defendant, and the matter is posted for your appearance on 08-12-2025 Therefore, make it convenient to appear before the above said Hon'ble Court on 08-12-2025 at 10-30 a.m. either in person or through counsel or else the matter will be heard as per law in your absence
// BY ORDER OF THE COURT//
Sd/- SAKA MOHAN RAO, Advocate
No. 4-4-3/6, Abhyudaya Nagar Colony, Bandlaguda Jagir, Hyderabad.
Cell: 9440543623

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: RANGA REDDY DISTRICT: AT KUKATPALLY
O.S. No.1001 of 2024
Between:-
State Bank of India, P.B.B. Miyapur Branch ...PLAINTIFF
AND
Mr. VISANAGARI SANTOSH ...DEFENDANT
To,
Mr. VISANAGARI SANTOSH, R/o. H.No. 0-000, Main Street, Anjaneya Swami Temple, Garugubilli, Lakhnapuram, Vizianagaram, Andhra Pradesh - 535 525.
Please take notice that the above mentioned Plaintiff filed above Suit for Recovery of Money of Rs. 1,48,072/- against Defendant, and the matter is posted for your appearance on 08-12-2025 There fore, make it convenient to appear before the above said Hon'ble Court on 08-12-2025 at 10-30 a.m. either in person or through counsel or else the matter will be heard as per law in your absence
//BY ORDER OF THE COURT//
Sd/- SAKA MOHAN RAO, Advocate
No. 4-4-3/6, Abhyudaya Nagar Colony, Bandlaguda Jagir, Hyderabad.
Cell: 9440543623

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE Cum SPL. JUDGE TO TRY CASES UNDER SC & ST (POA) ACT AT: VIZIANAGARAM
I.A.53/2025 in O.S.03/2025
Between:
V.R. DEVELOPERS, Rep. by its Partners Smt. Alluru Yamini Naga Lakshmi and others ...Petitioners / Plaintiffs
And
Sri Ganta Satish Naidu & others ...Respondents / Defendants
NOTICE
To,
R-5: Smt. Mandapati Vishali, W/o. Venkata Ravi Kumar, Hindu, aged about 42 years, C/o. M.S.N. Raju, Plot No.1, Kusuma Gajapapathi Nagar, Cantonment, Vizianagaram -535003.
R-9: Smt. Dendukuri Vijayalakshmi, W/o. Subba Raju, Hindu, aged about 72 years, R/at Church Street, Near Sharada School, Sharada Nagar, Narsipatnam -531116.
R-12: Smt. Chekuri Lakshmi Bhavani, W/o. Sanyasi Raju, Hindu, aged about 50 years, R/at Plot No.3, M.S.N. Colony, Vizianagaram -535002.
పైనెంబరు దావాయందు మీకు కోర్టువారు కోర్టు ద్వారా పంపిన సమన్లు / నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు జారీచేసియున్నారు. సదరు దావా తేది. 11-12-2025 నాటికి వాయిదా అయివున్నది. సదరు దావా విషయమై మీకు ఏవిధమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణగాని ఉన్నయెడల పైకోర్టు వారి ఎదుట పై తేదీన స్వయంగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై తెలుపుకొనవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది. లేనియెడల మహారాజశ్రీ కోర్టువారు మీ పరోక్షమందు సదరు దావాను పరిష్కరించగలరు.
(By Order of the Hon'ble Court)
V.V.V.S.S.M. RAJA RAO & N. MADHUSUDAN RAO, Advocates for Petitioners. Cell: 9440889502

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE Cum SPL. JUDGE TO TRY CASES UNDER SC & ST (POA) ACT AT: VIZIANAGARAM
O.S.03/2025
Between:
V.R. DEVELOPERS, Rep. by its Partners "Smt. Alluru Yamini Naga Lakshmi and others ...Plaintiffs
And
Sri Ganta Satish Naidu & others ...Defendants
SUMMONS
To,
D-5: Smt. Mandapati Vishali, W/o. Venkata Ravi Kumar, Hindu, aged about 42 years, C/o. M.S.N. Raju, Plot No.1, Kusuma Gajapapathi Nagar, Cantonment, Vizianagaram -535003.
D-9: Smt. Dendukuri Vijayalakshmi, W/o. Subba Raju, Hindu, aged about 72 years, R/at Church Street, Near Sharada School, Sharada Nagar, Narsipatnam -531116.
D-12: Smt. Chekuri Lakshmi Bhavani, W/o. Sanyasi Raju, Hindu, aged about 50 years, R/at Plot No.3, M.S.N. Colony, Vizianagaram -535002.
పైనెంబరు దావాయందు మీకు కోర్టువారు కోర్టుద్వారా పంపిన సమన్లు / నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు జారీచేసియున్నారు. సదరు దావా తేది. 11-12-2025 నాటికి వాయిదా అయివున్నది. సదరు దావా విషయమై మీకు ఏవిధమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణగాని ఉన్నయెడల పై కోర్టువారి ఎదుట పై తేదీన స్వయంగాగానీ, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై తెలుపుకొనవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది. లేనియెడల మహారాజశ్రీ కోర్టువారు మీ పరోక్షమందు సదరు దావాను పరిష్కరించగలరు.
(By Order of the Hon'ble Court)
V.V.V.S.S.M. RAJA RAO & N. MADHUSUDAN RAO, Advocates for Plaintiffs. Cell: 94408 89502

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

జనసేన చేరువ కావాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రెండో డివిజన్ పూల్‌బాగ్‌లో పార్టీ కొత్త కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. పార్టీ ఇన్‌ఛార్జి గిరీష్ నాయుడు, జనసైనికులు పాల్గొన్నారు.

వచ్చే నెల 4న ఘంటసాల జయంత్యుత్సవం..

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో డిసెంబరు 4న శతాబ్ది గాయకులు, పద్మశ్రీ ఘంటసాల 103వ జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. భీష్మారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

సంస్థ ప్రతినిధులు సర్వేశ్వరరావు, సూర్యనారాయణ, గుప్త పాల్గొన్నారు.

సత్యసాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, అధికారులు

విజయనగరంలో కొవ్వొత్తులతో నగర సంకీర్తన చేస్తున్న సత్యసాయి భక్తులు

ప్రజలకు సేవలందించడమే పరమావధి

జిల్లా వ్యాప్తంగా సత్యసాయి జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ర్యాలీలు, పూజలు, అన్నదానం, పండ్లు పంపిణీ చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా మహోన్నతుడిగా ఎదిగిన వ్యక్తి సత్యసాయిబాబా అని కొనియాడారు. జేసీ సేథుమాధవన్ తదితరులు పాల్గొన్నారు. చీడిపాలెంలో ఎంపీ భరత్ సాయి పుస్తకాలు ఆవిష్కరించారు. - న్యూస్‌టుడే, బృందం

ఎస్.కోట: సాయి పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

జరజాపుపేటలోని సాయి మందిరంలో పూజలు

బాబామెట్ట.. సమస్యలకు అడ్డా

నగరంలోని అయిదో డివిజన్ బాబామెట్ట ప్రాంతంలోని పలు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. దాసన్నపేట నీళ్ల ట్యాంకు సమీపంలో శుద్ధవీధి వద్ద రూ.40 లక్షలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నాలుగేళ్లయినా నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో స్థానిక మహిళలు అత్యవసర సమయాల్లో ఇబ్బంది పడుతున్నారు. ఉద్యానం అభివృద్ధికి నోచుకోలేదు. ద్వారకానగర్-8లో మురుగునీటి కాలువ అవుట్‌లెట్ గెడ్డలోకి విడిచిపెట్టారు. వర్షాలు పడితే మురుగు కాలనీ వైపు వచ్చి చెరువును తలపిస్తోంది. కాలువలు రాజానగర్‌లో నిర్మించాలని కోరుతున్నారు. కాలనీలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

శుద్ధవీధిలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరించబోమని తీర్మానం చేయాలి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, ఈ విషయంలో వైకాపాను మంత్రి శ్రీనివాస్ తప్పుదోవ పట్టిస్తున్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విధంగా తీర్మానం పంపిచామన్నారు. ఆదివారం ధర్మపురిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే స్టీల్ ప్లాంటులోని 30 డిపార్టుమెంట్లు అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చేశారన్నారు. రైతులకు మద్దతు ధర ప్రకారం పంట అమ్ముకునే వీల్లేకుండా చేస్తున్నారన్నారు. సూర్యనారాయణరాజు, జైహింద్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు

ఎస్టీయూ కార్యవర్గం ఏర్పాటు

విద్యావిభాగం: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లాశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా వై. అప్పారావు, ఉపాధ్యక్షులుగా డి. శ్రీరాములు, ఎస్. నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా డి. శ్యామ్, అదనపు ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్. శ్రీనివాస్‌దొర ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా వి. గోవిందరావు, సీపీఎస్ కన్వీనర్‌గా సి. ఎస్. వి. నాయుడు నియమితులయ్యారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం సతివాడ పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నెల్లిమర్ల, జరజాపుపేటలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. నాయకులు సీహెచ్ వెంకటరమణ, ఎంఎం. నాయుడు, కె. గోవింద, ఎం. అప్పలనాయుడు, వై. గోవింద, ఎ. నల్లిబాబు, తహసీల్దార్ కె. శ్రీకాంత్, ఏవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సతివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

తాగునీటి ప్లాంటు ప్రారంభం

కొత్తవలస: కంటకాపల్లిలో నిర్మాణంలో ఉన్న సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ కార్పొరేట్ ఆధ్వర్యంలో దత్తి హాయినా అనాథాశ్రమంలో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ ఆర్వో ప్లాంటును ప్రాజెక్టు హెడ్ ఐ.వి.మహేష్, హెచ్ ఆర్ జీఎం సూరజ్ వర్మ ఆదివారం ప్రారంభించారు. ఆశ్రమం డైరెక్టర్లు కృష్ణ, జోయెల్, తబితామీనన్, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

28న నామినేషన్ల స్వీకరణ

కొత్తవలస: కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాలకు చెందిన ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం కొత్తవలస తాలూకా యూనిట్ ఎన్నికలకు ఈనెల 28న నామినేషన్లు స్వీకరిస్తామని జిల్లా ఉపాధ్యక్షురాలు ఆదిలక్ష్మి తెలిపారు. డిసెంబరు 5న ఎన్నికలుంటాయన్నారు.

సీసీ కెమెరాల వితరణ

ఎల్.కోట: గేదెలవానిపాలెం సర్పంచి కనకలక్ష్మి, దేముడు దంపతులు మూడు సీసీ కెమెరాలను అందజేసినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు.

'పరిహారం పక్కదోవ'

ఎస్.కోట: తమకు రావాల్సిన పరిహారాన్ని బినామీల పేరిట పక్కదోవ పట్టించారని జిందాల్ నిర్వాసితులు అన్నారు. బొడ్డవరలో రిలే నిరాహార దీక్ష శిబిరంలో మాట్లాడుతూ ఇళ్లు, భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాలిచ్చేలా జీవో ఎం.నెం.892లో పేర్కొన్నారని, నేటికీ ఇవ్వలేదన్నారు. యువతకు ఉద్యోగాలిస్తామని రూ. లక్షలు వసూలు చేశారని, విచారణ జరిపించాలని కోరారు.

తెదేపాలో పలువురి చేరిక

విజయనగరం అర్బన్: గంట్యాడ మండలం ఎంపీటీసీ రాళ్లపూడి అప్పలరాజు ఆధ్వర్యంలో వైకాపాకు చెందిన 50 కుటుంబాలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో తెదేపాలో చేరాయి. వారికి మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు.

సందడిగా ఊరేగింపు

ఈ నెల 26 సుబ్రహ్మణ్యస్వామి జయంతి పురస్కరించుకుని ఆదివారం స్వామి కావడి అట్టం ఊరేగించారు. దేవాలయం వ్యవస్థాపకుడు వెంకటరమణ సిద్ధాంతి వేదమంత్రాల మధ్య పూజలు చేశారు. సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. స్వామి దీక్షాదారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, కంటోన్మెంట్

(c) eenadu

ఈనాడు పశ్చిమగోదావరి

పున్నమి రోజే పట్నంలో వెలుగు

భీమవరం పట్టణం, ఆకివీడు, నరసాపురం, న్యూస్‌టుడే

పట్టణాల అందం వెలుగులోనే బాగా కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం చాలా చోట్ల ఆ అవకాశం లేదు. ఎందుకంటే అంధకారంలో ఉండటమే. గత వైకాపా హయాంలో పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణను పూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధి దీపాల బాధ్యతను పురపాలికలు స్వీకరించాయి. అయినా చాలా వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

పురసేవ యాప్‌లో వస్తోన్న ఫిర్యాదుల్లో 45 శాతం వీధి దీపాల మరమ్మతుల గురించే ఉంటున్నాయి. వాటికి 48 గంటల వ్యవధిలో మరమ్మతులు చేయించాలి. భీమవరం, నరసాపురం, ఆకివీడులో ప్రధాన కూడళ్లలోని కొన్ని స్తంభాలను **'న్యూస్‌టుడే'** పరిశీలించగా చాలా చోట్ల వెలగడంలేదు, ఇంకొన్నింటికి దీపాలు అమర్చేందుకు అవసరమైన సామగ్రి లేదు.

నరసాపురం ప్రధాన రహదారిపైనే చీకట్లు అలముకున్నాయి. అంతర్గత దారులు, కాలనీల్లో అధిక శాతం వెలగకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది.

వీధి దీపాలు– 24,925
మరమ్మతులకు గురైనవి– 3,480

పట్టణాల్లో 3,480 వీధి దీపాలు వెలగడం లేదు. ఇవన్నీ వెలుగులు విరజిమ్మాలంటే రూ.6.50 కోట్లు అవసరమని అధికారులు నివేదిక సమర్పించారు. టెండరు పిలిచి బల్బు బిగించే వరకు పలు ప్రాంతాలు అంధకారంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. సాధారణ బల్బు అమర్చడానికి నెలలు పడుతుందంటే ప్రధాన కూడళ్లలో 110 వాట్స్, అంతర్గత వీధుల్లో 60 వాట్స్, 20 వాట్స్ దీపాలను ఏర్పాటు చేయడానికి ఆరు నెలలు అవుతోంది. వీధి దీపాల మరమ్మతులు, కొత్త వాటి ఏర్పాటు విషయమై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నానని రాజమహేంద్రవరం పురపాలక ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు.

ఆకివీడు పిల్లలమర్రి అగ్రహారం వీధి ప్రాంతంలో వెలగని వీధి దీపం

వీధి దీపాలు వెలగక అంధకారం

పట్టణం	వీధి దీపాలు
భీమవరం	6121
తాడేపల్లిగూడెం	5069
పాలకొల్లు	3343
నరసాపురం	4220
తణుకు	4500
ఆకివీడు	1672

ఏదో ఇచ్చామన్నట్లు..

నరసాపురం, ఆకివీడులో దీపాలు వెలగకపోవడంతో స్థానికుల నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కరించలేకపోతున్నామంటూ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలోని పట్టణాల్లో అయితే సచివాలయాల్లో అర్జీలు ఇస్తున్నారు. కొనుగోలు చేయాల్సిన సామగ్రి వివరాలు నమోదు చేసి.. ప్రతిపాదనలు తయారు చేసి కౌన్సిల్ ఆమోదం పొందడానికి ఆరు ఏడు నెలలు పడుతుంది. అప్పటి వరకు వెలుగులు మరచిపోవాల్సి వస్తుందని సభ్యులు నిలదీస్తే సాధారణ నిధులతో కొనుగోలు చేసిన బల్బులను వార్డుకు 4, 5 చొప్పున కేటాయించి బుజ్జగిస్తున్నారు.

స్థానిక సంగ్రామానికి సన్నాహాలు!

● మూణ్నెల్ల ముందే ఎన్నికలు ● కసరత్తు చేస్తున్న ఈసీ

'ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 909 గ్రామ పంచాయతీలు, 9,588 వార్డు స్థానాలకు నాలుగు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. 2026 మార్చి 17తో పురపాలక సంఘాలకు, ఏప్రిల్ 2న గ్రామ పంచాయతీలకు, సెప్టెంబరు 3తో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగియనుంది.'

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. పంచాయతీ పాలకవర్గాల పాలనా గడువు ముగింపునకు.. మూణ్నెల్ల ముందే ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే 175 నియోజకవర్గాల్లోని ఓటర్ల జాబితా ఈసీ కార్యాలయం తీసుకుంది. పురపాలక సంఘాలు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయనుంది.

రిజర్వేషన్ల ఖరారులో.. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికి నెల రోజులకు పైగా సమయం పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరుకు రిజర్వేషన్ల ఖరారును పూర్తి చేసి.. మార్చిలో ఎన్నిక ప్రకటన ఇవ్వనున్నట్లు సమాచారం. ఏప్రిల్‌లో మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. ఈ మేరకు వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా తయారీ, పంచాయతీల వర్గీకరణ, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికి చర్యలు చేపట్టాలని ఎస్ఈసీ ఆదేశించింది.

గోవిందా..గోవిందా..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గోవిందా.. గోవిందా.. అంటూ వేలాది మంది భక్తులు ద్వారకాతిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. సెలవు రోజు కావడంతో వేకువజాము తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి నిత్య కల్యాణంలో 90 జంటలు పాలుపంచుకున్నాయి. శ్రీవారి ఆలయానికి తూర్పు వైపున అనివేటి మండపంలో నిర్వహించిన కోలాట భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఇల్లు వదిలి.. తల్లడిల్లి: 6లో

పవన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

నేడు ఉప ముఖ్యమంత్రి రాక

ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పవన్ కల్యాణ్ కొండపైన ఆలయం వద్దకు వెళ్లే మార్గంలో బారికేడింగ్, ఇసుక మేటలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ పరదాలు వేశారు. ప్రాంగణమంతా గ్రీన్ మ్యాట్లు పరిచారు. ముఖ్యమైన వారిని మాత్రమే కొండపైకి అనుమతించేలా చర్యలు చేపట్టారు. ఆదివారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిశీలిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ అభిషేక్ గౌడ

రోడ్డు మార్గంలోనే.. ముందుగా ప్రకటించిన విధంగా పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో రావడం లేదు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరంలో ప్రత్యేక విమానం దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నేరుగా మధ్యాహ్నం 12 గంటలకు కొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు చేరుకుంటారు. కార్యక్రమాల అనంతరం ఒంటిగంటకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్తారు.

పటిష్ఠ భద్రత.. సుమారు 318 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన ఆలయ ప్రాంగణంలో 12 సీసీ కెమెరాలు, మార్గం మధ్యలో మరో రెండు అమర్చారు. వాహనాలకు కొండ దిగువున పార్కింగ్ ఏర్పాటు చేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి: కేంద్ర మంత్రి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరంలోని నర్సయ్యఅగ్రహారంలో నూతనంగా నిర్మించిన కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారి 165 నిర్మాణానికి నిధులు, నరసాపురం నుంచి వందే భారత్, నూతన రైళ్లు ఏర్పాటు చేయించానని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు సాధించి నరసాపురం పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి వర్మ చేపడతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి బాట వేస్తున్న ఆయన మరో 20 ఏళ్లు నరసాపురం ఎంపీగా ఉండాలని తాను కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు, శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాసు, పితాని సత్యనారాయణ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పాందువ్వ శ్రీను, కలెక్టర చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నిమ్మల రామానాయుడు, శ్రీనివాసవర్మ

ఉండి పాఠశాలలో అత్యున్నత సౌకర్యాలు

ఉండి, న్యూస్‌టుడే: జిల్లాలోనే అత్యున్నత సౌకర్యాలు కలిగిన ఉన్నత పాఠశాలగా ఉండిని తీర్చిదిద్దుతున్నామని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఉండి ఉన్నత పాఠశాలలో రూ.75.20 లక్షలతో కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ప్రయోగశాలలు, సోలార్ ప్యానల్స్, ఆట స్థలాల అభివృద్ధి పనులకు కలెక్టర్ నాగరాణి, డీఈవో నారాయణతో కలిసి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు ముందుకొస్తున్నారని తెలిపారు. పనులు ఆరు నెలల్లో పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిన మైదానం అభివృద్ధి గురించి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో మాట్లాడానని, త్వరలోనే వారు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉండిలో చెత్త సేకరించే బుట్టలు పంపిణీ చేశారు. తడి చెత్త సేకరణపై ప్రత్యేక సిబ్బందికి శిక్షణ ఇచ్చామని కలెక్టర్ నాగరాణి పేర్కొన్నారు.

మహిళలకు చెత్తబుట్టలు అందజేస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పారిశుద్ధ్య కార్మికులు ఉపసభాపతి, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను గుర్తించాలని తహశీల్దార్ నాగార్జునను ఆదేశించారు. డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈఈ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, పెనుమంట్ర, నరసాపురం, న్యూస్‌టుడే: రోవర్ వచ్చి స్థల నిర్ధారణ చేయాలన్నా (గ్రౌండ్ ట్రూథింగ్), దస్త్రాలు తయారు చేయాలన్నా కొన్ని ఖర్చులుంటాయి.. వాటినిస్తే వెంటనే పనవుతుంది. ఇది జిల్లాలోని కొందరు సర్వేయర్ల తీరు... గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వే మరిన్ని కష్టాలను తెచ్చింది. వాటి పరిష్కారానికి చేపట్టిన రీసర్వేలోనూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సొమ్ములిస్తేనే.. దిద్దుబాటు..!

రీసర్వేలో లోపాల సవరణకు డిమాండ్

● పెనుమంట్ర మండలంలో రైతుల నుంచి పత్రాలు సేకరిస్తున్న సమయంలో ఖర్చులకు సొమ్ములివ్వాలని సంబంధిత సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఎప్పుడవుతుందో తెలియదని చెప్పడంతో ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేయించుకుంటున్నారు.

● మొగల్తూరు, నరసాపురం మండలాల్లో క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ చేసేందుకు రోవర్ రావాలంటే సర్వేయర్ల చేతులు తడపందే పనులు కావడం లేదు. భూ కొలతల్లో హెచ్చుతగ్గులు చూపించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అడిగినంత ఇస్తే న్యాయం చేస్తామనడంతో తప్పక ఇవ్వాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు.

పర్యవేక్షణ లేక.. కూటమి ప్రభుత్వం వచ్చాక జనవరిలో తొలివిడత మండలానికొక గ్రామం చొప్పున 20 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేశారు. రెండో విడత ఏప్రిల్‌లో మరో 27 గ్రామాలు, మూడో విడత 16 మండలాల్లో 22 గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఇందుకోసం 124 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వో ఉండగా, క్షేత్రస్థాయిలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్లు, రీసర్వే ఉప తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలి. అది లేకనే మామూళ్ల దందేస్తున్నారు.

ప్రాంతాన్ని బట్టి.. గత ప్రభుత్వ హయాంలో రీసర్వేలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయి. ఫలితంగా బ్యాంకుల నుంచి రుణాలు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధిక వడ్డీలకు బయట అప్పులు తెస్తున్నారు. వాటిని సరిదిద్దేందుకు చేపట్టిన రీసర్వేలోనూ ప్రాంతాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు.

● రైతులు ఎవరికీ సొమ్ములివ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని భూ రీసర్వే జిల్లా అధికారి జాషువా తెలిపారు.

ఆర్వో ప్లాంటు వద్ద ఎస్సీ సంక్షేమ అధికారిణి అరుణకుమారి తదితరులు

వసతి గృహాలకు స్వచ్ఛ జలాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వసతి గృహాల విద్యార్థులకు స్వచ్ఛ జలాలు అందిస్తున్నారు. ఇందుకు పీఎం అజయ్ పథకంలో ఆర్వో ప్లాంట్లు సమకూరుస్తున్నట్లు ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎన్.వి.అరుణకుమారి తెలిపారు. భీమవరంలోని బాలికల వసతి గృహం, పరిమెళ్లలోని బాలురు, ఇదే ప్రాంతంలోని కళాశాల బాలికలు, బాలుర వసతి గృహాలు, నరసాపురంలోని బాలుర, బాలికల వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వాటి పనితీరును ఆదివారం పరిశీలించారు.

రొయ్య వెలవెల.. రైతు విలవిల..!

కైకలూరు, మండవల్లి, ఉండి, న్యూస్‌టుడే

మిలియన్ డాలర్ల పంటైన రొయ్యల సాగులో రైతులకు కాలం కలిసి రావడం లేదు. రూ.లక్షల్లో పెట్టుబడులు కోట్లలోకి మారి అప్పుల తిప్పలు వెంటాడుతున్నాయి. ఒక పంట కాకపోతే మరో పంట అంటూ సాగు చేస్తున్నా.. ఫలితం లేదు. మరో పక్క ట్రంప్ సుంకాల బాంబులు పేల్చుతున్నా అదరక బెదరక ముందుకు సాగినా.. ఒక్క సారైనా కనికరించలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

✦ రొయ్యల సాగు 1.1 లక్షల ఎకరాలు
✦ రైతులు 28 వేలు వరకు.
✦ నెల రోజుల్లో పంట నష్టపోతే ఎకరాకు రూ.1.20 లక్షలు ఆవిరి.
✦ 90 వేల ఎకరాల్లో ఒక పంట నష్టం: రూ.1,080 కోట్లు
✦ మూడు పంటల్లో నష్టం: రూ.3,240 కోట్లు నష్టం.

కలిసిరాని వాతావరణం.. గడిచిన 9 నెలల్లో దాదాపు 6 నెలలు మబ్బులతో ఆడపా దడపా వర్షాలు పడుతుండటం చల్లని వాతావరణం తెల్ల మచ్చల వ్యాధికి వాహకంగా పని చేసింది. దీంతో అన్ని చోట్ల చెరువులు తుడిచి పెట్టుకుపోయాయి.

◗ మండవల్లికి చెందిన ఓ రైతు 30 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మూడు పంటలు నష్టపోవడంతో రూ.1.2 కోట్లు అప్పులపాలై ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గడిచిన 9 నెలల్లో వేల మంది రైతుల ఆర్థిక పరిస్థితి తలకిందులైంది.

● తొమ్మిది నెలలుగా కలిసిరాని కాలం
● ఉమ్మడి జిల్లాలో రూ.3,240 కోట్లు ఆవిరి

నాణ్యత లేని సీడ్.. తల్లి రొయ్య నాణ్యత లేకపోవడం.. ఎక్కువ సార్లు సీడ్‌ను తీయడం, హేచరీ దశలోనే విబ్రియోసిస్ పెరిగిపోవడంతో సీడ్ నాణ్యత తగ్గిపోతోంది. వేసవికాలంలో విబ్రియో, వైట్ గట్, ఈహెచ్‌పీలు వెంటాడితే, మార్చి, జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ తెల్ల మచ్చల వ్యాధి(వైట్ స్పాట్) తీవ్రస్థాయిలో విజృంభించింది.

రైతుల స్వార్థం.. రొయ్యల సాగు సమష్టిగా చేస్తేనే మంచి ప్రయోజనాలు పొందే వీలుంటుంది. కాని రైతులు స్వార్థంతో వైరస్ వచ్చిన చెరువుల్లో మందులు పిచికారీ చేయకపోవడం, కనీసం పక్క రైతులను అప్రమత్తం చేయక పోవడం ◉ పరిపాటిగా మారింది.

అప్రమత్తత అవసరం రొయ్యల సాగులో అప్రమత్తత ఎంతో అవసరం. చెరువుల సిద్ధం చేసేప్పుడు శాస్త్రీయతను పాటించడం, నాణ్యమైన సీడ్‌ను పరీక్షించిన తర్వాతే చెరువులో వేసుకోవాలి. చెరువులోని రొయ్యలకు ఒత్తిడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– నరసయ్య, జేడీ, మత్స్యశాఖ

మా దారి.. జాతీయ రహదారి

ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇరుకు రహదారులు... పెరిగిన వాహనాల రద్దీ... తరచూ ఎక్కడో ఒకచోట రక్తమోడుతున్న దుస్థితి... ఈ సమస్యను పరిష్కరించి.. మెరుగైన రోడ్డును అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 165 విస్తరణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు పనులు చేపట్టే దిశగా అడుగులు వేసినా కోర్టు కేసులతో ముందుకు సాగలేదు. వాటి పరిష్కారం దిశగా గత వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వంలో కోర్టు, ఇతరత్రా ఎన్నో అవాంతరాలను దాటుకుని జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్)కు అనుమతి నిమిత్తం డీపీఆర్ వెళ్లింది.

కేంద్ర మంత్రిత్వ శాఖకు డీపీఆర్

చకచకా మేలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి జూన్ 14 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. ఏఏ గ్రామాల మీదుగా వెళ్తున్నాయో సర్వే నంబర్ల ఆధారంగా వారికి 3ఏ నోటీసులు జారీ చేశారు. అభ్యంతరాలు వ్యక్తమైన గ్రామాల్లో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎన్‌హెచ్ అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు, రైతుల నుంచి కారణాలను తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చొరవతో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆగస్టులో స్పష్టమైన ప్రకటన చేశారు.

ఎక్కడి నుంచి ఎక్కడికి
ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు
వెళ్లేది – ఆరు మండలాల్లో 20 గ్రామాల మీదుగా
దూరం - 45.92 కి.మీ.
భూసేకరణ సేకరణ 172.9235 హెక్టార్లు
ప్రాథమిక అంచనా రూ.3,256 కోట్లు

45.92 కి.మీ.. తొలిదశలో పామర్రు నుంచి ఆకివీడు వరకు 64 కి.మీ. రహదారి విస్తరణ పనులు చేశారు. రెండో దశలో 61.740 కి.మీ. నుంచి 107.660 కి.మీ. వరకు ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు 45.92 కిలోమీటర్లలో రహదారి విస్తరణకు చర్యలు చేపట్టారు.

వెళ్లేదిలా.. ఆకివీడు మండలంలో అజ్జమూరు నుంచి ఉండి మండలంలో చెరుకువాడ, పెదపుల్లేరు, చినపుల్లేరు, కాళ్ల మండలంలో కొలనపల్లి, సీసలి, జక్కరం, పెదఅమిరం, వేంపాడు, కోపల్లె, భీమవరం మండలంలో చిన అమిరం, రాయలం, తాడేరు, భీమవరం, గునుపూడి, పాలకోడేరు మండలంలో విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వీరవాసరం మండలంలో వీరవాసరం గ్రామాల మీదుగా రహదారి వెళ్లేలా డీపీఆర్ పంపించారు.

● ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపించాం, రెండు మూడు వారాల్లో అనుమతులొస్తాయని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు.

పిల్లలూ.. అంతా బాగుందా!

లోపాల గుర్తింపునకు యాప్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో నిర్వీర్యమైన వసతి గృహాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయించింది. విద్యార్థుల హాజరు నమోదుకు ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ అమలు చేస్తోంది. తాజాగా హాస్టల్ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ విధానం (యాప్) ఏఐ సాయంతో అమలు చేస్తున్నారు.

జిల్లాలో వసతి గృహాలు పరిశీలిస్తే..

బీసీ	29
ఎస్సీ	35
ఎస్టీ	2

సమాచారం నిక్షిప్తం.. వారాంతపు వివరాలు, నెలవారీ సమాచారాన్ని యాప్‌లో నమోదు చేస్తారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించిన వివరాలు ఉంటాయి.

వసతిగృహంలో ఏ రోజు ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఉదయం యోగా, అల్పాహారం, ఉదయం, రాత్రి వడ్డించే ఆహార పదార్థాలు ఇలా అన్నింటిని వసతిగృహ పర్యవేక్షకులు యాప్‌లో నమోదు చేయాలి. వీటిలో ఏదైనా తేడా ఉంటే రాష్ట్రస్థాయిలోని డాష్‌బోర్డు గుర్తిస్తుంది. బెండకాయ అని నమోదు చేసి దొండకాయ వండినా, అల్పాహారంలో తేడాలు ఉన్నా కనిపెట్టేస్తుంది.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోయినా, ప్రస్తుతం అవి ఏ స్థితిలో ఉన్నాయో తెలుసుకునేందుకు 1100 కాల్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి



జననం: 13-01-1944
మరణం: 10-11-2025

కీ॥శే॥ శ్రీ చిటకన సూర్యనారాయణ గారు (అబ్రహాం)
Retd. Electrical A.D.E., ఏలూరు

ఇంజినీర్‌గా విద్యుత్ రంగంలో విశిష్ట సేవలందించి, చెరగని చిరునవ్వుతో మమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహించి, మా ఉన్నతికి కారణమైన మీ జీవితం మాకు స్ఫూర్తిదాయకం. మీ జ్ఞాపకాలను మా మది నిండా నింపుకొని, మీరు చూపిన ఆశయాల బాటలో పయనిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: జయలక్ష్మి

కుమారులు – కోడళ్ళు, కుమార్తెలు – అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

జ్ఞాపకార్థ కూడిక: తేది. 24-11-2025 సోమవారం ఏలూరు, దొండపాడులో మా స్వగృహము నందు జరుపబడును.

WALK-IN-INTERVIEW
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED

REQUIRES ASSISTANTS IN BUSINESS DEVELOPMENT CUM RECOVERIES, ACT ASST., BID PAYABLE ASST. & OFFICE BOY FOR OUR PROPOSED NEW BRANCH AT TADEPALLIGUDEM

BUSINESS DEVELOPMENT CUM RECOVERIES ASSISTANTS & BID PAYABLE ASST:
Male graduates with pleasing personality below 30 years with 2/3 years of experience in relevant fields. Candidates having valid two wheeler driving licence are preferred. The above posts are mainly field oriented. Experience in chit fund/ financial institutions will be given preference.

Act Asst.:
The Candidate should be graduate and below 30 years of age with either B.Com. (General) or (Computers) and should have thorough knowledge of accounts, computers and good communication skills.

OFFICE BOY-1 POSITION:
SSC Passed male candidate with pleasing personality below 30 years of age.

Note: The selected candidates will have to undergo training at our Tanuku branch for about 1 to 2 months in all areas of operations of chit fund transactions and thereafter will be posted at our proposed new branch at Tadepalligudem.

Please attend **WALK-IN-INTERVIEW ON 25th November, 2025 (TUESDAY) AT OUR TANUKU BRANCH from 10.30 A.M. to 2.00 P.M.** alongwith latest Resume, xerox copies of certificates/ testimonials, recent colour passport size photographs and copy of Pan Card, Aadhaar card & Bank passbook first page at the following address:

The Branch Manager,
MARGADARSI CHIT FUND PRIVATE LIMITED.
D.No.26-3-19, 1st Floor, Satya Sneha Central, Above Union Bank of India, Alamurivari Street,
TANUKU - 534 211, ANDHRA PRADESH., ☎ Phone No. 08819-223505/ 221059.

నిమ్మలపై దాడి ఘటన.. పాలకొల్లులో సీఐడీ విచారణ

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో 2022లో టిడ్కో గృహాల ప్రారంభోత్సవ సమయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌లపై వైకాపా శ్రేణులు దాడికి పాల్పడిన ఘటనపై సీఐడీ బృందం ఆదివారం విచారణ జరిపింది. సీఐడీ ఏఎస్పీ (రాజమహేంద్రవరం) ఫర్హీన్ ఆధ్వర్యంలో బృందం పాలకొల్లు టిడ్కో సముదాయానికి వచ్చి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించింది.

ఏం జరిగిందంటే.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను కొందరు లబ్ధిదారులకు స్వాధీనపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అప్పటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు తదితర వైకాపా నాయకులు హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేను వేదికపైకి ఆహ్వానించాల్సి ఉండగా దీనిని పాటించలేదు. ఈ నేపథ్యంలో నిమ్మలతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌లు వేదికపైకి వెళ్లేందుకు యత్నించగా వైకాపా నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని వారికి కిందికి తోసేశారు. వేదికపై నుంచి పడిపోయిన ఎమ్మెల్యేతో పాటు ఇతర తెదేపా నాయకులపై కొందరు వైకాపా వర్గీయులు దాడికి పాల్పడ్డారు. వారిలో కొందరి వద్ద మారణాయుధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై యలమంచిలికి చెందిన తెదేపా నాయకుడు తాడి శశిధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేయలేదు. దీనిపై నిమ్మల హైకోర్టును ఆశ్రయించారు.

టిడ్కో సముదాయం వద్ద విచారణ జరుపుతున్న సీఐడీ బృందం

ప్రశ్నించడాన్ని తట్టుకోలేక.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును సీఐడీకి అప్పగించారు. విజయవాడ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఐదుగురి బృందాన్ని ప్రభుత్వం నియమించింది. కేసు దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరం నుంచి వచ్చిన సీఐడీ పోలీసులు టిడ్కో లబ్ధిదారులు, ఫిర్యాదుదారుడిని విచారించారు. కుట్రపూరితంగా రామానాయుడిపై దాడికి పాల్పడ్డారని కొందరు లబ్ధిదారులు సీఐడీ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అసెంబ్లీలో తరచూ వైకాపా అరాచక పాలనపై నిమ్మల ప్రశ్నించడాన్ని తట్టుకోలేక కక్ష గట్టారని మరికొందరు పేర్కొన్నట్లు సమాచారం.

ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Digital Partner: ఈనాడు.net TV Partner: ETV Organised by: ఈనాడు

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయి మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశ పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అబ్డామినల్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వారు). ●సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వారు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై పీఈటీ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో ఈనాడు కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు కార్యాలయం
తాడేపల్లిగూడెం - 534411
వివరాలకు: 99592 24506
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లో సంప్రదించొచ్చు.

నాకో అవకాశం.. నాదో విన్నపం

అధ్యక్షా.. అజెండాతో మాక్ ఎమ్మెల్యేలు సిద్ధం

పాలకోడేరు, పెనుగొండ గ్రామీణ, నరసాపురం, వీరవాసరం, తణుకు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న శాసనసభలో జరిగే మాక్ అసెంబ్లీలో ప్రజావాణి వినిపించేందుకు మాక్ ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. పాఠశాల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో సత్తా చాటిన వీరిని నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఎంపిక చేశారు. ఇప్పటికే అమరావతి చేరుకున్న వీరు 24, 25న ప్రత్యేక తర్ఫీదు తీసుకుని 26న మాక్ అసెంబ్లీకి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు.

మైదానాల దుస్థితి

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చాలాచోట్ల సరైన క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి అభివృద్ధి, క్రీడా కోర్టుల ఏర్పాటు ఆవశ్యకతను సభలో ప్రస్తావిస్తా. తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరతా. - గుత్తుల సత్య, పెన్నాడ, పాలకోడేరు మండలం

వసతిగృహాల గురించి

మా నియోజకవర్గం నుంచి మాక్ అసెంబ్లీకి వెళ్లే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. భారత రాజ్యాంగం ఆవశ్యకత, గొప్పదనం గురించి, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సౌకర్యాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడతా. - కె.సరిత, దేవ, పెనుగొండ మండలం

ట్రాఫిక్ సమస్యలు

భీమవరం పట్టణంతోపాటు పలు ప్రధాన రహదారులు ఆక్రమణకు గురికావడంతో తరచూ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రహదారుల విస్తరణ, మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణాలు, పట్టణ సుందరీకరణ వంటి అంశాలను సభలో ప్రస్తావిస్తా. - యేలేటి జాయ్‌సీ, రాయకుదురు, వీరవాసరం మండలం

తల్లికి వందనంపై కృతజ్ఞతలు

అధ్యక్షా అని అసెంబ్లీలో మాట్లాడబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పేద విద్యార్థుల చదువు నిమిత్తం తల్లికి వందనం పథకం అమలు చేయడంపై అసెంబ్లీలో ప్రభుత్వానికి విద్యార్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తా. గ్రామాల్లో సురక్షిత తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేస్తా. - ఎ.శ్రీవర్షిణి, మేడపాడు, యలమంచిలి మండలం

ఉపాధి, ఉద్యోగాల కల్పన

చదువు పూర్తయిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉండటంతో చెడు వ్యసనాల బాట పడుతున్నారు. వాటి కల్పనకు తీసుకోవాల్సిన చర్యలు గురించి అసెంబ్లీలో మాట్లాడతా. ఇళ్ల స్థలాలు, రోడ్లు, ఇళ్ల నిర్మాణాలకు రుణాలు వంటి వాటిపైన సభ దృష్టికి తీసుకెళ్తా. - ఎం.శ్రీమహాలక్ష్మి, రేలంగి, ఇరగవరం మండలం

తీరంలో పర్యాటకం

గోదావరి తీరం వెంబడి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను సభలో వివరిస్తా. కదలిక లేని ధవళేశ్వరం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా పనులపై మాట్లాడతా. - పి.గుణశివరామకుమార్, పీవీ తోట, మొగల్తూరు మండలం

సత్యసాయి సూక్తులు అనుసరణీయం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే పంచ సూక్తులు భగవాన్ సత్యసాయిబాబా ఆచరించి ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పట్టణంలో భీమేశ్వరస్వామి ఆలయ సమీపాన సత్య సాయి మందిరంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా సత్యసాయిబాబా చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, సంయుక్త కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూలమాలలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాబా 'మానవ సేవే మాధవ సేవగా' భావించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా శత వార్షికోత్సవాల చిహ్నం, 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీపీవో ఎం.రామనాథ్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్.రాంబాబు, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాథ రాజు, సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్లు గుడివాడ కృష్ణ, చలపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, చిత్రంలో జేసీ, ఎమ్మెల్యే

వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

కూరగాయల ధరలు తగ్గుముఖం



పెనుగొండ గ్రామీణ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: గత వారంతో పోలిస్తే కొన్ని రకాల కూరగాయల ధరలు 20 శాతం వరకు తగ్గినట్లు పెనుగొండ మండలం దొంగరావిపాలెంలోని హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు తెలిపారు. బయట దర మాత్రం పెరిగింది. ఆదివారం నాటి ధరలు (10 కిలోలకు రూపాయల్లో) ఇలా ఉన్నాయి. దొండ- 300, దోస- 250, నల్ల వంకాయ- 500, తెల్ల వంకాయ- 600, బెండ- 400, నాటు చిక్కుడు- 1000, బీట్‌రూట్- 350, క్యారెట్- 400, బంగాళాదుంప- 200, పచ్చిమిర్చి- 370, క్యాబేజీ- 250, ముల్లంగి- 500, ఉల్లి- 200 నుంచి 230, టామాటా- 450.

ఇల్లు వదిలి.. తల్లిడిల్లి!

☛ పిల్లలతో సహా వెళ్లిపోతున్న వైనం
☛ అదృశ్యాలపై బాధిత కుటుంబాల్లో ఆందోళన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులు.. ఆత్మీయులు.. బంధువులు ఒక్కసారిగా కనిపించకుండాపోతే ఆ బాధ, ఆందోళన చెప్పనలవికాదు. ఆనందంగా సాగిపోతున్న దాంపత్యంలో ఒకరోజు భార్య లేదా భర్త ఇల్లు వదిలి వెళ్లిపోతే.. పిల్లలనూ తమ వెంట తీసుకెళ్లితే.. ఆ వేదన వర్ణనాతీతం. ఎక్కడికెళ్లారో.. ఎందుకెళ్లారో.. ఏమైపోయారో.. తెలియక మానసికంగా కుంగిపోవాల్సిన దుస్థితి. రోజులు గడుస్తున్నా.. వారి జాడ తెలియకపోతే.. ఎక్కడున్నారు? క్షేమంగా ఉన్నారా? ఏదైనా అఘాయిత్యం చేసుకున్నారా? అనే ఆలోచనలు మదిని తొలిచేస్తూ కుంగదీస్తుంటాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో పరిపాటిగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

✶ ఉంగుటూరు మండలానికి చెందిన ఓ వివాహిత ఇటీవల తన కుమార్తె, కుమారుడిని వెంట పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం పని ముగించుకొని ఇంటికొచ్చిన భర్తకు విషయం తెలియడంతో.. చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

✶ చేబ్రోలు పోలీస్టుస్టేషన్ పరిధిలో గత నెల 23న ఓ వివాహిత తనకంటే అయిదేళ్ల తక్కువ వయసున్న యువకుడితో తన ఇద్దరు కుమారులను తీసుకుని వెళ్లిపోయారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆ బాధ వర్ణనాతీతం.. ఉమ్మడి జిల్లాలో యుక్త వయసున్న వారు ఎక్కువగా ఇల్లు వదిలి వెళ్లిపోతున్నారు. చేతికొచ్చిన పిల్లలు ఎందుకు ఇల్లు విడిచారో తెలియక తల్లిదండ్రులు అల్లాడిపోతున్నారు. అలిగారా, ప్రేమ వ్యవహారమా, అనుకున్నది దక్కలేదని కుంగుబాటా తెలియక సతమతమవుతున్నారు. ఇక భార్యాభర్తల బంధంలో మనస్పర్థలు, ఆర్థిక సమస్యలు, ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలు అదృశ్యాలకు ప్రధాన కారణమవుతోంది.



ప్రతి సమస్యకూ పరిష్కారం

ఆపదలొచ్చినప్పుడు.. సమస్యలు చుట్టిముట్టినప్పుడు ధైర్యంగా ఉండాలి. సరిగ్గా ఆలోచిస్తే ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుంది. ఆ దిశగా యోచించకపోవడంతోనే ఇంటి నుంచి వెళ్లిపోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం పరిపాటిగా మారుతోందని ఏలూరు సర్వజన ఆసుపత్రి మానసిక వైద్య విభాగం ఆచార్యుడు డాక్టర్ వంశీకృష్ణ చెబుతున్నారు. తమకు ఎదురైన వ్యథలను అధిగమించేందుకు మార్గాలు అన్వేషించాలని.. ఆత్మీయులతో పంచుకోవాలని.. అప్పుడే కచ్చితంగా పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: లారీ డ్రైవర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన బాపులపాడు మండలం పెరికీడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన కొత్తూరి ప్రసాద్‌బాబు(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శనివారం బాపులపాడు మండలంలోని ఓ పరిశ్రమ నుంచి సరకు తీసుకుని అరిపిరాలలో చేపల చెరువు వద్ద దింపారు. ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో పెరికీడులో జాతీయ రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద లారీ నిలిపేశారు. గమనించిన స్థానికులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ప్రసాద్‌బాబు సీట్లో మృతి చెంది ఉన్నాడు. గుండె పోటుతో మృతి చెందాడా? అనారోగ్య కారణమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాగులో మునిగి విద్యార్థి దుర్మరణం

వార్త తెలిసి గుండెపోటుతో నాయనమ్మ కన్నుమూత

యశ్వంత్ (పాత చిత్రం)

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: సరదాగా వాగులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సమీపాన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దొంతికుంట కాలనీకి చెందిన గుమ్మళ్ల యశ్వంత్(16) అశ్వారావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా స్నానాలు చేసేందుకు కామయ్యపాలెం వచ్చారు. వాగులో దిగాక లోతు తెలియక ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని పైకి తీశారు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే మనవడి మృతి వార్త తెలిసిన నాయనమ్మ వెంకమ్మ(72) గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బీచ్‌లో యువకుడు గల్లంతు

మోహన సాయి గణేశ్

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణాజిల్లా తేలప్రోలు వద్ద ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆయన ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. గణేశ్ సముద్రంలో స్నానానికి వెళ్లి అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. మెరైన్ సిబ్బంది, పోలీసులు, ఆ యువకుడి మిత్రులు, బంధువులు తీరంలో గాలింపు చేపట్టారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ వాహనం బోల్తా

14 మందికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్ పురం ఐటీడీఏ సమీపాన రాజానగరం మార్గంలో జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ట్రాలీ వాహనం బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజంపాలేనికి చెందిన 25 మంది ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుణ్ణంపల్లిలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బయలుదేరారు. ఐటీడీఏ సమీపానికి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ట్రాలీ వాహనం ప్రమాదవశాత్తు రహదారి పక్కకు బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనాల్లో మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో పలువురు చిన్నపిల్లలు కూడా ఉన్నారు. స్టీరింగ్ వదిలేయడం ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. బోల్తా పడిన వాహనాన్ని స్థానికుల సహాయంతో పైకి లేపారు.

ఘటనా స్థలిలో బోల్తా పడిన వాహనం, క్షతగాత్రులు

రోడ్డు అంచులో పడి వృద్ధుడు..

కొమరాడ (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఈ నెల 20న స్కూటర్ నడుపుతూ ప్రమాదవశాత్తు రోడ్డు అంచులో పడి కొమరాడకు చెందిన రాట్నాల చినదేవయ్య (75)తీవ్రంగా గాయపడినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి తెలిపారు. అతను గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొని మరొకరు..

గొల్లవానితిప్ప (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: గొల్లవానితిప్పకు చెందిన తాళ్లూరి శామ్యూల్‌రాజు (21) ఆదివారం తెల్లవారుజామున భీమవరం నుంచి ఇంటికి వెళ్తుండగా గ్రామంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మృతి చెందినట్లు ఏఎస్సై వై.వి.సత్యనారాయణ తెలిపారు. అతని తాతయ్య ప్రభుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ పోస్టులను తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. 4 పోస్టులు ఖాళీ ఉండగా.. నెలకు రూ.45 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. జ్యుడిషియల్ సర్వీసులో ఉద్యోగ విరమణ చేసిన, రాజీనామా చేసిన, జ్యుడిషియల్ మినిస్టీరియల్, సూపరింటెండెంట్ విభాగాల్లో పని చేసిన, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సర్వీసులో పని చేసి బార్ అసోసియేషన్‌లో కనీసం అయిదేళ్లు కేసులు వాదించిన వారు అర్హులన్నారు. ఔత్సాహికులు డిసెంబరు 12లోపు జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు బాలికల క్రికెట్ జట్టు ఎంపిక

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 25న దేవరపల్లి ఏఎస్ఎన్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు పీఎస్ఎన్.మల్లేశ్వరరావు, డి.సునీత, కె.అలివేలుమంగ, కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మైదానానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని, ఇతర వివరాలకు 98666 78844 నంబరులో సంప్రదించాలని సూచించారు.

దేశ సంస్కృతికి నిలువుటద్దం యోగా

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమని, యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం అన్నారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం చందలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 69వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను డీఈవో ప్రారంభించారు. ముందుగా పతాకావిష్కరణ, ప్రతిజ్ఞ చేయించారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ చందలూరి గిరిజ అధ్యక్షత వహించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనాన్ని అధికారులు స్వీకరించారు. విద్యార్థులు కోలాట ప్రదర్శనతో స్వాగతం పలికారు.

బాస్కెట్ బాల్ విజేతలు.. కృష్ణా, తూర్పుగోదావరి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్ 17 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతల వివరాలను టోర్నమెంట్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని తూర్పుగోదావరి, ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా, తృతీయ స్థానం విశాఖపట్నం, నాలుగో స్థానాన్ని కృష్ణా జిల్లాలు సాధించాయన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కృష్ణా, ద్వితీయ స్థానం తూర్పుగోదావరి, తృతీయ స్థానం గుంటూరు, నాలుగో స్థానాన్ని చిత్తూరు జిల్లా జట్లు సాధించినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా అండర్ 17 బాలుర విభాగంలో వరుసగా 8వ సారి విజయం సాధించారన్నారు. డీవైఈవో పీఎస్ సుధాకర్, సీఐ పి.సత్యశ్రీనివాస్, బిస్ అధినేత బి.శ్యామ్, కరస్పాండెంట్ మెలోడి, అబ్జర్వర్ పి.కృష్ణ, 13 జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

EENADU Classifieds

AGRI BUSINESS

ప.గో. జిల్లా భీమవరానికి 12 కి.మి. దూరంలో 10 1/2 చెరువు, 6 ఎకరములు పరిభూమి విడివిడిగా అమ్మకం. Cont: 92477 76006.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. ✆ 96667 14613.

పెద్దవారికి సేవచేయుటకు ఆడవారు & మగవారు కావలెను. ✆ 7702184399.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted Marketing Executive: Male 15-20K, Store Manager: M/F 10-15K, Sales Persons M/F 8-10K. Resume Send Whatsapp: 95050 66887.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.45 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉII 5 - ఉII 7
ఈ-మార్నింగ్స్	ఉII 7 - ఉII 11
నువ్వా నేనా	ఉII 11 - మII 2
సత్యభామ	మII 2 - సాII 5
లైట్ తీస్కో	సాII 5 - రాII 9
సరదాగా కాసేపు	రాII 9 - రాII 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రాII 12 - తెII 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

80080 12494

భీమవరం
●భీమవరం ●ఉండి

పారదర్శకంగా సర్వే చేయండి

ఉండిలో సర్వే యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి, న్యూస్‌టుడే: సొంత స్థలం ఉండి పక్కా గృహాలు మంజూరు చేయాలని ముందుకొచ్చే వారిని గుర్తించి ఆ వివరాలు పారదర్శకంగా సర్వే యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఉండి పెదపేటలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా సర్వే ఉండాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ పెన్మెత్స శివరామరాజు, ఏఈ గౌస్‌భాష, తహశీల్దార్ కె.నాగార్జున, డిప్యూటీ తహ శీల్దార్ ప్రసాదరాజు ఉన్నారు.

ఈత పోటీల్లో కాంస్య పతకం

విజేతలతో జోత్స్నశ్రీ

వీరవాసరం, న్యూస్‌టుడే: పెర్కిపాలెం గ్రామానికి చెందిన కోరశిఖ జోత్స్నశ్రీ విశాఖలో ఆదివారం సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రూప్-1 మహిళా విభాగం ఈత పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు తండ్రి వీర్రాజు తెలిపారు. బాలికను అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, కందుల భానుప్రసాద్, సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కోరశిఖ పెద్దిరాజు అభినందించారు.

గుర్తించి.. వదిలేశారు..!
చిట్టడవులు, చెరువుల్లా ఖాళీ స్థలాలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతున్నాయి. నివాసిత ప్రాంతాల మధ్యలో ఉన్న ఖాళీ ప్రాంతాల్లో తుప్పలు పెరిగి, దోమలకు నివాస యోగ్యంగా మారడమే దీనికి కారణం. వర్షాలకు పల్లపుప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుంది. సాధారణ రోజుల్లోనూ మురుగుతో ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి.

భీమవరం బ్యాంకు కాలనీలో ఇళ్ల మధ్య మురుగు

ఎక్కడెక్కడ అంటే.. మారుతీనగర్, చినరంగనిపాలెం, నర్సయ్యఅగ్రహారం, హౌసింగ్ బోర్డుకాలనీ, బ్యాంకు కాలనీ, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ, శ్రీరామపురం, బలుసుమూడి, ఏఎస్ఆర్‌నగర్, సూర్యనారాయణపురం, వంశీకృష్ణానగర్, రామలక్ష్మణనగర్, శివారు కాలనీలు.

పట్టణంలోని 39 వార్డుల్లో 3,338 ఖాళీ స్థలాలను మూడేళ్ల కిందట గుర్తించారు. 2300 స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మిగిలిన వాటి యజమానులు ఎవరనేది తెలుసుకోవడం కష్టంగా ఉండటంతో అధికారులు నోటీసులు జారీ నిలిపేశారు.

పట్టని నిబంధనలు.. ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయాయి. మురుగుతో దుర్వాసన భరించలేకపోతున్నారు. విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయి. నిబంధనల మేరకు నివాసాల మధ్య ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి. మెరక చేసుకుని లోపల ఎలాంటి తుప్పలు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించాలి. ఖాళీ స్థలాల యజమానుల వివరాలు సేకరించామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. నిబంధనల మేరకు మెరకతో పాటు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్నామన్నారు.

జారిపోతున్నా.. పట్టదా..
పంట కాలువలోకి రహదారి అంచులు

యండగండిలో కాలువ వెంబడి సర్విబాదులు, తడికెల మధ్య కంకర బస్తాలతో రక్షణ

ఉండి, న్యూస్‌టుడే: భీమవరం-పిప్పర మధ్య రాష్ట్రీయ రహదారి వివిధ చోట్ల ప్రమాదంగా మారింది. ప్రధానంగా యండగండి, ఉణుదుర్రు, కేశవరం, అప్పనవీడు ప్రాంతాల్లో ఏడెనిమిది చోట్ల అంచులు పక్కనే ఉన్న పంట కాలువలోకి జారిపోతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. కొన్నిచోట్ల అపసవ్య మార్గంలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఇటీవల కాలంలో 20-35 టన్నులకు మించి బరువుండే వాహనాల రాకపోకలు బాగా పెరిగిపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. రాష్ట్రీయ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరై దాదాపు ఏడాది గడిచిపోతున్నా ఆ పనులకు ఇప్పటికీ పచ్చజెండా ఊపలేకపోయారు. బలహీనంగా మారిన అంచుల్లో రక్షణ గోడల నిర్మాణం.. రహదారి విస్తరణ అభివృద్ధి పనులు ప్రధానంగా ఉన్నాయి. యండగండి, ఉణుదుర్రు, సాగపాడు ప్రాంతాల్లో కాలువ గట్టు బలహీనపడిన చోట్ల తాత్కాలిక చర్యలు చేపట్టారు. భూమిలోకి సర్విబాదులు దింపి.. అడ్డంగా తడికెలు ఉంచి కంకర బస్తాలతో గట్లను పటిష్ఠపరిచే పనులు చేపడుతున్నారు. ఈ తాత్కాలిక పనులు ఎన్నాళ్లు నిలుస్తాయనే నమ్మకం కనిపించడం లేదని ప్రయాణికుల వాపోతున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందిస్తూ పిప్పర రహదారిలో వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పనులు చేపట్టామని చెప్పారు.

కట్టరు.. అటు చూడరు
నిర్మాణ దశలో నిలిచిన భవనాలు

కలిసిపూడిలో అసంపూర్తిగా గ్రామ సంఘ భవనం

ఉండి, న్యూస్‌టుడే: పల్లెల్లో గ్రామ సంఘం, మండల కేంద్రాల్లో మండల సమాఖ్య కార్యాలయాల నిర్మాణాలకు 2019-24 మధ్య ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్వయం సహాయక సంఘాల మహిళలు ఒకచోటకు చేరి సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా వీటి నిర్మాణాలకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. ఈ భవనాలు ఆరేళ్లుగా నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి.

ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రెండుచోట్ల మాత్రమే భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఉండి, కాళ్ల కేంద్రాల్లో నేటికీ పూర్తి కాలేదు. ఉండిలో మండల రెవెన్యూ కార్యాలయానికి చేర్చి స్లాబ్ వేసి వదిలేసిన భవనం చుట్టుపక్కల కార్యాలయాల్లోని ఉద్యోగుల వాహనాలు భద్రపరిచేందుకు ఉపయోగపడుతోంది.

కలిసిపూడి, వాండ్రం తదితర ప్రాంతాల్లో గ్రామ సమాఖ్య భవనాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. రెండు చోట్ల స్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దాంతో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యే స్వయం సహాయక సంఘాల మహిళలు దేవాలయాల ప్రాంగణాలు, ఖాళీ నివాసాల్లో అరుగులపై ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పరిశీలించి నిలిచిన భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు. వెలుగు ఏపీఎం రాజేష్ స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

‘మట్టి అమ్మి మీరు బాగుపడటానికి కాదు’

అధికారులను ప్రశ్నిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని దొరగారి చెరువులో ఇష్టానుసారంగా మట్టిపూడిక తీత పనులపై ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన చెరువులో ఇప్పటి వరకు చేసిన పనులను పరిశీలించారు. చెరువును లోతుగా తవ్వి మట్టిని అమ్మకోవడంపై పనులు చేస్తున్న శ్రీనివాసరాజును ప్రశ్నించారు. చెరువు అభివృద్ధి కోసమే తప్పా మట్టిని విక్రయించి మీరు బాగుపడటానికి కాదని మండిపడ్డారు. ఇక ఒక ట్రక్కు మట్టి బయటకు వెళ్లినా, నిబంధనల మేరకు అధికారులు సూచించినట్లు పనులు పూర్తి చేయకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు చెరువులో జరిగే పనులను దగ్గరుండి పరిశీలించాలని అధికారులు, నాయకులకు సూచించారు.

నాణ్యతతో జరగాలి.. ఆకివీడు, న్యూస్‌టుడే: డ్రెయినేజీ నిర్మాణ పనులు నాణ్యతతో వేగంగా పూర్తయ్యేలా దాతలు, అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు సూచించారు. ఆకివీడు ఏఎంసీ కార్యాలయం నుంచి అయిభీమవరం రోడ్డు వరకు 850 మీటర్ల పొడవునా నిర్మించనున్న సీసీ డ్రెయినేజీ పనులకు ఆదివారం భూమిపూజ చేసి ప్రారంభించారు.

ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం

ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ దంపతులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఆపద వస్తే ఆదుకుంటామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. గొల్లలకోడేరుకు చెందిన దివంగత భాజపా సీనియర్ కార్యకర్త మెట్ట లక్ష్మీశ్రీనివాస్ ఇంటి నిర్మాణానికి ఆయన ఆదివారం సతీసమేతంగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ భీమవరంలో పార్టీలో కీలకంగా వ్యవహరించిన లక్ష్మీశ్రీనివాస్ 2021లో కరోనాతో మృతి చెందారని, అప్పుడే ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని పార్టీ పరంగా హామీ ఇచ్చామన్నారు. ఆ మేరకు సొంత ఇంటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్‌వర్మ, తోట గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బలరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

బీచ్ మార్గాల్లో విస్తృత తనిఖీలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది కార్తికమాసంలో కొద్ది రోజులు మాత్రమే బీచ్‌లోకి పర్యాటకులను అనుమతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. పర్యాటకుల రక్షణ నిమిత్తం పోలీసులు నో డ్రింక్ జోన్ అమలు చేశారు. బీచ్‌కు వెళ్లే మార్గాల్లో పోలీసు సిబ్బంది డీఎస్పీ జీ శ్రీవేధఅరవింద ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పర్యాటకులు తీసుకువెళ్తున్న మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ✦ బీచ్‌లో పర్యాటకుల రక్షణ నిమిత్తం మొగల్తూరు ఎస్సై జి.వాసు, మెరైన్ ఎస్సై సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది సిబ్బందిని నియమించారు. కనకదుర్గాబీచ్ వైపు పర్యాటకులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కాపలా కాశారు.

నేటి నుంచి ‘రైతన్నా మీ కోసం’

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం ‘రైతన్నా మీ కోసం’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మండలాలు	- భీమవరం, వీరవాసరం
రైతు సేవా కేంద్రాలు	- 27
వరి సాగు విస్తీర్ణం	- 19 వేల ఎకరాలు

దీనిలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు అధికారులు రైతుసేవా కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాగును లాభసాటిగా మార్చడం, రైతులను విప్లవాత్మకమైన మార్పుల వైపు నడిపించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఏం చేస్తారు: నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల గురించి అవగాహన కల్పిస్తారు. అగ్రిటెక్ పేరిట సాగుకు సాంకేతిక జోడిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. రైతులు పండించే పంటకు విలువ పెరగాలంటే వాటిని ప్రాసెసింగ్ చేయాలి. ఆ తరహా పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు జరుగుతుంది. దాని వల్ల కలిగే మేలు గురించి తెలియజేస్తారు. ఆధునిక సాగు పద్ధతుల గురించి తెలియజేస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు, వాటిని ఎలా వినియోగించుకోవాలో వివరిస్తారు. కార్యక్రమం నిర్వహణకు అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామని, రైతుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఏవో ప్రసాద్ తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఏదో విధంగా ఒత్తిడికి గురవుతున్నారని, శారీరక వ్యాయామం వల్ల దాన్ని అధిగమించొచ్చని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భీమవరం మండలం చినఅమిరం యూత్ క్లబ్ ఆవరణలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీని ఆయన ఆదివారం రాత్రి లాంఛనంగా ప్రారంభించారు. పోటీలు రెండ్రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మరాజు, చిలుకూరి నర్సింహరాజు, పేరిచర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచనా శక్తి

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి, డీఈవో నారాయణ

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచిని పెంచాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి అన్నారు. చినఅమిరం ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం కలిగిస్తే వారిలో ఆలోచన శక్తి పెరుగుతుందని అన్నారు. చెకుముకి సంబరాలు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని డీఈవో నారాయణ అన్నారు. అనంతరం జేవీవీ జిల్లా అధ్యక్షుడు రేపాక వెంకన్నబాబు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. విద్యాదాత పొత్తూరి బాపిరాజు, జేవీవీ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే: ? రామాపురం నుంచి పాములపర్రు వంతెన వరకు ఎడమవైపు ఉన్న పంట బోదె మట్టి, వ్యర్థాలతో పూడిపోయింది. వాటిని తొలగించి సాగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలి.
- నాగేశ్వరరావు, పాములపర్రు

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
- ఫణిశంకర్, జల వనరుల శాఖ ఏఈ, ఉండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే : ? పారిశ్రామికవాడలో మురుగుతో ఇబ్బంది పడుతున్నాం. డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు.
- రామచంద్రం, స్థానికుడు

? చినరంగనిపాలెం ప్రధాన రహదారి పక్కన చెత్త గుట్టలు వెంటనే తీయకపోవడంతో డ్రెయిన్లలో పడిపోయి మురుగుకు అడ్డంకిగా మారుతున్నాయి.
- కె.సత్యనారాయణ, ప్రైవేటు ఉద్యోగి

✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం.
- సూర్యనారాయణరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? దుర్గాపురంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న సిమెంటు దారిలో పాఠశాల కూడళ్లలో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు జరగకుండా చూడాలి. **- కె.చిన్నిబాబు**

✔ రహదారిని పరిశీలించి వేగ నియంత్రికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను.
- కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరులో మెయిన్‌రోడ్డు చర్చి ఎదురుగా ఉన్న చెరువులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి పూర్తిగా కలుషితం చేశారు. **- పి.రామకృష్ణ, పాలకోడేరు**

✔ చర్యలు తీసుకుంటాం.
- బి.గోపి, కార్యదర్శి, పాలకోడేరు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? కొవ్వాడఅన్నవరం ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. **- రమేష్**

✔ పరిష్కార చర్యలు చేపడతాం.
- శ్యాం, పంచాయతీ కార్యదర్శి

సండే స్కూల్ దినోత్సవం

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: ప్రపంచ సండే స్కూల్ దినోత్సవం సందర్భంగా వేంపాడులోని సెయింట్ పాల్ లూథరన్ దేవాలయంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ఆకట్టుకున్నాయి. దేవాలయం పాస్టర్ జి.ప్రకాశరావు ప్రత్యేక ప్రార్థన చేసి దేవుని సందేశం ఇచ్చారు. అనంతరం సండే స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ఆరాధన, వాక్య పరిచర్య, ప్రత్యేక పాటలు ఆలపించారు. సంఘ కాపరి పి.పీటర్ పాల్గొన్నారు.

సర్వమత ఆధ్యాత్మిక సమ్మేళనం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, శ్రీ సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. స్థానిక యోగా కేంద్రంలో ‘సర్వమత ఆధ్యాత్మిక సమ్మేళనం’ జరిగింది. ఆధ్యాత్మికవేత్త పసుమర్తి కనకం, ధ్యాన గురువు వీబీ ప్రతాప్‌కుమార్ ఆధ్యాత్మిక, యోగా, ధ్యాన సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

మావుళ్లమ్మకు గజమాల

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మకు భక్తులు భారీ కనకాంబరం గజమాల ఆదివారం సమర్పించారు. అర్చకులు సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు.

25 నుంచి షష్ఠి ఉత్సవాలు

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: రెండో పట్టణం శ్రీరామపురం కూడలిలో రామలింగేశ్వరస్వామి (సుబ్బారాయుడు గుడి)లో 25 నుంచి 29 వరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో డి.వి.కృష్ణంరాజు తెలిపారు. 27న తెల్లవారుజామున స్వామివార్ల కల్యాణం, సాయంత్రం రథోత్సవం, 28న రాత్రి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిందితుడికి 15 రోజుల రిమాండు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం గ్రామీణ పోలీస్‌స్టేషనులో గతంలో నమోదైన కేసులో రమేష్‌ను అరెస్టు చేసేందుకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దిగుంట గ్రామానికి ఈనెల 21న వెళ్లినట్లు ఎస్సై వీర్రాజు తెలిపారు. అదుపులోకి తీసుకోకుండా అతని బంధువులు అడ్డుపడి విధులకు ఆటంకం కలిగించారన్నారు. చివరికి అతడ్ని అరెస్టు చేసి తీసుకొచ్చి భీమవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండు విధించినట్లు తెలిపారు.

చినఅమిరంలో టెన్నిస్ టోర్నీ

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: చినఅమిరం యూత్ క్లబ్ ఆవరణలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పోటీలు రెండ్రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు మైక్రోఫిల్టర్లు ప్రారంభం

ఉండి, న్యూస్‌టుడే: ప్రజలందరికీ సురక్షితమైన మంచినీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్లు వివిధ చోట్ల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని చిలుకూరు, కలిసిపూడిలో పథకాలను ఉపసభాపతి, ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సోమవారం ప్రారంభించనున్నారు. వాటి పనితీరును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథరాజు, గ్రామాల అభివృద్ధి అధికారులు కె.రవికుమార్, వి.అప్పారావు ఆదివారం మధ్యాహ్నం పరిశీలించారు.

పనితీరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథరాజు

ఇల్లు కట్టుకుంటారా..
అయితే ముందుకు రండి..

యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న సర్వే సిబ్బంది

ఉండి, న్యూస్‌టుడే: మీకు సొంత స్థలం ఉండి.. పక్కా ఇల్లు నిర్మించుకోవాలనే ఆలోచన ఉందా. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రత్యేక సర్వేలో మీ పేర్లు నమోదు చేసుకోండి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేసే ప్రక్రియలో భాగంగా ‘ఆవాస్ ప్లస్ యాప్‌తో’ గ్రామాల్లో ప్రభుత్వం తాజాగా ప్రత్యేక సర్వే చేయిస్తోంది. ఖాళీ స్థలాలు ఉన్నవారు, తాటాకిల్లు, పెంకుటిల్లు, రేకుల షెడ్డులో ఉంటూ పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చే వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెల ఏడో తేదీన ఈ సర్వే ప్రారంభమైంది. ఈ నెలాఖరుతో ముగియనుంది. సొంత స్థలానికి చెందిన వివరాలు, బ్యాంకు పాస్ పుస్తకం, తెల్లరేషన్, ఆధార్ కార్డుంటే చాలు.. మీ పేరిట పక్కా ఇళ్లు సులభంగా మంజూరవుతోంది.

మండలం	నమోదైన వారి సంఖ్య
ఉండి	56
ఆకివీడు	71
కాళ్ల	142
పాలకోడేరు	60

గతంలో ఇళ్లు మంజూరు చేసిన తర్వాత లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకునేవారు. వారి పేర్లతో కూడిన జాబితాలను జిల్లా కమిటీలు ఆమోదించేవి. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు మంజూరుచేసేవి. ప్రస్తుతం ప్రతి పల్లెకు ఒక ఇంజినీరింగ్ సహాయకుడు ఆవాస్ ప్లస్ యాప్ కలిగిన చరవాణితో మీ ముగింటకే వస్తున్నారు. అతనికి మీ కుటుంబ సభ్యుల పేర్లు, సొంత స్థలం, ఆధార్, తెల్లరేషన్, జాబ్ కార్డు తదితర వివరాలు అందించాలి. ఒకవేళ జాబ్‌కార్డు లేని పక్షంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది మీ పేరుతో కొత్తగా కార్డు అందజేస్తారు. ఖాళీ స్థలాన్ని కచ్చితంగా చూపించాలి.

గ్రామసభ తీర్మానాలతో అర్హుల గుర్తింపు..
సర్వేలో నమోదైన వారి పేర్లు గ్రామసభల్లో చదువుతారు. అనర్హుల పేర్లు తొలగిస్తారు. అర్హుల జాబితా కేంద్ర ప్రభుత్వ యాప్‌లో నమోదు చేస్తారు. సర్వే సిబ్బందికి పూర్తివివరాలు అందించి సులభంగా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రండి.
- శివరామరాజు, డీఈఈ, గృహ నిర్మాణ శాఖ, ఉండి

సత్యసాయి సేవలు మార్గదర్శకం

కాళ్ల: జయంతి వేడుకలో ప్రత్యేకాధికారి దోసిరెడ్డి

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా సేవలు నేటితరానికి మార్గదర్శకం అని మండల ప్రత్యేకాధికారి దోసిరెడ్డి అన్నారు. కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలో భాగంగా బాబా చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీవో జి.స్వాతి పాల్గొన్నారు.

జీర్ణకోశ వ్యాధులపై వైద్య పరీక్షలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్, మానవత, డెక్కన్ ఫైన్ కెమికల్స్ సహకారంతో మెంటేవారితోటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీర్ణకోశ వ్యాధులపై డాక్టర్ పీఎస్ఆర్.అనీష్, బుద్ధరాజు వెంకటపతిరాజు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఔషధాలు అందజేశారు. 30న బీపీ, మధుమేహం, ఫిట్స్, పక్షవాతం రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

వీరవాసరం, న్యూస్‌టుడే: మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ విధిగా పరీక్షలు చేయించుకోవాలని వీరవాసరం శ్రీ కోల్లా భాస్కరమ్మ, శ్రీ వీరరాఘవులు మెమోరియల్ ట్రస్ట్ సభ్యురాలు ఆకుల మౌనిక సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని మెయిన్ పాఠశాల, బొంతువారి వీధి ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. త్వరలో స్క్రీనింగ్ పరీక్షలు, అవసరమైన వారికి మందులు ట్రస్ట్ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ సభ్యురాలు మౌనిక

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

భగవద్గీత పోటీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో స్థానిక మాదివాడ మల్లేశ్వర వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో జిల్లాస్థాయి భగవద్గీత పోటీలు ఆదివారం నిర్వహించారు. మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఆరో తరగతి విద్యార్థుల నుంచి 45 ఏళ్లు ఉన్న వారు మొత్తం 100 మంది పాల్గొన్నారు. వీరిలో విజేతలుగా నిలిచిన 9 మందికి తితిదే నుంచి గుర్తింపు పత్రం, జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేశారు. తితిదే సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, అయిభీమవరం వేద పాఠశాల ప్రిన్సిపల్ వి.సుబ్రహ్మణ్యంశాస్త్రి, జలదుర్గాప్రసాద్, నాగశశికళ, రామచంద్రరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక ఎన్‌సీసీ

ప్రదర్శనను ప్రారంభిస్తున్న రామకృష్ణంరాజు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందింపజేసేలా ఎన్‌సీసీ తీర్చిదిద్దుతుందని డీఎన్నార్ పాలకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.రామకృష్ణంరాజు తెలిపారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ జి.మోజెస్ ఆదివారం ప్రారంభించారు. శాంతియుత సమాజ స్థాపనకు యువత కృషి చేయాలని వక్తలు సూచించారు. పరిపాలన అధికారి పి.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ అధికారి ఎ.వీరయ్య, క్యాడెట్లతో ప్రదర్శన నిర్వహించారు.

రైల్వే గేటు మూసివేత వాయిదా

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజల విజ్ఞప్తి మేరకు వీరవాసరం-నవుడూరు రోడ్డులోని రైల్వే గేటు మూసివేతను వాయిదా వేసినట్లు రైల్వే ఇంజినీరింగ్ విభాగం సీనియర్ అధికారి కె.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

పిల్లలకు డిగ్రీ విద్య ఎంతో అవసరం

మాట్లాడుతున్న ఆకివీడు సీఐ జగదీశ్వరరావు

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: పిల్లలు కనీసం డిగ్రీ చదివేలా తల్లిదండ్రులు చూడాలని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు సూచించారు. చెరుకువాడ సీబీసీఎన్‌సీ మందిరంలో పోలీసు చట్టాలపై ఆదివారం అవగాహన కల్పించారు. పిల్లల్లో విద్యతో పాటు విలువలు పెంచేలా కృషి చేయాలని, చెడు స్నేహాల బారినపడి నష్టపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, మద్యం, పోక్సో, గంజాయి వంటి కేసులపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా పాల్గొన్నారు.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్క నాటుతున్న క్యాడెట్లు, అధికారులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి సీహెచ్. కోహిత్ కుమార్, లెఫ్టినెంట్ సంజీత్ రౌత్రే పేర్కొన్నారు. వారోత్సవాలను పురస్కరించుకొని నరసాపురంలోని ఎన్‌సీసీ సెవెన్ ఆంధ్ర నావల్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం 120 మంది క్యాడెట్లతో కేంద్రం నుంచి వైఎన్ఎం కళాశాల వరకు ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, గోదావరి గట్టు, దర్గా కూడళ్లలో మొక్కలు నాటారు.

పోలీసు శాఖకు అధునాతన వాహనాలు

నూతన వాహనం వద్ద సిబ్బంది

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయానికి ప్రత్యేక క్రైం స్పాట్ క్లూస్‌టీం వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చినట్లు డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద ఆదివారం తెలిపారు. చోరీలు, తీవ్ర నేరాలు జరిగినప్పుడు ఆధారాలు సేకరించేందుకు క్లూస్‌టీంలను ఈ వాహనాల ద్వారా వేగంగా ఘటనాస్థలికి చేరవేసే వీలుంటుంది. ఈ వాహనంలో అధునాతన పరికరాలు అందుబాటులో ఉంటాయి. భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరికరాలు దోహదపడతాయని డీఎస్పీ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? మిషన్ హైస్కూలు రోడ్డులో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- చంద్రరావు, నరసాపురం**

✔ మరమ్మతులు చేయిస్తాం. **- అంజయ్య, పురపాలక కమిషనర్**

నరసాపురం, న్యూస్‌టుడే: ? ఎన్టీఆర్ కాలనీలో చెత్తను సక్రమంగా తరలించడం లేదు. ఏ వీధిలో చూసినా వ్యర్థాలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. **- ఎన్.రాంబాబు, నరసాపురం**

✔ చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- జీవీవీఎస్ పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెనుగొండ, న్యూస్‌టుడే: ? వడలి జాంపేట రామాలయం వీధిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- బొబ్బిలి సత్తిబాబు**

✔ చర్యలు చేపడతాం. **- ఎన్.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ? రామన్నపాలెంలో సామూహిక మరుగుదొడ్ల చుట్టూ పొదలు పెరిగిపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. **- స్థానికులు**

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం. **- సూర్యప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీవో**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? మొగల్తూరు కాలువలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి ప్రవాహానికి అవరోధంగా మారాయి. **- నాగేంద్రబాబు, మొగల్తూరు**

✔ కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపడతాం. **- వెంకట నారాయణ, జలవనరుల శాఖ డీఈ**

పంట చేతికందే వేళ.. మరో గండం!

ఆచంట, పెనుగొండ గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: పశ్చిమ జిల్లాలో ఖరీఫ్ వరి మాసూళ్లు జోరందుకున్న వేళ వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో 4 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. మరోసారి వర్షాలు పడితే తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు చెబుతున్నారు.

మొగల్తూరు: చేలో వరిపనలను ఒడ్డుకు చేరుస్తున్న కూలీలు

ఆందోళనలో అన్నదాతలు

ఆరంభం నుంచి ఇక్కట్లే..

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సాగుకు అవరోధాలు ఎదురయ్యాయి. పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో సకాలంలో నాట్లు పడినా ఆచంట, పోడూరు, పాలకొల్లు, యలమంచిలి, నరసాపురం, మొగల్తూరు మండలాల్లో కొన్ని చోట్ల ఆలస్యమయ్యాయి. ఇలాంటి ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో చేలు తెగుళ్లబారిన పడ్డాయి. ఎకరానికి 5 నుంచి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క రెండు మూడు రోజుల్లో వాయుగుండం ఏర్పడి కోస్తా జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే హెచ్చరికలతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. నవంబరులో సంభవించే తుపానులు, వాయుగుండాల దిశను కచ్చితంగా అంచనా వేయడం కష్టమని అధికారులు చెబుతున్నారు.

ఉరుకులు.. పరుగులు.. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు పక్వానికి వచ్చిన చేల్లో హడావుడిగా కోతలు, మాసూళ్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు. పెనుగొండ మండలం పరిధిలో ఈ ఏడాది 12,220 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా.. ఇప్పటి వరకు కేవలం 360 ఎకరాల్లో మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన చోట్ల ధాన్యాన్ని రహదారులు, కాలువ గట్ల వెంబడి ఆరబెడుతున్నారు. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని నిర్ణీత తేమశాతం వచ్చే వరకు గట్లపై ఆరబెట్టుకొని విక్రయించుకోవాలని వ్యవసాయాధికారిణి పి.స్పందన సూచించారు.

కూలీలకు డిమాండు.. కొన్ని ప్రాంతాల్లో వరికోత యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. దీంతో కూలీలతో మాసూళ్లు చేయించాల్సి వస్తోంది. ఒక్కసారిగా వరి కోతలు జోరందుకోవడంతో కూలీలకు కొరత ఏర్పడింది. కల్లం పక్కనే ఉంటే ఎకరం చేలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసేందుకు రూ.12 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. కల్లాలకు దూరంగా ఉన్న చేలకు అయిదే ఎకరానికి రూ.15 వేలు, ఆపైన ఖర్చవుతోందని పేర్కొంటున్నారు.

సిద్ధాంతంలో దీపోత్సవం

ఘనంగా సత్యసాయి గ్రామోత్సవం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిద్ధాంతంలో భక్తులు నగర సంకీర్తన, బాబా చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. వంద మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాత్రి వంద జ్యోతులతో దీపోత్సవం నిర్వహించారు.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో బర్రెవారి వీధి, రాయపేటలలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా ప్రతిమను రథంలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయిబాబా చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సూర్య భగవానుడికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలో వశిష్ఠ గోదావరి తీరాన బాపుఘాట్‌లో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచహారతులు ఇచ్చారు.

అమ్మవార్లకు నైవేద్యాల సమర్పణ.. మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్లలో గంగాలమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మృతుల కుటుంబాలకు జనసేన బాసట

చెక్కులు, ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

యలమంచిలి, న్యూస్‌టుడే: ప్రమాదాల్లో మృతి చెందిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఆ పార్టీ బాసటగా నిలిచింది. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలేనికి చెందిన వలవల దివ్యశ్రీ రామ పవన్‌కుమార్, దొడ్డిపట్ల వాసి నామన దుర్గా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చొప్పున బీమా పరిహారం చెక్కులను పార్టీ ప్రధాన కార్యదర్శులు నాగబాబు, టి.శివశంకర్ శ్రీరామ్ ఆదివారం అందజేశారు. పార్టీ అబ్బిరాజుపాలెం గ్రామ అధ్యక్షుడు శిరిగినీడి వెంకట దుర్గా ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సైలు సీహెచ్ జయలక్ష్మి, ఎస్ఎన్ ముత్యాలరావు హెచ్చరించారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఆదివారం వారు వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని 18 మంది చోదకులకు అపరాధ రుసుము విధించారు. ఆరుగురి నుంచి అపరాధ రుసుము బకాయిలు వసూలు చేసినట్లు తెలిపారు.

కూటమి పాలనలో ప్రగతి పథం: మంత్రి

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నిమ్మల

యలమంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు తెదేపా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెదేపా యలమంచిలి మండల కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. అధ్యక్షుడిగా మామిడిశెట్టి పెద్దిరాజు, ఉపాధ్యక్షుడిగా తమ్మినీడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల శ్రీనివాస్ తదితరులతో మంత్రి ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. మరింత అభివృద్ధి కోసం కూటమి అధికారంలో కొనసాగాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. గత వైకాపా పాలనలో జరిగిన విధ్వంసాన్ని నేడు జరుగుతున్న ప్రగతి పనులతో పోల్చుకోవాలని సూచించారు. రాబోయే తరాల భవిష్యత్తు కోసం ప్రజలంతా ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత నియోజకవర్గం నలుమూలల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన తెదేపా శ్రేణులతో కలిసి మేడపాడు నుంచి యలమంచిలి వరకు నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నాయకులు బొప్పన హరికిశోర్, ఆరిమిల్లి చిన్ని, తమ్మినీడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. క్షీరపుర అన్నదాన సమాజ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆలయ అభిషేక మండపంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. కమిటీ ఛైర్మన్‌గా తెలనాకుల కోటేశ్వరరావు, సభ్యులుగా పి.ఉమా శంకరరావు, టి.వెంకటేశులు, జి.రామకృష్ణ, ఎస్.సృజన, ఐ.కాంతి, సి.లీలావతి, బి.అశ్విని, ఎం.కిరణ్మయి, కె.లక్ష్మిలతో ప్రమాణస్వీకారం చేయించారు. నాయకులు పెచ్చెట్టి బాబు, జీవీ, గాది చినవెంకన్న, ధనాని సూర్యప్రకాశ్, మండాది అవినాశ్, అల్లం తాతాజీ పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని

పేదలకు అండగా సీఎం సహాయనిధి

పోడూరు, న్యూస్‌టుడే: వైద్య సేవల పథకం వర్తించని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భరోసా లభిస్తుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో కవిటం గ్రామానికి చెందిన పులగం వెంకట సత్యనారాయణరెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం రూ.30 లక్షలు ఖర్చయ్యాయి. ఈ అంశాన్ని ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సీఎం సహాయ నిధి ద్వారా రూ.9.75 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును కొమ్ముచిక్కాలలో ఆదివారం సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో పలువురికి రూ.16.20 లక్షల విలువైన సహాయ నిధి చెక్కులను పితాని అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు గుబ్బల అప్పన్నస్వామి, గుడిమెట్ల నరేంద్రరెడ్డి, బూరాబత్తుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేయండి

ఉండిలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి, న్యూస్‌టుడే: సొంత స్థలం ఉండి పక్కా గృహాలు మంజూరు చేయాలని ముందుకొచ్చే వారిని గుర్తించి ఆ వివరాలు పారదర్శకంగా సర్వే యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఉండి పెదపేటలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా సర్వే ఉండాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ పెన్మెత్స శివరామరాజు, ఏఈ గౌస్‌భాష, తహశీల్దార్ కె.నాగార్జున, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరాజు ఉన్నారు.

ఈ వంతెనపై జాగ్రత్త!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలంలో మల్లవరం-మల్లవరం పెదలంక గ్రామాల మధ్య పంట కాలువపై ఉన్న వంతెన శిథిలస్థితికి చేరింది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ఈ వంతెన మీదుగా మల్లవరం, కొప్పర్రు, నవుడూరు గరువు, తిల్లపూడి తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కీలకమైన ఈ వంతెన నిర్వహణను పట్టించుకోకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్ కుమార్ తెలిపారు.

చెరువు గట్టు.. తీసికట్టు!

జిన్నూరు (పోడూరు), న్యూస్‌టుడే: గుమ్మలూరులో దాదాపు 9 ఎకరాల్లో ఉన్న సమగ్ర మంచినీటి పథకం చెరువు గట్టు ఉత్తరం వైపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఆ భాగంలో చెరువు పూడిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఈ చెరువుకు దక్షిణం వైపు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. మిగిలిన మూడు వైపులా ఎలాంటి రక్షణ లేకపోవడంతో పశువులు గట్టుపై సంచరిస్తున్నాయి. తూర్పువైపు గట్టు క్రమంగా ఆక్రమణలకు గురవుతోంది. మరోపక్క చెరువులోకి నీరు తోడే సమయంలో గుమ్మలూరు రహదారి బురదగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రివిట్‌మెంట్‌కు కొన్ని చోట్ల దెబ్బతింది. గట్టుకు మరమ్మతులు చేయకుంటే రాబోయే వేసవిలో ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. ఈ చెరువు ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.బుజ్జేశ్వరరావు తెలిపారు.

పట్టు జారితే ముప్పే!

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం- పాలకొల్లు మార్గంలో కొబ్బరి లోడు ట్రాక్టర్ వెనుక భాగంలో కూలీలు ఇలా వేలాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. వాహనం కుదుపులకు గురై వీరు పట్టు కోల్పోతే పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీచ్ మార్గాల్లో విస్తృత తనిఖీలు

సముద్ర తీరంలో పర్యాటకులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెం సౌత్‌లలోని బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది కార్తికమాసంలో కొద్ది రోజులు మాత్రమే బీచ్‌లోకి పర్యాటకులను అనుమతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. పర్యాటకుల రక్షణ నిమిత్తం పోలీసులు నో డ్రింక్ జోన్ అమలు చేశారు. బీచ్‌కు వెళ్లే మార్గాల్లో పోలీసు సిబ్బంది డీఎస్పీ జీ శ్రీవేధఅరవింద ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పర్యాటకులు తీసుకువెళ్తున్న మద్యం సీసాలను ధ్వంసం చేశారు. * బీచ్‌లో పర్యాటకుల రక్షణ నిమిత్తం మొగల్తూరు ఎస్సై జి.వాసు, మెరైన్ ఎస్సై సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది సిబ్బందిని నియమించారు. కనకదుర్గాబీచ్ వైపు పర్యాటకులు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కాపలా కాశారు.



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

క్రీడలతో ఆరోగ్యం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఏదో విధంగా ఒత్తిడికి గురవుతున్నారని, శారీరక వ్యాయామం వల్ల దాన్ని అధిగమించొచ్చని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భీమవరం మండలం చినఅమిరం యూత్ క్లబ్ ఆవరణలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీని ఆయన ఆదివారం రాత్రి లాంఛనంగా ప్రారంభించారు. పోటీలు రెండ్రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మరాజు, చిలుకూరి నర్సింహరాజు, సుభాష్ పాల్గొన్నారు.

కలుపుమందు తాగి ఆత్మహత్య

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం శేషమ్మచెరువులో నివాసం ఉంటున్న గుబ్బల నాగ దుర్గా మల్లేశ్వరరావు (29) మనస్తాపంతో ఈ నెల 17న కలుపు నివారణ మందు తాగారు. అతడిని కుటుంబ సభ్యులు విజయవాడలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. మృతుడి స్వగ్రామం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం కాగా రెండేళ్లుగా శేషమ్మచెరువులో నివాసం ఉంటున్నారని స్థానికులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జూద శిబిరంపై దాడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులో గుంటపల్లవపాలెంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపారు. వారి నుంచి నగదుతో పాటు ఆరు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిర్వహణ లేమితో ఇక్కట్లు

పల్లంగా ఉన్న ప్రాంగణం, పేరుకుపోయిన వ్యర్థాలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం ఎల్బీచర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలల విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. 2013 ప్రారంభమైన ఈ పాఠశాలలో 516 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యా ప్రమాణాలతో పాటు ఉత్తీర్ణత శాతం ఆశాజనకంగా ఉన్నా పాఠశాలలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి.

● పాఠశాల ప్రాంగణం పల్లంగా ఉండటంతో వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురవుతోంది. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

● ఈ పాఠశాలలో తాగునీటి సమస్య నివారణకు కలెక్టర్ నాగరాణి మంజూరు చేసిన రూ.9 లక్షలతో బోరు వేయించారు. దీని నుంచి మట్టి, ఇసుక కలిసిన నీరు వస్తోంది. దీంతో రక్షిత మంచి నీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటినే విద్యార్థులు పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపల్ ఎం.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

ధ్యాన సాధనతో ఒత్తిడి దూరం

గోడ పత్రాలు విడుదల చేస్తున్న శిక్షకులు, నిర్వాహకులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ధ్యాన సాధనతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని హైదరాబాద్‌కు చెందిన శిక్షకురాలు వారణాశి పద్మలత అన్నారు. పెనుమంట్రలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాకాహారంతో ఆరోగ్యాన్ని, ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. దాట్ల రాయజగపతిరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 నుంచి విశాఖలో జరిగే ధ్యాన మహా యజ్ఞానికి సాధకులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం దీనికి సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.

రైతన్నా.. మీ కోసం!

నేటి నుంచి వారోత్సవాలు

అన్నదాతలకు అందజేయనున్న సీఎం సందేశ లేఖ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: 'రైతన్నా మీకోసం' వారోత్సవాలతో వివిధ శాఖల ఉద్యోగులు రైతుల వద్దకు రానున్నారు. సోమవారం నుంచి వారం పాటు ఈ కార్యక్రమం జరగనుంది. వ్యవసాయ, అనుబంధ శాఖల యంత్రాంగంతో కూడిన బృందాలు రైతులను వారి ఇళ్ల వద్ద కలుసుకుని మాట్లాడతారు. దీని కోసం జిల్లాలో రైతు సేవా కేంద్రాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు.

★ ప్రతి మూడు కుటుంబాలను ఒక క్లస్టర్‌గా విభజించి, ప్రతి బృందం నిత్యం 30 క్లస్టర్లను (90 గృహాలు) సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, సాంకేతికత, ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ప్రయోజనాలను వివరించడంతో పాటు వినియోగించేలా ప్రోత్సహిస్తారు.

వీరి భాగస్వామంలో.. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎస్‌కే సహాయకుల, పశు సంవర్ధక, మత్స్య సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్, ఎనర్జీ అసిస్టెంట్లు, అభ్యుదయ రైతులు, ప్రాథమిక వ్యవసాయ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధుల, మార్కెట్ కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు.

కార్యాచరణ ఇలా..

● ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఉద్యోగుల బృందాలు రైతుల గృహాలను సందర్శిస్తాయి.

● ఈ సందర్భంగా సీఎం సందేశ లేఖ, కరపత్రం అందజేసి వారి నుంచి సూచనలు, సలహాలు సేకరిస్తారు.

● ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు గృహ సందర్శనలో వచ్చిన ఫిర్యాదులు, సూచనలపై పరిశీలించి నివేదిక తయారు చేస్తారు.

● 3న రైతు సేవా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి రానున్న రబీ, ఖరీఫ్ సీజన్లకు కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తారు.

ప్రైవేటీకరణ ఆపకుంటే ఉద్యమిస్తాం

నిర్మాణ ప్రాంతంలో కమిటీ సభ్యులు

పాలకొల్లు గ్రామీణ, మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకుంటే ఉద్యమిస్తామని ప్రభుత్వ వైద్యకళాశాల పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని ఆ కమిటీ రాష్ట్ర బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. వందకోట్ల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందుతుందని, పేద, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య చేరువ అవుతుందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరాం, కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని కోరారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచనా శక్తి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం పట్ల అభిరుచిని పెంచాలని ఎమ్మెల్సీ గోపీమూర్తి అన్నారు. చినఅమిరం ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం కలిగిస్తే వారిలో ఆలోచన శక్తి పెరుగుతుందని అన్నారు. చెకుముకి సంబరాలు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని డీఈవో నారాయణ అన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

జనాభా: 2,800

ప్రాంతాలు: బొర్రా వారి తోట, బెత్లేహేం పేట, రాజీవ్‌నగర్

18వ వార్డు నివేదన

రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్త

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు 18వ వార్డు పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బెత్లహంపేటలో రహదారి వెంబడి కొందరు నిత్యం చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. ఇవి రహదారిపైకి చేరడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లోనూ చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు పొదలు పెరగడంతో పాములు, విష పురుగుల బెడద ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

☛ రాజీవ్‌నగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం సరిగా లేకపోవడంతో మురుగు నిలిచిపోతోంది. దోమల బెడద అధికంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

☛ కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందని, వీధుల్లో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయని పలు కాలనీల ప్రజలు చెబుతున్నారు.

పరిశీలిస్తాం.. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడేలా సిబ్బందికి సూచనలు ఇస్తాం. ఖాళీస్థలాలను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. **- బి.విజయసారథి, పురపాలక కమిషనర్**

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

నేటి నుంచి 'రైతన్నా మీకోసం'

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం మండలంలోని గ్రామాల్లో ఈ నెల 24 నుంచి డిసెంబరు 2 వరకు 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వై.రామచంద్రరావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి పాడి-పంటపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతుల చరవాణిలో ప్రభుత్వం అందించిన ఏపీఏఐఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తామన్నారు. భూమి వివరాలు, ఈ-క్రాప్ నమోదు, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం, పంట తెగుళ్లు, బీడీపడలు, పంట నష్టం లెక్కింపు, పశుపోషణకు సంబంధిత సమాచారమంతా రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు.

పారదర్శకంగా సర్వే చేయండి

ఉండిలో సర్వే యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి, న్యూస్‌టుడే: సొంత స్థలం ఉండి పక్కా గృహాలు మంజూరు చేయాలని ముందుకొచ్చే వారిని గుర్తించి ఆ వివరాలు పారదర్శకంగా సర్వే యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఉండి పెదపేటలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా సర్వే ఉండాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ పెన్మెత్స శివరామరాజు, ఏఈ గోపి బాబు, తహసీల్దార్ కె.నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరాజు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో వెనుక మురుగునీరు నిండి నీరు నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. **-సందీప్, స్థానికుడు**

✔ మురుగునీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. **-సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? తాడేపల్లిగూడెం కడకట్ల శివాలయ వీధిలో కుక్కల సంచారంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. **-రాజు, స్థానికుడు**

✔ కుక్కల వృద్ధిని అరికట్టేలా చర్యలు చేపట్టి మరిన్ని చర్యలు చేపడతాం. **-ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

చురుగ్గా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 26న నిర్వహించే సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవానికి పట్టణంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు ముస్తాబవుతున్నాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాతూరు, గణేష్‌నగర్‌లో ఉన్న ఆలయాలను శుభ్రంచేసి రంగులు వేసి సర్వం సిద్ధం చేస్తున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

తణుకు, న్యూస్‌టుడే: తణుకు వెంకటేశ్వర థియేటర్ కూడలి వద్ద ఈ నెల 21వ తేదీ రాత్రి కొందరు యువకులు పుట్టినరోజు వేడుక పేరిట హంగామా చేయడం, పట్టణ పోలీసులు వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పట్టణ సీఐ ఎన్.కొండయ్య ఆదివారం సాయంత్రం యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, శాంతి భద్రతలకు భంగం పరిచే వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పుస్తకమే మార్గదర్శి.. భవితకు దిక్సూచి

రేలంగి(ఇరగవరం), న్యూస్‌టుడే: పాఠ్య పుస్తకాలతో పాటు అదనపు విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సర్కారు పాఠశాలలకు ఐదేళ్ల గ్రంథాలయ పుస్తకాలను సరఫరా చేసింది. కథల పుస్తకాలు పిల్లల్లో ఉత్సాహాన్ని పెంపొందించి సృజనకు పదును పెడతాయి. నైతిక విలువలు నేర్పిస్తాయి. పంచతంత్ర కథలు, తెనాలి రామకృష్ణుడు వంటి కథలు, దేశనాయకుల చరిత్రలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. విజ్ఞాన పరమైన పుస్తకాలు చదవడం ద్వారా అదనపు సమాచారాన్ని తెలుసుకోగలుగుతారు. తద్వారా పోటీ పరీక్షల్లో నిర్వహించే వ్యాసరచన, క్విజ్ తదితర పరీక్షల్లో ప్రతిభ కనబరచవచ్చు. ఉద్యోగం సాధించేందుకు దోహదపడుతుంది.

కె.ఇల్లిందలపర్రు ఉన్నత పాఠశాలలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

25 వేల పుస్తకాలు.. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించి కేవలం ఏడు శాఖా గ్రంథాలయాలే ఉన్నాయి. నియోజకవర్గంలో 163 పాఠశాలలకు ఐదేళ్ల 25 వేల పుస్తకాలను ప్రభుత్వం అందించింది. తద్వారా సుమారు 17 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా గ్రంథాలయాలు లేని గ్రామాల్లో విద్యార్థులు వీటిని ఆసక్తిగా చదువుతున్నారు. పుస్తక పఠనం అలవాటైతే మార్గదర్శిగా నడిపిస్తోంది. ఉన్నతికి బాట వేస్తోందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.. గ్రంథాలయ పుస్తకాలు చదవేందుకు ప్రతి పాఠశాలలో వారానికి రెండు పీరియడ్లు కేటాయిస్తున్నాం. పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు, దిన పత్రికలు చదివితే విద్యార్థుల్లో విజ్ఞానం, విషయ పరిజ్ఞానం, భాషపై పట్టు పెరుగుతాయి. - ఎస్.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, ఇరగవరం

పోటీల్లో పాల్గొంటున్నా..

గ్రంథాలయ పుస్తకాలు చదవడం వల్ల పాఠాలు, ఇతర సంస్థలు నిర్వహించే వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నా. భవిష్యత్తులో ఉద్యోగ పరీక్షలకు ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. **-సీహెచ్.రిషి, పదో తరగతి**

కొత్త సమాచారం..

మా గ్రామంలో గ్రంథాలయం లేదు. పాఠశాల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. పుస్తకాలు చదవడం వల్ల కొత్త సమాచారం తెలుస్తోంది. **-జి.రాజేశ్వరీదేవి, 9వ తరగతి**

కథలు బాగుంటాయి..

మరోకటి చదవాలనిపించేలా గ్రంథాలయ పుస్తకాల కథలు ఉంటాయి. దేశ నాయకుల చరిత్ర, సైన్స్ పుస్తకాలు చదివి పాఠశాలలో నిర్వహించే వక్తృత్వం, క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నా. **- ఎ.కార్తీక్, 7వ తరగతి**



తూడు.. రైతుల గోడు

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: కస్పా పెంటపాడులో పంట కాలువలో గుర్రపు డెక్క ఆలముకోవడంతో నీటి పారుదలకు అవరోధంగా మారింది. ఇదే కాలువపై ఆధారపడి రబీ నారుమళ్లకు సన్నద్ధమవగా నీరందే అవకాశం ఉండదు. చెత్త, వ్యర్థాలు అక్కడికే చేరుకుంటున్నాయి. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, నీటిసంఘాలు స్పందించి కాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగించాలని కోరుతున్నారు.

ఇంటింటికీ వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికీ వైద్యం నిర్వహించారు. వైద్యులు హరిసెస్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, ఉండ్రాజవరం, వేలివెన్ను ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సత్యవాడ రెడ్డి అపార్ట్‌మెంట్ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు 998 534 3530, 905 929 0717 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

నల్లమాడు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. నల్లమాడులో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ కార్యాలయానికి ఆదివారం వారు శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ.7 లక్షలు, రాష్ట్రీయ స్వరాజ్ అభియాన్ పథకం(ఆర్జీఎస్ఏ) కింద రూ.25 లక్షలు మొత్తం కలిపి రూ. 32 లక్షలతో పంచాయతీ భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యాలయానికి స్థలం విరాళమిచ్చిన పాతూరి వెంకట నారాయణస్వామిని సత్కరించారు. సర్పంచి గొత్తు రాము, తెదేపా, జనసేన మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్, పి.రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థల దాతను సత్కరిస్తున్న పత్సమట్ల, గన్ని

రోగాల భయం.. ఎలా అభయం

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో పలు ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి విషపురుగులు, దోమలు, పాములకు నిలయంగా మారాయి. రోగాలకు కారణమవుతున్నాయి. యాగర్లపల్లి, బాగ్యలక్ష్మిపేట, నరసింహారావుపేట తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి కంటే రోడ్లు ఎత్తుగా ఉండటంతో వర్షం కురిసినప్పుడు నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతోంది. స్థల యజమానులు వాటిని మెరక చేయకపోవడం, మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీస్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుంత.. ప్రయాణానికి చింత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక గణేష్ నగర్‌లో ఉన్న గెయిల్ కమ్యూనిటీ హాలుకు ఎదురుగా ఉన్న రోడ్డుపై గతంలో కురిసిన వర్షాల కారణంగా గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి సమయాల్లో ఆటుగా రాకపోకలు సాగించే వాహనదారులు గోతులను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయానికి వెళ్లే ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గోతులను వెంటనే పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలోని యూనియన్ బ్యాంక్ సజ్జాపురం శాఖ సమీపంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఫ్యూజ్ పెట్టె తుప్పు పట్టి పాడైంది. స్థానికంగా పలు బ్యాంకులు, బహుళ అంతస్థుల భవనాలు, ప్రైవేటు విద్యా సంస్థలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏఈ వెంకటేశ్వరరావు స్పందిస్తూ వెంటనే నూతన ఫ్యూజ్ పెట్టె ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

కుంగిన దారి.. అవస్థలుగా మారి

తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రు నుంచి మండపాక వెళ్లే దారి పలుచోట్ల కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వేసిన ఈ రోడ్డు కొద్దిరోజుల్లోనే కుంగిపోయింది. దీనికి ఒక పక్క కాలువ ఉండటంతో సుమారు అడుగు మేర కుంగిపోయి ప్రమాదపుటంచున రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా గాయాలపాలవుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ యశ్వంత్ తెలిపారు.

విరిగితే అంతే

అత్తిలి (గ్రామీణం), న్యూస్‌టుడే: అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురంలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం వద్ద విద్యుత్తు స్తంభం విరిగి ప్రమాదకరంగా ఉంది. గాలులు వీచిన సమయంలో విద్యుత్తు స్తంభం విరిగినా, తీగలు తెగినా ప్రమాదం సంభవిస్తుందని ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కలు.. పిక్కలు పట్టేస్తున్నాయ్

తణుకు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో వీధి కుక్కల సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతీ వీధిలో గుంపులు గుంపులుగా ఉంటూ పాదచారులు, వాహనదారులపైకి విరుచుకుపడుతున్నాయి. ఒంటరిగా బయటకు వచ్చేందుకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోజూ ఏదొక ప్రాంతంలో కుక్క కాటు బారిన పడుతున్నారంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివచ్చే విద్యార్థులు, ఉద్యోగాలు చేసేవారు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి దుస్థితి. వీధి కుక్కలనుంచి రక్షించాలంటూ పట్టణ, గ్రామాల అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కానీ అధికారుల్లో మాత్రం చలనం ఉండటంలేదు.

శస్త్ర చికిత్సలు శూన్యం.. వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి వాటి సంతానోత్పత్తిని తగ్గించాల్సి బాధ్యత ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఉంది. కానీ ఆ దిశగా అధికారులు చొరవ చూపడంలేదు. ఇటీవల పట్టణంలో అడపా దడపా కొన్ని చేస్తున్నా.. గ్రామాల్లో అయితే అటువంటి చర్యలే లేవు. దీంతో వీధికుక్కల సంఖ్య పెరిగి కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలపై దాడి చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేదీ పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఇదీ పరిస్థితి.. తణుకు నియోజకవర్గంలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 3,435 మంది వీధి కుక్కల బారిన పడ్డారు. పట్టణంలోని జిల్లా ఆసుప్రతిలో 2,244, వేల్పూరు పీహెచ్‌సీలో 201, ఇరగవరం 279, రేలంగి 174, అత్తిలి 326, మంచిలి 228 మంది వీధికుక్కల కాటుకు గురయ్యారు. ఈ నెల ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో సుమారు 180 వరకు బాధితులు ఉన్నారంటే పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

మలుపు.. ప్రమాద పిలుపు

గణపవరం మండలం వరదరాజపురం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే మార్గం మధ్యలోని వెలగపల్లి మలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. సీసీ రోడ్డు అంచున గుంత ఏర్పడి.. పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు గొయ్యి గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

- న్యూస్‌టుడే, గణపవరం

రహదారిపై ధాన్యం ఆరపోస్తున్న రైతులు

వాయుగండం!

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

భీమడోలు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గంలోని అన్నదాతలను వాయుగుండం హెచ్చరికలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ మాసూళ్లు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాల్లో నూర్పిళ్లు, ధాన్యం పట్టుబడులతో రైతులు తలమునకలై ఉన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, వాయుగుండంగా బలపడుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో.. హడావుడిగా మాసూళ్లు, ఆరబోతలు చేస్తున్నారు. చేతికొచ్చిన పంట చివరి నిమిషంలో నేలపాలు కాకూడదన్న ఉద్దేశంతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

వారం ఆగితే చాలు.. వర్షాలు వారం రోజులు ఆగితే చాలని.. తాము పూర్తి స్థాయిలో గట్టెక్కేస్తామని అన్నదాతలు చెబుతున్నారు. ఖరీఫ్‌లో భీమడోలు మండల వ్యాప్తంగా 12,800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయి. 6 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం తేమ 17శాతం లోపు ఉండాలన్న ప్రభుత్వ నిబంధనతో.. పంట మాసూళ్లు చేస్తున్న రైతులు రహదారులపై ధాన్యం రాశులను ఆరపెట్టుకుంటున్నారు. గ్రామాల్లోని రహదారులు ఆరపోసిన ధాన్యం రాశులతో నిండిపోతున్నాయి.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

తణుకు, న్యూస్‌టుడే: తణుకు సెక్టార్‌లోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టి స్థానిక సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్ల ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు. లక్ష్మీసుందరీబాయ్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎ. దీప్తి, సీహెచ్.రాజు, కె.సోమేశ్వరరావు, కె. పాపారావు, ఐ.హర్ష, వందమంది ఆర్మీ, నేవీ, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న గణపతి

● స్థానిక ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ అధికారి వి.గణపతి ఆధ్వర్యంలో కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2025 రన్ ఫర్ యూనిటీ నినాదంతో క్యాడెట్లు కళాశాల నుంచి నరేంద్ర కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని శశి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమ శిక్షణ, దేహ దారుఢ్యంతో పాటు బుద్ధి కుశలత అలవడతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనిక అధికారులు వినోద్, కేఆర్ పతి, సుమారు 200 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

అపర భగీరథుడు సత్యసాయిబాబా

తణుకు, ఉద్యాన విశ్వవిద్యాలయం, అత్తిలి గ్రామీణం, ఇరగవరం, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి ధర్మాలను ఆచరించి ప్రపంచ వ్యాప్తంగా భగవత్ స్వరూపుడిగా పూజింపబడుతున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. ఆదివారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకొని తణుకులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిబాబా మానవసేవే మాధవసేవగా భావించి దేశంలో ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనేక విద్యా సంస్థలు స్థాపించి ఎంతో మందిని ఉన్నత స్థానాలకు ఎదిగేలా సేవలందించారన్నారు. అనేక గ్రామాల ప్రజలకు తాగునీరు అందించిన అపర భగీరథుడు సత్యసాయిబాబా అని ఆయన పేర్కొన్నారు. ● వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విస్తరణ సంచాలకుడు బి.గోవిందరాజులు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సూర్యకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సత్యసాయి మందిరంలో దీపాలంకరణ

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ

● సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, అత్తిలి మండల ప్రత్యేకాధికారి కోటిలింగరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో శామ్యూల్, తెదేపా సీనియర్ నాయకుడు ఆనాల ఆదినారాయణ పాల్గొన్నారు. ● ఇరగవరం మండల పరిషత్తు కార్యాలయంలో బాబా చిత్రపటానికి ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. రేలంగిలో సత్యసాయిబాబా మందిరం వద్ద భజనలు చేశారు. గవర్లపాలెంలో అన్నసమారాధన చేశారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్ చెరువు వద్ద సాయిమందిరంలో ఉదయం తొమ్మిది నుంచి సుమారు రెండు వందల మంది మహిళలు సామూహిక సత్యసాయి వ్రతాలు చేశారు. మధ్యాహ్నం మహానారాయణసేవ కార్యక్రమంలో భాగంగా భారీ అన్నసమారాధన చేశారు. రాత్రి వేదపఠనం, నామ సంకీర్తన, జ్యోతుల ప్రజ్వలన, ఊంజల్‌సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సాయి వాలంటీర్లు సేవలందించారు.

26న దేశవ్యాప్త నిరసనకు తరలిరండి

తణుకు, న్యూస్‌టుడే: కార్మిక కోడ్‌లు రద్దు చేయకపోతే తగిన గుణపాఠం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లను నోటిఫై చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక వాన్‌బరి పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి గెజిట్ పత్రాలను దగ్ధం చేశారు. దేశ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగారావు, వెంకటేశ్వరరావు, గోపి, గోవింద రాజు పాల్గొన్నారు.

పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

శేషమహల్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు దాన వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శేషమహల్ సెంటరులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు దాన వరప్రసాద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కార్మికవర్గం ఎన్ని పోరాటాలు చేసినప్పటికీ స్పందించలేదన్నారు. నాలుగు కొత్త కోడ్‌ల రూపంలో ప్రభుత్వం చేస్తున్న ఈ దాడిని కార్మిక వర్గం తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో విజయ్ కొండ, సయ్యద్ భాష, నాగేశ్వరరావు, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలు పక్కన పెట్టి.. ఆశీలు వసూలు చేసి..

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలో ఆశీలు పేరుతో వ్యాపారుల నుంచి ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్నారు. తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ ఏడాది రూ. 45 లక్షలకు పాటదారుడు ఆశీలు పాటను దక్కించుకున్నారు. గెజిట్ నిబంధనలు ఉల్లంఘించి క్షేత్ర స్థాయిలో వ్యాపారుల నుంచి అధికంగా పన్ను వసూలు చేస్తున్నారు. యూనియన్‌లో ఉన్న వ్యాపారికి ఒక విధంగా.. లేనివారి నుంచి మరో విధంగా వసూలు చేస్తున్నారు.

పన్నులు ఇలా..

గెజిట్‌లో సైకిల్, మోటారు సైకిల్, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారి నుంచి రోజు వారి పన్ను రూ.10, రహదారిని ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్న దుస్తులు, రగ్గులు, చెప్పులు, ఇతర దుకాణాల నుంచి రూ.30 చొప్పున వసూలు చేయాలి. అదేవిధంగా కొబ్బరి బొండాల దుకాణానికి రూ.10, ఎండి, పచ్చి చేపల బుట్టకు రూ.10 చొప్పున వసూలు చేయాలి. మున్సిపల్ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే చదరపు మీటరుకు కొంత చొప్పున వసూలు చేయాల్సి ఉండగా తణుకు పట్టణంలో ఆ విధానం లేదు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. గుత్తేదారుడికి మాత్రం కాసులు కురిపిస్తోంది. మంగళవారం మార్కెట్‌లో ఉన్న వ్యాపారుల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొత్తగా వచ్చి ఇక్కడ విక్రయాలు చేసుకునే వారి నుంచి అధికంగా పన్నులు వసూలు చేస్తున్నారు.

రూ. 30 చెల్లిస్తున్నా.. నేను సైకిల్‌పై కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నా. నా వద్ద రోజువారీ పన్ను రూ.30 వసూలు చేస్తున్నారు. **-పెచ్చేటి శ్రీను, కొబ్బరి బొండాల వ్యాపారి, తణుకు**

క్రీడలతో ఆరోగ్యం

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఏదో విధంగా ఒత్తిడికి గురవుతున్నారని, శారీరక వ్యాయామం వల్ల దాన్ని అధిగమించొచ్చని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భీమవరం మండలం చినఅమిరం యూత్ క్లబ్ ఆవరణలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీని ఆయన ఆదివారం రాత్రి లాంఛనంగా ప్రారంభించారు. పోటీలు రెండ్రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మరాజు, చిలుకూరి నర్సింహరాజు, పేరిచర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

శ్రద్ధాంజలి

మంచిమనిషి, స్నేహశీలి, మా అందరి ఆత్మీయ శ్రేయోభిలాషులు శ్రీ చుండూరి వెంకట సుబ్బారావు గారి ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ చుండూరి వెంకట సుబ్బారావు గారు, కోరుమిల్లి

గారపాటి ఉదయభాస్కరరావు, సర్పంచ్, కోరుమిల్లి | గారపాటి శ్రీనివాసరావు
గారపాటి శ్రీహరి | గారపాటి హరిదుర్గా (ప్రభాకరరావు)
పిచికల వెంకటేశ్వరరావు | వల్లూరి సాయిరమేష్
చుండూరి సత్యనారాయణరావు | చుండూరి గాంధీ
వుండవల్లి నాగ వీర వెంకట సత్యనారాయణ | గన్నెన వెంకట రాంబాబు
వల్లూరి బుద సత్యనాగప్రసాద్ | వల్లూరి నరసింహారావు
వల్లూరి మురళీకృష్ణ | కోరుమిల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది

(c) eenadu

దయామయి.. ప్రేమ సాయి

సత్య సాయిబాబా చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అందరినీ ప్రేమించాలి... అందరికీ సేవ చేయాలంటూ సత్య సాయిబాబా చేసిన ప్రేరణ ఎంతో మందికి మార్గదర్శకమని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను కడప కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సాయిబాబా చిత్రపటానికి జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలిసి అంజలి ఘటించారు. అనంతరం సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. సాయిబాబా ప్రవచించిన ఆధ్యాత్మికత, నిస్వార్థ సేవ, వ్యక్తిగత పరివర్తనను అందరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెంకటపతి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పర్యాటక శాఖాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పడతుల బోనభాగ్యాలు

చక్రాయపేట, న్యూస్‌టుడే: బోనాల పండగను చక్రాయపేట మండలం చిలేకాంపల్లె పంచాయతీ సీతారాంపల్లెలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటును పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత గంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి.

ఆటోలో విద్యార్థులు.. గాలిలో ప్రాణాలు

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఆటోలో వేలాడుతూ ప్రయాణిస్తున్న వీరంతా పాఠశాల విద్యార్థులు. ఖాజీపేటలో ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు రేపటి పౌరులకు నిత్యకృత్యంగా మారాయి. తలుపులు లేకుండా వెనుక భాగంలో నిల్చోబెట్టి రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు ఆటో డ్రైవర్లు చిన్నారులను అధిక సంఖ్యలో ప్రమాదకరంగా ఇలా తరలిస్తున్నారు. ఈ తీరుపై పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వెంటాడుతున్న యంత్రుడు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప నగరంలో డ్రోన్ కెమెరాతో పోలీసులు నిఘా సాగిస్తున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒకటో పట్టణ సీఐ చిన్న పెద్దయ్య తమ సిబ్బందితో కలిసి గంజాయి, మత్తు పదార్థాలు తాగే వారిపై ఆదివారం నిఘా ఉంచారు. బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లోని గుర్రాలగడ్డ, పాత బస్టాండ్, నాగరాజుపేట, రాజా థియేటర్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో తనిఖీలు సాగించారు. పాత బస్టాండ్ వంతెన కింద కొందరు గంజాయి తాగుతున్న నేపథ్యంలో అక్కడ తనిఖీలు చేశారు.

తిన్నోళ్లకే మళ్లీ పెద్దిపీట



ఇసుకలో చేతులు కలిపిన నేతలు

జేబులు నింపుకొంటున్న అక్రమార్కులు

ఈనాడు, కడప: సమృద్ధిగా కురిసిన వర్షాలతో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. దీంతో ఇసుక కొరత ఏర్పడి డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రేవుల్లో ఇష్టారీతిన తవ్వకాలు సాగిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, తిరుపతి నగరాలకు నిత్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఐదుమాసాలుగా గత ప్రభుత్వ హయాంలో మెక్కిందంతా 'పెద్ద' పాత్ర పోషించిన నేతతో అధికార పార్టీలో కొందరు చేతులు కలిపారు. కాసుల కక్కుర్తితో ఇదేం తీరు 'రామచంద్రా' అనేలా వ్యవహరిస్తున్నారు.

ముగిసినా.. అదే గలీజు

వర్షాకాలానికి రేవుల్లో ఇసుక తవ్వకాల లీజు గడువు గత నెలాఖరుతో ముగిసింది. దీంతో తవ్వకాలు ఆగిపోకుండా యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుక తరలింపు పేరుతో ఈ నెలాఖరు వరకు అనుమతి తీసుకున్నారు. ఈ ముసుగులో రేవుల్లోనే తవ్వకాలు చేపట్టి నేరుగా తరలించుకుపోతున్నారు. పెనగలూరు మండలం కోమంతరాజుపురం, నారాయణనెల్లూరు రేవుల్లో యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. వైకాపా, తెదేపా నేతలు కొందరు కలిసి ఈ దందా సాగిస్తున్నారు. పరిమితికి మించి టిప్పర్లలో ఇసుక రవాణా చేస్తుండటం, ఆపై కురుస్తున్న వర్షంతో రహదారులు ఇప్పటికే ధ్వంసమైపోయాయి. పెనగలూరు నుంచి కడప- రేణిగుంట జాతీయ రహదారి వరకు, ఆపై జాతీయ రహదారి దెబ్బతింది.

ఇసుక టిప్పర్ల రాకపోకలతో ధ్వంసమైన రహదారి

అక్రమార్జన రోజుకు రూ. లక్షలు

నారాయణనెల్లూరు(పెనగలూరు మండలం), కోమంతరాజుపురం(పెనగలూరు మండలం) రేవుల్లో ఇష్టారీతిన తవ్వకాలు సాగుతున్నాయి. టిప్పర్లలో చెన్నై, బెంగళూరుకు తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. తిరుపతికి అయితే రూ. 40 వేలు డిమాండ్ చేస్తున్నారు. నిత్యం 150 నుంచి 200 టిప్పర్లలో అక్రమ రవాణా చేస్తూ రోజుకు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై గనుల శాఖ ఏడీ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. రేవుల లీజు గడువు గత నెలాఖరుతో ముగిసిందన్నారు. యార్డుల్లో ఉన్న ఇసుక కోసం ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. రేవుల్లో తవ్వకాలకు అనుమతి లేదని, తవ్వుతుంటే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముంచెత్తిన వాన

వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తున్న ప్రొద్దుటూరులోని గోకుల్ నగర్ ప్రధాన వీధి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వాయుగుండం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం జోరు వర్షం కురిసింది. కడప నగరంతో పాటు పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. ఒంటిమిట్టలో అత్యధికంగా 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చెన్నూరు(58.4), ఖాజీపేట(52.4), కమలాపురం(33.6), వల్లూరు (29.4), సిద్దవటం(36.6), కడప(32.4), పెండ్లిమర్రి(18.4), మైదుకూరు(26.6), అట్లూరు (45.8), దువ్వూరు(15.2), ప్రొద్దుటూరు(19.8), ఎర్రగుంట్ల (34.8), వేంపల్లె (26.8)లో మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

పెన్నాలో ఇద్దరు యువకుల గల్లంతు

గల్లంతైన నరేష్, రోహిత్ (పాత చిత్రం)

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రీల్స్ మోజులో ఇద్దరు యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. వీడియో తీసుకునే క్రమంలో ఇద్దరు గల్లంతవ్వగా.. ఒకరు బయటపడ్డారు. ఈ సంఘటన కడప నగర పరిధిలోని వాటర్‌గండి సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కడప రామాంజనేయపురం దండోర కాలనీకి చెందిన కె. నరేష్(18), అశోక్‌నగర్‌కు చెందిన పి. రోహిత్‌కుమార్(16) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి వాటర్ గండి సమీపంలోని పెన్నా నది వద్దకు వెళ్లారు. నరేష్, రోహిత్‌కుమార్‌లు రీల్స్ కోసం ఉద్ధృతంగా పారుతున్న నీటిలోకి వెళ్లి సుడిగుండాల్లో చిక్కుకుని గల్లంతయ్యారు. వీడియో తీస్తున్న అరుణ్ రక్షించేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అంజి అనే వ్యక్తి విషయాన్ని గుర్తించి అతన్ని రక్షించారు. సమాచారం అందుకున్న చిన్నచౌకు సీఐ ఓబులేసు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

కిడ్నీ కంత్రీపై వేటు

జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ సస్పెన్షన్

ఆంజనేయులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె నేరవార్తలు: మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ తీవ్ర కలకలం సృష్టించింది. మూత్రపిండ మార్పిడి కేసులో జిల్లా ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కాంపా ఆంజనేయులు అరెస్టు కావడం కలకలం రేపింది. ఈ ఉదంతంపై స్పందించిన ప్రభుత్వం అతనిపై సస్పెన్షన్ వేటేసింది. అతని కుమారుడు, కోడలి పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం తెలిపారు.

నోట్ల కట్టలతో నోరు నొక్కేసే యత్నాలు: గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ పేరుతో ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ కుటుంబ సభ్యులు ఈ ఏడాది జనవరిలో మదనపల్లెలో ఆసుపత్రి నెలకొల్పారు. ఇందులో ఆంజనేయులుతో పాటు అతని కుమారుడు అవినాష్, కోడలు శశ్వితి వైద్యులుగా పని చేస్తున్నారు. ఈ నెల 9న హారిక అనే మహిళ నుంచి మూత్రపిండాన్ని తీసి మరొకరికి మార్పిడి చేశారు. ఈ వ్యవహారంలో రూ. 25 లక్షల ఒప్పందం కుదిరినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం విశాఖపట్నంకు చెందిన యమునకు శస్త్ర చికిత్స చేసి మూత్రపిండం తీయగా.. తీవ్ర నొప్పి, బాధ, రక్తస్రావంతో ఐసీయూలోనే ఆమె మరణించింది. ఈ విషయం బయటికి పొక్కకుండా రూ. 6 లక్షలకు ప్రలోభ పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

● **పరారీలోనే కీలక నిందితుడు:** యమున మృతదేహాన్ని ఆసుపత్రిలోనే వదిలేసి కేసులో ఏ1గా ఉన్న ఆంజనేయులు, ఏ6 సూరిబాబు, ఏ7 సూరి తిరుపతికి పారిపోయారు. ఇదే కేసులో ఏ1 ఆంజనేయులుతో పాటు ఏ3 బాలరంగడు, ఏ4 షేక్ జండమ్మన్ మెహరాజ్, ఏ5 పిల్లి పద్మ, ఏ6 కాకర సత్య, ఏ7 సూరిబాబు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసులో కీలక వ్యక్తి ఏ2గా ఉన్న పార్థసారథిరెడ్డి పరారీలో ఉన్నారు. ఇతన్ని పట్టుకునే పక్షంలో కేసులో మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆంజనేయులు వ్యవహారంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు పోలీసులు వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఇన్‌ఛార్జి డీసీహెచ్‌ఎస్ వ్యవహారంలో ప్రాథమిక విచారణలో వాస్తవాలు వెలుగుచూడటం, ఆపై అధికారి 48 గంటలకు పైగా రిమాండ్‌లో ఉండటంతో సర్వీసు రూల్స్ ప్రకారం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ దందాపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం జిల్లాలో సంచలనం కలిగించింది. ఆసుపత్రి నెలకొల్పిన దగ్గర నుంచి అక్రమంగా మూత్రపిండ మార్పిడి పలు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. యమున మృతితో వ్యవహారమంతా బట్టబయలైంది.

ముందే గుర్తిస్తే.. ముప్పు తప్పినట్లే!

◆ కుష్ఠు లక్షణాలపై ఎల్‌సీడీసీ సర్వే

సర్వే చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: జిల్లాలో గత మూడేళ్లుగా ఏటా వంద మందికి పైగా కుష్ఠు బాధితులను అధికారికంగా గుర్తిస్తున్నారు. ఈ లక్షణాలను ముందే గుర్తిస్తే చికిత్సతో చాలా వరకు ముప్పు తప్పుతుంది. అందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 17 నుంచి 30 వరకు ఇంటింటి సర్వే తలపెట్టాయి. ఇందులో భాగంగా వైద్యాధికారులు, సిబ్బంది జిల్లావ్యాప్తంగా పల్లె, పట్టణాల్లో సమాచారాన్ని విస్తృతంగా సేకరిస్తున్నారు.

● జిల్లాలో 5,33,825 కుటుంబాలుండగా.. అందులో 21,76,331 మంది సభ్యులున్నారు.

● ఎల్‌సీడీసీ సర్వే చేపట్టడానికి 1,545 బృందాలను అధికారులు నియమించారు.

● ప్రతి బృందంలో ఆశా కార్యకర్తతో పాటు ఓ సామాజిక కార్యకర్త ఉంటారు.

● ప్రతిరోజూ 25-30 ఇళ్లకెళ్లి సమాచారాన్ని నమోదు చేయాలి. కుష్ఠు లక్షణాలున్నదీ లేనదీ ఆరా తీయాలి.

● జిల్లాలో ఇప్పటికే ఆరు లక్షల మందికి సంబంధించిన వివరాలు సేకరించారు.

● 'కుష్ఠు లక్షణాలుంటే బాధితులు వైద్యాధికారులు, సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలి. ఎల్‌సీడీసీ సర్వేకి ప్రజలు సహకారం అందించాలి. ఇప్పటికే 29 శాతం పూర్తయింది' అని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. రవిబాబు తెలిపారు.

జిల్లాలో నమోదైన కుష్ఠు బాధిత కేసులు					
సంవత్సరం	2021-22	2022-23	2023-24	2024-25	2025-26
కేసులు	90	114	149	115	29 (ఇప్పటి వరకు)

సేవలు అందిస్తున్నారా గురూ!

కలికిరి, న్యూస్‌టుడే: బంకుల్లో పెట్రోల్ కొట్టించుకునే వారిలో చాలా మందికి అక్కడ నిర్వాహకులు కల్పించాల్సిన సౌకర్యాలపై అవగాహన ఉండదు. ఇదే ఆసరాగా కొందరు కల్పించరు. మరికొందరు అడిగినా పట్టించుకోరు. ఈ విషయాలపై ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక. ఏం చేయలేక చాలా మంది మదనపడుతుంటారు.



● అత్యవసర సమయం, లేదా ప్రమాదాలు సంభవించినపుడు బంధువులు, అవసరమైన వ్యక్తులకు ఫోన్ చేసుకునేందుకు బంకుల్లో ఫోన్ సదుపాయం ఉండాలి.

● వినియోగదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలి. చాలా చోట్ల ఉదయం ఒక డబ్బా ఉంచి అయిపోయాక మళ్లీ పెట్టకుండా వదిలేస్తున్నారు. పెట్రోల్ బంకు పనిచేస్తున్నంత సేపు తాగునీరు అందుబాటులో ఉంచాలి.

● వినియోగదారులు ఉచితంగా వినియోగించుకునేలా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

● **ఇలా తెలపొచ్చు:** ఉమ్మడి జిల్లాలోని 70 శాతం పైగా బంకుల్లో నిబంధనల అమలు ఊసేలేదు. ఇబ్బందులను జీవీ పోర్టల్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో లేదా మండల, జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి, సదరు ఏజెన్సీకైనా తెలపొచ్చు.

● ఇంధనం నింపే వేళ లేదా ఇతర సమయాల్లో మంటలు చెలరేగితే అదుపునకు అగ్నిమాపక పరికరాలు ఉండాలి. నిర్వాహకులు, ఏజెన్సీ వివరాలు, ఫోన్ నంబర్లు ప్రదర్శించాలి.

● బంకుల్లో ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం ఉండాలి. ఉచితంగా గాలి నింపాలి. ప్రత్యేకంగా ఓ ఉద్యోగి ఉండాలి. ఇంధనం పోయించుకున్న వారికే గాలి పెడతారనే అపోహ ఉంది. ఏ వాహనానికైనా నింపాల్సిందే.

● ప్రమాదాలు, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో బంకుల్లో తప్పనిసరిగా ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి.

ఆమెకు అండ

◆ లింగ వివక్ష చూపితే చర్యలు

◆ అబలకు తోడుగా.. జీఆర్సీ కేంద్రాలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: అతివలు నేటికీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. అతివలకు అండగా నిలిచేందుకు మండల కేంద్రాల్లో జెండర్ రిసోర్స్ సెంటర్లు(జీఆర్సీ) పేరున వసతి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఎర్రగుంట్ల, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండల కేంద్రాల్లో ప్రారంభించగా.. బద్వేలులో ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. వీటితోపాటు మైదుకూరు, రాజుపాళెం, చాపాడు, వేముల మండలాల్లో నెలకొల్పేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

● **ఆదరిస్తారు.. పరిష్కరిస్తారు:** లింగ వివక్షకు గురైన బాధిత మహిళలను కేంద్రాలకు తీసుకొచ్చి అవగాన కల్పిస్తారు. కొన్ని రోజులు వసతి కల్పిస్తారు. తిరిగి సమస్య సర్దుబాటయ్యాక తిరిగి ఇంటికి చేరుస్తున్నారు.

కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న పీడీ రాజ్యలక్ష్మి

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

ప్రతి సంఘంలో ఒకరు జీపీసీ(జెండర్ పాయింట్ పర్సన్) ఉంటారు. గ్రామ సమాఖ్య స్థాయిలో ముగ్గురిని సోషల్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీ జెండర్ ఫోరం ఉంటుంది. సర్పంచి మహిళ అయితే ఛైర్మన్‌గా ఉంటారు. లేనిచోట పంచాయతీ పాలకవర్గంలో ఉండే మహిళకు ఆ బాధ్యత అప్పగిస్తారు. కమిటీలో ఏఎన్ఎం, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్త ఉంటారు. మండల, జిల్లా స్థాయిల్లోనూ కమిటీలుంటాయి. ఈ విషయమై డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహిళల పట్ల ఎవరూ వివక్ష చూపకూడదని ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా జెండర్ రిసోర్స్ సెంటర్ల గురించి వివరిస్తున్నామని తెలిపారు. మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్నదాత చెంతకు అధికారులు

నేటి నుంచి రైతన్నా మీ కోసం

భైరవగుట్ట సభకు హాజరైన రైతులు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెండ్లిమర్రి మండలంలో ఇటీవల పర్యటించారు. భైరవగుట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నగదు జమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'రైతన్నా.. మీ కోసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా అన్నదాత గడప తొక్కి వారి బాగోగులు, బాధలు తెలుసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. అనంతరం సమస్యలు పరిష్కరిస్తూ వ్యవసాయంలో నూతన ఒరవడి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయనుంది.

సాగు విస్తీర్ణం: దాదాపు ఆరు లక్షల ఎకరాలు (జిల్లా వ్యాప్తంగా రెండు కాలాల్లోనూ కలిపి)
రైతు కుటుంబాలు సుమారు 2.10 లక్షలు
అన్నదాత సుఖీభవ లబ్ధి పొందినవి 1,94,047
రైతుల ఖాతాల్లో నగదు జమ రూ. 131.37 కోట్లు

ఏకతాటి పైకి శాఖలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నుంచి అమలు చేయనున్నారు. అందులో భాగంగా వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య, మార్కెటింగ్, సహకార, నీటిపారుదల శాఖ, సిరికల్చర్ అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏకతాటి పైకి వచ్చినట్లైంది.

ఇవీ సేకరించే వివరాలు

రైతు ఇంటికి వెళ్లే అధికారులు ఎంత భూమి ఉంది.. సాగు విస్తీర్ణమెంత.. ఏ పంటలు సాగు చేస్తున్నారు.. పంటల్లో వచ్చే ఆదాయం.. చేస్తున్న వ్యయం.. జీవన పరిస్థితి, సాగు నీటి సమస్య, కాలువలా, చెరువులా! ప్రాజెక్టుల ఆధారమా! అనే వివరాలు తెలుసుకుంటారు. సదరు రైతు కుటుంబ సభ్యులు ఏం చేస్తున్నదీ తెలుసుకుంటారు. వివరాలను 'ఏపీ- ఏఐఎంఎస్' యాప్‌లో నమోదు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 మండలాల పరిధిలోని 342 రైతు సేవా కేంద్రాల్లోని గ్రామాల్లో అమలు చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పకడ్బందీగా అమలు

రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారంపాటు అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లాలని సూచించారు. అన్నదాతల సంక్షేమం కోసం సాగు విధానంలో తేవాల్సిన మార్పులు, సీఎం చంద్రబాబు ప్రకటించిన పంచ సూత్రాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఆ ఊళ్లు.. దేశ రక్షణకు పెట్టని కోటలు

ఎగువరామాపురం గ్రామ ముఖచిత్రం

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడు మండలంలోని ఎగువరామాపురం, ఎగువతంబళ్లపల్లె గ్రామాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ రెండు గ్రామాలు దేశ రక్షణకు పెట్టని కోటలుగా ఉంటున్నాయి. ఆయా ఊళ్లకు చెందిన 350 మందికి పైగా సైన్యంలో చేరి సేవలందిస్తుండటం ఇందుకు కారణం. ఇరవై అయిదేళ్ల క్రితం ఇక్కడ పంటలు పండక గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. ఆ సమయంలో రెండు గ్రామాల్లో ఒక్కో ఇంట్లో ఒకరిద్దరు చొప్పున సైన్యంలో చేరేందుకు కఠోరంగా శ్రమించి ఫలితం సాధించారు. నాటి నుంచి నేటి వరకు ఇదో ఆనవాయితీగా వస్తోంది. వందల సంఖ్యలో గ్రామస్థులు సైనికులుగా ఎంపికై సేవలందిస్తున్నారు. ఎగువరామాపురానికి చెందిన సుబేదారు షేక్ దస్తగిరి, బ్లాక్ కమెండో బండి ప్రతాపరెడ్డి 2008లో ముంబాయిలో చేపట్టిన ఉగ్రవాదుల ఏరివేతలో పాల్గొని పలువురిని రక్షించి గుర్తింపు పొందారు. మరికొందరు కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. దేశ రక్షణకు తమవంతు సేవలు అందించడం ఆనందంగా ఉంటుందని సైనికోద్యోగులు చెబుతుంటారు.

ఆంధ్రా భద్రాద్రిలో బెట్టింగ్ బంగార్రాజులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట, శివారు గ్రామాల్లో కొందరు బెట్టింగ్ బంగార్రాజులు పాగా వేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న కొందరు నిరుద్యోగ యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల బాట పట్టారు. లాభాలంటూ బంధువులు, మిత్రులు, ఇరుగుపొరుగు వారిపై ఆశల వల విసురుతున్నారు. కావాలంటే తామే పెట్టుబడి సర్దుబాటు చేస్తామని.. బ్యాంకుల్లో అదనపు ఖాతాలు తెరవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఈ తీరుతో పలువురు ఇప్పుడు కలత చెందుతున్నారు.

● **ఆశల వల విసురుతున్నారు:** సాలాబాదు పంచాయతీలోని ఓ పల్లెకు చెందిన యువకులు మండల కేంద్రమైన ఒంటిమిట్టకు మకాం మార్చారు. పందేలు, కమీషన్ రూపంలో రూ. లక్షలు ఆర్జించారు. ఒకనాడు అతి సాధారణ జీవితం గడిపిన వీరంతా.. ఇప్పుడు విలాసాలకు అలవాటు పడ్డారు. అడ్డదారిలో పొందిన డబ్బుతో ఖరీదైన వాహనాలు కొనుగోలు చేశారు. బెట్టింగ్‌లతో జీవితాలు బాగుపడతాయనేందుకు తామే నిదర్శనమంటూ కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బంధుమిత్రులను కూడా ఉచ్చులోకి దించుతున్నారు. మహిళా సంఘాల సభ్యులు, గృహిణులకూ ఎర వేస్తున్నారు. వీరికి కొందరు రాజకీయ నాయకులు సహకారం అందిస్తుండటంతో ఇతరులు నమ్మేస్తున్నారు. పోలీసులు స్పందించి మూలాలపై ఆరా తీయాల్సి ఉంది. లేకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోవాల్సిన పరిస్థితిని కల్పించినట్లవుతుంది.

నిలకడగా టమాట ధర

మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డులో టమాట ధర ఆదివారం కిలో అత్యల్పంగా రూ.33 నుంచి నాణ్యమైన కాయలు అత్యధికంగా రూ. 63 వరకు పలికాయి. దిగుబడులు తగ్గటంతో డిమాండ్ పెరిగినట్లు అధికారులు తెలిపారు. గత వారం రోజుల వరకు కిలో రూ. 28 నుంచి అత్యధికంగా రూ. 50 వరకు మాత్రమే ధరలు లభించాయి. మూడు రోజులుగా పుంజుకుని కిలో రూ. 63తో నిలకడగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు 120 టన్నుల నుంచి 140 టన్నుల వరకు రైతులు సరకు తెస్తున్నారు. సగటున కిలో రూ. 48 నుంచి రూ. 60తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ యార్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి జగదీష్ తెలిపారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

(c) eenadu

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్‌లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Energy Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY, MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Organised by: ఈనాడు | Digital Partner: ఈనాడు.net, ETV BHARAT

ఈనాడు - హైదరాబాద్

కళాశాల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్ రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘం తరఫున మహిళల జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్స్, అండర్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణులు కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, ఆలంఖాన్‌పల్లె, కడప-516 003.
వివరాలకు: 9154991003, 8008551774
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

మానవ సేవే మాధవ సేవ

సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో సత్యసాయిబాబా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య అన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంతో మందికి ఉచితంగా విద్య, వైద్యం అందిస్తూ ప్రజా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించడం గొప్ప విషయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలీసు అధికారులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం

కడప గ్రామీణ: విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తుపరమైన సమస్యల పరిష్కారానికి తన పరిధిలో డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్తు సరఫరా సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని అన్ని జిల్లాల నుంచి వినియోగదారులు తమ ఎదుర్కొనే విద్యుత్తు సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఉదయం 10 నుంచి 12 వరకు సెల్ నంబరు 89777 16661కు ఫోన్ చేసి తెలియచేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని సూచించారు.

సివిల్ పంచాయితీల్లో పోలీసుల జోక్యం తగదు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పక్కన శ్రీనివాసులు భార్య లక్ష్మి, తదితరులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రూ.7 కోట్ల లావాదేవీల సివిల్ పంచాయితీ చేసేందుకే ప్రొద్దుటూరుకు చెందిన బంగారు వ్యాపారి తనకంటి శ్రీనివాసులు, ఆయన సోదరుడు తాడిపత్రికి చెందిన వెంకటస్వామిని పోలీసులు తీసుకెళ్లారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో శ్రీనివాసులు భార్య లక్ష్మితో కలిసి ఆదివారం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. 'వెంకటస్వామి చాలా అప్పు చేయడంతో చట్టబద్ధంగా ఐపీ దాఖలు చేస్తున్నారు. అక్రిడిటెడ్‌గా ఉన్న శ్రీనివాసులు వద్ద నుంచి ఆ బకాయిలు రాబట్టేందుకు పోలీసులు తీసుకున్న చర్యలు చట్టవిరుద్ధం. కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లి 48 గంటలు గడిచినా కోర్టులో హాజరు పరచలేదు. వారిని కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు. డీఎస్పీకి తెలిసే ఈ విషయాలన్నీ జరిగాయని' ధ్వజమెత్తారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ.. ఓ ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో తన భర్త శ్రీనివాసులును చంపుతామని బెదిరించారని ఆరోపించారు. డీఎస్పీ దగ్గరకు వెళ్తే సాటి మహిళగా కూడా స్పందించలేదన్నారు. ఒకటో పట్టణ ఠాణాకు వెళ్తే అప్పులు చెల్లించేందుకు మీ భర్త ఒప్పుకుంటేనే ఇంటికి వస్తారని పోలీసులు చెప్పినట్లు ఆమె వాపోయారు.

రేపటి నుంచి మాజీ సీఎం జగన్ పర్యటన

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన ఖరారైంది. ఈ నెల 25న బెంగళూరులోని తన నివాసం నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి పులివెందులలోని బాకరాపురం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు తన క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ తనను కలిసేందుకు వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలను వింటారు. రాత్రికి తన నివాసంలో బస చేసి 26న ఉదయం 10 గంటలకు బ్రాహ్మణపల్లె సమీపంలోని అరటి తోటలను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడతారు. అదే రోజు మధ్యాహ్నం వేముల మండలం వేల్పుల గ్రామ ప్రజలతో మమేకమవుతారు. సాయంత్రం పులివెందులలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి తన నివాసంలో బసచేసి 27న ఉదయం బయలుదేరి బెంగళూరుకు వెళ్తారని వైకాపా పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

న్యాయం చేయాలని బాధితుల ఫిర్యాదు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని బంగారం వ్యాపారి తనికంటి శ్రీనివాసులుపై కేసు నమోదు కావడంతో అతని వద్ద బంగారం వస్తువులు ఆర్డర్లు ఇచ్చి అడ్వాన్స్ కింద డబ్బులు ఇచ్చిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన మహిళ సంధ్య గోల్డ్‌స్కీంలో భాగంగా నెలకు రూ. 50 వేల చొప్పున మూడు నెలలకు మొత్తం రూ. 1.50 లక్షలు చెల్లించారు. ఆమెకు పరిచయం ఉన్న మరో మహిళ కూడా నెలకు రూ. 50 వేలు చొప్పున కట్టారు. వ్యాపారి వద్ద దాదాపు 35.549 గ్రాముల బంగారం కొనుగోలు చేసేందుకు రూ. 4 లక్షలు అడ్వాన్స్ ఇచ్చారు. మరో మహిళ సైతం కూడా 22.210 గ్రాముల బంగారం కొనేందుకు రూ. 2.50 లక్షల అడ్వాన్స్ ఇచ్చామని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఒకటో పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు. తనికంటి జువెలర్స్‌లో బంగారం ఆర్డర్లు, అడ్వాన్స్, స్కీం డబ్బులకు తామే జవాబుదారీగా ఉంటామని వినయోగదారులు కంగారు పడొద్దని వ్యాపారి శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి తెలిపారు.

వీరభద్రుని సేవలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రాంగణంలోని ఉప ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని వీరభద్రస్వామి, భద్రకాళీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఆయనకు వివరించారు. దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథం, ఈవో వెంకట రమణారెడ్డి ఆయనను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సోలార్ పవర్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు తదితరులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వివిధ సంస్థల్లో కల్పించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్‌లో డీఆర్‌డీఏ-సిడాప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్- సోలార్ పవర్ ప్రాజెక్టులో పలు రకాల ఉద్యోగాల కోసం ఉద్యోగ మేళా నిర్వహించారన్నారు. 233 మంది నిరుద్యోగులు హాజరుకాగా అందులో 119 మంది ముఖాముఖిలో ఎంపికయ్యారు. వీరికి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది ఎంపికలు హైదరాబాద్ నుంచి నిర్వహిస్తారని సోలార్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టు జీఎం శ్రీనివాసులు, డిప్యూటీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, డీఆర్‌డీఏ- సిడాప్ జిల్లా ఉద్యోగ మేళా మేనేజర్ రంగస్వామి, సోలార్ సంస్థ ప్రతినిధులు, సిడాప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారి కేసులో కొనసాగుతున్న వివాదం

● పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు

పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తున్న శ్రీనివాసులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని బంగారం వ్యాపారి తనకంటి శ్రీనివాసులు, అతని సోదరుడు వెంకటస్వామిపై నమోదైన కేసు వ్యవహారంపై వివాదం కొనసాగుతోంది. పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. దాదాపు 10 కేజీల బంగారం తీసుకుని అందుకు సంబంధించి డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు గతంలో తనపై దాడి చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి హేమంత్‌శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 20న ప్రొద్దుటూరులో పోలీసులు సోదరులపై కేసు నమోదు చేశారు. అయితే ఆ విషయాన్ని రహస్యంగా ఉంచారు. ఈ నెల 21న రాత్రి శ్రీనివాసులు బైక్‌లో వెళ్తుండగా శివాలయం కూడలి వద్ద మఫ్టీలో వచ్చిన పోలీసులు అతన్ని బలవంతంగా తీసుకెళ్లారు. శనివారం సాయంత్రానికి శ్రీనివాసులు పోలీసుల అదుపులో ఉన్నట్లు స్పష్టత ఇచ్చారు. విచారణ అనంతరం శనివారం రాత్రి పోలీసులు శ్రీనివాసులును ప్రొద్దుటూరులోని ఆయన ఇంటికి తీసుకెళ్లగా అతని సోదరుడు వెంకటస్వామిని తాడిపత్రికి పంపించారు. ఈ క్రమంలో నోటీసులు అందించారు. దాదాపు రూ.7 కోట్ల విలువైన ఆస్తి పత్రాలను పోలీసులు తన వద్ద నుంచి తీసుకెళ్లారని శ్రీనివాసులు ఆరోపించారు. కాసేటికి బంగారం వ్యాపారి శ్రీనివాసులు పోలీసుల తీరును తప్పుబడుతూ మాట్లాడారు. తన సోదరుడిని పోలీసులు తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ● కేసులో వ్యవహారంలో సోదరులను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే తనకంటి శ్రీనివాసులును ఆదివారం ప్రొద్దుటూరు పోలీసులు మరోసారి అదుపులోకి తీసుకున్నారు. అతని సోదరుడు వెంకటస్వామి కోసం పోలీసులు తాడిపత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. ● తన బావ తనకంటి శ్రీనివాసులు చెబితేనే నా భర్త వెంకటస్వామి అప్పులు చేశారని అతని భార్య పద్మజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త వెంకటస్వామి, బావ శ్రీనివాసులు కలిసి 20 ఏళ్లుగా కలిసి వ్యాపారం చేశారని ఇప్పుడు ఆ అప్పులతో సంబంధం లేదని శ్రీనివాసులు చెబుతున్నారని తమకు న్యాయం చేయాలని పద్మజ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇతిహాస అంశాలపై పోటీ పరీక్షల నిర్వహణ అభినందనీయం

పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే: తెలుగు, హిందీ భాషాంశాలతో పాటు రామాయణంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించామని పెట్టడం సంతోషకరమని పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ హాలులో ఆదివారం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ), సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మొదటి బహుమతిగా మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి కలిసెట్టి పూర్ణచంద్రకి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. అభినయశ్రీకి రూ. 3,500, పెద్దముడియం విద్యార్థిని టి. వెంకటహారిక, వీరబల్లి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. సుధశ్రీలకు రూ. 1000, పదిమంది విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరుశ్రీనివాసులరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువులబాబు, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, అంకాల్‌కొండయ్య, బోగా గంగాధర్, గుండ్లమడుగు నరసింహ, సాయికుమార్, వెంకటప్రసాద్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీధర్, జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్ ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కార మార్గం చూపుతారన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మున్సిపల్ కేంద్రాలు, మండల కేంద్రాల్లో కూడా ప్రజల అర్జీలను సంబంధిత అధికారులు స్వీకరిస్తారన్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదకొండు మందిపై కేసు నమోదు

ముద్దనూరు, న్యూస్‌టుడే : ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనుల విషయమై జరిగిన ఘర్షణకు సంబంధించి 11 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మైనుద్దీన్ తెలిపారు. తెదేపా, భాజపా నాయకుల మధ్య స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనుల విషయంలో గొడవ జరిగింది. ఓ వర్గం ఫిర్యాదు మేరకు శనివారం ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అయితే కులం పేరుతో తిట్టారని మరో వర్గానికి చెందిన రాజుల సురేంద్రనాథరెడ్డి, మరో 10 మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సందడిగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి స్వామి తదితరులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలూ విద్యార్థుల దైనందిన జీవితంలో భాగం కావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సూచించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం అండర్-19 బాలబాలికల ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మంత్రితోపాటు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు హాజరై జ్యోతి వెలిగించారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 550 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు జరిగిన పోటీలు, విజేతల వివరాలివి.

బాలుర విభాగంలో..

తలపడిన జట్లు	విజేత
● కడప-కృష్ణా	కడప
● కర్నూలు-అనంతపురం	కర్నూలు

అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల పయనం

పయనమవుతున్న క్రీడాకారిణులతో వ్యాయామ ఉపాధ్యాయులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండలో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న ఎస్జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటేందుకు జిల్లా నుంచి ఎంపికైన బాలబాలికలు ఆదివారం రాత్రి పయనమయ్యారు. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె, ఎగువపల్లె జడ్పీహెచ్‌ఎస్ వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, రవిలు కడప రైల్వేస్టేషన్‌కు వెళ్లి వారిని రైలు ఎక్కించారు. కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఈ నెల 18న అథ్లెటిక్స్ అండర్-17 వయసు విభాగాలకు సంబంధించి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించిన విషయం విదితమే. ఇందులో ప్రతిభ కనబరచిన బాలబాలికలు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పయనమయ్యారు. వీరి వెంట మేనేజర్లుగా చక్రాయపేట నాగులగుట్టపల్లె, పుల్లంపేట వత్తలూరు, చిట్వేలు జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, తులసీ, ఈశ్వర్‌రాజు వెళ్లారు.

వేంపల్లెలో నాసిరకం మాంసం పట్టివేత

నాణ్యత లేని మాంసాన్ని కాల్చేస్తున్న పంచాయతీ అధికారులు

వేంపల్లె: వేంపల్లెలోని మాంసం దుకాణాలపై ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు దాడులు నిర్వహించారు. అనారోగ్యంతో చనిపోయిన గొర్రెల మాంసం విక్రయించేందుకు సిద్ధంగా ఉంచగా గుర్తించి పెట్రోలు పోసి సిబ్బంది సాయంతో కాల్పించేశారు. మృతి చెందిన పశువుల మాంసాని శీతల పెట్టెల్లో నిల్వ ఉంచి వినియోగదారులకు విక్రయిస్తున్నారని పలువురు గ్రామ పంచాయతీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పంచాయతీ ఈవో నాగభూషణ్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

PLOT FOR SALE

తిరుపతి -A రంగంపేట మోహన్‌బాబు స్కూల్ వెనుక 30x44 అం|| ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ ప్లాట్స్ అమ్మబడును. ✆ 73828 81119, 90147 27359.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెరటి తోట... ఆరోగ్యానికి బాట

● జిల్లాలోని 900 కేంద్రాల్లో పెంపకానికి ఏర్పాట్లు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సేంద్రియ పద్ధతిలో ఆకు కూరలు, కాయగూరలు, పండించేందుకు పోషణ వాటికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే సుమారు 900 అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ అవకాశాన్ని కల్పించింది. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు విడుదల చేసింది. ● జిల్లాలోని 13 అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో 2,389 అంగన్‌వాడీ కేంద్రాలుండగా దాదాపు 900 అంగన్‌వాడీ కేంద్రాలను సాఫ్ల్యంలో చేర్చారు. ఈ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించి ఖాళీ స్థలాల్లో మిరప, టమోట, వంకాయ, చిక్కుడు, బెండకాయ, బీర, తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, మెంతాకు, ముల్లంగి, పచ్చిబఠాణీలు వంటి వాటిని పెంచి వాటితోనే పౌష్టికాహారం అందిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సాగవుతున్న పంట

పండించిన కూరగాయలు

ఎంపిక చేసిన కేంద్రాల్లోనే..

వనరులున్న చోట పెరటి తోటలు పెంచుతున్నాం. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలిస్తున్నాం. ఇక్కడ లభించే కూరగాయలు, ఆకుకూరలతోనే లబ్ధిదారులకు ఆహారాన్ని అందించే ఏర్పాటు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తగా నిర్మించే కేంద్రాల్లో కూడా పెరటి మొక్కలు, ఆకుకూరలు పెంచేలా తగు చర్యలు తీసుకుంటాం.

- రమాదేవి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పథక సంచాలకులు

జిల్లా యువజన కాంగ్రెస్‌లో ఇద్దరికి చోటు

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులుగా నగరానికి చెందిన జిలానీబాషా, జఫరుల్లాహ్‌లకు చోటు దక్కింది. కడపలో ఆదివారం వారు మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు.

ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైకాపా నేతల తీరు

మాట్లాడుతున్న ఫిషరీష్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రాంప్రసాద్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: వైకాపాను ప్రజలు దూరం పెట్టినా వారి తీరు మారట్లేదని ఫిషరీష్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రాంప్రసాద్ అన్నారు. కడపలోని ఎమ్మెల్యే మాధవి నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ దయతో కడపలో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా 2019లో గెలిచారే తప్ప.. ఆయనపై ప్రజలకు ఎలాంటి విశ్వాసం లేదన్నారు. ఈ విషయాన్ని ఆయన గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలు ఎలాంటి స్వార్థం లేకుండా కడప నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తోందన్నారు.

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, సుబ్బారావు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

మైదుకూరు, న్యూస్‌టుడే : శక్తి యాప్ మహిళల భద్రతకు ఒక ఆయుధం లాంటిదని డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లో యాప్‌ను నిక్షిప్తం చేసుకుంటే అత్యవసర సమయంలో వినియోగించుకోవచ్చని వివరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె. రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శక్తి యాప్‌కు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సైలు చిరంజీవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బాషా ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. అతనికి జనసేన పార్టీ సభ్యత్వం ఉండటంతో ఆ పార్టీ తరఫున బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఆదివారం తాడేపల్లిలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాశం లక్ష్మీనరసయ్య, టి.నాగేంద్ర, డి.హరికృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

మేమున్నాం... మీకు తోడుగా...
(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

తారు రోడ్డు పనులు ప్రారంభం

స్పందనకు వందనం

స్థానిక నంగనూరుపల్లె నుంచి ఎర్రగుంట్ల రోడ్డు వరకు రూ.3.70 కోట్లతో తారు రహదారి పనులు ప్రారంభమయ్యాయి. సమస్యపై ఈ నెల 11న 'గుంతల దారి.. ప్రమాదకరంగా మారి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈ సుధాకర్‌రెడ్డి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ**

?: ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లెలో మురుగు రోడ్డుపై పారుతోంది. చెత్త పేరుకుపోయింది. దోమల బెడద ఎక్కువై వ్యాధులు వ్యాప్తిస్తున్నాయి. **- బాబు ఉమ్మారెడ్డిపల్లె**

✓: కార్మికులతో మురుగు, పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నరసింహులు, పంచాయితీ కార్యదర్శి**

?: స్థానిక యానాది కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండటంతో విషపురుగుల సంచారం అధికంగా ఉంది. **- ఆంజనేయులు, యానాది కాలనీ**

✓: వీధి దీపాలు వెలిగేలా, పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నరసింహులు, పంచాయతీ కార్యదర్శి**

?: చెన్నారెడ్డిపల్లెలో మురుగు రోడ్డుపై పారుతోంది. దోమలు అధికంగా ఉండటంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. **- రామయ్య, చెన్నారెడ్డిపల్లె**

✓: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- నరసింహులు, పంచాయతీ కార్యదర్శి** **- న్యూస్‌టుడే, ముద్దనూరు**

?: మైదుకూరు పట్టణం పార్వతీనగర్‌లో దారి పక్కన పెద్దఎత్తున చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలి. **- కె.హరి, పార్వతీనగర్**

?: మైదుకూరు నంద్యాలరోడ్డులోని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద చెత్త వేస్తున్నారు. **- హరీష్, మైదుకూరు**

✓: చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.- **సూర్యం, పారిశుద్ధ్య విభాగ అధికారి** **- న్యూస్‌టుడే, మైదుకూరు**

?: బద్వేలులోని సుమిత్రానగర్‌లో మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. మురుగు పారకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- విజయకుమార్, సుమిత్రానగర్**

✓: కాలువలో పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటాం.

?: బద్వేలులోని చెన్నంపల్లె మిట్టపై రాత్రివేళ ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదు. అంధకారం ఉండటంతో కాలినడకన వెళ్లేవారికి ఇబ్బందులు పడుతున్నారు. **- చెన్నయ్య, చెన్నంపల్లె మిట్ట**

✓: ఎల్ఈడీ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు బద్వేలు పురపాలక కమిషనరు నరసింహారెడ్డి సమాధానమిచ్చారు) - న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

చిన్నపాటి వర్షం.. వీధులు జలమయం

పురపాలకలోని పలు ప్రాంతాల్లో దుస్థితి

గోకుల్‌నగర్‌లో దెబ్బతిన్న రహదారిపై నిలిచిన వర్షపునీరు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతం గోకుల్ నగర్‌లో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ జలమయంగా మారుతున్నాయి. గోకుల్‌నగర్‌లోని మూడు వీధుల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ప్రధానవీధిలో భారీగా నీరు నిలిచింది. మురుగు కాలువల నిర్మాణాలు లేక ఈ దుస్థితి నెలకొంది.

❖ గోకుల్‌నగర్‌లోని మూడు వీధుల్లో సుమారు 600 నివాసాలున్నాయి. 3 వేల జనాభా ఉంది. ఈ ప్రాంతంలో మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు అధికారులను కోరుతున్నా స్పందన లేదు. సార్వత్రిక ఎన్నికల ముందు కాలువల నిర్మాణాలకు అనుమతులు వచ్చినా ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 25 శాతం కంటే తక్కువ పనులు చేసిన వాటిని రద్దు చేశారు. మురుగు కాలువల నిర్మాణాలు లేకపోవడం, కొత్త పాడురోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరంతా ఈ వీధుల్లోకి వస్తోంది.

❖ పట్టణంలోని పైపులఫ్యాక్టరీ, హనుమాన్‌నగర్‌లో కూడా వర్షం వస్తే నీరు వెళ్లే అవకాశం లేదు. హనుమాన్ నగర్ ప్రధాన వీధిలో మురుగు కాలువల నుంచి వర్షపునీరు బయటకు వెళ్లే అవకాశం లేక చెరువును తలపిస్తోంది. సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు పలుమార్లు పుర అధికారులు, స్థానిక కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పరిపాలన, సాంకేతిక అనుమతులున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు చేసేందుకు గుత్తేదారుడు ముందుకు రావడం లేదు.

నేటి నుంచి రైతన్నా మీకోసం

రాజుపాలెం: మాట్లాడుతున్న ఏవో శివరామకృష్ణారెడ్డి

రాజుపాలెం : ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి డీవీ రంగరాజు తెలిపారు. ఆదివారం రాజుపాలెంలో ఎంపీడీవో సభాభవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతన్నా మీకోసం కార్యక్రమంలో ప్రతి రైతు కుటుంబం ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తామన్నారు.

కొండాపురం: కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమం కోసం రైతన్నా మీకోసం ప్రత్యేక కార్యక్రమానికి సోమవారం నుంచి చేపడుతున్నట్లు ఏవో రామాంజులురెడ్డి తెలిపారు. సచివాలయ సిబ్బంది రైతు కుటుంబాలను సందర్శించి ఏపీఏఐఎంఎస్ యాప్‌లో వారి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు.

ముక్తియార్‌కు సత్కారం

ముక్తియార్‌ను సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

దువ్వూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర షేక్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన వి.ఎస్ ముక్తియార్‌ను ఆదివారం దువ్వూరుకు చెందిన మైనార్టీ నాయకులు ప్రొద్దుటూరులో సన్మానించారు. నాయకులు తాహీర్ హుస్సేన్, అక్బర్ సలీంలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరులో ఆదివారం ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనగరం వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, మహిళలు దీపాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

క్లస్టర్ పాఠశాలల్లోనే సమావేశాలు నిర్వహించాలి

కొండాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమావేశాలను క్లస్టర్ పాఠశాలల్లోనే నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధ్యాయులకు నిర్వహించే సమావేశాలను కేటాయించిన క్లస్టర్ పాఠశాలలోనే జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. శనివారం చౌటిపల్లె జడ్పీ పాఠశాలలో నిర్వహించాల్సిన క్లస్టర్ సమావేశాన్ని ఉపాధ్యాయుల ముఖ హాజరు అనంతరం కిలోమీటరు దూరంలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో నిర్వహించారని వివరించారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు ఇబ్బంది పడినట్లు స్పష్టం చేశారు.

భాజపా గ్రామీణ మండలాధ్యక్షుడి నియామకం

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: భాజపా ప్రొద్దుటూరు గ్రామీణ మండల అధ్యక్షుడిగా గోపిరెడ్డి మురళీకృష్ణారెడ్డి నియమితులయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి నియామక పత్రాన్ని అందించారు. అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, పట్టణాధ్యక్షుడు-2 పాళెం కిరణ్ కుమార్, నాయకులు అభినందించారు.

భవిత కేంద్రంలో ప్రత్యేక సదుపాయాలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులపై వివక్షత ప్రదర్శించవద్దని సహిత విద్య సమన్వయ కర్త రమణమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక హెచ్‌బీ కాలనీలోని భవిత పాఠశాలలో సమగ్ర శిక్షా, వైద్య శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించారు.

బందోబస్తు మధ్య రోడ్డు విస్తరణ పనులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో రహదారి విస్తరణ పనులు పోలీసు బందోబస్తు మధ్య జరిగాయి. ఆరేళ్ల క్రితం పట్టణంలో నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా ప్రొద్దుటూరు రోడ్డులోని ఓ ప్రార్థనా మందిరం వద్ద వివాదం తలెత్తడంతో కొంతమేర పనులు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి మిగిలిన పనులు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కొండాపురం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నట్లు ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు రెండేళ్ల కిందట పులివెందులకు చెందిన బాలజనార్దన్‌రెడ్డితో వివాహమైంది. అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

మరుగుదొడ్డి తలుపు ఊడి విద్యార్థికి గాయాలు

చాపాడు, న్యూస్‌టుడే: లక్ష్మీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి తలుపు ఊడిపోయి ప్రమాదవశాత్తు 8వ తరగతి విద్యార్థి వినయ్ తలకు గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పాఠశాల విరామ సమయంలో వినయ్ మరుగుదొడ్డికి వెళ్లగా తలుపు ఊడిపోయి తలపై పడింది. రక్త గాయాలైన విద్యార్థిని చాపాడు పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బడి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు గాయాలవుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

వాహనాల్లో చెలరేగిన మంటలు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలకలో ఆదివారం రెండు వేర్వేరు వాహనాల్లో చెలరేగాయి. చెన్నంపల్లెలో ఆదివారం తెల్లవారుజామున ఆనందరావుకు చెందిన కారులో మంటలు చెలరేగాయి. బద్వేలు-నెల్లూరు జాతీయ రహదారిలో లారీ టైర్ల రాపిడికి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
బ్రహ్మంగారిమఠం శాఖ, కడప (జిల్లా)
బంగారు నగల బహిరంగ వేలం ప్రకటన

ఈ క్రింద పేర్కొన్న వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణం పలుమార్లు కోరినప్పటికీ అప్పు చెల్లించక, నగలు విడిపించుకోలేకపోయినందున మా రిజిస్టరు నోటీసు ముట్టకపోవుటచేత, ముట్టిన వారు ఖాతరు చేయకపోవుటచేత ఈ ప్రకటన జారీ చేయడమైనది. ఎట్టి కారణముల చేత నోటీసు అందని వారు ఇదే చివరి నోటీసుగా భావించగలరు. కావున ఈ ప్రకటన చూసిన తక్షణం ఆ వ్యక్తి అప్పులను చెల్లించి నగలను విడిపించుకోలేక పోయినచో క్రింద తెలిపిన విధంగా మా శాఖ ఆవరణం నందు 26.11.2025వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.00 గంటలకు బహిరంగ వేలం వేయడం జరుగుతుంది.

వరుస సంఖ్య	అకౌంటు నెంబరు	ఖాతాదారుని పేరు/చిరునామా	అవుట్ స్టాండింగ్ అమౌంట్+వడ్డీ
1	40623684905	చెండలూరు సుబ్రమణ్యం, C/o పలనాటి అఖిల భారత అన్నదాన సత్రం, బి.మఠం	1,75,000/-

గమనిక : వేలములో వచ్చిన డబ్బును జమ చేసిన తరువాత ఇంకా అప్పు ఉన్న యెడల కోర్టు ద్వారా మిగిలిన అప్పును వసూలు చేయబడును.
ఇతర షరతులు : 1) వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5000/- దరావతు సొమ్ము చెల్లించవలెను.
2) ఎటువంటి నోటీసు లేకుండా వేలం తేదీని మార్చుటకు గానీ, వాయిదా గానీ, మినహాయించుటకు గానీ, రద్దు చేయుటకు గానీ, ఇతర షరతులు విధించుటకు గానీ బ్యాంకుకు అధికారము కలదు.
3) ఇందులో కనపరచిన అప్పులకు సంబంధించిన ఏ నగలు అయినా వేలం నుండి మినహాయించి నేరుగా బహిరంగ మార్కెట్‌లో అమ్మకం చేయుటగాని, ఆయా నగల రిజర్వు ధర నిర్ణయించుటకు గానీ బ్యాంకు వారికే హక్కు కలదు.
4) వేలంలో కొన్న నగలు, ఆభరణములపై తదుపరి వచ్చే ఆక్షేపణలకు బ్యాంకు బాధ్యత వహించదు.
5) ఎట్టి కారణముల చేత నోటీసు అందని వారు ఇదే చివరి నోటీసుగా భావించగలరు.
ప్రదేశం : బి.మఠం
తేదీ : 24.11.2025
ఇట్లు
బ్రాంచి మేనేజర్

సత్యసాయి జయంతి వేడుకలు

ప్రొద్దుటూరు విద్య, గ్రామీణ, బద్వేలు, పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆదివారం ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రొద్దుటూరు రెవెన్యూ కార్యాలయంలో బాబా చిత్రపటానికి తహసీల్దారు గంగయ్య, అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రొద్దుటూరు శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సత్యసాయిబాబా చిత్రపటానికి ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేత ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. పోరుమామిళ్ల సత్యసాయి సేవామందిరంలో బాబా చిత్రపటానికి ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రొద్దుటూరులో సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సత్యసాయి బాబా చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న వరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి

రైతు సదస్సు జయప్రదం చేయండి

టేకూరుపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మునక ప్రాంత రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న టేకూరుపేటలో చేపట్టే రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ కోరారు. టేకూరుపేటలో ఆదివారం రైతు సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భైరవప్రసాదు, తిరుమలకొండారెడ్డి, రాజారెడ్డి, కొండారెడ్డి, నాగిరెడ్డి, అబ్బిరెడ్డి, రమేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి

నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి చేస్తామని తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎన్జీజీవో నాయకులు తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ప్రొద్దుటూరు ఎన్జీజీవో నూతన కార్యవర్గ సభ్యులను తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ, ఆర్థిక, వైద్యం, తదితర ప్రయోజనాలు, హక్కుల సాధనకు రెండు సంఘాలు సమన్వయంతో వ్యవహరిస్తే సత్ఫలితాలు వస్తాయని వక్తలు తెలిపారు. ప్రొద్దుటూరు ఎన్జీజీవో అధ్యక్షుడు రామసుబ్బయ్య, కార్యదర్శి ప్రమీలదేవి, కోశాధికారి సదాశివ యాదవ్, ఉపాధ్యక్షుడు వరప్రసాదులను సత్కరించారు. ట్రెజరీశాఖ అధికారి తిరుపతిస్వామి, తాలుకా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, కోశాధికారి లక్ష్మన్న, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్టేది?

చెన్నమరాజుపల్లె తాగునీటి పథకం ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తారు. కుళాయి కనెక్షన్ లేని వారు ట్యాంకు దగ్గరకొచ్చి నీరు తీసుకెళ్తారు. ఈ సమయంలో ట్యాంకు కొళాయి ఆపేయకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. అలాగే ఇక్కడ అపరిశుభ్రత నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

రోడ్డుపై రంధ్రం.. చోదకులకు గండం

బద్వేలులోని దూదేకుల వీధిలో మురుగు కాలువపై మూత బండ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇరుకైన రోడ్డు మలుపులో దగ్గరకు వచ్చేవరకు వాహన చోదకులకు గుంత కనిపించదు. దీంతో ఇక్కడ వాహనదారులు ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలవుతున్నారు. సమస్య పరిష్కరించాలని పురపాలక అధికారులకు తెలిపినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, బద్వేలు

దాతలకు పోలీసుల సత్కారం

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పట్టణంలో నిఘా కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన దాతలను ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సత్కరించారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఎనిమిది మందికి శాలువాలుకప్పి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సీఐ రమణారెడ్డి, ఎస్సై చిరంజీవి, సుబ్బారావు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే మార్కెట్ చిత్తడే

చిన్నపాటి వర్షానికే మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రవేశ ద్వారం వద్ద నీరు నిల్వ చేరి బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోకలకు సమస్యగా మారింది. మార్కెట్ కమిటీ పరిసరాలు అధ్వానంగా ఉండటంతో క్రయవిక్రయాల కోసం సంతకొచ్చిన రైతులు, వ్యాపారులు అడుగుతీసి అడుగేయలేని పరిస్థితి నెలకొంది. పరిసరాల బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మైదుకూరు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: కూటమి సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, తిరిగి వైకాపా ప్రభుత్వాన్ని తెచ్చుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దొరసానిపల్లెలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్ర భాస్కర్, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

శబరిమలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు, న్యూస్‌టుడే: శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను బద్వేలు నుంచి నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్ పేర్కొన్నారు. ఒక్కో భక్తుడు రానూపోనూ రూ.4,600 చెల్లించాలన్నారు. వివరాలకు గురు స్వాములు 99592 25779 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

కాంచు వారి వివాహ రిసెప్షన్ మహోత్సవ ఆహ్వానం

శ్రీమతి & శ్రీ వెంకట గంగాధర్-జయశ్రీ
ముత్యాల పందిరిలో వేద మంత్రాల సాక్షిగా, ఏడడుగులు నడిచి, మూడుముళ్ల బంధంతో ఒక్కటై నేడు రిసెప్షన్ జరుపుకొంటున్న శుభవేళ బంధుమిత్రులందరూ సకుటుంబంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించ ప్రార్థన.
తేదీ : 24.11.2025 సోమవారం
సమయం : ఉదయం 11.00 గం.లకు
వేదిక : శ్రీదేవి ప్యాలెస్ ఫంక్షన్ హాల్ A/c RTO బైపాస్ రోడ్డు, ప్రొద్దుటూరు.
ఆహ్వానించువారు :

కాంచు తిరుమల కొండు కాంచు పద్మావతి
టీచర్స్ కాలనీ, ప్రొద్దుటూరు.
మా బాబాయ్ రిసెప్షన్‌కు రండి రారండి...
చి. హాను
శుభాకాంక్షలతో...
శ్రీమతి & శ్రీ కాంచు హరినాథ్-రాజేశ్వరి

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ప్రార్థనలు చేస్తున్న మహేష్, దర్గా నిర్వాహకులు

పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

బిల్టప్, కడప న్యూస్‌టుడే: నగరంలోని పెద్ద దర్గాను స్కూల్ లైఫ్ చిత్ర దర్శకుడు, కథానాయకుడు మహేష్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా విశిష్టతను ఆయనకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. దర్గాను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు.

సిద్దవటం పీఏసీఎస్ అధ్యక్షుడికి సత్కారం

దశరథరామనాయుడిని సత్కరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, న్యూస్‌టుడే: తెదేపాను నమ్ముకున్న వారికి న్యాయం చేస్తామని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సిద్దవటం మండలం భాకరాపేట శివారులోని కల్యాణ మండపంలో ఆదివారం సిద్దవటం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దశరథరామనాయుడు తన పదవికి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన చమర్తి ఆయన్ను సత్కరించారు. డీసీసీ బ్యాంకు జిల్లా ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నూర్‌బాషా, దూదేకుల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరభద్రుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: పులివెందులలో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం సందులో కోతుల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి ఉపశమనం కలిగించాలి. **- బాబా ఫక్రుద్దీన్, పులివెందుల**

✓: వెంటనే తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తాం. **- రాముడు, పురపాలక కమిషనర్, పులివెందుల**
- న్యూస్‌టుడే, పులివెందుల

?: మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనానికి మహిళా భక్తులు వస్తున్నారు. ఇక్కడ స్నానాలు చేయడానికి గదులున్నా ఎప్పుడూ తాళాలు వేసే ఉంటున్నాయి. వినియోగంలోకి తేవాలి. **- వెంకటసుబ్బమ్మ, భక్తురాలు**

✓: గంగమ్మ ఆలయ సమీపంలోని స్నానపు గదులతో పాటు మరుదొడ్ల భవనాలకు అందుబాటులోకి తెస్తాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- కృష్ణనాయక్, ఆలయ ఈవో, - న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె

కొనలేం.. తినలేం!

వల్లూరు, కమలాపురం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. అమాంతం ధరలు పెరగడం సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది. దీంతో సామాన్యుడు మార్కెట్‌కు వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. కిలో కొనాల్సిన వినియోగదారుడు అర కిలోతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ● ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గినట్లు రైతులు పేర్కొంటున్నారు.

కమలాపురం మార్కెట్‌లో ధరలు ఇలా (కిలో రూ.లలో)

కూరగాయలు	నెల కిందట	ప్రస్తుతం
వంకాయ	30	50
టమాటాలు	20	40
బీర	40	60
క్యాప్సికం	30	50
పచ్చిమిరప	40	60
క్యారెట్	50	80
కందికాయలు	100	120

వరుస వర్షాలతో టమోటా, మిరప, బెండ, చిక్కుడు, బీన్స్, ముల్లంగి, మునగ తదితర పంటలు దెబ్బతిన్నాయి. స్థానిక దిగుబడులు చాలకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఫలితంగా డిమాండ్ పెరిగి కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు ధర పెరిగింది.

అదుపు చేయాలి

కూరగాయల ధరలను అదుపు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల నుంచి కొనుగోలు చేసే ధరలకు, వ్యాపారులు నిర్ణయించే ధరలకు వ్యత్యాసం ఉంది. ఇలాంటి వాటిని నివారిస్తే రైతులకు, వినియోగదారులకు ఊరట కలుగుతుంది. **- లక్ష్మీదేవి, బీడీ కాలనీ, కమలాపురం**

నాణ్యత ఉండటం లేదు

నెల కిందట మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు అవే కూరగాయలు రూ.700 నుంచి రూ.800 వెచ్చించాల్సి వస్తోంది. పైగా నాణ్యత కూడా సక్రమంగా ఉండటం లేదు. **- పద్మ, సొసైటీ కాలనీ, కమలాపురం**

సమాజానికి విజ్ఞానం చేరువ చేయడమే లక్ష్యం

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే: సమాజానికి విజ్ఞానాన్ని మరింత చేరువ కావాలన్నదే ధ్యేయమని జవివే (జన విజ్ఞాన వేదిక) నాయకులు అన్నారు. స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం (జవివే) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష జరిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 21 టీంలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16 టీంలు హాజరయ్యాయి. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జవివే గౌరవ సలహాదారులు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు రాజశేఖర్‌రాహుల్, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జవివే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్‌బాషా, శివరాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు ఆపాలని డిమాండ్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప పాత బస్టాండులో యాదాళ్ల పిచ్చయ్య ఛారిటీ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను ఆపాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలు చేస్తున్న ప్రాంతాల్లో ఆదివారం సీపీఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక ప్లానింగ్ అనుమతులు లేకుండా కట్టడాలు ఎలా నిర్మిస్తారన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

పల్లెల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తాం

వీధుల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రగుడిపాడులో వైద్య శిబిరం నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు సూచించారు. గ్రామంలో పలువురికి విషజ్వరాలు సోకుతున్న విషయం తెలుసుకున్న ఆయన పీహెచ్‌సీ వైద్యులతో కలిసి ఆదివారం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో మురుగు నీరు నిలవకుండా, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మురుగు నీరు ఉన్నచోట దోమల నివారణ మందు, బ్లీచింగ్ చల్లాలన్నారు. వైద్యాధికారులు బాజామొహిద్, కాలసాక్కీశ్వర్ రెడ్డి, కమాల్‌బీ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కమలాపురం, న్యూస్‌టుడే: శబరిమలలో ఆచార, వ్యవహార తాంత్రిక పద్ధతిలో ఈ నెల 24న అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ గురుస్వామి నరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఉన్న ఆలయం నుంచి స్వామి వారి గ్రామోత్సవం పుర వీధుల గుండా కన్నెస్వాముల కలశాలతో మేళతాళాలతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం వివిధ రకాల పూజలు, అభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

ఒంటిమిట్టలో సత్యసాయి చిత్రానికి నివాళి అర్పిస్తున్న మండల అధికారులు

వేంపల్లెలో జరిగిన సత్యసాయిబాబా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విలువలు.. వ్యక్తిత్వమే సత్యసాయి సిద్ధాంతం

ఒంటిమిట్ట, సిద్దవటం, వేంపల్లె, న్యూస్‌టుడే: విలువల వ్యక్తిత్వమే శ్రీసత్యసాయిబాబా సిద్ధాంతమని వక్తలు పేర్కొన్నారు. కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన శత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒంటిమిట్ట రెవెన్యూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మండల అధికారులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సిద్దవటం శివాలయంలో ఏపీఎస్‌పీ పదకొండో బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో బెటాలియన్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సత్యసాయి బాబా చిత్రపటాన్ని రథంలో ఉంచి వేంపల్లె వీధుల్లో ఊరేగించారు. అనంతరం పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

24వ తేదీ నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని ఆచార్య ఎన్జీ రంగా ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో ఈనెల 24నుంచి ప్రారంభం కానున్న అంతర కళాశాలల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ రామచంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను మూడురోజులపాటు నిర్వహించే మొదటి దశ అంతర కళాశాలల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో మొత్తం 19 కళాశాలలు సంబంధించిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఇందులో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ చెస్, క్యారమ్స్, చెస్ వంటి క్రీడలలో పోటీలుంటాయన్నారు. వీటికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాశాల డీన్ డాక్టర్ మాధవ వివరించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన వేదిక, రవాణా, ఆహారానికి సంబంధించిన క్రీడా మైదానాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ అధికారులు, కళాశాల స్టూడెంట్ యాక్టివిటీస్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషా సేవకులకు సత్కారం

సత్కారం పొందుతున్న ఉర్దూ సాహిత్య సేవకులు

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: ఉర్దూ సాహిత్యంలో కడపది ప్రత్యేక స్థానమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు అన్నారు. కడప నగరంలోని క్రెసెంట్ పాఠశాలలో ఆదివారం అబ్దుల్ మజీద్ విద్యా సంక్షేమ సంస్థ ఉర్దూ భాష సేవకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్దూ భాషా వికాసానికి, సాహిత్య ప్రగతికి విశేష సేవలందించిన ఉపాధ్యాయులను సత్కరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. అనంతరం ఉర్దూ సాహితీ సేవకులు (ఉపాధ్యాయులు) సంయుద్ నజర్, సత్తార్ ఫైజీ, వర్మతులు మసీం సాహెబ్, జిలాన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జిలానీబాషా, గజీరెహ్మాన్, ఖుద్రతుల్లా, ఉపాధ్యాయ సంఘాల నేతలు పయాజ్, ఖదీర్‌పరేజ్, రహ్మతుల్లా, నాసర్, జమీల్, అహ్మద్, షైబుల్లా పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడపకు చెందిన పోలీసు కానిస్టేబుల్ 1998 బ్యాచ్ ఆదివారం కడప శివారు అంగడివీధిలోని అంధ వికలాంగుల సేవా కేంద్రంలోని సిబ్బంది అందులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారి కడుపు నింపితే ఎంతో పుణ్యం వస్తుందన్నారు.

సాఫ్ట్‌బాల్ సెమీ ఫైనల్‌కు కడప జట్టు

పులివెందుల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో కడప జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన సాఫ్ట్‌బాల్ అండర్-14 క్రీడా పోటీలల్లో కడప బాలుర జట్టు గోదావరి జిల్లాపై గెలుపొందగా బాలికల జట్టు కృష్ణా జిల్లాపై విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. ప్రకాశం బాలికల జట్టు కర్నూలు జట్టుపై.. అనంతపురం బాలికల జట్టు విజయనగరం జట్టుపై, తూర్పు గోదావరి జట్టు గుంటూరుపై గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరాయని ఎస్జీఎఫ్ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం సెమీఫైనల్స్ జరుగుతాయన్నారు.

మదార్‌షావలి ఉరుసు మహోత్సవం

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలో హజరత్ జిందేషా మదార్‌షావలి ఉరుసు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి బిడాలమిట్టలో వెలసిన దర్గాలో శుక్ర, శని, ఆదివారాల్లో గంధం, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రామ పంచాయతీ ఈవో నాగభూషణ్‌రెడ్డి తమ ఇంటి వద్ద నుంచి ఉత్సవాలకు సంబంధించిన జెండాను దర్గా వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం నిర్వహించిన కవ్వాలి ఆకట్టుకుంది. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కుక్కర్ పేలి మహిళకు గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలోని అల్పాహారశాలలో ఆదివారం కుక్కర్ పేలి లలితమ్మ (60) అనే మహిళ గాయపడ్డారు. వంట చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుక్కర్‌లోని వేడినీళ్లు ఆమె ముఖం, శరీరంపై పడటంతో గాయపడ్డారు. స్థానిక ఆసుపత్రికి తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

స్తంభమెత్తు నిర్లక్ష్యం

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న విద్యుత్తు స్తంభాలకు పలు చోట్ల పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు తీగల మరమ్మతులు, తీగలపై ఉన్న మొక్కలు తొలగించేందుకు ప్రతి వారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నారే తప్ప.. స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు మాత్రం తొలగట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కమలాపురం**

మురుగు కాలువ ఏర్పాటు

సీకేదిన్నె గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణ పనులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: సీకేదిన్నెలోని ప్రధాన వీధిలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో మురుగు కాల్వలు లేక పాత బ్యాంకు నుంచి ప్రధాన రహదారి వరకు మురుగంతా రోడ్లపైకి చేరి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారించింది. దాదాపు పంచాయతీ నిధులు రూ.3 లక్షలు వెచ్చించి ప్రధాన వీధిలో 120 మీటర్లు మురుగు కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు.

నేర ప్రవృత్తి విడనాడాలి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న తాలూకా సీఐ రెడ్డెప్ప

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని కడప తాలూకా సీఐ రెడ్డెప్ప అన్నారు. రౌడీషీటర్లకు ఆదివారం ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై అనునిత్యం నిఘా ఉంటుందన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు ఏవైనా గొడవల్లోకి వెళ్తే వారిపై శాఖాపరంగా చర్యలు తప్పవని తెలిపారు. రౌడీషీటర్లు చెడుప్రవర్తనను విడనాడాలన్నారు.

అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

అరటి రైతులతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: అరటి పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం వెంటనే స్పందించి గిట్టుబాటు ధర కల్పించి అరటి రైతులను ఆదుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె సమీపంలోని అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ ఆరా తీశారు. నల్లపురెడ్డిపల్లె వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

గురువును సన్మానించిన పూర్వపు విద్యార్థులు

చక్రాయపేట, న్యూస్‌టుడే: చక్రాయపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు బాలనారాయణను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తీర్మానించారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారులైన బ్రాంచ్ మేనేజర్, REPCO Home Finance Ltd., కడప వారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! ఈ క్రింది షెడ్యూలులో కనిన సర్వే నంబరులోని య.0.1 సెంట్లు మరియు 652 చదరపు లింకుల జాగాను 1) పెన్నెకట్ల జాకిర్ హుస్సేన్ మరియు 2) పెన్నెకట్ల షాహీర్ అను వారికి 26.2.2022వ తేదీన విక్రయ దస్తావేజు నంబరు 1697/2022 ద్వారా సంక్రమించి, వారు సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుకొనుచూ వుండి, వారు సదరు జాగాలో కడప మునిసిపల్ కమీషనర్ గారు యిచ్చిన ప్లాన్ మరియు ప్రొసీడింగ్స్ No.1013/0674/B/KAD/AP/2022 dated 12.05.2022 ప్రకారము షెడ్యూలు దాఖలా మహాడి మిద్దెను నిర్మించుకొనగా దానికి కడప కార్పొరేషన్ వారు D/No. 57/257-2-1-1 యిచ్చి పన్నును కూడా విధించారని, సదరు షేక్ షకీల్ అహమ్మద్ గారి భార్య షేక్ తాయిబా సల్మా 10.11.2025 వ తేదీన పై తెలిపిన 1) పెన్నెకట్ల జాకిర్ హుస్సేన్ మరియు 2) పెన్నెకట్ల షాహీర్ గార్ల నుండి అన్-రిజిస్టర్డ్ విక్రయ అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేసినదని, అయితే షెడ్యూలు దాఖలా ఆస్తి యొక్క లింకు దస్తావేజు అయినటువంటి విక్రయ దస్తావేజు నంబరు 9315/2012 dated 18.12.2012 యొక్క ఒరిజినల్ దస్తావేజు పోయినదని చెప్పి, దాని నకలు ఆధారముగా, షెడ్యూలు ఆస్తిని తనకగా వుంచి REPCO Home Finance Ltd., కడప వారి నుండి ఋణం పొందగోరుచున్నారు. ఈ ఋణం విషయమై ఎవ్వరికైనను అనగా వ్యక్తులు, బ్యాంకులు, ఫైనాన్సు సంస్థలకు ఆక్షేపణలున్నచో క్రింద తెలిపిన అడ్రసు వారికి ఈ నోటీసు వెలువడిన "7" దినముల లోపల వ్రాతపూర్వకముగా తెలుపుకొనవలెను. లేనిచో షెడ్యూలు ఆస్తిని వివాద రహితమైనదిగా పరిగణించి ఋణం మంజూరు చేయబడును. తదుపరి వచ్చు ఆక్షేపణలు ఈ ఋణం విషయమై REPCO Home Finance Ltd., కడప వారి హక్కులకు ఎలాంటి ప్రతిబంధకం కాజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

కడప డి., కడప అర్బన్ సబ్-డి., కడప మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, కడప సిటీ, అక్కాయపల్లె ఇలాఖా, 57వ వార్డు, శాస్త్రినగర్‌లోని, డోర్ నెం.57/257-2-1-1 రు (G+1), అసెస్మెంట్ నెం.101379442 రు గల ఆర్.సి.సి. మహాడి మిద్దె యిల్లు, బిగువు జాగా, వగైరాలు అనగా చెమ్ముమియ్యాపేట గ్రామ పొలంలో, సర్వే నెం. 492/2బి, య.4.02 సెంట్లు పైకి ప్లాటు నెం.73-ఎ రు య. 0.01 సెంట్లు 652 చ.లింకులు లేక 0.007 హెక్టార్లు గల జాగా. ఈ జాగాలో వుండు పై డోర్ నంబరు గల ఆర్.సి.సి. మహాడి మిద్దె యిల్లు, బిగువు జాగా, వగైరాలకు హద్దులు: **తూర్పు:** రోడ్డు, **పడమర:** హుస్సేన్ గారి యిల్లు, **ఉత్తరం:** ప్లాటు నెం. 73 రు జాగాలో యితరుల యిల్లు, **దక్షిణం:** ప్లాటు నెం.74 రు గల జాగా. ఈ హద్దుల మధ్య వుండు **తూర్పు-పడమర:** ఉత్తర దిశన 37 అడుగులు, దక్షిణ దిశన 35 అడుగులు. **ఉత్తరం-దక్షిణం:** ఇరువైపులా 20 అడుగులు కొలతలు గల అక్షరాలా ఒక్క సెంటు ఆరు వందల యాభై రెండు చ.లింకులు లేక 80 చ.గజములు గల జాగా. ఈ జాగాలో వుండు పై డోర్ నెంబరు గల ఆర్.సి.సి. మహాడి మిద్దె యిల్లు, ఇందుకు సంబంధించిన యావత్తు ఆస్తి, అడుగు జాగా, పైకప్పు, సామానులు, తలుపులు, ద్వారబంధనములు, పైకప్పు యావత్తు ఎలక్ట్రిక్ ఫిట్టింగ్స్, కరెంటు మీటరు, మీటరు డిపాజిట్లు, మంచి నీటి కుళాయి, కుళాయి డిపాజిట్లు, అసెస్మెంట్ నెం.101379442 రు. కరెంటు మోటారు వగైరాలతో సహా. ఈ యింటికి తూర్పు దిశన గల రోడ్డు గుండా ఇందులోని రాకపోకలు జరుపుకొని రాస్తా హక్కులతో సహా. ఈ ఆస్తికి సంబంధించిన యావత్తు ఈజుమెంటు హక్కులతో సహా.

ఇట్లు: **M.VENKATA RAMANA**, Advocate,
#1/917-1, Y.M.Palli, KADAPA CITY-516004.

మాట్లాడుతున్న న్యాయవాది, రచయిత దాదాహయాత్

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

కడప విద్య, న్యూస్‌టుడే: రాజ్యాంగ పరిరక్షణకి మేధావులు కృషి చేయాలని న్యాయవాది, రచయిత దాదా హయాత్ అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో అఖిల భారత అభ్యుదయ వేదిక, జనవిజ్ఞానవేదిక జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం 'భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-ప్రాథమిక హక్కులు' అంశంపై సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదా హయాత్ మాట్లాడుతూ 75 ఏళ్ల చరిత్రలో భారత రాజ్యాంగం ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగిందన్నారు. ప్రజలు చైతన్యవంతులై తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నరెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే దారులన్నీ మడుగులే!

మండలంలోని రాచపల్లెలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ నీరంతా ప్రధాన రహదారిలో నిలుస్తోంది. మోస్తరు వానొస్తే మడుగును తలపిస్తోంది. వాన నీరు వెళ్లడానికి మురుగు కాలువలు నిర్మించలేదు. లోతట్టు ప్రదేశంలోకి నీరొచ్చి చేరుతుంది. ఇక్కడి నుంచి కదలకుండా అక్కడే ఆగిపోతోంది. సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ, గ్రామ సచివాలయం, మండల పరిషత్తు అధికారులు ఇటువైపు తొంగి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

వెంకటేశ్వర ఆలయం పక్కవీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

వేంపల్లె, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికి వేంపల్లెలోని రహదారులన్నీ ఏరులను తలపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో కురిసిన వర్షానికి మురుగు కాలువలు నిండి రోడ్లపైకి ఆ నీరంతా ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గండిరోడ్డు, వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కవీధి, సాయిబాబా గుడి పక్కన వీధి, గాండ్లవీధి ఇతర ప్రాంతాల్లో రోడ్లన్నీ మడుగులను తలపించాయి. వర్షం వచ్చిన ప్రతిసారి ఈ ప్రాంతాల్లో అదే పరిస్థితులు నెలకొంటోంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది బాగు చేస్తే ఈ సమస్య తలెత్తే అవకాశం ఉండదు. ఈ విషయంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచమ వర్ధంతి

మంచితనంతో అందరినీ
ఆప్యాయంగా పలకరిస్తూ
ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగి
అందరికీ ఆదర్శంగా నిలిచి,
మాకు మార్గదర్శకులుగా నిలిచి
కుటుంబ ఉన్నతికై
అహర్నిశలు శ్రమించిన
కీ॥శే॥ శ్రీ ఎం.అడివప్ప గారు
మా నుండి దూరమై
5 సం॥లు గడిచిననూ
మీతో గడిపిన మధురస్మృతులు
సదా పదిలం. మీ ఆత్మకు దైవ
సన్నిధిలో శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ ఎం.అడివప్ప గారు
Executive Engineer (R&B), Rtd.
జననం : 01-7-1942 మరణం : 24-11-2020

భార్య : శ్రీమతి M.V.లక్ష్మమ్మ
మరియు కుటుంబసభ్యులు

(c) eenadu